Barcode - 2020010002525
Title - Kavijeevithamulu
Subject - literature
Author - gurajada srirama murthy
Language - TELUGU
Pages - 730
Publication Year - 1913
Creator - Fast DLI Downloader
https://github.com/cancerian0684/dli-downloader
Barcode EAN.UCC-13
2 020010 002525

విజయనగరచారిత్రగ్రంథసముదాయము.

# కవిజీవితములు

గురుజాడ. శ్రీరామమూర్తి

ప్రణీతము.

చెన్నపురి.

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారిచే

ప్రకటితము.

ఆదిసరస్వతీనిలయముద్రాక్షరశాలయందు

ముద్రితము.

Third Edition.] 1913. [All Rights Reserved.

TO

*H. H. Sri Maha Raja Adhiraja*

*Sri Pusupati*

*Mirja Ananda Gajapathiraz, Padsha*

*Kalinga, Manye Sultan,*

THE

**MAHARAJA OF VIZIANAGARAM, G. C. I. E.**

THIS VOLUME IS DEDICATED

*BY THE AUTHOR.*

# CONTENTS.

## విషయసూచిక.


| విషయము. | పుట. |
|---|---|
| 1. వేములవాడ. భీమకవి. | 1 |
| **I. భారతాంధ్రకవులు.** | |
| 2. నన్నయభట్టు. | 48 |
| 3. తిక్కనసోమయాజి. | 75 |
| 4. ఎఱ్ఱాప్రెగ్గడ. | 99 |
| 5. పిల్లలమఱ్ఱి. పినవీరభద్రయ్య | 109 |
| **II. రామాయణాంధ్రకవులు.** | |
| 6. హుళక్కి భాస్కరుఁడు. | 124 |
| 7. అయ్యలరాజు. రామభద్రయ్య. | 139 |
| 8. జయంతి. రామభట్టు. | 154 |
| 9. కంకంటి. పాపరాజు. | 156 |
| **III. ఆంధ్రపంచకావ్యకవులు.** | |
| 10. అల్లసాని. పెద్దన. | 162 |
| 11. నంది. తిమ్మన. | 176 |
| 12. తెనాలి. రామకృష్ణకవి. | 193 |
| 13. శ్రీనాథుఁడు. | 244 |
| **IV. ఆంధ్రద్వ్యర్థికావ్యకవులు.** | |
| 14. పింగళి. సూరన. | 291 |
| 15. రామరాజభూషణుఁడు. | 350 |
| 16. పిండిప్రోలు. లక్ష్మణకవి. | 401 |
| 17. శిష్టు. కృష్ణమూర్తి శాస్త్రికవి. | 442 |
| **V. ప్రౌఢప్రబంధకవులు.** | |
| 18. సంకుసాల. నృసింహకవి. | 457 |
| 19. శ్రీకృష్ణ దేవరాయలు. | 475 |
| **VI. పురాణకవులు.** | |
| 20. బమ్మెర. పోతరాజు. | 589 |
| 21. వెన్నెలకంటి. సూరనార్యుఁడు. | 648 |
| 22. జక్కన. | 674 |
| 23. వెన్నెలకంటి. వేంకటాచలము. | 681 |
| 24. రామగిరి. సింగనకవి. | 694 |

శ్రీ రస్తు.

# గ్రంథకర్తపీఠిక.

ఆంధ్రభాషాభిమానులకు నిపుడీగ్రంథము మరల రెండవకూర్పునఁ ప్రకటించునట్టిసంగతి విజ్ఞాపనము చేయుచున్నాఁడను. ఇది ప్రథమములో నేను స్కూలులో విద్యాభ్యాసము చేయుచున్నతఱి నింగ్లీషు భాషలో నుండు "Macaulay's Critical and Biographical Essays of Poets" అను గ్రంథమువంటిగ్రంథ మాంధ్రభాషలో నుండిన నెంతయు నుపయోగకారిగా నుండు నని యూహించి యావిషయమై కొందఱు పెద్దలతో సహవాసము చేసి కొంతగ్రంథము సంపాదించి దేశస్థుల యభిప్రాయము లరయుటకుఁగాను గొంతకొంతగా 1876 సం. రము మొదలు ప్రకటింప నారంభించినాఁడను. అంతట నందులోని రెండవ భాగము ఆ 1882 వ సంవత్సరములో B. A. పరీక్షకుఁ బఠనీయగ్రంథముగా నేర్పఱుపఁబడుటం జేసి యాభాగముమాత్రము మఱియొకపరి ముద్రించి ప్రకటింపఁబడినది. అనంతరము మఱికొన్ని భాగము లప్పుడప్పుడు శ్రీప్రబంధకల్పవల్లి యనుపత్త్రికలోఁ గల్పి ముద్రింపఁబడినవి. అవి యన్నియు నేకసంపుటముగ లేకున్నను, శాలివాహనశకము పదియవ శతాబ్దము మొదలు పదియేడవశతాబ్దమువఱకు నుండినకవులయొక్క చారిత్రములు దొరకినమట్టుకుఁ బ్రచురింపఁబడినవి. అంతట దేశచారిత్ర విషయమై చేయుచున్నకృషి యధికమగుటచేతను నందులోనే కవిచారిత్రములకువలయుకాలనిర్ణయాదికము చేయుట కాధారము లనేకము లుండుటంబట్టియు నట్టిపని చేయుటసులభసాధ్యము కాకుండుటచేతను బూర్తిగాఁ గవిజీవితగ్రంథము రెండవకూర్పుగా నచ్చువేయించుట కవకాశము చిక్కలేదు. ఇట్లుండఁ, బ్రం. కందుకూరి. వీరేశలింగముగారు తమమిత్రులెవ్వరో తమ్ము గవిచరిత్రములు తిరుగ రచియించుటకుఁ బ్రేరేపించినారని కవిచారిత్రములనుపేరుతో నొకగ్రంథము ప్రాచీనకవులం గూర్చినభాగమును ముద్రించి ప్రకటించిరి. అందుఁ జెక్కుడుకవులపేళ్ళును వారిచారిత్రములును వ్రాసిన ట్లున్నను చాలభాగ మిదివఱలో నాచేఁ బ్రకటింపఁబడినకవిజీవితములయర్థసంగ్రహమే కాని వేఱు కాదు. ఏవియైన నొకటి రెండుకథలు నవీనముగాఁ గల్పించుటకుఁ జేర్పఁబడినను నవి యనవసరమైనచారిత్రములుగా నైనను లేక ప్రత్యేకము కవిత్వశైలిం జూపుటకు

వ్రాయఁబడినపద్యములు నుదాహరణములు గానైన నుండును. అవి య
న్నియుఁ జేరి యొకగ్రంథముగా నేర్పడఁగా నందువలన నాంధ్రభాషకుఁ
గల్గినలాభ మేమయ్యె ననఁగా నదివఱలోఁ గవిజీవితములలో నేర్పఱుపఁ
బడినకాలనిర్ణయములు పూర్వపక్షము లగుటయుఁ గవిచరిత్రములోఁ
జేయఁబడినతద్విషయకోపన్యాసములనుబట్టి యట్టినిర్ధారణ చేయుటకు
వీలులేకుండుటయుఁ దటస్థం బయ్యెను. పైమార్గముననే యనంతరము
నెల్లూరుజిల్లాలో మఱియొకబుద్ధిశాలియును గవిజీవితములలోని ప్రథమ
భాగమును దనభాషాపాండిత్యమును జూపుచు మార్చి మఱికొన్ని
యంశముల నిష్టానుసారముగాఁ జేర్చి యొకగ్రంథ మచ్చువేసి ప్రకటిం
చెను. ఇది క్రీ.శ 1886 సంవత్సరమువఱకై యుండెను. కాని నేను వ్రాయు
చున్న దేశచారిత్రము ముగియక యుండుటంబట్టియును గొందఱు నే నప్పటి
వఱకు చేసిన సిద్ధాంతములఁ బూర్వపక్షము చేయుటంబట్టియును, మఱి
నాగ్రంథము ముద్రించి ప్రకటింప నవసర మున్నదియు లేనిదియుఁ
జూడకుండ ధనవ్యయము చేయ నేల యని యూహించి నేను వ్రాయు
చున్నపనినే నెఱవేర్చుచు నుంటిని. అది క్రిందటిసంవత్సరముతో ముగి
సినది కావున దానిని బ్రకటించుటకుఁ జిరకాలము పట్టు నని యెంచి
యిదివఱలోఁ దొలుతఁ బ్రకటింపఁబడినకవిజీవితములను గ్రంథము
లోఁ బ్రకటించినచోఁ బాఠశాలలకు మిగుల నుపయోగ మగు నని నా
మిత్త్రులు ప్రేరేపఁగా నే నిపుడు దానిలో నీభాగములను బ్రచురించు
చున్నాను. కవిచరిత్రముయొక్క రెండవభాగము ప్రచురింపఁబడుచు
న్నది గావున నిపుడు నేను ప్రచురించెడుగ్రంథములో సాధ్యమగునంత
వఱకు దానిపైఁ బూర్వపక్షములఁగూడఁ బ్రకటించెదను. ఇట్టిపని నే
గ్రంథకర్తల యెడలఁగాని వారిగ్రంథముల యెడలఁగాని నాకొకయసూయ
కల్గి యుండుటచేతఁ గాదు. ఎవరికిఁ దోఁచిన సిద్ధాంతమును వారు స్వతం
త్రించిచూపిన నది పాఠకుల కుపయోగింపక మిక్కిలి సందేహములఁ
జనుపుచున్న చారిత్రములు మతఖండనలు గలసంవాదగ్రంథములును భా
వ్యములు జదివినట్లు చదివి తుదకు ముఖవిధానస్థులై పూర్వపక్షము చే
సినవారికిని సిద్ధాంతము చేసినవారికిని నాల్గుదీవెన లిచ్చి పుణ్యమంది గ్రం
థమును క్రింద నుంచివేయుదురు. అట్టిసన్మానము కలుగకుండఁగఁ బ్రస్తు
తము నేను జేయుపూర్వపక్షసిద్ధాంతములు విమర్శన మనుశ్లోకతో

గ్రంథములో వేఱుగ నొకతావున సాధ్యమగునంతవఱకుఁ జేర్చుచున్నాఁడను. అటులనే కాలనిర్ణయము చేయునప్పుడును దానికి నొకశీర్షిక నిచ్చి వేఱుగనే చేయుచున్నాఁడను. ఇట్టిసంగతు లన్నియు గ్రంథము చూచినంగాని గోచరములు కావు. ఈసంగతు లన్నియు నట్లుండగాఁ దెలుఁగుదేశపుపండితుల నందఱ నొకసంగతిఁ బ్రార్థించుచున్నాఁడను. అది యెట్టిదనఁగా భాష యొకరిసొమ్ము గాదు. అటులనే చారిత్రమును. ఇంతియ కాక యిది యొకదేశములోనిదియుం గాదు. గ్రంథానుకూల మైనగాథ లాంధ్రదేశములో నాల్గుతెఱఁగుల నుండువాని సేకొని యిందుఁ బొందుపఱుచుచున్నాఁడను. అట్టివానిలో భేదములుగాని యపసిద్ధాంతములుగాని వచ్చినప్పుడు పండితులు వానిని దెల్పి యదివఱ కొకవేషము వేసికొని గ్రంథమును వినుపించుచున్న చారిత్రకారునిచేతనే దానిని సవరణ చేయించి యతని మర్యాదను నిల్పి యతనికృతజ్ఞతాసూచకము లగువందనముల నందుట మంచిది గదా! కావున నిఁక ముందు ప్రకటింపఁబోవు చారిత్రములకుఁ గాని కవిచరిత్రములకుఁ గాని చరిత్రాభిమాను లందఱును నేను బ్రార్థించువిధముననే సహాయము చేసెదరని నమ్మియున్నాఁడను. అని యిటుల వ్రాయుట కవితాధర్మముం దెల్పుటకుఁ గాని పూర్వపక్షి సేయునాక్షేపణకు జంకి కాదు. అట్టిపూర్వపక్షులమతఖండనము సేయుచోఁ గొంతకు కలహోసను లేదని గ్రంథము చూచినవారికే స్పష్టము కాఁగలదు. అయినను గొన్నిమార్గముం జూపుట కెవ్వరైనఁ బ్రయత్నించునప్పుడు విద్వాంసులు దానిలోనిగుణదోషములఁ దెలిసి దానిని గాపాడుట వారికి సహజధర్మమని విన్నవించుచున్నాఁడను.

"శ్లో. సామాన్యోఽయం ధర్మసేతు ర్నృపాణాం కాలే కాలే పాలనీయో భవద్భిః,
సర్వానేతాన్ భావినః పార్థివేన్ద్రాన్, భూయోభూయో యాచతే రామచన్ద్రః."

అని శ్రీరామచంద్రుఁడు సంతతానువను నీవిధముగఁ దాఁ జేసిన యొక కార్యమును బరిపాలింపవలయు నని ప్రార్థించుచుండ నిఁక నాయట్టికించిజ్ఞునిచే నిట్టిసహాయము ప్రార్థింపఁబడుట కేమియబ్బురము? కావున నాంధ్రపండితు లీశ్లోకమును బాటించి నన్ను గరుణింతురుగాక. *

విజయనగరము. 1.2.1893.

ఇట్లు, విన్నవించు చరిత్రకారుఁడు
గురజాడ. శ్రీరామమూర్తి.

* ఇది గ్రంథకర్త యొకప్పు డిందలియొక భాగమును బ్రకటించునపుడు చేసినవిజ్ఞప్తి.

# ముద్రాపకుల విన్నపము.

మన యాంధ్రభాషలోఁ బ్రథమచారిత్రగ్రంథ మగు నీ 'కవిజీవితములు' తమ యితరచరిత్రగ్రంథములతోఁ బాటు గ్రంథకర్తచే రెండుమాఱులు ముద్రింపఁబడియు నిప్పుడు చాలకాలమునుండి మరల ముద్రితము కానందునఁ బలువురచే నపేక్షితమయ్యు లభ్యము కాకున్న యది. ఇట్టిస్థితిలోఁ మనమైనఁ జేతనైనంతవఱకు లోకోపకారక మగు దీని ముద్రించి లోకమున కిచ్చెదముగాక యని మేము చిరకాలముక్రిందటనే తలఁచియుంటిమి. పలువురు మిత్త్రులును మమ్ము దీనిఁ బ్రకటింపఁ బ్రోత్సాహపెట్టుచుండిరి. అయినను మా కితరకంటెను నవశ్యకార్యము లుండుటచేతను, వేఱుచిక్కులవలనను ఇంతకాల ముపేక్షతో నుండఁగా సంస్కృతాంధ్రాంగ్లభాషావిశారదు లగుమామిత్త్రులు శ్రీయుత గురుజాడ. అప్పారావుపంతులు బి. ఏ., ఎఫ్. ఎమ్. యు. గారు దీని ముద్రింప మమ్ము బురికొలిపి, పైగ్రంథకర్తగారి కొమారు లగు శ్రీయుత గురుజాడ.దుర్గాప్రసాదరావుపంతులు బి.ఏ.బి.ఎల్ గారినుండి యీగ్రంథమును బ్రకటింప మా కనుమతి నిప్పించి మాచే దీనిని బ్రకటింపఁజేసిరి. ఇట్లు జనోపయోగముపొంటె మాచే సద్గ్రంథప్రకటనము జేయించిన శ్రీ అప్పారావు పంతులుగారికిని, శ్రీ దుర్గాప్రసాదరావుగారికిని, మాచేయు పరిశ్రమ కనుగుణముగా మమ్ము సద్గ్రంథప్రకటనమునకుఁ బురికొలుపుచున్న భాషాభిమాను లగునితరపండితులకును ననేకవందనముల నర్పించుచు నింతటితో విరమించి మఱియొకదెస కేఁగుచున్నారము. ఈగ్రంథమున కనుబంధముగా రచియింపఁ బడినశృంగారప్రబంధకవులచరిత్రము, గొంత యితరకవులచరిత్రము, కొన్ని విమర్శనములును గలగ్రంథము నముద్రితమైనదానిని పైగ్రంథకర్తవలన సంగ్రహించి యుంచిన శ్రీ అప్పారావుగారే మాకొసంగియున్నారు. అది చాల శిథిలమై మొదటఁగొన్ని పొరటలయంతర్ధానముగలదైయున్నది గావున నెమ్మదిగాఁ జక్కఁబఱిచి కొఱవడినదాని సంపాదించుకొని వెనువెంటనే ప్రకటించెద మని విన్నవించువిధేయులు.

చెన్నపురి.<br>
10-8-1918

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్.

శ్రీ ర స్తు.

శ్రీ దక్షిణామూర్తయే నమః

# కవి జీవితములు

## ప్రథమ భాగము.

## 1.

## వేములవాడ భీమకవి.

ఈకవిశిఖామణి వేములవాడ యను నొకయూర జన్మంబుం గాంచుటం జేసి యిట్టిగృహనామంబు గలిగినది. ఈగ్రామము గొందఱు కృష్ణామండలములోని దందురు. మఱికొందఱు గోదావరీమండలములోని దందురు. కొన్నికొన్నికారణములచే నిది గోదావరీమండలములోనిదే యని నిశ్చయింపఁబడినది. ఇది కాకినాడకు సమీపమున నున్నయది. దీనికిఁ గొంచెముదూరముననే దాక్షారామము (దక్షవాటిక) అనుగ్రామ మున్నది. అచ్చటనే భీమనాయకస్వామి యున్నవాఁడు. ఆయీశ్వరుని కటాక్షాతిశయమున నీతఁ డుద్భవించె ననియు నాతని కీతఁడు కుమారుఁడే యనియు వాడుక గలదు. ఇది యెంతవఱకు నమ్మఁదగినదో మనము చెప్పలేము. ఇట్టివార్తలు మనహిందువులలోనే కాక క్రైస్తవులు మొదలగునితరమతములవారిలోనుం గలవు. ఈవిధముననే క్రీస్తువు భగవంతునికుమారుఁ డని జగత్ప్రసిద్ధి గలదు. అట్టివృత్తాంతమును నమ్మువారు దీనిని విశ్వసింతు రని నమ్ముదము. ఇట్టివృత్తాంతములు ప్రతిమతములోనను మహాత్ములంగూర్చి చెప్పఁబడినప్పుడు కల్గును. కావున నందఱును నమ్మవలసినదే కాని వేఱు కాదు. అట్టివారిలోఁ గొందఱు నమ్మమనుట కలిగనేని వారు తమమతము నట్లే గ్రహించి రనవచ్చును. అయినను మన మిపు డావిషయమునుగూర్చి మాటలాడవలసినది లేదు. భీమునిజన్మవృత్తాంతము గొంత వక్కాణింతము.

వేములవాడగ్రామములో నొకబ్రాహ్మణుఁడు కాఁపురము సేయుచుండెను. ఆయన కొక కూఁతురు సంతానము లేక వగచు కాలమునఁ గలిగినది. అట్టిశిశువుం జూచి యాబ్రాహ్మణుఁడు మిక్కిలి ప్రేమతోఁ బెంచుచుఁ బెద్దదానిం జేసి వివాహసమయము తటస్థింపఁగానే యొకా నొకబ్రాహ్మణకుమారు నెకి విద్యాబుద్ధులచే నొప్పువాని కిచ్చి వివాహము చేసెను. ఆచిన్నదాని కత్తవారియింటికి వెడలుప్రాయము వచ్చువఱ కాచిన్నదానిభర్త కాలధర్మము నొందెను. అపు డాచిన్నది విశేషదుఃఖముతో నుండ నాచిన్నదానితలిదండ్రులు దానిని బుజ్జగించి తమయింటనే యుంచుకొని పోషించుచుండిరి. ఇట్లుండఁ గొంతకాల మతిక్రమించినది. ఒకానొకసమయమున నాయూర నుండు మఱికొందఱు బ్రాహ్మణస్త్రీలు శివరాత్రినాఁడు తత్పర్వంబునకై యాసమీపముననే యున్న దాక్షారామమునకుఁ జన నుద్యుక్తలయిరి. అపు డీబ్రాహ్మణునికూఁతురును వాండ్రతోఁ బోవఁ గమకించి తల్లిదండ్రుల నాజ్ఞ యడుగఁగా వారును గూఁతు రిహమునకుఁ గాకున్నఁ బరమునకైనఁ దగుయత్నంబు చేయవలసినదే కావున దీనికి సెల వీయఁ దగు నని తగుధనం బిచ్చి వాండ్రవెంట దాక్షారామమునకుఁ బంపిరి.

ఇటు లాబ్రాహ్మణస్త్రీ లందఱు దక్షవాటిం జేరి యచ్చోఁ బ్రవహించుచున్న సప్తగోదావరములో స్నానము చేసి భీమనాథుని దర్శించి స్వమనోభీష్టములం గోరుచు మ్రొక్కు లిడ సాగిరి. అపు డీబాలరండయు స్వామికిఁ దనతోడియువతులు మ్రొక్కుటచూచి అవి సఫలము లగునా యయిన నేనును మ్రొక్కెద నని యీశ్వరునిదిక్కుమొగంబై "ఓస్వామీ! నాకు నీయట్టికుమారుఁడు పుట్టెనేని పుట్టెఁడునీరు దీపారాధనచేసి నాలుగుపుట్లయినుక నైవేద్యము పెట్టెద" నన్నది. అట్టిదీనిమనవి యగా యీశ్వరుని కెంతయు సమ్మోదకారి యయ్యెనఁట. ఆహా! ఏమి! ఈశ్వరుని విలాసము! ఏమి! యాభక్తసులభత! ఇట్లు నలువురితోపాటు మ్రొక్కి యింటికి వచ్చి శయనించినయాబ్రాహ్మణస్త్రీకి స్వప్నమున నాయీశ్వరుఁడు సాక్షాత్కరించి "ఓయువతీ! నాయట్టిపుత్త్రుని బడ

యుఁగోరితివి; ఆవరము నీకు దయసేయ వచ్చితిని; ఇదె గైకొమ్మని యామెతో నప్పుడే కలసి నీపుత్త్రునకు నాపేరే యుంచు". మని సెల విచ్చి యంతర్హితుం డయ్యెను.

ఆబ్రాహ్మణి యది యంతయుం జూచి విస్మితయై యొకవిధ మగుకల కావలయును. లేకున్న నీశ్వరుఁ డెక్కడ? నే నెక్కడ? నన్నుఁ బొందుటయే యాతనికి వలయునా? అని యూహించి సిగ్గుచేత నీవృత్తాంత మెవ్వరితోడనుఁ జెప్పఁజాల దయ్యెను. ఇట్లుండ నెలతప్పినది. అంతట వేవిళ్ళారంభ మయినవి. దానిం జూచి యాచిన్నది మనంబునఁ గళవళపడసాగినది. అంత మూఁడుమాసంబులు గతించినతోడనే యా చిన్నది గర్భము ధరించినది యని యందఱు ననుమానపడఁదొడఁగిరి. ఇట్లుండ నైదవమాసము సంప్రాప్త మయినది. అప్పటిస్థితిగతుల నాలోచించి యాచిన్నది దోషిణి కావున దీని నిలు వెడలఁ గొట్టినఁ గాని మీయింటికి రా మని యా లేమతండ్రితో నాయిరుగు పొరుగువా రందఱు ననిరి. అపు డాబ్రాహ్మణుఁడు కూఁతుం బిలిచి నిజవృత్తాంతము చెప్పు మనుఁడు నాచిన్నది కన్నీరు నించుచుఁ దా శివునకు మ్రొక్కువిధంబును శివుఁడు తనకుఁ గలలోఁ గన్పించిన తెఱంగును సవిస్తరముగాఁ జెప్పిన నాబ్రాహ్మణుఁడు తాను శివపూజాపరుఁడు కావున శివునకు గల్గినమహానుగ్రహమునకు సంతసిల్లి "అమ్మా! నీవు వగవకుము. లోకులేమనిన ననఁగలరు. నాకు నీవృత్తాంతము సరిపడి యున్నయది" అని యాచిన్నదానిని దగువిధంబునఁ గాపాడుచుండెను. అంత నవమాసములును నిండినవి. అపు డామె యొకపుత్త్రుఁడు విశేషతేజశ్శాలి జనియించెను. అతని తేజోవిశేషంబులఁ జూచి యాతనికి భీమేశ్వరుం డని నామకరణము చేసెను. ఇదియె వేములవాడభీమకవి జన్మప్రకారము. ఇది యీదేశమున నంతటను నట్లే వ్యవహరింపఁబడుచున్నది. ఇఁక నితనిశైశవక్రీడాదికముం గూర్చి యించుక వ్రాయుదము.

ఈభీమకవి యయిదాఱుసంవత్సరములవఱకుఁ దల్లిపాలనమునై యుండెను. ఇట్లుండి యొకనాఁడు తోడిపిల్లలతో నాటలాఁ

నం దొకకుఱ్ఱం డీతఁ డన్నియాటలం జెల్లుడుకొనుచుంట సహింపలేక యితనితోఁ బ్రమము లెన్నఁదలఁచి "యోకుఱ్ఱలారా! మన మాతండ్రిలేనివానితో నాఁడ నేల? మనలో మన మాఁడుకొనుదము రండు" అని వారిం బిలుచుకొని పోవుడు భీమకవి మొగము చిన్నఁబుచ్చుకొని యచ్చోటు వాసి పోయి తనతల్లిం గాంచి యిట్లనియె. "అమ్మా! మాతండ్రి యెచ్చో నున్నాఁడు? ఒకచో నున్న యెడల నన్నీబాలు రిట్లనుటకుఁ గారణం బేమి? తండ్రిలేనివాఁ డని పెక్కుగఁ బల్కి యపహాసించుట యేల కల్గె? దీనికిఁ గారణమ్ము దెలుపు మనుఁడు నమ్మగువ యేమియు నన నోరాడక యూరకుండినది." అది తన్నవమానించుటగా నెఱింగి భీమన యొకకత్తి పెఱికికొని వచ్చి "మాతండ్రిమాట చెప్పెదవా? లేకున్న నీతల శకలంబులు చేయుదునా; అనుఁడు నాపె భయ మొంది యిట్లనియె. "అయ్యా! మీయయ్య దాక్షారామపు దేవళములో నున్న యాశిలయే. అతనియొద్దకుం బోయి నీవృత్తాంతమం తయు నడుగు మనుడు వల్లె యని యారాత్రితో నచ్చటికిం బోయి "యోయీ! నీవు నాతండ్రివఁట! నీ వుండ నన్నుఁ దండ్రి లేనివాఁడా యని నాస్నేహితు లన నవసరం బేమి? నీవు నాతండ్రివే యయిన యెడల వారి కందఱకును గాన్పించి నన్నిట్లనకుండఁ జేయుము" అనుడు నాదేవునివలన నేమియు నుత్తరము లేదయ్యెను. "అంతం గోపించి భీమన యేమీ యీమూర్ఖత నీవు మాట్లాడకున్న నీఱాతిచే నీశిరంబు శకలీభూతంబు గావించెదను" అనుడు నాయీశ్వరుఁడు వానియెడ వాత్సల్యము వహించి ప్రత్యక్షుంబై నేను నీకుఁ దండ్రినే యగుదును. నీవు నాకు బిడ్డఁడవు. ఈవృత్తాంతము లోకములో నందఱకు నికఁ దెలియును. [illegible]మ్మనుఁడు [illegible]ంతటితోఁ బోనీయక నే నీకొడుకునే యయిన నే నాఁడినది

ఱియుఁ బాడినది పద్యమును నగునట్లు వర మిమ్మనుఁడు నవ్వి యమ్మహామహుం డట్లు వరమిచ్చి యంతర్హితుం డయ్యె. అట్టివరములం బడసి భీమన తల్లికడ కరుదెంచి యావృత్తాంత మాపెకుఁ దెల్పిన నాపెయు హర్షోత్కర్షము నందినది. భీమన [illegible] నాబాలురతోఁ

గలియక తనపని తాను జూచుకొనుచుండెను. ఇట్లుండ మఱికొన్ని దినంబులు గతించినవి. అంత నాయూర నొకగొప్పగృహస్థునియింట్ల నొక బ్రాహ్మణసంతర్పణ తటస్థించినది. అపు డాయూర నుండు బ్రాహ్మణు లందఱును భోజనంబునకుఁ బిలువంబడిరి. భీమకవిమాత్రము రండాపుత్రుండని పిలువంబడఁడయ్యెను. దానికి భీమన తనమనమున వగచి కార్య మగుచున్న వారివాకిటఁ గూర్చుండెను. ఇతఁడును వాకిట నున్నాఁ డనువర్తమానము దెలిసి తలుపులు దగ్గఱగా వేసికొని లోపల వడ్డనకారంభించిరి. అవుడు భీమన తనమాహాత్మ్యమును వారలకుఁ జూప నిశ్చయించి, యప్పాలు కప్పలు కావలె ననియు, నన్నము సున్నము కావలె ననియుఁ బాడం దొడంగెను. ఇట్టిపాటకు ననుగుణముగా లోపలఁ గప్పలును సున్నమును నగుడు నచ్చో నుండువారందఱును వెఱచి దీనికిఁ గారణ మే మన నందులోఁ గొందఱు భీమనపాట విని దీనికి భీమనయే కారణము. ఆయన మహానుభావుఁడు. అట్టివానిఁ దోడితెచ్చి మనము పూజించితిమేని సీయాపద మాను నని నిశ్చయించి యజమానునిం దోడ్కొని వచ్చి యామహామహుం బ్రార్థించి లోనికిం దెచ్చిరి. అపు డాతఁడు తిరుగఁ గప్ప లప్పములు గావలె ననియు, సున్న మన్నము గావలె ననియుఁ బాడినతోడనే యవి యన్నియు నట్లే యయినవి. అవుడు భీమకవి మహత్త్వము సర్వజనులకును గోచరమయినది. నాఁడు మొద లీత డెప్పుడును సగౌరవం బందఁడయ్యెను.

ఇతఁడు చళుక్యవంశపురాజగు చొక్కనృపాలునసభ నున్నట్లు కొన్నికొన్ని పద్యంబులచేఁ గాన్పించుచున్నది. ఆచొక్కనృపాలుఁడు రాజరాజనరేంద్రునివంశజుఁడు. అతనికిని రాజనరేంద్రునకును గలుగునంబంధము రాజనరేంద్రచరితంబునఁ జెప్పఁబడును.

ఈకవి యన్నిసంస్థానంబులం జూచి యారాజులచే విశేషగౌరవము నందినట్లు వాడుక గలదు. ఇతని కాలములోనె మైలమ భీమన యనునొకదండనాథుఁడు గలఁడు. అతనింగూర్చి యితఁడు కొన్నిపద్యములం జెప్పెను. భీమకవికవిత్వఘటికఁ జూపుటకు

బఱిచెదము. ఈమైలమభీమనశాసనము అమరావతిలోని అమరేశ్వరుని దేవళముపై నున్నట్లును అది శాలివాహన.సం.925 యైనట్లును "Elliot Marbles" అనుపుస్తకమువలనం గాన్పించును.

ఇతనిసంతతివారే ఆంధ్రదేశములోనిపూసపాటిమహారాజులందఱును అని తెలియుచున్నది. ఇతనితల్లి యగుమైలమాంబవలన నితనికి మైలమభీమన యనునామము గల్గినది. ఆవృత్తాంతమును మఱికొంత యితర వృత్తాంతమును నీభీమకవిచారిత్రాంతమున జూపెదము.

చ. గరళపుముద్ద లోహ మవగాఢమహాశనికోట్లు సమ్మెటల్
హరునయనాగ్ని కొల్మి యురగాధిపుకోఱలు పట్టుకార్లు ది
క్కరులయురంబు దాయి లయకాలుఁడు కమ్మరి వైరివీరసం
హారణగుణాభిరాముఁ డగుమైలమభీమనఖడ్గసృష్టికిన్.

ఈకవి యొకానొకసమయమున గుడిమెట్ట యనుగ్రామమునకుఁ జనియె. అవుడు తనగుఱ్ఱము నొకచోఁ గట్టించిన నది కనుమొఱంగి చనియె. దానిని వెదకుటకుఁ దనసాహిణిం బంచిన వాఁడును వెదకివెదకి యది శ్రీపతిరాజు పోతరాజనునొకరాచకొమరునిచేఁ బట్టువడినట్లును, దన కది సాధ్యము కానట్లును విన్నవించెను. అప్పుడు భీమనయు గుఱ్ఱంబు తనదైనట్లును, దాను వైదేశికుండైనట్లును, ముందు జాగ్రతగా దాని నుంచుటకు సాహిణికిం జెప్పెద ననియు వర్తమానంబు పంచెను. అది విని యాక్షత్రియుఁడు సరకు సేయఁడయ్యెను. అతనితమ్ముఁ డది కర్ణంబు కాదనిన వినడయ్యెను. ఇట్లారాజు తాఁ బట్టినపట్టు విడువకుండుటకుఁ దనలోఁ గోపించి భీమన యీక్రిందిపద్యమును వ్రాసి పంపెను. అదెట్లన్నను:—

చ. హయము మది సీత-పోతవసుధాధిపుఁ డారయ రావణుండు ని
శ్చయముగ నేను రాఘవుఁడ * జాహ్నవి వారిధి మాఱఁ డంజనా
ప్రియతనయుండు † సింగన విభీషణుఁ డాగుడిమెట్ట లంక నా
జయమును బోతరక్కసునిచావును నేఁడవనాఁడు చూడుఁడీ.

* పవ్యాజ. ॥ లచ్చన, అని యప్పకవీయములో దీనికిఁ బాఠాంతర మున్నది.

అని యిట్లు శాపం బిచ్చి యాపద్యం బారాజుకడకుం బంచి భీమన తాను యథేచ్ఛం జనియెను. ఆరాజకుమారుఁడు భీమనశాపంబు పరకుగొనకున్న నేఁడవనాఁటికే మృతి నొందెనఁట. ఇట్లు కాలవశుండైనయారాజుయొక్క బంధువు లతనికి నగ్నిసంస్కారంబు గావించుటకు శ్మశానవాటికకుం గొనిపోయిన నాతనిభార్య లిరువు రాతనితో సహగమనము సేయం జనుదెంచి యచ్చో విలపించుచు నుండిరి. అంతలో భీమన మరల నాయూరికి వచ్చుచుండెను. అది గాంచి యచ్చో నుండు కొందఱు బుద్ధిమంతు లాయువతులం బోయి భీమనకుఁ బాదాభివందనంబు సేయుఁ డని తెల్పిరి. అట్లనే యాయిర్వురుయువతులును ముఖంబులయందు శోకచేష్టలం దోఁపనీయక యాకవి కెదురుగఁ జని నమస్కారంబులు గావించిరి. వీం డ్రెవరో యిల్లాం డ్రని నిశ్చయించి వారి భక్తికి మెచ్చి "సౌభాగ్యవతీ భవ" "సౌభాగ్యవతీ భవ" అని దీవించెను. అంతల కాయింతు లానందించి "స్వామీ! మే మదియ కోరి వచ్చినవారము. కావున మాపతివలనియవజ్ఞత సైఁచి మాకుఁ బతిభిక్ష పెట్టుఁడు" అనుఁడు నామహాకవి వారినిఁ బోతనృపునిభార్యలుగా గ్రహించి విగతభర్త ననుగ్రహించితి నని యీక్రిందిపద్యంబు లిఖించెను.

క. నాఁటిరఘురాము తమ్ముఁడు, పాటిగ సంజీవిచేతఁ బ్రతికినభంగిన్
గాటికిఁ బో నీ కేటికి, లేటవగపుపోతరాజ లెమ్మా రమ్మా.

అనుఁడు నారాజన్యుఁడు మూర్ఛఁ జెంది తెలిసినవానివలెనే దీర్ఘనిద్రం జెందక లేచి తనయెదుట నున్న భీమకవిం జూచి రక్షింపు మని నమస్కరించిన నాతఁ డప్పు డని వానిం దీవించి బుద్ధి గల్గి బ్రతుకు మని తెల్పి యథేచ్ఛం జనెను. ఈవృత్తాంతము తురగా రామకవి దని కొంద ఱందురు. అప్పకవీయములో నెల్లూరి తిరుమలయ్య చెప్పినట్లున్నయది.

ఈభీమకవి రామగిరిదుర్గమునకుఁ జొక్కభూపాలునితో దండయాత్రకుం జనియె. అచ్చట నానృపాలుని సాహిణిమారుఁ డనుదండనాయకుఁ డెదిర్చెను. అతనిదౌష్ట్య మడఁగం బగుడు భీమకవి యీక్రిందిపద్య

ము చెప్పి వాని సంహారించి తనరాజునకు జయం బిచ్చెను. ఆపద్య మెట్లన్నను :—

ఉ. చక్కఁదనంబుదీవి యగుసాహిణిమారుఁడు మారుకైవడిన్
బొక్కి పడం గలండు చలము న్బలమున్గలయాచళుక్యపుం
జొక్కనృపాలుఁ డుగ్రుఁ డయి చూడ్కుల మంటలు రాలఁ జూచినన్
మిక్కిలి రాజశేఖరునిమీఁదికి వచ్చిన రిత్త వోవునే.

ఈకవి యొకానొకసమయంబున నీచొక్కనృపునిసభ నలంకరించి యుండఁగా నాతఁడు "స్వామీ! మీ రాడినది యాటయుఁ బాడినది పద్యమును నగు ననియు, నేమనిన నది యట్లే యగు ననియు జగత్ప్రసిద్ధి గలదు. దాని నీసభవారికి వినోదార్థ మగుపఱుప వేఁడెదను" అనుఁడు నీ కేది యభీష్ట మనుఁడు నాతఁడు తనమల్లశాల నున్న స్తంభము వృక్షము సేయుటయే యనియె. దానికి భీమకవి నవ్వి యిట్లనియె.

శా. ఆనీతాభ్యప దానుశృంగళపదభ్యాలంబిత స్తంభమా!
నేనే వేములవాడభీమకవి గా నీ చిత్రకూటంబులో
భూనవ్యాపితపల్లవోద్భవమహాపుష్పగుచ్ఛంబులన్
నానాపక్వఫలప్రదాయి వగుమా నాకల్పవృక్షాకృతిన్.

అని యిట్లు చదివినతోడనే యాసభవా రందఱును గన నది పుష్పఫలసమన్వితం బగువృక్షం బయ్యెను. అట్టివృత్తాంతమునకు రాజును సభవారును మిగుల సంతసించి మఱల దానిని స్తంభముగ నొనర్పు మనిన దానికి సంతసించి భీమకవి యిట్లనియె.

ఉ. శంభువరప్రసాదకవిజాలవరేణ్యుఁడ నైన నావచో
గుంభన సేయ నెంతయనుకూలత నొంది తనూనభావమై
కుంభినిఁ జొక్కనామనృపకుంజరుపండిటిమల్లశాలకున్
స్తంభమురీతి నీతనువు దాల్పుము యెప్పటియట్ల యుండుమా.

ఈభీమకవి యొకానొకసమయంబున విజయనగర (కళింగదేశములోనిది) సంస్థానాధిపుఁ డగురాజకళింగగంగును జూచు కేడుక నచ్చటికిం జని తనశ్లాఘ యాతనికిం జెప్పి పుచ్చె. అపుడు రాజకళింగగంగు కా

ర్యాంతరభాగంబున నుండుటంజేసి మఱియొకపరి రమ్మని మాఱుపం చె. భీమకవి తనంతటఁ దాను వచ్చి వర్తమానంబు పంపినపుడు రాజు స్వయముగ వచ్చి తనకడ సెలవు గైకొనక యిట్లు వర్తమానంబు పంపుట కుం గోపించి యీక్రిందిపద్యంబు వ్రాసి మఱలఁ బంపెను.

క. శాపానుగ్రహపటువును, గాపాడెడికవులఁ ద్రెంచి (?) పంబనఁగా
భూపాలసభలఁ బూజ్యుఁడ, నాపేరే భీముఁ డండ్రు నగవగ సభలన్.

ఇట్టిపద్యంబు చూచియు రాజు జాగరూకుఁడై యాకవిదర్శనంబునకు రాక మరలఁ బోంటియట్ల యుత్తరం బిచ్చెను. దానిచేఁ గ్రోధారుణితలోచనుండై భీమకవి యీక్రిందిపద్యము వ్రాసెను. అదెట్లన్నను :—

ఉ. వేములవాడభీమకవి వేగమ చూచి కళింగగంగు దా
సామము మాని కోపమున సందడి దీఱినవెన్కఁ గమ్మనెన్
మోమిటు చూప దోష మని ముప్పదిరెండుదినంబులావలన్
జామున కర్ధమం దతనిసంపద శత్రులపాలు గావుతన్.

అని యిట్లు శాపం బిచ్చి యాతఁడు తనగ్రామం బోయెను. దానికిని కళింగగంగు లక్ష్యము సేయక యూరకుండెను. ఇట్లుండ శాపకాలంబు సంప్రాప్తమయ్యెను. అపుడు తత్సమీపంబున నున్న పరరాష్ట్రమువారు తద్వృత్తాంత మంతయు విని యాతనిపై దండెత్తి వచ్చి యాతనికోట నాక్రమించుకొనిరి. అపుడు రాజకళింగగంగు చేయునది లేక దేశాంతరగతుఁ డయ్యెను. పరులు నిర్భయంబుగ నచ్చో నుండి దేశమును బాలింపందొడంగిరి. రాజకళింగగంగు నేకాకియై దేశదేశంబులఁ దిరిగి ప్రచ్ఛన్నరూపంబునఁ బగటివేషగాండ్రతోఁ గలిసి యుండి స్వోదరపోషణంబు గావించుచుండెను. ఇట్లుండఁ బెక్కుదినంబులు గడచినవి. అంత నొకనాఁటిరాత్రికాలంబున నీరాజకళింగగంగు వేషధారులతోఁ బగటియుం దుండి రాత్రి మఱియొకయూరికిం బోయి పరరాష్ట్రమువారినృత్తాంత మరయుటకు వచ్చుచుండెను. భీమనయు నొకయాందలంబునం గూర్చుండి జోడుదివిటీలు వేయించుకొని విశేషవైభవంబుతో నాతని కెదురుగ వచ్చుచుండెను. వాహకులు భుజములు

సవరించుకొనుటకు నిలిచినపుడు భీమనకుఁ గొన్నిమాటలు వినవచ్చి నవి. అట్టుక్రితము ఎదురుగ వచ్చుచున్న రాజకళింగగంగు భీమకవికడ నున్న దివిటీలఁ జూచుచు నడుచుచుండెను గావునఁ దోవ నున్న యొకగోతిం జూడఁజాలక యందుఁ గూలి పై కెగఁబ్రాఁకుచు ఛీ! కాలిదివిటీ యైనను లేనివాని బ్రతుకు నిరర్థకముగదా యనుచుండెను. ఈవృత్తాంతము భీమన చెవులం బడినంతోడనే అతఁడు కొంచెము చింతించి "యెవఁడురా యాగోతిలో నున్నవాఁడు" అనుఁడు రాజకళింగగంగు "అయ్యా! నేను వేములవాడభీమకవిగారిచేఁ జేయఁబడినజోగి" ననియెను. ఆమాట విని భీమన "నీవు రాజకళింగగంగువా" యనుఁడు చిత్తము రక్షింపుఁ డని పాదంబులపైఁ బడి మ్రొక్కుఁ దొడంగెను. అట్టికళింగగంగుం జూచి యాతఁ డిట్లనియెను :—

చ. బిసరుహగర్భు వ్రాఁతయును విష్ణుని చక్రము వజ్రివజ్రముం
దెసలను రాముబాణము యుధిష్ఠిరుకోపము మౌనిశాపమున్
మిసకపుఁ బాముకాటును గుమారునిశక్తియుఁ గాలుదండముం
బశుపతికంటిమంటయును బండితవాక్యము రిత్త వోవునే.

అనుపల్కుల కులిక్కి రాజకళింగగంగు క్షమింపుఁడు క్షమింపుఁ డని నమస్కరించిన భీమన మరల నిట్లనియెను:—

ఉ. రామునమోఘబాణమును రాజశిఖామణికంటిమంటయుం
దామరచూలి వ్రాఁతయును దారకవిద్విషు ఘోరశక్తియున్
భీముగదావిజృంభణము వెన్నునిచక్రము వజ్రివజ్రముం
వేములవాడభీమకవిభీషణవాక్యము రిత్త వోవునే.

ఇది యే భీమన చెప్పినపద్యము కావచ్చును. పైపద్యము దీనికిఁ బాఠాంతర మని తోఁచెడిని. ఇట్లని నవ్వుచు నారాజుం జూచి భీమకవి యిట్లనియె.

ఉ. వేయుగజంబు లుండఁ బదివేలుతురంగము లుండ నాజిలో
రాయలఁ గెల్చి సజ్జనగరంబునఁ బట్టముఁ గట్టుకో వడిం
రాయకళింగగంగు కవిరాజభయంకరమూర్తి చూడఁ డాఁ
బోయెను మీనమాసమునఁ బున్నమ పోయినషష్ఠి నాఁటికిం.

అనుపద్యముచే భీమన రాజుం దీవించి యందు నయోచితము గాఁ దననిర్యాణంబు సూచింపఁబడుపదం బుండుటకు నాశ్చర్యం బంది కాలగతి యిట్లున్న దని నిశ్చయించి తనమార్గంబునం బోయెను. అనంతరము రాజకళింగగంగు భీమకవివరంబు వనంబునఁ దలపోయుచుఁ దిరిగి తా నున్న సగటి వేషగాండ్రమేళంబులోనికిఁ జనియెను. ఆవేషగాం డ్రొదినములకు వచ్చి రాజ్యంబు సేయుచున్న పరరాజుం జూచుచుండిరి ఆరాజును గాలచోదితుండై భీమకవివరదినంబు నాఁటికి రాజకళింగగంగు వేషమును జూచునభిలాషము దనకుఁ గల దనియు నావేషం బెవ్వరైన వేయఁగలరా యనియు నావేషగాండ్ర నడిగిన వారందఱును సంశయించి యూరకుండిరి. వేషగాండ్రలో నొకఁడైన రాజకళింగగంగు తాఁ బయలుపడుట కదియు తఱి యని యెంచి యో రాజోత్తమా! నేను కళింగగంగు వేషంబు ధరింపఁగలను.అతనిగుఱ్ఱంబును వేషంబును నాయుధంబులును దన కిప్పింపుఁ డని యడుగుఁడు. వినుండు పూనుడు నట్లు కావించిరి. రాజును వానిపన్నిటిని నిచ్చుటకు సెలవొసంగెను. ఆమఱునాఁటిసాయంకాలము రాజకళింగగంగు నిజవేషంబు ధరియింపఁగోరి యత్యంజనసస్నాతుండై సాంబ్రాణిధూపంబునఁ దల యార్చి నునుపుఁ జిలుకంబు దిద్ది కొసదుస్తులఁ గట్టి తాజు ధరించి కాఁగడాగాండ్రం బిలిచి గృహాంబు వెలువడి తన ఘోటకసమీపంబునకు వచ్చి దానిమీఁద జీను వేసి పొల్లనఁ దట్టిన నది తనప్రభుం డవుట గ్రహించి తనసంతోసముం జూపుగీతి నొక స్తుతింబు గావించినది. దానిం గని కళింగగంగు తాను జయమును గ్రహించుట నిశ్చయమునుకొని యశ్వారోహణంబు గావించెను.అట్టి వేషమును జూచి తత్పురంబులోనికొంద ఱాతఁడు నిజమైనరాజు గాని వేషధారి కాఁ డని నిశ్చయించి తోడ నడువ నారంభించిరి. రాజకళింగగంగు వేషము వచ్చుచున్న దని తక్కుంగలవేషగాండ్రను చని పరరాజునకుం జెప్పిరి. వాతేఁ డదికళింగగంగు నవమానించుటకుఁ దగినతఱి యని యెంచి సిందుకొలువుండి వేషంబును లోపలకు రా సెలవొసంగెను. రాజకళింగగంగు సింహాసనసమీపమువఱకు గుఱ్ఱముతోనే వచ్చి యచ్చో దానిని నిల్పి

తాను డిగి చెచ్చెర సింహాసనంబుపైకిఁ జని యం దున్నపరరాజు శిరంబు నఱికి యాతనియట్టె గ్రిందికిఁ ద్రోచి తనపరివారంబుం బిలిచి సేనలసన్నాహంబు సేయు మనఁడు వారందఱునుఁ దమరాజు చిరకాలమునకు వచ్చుట కెంతయు సంతసించి యుద్ధసన్నద్ధులై పరరాష్ట్రసైన్యము నుక్కడంచి మిగిలినవారిం బాఱఁదోలిరి. ఇట్లు రాజకళింగగంగు భీమకవివరప్రసాదలబ్ధసింహాసనాసీనుండై సుఖంబుగ రాజ్యంబు సేయుచుండెను. అప్పుడు కళింగదేశమునకు సజ్జనగరము ముఖ్యపట్టణ మని పోఁచెడిని. విజయరామమూర్తి నృపుఁడు విజయనగరముం గట్టి ముఖ్యపట్టణము చేసినట్లు వాడుక గలదు. ఇక్కడ భీమకవి కళింగగంగును దీవించి యింటికిం జని తనకు నిర్యాణంబు తటస్థించినది కాఁ దలంచి తత్సన్నాహంబున నుండెను. ఇట్లుండ నొకనాఁ డాతనిమాత యతనికి నన్నం బొసంగుచుండ నాపెకడుపున మసి యంటుట చూచి భీమకవి తనతల్లిం బిలిచి నీకడుపు మసి యయ్యె ననియెను. ఆమాట విని యాపె తనకుమారునివాక్యమమోఘ మని యెఱింగినదిగనుక "నాయనా! యెట్లంటి వనుఁడు భీమన తనకుఁ గాలంబు తటస్థించెం గావునఁ దదనుకూలంబుగనే సర్వంబును జరుగుచున్న దని చెప్పెను. ఆమాటలు విని యాయిల్లాలు మిగుల వగల నొందినది. భీమకవియుఁ దా నిర్దేశించినదినంబునాఁటికిఁ గాలవశుండయ్యెను.

ఈభీమనచేఁ జేయఁబడినమహాకార్యము లనేకములు గలవు. ఇతఁడు లక్షోత్తరప్రశ్నంబులఁ జెప్పుటకు నొకగ్రంథంబును వ్రాసి బెజవాడసమీపంబున నుంచెను. అందుఁ బటలంబు లనియు సర్గంబు లనియు భేదంబులు గలవు. మనప్రశ్నము చేరినకాలముంబట్టి గణితముచేసినచో నిన్నవపటలములో నిన్నవసంచికలో నిన్నవపుటలో నుండు నని చెప్పంబడియుండును. ఆపుటలో మన మడిగినప్రశ్నంబులును దానికిం దగునుత్తరంబులు నుండును. ఇది యొకగొప్పయద్భుతవృత్తాంతము. ఇప్పుడు మన మడుగుప్రశ్నంబులును వానియుత్తరంబులును వేయిసంవత్సరములక్రిందట భీమన యూహించి యుంచెను. ఇది యీశ్వరునిచే నయ్యెడు

పని గాని యొండు గాదు. కావున నిట్టిసంగతి నొనర్చినయాతఁ డీశ్వరవరప్రసాది యని చెప్పుట కేసందియంబును లేదు. ఈగణితమువిషయమై యింక ననేకగ్రంథంబులు రచియించె నని వాడుక గలదు. అం దద్భుతము లింకను గల వందురు.

ఇఁక నీకవిసాహిత్యముంగూర్చి యించుక వ్రాయుదము. ఆకాలమునఁ గాసి వారిసాహిత్య మీతనిసాహితికిఁ జాల దని వాడుక గలదు. అపుడు రెండర్థములు వచ్చునట్లు పద్యములు చెప్పినవాఁ డీతఁ డొక్కఁడే యని యనేకులు నిశ్చయించిరి. ఇందులకు దృష్టాంతముగాఁ బింగళి సూరన తనరాఘవపాండవీయములోఁ జెప్పినపద్యము :—

శా. రెండర్థంబులపద్య మొక్కటియు నిర్మింపంగ శక్యంబు గా
కుండుం దద్గతిఁ గావ్య మెల్ల నగు టే నోహో యనం జేయనే
పాండిత్యంబున నందునుం దెనుఁగుకబ్బం బద్భుతం బంద్రు ద
త్తుం డెవ్వాఁ డిల రామభారతకథల్ జోడించ భాషాకృతిన్.

ఉ. "భీమన తొల్లి చెప్పె ననుపెద్దలమాటయె కాని యందు నొం
డేమియు నేయుడ న్నిలువ మెవ్వరుఁ గాన గటుండ నిమ్మ"

ఈకవి రాఘవపాండవీయ మనుద్వ్యర్థికావ్యము పూర్వము రచించె నని వాడుక గలదు. అది యిపుడు ఖిలమైనది. అప్పకవి నన్నయభట్టు దాని నడఁచె నని చెప్పెను. కారణంబు లతనిచేతఁ జెప్పఁబడినవి యెంతవఱకు నిజమో మన మిపుడు చెప్పఁజాలము. ఇతఁడు విశేషకవి యని శ్రీనాథుఁడు కాశీఖండములోఁ దన్ను రాజు నుతించి "నీవు భీమనవలెఁ గవిత్వము చెప్పఁగలవు" అనినట్లుగాఁ జెప్పినపద్యము :—

సీ. "వచియింతు వేములవాడభీమనభంగి నుద్దండలీల నొక్కొక్కమాటు"

ఇఁక ననేకస్థలంబులలో నీకవిమాహాత్మ్యంబు పేరొక్కనఁ బడియె. నన్నయభట్టారకాదులు నీతని విశేషంబుగా నుతించి చెప్పినపద్యములు నన్నయభట్టుంగూర్చి చెప్పినకథలో వ్రాసియుంటిమి. ఇంతియకాక యీకవి ఛందోవిషయమైనగ్రంథం బొకటి యొనర్చెను దానినే భీమనఛంద మందురు. అది నన్నయభట్టువ్యాకరణంబునకుఁ బూర్వ

పుడి. అందు విశేషించి యీకవిచే రచియింపఁబడినచాటుధారాపద్యము లున్నయవి. అప్పటివార లందఱును దీనింబట్టియే కవిత్వము చెప్పినట్లు ప్రాచీనగ్రంథములంబట్టి చెప్పఁదగియున్నది. అందులో యతులం జెప్పి యొకపద్యంబు చెప్పెను. ఆపద్యమును జూచిన నతనికిం గవిత్వమందున్న ప్రజ్ఞ విదితం బగును. అది యెట్లన్నను :—

సీ. అబ్జగర్భశివస్వరాఖ్యపూజ్యపదాబ్జ, కమలాక్షమానివర్గప్రసన్న
వైభవాఖండదేవాదిదేవకృపాబ్ధి, యఖిలదిక్పాలకప్రాదినిలయ
నుతపుణ్యహాస బిందుయుతానానాంభోజ, యతిదయాప్లుతనిజాత్మ మహాత్మ
స్వచ్ఛపారదకీర్తిసంయుక్తసంచార, మహిమ సెక్కటి ప్రముఖమాన్యచరిత
గీ. పోల్ప నీపోలికను దైవములును గలరె, సరససుతిపాత్ర భక్తగంజనపవిత్ర
ప్రాసనిర్భిన్నచండతరాసురేంద్ర, యలఘుయతిగణ్య రఘురామ యాఘవిరామ.

ఇందు వళినామంబులును వానికుదాహరణంబులు జప్పుచు సీసర్వరుని సన్నుతించిన ట్లున్నది. ఆహాహా! చూడుఁడు ఈకవిప్రజ్ఞావిశేషంబులు? ఇట్టికవింగూర్చి యప్పకవి కొన్ని తప్పుమాటలు తనగ్రంథంబులో నతికించినవాఁడు. వానిం జూచినవారు భీమకవిప్రజ్ఞావిశేషంబు లెఱింగినయనంతరమున నప్పకవి నపహసింపకమానరు. ఈకవిశిఖామణి కవిత్వములోనివి కొన్ని పద్యంబు లిచ్చోటను వివరింతము.

చ. హరుఁ డధికుండు వింటికిఁ బురాంతకుఁ గంటెఁ గిరీటి మేటి శం
కరపురహూతనందనులకంటెను రాముఁడు నేర్చు నిండు శే
ఖరకపికేతుభార్గవులకంటెఁ గుమారుఁడు మీఱు నంబికా
వరనరజామదగ్న్యశిఖివాహుల కెక్కుడు రాఘవుం డిలన్.

ఉ. వారక వారకామినులవార్తలు చారుపచోపగూహముల్
కోరక కోరకోల్లసితకుంజములుం జిగురాకుపానుపుల్
చేరక చారుకేరళకళింగకళింగనరేంద్రమందిర
ద్వారవిహారులై చెలువు లందక నందకపాణిఁ గొల్వరో.

## వేములవాడ భీమకవి కాలనిర్ణయాదికము.

ఈకవికాలము మన మిదివఱకుఁ దత్కాలీనులను జెప్పుటచేత నొక విధముగా నుడివినారము. అప్పకవీయములోఁ గూడ నితఁడు నన్నయ

భట్టునకు సమకాలము వాఁడైనట్లుగా ననేకదృష్టాంతములు గాన్పించుచున్నవి. ఎట్లన్నను :—

* గీ. భారతముఁ దెనిఁగించుచుఁ దా రచించి, నట్టి రాఘవపాండవీయము నడంచె
ఛందము నడంచ నీశక్తిఁ సంగ్రహించె, నను చు భీమన యింతయు నడఁచె దాని.

దీనింబట్టి చూడఁగా భారతమును దెనిఁగించుచు భారతార్థమును జెప్పుచున్న రాఘవపాండవీయమును నన్నయభట్టు పూర్వపక్షము చేసెననియును, దన ఛందస్సు నడఁచుటకుఁగా నీవన్నయభట్టు ఆంధ్రశబ్దచింతామణిని సంగ్రహించెఁ గావున దానిపై భీమన యణఁచివేసెననియును దేలినది. దేని నేది పూర్వపక్షము సేయుట కేర్పడినను నన్నయభట్టునకును భీమనకును బరస్పరమును వైమనస్య మున్నట్లుగా దీనివలన గోచరం బగును. వీరిర్వురును సమకాలీనులు గాక యుండినచో నిట్టివృత్తాంతము జరుగుటయే తటస్థింపదు. అయితే మన మిపు డీయుప్పకవి కథయే అసత్యమని సంవాదార్థమై యోజింతము. ఆపక్షముఁగో నన్నయభీమనలు సమకాలీనులని మఱికొన్ని సాధనములఁబట్టి మనము నిర్ణయింపవలయును. వీరిర్వురకును సమకాలీనులుగా నున్న మఱికొందఱి కాలములు మనము తెలిసికొని యనంతరము ప్రస్తుతాంశ మాలోచింతము.

ఇతఁడు చెప్పినచాటుధారాపద్యములలో నక్కడక్కడ రాజకళింగగంగుంగూర్చియుఁ జోక్కరాజుంగూర్చియు సాహిణిమారుంగూర్చియు శృంఖలరాజుం గూర్చియు వచ్చెడిప్రస్తావనలనుబట్టి యితఁడు వారితో సమకాలీనుఁడని యూహించుటకుఁ దగి యుండును గదా! వారికాలంబులు నిదివఱకు నిర్ణయింపఁబడక యుండుటంబట్టి మనము సాధ్యమయినంతవఱకు వానినిర్ణయముఁ గూడ నిప్పుడ చేసి దీని నిర్ణయింతము.

భీమకవి చెప్పినయీక్రిందిపద్యములంబట్టి భీమకవి రాజనరేంద్రునితండ్రి యగువిమలాదిత్యుని సమకాలీనుఁడని విస్పష్ట మగుచున్నది. ఆపద్య మెట్లన్నను :—

* వేములవాడభీమకవి భారతము రచించిన ట్లీపద్యమువలనం దెలియఁబడదు. ఆంధ్రకవిచరిత్ర మత మట్లు కాదు.

మ. ఘనుఁడన్ వేములవాడవంశజుఁడ దాక్షారామభీమేశనం
దనుఁడన్ దివ్యవిషామృతప్రకటనానాకావ్యధుర్యుండ భీ
మన నాపేరు వినంగఁ జెప్పితి వెలుంగాధీశ కస్తూరికా
ఘనసారాదిసుగంధవస్తువులు వేగన్ దెచ్చి లాలింపురా.

ఇందలి "వెలుంగాధీశ" యనుపదమునకు విమలాధీశుఁడని యర్థము కొందఱు చెప్పుదురు. అట్లు యయిన నితఁడే రాజనరేంద్రునితండ్రి. ఇతఁడు శాలివాహన సం. ౯౩౭ న రాజ్యమునకు వచ్చి శాలివాహన సం. ౯౪౪ వఱకు రాజ్యముచేసెను. ఇతఁడు రాజ్యమునకు రాకపూర్వము ౨౭ సంవత్సరములనుండి వేఁగిదేశ మరాజకముగా నున్నట్లు మనకుఁ జాళుక్యవీరవాదశాసనముంబట్టి కాన్పించును. దీనినే సూచించుశాసనములు పెక్కులు గలవు.* ఈపద్యము నాఁటికి శాలివాహన సం. ౯౨౭ పైఁగా నయినది. విమలాదిత్యుఁడు మఱియొక పదిసంవత్సరములకే రాజ్యమునకు వచ్చినట్లు కాన్పించుచున్నది. ఈసమయములోపలనే కళింగనగరమం దుండెడికళింగరాజులు తమ యధికారమును బలపఱచుకొనినట్లుగాఁ బైగ్రంథమునందే చెప్పఁబడి యున్నది. † దీసింబట్టి భీమకవి శాలివాహన సం. ౯౪౪ నకుఁ బూర్వమందే యున్నట్లుగా నెన్నవలసి యున్నది. ఇదియే నిశ్చయమైనట్లుగా శ్రీనాథుఁడు తాఁ జేయుచున్న కవిస్తుతిలోఁ బ్రారంభమునందు

సీ. "వచియింతు వేములవాడభీమనభంగి, నుద్దండలీల నొక్కొక్కమాటు"

అని భీమకవిపేరు చెప్పి పిమ్మట

"భాషింతు నన్నయభట్టుమార్గంబున, నుభయవాచాప్రౌఢి నొక్కమాటు"

---

*న్యూయలు దొరగారి దక్షిణదేశపురాష్ట్రవృత్తాంతములోఁగూడ "At that period (in A. D. 977) there ensued a period of anarchy in the Eastern Chelukya territories which lasted for 27 years at least" అనఁగా శాలివాహన సం. (క్రీ. శ. ౯౭౭) ౯౦౦ గలకాలమున నొకయరాజకావస్థ తూర్పుదేశపు చాళుక్యులలోఁ దటస్థమై యది యిందుమించుగా ౨౭ సంవత్సరములదాఁక నున్న దని యర్థము.

† (See page 183 of Mr. Sewel's Lists Vol. II.)

అని యనంతర మాంధ్రభాషావాగనుశాసనుం డనం బరఁగిన నన్నయభట్టారకుం గొనియాడెను. అనంతరము తొంటివరుస చెడనట్లుగాఁ దిక్కనసోమయాజిని నెఱ్ఱాప్రగ్గడంగూడ వర్ణించి చెప్పెను. ఇప్పద్యమునుం బట్టి చూడఁగా భీమకవి నన్నయభట్టునకును బూర్వుం డని నిర్ణయింపఁబడినది యగుచున్నది. మన మిదివఱకు వ్రాసిచ్చినచారిత్రము నట్లే స్థిరపఱుచుచున్నది. కావున నిఁక నీవిషయమై సంవాదములో నవసరము లేదు. మైలమభీముని అమరావతిశాసనమువలన నితనిసమకాలీనుఁ డగునా రాజు శాలివాహన సం. ౯౭౫లో నున్నట్లు కాన్పింపఁగా భీమకవి ఆసమీపకాలములో నున్నవాఁ డని చెప్ప నొప్పియుండును. అయినను "వెలుంగాధీశ" యనుపదము విమలాదిత్యునకు వర్తింపక పోవునని శంకించి యీకథ యింతటితో నిలిపి మఱియొకకథం బట్టి భీమకవికాలమును నిర్ణయింతము. అది రాజకళింగగంగు కాలమునుఁ బట్టి దానింగూర్చి మన మిప్పుడు సంవాదించి నిర్ధారణ చేయవలసి యున్నది. దీనివిషయమై మనము వ్రాయుటకుఁ బూర్వము భీమకవి చేసినకళింగపట్టణముయొక్క వర్ణన నిచ్చోటను వివరింతము. అదెట్లనిన :—

సీ. యోజనద్వయవిశాలోన్నతిఁ జెలువొంది, పట్టణం బమరు శోభావిభూతి
హాటకరత్నకవాటానుమోదమై, సూటి మించును గంచుకోటమహిమ
నూటొక్కగుళ్ల చెన్నుగ శివానందమై, నిత్యోత్సవక్రీడ నెమ్మిఁ దనరు
వంశధారానదీవారాశిసంయుత, సాగరసంగవిస్రంభ మమరఁ
గీ. గడిఁది రాజకళింగభూకాంతునకును, దనరునవలతు కాళింగ మనఁగ నొప్పు
శృంఖళద్వీప మనఁగఁ బ్రసిద్ధి మించు, గణనకెక్కఁ గళింగపట్టణము ధాత్రి.

దీనింబట్టి చూడ శృంఖళరాజనామము రాజకళింగగంగునకుఁ బర్యాయపద మైనట్లుగా సూచించుచున్నది. శృంఖళద్వీప మని ప్రసిద్ధిఁ జెందినకళింగపట్టణమున కధిపతి గావున నాతని నొకపరి శృంఖళుఁ డనియుఁ గళింగాధిపుఁ డనియు వాడుచు వచ్చెను. ఇతఁడు చాళుక్యశాఖలో నిభాగ మగుగంగవంశపురాజులలోనివాఁడు గనుక నితనిని గళింగగంగని వాడినట్లుగాఁ గాన్పించును. ఉత్కళదేశపురాజవంశమునకు గాంగేయవంశ మనియు గంగవంశ మనియు గంగేశ్వరుఁ డనుపురుషునిఁబట్టి

నామంబులు గలవు. ఈవంశస్థులలోఁ గొందఱు శాలివాహనశకమునకు నాఱేడుశతాబ్దములకుఁ బూర్వముననే కళింగదేశమునకు వచ్చి యచ్చట స్థిరపడినట్లుగా హిందూ సిలోన్ దేశములయొక్క ప్రాచీనశాసనాదికములంబట్టియు, గ్రీసురోము దేశములలోని ప్రాచీనగ్రంథములంబట్టియుఁ గాన్పించుచున్నది. ఇది కొంతకాలము విశేషాభివృద్ధిగా నున్నట్లును మఱికొంతకాలము దుర్బలముగా నున్నట్లును గాన్పించును. ఇదివఱకు మనము చూపించినదృష్టాంతములంబట్టి యీవంశమువారికి మరల నధికారప్రాబల్యము శాలివాహన సం.౯౦౦ మొదలు కల్గినట్లుగాఁ గాన్పించును. అదిమొదలు చిరకాలము వీరు విశేషవృద్ధిలో నుండి తుదను కృష్ణరాయల కాలములో మఱల నపజయము నందినట్లు గాన్పించును. ఆవృత్తాంతము లన్నియు దేశచారిత్రములో నుచితస్థలములలోఁ గీల్కొల్పుదము. మనము ప్రస్తుతాంశమును మఱలఁ గైకొందముగాక. ఈభీమకవి శృంఖలుని సమకాలీనుఁడనుటకు సందియము లేదు. ఇతఁడు శృంఖళరాజు నొద్దకు వెళ్లినప్పు డారాజు భీమకవిమాహాత్మ్యము దెలియక నీవు కవివై యేమిచేయఁగలవు? నీవే రెవ్వ రని యడిగిన భీమకవి యాగ్రహముతో నీక్రిందిపద్యమును జెప్పె నని కలదు.

సీ. గడియలోపలఁ దాడి నడఁగి ముత్తునియఁగాఁ, దిట్టిన మేధావిభట్టుకంటె
రెండుగడియల బ్రహ్మదండిముం డ్లన్నియుఁ, దుళ్లఁ దిట్టినకవిమల్లుకంటె
మూఁడుగడియలకుఁ దా మొనసి యత్తినగండి, పగులఁ దిట్టినకవిభానుకంటె
నఱజాములోపలఁ జెఱువునీ ళ్లింకంగఁ దిట్టినబడబాగ్నిభట్టుకంటె
తే. నుగ్రకోపి నేను నోపుదు శపియింపఁ, గ్రమ్మరింప శక్తి గలదు నాకు
వట్టిమ్రానఁ జిగురుఁ బుట్టింప గిట్టింప, బిరుద వేములవాడభీమకవిని.

అని పల్క నారాజు దాని నంతయు ఛలోక్తిగా నెంచి తనసభామంటపమం దున్న స్తంభమును వృక్షముగాఁ జేయఁగలవా యని యడిగినట్లును దానిపైని భీమకవి.

"అనీతాభ్యుపదానుశృంఖలపదాభ్యాలంబిత స్తంభమా"

అనుపద్యము చెప్పినట్లును నటుపిమ్మట నా స్తంభము వృక్షమై యతనికా లందుఁ జిక్కుకొన భీమకవిం బ్రార్థింపఁగా

"శంభువరప్రసాదకవిజాలవరేణ్యుఁడ నైన"

అనుపద్యమును భీమకవి చెప్పి యతనిని మెప్పించి యతని యాస్థానకవిగా నట నుండుటకుఁ గోరఁబడియుండె నన్నట్లును జెప్పుకొనియెదరు. దీనింబట్టి చూడఁగాఁ జోళ్కనృపాలుఁ డనియు శృంఖళుఁ డనియు నామములు గలరాజకళింగగంగునకీతఁడు సమకాలీనుఁ డని స్పష్ట మగుచున్నది. పైసీసపద్యములో భీమకవి తనకు సమకాలీనులుగా నైనను బూర్వులుగ నైనను నున్నవారల నామములు మనకుఁ గొన్ని కొన్ని తెలిపెను. వీరిలో బడబానలభట్టు చాలఁ బ్రసిద్ధిఁ జెందినవాఁడు. అతనింగూర్చి కొంచెము విశేషించి ము చ్చటించుటకుఁ బూర్వము తక్కినముప్వురును గోపముతోఁ జెప్పినపద్యములు వారివారికవిత్వశైలి చూపుటకును దత్తత్కాలీనులనామంబులు సూచించుటకును నిట వివరించెదము.

మేధావిభట్టు తాను హఠాత్తుగా * సాళువ పెదతిమ్మరాజును సమీపించినపు డతనిపైఁ బద్యముఁ జెప్పుట కిష్టము గలిగి పద్యము వ్రాయుటకుఁ దాటాకు లేక తాటిచెట్టును విరిగి పడు మని చెప్పినట్లుగా నీక్రిందిపద్యమువలనం గాన్పించును. అదియెట్లన్న:—

క. సాళువపెదతిమ్మమహీ, పాలవరుఁడు నీఁడె వచ్చెఁ బద్యము వ్రాయన్
గేలను లే దా కొకటియుఁ, దాళమ యుత్తునియ లగుచు ధరపైఁ బడుమా.

ప్రౌఢకవిమల్లన గుడి యన్నమరాజుకోటకు నడిచి పోవునపుడు కొండపల్లిపడమటఁ దనరెండుమడమలలో బ్రహ్మదండిముండ్లు గ్రుచ్చుకొనఁగా నీక్రిందిపద్యముం జెప్పెను. ఎట్లన :—

క. గుడియన్ననృపతిఁ జూడఁగ న, నడువంగాఁ గొండపల్లినగరిపడమటన్
గుడిరెండమమడమ గాఁడిన, చెడుముండులు బ్రహ్మదండిచెట్టున డుల్లన్.

బడబానలభట్టు త్రిపురాంతకమునుండి శ్రీశైలమునకుఁ బోవు

---

* ఇతనివంశముంగూర్చియుఁ గాలనిర్ణయముంగూర్చియుఁ బిల్లలమఱ్ఱి వీరన్న చారిత్రములోఁ జూడఁదగును.

మార్గములోఁ * వేనుఁగురాయఁడు గట్టించిన చెఱువునీ ళ్లన్నియు నాలుగుగడియలకు నింకిపోవునటులఁ దిట్టెను. ఎట్లన్నను :—

క. బడబానలభట్టారకు, పుడిచేయుంగరము రవికి గొబ్బున నర్ఘ్యం
బిడు వేళ నూడి నీలోఁ, బడియెఁ దటాకంబ నీటిఁ బాయుము వేగన్.

ఈబడబానలభట్టు శాలివాహన సం. ౧౦౧౫ న వెలమవంశస్థులగోత్రఖండ చేసెననియు నద్దానింబట్టి యాకవి వారిచే నెల్లప్పుడు స్మరియింపఁబడవలసినవాఁడుగాఁ బద్మనాయకచరిత్ర మను వెలమల వృత్తాంతగ్రంథములో వ్రాయఁబడి యున్నది. ఆచరిత్రము వ్రాయుచో నీకవివృత్తాంతంబు వ్రాయుదము. అప్పటికి బడబానలభట్టు మిక్కిలి వృద్ధుఁడుగా నుండి యుండును కాఁబట్టి బడబానలభట్టును శాలివాహన సం. ౯౫౧ సమీపకాలమునఁ బుట్టి యుండ నోవును. ఇది భీమకవికాలమే అగును.

చోక్కరాజుతో యుద్ధమునకు వచ్చినసాహిణిమారునిఁ దదాస్థానమందుండెడుభీమకవి తిట్టి పద్యముఁ జెప్పె ననుటంజేసి యీయుభయులు సమకాలీను లని వేఱే చెప్పవలసినదే లేదు. భీమకవియొక్క కాలనిర్ణయమునకై పైని మనము చేసినచర్చయే తగి యున్నది. కాని కొందఱాధునికచారిత్రకులు వ్రాసుచ్చినవిధముగా నితఁడు పదుమూఁడవశతాబ్దారంభమున నున్నట్లూహింప వీలు లేదు. చోక్కరాజు శాలివాహనశకము పదుమూఁడవశతాబ్దమువాఁ డైనట్లుగా వ్రాఁతమూలములు లేవు. ఇతని కాలముననే సాహిణిమారుఁడు నున్నట్లు కాన్పించును. అతనింబట్టి భీమన కాలముగాని చోక్కరాజు కాలము గాని నిశ్చయింప వీలు పడునా? గుడిమెట్టపోతరాజు భీమకవిగుఱ్ఱమును దొంగిలించె నని యున్నయొక పద్యమునుబట్టి భీమకవి కాలమును నిర్ణయింప వీలులేదు. ఆకథ రెల్లూరి తిరుమలయ్య శ్రీపతి పోతరాజు నుద్దేశించి చెప్పినట్లుగా నప్పకవి చెప్పియున్నాఁడు. ఈ ప్రాంతములయందు లేటవరపుపోతరాజుంగూర్చి తురగారామకవి చెప్పె నని వాడుక గలదు. ఇట్టిభేదములతో నొప్పుచుండెడియీవృత్తాంతమునుబట్టి భీమకవియొక్క కాలము మనము నిర్ణయించుట కేమి

* ఇతనిపేరే భీమకవి "వేలుంగాధీశ" అని చెప్పినట్లు తోఁచెడిని.

చాలియుండును? న్యూయల్ దొరగారి లిష్టులలో గుడిమెట్టగ్రామములో నొకకోట యున్న దనియును నందుపై నున్న శాసనములనుబట్టి యాకోట 'సాగి పోతరాజు కాకతీయ రుద్రమహారాజుగారి దని యున్నట్లును' వ్రాసి దీనియర్థ మేమో యని వ్రాసియుండెను. ఆక్రిందనే పోతనృపుని శాసన మున్నదని చెప్పి యాశాసనము గాని తనకు వచ్చిననకలు గాని యసంపూర్తిగా నుండవలెననియును వ్రాసెను. ఈయనయే బెజవాడశాసనముంగూర్చి వ్రాయుచో నది శాలివాహన సం. ౧౧౨౧ లోనియెవ్వరో యొక పోతభూపతియొక్క యొకశాసన మని వ్రాసెను. అతని యనంతరము వచ్చిన మట్టికొండదళియొక్క పేర్లు గలవంశవృక్ష మున్నట్లును చెప్పి యితఁడు చోళవంశపురాజు కానోపు నని వ్రాసియుండెను. రామవిలాస మనుగ్రంథముంబట్టి చూడ నీసాగి పోతరాజు సాగివారు, పత్సవాయవారు, భూపతిరాజువా రని మనదేశమునఁ బ్రసిద్ధిఁ జెందిన క్షత్రియులకు మూలపురుషుఁడుగాఁగాన్పించెను. ఇతఁడు భీమకవికి సమకాలీనుఁడని చెప్పుటకు నేవిధమయిన దృష్టాంతములును లేవు. కావునఁ గవిచరిత్రములోఁ జెప్పినప్రకార మిదియును నీతనికాలనిర్ణయమునకుఁ జాలియుండ లేదు. మనముమాత్రము శ్రీనాథుఁడు చెప్పినపద్యము ననుసరించి భీమకవి నన్నయభట్టుకంటెను బూర్వుఁడని నిశ్చయించికొందము.

సీ. వచియింతు వేములవాడభీమనభంగి, నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టుమార్గంబున, నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాక్రుత్తు తిక్కయజ్వప్రకారము రసా, భ్యుచితబంధముల నొక్కొక్కమాటు
పరఢవింతు ప్రబంధపరమేశ్వరునిఠేవ, సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు
తే. నైషధాదిమహాప్రబంధములు పెక్కు, చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడ వనఘ
యిప్పుడు చెప్పఁదొడంగినయీప్రబంధ, మంకితము సేయు వీరభద్రయ్యపేర.

ఇట్లని శ్రీనాథునిచే భీమకవి ప్రథమకవిగా వర్ణింపఁబడియెను.

దీనినే స్థిరపఱుచుచు నొక్కపద్యము గాన్పించును. అది నన్నయ భీమకవిని నుతియించి చెప్పిన దని యిదివఱకు వ్రాసియున్నారము. అదెట్లన్నను :—

చ. మతి, ప్రభ, నీగిఁ, జేర్మి, సిరి, మానము, పెంపున, భీమునిన్, బృహ
స్పతి, రవిఁ, గర్ణు, నర్జునుఁ, గపర్ది, సుయోధనుఁ, బోల్పఁ, బూనవా
మకకరి, నైష్ఠు, దుష్కృతులు, నమానుషు, భిక్షు, ఖలాత్ము నెంచి వా
క్సతిపు, శశిన్, శిబిన్, గొమరుసామిని, మేరువు, నబ్ధిఁ, బోల్చెదన్.

(ఇది భీమకవి చెప్పినఛందస్సులోఁ జూడనగును.)

ఈభీమకవి గొప్పదైవజ్ఞుఁడని యిదివఱకే చెప్పియున్నాము. దానిం దెల్పుటకు భీమకవీయప్రశ్నలక్షణ మనునొక చిన్నప్రశ్నశాస్త్ర మిందులోఁ జేర్చెదము :—

## భీమకవీయప్రశ్నలక్షణము.

శ్లో. ప్రష్టోక్తాద్యాని అంకాని అష్టభాగావశిష్టకే, సూర్యాదితో గ్రహం జ్ఞాత్వా తాని చాష్టోత్తరే శతే. త్యక్త్వా శేషం తు విజ్ఞాయ పునః పృష్టం తథా వద, అంకాని చాష్ట శేషే తు పూర్వవద్గ్రహనిర్ణయః. అష్టోత్తరశతే శేషే పునరుక్తాని సంత్యజ, శిష్టాష్టోత్తరశేషేషు అష్టభిర్హరణే కృతే. శేషే గ్రహంతు విజ్ఞాయ ప్రథమోక్తాంకశేషకే, ఏకం విసృజ్య శేషాంకానష్టభిర్గుణయేత్తతః. తస్మిన్ ద్వితీయశేషం తు సంయుక్తాంకవినిర్ణయః, గ్రహత్రయం నిర్ణయాంకే క్రమాత్తిష్ఠే త్ఫలం భవేత్. ఆద్యోక్తాంకస్య శేషం తు జ్ఞేయ మాద్యగ్రహేణ హి, తస్మిన్నేకం విసృజ్యాథ గుణయేచ్ఛేష మష్టధా. గుణితాంకేషు సంయోజ్య ద్వితీయగ్రహసంఖ్యకమ్, మిళిత్వాంకాని యావంతి తచ్ఛ్లోకేఽస్తి గ్రహక్రమః. ఇత్యుక్తం భీమకవినా సర్వలోకోపకారకమ్.

ఆంధ్రభాషచేత నర్థము. ఈప్రశ్నలు చెప్పుక్రమ మెట్టి దనినఁ బ్రశ్న యడిగినవారిని నూటయెనిమిదింటిలో సీమనస్సునకు వచ్చినన్ని యంకెలు తలఁచుకొని చెప్పు మని యడిగి యతఁ డెన్ని తలఁచుకొన్నా నని చెప్పునో యాయంకె లెనిమిదింట భాగింపఁగా శేషించినయంకెలు సూర్యాదిగ్రహములుగా నెంచి గ్రహనిర్ణయము చేయునది. అతఁడు చెప్పినయంకెలు నూటయెనిమిదింట్లో తీసివేయఁగా మిగిలినయంకె లిన్ని యని జ్ఞాపక ముంచుకొనవలయును. మరల నతనిని మునుపటి వలెనే యంకెలు తలఁచుకొమ్మని మరలఁ జెప్పినయంకెలు మునుపటి వలెనే యెనిమిదింట భాగింపగా మిగిలినయంకెలకు సూర్యుఁడు మొదలు క్రమముగా ఫలాన్నాగ్రహ మని యెఱుంగునది. మునుపటివలెనే రెండవమాఱు చెప్పినయంకెలు పూర్వమందు మిగిలినయంకెలలోఁ

దీసివేయఁగా నూటయెనిమిదింటికి నెన్ని యున్నవో యవి పూర్వము వలెనే యెనిమిదింట భాగింపఁగా శేష మెన్ని యంకె లున్నవియో యాయంకెలకు సూర్యుఁడు మొదలు క్రమముగా గ్రహములను నిర్ణయించి మొదటఁ దలఁచుకొనిన శేష మంకెలలో నొకటి తీసివేసి మిగిలిన యంకె నెనిమిదింట హెచ్చు గుణించి యందులో రెండవమా ఱడిగిన యంకెల శేషము కలిసిన నెన్ని యగుచున్నవో యన్నవ శ్లోకములో వచ్చిన గ్రహత్రయమును దెలిసికొని శుభాశుభ ఫలములు చెప్పెడు నిర్ణయము. ప్రథమోక్తాంక శేషము మొదటిగ్రహమునుబట్టి తెలిసికొన వలయును. అందులో నొకటి తీసివేసి శేషము ౮ చే హెచ్చు గుణించి యాహెచ్చుగుణించినసంఖ్యలో ౨ గ్రహసంఖ్య కూడఁ గలిపిన నఱువదినాలుగు అంకెలలో నన్నవశ్లోకము చూచుకొనిన నే గ్రహక్రమము వచ్చునో యాశ్లోకములో నున్న మంచిచెడ్డ లా ప్రశ్నకు ఫలముగాఁ జెప్పునది. "ఆద్యోక్తాంకస్య శేషంతు" అనుదానికి నర్థము. ఎనిమిదియంకెలు తలఁచుకొని రాహువు మొదటిగ్రహ మయినపక్షమునకు నెనిమిదింటిలోఁ దీసివేసి యేడును నెనిమిదింట హెచ్చు గుణించి రెండవగ్రహసంఖ్య కలుపుకొనవలయును. తొమ్మిదియంకెలు తలఁచుకొనిన రవి మొదటిగ్రహ మగునే నొకటి తీసివేసి శేషము లేదు గనుక హెచ్చు గుణించుట యక్కఱ లేదు. రెండవగ్రహసంఖ్యశ్లోకమునే చూచుకొనవలయును. శ్లోకములఫలము మొదటినుండియుఁ జెప్పెదను. మేకిమేకీమేకిమేకీమెమెమేకీదశైవమే, కిమెమేకీచపశ్మేకీకిమెమేక్షష్టమేకిమే, కీకీమెమెకిమే మేకీపశ్మేమేకీకిమేత్యపి, చతుష్షష్ట్యాత్మక శ్లోకఫల మేవం ప్రకీర్తితమ్.

శ్లో. రవౌ షట్చ ద్వాదశ చ త్రివింశష్షడ్వింశతిః, త్రయస్త్రింశచ్చతుస్త్రింశత్సప్తత్రింశదథోచ్యతే. షడష్టసప్తచత్వారింశ ద్ద్విపంచాశద్వ్యష్టిశస్, [illegible] చదశకం శ్లోకం భీమోక్త గ్రంథకత్యగమ్. ఆదిత్యార్కమధ్యాంశు శ్చేద్విజయ శ్రీసమాగమః, ఈప్సితం సుఖసంపత్తిః కల్పకృత్ప్రదర్శనాత్. ౧. భానుచంద్రార్కయుక్త శ్చే ద్విదేశగమనం భవేత్, బంధువర్గదశై శ్చైవ శ్చాంతివృత్ప్రదర్శనాత్. ౨. అర్కాంగారాహియుక్తా శ్చేత్సివస్థానే పూజ్యతే సదా,

జ్వరాదిరోగనాశశ్చ లభతే ప్రియదర్శనాత్. ౩. అర్కసౌమ్యశని ర్యత్ర దృశ్యంతే కార్యహానితః, శక్రస్యాపి శ్రియం హంతి మాగకస్య ప్రదర్శనాత్. ౪. సూర్యజీవభృగు ర్యోగా ద్భూలాభ స్సుప్రియం భవేత్, సుఖాప్తి మాయురారోగ్యం లభతే మృగదర్శనాత్. ౫ మార్తండశుక్రజీవా శ్చే న్మరణం రోగపీడనమ్, కుక్షిరోగం మానహానిః కారాగృహనిదర్శనాత్. ౬. అర్కార్కిబుధసంయోగే బంధుప్రీత్యా చ జీవనం, నష్టస్య లాభదేశత్వం విమానం పూజ్యదర్శనాత్. ౭. అర్కాహిభౌమసంయోగే వ్యాధిరోగాదిదుఃఖకృత్, మానహాని ర్ధనాశ శ్చ కారాగృహనిదర్శనాత్. ౮. యత్రేందుభానుసూర్యా శ్చ స్వస్థానే పూజకే సదా, ఈప్సితం సర్వసంపత్తి రైరావతనిదర్శనాత్. ౯. చంద్రసోమాహియుక్తా శ్చే త్సర్వసంపత్సమృద్ధయః, సువార్తా రాజపూజా చ విజయ శ్రీనిదర్శనాత్. ౧౦. చంద్రాంగారకార్కి చ వినష్టం లభతే ధనమ్, విజయం సర్వసంప్రాప్తి క్ష్మహామేరు ప్రదర్శనాత్. ౧౧. సుధాంశుసౌమ్యశుక్రా శ్చే ద్వ్యాధిః శుభయం భవేత్, భవేత్సజ్జనవిద్వేషో దావానలనిదర్శనాత్. ౧౨. యత్రేందుగురుజీవాశ్చ ధనధాన్యసమృద్ధయః, రాజపూజ్యం మహాకీర్తిః పద్మాకరనిదర్శనాత్. ౧౩. యత్రేందుశుక్రసౌమ్యాశ్చ దృశ్యంతే తత్ర బంధుభిః, దృశ్యతే సుఖసంవాద్యం కుంజరస్య ప్రదర్శనాత్. ౧౪. యది చంద్రార్కి భౌమాశ్చ ధనలాభః ప్రియం యశః, బంధుప్రీతీ రతిశ్చైవ శ్వేతచ్ఛత్రాదిదర్శనాత్. ౧౫. యత్రేందురాహుచంద్రాశ్చ పురా భూపభయం భవేత్, పశ్చాద్రాజ్ఞశ్చ సన్మానం దధికుంభ ప్రదర్శనాత్. ౧౬. యథా కుజార్కి రాహుశ్చ బహులాభ స్తథా భవేత్, జయం లాభో నృపా త్పూజా మత్తమాతంగదర్శనాత్. ౧౭. అరచంద్రార్కిసంయోగే ప్రస్థానే భయ ముచ్యతే, స్వస్థానే సుఖ మాప్నోతి కామధేనుప్రదర్శనాత్. ౧౮. భౌమద్వయసితై ర్యుక్తే ధనలాభః ప్రియం యశః, శ్రీలాభంచ సుసంప్రీతిః కామధేనుప్రదర్శనాత్. ౧౯. అరసౌమ్యసురేజ్యా శ్చే న్నీచాశ్రయతతో భవేత్, స్వస్థానే సుఖ మాప్నోతి హరిదశ్వస్య దర్శనాత్. ౨౦. అంగారగురుసౌమ్యా శ్చే త్సర్వశత్రుక్షయో భవేత్, స్వస్థానే సుఖమాప్నోతి హరిదశ్వప్రదర్శనాత్. ౨౧ భౌమశుక్రకుజేషు స్యా ద్వాణిజ్యలాభో ధనాగమః, భూలాభో వస్త్రలాభ శ్చ ధరణీధ్రప్రదర్శనాత్. ౨౨. భౌమమందసుధాంశు శ్చే త్కార్యహాని రనర్థతా, అతిక్లేశశ్చ భవతి శల్యవృత్తప్రదర్శనాత్. ౨౩. భౌమస్వర్భానుభానూనాం మనసా చింతితం ఫలమ్, బంధుమిత్రధనప్రాప్తి శ్చింతామణినిదర్శనాత్. ౨౪. బుధార్కార్కిషు యుక్తేషు మిత్రతా మధిగచ్ఛతి, ధనలాభం చ విజ్ఞేయం పద్మాకరనిదర్శనాత్. ౨౫. బుధేందుసితయోగే స్యా దతిక్లేశో మహా ద్భయమ్, బంధుమిత్రవిరోధశ్చ శూన్యవాపీప్రదర్శనాత్. ౨౬. సౌమ్యాగగురుసంయోగే ష్వనేకశుభదర్శనమ్, స్వస్థానే సుఖ మాప్నోతి తరుణాదిత్యదర్శనాత్. ౨౭.

సౌమ్యత్రయసమాయోగే రాజపూజా ధనాగమః, సౌఖ్యం చ ప్రయత్నం... మహా
తత్వతు ప్రదర్శనాత్. ౨౮. సౌమ్యజీవకుజేషు స్యా ద్రాజ్యలాభో ధనాగమః,
శ్రీలాభ స్స్యాత్సమాయోగే రక్తాంబరనిదర్శనాత్. ౨౯. సౌమ్యశుక్రేందుసంయో
గే ఆరోగ్యం ధనసంపదః, గమనే సుఖ మాప్నోతి కేతకాశ్చ ప్రదర్శనాత్.
సౌమ్యార్కి భానుసంయోగే ధనోత్సాహవివర్ధనం, సర్వోత్సాహో మనుష్యా
ణాం బృందావననిదర్శనాత్. ౩౧. బుధో రాహుశ్చ రాహుశ్చ సహసా సర్వ
సంపదః, స్వస్థానే కార్యసంపత్తి రైరావతనిదర్శనాత్. ౩౨. గురుభానుశ్చ శు
క్రశ్చ యాత్రాయాం నిష్ఫలం భవేత్, మిత్త్రిస్యాత్మవిరోధశ్చ శూన్యవాపీప్ర
దర్శనాత్. ౩౩. గురుచంద్రసురేజ్యాశ్చ మహత్సుఖ మవాప్నుయాత్, అర్థా
గ్గం బంధువిద్వేషో భిన్నపత్త్రిప్రదర్శనాత్. ౩౪. గురుభౌమబుధేషు స్యా న్నష్ట
ద్రవ్యాగమో భవేత్, రాజ్యలాభో మహోత్సాహో దర్పణస్య ప్రదర్శనాత్.
గురుసౌమ్యారసంయోగే ఈప్సితస్య సమాగమః, అతిస్నేహశ్చ సౌఖ్యంచ నవ
రత్నప్రదర్శనాత్. ౩౬. గురుద్వయేందుసంయోగే గోత్రబంధువిరోధకృత్, కా
ర్యనాశ శ్చ జాయంతే వసుదేవప్రదర్శనాత్. ౩౭. గురుభార్గవభానుశ్చ విద్యా
లాభశ్చ సర్వదా, గురుప్రతిష్ఠా సంపత్తి ర్దేవేంద్రస్య ప్రదర్శనాత్. ౩౮. వాగీశ
మందరాహూణా ముదయో రాజ్యసంపదః, మిత్త్రిలాభో నృపాత్ పూజా కు
మారస్వామిదర్శనాత్. ౩౯. జీవాహిమందసంయోగే శత్రునాశయ మధాగమః,
అర్థలాభో భవే త్సౌఖ్యం ఐరావత్యాః ప్రదర్శనాత్. ౪౦. శుక్రభానుశ్చ జీవ
శ్చ పుత్త్రిలాభో ధనాగమః, పుత్త్రిసౌఖ్యంచ భాగ్యంచ దావాదిప్రయాదర్శనా
త్. ౪౧. శుక్రసౌమ్యబుధేషు స్యా చ్ఛత్రునాశో ధనాగమః, జనాశ్వధనసం
పత్తి ర్దిగ్గజస్య ప్రదర్శనాత్. ౪౨. శుక్రభానుకుజేషు స్యా త్పుత్రలాభో ధ
నాగమః, స్థానే స్థానేషు పూజ్యంతే పుష్పవృష్టేః ప్రదర్శనాత్. ౪౩. కావ్య
సౌమ్యేందుసంయోగే రాజకీర్తి ర్ధనాగమః, కార్యసిద్ధిశ్చ విజ్ఞేయా పూర్ణకుం
భప్రదర్శనాత్. ౪౪. కావ్యజీవార్కిసంయోగే సర్వకార్యంచ సిధ్యతి, భవే
త్సుఖం చ కీర్తించ పూర్ణకుంభప్రదర్శనాత్. ౪౫. శుక్రద్వయభుజంగాశ్చ జ
న్మపీడాపరాభవః, విదేశగమనేచింతా ఈశ్వరస్య ప్రదర్శనాత్. ౪౬. శుక్రా
ర్కిమందసంయోగే అప్సుతే రాజసంపదః, యాత్రాయా మర్థలాభ స్స్యాద్బిల్వశా
ఖ్లీ ప్రదర్శనాత్. ౪౭. శుక్రరాహుశిఖిత్రయే శ్శత్రు నృపపీడా రణే తథా, చిత్త
నాశశ్చ భీతిశ్చ చంద్రికాయాశ్చ దర్శనాత్. ౪౮. యది మందార్కి సౌమ్యా
శ్చ శత్రుపీడా పరాభవః, దేశే సర్వార్థహానిశ్చ శవలీశత్రుదర్శనాత్. ౪౯.
మందేందుభూమిజాయోగే యేన కేనచ యస్యవా, పుత్త్రిలాభో యశ శ్చైవ షో
డశోపరిదర్శనాత్. ౫౦. మందమంగళచంద్రాశ్చ రాజపూజా ధనాగమః, భవే
చ్చ మహతీ లక్ష్మీ స్స్వర్ణకుంభప్రదర్శనాత్. ౫౧. భవే న్మందజ్ఞసూర్యేషు వి

ద్యా సౌఖ్యం ధనం యశః, అంతే మహద్భయం చైవ కాగ్యభంగనిదర్శనాత్. మందజీవభుజంగేషు పుత్త్రలాభో ధనాగమః, యోషిత్సంగం చలభతే శ్రీగ సాగరదర్శనాత్. ౫౩. శనిశుక్రార్క సంయోగే స్థానభ్రష్టం స్థిరం యశః, అంతే మహద్భయంచైవ కార్యభంగనిదర్శనాత్. ౫౪. ద్వయార్కసుక్రసంయోగే సంస్థిరాశ్చ సుఖాదయః, గమనే కలహం రూఢిః రూపరాగప్రదర్శనాత్. ౫౫. మందాహిగురుసంయోగే సుస్థిరశ్చ సుఖోదయః, గమనే భూసుణాం భూతిః పుత్త్రజీవ ప్రదర్శనాత్. ౫౬. రాహుభాను కుజేషు స్యా ద్రాజ్యలాభో ధనాగమః, స్థానే స్థానే తు పూజ్యంతే మిత్త్రలాభప్రదర్శనాత్. ౫౭. రాహుచంద్రేందు సంయోగే యాత్రాసిద్ధి స్సమాగమః, స్నేహవృద్ధి శ్చ భవతి శంఖవస్త్రప్రదర్శనాత్. ౫౮. రాహుమంగళభానూనా ముదయే మంగళోత్సవః, సర్వశత్రుజయావాప్తి ర్దేవేంద్రస్య ప్రదర్శనాత్. ౫౯. రాహుసౌమ్యభుజంగేషు శత్రునాశో ధనాగమః, కార్యసిద్ధిశ్చ భవతి మహామేరుప్రదర్శనాత్. ౬౦. భుజంగజీవమందేషు తేజోవిజయ వృద్ధయః, రాజపూజా భవే ద్వృద్ధి ర్గ్రహాల క్ష్మీప్రదర్శనాత్. ౬౧. రాహుశుక్రసితేషు స్యా ద్వైర్గ్రతా కార్యనాగనం, శత్రుపీడాచ భవతి నష్టచంద్రప్రదర్శనాత్. ౬౨. రాహు గ్రందో గురుశ్చైవ యాత్రా మర్థఫలం భవేత్, పశ్చాత్క్రమేణ సౌఖ్యంచ దధికృత్యనిదర్శనాత్. సరాహురాహు సౌమ్యాశ్చ ధనలాభో భవేత్సుఖం, గమనే రాజపూజాచ పూర్ణకుంభ ప్రదర్శనాత్. ౬౪. *

సంపూర్ణము.

ఈభీమకవి శాపానుగ్రహసమర్థుఁ డనుటకు మఱియొకకథ గలదు, అదియెట్లనఁగా :—

చామర్లకోట యనుగ్రామమునకు సమీపమున భీమవర మను నొకపట్టణము గలదు. అది పూర్వకాలమున చళుక్యభీముఁడు కుమారభీముఁడు అనునొక రాజవర్యునకు ముఖ్యపట్టణమై యుండెను. ఒకానొ

* ఈకవి నృసింహపురాణమును రచియించినాఁ డనియు, దానిలోనిదే యీపద్యమనియు నీనడుమ ముద్రిత మై వెలసిననన్నెచోడునికుమారసంభవభూమికలోఁ వ్రాయఁబడి కానవచ్చెడిని.

ఉ. వాండిమి నల్లసిద్ధిజనవల్లభుఁ డోర్చినరాజు భీరుఁ డై
యాంధ్రను గానపండ వృషభాంకము పెట్టికొనంగఁ జూచితో
నేండిదె యేమి నీ వనుచు నెచ్చెలులెల్ల హసింప నంతలో
మూండవకంటితోడ దొరమూర్తి వహించిన క్రౌంచిక్కు రంగనల్.

కసమయమున భీమకవి యాయూరికిఁ బోయి యుండఁగా నాయూర నుండువా రెవ్వరును భీమకవి నివసించుటకు బస నొసఁగక యుండి రనియు దానికిఁ గనలి భీమకవి యాయూరు త్వరలోనే పాడువడు నని శాపం బిచ్చి యథేచ్ఛం బోయె ననియు నాఁడు మొదలు ఆచళుక్య భీమవరము భూమిలోఁ గలసె ననియుఁ జామర్లకోట భీమవరము గ్రామ వాస్తవ్యులచే నేటికిని వాడుకొనంబడుచున్నది. చామర్లకోట కాలువన గుండ రాజమహేంద్రవరమువైపు పోవునప్పుడు సేనువుగము సమీపమున నొకప్రాచీనదేవాలయము గాన్పించును. ఆదేవళము మొదలు ప్రస్తుతపు భీమవర భీమేశ్వరపు దేవళమువఱకును పూర్వపుభీమవరములోని యొక వీధి వ్యాపించి యుండె ననియు నటులనే యూరంతయు దానిం జుట్టుకొని యుండె ననియు నాయూరు దిబ్బ చేయు ననుభయము గలవారిందఱును ఆపాడు వదలి దానికి అర్ధక్రోశదూరమున నున్న చామర్లకోటదగ్గర నిప్పు డుండుభీమవరము కట్టుకొని ప్రవేశించిరనియు వాడుక గలదు. అయితే చామర్లకోటలో నుండెడు కోటయును సీభీమవరము ను నవీనములుగా కట్టఁబడి యుండవోవును. ఆకోటకే చామర్లకోట యనునామంబు లేక భీమవరముగానే వాడుక గల్గి యుండు నని శ్రీనాథునికాలము నాఁటికిఁగూడఁ జళుక్యభీమవరనామంబు వ్యాపకమై యుండుటం జేసి యూహింపనై యున్నది. శ్రీనాథుఁడు తనవీథినాటకములో తెనుఁగురాయని కస్తూరి యిప్పించు మని కోరి చెప్పినపద్యములో నీయూరియుదాహరణ మిచ్చి చెప్పినపద్యము.

శా. అక్షయ్యంబుగ పాంపరాయని తెలుంగాధీశ కస్తూరికా
భిక్షాదానము చేయరా సుకవిరాడ్బృందారక శ్రేణికిన్
దాక్షారామ చళుక్యభీమవరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించుఁ దద్వాసనల్.

## రణతిక్కన బ్రతికించుట.

ముప్పదియిద్దఱు నియోగులపద్యములో రణతిక్కనంగూర్చి వ్రాయుచో తిక్కన రణమందు హతుఁ డయ్యె ననియు నతనిభార్య

అతనిశిరంబుతో మాత్రము సహగమనంబు చేయుతలంపున నుండఁగా నంతట నామార్గమున నీభీమకవి తటస్థ మయ్యె ననియు నప్పుడు రణతిక్కనభార్య యతనికి నమస్కరింప "సౌభాగ్యవతీ భవ" యని దీవింపఁగా నప్పుడు సమీపమున నున్నవార లాపెపెనిమిటి మృతుఁడై యుండె నని తెల్పఁగా నాపె వచ్చి తనపెనిమిటిని బ్రతికించి తన్ను రక్షింపుఁ డని ప్రార్థించె ననియు దానికి భీమకవి రణతిక్కనశిరంబును, కళేబరంబును గూర్చి యుంచిన బ్రతికించెద ననిన నప్పు డాపతివ్రత లేచి తనపఁతిశరీరఖండంబులు పైకి వచ్చియుండవలయు నని ప్రార్థింపఁగా నాపె పాతివ్రత్యవిశేషంబున నాఖండంబులు నృత్యము చేయుచు రణభూమి నుండి పైకి నిల్చె ననియు దానికి భీమన సంతసించి యారణతిక్కనను పునర్జీవితుని జేసె ననియు నొకకథ గలదు. ఆసమయంబున భీమకవి చెప్పినపద్య మీక్రింద వివరింపఁబడును గాక.

క. గుణములనిధాన మగుమనగణతిక్కఁడు తాఁ గళేబరంబును దగముక్
గణకమెయి గలియు బ్రతుకును, బ్రణతాఖిలనరిమకుటభాసితపదుఁడై.

అనినవెంటనే తిక్కన సజీవుఁ డయ్యె నను మొదలగుసంగతులు తెల్పునొకకథ గలదు. అది యెంతవఱకు నమ్మఁదగునో ఆలోచింపవలసి యున్నది. ఈకథ పరిశీలించి చూడఁగా నన్నయభట్టారకుఁడు, భీమకవి, తిక్కనకవితండ్రి యగు కొమ్మనామాత్యులు నేకకాలీను లని దేశంబునం గలప్రతీతిం బట్టి యిది కల్పింపఁబడినదైన నుండవలెను లేదా కొంచె మెచ్చుతగ్గు కాలములో నన్నయతిక్కనాదు లున్నట్లుగా గ్రంథదృష్టాంతములు కాన్పించుచున్నవి గనుక నితఁడును భీమకవిసమకాలీనుఁడై యైన నుండవలెను. పైద్వాత్రింశన్మంత్రిచారిత్రములో నీరణతిక్కన తిక్కనసోమయాజితమ్ముం డనియు నితనితండ్రి కొమ్మనయే యనియు, నితనిని సిద్ధన యనుకొమ్మన యన్న పెంచుకొనినట్లును సూచింపఁబడినది. ఈకథ కేవలము కల్పిత మని చెప్పుట కాధారము లేవియుఁ గానరావు. రణతిక్కనచారిత్రములో నాకథలో నుండు భేదాభిప్రాయంబులు చూపెదము. భీమకవిచారిత్రము వ్రాసి యుంటి

మి కావున నతనిచే రచియింపఁబడిన భీమకవీయప్రశ్న మనునొకచిన్న జ్యోతిషగ్రంథమును, భీమకవిచందమునుగూడ నీచారిత్రముతోడనే వీలయినవఱకు ముద్రించెదము. భీమకవిచందము అతనిచే నతనికుమారున కుపదేశింపఁబడినట్లును ఆకుమారుఁడు దానిని గ్రంథముగాఁ జేసినట్లును ఆచందములోని యీక్రిందిపద్యములవలనఁ గాన్పించుచున్నది. అదియెట్లన్నను :—

క. పరఁగినవిమలయశోభా, సురచరితుఁడు భీమనాగ్రసుతుఁ డఖిలకళా
పరిణతుఁ డయ్యెను భూభృ, ద్వరవిమలప్రసాదితోద్భవశ్రీయుతుఁడై.

క. కమనీయ సమస్తకళా, గమములకును జన్మభూమి కావ్యము కావ్యా
గమవిదుఁడు సర్వాదుఁ డని, సమయచతుష్టయమునందుఁ జగివిరి మొదలన్.

క. కావునఁ గవిత్వతత్త్వము, భూవలయములోనఁ దేఁటఁ బూజ్యం బని స,
ద్భావమునఁ జెప్పఁ గావ్యక, ళానేదులు పొగడఁ గావ్యలక్షణమహిమన్.

అనువీనివలన భీమకవికి సంతానము కలదనియు నందులో నొకరిచేతి గ్రంథము గూడ రచియింపఁబడె ననియు మనకుఁ దెలియుచున్నది. ఆచందము మన మనకాశానుసారముగఁ గాలాంతరమునఁ బ్రకటింప నిశ్చయించినారము. గనుక ప్రస్తుతము భీమకవిచారిత్రమున నుడువంబడిన యతని సమకాలీనులచారిత్రము మనకుఁ దెలిసినంతవఱకు వ్రాయుదము. అది దేశచారిత్రములోఁ జేరియుండును.

## దేశచారిత్రము.

### భీమకవికాలీనులచారిత్రము.

భీమకవిచారిత్రములో నుదాహరింపఁబడినవారిలో మనము చారిత్రము వ్రాయవలసినవారు :—

౧. మైలమభీమన యితనివంశము తెలుఁగు దేశపుక్షత్రియుల విషయమైనగాథలతో నొప్పియుండును.

౨. బడబానలభట్టారకుఁడు. ఇతనికాలమున దేశములో వెలమలకు బిరుదులు మొదలగునవి గలిగినవిధము. ఈరెండువృత్తాంతములను మనము పూర్ణముగా వ్రాయుటకుం గమకించిన నిఁక దేశవృత్తాంతము

వ్రాయుట కవకాశమే యుండదు. కావున మనము ప్రకృతము ముందీరెండు శాఖలవారింగూర్చి చెప్పఁబోవు గ్రంథమునకు సంగ్రహరూపమున కొంత చెప్పినచారిత్రము అనంతరము ఆయా శాఖలవారికి వలయునేని ఆయా గ్రంథములు ప్రత్యేకము ప్రకటింతము. ఇదివఱలో మనము భీమకవిచారిత్రములోని మైలమభీమనవంశస్థులు మనదేశములోని పూసపాటివా రని వ్రాసి యున్నాము. ఇప్పు డామైలమభీమనచారిత్రము నుడువుటకుముందు అతనివంశస్థు లగుపూసపాటివారిచే బూర్వమునుండియు సంపాదింపఁబడినబిరుదము లెవ్వియో వాని దెల్పి వానికాల మెద్దియో నిర్ధారణ చేసి యుంచుదము. ఇది ముందు మనము ప్రకటింపఁబో మైలమభీమనవంశచారిత్రమునకుఁ బీఠిక యై యుండును. అటులనే బడబానలభట్టుచారిత్రము వ్రాయుటకు ముందుగా నతనివలన శాసింపఁబడిన వెలమలలోఁ బద్మనాయకులను వెలమవారిలో ముఖ్యులగు రేచర్లగోత్రమువారిబిరుదంబులు వ్రాసి యుంచిన దానికి నది పీఠికయై యుండును గావున నీపత్రికలోఁ బూసపాటివారిబిరుదంబులును, వేంకటగిరి వారిబిరుదములును, విశదీకరింతము. అవి యెట్లన్నను:—

పూసపాటివారిబిరుదులు.

౧. శ్రీమన్మహామండలేశ్వరుఁడు—ఇది మండలాధిపతి యైనందువలనం గల్గినది.

౨. మహీమండలరాయఁడు—ఈబిరుదు మండలాధిపత్యమున కధికమగుభూములను సంపాదింపగలిగియుండుటను దెల్పును.

3. మన్నెసురతాణుఁడు—దీనినే మన్యసుల్తాన్ అని హిందూస్థానీలోఁ జెప్పుదురు. ఇది యవనభాషలో మనేహాసుల్తాన్ అని యుండును. అనఁగా గొప్పప్రభు వని యభిప్రాయము

౪. దర్భజకులసంభవుఁడు—శ్రీరామచంద్రునికుమారునకుఁ గుశుఁ డని నామంబు గలదు కుశశబ్దపర్యాయము దర్భ యగుటయు దర్భజకులజు లనఁగా కుశవంశసంభూతు లనియు నర్థము.

౫. హాసబిరుదాంకుఁడు—అనుబిరుదునకు హేసబిరుదగండఁడను పాఠాంతరము గలదు.

౬. ధారాపురీగహనదావధనంజయుండు—దీనికి ధారాపురీసుప్రా-రణ్యాపావకుఁ డను పాఠాంతరము గలదు. ధారాపురము భోజునిముఖ్యపట్టణము. ఈభోజుఁడు విధర్భదేశాధిపతి. దీనికి Bidar అని యవనాదుల వలన నామంబు గలిగినది. ధారాపురిని జయించె నని చెప్పుటచే బీదరని చెప్పఁబడువిదర్భదేశము గూడ నాక్రమింపఁబడె నని చెప్పవలసి యున్నది.

౭. గండధనంజయుఁ డని యున్నబిరుదునకు గండలకు ధనంజయునివంటివాఁ డనియర్థము.

౮. మేదినీరాయమృగవేఁటకారుఁడు—దీనికి మేదినీరాయ మృగసముదయచండమృగయుఁ డని పాఠాంతరము. సింహాచలమునొద్ద నున్న పొట్నూరునకుఁ బూర్వము ప్రభువులు మేదినీరావునారు. వీరిలో కృష్ణరాయని నెదిరించినయతనిని కళింగమేదినీవిభుఁ డని పెద్దనవలనం జెప్పఁబడియె. అట్టిమేదినీరాయనామముగల రాజును జయించుటం జేసి యీబిరుదు గలిగినది.

౯. వీరకేదారుఁడు—ఇది వీరశ్రేష్ఠుఁ డని తెల్పును.

౧౦. కృష్ణవేణీ జలక్రీడావినోదపరాయణుఁడు—తఱచుగాఁ గృష్ణానదిలో స్నానముచేయుకుతూహలము గలవాఁడు. కొందఱకాలములో నమరావతియు మఱికొందఱకాలములో బెజవాడయును ముఖ్యపట్టణములై యుండెను. ఈరెండుస్థలములలోపలంగూడ కృష్ణానది ప్రవహించును గనుక నీబిరుదు సర్వత్ర చెల్లును.

౧౧. ఖడ్గనారాయణుఁడు.
౧౨. దుర్జయకులకులాచల కంఠీరవుఁడు.
౧౩. రణరంగభైరవుఁడు.
} ఇవి చారిత్రమునం దెల్పు బిరుదులు కావు.

౧౪. మాళవరాజమస్తకశూలంబు—దీనివలన మాళవరాజును దన వశవర్తిగఁ జేసికొనియె నని తేలుచున్నది. ఈవంశస్థులలోని రాచిరాజు అనునతఁడు మాళవరాజును జయించి అతనిమన్యసుల్తాన్ బిరుదు లాగుకొనియెను.

౧౫. కర్ణాటరాజకందకుద్దాలకుఁడు—దీనికి కర్ణాటసంస్థాన కందకుద్దాళికుఁ డని పాఠాంతరము. కర్ణాటరాజులను మొదలుకోఁ బెల్లగించి యీరాజ్య మాక్రమించుకొనె నని భావము.

| | |
|---|---|
| ౧౬. వైరిరాజోరగవైనతేయుఁడు.<br>౧౭. శౌచగాంగేయుఁడు.<br>౧౮. వీరసేతుప్రతాపభాసురుఁడు. | చారిత్రోపయోగములు కావు. |

౧౯. వామఛురీధరుఁడు—దీనివలన నిప్పటివఱకు నీవంశమువారివలన కత్తి యెడమభాగమందు ధరియింపఁబడు ననుసాంప్రదాయము తేలుచున్నది.

౨౦. నెల్లూరు, యెలమంచిలి, కంచి, దేవగిరిచూరకారుఁడు—ఈనాల్గిటిరాజ్యరమాచూరకారుఁ డని పాఠాంతరము. దీనిలోఁ జెప్పఁబడిన నాలుగుపట్టణములు నాలుగురాజధానులు. అందు నెల్లూరు మనుమసిద్ధిరాజుది. ఎలమంచిలి కళింగాధిపునిది. కంచి చోళప్రభునిది. దేవగిరి యాదవవంశప్రభువులది. దీనిని తురష్కులు తమస్వాధీనము చేసికొనినతరువాత దౌలతాబా దనునామాంతరముచే వ్యవహరించుచుండిరి. ఈబిరుదు సంపాదించునాఁటికి ఈనాల్గురాష్ట్రములం జేర్చికొనినట్లు కాన్పించును.

౨౧. ఆంధ్రకటకవజ్రప్రాకారుఁడు.—ఆంధ్రదేశకటకమునకు వజ్రప్రాకారముగాఁ గలవాఁడు.

| | |
|---|---|
| ౨౨. మానగోవిందనామధేయుఁడు<br>౨౩. కుంతకౌంతేయుఁడు | చారిత్రోపయోగములు కావు. |

౨౪. విజయవాటికా సింహాసనాధ్యక్షు మాధవవర్మాన్వయ లలాముఁడు— విజయవాటి అనియు లేక బెజవాడ అనియు బిజయపుర

మనియు వాకు శా ఉచ్చరింపఁబడును. ఈస్థలమున మొదట సింహాస నము సంపాదించినయతఁడు మాధవవర్మ అతనివంశ శ్రేష్ఠుఁడని యర్థము.

౨౫. కనకదుర్గావరప్రసాద లబ్ధవైభవుఁడు.—ఈబెజవాడపట్టణమున వేంచేసియున్న కనకదుర్గామహాదేవిని పయిమాధవవర్మ యుపాసింపఁగ ఆమహాదేవీకటాక్షమున చతురంగబలములును, అనంతైశ్వర్యమును లభించెను.

౨౬. గరుడ భైరవ ధ్వజప్రాభవుఁడు.—గరుడధ్వజము, భైరవ ధ్వజమును గలవాఁడు. ఇది సిరివంశజులలో కొందఱు వైష్ణవులుగా నున్న ట్లును, మఱికొందఱు శైవులుగా నున్నట్లును సూచించును.

౨౭. కొలిపాకపురీధవుఁడు.—కొలిపాక యనుపట్టణము అధికారస్థా నముగాఁ గలవాఁడు. కొందఱు ప్రభువులకాలములో నిది ముఖ్యపట్టణ మాయెను.

౨౮. నహాకారబాంధవుఁడు.—

౨౯. దశలక్షహయ, అష్టసహస్రగజవల్లభుఁడు.—ఈవిశేషసేనలు కనకదుర్గాప్రసాదమువలన మాధవవర్మకుఁ గల్గినవి. అవు డీ బిరుదు గలిగినది.

౩౦. మల్లికావల్లభుఁడు.—

౩౧. లాట, భోట, చోళ, గౌళాదిరాజపురసర్వస్వాపహారుఁడు.— దిగ్విజయంబు చేసి పైదేశములలోని ధనమును గొల్లగొట్టి వచ్చినవాఁ డని యర్థము.

౩౨. పరిచ్ఛేదివంశాభరణము.—మైలమభీముఁడు కారణాంతరమునఁ దనకత్తిం గొని తానే నఱికికొని మృతుండయ్యెను. కావున నాతనికిఁ బరిచ్ఛేది యనుబిరుదు గలిగినది.

౩౩. బిరుదరాయరాహుత్తవేశ్యాభుజంగుఁడు.

౩౪. కళ్యాణరాజదుర్మదవిభంగుఁడు.— ఇందుఁ దెలుపఁబడినకళ్యా ణపురము పశ్చిమచాళుక్యులకు ముఖ్యపట్టణము. ఈముఖ్యపట్టణము గ లదేశమునకుఁ గుంతలదేశ మని పేరు. ఈపట్టణము తురష్కులస్వాధీ

న మయిన పిమ్మట నానమీపమున నుండుబీజపూరు (Bijapore) ఆదేశమునకు ముఖ్యపట్టణ మాయెను. ఆసంస్థానమునకుఁగూడ బీజపురరాజ్య మనియే పేరు గలిగెను. అయితే త్రైలమభీమనకాల నగుశాలివాహన సం. 975 (A. D. 1053) నాఁటికి కళ్యాణపుర మనునామమే కలదు. *

36. సేతుసీతాచలాస్తోదయాద్రిబిగుదశాసన స్తంభవిభ్రాజితుఁడు—వీరివంశస్థులలో నొకమాధవవర్మ యనురాజు దిగ్విజయార్థము కృష్ణదేవరాయలకాలమునాఁడు బయలుదేరి యనేకస్థలములు జయించి సేతువుపఱకును దనజయస్తంభములు పాతించినట్లు గ్రంథములలో దృష్టాంతము గలదు.

37. భారుహామన్నె గండ పెండేర విరాజితుఁడు—దీనికి పాఠాంతరమే యర్థముగా నుండును. ఎట్లన్నను, భారుహామన్యరాజన్యకోటీరకోటిహీరచారుశుమ్భ్యమానసమాశ్రితపాదపంకజుఁడని.

38. కళింగరాయ ప్రళయకాలాభీలుండు—ఇందలికళింగరాయఁడు రాజకళింగగంగు కానోపును. లేదా కళింగరా జని యయిన సనన న్చును. మయిలమభీమునయును, రాజకళింగగంగును నేకకాలీనులు కావున మొదటియర్థమే యనుకూలించి యుండును.

39. కిమిడిరాయమానవిభాళుఁడు—దీనిపాఠాంతరము కిమిడిరాజమానతిమిరార్కుండని యున్నది.

40. గంగిమంగితలగుండుగండఁడు—

41. మండలీకరగండఁడు—

42. కరవాలరుద్రుండు—

43. విమతవీరభద్రుండు—

---

* ఒక యాంగ్లేయచారిత్రములో, (The capital of the Western Chalukyas was Kalyan or Kalyanapura Someswara. Trylokya mallawas ruling over it as early as in 975 Saka (1053. A. D.) అని యున్నది. ఈబిరుదువలన నీవంశస్థులు కళ్యాణరాజ్యము జయించి యారాజ్య మాక్రమించినట్లు కాన్పించును.

౨౩. బల్లాడగోధూమఘరట్టుఁడు—ఇందలి బల్లాడశబ్దము కటకదేశప్రభుఁడగు భల్లహునియందును వర్తించును. బల్లాణవంశస్థులని పశ్చిమదేశమున నొకసంస్థానమువారు గలరు. వారికిఁ జెల్లినఁ జెల్లును. కొంతకాలము క్రిందట వీరిరాజ్యము తూర్పునఁ గటకమునంతకును, పడమట దేవగిరివఱకును వ్యాపించి యుండుటంబట్టి యీబల్లాడశబ్దము వారి కన్వయించిన నన్వయింపవచ్చును. లేదా యుద్ధయోధుల వర్తించునదని చెప్పినఁ జెప్ప నొప్పును.

౨౪. భోజరాజదిశాధట్టుండు—దీనికిఁ బాఠాంతరము భోజరాజశ్రీవీణకీలికీలాకరాళుఁడని కలదు.

౨౫. చాళుక్యరాజరాజ్యస్థాపనాచార్యుఁడు—చాళుక్యులు పూర్వచాళుక్యులు పశ్చిమచాళుక్యులని రెండు తెగలవా రుండిరి. అందుఁ బూర్వచాళుక్యులముఖ్యపట్టణము రాజమహేంద్రవరము. పశ్చిమచాళుక్యులముఖ్యపట్టణము కళ్యాణపురము. ఇదివఱలో 34 వ సీసములోఁ గళ్యాణపురములోనిచాళుక్యులఁ గూర్చి వ్రాసియున్నాఁడు గాన నిప్పు డీబిరుదు పూర్వరాజ్యమందుండు రాజమహేంద్రచాళుక్యులకుం జెల్లును. వీరిలో రాజనామము రాజనరేంద్రునకుఁ జెల్లును. ఈరాజనరేంద్రుని తండ్రి యగువిమలాదిత్యుఁడును, శైలమభీమునియును సమకాలీనులు. శైలమభీముని విమలాదిత్యునియనంతరము రాజనరేంద్రుని వేంగీసింహాసనము నం దెక్కించి యుండిన నుండవచ్చును. లేదా యీవంశములో మఱియొకరికైన నీబిరుదు చెల్లు నని చెప్ప నొప్పియున్నది.

౨౬. ఒడ్డిరాయ మీజాలికనర్తుఁడు—పాఠాంతరము. ఒడ్డెనుహీం రాయ సముదాయజీవనవిహారసముచ్చత్క్రూరనాళుఁడు—ఒడ్డియరాయమస్తకశూలధరుఁ డని యింకొక పాఠాంతరము. ఒడ్డిరాయఁ డనఁగా నోఢ్రరాజు. (King of Orissa.)

౨౭. జలదుర్గదీవిమన్నెయునివేసఁడు :—ఇట దీవిసీమలో జలదుర్గము గల్గియుండె నని యభిప్రాయముగా నోవు. ఇది కృష్ణానది తీరములోనిది.

౪౮. స్థలదుర్గ కేతవరపట్టణాధీశ్వరుఁడు— కేతవరపురనాయకుఁడు. అని పాఠాంతరము.

౪౯. వనదుర్గ మొగలితుర్తిప్రభుఁడు— మొగలితుర్తిరాజధానిం ద్రుం డని పాఠాంతరము. దీనింబట్టి మొగలితుర్తు పూర్వము పూసపాటివారి దనియు ననంతర కాలములో నిది కలిదిండివారి కియ్యఁబడిన దనియు నూహింపవలయును.

౫౦. నగదుర్గానంతగిరిప్రభుండు—ఈయనంతగిరి కృష్ణరాయల కాలమునాఁటికిఁ జాలఁ బ్రసిద్ధి గల పట్టణ మయియున్నది. ఈపట్టణముం జయించి యారాజు బెల్లముకొండ, కొండవీటిసీమయును జయించి నట్లుగా నున్నది. కృష్ణరాయల కాలములో నొకమాధవవర్మ యను నాఁత డిచ్చో నధికారము చేయుచుండెను. అతఁడు మిగులఁ బరాక్రమవంతుఁడు.

౫౧. వీళరాయరక్కసరాయఁడు—

౫౨. తెల్లతలాటరాయఁడు—ఈబిరుదములన్నియును శాలివాహన సం. ౧౬౫౦ కాలమున మయిలమ భీమునివంశస్థులలో రాజ్యమును వహించియున్న తమ్మభూపాలునివలనఁ గృష్ణవిజయ మనునాంధ్రకావ్యములో వివరింపఁబడియున్నవి. ఈపైవానిలో నతనిబిరుదులును జేరియేయుండును. తదనంతర కాలము మొద లింగ్లీషువారు మనదేశములోఁ బ్రవేశించి మచిలీబందరు మొదలగుసముద్రతీరపట్టణములను దత్కాలప్రభుం డగు నానందగజపతిమహారాజువలన సంపాదించువఱకును గల బిరుదంబులును, పైగ్రంథములో వదిలివేసినవియును నీక్రింద వివరించెదము.

౫౩. రేచర్లగోత్ర సముద్భవశుష్కకానన దావదహనుండు— అనునీబిరుదు రేచర్లగోత్రోద్భవుం డగు త్రిభువనీరాయబిరుదుం డగుసింగమనీనికిని నా కాలములోనిమాధవవర్మకును జరిగినయుద్ధములో బెజవాడసమీపంబున నున్న పెదవీ డనుస్థలము నపహరించి యతనిభా

ర్భగర్భములో నుంకుశిశువుంగూడ సంహరింపఁ బ్రయత్నించినపుడు గ
ల్గినది. ఈ రేచర్లవారు, వేంకటగిరి, పిఠాపురము, బొబ్బిలి మొదలగు
సంస్థానములవారై యున్నారు. పైని జెప్పఁబడినగోత్రమువారికి నీ
సింగమనీఁడు మూలపురుషుఁడై యున్నాఁడు. అతని సంహరించుట
చే నాబిరుదు గలిగినది.

౫౪. యవనసైనికనికాయమేఘమారుతుఁడు.—ఈబిరుదు తురుష్క
సేనలను జయించుటచేఁ గలిగినది.

౫౫. దక్షిణదిగ్దేశాధిపతివధూలోకసాంచాలుఁడు—

౫౬. పశ్చిమదిగ్రాజమహేశ్వరుఁడు—

౫౭. ఉత్తరదిశాన్నృలోకపాలకమదేభకంఠీరవుఁడు—

౫౮. పూర్వగోత్రాధిపగోత్రవిద్వేషణుఁడు—

౫౯. చోళభల్లాడఘూమఘట్టనఘరట్టుఁడు—

౬౦. దానకర్ణుఁడు—

౬౧. మానదుర్యోధనుండు.—

౬౨. పావురాయకాకోదరనీలకంఠుఁడు—

౬౩. కంజి, జెంజీ, యెలమంచిలి, నెల్లూరు, ద్వారకాపుర, సిద్ధూమధా
ముఁడు.—Destroyer of Conjeevaram, Jinjee, Yelamanchili,
Nellore and Dwarakapura in the state of Baroda.

౬౪. స్థలదుర్గకుంభిలాపుర నికేతనుఁడు— ఈ కుంభిలాపురము నే
ఁడుపుడు కుమిలె యని చెప్పుదురు. ఇది స్థలదుర్గముగ నుండెను.

౬౫. పూసపాటిపురాంకుఁడు—ఈబిరుదు పూసపాటి యనుగ్రామం
బునం గలయొకకోటను సంరక్షణ చేయుటంబట్టి పూసపాటివా రని పిలు
వఁబడిరి. మైలమభీమునివంశమున నమలరా జనునొక ప్రభుండు పుట్టెను.
అతఁడు. "గీ. పూసపాటినగరంబుఁ బ్రోచుకతనఁ, బూసపాటిపురాం
కుఁడై పొగడు గనియె." అని యున్నది.

౬౬. చతుర్గోత్రవందనీయుఁడు—ఆంధ్రదేశంబున నాలుగు గోత్ర
ములు గలక్షత్రియు లున్నారు. ఆనాల్గుగోత్రములవారును మొదట

మైలమభీమునికూటస్థు లగు ముక్కంటిరాజు, బుద్ధవర్మ, మాధవవర్మ మొదలగువారితో నీదేశములోనికిఁ దత్సహాయార్థమై వచ్చియుండిరి. అదికారణముగాఁ దమకుఁ బ్రభువులుగా నుండెను ఈమయిలమ భీముని యన్వయంబులోనివారికి నమస్కరించు నాచారము గలదు. కావున నీబిరుదు గల్గినది.

౧౭. రాయసంస్థాననృప ప్రాణవాయుభుజగుండు — రాయసంస్థానము కర్ణాటరాజులసంస్థానము. తత్సంస్థాననృపతుల సంహారించె నని కలదు.

౧౮. నిజస్నానోదకకుష్ఠరుజానివారకుండు — వీరిలో నొకరు స్నానముచేసి తనబట్ట పిండిచిననీరు పోసిన నొకకుష్ఠురోగికి వెంటనే గుణమిచ్చె నని కలదు.

౧౯. స్థలదుర్గవిజయనగరశిలాప్రాకారవిభుండు — అనంతరకాలములో విజయనగరము స్థలదుర్గముగాఁ జేయఁబడినది. అందు శిలాప్రాకారము గట్టింపఁబడియె. ఇదియ ప్రస్తుతము మైలమభీమునివంశస్థులకు రాజధాని.

౨౦. జలదుర్గభీమపట్టణాధ్యక్షుండు — విజయనగరము సమీపమున నుండు భీమునిపట్టణము వీరికి జలదుర్గముగా నుండెను.

౨౧. వనదుర్గమత్స్యపురవిభుండు — మాడుగులకు మత్స్యపుర మను నామాంతరము గలదు. ఇది వనదుర్గముగా నుండెను.

౨౨. గిరిదుర్గముఖ్యనందాపురీప్రభుండు — ఈనందాపురము ఇప్పటి జయపురపుసంస్థానమునకుఁ బూర్వము ముఖ్యపట్టణము. ఆపట్టణము వీరికి జలదుర్గముగఁ గొంతకాల ముండెను.

౨౩. విజయభేరీప్రముఖవాద్యనవకైరవావనవరబిరుదధౌరేయుండు—

౨౪. మనసజమణికిరీటకనకచ్ఛత్రమత్స్యధ్వజసింహతలాటపీరకాహళాద్యనేకబిరుదాంకసముజ్జ్వలుండు—

౨౫. నీలగిరినాయకప్రతిష్ఠాపకుండు — అనఁగా సింహాచలస్వామిని బ్రతిష్ఠచేసె నని యర్థము.

౭౬. అనేకరాజకులసంస్థాననిర్వాహకబిరుద—

౭౭. మహారాష్ట్రాబ్ధిమంథనుండు.—వీరి దేశమునకు మహారాష్ట్రసేనలు వచ్చినపుడు వారిని జయించి పాఱఁదోలుటచేతఁ గలిగినది.

౭౮. దేవబ్రాహ్మణక్షేత్రపరిపాలన పాండవాగ్రజుఁడు.— వీరి సంస్థానమున వేలకొలఁది బ్రాహ్మణాగ్రహారములును, మాన్యములును, దేవబ్రాహ్మణులకీయఁబడినవి. అట్టివానిని సంరక్షించె నని యర్థము.

౭౯. గజపతినామాంకప్రభుఁడు.—గజపతి యనుబిరుదు సంపాదించె నని యర్థము.

౮౦. యవనపరాసుసైనికభూధరకులిశాయుధుఁడు.—యవను లనఁగాఁ దురుష్కులను ఫ్రెంచివారినిగూడ జయించె నని యర్థము.

ఆంగ్లేయులు మనయాంధ్రదేశములోనికి వచ్చినపిమ్మట వారివంశజులచే సంపాదింపఁబడినబిరుదు లాయాయుచితస్థలంబులలో వివరింపఁబడును. ఇవి యన్నియు నవీనములు. పైనుదాహరింపఁబడినవి ప్రాచీనములు. కావున వానినిమాత్రమే వివరించియున్నారము.

పైబిరుదాంకము లన్నిటిఁబట్టి చూడ మైలమభీమునివంశస్థుల కొక్కొక్కకాలములోఁ గొలిపాకయుఁ, గేతవరమును, బెజవాడయుఁ, గుంభిళాపురమును, విజయనగరమును, ముఖ్యపట్టణము లయి యుండె ననియును; ధారాపురము, నెల్లూరు, యెలమంచిలి, కంచి, దేవగిరి, కటకపురి, చెంజి, ద్వారకాపురము మొదలగుపట్టణములపై దండెత్తి వెడలి వానిని స్వాధీనపఱుచుకొనినట్లును, మేదినీరాయ, మాళవరాజ, కర్ణాటరాజ, కళ్యాణరాజ, కళింగరాజ, కిమిడిరాజ, భల్లాడ, ఒడ్డియరాయ, వీరరాయ, రేచర్లగోత్ర, యవనసైనిక, చోళరాజ, పాండ్యరాయ, రాయసంస్థాననృప, పరాసుసైన్య జయాంకబిరుదులును, చాళుక్యరాజరాజ్యస్థాపన, అనేకరాజకులసంస్థాన నిర్వాహకబిరుదులు చెల్లినట్లును గాన్పించును. వీని నన్నిటిం బట్టి చూడ నీముఖ్యులను భీమునివంశస్థు లెంత దేశమునకుఁ బ్రభుత్వము చేసిరో యెందఱు రాజులతో సంబంధము గలిగియుండిరో బోధపడక పోదు.

ఇంతవఱకును మనయాంధ్రదేశములోని ప్రాచీనరాష్ట్రమును పాలించెడు వెలమక్షత్రియవంశస్థులచరితము సూచించుబిరుదులం జెప్పితిమి. ఇపుడు శ్రీనాథకవిసమకాలీనుఁడును రేచర్లగోత్రోద్భవుఁడును నగు ఆదిజగన్నాథరావుప్రభునివంశస్థులలోఁ జెల్లెడు బిరుదావళులఁ జెప్పెదము. అట్టిబిరుదులం జెప్పుటకుఁ బూర్వమీయాదిజగన్నాథరావుంగూర్చి కొంచెము చెప్పవలసి యున్నది. ఇతఁడు రేచర్లగోత్రనామమునకుఁ బ్రాతిపదిక యగుచెవ్విరెడ్డితండ్రి పోలన్నకు మూలపురుషుఁడు. ఇంతకంటె నీయాదిజగన్నాథరావు వృత్తాంతము పద్మనాయక చారిత్రము పుట్టిననాఁటికే తెలిసి యుండలేదు. చెవ్విరెడ్డినాఁటికి వీరిగోత్ర మామనగంటిగోత్ర మని యుండెను. రేచఁ డనువానికిఁ జెవ్విరెడ్డి యిచ్చినవరమును బట్టి వానిపే రిడఁగా నాఁటనుండియు నీచెవ్విరెడ్డి రేచర్లగోత్రముచే నొప్పెను. ఈచెవ్విరెడ్డి కారణాంతరమునఁ బిల్లలమఱ్ఱిభేతాళరెడ్డి యను పౌరుషనామంబు నోరుగంటిప్రతాపరుద్రునివలన సంపాదించి ప్రసిద్ధి నొందెను. వెలమలగోత్రములు నిర్ణయింపఁబడినసమయమునకు ననఁగా శాలివాహన. స. ౧౧౧౦ నకు రేచర్లవారిలో నప్పనామాత్యుఁ డను నొకప్రభుం డుండెను. ఇతఁడు భేతాళరెడ్డి కెట్టిసంబంధము గలవాఁడో దానిం దెల్పుటకుఁ దగినగ్రంథసహాయము కాన్పించలేదు. ఇతఁడే భేతాళరెడ్డి యగు నని యూహింపనై యున్నది. రేచర్లగోత్రుల కాతని నాఁడు కల్గినబిరుదములు ముందుగ నీక్రింద వివరించెదము.

౧. పంచవాద్యేయదళవిఘాలబిరుదు.—

౨. కాకతిరాయరాజ్యస్థాపనాచార్యబిరుదు.—

ఇతఁడు కాకతిపోలురా జని చెప్పఁబడును. ఇతఁడు ప్రతాపరుద్రుని మాతామహుఁ డగుగణపతిరాజునకుఁ బితామహుఁడు. ఇతనికాలము లో ననఁగా శాలివాహన సం. ౯౯౦ లో నోరుగల్లుపట్టణము కట్టఁబడినది. అపుడు చెవ్విరెడ్డితండ్రి పోలన్న యోరుగల్లునకు వచ్చినట్లుగాఁ గాన్పించును. ఈబిరుదు సంపాదించినవాఁ డితఁడే కానోపును.

3. చలమర్తిగండ — ఈబిరుదు ప్రతాపరుద్రుని వంశమువారిలోఁ బ్రాచీనకాలమునుండి చెల్లుచున్నది. భేతాళరెడ్డి వంశమువారు రుద్ర వంశజులకుఁ జేసినయుపకారవిశేషంబుచే సమానప్రతిపత్తిం జూపుట కీయంబడినట్లూహింపఁబడును.

౪. జల్లిపల్లెవీరక్షేత్రగోభారతీకమల్లా — అనుబిరుదు జల్లిపల్లె యను నొకవీరులుండుస్థలమును జయించుటచేఁ గల్గినది.

౫. సోమకులపరశురామ — అనుబిరుదు చంద్రవంశపుక్షత్రియులను సంహరించుటచేఁ గల్గెను. ప్రతాపరుద్రవంశమును జంద్రవంశమే యగును. భేతాళరెడ్డి యావంశములో నుండువారికి భృత్యుతగానుండెను గావున నీబిరుదు ప్రతాపరుద్రవంశజులకుం గాక తక్కినసోమవంశజులవిషయమై చెల్లునని చెప్పవలసి యున్నది. పైని మనము చెప్పినజగన్నాథరావుకాలమునకుఁ గళ్యాణీపురముదగ్గఱ పశ్చిమచాళుక్యులు మిక్కిలి ప్రబలులుగా నుండి బహుదేశములను స్వాధీనపఱుచుకొని యుండిరి. వారికిని నోరుగంటిప్రభువులకును యుద్ధములు జరిగినందులకు గ్రంథదృష్టాంతములు గలవు. కాఁబట్టి సోమవంశముపేరిటిమఱికొన్ని వంశముల వారిని జయించి స్వప్రభువులకు సహాయ మొనగించె నని చెప్ప నొప్పి యున్నది. అనపోతమనాయఁడు మాదనాయనికాలములో నిది జరిగినది. ఇది శాలివాహన సం. ౧౩౫౦ మొదలు ౧౪౨౦ కాలమువఱకు.

౬. యంబిరుదుగండ —

౭. సర్వబిరుదకుమారసేశ్యాభుజంగ —

౮. ఆమనగంటిపురవరాధీశ్వర — అనుబిరు దానిజగన్నాథరాజు కాఁపురముండుస్థలముంబట్టి కల్గినది.

౯. గజదళవిభాళబిరుదు — కరిఘటలం గొట్టుటచేఁ గల్గెను.

౧౦. గాయగోవాళబిరుదు — శత్రులసంపద నాకర్షించుటచేఁ గల్గెను.

౧౧. కంచికవాటచ్ఛూరకార — అనుబిరుదు కంచికోటతలుపుల నూడఁగొట్టుటచేఁ గల్గెను. ఈకంచిపట్టణము భేతాళరెడ్డినాఁటికిఁ జోళ

చక్రవర్తులకు ముఖ్యపట్టణమై యుండినది. అట్టిచక్రవర్తిని జయించుటకుఁగాను వారికోటతలుపుల బ్రద్దలుగొట్టె నని యర్థము.

ఇదివఱకుఁ గలబిరుదు లన్నియును జెవ్విరెడ్డినాఁటికే కల్గినట్లు కాన్పించును. ఈక్రిందిబిరుదులు చెవ్విరెడ్డియనంతరకాలమువారివలన సంపాదింపఁబడినవి. అందు ఖడ్గనారాయణభుజాబలభీమ, గండభేరుండ, ప్రతిగండభైరవ, శ్వేతకేతన, వైరితలగుండుగండ, ఛండభీమ, మండలీకరగండ, కోటగిరివజ్రాయుధ, అసహాయశూర, గరుడనారాయణభల్లరగండ, రణరంగభైరవ, వైరిగజాంకుశ, రాహుత్తమల్ల, హొన్నిబ్బరగండ, రిపుగజసంచయపంచానన, సామంతరాయగోపాల, రాయరాహుత్త, సింహతలాట, శాత్రవారణ్యగహనదావానల, పట్టుతలాటాంక, రాయవేశ్యాభుజంగ, ఏకధాటీసమర్థ, కోటలగొంగ, ద్విశాఖకరదీపికాబిరుద, పనఘానబనవశంకర, పరరాజన్యదౌర్జన్యశ్వసనగ్రసనాత్యుగ్రనాగబిరుద, భల్లరగండయనుబిరుదులు చారిత్రోపయోగములు కావు. ఇఁకఁజారిత్రోపయోగము లయినవాని నీక్రింద వివరించెదము. ఇక్కడికి బిరుదుల సంఖ్య ४౧.

४౨. కాకతీయరాజ్యస్థాపనాచార్య—అనునది గణపతిదేవునకు సేనానిగా నుండినప్రసాదిత్యునివలన సంపాదింపఁబడినది. గణపతి దేవుని యనంతరము రాష్ట్రములోఁ గల్గినయుపద్రవముల నివారించి యతని భార్యను రాజ్యమున నిల్పుటచేఁ గల్గెను.

४३. రాయపితామహబిరుదు— ఇది ప్రసాదిత్యుఁ డనుప్రభునికాలములోఁ గల్గినది. గణపతిదేవుని యనంతరము ప్రతాపరుద్రుని బాల్యమున రాష్ట్రవ్యవహారము గణపతిదేవునిభార్య యగురుద్రమమహాదేవి చేయుచు వచ్చెను. ఆమెకు నీప్రసాదిత్యుఁడు మంత్రియై యుండి రుద్రమహారాజునకు విద్యాబుద్ధులు గఱపుచు నాతనిచేఁ దాత తాత యని పిలువఁ బడుటచే రాయపితామహుఁ డనుబిరు దందెను.

౨౨. మత్స్యప్రతిపద్మనాయకగోత్రవందనీయుఁడు. ఇది మొదట ప్రతాపరుద్రునిచే వెలమలకు గౌరవము కల్గించుటచేత నతనికిని అనంతర మట్టియౌదార్యమునఁ గులమువారిని సంరక్షించుటచేత నతనివంశజుల కునుగూడఁ జెల్లుచుండును.

౨౩. కోటగిరివజ్రాయుధనాగార్జునపురకోటసాధక. మాహురీపుర క్షేత్రశత్రునివారణ, వేములకొండస్థలవైరిరాజజీమూతపవన, ఏక శిలానగరసమీప క్షాత్రవరాజన్యగహనదహన, చెతంపూఁడిమనవిభాళ, హొన్నెగట్టు, కుదిరిగట్టు, మండలీకరగండ—అనుబిరుదులు పైస్థలము లలో నపుడపుడు పౌరుషములఁ జూపుటచేతఁ జెవ్విరెడ్డివంశస్థులవలన సంపాదింపఁబడినవి.

౨౪. | పాండ్యగజకేసరి. | ౧ వీరపాండ్య. ౨ విక్రమపాండ్య.
౨౫. | పంచపాండ్యదళవిభాళ | 3 పరాక్రమపాండ్య. ౪ సుందరపాండ్య.
౫ కులశేఖరపాండ్య అను పాండ్యపంచకమును జయించుటచేఁ గల్గెను.

౨౬. హరిత్తోరణబిరుదము. మట్లాదియిమ్మడను రాజుం బడిమార్చి వానికి బిరుదముగా నున్న పచ్చతోరణముఁ గైకొనుటచేఁ గల్గెను.

౨౭. తిరుకాలరాయరాజ్యస్థాపనాచార్య—తిరుకాలరాజునకు మరల రాజ్య మిప్పించుటచేఁ గల్గెను.

౨౮. మత్స్యనాయకగండ—ఇది మాఁనుగులు ప్రభుని జయించుటచేఁ గల్గెను.

౨౯. కొదమనాయకతలగుండుగండ—కొదమనాయకుని సంహరించుటచేఁ గల్గెను.

౩౦. ధరణీవరాహలాంఛనుఁడు—ఈబిరుదు చాళుక్యులను జయించినపుడు కల్గియుండ నోపును. చాళుక్యులకు ధరణీవరాహలాంఛనబిరుదు చెల్లుచుండెను. సోమకులపరశురాముఁ డనునది చాళుక్యులను జయించుటచేతనే చెల్లెను. పైదాని నీబిరుదు స్థిరపఱుచుచున్నది.

౧౩. హిందూరాయత్రాణబిరుదు— ఈబిరుదము సింధుదేశాధిపతిని సంరక్షించుటచేఁ గల్గియుండును. సింధువునకే హిందని పాశ్చాత్యుల వ్యవహారము.

౧౪. హాత్తిబ్బరగండ—హాత్తు అనఁగాఁ బదియును, నిబ్బర యనఁగా రెండును గలిసి పన్నిద్దఱు రాజుల జయించుటచేఁ గల్గెను.

౧౫. కఠారినారాయణ—కఠారియుద్ధమున నధికుఁడని యర్థము.

౧౬. శ్రీశైలసోపానవిమానమంటపప్రాకారనిర్మాణధురీణుఁడు—ఆంధ్రదేశమున నుండు స్మార్తమతస్థుల కందఱకును మిక్కిలి యుత్కృష్టస్థానమగు శ్రీశైలము విశేషము నిడివి కలదియై జనులకు దుర్గమముగానుండును. దానంజేసి దానికి సోపానాదికము గల్గించి కైంకర్యము చేయఁబడియెను.

౧౭. మూరురాయరగండఁడు—ఇదికృష్ణరాయనిబిరుదు. అశ్వపతి, నరపతి, గజపతులను జయించుటచేఁ గల్గినది. దీనింబట్టి కృష్ణరాయని కాలములోఁగూడ నీచెవ్విరెడ్డివంశజులు విశేషప్రబలులై యున్నట్లూహింపనై యున్నది.

౧౮. జగనొబ్బగండబిరుదు. ఇది యద్దంకసీమకుఁ బూర్వము ప్రభుఁడైనట్టియు, ననపోతరెడ్డి, యనవేమరెడ్డి మొదలగు ప్రసిద్ధరెడ్డి రాజులకుఁ దండ్రియైనట్టియు, శ్రీశైలములోఁ బాతాళగంగకు సోపానాదికైంకర్యము లొనరించినట్టియు నాదివేమభూపాలునిబిరుదు. శత్రులోకమును జయించినవాఁడని దీనియర్థము. ఈబిరుదు వేమభూపునకు సహాయము చేయుటచే నైనను లేక యతనిని సంహరించుటచే నైనను గల్గియుండును. కఠారినారాయణుఁ డనుబిరుదు ఆనవేమరెడ్డితో జరిగినయొక యుద్ధమును సూచించును. కావున రెండవయర్థముఁ జెప్పుటయే లెస్సయైయున్నది.

౧౯. సర్వజ్ఞుఁడు. ఈబిరుదు చెవ్విరెడ్డివంశజులలో సింగమనీనివల నంగైకొనఁబడియెను. ఇది సింగమనీనికిఁ గలవిద్యావైదుష్యాదికముం

బట్టి విద్వాంసులచే సేయఁబడినబిరుద మయి యున్నది. ఈ ప్రభునకు సంస్కృతమునఁ గావ్యనాటకాలంకారములలోన నద్భుతమగు పాండిత్యము గలదని యీతనిచే రచియింపఁబడిన సింగభూపాలీయమును, రూపకపరిభాషయుఁ జూచిన గోచర మగును. ఇతనియాస్థానము విద్యాస్థాన మనియు, నితనిదగ్గర మెప్పువడయుట శిన కెట్లు తటస్థించు ననియు, శ్రీనాథునియట్టి కవీశ్వరుఁడు జంకి తాను సింగమనీనిసభకుం బోవునపుడీక్రిందిపద్యమును సరస్వతిం బ్రార్థించుచుఁ జెప్పెను.

సింగమనీనిసర్వజ్ఞత్వస్థాపన కది మిక్కిలి ప్రామాణికవచనమై యుండును గావున దాని నీక్రింద వివరించెదము.

సీ. దీనారటంకాలఁ దీర్థమాడించితి, దక్షిణాధీశు ముత్యాలశాల
పలుకుతోడై తాంధ్రభాషామహాకావ్య, నైషధ గ్రంథసందర్భమునను
బగులఁగొట్టించి తుద్భటవివాదప్రౌఢి, గౌడడిండిమభట్టుకంచుఢక్క
చంద్రశేఖరక్రియాశక్తి రాయలయొద్దఁ, బాదుకొల్పితి సార్వభౌమబిరుద
గీ. మెటుల మెప్పించెదో నన్ను నింకమీఁద, గావుసింగన్నభూపాలు ఘనవిశాలు
నిండుకొలువున నెలకొని యుండి యిప్డు, సరససద్గుణనికురుంబ శారదాంబ.

ఈ శ్రీనాథుఁడు సంస్కృతములోని విద్వాంసపథ మగు నైషధమును, నయఃపిండ మని ప్రసిద్ధి కెక్కిన కాశీఖండమును దెనిఁగించి యాంధ్రగీర్వాణసాహితీసార్వభౌముఁ డని రాయలయాస్థానమున బిరుదం దినవాఁడు. అట్టి శ్రీనాథునకు నురనగాహ మగుసాహిత్యదుర్గము గలసింగమనీనికి సర్వజ్ఞబిరుదు చెల్లిన నేమివింత యున్నది? ఇతనిగ్రంథములును నితనియితరవిశేషాదికములును రావువంశచారిత్రములో యథోచితస్థానంబునఁ బ్రకటించెదము.

ఉం. వెలిగోటుగురాయఁడు — ఈబిరుదు శ్వేతచ్ఛత్రమును బట్టించుకొనుటచేఁ గలిగినది.

ఉ౧. నాగార్జునకోటనికటప్రకటవికటావళి రెూబళ రాజరాజీవగజరాజు — అనుబిరుదావళి రెూబళరాజును జయించుటచేఁ గల్గినది.

౬౨. వేంకటగిరిపురనిర్మాణాలంకర్మీణ——అనుబిరుదు తన్నామకపట్టణనిర్మాణమువలనం గల్గినది. ఇది కట్టినపిమ్మట నిందుండు ప్రభులకు వేంకటగిరివా రనియును, సంస్థానమునకు, వేంకటగిరిసంస్థాన మనియు నామంబులు గల్గినవి. వెలుగోటివా రనుగ్రహనామము ప్రాచీన మగుటం జేసి యీనామము గ్రంథస్థముగఁ గాన్పించును.

౬౩. సారెయోబళరాజరాజ్యస్థాపనాచార్యబిరుదు. ఇది సారెయోబళరాజునకుఁ బోయినరాజ్యమును మరల నిప్పించుటచేఁ గల్గెను.

౬౪. కవికల్పద్రుమబిరుదు——ఇది భానుమతీపరిణయమును గృతి నందినరాయప్పనాయునికిఁ గల్గి యున్నట్లుగా నాగ్రంథములోఁ గాన్పించు. ఈరాయప్పనాయనికిం గలబిరుదులు మఱికొన్నిటిని గూడఁ జేర్చి యొకపద్య మాగ్రంథమునందు వర్ణింపఁబడినది. దాని నీక్రింద వివరించెదము.

సీ. ఘనజయశ్రీభావకలిమి నెవ్వనివీర,నారాయణాంక మున్నతి వహించు
హితమహానందచిత్తతఁ దాల్చి యెవ్వాని, గండగోపాలకాంకంబు మెఱయుఁ
దతసింహబలసమున్నతిచేత నెవ్వాని, యాహవభీమాంక మతిశయిల్లు
సకలార్థసంధానచాతురి నెవ్వాని, యర్థిమందారాంక మమరి యుండు
గీ. నతఁడు నుతిఁ గాంచు రాయచౌహత్తిమల్ల, రాజవేశ్యాభుజంగ ధరావరాహ
గాయగోవాళకేళాదిరాయబిరుద, రమ్యగుణహారి వెలుగోటిరాయశౌరి.

అని యిం దుదాహరింపఁబడినబిరుదు లెవ్వి యనఁ ౧ వీరనారాయణ ౨ గండగోపాల ౩ ఆహవభీమ ౪ అర్థిమందార ౫ రాయచౌహత్తిమల్ల ౬ రాయవేశ్యాభుజంగ ౭ ధరణీవరాహ ౮ గాయగోవాళ, ౯ కేళాదిరాయ అని మఱియొకచో హిందురాయసురత్రాణుఁ డనియు నున్నది. ఇట్టిబిరుదులు సంపాదించిన రాయప్పనాయనికాలము నిర్ణయింప నాధారములు తగినవి దొరకుటలేదు. కొన్నికొన్నిదృష్టాంతములచే నితండు శాలివాహన సం. ౧౫౫౦ గలకాలమున నున్నట్లు కాన్పించును.

౬౭. రామరాయ రాజ్యస్థాపనాచార్యుఁ డనుబిరుదు—యాచసూరుఁ డనునీవంశజునిచేతను రమారమి రాయప్పనాయని కాలమునాఁడే సంపాదింపఁబడినది.

ఇంతవఱకును జెప్పఁబడినబిరుదములు స్వదేశప్రభువులవలన నాది జగన్నాథరావువంశజు లగువేంకటగిరి, పిఠాపురము, బొబ్బిలి మొదలగుసంస్థానములవారు సంపాదనము చేసినవియై యున్నవి.

అటుపిమ్మట తురష్కులకాలములోను, హూణప్రభుత్వములోను సంపాదించినబిరుదములు నవీనములు గావున వారివంశచారిత్రములో వ్రాయఁదలఁచి యిప్పటి కిది వ్రాయ విరమించెదము.

శ్రీ ర స్తు.

# క వి జీ వి త ము లు.

## 2.

## న న్న య భ ట్టు.

ఇతఁడు తాను రచియించిన భారతప్రథమపర్వములోఁ దనవృత్తాంత మీక్రిందివిధముగ వ్రాసి యుంచె నదెట్లన్నను:—

సీ. తనకులబ్రాహ్మణు ననురక్తి నవిరళ, జపహోమతత్పరు విపులశబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది, నానాపురాణవిజ్ఞాననిరతుఁ
బాత్రు నాపస్తంబసూత్రు ముద్గలగోత్ర, జాతు సద్వినుతావదాతచరితు
లోకజ్ఞు నుభయభాషాకావ్యరచనాభి, శోభితు సత్ప్రతిభాభియోగ్యు
ఆ. వె. నిత్యసత్యవచను మత్యమరాధిపా, చార్యు సుజను నన్నపార్యుఁ జూచి
పరమధర్మవిదుఁడు వరచళుక్యాన్వయా, భరణుఁ డిట్టు లనియెఁ గరము ప్రీతి.

అనుదీనిం బట్టి చూడ నీనన్నయభట్టు, ౧ రాజునకుఁ గులబ్రాహ్మణుఁ డనియును, ౨ జపహోమతత్పరుఁ డనియును, ౩ శబ్దశాసనబిరుదాంకితుఁ డనియును, ౪ వేదాభ్యాసి యనియును, ౫ ఆపస్తంబసూత్రుఁ డనియును, ౬ ముద్గలగోత్రుఁ డనియును, ౭ బ్రహ్మాండాది పురాణములు తెలిసినవాఁ డనియును, ౮ లోకజ్ఞానము గలవాఁడనియును, ౯ ఉభయభాషాకావ్యరచనాశక్తియుతుం డనియును దేలుచున్నది.

వీనిలో మొదటివిశేషముంబట్టి రాజవంశానుక్రమముగ నాశ్రయించియున్న పురోహితుఁ డనియును, రెండవదానింబట్టి యాజ్ఞికతంత్రమున సమర్థుఁ డనియును, మూఁడవదానింబట్టి వ్యాకరణవేత్తయనియును, అందులో నుపాధ్యాయత్వముంగూడ సంపాదించినవాఁ డనియును, నాల్గవదానింబట్టి సాంగవేదవేది యనియును, అయిదవదానింబట్టి పౌరాణికశ్రేష్ఠుం డనియును, తొమ్మిదవదానింబట్టి ఆంధ్రగీర్వాణకావ్యరచనాదక్షుం డనియును నిశ్చయ మగుచున్నది.

ఇట్టిబిరుదము లుండుటంబట్టి యితఁడు కేవలవైదికవృత్తిలో నున్నట్లును, కావున వైదికశాఖలోని బ్రాహ్మణుఁ డనియును కొందఱూహించెదరు. కాని "లోకజ్ఞు" అని యితఁడు చేసియున్న ప్రయోగముంబట్టి యితఁడు లౌకికుఁడుగూడనై యుండవచ్చు నని తోఁచుచున్నది. పూర్వకాలములో లౌకికవైదికవ్యాపారములు లౌకికులవలననే జరిగింపఁబడినట్లుగా గ్రంథములవలనం గాన్పించెడిని. ఇపుడు మనము మాటలాడుచున్న నన్నయభట్టుకాలమునాఁటికి వైదికు లని ప్రకృతమునఁ బిలువంబడుచున్న బ్రాహ్మణశాఖ వేఁగిదేశమునకు వచ్చియున్నదా? లేదా? అని యూహింపవలసినదిగా నున్నది. అట్టిస్థితిలో నన్నపార్యుఁ డదివఱకు దేశములో రాజాస్థానములయం దుండి లౌకికవైదికకార్యములను నెఱవేర్చుట కేర్పడినని యోగిశాఖలోనివాఁడు గాక తదనంతర మొకటిరెండుశతాబ్దముల కీదేశమునకు వచ్చినవైదికశాఖలోనివాఁ డెట్లగు నని యోజింపవలసి యున్నది. అప్పటిచాళుక్యరాజులతో నీదేశమునకు వచ్చియుండు బ్రాహ్మణులు తమప్రభువులతోపాటు పశ్చిమదేశస్థులే అయియుండవలయును. తమప్రభువు లగుచాళుక్యులు మహారాష్ట్రదేశములో బీజపూరుసంస్థానములోని దగు 'కళ్యాణి' పురమునుండి వచ్చియుండిరి. అక్కడిప్రభుఁడు సత్యాశ్రయవల్లభుఁ డనియు నతనితమ్ముఁ డగుకుబ్జవిష్ణువర్ధనుఁడు తూర్పుదేశమును జయించుటకుఁగానువచ్చి వేఁగిదేశమాక్రమించుకొని పాలించినట్లును అతనిసంతతిలోనివాఁడే పైపద్యములోనిచళుక్యాన్వయాభరణుఁ డగురాజనరేంద్రుఁ డనియును రాజనరేంద్రచారిత్రములో వివరింపఁబడినశాసనములవలన విస్పష్టము కాఁగలదు. మహారాష్ట్రదేశములోనిపశ్చిమఖండమునుండి వచ్చినరాజులకు వంశానుగతమైనపురోహితులుగానుండువారు ఆదేశమునం దుండెడువారు గాక నవీనరాజ్యమగునాంధ్రదేశములోనివారలై యుండరు గదా. రాజనరేంద్రుని కాలమునకుఁ బశ్చిమచాళుక్యశాఖ అంతమగుటం జేసి కావలయును. వారిస్వాధీనములో నుండెడుదేశ మంతయు ననఁగాఁ గొంకణదేశము చివరవఱకును నీరాజనరేంద్రునిస్వాధీనములో నున్నట్లుగాఁ

గాన్పించును. (కొంగదేశపురాజకాల్ అనుచారిత్రము చూడవలెను.) అందుచేతఁ బైరాజనరేంద్రుఁడు తఱుచు పశ్చిమదేశమందే నివసించియుండె ననియును, అతని కాదేశస్థులే మంత్రులుగాను పురోహితులుగాను నుండి రనియును నూహించుట న్యాయమైనట్లు కాన్పించెడిని. కావున నన్నయభట్టారకుఁడు నక్కడివాఁడుగానే కాన్పించును. అతనికి నాదేశస్థులలోవలె లౌకికవైదికములు రెంటియందును బరిశ్రమ యుండ నోపును. అంతమాత్రమున నతనిని కేవలము వైదికశాఖలోని వాఁడని చెప్పంజాలము. భట్టనుశబ్దము మహారాష్ట్రదేశములోనివిద్యావంతు లగుబ్రాహ్మణులకుఁ గల్గెడునొకబిరుదు. ఇట్టిబిరు దున్నంతమాత్రముచేత నీపైబిరుదుగలవారందఱును వైదికశాఖలోనివారే అని చెప్ప నొప్పియుండదు గదా !

ఇపుడు మనము మాటలాడుచున్న కాలములోఁ గేవలవైదిక వృత్తిలో నుండువారు సంస్కృతభాష నొక్కదానినే నేర్చికొనునట్లును, లౌకికవృత్తిలో నుండువారుమట్టుకుఁ దప్పక రాజకీయభాషయు దేశభాషయు నగుటచేత నాంధ్రభాష నభ్యసించి యందు విశేషముగఁ బాండిత్యము కుదిరినచో దానిలోఁ గొన్నిగ్రంథములు రచియించి యాభాష యెడల మిక్కిలి యభిమానము గలవారలై యున్నట్లు కనుపించును. నేఁటికిని లౌకికములోఁ బ్రవేశింపఁదలఁచుకొనువారలే రాజకీయభాషలోఁ గృషి చేయుదురు గాని కేవలవైదికవృత్తి నుండఁగోరువారు కారు. అట్టిస్థితిలో లౌకిక మనుమాటయే చెవులఁబెట్టని పూర్వకాలములో ననగాఁ బదివందలసంవత్సరములక్రిందట లౌకికులు గాఁ గోరనివారలు రాజకీయభాషలో గ్రంథము రచియించువఱకును గృషి చేసియుందు రనుట యుక్తిసహమై యుండదు. మఱియును వేఁగిదేశములోని కిట్టిరాజకీయ భాషాపండితులు మొదట వచ్చుకాలమునకు నీయాంధ్రభాష సామాన్యస్థితిలో నున్నట్లు కాన్పించును. అప్పటికిఁ బ్రసిద్ధములైనగ్రంథములు లేవు. ఉన్నవైనను పదియిరువదిపుటల గ్రంథములుగాని అధికములు గావు. భాషయు నంతగా శిక్షితమై యుండకపోవచ్చును. ఇట్లుండఁగా రా

జును, తద్రాజకీయోద్యోగులును, కొన్ని దినములైనపిమ్మట దేశభాషయే రాజకీయభాషగాఁ గావలసినయగత్యము తటస్థించినప్పుడు ఆంధ్రదేశ భాషనుగూడ విశేషముగ వృద్ధి నందించినట్లు కాన్పించును. కావుననే మన కిపుడు తెనుఁగుభాషలోని ప్రాచీనగ్రంథము లని చెప్పఁబడునవి యన్నియు నించుమించుగా నీ చాళుక్యరాజులకాలములోనివే యయి యున్నవి. అంతకును బ్రాచీనము లగుగ్రంథములు దొరకుటయే లేదు. పైగ్రంథములను రచియించినవా రందఱును లౌకికవ్యాపారములలోఁ బ్రవర్తించువారును వారిసంతతివారునునై యున్నారు. నేఁటినఱకును నదేసంప్రదాయము ననుసరించి యాంధ్రకవిత్వముఁ జెప్పువారు తఱుచు గా లౌకికవిద్యాభ్యాసకులే అయి యున్నారు.

పూర్వకాలములో నిట్టి లౌకికు లీదేశమున కొక్కుమ్మడిగ వచ్చి యుండిరి. అప్పటిలో నీదేశ మంతయు జైనాక్రాంతమై యుండెను. కావున నప్పటిలో నీదేశమునకు వచ్చినయీలౌకిక బ్రాహ్మణులకు జైనులచే వృత్తిస్వాస్థ్యము లీయఁబడినవి. కావున వీరు వైదికవృత్తితోఁ జేరిన వ్యాపారములుగూడఁ దామే నడుపుచు వచ్చినవారైరి. అనంతరకాల ములో వైదికు లీదేశమునకు వచ్చినతరువాత పైలౌకికులు వైదికవృత్తి తోఁ జేరినజీవనము వదలుకొని కేవలలౌకికజీవనమే ప్రధానముగాఁ గల వారైరి. అప్పటినుండియు నీవైదికలౌకికశాఖాభేద మేర్పడినది. ఇట్టిశా ఖాభేదము లేర్పడినవిధ మంతయు నాదేశచారిత్రములో వివరింపఁబడి యున్నది కావున దాని నిట వ్రాయ నవసరము లేదు.

ప్రస్తుతము మనము వ్రాయుచున్న నన్నయభట్టును పైవిధమున లౌకికవైదికములను నడుపుట కేర్పడినశాఖలోనివాఁ డని తెల్పి యనం తర మతనివృత్తాంతము మఱికొంత వివరించెదము. దీనిసంప్రదాయము గ్రంథాంతరములోఁ జూడఁదగు నని చెప్పెదము.

పూర్వులలో లౌకికశబ్దవాచ్యు లగునియోగులుగూడ భట్టుశబ్ద ముంచి వ్యవహరించినాదులకుఁ బ్రయోగము గలదు. అది యెట్లనగా—

"గీ. వ్రాయ మింతకు మిగులఁ గైవాలుకుండఁ, గాశికాఖండ మనుమహాగ్రంథ మేను
దెనుఁగుఁ జేసెదఁ గర్నాటదేశకటక, పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి."
శ్రీనాథుని కాశీఖండము.

అనియున్నదికాని యీశ్రీనాథుఁడు నియోగియే యగునా? అని యూహింపఁగా నాగ్రంథాంతములోని యాశ్వాసాంతగద్యము పైసందేహమును నివారించును. ఎట్లన్నను:—

"ఇది కమలనాభపౌత్త్ర మారయామాత్యపుత్త్ర సుకవిజనవిధేయ శ్రీనాథనామధేయ ప్రణీతము" అనియున్నది. కావున నీతఁడును నియోగిబ్రాహ్మణుఁ డనియే నిశ్చయమగుచున్నది గదా. దీనింబట్టి శ్రీనాథునికాలమువఱకును నియోగులు వైదికవృత్తిలో నున్నవారమాత్యాదినియోగబిరుదావళులం గైకొనక యున్నట్లును, లౌకికవ్యాపారములోఁ దిరుగువారుమాత్రమే అమాత్యాదిశబ్దముల గ్రహించుచున్నట్లును గానుపించును. దీనింబట్టియే శ్రీనాథుఁడు తనతాతపేరు వ్రాయుచు "కమలనాభతనూభవ" అనిమాత్రమే వ్రాసెను. ఈకమలనాభుఁ డొకగొప్పయాంధ్రకవి. అయినను లౌకికవృత్తిలో లేఁడు గావున నమాత్యశబ్దముంచి చెప్పలేదు. ఇంతియకాక 'నన్నయ' "తిక్కయ" అనునామములుగూడ మహారాష్ట్రభాషాసాంకర్యము గలవని చెప్పుటచేఁ బైని మనము చేసినయూహాలు మఱియును బలపడునవియై యున్నవి.

నన్నయభట్టు భారతమును దెనిఁగించుట.

పైసీసపద్యములో వివరించినప్రకారము రాజనరేంద్రుఁడు నన్నయభట్టును సగౌరవంబుగాఁ జూచి యీక్రిందివిధంబుగఁ జెప్పెను. ఎట్లన్నను:—

"క. జననుతకృష్ణద్వైపా, యనమునివృషభాభిహితమహాభారతబ
ద్ధనిరూపితార్థ మేర్పడఁ, దెనుఁగున రచియింపు మధికధీయుక్తి మెయిన్."

అని యానతిచ్చిన నన్నయ తనలో నిట్టుగా యోజించెను. అదెట్లన్నను:—

" చ. అమలినతారకాసముదయంబుల నెన్నను సర్వవేదశా
స్త్రములయశేషపారము ముదంబునఁ బొందను బుద్ధిబాహుని
క్రమమున దుర్గమార్గజలగౌరవభారతవాహినీసము
ద్రముఁ దఱియంగ నీఁదను విధాతృనకైనను నేరఁబోలునే."

అని నన్నయభట్టారకుఁడు తనలో నూహించుకొని ప్రభువు కోరిన కార్యము నెఱవేర్చుట విధి యని నిశ్చయించుకొని ప్రభువు నుద్దేశించి నీయనుమతంబున విద్వజ్జనంబులయనుగ్రహంబునం జేసి నా నేర్చువిధంబున నీకావ్యము రచియించెద నని యిష్టదేవతావందనం బొనర్చి సంస్కృతకవు లగు వాల్మీకివ్యాసాదుల నుతియించి తక్కినపండితసమాజము నీక్రిందివిధంబున నుతియించెను. ఎట్లనఁగా :—

చ. పరమవివేకసౌరభవిభాసితసద్గుణపుంజవారిజో
త్కరరుచిరంబులై సకలగమ్యసుతీర్థములై మహానునో
హరసుచరిత్రపావనపయఃపరపూర్ణములైనసత్సభాం
తరసరసీవనంబుల ముదం బొసరన్ గొనియాడి వేడుకన్."

ఇంతియ కాని యీకవి తనకుఁ బూర్వు లగునాంధ్రకవుల నుతించియుండ లేదు. అంతమాత్రముచేత నతనికిఁ బూర్వు లగునాంధ్రకవులు లేరని చెప్పఁగూడదు. పెక్కండ్రు ప్రసిద్ధాంధ్రకవులు గలరు. ఉన్నను వారిని నుతియింపక యుండుటయే ఆ కాలపుఁగవులయాచారముగాఁ దోఁచెడిని. భీమకవి గాని, భాస్కరకవి గాని, తిక్కనసోమయాజి గాని తమకుఁ బూర్వు లగునాంధ్రకవుల నుతించినట్లు కానుపించదు. కాని ఎఱ్ఱాప్రగ్గడనుండి యీపద్ధతి మాఱునుఁబడినది. అతఁడైనను నన్నయభట్టారకుని, తిక్కనసోమయాజినిమాత్రము హరివంశములో నుతియించెను. అందు నన్నయభట్టు నీక్రిందివిధంబుగఁ బేర్కొనియెను. ఎట్లన్నను.—

" ఉ. ఉన్నతగోత్రసంభవము నూర్జితసత్త్వము భద్రజాతిసం
పన్నము నుద్ధతాన్యపరిభావిమదోత్కటముం నరేంద్రపూ
జోన్నయనోచితంబు నయి యొప్పెడు నన్నయభట్టకుంజరం
బెన్న నిరంకుశోక్తిగతి నెంతయుఁ గ్రాలుటఁ బ్రస్తుతించెదన్ ".

శ్రీనాథకవియు నన్నయభట్టు నీక్రిందివాక్యంబున భీమఖండంబున నుతియించెను. ఎట్లన్నను:—

"క. నెట్టుకొని కొలుతు నన్నయ, భట్టోపాధ్యాయసార్వభౌముని గవితా
పట్టాభిషిక్తు భారత, ఘట్టోల్లంఘనపటిష్ఠగాథ ప్రతిభున్".

ఇటులనే ఆంధ్రకవు లందఱును నన్నయభట్టును నుతియించిరి.

## నన్నయభట్టారకుని గ్రంథరచనాప్రతిజ్ఞ.

నన్నయ తాను రచియింపఁబోవు గ్రంథమున నీక్రిందివిధమున శపథంబుఁ జేసెను:—

"ఉ. సారమతిం గవీంద్రులు ప్రసన్నకథా కవితార్థయుక్తిలో
నారసి మేలు నా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెలుంగున న్మహా
భారతసంహితారచనబంధురుఁ డయ్యె జగద్ధితంబుగన్".

## సహాయుఁ డగు నారాయణభట్టు.

అని చెప్పి తాఁ జేయ దొరఁకొనినపైగ్రంథరచనలోఁ దనకు సహాయుఁడుగాఁ దగిననారయణభట్టునుగూడఁ జేర్చుకొని గ్రంథరచనకు గడఁగెద నని చెప్పెను. ఎట్లన్నను:—

ఉ. పాయక పాకశాసనికి భారతఘోరరణంబునందు నా
రాయణుఁ డట్లు తానును ధరామరవంశవిభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయధురంధరుఁడుఁ దన కిష్టుఁడుఁ సహా
ధ్యాయుఁడు నైనవాఁ డభిమతంబుగఁ దో డయి నిర్వహింపఁగన్".

దీనింబట్టి నన్నయభట్టారకునితోపాటుగ నారాయణభట్టారకుఁడును మనయాంధ్రభాషాభ్యాసకులకు నాధార మైనభారతగ్రంథములోని మొదటిమూఁడుపర్వములలోను నన్నయ యెట్లాప్రగ్గడలవలె ముఖ్యుఁ డై నాఁడు. కాని యితనిచేత రచియింపఁబడినభాగము లివి యని తెలియకపోవుటచేతను, అతనికవిత్వ మెట్లున్నదో చెప్పఁజాలము. కాని మొదటిమూఁడుపర్వములోనిదినన్నయభట్టుకవిత్వమా ? అని సంశయింపఁ దగినకొన్నిపద్యములు సామాన్యశైలితో నున్నవి కానుపించును.

కొన్ని ఘట్టము లటులనే యున్నవి. అవి యీనారాయణభట్టుకవిత్వము
లోనివై యుండనోవును. అటుగాకున్న నన్నయభట్టారకుఁ డీతనివిషయ
మై చేసినస్తోత్రముంబట్టి మంచిశైలితో నుండినపద్యములే అతనివై సా
మాన్యశైలితో నుండునవియే నన్నయభట్టుకవిత్వములోనివి కానోవు
ను. అటుగాకున్న రామాయణ మాంధ్రీకరించుకవులు కొన్ని కాండము
లొకరును మఱికొన్ని కాండములు మఱికొందఱును పంచుకొని రచియిం
చినట్లు నిర్ణయించి గ్రంథము వ్రాయుచు నది ముగియకమునుపే నన్న
యభట్టునకుం గలిగినమనోవైకల్యముంబట్టి యాగ్రంథమంతయు యథా
యథలై పోఁగా నాయుద్యమ మంతటితో ముగియఁగా నదివఱకు
సిద్ధమైనగ్రంథము నన్నయభట్టారకునిపేరిటనే ప్రకటింపఁబడి యుండ
నోవునుఁ అటుగానిచో నారాయణభట్టుపేరుమట్టుకు వ్రాయఁబడి
పిమ్మట నతనివలనఁ జేయంబడినసహాయము వివరింపఁబడక యుండునా?
అట్లుండదు. ఉన్నను లేకున్నను మన మావిషయముంగూర్చి చర్చించిన
లాభ మేమి? కావున దానిని వదలుదము.

## భారతాంధ్రీకరణము

ఈకథ సంప్రదాయజ్ఞ మతానుసారముగ వ్రాయంబడును. ఎట్లన్న
నను:—వేఁగిదేశములోని రాజమహేంద్రవరపురీ రాజమహేంద్రుం డ
గురాజరాజనరేంద్రుఁడు ఆంధ్రదేశములోని వేఁగినాఁడు (ప్రస్తుతపుగో
దావరిజిల్లా) ను పాలించుచుండెను. అతఁ డొకదినంబునఁ బొడమినకుతు
కంబున నిజసభాభ్యంతరంబున కేతెంచి పండితశిరోమణులం గాంచి భా
రతామ్నాయంబుఁ దెనుఁగున భాషాంతరీకరణం బొనర్పఁ దగువార
లేవార లనిన సభ్యులందఱును వాగనుశాసనుం డగునన్నయభట్టారకుం
డుదక్క నట్టిమహత్తరకార్యంబున కొరులు చాల రనిన నారాజశిఖా
మణి యగుఁగాక యనియెను. ఇట్లని వాగనుశాసనుం బిల్చి పూజించి
కర్పూరతాంబూలకనకచేలంబు లిచ్చి మీరీమహనీయకార్యమునకు
నియ్యకొనుం డని పల్కెను. పల్కిన నన్నయ యత్యానందంబునఁ

"బంచమవేదం బగుభారతంబును దెనిఁగింపఁ గంటిని ధన్యుండ నైతి" నని యెంచి రాజుం గాంచి యట్లనే కావించెద నని దానిఁ దెనిఁగింప నుపక్రమించెను.

## అథర్వణాచార్యుఁడు.

ఇటుల నారంభించి తొలుత నాదిపర్వంబును బిమ్మట సభాపర్వంబును దెనిఁగించెను. ఆరణ్యపర్వంబు రచియించుతఱి నథర్వణాచార్యుం డనునొకపండితోత్తముఁడు తాను భారతముఁ దెనిఁగించి విష్ణువర్ధనునకుఁ గృతి యిచ్చుటకు వచ్చి తత్సంస్థానపండితుం డగునన్నపార్యుం జూడఁ జనుదెంచెను. వచ్చి తనరాక నెఱిఁగించిన నాతఁడు తానును భారతమును దెనిఁగించుచుంటం జేసి యాతనికవిత్వ మెట్లున్నదో చూతమని యతనిభారతంబున నొకపద్యంబుఁ జదువు మనుడు నాతఁడును నట్ల కావించెను. అంతట నన్నయ యాతనిసంగ్రహానైపుణికి మిగుల నచ్చెరువంది తనమనంబున నిట్లు చింతించె. "ఈతనిభారతంబు మన రాజు చూచెనేని మిగుల సంతసించును. ఇంతటితో మద్గ్రంథంబు పరిసమాప్తి నొందును. అట్లైన నాగౌరవంబు కొంచె మవును. ఏదియేని యొకయుంకిలి గావించి రాజు దీనిం జూడకుండునట్లు చేయవలెను. ఈసమయములో నీతఁడు దొలంగినఁ గొంత మేలగును. మఱల నీతఁడు వచ్చునంతకు నేఁ జేయుభారతము పూర్ణంబు సేసి రాజునకుఁ జూపెదను" అని యూహించి యాపండితుం గాంచి యెల్లి రాజదర్శనంబున కరుగుదము. నేఁడు విడిదలకుఁ జనుం డని యాతనిం బనిచి యాతఁడు విడిసిన యింటివారల రావించి వారలకుఁ గొంతధన మొసంగిన వారలు "దేవరయాజ్ఞ సేసెదము. కర్తవ్యంబు సెలవిం డనుడు వారల కాతఁ డిట్లనియె. "రేపటిదినం బాకవి యింట లేనిసమయంబున మీయింటికిఁ జిచ్చిడుఁడు. దానిచే నతనిపొత్తంబులు సెడును." అనిన వారలు సమ్మతించిరి. తా నామఱునాఁ డాపండితునికడకుం జని యాతనిఁ దోడ్కొని రాజమందిరద్వారంబు చేరెను. అచ్చట వీరిరువురును ముచ్చటలాడు

చుండిరి. ఇచ్చట నాయింటివారలు ధనంబునకు లోఁబడి తమయింటికి నగ్ని సొనిపిరి. ఇట్లు గృహంబు పరశురామున కర్పణంబు నేసి రోదనంబు సేయుచు వీరలు రాజదర్శనార్థంబునకుఁ బోవునట్లు తత్సింహద్వారంబుకడ కేతెంచి యచ్చట ముచ్చటించుచున్న వారల కావృత్తాంతంబు దెలిపిరి. దాని వినినతోడనే యథర్వణుండును నాగ్రహమ్ము మోఁది కొనుచు శీఘ్రంబ యచ్చోటు వాసి యిలు సేరి దగ్ధంబులైనతనపాత్రంబుల మొత్తంబులఁ జూచి యందు స్వకృతభారతంబు నుండుటకు మిగుల వగఁగుంది యోర్వలేమిచే నచటిపండితు లీదుస్తంత్రంబు గావించి రని యెంచి "నా కీర్తియపకృతి నొనరించినవారును నాకుం బోలె సర్వైహికఫలంబులకు వెలి యయ్యెదరు" మని దుర్వారక్రోధంబున శాపం బొసంగి యిఁకఁ బ్రతికియున్న నేమిఫలం బని యెంచి తా నాయగ్నిం బ్రవేశించి మసి యయ్యెను. ఇదియే నన్నయకు మతిచాంచల్య కారణము. నన్నభట్టునకు మతిచాంచల్యకారణంబు కొందఱిచే నింకొకవిధంబునఁ దెలుపంబడును. ఎట్లన:—

## భీమకవిశాపవిషయము.

ఈతఁ డరణ్యపర్వంబు దెనిఁగించుచుండ వేములవాడభీమకవి కోపంబున నన్నయభట్టింకను నరణ్యంబున నే రోదనంబు చేయుచున్నాఁడా? ఇతఁ డెవ్వఁడును నట్లే యుండుఁగాక అని శాపం బిచ్చె ననియును, దానిచే నాతని కప్పటినుండియు మతిభ్రమణంబు గల్గె ననియును నందురు. కారణంబు లేకయే భీమన యాతనికి శాపం బిచ్చె ననుట సహేతుకంబుగ నున్నది కాదు. గ్రంథంబులు మఱికొన్నిటింబట్టి చూడ వీరలకు విరోధ మున్నట్లుగఁ గాన రాదు కాని స్నేహిత మున్నట్లు మాత్రము గానవచ్చుచున్నది. భీమనఛందము:—

నన్నయభట్టు వేములవాడభీమకవిని వర్ణించినపద్యము :—

చ. మతిఁ, బ్రభ, నీగిఁ, జేర్మి, సిరి, మానము సొంపున భీమునిన్ బృహ
స్పతి, రవిఁ, గర్ణు, నర్జును, గపర్ది, సుయోధనుఁ, బోల్పఁ బూన. జా

మతకరి, తైష్ణు, దుష్కృతులు, సమానుషు, భిక్షు, ఖలాత్ముఁ లందు వా
క్సతిపు, శశిక్, శిబిం, గొమరుసామిని, మేరువు, నధ్గిఁ బోల్చెదన్.

దీనిచే నన్నయకు భీమకవియెడ విశేషగౌరవ మున్నట్లు గానస
య్యెడిని. ఇట్లుండ భీమకవి కీతనియెడ భేదబుద్ధి యుండునా? యనిమా
త్రము సంశయము పుట్టుచున్నది. ఈ యిర్వురికిం గొన్నిసంవాదములై
వారిగ్రంథంబులు వీరు వీరిగ్రంథంబులు వారును పూర్వపక్షము చేసిన
ట్లున్నది అప్పా డీశాప మీయఁబడలేదు. 'అరణ్యపర్వావశిష్టంబునందు
భీమకవి శాపభయంబున జయంబు గొనఁగోరి 'స్ఫురదరుణాంశురాగ'
యని శంభుదాసుండు నగణం బుంచి మొదటిపద్యము వా... నని
యప్పకవీయము. ఈగణమునే నళోదయమునకు ముందు శ్రీ... సుండు
ను, శివభద్రంబునందు, ప్రణమితి సిరసి యని కవివరుండును ప్రయోగిం
చె ననియును జెప్పియుండెను వానికిఁ గారణంబు లేమియు నున్నట్టు
వ్రాయలేదు. భీమనశాపభయంబున శంభుదాసుం డట్లు వ్రాసె నని
చెప్పిన యప్పకవిపల్కునకు భీమనపై నతని కుండుననూయ తప్పఁ
గారణంబు వేఱు గానరాదు. ఇట్టియసూయకుఁ గారణం బీతనిస్వప్నగ
త వృత్తాంతంబు గాని వేఱేమియు నున్న ట్లీతఁడు చెప్పలేదు. కలఁగొ
నివార్త నమ్మి మనకు దేనిని నిశ్చయించి చెప్పుటకును నలవి కాదు.

## నన్నయభట్టు భారతమును వదలివేయుట.

పైకథనుబట్టి యుధర్వణుని చాపు విని నన్నయభట్టారకుండు
మూర్ఛ నొంది హితులచేఁ దెల్పంబడి కొంతవడికి లేచి యుల్లంబు దల్ల
డిల్ల నిట్లు చింతించెను. "హా! యెంతదుర్మార్గుఁడను! చూచిచూచి
యొక్కతుణాంబుకొఱకనే బ్రహ్మహత్యం గావించితిని. నాతనువుఁ గాల్ప
నే? ఎంతచదివిననేమి? బుద్ధిః కర్మానుసారిణీ యని యుండ మరలింప
నేరితరంబు. ఈతఁడింతవఱకుఁ దెచ్చు నని మొదటనే యెఱింగిన నీలాటి
దుర్ణయకార్యంబు సేయకుందుఁగదా" అని యనేకవిధంబుల శోకా
యమానమానసుండై వ్యాకులపడుచుండెను. ఇదియకదా సజ్జనునకును

మర్జునునకును గల్గుభేదంబు. ఈతఁడు సహజముగ సన్మార్గవర్తనుం డవ్వుటం జేసి ధనంబునకుఁగాఁ బాపోనర్చినచెట్టలఁ దలంచి పశ్చాత్తప్తుం డయ్యెను. ఇట్లు తాఁ జేసినచేతనే మరలఁ జింతింపుచు నన్నపానంబులఁ గొనక పరులకు మొగంబు చూప నోడి వగఁ గుందుచున్న నన్నపార్యు తెఱంగెఱింగి రాజాతనిం జూడ నేతెంచి యోదార్చి గడచినదానికి వగచిన నేమగు నని తెల్పిన నాతఁడు మిగుల జాలినొందె. అపు డాతనితో రాజేంద్రుండు మరల భారతంబు దెనిఁగించి యొకవ్యాసంగంబున నుండుటచేత వంత కొంత మాను ననుచు నాతఁడిట్లనియె. కటా! పంచమహాపాతకప్రధాన బ్రహ్మహత్యాకారి నగు నాకుఁ బంచమవేదం బగుభారతంబు ముట్టుటకైన నర్హత లేదు. వికలం బగునామనం బట్టిమహత్తరకార్యనిర్వహణంబునకుం జాలదు. అని కన్నీరు మున్నీరుగా నేడ్చుచున్న నన్నపార్యుం గాంచి గత్యంతరం బేమనిన రాజున కాతఁ డిట్లనియె.

## రాజు కవులను వెదకించుట.

ఉపాయాంతరంబు సెప్పెద వినుండు. మత్కృతభారతసభాపర్వంబులోని దగు ;——

మ. మదమాతంగతురంగకాంచనలసన్మాణిక్యగాణిక్యసం
పద లోలిం గొని తెచ్చి యిచ్చి నుత ముఖ్యం గాంచి సేవించి రా
యుదయాస్తాచలసేతుశీతనగమధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయుం ధర్మజుఁ దత్సభాస్థితు జగత్పూజ్యప్రతాపోదయున్.

అను పద్యంబు పత్త్రికల లిఖించి దీనిఁ దేశములకుఁ బంపుఁడు. ఈపద్యమునకు సమాన మగుపద్యం బెవ్వఁడు వ్రాయునో యాతఁడె భారతంబును దెనిఁగింప సమర్థుండు. అట్టివాని నారయ భటులను బంపుఁ డనుచు నాపద్యంబు బహుపత్త్రికల లిఖించి దానికిఁ దుల్యం బగుదానిని వ్రాయఁ గవులకుఁ బ్రార్థనాపత్త్రికలు వ్రాసి నానాదేశ దేశంబులకుఁ బనిచిరి.

### తిక్కనసోమయాజి పద్యమునకు వర్ణము చేయుట.

అంతట రాజభటులు పత్త్రికలం గొని సర్వదేశంబులకును జని యచ్చో నున్నకవులకుఁ దమపత్త్రికలం జూపిన వారు స్వశక్త్యనుసారంబుగ వేర్వేఱుపద్యంబుల వ్రాసిరి. వానిం దెచ్చి భటులు రాజునకుఁ జూపిన నాతఁడు వాగనుశాసనునకుం జూపెను. ఆతఁ డేమియు ననకూరకుండె. అంతకుమున్న కాశికాపురంబునకుం జనినభటులు కవుల వెదకుచుఁ బోవంబోవ నొక్కచో వేశ్యాగృహంబు వెడలి విడెం బుమియుచు నావులింపుచుఁ బ్రొద్దెక్కె నని త్వరతో నేతెంచుతిక్కనం గాంచి యెవ్వఁడో జారశిఖామణి యని యెంచి తమత్రోవం[?] జన నుద్యుక్తులగుడు వ్వారిం గాంచి తిక్కన వారి రాక నారసి పత్త్రికంగొని యందున్నవృత్తాంతంబు చూచి యందలి పద్యంబే మరల దానిక్రింద లిఖియిం[?]చి యుమియుచున్నతమలంబున దానికి వర్ణం బిడి తనపేరు చారల కెఱిఁగించి[?] యచ్చోటు వాసి చనియె. రాజభటు లీచిత్రంబు తమయూరుఁ జేరి రాజునకుఁ దెల్పిన నాతఁ డచ్చెరువంది తత్పత్త్రింబుఁ గొని దాని నన్నపార్యునకుం జూపెను. దానిం జూచి యాతఁడు తేని[?] కిట్లనియె. ఈతఁడే భారతంబుఁ దెనిఁగింప సమర్థుఁడు. ఈతనికవనంబును నాదియు నొక్కతీరుననే యుండును. అది యెంతయు నీతఁడు నాపద్యంబ మరల వ్రాయుటంజేసి సూచించెడిని. నీకును గడు నచ్చెరు వగువన్నియుఁ దె[?]త్తు నని యీతఁడు దీనికి వర్ణం బిచ్చెను. కావున నీతని నవశ్యంబుఁ దోడి తేఁజనును. అనుడు నన్నయపల్కు లాలించి యాతనిసునిశితం బగుబుద్ధికి మిగుల సంతసించి పండితులం గాంచి యిట్లనియె. అహాహా మూఢుఁడు. దురవస్థం జెందియున్నను నీతని బుద్ధి యెట్టుల వ్యాపించుచున్న యదియో. “గూఢార్థము కవి యెఱుఁగును” అన్న పండితోక్తి నిజమాయెను. అనుడు నాయార్యు లందఱును నన్నపార్యు ననేకవిధంబుల శ్లాఘించిరి. రాజును పనివిని నిజనివాసంబునకుం జని తిక్కనను రావించునుపాయంబ చింతింపుచుఁ దనమనంబున నిట్లని వితర్కించెను, “ తిక్కనమన మెట్టిదో మన మెఱుంగము. అతఁడు దేశంబుగానిదేశంబున నున్నాఁడు. మన

ము రమ్మనిన నేమనువాఁడో. భటులవలన నాతనివృత్తాంత మంతయు వినియేయుంటిమి. అట్టివన్నె వాఁ డెట్లు స్వాధీనుండగును? కాకున్నఁ జేయునది యేమి?" అని యనేకవిధంబులఁ జింతింపుచు నిద్రించెను.

### రాజునకు స్వప్న మగుట.

ఇట్లు నిద్రించియున్న యా రాజశిఖామణికి స్వప్నంబున నాతని యిష్టదైవంబు సాక్షాత్కరించి ఓయీ! భారతంబుఁ దెనిఁగింపఁ దిక్కనయే సమర్థుండు. ఒకొక్కరును నట్టి మహోత్తర కార్యంబునకుఁ జాలరు. ఆతనిఁ దోడ్తెచ్చి యా కార్యంబు నెఱవేఱుప నియమింపుము. అతఁడును మద్భక్తియుతుండు. నీవు రమ్మనిన వచ్చి నీయభీష్టంబు నెఱవేర్చువాఁడు గాని వేఱుచేయువాఁడు గాఁడు, అని తా నంతర్ధానము నొందె నాపుడమితేఁడు నిద్ర మేల్కాంచి ప్రభాతంబగుటయుఁ గాలోచితకృత్యంబులు నిర్వర్తించి మిగుల సంతసంబున సభాంతరంబున కేతెంచి యచ్చోట నున్న విబుధులకు దనస్వప్నంబు వినిపించెను. వారందఱును నుల్లముల నుల్లసిల్లి తత్స్వప్నఫలంబు విప్పి చెప్పి యిట్లనిరి. ఈ కార్యంబునకు మీ యిష్టదైవంబు మీకంటెను వేగిరింపుచుండ మీరు సంశయింపనేల? ఈశ్వరానుగ్రహంబునఁ గార్యంబు నెఱవేఱును. భగవదాజ్ఞానుసారంబుగఁ గార్యంబు నడుపుఁడు, అనుడు సంతసంబున నట్ల కాక యని యా భూపతి తగుమంత్రులఁ బిలిచి వారి నాతనివెంటఁ దోడ్తేర నియమించి వారితో నొకపసిఁడియుడ్డలయందలంబు నాతనివచ్చుటకుఁ బనిచెను.

### తిక్కనకు స్వప్నమున హరిహరనాథుఁడు దర్శన మిచ్చుట.

ఇచ్చటఁ గాశికానగరంబున నాఁటిరేయిఁ దిక్కనయిష్టదైవం బగు హరిహరనాథుఁడు తిక్కనతండ్రి యగుకొమ్మనామాత్యు నాకలోకనివాసు ముందిడుకొని వచ్చి యాతనికి స్వప్నంబున దర్శనం బొసంగెను. అనంతరము కొమ్మన తిక్కనం జూచి "కుమారా! నీదేవుం డగు హరిహరనాథుండు వచ్చి యిదె నినుఁ గృతార్థుం జేయ నున్నవాఁడు, చూడుము, అనుడుఁ నాతఁడు కన్నులు విచ్చి ముందున్న యద్వయబ్ర

హ్యంబుం గాంచి పులకాంకితగాత్రుండై యంజలి యొనర్చి పురుషసూక్త విధానంబున నాదేవుని వినుతించి రక్షరక్ష జనార్దనయని ప్రపన్నుండై యుండ నాపరమపూరుషుం డాతనియెడఁ బ్రసన్నుండై యోయుపతా! నీభక్తియుక్తులకు నలరితిని. నీజననంబు సార్థకం బయ్యె. నీవు జీవన్ముక్తుండవు. నీనామం బీజగంబున నాచంద్రార్కంబుగ నుండ భారతాన్వయంబుఁ దెనిఁగింపుము.

అనుడు నాతఁడు దేవరయాజ్ఞ యని తలవంచి యున్నంతట భగవంతుఁ డదృశ్యుఁ డయ్యె. అంత నిద్ర మేల్కాంచి యెంతయు సంతసంబున నక్కలనిజాప్తవర్గంబున కెఱింగించి కర్తవ్యంబు విచారించుచుండె.

## తిక్కన భారత మాంధ్రీకరించుటకై యజ్ఞము చేయుట.

అట్లుండఁ గొన్నిదినంబులకు రాజనరేంద్రునిసచివు లేతెంచి తమ రాక నెఱింగించిన నగుంగాక యని యక్కవిశిఖామణి వారి వెంబడిని రాజమహేంద్రవరంబున కేతెంచె. అప్పుడు రాజనరేంద్రుఁడు నాతని కెదురుగఁ జని యాలింగన మొనర్చి సభామంటపమునకుం దోడ్తెచ్చి యున్నతాసనంబునం గూర్చుండ నియమించి యర్ఘ్యపాద్యంబు లొసంగి కర్పూరతాంబూలగంధమాల్యంబు లిచ్చి కుశలసంప్రశ్నంబు గావించి, పిమ్మట నాతనిఁ జూచి మీప్రభావంబు దివ్యంబు సుండీ యని స్వప్నంబుఁ దెలిపిన నాతండును నిజస్వప్న ప్రకారంబు వినిపించె. ఇట్లన్యోన్యకుశలసంప్రశ్నంబుల సంతసించి యుండ నారాజోత్తముఁడు భారతంబుఁ దెప్పించి యం దున్నయట్టి నన్నయకృతంబుఁ జూపి కర్జం బడిగిన నాతం డిట్లనియె. నే నింతదనుక శుద్ధుఁడఁ గాను. సోమరసపానంబున గాని నారసన పూతంబు గాదు. కావున నాకు జన్నం బవశ్య కర్తవ్యంబు. అనుడు వల్లె యని యారాజు ఋత్విక్పురోహితుల నియమించి యధ్వరంబు సేయుం డనుఁడు దిక్కన యజ్వయై క్రతువు పూర్ణంబు సేసి సోమరసపానంబు సేసి యవభృథానంతరంబున భారతంబు దెనిఁగించె. తిక్కన జన్నంబు చేయుటకు వేఱుకారణంబు గల దని

కొందఱు చెప్పికొనెదరు. అది నమ్మ నర్హము కాని దైనను అచ్చట చ్చట లోకంబున వాడంబడుచుంటంబట్టి దాని నిట వివరించెదము. రాజన రేంద్రుండు భారతంబు పూర్ణంబు చేయుటకుం దగు పండితుండు తిక్కన యని నిశ్చయించి యతని ప్రభుం డగు మనుమసిద్ధిరాజుకడ కా పండితుని బంపుటకుం గోరి వర్తమానంబు పంచెను. ఆ మనుమసిద్ధి అట్లనే చేసెద నని తిక్కనను రావించి రాజనరేంద్రునికడకుం బొమ్మనుడు దానికిం దిక్కన సమ్మతింపనందున మనుమసిద్ధి కోపించి నీవు నాయాజ్ఞానుసార ముగాం బోకుంటివేని నీమూతి గొరిగించి తప్పెటలతో నీసుల వెంబడి నూరేగించి యూరివెలపట గుడిసెలో ప్రవేశపెట్టి నీనోటఁ గండశజంపించెద నని చెప్పి భయపెట్టెను. దానికి దిక్కన జంకక యుండినచో మనుమసి ద్ధి యాతనిం బ్రార్థించి రాజనరేంద్రవరంబు బంచి తన్ను నదివఱ కుం బల్కినపల్కులు వృథ గాకుండం దిక్కనచే యజ్ఞదీక్ష నొసంగించినం దిక్కనకు మూతి గొరిగించుకొనుటయుం దప్పెటలతో నూరేగింపబడు యును, గుడిసెలోం బ్రవేశించుటయును, మాంసభక్షణంబును అనుష్ఠము లయ్యెనంట !

ఈకథ పండితసామాన్యముగా వాడుకొనంబడక యుంటచే నీవ ఱకిందం బొందుపఱుపంబడ దయ్యె. ఇవ్వ ఇది రాజనరేంద్రునిసంగా మ నుమసిద్ధి సమకాలీనుం డనువృత్తాంతమును స్థాపించుటకు ముఖ్యసాధన ముగా నుద్ఘోషింపంబడినది. అట్టిసిద్ధాంతమునకుం గల కారణంబు లు నీకథాంతంబున విమర్శమూలముగా వివరింపఁబడి యున్నవి గనుక నిపుడు తరువాతివృత్తాంతంబు వ్రాయుదము.

## — కుమ్మర గురునాథుం డొత్తెచ్చుట. —

“నేను గనసంబు నుడువుచో నన్వయించుచు శాస్త్రంబు వ్రాయం గలయొక పండితుండు వలయును. మీకడ నుండువారిలో నొక్కనిం బంపుం డు” అనినం దిక్కనం గాంచి రాజు మీధాటికిం దగువాని మీరే నుడు వవలయును. అట్టివాని మే మెఱుంగ్చు నున్నను మీయాజ్ఞం దెలిసి తోడి

తెత్తుము అనురాజపల్కుల కాతఁ డిట్లనియె. మత్పితృకృపాతిశయం
బునఁ గల్గిన కుమ్మర గురునాథుం డనువాఁడు మాయూర నున్నాఁడు.
ఆతనిం దోడ్తెం డనుడు వల్లె యని యాతనిం దెచ్చి తిక్కనకుఁ జూపిరి.
దాని కాతఁ డెంతయు సంతసిల్లెను.

## తిక్కనచేయుశపథములు.

అనంతరము భారతముఁ దెనిఁగింప నుద్యుక్తుండై తిక్కన తాను
జేయుశపథంబు లని రాజున కిట్లనియె. నేఁ జేయుగ్రంథంబునకు హరిహర
నాథుఁ డక్క నొరుల నాయకులం జేయను. సంస్కృతభారతంబును
సభాంతరంబున నెన్నఁడును ముట్టను. వచియించుతఱి నెన్నఁడును దడవికొ
నను. అట్లు ప్రమాదవశంబున నొనరించినచో నానాలుక నీ బెడిదం బగు
నడిదంబున ప్రక్కలించెద నని భయంకరంబుగఁ బల్కిన నాసభ్యులు భ
య మంది యాహా! యీతఁడు సార్థకనామ్ముఁడు గానోపును. వల దన
నేమగునో ఊరకున్న నెటు వోయి యెటు లయ్యెడునో యని యనేకవి
ధంబులఁ జింతించుచుండఁ దిక్కన రాజుం జూచి సభామధ్యంబున నొక
కాండపటంబు గట్టింపుఁ డందు నే నుండుదును. అనుడు నాతఁ డట్ల కావించె.
తిక్కన తా నందుఁ బ్రవేశించి యిట్లనియె. నన్నపార్యుండు రచించిన
భారతభాగంబు లిం దుండుటం జేసి యాతనికీర్తియు కృతిపతివగు
నీకీర్తియు నాచంద్రార్కంబై యుండును. కావున నే నామూఁడు
పర్వంబుల ముట్టక నాలవది యగువిరాటపర్వంబును దర్వాత నుం
డుపర్వంబులును దెనిఁగింతు ననుడు నీతనివాక్యంబుల కందఱు నలరిరి.

## గ్రంథరచనావిషయము.

ఈతఁడు సంస్కృతభారతంబు సభాంతరంబున ముట్టకయే తన
యిష్టదేవతాప్రసాదంబున నాశుధారను నిజవాగ్వైఖరి మెఱయ
విద్వజ్జనానుమతి యగునట్లు కవనంబు నుడువ దానిని గురునాథుఁడు
సభామంటపంబునఁ గాండపటసమీపంబునఁ గూర్చుండి యతిత్వరిత
గతి లిఖించుచుండెను. దానిం జూచి సభాసదు లందఱును వ్యాసు

నకు గజవక్త్రుండునుంబోలె గురునాథుఁడీకవికిఁ దగియుండె నని కొనియాడిరి. అనంతర మనుదినంబును నీ గ్రంథంబు దివాభాగంబున నారంభించి దినాంతంబునఁ బరిసమాప్తి నొందించి నిశాంతంబులకు జనుచుండురు. ఇట్లుండి కొలఁది కాలంబులోపల విరాటపర్వంబు, నుద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ, శల్యపర్వంబులు సాంతంబుగఁ జేసి రాజున కొసంగిన నాతఁడును దత్సభాసదులును దిక్కనపదలాలిత్యంబునకును, శబ్దసౌష్ఠవమునకునుఁ గల్పనాచమత్కృతికిని శయ్యానేర్పునకును సంగ్రహాశక్తికిని సందర్భనైపుణికిని నెంతయు సంతసించిరి. మఱికొందఱు సోమయాజి కవనంబు చూచి యోరువలేమిచే నీతఁడు సామాన్యవృత్తంబులఁ గొన్నిటి నేర్చి కాలము గడుపుచున్నాఁడు. ఈతనిబండార మింతియ. విశేషవృత్తంబులవాఁడు గాఁడు. సాహితీపటిమయు నంతమాత్రంబే. దూరపుఁగొండలు నును పన వినమే. అని యాతని నిరసించుచు నచ్చటచ్చట బల్కసాగిరి. అట్టివారిపల్కు లన్నియు నాతనిచెవికి ముల్కులై సోఁకిన నాతఁడు మృదువృత్తంబుల కిది తఱి గా దని యెంచి సౌప్తిక స్త్రీపర్వంబుల రెంటిని కఠినతరవృత్తసమన్వితంబులుగాను సంస్కృతజటిలంబులుగను నొనర్చె. వానిం జూచి యితనికి ఛందంబునఁ గలప్రజ్ఞకు నందఱును నలరిరి. కాని యం దొకరైన నీతనియభిప్రాయంబును దెలిసికొనరైరి. కావున నీతఁడు తనసాహితీపటిమను జూపఁ దలంచి శాంత్యానుశాసనికపర్వంబులు రెండును జెప్పుచో ననేకసంస్కృతజటిలవాక్యంబులు నచ్చతెనుఁగువాక్యంబులను గుప్పించెను. ఆశైలిం జూచి పండితజనంబు లెల్ల నాహారవంబుల నీకవిశిఖామణిసామీప్యంబున కేతెంచి యిట్టికఠినశైలి సర్వజనదురవగాహంబు. పండితపామరజనసుగమం బగు నట్లీవలఁ జెప్పి యిపు డిటు వ్రాయుటకుఁ గారణంబు గానరాదు. అనుడుఁ దిక్కన నవ్వి పండితపామరుల నిర్వుర మెప్పించుట ముఖ్యంబు గావున నే నట్లొనరించితిని కొందఱకు మార్దవంబైనచో రుచ్యంబు. మఱికొందఱకుఁ గఠినంబైనచో నిష్టంబగును. కఠినంబు గోరువారికిఁ గఠినంబుగ నుండుటయే కర్జంబు గదా. కవి వీరి నందఱ సంతుష్టి

నొందింప యత్నింపవలయు. అనుడు నాతిక్కనపల్కు విని ఆహా! దుర్జనుం డెవ్వఁడో యాతనిమనంబు నోనాడె. కార్యంబు దప్పె నని వా రాతనిం గాంచి యినుమునుబట్టి యగ్నికి సమ్మెటపెట్లున్నట్టు దుర్జనుం డాడుపల్కులు గణించి దీని నందఱకును దుర్గమం బవున ట్లొనర్చితిరి. మీబోంట్ల కిది ధర్మమా? ఇంక నైన మీతొంటిపదలాలిత్యంబు గన్గొంటిమేనిఁ గృతార్థుల మయ్యెద మని ప్రార్థింపఁ దిక్కన నవ్వి వారి కిట్లనియె. ఈరెండుపర్వంబులును వేదాంతార్థప్రతిపాదకంబు లవుటంజేసి యిట్లుండ పామరజనదుర్గమంబు లగుపీనిఁ బండితు లెట్లయినఁ బొందుదురు. నేను దొంటిశైలిని మరలఁ గైకొందును. అనుడు మోదితులై వారును బనివినిరి. అనంతరము సోమయాజి యశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రాస్థానిక స్వర్గారోహణపర్వంబులు దొంటికంటెను లలితం బగువచనరచనఁ దెనిఁగించి భారతం బంతయుఁ బూర్ణంబు సేసి రాజున కిచ్చిన నాతఁ డానందాబ్ధిమగ్నుండై యాకవిపారేణ్యు నెంతయుఁ గీర్తించి కనకాభిషేకం బొనరించి గారవించెను.

### తిక్కనసోమయాజి తననాలుకం గోసికొనఁబోవుట.

ఈతిక్కనసోమయాజి భారతంబుఁ దెనిఁగించుతఱి ద్రోణపర్వంబున సైంధవవధప్రకారంబు సంజయుఁడు ధృతరాష్ట్రునకుం దెలిపె నని చెప్పుచో నొకపద్యంబు చెప్పె నందుఁ బద్యాంతంబు స్ఫురింపకుండుటంజేసి "ఏమి సెప్పుదుం గురునాథా" అని తోడన తననుండున్న కాండపటంబు ద్రెస్సి యచ్చటఁ దా నుంచినకత్తి నెత్తి యిదె నానాలుకం గోసికొనెద. నాకిత్తఱి దైవసహాయంబు లేదు. అనుడు నాతనిం జూచి గురునాథుండు తత్పద్యంబు మరలఁ జదివి యిట్లనియె. నా కిందేదియు లోపంబు గానరాదు. కురునాథుం డగుధృతరాష్ట్రునకు సంజయుండు పల్కుపల్కులుగాఁ బల్కితివి. అట్లు నా కన్వయించుటంజేసి వ్రాసితిని. నీ తెగువకుఁ గారణం బేమి? అనుగురునాథుమాటల కెంతయు నలరి హరిహరనాథుకటాక్షంబు మనకుఁ గలుగ వగవ నేల యని తిక్కన మరల గ్రంథంబు వ్రాయఁ దొడంగెను.

### భారతములో నెన్నిక యగుపద్యము.

ఇది పూర్ణంబైనయనంతరము కొందఱు పండితు లాతనిం జూడ నేతెంచి ప్రసంగవశంబున నాతని నతనిభారతంబులోని మిగుల రమణీయం బగుపద్యంబు చదువుం డనిన సోమయాజి విరాటపర్వంబులోని దగు :—

శా. "సింగం బాఁకటితో గుహాంతరమునం జేట్పాటుమై నుండి మా
తంగస్ఫూర్జితయూథదర్శనసముద్యత్క్రోధమై వచ్చునో
జం గాంతారనివాసఖిన్నమతి నస్మత్సేనపై వీఁడె వ
చ్చెం గుంతీసుతమధ్యముండు సమగ్రస్థేమాభిరామాకృతిన్."

అనుపద్యంబుఁ జదివిన వారందఱును దానియందలియుపమాసాదృశ్యలక్ష్మికి నెంతయు సంతసించిరి.

### నన్నయభట్టుకాలనిర్ణయము.

ఇంతవఱకును భారతగ్రంథనిర్మాణమునకుం గలకారణములును అది పూర్తియైనరీతియును వ్రాసియున్నాము. ఇఁకను భారతప్రారంభ మెప్పుడు? భారతశేషమును దిక్కనసోమయాజి పూర్తిచేయుకాలమునకును దానికిని వ్యవధి యెంత యున్న దనుసంగతి యోజింపవలసి యున్నది. అందిపు డీకథయందు భారతకాలమును గూర్చిమాత్రము చర్చింతము. రెండవశంకకు సమాధానము తిక్కనసోమయాజి చరిత్రములోఁ జేయుదము. అందు మొదటిశంకకు సమాధాన మెట్లంటేని.—

ఇది రాజనరేంద్రునకుఁ గృతి యియ్యఁబడిన దగుటచే నతనికాలములోనిదే కావచ్చును. అతఁడు శాలివాహనశకము ౯౪౪ మొదలు శా.సం. ౯౮౫ వఱకును వేఁగిదేశములో నధికారము చేసియున్నట్లు చాళుక్యవంశస్థులశాసనములఁబట్టి స్పష్ట మగుచున్నది. కాని రామానుజాచార్యులు దిగ్విజయమున కాంధ్రాదిదేశములకు వచ్చువఱకును ఆదేశము లన్నియును జైనమతాక్రాంతములై యుండెను. అటుపిమ్మట ననఁగా శా.సం. ౧౦౧౦లకు మీఁదట మరల నీదేశములో బ్రాహ్మణమ

తము వ్యాపక మైనది. రాజనరేంద్రుఁడు వేఁగిదేశము వదిలి దక్షిణదేశము దండయాత్రకుఁ గా వెళ్ళియుండెను.ఆకాలములలో నతని పుత్త్రులు మొదలగువా రీవేఁగిదేశమును బాలింపుచుండిరి. రాజనరేంద్రునిచే నీగ్రంథము ఆంధ్రీకరించుటకుం గోరఁబడుట వేదమతప్రాబల్యమైనకాలములో నని యూహింప ననువై యుండును. అతఁ డాగ్రంథము కొనసాగువఱకును ఈ దేశమున నుండినను నుండకున్నను జీవించియున్నను లేకున్నను నతనిస్థానమునందు వచ్చియున్న నతనికుటుంబమువారు దానిం బూర్తిచేయించుటకు యత్నింపవచ్చును. రాజనరేంద్రునకుం జివరకాలములోఁ జోళదేశముకూడ వచ్చియున్నది. కావున నాచోళదేశమునకు కాంచీపురము ముఖ్యపట్టణమై యుండుటంబట్టియు నచటికి నెల్లూరు సామీప మగుటంబట్టియు నా నెల్లూరిలోఁ దిక్కన సోమయాజివంటిప్రసిద్ధాంధ్రకవి యున్నాఁ డని వినుటచేతను రాజనరేంద్రునిస్థాపకులు తిక్కనసోమయాజికొఱకుఁ బ్రయత్నము చేసియుండవచ్చును. కావున నన్నయభట్టు మృతినొందుసమయమునకు రాజనరేంద్రుఁడు తనకుమారునియొద్దను గాంచీపురములోనైన నుండవచ్చును. అటు గాకున్న నతఁడు కాంచీపురిలోఁ బ్రభుత్వము చేయుచు రాజమహేంద్రవరపుపండితులను తనకడ నుంచుకొని యైన నుండవచ్చును. అట్లు పైపండితులు చేయుచున్నగ్రంథమునకు విఘ్నము రాఁగా రాజనరేంద్రుఁడు గాని, రాజేంద్రచోళుఁ డనునతనిపుత్త్రుఁడు గాని యచ్చటనే దానిఁ బూర్తిచేయుటకు యత్నించి యుండవచ్చును. అట్లైనను గ్రంథము రాజనరేంద్రునిపేరిట నారంభింపఁబడెను. గావున నాతనిపేరిటనే అది పూర్తిచేయించుట కభ్యంతర ముండదు. కాఁబట్టి దేశములో నుండువాడుక ననుసరించి నన్నయభట్టునకు మతిభ్రమణము కల్గునప్పటికీరాజు రాజ్యముచేయుచుండె ననియు, నన్నయభట్టారకుఁడే తిక్కనసోమయాజిని నియమించినాఁ డనియును, నిశ్చయింతము. తిక్కనసోమయాజికాలముంగూర్చి యతనిచారిత్రములో విశేషించి వ్రాయుచున్నా

రము గావున నీకవు లిరువురును ఆసిద్ధాంతము చూచువఱకును సమ కాలీను లని యంగీకరింతము. నన్నయభట్టు వార్ధికావస్థలో నుండవ చ్చును. తిక్కన బాలుఁడై యుండవచ్చును. వారిరువురకును వయస్సు లో నేఁబదియిరువదివత్సరములవఱకును భేద ముండవచ్చును.

—॥ నన్నయభట్టారకునిగద్యము. ॥—

"ఇది సకలసుకవిజనవినుతనన్నయభట్టప్రణీతం బైనశ్రీమహాభా రతంబునందు" అని యున్నది. దీనింబట్టి యితనివంశస్థులవలన సంపా దింపఁబడినగౌరవములు గాని తండ్రిపేరు గాని కానుపించవు. దీనిం జెప్పఁజాలుగ్రంథములును గానరావు. కావున నాయంశ మట్లే యుంచుదము.

—॥ ఆంధ్రశబ్దచింతామణివిషయము. ॥—

ఇది నన్నయభట్టారకునిచే రచియింపఁబడినట్లు చెప్పఁబడినవ్యాక రణము. సూత్రము సంస్కృతము నుదాహరణములు తెలుఁగున నీయం బడినవి. ఈగ్రంథముంగూర్చినసంగతి భారతగ్రంథములో నున్న నన్నయ భట్టువలన దానావఱకుఁ జేసియుండిన గ్రంథములోఁ జెప్పఁబడదాయె ను. ఈగ్రంథములో నావృత్తాంత మేమియుఁ దెలియ వీలులేదు. దీనింగూర్చి కాకునూరి అప్పకవిచే నతనివలన రచియింపఁబడినయప్పక వీయ మనుగ్రంథములోఁ గొన్నియంశములు వ్రాయఁబడినవి. అంత కంటె మన కిప్పుడు పైయాంధ్రశబ్దచింతామణిం జెప్పుగ్రంథములు లేవు. కావున నందు వ్రాయఁబడిన దంతయు నిట వివరించెదము. ఎట్లన్నను :— అప్పకవీయము మొదటియాశ్వాసములో శా. శ. ౧౫౮౨ సరియైనమన్మథసంవత్సరదక్షిణాయనమున శ్రావణబహుళ ౮ శ్రీకృష్ణజ యంతినాఁడు శ్రీకృష్ణమూర్తి స్వప్నంబునఁ గాన్పించి :—

ఉ. ఈ యువతుల్ రమాధరణు లేను బయోరుహపత్త్రనేత్రుఁడన్
నీయెడఁ గూర్మి గల్గి ధరణీదివిజోత్తమ వచ్చినాఁడ స్వ
శ్రేయస మబ్బ నీకు నిఁక సిద్ధము నన్నయభట్టు చెయాంధ్రము
జేయుము మాయనుగ్రహముచేఁ గవు లచ్చెరు వంది మెచ్చఁగన్.

క. వినియును గనియును నెఱుఁగని, ఘనఫక్కిం దెనుఁగు సేయఁగా నెట్లగు నా
కన వలదు దానిలక్షణ, మును నీ కది గలుగుచందమును విను మింకన్.

గీ. ఆంధ్రశబ్దచింతామణివ్యాకరణము, ముందు రచియించి తత్సూత్రములఁ దెనుంగు
బాసచేఁ జెప్పె నన్నయభట్టు తొల్లి, పర్వములు మూఁడు శ్రీమహాభారతమున.

వ. ఆసమయంబున.

గీ. భారతముఁ దెనిఁగించుచుఁ దా రచించి, నట్టిరాఘవపాండవీయము నడంచె
ఛందము నడంచ నీఫక్కి సంగ్రహించె, ననుచు భీముని యెంతయు నడఁచె దాని.

వ. తదనంతరంబ.

ఉ. ఆదిని శబ్దశాసనమహాకవి చెప్పనభారతంబులో
నేది వచింపఁగాఁబడియె నెంతును దానిన కాని నూత్నసం
పాదన లేమిచేఁ దెనుఁగుపల్కు మఱొక్కటి చేర్చి చెప్పఁగా
రాదని దక్షవాటికవిరాజుసుఁ డీనియమంబుఁ జేసినన్.

క. ఆమూఁడుపర్వములలో, సామాన్యుఁడు నుతుపు తెనుఁగు లరసికొని కృతుల్
దాము రచించిరి తిక్కను, ధీమణి మొద లైనతొంటితెలుఁగుకవీంద్రుల్.

గీ. రాజరాజనరేంద్రతనూజుఁ డార్య, సఖుఁడు సారంగధరుఁడు శైశవమునందు
నన్నయ రచించునెడఁ బఠనం బొనర్చి, నన్ను లెవ్వ రెఱుంగ రీయాంధ్రఫక్కి.

క. ఆలోకనుతుఁడు మొన్నటి, కీలకసమ నామతంగగిరికడ నెసఁగెన్
బాలసరస్వతులకు నతఁ, డోలిఁ దెనుఁగుటీక దాని నొప్పఁగఁ జేసెన్.

క. ఆదిని భీమకవీంద్రుఁడు, గోదావరిఁ గలిపె దానిఁ గుత్సితమున నా
మీఁదను రాజనరేంద్ర, క్ష్మాదయితునిపట్టి దాని మహి వెలయించెన్.

క. ఇల నెనుబదిరెండార్యలు, గలిగి పరిచ్ఛేదపంచకంబునఁ దగునీ
విలసితఫక్కి మతంగా, చలవిప్రులకలన నీదుసదనముఁ జేరున్.

క. మును నారాయణధీరుఁడు, తనకు సహాయముగ సంస్కృతము వాగనుశా
సనుఁడు రచియించె దానిన్, దెనిఁగింపఁగ నీకుఁ దోడు నే నిపు డగుదున్.

క. తాతనయును నూత్నదండియు, నీతెనుఁగులలక్షణం బొకించుక యైనన్
జేతఃప్రౌఢిమఁ జెప్పిరి, క్ష్మాతలమున దీని తెలుఁగు గా వవి యెల్లన్.

అని యిట్లు స్వామి అప్పకవిస్వప్నంబునఁ దెల్పి యంతర్హితుండు గాఁగ నామఱునాటిదివసంబున మతంగనగనివాసియగు బ్రాహ్మణుండు పుస్తకముఁ దెచ్చి యిచ్చె నని యున్నది. ఇది కలలోనివార్త యగుటచే దీనిలో యథార్థ మెంతవఱకో యబద్ధ మెంతవఱకో దానిం దెలిసి

కొనుట కలవిగా కున్నది. ఇది కేవలము స్వప్నములోనివార్త యవుటచే తేఁ జారిత్రముగా నమ్మ వలనుపడదు. నమ్మినను నమ్మకున్నను అప్పకవి యిట్లుగా వ్రాయుటకుఁ గారణ మేమియై యుండు నని యూహించెదము. అది యొకకారణమువలన నై యుండునేమో యని యూహింపనై యున్నది. ఎట్లనఁగా:—ఆవఱకుఁ బేరైనను విన బడక యుండు నాంధ్రశబ్ద చింతామణిగ్రంథంబు నీతఁడు తెనిఁగించి వ్యాపింపఁజేసె నని యొకవిఖ్యాతిని సంపాదించుటకై కావలయును. దీని కనువగునట్లుగా నితనివలన వ్రాయఁబడినకథయందుఁ గలపరస్పరభేదములు మనమాటను స్థిరపఱుచుచున్నవి. అందు మొదటిదానిలో నన్నయభట్టు భారతముం దెనిఁగించి భీమనవలన రచియింపఁబడినరాఘవపాండవీయము నడంచి భీమకవి ఛందస్సుగూడ నడఁగించుటకుఁగాను వ్యాకరణమును సంగ్రహించి యుండె ననియు భీమకవి యీవ్యాకరణమును బూర్వపక్షము చేసె ననియును జెప్పెను. దీనింబట్టియే రాఘవపాండవీయ మనుభీమనకృతిని నన్నయభట్టు పూర్వపక్షము చేసెననియు భీమకవి దానికిఁ బ్రతినిధిగా నన్నయభట్టీయ మగువ్యాకరణము పూర్వపక్షము చేసె ననియు స్పష్ట మగుచున్నది. ఇఁక నిర్వురును సమానకక్షివారలే గాని అందేమియును భేదము లేదు. ఇట్టివారి కన్యోన్యము సమానగౌరవమే యుండును గాని హెచ్చుతగ్గు లుండవు. ఇట్లుండఁగా భీమకవి నన్నయభట్టుచే రచియింపఁబడినభారతములో నేది రచియింపఁబడినదో అదియే తెలుఁగునకుఁ జెప్పఁబడవలయును గాని వేఱుపదము సూత్రసంపాదన లేమిం జేసి చెప్పఁబడ గూడ దని నియమంబుఁ జేయుట కల్గునా? ఆహా! ఈయుక్తి యేమి యుక్తముగా నున్నది? భీమకవి యంతయుపండితుఁ డని అప్పకవి యూహించెనో గాఁబోలును? నన్నయభట్టునకు ముందుగ ఛందమును రచియించినభీమకవి నన్నయభట్టీయమును గోదావరిలోఁ గలిపి మరల వ్యాకరణమును రచియింపలేక నన్నయభట్టారకుఁడు రచియించినభారతగ్రంథమును జూచుకొనవలయు ననుట నియమంబుఁ జేసినవాఁ డనుటకంటె గొప్పవింత యేమైనఁ గలదా! అంతటితోఁ బోనీయక "దక్ష

వాటి కవిరాక్షసుఁడు" అని భీమకవికి బిరుదు నొసంగెను. ఈమాట భీమకవి లేనిచో నతనిపరోక్షములో నప్పకవి వ్రాసి జీవించి యుండెంగాని భీమకవి యుండఁగనే వచియించిన నప్పకవి అంతకుపురి చెంతకుఁ బోక యుండునా? ఈప్రసంగ మింతటితోఁ జాలించి యొక్కసంగతిమాత్రము విజ్ఞాపన జేసి యీవృత్తాంతము విడిచెదము. భీమనఛందస్సనుగ్రంథము భీమకవివిరచితము గాక భీమకవియొక్క అగ్రపుత్త్రునివలన రచియింపఁబడినది. అందుల విశేషము లన్నియు నాభీమకవిచారిత్రములో జూడం దగును. భారతానంతరము భీమకవి ఛందస్సు నడఁచుటఁకుగా నీవ్యాకరణము నన్నయ చేసె ననుమాట భారతము రచియించుచున్న సమయములోనే నన్నయభట్టునకు మతి పోయె నని యున్న కథవలన నిరస్త మగుచున్నది.

తిక్కన మొదలగు తొల్లింటి తెలుఁగుకవులు భారతము మూఁడు పర్వములలో నన్నయవలనఁ బ్రయోగింపఁబడిన తెలుఁగుల నరసికొని తాము గ్రంథములు వ్రాసికొని రని యింకొకమాట చెప్పఁబడినది. ఇది పైదానికంటె నద్భుతముగా నున్నది. అప్పకవియభిప్రాయము తిక్కనసోమయాజి నన్నయభట్టునకు శిష్యుం డని చెప్పవలయు నని కాఁబోలును? తిక్కనవృద్ధపితామహప్రపితామహులనుండియుఁ గవిత్వమహత్త్వ గల దని యాతఁ డెఱుఁగఁడు. దీనికి దృష్టాంతము వలయునేని తిక్కనసోమయాజి నిర్వచనోత్తరరామాయణములోని

" సారకవితాభిరాము గుంటూరివిభుని, మంత్రిభాస్కరు మత్పితామహునిఁ దలఁచి "

అనుపద్యము చూచుకొనవలయును. ఇంతియకాక తిక్కనసోమయాజి విరచితము లగుభారతములోనిపదేనుపర్వములును సావధానముగఁ జూచినచో నీసంశయము తొలఁగిపోవుటయేకాక నన్నయభట్టునకు సోమయాజులవలన నేర్చుకొనవలసినయంశములు పెక్కు లుండిపోయిన వని సులభముగ బాలురకుంగూడ బోధయగును. ఇదియునుంగాక రంగనాథ రామాయణము భాస్కరరామా

యణము మొదలగుప్రాచీనగ్రంథములును నన్నయభట్టీయమతానుసారములై యుండెనని అప్పకవి అభిప్రాయమేమో? అట్లనినచో నప్పకవికి నెవరికంటె నెవరు ప్రాచీనులో ఆసంగతి తెలియనే లేదని చెప్పవలసియుండును.

నన్నయభట్టీయమును దెనిఁగింప దొరఁకొనుచున్నాఁడు కావున నప్పకవి కాగ్రంథ మంతఘనముగాఁ గాన్పించుచున్నది. కాని నన్నయభట్టుకాలములో నీగ్రంథమున కంత కాకున్నఁ గొంతయైన గౌరవ మున్నట్లు కాన్పించదు. నన్నయభట్టీయముకంటె నధిక మగునాథర్వణాచార్యుని వ్యాకరణమే ఆకాలములో విశేషవిఖ్యాతితో నుండెను. ఆంధ్రభాషలో నపశబ్దోచ్చారణానంతర మాథర్వణనామస్మరణ చేసినచోఁ దద్దోష పరిహారమగు నని యుండుటంబట్టి నన్నయభట్టు వైయాకరణుఁడుగానే యెవ్వరివలనను గ్రహింపఁబడలేదు. ఇట్లున్నను సర్వకాలములలోను నన్నయభట్టీయమే పూజనీయమై అది తిక్కనమొదలగుమహాకవుల ప్రయోగములకుఁగూడ నాధారగ్రంథమై యున్న దని అప్పకవి చెప్పినందులకుమాత్రము విచార మగుచున్నది.

### సారంగధరుఁడు వ్యాకరణమును బ్రకటించుట.

రాజనరేంద్రునిపుత్త్రుఁ డగుసారంగధరుఁడు నన్నయభట్టీయవ్యాకరణము రచియింపఁబడునపుడు దానిం బఠియించె ననియు దాని నితరులెవ్వరును నెఱుంగ రనియు నప్పకవిమతము. ఇది మఱియుఁ జిత్రముగా నున్నది. నన్నయభట్టు వ్యాకరణమును లోకోపకారార్థము రచియించును గాని యొక్కసారంగధరునికొఱకే అయి యుండదు. గ్రంథము వ్యాపకమే అయినచో మఱికొందఱు గూడ దానిఁ దెలిసికొనక మానరు. ఇదియునుంగాక నారాయణఘీరుఁడు సహాయము చేయఁగా నన్నయభట్టీయము రచియింపఁబడిన దని అప్పకవియే చెప్పియున్నాఁడు. గ్రంథము నష్టమైపోవునపుడు నారాయణభట్టయినను దానిని వ్యాపింపఁ జేయకపోఁడు. సారంగధరుఁ డైనను నీగ్రంథము భీమనచే గోదావరిం

*బడవేయఁబడె నని వినినతోడనే దానిని మరల వ్రాయింపక పోఁడు. కావున నిది యీకాలములో రూపుచెడఁబోయె ననియును, అనంతరకాల ములో ననఁగా నైదాఱువందలసంవత్సరము లైనపిమ్మటను కారణము లేకయే యొక్కఁడికి మాత్రము తెలుపఁబడియెనని చెప్పుట సహేతుకము కాదు.

భీమకవికాలము మొదలుకొని అప్పకవికాలమువఱకును మధ్యను అయిదువందలసంవత్సరములు వ్యవధి యున్నది. ఈకాలములో ననఁగా పై అయిదువందలసంవత్సరములకాలములో నీ నన్నయభట్టీయవ్యాకరణ ము కాన్పించకుండుటకుఁ గారణము విచారించి చూడఁగా నిది భీమకవి వలనఁ బూర్వపక్షము చేయఁబడెననియు, నట్టికారణమున నది అప్పటివా రందఱివలన నుపేక్షింపఁబడె ననియును దోఁచుచున్నది. కాని యీమధ్య కాలములో నాధర్వణవ్యాకరణమే ఆంధ్రభాషకుఁ బఠనీయగ్రంథముగా నప్పటివారివలన గ్రహియింపఁబడినట్లుగా నూహింపఁబడవలయును. ఇట్టి వృత్తాంతము చెప్పుట కిష్టము లేక అప్పకవి పూర్వపక్షగ్రంథ మగునన్న యభట్టీయమును బునరుజ్జీవింపఁజేయునిష్టముచే నిట్టియపూర్వవృత్తాం తము నొకదానిని పన్నె ననియు, నదియు నొకరివలన వింటి నన నది యతనిసమకాలీనుల కైన నమ్మకముగా నుండ దనుతలంపున నట్లు చెప్పె ననియుఁ దోఁచెడిని. నన్నయభట్టుచేఁ బూర్వపక్షము చేయఁ బడినరాఘవపాండవీయ మెట్లుగ నామరూపరహితముగనయ్యెనో అటు లనే భీమకవిచేతను బూర్వపక్షము చేయంబడిననన్నయభట్టీయము నామ రూపరహితమై పోయె నని యొప్పుట కాక్షేపణము లేదు. భీమకవికిని అప్పకవికిని మధ్యకాలములో నున్నవారికవిత్వము లధర్వణవ్యాకరణ మతానుసారు లనుట కనేకదృష్టాంతము లున్నవి. అట్లున్నను అప్పకవి యీగాథను బన్నుటకుఁ గారణము పూర్వపక్షితగ్రంథోజ్జీవనార్థమే కాని మఱియొకటి కా దని స్పష్టమైనది. దీనిచే భీమకవిపై నప్పకవి చేసి ననిందాప్రయోగములును నిష్కారణద్వేషబుద్ధి చూపుటయును స్థిరపడు చున్నవి.

శ్రీ ర స్తు.

# క వి జీ వి త ము లు.

## 3.

## తిక్కనసోమయాజి.

ఇతఁడు భారతములోని పదేనుపర్వముల నాంధ్రీకరించినకవి. ఈతనివలననే యీతనివంశమును గోత్రమును జెప్పఁబడినది. అందొకటి యితనిప్రథమప్రబంధ మగునిర్వచనోత్తరరామాయణములోను, రెండవది భారతములోని విరాటపర్వములోను గాన్పించును. అందు మొదటిదానిలో :—

మ. "అమరోదాత్తమనీషి నే నుభయకావ్యప్రౌఢిఁ బాటించు శి
ల్పమునం బారగుఁడన్ గళావిదుఁడ నాపస్తంబసూత్రుండ గౌ
తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుండ న
న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుఁడఁ దిక్కాఖ్యుండ సన్మాన్యుఁడన్."

అనియును, రెండవదానిలో :—

సీ. "సుజనకుండు సన్మాన్యగౌతమగోత్రి, మహితుండు భాస్కరమంత్రితనయుఁ
డన్నమాంబాపతి యనఘులు కేతన, మల్లన సిద్ధనామాత్యవరుల
కూరిమితమ్ముఁడు గుంటూరివిభుఁడు, కొమ్మనదండనాథుండు మధురకీర్తి
విస్తరస్ఫారుఁ డాపస్తంబసూత్రపవిత్రశీలుఁడు సాంగవేదవేది."

అనియుం జెప్పెను.

పై రెండుపద్యములలో మొదటిదానింబట్టి యాలోచింపఁగాఁ దిక్కనసోమయాజి యజుర్వేదియనియు నాపస్తంబసూత్రుఁ డనియు, గౌతమగోత్రుఁ డనియుఁ దెలియుచున్నది. ఇతనితల్లిపేరు అన్నమ్మ. తండ్రిపేరు కొమ్మన్న, మంత్రిశబ్దముఁ బ్రయోగించుటంబట్టి యితఁడు నియోగిశాఖాబ్రాహ్మణుఁడు అని స్పష్టమే.

## సోమయాజితండ్రి.

ఇఁక రెండవపద్యముంబట్టి యితనితండ్రి యగుకొమ్మనామాత్యుని వృత్తాంతము కొంత తేటఁబడుచున్నది. అందుఁ గొమ్మనామాత్యుఁడు భాస్కరమంత్రికుమారుఁ డనియును, కేతన, మల్లన, సిద్ధన యను మంత్రిశిఖామణుల తమ్ముఁ డనియును, గుంటూరికి అధికారి యనియు, సేనానాయక వృత్తిలో నుండె ననియును పవిత్రస్వభావుఁ డై యుండె ననియును సాంగోపాంగముగ వేదముల నభ్యసించె ననియును గలదు.

## సోమయాజితాత.

తిక్కనసోమయాజితాత యగు భాస్కరుఁడు గుంటూరికిఁ బ్రభుఁ డగునొకసామంతునకు మంత్రిగా నుండె నని యుత్తరరామాయణములోనిమఱియొకపద్యమువలనఁ దెలుచున్నది. కాని యీయన భాస్కరునికుమారుఁ డగుకొమ్మన్న దండనాథుఁడు గా నుండుటచేత నీగ్రామ మతనికి శ్రోత్రియముగా నీయంబడి యుండనోపును.

## సోమయాజివాసస్థలము.

తిక్కనసోమయాజితండ్రియుఁ దాతయు గుంటూరిలో నున్నట్లు కాన్పించుటచేతఁ దిక్కనసోమయాజియును, అక్కడ జనించినవాఁడే అని స్పష్ట మగుచున్నది. ఇట్లుండఁగ నీసోమయాజి నెల్లూరువాస్తవ్యుఁ డని కొందఱిచేతను, గుంటూరుజిల్లాలోని ప్రాటూరుకాఁపురస్థుఁ డని మఱికొందఱిచేతను జెప్పంబడును. నెల్లూరిప్రభుఁ డగుమనుమసిద్ధిరాజు పేరిట సోమయాజి తననిర్వచనోత్తర రామాయణము కృతి యిచ్చుటంజేసియు, భారతము హరిహరనాథునిపేరఁ గృతి యిచ్చుటచేతను నీతఁడు నెల్లూరువాసస్థుఁ డనువాడుక కలిగినది. ఇందు మొదటిగాథనుబట్టి అక్కడ నివాసము స్థిరపఱుప వీలు లేదు. పూర్వము కవీశ్వరులు దేశదేశములు తిరిగి, ఎక్కడ రసికు లగుప్రభువు లుండురో అక్కడఁ గొన్నిదినంబు లుండి యాప్రభుని కొకకృతి యిచ్చి బహుమతుల నంది మరల స్వస్థలమునకుఁ బోవుచుండునాచారము గలదు. అటులనే సోమ

యాజియుఁ జేసియున్నాఁ డని ఆతని రెండవగ్రంథ మగుభారతములో మనుమసిద్ధియాస్థానములోనివాఁడ నని యుచ్చరింపఁబడకపోవుటచేత నిస్సంశయముగాఁ జెప్పనొప్పి యున్నది. ఇఁక రెండవశంకకు సమాధాన మెట్లన్న—భారతములో స్మరియింపఁబడిన హరిహరనాథుఁడు అర్చావతారరూపుఁడై నెల్లూరున వెంచేసి యున్న హరిహరనాథుఁడు కాక కేవలమును నద్వైతుల కుపాస్యుం డగుహరిహరులకు నధినాథుఁ డగునద్వయనిర్గుణబ్రహ్మ మని భారతములోనియాశ్వాసాద్యంత పద్యముల నద్వైతశాస్త్రసంప్రదాయమునఁ జూచిన స్పష్టము కాఁగలదు. కావునఁ బై రెండుయుక్తులును సోమయాజి నెల్లూరుపురవాసి యని చెప్పుటకుం జాలవు. భారతరచనాపూర్వకాలములో సోమయాజి కాశీయాత్రఁ జేయుచుఁ గాశినుండి యీగ్రంథరచనకు వచ్చియున్నాఁ డని చెప్పెడుసంప్రదాయజ్ఞవాక్య ముభయపక్షములలో నిర్బాధకమే అయి యున్నది. పై నుదాహరింపఁబడినపాటూరుగ్రామవాసి యనుదాని నింకొకవిధముగా సమన్వయించెదము. గుంటూరుపురవాసమునకుఁ బూర్వము సోమయాజితండ్రితాతలు ప్రాటూరుగ్రామవాస్తవ్యులు కానోపుదురు. దానింబట్టి యీకుటుంబమువారికి 'పాటూరివారు' అనుగృహనామము కల్గి యుండును. అనంతరము సోమయాజివంశస్థులు లౌకికులగుటచేత వ్యాపారాంతరముల నితరదేశములకుఁ బోయి యుండినను గృహనామముమాత్రము పాటూరివారే అని యుండుట ఆంధ్రదేశసంప్రదాయము కావున వీరికిని నట్లె అయ్యె నని సిద్ధాంతము.

## సోమయాజిచే రచియింపఁబడినకావ్యములు.

ఇతఁడు ప్రథమములో నిర్వచనముగ రామాయణముతోఁ జేరిన యుత్తరకాండముఁ దెనిఁగించెను. దీనినే నిర్వచనోత్తరరామాయణ మని వాడెదరు. అనంతరమున సంస్కృతమహాభారతములోని పదేనుపర్వముల నాంధ్రీకరించెను. కవివాగ్బంధన మనులక్షణగ్రంథముం గూడ రచియించెను.

# ఆంధ్రభారతము.

సోమయాజికృతము లగుప్రసిద్ధగ్రంథములు రెంటిలోపలను భారతగ్రంథమువలన నాతనికవిత్వమహత్త్వము జగద్విదితమైనది. కావున మనము ముందుగ భారతరచనకుం గలకారణములం జెప్పి అనంతరము నిర్వచనోత్తర రామాయణగ్రంథరచనావృత్తాంతమును వివరింతము భారత మాంధ్రీకరించుటలో సోమయాజి యుద్దేశ మితరులవలన నెట్లుగా వాడుకొనంబడినను దాని నంతయు విరాటపర్వారంభంబున నాతని చేతనే వివరింపంబడి యున్నది. దాని నీక్రింద వివరించెదము :—

ఉ. శ్రీ యన గౌరి నాఁ బరఁగు చెల్వకుఁ జిత్తము పల్లవింప భ
ద్రాయితమూర్తియై హరిహరం బగురూపముఁ దాల్చి విష్ణురూ
పాయ నమశ్శివాయ యని పల్కెడుభక్తజనంబు వైదిక
ధ్యాయుల కిచ్చ మెచ్చుపరతత్త్వముఁ గొల్చెద నిష్టసిద్ధికిన్.

వ. అని సకలబ్రహ్మప్రార్థనంబుఁ జేసి తత్ప్రసాదాసాదితకవిత్వతత్త్వనిరతిశయానురూపానందభరితాంతఃకరణుండ నగుచుండి యొక్కనాఁ డిట్లు వితర్కించితి.

శా. విద్వత్సంస్తవనీయభవ్యకవితావేషుండు విజ్ఞానసం
పద్విఖ్యాతుఁడు సంయమిప్రకరసంభావ్యానుభావుండు కృ
ష్ణద్వైపాయనుఁ డర్థి లోకహితనిష్ఠం బూని కావించె ధ
ర్మాద్వైతస్థితి భారతాఖ్య మగులేఖ్యం బైనయామ్నాయమున్.

క. వేదములకు నఖిలస్మృతి, వాదములకు బహుపురాణవర్గంబులకున్
వా దైనచోటులను దా, మూదల ధర్మార్థకామమోక్షస్థితికిన్.

వ. అదియును.

ఉ. ఆదరణీయసారవివిధార్థగతిస్ఫురణంబు గల్గి య
ష్టాదశపర్వనిర్వహణసంభృతమై పెంపొంది యుండ నం
దాదిదొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్.

మ. హృదయాహ్లాది చతుర్థ మూర్జితకథోపేతంబు నానారసా
భ్యుదయోల్లాసి విరాటపర్వ మట నుద్యోగాదులుం గూడఁ గాఁ
బదునేనింటిఁ దెనుంగుబాస జనసంప్రార్థ్యంబులై పెంపునన్
దుది ముట్టంగ రచించు టొప్పు బుధసంతోషంబు నిండారఁగన్.

ఈపైపద్యములలోనికథ సోమయాజి స్వయముగఁ జెప్పినవృత్తాంతము గావునఁ బుక్కిటిపురాణములకంటెఁ బూర్ణముగ విశ్వసనీయము గదా! కనుక దానిం జెప్పెడుపద్యముల వివరించినాఁడను, ఇపు డందులకథా సంగ్రహము వ్రాసెదను, ఎట్లన్న:—తిక్కనసోమయాజి హరిహరనాథ రూపుఁ డగుపరవస్తువును సకలబ్రహ్మవస్తువుగా ననఁగా సగుణబ్రహ్మముగాఁ బ్రార్థనము చేసి యట్టి సగుణబ్రహ్మయొక్క ప్రసాదముచేత లబ్ధమైనకవిత్వతత్త్వనిరతిశయానురూపానందభరితాంతఃకరణుఁ డై యుండి యొక్కనాఁడు తనలో నిట్లుగా నాలోచించుకొనియెను. తొల్లి కృష్ణద్వైపాయను డనంబరఁగువ్యాసమహర్షి లోకహితార్థము ధర్మాద్వైతస్థితికొఱకుఁ బంచమవేద మనంబరఁగు భారతమును రచియించెను. అది పదునెన్మిదిపర్వములుగా నుండును. అందు మొదటిమూఁడు పర్వములను ఆంధ్రకవిత్వవిశారదుం డగునన్నయభట్టారకుఁడు తెనింగించెను. ఇఁక నాల్గవపర్వము మొదలు అనఁగా విరాటపర్వము మొదలు పదేనుపర్వములు జనసంప్రార్థ్యము లౌటం జేసి తుదముట్ట నాంధ్రీకరించుట తగవు. అని ఇట్లు చెప్పుట నావఱకు నొకపండితునిచేఁ దెలిఁగింపఁబడినభాగముంగూడ మరలఁ దాను దెలిఁగించినచో నాతనిభాగము లోకములో వ్యాపింపకయే యుండును; ఆకవినామమును శాశ్వతముగా నుండకపోవు నని యెంచి యందులకు సోమయాజి సమ్మతింపక పోవుటచే భారతము ప్రథమమునుండి ప్రారంభించ లేదని యూహింపనై యున్నది. సోమయాజి పైవిధముగ వ్రాసి గ్రంథరచనాకుతూహలంబున నుండి యీప్రబంధమండలికిఁ గృతిపతి నెవ్వరిం జేర్కొనువాఁడ నని యున్నసమయంబున నతనికిఁ గొంచెము నిద్రవచ్చెను. అపుడొక స్వప్నం బాయె నని దాని నీక్రిందివిధముగ వివరించుచున్నాఁడు. ఎట్లన్నను :—

సీ. "మజ్జనకుండు సన్మాన్యగౌతమగోత్రమహితుండు భాస్కరమంత్రితనయుఁ
డన్నమాంబాపతి యనఘులు కేతన మల్లన సిద్ధనామాత్యవరుల

శ్రీమిత్రుండు గుంటూరివిభుఁడు కొమ్మనదండనాథుండు మధురకీర్తి
విస్తరస్ఫారుఁ డాపస్తంబసూత్రపవిత్రశీలుఁడు సాంగవేదవేది
యర్థిఁ గల వచ్చి వాత్సల్య మతిశయిల్ల, నస్మదీయప్రణామంబు లాదరించి
తుష్టి దీపించి కరుణార్ద్రదృష్టిఁ జూచి, యెలమి నిట్లని యానతి యిచ్చె నాకు.

శ్లో. కి మస్థిమాలాం కిము కౌస్తుభం వా, పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్,
కిం కాలకూటః కిమువా యశోదా, స్తన్యం తవ స్వాదు వద ప్రభో మే.''

వ. అని నీవు తొల్లి రచియించినపద్యము గాఢాదరంబున నవధరించి భక్తవత్సలుం డగుహరిహరనాథుండు నీదెస దయాళుం డై యునికింజేసి నిన్నుఁ గృతార్థునిఁ గాఁ జేయఁ గార్యార్థి యై నాకలోకనివాసి నైననాకుఁ దనదివ్యచిత్తంబునం గలయాకారణ్యంబు తెలియంగునట్టి శక్తి ప్రసాదించి నన్ను నాకర్షించి కొలిపింపుకొని వీఁడె విజయంబు చేయుచున్నవాఁ డనుచుఁ జూపుటయును సవిశేషసంభ్రమ సంభరితహృదయుండ నై యయ్యెలను గలయం గనుంగొని.

అని సోమయాజి తాను హరిహరనాథుని నుతియించినట్లును అపు డాదేవుఁడు తనయెడ దయాళుఁడై:—

క. "పారాశర్యునికృతి యయి, భారత మనుపేరఁ బరఁగు పంచమవేదం
బారాధ్యము జనులకుఁ ద, ద్గౌరవ మూహించి నీ వఖండితభక్తిన్.

గీ. తెనుఁగుబాస వినిర్మింపఁ దివురు టరయ, భవ్యపురుషార్థతరుపక్వఫలము గాదె
దీని కే నియ్యకొని వేడ్క నూని కృతిప, తిత్వ మర్థించి వచ్చితిఁ దిక్కశర్మ''.

అని హరిహరనాథుం డానతియ్యఁగఁ దా నందులకు నియ్యకొంటి నని సోమయాజి తెల్పి:—

ఉ. "కావున భారతామృతముఁ గర్ణపుటంబుల నానఁ గ్రోలు నాం
ధ్రావళి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయసంస్కృతి
శ్రీవిభవాస్పదం బయినచిత్తముతోడ మహాకవిత్వదీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్.''

అని చెప్పెను.

## సోమయాజి స్వకీయ శిష్టత్వమును బ్రకటించుట.

భారతము పంచమవేద మని ప్రసిద్ధిఁ జెందిన గ్రంథము. అట్టిదానిం దెనిఁగించు నవసరములోఁ దనకును దనవంశమునకును గలశ్రేష్ఠత్వమును, దేవతాభక్తి మొదలగువానిని బ్రకటింపక యున్నచోఁ దన గ్రంథము సర్వజనాదరణపాత్రము కా దనుతలంపుతో సోమయాజి

పై స్వప్నసందర్భములో హరిహరనాథుండు తన నుద్దేశించి యీక్రింది విధంబుగఁ బల్కెనని వ్రాసె. ఎట్లన్నను :—

ఉ. వైదికమార్గనిష్ఠ మగువర్తనముం దగ నిర్వహించుచున్
భేదము లేనిభక్తి నతినిర్మలవృత్తిగఁ జేయుచుండి మ
త్పాదనిరంతరస్మరణతత్పరభావముకల్మి నాత్మస
మ్మోదముఁ బొంది కావ్యరసముం గొనియాడుచు నుండు మెప్పుడున్.

అని సోమయాజి తనకుఁ గలవైదికమార్గనిష్ఠ మగుప్రవర్తనమును, హరిహరులయెడ భేదములేక సమభక్తి కల్గి యుండుటయును స్మరియించి తదుభయసగుణమూర్త్యధిదేవత యగుహరిహరనాథునియెడ నిరంతరభక్తి గల్గి యాత్మానందానుభవంబు గల్గి యున్నట్లు చెప్పెను. ఇట్లుగా స్వప్నంబు గల్గినట్లుగ మిషఁ గల్పించుకొని స్వాభిప్రాయప్రకటనము చేయుట పూర్వకవులలో నాచారమై యున్నట్లు కాన్పించును. ఇందులో నప్పకవిస్వప్నమువలె దేశచారిత్రము లేదు కావునను, స్వప్నములో నుపాసకులకుఁ దదుపాసనాదేవతలును, అన్యులకు జాగ్రత్పరిదృశ్యమానప్రపంచవస్తువిశేషంబులు నగపడుట సహజము కావున దానిని నమ్మినను నమ్మకయున్ననుఁ బాఠకులకు బాధక మేమియు లేదు. కాని స్వప్నములను నమ్మి వానిని గ్రంథస్థముఁ జేసినయాంధ్రకవులలో నీతఁడే మొదటివాఁడు. భగవదుపాసనాపరులకుఁ దన్మూలముగ నంతఃకరణపరిపాకము కల్గి యిట్టిభగవదనుగ్రహసూచకస్వప్నంబు లగుటయు విశేషమహాత్ములు లభ్యమగుటయు నైసర్గికములే యని యాస్తికులకు విశేషించి చెప్పవలసినది లేదు. సోమయాజియు నట్టియుపాసనాబలంబున విజ్ఞానసంపన్నుఁడై భారతరహస్యార్థములఁ దెలిసికొని వేదముం బ్రకటించినచతురాననప్రతిష్ఠ నంది యుండె నని చెప్పుటకు సందియము లేదు. ఇట్టిఘనకార్యము నిర్వహించుటచే నీసోమయాజియనంతరకాలములోనిపురాణకవులలో విశేషజ్ఞులు సోమయాజిని జతురాననుఁడే యని నుతియించుచు వచ్చిరి.

హరివంశములో నెఱ్ఱాప్రగ్గడ :—

మ. తనకావించినసృష్టి తక్కొరులచేతం గాదు నా నేముఖం
బునఁ దాఁ బల్కిన పల్కు లాగమము లై పొల్పొందు నా వాణి న
త్తను నీతం డొకరుండ నాఁ జను మహత్త్వవ్యాప్తిం గవిబ్రహ్మ నా
వినుతింతుం గవితిక్కయజ్వ నిఖిలోర్వీదేవతాభ్యర్చితున్.

భీమఖండములో శ్రీనాథకవి.

ఉ. పంచమవేద మై పరఁగుభారతసంహిత నాంధ్రభాషఁ గా
వించెఁ బదేనుపర్వములు విశ్వజగద్ధితబుద్ధి నెవ్వఁ డ
క్కాంచనగర్భతుల్యున కఖండితభక్తి నమస్కరింతు ని
ర్వంచితకీర్తివైభవవిరాజికిఁ దిక్కనసోమయాజికిన్.

—సోమయాజి భారతముం దెనిఁగింప నుద్యుక్తుం డగుట.—

పైనిఁజెప్పినవిధంబుగఁ దిక్కనసోమయాజి సాత్యవతేయసంస్మృతి గలచిత్తముతోడ మహాకవిత్వదీక్ష నంది పర్వ్యంతములం జెప్పి హరిహరనాథు నుతియించి ఆదేవునకుఁ దాను విన్నపము సేయుతెఱంగునఁ దత్సన్నిధిం గల్పించుకొని అమ్మహావాక్యంబున నర్థంబు సంగతంబు చేసెదనని మరల భక్తిపారవశ్యంబునఁ దనహృదంతరంబున నీక్రింది విధంబుగ భజనంబు చేసితి నని చెప్పెను. ఎట్లన్నను :—

క. జలనిధిహిమవద్భూధర, కలితజననకేళికౌతుకవ్యక్తావ్య
క్తలలితసౌందర్యస్ఫుర, దలఘుతను శ్రీసనాథ హరిహరనాథా.

అను నీపద్యములో వ్యక్తావ్యక్తలలితసౌందర్యస్ఫురదలఘుతను శ్రీసనాథుఁడు హరిహరనాథుఁ డని చెప్పుటచేతను దనయుపాస్యదేవుఁడు మహాదేవుం డగుశివుం డని మఱియొకచోఁ జెప్పుటచేతను సోమయాజి యద్వయబ్రహ్మమయుండును, జ్ఞానప్రదుండును తేజోమూర్తియు నగు దక్షిణామూర్తి నుద్దేశించి చెప్పెననుటకు సందియము లేదు. ఇట్టి సంప్రదాయములు మంత్రశాస్త్రరహస్యములు. ఇట్టి తనయుపాస్యమూర్తి సాన్నిధ్యంబు గల్గించుకొని.

వ. దేవా! దివ్యచిత్తంబున నవధరింపుము :—

గీ. కథ జగత్ప్రసిద్ధి గావునఁ బూర్వప, ర్యార్థయుక్తిఁ జేయునట్టియెడల
యత్న మించుకంత యైనను వలవదు, వలసినట్లు చెప్ప వచ్చియుండు.

అని విన్నవించి సోమయాజి గ్రంథారంభంబు సేసె నని యున్నది.

పైపద్యము పరిశీలింపఁగఁ దిక్కనసోమయాజివలనఁ జేయంబడిన మఱియొకనియమము మనచరిత్రమునకు ముఖ్య మగునది బయలువెడలుచున్నది. అదియే లోకములో సోమయాజి భారతముఁ దెనిఁగించుచో సంస్కృతమాతృకను జూడకయే భారతగ్రంథము ఆసుధారను నిరంకుశప్రజ్ఞతోఁ జేసియున్నాఁ డని చెప్పెడుప్రతీతికిఁ గారణ మయి యుండును. ఆయంశ మెద్ది యనఁగా :— భారతకథ జగత్ప్రసిద్ధ మయినది. కావున పూర్వపర్యార్థములను సందర్భింపఁ జేయునప్పుడు యత్న మే మాత్ర మక్కఱ యుండ దనియును, ఇష్టానుసారముగ సందర్భము పొసఁగింపవచ్చు నని చెప్పినవాక్యమే. దీని కర్థము బుద్ధిమంతు లేమి చెప్ప వచ్చునో యూహింపుఁడు. ఇది చదివినయప్పుడు పుక్కిటిపురాణములుగా వాడుకొనఁబడుచున్న తిక్కనసోమయాజికృతప్రతిజ్ఞాదికమున కిది యాధారమై యుండు నని తోఁచకపోదు.

## తిక్కనసోమయాజి వ్యాసుని నుతించుట.

సోమయాజి తనకు భారతకృతనిర్మాత యగువ్యాసమహర్షి పయిం గలభక్తివిశ్వాసములను అవకాశమైనప్పుడెల్ల వివరింపుచుండును. ప్రతి యాశ్వాసమున నాద్యంతములలో హరిహరనాథుని నుతియించినట్లుగనే వ్యాసభగవానునిఁగూడ స్మరియించుచుండును. సోమయాజికి భారతరహస్యార్థములు స్ఫురియించుచో వ్యాసావేశంబు గల్గియుండె నని ప్రతీతి గలదు.

## సోమయాజికిఁ గలశాస్త్రపాండిత్యము.

సోమయాజికి వేదాంతాదిశాస్త్రములందును, సాంఖ్యయోగాదిశాస్త్రములలోపలను గలవిశేషపాండిత్యము శాంత్యానుశాసనికపర్వములను తిక్కనపర్వములలోఁ దత్త్వముం జెప్పెడునితిహాసాదుల వలనం గోచరంబులు గాఁ గలవు. పూర్వోత్తరమీమాంసాశాస్త్రము

లెంతయు నేర్చినవాఁ డని సోమయాజి జైనపండితులతోఁ జేసినసంవాదాదికములవలనం గోచరం బగును. అట్టివానివివరములు గ్రంథస్థములు గాకున్నను, అట్టి సంవాదములవిషయము మాత్రము సోమదేవ రాజీయము మొదలగుగ్రంథములలోఁ గొంత వివరింపఁబడి యున్న దాని నే నీవఱకే ప్రకటించితిని.ఆవృత్తాంతమును వివరించుటకు ముందుగ నద్వైతమతబోధ మాంధ్రభాషలోఁ జేసినయాచార్యులలో సోమయాజియే మొదటివాఁ డని చెప్పవలసి యున్నది. ఆంధ్రులలోఁ దత్త్వరహస్యములరయఁగోరెడునాంధ్రభాషాపండితు లందఱును సోమయాజిమార్గముం దెలిసికొనక యే యితరగ్రంథము లభ్యసింపరు. ఇఁక వేదాంతగ్రంథములు తెనిఁగింప నుద్యోగించువా రందఱును సోమయాజిమార్గము నే యవలంబించి నవీనగ్రంథములు రచియించిరి.

ఇట్టివారిలోఁ బౌరాణికకవు లందఱును దా మాంధ్రీకరించుగ్రంథములలోఁ బ్రసక్తమైనచోటుల నెల్ల మతోపన్యాసములఁ బద్యరూపముగాఁ జేయుచునే వచ్చుచుండిరి. అందులో భారతమును, భాగవతమును, జ్ఞానవాసిష్ఠమును, విజ్ఞానప్రదీపికయును,సీతారామాంజనేయసంవాదము మొదలగుగ్రంథములను రచియించినగ్రంథకర్తలు సోమయాజితోపాటు కేవలమును గురురూపులుగా నాంధ్రులవలన గ్రహింపఁబడినవారై యున్నారు. ఇట్టివారిలోఁ భారత మన్నిగ్రంథములలో నెల్లు ప్రామాణికగ్రంథ మయ్యెనో అటులనే అద్వైతశాస్త్రబోధకు లగుకవులలోఁ దిక్కనసోమయాజియు గౌరవనీయుఁడును, అగ్రగణ్యుఁడును నై యున్నాఁడు. ఇట్టివిశేషములను జూపుటకును కేవలము ఆంధ్రభాషలోపలనే అద్వైతమతబోధము కోరువారికి నుపయుక్తముగ నుండుటకొఱకు పైగ్రంథములన్నిటిలో నుండుతత్త్వవిషయికము లగుభాగముల నెత్తి వేఱే యొకగ్రంథము పర్యాయమున నచ్చు వేయుచున్నాఁడను.

## తిక్కనసోమయాజి కాకతీయ గణపతి మహారాజుం జూడఁబోవుట.

సోమదేవరాజీయ మనుప్రతాపరుద్రవంశచారిత్రము:లోఁ బ్రతాపరుద్రునిమాతామహుఁ డగుగణపతిదేవరాయని దర్శించుటకుఁ దిక్కన

సోమయాజి వచ్చె ననియు నపుడు కొన్ని రాజకీయవ్యవహారములును మతసంవాదములు నడిచె ననియుం జెప్పి యున్నది. ఇట్టివృత్తాంతము లావంశచారిత్రముం దెల్పుగ్రంథములన్నిటిలోపల నేకరీతినే కాన్పించును. ఆగ్రంథములలో నొకటిరెండు ప్రామాణికగ్రంథములుగం గాన్పించును. అందు మొదటిది వచనకావ్యము. ఇది పుట్టి యిప్పటికి ౩౦౦ సంవత్సరములకుం బైంగా నసంగా శా. సం. ౧౧౦౦ సమానకాలములోం బుట్టి యుండును. రెండవది దానికే పద్యకావ్యము. అది పుట్టి ౧౧౨ సంవత్సరములై యున్నది. ఈరెండుగ్రంథములును గోదావరీమండలములోని రహితాపురము రఘుదేవపుర మనునామములతో నొప్పు పట్టణమునకుం బూర్వపుజమీన్‌దారు లగుమందపాటివా రనుక్షత్రియ ప్రభువులవలన సంపాదింపంబడినవి. అందుం బద్యకావ్యము కూచిమంచి తిమ్మకవిసార్వభౌమునితమ్ముం డగుజగ్గకవివలనం బై మందపాటివారిపైం గృతియియ్యంబడినది. పై రెండుగ్రంథములలోపలంగూడం దిక్కనసోమయాజివృత్తాంత మొక్కవిధముగనే వ్రాయంబడి యున్నది. కావున వచనకావ్యములో నున్నదాని నిట వివరించెదను. ఎట్లన్నను :—

"గణపతిరాజేకశిలానగరంబునకు వచ్చి, తనను మరలంబడ్డతమ్ములం బ్రహరించి తాను పట్టాభిషిక్తుండై యోరుగంటికి శిలాప్రాకారంబుగాం గోట నేర్పఱిచి, చేయం గడమవడినదేవాలయంబులను బూర్తిగాం గట్టించి యున్నసమయంబునం దిక్కనసోమయాజి లేతెంచిన గణపతి దేవు లెదుర్కొని పూజించి యతనిచేత భాగవతార్థంబులును, ద్వైతాద్వైతంబులును, చిదచిద్వివేకంబులును, ధర్మాధర్మంబులును, రాజనీతి ప్రకారంబులును, భారతపీఠప్రభావంబులును నాదిగాం గలయర్థంబులు వినుచుండె. అట్టిసమయంబున నొక్కనాండు తిక్కనసోమయాజి యనుమకొండనివాసు లైనబౌద్ధమునులతో వాదించి యనుబదినల్వుగ బౌద్ధమునుల నతిక్రమించె. అనంతర మాగ్రంథములో గణపతిదేవుండు తిక్కనసోమయాజికి నెనిమిదిగ్రామంబులును, నవలక్షధనంబును, స్వర్ణకుండలములును బహుమానంబుగ నిచ్చె."

అని యున్నది. ఈవృత్తాంతము పద్యకావ్యమునంగూడ విశేషభేదము నొందకుండ నున్నది. ఎట్లన్నను :—

"గీ. వచ్చి తనను మఱలంబడ్డతమ్ములను హ, రించి సకలగహ్వరీస్థలికినిం
బ్రాజ్ఞ లెన్నంగాను బట్టాభిషిక్తుండై, వీటికొక్కజాతికోట నిలిపె, ,

గీ. చేయఁ దక్కువ యైన దేవాయతనము, లపుడు పూర్తిగఁ గట్టించి యలరుచున్న
చోట నొకనాఁడు తిక్కనసోమయాజి, వచ్చె నెల్లూరినుండి భూవరునికడకు.

సీ. వచ్చిన నయ్యార్యవర్యు నెదుర్కొని, వినయసంభ్రమభక్తు లినుమడింప
నతిథిపూజ లొనర్చి యతనిచే భారతా, ర్థమును ద్వైతాద్వైతతత్త్వములును
విస్తృతచిదచిద్వివేకలక్షణములు, ప్రకటధర్మాధర్మ పద్ధతులును
రాజనీతిప్రకారంబును భారత, వీరులమహిమంబు వినుచు నుండి

గీ. యనుమకొండనివాసు లైనట్టిబౌద్ధ, మునుల రావించి వారిఁ దిక్కనమనీషి
తోడ వాదింపఁ జేసినఁ దొడరి వాండ్రఁ, జాలకఁ గా సోమయాజులు గెలుచుటయును.

వ. అప్పుడు బౌద్ధదేవాలయంబులు గూలం ద్రోయించి గణపతిదేవరాజు సోమయాజులపటువాక్యశక్తికి మెచ్చి యతని బహుప్రకారం బులఁ బూజించి యెనిమిది గ్రామంబు లొసంగి యతఁడు వచ్చినకార్యం బడిగిన నాభూవరునకుఁ గవివరుం డిట్లనియె. ”

### సోమయాజి మనుమసిద్ధిరాజునకుఁ గలిగినవిపత్తు తెల్పుట.

పైని చెప్పినవిధంబున సోమయాజి బౌద్ధమునులను జయించి గణపతిరాజుతో నెల్లూరునకు ప్రభుండగుమనుమసిద్ధిరాజునకు దాయాదులవలనఁ గలిగినరాజ్యవిహీనతవిధంబు తెల్పెను. ఇట్లు తెల్పి ఆమనుమసిద్ధిరాజుయొక్క దాయాదులఁ బాఱఁదోలి అతనిరాజ్య మాతనికి నిప్పింపుఁ డని చెప్పిన విని గణపతిదేవరా జందుల కంగీకరించి, నవలక్షధనమును, యజ్ఞకుండలములును తిక్కనసోమయాజికి బహుమానమిచ్చి పనిచెను.

### గణపతిదేవునిమంత్రింగూర్చి సోమయాజి రాజుతో ముచ్చటించుట.

ఇట్లు సోమయాజి గణపతిదేవరాజువలన స్వదేశంబునకుఁ బోవుట కనుజ్ఞాతుండై గణపతిదేవునిమంత్రి యగు "శివదేవయ్య" అనునతనిం జూచి గణపతిదేవునితో నిట్లనియె. "రాజా! ఈమంత్రి దేవుండుగాని సామాన్యమనుష్యమాత్రుండు గాఁడు. నీవు రాజ్యభారం బితని యనుమతంబునఁ జేయుట శ్రేయోదాయకము" అని సోమయాజి చెప్పి నిజనివాసంబునకుం జనియెను.

## గణపతిరాజు మనుమసిద్ధిని మరల సింహాసన మెక్కించుట.

ఇట్లు సోమయాజిం బనిచి గణపతిదేవరాజు తినమంత్రి యగు శివదేవయ్యయనుమతిం గొని ప్రయాణభేరి వేయించి చతురంగబలసమేతుం డై దండయాత్రకు బయలువెడలెను. ఇట్లు పోయి ముందుగ వెల్నాటిరాజుం గెల్చి యతనిం దనయాజ్ఞకుఁ లోనుజేసికొని యుప్పనంబులు గొని నెల్లూరిపై విడిసెను. అక్కడ నవు డధికారము చేయుచున్న "అక్కన, బయ్యన," అనుమనుమసిద్ధిరాజుదాయాదు లగువారిని మనుమసిద్ధిరాజును సింహాసనపిహీనుఁ జేసిననేరమునకుఁగాను దండించి, వారిబిరుదములు తనకు ధారణయోగ్యంబులు కా వని వానిని తేరాల రుద్రారెడ్డి యనునొకసామంతునకు ధరియింప నిచ్చెను. ఇట్లు చేసి మనుమసిద్ధిరాజును నెల్లూరునకుఁ బిలిపించి మరల నాతని నారాజ్యమునకుఁ బట్టంబుగట్టి అతనికి స్వాధీనము గానియిరువదినాల్గుదుర్గంబుల సాధించి యతనికి రెండువేలయేనూటగ్రామంబులఁ జెల్లం జేసి, ఒక్క తటాకంబును గట్టించె. ఇట్లుగాఁ జేసి గణపతిరాజు మనుమసిద్ధిరాజుచేఁ బూజితుం డయి తనదేశంబులోని దగుగంగాపురంబునకు వచ్చెను. ఈ కథవలన సోమయాజి కాలములోనిరాజుల కతనియెడ నెట్టిగౌరవము గలదో తెలిసికొనవచ్చును.

### సోమయాజిసంతతి.

ఇంతవఱకును సోమయాజికి మతవిషయములోపలను, లౌకిక విషయములోపలను గలవిశేషములను వివరించినారము— ఇఁక సోమయాజిసంతతిం గూర్చి వివరింపవలసి యున్నది. అట్టిపనికి నిదర్శనములను విస్పష్టముగఁ జూపెడు గ్రంథదృష్టాంతము లెవ్వియుం గానరావు. కాని జ్ఞానవాసిష్ఠము నాంధ్రీకరించినకవి సోమయాజికిఁ దాను సంబంధుఁడ నని కొంత వ్రాసి యుంచెను. దాని నిచ్చో వివరించెదను. దాని నట్లు వివరించుటకుఁ బూర్వము "ఆంధ్రకవిచరిత్రము" అనుగ్రంథములో వివరింపఁబడినయొకగాథ తెలుపవలసి యున్నది. అందులో – తిక్కన

సోమయాజికుమారుం డగుమారనకవి మార్కండేయపురాణముం దె నిఁగించి ప్రతాపరుద్రదేవునిమంత్రి యగునాగయగన్నమంత్రికిఁ గృతి యిచ్చినట్లుగాఁ జెప్పంబడి యున్నది. అందులోనే మఱియొకచోఁ బైనిఁ జెప్పినమారనకవి సోమయాజికుమారుండు కాఁడనియును, మఱియొక తిక్కనామాత్యునికుమారుం డనియును, నొకానొక రనిరి గాని దాని కాధార మేదియుఁ గానరా దని యుండెను. కాని యాగ్రంథములోని సందర్భము చూచినమాత్రముననే మారనకవి సోమయాజికుమారుఁడు కాఁడని స్పష్టముగ నూహింప నయ్యెడిని. తిక్కనసోమయాజికొమారుని పేరు మారన యని వాసిష్ఠరామాయణకవివలనం గాని, మఱియే యితరగ్రంథమువలనం గాని, తిక్కనసోమయాజికృతంబు లగుగ్రంథములవలనం గాని కాన్పింపదు. జ్ఞానవాసిష్ఠరామాయణాంధ్రకవి తనవంశముం గూర్చి వ్రాసికొనుచోఁ దనతాత యగునల్లాడమంత్రి తిక్కనసోమయాజిపౌత్త్రిఁ డగుగుంటూరికొమ్మవిభునికూఁతుం బరిణయ మయ్యె నని చెప్పి యుండెను. దీనివలన సోమయాజి కొక్కకుమారుఁ డున్నట్లు తెలియుచున్నది. కాని యతనిపేరేమో తేలలేదు. ఇఁక మార్కండేయపురాణములోనియాశ్వాసాంతపద్యములో నున్నసందర్భముంబట్టి చూడ నం దుదాహరింపఁబడినమారనకవి తిక్కనసోమయాజికుమారుఁడు కానట్లు స్పష్టమే యగుచున్నది. అందులో :—

"శ్రీమదుభయకవిమిత్త్ర తిక్కనసోమయాజిప్రసాదలబ్ధసరస్వతీపాత్ర తిక్కనామాత్యపుత్త్ర మారయనామధేయ ప్రణీతము"

అని యున్నది. దీనింబట్టి మారనకవి తిక్కనసోమయాజిపుత్త్రుండు గాక అతనిశిష్యుం డగుతిక్కనామాత్యునిపుత్త్రుం డని స్పష్ట మగుచున్నది. కావునఁ దిక్కనసోమయాజి కుమారునిపేరు మనకుఁ దెలియ లేదు. ఇటులఁ దెలియనిదానికై ప్రయత్నము మాని అతనిసంతతివారిలో నెవ్వరిపేళ్లు వసిష్ఠరామాయణకవివలన వివరింపఁబడినవో వానిం జూపుదము.

### తిక్కనసోమయాజికిని వసిష్ఠరామాయణ కవి యగుసింగనకును గలసంబంధము.

పై గ్రంథములోఁ జెప్పఁబడినయొకపద్యమువలన నీకథ యంతయు స్పష్టము కాఁగలదు. కాఁబట్టి ఆపద్యమును దెలిపెదను. అందు సింగనకవి తనతాత యగునల్లాడమంత్రిం గూర్చి వ్రాయుచు నీక్రిందివిధంబుగ వివరించెను. ఎట్లన్నను :—

సీ. అతఁడు దిక్కనసోమయాజులపౌత్త్రుఁడై, కొమరారు గుంటూరికొమ్మవిభుని
పుత్త్రి బిట్టాంబిక బుధలోకకల్పక, వల్లి వివాహమై వైభవమున
భూసార మగుకోటభూమి కృష్ణానదీ, దక్షిణతటమున ధన్యలీల
వలరురావెల యనునగ్రహారముఁ దన, కేకభోగంబుగా నేలుచుండి
గీ. యందుఁ గోవెలఁ గట్టి గోవిందు నెన్న, గోపినాథుప్రతిష్ఠయుఁ గోరి చేసి
అఖిలవిభవంబునందున నతిశయిల్లె, మనుజమందారుఁ డల్లాడమంత్రివిభుఁడు.

అనుసీసపద్యములోఁ బౌత్త్రుఁడని వ్రాసినచోఁ బుత్త్రుఁడని పాఠాంతర ముండిన నుండవచ్చును. ఆంధ్రదేశస్థులలోఁ దఱు మగఁ దండ్రిపేరు కొడుకుల కుంచుట స్వభావముగా నున్నది. తిక్కనసోమయాజి తండ్రిపేరు కొమ్మన పైపద్యములో వివరింపఁబడినతిక్కనసోమయాజి సంబంధి యగునతనిపేరును గొమ్మనయే అచ్చుప్రతులలోఁ బౌత్త్రుఁడని పుత్త్రునకే పడియున్నఁ బడియుండును. ఈమార్పువలనఁ బద్యములోన గణభంగము కాదు. కాఁబట్టి, ఆభాగము "తిక్కనసోమయాజులపుత్త్రుఁడై కొమరారుగుంటూరికొమ్మవిభుని" అని సవరించిన లెస్సయై యుండును. అట్లే సవరించి చదువఁగాఁ దిక్కనసోమయాజికిఁ గుమారుఁడు గుంటూరికొమ్మన యనియు, పౌత్త్రి బిట్టాంబిక యనియును, ఆమెకు నల్లాడమంత్రివలన నయ్యలమంత్రి యనుకుమారుఁడు కల్గె ననియును, నాయయ్యలమంత్రి కుమారుఁడు వసిష్ఠరామాయణగ్రంథకర్త యగుసింగనమంత్రి యనియుం దేలినది. ఇంతకు నధిక మగుగ్రంథములు దొరకకుండుటచేతఁ దిక్కనసోమయాజికుమారునివంశముం గూర్చి వివరింపఁబడ దయ్యెను. దేశాభిమానులీవిషయము నింకను శోధింతురుగాక. సోమయాజికృత

నిర్వచనోత్తర రామాయణముంగూర్చి రామాయణకవులచారిత్రము లోఁ జూడఁదగును.

## తిక్కనసోమయాజికాలనిర్ణయవిమర్శనము.

ఇదివఱలోఁ దిక్కనసోమయాజికాలనిర్ణయము చేయుటకుఁగాను ఆంధ్రకవులచారిత్రములోఁ గొంతయత్నము చేయఁబడినది. కాని అది యొకస్థిరమార్గమును కనుపఱుపనందున నిం దాకాలనిర్ణయమును ముందు విమర్శించి అనంతరము దాని నెట్లు సిద్ధాంతీకరింపవలయునో వ్రాయఁజేసెదను. అది యెట్లన్నను :—

౧. ఆంధ్రకవిచారిత్రములో "కృష్ణామండలచారిత్రము లోని గొల్లడగ్గరా జగు కాటమరాజును, పల్నాటిప్రభు వైనపద్మనాయకుఁడును, గలిసి పశువులబీళ్లకుఁగాను పదుమూఁడవశతాబ్దమందు నెల్లూరిప్రభు వైన సిద్ధిరాజుతో యుద్ధము చేసినట్లును, సిద్ధిరాజుసేనలు కవితిక్కనతమ్ముని కుమారుం డగుతిక్కనమంత్రిచే నడిపింపఁబడినట్లును" చెప్పఁబడి యున్నది. దీనింబట్టి చూడఁగా సోమయాజితమ్మునికుమారుఁడు పదుమూఁడవశతాబ్దములోని వాఁడు కాని సోమయాజి పదమూఁడవశతాబ్దము లోనివాఁడు కాఁడని తేలినది. ౧౨౦౦ ల సంవత్సరము మొదలు ౧౩౦౧ ల సంవత్సరమువఱకును పదమూఁడవశతాబ్ద మగును. సోమయాజితమ్ముని కుమారుఁడు ౧౧౯౦ కలకాలములోఁ బుట్టి ౧౨౦౧ వఱకు ననఁగా ౧౧ సంవత్సరములవఱకును జీవించియున్నను పదమూఁడవశతాబ్దములోఁ జరిగెడుయుద్ధములో నుండవచ్చును. ఆయుద్ధములోనే హతుఁడైన నతఁడు పదమూఁడవశతాబ్దములో యుద్ధములో హతుఁ డయ్యె నని చెప్పఁబడవచ్చును. ఇతఁ డేఁబదిసంవత్సరములవాఁ డని యొకయూహ చేసినారము. అంతకుఁ దక్కువవయస్సులో నుండువానికి బూర్వకాలము లో నున్నతోద్యోగములు దొరకెడునాచారము లేదు. ఏఁబదిసంవత్సరములవయస్సునకుఁ బైవాఁ డే అయ్యెనేని అతనిజననకాలము ౧౧౩౦ లేక ౧౧౪౦ కూడఁ గావచ్చును. ఇది కాక తిక్కనసోమయాజితమ్ముని

కుమారుఁడు పదమూఁడవశతాబ్దమున నున్నట్లు చెప్పినను తిక్కన దానిం బట్టి అతనికి సరిసామీప్యకాలీనుఁ డని యూహింపఁ జాలి యుండను. సోమయాజితండ్రికి సోమయాజి అతిబాల్యంబునం బుట్టి యుండవచ్చును. అతనితమ్ముఁడు సవతితమ్ముఁ డై తండ్రి వృద్ధావస్థలోఁ గల్గి యుండవచ్చును. ఈయిర్వురకును నలుబదిసంవత్సరములవఱకును వ్యవధి యుండవచ్చును. అట్టితిక్కనసోమయాజితమ్మునకు మరల నైదవపదిలోనో లేక ఆఱవపదిలోనో పుట్టియున్న తిక్కనమంత్రి అతని యఱువదవసంవత్సరమున యుద్ధములో హతుఁ డయి యుండవచ్చును. అట్లైనఁ దిక్కనమంత్రిమృతినాఁటికిఁ దిక్కనసోమయాజి జననకాలము నూటయేఁబదిసంవత్సరములకు ముందు గాకున్న నూఱుసంవత్సరములవఱకైన నై యుండును. రెండవపక్షములోఁ గూడ నది శా. సం. ౧౧౭౦ అంతకుఁ బూర్వము అగు ననుటకు సందియ ముండదు. కాని యీపైవృత్తాంత మంతయు నూహాలపైని చేసిన సిద్ధాంతమునకు నట్లుగనే యూహించి యియ్యఁబడిన సమాధానముగా నగును. తిక్కనసోమయాజికిఁ దమ్ముఁ డున్నాఁ డని సోమయాజికృతగ్రంథములలోఁ జెప్పఁబడి యుండలేదు. ఇట్లుగాఁ జెప్పఁబడకపోవుటంబట్టి సోమయాజితండ్రికి సోమయాజి యొక్కఁడే కుమారుఁ డని నిశ్చయింపవలసి యున్నది. తిక్కన మంత్రినాముఁడు కాక దండనాథనాముఁడు వీరివంశములో నొక్కఁ డున్నట్లు గ్రంథము లున్నవి. అతనికే రణతిక్కన యని వాడుక. ఇతనితండ్రి సిద్ధయ. ఈసిద్ధయ సోమయాజికి మూఁడవ పెత్తండ్రి. సిద్ధయకుమారుం డగురణతిక్కన ముప్పదియిద్దఱునియోగులలోఁ జెప్పఁబడిన వాఁడును, వేములవాడభీమకవికాలములోనివాఁడు నైనట్లు నివఱకే యాభీమకవిచారిత్రములోఁ జెప్పఁబడియెను. ఇఁకఁ దిక్కనతమ్మునికుమారుం డగుతిక్కనమంత్రి యున్నట్లు ప్రామాణికగ్రంథములు లేవు గావున దీనింబట్టి తిక్కనసోమయాజికాలము నిర్ణయింపము. ఇది నిర్ణయము కాలేదు గావునఁ దిక్కనమంత్రికిఁ బ్రభుఁడుగానుండినసిద్ధిరాజు తిక్కనసోమయాజులవలన నుత్తర

రామాయణము గృతి నందినసిద్ధిరాజైనట్లును నిశ్చయింపఁజాలము. కావున సోమయాజికాలనిర్ణయ మీమార్గముగఁ గాలేదు.

౨. ఆంధ్రకవిచారిత్రములోనిమఱియొకయుదాహరణమునుబట్టి తిక్కనసోమయాజికుమారుఁ డగుమారన మార్కండేయపురాణమును తెనుఁగించి దానిని ప్రతాపరుద్రదేవునిమంత్రి యగునాగయగన్నమంత్రికిఁ గృతి యిచ్చెఁ గావున దానింబట్టి తిక్కనసోమయాజికాలము నిర్ణయించెద మని చెప్పి యున్నది. ఇంతమాత్రమునఁ దిక్కనసోమయాజికాలమునిర్ణయింప వలనుపడదు. ప్రతాపరుద్రుఁడనునామమును కాకతీయవంశస్థులలోఁ గొందఱకును, కటకప్రభువులలోఁ గొందఱకును నున్నది. వీరిలో నెవ్వరిమంత్రిగానున్న నాగయగన్నమంత్రికిఁ గృతి యిచ్చెనో తెలియదు. ఎట్లైనను మనదేశములో విశేషవ్యాప్తినాముఁ డగువాఁడెవ్వఁడో అతనిమంత్రియగు నాగయగన్నమంత్రికే కృతి యిచ్చెనని యూహింతము. "M. R. Sewell's Lists of Antiquities" అను న్యూయల్ దొరగ్రంథములో నీక్రింద నుదాహరించినవారు రుద్రనాములై యున్నారు. ఎట్లన్నను:—

| క్రీ. శ. | | శా. సం. |
|---|---|---|
| 1179—77 | = | 1102 లో నొకరుద్రుఁడు. |
| 1179—77 | = | 1120 ,, |
| 1255—77 | = | 1202 ,, |
| 1299—77 | = | 1222 ,, |
| 1310—77 | = | 1242 ,, |

ఇట్లుగా నైదుగురురుద్రు లున్నారు. వీరు గాక పద్మనాయకులవంశావళీశాసనముం జేయించినరుద్రుఁడు మఱియొకఁ డున్నాఁడు. ఇతఁడు శా. సం. ౧౨౧౮ లోనివాఁ డైనట్లా శాసనమువలనఁ గాన్పించును. కోనసీమద్రావిడులకు నగ్రహారములును, స్వాస్థ్యములు నిచ్చినరుద్రుఁడు మఱియొకఁ డున్నాఁడు. ఇతనికాలము శా. సం. ౧౦౮౭. ఇట్లు

గాన్పించునేస్సురురుమ్రిలంలో నెవ్వరివలన నాగయగన్నమంత్రికాలము నేర్పఱుపవలయునో తెలియకున్నది. ఇది యయినపిమ్మట నతనికి మార్కండేయపురాణము గృతి యిచ్చినమారనకవికాలము నిర్ణయింపవలయును. ఇంతశ్రమకు నొప్పికొని మారనకవికాలము నిర్ణయించినచో నామారనకవి తిక్కనసోమయాజికొడుకు గాక తిక్కనసోమయాజిశిష్యుండగుతిక్కనమంత్రికుమారుండైనట్లుగా నీవఱకే చూపించి యుంటిమి. మన మొకవేళ మారనకవికాలము నిర్ణయించినను మొదటియంశములోం జెప్పంబడిన యాక్షేపణలే యిందును డటస్థము లగునుగావున దీనిం బట్టియును తిక్కనసోమయాజికాలము నిర్ణయింప వీలుపడదాయెను. కావున నాంధ్రకవిచారిత్రములో వ్రాయంబడినసిద్ధాంతము మాని తిక్కనసోమయాజికాల మింక నెట్లు నిర్ణయింపవలయు నని శంకించుకొనెదము. దాని కీక్రిందిభాగములోం జేయంబోవునుపన్యాసము సమాధానమై సిద్ధాంతమును స్పష్టీకరించును.

## సోమయాజికాలనిర్ణయము.

తిక్కనసోమయాజి యేకాలమువాఁడైనదియును నిర్ణయించుటకొకటిరెండు మార్గములు గలవు. అందు మొదటిది సోమయాజిప్రభుండగుమనుమసిద్ధిరాజుకాలపరిజ్ఞానము. రెండవది యీరాజుయొక్కగాని, లేక, అతనిపూర్వులగు రాజులయొక్కగాని సమకాలీనుల కాలవిజ్ఞానము. ఈరెండును గానిచోం దిక్కనసోమయాజిసమకాలీనుల కాలములం దెలిసికొనుట గాని లేక కేవలము లోకమునావుకవలనం గల్గెడుకథాజ్ఞానము కల్గించుకొనుట గాని యవలు యుండును. అందులకు ముందు మొదటిదానిలో నీసంశయమును నివారించుస్పష్టగాథలు లేవు. రెండవగాథలో నియంశములు చూచినం గాని దానిలోం గలసంశయములు తీఱవు. కావున రెండవదానిని వివరించెదను. ఎట్లన్నను:—

౧. తిక్కనసోమయాజిలోం గొంచెము సంబంధము గల్గియున్న వాసిష్ఠరామాయణగ్రంథకర్త యగుసింగనకవి తనతాతభార్య తిక్కన

సోమయాజికుమారునికొమార్తె యని చెప్పెను. అటుపిమ్మట సింగన తనతండ్రిం గూర్చి వ్రాయుచు నతఁడు రాజమహేంద్రవరమునఁ బ్రభుత్వముఁ జేయుచున్న తొయ్యేటి అనపోతభూపాలునిమంత్రి యని యీక్రిందివిధంబుగఁ జెప్పెను. ఎట్లన్నను:—

సీ. ఆత్రేయగోత్రపవిత్రు పేరయమంత్రి, పుత్త్రి సింగాంబిక పుణ్యసాధ్వి
వెలయ వివాహమై వేఁగిదేశంబులో నేపారు రాజమహేంద్రపురికి
నధిపతి తొయ్యేటి అనపోతభూపాలుమంత్రి యై రాజ్యసంపదలఁ బొదలి
యొప్పారుగౌతమియుత్తరతటమున మహనీయ మగు పెద్దమునికిగొండను
గీ. స్థిరతరారామతతులు సుక్షేత్రములును, పెక్కు లార్జించి సితకీర్తి పెంపు మిగిలి
యఖిలజగదన్నదాత నా నవనిఁ బరఁగె, మనుగుణధుర్యుఁ డయ్యలమంత్రివరుఁడు.

దీనింబట్టి చూడ నీ అయ్యలమంత్రి అనపోతభూపాలునితో సమకాలీనుఁ డని స్పష్టమే కదా. అనపోతభూపాలుఁడు కొండవీటిసీమలో రాజ్యము చేయువాఁడు. అతనిప్రభుత్వకాలము శా. సం. ౧౨౨౨ మొదలు ౧౨౪౧ వఱకునై యున్నట్లు కొండవీటి రెడ్ల శాసనములవలనం గాన్పించును. ఇది యే అనఁగా శా. సం. ౧౨౦౦ మొదలు ౧౨౫౦ వఱకును, అతనిమంత్రి యగునయ్యలమంత్రికాలముగా నిర్ణయింపవలయును. అయ్యలమంత్రి మొదలు తిక్కనసోమయాజివఱకును పైని చెప్పినవిధమున నైదుగురుపురుషు లైరి. పురుషునకు ముప్పదిసంవత్సరముల చొప్పున నైదుగురికిని నూటయేఁబదివత్సరము లగును. ఇది పన్నెండువందలలోఁ ద్రోసివేయఁగ ౧౦౫౦ శా. సంవత్సర మగును. ఇది తిక్కనసోమయాజికాలమును నిర్ణయించుట కొకమార్గము.

౨. ఇఁక రెండవవిధ మెట్లన్నను:—గోదావరీమండలములోని దాక్షారామదేవాలయముపై నున్న యొకశిలాశాసనములో శా. స. ౧౦౯౮ (SS. 1098+77=1175 AD) లోఁ గాకతీయగణపతిరుద్రుని యెల్లునిదాన మున్నది. దీనింబట్టి కాకతీయగణపతికాల మంతకుఁ బూర్వ మిరువదిముప్పదిసంవత్సరము లైనను నై యుండవచ్చును. ఈ గణపతిరుద్రునికడకే తిక్కనసోమయాజి పోయి యుండె ననియు, నతని

కోర్కెపైని బౌద్ధమునులతో సోమయాజి సంవాదము చేసి యుండె ననియును నీవఱకుఁ జెప్పియుంటిమి. గణపతిరుద్రుఁడు శా. సం. ౧౧౭౯ మొదలు ౧౧౮౫ వఱకును రాజ్యము చేసినట్లు సోమదేవరాజీయ వచనకావ్యమువలనం గాన్పించును. కావున సోమయాజియు నాకాల మువాఁడే యని నిశ్చయింపవలయును. తిక్కనసోమయాజి గణపతి రాజుం జూడఁబోవునప్పటికే భారతముం దెనిఁగించినట్లును, భారతార్థము లతనిసభలో నుపన్యసించినట్లును కానుపించును. సోమయాజి శివ దేవయ్య యనుమంత్రియొక్కగుణవిశేషములు గణపతిరాజునకు బోధించిన ట్లుండుటచేతను, అతనిమూలముగనే రాజకీయవ్యవహార మంత యు నడిపింపు మని సోమయాజి లెస్స చెప్పుటచేతను గణపతిదేవుఁడప్పుడే సింహాసనమునకు వచ్చి యున్నట్లును, అప్పటికే అనఁగా శా. స. ౧౧౭౯ నకే సోమయాజి భారతముం దెనిఁగించినట్లును స్పష్ట మగుచున్నది. ఇట్టిమనయూహాలు పైనుదాహరించినకాలముతో సరిపడి యుండుటం బట్టి న్యాయ్య మగునవిగానే కానుపించుచున్నవి.

3. కాకతీయగణపతి రాజుమంత్రులలో నొకఁడగువాణసవంశపు కన్నమంత్రి వసిష్ఠరామాయణకవి యగుసింగనకవివలనఁ బద్మపురాణోత్తరఖండముం గృతి నందినకందనమంత్రికి నాఱవపురుషుఁడు. వసిష్ఠరామాయణకవి యైన సింగనమంత్రి తిక్కనసోమయాజికి నైదవ పురుషుఁడు. కాఁబట్టి తిక్కనసోమయాజియును కాకతీయగణపతిరాజును సమకాలీను లని చెప్పుట కేయాక్షేపణయును లేదు. సోమదేవరాజీయ మను వచనపద్యకావ్యములరెంటికిని ప్రారంభము మొదలుకొని లోకవందసంవత్సరములు వ్యత్యాసము గాన్పించును. ఆవ్యత్యాసముంగూర్చి కాకతీయరాజవంశచారిత్రములో నాచేత సవిస్తరముగ సంవాదింపఁబడినది గావున నిపు డది యంతయు నీకవిజీవితములలో వ్రాయఁబడక వచన కావ్యములోఁ జెప్పఁబడిన గణపతిరాజుకాలమే సరియైనది యనియును, దానికి నీదృష్టాంతమునే చూపి యుంటి ననియుఁ దెలియఁజేయుచు న్నాఁడను.

౮. చెన్నపట్టణములోని గవర్నమెంటువారి ప్రాచీనపుస్తక భాండాగారములో సి. పి. బ్రౌన్ (Mr. C. P. Brown) దొరవలన మెకంజై కలెక్షన్స (Mackenzie Collections of old Manuscripts) లలో నుండి యెత్తి వ్రాయింపఁబడిన లోకల్ రికార్డ్సు (Local Records) లను స్థలచారిత్రగ్రంథములలో మూఁడవసంపుటము ౩౮౯ పుటలోఁ దిక్కనసోమయాజిమృతికాలమును స్పష్టపఱుచునొకపద్యము కానుపించును. అదెట్లన్నను :—

క. అంబరరవిశశిశాకా, బ్దంబులఁ జను కాళయుక్తిభాద్రపదపుమా
సంబున రవిప్రభావిని, భంబగుశ్రీతిక్కయాజ్వ బ్రహ్మముఁ జేరెన్.

అనునీపద్యములోని "అంబర=౦, రవి=౧౨, శశి=౧ అనుదానిని "అంకానాం వామతో గతిః" అనుగణితశాస్త్రసూత్రము బట్టి లెక్కింపఁగా ౧౧౨౦ తేలును. ఇది శాలివాహనశకము. సంవత్సరనామము కాళయుక్తి. ఇది తిక్కనసోమయాజిమృతివత్సరము. ఈసంఖ్యను ౧౨౧౦ గా లెక్కించి ఆంధ్రకవులచారిత్రములో వ్రాసినది గణితశాస్త్రసంప్రదాయమునకు సరి కాదు. అట్టివత్సరము కాళయుక్తవత్సరము కాదు. రెండంకెలఁ గూర్చి యొక్కటే సంకేతనామము చెప్పఁబడినప్పుడా రెండంకెలకు "అంకానాం వామతో గతిః" అనుసూత్రము పట్టదు. దీనిం దెల్పుటకు మఱియొక్కశాసనోదాహరణముం దెల్పెదను. అది రాజమహేంద్రవరములో మార్కండేయశివాలయమును మరలఁ గట్టించినకాటయవేమారెడ్డిభార్య మల్లాంబ కోనసీమలోని సుల్లనరాగ్రహారదానముం జేసినప్పు డిచ్చినశాసనము. దీనివివరణము రెడ్లచారిత్రములో వ్రాయఁబడినది. ఇపుడు ప్రస్తుతాంశమునకు వలయుశ్లోకమును మాత్ర ముదాహరించెదను. ఎట్లన్నను :—

"శ్లో. శ్రీశాకే గుణ రామ విశ్వ గణితే కార్తికస్యాహ్నిష్టే ఖరే," అని,

ఇం దుదాహరింపఁబడిన శకవత్సరము గుణ=౩, రామ=౩, విశ్వ (౧౩ విశ్వే దేవతలు)=౧౩-దీనిని లెక్కించునపుడు "అంకానాం" అను సూత్రమునకుఁ బైయర్థమే కాకున్న ౩౧౩౩ శాలివాహనశకము

కావలసివచ్చును. ప్రస్తుతములోఁగూడ శాలివాహనశక మింకను ౧౧౨౦ లోపే కావునఁ బైగుణితము సంపూర్తిగా నసందర్భ మని చెప్పక తప్పదు. సోమయాజిమరణమును దెల్పుపద్యములో మనము చేసిన సిద్ధాంతమే సరియగునది యని ఖరసంవత్సరము శా. సం. ౧౩౩౩ అగుటచే స్థిరపఱుచును. అట్లైనచో సోమయాజినిర్యాణము శా. సం. ౧౧౨౦ అగును.

ఇట్లు సోమయాజిమృతికాలము సిద్ధాంతము కాఁగా సోమయాజి జననకాలము దానింబట్టి నిశ్చయించుట అతిసులభమై యుండును. ఇదివఱలో భారతము శా. సం. ౧౦౫౭ నకుఁ బూర్వమే తెనిఁగింపఁబడె నని చెప్పియున్నాము. అప్పటికిఁ దిక్కనసోమయాజి నలుబదియేఁబదిసంవత్సరములవాఁ డని యూహింపవచ్చును. అట్లైనచో నాతనిజననము శా. సం. ౧౦౨౦కి లోపుననే అయి యుండును. అది మొదలు సోమయాజికి నూఱువత్సరములు చెప్పవలసియుండును. ఇది సామాన్యముగ మనదేశములోఁ బ్రస్తుతకాలాయుర్దాయములనుబట్టి చూడ నాశ్చర్యముగాఁ గాన్పించును గాని సోమయాజిసమకాలీను లగురామానుజాచార్యుఁడు మొదలగు ౧౨౦ సంవత్సరములు జీవించినవారితో సరిచేసి చూడఁగాఁ దక్కువయే కాని అధిక మేమియును లేదు. పూర్ణాయుర్దాయవంతులు వేయుసంవత్సరములక్రిందట ప్రస్తుతమునకంటెఁ జెక్కుండ్రున్నట్లుగా ననేకగ్రంథదృష్టాంతములు కలవు. కావునఁ దిక్కనసోమయాజి నూఱుసంవత్సరములు జీవించె నని చెప్పుట యుక్తిసహ మని వక్కాణించెదను.

—— సోమయాజియు నన్నయభట్టును సమకాలీను లనుట. ——

పై సంవాదములోఁ దేలినసిద్ధాంతములంబట్టి తిక్కనసోమయాజి పదునొకొండవశతాబ్దములో నున్నవాఁ డనుటకు సందియము లేదు గదా ? ఇదివఱలో నన్నయభట్టారకుఁడు పదియవశతాబ్దాంతమునను పదునొకొండవశతాబ్దములో నుండినట్లు చూపించి యున్నాము. ఈ యిర్వురును సమకాలీను లనుమాట దృఢపఱుచుటకుఁ బైసంవాదమే

చాలియుండును. అయినను ఆంధ్రులలోని బుద్ధిశాలు లాలోచించి యింకనుఁ బరిశీలించుటకుఁగాను లోకములోఁ గలయొకప్రతీతిని వివరించుచున్నాఁడను. దానిని మనస్సున నుంచుకొని శోధకులు గ్రంథములు లభించినప్పుడు పరిశీలింతురుగాక. అది యెద్ది యనఁగా :—

రామాయణము నాంధ్రీకరించినభాస్కరుఁడును, నన్నయ భట్టారకుఁడును, వేములవాడ భీమకవియును, దిక్కనసోమయాజియును సమకాలీను లనియును, భాస్కరకవి రామాయణము తెనిఁగించుచు రావణసంహారానంతరము శ్రీరాముని వివిధదేవతలు చేయుస్తోత్రములు వివిధభూదేవత లగుకవీశ్వరులచే రచియింపఁబడి తనగ్రంథములో నుండవలయు నని కోరఁగాఁ బైకవీశ్వరు లందఱును తమపేరు లుంచి యొక్కొక్క పద్యము రచియించి యిచ్చి రనియును, ఆ పద్యములను వారిపేరటనే ప్రకటించి రనియును వాడుక గలదు. కాని ముద్రితగ్రంథములలోఁ గాండాంతగద్యములుకూడ మార్చి ముద్రింపఁబడినట్లుగా రామాయణకవుల చారిత్రములోఁ జూపించి యుంటిమి. కాఁబట్టి ప్రాచీనము లగుతాళపత్త్రి గ్రంథములు దొరకినప్పు డెల్ల నీవిషయమై పరిశీలన చేయుటకు బుద్ధిమంతులను బ్రార్థించి యిప్పటికీవృత్తాంతమును వ్రాసి విరమించెదను.

---

శ్రీ ర స్తు.

# క వి జీ వి త ము లు.

## 4.

## ఎఱ్ఱాప్రెగ్గడ.

(శంభుదాసుఁడు).

ఇతఁడు భారతములోని యారణ్యపర్వశేషమును భారతముతోఁ జేరినహరివంశమను గ్రంథమును దెనిఁగించెను. లక్ష్మీనృసింహకథ ద్విపదగాఁ జేసెను. ఇతనిం గూర్చినచారిత్రవిశేషములు తెలియకున్నను నీతని గ్రంథములం జూచిన నీతనివంశావళి మొదలగునవి కొన్ని తెలియఁగలవు. వానిని మఱియొకచో వివరించెదను.

### గ్రంథరచనాకారణము.

"అని యిట్లు పూజ్యపూజాతత్పరుండనై నానాసభీష్టార్థదాతనై యవదాతచరితంబున నఖిలజనరంజనం బొనర్చుటం జేసి రాజశబ్దంబునకు భాజనం బగుచుఁ దేజోవిలాసైకనిత్యుండు, పల్లవాదిత్యుండు మొదలగు బిరుదంబుల నొప్పు వేమజనేశ్వరుండు"

అని గ్రంథారంభములో నెఱ్ఱాప్రెగ్గడ యొకవచనమును వ్రాసి ఆ ప్రభుఁడు అద్దంకిపురంబున భద్రసింహాసనమున నుండి తన్నుం బిలువం బనిచి యీక్రిందివిధముగఁ బల్కినట్లు చెప్పియుండెను. ఎట్లన్నను :—

క. అంబుజభవనిభుఁడును పో, తాంబావిభుఁ డగు సూరనార్యునిసుతు న
న్నుం బూజితధూర్జటిచర, ణాంబుజు శ్రీవత్సగోత్రు నంచితచరితున్.

వ. సవినయంబుగా నర్చించి యిట్లనియె.

గీ. సకలభాషాకవిత్వవిశారదుఁడవు, సాధుసమ్మతుఁడవు నిత్యసౌమ్యమతివి
భవ్యుఁడవు గాన నీవిపుడఁ బరఁగఁ బద్య, మేను గల్గి యుండుదు చెప్ప దెట్టనావ్య.

శా. నాతమ్ముండు ఘనుఁడు మల్లరథినీనాథుండు నిస్నాతత
శ్రీతోడన్ సముపేతుఁ జేసి యలమిన్ జేపట్టి మా కిచ్చుటన్
జేతోమోద మెఱప్ప రామకథ మున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం గాంచితి నింక నుందనియ నేఁ గావ్యామృతాస్వాదనన్.

క. భారతపరాంశ మని యిం, పారఁగఁ జెప్పుదురు బుధులు హరివంశము నీ
వారమ్యకథఁ దెనుంగున, ధీరోత్తమ నిర్వహించి తెలుపుము నాకున్.

అని చెప్పియుండెను. దీనింబట్టి యీకవి అనవేమారెడ్డి యాస్థానములో నుండెననియు, నద్దంకివాసస్థుఁ డనియు, వేమారెడ్డితమ్ముఁడగుమల్లారెడ్డి మొదట సీతనిని తనకడ నుంచికొని యనంతర మతని యన్నయగు వేమారెడ్డి కొప్పించెననియు నావేమారెడ్డి ప్రథమమునలో సీతనివలన రామకథ చెప్పించె ననియును, అనంతర మాభారతశేష మగుహరివంశము దెనిఁగింపు మని కోరఁగా దానిం దెనిఁగించినట్లును దెలిసినది. అట్లుగాఁ బ్రభుఁడు తన్ను గ్రంథరచన కుత్సహింప నెఱ్ఱాప్రెగ్గడ యీక్రిందివిధంబునఁ బ్రభున కుత్తరము చెప్పినట్లుగ నున్నది. ఎట్లన్నను:—

ఉ. నన్నయభట్టతిక్కకవినాథులు చూపినత్రోవ పావనం
బెన్నఁ బరాశరాత్మజమునీంద్రునివాఙ్మయ మాదిదేవుఁడౌ
వెన్ను నివృత్తి మాపుఁ గడు వేడుకతో విను నాయకుండ వి
ట్లన్నియు సంఘటించె మదభీప్సితసిద్ధికి రాజపుంగవా.

క. కావునఁ జెప్పెదఁ గళ్యా, ణావహమహనీయరచన హరివంశము స
ద్భావమున నవధరింపుము, భూవినుతగుణాభిరామ పోలయవేమా.

అని యున్నది. దీనింబట్టి చూడ నెఱ్ఱాప్రెగ్గడ తాను నన్నయతిక్కనలమార్గములనే పోవునట్లుగాఁ జెప్పెను. ఈహరివంశములోఁ దానావఱకుఁ జేసియున్నగ్రంథ మొక్కరామాయణ మనియే చెప్పి యుండెంగాని రెండవగ్రంథము కానుపింపదు. ఆరామాయణముగూడ వ్యాపకములో నున్నట్లు కానరాదు. కొంతకాలముక్రిందట నొకచిన్నయచ్చుపొత్తములో నుత్తరరామాయణగాథ ద్విపదలో నున్నది చూచియుంటిని. అది యెఱ్ఱాప్రగ్గడనామమున నున్నట్లు జ్ఞాపక మున్నది. అదియును పూర్తిగా నచ్చుపడక యక్షగానగ్రంథముల కుపయోగ మగుభాగమువఱకే అచ్చుపడి యుండుటంబట్టి దానియం దంతశ్రద్ధ చేసి సంపాదించి యుండలేదు. ఇతఁడు చేసిన రామాయణ మదియే యగునేని యది యంతవిశేషగ్రంథము కాదనియును దానిని నేఁ డయుఁ బ్రకటించు

ట యనావశ్యక మని అచ్చులోత్తువారు అందలిముఖ్యభాగములుమా త్రమే ప్రచురించి రనియు నూహింపనై యున్నది.

## ఆరణ్యపర్వశేషము.

భారతములోని ఆరణ్యపర్వశేషము నీతఁ డెప్పుడు తెనిఁగించె నో అది యితనిచేత విస్పష్టముగాఁ జెప్పఁబడలేదు. కాని యందు లో నాల్గవయాశ్వాసములో "ధర్మరాజు నహుషప్రశ్నలకుఁ బ్రత్యు త్తరము లిచ్చుట" అను భాగములోఁ గొంత నన్నయభట్టుచేతను అటు పిమ్మట నెఱ్ఱాప్రెగ్గడచేతను రచియింపఁబడినట్లు చెప్పఁబడి యున్నది. అందునన్నయభట్టుకవిత్వములోని తుదిపద్యము :—

ఉ. శారదరాత్రు లుజ్జ్వలలసత్తరతారకహారపంక్తులన్
జారుతరంబు లయ్యె వికసన్నవకైరవగంధబంధురో
దారసమీరసౌరభము దాల్చి సుధాంశువికీర్యమాణ
కర్పూరపరాగపాండురుచిపూరము లంబరపూరితంబు లై.

అనునది. దీనినే పత్త్రికాముఖంబునఁ బ్రకటింప దానికే దిక్కన సోమయాజి వర్ణము వేసె ననియు దానం జేసి యతఁడు భారతశేషము రచియించుటకుఁ బిలువంబడె ననియును మఱియొకప్రతీతియుఁ గలదు.

ఈపద్యముతో నన్నయభట్టుకవిత్వము నిలిచిపోయినది. అనంత రము ఎఱ్ఱాప్రెగ్గడకవిత్వముఁ గానుపించును. కాని యిదియా వెంటనే అనఁ గా నన్నయభట్టు వదలివేసినవెంటనే రచియింపఁబడక మఱికొంతకా ల మైనపిమ్మట వ్రాయఁబడినట్లు కానఁబడును. తిక్కనసోమయాజి తనకవిత్వము ఆరణ్యపర్వశేషమునుండి యారంభింపక విరాటపర్వము నుండి యారంభించెను. అందులో :—

"ఆంధ్రకవిత్వవిశారదుండు
విద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్."

అని చెప్పియుండెను. దీనింబట్టి చూడఁగాఁ దిక్కనసోమయాజి నన్న యభట్టు ఆవలకు రచియించియున్న గ్రంథమును జూడకయే వ్రాసియున్న ట్లును గాన్పించును. కాని యెఱ్ఱాప్రెగ్గడ భారతముతోఁ జేరియున్నవారి

వంశము తెనిఁగించుటకుఁగా నేర్పఱుచుకొని దానిని పూర్తిచేసినపిమ్మట భారతములోఁ గొంతభాగము మాత్రము సంపూర్తి కాకయుండుట బాగుగా దని దానిఁగూడఁ బూర్తిచేసినట్లు కానుపించును. కాని యు ట్టిసందర్భము దీనిలో వ్రాయఁబడి యుండలేదు. నన్నయభట్టు ప్రారంభించిన శరదృతువర్ణననే తానును మఱికొన్నిపద్యములతోఁ జెప్పి గ్రంథమంతయు నన్నయభట్టు రచియించినట్లు రాజనరేంద్రునిపైఁ గృతియుంచి పూర్తి యొనరించె. నన్నయభట్టుకవిత్వమునకును శంభుదాసుని కవిత్వమునకుం గలశయ్యాభేదంబు సూచించుటకుఁ గాను శంభుదాసుని శరదృతువర్ణనలోనియొకటిరెండుపద్యముల నిటవివరించెదను. ఎట్లన్నను:—

చ. స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి నిగస్తనీరదా
వరణము లై దళత్కమలవైభవజృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతరహంససారసమధువ్రతనిస్స్వనముల్ సెలంగఁ గాఁ
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళఁ జూడఁగన్.

శా. దానాంభఃపటలంబునం బృథుపయోధారావళిం దాల్చి గ
ర్జానిర్ఘోషము బృంహితచ్ఛలనఁ బ్రచ్ఛాదించి ప్రావృట్పగిగా
దానీకంబు శరద్భయంబున నిగూఢాకారతన్ డిగ్గె నాఁ
గా నొప్పారె మదోత్కటద్విగదసంఘంబుల్ వనాంతంబునన్.

ఆరణ్యపర్వాంతమున శంభుదాసుఁడు తా నీగ్రంథరచనఁ జేయుటకుఁ గలకారణము నొకపద్యములో రచియించెను. దాని నిచ్చట వివరించెదను. ఎట్లన్నను :—

సీ. భవ్యచరిత్రుఁ డాపస్తంబసూత్రుండు, శ్రీవత్సగోత్రుండు శివపదాబ్జ
సంతతధ్యానసంసక్తచిత్తుఁడు సూర, నార్యునకును బోతమాంబికకును
నందనుం డిలఁ బాకనాఁటిలో నీలకంఠేశ్వగస్థాన మై యుసకమెసఁగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు ధన్యుఁడు ధర్మైకతత్పరాత్ముఁ
గీ. డెఱ్ఱనార్యుఁడు సకలలోకైకవిదితుఁ, డైననన్నయభట్టమహాకవీంద్రు
సరససారస్వతాంశప్రశస్తి దన్నుఁ, జెందుటయు సాధుజనమార్గసిద్ధి గోరి.

క. ధీరవిచారుఁడు తత్కవి, తారీతియుఁ గొంత దోఁపఁ దద్రచనయ కా
నారణ్యపర్వశేషము పూరించెఁ గవీంద్రకర్ణపుటపేయముగాన్.

## ఎఱ్ఱాప్రెగ్గడవంశము.

ఇతనిచే నింతకుముందుగాఁ జెప్పంబడిన పద్యానుసారముగ శ్రీవత్సగోత్రుఁ డైనట్లును, ఇతనితల్లి పోతమ్మ, తండ్రి సూరన్న యనియు, ఇతఁడు శైవోపాసకుం డనియు, శంకరస్వామి యనుయతీంద్రుల శిష్యుం డనియును సకలభాషాకవిత్వవిశారదుఁ డనియుం దేలినది. ఈ శంకరస్వామి విద్యారణ్యస్వాములకు గురుఁ డగునట్టియు లంబికాయోగ పారగు లైనట్టివిద్యాశంకరులు. విద్యాశంకరులు సన్న్యసించినది శా. స. ౧౧౫౧. సిద్ధినందినది శా. సం. ౧౨౫౫.

ఈహరివంశగ్రంథమువలన దొరకినచారిత్ర మింతయే అయియున్నది. పైపద్యములవలనఁగాని ఆశ్వాసాంతగద్యమువలనఁగాని యెఱ్ఱాప్రెగ్గడ నియోగిశాఖలోనివాఁడో, వైదికశాఖలోనివాఁడో తెలియఁబడుటలేదు. ఆశ్వాసాంతగద్యములో "ఇది శ్రీశంకరస్వామిసంయమీశ్వర చరణసరోరుహధ్యానానందసౌందర్యధుర్య శ్రీసూర్యసుకవిసంభవశంభుదాసలక్షణాభిధేయయెఱ్ఱయనామధేయప్రణీతము" అని యుండుటంబట్టి యీహరివంశగ్రంథమువలన నీసంశయము నివారణ కాలేదు. ఇతనినే యెఱ్ఱప్రెగ్గడ యని వాడుటచేత నియోగియే అని నిశ్చయించినను గ్రంథములోఁ బ్రెగ్గడశబ్దము గాని పర్యాయపదములు గాని వేసికొని యుండక పోవుటచే నీతఁ డెవ్వరో యనుసందియము గల్గును. అది నివారింపఁబడుటకు గ్రంథాంతరము జూచెదము గాక.

శ్రీమదాంధ్ర భాగవతమున నెఱ్ఱాప్రెగ్గడవంశస్థుఁ డగుసింగనచే నతని వంశావళి తెల్పఁబడినది. దానింబట్టి చూడ నీతఁడు నియోగి బ్రాహ్మణుఁడే అయినట్లు నీతనివంశంబులో నొక్కఁడు హరివంశము, నొక్కఁడు శ్రీభాగవతములోని కొన్నిభాగములును దెనిఁగించె ననియుం జేలినది. తిక్కనవంశస్థులవలన భారత రామాయణములు తెలిఁగింపఁబడినట్లుగా నెఱ్ఱాప్రెగ్గడవంశస్థులవలన భారతభాగవతములలోనిభాగములు తెలిఁగింపఁబడినవి. భాగవతము లోని వంశావళిపద్య మెద్ది యనఁగా:—

సీ. శ్రీవత్సగోత్రుండు శివభక్తియుక్తుఁ డాపస్తంబసూత్రుఁ డపారగుణుఁడు
ఏర్చూరిశాసనుం డెఱ్ఱనప్రెగ్గడ, పుత్త్రుండు వీగన పుణ్యమూర్తి
కాత్మజుం డగునాదెయామాత్యునకుఁ బోలమాంబకు నందను లమితయశులు
కసువనామాత్యుండు ఘనుఁడు వీరనమంత్రి, సింగధీమణియు నంచితగుణాన్వ
తే. లుద్భవించిరి తేజంబు లూర్జితముగ, సొరిది మూర్తిత్రయం బన శుభకీర్తిఁ
బరఁగి రందులఁ గసవనప్రభువునకును, ముమ్మడమ్మను సాధ్వికి మున్ను వెలసి.
క. ఆకసవమంత్రికిం బు, ణ్యాకల్పశుభాంగి ముమ్మడమ్మయు మును స
ద్వ్యాకులచిత్తుల నిరువుర, శ్రీకరగుణగణులఁ బుణ్యశీలురఁ గాంచెన్.
క. అంగజసమలావణ్యులు, భంగులు హరిదివ్యపదయుగాంబుజవిలస
ద్భృంగాయమానచిత్తులు, సింగయ తెలగయలు మంత్రిశేఖరు లనఁగన్.
క. అం దగ్రజుండ శివపూజం దనరినవాఁడ విష్ణుచరితామృతని
ష్యందిపటువాగ్విలాసా, నందోచితమానసుఁడను సయశోవిదుఁడన్.

ఈపై నుదాహరించిన యెఱ్ఱాప్రెగ్గడవంశావళి క్రింద వివరించెదను, ఎట్లన్నను:—

శ్రీవత్సగోత్రము (ఆపస్తంబసూత్రము.)
|
సూరన
|
ఎఱ్ఱాప్రెగ్గడ (ఏర్చూరి శాసనుఁడు)
|
వీగన
|
ఆదెయామాత్యుఁడు
|
కసువనమంత్రి — వీరనమంత్రి — సింగరాజు
|
కసువనమంత్రి:
సింగయమంత్రి (భాగవత షష్ఠస్కంధ గ్రంథకర్త.) — తెలగయమంత్రి.

ఈసింగనమంత్రిచారిత్రము భాగవతములో వ్రాసియుంటిని గావున దాని నిచ్చోట వ్రాయ మానినాఁడను.

## కొక్కోకగ్రంథవిషయము.

కళాశాస్త్ర మనునామంబుతో వ్యవహరింపఁబడు నీకొక్కోక గ్రంథకవి కొంచెమెచ్చుదగ్గుగఁ బై యెఱ్ఱాప్రెగ్గడవలెనే కాన్పించుచున్నాఁడు. అం దాతనిచేఁ జెప్పఁబడినవంశావళీ వర్ణనము నిట వివరించుచున్నాఁడను, ఎట్లన్నను :—

సీ. శ్రీవత్సగోత్రప్రసిద్ధసంభూతి నాపస్తంబసూత్రప్రశస్తుఁడు
గురుదయానిధి ఘనకూచనమంత్రికి, నంగనామణి నుత్తమాంబికకును
తనయుండు సత్కవీశ్వరమానిభరతుండు, శివకృప సుజ్ఞానశేఖరుండు
నారాధ్యవిద్యాచలానందయోగీంద్రు, శిష్యప్రచారి విశిష్టగుణుఁడు
తే. ఎఱ్ఱయామాత్యుఁ డన సత్కవీంద్రహితుఁడు
కలితవాక్ప్రౌఢిఁ గొక్కోకకవివరుండు
చతురమతితోడ రతికళాశాస్త్రమిదియ
తెనుఁగుగాఁ జేసె రసికులు వినుతి సేయ.

అనుదీనింబట్టి చూడఁగా నీకవిపేరు "ఎఱ్ఱయ" యనియు, నమాత్యుఁడనియు నుండుటంజేసి నియోగిబ్రాహ్మణుఁ డనియు, శ్రీవత్సగోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు, శివోపాసనాపరుఁడు, ఆరాధ్యుఁ డగువిద్యాచలానందయోగీంద్రునిశిష్యుం డనియు, కూచనమంత్రికుమారుఁ డనియుఁ దేలినది. కాని హరివంశములోఁ జెప్పఁబడిన యెఱ్ఱయ సూరనమంత్రికుమారుఁ డనియు నతనితల్లిపేరు పోతమ అనియు నున్నది. ఇదియొకభేదము. ఇర్వురకును సమానధర్మములు మఱికొన్ని కానుపించుచున్నవి. అందు మొదటియతఁడు శంకరస్వామిసంయమీశ్వరశిష్యుఁడు. రెండవయాతఁడు విద్యాచలానందయోగీంద్రునిశిష్యుఁడు. కావున నిర్వురును యతీశ్వరశిష్యులు. మొదటియతఁడు సకలభాషాకవిత్వవిశారదుఁ డని యున్నది. రెండవయతనికి అష్టభాషాకవిమిత్త్రుఁ డని యున్నది. కావున నీయిర్వురును గవిత్వప్రజ్ఞలో సమానులే. పైవాని నన్నిటిం బట్టి చూడఁగా నీ యిర్వురు నొకరే అని తోఁచుచున్నది. తలిదండ్రులపేరులు భేదముగా నుండుటంబట్టియు, గురువులపేరులును భేదముగా నుండుటంబట్టియు మొదట నతనికి శంభుదాసనుపర్యాయనామము ముండు

టంబట్టియు రెండవయతనికి నది లేక నవఘంటసురత్రాణుఁ డనుబిరు దుండుటంబట్టియు, లక్షణాభిధేయుఁ డనుబిరుదు లేకుండుటంబట్టియు నీయిర్వురు నొకరు కారని నిశ్చయింపవలసెను. కాని భాగవతశేషము రచియించినసింగనకవిమాత్రము వీరియిర్వురిలో నెవ్వరిసంతతివాఁడో యిపుడు చెప్పఁజాలము. అతఁడు శ్రీవత్సగోత్రుఁ డగునెఱ్ఱన తనమూల పురుషుం డని చెప్పెను. అందుచే నీయిర్వురిలో నొకఁడు కానోపును. అనిమాత్రము చెప్పవలసి యున్నది.

ఇఁకఁ గొక్కొకకవివరునికాలము నిర్ణయింపఁబడవలసి యున్న ది. అది సులభసాధ్యముగాఁ గానుపించుట లేదు. ఈ గ్రంథమును గృతి నందినకుంటముక్కలమల్లనామాత్యునివంశచారిత్రమునుబట్టి చూ డవలసి యున్నది. అతనివంశమునుగూర్చి వ్రాయుచోఁ గృతిపతిపౌత్రుఁ డైనభైరవమంత్రింగూర్చి యీక్రిందివిధంబుగ వ్రాసియున్నది. అవె ట్లన్నను :—

గీ. అట్టిబయ్యమంత్రి కనుకూలసౌభాగ్య, భాగ్యగరిమ వెలయుపత్ని యైన చ్య
నక్కమాంబతనయు లనఘుల నలువురు, గనిరి యు గుణసముద్రు లనఁ దగఁ బొగడ.

క. వారివ్వ రనిన గంగన, ధీరుఁడు పెదమల్లనయును దీప్తయశశ్శ్రీ
ధారుఁడు మల్లామాత్యుఁడు, భైరవుఁడు ననంగ నఖిలభాగ్యోన్నతులన్.

వ. వారిలోన.

సీ. హరిపదధ్యానతత్పరుఁడు చండలమహాలక్ష్మీప్రసాదైకలబ్ధవరుఁడు
రహిఁ గజపతిమహారాయ లిచ్చినసమంచితమహాపాత్రప్రసిద్ధయశుఁడు
జెముఖానరాయనిచేతను నొడయఁడై, వినుకొండదుర్గ మేలినఘనుండు
కృతివననిక్షేపనుతతటాకాదిక, ధర్మైకసప్తసంతానఘనుఁడు

తే. "మునిపరాశరగోత్రసంజనితుఁ డార్య, సేవ్యతిరువేంగళాచార్యశిష్యుఁడు నగు,
మంత్రిపెరుమాళ్ల కొమ్మయామనుమఁ డాబ, మంత్రి తెలగయ భైరవమల్లమంత్రి."
అనియున్నది.

షష్ఠ్యంతములలో

క. ఇటువంటిమంత్రినిధికిని, పటుతరవిద్యావిశేషపాండిత్యునకున్
కటక, కలుబరిగ, ఢిల్లీ, కటకస్తవనీయసుగుణగణనిత్యునకున్.

క. తిరుమల తిరువెంగళగురు, పరమకృపాలబ్ధవిభవభాగ్యాత్మునకున్
హరిచరణకమలమధుకర, వరమతికిని జటులగంధవారణకృతికిన్.

అనుపద్యములంబట్టి యీమంత్రి గజపతిరాయసమంత్రి యని యు, మహాపాత్రుఁ డనుబిరు దాదినవాఁ డనియును, "జెంఖాన్" అనుప్రభునివలనఁ బ్రభుత్వము నంది వినుకొండకోట కధికారముచేసె ననియు, కటకము, ఢిల్లీ, కలుబరిగ మొదలగుస్థలములలో వ్యవహారము కలవాఁ డనియును, తిరుమల తిరువెంగళాచార్యులశిష్యుఁ డనియును దేలినది. ఇందులోఁ జారిత్రానుకూలము లగువిశేషములు పెక్కు లున్నను అవిప్రత్యేకము విస్పష్టమై ప్రసిద్ధములైనగాథలు కాకుండు టచేత నిదమిత్థమని నిర్ణయింప వీలు లేదు. గజపతిరాయలవలన మహా పాత్రప్రసిద్ధబిరు దందినవాఁ డని చెప్పుటచేత ఆకాలము గజపతులు కొండవీడుదేశమును బాలించుచున్నకాల మని తోఁచుచున్నది. ఇది కృష్ణదేవరాయలు కొండవీటిదుర్గమును జయించుటకుఁ బూర్వ ము దీనింబట్టి యీమంత్రిశిఖామణి కృష్ణరాయలకాలమునకంటెఁ బూర్వుఁ డనియును, శ్రీనాథుఁడు, పోతరాజు మొదలయినవారికాలము లోనివాఁడు కావచ్చుననియుం దోఁచుచున్నది. ప్రస్తుతములో నింత కంటె విస్తరింపవలసినది లేదు. కనుక నిపుడు మనము వ్రాయుచున్న యెఱ్ఱయకవియును ఆకాలమువాఁడే అని చెప్పెదము.

## ఇందలిపైకవులశయ్యావిశేషంబులు.

నన్నయభట్టారకునికవనంబును దిక్కనసోమయాజి కవనంబును బదశయ్యాదులం దొక్కతీరున నుండును. వీరిలోఁ దిక్కన మిక్కిలి సం గ్రహమైనపుణికలవాఁడు. ఈతఁ డేపద్యంబుఁ దాఁ జెప్పఁదొరకొన్నను దానియందే తాఁ జెప్ప నిశ్చయించినయర్థమంతయుఁ బొందుపఱుచు నుగాని తఱుచుగ నింకొకపద్యంబుతో దానికి సంబంధ ముండునట్లు చెప్పఁడు. చరణపూరణంబునకుఁ బ్రయోగింపఁబడుపొల్లుపదంబులు తిక్కన కవనంబునఁ దఱుచుగఁ గానరావు. నన్నయ తిక్కనల కవనం బుల వ్యాకరణభంగంబులుగాని ఛందోభంగంబులుగాని యుండవు. శా

వున వీరు ప్రామాణికకవు లని వాడఁబడుదురు. వీరిప్రయోగంబులే జనులందఱుం బ్రయోగింపందగును. ఇతరకవులు వీరికి భిన్నంబుగఁ బ్రయోగంబులు సేసినను నాశబ్దంబులు బుధజనాదరణంబు నొందవు. వీరు తెలుచు ఱాకును రేఫమునకు మైత్త్రిం జెప్పి యుండలేదు. కావున నితరకవులు వానికి మైత్రిఁ జెప్పి ప్రయోగించుటకు సంశయింతురు. వీరి కాలమువాఁడగుభీమకవి వీరిమైత్త్రికి సమ్మతించెను. అందుల నప్పకవిమాత్రము సమ్మతింపఁడయ్యెను. దానికి నాతనిచేఁ జెప్పఁబడిన కారణము లిప్పటివారికి సమ్మతములు గావు. ఎఱ్ఱాప్రెగ్గడయుఁ గవనంబున నన్నయతిక్కనలకు సరియగువాఁడు. ఈతఁడు భారతంబున మిక్కిలి తక్కువభాగంబుఁ దెనిఁగించి యుండుటంజేసి యిం దీతనిపాండిత్యము మనకుఁ దెల్లంబు గాదు. ఈతఁడు తెనిఁగించినభారతముతోఁ జేరినహరివంశంబున నీతని సామర్థ్యాతిశయంబు బోధ యయ్యెడిని. ఈతనికవనము నన్నయతిక్కనల కవనముకంటె నించుక కఠినము. విశేషించి తెనుఁగుపదంబులఁ బ్రయోగించునిష్టము గలవాఁడు. అచ్చటచ్చట సంస్కృతజటిలంబు లగుసమాసములు గానవచ్చెడిని. అన్వయకాఠిన్యమును గలదు. పైని చెప్పఁబడిన మువ్వురుకవులును బురాణశైలికి నెంతయుఁ దగియున్నారు. వీరికాలంబునం గలకవులచేఁ బురాణంబు లన్నియు నించుమించుగఁ దెనిఁగింపఁబడియెను. హరివంశము నాచనసోమునిచేతనుగూడఁ దెనిఁగింపఁబడియెను. ఆతఁడును బదలాలిత్యంబునకును జాతీయకవనంబునకును బ్రసిద్ధుఁడే. ఈపైని జెప్పిన కవులకల్పనలంగూర్చి పోతనామాత్యునికథలో నింకను గొంత వ్రాయఁబడును. రెండవయెఱ్ఱనకవికవిత్వము మృదుమధుర మైనది.

## భారత పర్యాయనామ గ్రంథకర్తలు.

ఇదివఱలో మనము భారతనామంబున నొప్పునట్టిదియు, దాని కనుబంధమై భారతశేషమై హరివంశనామమున నొప్పునట్టిదియునగు గ్రంథమును రచియించినకవులంగూర్చియును వారితో సంబంధించిన కవులంగూర్చియు వ్రాసియున్నారము. ఇఁకముందు “జైమినిభారతము,

చిత్రభారతము" అనుమఱిరెండు గ్రంథములకుఁ గవు లగు "పిల్లలమఱ్ఱి పినవీరభద్రయ్య, చరికొండ తమ్మన్న" అనువారి చరిత్రములు వ్రాయవల సియున్నది. కాని హరివంశమును రెనిఁగించిననాచనసోమనాథుఁ డను మఱియొకకవిచరిత్రమునుగూడ వ్రాయవలసియుండును. అతనికిఁ బ్రత్యేక ము చారిత్రము వ్యాపకములో లేకయుండుటంబట్టి యతనికులగోత్ర ములు మఱికొందఱిచే నీవఱకే వ్రాయఁబడుటంబట్టియు నట్టివారిని చరి త్రములు గలవారితోపాటుగ వివరింపఁజాలను. ఇతనివలెనే చిత్రభారత మును రచియించిన చరికొండతిమ్మనకవియు నున్నాఁడు. కావున నతిని చారిత్రమును వ్రాయఁబడలేదు. పైయిర్వురిపేరులును స్మరియించి చారిత్రవిశేషములు గల జైమినీభారతగ్రంథకర్త యగుపిల్లలమఱ్ఱి పిన వీరభద్రయ్యంగూర్చి మాత్ర మిపుడు వ్రాసెదను.

---

# కవి జీవితములు.

## 5.

## పిల్లలమఱ్ఱి పినవీరభద్రయ్య.

ఇతఁడు నియోగిశాఖాబ్రాహ్మణుఁడు. తండ్రిపేరు గాదయమం త్రి. అన్నపేరు పెదవీరభద్రయ్య. ఇతఁడు సాళువగుండ నృపాలుని యాస్థానపండితుఁడు. ఈరాజు సభ్యులం జూచి జైమినిభారత మాంధ్రీక రించుటకుఁ దగువార లెవ్వ రని యడుగఁగా నాపండితులు పినవీరభద్ర య్యావంశవిశేషముల నీక్రిందివిధమున వర్ణించిరి. ఎట్లన్నను:—

సీ. అమృతాంశుమండలం బాలవాలము గాఁగ, మొలిచె నెుక్కొటి జగన్మోహనముగఁ,
జిగిరించె నేయసింధుగత శైలవడింభ, శయనీయవరపలాశములతోడఁ
బిత్పదేవతలకు నంటితసత్త్రికాలమై, చెట్టు గట్టెను గయాక్షేత్రసీమ
నిలువ నీడయ్యె నిందీవరప్రియకళా, కోటీరునకు భోగికుండలునకు

తే. మట్టిమాత్రంబె పిల్లలమఱ్ఱిపేరు, పేరునలేఁ గాదు శారదాపీఠకంబు
వారిలోపలఁ బినవీరువాక్యసరణి, సరసులకు నెల్లఁ గర్ణరసాయనంబు.

అనుదీనింబట్టి యితనివంశముయొక్క నామము పిల్లలమఱ్ఱివా రనియును, అది శారదాపీఠ మగుమఱ్ఱి యనియును, అం దనేకులు కవు లుండిరనియును, వారియందఱిలోని పినవీరన (పినవీరభద్రకవి) యొక్క వాక్యరచన సరసకర్ణరసాయనం బనియును దేలినది. పైపద్యములోని కవివంశమువారిలోఁ బెక్కండ్రు కవులున్నా రని చెప్పినను సతిసతింగ్ర్డి తాతలు కవు లగుదురో కారో యనుశంక కల్గునని సభ్యు లీక్రిందివిధంబుగ నింకొకపద్యముం జెప్పిరి. ఎట్లన్నను :——

క. తాతయుఁ దండ్రియు నగ్ర, భ్రాతయునుం దాను భువనభానుగుణస్ఫూర్తిని
ర్మాతలు పిల్లలమఱ్ఱి వి, ఖ్యాతునిఁ బినవీరుఁ బోలఁగల రే సుకవుల్.

ఇట్లీపద్యమున ననుస్యూతముగఁ బినవీరనవంశమునఁ గవు లు న్నా రని తెల్పుట వీరనకవిత్వము సంప్రదాయసిద్ధ మైన దనియును ఆవిషయమై శంకింపవలసిన యవసరముండ దనియును రాజునకు స్పష్ట మగుటకుఁగా నై యున్నది.

## కాలనిర్ణయము.

ఇఁకఁ బినవీరనకవియొక్క కాలము నిర్ణయింపవలసియున్నది. అది రెండువిధములుగ నై యుండును. అందు మొదటిది యుతనిప్రభు వగు గుండమరాజు కాలవిజ్ఞానము. రెండవది పినవీరనతోసమకాలీనుల కాలవిజ్ఞానము. ఇందు మొదటిది కష్టసాధ్య మగున దియును, రెండవది మిక్కిలి సులభ మైనదియు నై యున్నది. కావున రెండవదానింబట్టి దీనిని నిర్ణయించెదను. ఎట్లన్నను :——

ఆశ్వాసాంతగద్యములో :——

"ఇది భారతీతీర్థ శ్రీచరణకరుణాపాత్ర గాదయామాత్యపుత్త్రి వినయవిద్యా సముద్ర, పినవీరభద్రప్రణీతం బైనజైమినిభారతము"

అని చెప్పియుండెను. కావున నీతఁడు భారతీతీర్థుల శిష్యుఁడు. అట్లగుటచేఁ బినవీరన యతనిసమకాలీనుఁడే కదా. ఇఁక భారతీతీర్థుల కాల మెప్పటిదో తెలిసికొనవలయును.

## భారతీతీర్థులకాలము.

భారతీతీర్థులకాలమును నిర్ణయించుటకుఁ బూర్వము భారతీతీర్థులవృత్తాంతము చెప్పవలసి యుండును. ఇతఁడు శృంగేరిలోని జగద్గురుపరంపరలోనివాఁడును, వేదభాష్యకారుఁ డగుమాధవామాత్యాపరనామవిద్యారణ్యులతమ్ముఁడును నై యున్నాఁడు. ఇతనికే భారతీతీర్థు లనియు, భారతీకృష్ణతీర్థు లనునామములు గలవు. జగద్గురుపీఠములోనివిద్యాశంకరున కితఁడు ప్రథమశిష్యుఁడు. ఇతనియనంతరము విద్యారణ్యులు విద్యాశంకరస్వామిశిష్యుఁ డయ్యెను. అందుకుఁ గారణములు నావిద్యారణ్యచరిత్రములోఁ జూడం దగును. భారతీతీర్థులు యోగమార్గప్రవర్తకుఁడును, విద్యారణ్యులు కర్మబ్రహ్మమార్గప్రవర్తకుఁడునునై యున్నారు. ఈయిద్దరుం గలిసి యద్వైతమునకుఁ బ్రకరణగ్రంథ మగు పంచదశప్రకరణము అనుగ్రంథమును రచించిరి. భారతీతీర్థులు శా. సం. ౧౨౫౦ సన్యాసాశ్రమము గైకొని శా. సం. ౧౩౦౨-న సిద్ధి నొందెను. పిల్లలమఱ్ఱి పినవీరభద్రయ్యయు నీభారతీతీర్థుల శిష్యుఁడు గావున నించుమించుగ నీకాలమువాఁడే యని నిర్ణయింపవలసి యున్నది.

## పినవీరనశాస్త్రపాండిత్యాదికము.

ఇతఁడు భారతీతీర్థులశిష్యుం డగుటచేత యోగాభ్యాసపాటవంబు గలవాఁ డని చెప్పవలసియున్నది. యోగసిద్ధుఁ డనియునుఁ బ్రతీతి గలదు. పైభారతీతీర్థులు శృంగగిరిజగద్గురుపరంపరలోనివాఁడే యని చెప్పుటకు నీపినవీరనకవిచలనఁ జేయఁబడినభారతీవర్ణనముచేతను పండితు లీతనివాసస్థానము మగు "పిల్లలమఱ్ఱి" అనుదానిని శారదాపీఠమని చెప్పుటచేతను నూహింపనై యున్నది అందు సరస్వతీవర్ణన మెట్లన్నను :—

సీ. ప్రణవపీఠమున మంత్రపరంపరలు గొల్వ, నుండు నేదేవి పేరోలగంబు
భావజ్ఞులకుఁ బరాపశ్యంతిమధ్యమా, వైఖరు లేదేవివర్ణసరణి

జపహారకీరపుస్తకవిపంచిసమంచితంబు లేదేవిహస్తాంబుజములు
కుందేందుమందారకందళీబృందంబు, చంద మేదేవియానందమూర్తి

గీ. కాంచె నేదేవి కాంచన గర్భచతుర, పూర్వదంతకవాట విస్ఫుటమహోష్ఠ
చంద్రకాంతశిరోగృహ స్థలవిహార, యమ్మహాదేవి వాగ్దేవి నభినుతింతు.

అనియుండెను. కావున నీతఁ డుపాసించుదేవత యగుభారతి జగద్గురుశారదాపీఠవర్తిని యనియు, నట్టిభారతి నుపాసించిన భారతీతీర్థులే పినవీరనకు గురుఁ డనియును, పినవీరనకుఁ గల్గిన జ్ఞానవిశేషమున కాదేవతోపాసనయే కారణ మనియునుఁ జెప్పఁదగి యున్నది. ఇంతియ కాక పైవర్ణనమును క్రిందిపద్యమును బరిశీలింపఁగాఁ బినవీరన మంత్రయోగ రహస్యములుగూడఁ జెక్కులు తెలిసినవాఁడుగాఁ గాన్పించును. ఆపద్య మెట్లన్నను:—

గీ. కరముగా భారతీ తీర్థగురుకృపాస, మిద్ధసారస్వతుఁడు సత్కవీంద్రహితుఁడు.

పై భారతీతీర్థులు శా. సం. ౧౨౫౦ లో తురీయాశ్రమమును స్వీకరించి శా. సం. ౧౩౦౨ లో సిద్ధినందినట్లు శృంగేరీజగద్గురుపీఠాధిరోహణకాలనిర్ణయపట్టికయం దున్నది. దానినే నీవఱకు కావ్యకల్పవల్లిలోఁ బ్రచురించియున్నాఁడను. పినవీరన భారతీతీర్థులచరమకాలములో యోగోపదేశము నందియుండు నని తోఁచెడిని. అప్పటి కీతఁడు మిక్కిలి బాల్యవయస్సున నుండి యుండును. కావున నీపినవీరన శా. సం. ౧౩౦౦ మొదలు శా. సం. ౧౩౫౦ వఱకుఁ గలకాలమువాఁ డని నిర్ణయించెదను.

పినవీరన కుకవులయెడ మిగుల భీకరుఁడై యున్నట్లు పైగీతపద్యములోనియుత్తరార్థమువలనం గాన్పించును. అది యెట్లన్నను :—

"కుకవిమూర్ధవిలుంఠనకులిశహస్త, పల్లవుఁడు చెప్పెఁ బినవీరభద్రసుకవి.

## → పినవీరభద్రయ్యగోత్రవిషయము. ←

దీనింగూర్చి పినవీరభద్రకవిచే నేమియుఁ జెప్పఁబడదయ్యెను. కాని యతఁ డాంధ్రకవులంగూర్చి వర్ణించుచు వ్రాసినపద్యమువలన నీతనిగోత్ర మూహింపఁదగి యున్నది. ఎట్లన్నను :—

మ. కవులన్ బంకజగర్భసన్నిభుల వర్ణింతు వల్మీకసం
భవునిన్ వ్యాసునిఁ గాళిదాసు బిల్హణున్ బాణున్ మయూరున్ శుకున్
భవభూతిన్ శివభద్రు మల్హణుని ఘంటామాఘునిం జోరు భా
రవి మానన్నయభట్టుఁ దిక్కకవి నేతాప్రగ్గడన్ సోమునిన్.

అనుపద్యములోని "మా" అనుదానింబట్టి చూడ నన్నయభట్టును పినవీరనయొక్క వంశమువారును నొక్కగోత్రమువారై యుండు రనియుఁ జెప్ప నొప్పి యున్నది. నన్నయభట్టుది భారద్వాజగోత్రము కావునఁ బినవీరనగోత్రమును నదియే యని యూహింప నై యున్నది.

### జైమినిభారతరచనావిషయము.

ఇందువిషయమై లోకమునఁ గల ప్రతీతిని గథాసందర్భములో వివరించెదను. కాని యితనిగ్రంథములో వర్ణింపఁబడిన వృత్తాంతము ముఖ్యముగ నమ్మఁదగియుండు నని యెంచి దాని నీక్రింద వివరించెదను. ఎట్లన్నను :—

"ఆ రాజపరమేశ్వరుఁడు (సాళ్వగుండ నరసభూపాలుఁడు) ఒక్కనాఁడు.........యథాస్థానసమాసన్న రాజన్యశిరఃప్రసవ వాసనా ముద్రితం బైన భద్రాసనంబునఁ బేరోలగం బుండి పురాణేతిహాసకథాప్రసంగంబుల వినోదించుచు :—

క. నామది నిగతము భారత, రామాయణకథలఁ బ్రేమ రంజిలు నందున్
జైమినిభారత మనఁగా, భూమి నపూర్వము పురాణముల గణియింపన్.

గీ. ఆపురాణంబుఁ గనఁ దెనుఁగయ్యెనేని, చెప్ప నేర్చినకవియుఁ బ్రసిద్ధుఁడేని
తెనుఁగు నుడికారమున మించుఁ గనియెనేని, కుందనముకమ్మ వలచినచందమగును.

వ. అని సభాసదులమొగంబులు చూడ నవధరించిన నారాజసత్తముచిత్తం బెఱింగి వా రిట్లని విన్నవించిరి.

క. ఏరీతి తెలిఁగ నీ పిన, వీరన దేవరతలంపు విఖ్యాతముగాఁ
జేయను బెట్టిదియుండు దన, పేరుగ రచియింపఁ బూనెఁ బేశలఫణితిన్.

క. అని విన్నపంబుఁ జేసిన, ననుఁ గనుఁగొని యలరి సాధనంబు ఋణముగాఁ
దినకర యుపార్జించె నుశో, ధన మిటు గావలదె యాశ్రితత్వం బనుచున్.

క. దరహాసరసముఁ దాంబూ, లరసముఁ గప్పురపుఁబలుకులం గుంపమరం
బెరసినగతిఁ దోఁపఁగఁ జా, దరముగ నిట్లనియె భాగవతజ్ఞులతోడన్.

ఉ. అల్లన విచ్చుచెంగలువలందురజంబును గప్పురంబుఁ బైఁ
జల్లఁగఁ జల్లనై వలచుసౌరభముల్ వెదఁజల్లుభావముల్
పల్లవహస్తచన్నుఁగవపయ్యెదజీబుగఁ దోఁచుభాతి గాఁ
బిల్లలమఱ్ఱివీరన యభిజ్ఞుఁడు చెప్పఁగ నేర్చుఁ గల్పనల్.

వ. అని సమీపంబునఁ గొలిచియున్న నన్నుం గృపాతరంగితాపాంగంబున నిరీక్షిం
చి మామకమనోరథం బెఱింగినట్లు చెప్ప నుద్యోగించితివి హృద్యాఖ్యానపద్యగద్యపద్యాను
బంధంబుగాఁ బ్రబంధం బంధ్రభాషను జైమినిభారతంబునం దశ్వమేధపర్వంబు నిర్వి
ఘ్నంబుగా రచియింపు మని యానతిచ్చినఁ బ్రసాదం బని యంగీకరించితిని".

అని యున్నది. ఈపైపద్యములు పినవీరనను రాజు అతని గ్రంథరచనకై ప్రేరేపించకపూర్వమే జైమినిభారతగ్రంథరచన చేయుచుండెనని తెల్పుటయేకాక అతని కవిత్వమునందుఁ గలవిశేషమును భావస్ఫూర్తిని చేయుటయందుఁ గలసామర్థ్యాదులంగూడఁ జూపును. అందులో "అల్లన విచ్చుచెంగలువ" లనుపద్యములోఁ జెప్పినవిధముగ నీతనికవిత్వము, వినినమాత్రనే హృదయాహ్లాదకర మనియునుఁ జెల్పఁబడియె. ఇతనికవిత్వములోఁగూడఁ గథానుసారమైన కాఠిన్యములు కొన్నిచోట్లఁ గానుపించును. ఎట్లైనను మెట్టున నీపినవీరభద్రుఁడు ముక్కుతిమ్మనమొదలగు వారివలె మిక్కిలి మృదుమధురవాక్కులు గలకవిగా నెన్నవలసి యుండును. ఇతఁడు శ్రీనాథునికంటెఁ గొంచెము చిన్నవాఁడై యున్నట్లుగాఁ గనుపించును. ఆవివరము శ్రీనాథునికవిత్వములోఁ జూచి యుంటిమి గావున నావిషయమై యిందు విశేషించి వ్రాయక లోకమువాడుకనుబట్టి యితనికవిత్వమహాత్మ్యాదుల నీక్రిందిభాగములో వివరించెదను.

## లోకమువాడుకం బట్టినపినవీరభద్రయ్యచర్యలు.

ఇతఁ డాకాలపుఁ బండితులలోఁ బ్రసిద్ధుఁడు. మిక్కిలి బాలుండై వీథులలో నాడుకొనుచున్న సమయమందు నీతనిప్రతిభావిశేషంబులు పండితులకు నచ్చెరువుఁ బుట్టించుచుండును. ఇట్టిసమయంబుననే

శ్రీనాథుఁడు తన నైషధ మీతనికడకుఁ దెచ్చెను. అపు డతఁడు బాల్య చాపలంబునఁ జెలికాండ్రతో నాడుకొనుచుండెను. ఇతఁడే పినవీరన యగు నని నిశ్చయింపలేక శ్రీనాథుఁడు పినవీరన యెచ్చో నున్నాఁ డని సంప్రశ్నంబు చేసెను. దాసిని విని పినవీరనవృత్తాంతమున కేమి గాని నీ వెవ్వాండవో యాతనితోడి పెక్కుం గల్గుకార్యం బెద్దియో ముందుగఁ దెల్పు మని యడిగెను. అంతటితో నైన నతఁ డితఁడే యని గ్రహింపక వీరనతోఁ నాకొకకార్యంబు గల దని శ్రీనాథుఁడు చెప్పెను. ఆమాట విని వీరనతోఁ గల్గుకార్యంబు నాకుఁ జెప్పునగత్యంబు నీకు లేదు కాని వీరన యెచ్చో నున్నాఁడో దానిఁ దెల్పునగత్యంబు నాకే విశేషంబై యున్నదా? యేమి? అనుడు శ్రీనాథుం డా బాలుఁడే వీరన యగు నని యెంచి తాను వచ్చినకార్యము నివేదించెను.

### శ్రీనాథుఁడు నైషధముం జూపుట.

శ్రీనాథుఁ డంతఁ దన యాంధ్రనైషధముం జూపి మీరు దీనిని బాగనిన జగద్వ్యాపకం బవున ట్లొనరించెదఁ జూడుఁ డనుడు నాతఁడు శ్రీహర్షనైషధంబులోని దగు "గమికర్మీకృత నైకనీవృ తా" అనుదాని నెట్లు దెనిఁగించి తని యడిగెను. అంత " గమికర్మీకృతనైకనీవృతుఁడనై" అని తెనిఁగించితి నని శ్రీనాథుం డనియె. అపుడు వీరన శ్రీనాథుం జూచి నవ్వి యోయీ నీ విందు "నై" తెనిఁగించితివి గాఁబోలు. అనుడు వీరనపల్కులకు కేమియు నుత్తర మీఁజాలక శ్రీనాథుఁడు తా నాగ్రంథమును దెనిఁగించుతఱిం జేసినపరిశ్రమవిశేషంబులు దెలుపఁదొడంగెను. అంత వీరన చిఱునవ్వు నవ్వి యిది మాబోంట్లకుఁ గాకున్న నేమి సామాన్యులకుఁ బఠనార్హం బగుఁ గావున దీనిని జగద్వ్యాపకంబు సేయు మనుడు శ్రీనాథుండు గర్వం బేది నిజావాసంబునకుం జనియె. వీరన యెట్లన్నను శ్రీనాథకృతనైషధము తెనుఁగుగ్రంథంబులలో మిగుల శ్లాఘనీయంబు. సంస్కృతంబునకు సరియైన తెనుఁ గని దీనినిం బండితు లందఱును నొప్పికొని యున్నారు.

## ఇచ్ఛావిహారవర్తనము.

ఈపినవీరన బాల్యమునుండియు స్వేచ్ఛావిహారంబున నుండునిష్టంబు గలవాఁడు. కావున నీతనిప్రవర్తనము తనవారికిని బొసుఁగును సరిపడి యుండదయ్యెను. ఇతనియన్న యగుపెదవీరన్నయు నీతనిని జిన్నచూపే చూచుచుండెను ఇతని యన్న భార్యమాత్ర మీతనిప్రభావమును దెలిసికొని పుత్త్రప్రేమచే గారవించుచు నీతఁడిలు సేరు సమయంబునకు నన్నపానంబులు సిద్ధపఱిచి యిచ్చుచు నుండెను. ఇట్లింటికి వచ్చి భోజనంబు సేయుట తడవుగ నిలువెడలి భోగభామినులగృహంబులకుం జని యచటనే కాలం బంతయుఁ గడపుచుండెను. ఇతఁడు భోగిసీజన భాగధేయుండై యుండియుఁ బతుంబున కొకపరి రాజదర్శనంబునకుఁ బోవుచుండెను. అహరహంబు పూర్వాహ్ణం బంతయు సుషుప్తిం గడపి, తములం బుమియుచు, వెలవెలందుకలగృహంబులు వెడలి, స్వగృహంబునకు వచ్చి అపుడు వదినె నడిగి దంతధావనోదకంబుఁ దెప్పించికొని ముఖసమ్మార్జనము సేయుచుండును. ఇట్టిప్రవర్తనంబు గలవాని జలకడ యోగమహిమాతిశయంబు లున్న వని యూహించుటకు నితరుల కేమియుక్తులు గలవు ? కావున నితనియన్నకు నితనియెడఁ గల్గిన నూయ దినదినప్రవర్ధమానం బయ్యెను. వదినెమాత్ర మీతనిని మిక్కిలి యడఁకువతో గారవించి ముం దీతనిపని నమర్చి మఱి గృహకృత్యంబులు సలువుచుండును. ఇతనియందు మహిమలు కొన్ని యున్నట్లు వ్రాసి యుంటిమి. వాని నిట జనంబులు వాడికొనునట్లుగ వివరించి, యితనిగ్రంథం బగుజైమినిభారతరచనావృత్తాంతము తర్వాత వ్రాయుదుము.

### పినవీరనయోగమహిమలు.

ఒకానొకదినంబున నీతఁ డుదయంబున గృహంబునకు వచ్చి దంతధావనోదకంబు తెమ్మని వదినె నడుగుడు నాపె సత్వరంబుగఁ దెచ్చి యందిచ్చినది. అపు డాపెకాలి నుండుపావడంబులు బొళబొళ యుసి

ధ్వని చేసినవి. అట్టిధ్వనిని దూరంబునం గూర్చుండి శివపూజ సేయుచున్న పెదవీరన్న విని, దీనిపావడముల క్రింద నందియలు లేకుండుటం జేసి యిట్లు ధ్వని పుట్టుచున్నది. కావున మనము త్వరలో నందియలం జేయింపవలయును. అని నిశ్చయించి ఆపని నెఱవేర్చుపనివాఁ డెవ్వం డని బుద్ధిని మనసున పనివాండ్రపేరు లూహించి యందులో నమ్మఁదగినవానిని, దనయింటికి సమీపంబున నున్నవాఁడును నగు నొకకంసాలిని నిశ్చయించి పూర్ణంబుగ నానసుపు ప్రయత్నంబు సేయింప నిశ్చయించుచుండెను. ఇట్లీతఁడు పరాయత్తచిత్తుండై పరంబును మఱచి యుండుతఱి నొకమనుజుఁడు లోనికిఁ జనుదెంచి పెదవీరన్న యున్నాఁడా? అని కేకవేసెను. దాని నీయాలోచనలో మునిఁగియున్న పెదవీరన్న తిన్నఁగ విని యూహింపలేక పెదవీరన్న యింటికడ లేఁడని యతఁడై యుత్తరం బిచ్చెను. దాని విని పినవీరన నవ్వి పెదవీరనగారు కంసాలి దుకాణంబుపైఁ గూర్చుండి పెద్దమ్మపావడంబులకు నందెలు చేయింపనున్నారు. మఱల రమ్మని పొమ్మనియెను. దాని విని పెదవీరన వెఱఁగంది స్వమనోగతార్థ మితని కెట్లు గోచరం బయ్యె నని యోజించి యీతనియొక్క మహిమాతిశయం బితరులకడఁ గల దని నిశ్చయించెను. ఇంతియ గాక తనమనంబు శివపూజాసమయంబున సంచలించుచున్న దానిని జూపుటకుఁ గూడ నాతఁ డీ వార్తం దెలిపె నని నిశ్చయించి నాఁట నుండియుఁ దమ్ముని యెడ జాగరూకుఁడై యుండెను.

## పినవీరన పిల్లలకడుపులు గడుగుట

ఇట్లుండ నొకానొకదినంబున నీ పెదవీరన శివపూజ సేయుచోఁ దనతమ్ముఁడు భోజనంబునకు రాఁ గని పూజాంతంబువఱకును భోజనంబున కితఁడు నిలువఁ డని సంశయించి యోరీ! పిల్లలం దోడ్కొని చెఱువునకుఁ బోయి కడుపులోపల వెలపల శుభ్రముగఁ దోమి స్నానంబు సేయించి త్వరితంబుగ భోజనము సేయ రమ్మనియెను. ఆమాట విని పినవీరన యాబాలుర సరోవరంబునకుఁ దోడ్కొని చని పొట్టలు

చించి నీటం బడవైచి కడుపులోపట వెలపటఁ బరిశుభ్రంబుగఁ గడిగి నిర్జీవంబు లగుకళేబరంబుల భుజంబులపై నిడికొని గృహంబునకుం జనుదెంచి యాకళేబరంబుల నన్నముం దుంచి నీయాజ్ఞానుసారంబుగఁ గుజ్జులకడుపులోపల వెలుపటను గడిగితిని. అనుడు నాకళేబరంబులు చూచి పెదవీరన కన్నకడుపు గావున దుఃఖంబు నిలుపలేక రొమ్ము మోఁదికొనుచుఁ దమ్ముని నేమియు ననఁజాలక రోదనంబు సేయ నారంభించెను. అతనిభార్యమాత్ర మాకళేబరంబులఁ జూచి యేమియు సంశయింపక అది యంతయుఁ దనముద్దులమఱఁది లీలావినోదంబులుగ నెఱింగి నవ్వుచు నూరకుండెను. పాకంబు సిద్ధంబు చేసి యాపె పినవీరనం జూచి "అబ్బాయీ! పిల్లలం దోడ్కొని భోజనంబునకు రమ్ము" అని పిలిచినది. తోడనే పినవీరన యన్నకు నద్భుత మావహిల్ల నాపిల్లల వారివారినామంబులచేఁ బిలిచి "మీయవ్వ బువ్వఁ దినఁ బిలుచుచున్నది. రండు రం"డని యాకళేబరంబులఁ బట్టి యెత్తెను. వారలు నదె వచ్చితి మని యుత్తరంబు లిచ్చి లేచి వచ్చిరి. వారిం జూచి పెదవీరన యత్యంతానందంబునఁ దమ్మునిఁ గౌఁగిలించికొని అతని కట్టిమహిమల నిచ్చినభగవంతుని నుతించి తనయదృష్టంబుం గొనియాడెను. అనంతరము పిల్లలంగూడి పినవీరన యన్నపొత్తున భుజించెను.

### జైమినిభారతాంధ్రీకరణవిశేషములు.

ఇట్టియద్భుతకృత్యంబులు సేయుపినవీరనవిఖ్యాతి లోకంబునం దంతటను వ్యాపింపఁదొడంగెను. జనులందఱును నితనిని దేవునిగఁ జూచుచుండిరి. ఇట్లుండ నీవీరన యొకనాఁడు సాళ్వగుండనరసరాజుతో సల్లాపించుచుండెను. అపు డాతఁడు జైమినిభారతంబును దెనిఁగింప సమర్థు లెవ రని పండితులతోఁ బ్రశంసించెను. వారపుడు కొందఱుపండితుల పేరులు సెప్పి వారిలో నీపినవీరన యత్యంతము సమర్థుం డని రని చెప్పి యుండెను. దాని విని రాజు మనకు గ్రంథము కొంచెము కాలములో సంపూర్ణము సేసి యీఁగలసమర్థు లెవ రనుడు. దానికిని నితఁడే

సమర్థుం డనిరి. ఎంతకాలములోపల దీని నీతఁడు రచింపఁగలఁ డనుడుఁ గొందఱ తితని కొకవత్సరంబు చాలు ననిరి. మఱికొందఱు తాఱుమాసంబులు పట్టు ననిరి. అందుపై రా జీతనిం జూచి మూఁడుమాసములకు సంపూర్ణ మగునా? యనుడుఁ బినవీరన నవ్వి యొకమాసములోపల నెలవేసిఁ జెప్పు ననియెను. అప్పుడు రాజు త న్నగతాళి సేయుట కాతఁ డట్లనె నని యూహించి మనంబునఁ గోపించి యొకమాసంబునకుఁ దేకున్నచో:—అని యూరకుండెను. దాని విని వీరన మరల నవ్వి "అట్లు తేకున్నచో మీయిష్టానుసారముగఁ గార్యము నడుపుఁ" డనియెను.

రాజును మంచిదే యని యపుడ కర్పూరతాంబూలంబు తెప్పించి యిచ్చి యాతనికి సెల విచ్చెను. వీరన యచ్చోటు వాసి యెప్పటి యట్ల తనలీలావాసంబునకుం జనుదెంచెను. సభ్యులందఱు నీపినవీరన వాక్యంబులకు భయ మంది "అయ్యయో! యీతనికి మతిభ్రమణంబు గల్గె నని శోచించిరి. ఆస్థానంబున నిట్లు వృథాజల్పనంబు లాడఁగూడునే? అనుడు మఱికొందఱు "బాగుబాగు! అతఁ డూరక ప్రగల్భవాక్యములు పల్కువాఁడు గాఁడు. ఏదియేని ధైర్యముచేతనే యిట్లు అని యుండును. లోకమునఁ దనముప్పు దప్పించుకొనఁ బ్రయత్నంబు సేయనివా రెవరుం గలరె. అయిన మన మొకనెల యోపికపట్టి యున్నచో సర్వంబును దెల్లం బగును." అని నిజనివాసంబులకుం జనిరి.

ఇట పినవీరన రాజుకడఁ దాంబూలం బందినవృత్తాంతంబు సభ్యులవలన నితఁ డన్న విని భయకంపితశరీరుండై తమ్ముఁ డింటి కెప్పుడు వచ్చు నని యతని రాక కెదురు చూచుచుండెను. ఇట్లుండఁ గొంతవడికిఁ దమ్ముఁ డింటికి వచ్చెను. అప్పు డాతఁ డతనిహస్తములు పట్టుకొని దైన్యము మొఖమునం దోఁపఁ "తమ్ముఁడా! రాజుకడ నీ వట్టిప్రతిన పట్టుట తగునా? నెఱవేఱుప నసాధ్యం బగుపని నెఱవేర్ప నేరితరంబు? నీవు మొదటినుండియు గడుసుదుకవుగనే యుంటివి గదా! ఇఁక నేమి

చించి నీటం బడవైచి కడుపులోపట వెలపటం బరిశుభ్రంబుగఁ గడిగి నిర్జీవంబు లగుకళేబరంబుల భుజంబులపై నిడికొని గృహంబునకుం జనుదెంచి యాకళేబరంబుల నన్నముం దుంచి నీయాజ్ఞానుసారంబుగఁ గుఱ్ఱలకడుపులోపల వెలుపటను గడిగితిని. అనుడు నాకళేబరంబులు చూచి పెదవీరన కన్నకడుపు గావున దుఃఖంబు నిలుపలేక బ్రామ్మ్రె మోఁదికొనుచుఁ దమ్ముని నేమియు ననఁజాలక రోదనంబు సేయ నారంభించెను. అతనిభార్యమాత్ర మాకళేబరంబులఁ జూచి దేమియు సంశయింపక అది యంతయుఁ దనముద్దులమఱఁది లీలావినోదంబులుగ నెంచి నవ్వుచు నూరకుండెను. పాకంబు సిద్ధంబు చేసి యాపె పినవీరనం జూచి "అబ్బాయీ! పిల్లలం దోడ్కొనిపి భోజనంబునకు రమ్ము" అని పిలిచినది. తోడనే పినవీరన యన్నకు నద్భుత మావహిల్ల నాపిల్లల వారివారినామంబులచేఁ బిలిచి "మీయవ్వ బువ్వఁ దినఁ బిలుచుచున్నది. రండు రం"డని యాకళేబరంబులఁ బట్టి యెత్తెను. వారలు సిదె వచ్చితి మని యుత్తరంబు లిచ్చి లేచి వచ్చిరి. వారిం జూచి పెదవీరన యత్యంతానందంబునఁ దమ్మునిఁ గౌఁగిలించికొని అతని కట్టిమహిమల నిచ్చినభగవంతుని నుతించి తనయదృష్టంబుం గొనియాడెను. అనంతరము పిల్లలంగూడి పినవీరన యన్న పొత్తున భుజించెను.

## జైమినిభారతాంధ్రీకరణవిశేషములు.

ఇట్టియద్భుతకృత్యంబులు సేయుపినవీరనవిఖ్యాతి లోకంబునం దంతటను వ్యాపింపఁదొడంగెను. జనులందఱును నీతనిని దేవునిగఁ జూచుచుండిరి. ఇట్లుండ నీవీరన యొకనాఁడు సాళ్వగుండనరసరాజుతో సల్లాపించుచుండెను. అపు డాతఁడు జైమినిభారతంబును దెనిఁగింప సమర్థులెవ రని పండితులతోఁ బ్రశంసించెను. వారపుడు కొందఱుపండితుల పేరులు సెప్పి వారిలో నీపినవీరన యత్యంతము సమర్థుం డని రని చెప్పి యుంటిమి. దాని విని రాజు మనకు గ్రంథము కొంచెముకాలములో సంపూర్ణము సేసి యీఁగలసమర్థు లెవ రనుడు దానికిని నితఁడే

సమర్థుం డనిరి. ఎంతకాలములోపల దీని నీతఁడు రచింపఁగలఁ డనుడుఁ గొందఱితని కొకవత్సరంబు చాలు ననిరి. మఱికొందఱాఱుమాసం బులు పట్టు ననిరి. అందుపై రా జీతనిం జూచి మూఁడుమాసములకు సంపూర్ణ మగునా? యనుడుఁ బినవీరన నవ్వి యొకమాసములోపల నెలవేనిఁ జెత్తు ననియెను. అపుడు రాజు త న్నెగతాళి సేయుట కాతఁ డట్లనె నని యూహించి మనంబునం గోపించి యొకమాసంబునకుఁ దేకున్నచో:—అని యూరకుండెను. దాని విని వీరన మరల నవ్వి "అట్లు తేకున్నచో మీయిష్టానుసారముగఁ గార్యము నడుపుఁ" డనియెను.

రాజును మంచిదే యని యపుడ కర్పూరతాంబూలంబు తెప్పిం చి యిచ్చి యాతనికి సెల విచ్చెను. వీరన యచ్చోటు వాసి యెప్పటి యట్ల తనలీలావాసంబునకుం జనుదెంచెను. సభ్యులందఱు నీపినవీరన వాక్యంబులకు భయ మంది "అయ్యయో! యీతనికి మతిభ్రమణంబు గల్గె నని తోఁచెడిని. ఆస్థానంబున నిట్లు వృథాజల్పనంబు లాడఁగూడు నే? అనుడు మఱికొందఱు "బాగుబాగు! అతఁ డూరక ప్రగల్భ వాక్యములు పల్కు వాఁడు గాఁడు. ఏదియేని ధైర్యముచేత నే యిట్లు అని యుండును. లోకమునఁ దనముప్పు దప్పించుకొనఁ బ్రయత్నంబు సేయనివా రొకరుం గలరె. అయిన మన మొకనెల యోపికపట్టి యున్నచో సర్వంబును దెల్లం బగును." అని నిజనివాసంబులకుం జనిరి.

ఇట పినవీరన రాజుకడఁ దాంబూలం బందినవృత్తాంతంబు సభ్యు లవలన నితనియన్న విని భయకంపితశరీరుండై తమ్ముఁ డింటి కెప్పుడు వచ్చు నని యతనిరాక కెదురు చూచుచుండెను. ఇట్లుండఁ గొంతవడికిఁ దమ్ముఁ డింటికి వచ్చెను. అప్పు డాతఁ డతనిహస్తములు పట్టుకొని దైన్యము ముఖమునం దోఁపఁ "దమ్ముఁడా! రాజుకడ నీ వట్టిప్రతిన పట్టుట తగునా? నెఱవేఱుప నసాధ్యం బగుపని నెఱవేర్ప నేరితరంబు? నీవు మొదటినుండియుఁ గడు దుడుకువుగ నే యుంటివి గదా! ఇఁక నేమి

గతి యోజించెను? అనుడు నవ్వి చినవీరన్న "యన్నా! భయము వలదు. ఈపని నెఱవేర్చుటకు సమర్థుండను. దీనిచే మనకు శాశ్వతయశం బుండును." అని యతనిని ధీరుం గావించి తాను భుజియించి నిజావాసంబునకుం జనియెను. పెదవీరన తమ్మునిమాటయందు గుఱి యుంచి యూఱడిలి కొన్ని దినంబు లూరకుండెను. ఇట్లు కొన్ని దినంబు లుండి తమ్ముఁడు గ్రంథ మెచ్చో నైనను వ్రాయుచున్నాఁడా యని యరయుచోఁ గాలయాపనంబు సేయుటయ కాని కార్యంబు సేయుచున్నట్లు కానరా దయ్యెను. కావున నీతఁడు తమ్మునియాన వదలి యాతనితో మరల నీప్రస్తావన సేయక యూరకుండెను. చినవీరన్న యానెల యంతయు నించుమించుగఁ గడపి యొకానొకదినంబున నింటికి వచ్చి తనవదినెను బిలిచి యొకగది శుభ్రంబు సేసి తగుమాత్రముగ నలంకరించి యొకటి రెండుదీపము లుంచి కొంతచమురు గూడ నుంచు మనియెను. అతని పల్కు లాలించి యావనితయు నట్లే యొనరించినది. చినవీరన్న నాఁటి రేయి యతిత్వరితగతి భుజియించి యాగదిలోనం బ్రవేశించి తల్పునకు గొలుసు తగిలించెను. ఇది యంతయు గ్రంథసన్నాహంబె కావచ్చునని యాతనివదినె గ్రహించినది. అన్నమాత్ర మీవృత్తాంతం బెఱుఁగనివాఁడు గావునఁ దమ్ముఁ డాదినం బింటఁ బవ్వళించునదృష్టము గల్గెనని సంతసించుచుండెను. ఇట్లుండ లోపలనుండి కొంతవడికిఁ దాటాకు వ్రాయ నగుచప్పుడు వీతెంచెను. దానిఁ దడ వాలించి తమ్ముఁడేమైనను వ్రాయుచున్నాఁడా? యని భార్య నడుగ నామె యూరకుండెను. ఇంకొకకొంతవడికి లోపలనుండి నిద్రించువాఁడు బుసకొట్టునట్లుగ వినంబడియెను. దాని విని యిప్పుడు తమ్ముఁడు నిద్రించుచున్నాఁడని నిశ్చయించెను. మఱికొంతవడికి బుసకొట్టుట తాటియాకువ్రాయుటయుం గూడ విననయ్యెను. ఇట్టిధ్వనులకు దడవు విని యేమియు నిశ్చయింపలేక పెదవీరన మెల్లన లేచి తమ్మునిగదిగుమ్మముసమీపంబునకుం జని నలుగెలంకులు చూచి తలుపున నొక్కచో నున్నరంధ్రం

బునఁ గన్నుంచి లోపలివృత్తాంతంబు గన్గొనుచో నొకసుందరాంగి సర్వాభరణభూషితయై యొకచేతఁ బైఁడిఘంటంబు పట్టి యింకొక చేత పుస్తకంబు పట్టిశరవేగంబున వ్రాయుచున్నట్లు గాన్పించెను. పిన వీరన యచ్చో నున్నమంచంబుపైఁ బవ్వళించి నిద్రించుచున్నట్లు చూపట్టెను. ఇట్టిచూపున కద్భుతం బందియుఁ బెదవీరన యాపెఁ బద్మభవుని రాణిగ నెఱుంగలేక సామాన్యభావంబుచేఁ జూచుచుండఁగా దీనిని గ్రహించి విరించిరాణి తనఘంటం బాతనికంటం బడ విసరినది. దానిచే నాతఁ డొకబొబ్బ వేసి భూమిపయిం బడుడుఁ బినవీరన్న లేచి వచ్చి యేమికారణం బనుచు నాతఁడు తనకన్నుం జూపెను. అపు డాతఁడు వెఱవకు మని లోపల వ్రాయుటచే రాలినతాటాకుపొడిఁ దెచ్చి యాతనికంటిలో నుంచి కొంతసేపు కట్టి విప్పినతోడనే మఱల నేత్రం బెప్పటి యట్లు కాన్పించెనఁట.

ఇట వాణి తన్నన్యుఁడు వీక్షించుటం జేసి యచ్చో నుండ నొల్లక యంతర్హిత యయ్యెను. వీరన మిగిలినభాగంబు సంపూర్తిచేసి దానితుదిని :—

సీ. పరఁగఁగ మల్లమాంబకుమారునకు పోన్నమకులాంబునిధిపూర్ణిమావిధునకు
భరతకీర్తికిఁ దులాపురుషాదిదానాంబు, జంబాలితాస్థానసౌధునకును
పరరాజభీకరధరణీవరాహున, కాత్రేయగోత్రపవిత్రునకును
గుండయనరసింహామండలేశ్వరునకు, నభ్యుదయపరంపరాభివృద్ధి
గీ. కరముగా భారతీతీర్థగురుకృపాస, మిద్ధసారస్వతుఁడు సత్కవీంద్రసఖుఁడు
శుకవిమూర్ధవిలుంఠనకులిశహస్త, పల్లవుఁడు చెప్పెఁ బినవీరభద్రసుకవి.

అని వ్రాసి గ్రంథంబు ముగించి దానిని వదినెతో విన్నవించి మాయన్నతో దీని నాస్థానంబునఁ జదువఁ జెప్పు మని ప్రార్థించెను. ఆపె తనభర్తతో మఱఁదియభీష్టంబు తీరుటకు నాస్థానంబునకుఁ జనుం డని మనవి యొనరించినది. అతఁడును తమ్ముఁడు నాపమీపంబున నున్న నే దీనిం జదివెదఁ గాని లేకున్న నే నిద్దానిని ముట్ట ననియెను. ఆమాట విని పినవీరన తానును వచ్చెద నని సమ్మతించెను.

ఇట్లు వీరు సంభాషించుచుండ సూర్యోదయం బయ్యెను. అవు డు సాళ్వగుండ నరసింహనృపాలుఁడు సభామండపంబునకు విచ్చేసి నిండోలగం బుండి పినవీరనరాక నిరీక్షించుచుండెను. అప్పుడు ముందు పెదవీరనయు నాతనియనంతరము పినవీరనయు వచ్చి యథోచితస్థానం బులఁ గూర్చుండి గ్రంథంబు పరిసమాప్తి యయ్యె నని తెలిపిరి. దాని ని విని రాజు మిగుల సంతసించి దానిం జదువు మనియెను. అపుడు పెదవీరన కథారంభంబు మొదలు గ్రంథాంతమువఱకును జదివెను. దానిని విని పండితులు పినవీరనసరసతకు నెంతయు సంతసిల్లి యీక్రింది పద్యంబును మరలఁ జదివిరి. అదియెద్ది యనిన:—

సీ. అమృతాంశుమండలం బాలవాలము గాఁగ, మొలిచె నొక్కటి జగన్మోహనముగఁ
జిగిరించె విలయసింధుగతకైతవడింభ, శయనీయవరపలాశములతోడఁ
బితృదేవతలకు సంచితసత్త్రిశాలయై, చెట్టు గట్టెను గయాక్షేత్రసీమ
నిలువ నీడయ్యె నిందీవరప్రియకళా, కోటీరునకు భోగికుండలునకు
గీ. మఱ్ఱిమాత్రంబె పిల్లలమఱ్ఱిపేరు, పేరువలెఁ గాదు శారదాపీఠకంబు
వారిలోపలఁ బినవీరువాక్యసరణి, సరసులకు నెల్లఁ గఱ్ఱరసాయనంబు.

అనుడు భళిరే! మీరావచించున దింత యొప్పునే. ఈతఁ డిట్టివాఁ డ యగును. ఈతనివంశము నట్టిదయ. ఈతని కల్పన లెట్టివో చూచితిరే.

ఉ. "అల్లన విచ్చుచెంగలువలందురజంబును గప్పురంబుపైఁ
జల్లఁగఁ జల్లనై వలచుసౌరభముల్ వెద చల్ల భావముల్
బల్లవహస్తచన్నుఁగవపయ్యెదజిమ్ముగఁ దోఁచుభాతిగాఁ
బిల్లలమఱ్ఱివీరన యభిజ్ఞుఁడు సెప్పఁగ నేర్చు కల్పనల్."

అని చెప్పి యాకవికి బహుమానం బీతనియిష్టానురూపంబుగ నిచ్చుట మేలని యితఁ డాశ్వాసాంతమందుఁ జెప్పిన:—

క. ప్రేమమున శ్రోతవక్తకుఁ "జామీకరహయము ధవళచామరములు నా
నామణివిభూషణంబులు, గ్రామము కృపసేయవలయు" గ్రంథసమాప్తిన్.

అనుపద్యానుసారంబుగ నిచ్చి భూపాలుఁడు బహూకరించెను.

ఇట్టిబహుమతుల నంది యాతఁ డుండఁ బండితు లందఱును గ్రంథంబు స్వల్పకాలంబున ముగియించుట యత్యాశ్చర్యంబు. అది యెట్లు ముగించితి రని ప్రశ్నంబు సేయఁ బినవీరన వాణి నారాణి యై

యుండ నేమి లోపంబు? దీని నొకదినంబులోపలఁ బూర్ణంబు సేసితి, ననియె. "వాణి నా రాణి" యని నిశ్శంకతోఁ బల్కినవీరనం గని మీరు వాణి నా రాణి యని పల్కెదరు గాఁబోలును? అనుడు వీరన నవ్వి "వాణి నా రాణి"యని కంఠోక్తిగాఁ బల్కెను. ఆమాటకుఁ బండితు లందఱును గనలి నీ వెంతవిద్వాంసుఁడవై యున్నను నిర్భయుంబుగ నిట్టిమాట లాడఁగూడదు. జగన్మాత యగువాణి నితఁడు తనరాణి యని పలుక సభ్యులు తగు నుత్తర మీక యూరకుండఁ జనదు. ఇట్టివాఁడు పండితమాని గాని పండితుఁడు గాఁడు. అని సభ్యులొక్క పెట్టుఁ బలుకఁ దొడంగిరి. అప్పు డంతరిక్షంబున నుండి యొకయశరీరవాణి గర్జారవంబున సభ్యుల నుద్దేశించి యిట్లనియె :—

"వాణి జగంబునకు మాత. ఇతనికిమాత్రము భార్య యగును. ఇతఁడు చతురాననునియపరావతారము. కావున నీసంశయం బింక వదలుం"డని పలుక వారందఱును నద్భుతం బంది యాతని నెంతయు గౌరవించిరఁట! ఇట్టి వృత్తాంతము లిప్పుడు చెప్పెడివారికిని వినువారికిని నద్భుతంబులు పుట్టించుటకు సంశయంబు లేదు. అయిన నాతనిచారిత్రమునకు వలయుప్రధానవృత్తాంతంబులు మనకుఁ దెలిసిన వివియే కావున వాని నిట వ్రాసితిమి.

## గ్రంథకథావిషయము.

ఈగ్రంథములోనిధర్మజునియశ్వమేధవృత్తాంతము భారతములో నున్నది. దానినే జైమినిముని యింకొకవిధంబునఁ జెప్పినట్లున్నది. ఇందలికథలు కొన్ని భారతంబునఁ గానరావు. ఈకవి రచియించినపర్వ మిది యొక్కటియే. రాజు కోరినదియు నింతమట్టుకే అయినట్లు గ్రంథారంభము తదంతంబుం జూడ గోచరం బగును. ఈకవిశైలి మృదు వగునదియైనను నన్నయకాఠిన్యముమాత్ర మించుక కలదు. ఈతనిపదశయ్యాదులు రసస్ఫూర్తియుఁ దిక్కనసోమయాజి కవనంబుంబోలె సరసంబై యుండును. ఇట్టి సామ్యంబుఁ జూడఁగోరెనచో భారతంబులో నశ్వమేధపర్వంబున నున్నసమానేతిహాసంబులు చూడఁదగును.

భారతాంధ్రకవులచరిత్రము ముగిసెను.

శ్రీ ర స్తు.

# క వి జీ వి త ము లు.

రామాయణాంధ్రకవులు.

## 6.

## హుళ్లిక్కి-భాస్కరుఁడు.

వాల్మీకిరామాయణముం దెనిఁగించిన కవిశిఖామణి యీతఁడే. ఈయనపేరిటఁ దెనుఁగురామాయణము భాస్కరరామాయణ మనంబరఁగును. ఇది భారతమునకంటెఁ గొంచెము పురాతనము. ఇది భాస్కరునిచేఁ దెనిఁగింపఁబడినట్లు విఖ్యాతి గల్గియున్నను గొంతభాగ మతనిపుత్త్రుం డగుమల్లికార్జునభట్టారకునిచేతను, నాశేష మతనిశిష్యుం డగునయ్యలభట్టారకునిచేతను దెనిఁగింపఁబడియెను. ఇదియును భారతంబువలెఁ గారణాంతరమున శైథిల్యము నొంది పిమ్మట నీయిర్వురిచేతను నంపూర్తి చేయంబడినట్లు గోచరంబయ్యెడిని. ఈవిషయం బగు వృత్తాంత మేమియు వాడుకలో లేదు కాని భాస్కరుఁడు మొదట గ్రంథంబు రచియించి యొకరాజునకుఁ గృతి యిచ్చుటకుఁ గొనిపోయె ననియు, నవ్వ డారాజు దానిం గైకొనకుండుటకుఁ గనలి దాని నచ్చోనుండుగుఱ్ఱపువానికిఁ గృతి నిచ్చె ననియు, నతఁ డాతనికి విశేషంబుగ వరాల నిచ్చె ననియుం గలదు. ఆగుఱ్ఱపువాఁడే సాహిణిమారుఁడు. ఇందు గుఱ్ఱపువాఁ డనుమాటకు గుఱ్ఱమును గాచువాఁ డని సాధారణముగ నర్థము చేయుదురు. ఇతఁడు గుఱ్ఱమును గాయువాఁడు గాక గుఱ్ఱపుదళవాయి యైనట్లు గాన్పించును. దానికి దృష్టాంతముగ నీవఆకే మనము భీమనచారిత్రములో కొంతచరిత్రము సూచించి యున్నారము. రాజు కృతి నందలేదుగనుకను భాస్కరునకు స్వవాక్యపరిపాలన

మే కావలిసి యున్నది గనుకను నాకృతి మారనపేరిట నిచ్చి యుండును. అట్లు గాకున్నచో సత్కవి నీచు నేల కృతిపతిం గావించును? అట్లుండదు. సాహిణిమారునిపూర్వులు తగినంతగొప్పవారు కాకపోవచ్చును. కావున రామాయణకృతిముఖంబున నతనివంశము మాత్రము వర్ణింపఁబడక యుండవచ్చును. భాస్కరుఁడీసాహిణిమారుని నుతించి చెప్పినపద్యము లనేకములు. అందొకచాటుధారాపద్యము నీక్రింద వివరింతను :—

"క. అప్పు లిడునతఁడు ఘనుఁడా, యప్పు డొసఁగి మఱలఁ గొందు నాతఁడు రాజా
చెప్పఁగవలె సాహిణిమా, రప్పను దానమున ఘనుఁడు రాజు నటంచున్."

ఈరామాయణగ్రంథకవుల వృత్తాంతములంగూర్చి ముందు వ్రాయుదము :—

## —॥ గ్రంథోత్పత్తికారణము. ॥—

ఈగ్రంథోత్పత్తినిగూర్చి "పురాణనామచంద్రిక" అనుగ్రంథములో నొకతీరునఁ జెప్పఁబడి యుండెను. అది యెంతవఱకు నిజమో మనము చెప్పఁజాలము. అందు యథార్థము విశేషించి యుండవచ్చునని యూహింపఁదగి యున్నది. ఆకథ యెట్లన్నను :—

"భాస్కరరామాయణము" భాస్కరునివలన నైనరామాయణము. ఇది భాస్కరుఁడు, అతనికుమారుఁ డగుమల్లికార్జునభట్టు, శిష్యుఁ డగుకుమారరుద్రదేవుఁడు, స్నేహితుఁ డగునయ్యలార్యుఁడు, ఈనలుగురుకవులచేతను రచియింపఁబడినది. అయినను వారిలో భాస్కరుఁడు ముఖ్యుఁ డగుటచేత నీగ్రంథము భాస్కరరామాయణ మన నెగడి యున్నది. ఇది యిట్లు రచింపఁబడుటకుఁ గారణ మేమనఁగా నాకాలమం దితనికి నాశ్రయుండై యుండినరాజునొద్ద నతనిబంధు వైనరంగనాథుఁ డనునాతఁడు రాజుయొక్కయాజ్ఞను బొంది ద్విపదరామాయణము రచియింపఁబూనుకొనఁగా నతనియందుఁ దనకుఁ గలసహజమత్సరముచేత రాజుతో "నీఘనతకు ద్విపదకావ్యము తగినది కాదు. నేను బద్యకావ్యమును జేసికొని వచ్చెదను. దానినిఁ బరిగ్రహింపుము" అనఁగా నతఁడు చెప్పినమాట తప్పుట యుక్తము గాదు గనుక రంగనాథుని

గ్రంథమునే కైకొనుతలంపున "నెవరు ముందు దెత్తురో వారికృతిని గ్రహించెదను" అని చెప్పి పంపెను. అప్పటికి రంగనాథుని రామాయణము మూఁడుపాళ్లు తీరియుండెను. కనుక నితఁ డది ముగియుటకు ముందే తనరామాయణమును ముగించి కొనిపోవ నెంచి మీఁదఁ జెప్పినమార్గురిసహాయముచేతను త్వరితముగా ముగించుకొని పోయెను. అప్పటికి రంగనాథుఁడు తనరామాయణమును ముగించి యాస్థానమునకుఁ దెచ్చియుండెను. అది చూచి రంగనాథునితట్టు కుడిచేతిని భాస్కరునితట్టెడమచేతినిఁ జాఁచెను. అందులకు భాస్కరుఁడు కోపగించుకొని "పక్షపాతము గలనీవంటిరాజునకు నిచ్చుటకంటె నాకృతి నొకగుఱ్ఱపువాని కిచ్చుట మేలు" అని పలుకుచు నాస్థానమునుండి వెడలి పోవుచు నుండఁగా నారాజుయొక్కగుఱ్ఱపుదళవాయి "కవిసార్వభౌమా! ఆడినమాట తప్పవలదు" అని దారికి నడ్డముగా వచ్చి మ్రొక్కెను. అంత నతఁడు వానికిఁ దనకృతిని నంకితముం జేసెను. కనుక నే యీగ్రంథాదియందు "సాహిణిమారా" యని సంబోధించి చెప్పఁబడి యున్నది. దీనిలోఁ గొన్నియంశములంగూర్చి మనము చెప్పియుంటిమి గావున దీని నిపుడు విమర్శింప నవసరము లేదు. మనవిమర్శనమునకు వ్యతిరేకింప నది యంతయు మనయభిప్రాయము ననుసరించి యున్నట్లు గ్రహింపఁదగును.

## రంగనాథరామాయణము.

రామాయణగ్రంథము పురాణము లన్నిటికంటెను ముందుగాఁ దెనిఁగింపఁబడినది. దీనినిఁ బెక్కండ్రు పెక్కుభంగులఁ దెనిఁగించిరి. వారిలో రంగనాథరామాయణగ్రంథకర్త మొదటివాఁడు. ఇతఁడు దీనిని ద్విపదగఁ దెనిఁగించెను. ఇది నెల్లూరిజిల్లాప్రాంతమున సర్వజనులకు వీథిపురాణముగ నుండెను. దీనిశైలి మృదువు గావున దీనిని జను లందఱును మిగుల నాదరంబుతోఁ జదువుదురు. ఇది కోనబుద్ధభూవిభునిచేతఁ దెనిఁగింపఁబడి యతనితండ్రి యగు విఠ్ఠలరంగనాథునకుం గృతి యియ్యఁబడినది. కావున దీనికి రంగనాథ

రామాయణ మని నామము కల్గినది. ఈరాజు దీనిఁ దెనిఁగించు కాలమునకు నన్నయభట్టారకుఁడు వ్యాకరణము చేసి యున్నట్లు కానరాదు. ఇందుఁ గొన్ని ప్రయోగములు నన్నయభట్టీయమతానుసారముగ నుండవు. ఆయా ప్రయోగభేదములు గ్రంథము సావకాశముగఁ జూచినచో గోచరము లగును. పూర్వవ్యాకరణములకు నిందు లక్ష్యములు పెక్కులు గాన్పించును. ఈగ్రంథములోనికల్పన లన్నియు మృదువు లయినవియు మధురము లయినవియు. ఇట్టిగ్రంథమును జూచి పద్యముగ దీని నింతకంటెను బ్రౌఢిమతోఁ దెనిఁగింపఁ దలఁచి భాస్కరుఁడును రామాయణమును శిష్యులతోఁ గలిసి యారంభించి గ్రంథము ముగించె నని కొందఱియభిప్రాయము. ఈగ్రంథమును దొలుత మల్లికార్జునభట్టారకుఁడు ప్రారంభించి కోనభూవిభుఁడు తనతండ్రిపేరు గ్రంథమున నుంచినట్లతఁడును దనతండ్రిపేరా గ్రంథమున నుంచినట్లును మఱికొందఱు వాడుదురు.

## రామాయణముపై విమర్శనము.

౧. ఇందలి బాలకాండములోఁ గృతిముఖమునఁ గృతిపతి వర్ణన గాని, కవివంశవర్ణనము గాని లేదు. ఆశ్వాసాంతమునందును గృతిపతి పేరు చెప్పఁబడక గిరిజాధీశునకుం గృతి యిచ్చినట్లుగా నున్నది. దీనిచివరను గవినామము తెలుపుగద్యముమాత్ర మున్నది. అందులో "అష్టభాషాకవిమిత్త్రికులపవిత్రభాస్కరసత్కవిపుత్త్రి మల్లికార్జునభట్టప్రణీతం బైన" అని వ్రాసి యున్నది.

౨. అయోధ్యాకాండములో "బుద్ధయకుమార సాహిణిమారా" అని కృతిపతి సంబోధింపఁబడియెను. ఆశ్వాసాంతములో "కాచమాంబాకుమారా" యని చెప్పఁబడియె. ఆశ్వాసాంతగద్యములో "సకలకళావిశారదశారదాముఖముకురాయమాణసారస్వతభట్టబాణనిశ్శంకవీరమారయకుమారకుమారరుద్రదేవప్రణీతం" బని గ్రంథకర్త వివరించెను.

3. అరణ్యకాండము మొదట నాశ్వాసారంభములో సాహిణి

మారుని సంబోధన యున్నది. రెండవయాశ్వాసాదియందును నట్లే యున్నది. ఈరెండాశ్వాసాంతములయందును సాహిణిమారునిపేరు స్పష్టీకరింపఁబడ దయ్యెను. ఈరెండాశ్వాసాంతగద్యములయందును "సకలసుకవిజనవినుతయశస్కరభాస్కరప్రణీతం బైన" యని యున్నది.

౪. కిష్కింధాకాండము మొదటిపద్యములో సాహిణిమారుఁడు స్పష్టపఱుపఁబడలేదు. ఆశ్వాసాంతమునందు "రథినీపాలాగ్రణీ సాహిణీ" యని చెప్పఁబడియెను. ఈయాశ్వాసాంతమందును"అష్టభాషేత్యాదిభాస్కరసత్కవిపుత్త్రిమల్లికార్జునభట్ట ప్రణీతం" బని యున్నది.

౫. సుందరకాండారంభమున "సాహిణిమారా" యనుసంబుద్ధి యిన్నది. ఆశ్వాసాంతమున సాహిణిమారునివిశేషణములు లేక యీశ్వరునివిశేషణము లున్నవి. ఆశ్వాసాంతగద్యమందు "అష్టభాషేత్యాదిభాస్కరసత్కవిపుత్త్రి మల్లికార్జునభట్ట ప్రణీతం" బని యున్నది.

౬. యుద్ధకాండారంభములో "సాహిణిమారా" యనుసంబోధన మున్నది. ఆశ్వాసాంతమునందు నీశ్వరనామంబే స్మరియింపఁబడినది. ముద్రితగ్రంథములలోమాత్రము ఆశ్వాసాంతగద్యమందు "అష్టభాషేత్యాదిభాస్కరసత్కవిమిత్త్రయ్యలార్యరచితం బైన" అని యున్నది. కొత్తప్రతులలో నున్నదానిని ముందు తెల్పుదము.

దీనినంతయుఁ బరిశీలించి చూడఁగా నీగ్రంథము మొదట సాహిణిమారునిపేరిట నుద్దేశింపఁబడినట్లును ననంతరము కారణాంతరమున నితనిపే రందుఁ జేర్పఁబడినట్లును గాన్పించును. లేకున్నచోఁ గృతిముఖంబునఁ గృతిపతివంశము వర్ణించుటయును షష్ఠ్యంతములు మొదలగునవియును గాన్పింపక మానవు. అట్టివి లేవు గనుకనే సాహిణిమారుఁడు గుఱ్ఱపుకాసుదా రని కొందఱును గాదు తదితరుఁడని కొందఱును క్షత్త్రియుఁ డని మఱికొందఱును వచియించుటకు నవకాశ మిచ్చెను. "బుద్ధయకుమారసాహిణిమారా" యని యుండుటచేతను బుద్ధరాజకుమారుఁ డీసాహిణిమారుఁ డనియు "మారయ

కుమారరుద్రదేవప్రణీతం" బని యుండుటచేత నితనికుమారుఁడు రుద్రదేవుఁడనియుఁ జెప్పుటకు సరిపడి యున్నది. కాని యిచట సాహిణిశబ్దమేమిగాఁ బ్రయోగింపఁబడినదో దానిని యోచింపవలయును. కిష్కింధా కాండాంతమున "రథినీపాలాగ్రణీ సాహిణీ" అని యుండుటచేత నిది వంశనామముగా సూచించుచున్నది. ఇది వంశనామమే కాకున్నచోఁ బ్రతిచోటను "సాహిణిమారా" అని సంబోధనతో నవసరముండదు. మారయకుమారకుమారరుద్రదేవప్రణీతకృతిలో సీతని కుమారుం డని చూపుటకుఁ దగినవిశేషణములు వ్రాయక "సకలకలా విశారద" మొదలగునితరవిశేషణంబు లుంపఁబడియెను. దీనిచేత మన మీవిధ మని నిర్ణయింపఁజాలము. కాని పైకథ యంతయు నవిశ్వసనీయ మని చెప్పఁదగినయొకవృత్తాంతముమాత్రము ప్రస్తుతము మనకు లభ్య మయినది. దాని నిచ్చో వివరించి మనయభిప్రాయము పిమ్మట దెల్పుదము ఈదేశములో ముప్పదియిద్దఱునియోగులపద్య మని యొక సీసమాలిక సర్వత్ర వాడుకలో నున్నది. అందులో నీసాహిణిమారుఁడును నొక్కఁడుగా లెక్కింపఁబడినాఁడు. దీనిఁబట్టి యిప్పు డితఁడు నియోగిబ్రాహ్మణుఁ డని నిర్ణయించి క్షత్త్రియపరముగా నన్వయింపఁబడినవిశేషణము లుపమలుగాఁ గైకొనవలయు నని చెప్పుదము. ఆపద్య మెట్లన్నను.

### ముప్పదియిద్దఱునియోగులపద్యము.

సీ. కవు లిచ్చి భూపతి గాచి పట్టగ నిల్పెఁ, బ్రజలకై రాయనభాస్కరుండు
వరదాతయై మణివలయము ల్కవి కిచ్చె, దండిభాస్కరునాతి కొండమంత్రి
భాస్కరువలెఁ గీర్తిఁ బడసెఁ దత్పుత్రుఁ డౌ, ఘనరామలింగభాస్కరుఁ డొకండు
గణకనిర్వాహంబు గల్గించె నూరూర, మహి గోపరాజు రామప్రధాని
దుర్గ మియ్యక శత్రువర్గంబుతోఁ బోరెఁ, బెల్లుగాఁ గరణము మల్లమంత్రి
యాత్మీయతపముచే నర్థినాలుకమడ్డు, కేడించె బండారుకేశమంత్రి
కవి పాముచేఁ జావఁగను నాయు వాతనికై యిచ్చె సేదమయాజిఘనుఁడు
వేటారుతునిలయ విమతులఁ జెండాడె, నాజిలో నాదెళ్లయయ్యలయ్య
పోరిలో నసహాయశూరుఁడై తెగి వెన్కఁ, బ్రతికె సిద్ధయతిక్కఁ దతులితముగఁ

బట్టిసపురవీరభద్రుని ప్రేమచేఁ, జెన్నొందె శ్రీకోటసింగరాజు
ఇలుచూర యాచకావళికి దాతలదాత, యై యిచ్చె నిట్టలవారివరప్ప
తనదుమీసముఁ దీసి తాకట్టుగా నుంచి, కొత్తరెడ్డిం డర్థి కోర్కెఁ దీర్చె
గణపతిదేవునికరుణ భట్టుకు మణి, యడపం బొసంగె గుండార్యవరుఁడు
అష్టసహస్రంబు లర్థి కిచ్చె సుకీర్తి, మహిని సింగనమంత్రిమాచఁ డుండెఁ
గొనియె భాస్కరునిచేఁ దెగుఁగురామాయణం, బారూఢి సాహిణిమారమంత్రి
యాంధ్రనైషధకావ్య మందె శ్రీనాథునిచే, మామిడిసింగనామాత్యమౌళి
ఘనదానకర్ణుఁడై గండపెండెముఁ దాల్చెఁ, గొఅవియన్నామాత్యకుంజరుండు
పగతుఁ జుట్టు మటంచుఁ బెక్కుఁగా ధన మిచ్చె, చేపట్టెఁ బెమ్మయసింగరాజు
గురుజగత్త్రియదానగురుమూర్తియై మించె, నందూరిభీమన్న గుండమంత్రి
ప్రాణికోటికి నెల్ల బహుభక్ష్యభోజ్యాన్న,సత్త్రము ల్పెట్టె విస్సప్రధాని
భట్టుమూర్తికిఁ గినుక రెట్టింపఁ బచ్చలహార మర్పించెఁ దిమ్మగనుమౌళి
ఘనదైవతంబు ద్రాక్షారామభీమేశుఁ, డని కొల్చె బెండపూడన్నమంత్రి
నీడఁ ద్రొక్కుడునీళ నెతి నర్థి కభిమతం, బిప్పించెఁ జేమకూరప్పరాజు
ఘనసప్తసంతతు లొనరించి సత్కీర్తి, వెలయించె విఠ్ఠలవెల్లమంత్రి
యమితశత్రుల గెల్చి యవనిఁ బాలనఁ జేసె, రహిఁ గుంటుపలి ముత్తరాజమంత్రి
తను నేలునృపతిచేతను మేటికృతిఁ గాంచె, శ్రీగుంటుపలినరసింగమంత్రి
ఘనభట్టుసుకవికి మణిమండల మొసంగి, నందితిమ్మకవీంద్రుఁ డుండెఁ గృతులఁ
గవుల కర్థ మొసంగి ఘనకీర్తిని వహించె రహిఁ గూరగాయలరామమంత్రి
వాకిటికావలిజోకతో నొనరించి, దివ్యకీర్తి వహించెఁ దిమ్మమంత్రి
రిపు గెల్వ నృపుఁ డిచ్చువిపులాగ్రముల నర్థి, కర్పించెఁ గటికికామన్నమంత్రి
కవిబుధావళి నేలి ఘనకీర్తిని వహించె, వరకోటిపల్లిశ్రీశరభమంత్రి
నిరతాన్నదాతయై నిత్యకీర్తి వహించెఁ, గాళిబందాపరదేశమంత్రి.

ఈ పద్యమే నిజమగునదియేని (కాదనుట కాధారములు లేవు) సాహిణిమారుఁడు నియోగిబ్రాహ్మణుఁడు కాని వెలిజాతివాఁడు కాఁడు. దీనికి వ్యతిరేకముగాఁ జెప్పఁబడినకథ యంతయు విశ్వసింపఁదగ దని నిశ్చయింపక తప్పదు. ఇఁక మంత్రిభాస్కరుఁ డెవరు? హుళక్కిభాస్కరుఁ డెవరు? అను మీమాంస యొకటి యున్నది. ఆవృత్తాంత మీ క్రింద ముచ్చటింతము :—

మంత్రి భాస్కర, హుళక్కిభాస్కరు లొక రని తిక్కనసోమయాజి తననిర్వచనోత్తరరామాయణములోఁ దాను “ గుంటూరివిభుని

మంత్రిభాస్కరునిమనుమఁడ" నని చెప్పెను దానిం బట్టి యీ రామాయణమును రచియించినభాస్కరుఁడే యతఁడు కానోపునా యని యొకసంశయము పొడముచున్నది. ఇట్టిసంశయమే కొందఱుపండితులకుం గల్గి శ్రీయాంధ్రభాషాసంజీవనిలోఁ బ్రశంసింపఁగా, ఆ ౧౮౯౧ సంవత్సరము ఫిబ్రేవరునెల శ్రీప్రబంధ కల్పవల్లి "ఆంధ్రభాషాసంజీవనిలోని హుళక్కి" యనుపేరిట నీక్రిందియుపన్యాసమును బ్రకటించినది. అది ప్రస్తుతాంశమున కెంతయు నుపయోగించును గనుక దాని నిట వివరింతుము. అదెట్లన్నను :—

తిక్కనసోమయాజియొక్క పితామహుఁడు మంత్రి భాస్కరుఁ డనియే సంజీవనిలోఁ బలుకఁబడెను గాని హుళక్కి భాస్కరుఁ డని కాదు "మంత్రిభాస్కరు మత్పితామహుని దలఁచి" యని సోమయాజియే స్వరచితనిర్వచనోత్తరరామాయణముయొక్క ప్రథమాశ్వాసమున వక్కాణించెను. మంత్రిభాస్కరుఁడే హుళక్కిభాస్కరుఁ డని ప్రబంధకల్పవల్లీవిలేఖకులు నిష్కర్షించుటకుం గలకారణముల నెఱుంగ నుత్సహించుచున్నారము" అని యుండెను. మఱియును సోమయాజిగారు స్వకృతభారతమున "దేవా! జనమేజయునకు వైశంపాయనుం డిట్లనియె." అని యనియే వాగనుశాసనమతానుసారులై రచియించిరి. కాని వారు భారతమునకంటెఁ బూర్వము రచియించిననిర్వచనోత్తరరామాయణమునందుఁ దమతాత యైనమంత్రిభాస్కరునిపథకము ననుసరించిరి. అదెట్లన్నను; సకలసుకవిజనప్రణుతయశస్కరభాస్కరప్రణీతం బైనశ్రీరామాయణమునం దారణ్యకాండంబునఁ బ్రథమాశ్వాసము తుదను "శా. పుణ్యుండూర్జిత...ఉర్వినెందున్" అనియు నీమొదలగుకొన్నిసంగతులు వ్రాసియుండెను, దానిచే సంజీవనిలో రామాయణ గ్రంథకర్త యగు మంత్రిభాస్కరుఁడు తిక్కనసోమయాజికిఁ దాత యనియే తెలిసినది.

౧. ప్రథమమున నిర్వచనోత్తరరామాయణములోఁ దనకుఁ బితామహుఁడు గుంటూరివిభునిమంత్రిభాస్కరుం డనియు, నతనిమనుమఁ

డ నని యుఁ జెప్పికొనినచోఁ దనకవిత్వము సంప్రదాయశుద్ధ మని లోకమునకుం దెలియు ననియుం జెప్పెను ఎట్లన్నను:— నిర్వచనోత్తర రామాయణములోని :—

గీ. సారకవితాభిరాము గుంటూరివిభుని, మంత్రిభాస్కరు మత్పితామహుని దలఁచి
యైనమన్ననమెయి లోక మాదరించు, వేఱె నాకృతిగుణములు వేయు నేల.

అనుపద్యముంబట్టి సోమయాజి నిర్వచనోత్తరరామాయణమును రచించుటకుఁ బూర్వము కవిత్వసంప్రదాయమునకు విశేషముగఁ బ్రసిద్ధికెక్కినభాస్కరుఁ డనునొకకవి యుండె నని యూహింప వలసి యుండును. అట్టివారిలో రామాయణమును దెనిఁగించినభాస్కరుఁడు తప్ప మఱెవ్వరును భాస్కరులు గానరారు. ఇందుచేత నీతఁడే తిక్కనసోమయాజి వక్కాణించినభాస్కరుఁ డని యూహింతము.

౨. ఇంతియ కాక తిక్కన సోమయాజి యుత్తరరామాయణమును దెనిఁగించుటకుఁ గారణము నీతనిమనుమఁ డగుటచేత నే యని తోఁచెడిని. రామాయణముయొక్క పూర్వభాగము తిక్కనతాతచే రచియింపఁబడినచోఁ దిక్కన యాగ్రంథమంతయుఁ బూర్తి సేయుటకు యత్నించుట లెస్సయై యుండునుగదా. అపుడు రామాయణ మంతయు వారి వంశజులచేత నే తెనిఁగింపఁబడె ననుఖ్యాతి గల్గును. అట్టిసంబంధ మేదియేని లేనిచో నొరులు రచించినగ్రంథశేషమునే తిక్కన తెనిఁగింప నుత్సహించుట గలుగదు. భారత మెట్లు తెనిఁగించి రంటిరో దానికిఁ గారణాంతరము లున్నవి.

3. భారతములోఁ జెల్పఁబడినయీక్రిందిపద్యము పైయూహలను మఱికొంత బలపఱచుచున్నది. ఆపద్య మెద్ది యనిన భారతమువిరాట పర్వములో :—

“సీ. మజ్జనకుండు సన్మాన్యగౌతమగోత్ర, మహితుండు భాస్కరమంత్రితనయుఁ
డన్నమాంబాపతి యనఘులు సింగన, మల్లన సిద్ధనామాత్యవరుల
కూరిమితమ్ముండు గుంటూరివిభుఁడు కొమ్మనదండనాథుండు మధురకీర్తి.”

అని యున్నది. దీనింబట్టి భాస్కరునకు నల్గురుకొడుకు లనియు వారినామములు సింగన, మల్లన, సిద్ధన, కొమ్మన యనియు నుండెను.

రామాయణమును రచియించినభాస్కరునకు మల్లికార్జునభట్టారకుం డనుపుత్త్రుఁ డున్నట్లు స్పష్టమే. ఇతనినే మల్లన యని చెప్పినఁ జెప్ప నొప్పును. వీనింబట్టి చూడఁగా రామాయణగ్రంథకర్త యగుభాస్కరుఁడే తిక్కనసోమయాజికిఁ దాత యగుభాస్కరుఁ డని చెప్పఁదగి యున్నది.

కాని కొందఱమతముచేతను హుళక్కిభాస్కరుఁడును, మంత్రి భాస్కరుఁడును వేఱని యున్నది. దానికి వారిచేఁ జెప్పఁబడినకారణ మేమనఁగా హుళక్కిభాస్కరునిగద్యము "శ్రీమదష్టభాషాకవిమిత్త్రే" త్యాది యైనట్లు బాలకాండాదులు రచియించినమల్లికార్జునభట్టుగద్యము చేతను, యుద్ధకాండశేషమును రచియించిన యయ్యలార్యునిగద్యము చేతను దెలియవచ్చుచున్నట్లు నున్నది. ఇది యెంతవఱకు సయుక్తికమో యాలోచింతము. బాలకాండము, కిష్కింధాకాండము,సుందరకాండము వీనితుదను "అష్టభాషాకవిమిత్త్రకులపవిత్త్రభాస్కరసత్కవిపుత్త్ర" అని యున్నది. ఈమొదటివిశేషణము భాస్కరుని కన్వయించి యీసందేహ ముల నందుచున్నారు. ఇవి మల్లికార్జునభట్టునకే విశేషణము లేల కాఁ గూడదు? ఆపక్షములో నరణ్యకాండాంతములో నున్న "సకలసుకవిజ నవినుతయశస్కరభాస్కరప్రణీతం బయిన" యనుగద్యము పైదానిని బాధింపదు. ఇఁక నయ్యలార్యుఁడు యుద్ధకాండాంతమున వ్రాసినగద్య ములో నుండు "అష్టభాషాకవిమిత్త్రకులపవిత్త్రభాస్కరసత్కవిమిత్త్రా య్యలార్యరచితం బయిన" యనుదాని నాలోచింపవలసి యున్నది. ఇక్కడ నైన నీబిరుదయ్యలార్యునకును గలదా యని యూహింప వలసి యున్నది. అది యెట్లనఁగా :—

"ఇది శ్రీశాకల్యమల్లకవివరరామన్నసింహావరజాప్పలార్యవరనందనోభయ భాషాకవితావిశారదశారదాచరణకమలపరిచరణపరిణతమానసాయ్యలార్యవిరచితం బయి న శ్రీమద్రామాయణంబునందు యుద్ధకాండశేషంబునందు సర్వంబును నేకాశ్వాసము"

అని. ఈతఁడు తాను "హుళక్కిభాస్కరుఁడు చెప్పఁగా మిగిలి యున్న యుద్ధకాండమును బూర్తిచేసితి" ననియును. యుద్ధకాండాంత మునం దొకపద్యము గద్యస్థానీయముగాఁ జెప్పెను. దీనితోడనే

గ్రంథము ముగియునట్లుగాఁ దోఁచుచున్నది దానిక్రింద వ్రాయఁబడిన రెండుమూఁడుపద్యములును గద్యమును పైగద్యములో నవీనకల్పితములుగాఁ దోఁచెడిని. యుద్ధకాండముతుదను వ్రాయఁబడినపద్య మిట వివరింతము. అ దెట్లన్నను :—

చ. అమర వాల్మికిభాస్కరమహాకవి చెప్పఁగ నున్నయుద్ధకాం
డముతరువాయి చెప్పె వికటప్రతిభావణుఁ డప్పలార్యస
త్తమసుతుఁ డయ్యలార్యుఁడు కృతస్థితి నార్యులు మెచ్చునట్లుగా
హిమకరతారభాస్కరమహీవలయస్థిరలక్ష్మి చేకుఱన్.

అను నిట్టివానిం బట్టిచూడఁగా రామాయణమును రచియించినట్టి భాస్కరుఁ డొక్కఁడే కాని యిర్వురు కా రనియును, నతనికే “సకలసుకవిజనవినుతయశస్కరభాస్కరుఁ” డనియును, వాల్మీకిభాస్కరుఁ డనియును నామము లనియును నూహింపనై యున్నది. ఇదివఱలో సూచింపఁబడినకారణములచేత నితఁడే గుంటూరిప్రభుసమంత్రి యగుభాస్కరుఁడనియుఁ దిక్కనసోమయాజికిఁ దాత యనియు నూహింపఁదగి యున్నది. గుంటూరివిభుఁ డెవ్వరోమాత్ర మూహింపఁజాల కున్నారము. తిక్కన నెల్లూరిప్రభుఁడగుమనుమసిద్ధికడ నున్నట్లు ప్రసిద్ధి గలదు. ఇతని పూర్వులు మనుమసిద్ధికిఁ బూర్వులకడ నుండుట సహజము. అట్లు గానుపించక తిక్కనయొక్కపూర్వులు గుంటూరివిభునికడ నున్నట్లుగాఁ గాన్పించును. పైపద్యములో “గుంటూరివిభున్ మంత్రిభాస్కరు” నని విడఁదీసినచో గుంటూరికి మిరాసీదా రని కాని మొఖాసాదా రని కాని కూడ నర్థము చెప్పవచ్చును. గ్రంథదృష్టాంతము లేదు గావున నీవిషయము ముగించి, యిట్టిగుంటూరి విభునికడ మంత్రిగా నున్న భాస్కరుఁ డనేకపదపద్యముల నంది యుండుటంగూర్చి యోజింతము. ఇప్పుడు మనము మాటలాడుకాలములో దేశచారిత్ర మేమియును దెలియదు. దేశములో నీభాస్కరుఁ డేయేఘనకార్యములు చేసి పదపద్యము లందెనో దాని నూహింప నలవి కాక యున్నది. అట్టి పదపద్యము లేమయిన నున్నవా యనియు సంశయింపవలసియున్నది. ఆంధ్రికవిచరి

త్రములో వ్రాయఁబడినపద్యము లన్నియుఁ గృష్ణరాయనికాలము లోఁ బ్రసిద్ధిఁ జెందినరాయనిభాస్కరునివియును, నతని వంశస్థులవి యును గాని రామాయణగ్రంథకర్త యగుభాస్కరునివి కావు. రాయనిభాస్కరునిచారిత్ర మీవఱకే మత్కృతము లగురాజచారిత్ర ములతో వ్రాయఁబడి యున్నది. అం దీపద్యములును వానివానికిఁ గలకారణములును సూచింపఁబడినవి. "రాయ" లనుబిరు దాంధ్రదేశపు ప్రభువులకుఁ గాక కర్ణాటదేశప్రభువులకే చెల్లును. దానిచేతనే యిప్ప టికిని నాదేశములో గొప్పవారిని సంబోధించునపుడు సర్వత్ర "రాయల వారూ3" అని వాడఁబడుచుండును. అట్లుండఁగా "రాయనిమంత్రిభా స్కరుఁ డని ప్రత్యేకము" వర్ణించి చెప్పినపద్యములుగూడ రామా యణకవి యగుభాస్కరునకు సమన్వయించుట సంప్రదాయవిరుద్ధ మని మాయభిప్రాయము.

రాయనిమంత్రిభాస్కరునికుమారుని పేరు. * కొండన. ఈకొం డనయే కొమ్మన యని వ్యవహరింపఁబడు ననుమాటకు గ్రంథదృష్టాంత మేమియును లేదు. కొండన కొమ్మన కావచ్చు ననుదానికిఁ గారణము భాస్కరునివిషయ మయి కలిగినపొఱపాటే యగును.

### భాస్కరుని కాలనిర్ణయము.

ఇఁక నీరామాయణకవియొక్క కాలనిర్ణయముంగూర్చి యాలో చింపవలసి యున్నది. అది యంతయు తిక్కనకాలనిర్ణయముంబట్టి ని ష్కర్షింపఁబడును. తిక్కనకాలనిర్ణయ మయినది గనుక నతనితాత యగుభాస్కరునికాలమును సులభముగ నిర్ణయింపవచ్చును. అయినను నాంధ్రకవిచరిత్రములో నీయఁబడినభాస్కరునికాలముంగూర్చి కొంచె ము సంవాదింతము :—

బెజవాడమల్లేశ్వరస్వామికి భూమి యిచ్చినట్లుగా నచటి స్తంభము న నొకశాసన మున్న దనియును, నాశాసనములోఁ జెప్పఁబడినరాయన

* చూ. ముప్పదియిదట్టునియోగులపద్యము.

ప్రగ్గడ రాయనిభాస్కరుఁడే యనియును నతనిదానశాసనకాలము శా. సం. ౧౧౩౮ అప్పటంబట్టి భాస్కరునికాల మదియే యగునియును వ్రా యఁబడియెను. కాని యీశాసనము తిరుగా నొకపరి పరిశీలింతము. ఈ శాసనసంగ్రహ మింగ్లీషులో న్యూయలుదొరవలన బ్రాచీనశాసనపట్టి కలో నీక్రిందివిధముగా వ్రాయఁబడియున్నది. ఎట్లన్నను:—

" (35) On the Same. S. S. 1138 (A D 1216) Grants by Bollana, Brahman "minister" and by Rayana Peggada, Commander of the Forces of Sriman Mahamandalika Gunturi Odaya Rajah"

దీనింబట్టి చూడఁగా శ్రీమన్మహామండలీకగుంటూరియుదయరా జుయొక్క సేనానాయకుఁ డగురాయనప్రగ్గడవలనను, బొల్లన యను నొకబ్రాహ్మణమంత్రివలనను దానములు శా. సం. ౧౧౭౭ సంవత్సర మునం దీయఁబడినట్లుగాఁ గాన్పించును. ఇందులో గుంటూరిప్రభువికి రాయనప్రగ్గడ సేనానాయకుఁడు గాని మంత్రి కాఁడు. మంత్రికిని సేనా నాయకునకును భేదము చాలఁ గలదు. కావున నాసమన్వయము సరిపడి యుండదు. ఇంతియకాక రాయనప్రగ్గడ యనఁగా రాయన్న యను మంత్రి యని యర్థమగును గాని రాయనిభాస్కరుఁ డని యర్థము కాఁ జాలదు. ఇట్టిశాసనబలంబున నీహుళిక్కిభాస్కరుని కాలనిర్ణయముఁ జే యుట యెంతమాత్రమును యుక్తియుక్తము గాదని యూహించెదము.

ఇఁక భాస్కరునికాలనిర్ణయము చేయుటకుఁ దగినసాధనము లేవి యని యూహింపఁగాఁ బ్రతాపరుద్రవంశచారిత్ర మనంబరఁగు సోమదేవరాజీయములో రుద్రమహారాజుసభకు హుళిక్కిభాస్కరుఁడు రంగనాథుఁడు మొదలగువారలు వచ్చుచుండి రనుకథంబట్టి యితఁడు రుద్రునికాలమువాఁ డని నిర్ణయింపవచ్చును. కాని యీరుద్రునికాల ముఁను నాగ్రంథములో నొకవిధముగా విశదీకరించినను రుద్రనాము లిర్వురు మువ్వురుప్రభువు లుండుటచేత నొకరికాలమందు జరిగినవృత్తాం తము లింకొకరికాలములో జరిగినట్లు కాలనిర్ణయసామగ్రి లేకుండుటం

జేసి యట్లుగా గ్రంథకర్తవలనం దెల్పఁబడియె నని తోఁచును. ఇప్ప టికి మనకు దొరకినశాసనసహాయముంబట్టి యేకథ యేరుద్రునికాల ములోనిదో కొంత నిర్ణయింపఁగలము. ప్రస్తుతము మనము మాటలా డుచున్న హుళిక్కి-భాస్కరునికాలము నుడివినతోడనే పద్మనాయకుల (వెలమల) వృత్తాంతము చెప్పి యట్టివెలమ లందఱును రాజును సేవిం చి యుండి రని వ్రాసెను. ఈ వెలమలశాఖ ప్రతాపరుద్రునికాలములో బడబానలభట్టారకునివలన శపింపఁబడినట్లు పద్మనాయకచరిత్ర య నునొకచారిత్రమువలనం గాన్పించును. అందులకు నొకశాసన మున్న ట్లాగ్రంథములో వ్రాయఁబడియున్నది. ఆశాసనకాలము శా. సం. 1019 అయి యున్నది. దీనికి సంబంధించు మొదటిప్రతాపరుద్రునికాల మును సోమదేవరాజీయములో వ్రాయఁబడి యున్నది.

అదెట్లన్నను :—

| | | శా. స౦. | శా. సం. |
|---|---|---|---|
| కాకతిప్రోలరాజు | ... | 909 | 982 |
| రుద్రదేవరాజు | ... | 982 | 1054 |
| మహాదేవరాజు | ... | 1054 | 1057 |
| గణపతిదేవరాజు | ... | 1057 | 1085 |

ఈప్రకారముగా నున్నవి. కావున సోమదేవరాజీయములో హుళిక్కి-భాస్కరుఁడు ప్రతాపరుద్రునియాస్థానమునకు వెళ్లినాఁ డని చెప్పినవృత్తాంతమునకు మొదటిరుద్రదేవరా జని సమన్వయించినచో సరిపడి యుండును. ఇది యథార్థముగాఁ గూడఁ గాన్పించును. ఏమనిన నితనిమనుమఁ డగుతిక్కనసోమయాజి గణపతిరాజునసభకుం బోయె నని యు నచ్చో నతనికి భారతార్థంబు లుపన్యసించి చెప్పె ననియు నీగ్రం థములోననే కాన్పించుచున్నది. కావునఁ దిక్కనసోమయాజికిఁ బూర్వుఁ డగుభాస్కరుఁడు గణపతిదేవునకుఁ బూర్వుఁ డగురుద్రమహారాజు కాల ములో నుండె నని చెప్పుట సయుక్తికమును నిర్బాధకమును నై యు న్నది. కావున భాస్కరునికాలము శా. సం. 950 మొదలు 1000

లోపున ననఁగా క్రీ. శ. 1027 మొదలు 1077 లోపుగానై యుండును. కావుననే యీకృతిరచన భారతమునకుఁ బూర్వమే యని నిర్ణయింప వలసి యున్నది. అప్పటికి నన్నయభట్టారకునియాంధ్రశబ్దచింతామణి పుట్టి యుండినట్లు కాన్పించదు. కావున నిందు నాంధ్రశబ్దచింతామణికి విరుద్ధము లైనకొన్ని ప్రయోగములు గాన్పించును. ఆంధ్రశబ్దచింతామణి ననుసరించియే భారతము రచియింపఁబడినది గనుక భాస్కరరామాయణము దానికిఁ బూర్వ మనియే చెప్పనొప్పును.

సోమదేవరాజీయములోఁ బ్రతాపరుద్రునిదర్శనమునకు వచ్చువారు "శాకల్లిమల్లికార్జునభట్టు" మొదలయిన బ్రహ్మవిద్వాంసులు బంగరుపల్లకీ లెక్క వచ్చువారు నూటయేఁబండ్రును, హుళిక్కిభాస్కరుఁడు మొదలుగాఁ గలసత్కవీశ్వరు లిన్నూటయేఁబండ్రును, గుండభొట్లు,ప్రతాపభొట్లును మొదలగు వేదవేదాంగపారగు లయినపురోహితు లిన్నూట యిరువండ్రును" అని చెప్పఁబడి యుండెను. అందులోనే హుళిక్కిభాస్కరునివిషయమై మఱియొకచోటఁ గొన్నిమాటలు వ్రాయఁబడి యున్నవి. అవియును నాగ్రంథక ర్తచేఁ గాలనిర్ణయ మెఱుఁగకుంటచే వ్రాయఁబడినవిగా భావింపవలసియున్నవి. అందుఁ గొన్ని రెండవరుద్రునివృత్తాంతములును గొన్ని మొదటిరుద్రునివృత్తాంతములును వ్రాయఁబడినవి. ఆరుద్రచరిత్రములో నదియంతయు స్పష్టపఱుపఁబడును.

## భాస్కరనామములఁగూర్చి.

రామాయణమును దెనిఁగించినభాస్కరుఁ డాంధ్రదేశములో సుప్రసిద్ధుఁడే. అయినను నతనినామము గలవారు మఱికొన్నికార్యములలోఁ బ్రసిద్ధి నొందినవారును మఱికొందఱు గలరు. కావునఁ బాఠకులు "గుంటూరిభాస్కరుఁడు, హుళిక్కిభాస్కరుఁడు" అనువా రిరువురును నొకరే యనియును, "వినుకొండభాస్కరుఁ"డని యున్నవు డతఁడు దానమున విఖ్యాతుఁ డగు "రాయనిభాస్కరుఁ"డనియును,"గుంటుపల్లిభాస్కరుఁ"డని చెప్పినచో నింద్రజాలాదికములఁ జేసి కోటివఱకును విప్రవినోదులు మొదలగువారివలనఁ దద్విద్యాప్రకటనావసరమున స్మరియింపఁబడు

వాఁ డనియును, "రామలింగభాస్కరుఁ" డని యుండినచో భట్రాజుల చే నుతియింపఁబడు "రాయనిభాస్కరునిమనుమఁ" డనియును గ్రహింప వలయును. ఇట్టియేర్పాటులు చేసికొననినాఁడు వీరివృత్తాంతములు కల గలపులై వీరికాలనిర్ణయమును జేయనీయక యెట్టివారి కైనను దిగ్భ్రమనుఁ బుట్టించును. కావున మెలఁకువతో దీనిని గ్రహింపవలయును.

రామాభ్యుదయకావ్యము.

ఇదివఱలో రామాయణము నాంధ్రీకరించినకవులవృత్తాంతము ను జెప్పియున్నాము. ఇవుడు మనము రామాయణనామముతో నొప్పు గ్రంథములు రచియించినకవులను జెప్పవలసియున్నది. కాని యట్టినామ ములు గలపుస్తకము లనంతములై యున్నవి. కొందఱు తమగ్రంథములను ప్రబంధములుగా రచియించిరి. మఱికొందఱు కేవలసంగ్రహములుగా రచి యించిరి. ఇంకొకకొందఱు శతకములుగా రచియించిరి. అవి యన్నియు రామాయణనామముతో నొప్పక యున్నను రామకథ కలవిగా నున్న వి. కావున నే నట్టిగ్రంథములు వదలి పురాణములతో పాటుగ గణనకు వచ్చినవాల్మీకి రామాయణమును ప్రబంధములతో పాటుగ గణనకు వ చ్చినరామాభ్యుదయ మనుగ్రంథములంగూర్చియే యిందుఁ బ్రశంసింప నై యున్నాను. అం దిదివఱకుఁ బురాణముగా నెన్నబడిన వాల్మీకి రామాయణము నాంధ్రీకరించిన కవుల గూర్చి వ్రాసియున్నాను గావున నే నిపుడు రామాభ్యుదయగ్రంథకర్త యగునయ్యలరాజురామభద్రయ్య చారిత్రముంగూర్చి వ్రాసెదను:—

---

## 7.

# అయ్యలరాజు రామభద్రయ్య.

ఇతఁ డొంటిమిట్ట (ఏకశిలానగర) నివాసి. ఒంటిమిట్టరఘువీరశ తకము చిన్నతనములో రచియించెను. ఇతఁడు నిరుపేద. బహుకుటుంబ వంతుఁడు. ఏడెనమండ్రుపిల్లలు గలవాఁడు. ఇట్టిహేతువుచేత నితనికిఁ

బిల్లలరామభద్రయ్య యనుపేరును గలదు. ఇతఁడు కుటుంబభరణము సేయలేక యొకానొకదినంబునఁ జింతాభరాక్రాంతచిత్తుండై పల్లెల నుంటకంటె నడవియందుండుటయే మేలని చెప్పినపెద్దలవాక్యము ననుసరించి దారాపుత్రాదులను వదలి యరణ్యమున మునినై యుందుంగాక యని నిశ్చయించికొని తత్సన్నాహము సేయుచుండెను. దీనినంతయుం జూచి యతనిమిత్త్రుం డొకరుఁడు వచ్చి యోయీ యిట్లు సేయ న్యాయమా? ఇట్టియుద్యోగము సంకెన్నడును నూహింపకుము. విద్వాంసుఁడైనవాఁడు కష్టసుఖములకు ఖేదమోదముల నందకుండవలయును. నీ విచ్చో నుండి కుటుంబసంరక్షణము సేయలేకున్నచో నేదియైననొక పట్టణమునకుఁ జని యచ్చో నెవరినైన నాశ్రయించి కాలము గడపుమనుడు నాతఁడు ధైర్యముఁ దెచ్చికొని యాదినమునందే తనకుటుంబసహితముగ బీజనగరు (విజయనగరము) నకుఁ బ్రయాణము నిశ్చయించుకొని శుభముహూర్తమున బయలువెడలెను. అనంతరము కతిపయదినములకు నాయూరు సమీపించెను. అపు డొకపెద్దవర్ష మాకస్మికముగ సంప్రాప్త మయ్యెను. మార్గమధ్యమున నీకవి సకుటుంబముగ వానం దడిసి యచ్చో నున్న యొకదేవళము చేరెను. అందే కొందఱు జను లావఱకు వచ్చి యుండిరి. వా రందఱును నొకపద్య మూహించుచు నెవరును రచియింపఁజాలక "నీవు మరల యోజింపు" మని తమలోఁ దమరు చెప్పికొనుచుండిరి. రామభద్రయ్య వారిం" జూచి "యోబాలులారా! యేమి వ్రాయుచున్నా" రని యడిగెను. అపుడు వారిలోఁ బెద్దవాఁ డిట్లనియె. "స్వామీ! మాగురువులవా రొక పద్యముచే విరహిణీ మూర్ఛానంతరకార్యములను వర్ణింపుఁ డనియాజ్ఞ యిచ్చిరి. దానిం జేయలేక చిక్కులఁ బడుచున్నార" మనుడు నాతఁడు నా కిపు డేమైన నుపాయము సెప్పి చలి లేకుండఁ జేసెద రేని నే నీపద్యమును రచియించెద ననియెను. వారలు దానికి సమ్మతించి చుట్టుపట్ల నున్న యాకులం దెచ్చి చలిమంట వేసి తమయుత్తరీయములు వానికిం గట్ట నిచ్చిరి. అపు డాకవి మిక్కిలి యానందము నొంది చలి కాఁచికొని ఘంటము నాకుం గొని యీక్రిందిపద్యము వ్రాసెను.

సీ. మోహోపదేశకతమోముద్రితము లైన, కనుదమ్ములు హిమాంబు లనుపరాదు
శ్రమబిందుతారకాగమఖిన్నకుచకోక,ములఁ జంద్రనామంబుఁ దలఁపరాదు
శీర్యదాశాపృంతశిథిలితాసులతాంత, మసియాడ వీవన ల్విసరరాదు
పటుతాపపుటపాకపరిహీణతనుహేమ, మింకఁ బల్లవపుటా ర్చిడఁగ రాదు.
గీ. ఇలవ కానంగకేలికీలాకలాప, సంతతాలీఢహృదయపాత్రాంతరాళ
పూరితస్నేహపూరంబు పొంగి పొరలఁ, జల్లనిపటీరసలిలంబుఁ జల్లరాదు.

అని వ్రాసిన పద్యముం గొని సంతసంబునఁ జని యావిద్యార్థులు తమగురుం డగుభట్టుమూర్తిరాజభూషణకవికిం జూపిరి. అతఁడు పద్య మంతయుం జదివి దాని చమత్కృతికి మిగుల సంతసించి దాని పదశయ్యావిశేషములచే నది తనశిష్యకృతము కా దని నిశ్చయించి "దీనిని రచించినవా రెవ్వరో యథార్థముగఁ దెలుపుఁ డని యడిగెను." దాని విని శిష్యులు గడచినవృత్తాంత మంతయుఁ దెల్పిరి.

## రామభద్రుని జూడ రామరాజభూషణుఁడు వచ్చుట.

ఆవృత్తాంతము విని రామరాజభూషణుఁ డాపద్యము చెప్పినవాఁడు గొప్పపండితుఁ డని తెలిసి శిష్యులు ముందు నడువ నా దేవళము నకుం జనియెను. ఆకవియును "వీరందఱును దమగురునిం దోడ్తెచ్చుచున్నా రేమియునేఁగెనో" యని భయంపడఁ దొడఁగెను. రామరాజభూషణుఁడును సమీపించి గాఢాలింగనము సేసికొని యతనివృత్తాంత మంతయుఁ దెలిసికొని తన తోడఁ జనుదెమ్మని తోడ్కొనిచని యొక్కచో విడియించి రెండుమూఁడు దినములు స్వయంపాకములు పంచి రాజుకడకుం జని యతని వృత్తాంతము సెప్పి దర్శనము సేయించి యాస్థానవిద్వాంసునిగ నియమించెను. అనంతర మీపద్యము నాకవియం దలి తనగౌరవమును సూచించుటకుఁ గాలాంతరమునఁ దనవసుచరిత్రంబున నుంచె నని వాడుక గలదు.

## రామభద్రునికవిత్వాదికము.

ఈకవియును మృదుతరకవనంబునకే ప్రసిద్ధుఁడు. కల్పనాంశమునఁ గూడ మిగుల సమర్థుఁడు. పెద్దనవలె నితఁడును శ్లేష ప్రధానము గాకుండఁ గవిత్వము సెప్పును. ఇతనికవితసరసత పెద్దనరామరాజభూషణా

దులవానింబలె విశేషముగ మనపండితులను సంతసింపఁజేయును. ఇతని చాటుధారాపద్యములు మన కిపు డేమియు సంప్రాప్తములు కావయ్యెను. కావున నీతనిచే రచియింపఁబడిన రామాభ్యుదయములోని కొన్ని పద్యము లిట వివరింతము:—

స్త్రీ వర్ణనము.

"గీ. చొక్కపుఁబసిండినక్కలచెక్కుచెక్కు, లక్కలికికొప్పునీలాంబుముక్కముక్కు,
కనకగంధఫలిస్మారకంబుకంబు, కలితరేఖావిలాసమంగళము గళము."

కౌసల్య రామునిఁగూర్చి విలపించుట.

సీ. కానక కన్నసంతానమ్మ గావునఁ, గానక కన్నసంతాన మయ్యె,
నరయ గోత్రనిధానమై తోఁచుఁ గావున, నరయ గోత్రనిధాన మయ్యె నేఁడు
ద్విజకులాదరణవర్ధిష్ణుండు గావున, ద్విజకులాదరణవర్ధిష్ణుఁ డయ్యె
వివిధాగమాంతసంవేద్యుండు గావున, వివిధాగమాంతసంవేద్యుఁ డయ్యెఁ
గీ. గటకటా దాశరథి సముత్కటకరీంద్ర, కటకలితదానధారార్ద్రకటకమార్గ
గామి యెట్లు చరించు నుత్కటకరీంద్ర, కటకలితదానధారార్ద్రకటకతతుల.

భట్టుమూర్తివిరోధకారణము.

ఈకవి, రాయలసభలో మిగులఁ బ్రబలుచుండుటఁ గని యోరువలేక భట్టుమూర్తి యీతనియెడ వైరము సాధించుచుండెను. ఇతఁడు నాతని లక్ష్యము లేకయే మెలంగుచుండెను. ఇట్లుండ నొకనాఁడు భట్టుమూర్తియెడం గరుణించి రాయఁ డాతనికవిత్వమును గొనియాడి యర్ధసింహాసనమునఁ గూర్చుండఁబెట్టికొనియెను. అట్టి రాయనికృత్యము సభాసదులకు మిగులఁ గష్టముగఁ గాన్పించెను. అపుడు భట్టుమూర్తి రామభద్రకవిం జూచి నగిన నాతఁడు కోపించి యీక్రిందిపద్యమును వ్రాసి సభానంతరమున సింహాసనమునకుం గ్రుచ్చి చనియెను. అది యెట్లనఁగా:—

ఉ. * పండితు లైనవారలు సభాస్థలి నుండఁగ నల్పుఁ డొక్కఁ డు
ద్దండతఁ బీఠ మెక్కిన బుధప్రకరంబుల కేమి యెగ్గగుఁ
గొండకకోఁతి చెట్టుకొనకొమ్మకు నెక్కినఁ గ్రింది మత్తవే
దండమహోగ్రసింహములు తాలిమి నుండవె రాజచంద్రమా.

---

* ఈపద్యము మఱియొకనికవిత్వములోనిది గాని రామభద్రునికవనము కాదని కొందఱు చెప్పిరి. ప్రస్తావవశముఁగాఁ న్ఠితరులపద్యములం జదువుట లోకములోని మర్యాదయే కదా.

అనంతరము దీనిఁ జదివికొని యాతఁడు లజ్జించి యూరకుండెను. కాని రామభద్రునియెడ నెడతెగని వైరము గల్గియుండెను. ఇట్లుండఁ గొంతకాలము జరిగినది.

### భట్టుమూర్తిశపథము.

అపు డొకానొకదినమునఁ గృష్ణరాయసింహాసనాసీనుం డగు వేంకటాద్రిసమీపమున నీయిరువురకు మఱలఁ గలహము విద్యావిషయమున సంభవించినది. అపుడు భట్టుమూర్తి రామభద్రుని జూచి "నిర్దోషంబుగ నీ వొకప్రబంధము సేసి తెమ్ము. దానిలో దోషము నేఁ జూపెదను. అటు గాకున్న నేఁ జేసి తెచ్చెదను. దానిలోన దోషము జూపెదవేని నేను నీచెప్పినశిక్షకుఁ బాత్రుండ నయ్యెదను. నీ దానిలోఁ దప్పేఁ జూపించిన నీశిరంబున నాపాదంబు ధరించెదే?" అనుచుఁ గృద్ధుండై రామభద్రుఁడు వీని పోతర మడంచుట మంచి దని యిట్లనియె. "ఓయీ! నేను గ్రంథముచు రచించి తెచ్చెదను. దానిలో దోషమును జూపలేకున్నచో నాతన్ను నందెదే" అనుచు వల్లె యనిరి. అపుడు రాజుం జూచి భట్టుమూర్తి యితఁడు గ్రంథమును రచియించుటకు నాలుమాసములు వ్యవధి యిచ్చితిని. నాఁటికిఁ దేకున్నచో నీతని కిదియ శిక్ష యనియెను. రామభద్రుఁడు పిమ్మట నిజనివాసమునకుఁ జనియెను. భట్టుమూర్తి యితని గ్రంథవృత్తాంత మరయుటకై చారుల నియమించెను. రామభద్రుఁ డవమానము సంప్రాప్తం బగు నని బెంగటిల్లి యేకార్యము చేయుటకును జేయాడక తనయిష్టదేవుం డగురామభద్రుని ధ్యానింపుచు నూరకుండెను. ఇట్లుండ నేకదినావశిష్టంబుగ నాలుమాసంబులును గడచినవి. ఆదినమున రామభద్రుఁ డేమియుఁ జేయక ప్రాణత్యాగము సేయ నిశ్చయించి తనసేవకుఁ డగు నొకబాలునకుఁ గొంతసొమ్మిచ్చి వసనాభిఁ దెమ్మని పనిచె. ఇట్లుండ నొకచిత్రవృత్తాంతము జరిగినదఁట. దానికి మన మద్భుతపడ నవసరము లేదు. గొప్పకవులును రాజులును భగవత్సాక్షాత్కారము గల్గియుందు రనియు నట్టిభగవత్సహాయముచేతనే యనన్యసాధ్య

ము క్రైస్తవులు వారు నెరవేర్చెద రనియు మన దేశములో నుండు పం
డితపామరులస్థిరమైనయభిప్రాయము. కావున నిచట భగవంతుఁడు స్వ
యముగ వచ్చి కార్యము చేసె నని చెప్పిన హిందువులకు నద్భుతముగ
నుండదు. అట్టివిధం బగు నొకచిత్రకథ మే మిప్పుడు వివరింపఁ బోవుచు
న్నారము:...

## రామభద్రుఁడు చావ యత్నించుట.

రామభద్రుఁడు చావ నిశ్చయించి సేవకుం బిలిచి వసనాభిని
దెమ్మనఁగా నావృత్తాంతం బాతనియిష్టదైవం బగు రామభద్రుఁ డెఱింగి భ
క్తరక్షణార్థంబుగ నొకమనుజునివేషము దాల్చి నాభి దెచ్చుటకుఁ జనిన
వానిని జూచి రామభద్రుని కడ కరుదెంచి "స్వామీ! తమసేవకుఁ
డేడి?" యని యడిగెను. అతఁ డేదియేని పనికై వాని నంగడికిఁ బం
పితి ననియెను, అప్పు డామాయకాఁడు భృత్యునితల్లికి జాడ్యము వచ్చె
ననియు లోకాంతరగమనమునకై సిద్ధమై యున్న దనియుం దెల్పి వానిం
ద్వరగాఁ జూపు మనియెను మంచిది కూర్చుండు మని రామభద్రుఁడు
వానిని వెదకుచు నూరంతయుఁ దిరిగి తిరిగి వేసారి సాయంకాల మిం
టికిఁ జనుదెంచి "యోయీ! నా కాచావుకంటె నీ చా వెక్కుడుగ
నున్నది. వాఁ డెచ్చోటను గాన్పించఁ డయ్యె. ఏమి యుపాయము"
అనుడు నామాయలవాఁడు "సామీ! యాచావంటివెద్ది నాకు
దానిం దెల్పు" మని సంప్రశ్నంబు చేసెను. దాని కతఁ డేమియుఁ జెప్పక
యూరకుండెను. వాఁ డాప్రశ్నమునే మఱలమఱల నడుగ నారంభించె.
తుదకు రామభద్రుఁడు వేసారి వృత్తాంత మంతయుం దెల్పెను. దాని
విని "స్వామీ! యిట్టిపనికి మీ రింతగ వగవనేల? నేఁటిరాత్రిలోపల
నే నాపని నెఱవేర్చెదను. భయంపడకు" మని యిట్లనియె. "స్వా
మీ! యొకగది నలికి ముగ్గులు వెట్టి ధూపదీపంబు లిచ్చి వ్రాఁతకు
వలయుసామగ్రి సిద్ధము సేయుఁడు. సూర్యోదయమున కేను గ్రంథము
వ్రాసి యిచ్చెద" ననుడు, రామభద్రుఁడు భగవదనుగ్రహము తన
యం దిట్లు ప్రసరించుచున్న దని యెంచి యాచిన్నవానివాక్యానుసారం

బుగ గది నలంకరించెను. అతఁడును గదిం బ్రవేశించి యష్టముఖగండభేరుండం బై యెనిమిది గంటంబులఁ బూని యొక్కపెట్టున నెనిమిదియాశ్వాసముల గ్రంథం బగురామాభ్యుదయ మనుదానిని రచియింప నారంభించెనఁట. లోపల గంటములచప్పు డధికం బగుట విని రామభద్రుఁడు దర్భశయ్య వదలి లేచి వచ్చి తలుపుకంతనుండి లోనివృత్తాంతము చూచుచో దేహము పులకరించెను. ఇట్లు స్వామి దివ్యతేజోమూర్తిని దర్శించి తన మనంబులో నతనిని స్తుతించి మరల పవళించెను. అనంతరము కొంతవడికి స్వామి వెలుపలికి వచ్చి రామభద్రునిం బిలిచి "యోరీ దీనిం గొని రాజసభం జదువుము. నీకుఁ గారణాంతరముచే నవమానము వచ్చినట్లు గాన్పించి పిమ్మట మామాహాత్మ్యంబున నది నివారితం బగును, ధైర్యమున నుండు" మనియె. రామభద్రుఁడు మహాప్రసాద మని స్తుతి యొనరింప నాతఁ డపు డదృశ్యుఁ డయ్యెను. మఱునాఁడు రాజసభకు గ్రంథమును గొనివచ్చెద నని వర్తమానము బంపెను. ఇట భట్టుమూర్తి యానాఁటిరేయి రామభద్రునకవమానము గల్గించునట్లు ప్రసాదింపు మని తనయిష్టదేవత యగునాంజనేయు నుపాసించుచుండెను. మఱునాఁడు సూర్యోదయమున రాజు సభదీర్చి కూర్చుండి యుండి విరోధు లగునీయిద్దఱుకవులకును వర్తమానము పనిచెను. అట్టివర్తమానము తెలిసి యాయిరువురును నాస్థానమునకు వచ్చిరి. రామభద్రుఁడు తనగ్రంథమును చక్కఁగఁ జదువ నారంభించెను. భట్టుమూర్తి తదేకనిష్ఠచే యోచించుచుఁ దప్పెచ్చోనైన వచ్చునా ? రామభద్రు నవమానింతునా ? యని కూర్చుండెను. ఇట్లుండ రామభద్రుఁడు గొంతతడవునకు నీక్రిందిపద్యమునుఁ జదివెను అది యెద్దియనిన :—

" సీ. సింహనఖాంకుర చ్ఛిన్నవారణకుంభ, జనితముక్తాఫలశర్కరిలము
సమదసూకర పరస్పరభీకరాఘాత, శిథిలదంష్ట్రాచూర్ణ సికతిలంబు
గంధసింధురపటు ఘటితసహస్రవ, ద్బంధుర దానాంబు పంకిలంబు
దళగంధవహాబంధు దహ్యమానానేక, కాళికాగురుధూమగంధిలంబు

తే. పృథులషడ్జస్వనోద్దీర్ణ ఖిల్ల పల్ల, వాధరాగీతికాకర్ణనాతిభీతి
పరవశాత్మపటీర కోటరకుటీర, లీనఫణి యగునకాన గానసర్యొ."

దీని విని భట్టుమూర్తి కెవ్వునఁ గేక వేసి దొరికెరా బాపఁడు అని తలంచి యచ్చో నాఁగు మాఁగు మని పల్కెను. దానికి సభ గడగడ వడంకినది. రామభద్రుఁడును విన్నఁబోయి తనయిష్టదైవంబునకు మ్రొక్కి యచ్చో నూరకుండెను. అపుడు భట్టుమూర్తి లేచియిదే పాదంబు నీశిరస్సున ధరియింపు మనియెను. అపుడు సభలో హాహాకారంబులు సెలఁగినవి. రామభద్రుఁడు మెల్లన నాతని కిట్లనియె. "నా పద్యములోనిదోషము చూపి పిమ్మట నీయిష్టానుసారంబుగ నడుపుము" అనుడు భట్టుమూర్తి "ఓయీ! యిందు వీణానాదము వినుటంజేసి సర్పములు భయము నొంది తోఁట్రుపాటుం దూఱెనని చెప్పఁబడి యున్నది. ఎచ్చోటనైన వీణాగానంబు విన సర్పంబు లుత్సాహంబుతో వచ్చు నని యున్నది గాని దాని విని భయపడి దాఁగె నని చెప్పఁబడి యుండలేదు. కావున నీ యీకల్పన దోషసహితము. కవిసమయసిద్ధము గాదు. ఇఁక నాపాదము శిరమున ధరియింపుము." అనుడు రామభద్రుఁడు భట్టుమూర్తి తనకల్పనకుం జెప్పినదోషం బనుభ్రమ నెఱింగి వీనికి సభలో నవమానంబు నొందుకాలంబు సంప్రాప్తం బయ్యె నని యూహించి యిట్లనియె. "ఓయీ! శాంతించినచోఁ గొన్ని సమాధానములు చెప్పెద విను" మనుడు భట్టుమూర్తి "వల్లె" యనెను. అంత రామభద్రుఁ డిట్లనియె. "ఓయీ! నేను షడ్జస్వనము వినుటంజేసి సర్పములు భయపడె నంటిఁ గాని వీణాగానంబుచే ననలేదు. షడ్జస్వనంబునకు కేకికేక యని భయమంది సర్పములు పాఱెను. దీనికి దోష మేమి కలదు" అనుడు సభ్యు లందఱును "మేలుమేలు రామభద్రుఁడు చెప్పినది లెస్సైయున్నయది" యనిరి. భట్టుమూర్తి యుత్తర మేమియు నీఁజాలక యూరకుండెను. అపుడు సభవారందఱును రామభద్రు నతని ప్రతిజ్ఞ చెల్లింపవలయు ననిరి. తోడనే భట్టుమూర్తి తనశిరోవేష్టనంబు క్రింద నుంచెను. రామభద్రుఁడు దానిని వామపాదంబున మెట్టెను.

అనంతరము రాజు గ్రంథంబు నాఁటికి నిలిపి యింకొకదినంబున దాని విని యెద మని సభ చాలించెను. భట్టుమూర్తి చింతాక్రాంతుఁడై యింటి కేఁ జనియె. సభ్యులందఱును సభావిశేషములు చెప్పుకొనుచు :—

"శ్లో. విద్యా వివాదాయ ధనం మదాయ, శక్తిః పరేషాం పరిపీడనాయ,
ఖలస్య సాధో ర్విపరీత మేతత్, జ్ఞానాయ దానాయ చ రక్షణాయ."

అనుశ్లోక మిచ్చో టెట్టు లన్వయించెనో చూచితిరే యని వాని చెట్టులఁ దలంచుచుఁ జనిరి. మూర్తియు గృహంబునకుం జని యారాత్రి తనయుపాసనాదైవం బగునాంజనేయుని ధ్యానించి రామభద్రకవిని సంహరింపుఁ డని ప్రార్థించెనఁట! అతఁడు నుద్దండగదాదండంబుఁ బూని రామభద్రునొద్దకు సంహరింప నేతెంచి యచ్చో ధనుర్బాణధరుఁ డగుశ్రీరాముని నతఃసతమ్ముఁడగు లక్ష్మణునిం గని నమ్రుఁడై నమస్కరించి మీరుండుచోటునకు నన్నుఁ బంపినమహాపాతకుం డునిమెద నని చెప్పి మరలి వచ్చి భట్టుమూర్తిని తనగదతో మొత్తెనఁట. ఆదెబ్బకే భట్టుమూర్తి నిర్యాణము నందెనఁట. రామభద్రకవి తనగ్రంథమును వసుచరిత్రమును గృతి నందినతిరుమలరాయుని మేనల్లుం డగుగొబ్బూరి నరసరాజునకుం గృతి యిచ్చెను.

## అప్పకవీయములో నున్న రామభద్రకవి వర్ణనము.

ఆంధ్రకవులవర్ణించుచు, నప్పకవి యీక్రిందిపద్యము వ్రాసెను. అది యెద్దియన :—

"సీ. శబ్దశాసనుపాద జలజంబులు భజించి, యుభయసత్కవిమిత్త్రు నభినుతించి
శంభుదాసునకు నం జలి చేద్కొనరించి, సహజపాండిత్యుని సంస్మరించి
సకలవిద్యాసనాథకవీంద్రుఁ గొనియాడి, సౌజన్యజేయువాక్సరణిఁ బొగడి
తగ నాంధ్రకవితాపితామహు వర్ణించి, సుజనవిధేయు హెచ్చుగ నుతించి
తే. రామరాజవిభూషణరత్నఖచిత, చారుమస్తకలాపాదిహారివాక్య
గౌరవము పెక్కుభంగుల గణన చేసి, పిదప నితరాంధ్రకవులకుఁ బ్రియముపల్కి."

ఇందు కేవలమును కవులనామములు చెప్పఁబడక వారివారిగద్యములలో నుండినవిశేషణములుమాత్రము చెప్పఁబడినవి. అట్టిగద్యముల

వలనం జెప్పఁబడినపురుషులనామము లప్పకవీయములో నుచితస్థలంబున వివరించెదను. ప్రస్తుతము రామభద్రకవికి వర్తించునది. "రామరాజవిభూషణరత్నఖచితచారుమస్తకలాపాదిహారి" అనువాక్యముం గూర్చి మాత్రము వ్రాయవలసి యున్నది. దీనియర్థము పైవృత్తాంతము చదివినవారికెల్ల గోచరం బగుట స్పష్టమే. ఇక్కడ "రామరాజభూషణకవి" యని యున్నది. పైని మనము "భట్టుమూర్తి" యని చెప్పి యున్నాము. అది లోకములో సామాన్యముగ "భట్టుమూర్తి" అనునది రామరాజభూషణునకుఁ గల్గినపర్యాయనామ మని చెప్పుకొనుభ్రమ వలనం గల్గును. ఆవృత్తాంతము భట్టుమూర్తి రామరాజభూషణులచారిత్రములం జూచిన స్పష్ట మగును.

పైపద్యములో నాంధ్రకవులకుఁ గలబిరుదులం బట్టి వారినామములు స్ఫురించును గాని రామభద్రకవి పేరుమాత్ర మట్లు స్ఫురింపదు. ఇది చారిత్రసంబంధ మైనబిరుదుగాని గ్రంథాంతగద్యములోనిది కాదు. ఆగద్యము నిటఁ జూపినచోఁ బ్రమాదమునుండి పాఠకులం దప్పించును గావున దాని నిట వివరించెదను, ఎట్లన్నను :—

"గద్యము. ఇది శ్రీమదొంటిమెట్ట రఘువీరశతకనిర్మాణకర్మఠజగదేకఖ్యాతి ధుర్యాయ్యలరాజు తిప్పయమనీషి పర్వతాభిధానపౌత్ర, త్రైకక్కయాచార్యపుత్త్ర, పరిశీలితసమిద్ధరామానుజమతసిద్ధాంతమర్మ ముమ్మిడివరదాచార్య కటాక్షవీక్షాపాత్ర, హృదయపద్మాధిష్ఠితశ్రీరామభద్రరామభద్రకవిప్రణీతం బైన రామాభ్యుదయమహాప్రబంధము"

అనునీగద్యమువలన నీరామభద్రకవియొక్కవంశవృత్తాంతము గొంత విస్పష్టమగును.

అందయ్యలరాజువా రనునింటిపేరునుబట్టి చూడఁగా నీతఁడు నియోగి యగుట స్పష్టమే. ఇతనితాతపేరు తిప్పయాపరనామము గల పర్వతరాజు తండ్రిపేరు "అక్కయాచార్యుఁడు" ఇతనినాఁడు వీరు వైష్ణవమతప్రవిష్టు లైనట్లు కానుపించును. ఇతఁడు ముమ్మిడివరదాచార్యులను నొకరామానుజమతసింద్ధాంతమర్మజ్ఞునిశిష్యుఁడు. వరదాచార్యులు పర

వస్తువంశములోనివాఁ డని గ్రంథారంభములో నీక్రిందివిధంబుగ వ్రాయఁబడి యున్నది. ఎట్లన్నను :—

క. పరవస్తు వంశరత్నా, కరకౌస్తుభమణి ప్రభావఖని యై నాకుఁ
బరమగురు వైనముమ్మడి, వరదాచార్యాంఘ్రివనజ వందారుఁడ నై"

దీనింబట్టి రామభద్రకవి వరదాచార్యులసమకాలీనుఁ డని తేలినది.

రామాభ్యుదయగ్రంథకృతిపతి యగుగొబ్బూరినరసరాజు భోజనపల్లెనారాయణాచార్యశిష్యుఁడు. కావున వీరందఱును సమకాలీనులే. గొబ్బూరి నరసరాజు వసుచరిత్రకృతిపతి యగుతిరుమలరాజుమేనల్లుం డని యిదివఱకే వ్రాసి యున్నారము. కావున నీపైవారలందఱు శాలివాహనశకము ౧౫ - శతాబ్దముచివరవా రనియుఁ, బదునాఱవ శతాబ్దములోని మొదటిపాదములోఁగూడ నున్నారనియును జెప్ప నొప్పి యున్నది.

## రామభద్రకవిగోత్రము.

దీనిని దెలియుటకుఁ దగినయాధారములు పైగ్రంథములో లేవు. కాని యయ్యలరాజువారివలనం జెప్పఁబడినమఱికొన్నిగ్రంథములం బట్టి చూడఁగా నీరామభద్రకవి కౌండిన్యసగోత్రుఁ డని తేలుచున్నది. అందు శుకసప్తతిని దెనిఁగించిన కవీశ్వరుఁడు తనగోత్రము చెప్పి తన వంశములోనికవీశ్వరులను జెప్పుచు "మాయయ్యలరాజువంశజుల నాది కవీంద్రులఁ బ్రస్తుతించెదన్" అని వ్రాసియున్నాఁడు.

## ఉత్తరరామాయణకవులు.

వాల్మీకికృతసంస్కృతరామాయణగ్రంథములో మొదటి యాఱు కాండలు కలసి యొక్కటిగా నుండును. కావున రామాయణము షట్కాండములు గలదిగానే వ్యవహరింపఁబడుచున్నది. అందు శ్రీరామపట్టాభిషేకాంత మైనకథ గలిగియుండును. అనంతరవృత్తాంత మంతయు నుత్తరకాండ మనుపేర నొప్పియుండును. అందు శ్రీరామరాజ్యవిశేషములును. పుత్రోత్పత్తియు, నశ్వమేధయాగమును జేయుటయు,

శ్రీరాముఁడు వైకుంఠలోకమునకుం బోవుటయు నుండును. ఇట్టిగ్రంథమును దెనిఁగించుటకు నుద్యోగించినవారిలో నిర్వురు ప్రధానులు. అందుఁ దిక్కనసోమయాజి యొకఁడు. కంకంటిపాపరా జొకఁడు నై యున్నారు. అందుఁ దిక్కనసోమయాజికృత మగునుత్తరరామాయణ మతనిభారతముకంటెను బ్రాచీన మైనదియును బాపరాజకృతోత్తర రామాయణము నవీనగ్రంథములలోఁ బ్రాచీన మైనదియును నై యున్నది. ఇపుడు మనము ముందు తిక్కనసోమయాజికృతం బగునుత్తరరామాయణముంగూర్చి చెప్పి యనంతరము పాపరాజకృతోత్తరరామాయణముంగూర్చ వ్రాయుదము.

## తిక్కనకృతనిర్వచనోత్తరరామాయణము.

ఇది వచనము లేకయే రచియింపఁబడుటంజేసి దీనికి నిర్వచనోత్తరరామాయణ మనునామము కల్గినది. అట్లు చెప్పుట ప్రౌఢకవిలక్షణము గావునఁ దా నట్లు చెప్పెద నన్న ట్లీక్రిందిపద్యమువలనం గాన్పించును. ఎట్లనిన:—

క. వచనము లేకను వర్ణన, రచియింపఁగఁ గొంతవచ్చుఁ బ్రౌఢులకుఁ గదా
ప్రచయము పద్యము లన పెం, దుచితంబుగఁ జెప్ప నార్య లొప్పిద మనరే.

ఈనిర్వచనోత్తరరామాయణములోని కొన్నిపద్యములవలన నితనిచారిత్రమును, నితనిప్రభు వగుమనుమసిద్ధి రాజితనికిఁ జేసినగౌరవమును గోచరం బగును గావున వానిని యథోచిత స్థానంబుల వివరించెను.

## గ్రంథారంభము.

తిక్కన తనపూర్వు లగుగ్రంథకర్తలవలెనే గీర్వాణశ్లోకము కృత్యాదిని మంగళాశాసనముగాఁ జెప్పెను. ఎట్లన్నను :—

శ్లో. శ్రీ రాస్తాం మనుమక్షితీశ్వర భుజస్తమ్భే జగన్మణ్డలం
ప్రాసాదస్థిరభారభాజి దధతీ సా సాలభఞ్జిక్రియా
ఉద్దాలోత్తమగణ్డభిత్తిషు మదవ్యాసక్తి వశ్యాత్తయా
యా ముత్తేజయతే తరాం మధులిహా మానన్దసాన్ద్రస్థితిః.

అని యిట్లుగాఁ గృతిపతి నాశీర్వదించి ప్రాచీనాధునికకవులను వర్ణించుటకు నిర్దేశించి యెవరినామములను వివరింపక యీక్రిందివిధంబున వ్రాసెను. ఎట్లన్నను:—

చ. హరిహరపద్మగర్భులను నాదికవీంద్రుల నూత్నసత్కవీ
శ్వరులను, భక్తిఁ గొల్చి తగ వారికృపన్ గవితావిలాసవి
స్తరమహనీయుఁ డైన నను సర్వగుణోత్తరమూర్తి మన్మభూ
వరుఁడు దగంగ రాఁ బనిచి వారనిమన్నన నాదరింపుచున్.

ఈపద్యముంబట్టి చూడఁగాఁ దిక్కననాఁటికి నతనిచేతఁ గవులుగా నుతియింపఁదగుప్రాచీనకవులు లేక యైన నుండవలయును. లేదా? యట్టియాచారమైన లేక యుండవలయును.

ఇట్లుగా గ్రంథారంభంబు చేసి తిక్కన రాజు తన్నుం బిలువనంపి గ్రంథరచన కాజ్ఞ నొసంగినకథఁ జెప్పుచున్నాఁడు. ఎట్లన్నను:—

క. ఏ నిన్ను మామ యనియెడి, దీనికిఁ దగ నిమ్మభారతీకన్యక నా
కీ నర్హుఁడ వగు దనినను, భూనాయకుపలుకు చిత్తమున కింపగుడున్.

దీనింబట్టి చూడఁ దిక్కనసోమయాజికి రాజునకుఁ గృతి నొసఁగుకోర్కె యదివఱలో లేదనియును, రాజు పల్కినమాటలోనిచమచమత్కారముచేత మనస్సున నానందంబు గల్గుటచే నిచ్చినట్లును స్ఫురియించుచున్నది. దానికి దృష్టాంతముగ నీక్రిందిపద్య మున్నది. దానివలనఁ దనమనస్సునకు సమ్మతి లేక యుండఁగా దానిని సయుక్తికముగ బోధించినట్లు కానుపించును. ఆపద్యమెద్ది యనఁగా:—

సీ. సకలలోకప్రదీపకుఁ డగు పద్మినీ, మిత్త్రివంశమున జన్మించె ననియుఁ
జూచిన మగలైనఁ జొక్కెడునట్టిసౌం, దర్యసంపదసొంపు దాల్చె ననియు
జనహృదయానందజనవమై సెగడిన, చతురతకల్మి నప్రతిముఁ డనియు
మెఱసి యొండొంటికి మిగులశౌర్యత్యాగ, విఖ్యాతకీర్తిచే వెలసె ననియు.
గీ. వివిధవిద్యాపరిశ్రమువేది యనియు, సరసబహుమానవిరచితశాలి యనియు
మత్కృతీశ్వరుఁ డగుచున్న మనుమన్నృపతి,సుభగుఁగావించుటకు సముత్సుకుఁడ నైతి.

అని యిట్లు కృతనిశ్చయుండై తిక్కన మనుమసిద్ధిరాజునకు నంకితము చేయఁబోవుకృతిలోనివిశేషముల నీక్రిందివిధముగ సంగ్రహించి వ్రాయుచున్నాఁడు. ఎట్లన్నను :—

"ఉ. భూరివివేకచిత్తులకుఁ బోలు ననన్ దలఁపందలంబులన్
సౌరభ మిచ్చుగంధవహుచందమునన్ బ్రకటంబు సేసి యిం
పారెడుపల్కులం బడయ నప్పలుకుల్ సరివచ్చునట్లుగాఁ
జేరుప నేరఁగా వలయుఁ జేసెద నేకృతి యన్న వారికిన్."

ఇట్లని యనంతరము కుకవినిందఁ జేయుటకుఁ గా నీక్రిందిపద్యంబుఁ జెప్పెను. ఎట్లనిన :—

"చ. పలుకులపొందు లేక, రసభంగము చేయుచుఁ, బ్రాఁతవడ్డమా
టలఁ దమ నేర్పు చూపి, యొకటన్ హృదయం బలరింప లేక, యే
పొలమును గాని యెట్టిక్రమమున్ దమ మెచ్చుగ లోక మెల్ల న
వ్వులఁ బొరయన్ జరించుకుకవుల్ ధర దుర్విటులట్ల చూడఁగన్."

అని యిట్లు కుకవినింద చేసి యంతటితోఁ బరిసమాప్తి నందింపక భావికాలములోఁ దెనుఁగుకవిత్వముఁ జెప్పుసుకవులకు నుపయుక్తము లగుకొన్ని సూత్రప్రాయము లగుపద్యములంగూడ వ్రాసెను. అవి యెవ్వి యనఁగా :—

వడిప్రాసవిషయము.

"క. తెలుఁగుకవిత్వముఁ జెప్పన్, దలఁచినకవి యర్థమునకుఁ దగి, యుండెడుమా
టలు గొని వళులుం బ్రాసం, బులు నిలుపక యొగిని బలిమి బుచ్చుట చదురే."

తద్భవములఁ గూర్చి.

"క. అలవడ సంస్కృతశబ్దము, తెలుఁగుపడి విశేషణంబు తేటపడంగాఁ
బలుకు నెడ లింగవచనం, బులు భేదింపమికి మెచ్చు బుధజనము కృతిన్."

సరసాహ్లాదముగఁ జెప్పవలె నని.

"గీ. ఎట్టికవికైనఁ దనకృతి యింపుఁ బెంపుఁ, జాలఁ గావునఁ గావ్యంబు సరసులైన
కవులచెవులకు నెక్కినఁ గాని నమ్మఁ, డెందు బరిణతి గలుగుకవీశ్వరుండు."

అని యిట్లు సత్కవులమార్గము నుడివి యట్టిమార్గము ననుసరించి తా నుత్తరరామాయణమును రచియించెద నని యీక్రిందిపద్యములలో వ్రాసెను ఎట్లన్నను :—

"క. అని సత్కవీంద్ర మార్గము, మనమున నెలకొల్పి సరసమధురవచోగుం
భనసుప్రసాదసంబో, ధనగోచరబహువిధార్థతాత్పర్యము గాన్."

ఇట్లుగాఁ జెప్పి తా నుత్తరరామాయణము నాంధ్రీకరింపఁగడఁ
గుటకుఁ గారణ మీక్రిందివిధంబున వ్రాసెను. ఎట్లనఁగా:—

"క. ఎత్తతి నైనను ధీరో, దాత్తగుణోత్తరుఁడు రామధరణీపతిస
ద్వృత్తము సంభావ్య మగుట, నుత్తరరామాయణోక్తియుక్తఁడ నైతిన్."

తిక్కన యిటుల వ్రాసి వెంటనే తనతాత యగు గుంటూరి మంత్రిభాస్కరునిఁ జూచి యైనఁ దనకవిత్వము సర్వజనాదరణీయ మగు నని పల్కిన దానింబట్టి తనతాతయే రామాయణము దెనిఁగించుటచేతఁ దనకు దానిం దెనిఁగించుట కవకాశము లేకపోవుటచేత నెల్లిన శ్రీరామకథం దెనిఁగించుటకుఁ దనకుఁ గల యుత్సాహమును జూపుటకు నుత్తరరామాయణములోఁ గల రామకథఁ దెనిఁగించినఁ జాలు నని మనస్సున సంతుష్టి నందినట్లుగాఁ గాన్పించును. అటు గాకున్నచో రామాయణమును దెనిఁగించుటకు భాస్కరునంతకవి యుండవలయును గాని తన వంటివాఁ డొకఁడు దానికై యత్నింపఁ దగునా యని యొరులు చేయుశంక మనస్సున నుంచికొని తిక్కన తాను భాస్కరకవి మనుమఁడనే యని చెప్పి యాభాస్కరునిసంప్రదాయానుసారముగనే తనకవిత్వము ండు ననుటచేత రామాయణకవిత్వములోని సంప్రదాయ ముత్తరరామాయణములోఁగూడఁ గాన్పించు నని లోకమునకు స్పష్టపఱుప నైనను గావలయును.

తిక్కన తాను జేయు నిర్వచనకావ్యము పండితులకు మిక్కిలియానందదాయి కాఁగల దని యీక్రిందివిధమునఁ జెప్పెను. ఎట్లన్నను:—

ఉ. జాత్యనుగామి నొప్పయిన సంస్కృత మెయ్యెడఁ జొన్ప వాక్యసాంగత్యము సేయుచో నయిన గర్వము తోడుగఁ జెప్పి పెట్ట దా
ర్ఢత్యముఁ దోఁపఁ బ్రాసముప్రకారము వేఱుగ నక్షరంబులన్
శ్రుత్యనురూప మంచు నిడ కూరుల కివ్విధ మింపుఁ బెంపదే.

క. లలితపదహృద్యపద్యం, బులన పదార్థంబు ఘటితపూర్వాపరమై
వెలయ నిడి విణితులనఁగా, హాల సంధించినవిధంబు నమరఁగ వెలయున్.

ఉత్తరరామాయణములో నింతవఱకే తిక్కనవృత్తాంతము గా న్పించును. ఆశ్వాసాంతమునందు వ్రాయఁబడినగద్యమున నీగ్రంథరచన కాలమునాఁటికిఁ దిక్కనసోమయాజి యజ్ఞము చేయలే దని తేలు చున్నది. ఆగద్య మెద్ది యనఁగా :—

"ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధన విధేయ తిక్కయనామధేయ ప్రణీతం బైన యుత్తరరామాయణం బనుకావ్యంబునందు"

అని యున్నది. భారతములో "బుధారాధనవిరాజి తిక్కనసోమ యాజి" అని యున్నది. కావున నుత్తరరామాయణకాలమునకుఁ దిక్కనసోమయాజి యాహితాగ్ని కాలేదు. నిర్వచనోత్తరరామాయణ ములోనితుదియాశ్వాసముతప్ప తక్కిన దంతయుఁ దిక్కనసోమయాజి ప్రణీత మగుటచేత దానికిఁ గారణ మేమై యుండు నని యూహింపనై యున్నది. దాని కాగ్రంథములోని తుదియాశ్వాసమును బూర్తి చేసిన జయంతిరామకవిచే నైన కారణము చెప్పఁబడదయ్యెను. లోకప్రతీతిం బట్టి యాయాశ్వాసములో రామనిర్యాణమును జెప్పవలసి వచ్చు నని వదలినట్లుగా నూహింపనై యున్నది. అట్లే యయినచో భారతము లోని స్వర్గారోహణపర్వములో మొదటఁ గృష్ణనిర్యాణంబును, అనం తరము పాండవుల లోకాంతరగమనంబును జెప్పుటయే తటస్థింపదు. అట్లు గావున దీనికిఁ గారణ మేది యైన నుండవలెను. దానిం దెల్పుగ్రంథ సామగ్రి లేదు గావున దాని న్వదలి తుదియాశ్వాసము పూర్తిచేసిన కవివరునివృత్తాంత మిచ్చోఁ గొంచెము ముచ్చటింతము :—

---

ఉత్తరరామాయణము

8.

## జయంతి రామభట్టు.

ఇదివఱకు మనము చెప్పిన జయంతి రామకవీశ్వరునిం గూర్చిన చారిత్ర మాకవిరచిత మైనయాశ్వాసప్రారంభములోఁ గాని లోకమువా

డుకలోఁ గాని కానుపించదు. ఆశ్వాసాంతగద్యములోఁగూడ నొకవిధముగా నున్నది. అంతమాత్రముచేత నతనికవిత్వవిశేషములు వ్రాయఁజాలి యుండవు. ఆగద్య మెట్లున్నను:—

"ఇది శ్రీమద్భద్రాద్రిధామ వరప్రసాద లబ్ధ కవిత గార్గేయసగోత్రపవిత్ర జయంతి కృష్ణభట్టారక శుభద్రాంబా వరతనూజ రామభట్టప్రణీతం బైనశ్రీమద్రామాయణం బనునాదికావ్యంబున నుత్తరకాండంబునందుఁ దిక్కనసోమయాజిరచిత శేషంబు గల మీఁదికథయందు శ్రీరాముఁడు కుశలవులకు విద్యాభ్యాసంబు చేయించుటయు, అతిరాత్ర, పౌండరీక, వాజపేయంబు లాదిగా శతక్రతువులు గావించుటయు......నారాయణాఖ్యం బ్రవర్తిల్లి పూర్వరీతిని వైకుంఠ పురప్రవేశంబునను కథలు గలిగిన యేకాదశాశ్వాసము."

అని యున్నది.

దీనింబట్టి చూడ నీకవి భద్రాద్రిసమీపములోనివాఁ డనియును, గార్గేయసగోత్రుఁ డనియును జయంతి యనుగృహనామము గలరామభట్టను బ్రాహ్మణుఁడని స్పష్టమే. ఇతనికాలనిర్ణయము చేయుట మిక్కిలి దుర్ఘటముగా నున్నది. ఇతఁడు గ్రంథాది నుత్తరరామాయణములోనితుదియాశ్వాసమును జెప్పుటకుఁ గలకారణ మొకపద్యములోఁ జెప్పి యుండెను. దానిం బట్టి తిక్కనసోమయాజి పదియాశ్వాసములు చెప్పి తక్కినది చెప్పకపోవుటకుఁ గాని యట్టియసంపూర్తిగ్రంథమును దాఁ దెనిఁగించుటకుఁ గాని కారణములు తెలియఁబడవు. ఆపద్యములో నెట్లుండె ననఁగా

"తిక్కనసోమయాజి మును దెల్గున నుత్తరకాండ చెప్పి యం
దొక్కటి జెప్పఁడయ్యె............................
...................................................
చక్కని దేవళంబుపయి స్వర్ణఘటం బిడుపోల్కి దోఁపఁగన్."

అని తాను దెనుఁగించుగ్రంథములోని విశేషముమాత్రము చెప్పెను. కావున నింతకంటెఁ బ్రస్తుత మీగ్రంథమువిషయమై వ్రాయము. కాని తిక్కనసోమయాజి చెప్పినపదియాశ్వాసములలోని శయ్యాచమత్కారమును బ్రౌఢిమమును నీపదునొకొండవయాశ్వాసములో లే దనియును నీయాశ్వాసము చదువునపుడు తిక్కనసోమయాజి యీయాశ్వా

సము గూడ బూర్తిచేసిన బాగుగ నుండియుండు ననియును దోచు నని మాత్రము చెప్పెదము.

---

ఉత్తరరామాయణము.

## 9.

# కంకంటి పాపరాజు.

పైనిర్వచనోత్తరరామాయణము కావ్యముగా రచియింపఁబడి యుండుటఁ జూచి కంకంటి పాపరాజను నతఁ డుత్తరరామాయణము మహాకావ్యముగా రచియించుట కుత్సహించి తిక్కనసోమయాజి చేసిన కావ్యమునే తాను మఱియొకసారి తెనుఁగుచేయుట చర్వితచర్వణ మని యు, నెచట నైన సమానవర్ణన లున్నచోఁ దనకవిత్వము తిక్కనసోమయాజికవిత్వముతో సరి తూఁగనిచోఁ బాఠకులు త న్నాక్షేపంబుచేసెద రనియు శంక మనస్సులో నుంచుకొని యీక్రిందిపద్యముచేతఁ దన యుద్యమమును వ్యక్తీకరించు చున్నాఁడు. అది యెద్ది యనఁగా:—

"మ. వరుసం దిక్కనయజ్వ నిర్వచనకావ్యం బై తగం జేసె ను
త్తరరామాయణ మండ్రు దన్మతి ప్రబంధం బూని నిర్మించు టే
సరసత్వం బని ప్రాజ్ఞులార నిరసించం బోకుఁడీ రాఘవే
శ్వరుచారిత్రము లెంద ఱెన్నిగతుల న్వర్ణించినం గ్రొత్తలే."

ఇట్లు చెప్పియు నుత్తరరామాయణమునే యాంధ్రీకరించుట కుఁ గలకారణము తిక్కనపైని పోటీగా వ్రాయుటకుఁ గాదనియుఁ దాను తరియించుటకు సాధన మనియుఁ దన యుపాసనాదేవుఁడు శ్రీరాముఁ డవ్వుటంజేసి యందులకుగాను దా నాగ్రంథ మారంభించితి నని యు నీక్రింపద్యములలోఁ జెప్పెను. ఎట్లన్నను:—

"ఉ. మానక కర్మభూమిఁ బయి మానవదేహముతోఁ హితాహిత
జ్ఞాన మెఱుంగు బ్రాహ్మణుఁడు చారుకవిత్వము నేర్చి జానకీ
జానికథ ల్రచింపక యసత్కథ లెన్ని రచించెనేనియుం దా
వానివివేక మేమిటికి వానికవిత్వమహత్త్వ మేటికిన్.

"ఉ. శ్రీకరరామమంత్రజపసిద్ధిఁ బ్రసిద్ధి వహించి వెన్క వా
ల్మీకి రఘుప్రవీరుకథలే రచియించి కదా చెలంగె ము
ల్లోకములందు నెల్లమునులుం గొనియాడఁగ నట్టి దొట్టి బు
ణ్యాకర మైనరామకథ హైన్యము మాన్పదె యెట్టివారికిన్."

అని యిన్నివిధములుగఁ బాపరాజు తనకు జనులవలనఁ గల్గఁబో వునిందను నివారించుకొనుటకుఁగాను యత్నించెను. ఇది యెంతశ్లాఘాపాత్ర మైనగుణము. ఆధునికులు పాపరాజుం జూచి కవిత్వవిశేషములు నేర్చుకొనుటయే కాక గృహస్థమర్యాదను గూడ నేర్చుకొని యితరులు ప్రారంభించినకృతు లనుచ్ఛిష్టముచు గ్రహించుటకు సిద్ధపడకుండుట నేర్చుకొనెదరుగాక. అట్టికార్యముం జేయఁబోయి పొందెడియవమానంబునుండి తొలఁగుదురుగాక.

## పాపరాజువంశముంగూర్చి.

ఈకవి తనవంశమును వర్ణించుకొనుటకుఁ బూర్వము తాను జన్మించిన నియోగిశాఖాబ్రాహ్మణుల నాఱ్వేలవారిని వర్ణించెను. ఆవర్ణన ప్రాచీనచారిత్రగాథల కన్నిటికిని సంగ్రహము గావున దాని నీక్రింద వివరించెదను:—

## ఆఱ్వేలనియోగులవర్ణనము.

"సీ. అఖిలరాజాధిరాజాస్థానజనహృద్య, విద్యావిహారు లాఱ్వేలవారు
కల్పకబలికర్ణకలశార్ణవోదీర్ణ, వితరణోదారు లాఱ్వేలవారు
సజ్జనస్తవనీయసతతనిర్వ్యాజ, పరిపరోపకారు లాఱ్వేలవారు
ఘనదుర్ఘటస్వామికార్యనిర్వహణప్ర, వీణతాధారు లాఱ్వేలవారు.
గీ. విమతగర్వాపహారు లాఱ్వేలవారు, అట్టియాఱ్వేలవారిలో నలఘుకీర్తి
వెలయు శ్రీవత్సగోత్రారవిందహేళి, మహితగుణశాలి వల్లభామాత్యమౌళి.

దీనింబట్టి యాఱ్వేలనియోగులలోఁ బెక్కండ్రు రాజాధిరాజుల యాస్థానములలోఁ బ్రకాశింపఁదగిన విద్యావిశేషములు గలవా రనియును, విశేషవితరణశాలు లనియును, నిరంతరాదూరు లగుపరోపకారు లనియును, దుర్ఘటస్వామికార్యనిర్వాహకు లనియును, శత్రువుల గర్వముం బరిహరించువారనియును దెలిసెడి. అట్టియాఱ్వేలవారిలో శ్రీవత్సగో

త్రుఁ డగువల్లభరాజు తనకు మూలపురుషుఁ డని పాపరాజు చెప్పెను. అతనిసంతతి.

వల్లభరాజు
|
అయ్యన్నమంత్రి
|
అప్పయామంత్రి
|
పాపరాజు. (గ్రంథకర్త.) | నరసింహము.

## పాపరాజునకుం గలయధికారపదవి.

ఈపాపరాజు కవిత్వవిభవోపేతుఁడే గాక యధికారాదివిభవోపేతుఁ డని యాశ్వాసాంతగద్యములో వ్రాయఁబడినవాక్యములం బట్టి యోజింపవలసి యున్నది. ఎట్లన్నను :—

"గద్యము. ఇది శ్రీమదనగోపాలకృపాకలితకటాక్ష వీక్షా సమాసాదిత చతుర్విధానవద్యకవిత్వవిద్యావధాన ధునాతనభోజరాజ సకలవిద్వజ్జనాభివర్ణితోదీర్ణవైభవాధఃకృతరాజరాజ, రాజయోగసామ్రాజ్యలక్ష్మీవిలాస ధురంధర, ధరాధిపసభాంతరస్తవనీయ, నయకలాయుగంధర బంధురమనీషా విశేషముంధానవసుంధరాధరశోధిత గణితశాస్త్రరత్నాకర, వినయాదికగుణరత్నాకర, కంకంటివంశపయఃపారావార పరిపూర్ణసుధాకరాప్పయామాత్యసంక్రందననందన, విజ్ఞానవిభవజితసనందన, విష్ణుమాయావిలాసాభిధాన యక్షగాన నిర్మాణప్రవీణతానిధాన పాపరాజప్రధాన ప్రణీతంబైనశ్రీమదుత్తరరామాయణం బను మహాకావ్యంబునందు".

దీనింబట్టి చూడఁగా నీపాపరాజు కేవలకవిత్వవిశేషములు గలవాఁడే గాక, విశేషధనికుఁ డనియు, రాజయోగాద్వైతశాస్త్రప్రవీణుఁ డనియుఁ బ్రభుసంస్థానములలో న్యాయకార్యవిచారణాదక్షుం డనియును, గణితశాస్త్రవిశేషజ్ఞుఁ డనియును జ్ఞాని యనియును, విష్ణుమాయావిలాస యక్షగాననిర్మాత యగుటం జేసి సంగీతములోఁగూడఁ బండితుఁ డనియును దేలినది.

### పాపరాజునకుఁ బుప్పగిరి తిమ్మకవి సహాయుఁ డౌట.

ఈపాపరాజునకు నుత్తరరామాయణగ్రంథరచనలోఁ బుప్పగిరి తిమ్మనకవి సహాయుఁడై యుండిన ట్లీగ్రంథములోననే కాన్పించును. ఆ వృత్తాంతముఁ జెప్పుటకుఁ బూర్వము పాపరాజు తానొకకలఁ గంటి నని యును, ఆకల తనకు మిత్త్రుండును సహాధ్యాయియు నైనపుప్పగిరి తిమ్మకవితోఁ జెప్పఁగా నతఁ డందులవిశేషముల విప్పి చెప్పి తన్ను గ్రంథరచన కుత్సహించి సహాయుఁడు కాఁగాఁ దా నీగ్రంథమును బ్రారంభించితి ననియును జెప్పెను. ఎట్లన్నను :—

క. అని పల్కి యాకృపాలుఁడు, సనుటయు నే మేలుకాంచి స్వప్నమునం దు
న్నను నేలుస్వామిఁ గనఁ గలి, గె నె యని రోమాంచకంచుకితగాత్రుఁడ నై.

"మ. హనుమద్దివ్యపదారవింద మకరందానంద నేందిందిరా
త్ము ననేకాంధ్రకృతి ప్రకల్పనసమర్థుం బుప్పగిర్యప్పనా
ర్యునిసత్పుత్త్రినిఁ దిమ్మనాఖ్యకవిచంద్రున్ మత్సహాధ్యేతఁ బ్రో
ద్ధున నేఁ బిల్వఁగఁ బంచి కన్నకల సంతోషంబునం దెల్పినన్.

"మ. అతఁ డానందముఁ జెంది నన్నుఁ గని యన్నా జాళువాపైఁడికిన్
గృతకర్ణాంచితరత్న మబ్బినటు లయ్యె న్నీవు వాక్ప్రౌఢిమం
గృతి సేయంగఁ దొడంగురామకథకుం గృష్ణుండు రాఁ జౌటఁ బ్ర
స్తుతి గావింపఁగ మాకు శక్యమె భవత్పుణ్యప్రభావోన్నతుల్".

"తే. అని కిరీటికి శౌరి తోడైనయటుల, నమ్మహాకవి సాహాయ్య మాచరింపఁ
గృతి మొనర్పఁగఁ బూనినయేను మొదట, నెంతు మద్వంశవిధ మది యెట్టులనిన.

### పాపరాజు కాలనిర్ణయము.

దీనిని సూచించుట కీగ్రంథములో నేమియు నాధారము లేదు. కాని యీగ్రంథకర్త పుప్పగిరితిమ్మకవిసమకాలీనుఁ డని చెప్పి యుండుటం జేసి యతనికాలముంబట్టి యైనను దీనిని నిర్ణయింత మని యోచింపఁగా నదియును నంతమాత్రముగానే యున్నది. అతనిపేట దశావతారచారిత్ర మనుగ్రంథ మొకటి ప్రఖ్యాతి నంది యున్నది. అది యతనిచే రచిత మైనను ధరణీదేవులరామమంత్రిపేరు బెట్టి రచియింపఁబడినది. అం దీతిమ్మనపే రైనను గానరాదు. ఇట్టిచో నేవిధముగ

దీనిని నిర్ణయింపఁగలమో నాకు బోధ కాకుండ నున్నది. దశావతార చరిత్రంగూర్చి వ్రాయుచో నీవిషయమై సంపూర్ణముగ సంవాదించెదను. ప్రస్తుతములో మాత్రము లోకము వాసుకంబట్టి దానిని గ్రంథకర్త యగుపుష్పగిరి తిమ్మనయును, ధరణీదేవుల రామమంత్రియును, కంకంటి పాపరాజును సమకాలీను లనియును వారందఱును గృష్ణరాయానంతర కాలములోఁ బెన్గొండ, చంద్రగిరి సంస్థానములలో నాధిపత్యము చేసిన వీరవేంకటపతిరాయనిమంత్రి యై యతనివలనఁ జామరయుగళమును, పల్యంకిక భద్రదంతి మొదలగు సన్మానముల నందిన మదగలతిమ్మమంత్రి మనుమఁ డగు రామమంత్రికాలములోనివారుగా నిర్ణయింపఁబడవచ్చును. ఈమదగలరామమంత్రి పేరిటనే దశావతారచరిత్రము కృతియియ్యఁబడినది కావున నీమువ్వు రందఱును శాలివాహనశకము పదునేడవశతాబ్దారంభములోనివారుగా నూహింపఁబడవచ్చును.

## పాపరాజుకవిత్వశయ్యాదులు.

ఇతనికవిత్వము ప్రబంధకవులకవిత్వమురీతిని మిగులఁ బ్రౌఢిమ గలదియు రసవంతమైనదియు నని చెప్పవలసి యున్నది. కాని వ్యాకరణములో మట్టుకుఁ గొన్నిస్ఖాలిత్యము లగపడును. ఇతఁడు ప్రబంధకవులవలెఁ దదవసరశాస్త్రములన్నిటిని విశేషించి పరిశీలించినవాఁడును, విశేష పరిశ్రమ చేసినవాఁడును గాకపోవచ్చును. కవిత్వవ్యాసంగములో మట్టుకుఁ బరిశ్రమ కలవాఁ డౌటచేత ధారాశుద్ధియును, భావప్రకటనయందు సమర్థతయును, విశేషించి యున్నవి. దానిం దెల్పుట కొకటిరెండు పద్యముల నీక్రిందఁ జూపెదను.

### ద్వారకి.

"శా. వైదర్భీవిలసద్విలాసమునఁ జెల్వం బూని సత్శ్లోక్తి సొం
తే దీపించి కళిందజోజ్జ్వలరసాప్తిన్ మించి భద్రాత్మకం
బై దివ్యధ్వనలక్షణాశ్రయసమాఖ్యం గాంచుమత్కావ్య మా
హ్లాదం బిచ్చు గ్రహింపఁ గృష్ణునకు నర్హం బౌ కదా యెయ్యడన్."

## యమకము.

సీ. చిత్రకూటమణీవిచిత్రకూటసుఖేట, చిత్రకూటస్థలాసీనుఁ డగుచు
దండకాశరభవేదండకాసరముఖో,ద్దండకాసరమృగధ్వంసి యగుచు
మానవారితపూజ్యమానవాసవిరాధ, మానవాదహిమోగ్రభానుఁ డగుచు
దానవాగ్నిభిదానిదానవార్యభయప్ర, దానవాక్పరితుష్టమౌని యగుచు
దూషణాలాపఖరఖరదూషణామ, రేషణద్వేషణానేకశోషణాతి
భీషణాశనిఘోషణాశ్లేషణాస్త్ర, పోషణుఁడు మించె రఘువంశభూషణుండు.

## ఆంధ్రము.

సీ. చలిగట్టుదొరపట్టి జపియించుమంత్రంబు, వేయురేకులతమ్మి వెలయునంచ
పలుకుఁగొమ్మకుఁ దేనిఁ గలిగించుతొలిపెద్ద, యీరేడుజగముల నేలుఱేఁడు
ప్రాఁబల్కుజవరాండ్రబలగంపుముచ్చట, పెనునీటఁ దేలాడుపిన్నపాప
మరుగొంగవలపుఁదామరమీఁదియొలదేఁటి, కలిమిరాయొయ్యారినోములఫలంబు,
కటికచీఁకటివేల్పు నొక్కుట వెలుంగు, మేటిరేద్రిమ్మరులగంటుపోటుబంటు,
తొగలఁ దమ్ములఁ బ్రోచుకన్దోయిఁ జూచు, వేల్పుకౌసల్యకొమరుఁడై వృద్ధిఁబొందె.

## ముక్తపదగ్రస్తము.

సీ. శ్రీకరరఘుకులక్షీరాంబునిధిసోమ, సోమముఖ్యామరస్తోమధామ
ధామనిధిప్రశస్తప్రతాపోదార, దారకవిత్వవిదారవీర
వీరభద్రోన్నిద్రవీరరసాధార, ధారణాభ్యాసచేతఃప్రచార
చారణశ్రీవిలాసనిరస్తరాజీవ, జీవభావైక్యదృష్టిప్రదాన
గీ. దానవప్రాణహృతిప్రాణతతిభుజంగ, జంగమస్థావరరచనాంచత్ప్రభావ
భావనాదూర బహుపావనావతార, తారకబ్రహ్మనామ కోదండరామ.

---

శ్రీ ర స్తు.

# క వి జీ వి త ము లు.

ఆంధ్రపంచకావ్యకవులచారిత్రము.

## 10.

## అ ల్ల సా ని పె ద్ద న.

దీనిని విస్పష్టముగాఁ దెల్పుదృష్టాంతములు విశేషముగ లేవు. మనుచరిత్రములో నచ్చటచ్చట వివరించినసంగతులం బట్టి కొంచెము చారిత్రము సమకూర్పవలసి యున్నది. ఇతనిగ్రంథారంభస్తోత్రములం బట్టి స్మార్తుఁ డని తోఁచుచున్నది. స్మార్తులు సామాన్యముగా బ్రహ్మ విష్ణు మహేశ్వరుల నుమారమావాగ్భామామణులను. వినాయకాదు దులను వర్ణించి పద్యములను రచియించెదరు. అట్లుగా నీతఁడును చెప్పెను. గాని తనగురుని వర్ణించి చెప్పినయీక్రిందిపద్యమువలన నాతఁడు స్మార్తుఁడు కాఁడేమో యని తోఁచుచున్నది. ఆపద్య మెట్లన్నను:—

క. కొలుతు న్మద్గురు విద్యా, నిలయు న్గరుణాకటాక్షనిబిడజ్యోత్స్నా
దళితాశ్రితజనదురిత, చ్ఛలగాఢధ్వాంతసమితి శఠగోపయతిన్.

అనుదీనింబట్టి శఠగోపయతీంద్రునిశిష్యుం డైనట్లును వైష్ణవమత ప్రవిష్టుఁ డనియుం దోఁచెడిని.

ఈతఁడు నందవరీకు లను నియోగులలోనియొకవంశస్థుఁ డగున ల్లసాని చొక్కనమంత్రి కుమారుఁడు. రాయలయాస్థానకవిశేఖరుఁడు, ఆంధ్రమున కెంతయుఁ బ్రసిద్ధుఁడు. సంస్కృతమునంగూడ నసమానప్రజ్ఞ కలవాఁడు, ఈతనికిఁ బూర్వు లగుపురాణకవులును, కావ్యకవులును నొనరింపనిప్రబంధకవనమునకుఁ గ్రొత్తత్రోవ లీతఁడు కల్పించుటంజేసి యాంధ్రకవితాపితామహుఁడని విఖ్యాతబిరుదు గల్గినది. ఈతని రాయలు

" క. హితుఁడవు చతురవచోనిధి, వతులపురాణాగమేతిహాసకథార్థ
స్మృతియుతుఁడ వంధ్రకవితాపితామహుఁడ వెవ్వ రీడు పేర్కొన నీకున్."

" చ. ఘనతరఘూర్జరీకుచయుగక్రియ గూఢము గాక ద్రావిడీ
స్తనగతిఁ దేట గాక యఱచాటగు నాంధ్రవధూటి చొక్కపుం
జనుగవఁ బోలె గూఢమగు జాటుఁదనంబును లేక యుండఁ జె
ప్పిన నదివో కవిత్వ మనిపించు నగిం చటు గాక యుండినన్."

" ఉ. ఱవలచన్నులంబలె బయల్పడనీయక ఘూర్జరాంగనా
గురుకుచయుగ్మముంబలె నిగూఢము కాక తెనుంగుదేశపుం
గరితలచన్నులంబలె నొకానొకయించుక గానుపించినన్
సరసులు మెత్తు రక్కవితచందము నందముగా జగంబునన్."

అని కృష్ణరాయఁడు పెద్దనకవిం జూచి తనపేరిటఁ గృతి రచియింప యత్నింపవలయు నని తలఁచుచుఁ బ్రోత్సహించుచుండెనఁట! అట్లుత్సహింపఁబడినను మంచిది రచియించెద నని కాలయాపన చేయుచుండెను గాని గ్రంథారంభముమాత్రము చేయఁబడదాయెను. ఒకనాఁడు పెద్దన యిట్లు కాలయాపన చేయుటకుఁ గారణ మేమి యుండు నని యూహించి యతనిం బిలువనంపించి కృతి రచియింప నారంభించినఁగాని తాను భుజియింప ననియు నాదినమునందే కృతి యారంభింపక తప్పదనియును బలవంతపెట్టి చెప్పిన విని పెద్దన యిట్లనియె.

చ. నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చు క
ప్పురవిడె మాత్మకింపయినభోజన ముయ్యెలమంచ మొప్పుత
ప్పరయురసజ్ఞు లూహ తెలియంగలలేఖక పాఠకోత్తము
ల్దొరికినఁ గాక యూరక కృతుల్ రచియింపు మటన్న శక్యమే.

అని నుడివిన రాయఁడు పెద్దన్నయభిప్రాయానుసారంబుగ నొక్క దివ్యభవనంబును, గోకట మొదలగు నగ్రహారాదికము నిచ్చి సంతోషపెట్టెను. అనంతరము కృష్ణరాయఁడు మరలఁ బెద్దనకవివలనఁ గృతినందు నిష్టము కలవాఁడై యిట్లనియె.

గీ. సప్తసంతానములలోఁ బ్రశస్తిఁ గాంచి, ఖిలము కాకుండునది ధాత్రిఁ గృతియ కానఁ
గృతి రచింపుము మాకు శిరీషకుసుమ, పేశలసుధామయోక్తులఁ బెద్దనార్య.

పెద్దన దానికి సంతసించి "మనుచరిత్రం" బనునొకప్రబంధమును రచియించి తెచ్చెను దానిని సాంతముగ విని కృష్ణరాయఁ డతనికి విశేషబహుమానంబు గావించెను. ఈగ్రంథమునఁ బ్రబంధమునకు వలయు వర్ణన లన్నియు నున్నయవి. ఇందుఁ గల్పనలు శ్లేష విశేషముగ లేకుండ నుండును. కొన్నిస్థలములు సంస్కృతజటిలములు. మఱి కొన్నితావు లచ్చతెనుఁగుగలవి. కొన్నిమిశ్రంబులు, ఈతనియుభయభాషాపాండిత్య మాయాస్థలములఁ జూచినచో గోచరం బగును, అప్పటివారలలోఁగూడ నీతని కీడగువాఁ డీతఁడే యని చెప్పవచ్చును. "పెద్దన వలెఁ గృతిసెప్పిన, బెద్దన వలె" అనులోకోక్తియుం గల్గె, ఈకవికి జ్యోతిషంబునఁగూడ నసమాన ప్రజ్ఞ గలదు. ఆవిషయమున పద్యము లచ్చటచ్చట నీగ్రంథముననే చూడనగును. సంస్కృతజటిలముగ నుండు పద్యము:—

క. నరనారాయణచరణాం, బురుహద్వయభద్రచిహ్నముద్రితబదరీ
తరుషండమండలాంతర, సరణిం ధరణీసురుండు చనిచని యెదుటన్.

అన్యదేశ్యంబు లుంచి చెప్పినపద్యము.

సీ. పచ్చనిహురుమంజిపనివాగ పక్కెర, పారసిపల్లంబు పట్టమావు
రాణ నొప్పారువైహాణాపుసింగిణి, తళుకులకోరీతరకసంబు
మిహిపసిండిపరంజా మొహదాకెలంకుల, తావుగుజ్జరివన్నెకేవడంబు
డాకెలంకునసిరాజీకరాచురికత్తి, కుఱుఁగటుఁ గ్రొవ్వాఁడిగోటికలపాది.
తే. పీలిసుంచెతలాటంబు పేరజంబు, మణులమొగముట్టుఁ బన్ని సాహిణిరొకండు
కర్తయెదుటికిఁ గొనివచ్చె గంధవాహ, బాంధవం బగునొకమహాసైంధవంబు.

మిశ్రమున కుదాహరణము.

సీ. బుద్ధీంద్రియక్షోభములకుఁ బెట్టనికోట, పపదంబు రాశిదుర్వ్యక్తి|గోడ
ఖలదురాలాపమార్గణవజ్రకవచంబు, రణమహీస్థలికి శ్రీరామరక్ష
శాత్రవదుగ్గర్వసంస్తంభనౌషధి, మొనయుచింతాశ్రేణిమూఁకవిప్పు
రోగాదిసంసిద్ధు లొనగూర్చు పెన్నిధి, తూలునేకాకులతోడునీడ,
తే. సకలసుగుణప్రధానంబు సకలకార్య, జాలసాఫల్యకరణైకసాధనంబు
ధైర్యగుణ మట్టిధైర్యంబుఁ దక్కఁ బాఱఁ, దత్తరింతురె యకట మీతరమువారు.

ఈ పెద్దనయే యపుడపుడు కృష్ణరాయలపై రచియించినచాటుధారపద్యములు కొన్ని గలవు. వాని నిచ్చో వివరింతము :—

మ. సమరక్షోణిని గృష్ణరాయలభుజాశాతాసిచేఁ బడ్డదు
ర్దమదోర్దండపుళిందకోటి యవనవ్రాతంబు సప్తాశ్వమా
ర్గమునం గాంచి శబాసహోహరిహరంగా ఖూబుఖోడాకి తే
తుముకీబాయల బాయిరే మలికి యందుర్మింటికిన్ బోవుచున్.

మ. రాయగ్రామణి కృష్ణరాయ భవదుగ్రక్రూరఖడ్గాహిచేఁ
గాయం బూడ్చి కళింగదేశనృపతుల్ కానిర్ఝరీపావణీ
మాయాభీతు ముటాకులోష్ఠహుటు రేమాయాసటాజాహిరే
మాయాస్మేయమడే యటంచ్రు దివి రంభాజారునిన్ యక్షునిన్.

శ్లో. వీరాగ్రేసర కృష్ణరాయ నృపతే త్వద్వైరికాంతా వనే
ధావంత్యః కుచయానరోమలతికావ్యాహారలీలాభృతః,
ప్రాప్తాన్ కోకమదేభపన్నగఖగాన్ రుంధంతి వక్త్రేందునా
మధ్యేనాపి కచేన కంకణాల సద్వైవస్వర్ణరత్నైరపి.

సీ. చినుకుపూసలు గూర్చు చెలువైనపూదండ, దండాటగలవేల్పు తపసికొండ
కొండాటములను జిక్కులు బెట్టుజడదారి దారితప్పక గట్టుజీరునలుగు
నలుగటింటికి వెన్నుఁ డిలకుఁ దెచ్చినచెట్టు, చెట్టుగొట్టఁగఁ జేయుచెలువతోడు
తోడు క్రీడికి నైఁదొరతోడఁబుట్టువు, పుట్టులిబ్బులకానిపొందుకాఁడు
గీ. కాఁడుపూరిజనించినఘనునితల్లి, తల్లిబిడ్డలఁ బెండ్లాడుగొల్లమనికి
మనికితంబుల నీడేర్చుఘనుఁడవిందు, విందు సత్కీర్తి నరసింహవిభునికృష్ణ. ”

మనుచరిత్రలో నల్లనిసాని పెద్దన యీక్రింది విధముగఁ గృష్ణరాయని వినుతించె ఎట్లన్నను:—

సీ. ఉదయాచలేంద్రంబు మొదల నెవ్వనికుమారతకుఁ గ్రౌంచాచలరాజ మయ్యె
నావాడపతిశకంధరసింధురాధ్యక్షు, లరిగాపు లెవ్వానిఖురతరాశి
కాపుచగౌడధాత్రీతలం బెవ్వాని, కనివారుగా నేఁగునట్టిబయలు
సకలయాచకజనాశాపూర్తి కెవ్వాని, ఘనభుజాదండంబు కల్పశాఖ
గీ. ప్రబలరాజాధిరాజవీరప్రతాప, రాజపరమేశబిరుదవిభ్రాజి యెవ్వఁ
డట్టిశ్రీకృష్ణదేవరాయాగ్రగణ్యుఁ, డొక్కనాఁడు సుతూహలంబుప్పతిల్ల.”

అనుసీసపద్యమువలన మనుచరిత్రము కృతి నందునాఁటికే కృష్ణరాయఁడు “ఉదయగిరిసెమ” ను జయించె ననియు నావాడశకంధరసింధుదేశాధిపతులు కప్పము నిచ్చుచుండి రనియుఁ బంచగౌడదేశముపైన నేక పర్యాయములు దండయాత్రలు చేసె ననియు రాజాధిరాజ వీరప్రతాపరాజపరమేశ్వర బిరుదులు గల్గి యుండె ననియుం దెలిసెడి.

ఈకవిరాయల సభాస్థలిలో ననేకసమస్యలు పూర్తి సేయుచు ననేకసమస్య లితరకవుల కిచ్చుచు విద్యావినోదంబులు పెక్కులు సేయుచుండును. వానిలో నితఁ డితరుల నడిగినవానిం గొన్నిటి నిట వివరించెను ఒకానొకదినంబున రాధామాధవుం డనుకవిశిఖామణి రాయలఁ జూడఁ జనుదెంచినఁ బరీక్షింప నితఁడు నియమింపఁబడియె. అతనిసామర్థ్యాతిశయంబు చూడ నగరు, తొగరు, వగరు, తగరు అనుపదంబులు ప్రాసస్థానంబులం దుంచి శ్రీరాము లరణ్యవాసంబున కేఁగునట్లుగ వర్ణింపు మని యడిగెను, దాని కాతఁడు నల్లెయని :—

"చ. నగరు పగాయె నింక విపినంబుల కేఁగుడు రాజ్యకాంక్షకం
దగరు కుమారులార యని తల్లి వగ ల్మిగులంగఁ దోఁపఁగాఁ
దొగరున రక్షఁ గట్టి మదిఁ దోఁచక గద్గదఖిన్నకంఠియై
వగరుపుచున్నఁ జూచి రఘువంశవరేణ్యుఁడు తల్లికిట్లనున్."

అని చదివిన నీతఁడు మెచ్చి "యోయీ భారతంబులోనికథ కావలయును" అనుడు నల్లె యని యీతఁడు. :—

"చ. తొగరుచి కన్నదోయిఁ గడుఁ దోఁపఁ గర్ణుఁడు భీమసేను పైఁ
దగరు ధరాధరంబుపడిఁ దాఁకినభంగినిఁ దాఁకి నొచ్చిన
న్నగరుపుచున్ వెసం బరుగువాఱిన నచ్చటిరాజలోకము
ల్నగరు సుయోధనాజ్ఞ మది నాటుటఁజేసి ధరాతలేశ్వరా."

అనుడుఁ బెద్దన యేదీ? భాగవతంబునఁ జెప్పు మనుడు నాతఁ డిట్లనియె:—

"చ. వగరుపుమాత్రమే వరుఁడు వశ్యుఁడు గాఁడు సఖీసఖిత్వమె
న్న గరుడవాహనుండు మము నాఁ డిటు డించుట లెల్ల యుద్ధవా
తగ రని కాక మోహపులతాతనులైన విడంగఁ జూతురే
తొగరుచి యోషధీశునకఁ దోఁచునె యుష్మలికంబు మానునే."

అని చదివినయాతనియాశుధార కెంతయు నలరి రాయలకడ నాతని నెంతయు శ్లాఘించెను. రాయఁడు నాతనికి విశేషసన్మానంబు సేసి పుచ్చెను.

ఈపెద్దన పూర్తిచేసినపద్యంబు లనన్యభేదంబులు, ఒకానొక దినంబున రాయం డొకపెండేరంబు దెచ్చి యాస్థానంబునం దుంచి యాం

ధ్రమునందును సంస్కృతమందును గవిత్వము సమానముగఁ జెప్పఁ గలవారలు దీనిం గైకొనం దగుదు రనియె. దానికి సభలోనిపండితు లందఱు నాలోచించుచు నుండిరి. అంత నీయాంధ్రకవితాపితామహుఁడు లేచి నిలిచి యీక్రిందిపద్యముఁ జదివె దానికి సభ్యు లందఱును మెచ్చి యీపెండేర మీతనికిఁ దగు ననిరి. నాఁటనుండియు నీతనికిఁ "కవిగండ" యని బిరుదు గల్గినది. ఈతఁడు చెప్పినపద్యమును "ఆంధ్రకవితాపితామహునిసింహావలోకనము" అని యందురు. అది యుత్పలమాలికా వృత్తమాలిక. ఎద్ది యనిన :—

" ఉ. పూఁత మెఱుంగులుం బొసఁగుపూఁప బెడంగులు నూపునట్టివా
కైతలు జగ్గునిగ్గు లెనగావలెఁ గమ్మన కమ్మనవ్వలెన్
రాతియుం బవల్ యుఱపురాదను నాచెలియోర జంపులి
ద్దాతరితీపులంబలెను దారసిలన్వలె లోఁ దలంచినన్
బాతిగఁ బైకొనన్వలెను పైదలి కుత్తుకలోనిపల్లటీ
కూఁత లనన్వలెన్ సొగసుకోర్కులు గావలె నాలకించినన్
చేతులకొద్ది కౌఁగిటను జేర్చినముద్దులచిన్ని పొన్నిమే
లూఁతలచన్నుదోయివలె నుబ్బటగావలె విచ్చిచూచినం
డాతోడ నున్న మిన్నల మిటారపుముద్దులగుమ్మకమ్మనా
వాతెఱదొండపంటివలె వాచవి గావలెఁ బంటనూఁదినన్
గాతరతమ్మిచూలిదొరకై జవటాడెడుగబ్బిగుబ్బఫై
నూఁతల నున్నకాయసరిఁ బొల్చెడికిన్నరమెట్టుబంతిసం
గాతపుసన్నతంతిబయకారపుకన్నడగౌళవంతికా
సాతతతానతానలపసం దివుటాడెడిగోటిమీటుబల్
మోఁత లనన్వలెన్ వలపు మొల్లము గావలె నచ్చతెన్గు లీ
రీతిని సంస్కృతంబు పచరించినపట్టున భారతీవధూ-
టీతపనీయగర్భనికటీభవదానపర్వసాహితీ
భూతికనాట్యకప్రకర భారతభారత సమ్యగప్రభా
శీతన గాత్మజాహృదయ శేఖరశీతమయూఖ రేఖికా
పాతనఖప్రపూగ బహుభంగఘుమంఘుమఘుంఘుమాస్ఫటీ
జాతకతాళయుగ్మలయ సంగవిడంబి విడంబి తామృతం
గాతత తేహిత త్తహితహోధిత గానసతానదిందిమి

వ్రాతలయానుగుణ్యపదహారిషహూద్వహాహారిశోభితా
నూతనఘుల్ఘులాచరణనూపురజాలఝురీ మరందసం
ఘాతవియద్ధునీ చకచక ద్వికచోత్పల. సారసంగ్రహా
యాతకుమారగంధవహహారి సుగంధవిలాసయుక్తిమై
చేతము చల్లచేయఁగలెఁ జిల్లనఁ జల్లఁగలెన్ మనోహర
ద్యోతకగోస్తనీఫలమధుద్రవగోఘృత పాయసప్రసా
రాతి రసప్రసారరుచిరప్రతిగావలె సారెసారెకున్.

పాఠాంతరము.

ఉ. మా. పూఁతమెఱుంగులున్ పసరుపూఁపబెడంగులు చూపునట్టివా
కైఁతలు జగ్గునిగ్గు సెనగావలెఁ గమ్మనఁగమ్మనన్వలెన్
రాతిరియున్ నృప లక్ష్మిఅపురానిపహాయల్చెలి మారజంపుని
ద్రాతరితీపులున్ నృలెను దారసిలన్వలె లోఁ దలంచినం
డాతొడ నున్నమిన్నలమిటారపు ముద్దులగుమ్మకమ్మ నా
వాతెఱదొండపంటివలె వాచవి గావలెఁ బంట నూఁదినన్
జేతులకొద్ది కౌఁగిటను జేర్చనకన్నియ చిన్నిపొన్నిమే
ల్మూఁతలచన్నుదోయివలె ముచ్చటకావలెఁ బట్టిమాచినం
బాఁతిగఁ బైకొనన్వలపుఁ బైదలిసత్తుకలోనిపల్లటీ
కూఁతలునన్నలెన్ సొగసుకోర్కులు గావలె నాలకించినం
గాతలతమ్మిచూలి దొరకైవసపుంజవరాలిసిబ్బెపు
న్మేలెలియుబ్బరంపు జిగిబిబ్బగపుబ్బగుగబ్బిగుబ్బపొం
బూఁతలనున్న కాయసరి పోఁడిమికిన్నెర మెట్లబంతిసం
గాతపుసన్నతంతిబయవారపుకన్నడ, గౌళ, పంతుకా
సాతతతాన తానలపసందివుటూడెను గోటమీటుబల్
మోతలనన్వలెన్ హరువు మొల్లము గావలె నచ్చతెన్గు లీ
రీతిగ సంస్కృతంబు పచరించినపట్టున భారతీవధూ
టీతపనీయగర్భనిక టీభవ దానసపర్వసాహితీ
ఖ్యాతిక నాటకప్రకర భారతభారత సమ్మతప్రభా
శీతనగాత్మజాగిరిశశేఖరశీతమయూఖరేఖికా
పాతసుధాప్రపూరబహుభంగ ఘుమంఘుమఘుంఘుమార్భటీ
జాతకతాళయుగ్మలయ సంగతి చుంచు విపంచికామృదం
గాతతతత్తతాధిహిత హాధిత దంధణుధాణుదింధిమి
వ్రాతలయానుగుణ్య పదవారిషహూద్వహాహారికింకిణీ
నూతనఘుల్ఘులాచరణ నూపురఝూళఝురీకరాబ్జసం

ఘాతవియుద్ధునీచకచకద్ద్వికచోత్పలసారసంగ్రహా
యాతకుమారగంధవహ హారిసుగంధ విలాసకృత్యమై
చేతము చల్లజేయవలె జిల్లన చల్లవలె న్మనోహర
ద్యోతకగోస్తనీ మధుమధుద్రవ గోఘృతపాయసప్రసా
రాతిరసప్రసారరుచిరప్రతి గావలె సారెసారెకున్."

అనుసీపద్యంబుఁ జదివినపెద్దనకవిని రాజులు సభ్యులును నెంతయుఁ గొనియాడి యతనియాశుధారం గీర్తించి యీయందెను ధరింప నతఁడే సమర్థుం డనిరి. అపుడు కృష్ణరాయం డాకవిగండపెండేరముం గొని యాతనిపాదంబు పట్టికొని దానిం దొడిగెను. దానికి సభ్యులందఱును సంతసిల్లిరి. ఇట్లు గౌరవించినరాజుం గాంచి పెద్దన విశేషానందముతో నాతని నొకపద్యంబు చెప్పి దీవించెను. అదెట్లనిన:—

పంచపాది.

శా. క్షీరాంభోనిధియందు యోగసరణిం జిచ్ఛక్తిఁ బ్రాపించి త
ద్గోరాజత్కుచదస్థగోపవిలసద్గోరాజగోలోకతా
స్ఫారాలోకనతేజగాత్రచలనస్వాంతాద్రిదంభోళిక్రు
త్స్వారజ్ఞానసనందనాదిమునిబృందాధిక్యసామగ్ధ్యవాః
పూరాకారత నిద్రఁ జెందుకరుణాంభోరాశి నిన్ బ్రోవుతన్.

ఈపెద్దనకడ నొకభట్టు చిరకాలమువిద్యాభ్యాసము సేయుచుండెను, ఈచిన్నవాఁడు విద్యకఱచుటయందు మిగుల శ్రద్ధాళుఁడై యుండువాఁడు కావున నీతనియెడఁ బెద్దనకు నెక్కుడుప్రేమ యుండి విద్యామర్మముల నన్నిటిం గ్రమక్రమంబుగ బోధించెను. ఇట్లుండ నొకనాఁటిరేయిఁ బెద్దన పండియుండి యొకానొకవర్ణనాంశం బూహించుచుండెను. అపుడీభట్టు గురునిపాదసేవ సేయుచునుండి స్వామీ! మీ రూహించువర్ణనకు బాధకంబు గలదు దాని నింకొకవిధంబున నూహింపుఁ డని తద్విధం బెఱింగించె, దాని విని యత్యాశ్చర్యంబునఁ బెద్దన యిట్లు చింతించెను. అహాహా! నాకుం దోఁచనియీకవివర్ణనం బితఁ డూహించుటచే వీనిమనోదార్ఢ్యంబు విశేషంబని తెలియుచున్నది, వీఁడు మత్సముం

డమ్యెను. కావున శుశ్రూషార్హుండు గాఁడు” అని వానిం జూచి “ రామ యా! యిఁక నాపాదములు ముట్టకుము ; ఇంటికడనే యుండి పాఠములు చింతన సేయుచుండుము, రాజదర్శనార్థము నినుఁ దోడ్కొని పోయెదను” అని దానికిఁ దగు నుపాయ మన్వేషింపుచుఁ గొంత చింతించి పర్యాయంబున నాలోచింత మని నిశ్చయించి భట్టుం జూచి నేను లేకుండ రాజుకడకుఁ జనవల దని తెల్పి తా నిదురించెను. అంత భట్టు తనప్రజ్ఞావిశేషములు పెద్దనకే యధికముగఁ దోఁచుట తెలిసికొని మిక్కిలి సంతసించి రాజదర్శనమునకుఁ జనఁ దనలోఁ దా నిట్లు చింతించె. “ పెద్దన నన్నుఁ దా లేనపుడు రాజుకడ కఱుగవల దనెను. దీనికిఁ గారణం బేమి. నాకు విశేషసన్మానము గల్గు ననియెంచి కానోపును, ఇట్టి వాని నమ్మినఁ గార్యం బేమి? కావున నే నిపుడు రాజుకడ కేఁగి మద్వృత్తాంతం బాతని కెఱింగించి వచ్చెద. ఉదయమైన నీతం డేదేనియంకిలి గావింపనోపును. అని యెంచి తత్క్షణంబ బయలువెడలి నగరు చేరం జని తనవార్త రాజునకుఁ బంపిన నాతఁడు కవి వచ్చె నని విని సంతసించి యపుడు సమయం బొసంగిన నీభట్టు కట్టెదుట నిలిచి కైవారంబు సేసి “ కుంజరయూథంబు దోమకుత్తుక సొచ్చెఁ” అనునట్లు తా నంతవఱకుఁ బ్రసిద్ధి లేక పెద్దనగృహంబున నుంటి ననియు నాకెన్నఁడును నాతఁడు దేవరదర్శనలాభము గల్గున ట్లొనరించి యుండలే దనియు నింతియకాక తనకుఁ దెలియకుండ దర్శనంబునకుఁ బోవల దనియుఁ దెల్పిన నాతఁడు నిద్రించుతఱిఁ గనుమొఱఁగి వచ్చితి నని యాతనివలనిభయం బభినయించుచునుండెను. అది విని రాజు క్రొంచె మాలోచించి పెద్దన యిట్లొనర్చునా యనుకొని యయినను సంగతి నరయవలయుఁ బెద్దన నిటకుఁ దోడ్కొని రమ్మని భృత్యులకుం దెల్పెను. వారును వేగంబున వచ్చి నిద్రబోవుచున్న పెద్దనను లేపి రాజాజ్ఞఁ దెలిపిన నాతఁ డట్టిసమయమునఁ బ్రభుఁడు రాఁబంచుటకుఁ గారణం బేమని యూహించి తనశిష్యుం బిలిచెను. వాఁ డట లేకుంటచే రాజు

కడ నెవ్వ రుండి రని భటులతో ముచ్చటింప వా రెవ్వఁడో యొకభట్టు న్నాఁ డని పల్కిరి. దానిచే వాఁడే తనశిష్యుఁ డనియును రాజు తన్ని మిత్త్రంబుగఁ దనకు వర్తమానము పంచె ననియు నిశ్చయించి రాజుకడ కరుదెంచి యెదుట నిలువంబడియె. అపుడు రా జాతనిం జూచి "కుంజరయూథంబు దోమకుత్తుకఁ జొచ్చెన్" అని సమస్య యిచ్చె. పెద్దన దాని విని యది భట్టుకవిసమస్యగ నూహించి యాతనిం దప్పక చూచి:—

"క. గంజాయి త్రాగి తురకల, సంజాతులఁ గూడి కల్లు చవి గన్నావా, లంజలకొడకా యెటికిఁ, గుంజరయూథంబు దోమకుత్తుక సొచ్చెన్.

అని రోషంబుతో ననిన పెద్దనం గని రాజు నవ్వి యిది నాసమస్య, నెన్నుం జూచి సంపూర్ణము సేయు మనుడుఁ జిత్త మని యిట్లనియె:—

"క. రంజన చెడి పాండవు లరి, భంజనులై విరటుకొల్వు పాలైరి కటా సంజయ! విధి నేమందును, గుంజరయూథంబు దోమకుత్తుక జొచ్చెన్"

అని యిట్లు పూర్ణము సేసిన నాతనిసమయస్ఫురణమునకు రాయం డలరి పొద్దాయె, శయనింపఁ బొండు. అని యాతని వీడ్కొలిపి భట్టుం జూచి దయతో నిట్లనియె, ఓయీ! నీవు భయ మందకుము. నిన్నుఁ గంటికి ఱెప్పయుంబలె నాతనివలన హాని లేకుండ రక్షించెద ను. ఇంటికిఁ బొ మ్మని యాతనిఁ బనిచి తాను నారాత్రి నిదురించి మ ఱునాఁడు రేపకడ లేచి యాస్థానమునకు వచ్చి నిండోలగంబుండి భట్టు ను రావించి సభ్యుల కాతనిం జూపి "యీతని మనయాస్థానపండితుల లో నొకనిగ నియమించితిమి. కావున నీతనియెడఁగూడ నాస్థానపండితు లకుం జూపుగౌరవమే చూపవలయు" ననియెను. దానికి వారందఱును సమ్మతించిరి.

భట్టిట్లు రాజసన్మానము గాంచి విఱ్ఱవీఁగి విద్వజ్జనమును లెక్కింపక యుండెనఁట. ఇట్లుండఁ గొంతకాలంబు సనె. అపు డీతఁడు రాజానుగ్రహము విశేషముగఁ దనయెడఁ గల్గిన ట్లందఱకుం జూపఁ గోరి యొకా

నొకదినంబున తేనిం బ్రార్థించి తనయిష్టానుసారముగా నొకకార్యము నడపుఁడనియె. దానికి రాజు సమ్మతించి యేమికార్య మనుడు నిట్లనియె. "చమత్కారార్థముగ మనయాస్థానములోనికొందఱుకవులను మీయాజ్ఞ యని తెల్పి సభకు రాఁగూడ దని నుడివెదను, ఇదియ నాయభీష్టమని యె, దానికి రాయఁడును సమ్మతించెను అవుడు భట్టు సభలో నిలిచి కొందఱి నామములు జదివి వీరిని ప్రభుఁ డాస్థానమునకు మఱల రా నుత్తరం బిచ్చువఱకు వీర లిచటికి రావల దని తెల్పి యిదియు రాజాజ్ఞ యే యనియె. రాజాజ్ఞయనుటం జేసి యలంఘనీయము గావున వల్లె యని వారందఱును నాస్థానంబు వాసి చనిరి. వారిలోఁ బెద్దన మొదలగుకవు లుండిరి. వీరందఱును గారణం బేమియు లేక రాజిట్లాజ్ఞ యొసంగుటకుఁ జింతించ్రి యిది భట్టుచేత నైనదే కాని యింకొకటి కాదని నిశ్చయించి ముక్కుతిమ్మనయింటికిం జని యచ్చోఁ గూర్చుండి భట్టుచెట్టలు దలంచుచుండిరి. ఇట్లుండఁ గొంతతడవునకు భట్టందలం బెక్కి యావీథింజనుచుండె. తిమ్మనవాకిట నున్నకవికోటి యాతనికి దృష్టిగోచరంబయ్యె. వారింజూచి నిజప్రభావము వర్ణించికొని మాధవుం డనుతనభటునిం బిలిచి యిట్లనియె:—

"వాకిటి కావలితిమ్మన, వాకిటకవికోటి మాధవా కిటికిటీ"

అని నగిన విని పెద్దన క్రుద్ధుండై యద్దిరే భట్టెట్టికాఱు లఱచుచున్నాఁడు! చూడుఁడు? వీనికండక్రొవ్వు. మాటలో నైన వీనికి మనము చాల మని తలంచుచున్నాఁడు. తగునుత్తరం బిచ్చెదంగాక యని లేచి యెలుఁగెత్తి యాతని నుద్దేశించి :—

"క. ప్రాకృతసంస్కృతఘుర్ఘుర, మూకీకృతసుకవితుంగముస్తాతతికిన్
వాకిటికావలితిమ్మన, వాకిటికవికోటి మాధవా కిటికిటీ."

అనుడుఁ బెద్దన గర్జారవమున కులికి మాఱు వలుక నోరాడకున్నభట్టు తనస్తోత్రం జని మఱునాఁ డావృత్తాంత మంతయు రాజునకుం

దెల్పె. దాని విని ధర్మము దప్పినమనకు వారా భయముపడువారు? పెద్దల నూరక నొప్పించుట మహాపరాధము. అని యూహించె.

ఒకనాఁడు కృష్ణరాయఁడు గజారోహణముఁ జేసి వాహ్యాళి వెడల నీపెద్దనకవి పైనుండి వచ్చుచు నొకసందుమళుపుఁ దిరుగునపుడు రాజును మిక్కిలి సమీపమునఁ జూచి భయవినయములు చూపుచు నిలువంబడినఁ గృష్ణరాయఁడు తనలోపమునకు క్షమాపణముఁ జెప్పుట కదియ సమయ మని యెంచి పెద్దనకవిని దనయేనుఁగుపై గౌరవముగా నెక్కించుకొని లోకములోనివర్తమానము లెట్లున్నవి? అని యడుగుడుఁ బెద్దన యాతని కిట్లనియె:—

మ. గవనుల్ బల్లిదమయ్యె ఢిల్లికిని మక్కాకోట మేటయ్యె నీ
భువనం బెల్ల నదల్చి పుచ్చె ననఁగాఁ బోలేరు సందేరులన్
దవసం బెక్కెబెడఁదకోటపురకాంతాగర్భనిర్భేదన
శ్రవణంబయ్యె భవత్ప్రతాపజయవార్తల్ కృష్ణరాయాధిపా.

అని పెద్దన చదువఁగా రాయలు మిగుల సంతసించి యతనికిఁ దనయాభరణం బొక్కదాని నిచ్చి యనంతర మతనిఁ దొల్లిటికంటె విశేషముగ మన్నించుచుండెను. ఈవృత్తాంతమునె యీపెద్దన కృష్ణరాయనిర్యాణానంతరము చెప్పిన.

"ఎదురైనచోఁ దనమదకరీంద్రము నిల్పి కేలూఁత మొసఁగి జేసి యెక్కించుకొనియె."

అనుపద్యములో సూచించెను.

ఇట్లుగా విద్యావినోదములు పెక్కులు గావించి కృష్ణరాయఁడు స్వర్గమునకుం జనినయనంతర మీరాయలసంస్థానములోఁ గల్గినతొందర నింకొకచోఁ జెప్పియే యున్నారము. అట్టిసమయమునఁ బెద్దన శత్రురాజులపై ననేకపద్యంబులం జెప్పె ననియు నట్టిపద్యములవలనఁ గొన్నితొందరలు నివారితము లయ్యె ననియును గలదు. ఆపద్యములలోఁ గొన్ని మన కిపుడు సంప్రాప్తము లైనవి, వానికిఁ గలకథను వ్రాసిని వివరించెదను.

కృష్ణరాయలు గతించినపిమ్మటఁ గటకాధిపుఁ డగుగజపతి విజయనగరము (ఆనెగొందిపై) దండెత్తి వచ్చి తత్పట్టణసమీపములో విడిసెను. దానికిఁ బ్రజలందఱును మిగుల భయముపడఁ దొడగిరి. అది చూచి పెద్దనామాత్యుఁడు గజపతికడకుం బోయి యీక్రిందిపద్యమును జదివె నెట్లన్నను:—

సీ. రాయరాహుత్తుగండ రాచయేనుఁగు వచ్చి యారట్లకోట కోరాడునాఁడు,
సమ్మెటనరపాలసార్వభౌముఁడు కంచుతలుపులఁ గరుల డీకొలుపునాఁడు,
సెలగోలసింహంబు చేరి ధిక్కృతిఁ జేసి సింహాద్రిజయశిలఁ జేర్చునాఁడు,
గడికోటమారాజు గండపెండేరంబుకూతుఁ నొడంబడఁ గూర్చునాఁడు.

గీ. నోడ తెలుంగవా చచ్చితో యూఁక లేవొ, చీరఁ జాలక తొలఁగితో జీర్ణమైతొ,
కనడరాజ్యంబు చొచ్చితే గజపతీంద్ర, తెఱచినిలు కుక్కసొచ్చిన తెఱఁగు గాను.

అనునీపద్యమును విని గజపతి సిగ్గుపడి తాను కారణాంతరమున వచ్చితిం గాని వేఱు కా దని చెప్పి తనదేశమునకుఁ మఱలె నని ప్రతీతి గలదు.

కృష్ణరాయునియల్లుం డగు రామరాజు రాజ్యము చేయుతఱి నొక వెలయాలు మైసూరుదేశమునుండి వచ్చినది. దానివిద్యావిశేషములకు రామరా జెంతయు నలరి దాని నచ్చోఁ దనకుగా నిల్పుటకు యత్నించెను. ఆవృత్తాంతము కృష్ణరాయునికూఁతురు విని యట్టిపని నివారింపఁ బెద్దనకు వర్తమానము పంపినది. అతఁడును దగుసమయముం జూచుచుండెను, ఇట్లుండ రామరా జొకదినమున సభ చేయించి యా వెలయాలివిద్యం బరీక్షింప నిర్ణయించి పెద్దన మొదలగుపెద్దల రావించెను. అట్టివిద్వత్సభలో నాగణికాశిఖామణి గానంబునం గల తనప్రావీణ్యముం జూపి సభికులమనంబు వలరించినది.

దానికి రామరా జెంతయు సంతసించి పెద్దనదిక్కు మొగంబై జాణగానచమత్క్రియల వర్ణించి సభను నానందింపఁ జేయు మనుడు బెద్దన సకరుణంబుగా నిట్లనియె. "ఓ రాజేంద్రా నేను కృష్ణరాయఁడు

గతించినప్పుడే కవితాసంన్యాసము తీసికొని యుండితిని. కావుననే వర్ణనావిషయమగు కవిత్వము చెప్పను. ఒకవేళ జెప్పుదునేని యది భగవత్పరముగా నుండవలయును. ఇట్లు నన్ను వెలయాలిపైఁ గవిత్వము చెప్ప నుత్సహింపఁ జేయుట న్యాయము గాదు, మఱియొకవర్ణనమైనం గాదు. వెలయాలిని వర్ణించుట మిక్కిలియు హైన్యము గదా. దానిజీవన మెట్టిదో వివరించెదను. చిత్తగింపుఁడు :—

చ. పడిగము తమ్మలంబు మిరియు పల్లవకోటికి నోరు వేణి యం
గడిసవరంబు సంతసారకాయ లురోజము లిచ్చ అచ్చపా,
వడి యొడ లూపువుల్ గవని వాతియనంటులు మోవి యొడ్డిగి
జ్జడి వెలయాలిజీవనము జీవనమే యది యెంచి చూచినన్.

అని యిట్లు వెలయాలిదోషములు సమయోచితముగ నుడివిన రాజునకు దానిపై నుండుమోహము తగ్గింపవలయు నని తోఁచినది. పిమ్మట దాని నటు నిల్పుప్రయత్నము మాని సబహుమానముగఁ గారవించి సాఁగంబనిచెను.

కృష్ణరాయఁడు గతించినవెనుకఁ బెద్దన తనలోపము పాటించి యీక్రిందిపద్యము వ్రాసె. దీనిచే నీయిర్వురకుఁ గలమైత్రియుఁ గృష్ణరాయలగుణాతిశయమును గోచరమగును అదెట్లన్నను:—

సీ. ఎదురైనచోఁ దనమదకరీంద్రము నిల్పి, కేలూఁత యొసఁగి యెక్కించుకొనియె
మనుచరిత్రం బందికొని పురం బేగింపఁ, బల్లకి తాఁ జేతఁ బట్టి యెత్తెఁ
గోకట గ్రామాద్యనేకాగ్రహారము, ల్చాల సీమల నిచ్చి సంతరించె
బిరుదైనకవిగండపెండేరమున కీవ, తగు దని నాదుపాదమునఁ దొడిగె.

గీ. నాంధ్రకవితాపితామహ యల్లసాని, పెద్దకవిచంద్ర యని నన్నుఁ బిలుచునట్టి
కృష్ణరాయలతోడ ముగించుకొనక, వసుధఁ బ్రతికితి జీవచ్ఛవం బనంగ.

అని యిట్లు విలపించుచుఁ బెద్దన కొలఁదికాలములోపలనే మృతుండయ్యెను. అనంతరము భట్టుమూర్తి పెద్దనదారాపుత్త్రాదులం బరామర్శింప నతనియింటికిం జని వారిం గాంచి దైవయోగంబునకు దుఃఖించిన వినియోగం బేమి యున్న దని పెద్దనకడఁ దాఁ జదివినవిశ్వా

సముతో నిట్లనియె. "అయ్యయ్యో! నా కీకుత్సితం జూచిన జాలి యయ్యెడిని. పెద్దన యింకను గొంతకాల ముండిన వీరికిం జదువుసంధ్యల నేర్పి తనయంతవారిం జేయును గదా! ఇపుడు వీరికి విద్య యలవడు టెట్లు తండ్రివిద్వాంసుఁ డైనఁగొడుకులును నట్టివారగుట యెచ్చటనో గద అనుభట్టుమూర్తిపల్కులాలించి పెద్దనకుటుంబిని తనపుత్త్రిల నతఁడధిక్షేపించుటగ నెంచి కనలి యిట్లనియె. నాపుత్త్రిలు తండ్రిఁబోలె విశేషముగఁ బ్రజ్ఞావంతులు గాకున్న శ్లేషకవనము చెప్పికొని యైనను బొట్టపోసికొనెదువా రగుదురు పొమ్ము, వీరింగూర్చి నీవు వగవకుము. అను డు భట్టుమూర్తి యాపెపల్కుల నాలించి తా శ్లేషకవి యవుటయుఁ దాఁ బెద్దనకు మిగుల నిష్టుండు గాకుండుటయుఁ దలఁచి యామె యట్లనె నని యూహించి యనంతరము నిజనివాసమునకుఁ జనియెను.

ఆంధ్రపంచకావ్యకవులచారిత్రము.

# 11.

# *నందితిమ్మన.

ఈ తిమ్మనచారిత్రము దెల్పుటకు మనకు రెండుగ్రంథములు గలవు. అం దొకటి పారిజాతాపహరణము. రెండవది యాంధ్రప్రబోధ చంద్రోదయము-అందు మొదటిదానిలో :—

"సీ. కౌశికగోత్రవిఖ్యాతుఁ డాపస్తంబ, సూత్రుఁ డార్వేలపవిత్రకులుఁడు
నందిసింగామాత్యునకును దిమ్మాంబకుఁ, దనయుండు సకలవిద్యావివేక
చతురుఁడు మలయమారుతకవీంద్రునకు మే, నల్లుండు కృష్ణరాయక్షితీశ
కరుణాసమాలబ్ధఘనచతురంతయా, నమహాగ్రహారసన్మానయుతుఁడు
గీ. తిమ్మనార్యుండుశివపరాధీనమతి యు, ఘోరశివగురుశిష్యుండు పారిజాత
హరణ మనుకావ్య మొనరించె నాంధ్రభాష, నాదివాకరతారాసుధాకరముగ,

* ముక్కుతిమ్మన.

దీనింబట్టి చూడఁగా దిమ్మకవి కౌశికగోత్రుఁ డగునార్వేలని యోగిబ్రాహ్మణుఁ డనియును, వీరిగృహనామము నంది వా రనియును, నీతనితండ్రిపేరు సింగన యనియును, తల్లిపేరు తిమ్మాంబ యనియును, దేలుచున్నది - ఇతనిమేనమామపేరు మలయమారుతకవి. ఈమలయ మారుతకవీంద్రుఁడు సకలవిద్యావివేకచతురుం డని ప్రబోధచంద్రోద యకృతిముఖంబునంగూడ వ్రాయఁబడినది. ఇతనిగ్రంథము లెవ్వియో యింకను మనకు గోచరము గాకున్నవి.

తిమ్మకవి గ్రంథారంభములోఁ దాను మొదట రాజాజ్ఞానుసారముగ నీపారిజాతాపహరణగ్రంథము రచియింపకుండుటంబట్టి యట్టిసందర్భము చెప్పఁడయ్యె. అనంతరము రాజు దానిం గృతి నందినాఁడు గావునఁ దన కాతనివలనం గలిగినవిశేషాదికము వక్కాణించి యుండెను. అందుఁ జతురంతయానమహాగ్రహారముం బొందెను. ఈతఁ డఘోరశివగురునిశిష్యుం డని వ్రాసియుండుటంబట్టి దక్షిణామూర్తిమంత్రోపాసనాపరుం డని తెలియవలయును. ఇట్టిశైవోపాసనమునం గల్గినప్రతిభవలననే తా నీగ్రంథమును రచియించితి నని మఱియు విస్పష్ట మగుకొఱ కాశ్వాసాంతగద్యములో "శ్రీమ దుమామహేశ్వరలబ్ధసారసారస్వతాభినంది" అని వ్రాసియుండె. ఇతఁడె కాక యితనివంశ్యులలో మఱికొందఱుగూడ నీదక్షిణామూర్తి నుపాసించినట్లు కానుపించును. ఈదక్షిణామూర్తి నుపాసించువారికిఁ గవిత్వప్రౌఢిమయే కాక విజ్ఞానసంపత్తియుం గల్గు నని చెప్పుటకు శంకరాచార్యములే చాలియున్నారు.

## పారిజాతాపహరణము.

కృష్ణరాయలపేరిటఁ గృతి యీయఁబడినపారిజాతాపహరణగ్రంథ రచనమున కొకచిత్రమయినకథ గలదు. ఒకానొకదినమున రాయలు రాత్రి భోజనానంతరము పండితజనగోష్ఠిచే సభలో నిశీథముదనుక నుండి యాస్థానము చాలించి శయ్యాగృహంబునకుఁ జనియె. అచ్చో నాతనిపట్టమహిషి యంతకుమున్నె హంసతూలికాతల్పమునం గూర్చుండి చెలులతో ముచ్చటలాడుచు భర్త్రాగమనంబు వీక్షించుచుండె. నిశీ

థ మయ్యెం గావున నాపె నిద్రాభరంబునకు నోపంజాలక పరాకున వ్యత్యస్తముగ శయనించినది. అత్తఱిం జెలు లాపెపై నొక్కపటము గప్పి యథేచ్ఛం జనిరి. కృష్ణారాయం డతఃపురంబున కేతెంచి స్వతల్పమునం దొంటియట్ల శయనించె. ఇట్లుండ ననంతరము వ్యత్యస్తశయాన యైననిజమహిషి పాదనూపురరవం బాతనికిం గర్ణగోచరం బయ్యెను. తోడనే దిగ్గన లేచి మంచమునలుగెలంకులం బరికించి యచ్చోం బాదము లుంచి నిద్రించుభార్యం గాంచి కారణ మూహింపుచుం గొంతవఱకుం దెలిసి కోపించి తనలోం దా నిట్లనియె-"అద్దిరే యింతు లెంత మొఱకులు ఆలస్యము చేసితి నని నాపై నలిగినది గాంబోలు. కోపించినం గోపింపుం గాక నను నవమానింపం దలంపం దా నెంతటిది? ఇట్టియనుచితకృత్యమున కుద్యోగించినచో నొకపరి దండించినముం దెన్నం డిట్టిచేష్టలం జేయదు" అని పండ్లు పటపటం గొఱికి క్రూరదండనోపాయం బన్వేషింపుచు "భార్యాదండః, పృథక్ఛయ్యా" అని యున్నది గావున నట్లే చేసెదంగాక యని యచ్చోటు వాసి యింకొకభవనంబునకుం జని యచట శయనించెను. అనంతర మిట నాసాధ్వీమతల్లి యెల్లవృత్తాంతమును జెలికత్తియలవలన విని మనమున మిగుల దిగు లొంది కర్జంబు గానక యూరకుండెను. అట్లు కొన్నిదినములు గడచినవి

ఇట్టివృత్తాంతము నంతయు నాపెయరణపుకవి యగుముక్కుతిమ్మన (నంది తిమ్మన) చూచాయగ గ్రహించి వైళంబ పట్టమహిషికడ కరుదెంచి "తల్లీ! నీమొగము తొంటి తేజంబుననుండ లేదు. దుర్లభకార్యమును జింతించుచున్నట్లు గాన్పించు. నే నుండ మీ రిట్లు చింతింప నేల? వృత్తాంత మెట్టిది యైన సెలవిం డనును రాజమహిషి "యంతఃపురరహస్యములు వెలువరించినచోం బ్రాణహాని యగును. నాపుణ్య మెట్లున్నదో యట్లగును వృథావిచారం బేల?" యనుడు నాతం డిట్లనియె. "తల్లీ! వుత్త్రుండు రహస్యము నీకంటెను గుప్తముగ నుంచి

కార్యము సానుకూలం బవుటకు యత్నించు నని నమ్మెము. నీపిత్రృన ఋండ నైననేను నీకింతమాత్ర ముపకారము నీయిష్టానుసారముగ నొన రింపలేకున్నచో నిచ్చో నుండులాభం బెద్ది?" అను తిమ్మనపల్కు లాలిం చి యాతేనియాలు కన్నీ రొలుక నేడ్చుచుఁ గడచినవృత్తాంత మా మూలాగ్రముగఁ జెప్పినది. దాని నంతయు విని " తల్లీ నీ వింతమాత్రము నే భయంపడ నేల ? ఈ వారములోపల నీనాథుఁడు తనంతన నీకడ కరు దెంచి నిన్ను మన్నించుచు వగవకుము నేనుబోయి వచ్చెదను" అని నిజగృహంబునకుఁ జనుదెంచి రహస్యమునం గూర్చుండి "రాజమహిషి నూరార్చుటకు నచ్చోఁ బ్రాగల్భ్యములు పల్కి వచ్చితిని. ఇపుడు కా ర్యం బెట్లు నిర్వహింతును. ఈవర్తమానము రాజునకుం దెలిసినచోఁ దలకొట్లగును. ప్రస్తావవశమున నన్యాపదేశముగఁ బల్కినచో నాతఁడు దీనిని గ్రహింపఁ దగుసమర్థుండు. అసాధ్యుఁడు. ఆవులించినఁ బ్రేవులు లెక్కించువాఁడు. పిమ్మట నెటుపోయి యెటు లయ్యెడినో" అని య నేకవిధంబుల నూహించి కొంతవడికి మనంబు పదిలంబు సేసికొని తన యిష్టదేవతకు మ్రొక్కి యిట్లు నిశ్చయించె. ఇపుడే తేనిపేరిట నొకప్ర బంధము రచించి దాన దీని కనుగుణం బగుకథ పొందుపఱిచెదను. అందుఁ బ్రస్తావవశంబునఁ బల్కునట్లు మదభిప్రాయము తేటపఱిచెదను రాజును గడు రసికుఁడుగావునఁ దనలోపమును దానిచే నెఱింగి సుపథం బున వర్తించు నటులైన మదీప్సితము సేకూఱును.

అని తలంచి పారిజాతాపహరణం బనుకథఁ గొని ప్రబంధమురచి యింప నారంభించెను. అందుం దొలియాశ్వాసమున నే తనయభిప్రాయ ము తేటపఱిచి దానికిఁ దగుపద్యములు విరచించి దానిచేఁ దనయభీ ష్టంబు సిద్ధించు నని యెంచి గ్రంథ మంతయు వైళంబ పూర్ణము సేసి రాజునకుఁ దెలియఁబఱిచెను. అతఁడును గ్రంథములకుఁ గృతినాయకుఁ డుగా నుత్సహించువాఁడు గావున నొకశుభదినమున సభఁ జేసి గ్రంథ ము జదువఁ దిమ్మనకు నాజ్ఞ యొసంగెను. అపుడు తిమ్మన తనమృదు

తరవాగ్వైఖరి మెఱయ నాగ్రంథమును జదువ నారంభింప నంత నా రదుఁడు శ్రీకృష్ణసాన్నిధ్యమునకు వచ్చి పారిజాతసుమం బిచ్చిన వృత్తాంత మును విన్నట సత్యభామ నాతఁడు నిందించుటయును సాత్రాజితికిఁ గ ల్గినకోపకారణమును శ్రీకృష్ణుఁడా పెకుఁ గోపోపశమనము సేయుటయుఁ జదివి భర్తయెడ నాయింతికి.గోప ముడుగకున్న నారమాభర్త:—

"ఉ. పాటలగంధిచిత్తమునఁ బాటిలుకోపభరంబుఁ దీర్ప నె
ప్పాటను బాటుగామి మృదుపల్లవకోమలతత్పదద్వయీ
పాటలకాంతి మౌళిమణిపంక్తికి వన్నియ వెట్ట నాజగ న్నా
టకసూత్రధారి యదునందనుఁ డర్మిలి మ్రొక్కె మ్రొక్కినన్.

అని చదివి విన్నటఁ దనయభిప్రాయము తేటపఱుప నిట్లనియె.

"మ. జలజాతాసన వాస వాది సుర పూజా భాజనం బై తన
ర్చులతాంతాయుధుకన్నతండ్రిశిర మచ్చో వామపాదంబునం
దొలఁగం ద్రోచె లతాంగి యట్ల యగు నాథుల్ నేరము ల్సేయఁ జే
రలుకం జెందినయట్టికాంత లుచితవ్యాపారము ల్నేర్తురే."

అని చదివి దానికి విశేషదృష్టాంతములు దెల్పుచు సరసంబుగ స్త్రీలు కోపించి యొనరించెడివృత్తాంతములఁ జెప్పి యప్పట్టున మఱలఁ గోపించక శ్రీకృష్ణుఁ డెట్లుండెనో చూచితిరే యని:—

"చ. నను భవదీయదాసుని మనంబున నెయ్యపుఁగిన్కఁ బూని తాఁ
చినయది నాకు మన్ననయ చెల్వగునీపదపల్లవంబు
మత్తనుపులకాగ్రకంటకవితానము సోఁకిన నొచ్చు నంచు నే
ననియెద నల్క మానవు గదా యిఁకనైన నరాళకుంతలా."

అనునీపద్యమును జదివెను. తోడనే రాయనికిఁ దనమనంబున స్వకీయవృత్తాంతము జ్ఞప్తికి వచ్చి తా నిట్టిసమయమున నడచినవిధమం తయు విరసముగఁ గాన్పింపఁ దనలోఁ దా నిందించికొనుచు "కృష్ణుఁడు లోకారాధ్యుఁ డయ్యును గోపించి తన్నినభార్యయెడ నెట్లు వర్తించెనో చూడుఁడు. కృష్ణునట్టిరసికుఁ డుండవలదా. అవ్వలివృత్తాంతము చదు వుఁడు" అనుడుఁ దిమ్మన తనతంత్రము కార్యకారి యయ్యె నని లోన ముదితుండై మీఁదివృత్తాంతము చదివి సత్యభామ కృష్ణున కిచ్చినయు త్తరము లని యిట్లనియె:—

"క. మానంబె తోడవు సతులకు, మానమె ప్రాణాధికంబు మాన మఖిలస
న్మానములకు మూలం బగు, మానరహిత మైనబ్రదుకు మానిని కేలా."

అనుదీనిని రసపుష్టి చేసి యన్వయించి చెప్పిన విని రాజు బలే నీవుచెప్పిన దంతయు మేలుగ నున్నది. అనంతరవృత్తాంతముం జదువు మనుడు నాయాశ్వాస మంతయు ముగించెను. అంత సూర్యాస్తమయస మయమయినది.

అప్పుడు రాయఁడు పండితులం జూచి నేఁటికి నాస్థానమును జాలింత మని వారలకు సెల వొసఁగి తా నంతఃపురికి వచ్చి దాసీజనమును గాంచి కేళికాగృహము నలంకరింప నాజ్ఞ యొసంగెను. వార లతిసంభ్రమమునం జని రాజ్ఞి కవ్వార్తఁ దెలిపిరి. ఆయువతి యానందాబ్ధిమగ్నయై వారికిఁ గనకాంబరాభరణము లొసంగినది. రాజు నాఁటిరేయి భార్యాద్వితీయుఁడై సుఖముగ నుండెను. రాజమహిషి మఱునాఁడు వేకువ నవ్వార్త రహస్యముగఁ దిమ్మనకు నొకచెలికత్తెచేఁ బంచినది. దాని విని యాతఁడు నత్యంతానందంబు నందెను.

కృష్ణరాయలు పారిజాతాపహరణవృత్తాంతము విని యున్నవాఁడు గావున నందలికథాసందర్భము మనమునకు వింత దోఁపింప భార్యను బిలిచి యాపెతో నిట్లనియె. "ముక్కుతిమ్మన చేసిన పారిజాతాపహరణములోనికథాసందర్భము కల్పితమై యుండును. అట్లు గాకున్నఁ గృష్ణుఁడు తనభార్యకుఁ గోపముతీఱుపం జనినను ఆపె తన్నిన నూరకుండుట నిజముగఁ గల్గునా? ఇట్టిచిత్రవృత్తాంత మెప్పుడైనను జరుగునా? అనుడు నాపె నవ్వి పురుషులు కాలానుసారముగఁ గార్యములు నడిపెదరు దీనియాథార్థ్యము కాలాంతరమున మీకే గోచరం బగు నని యప్పటికి నూరకుండెను.

పిమ్మట నారాజపత్ని తనచమత్కారమును బురుషులకన్నతీతియును గనుపఱుప నొకయుపాయ మారయం దొడంగినది. అంతఁ దన దాసీజనములో, బిన్నవయసున నున్నట్టిరూపలావణ్యాతిశయముల నొప్పునట్టియొకజవరాలిం దెచ్చి తనయాభరణము లుంచి దాని నలంకరించి

తనయింట నుంచి కృష్ణరాయలు వచ్చినతఱి మాటలమధ్యను దనపిన తల్లికూఁతురు తన్ను జూడ వచ్చిన దనియును అది తనయింట నుండు వఱకును దనకై యతఁడు తలఁచుగ వచ్చిన భాగుగనుండదనియును జె ప్పినది. ఆమాటలు వినినతోడనే కృష్ణరాయని కాచిన్నదానిఁ జూచువే డుక యధిక మయ్యెను. కావున నాఁడు మొదలు తనభార్యం జూచునెప మున వేళగానివేళల వచ్చి తనమఱఁదలిఁ జూచి కొంచెముగా సంభాషింప నారంభించెను. దాని కతనిభార్యయు నర్ధాంగీకారముగా నూరకుండుటకు సంతసించి యొకనాఁడు తనభార్యతోఁ దానభ్యంజనముకాఁ గోరెద నని యును, తనమఱఁదలు తనభార్యయును దనకు రాణివాసంబుననే య భ్యంజన స్నానాదికమును జేయింపవలయు నయును దెల్పెను. దాని కాతనిభార్య సమ్మతింపక యనేకాటంకములు కలిగించినది. దాని కతఁ డు కోపింపక యాపెను మిగులఁ బ్రార్థించిన నపు డాపె తా నేమియు ననలేనట్లుగ నభినయించి, మఱఁదలితోఁ మాటలాడక దానిం గన్నెత్తి చూడకుండినచో నది వచ్చు ననియుఁ బల్కినది. దానికిఁ గృష్ణరాయఁ డు సమ్మతించి యభ్యంజనము చేయించుకొన నారంభించెను. తిరుమల దేవియును నదియ తనయభీష్టసిద్ధికిం దగినతఱి యనియెంచి యేదియో పని యున్నట్లుగా లోనికిం బోయి యొక తెరచాటున నొదిగి నిల్చి యుం డెను అదియు యనుకూలసమయ మని కృష్ణరాయఁడు తనమఱఁదలి యొంటిపైఁ జెయి వేసెను.

తోడనే యాచిన్నదియును నొక కేక వేసి "మాయక్కతోఁ జె ప్పెద నని పరుగిడఁ దొడంగినది కృష్ణరాయఁడు తత్తరమున నాబిత్తరి పాదములు పట్టుకొని లోనికిం బోవల దనియును, నావృత్తాంత మెరు లకుం జెప్పవల దనియును బతిమాలుచుఁ దనచేతిభద్రముద్రికం దీసి దానిచేత నుంచి నీ కిది బహుమాన మిచ్చితి నని తెల్పెను. ఇట్టివృత్తాం తము రహస్యముగ లోపలనుండి చూచుచున్న తిరుమలదేవి కెంతయు సంతసము కల్పింపఁ దాను రాజుం జూచునమయం బదియ యని యే

మియు నెఱుఁగనివానివలె వచ్చి అయినదా అభ్యంజన మని పల్కి-తనపెనిమిటి తత్తరపడుట చూచి నవ్వుచుఁ గార్యావసరమున శ్రీకృష్ణునంతవాఁడే యాఁడుదానిపాదములు పట్టఁగా యుష్మదాదులన నెంత యనుడు రాయనికిఁ కొంచెము గుండియ కుదుటఁ బడియె. అట్టిభర్తం జూచి తిరుమలదేవి నవ్వుచు "ప్రాణనాథ! నీవు వగవం బనిలేదు. ఇది నీయిష్టానుసారముగ నుండఁదగిన మగువయే. పురుషుల కక్కటికిం జూపుటకుఁగా నావలన నీపన్నాగము చేయంబడె నని తెల్పినఁ గృష్ణరాయఁడు నివ్వెఱగంది యిట్టివృత్తాంతములు పూర్వయుగములలోపల జరిగి యుండు ననుటకు సందియ ముండదు. కృష్ణుఁడును నటులనే చేసి యుండె ననుమాట నమ్మఁదగియే యున్నది. అని తెలిసి భార్యచమత్కృతి కెంతయు సంతసించెను.

తిమ్మకవి శ్రీస్థలీదండకమును రచించెను. ఈతఁడు లలితకవనము నకుఁ బ్రసిద్ధుఁడు గావున రామలింగ మీతని కవనసౌష్ఠవంబు గూర్చి పల్కుచో, "ముక్కుతిమ్మనార్యు ముద్దుపల్కు," అని చెప్పి యుండెను. ఈ వాక్యము నే మఱియొకకవి యింకొకవిధమున రసపుష్టి చేసి పద్యరూపముగాఁ జెప్పెను.

అదెట్లనిన :—

"క. * లోకమునం గలకవులకు, నీకవనపుఠీవి యబ్బునే కూపనట,
దేకములకు గగనధునీ, శీకరములచెమ్మ నందిసింగయతిమ్మా."

ఈతనిమ్రుకుత్సౌశయ్య నగుపఱుచుపద్యములఁ గొన్నింటి నీవఱకే మనము వ్రాసి యుంటిమి. ఈపద్యంబున కొకకథ గలదు. దాని నిచ్చోట వివరింతము.

ఒకకవి రాజదర్శనార్థము వచ్చి చిరకాలము వేచి యుండి దర్శనము గాకుండుటం జేసి సంస్థానకవి యగునీతిమ్మనం జూడ నిశ్చయించి యాతనికవిత్వవిఖ్యాతియు శక్తియుక్తులును వినియుఁ గనియు నున్నాఁడు గావునఁ బైపద్యము రచియించి యాతనిం గాంచి దానిం జదివెను.

* మాకొలఁది జానపదులకు

తిమ్మన దానిని విని యాకవిశిఖామణి శయ్యాలాలిత్యమున కెంతయు సంతసించి తనచెవుల నున్నపచ్చలచౌకట్లాతనికి బహుమానం బిచ్చి రాజదర్శనమునకుం దోడ్కొని చనియెను. రాజును నవీనకవీంద్రుం జూచి యేప్రశ్నంబును నడుగకముందె యాచౌకట్లెవరిబహుమానం బని యడిగెను. అప్పు డాకవి వాని మీయాస్థానకవివరుం డగుతిమ్మన యిచ్చె నని తెల్పెను. ఆమాటలువిని "యేమికారణమున నాతఁడు వీని నిచ్చె" నని యడుగుడు నాకవి "యాతనిపైఁ బద్యము సెప్పితి నని విన్నవించెను. అప్పుడు రాజు దాని కెంతయు నాశ్చర్యము నొంది "యేదీ యాపద్యము విందము చదువుఁ"డనుడు నాకవియుం దానిం జదివెను దాని విని కడు సంతసించి రాజు కవిం జూచి మీపద్యములోని "గగనధునీ" అనుశబ్దంబునకు మాఱుగా "నాకధునీ" అని యుంచినచోఁ బద్యమునడక మఱియు సొబగుగ నుండునుజుఁడీ! యనియెను- అట్లే యుంచి యాపద్యము మఱలఁ జదివి దానియమకమున కెంతయు సంతసించి యాకవి ప్రభుసరసత మెచ్చి తనచెవుల నున్నచౌకట్లం దీసి రాజున కందించి స్వామీ! దేవరరసజ్ఞత కిది తగు బహుమానముకాదు. అయినఁ జంద్రున కొకనూలుపోగు అన్నట్లు లేను గవిచంద్రుండ వగు నీ కీపారితోషకం బిచ్చెదఁ గైకొమ్ము అనుడు సరసుండు గావున రాయండు వాని నందికొని యాకవియౌదార్యసాహసములకు మెచ్చి యొకపళ్ళెరంబున వరాల నుంపించి యామీఁద నీచౌకట్ల నుంచి యాకవికి మరల బహుమానం బిచ్చెను. అనంతర మాకవిశిఖామణి దాని కెంతయు సంతసించి పనివిని యథేచ్ఛం జనియెను.

ఈతిమ్మన యొకానొకదినమున క్షౌరకుం బిలిచి పనిగొని వాని నేర్పున కెంతయు సంతసించి యొకపద్యము వ్రాసి యిచ్చి దీనిం గొని చని మంచికవి కిచ్చితివేని నీకు రొక్క మెక్కుడుగ దొరకును బొమ్మనుడు మహాప్రసాద మని వాఁడు దానిం గొని కవులకుం జూప నారంభించె. అప్పుడు రామరాజభూషణకవి దానిచమత్కృతికి నలరి నాల్గువేలవరా లిచ్చి దానిని పిలిచి తనవసుచరిత్రమునఁ గాలాంతరమున నుంచెనని వాడుక గలదు.

ఆపద్యం బెద్ది యనిన.—

శా. నానాసూనవితానవాసనల నానందించు సారంగ మే
లా నన్నొల్ల దటంచు గంధఫలి బల్కాకం దపం బది యో
షానాసాకృతిఁ దాల్చి సర్వసుమనస్సౌరభ్యసంవాసి యై
పూనెం బ్రేక్షణమాలికామధుకరీపుంజంబు లిర్వంకలన్.

వసుచరిత్రము కృతినొందు సమయమున నున్న రాజు దీని విని వేయువరాలు చేయు నీపద్య మనుడు రామకృష్ణుఁడు స్వామీ! అంత మట్టుకు మాత్రమే మీర లిప్పించినఁ గవి కింకను మూఁడువేలు నష్టము అనుడు రాజు కారణం బేమి యని యడిగెను. అపు డాతఁడు జొరకుసివృత్తాంతము దెల్పెను తిమ్మనకు ముక్కుతిమ్మన యని పౌరుష నామము గల్గుటకుఁ గారణ మీముక్కుపైని జెప్పినపద్యమే యని కొందఱియభిప్రాయము. ముక్కొక్కుడు గనుక నని కొందఱిమతము.

తిమ్మకవితమ్ముఁడును నతని మేనల్లుఁ డగు మలయమారుతకవియును బ్రబోధచంద్రోదయముం దెనిఁగించిరి. అందులో వానింగూర్చి యాక్రిందివిధమున నున్నది:—

సీ. కలదు కౌశికగోత్రకలశాంబురాశిమం, దారంబు సంగీతనంది నంది
సింగమంత్రికిఁ బుణ్యశీల పోతమ్మకు, నాత్మసంభవుఁడు మల్లయమనీషి
అతని మేనల్లుఁ డంచితభరద్వాజగో, త్రారామచైత్రోదయంబు ఘంట
నాగధీమణికిఁ బుణ్యచరిత్ర యమ్మలాం, బకుఁ గూర్మితనయుండు మలయమారు
గీ. తాహ్వయుఁడు సింగనార్యుండు నమృతవాక్కు, లీశ్వరారాధకులు శాంతు లిలఁ బ్రసిద్ధు
లుభయభాషల నేర్పరు లుపమపరస, మర్థు లీకృతి రాజనిర్మాణమునకు.

అనుదీనింబట్టి దీనిలోని మొదటికవీశ్వరునియింటిపేరు నందివారనియును, అతనితండ్రిపేరు సింగయమంత్రి యనియును, తల్లిపేరు పోచమ యనియును, కవిపేరు మల్లయ్య యనియును దేలినది.

ఇఁక రెండవకవి పైమల్లయకవికి మేనల్లుండు అతనిది భారద్వాజసగోత్రము, ఇంటిపేరు ఘంటవారు తండ్రిపేరు నాగధీమణి తల్లిపేరు అమ్మలాంబ మలయమారుతాహ్వయుఁ డగుసింగన యని కవిపేరు.

ఈపద్యములఁబట్టి చూడఁగా ముక్కుతిమ్మనకు మల్లయకవి సవతితమ్ముం డనియును, సింగనకవి సవతి మేనల్లుం డనియును దేలినది. ఈసింగనకవికి మలయమారుతాభిధాన ముండుటంబట్టి యితఁడు తిమ్మకవికి మేనమామ యగుమలయమారుతకవికిఁ గుమారుని కుమారుఁడు గా నూహింపనై యున్నది.

ఈగ్రంథమునందును నాస్వాసాంతగద్యములో "ఇది శ్రీమదుమామహేశ్వరప్రసాదలబ్ధసారసారస్వతాభినంది అని చెప్పి యుండెను.

ఈకవులకు రాజయోగశాస్త్రమునందును విశేషపరిశ్రమ గల దని చెప్పుట కీక్రిందిపద్యమే చాలి యున్నది. ఎట్లంటేని :—

చ. జలకము మూర్ధచంద్రసుధ షట్కమలంబులపూజ ధూపము
జ్జ్వలతరబోధ వాసనానివాళి సుషుమ్న వెలుంగు శౌర్యముల్
తలఁపున నీగి బోనము సదాతననాదముఖంబు గాఁగ ని
ష్కలుషతనీయనంతవిభుగంగన గొల్చు నిజాత్మలింగముల్.

ఈ కవులకవిత్వవిశేషమును శయ్యాచమత్కృతియునుం జూపుటకుఁ గృతిపతిని వర్ణించి చెప్పిన మఱియొకపద్య మీక్రింద వ్రాయుచున్నాను :—

"సీ. సరిలేనినీతిచాతురిచేత రాజ్యతం, త్రంబులు నడిపిన నడుపుఁ గాని
అనిశము పుష్పచందనవనితాదిసౌ, ఖ్యంబులు నందిన నందుఁ గాని
సమహితశక్తిని సదవనాసదను శా, సనలీల జరిపిన జరుపుఁ గాని
సంగీతసాహిత్యసరసవిద్యావినో, దంబులఁ దగిలినఁ దగులుఁ గాని

గీ. నీళ్లలోపలిసరసిజి నీదళంబు, సరణి నిర్లేపుఁ డైనసంసారయోగి,
సందియము లేదు ప్రత్యక్షశంభుమూర్తి, యీయనంతయగంగమంత్రీశ్వరుండు.

ఈ కవు లిర్వురును ముక్కుతిమ్మకవితమ్ముం డనియు మేనల్లుం డనియునుం జెప్పుటం జేసి పీ రాతనిసమకాలీనులే యగుదురు లేకున్న ముప్పదినలువదినంవత్సరములు చిన్నవారలైన నై యుందురు. వీరలు కృష్ణరాయలసమకాలీను లని గాని లేక యతనియల్లుం డగురామరాయుల సమకాలీను లని కాని నిర్ణయింపఁబడవచ్చును.

వీరు దక్షిణామూర్తిదేవతోపాసనవలనఁ గల్గినవిశేషమహిమ వచోధోరణి గలవారలై యున్నారు. వీరలచేఁ జేయంబడిన యీక్రింది పద్యమువలన నీమూర్తియెడ వీరికిఁ గలభక్తితాత్పర్యములు స్పష్టము కాఁగలవు.

### ప్రబోధచంద్రోదయములోని దక్షిణామూర్తి వర్ణనము.

" సీ. ఎఱుఁగనివారికి నేదేవుఁడు ప్రపంచ, మవు మరీచికలు నీరైనకరణి
ఎఱిఁగినవారికి నేదేవుఁడు జగంబు, గాఁడు పగ్గము పాము గానికరణి
ఏదేవుఁడు వెలుంగు నాదిశక్తియుఁ దాను, నెలయును నిండువెన్నెలయుఁబోలె
బ్రహ్మనాడ్యాగతప్రత్యక్పరంజ్యోతి, నా మించు నేదేవు నడిమినేత్ర

గీ. మట్టిసర్వేశుతోడఁ దాదాత్మ్యమహిమ, గలిగి పరిపూర్ణభావవిఖ్యాతు లైన,
దక్షిణామూర్తిదేశికోత్తము నఘోర, శివుల భజియించి యేకాగ్రచిత్తమునను.

### నందిమల్లన్న ఘంటమలయమారుతకవులకాలనిర్ణయము.

పేర్కొనఁబడిన కవు లిర్వురును పైనిజెప్పిన తిమ్మకవికి సంబంధులని చెప్పితిమి. దానిం దెల్పుట కొకపద్యము పైకవీశ్వరులచే వారిర్వురవలన నాంధ్రీకరింపఁబడినప్రబోధచంద్రోదయ మనుగ్రంథములో వివరింపబడెను గావున దానింబట్టి చూడగా నది యీ క్రిందివిధమున స్పష్టమగును.

కౌశికగోత్రములో

నంది సింగన

మలయమారుతకవి చెల్లెలు తిమ్మాంబ యొక భార్య. — మరియొక భార్య పోచమ్మ.

ముక్కుతిమ్మన్న (పారిజాతాపహరణ) గ్రంథకర్త. — కొడుకు నందిమల్లయ్య — కూఁతురు అమ్మలాంబ (ఈమె భర్తపేరు ఘంటసాగయ)

మలయమారుతుఁడు లేక సింగన్న.

ఇది యిట్లుండ "ఆంధ్రకవుల చారిత్రము" లో ముక్కుతిమ్మకవి కంటె మల్లయకవి ప్రాచీనుం డనియును, ఇందులోం జివరం జెప్పంబడిన మలయమారుతకవికిం దిమ్మకవి మేనల్లుం డనియును మల్లయకవివలనం గృష్ణరాయనితండ్రి యగుసాళువనరసింగరాజునకు వరాహపురాణము కృతి యియ్యంబడెనుగావున నీమల్లయకవి తిమ్మకవికంటెం బూర్వుం డనియును వ్రాయంబడియెను. కవులకాలనిర్ణయమునకుంగాను రాజుల కాలనిర్ణయమును జేయవలయును గావున ముందుగ నందుం జెప్పంబడినరాజులకాలము ప్రస్తుతములో నప్రస్తుతమైనను నీక్రింద సంగ్రహముగా వివరించెదను. ఎట్లన్నను:—

వరాహపురాణములో సాళువనరసింహరాజు వంశవర్ణనము చేయంబడిన దనియును. అతనివంశములో-

౧. గుండరాజు.
౨. సాళువ మంగరాజు.
3. గౌతరాజు.
౪. గుండరాజు.
౫. తిమ్మరాజు.
౬. నరసింహరాజు. ఉండిరనియుం జెప్పెను.

ఆనరసింహరాజుకడ సేనాని సాళువయీశ్వరరాజు ఈశ్వరరాజు పుత్త్రుండు సాళువనరసింగరాజు. ఇతనివంశము తుళువవంశ మాయెను అని చెప్పి యీశ్వరరాజు ప్రతాప మీక్రిందివిధమున వర్ణింపంబడినట్లు చెప్పంబడియెను. ఎట్లనంగా:—

"సీ. ఉదయాద్రి ఛేదించె హుత్తరి నిర్జించె, గండికోటపురంబుం గదలంద్రవ్వెం
బెనుగొండ సాధించెం బెగ్గలూరు హరించెం, గోవెలనెల్లూరు గుంటుపఱిచె
గుండాణి విదళించె గొడుగుచింత జయించె, బాగూరు పంచముపాడు చేసె
నరుగొండఁ బెకలించె నాయూరు మర్దించె, శ్రీరంగపురమును జారిచమిరె

గీ. రాయచౌహత్తిమల్లధరా వరాహ, మోహనమురారి బర్బరబాహుసాళ్వ
నారసింహప్రతాపసన్నాహుఁ డగుచు, విశ్వహితకారి తిమ్మయయీశ్వరుండు.

కృష్ణరాయనివంశములోఁ జెప్పంబడినయీశ్వరరాజునకు నీపై యీశ్వరరాజునకును భేద మేమైన నున్నదో లేక యీయిర్వురును నొక్కరుగా నెన్నవలయునో దానిం దెలియవలసి యున్నది. పారిజాతాపహారణములోపల, మనుచరిత్రములోపల నొక యీశ్వరరాజు వర్ణనము గలదు. దాని నిచ్చోఁ వివరించి పిమ్మటఁ బైసంప్రశ్న మాలోచింతము. అందు మనుచరిత్రములోపలఁ గనుపించిన వంశావళియే యాముక్త మాల్యదలోఁగూడఁ గానుపించుం గావున ముందారెండుగ్రంధములలో వివరింపఁబడినవంశముం జూపుదము.

మనుచరిత్రము - ఆముక్తమాల్యద.

చంద్రుడు

|

బుధుడు.

"క. అతనికి యదుతుర్వసు లను, సుతు లుద్భవ మంది రహితసూదనులు కళాన్వితమతులు వారిలో వి, శ్రుతకీర్తి వహించెఁ దుర్వసుఁడు గుణనిధియై."

"గీ. వానివంశంబు తుళువాన్వ యాయ మయ్యె,
నందుఁ బెక్కండ్రు నృపు లుదయంబు నంది
నిఖిలభువనాభిపూర్ణనిర్ణిద్రకీర్తి
నధిపు లైరి తదీయాన్వయమునఁ బుట్టి."

అను పై రెండుపద్యములవలనను తుర్వసువంశమువారికి మొదలనుండియుఁ దుళువవంశస్థు లని పేరున్నట్లుమాత్రము కానుపించును గాని సాళువవంశ మని చెప్పి యున్నట్లు కానుపించదు. తరువాత నున్న పద్యములో నీవంశములోఁ బ్రసిద్ధుఁడు తిమ్మరా జనియును, నతనికు మారుఁ డీశ్వరరా జనియును జెప్పెను. అదియెట్లన్నను:—

"మహాస్రగ్ధర. ఘనుఁడై తిమ్మక్షితీశాగ్రణి శతకమత్రగావసంఘాతవాతా
శనరాణాశాంతదంతిస్థవిరకిరులజంజాటముల్ మాన్చి యిమ్మే
దిని దోర్దండైకపీఠిం దిరముపఱిచి కీర్తిద్యుతుల్ రోదసిం బ
ర్వ నరాతుల్ నమ్రులై పార్శ్వములఁ గొలువఁ దీవ్రప్రతాపంబు నూపెన్."

ఈ తిమ్మరాజుంగూర్చి పారిజాతాపహరణములో వ్రాయఁబడియే,

"క. ఉర్వీశవరాళి యగునా, దుర్వనువంశంబునందు దుష్టారిభుజా
దుర్వారగర్వరేఖా, నిర్వాపకుఁ డీశ్వరాఖ్యనృపతి జనించెన్."

అని వ్రాసెనుగాని తరువాతిపద్యములో నీశ్వరరాజుంగూర్చి వ్రాయుచుఁ దిమ్మయయీశ్వరుం డని వ్రాయుటంజేసి యాయీశ్వరరాజుతండ్రి తిమ్మరాజని తేలును.

"ఉ. రాజులనెత్తుటం బరశురాముఁడు వ్రంతలు చేసె రెండు మూఁ
డీజగతిన్ గణింప నది యేంతటివిస్మయ మబ్ధినీసుహృ
త్తేజుఁడు కందుకూరికడఁ దిమ్మయయీశ్వరుచే జనించె ఘో
రాజి బెడందకోటయవనాశ్వికరక్త నదీసహస్రముల్."

## పారిజాతాపహరణములోని యీశ్వరరాజువర్ణనము.

ఈశ్వరరాజు మనుచరిత్రములో నీక్రిందివిధముగ వర్ణింపఁబడియెను:—

"చ. బలమదమత్తదుష్టపురభంజనుఁడై పరిపాలితార్యుఁడై
యలఘయిఁ దొంటియీశ్వరుడె యీశ్వరుఁడై జనియింప రూపరెన్
జలరుహనేత్రలం దొఱఁగిశైలవనంబుల భీతచిత్తులై
మెఁగెడు శత్రుభూవరులమేనులు దాల్చినమన్మథాంకముల్."

ఇప్పుడు మనము పైనుదాహరించినయిర్వురు యీశ్వరరాజులకును జెప్పంబడినవిజయముల నరయఁగలము. అందు వరాహపురాణములోనియీశ్వరరాజుజయములు చెప్పటలో

౧ - ఉదయాద్రి భేదించెను.
౨ - వినుత్తరి నిర్జించెను.
౩ - గండికోటపురంబు త్రవ్వించెను.
౪ - పెనుగొండ సాధించెను.
౫ - బెగ్గలూరు హరించెను.
౬ - కోవెల, నెల్లూరు గుంటుపతిచెను.
౭ - కుందాని విదళించెను.
౮ - గొడుగుచింత జయించెను.
౯ - బాగూరు, పంచముపాడు చేసెను.
౧౦ - నరుగొండ పెకలించెను,
౧౧ - నామూరును గొట్టెను.
౧౨ - శ్రీరంగపురమును సమరెను.

అని యున్నది. పారిజాతాపహరణాదులలోని యీశ్వరరాజు కందుకూరికడ గొప్పయుద్ధము చేసి యుక్కడ బెడఁదకోట తురుష్కుల యొక్కగుఱ్ఱపుదళములను రక్తప్రవాహము లగునట్లుగాఁ గొట్టె నని మాత్ర మున్నది. ఆమాత్రపువృత్తాంతమైనను మనుచరిత్రములోను

జెప్పంబడలేదు. కావున వరాహపురాణములోఁ జెప్పంబడినయీశ్వర రాజు మనుచరిత్రములోను, పారిజాతాపహరణములోను, జెప్పంబడిన తుళువవంశములోనియీశ్వరరాజు గాక సాళువవంశములోనియీశ్వర రాజుగాఁ జెప్పంబడుట సరియై యున్నట్లు కానుపించును. ఈసాళువవం శములోనివా రందఱును ప్రత్యేకముగా మండలాధిపతు లైనంగాక యంతకంటెను డక్కువస్థితి గలసామంతప్రభువు లై యున్నట్లు కాను పించును. దానికి దృష్టాంతము జైమినిభారతములోనిసాళ్వమంగ రాజుం గూర్చి జెప్పెడియీక్రిందిపద్యము చాలియుండును. ఎట్లన్నను :—

"సీ. దురములో దక్షిణసురతాణి నెదిరించి, కొనివచ్చి సాంపరాయనికి నిచ్చె
సామ్రాజ్యమున నిల్పి సాంపరాయస్థాప, నాచార్యబిరుదవిఖ్యాతి గాంచె
శ్రీరంగవిభుఁ బ్రతిష్ఠించి యిర్వదివేల, మాడ లద్దేవునమ్మడికి నొసఁగె
మనురాసురత్రాణు మడియించి పరపక్షి, సాళువబిరుదంబు జగతి నెరపె
గీ. గబ్బితనమునఁ దేజిమొగంబు గట్టి, తత్తిమి నగరంపుగవనులు విఱుగఁద్రోలి
తాను ప్రవేసినగొడుగుద్దవిడిఁ దెచ్చె, సాహసంబున నుప్పాంగు సాళ్వమంగు.

అను దీనిలో నుదాహరింపఁబడినసాంపరాయఁడు మండలాధిప తిఁ ఇతనికడను సాళ్వమంగు సేనానాయకుఁడై యుండి కొన్ని యుద్ధము లలో సాంపరాయనికిఁ దటస్థములైనచిక్కులఁ దొలఁగించి సాంపరాయ స్థాపనాచార్యబిరుదము నందెను. ఈసాళ్వమంగు జైమినిభారతకృతిపతి యగు నరసింహరాజునకుఁ బ్రపితామహుఁడు. కాఁబట్టి వీరివంశములో నుండువారు మండలాధీశ్వరులని గ్రంథదృష్టాంతము లగుపడువఱకును వీరు కృష్ణరాయవంశస్థులకుఁ బూర్వు లని చెప్ప వలనుపడదు; అది నిశ్చ యమగువఱకును నావంశములోనివారికాలనిర్ణయము నాసిద్ధాంతము పైని నిర్ణయింపఁ గూడదు. ఇంతియు కాక పైసాళ్వవంశము వారు కృష్ణ దేవరాయనికాలమువఱకును సాళ్వవంశనామముతో నుండిరి. కృష్ణదే వరాయునికడ మన్నన గలమంత్రి యైనతిమ్మరుసు సాళ్వవంశమువాఁడై యున్నట్లు కృష్ణరాయవిజయములోనియీక్రిందపద్యమువలనఁ గాన్పిం చును. ఎట్లన్నను :—

చ. కరచరణాదులందఱకుఁ గల్గినయంతటనే సమగ్రతన్
మెఱవడిఁ గాంచ నేర్తురొ మనీషివరుల్ ధరలోన నెవ్వరి
క్కఱణి ఘటింపుచుం గృతయుగంబునఁ ద్రేతను ద్వాపరంబునన్
దరయఁగ సాళ్వతిమ్మసచివాగ్రణికిన్ సరిమంత్రి గల్గునే.

అని యుండుటంబట్టి కృష్ణరాయనిమంత్రి యగుతిమ్మన్నయింటి పేరుసాళువవా రనియును. కృష్ణరాయనివంశనామము "తుళువవంశము వారు" అనియును దేలినది.

కావున నీశ్వరనారసింహరాజు కృష్ణరాయనికాలమునకుఁ బూర్వపువాఁ డని కాని అందుమూలముగఁ నతనికవీశ్వరు లగునందిమల్లయ్య, మఱయమూరుతకవులు కృష్ణరాయనికంటెఁ గాని యతనితండ్రి యగునరసింగరాయనికంటెఁ గాని పూర్వు లయినట్లుగాఁ గాని యిందు స్థిరపఱుపఁబడదు అట్లైనను గాకున్నను కాలనిర్ణయసిద్ధాంతమున కాయాశము చాలదు. మల్లయకవి కాలనిర్ణయమున నట్టే కావున నామార్గము వదిలి యిఁక మల్లయ, మలయమూరుతకవుల కాలము పారిజాతాపహరణప్రబోధచంద్రోదయములను వ్రాసినవిధమున నే నిర్ణయించెదము. అందు మల్లయకవియును, ముక్కుతిమ్మనయు నొక్కతండ్రికుమారులుగను తల్లిమాత్రము భేదముగాను నున్నట్లు కాన్పించుటం జేసి వారు సమకాలీను లైనట్లుండినను నుందురు. యిద్దఱుతల్లులలో నెవ్వరు చిన్నయో యాసంగతి కాని మల్లయ, తిమ్మనలలో నెవ్వరు పెద్దయో యాసంగతిగాని చెప్ప నాధారము లేదు. వీరిద్వరును సవతియన్నదమ్ము లగుటంజేసి సమకాలీను లని చెప్పుట కేమియు నభ్యంతర ముండదు. ఈయిద్దరకు నలుబదియేఁబదిసంవత్సరములు వ్యవధి యున్నదని చెప్పినను జెప్పవచ్చును. అటులైన సమకాలీనులే యని నిర్ణయించి యిప్పటి కీసంవాదము నిల్పెదను.

నందిమల్లయకవికి ముక్కుతిమ్మన మనుమఁ డని కాని, యిందులోఁ జెప్పంబడిన మలయమూరుతకవియు, తిమ్మకవి మేనమామ యగు

మలయమారుతకవియు, నొక్కఁడే యని గాని చూపుటకు గ్రంథదృష్టాంతములు లేవు. అట్టిప్రతీతియైనను వ్యాపకములో లేదు. ప్రబోధచంద్రోదయ, వరాహపురాణములలోఁ బై యిర్వురు కవులకవిత్వ మున్నను దానిలో నేది యేకవికవిత్వమో చెప్పఁజాలము. కాని యీయిర్వురిలో మల్లయకవి ప్రథమగణ్యుఁ డవుటం జేసియును, రెండవకవి యగుమలయమారుతుఁ డాతనిమేనల్లు డగుటం జేసియుఁ బ్రథమకవియే ప్రధానగ్రంథకర్త యనియును, మొదలనుండియు సగముగ్రంథ మాతనికవనమే యనియును, తక్కినసగము భాగమును మలయమారుతకవికవనం బనియును నూహింపఁదగియుండును. ముక్కుతిమ్మకవికిం గల మృదుకవనము ప్రబోధచంద్రోదయములోని పూర్వఖండములోఁ జూడదగును. రెండవఖండములోని కవనసైపుణి లెస్సగఁ బరికించినచోఁ బైకవనములోఁ గించిత్తు తక్కువయైనశయ్యతో నొప్పును, వరాహపురాణములోనిమృదుతరభాగములు మల్లనకవి వనియును, నంతకుఁ గొంచెము న్యూనముగ నుండునది మలయమారుతకవికవన మనియును నిర్ణయింపవచ్చును.

ఆంధ్రపంచకావ్యకవులచారిత్రము.

## 12.

# తెనాలి రామకృష్ణకవి.

ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు, శుక్లయజుశ్శాఖలోనివాఁడు. ఇతఁడు తనవంశముంగూర్చి పాండురంగక్షేత్రమహాత్మ్యములోఁ గొంత చెప్పియున్నాఁడు. అంతకు విశేష మగువృత్తాంతము లేమైనను "పాండురంగవిజయ మనుగ్రంథములో నుండవచ్చును. కాని యాగ్రంథ మీమూలాగ్రముగఁ బ్రస్తుతము దొరుకుట లేదు. నా మిత్త్రులు కొందఱాగ్రంథములోనికొన్ని యాశ్వాసములు చూచినట్లు చెప్పియున్నారు. కాని వారికే యది రామకృష్ణునికవిత్వమని చెప్పఁదగినట్లుగాఁ గనుపిం

చలే దని చెప్పినారు. రామకృష్ణునిచే రచియింపఁబడిన గ్రంథము పాండురంగమాహాత్మ్యమే గాని విజయము కా దని సంప్రదాయజ్ఞులైన పురాతనపండితులయభిప్రాయము. ఒకవేళ రామకృష్ణకవిప్రణీత మైన మఱియొకగ్రంథ మున్నను నుండవచ్చును. దానిపేరు పాండురంగవిజయమును గానవచ్చును. కాని యది లోకములో హాస్యరసప్రధానుఁడగు రామలింగకవిది కాక తన్నాముఁ డగుమఱియొకకవిదై యుండవచ్చును. కాదేని మఱియొకరిచే నది రచియింపఁబడి రామకృష్ణునిపేరిటఁ బ్రకటింపఁబడి యుండవచ్చును. అటు గానిచో నప్పకవీయాదిగ్రంథములలోఁ బాండురంగక్షేత్రమాహాత్మ్యములోనిపద్యములే గ్రహింపఁబడి విజయములోనిపద్యము లేల కైకొనంబడవు. కావున విజయ మనుగ్రంథమును మాహాత్మ్యగ్రంథమువలెనే ప్రామాణికగ్రంథ మని గాని మాహాత్మ్యగ్రంథకర్త యగురామకృష్ణకవిరచిత మని కాని యంగీకరింపఁజాలము. ప్రస్తుతము మనము వ్రాయుచున్న చారిత్రములో రామకృష్ణునికులగోత్రములు మాహాత్మ్యగ్రంథములోఁ జెప్పఁబడినవిధము వనే వివరించుచున్నారము :—

## రామకృష్ణకవిగోత్రాదికము.

వీనింగూర్చి మాహాత్మ్యములో నీ క్రిందివిధముగ నున్నయది.

"క. కౌండిన్యస గోత్రుఁడ వా, ఖండలగురునిభుఁడ వఖిలకార్యస్ఫురణన్,
గండలితపండలివి భూ, మండలవినుతుఁడవు లక్ష్మమావరతనయా. "

అని యుండుటంబట్టి యితఁడు కౌండిన్యసగోత్రుఁడనియు నితని తల్లిపేరు లక్ష్మమ్మ యనియుం దేలినది. కృతిపతి యితనికవనముంగూర్చి కొంత శ్లాఘించినట్లుగా మఱికొన్ని పద్యము లున్నవి. అందితని నివాసస్థలము మొదలగునవి వివరింపఁబడినవి, ఎట్లన్నను :—

"క. నను రామకృష్ణకవిఁ గవి, జనసమాకారావళీవసంతోత్సవనూ
తనిధిఁ బిలిపించి యస్మా, సనమునఁ గూర్చుండఁ బనిచి చతురత ననియెన్.

సీ. లగపంపకృతముఁ దెనుంగుగఁ జేయఁ దెనుఁగు సంస్కృతముగ జేయంగఁజతురమతివి
నలు తెలుంగుల వాక్య నవసుధాధారల, ఘనుఁడ వాళువునందుఁ గరము మేటి

వఖిలభూమీపాల కాస్థానకమలార్క, కోదయుతరుణసూర్యోదయుఁడవు
శైవవైష్ణవపురాణావళినానార్థ, ములు నీకుఁ గరతలామలకనిభము
గీ. లంధ్రభూమిపచాగ్రహారాభమైన, శ్రీతెనాల్యగ్రహారనిర్ణేత వగ్ర
శాఖకోకిలమవు నీవు సరసకవివి, రమ్యగుణకృష్ణరామయ రామకృష్ణ.

పై పద్యములవలన రామలింగము కవిత్వవిశేషములు తెలిసిన వాఁడే కాక, యతఁ డాంధ్రదేశములోని తెనాలి యను నగ్రహారము నేర్పర్చినవాఁడనియును, యాజ్ఞవల్క్య శాఖ (శుక్లయజుశ్శాఖ) లోని బ్రాహ్మణుఁడనియును, నతనితండ్రిపేరు రామయ్య యనియును దెలినది.

## రామకృష్ణకవి కవిత్వవిశేషములు.

పై రెండుపద్యములలో నీతనికవిత్వవిశేషములుగూడఁ గొన్ని కాన్పించుచున్నవి. దానింబట్టి రామకృష్ణుఁడు సంస్కృతమును దెనిఁగించుటలోను, దెనుఁగును సంస్కృతము చేయుటలోను జతురుఁ డనియును, జతుర్విధకవితావిశారదుఁ డనియును, నాశుకవిత్వనిపుణుఁ డనియును శైవ వైష్ణవపురాణసారవేది యనియును దేలినది. మఱియొక పద్యమువలన నీతనితో సమానులాంధ్రకవులలో లేరనియుఁ దేలుచున్నది. ఆపద్యము కృతిపతి రామకృష్ణునింగూర్చి చెప్పినట్లుగా నున్నది. అది యెట్లన్నను :—

మ. ఉదయంబస్తనగంబు సేతువు హిమవ్యూహంబునన్ జొట్టిరా
విదితంబైనమహిన్ మహాంధ్రకవితా విద్యాబలప్రౌఢి నీ
కెదు రేరీ సరసార్థబోధఘటనాహేలా పరిష్కారశా
రద నీరూపము రామకృష్ణకవిచంద్రా సాంద్ర కీర్తీశ్వరా.

## రామకృష్ణకవిమతము

రామకృష్ణుఁడు గ్రంథాంతమునందు రచియించినగద్యముంబట్టియును, నతఁడు గ్రంథారంభములోఁ గృతిపతింగూర్చి వ్రాసిన వర్ణనముంబట్టియు నతండు వైష్ణవమతప్రవిష్టుఁ డని స్పష్టమగుచున్నది. రామలింగనామము రామకృష్ణుఁడుగా మాఱినను మాఱవచ్చును.

వైష్ణవమతప్రవిష్టుఁ డగుటకు గద్యములోని పరమపదనాథశబ్దమే చాలియుండును. ఆగద్య మెట్లన్నను :—

"ఇది శ్రీమత్పరమపరమపద నాథ నిరవధిక కృపాపరిపాక పరిచిత సరస కవితాస నాథ రామకృష్ణకవినాథప్రణీతం బగుపాండురంగ మాహాత్మ్యము."

అని యున్నది. కృతిపతి యగువిదూరి వేదాద్రిమంత్రి నీక్రింది విధంబున వర్ణించెను. అదియెట్లన్నను :—

సీ. తనకులాచారవర్తన వైష్ణవాచార, పర్యాయముల కోజబంతి గాఁగఁ
దనసూనృతము పురాతనసత్యవిధులయు, న్నతికిఁ బునః ప్రతిష్ఠితము గాఁగఁ
దనబుద్ధి నీతిశాస్త్రరహస్యములు తెల్ల, ముగఁ దెల్పు నాఖ్యానముద్ర గాఁగఁ
దనవారియుఁగంటంపు మొనవాఁడి విశ్వంభ, రాప్రజలకుఁ బ్రాణరక్ష గాఁగ
గీ. వెలయు మంగయగురవభూవిభుని పెద్ద, సంగభూపాలమణిరాయసంప్రపత్తి
జయయుతుం డైనరామానుజయ్యసుతుఁడు, భద్రగిరివిదూరివేదాద్రిశౌరి.

## —కృతిపతిప్రభుఁ డగుసంగభూపాలునిఁగూర్చి.—

ఈరామకృష్ణకవి తనకృతిపతియాధిత్యమును దెల్పుటకుఁ గా నాతనిప్రభుం డగు పెద్దసంగభూపాలునివిశేషము లీక్రింద వివరించుచున్నాఁడు. కవికాలమును, కృతిపతికాలమును నిర్ణయించుటకుఁగా నప్పటి రాజులకాలవిజ్ఞాన మవసర మైనది కావున నాయంశముల నీక్రింద వివరించెదను, అవి యెవ్వి యనఁగా:—

"వెండియు నవ్వేదాద్రిమంత్రీశ్వరుండు కవికులతిలకుండును, నఖండితభాగ్యవర్ణపూర్ణలలాటఫలకుండును, పూర్వసింహాసనాధీశ్వరుండును, సతతసమారాధితనిర్మలసంగమేశ్వరుండును, రాయరాహుత్తుండును, లోకోత్తరగుణోత్తరుండును, రణరంగధీరుండును, అంబునిధిగంభీరుండును, భట్టారబాహుండును, నకలంకుండును, నరపత్తారుమండలీకరగండండును, మద్దండభుజాదండుండునై, పరనారీ సహోదరుండును, నితరనరవరసమార్జితకీర్తివధూవల్లభుండును, గోపికాగోవిందుండు నయ్యును నీశ్వరలక్షణలక్షితుండును, పాన్నాంబరదేవరదివ్యశ్రీపాదపద్మారాధకుం డయ్యును, ప్రతిష్ఠాపితపరమవైష్ణవకుటుంబవిశేషుండును, నయినఘనుని"

అనియును.

"గీ. గుణయుతు నలరాజామంగయ గురవరాజు, పుత్రు పెదసంగభూపాలుశత్రుజైత్రు
. భామసహోదర.విద్యానిధానభోజు, గొలిచి వేదాద్రినిత్యలక్ష్మిలఁ దనర్చు".

అను పైపద్యములోని చారిత్రాంశములు మాత్ర మీ క్రింద వివరించెదను. ఎట్లన్నను:—

సూర్యవంశము
|
మంగరాజు
|
గురవరాజు
|
పెద్దసంగమరాజు

ఇందులోని పెద్దసంగమరాజు పూర్వసింహాసనాధీశ్వరుఁ డని యుండుటంబట్టి తూర్పు దేశములోనిసింహాసనముగలవాఁ డని తేలును. "తూర్పు" అనఁగా నే దేశమునకుఁ దూర్పని యూహింపవలసి యుండును. అప్పటికిఁ గృష్ణరాయ లుండువిజయనగర (అనిగొందె) సింహాసనమునకుఁ బశ్చిమరాజ్యసింహాసన మని ప్రసిద్ధి యుండుటంబట్టి యీపూర్వసింహాసన మానిగొందెకుఁ దూర్పుగా నున్నయాంధ్రదేశసింహాసన మని తేలుచున్నది. సంగమేశ్వరపూజారతుఁ డని చెప్పుటచేత సంగమేశ్వరక్షేత్రములోనియీశ్వరపూజాపరాయణుఁ డని తేలును. ఈసంగమేశ్వరక్షేత్ర మెచ్చోటిది యని శంక పొడముచున్నది. అది గోదావరీమండలములోనిరామచంద్రపురము తాలూకాలోనిమాండవ్యపురాపరనామమున నొప్పుచుండ పేటకును, నచ్చటికే క్రోసుదూరములో నున్న యేడిధె యనుగ్రామమునకు మధ్యమునం దొకగ్రామ ముండును. అది చిరకాలముక్రిందటనే చెడిపోయెను. అది ప్రస్తుతము మనము వ్రాయుచున్నప్రభుఁ డి కాదు. రెండవసంగమేశ్వరము పూర్వ ముదయగిరిసీమలోఁ జేరినచింతకుంటతాలూకాలోని యానిమలసముతులోనిదై నట్లుగా నచ్చటికైఫియ్యతులో నీపైరాజవంశావళి చెప్పుటచేత నూహింపనై యున్నది,(See Local Records Vol. VII page 47) చింతకుంటతాలూకాకైఫియ్యతు- అందులో దేవాలయమునకు దక్షిణభాగమున నేటివొడ్డున సదాశివరాయనికాలములోనియొక శాసన మున్నది. అదెట్లన్నను :—

"శ్రీసదాశివదేవమహారాయలు విజయనగరమందు రత్నసింహాసనస్థులై రాజ్యమేలుచుండగా సూర్యవంశస్థులైన శ్రీమన్మహామండలేశ్వర,సంగరాజునాయన తత్పూర్వమందె యీసంగమేశ్వరస్థలమునకు దక్షిణభాగమందు పరుగుదూరమున గ్రామము గట్టుకొని పసియిండ్లరాచవారిని గూర్చుకొని యాపల్లె వారిజాగీరుగా ననుభవించుచుండిరి అందుచే నది రాజుపాలెం" అని చెప్పఁబడును.

సంగరాజుకుమారులు :—

౧. బొమ్మరాజు.

౨. మంగరాజు.

౩. గురవరాజు. (శైవుఁడు) ఇతనికిఁ గొడుకులు తొమ్మండ్రు గలిగిరి. వారి పేళ్లెవ్వియనఁగా ;—

౧. పెదసంగరాజు.
౨. చినసంగరాజు.
౩. తిమ్మరాజు.
౪. రుద్రరాజు
౫. బసవరాజు.
౬. పెదచిట్టిరాజు.
౭. చినచిట్టిరాజు.
౮. బొజ్జసంగరాజు.
౯. పాపసంగరాజు.

పై గురవరాజు దేవునియుత్సవములకు గడువక తనకుటుంబసహితముగ విద్యానగరమునకుం బోయి శ్రీరంగరాజు, రామరాజుల ద్వారముగ సదాసివరాయలను దర్శించి, యాయనవలన నాల్గుగ్రామములు స్వామినిమిత్తముఁ గైకొనెను. ఇది జరిగినకాలము శా. స. ౧౪౬౫ శోభకృత్తు సంవత్సరము (AD 1543.)

పై కథనుబట్టి పెదసంగరాజుకాలమును, అతనిమంత్రియుఁ గృతిపతియు నగువేదాద్రికాలమును, కవియగురామకృష్ణుని కాలమును మనమించుమించుగా నూహింపవచ్చును. పైగురవరాజును నతనితొమ్మండ్రుకొడుకులును బైశాశనములో వర్ణింపఁబడుటచేత నప్పటి కతఁడు మిక్కిలి ముదుసలియై యుండవచ్చును. గురవరాజునకుఁ జెప్పంబడనిరాయరాహుత్త మొదలగుబిరుదులు పెద్దసంగమరాజునకుఁ గల్గుటం బట్టియుఁ బూర్వసింహాసనాధీశ్వరుం డని యుండుటఁబట్టియుఁ జూడఁగా నీపెద్దసంగరాజునాఁడు విశేషవిభవము గల్గినట్లు గోచరంబయ్యెడిని. అట్టివిభవము గల్గుట క్రమముగా నానిగొందిప్రభువుల యనుగ్రహం

బున నైనను గావచ్చును. కాదేని సదాశివరాయలకాలములో నాదేశమునఁ గల్గినయరాజకావస్థలో సింహాసనమును సంపాదించి యైనను నుండవచ్చును. ఇది శా. స. ౧౪౬౦ల సమీపకాలముగా నిశ్చయించుటకుఁ దగి యుండును.

పై వేదాద్రిమంత్రికాలమును నాతనిగురుం డగునాళువందారుకందాళయప్పయాచార్యుల కాలముంబట్టియు నిర్ణయింపఁదగి యుండును. అతనివర్ణనము రామకృష్ణునిచే నీక్రిందివిధముగఁ జేయంబడియెను. ఎట్లన్నను:—

సీ. వేదమార్గప్రతిష్ఠాదైవతజ్యేష్ఠుఁ, డభ్యస్తషడ్దర్శనార్థరాశి
యతిరాజరచితభాష్యగ్రంథనిర్ణేత, యఖిలపురాణేతిహాసకర్త
బంధురదివ్యప్రబంధానుసంధాత, పంచసంస్కారప్రపంచచణుఁడు
వాధూలమునిచంద్ర వంశవర్ధనమూర్తి, సకలదేశాచార్యనికరగురువు
గీ. పట్టమేనుంగు శ్రీరంగపతికి నణ్ణ, గారుగర్భాంబురాశినీహారరశ్మి
సారసాహిత్యసర్వస్వశయ్యవేది, యాళువందారుకందాళయప్పగారు.

వైష్ణవగురువులలో ముఖ్యు లగువారిచారిత్రములు ప్రపన్నామృతము మొదలగుగ్రంథములలోఁ గాలనిర్ణయముతోఁగూర్చి చేర్పంబడి యున్నవి. అవి యన్నియును వేఱుస్థలములలోఁ జేర్పంబడును గావున నందలివిశేషములు గాని కాలనిర్ణయము గాని వ్రాయను.

ఈవఱకును మనము వ్రాసినరామకృష్ణునిచారిత్రము గ్రంథస్థమైనదియు సంశయింప నవసరము లేనిదియు నై యున్నది. ఇఁక ముందు వ్రాయువృత్తాంత మంతయును లోకము వాడుకంబట్టి వ్రాయునదియై యున్నది. ఎట్లన్నను:—

## రామకృష్ణునిజన్మాదికము.

తెనాలి రామకృష్ణుని (రామలింగము) వాసస్థలము కృష్ణామండలములోని గార్లపా డనునొక గ్రామము. దానిచే నీతని యింటిపేరు గార్లపాటి * వారనియుం జెప్పఁబడును. ఈతఁడు చిన్ననాఁడె తండ్రి గతిం

* ఈశ్వరప్రగ్గడవా రని మఱికొంద ఱందురు.

చెను. అనంతర మీతనిమాతులుం డితనిని దనగ్రామం బగు తెనాలికిం గొంపోయి యచ్చో నీతనికి నామకరణాదికర్మంబుల జరిపెను. ఆగ్రామమున రామలింగేశ్వరుం డనునొక దేవుఁడు గలఁడు. ఈచిన్నవాని కాతని నామమే యుంచినట్లు వాడఁబడెడి. ఇతనిచారిత్రము మిగుల విససొంపగుచమత్కారములు గల్గి చదువువారల కెంతయు సంతసంబు పుట్టించును. ఈతఁడు హాస్యప్రవర్తనమున కెంతయుఁ బ్రసిద్ధుఁడు. ఆంధ్రభోజుం డనఁ బరఁగినకృష్ణరాయలయాస్థానమున నితఁడు హాస్యకాళిదాసు. అష్టదిగ్గజములలో నొక్కఁడు. తక్కుఁగలదిగ్గజములు పెక్కురు వాక్చాతురీధురీణు లైనను రామలింగమున కెల్లప్పుడుఁ జిక్కిరిగాని ధిక్కరింపఁ జాలరైరి. ఇట్టియీతనిధిక్కారంబుల మన మిపుడు వ్రాయవలయు నైనను, ఈతనిబాల్యావస్థఁ గొంత తెలిపి పిమ్మట దానిని వ్రాయుదము. దీనిం దెల్పుకథలు పెక్కులు గలవు. అందు మిగుల విరుద్ధంబులు కానివాని నిపు డిట వక్కాణించుట యుక్తము. ఇతనికి మేనమామ యక్షరాభ్యాసము సేయించి యొకయుపాధ్యాయుని కొప్పించె. అపుడు రామకృష్ణుండు బాల్యచాపలంబున బడి కరుగక కదుదుడుకుఁదనము సేయుచు నెడనెడ నుపాధ్యాయునిం గని తడబడఁ బాఱుచుఁ బట్టువడినతఱి నాతనినుడి పెడచెవి నిడి పుట్టలఁ, బూరుల దాఁగుచు, సాయంసమయమున నిలు సేరి యచ్చో నారాత్రి వసియించి వేకువఁ బరాకు లేక పలాయనము సేయుచుండెను. ఇట్టిస్వేచ్ఛావిహారంబునఁ దోడిబాలురతోడ నాడుచుండు సమయంబున నొకనాఁడు సిద్ధుం డొక్కరుండు తన్మార్గంబున నేతెంచుచు వచ్చి రామకృష్ణుని జూచి వానితేజోవిశేషంబులకు సంతసిల్లి డగ్గఱి వర్ణం బేమి యని డిగియు బ్రాహ్మణుఁ డౌటఁ దెలిసికొని సంతసించి యిట్లనియె.

## సిద్ధుం డుపదేశించుట.

ఓబాలకా! యిదె నీ కొకమంత్ర ముపదేశ మిచ్చెదఁ గైకొమ్ము. దానిఁ గొని నీవు కాళిం ధ్యానించినచో నీ కాయంబ వాఃసరంబు

లోపల సాక్షాత్కరించి నీకోర్కుల నెల్ల సాఫల్యము నందించు. నాకు నిర్యాణకాలము సమీపించినది. నాతో నీమంత్ర మంత్రము నందును. తనచే నభ్యస్తం బగువిద్య నొరుల కెఱింగింపక తనతో నంతంబు నొందింపఁ బ్రహ్మరక్షస్సగు నని శాస్త్రము గలదు. కావున నీవు దీని విఫలంబు గాకుండ నుపాసించి మను మని తన్మంత్రము నసాకల్యముగ నుపదేశ మిచ్చెను.

—— కాళికాదేవి ప్రత్యక్ష మగుట. ——

అనంతరము రామకృష్ణుం డామంత్రప్రభావం బెంతమాత్రమో చూత మని యానాఁటిరేయిఁ గాళీదేవళంబులోనికిం జని యెంతయు నియమమున నామె నుపాసించిన, నాదేవి భక్త పరాధీన గావున నాతనికి సాక్షాత్కరించినది. అట్లావిర్భవించినభవానిం గని రామకృష్ణుండు కింకరుండ నని యంజలి యొనర్చి వినమ్రుండై యుండఁగా నాదేవి కరుణించి తనవామదక్షిణకరంబుల మెఱయుచున్న స్వర్ణ రజతపాత్రంబులం జూపి యిందొకదానిలోఁ బెరుఁగు, నింకొకదానిలో బాలు నున్నయవి. వానిం గ్రోలినవారలకుఁ గ్రమంబున విద్యయు. నైశ్వర్యంబును జేకుఱును. అవి తనహస్తంబుల నత్తుకొని యున్నచషకయుగంబుఁ జూపి నీ కిం దెద్ది వాంఛితంబో వేఁడు మనుడు, రామకృష్ణుం "డమ్మా! నాకు వీనియందలివిశేషంబు లేర్పరింప రాకున్నవి. చూచికొన నిచ్చెదవేని కలతెఱం గెఱిఁగింతును" అని యారెంటిం గైకొని యొక్కపరి వానిలోని దధిక్షీరంబులఁ దనగొంతునం బోసికొని మ్రింగి "అమ్మా! రెండును రుచ్యంబులే కావున నారెంటింగూడ నుంచితిని. గినియకుమీ" యని నవ్వెను. దానికిం గనలి శర్వాణి "యోరీ నాయాజ్ఞోల్లంఘనంబుఁ జేసితివి.

కావున నీవు విద్వాంసుండ వయ్యును వికటకవి వగుదువు పొమ్మని శాపంబిచ్చెను. అపుడు రామకృష్ణుఁడు "తల్లీ ! నాయజ్ఞానంబు సైఁపుము. తనయుని తప్పులు తల్లి మన్నింపకున్న నిఁక వానికి శరణ

మెవరు గలరు. తల్లి విషమిడినను, తండ్రి ధనికుల కమ్మఁ జూపినను బిల్లలకు దిక్కెక్కడిది ? " అని దీనాలాపంబులఁ బ్రార్థించిన నట్టికేల కాయమ్మ కరుణించి " వికటకవి వయ్యు రాజసన్మానము గాంచెదవు రాజ సభాభూషణంబ వయ్యెద" వని వర మిచ్చి యంతర్హిత యయ్యెను.

## తాతాచార్యులఁ జూచుట.

అపుడు రామకృష్ణుఁడు నిజనివాసంబున కేతెంచి నివురు గప్పిన నిప్పువలెఁ దనసామర్థ్యము గుప్తము సేసికొని కొన్ని దినము లుండెను. అనంతర మొకనాఁ డిట్లు చింతించెను. నాకుఁ గాళికాదేవి రాజసన్మానము గల్గు నని వర మిచ్చినది. దాని కేమి? ముందుగఁ దత్సాన్నిధ్యమునఁ బ్రవేశము గల్గు టెట్లు? ఇంతియ కాక నేను విద్వాంసుఁడ నని యొరు లెఱుంగనిసమయమున నానామము వ్యాపక మగు టెది యుపాయము? " అందలిమ్రానిపండ్లకు నట్టు చాఁప నేల ? " యని యూరకున్నచో భుక్తిముక్తు లలవడు టెట్లు? ఎట్లైనను రాజానుగ్రహము సంపాదించుట ముఖ్యము." అని రాజగురుఁ డగుతిరుమలతాతాచార్యుల (లక్షగోదానముల తాతాచార్యులను) జూడఁ జని తనయభీష్ట మెఱిగించెను. అతఁడు సమయ మగునపుడు కార్యము చేసెద నని తెల్పెను. నాఁటనుండియు రామకృష్ణుం డహరహమును తాతాచార్యులఁ జూచుచు వేచియుండెను, ఇట్లు చిరకాలమయ్యెను. అంత నొక్కనాఁడు రామలింగము తనలోఁ దా నిట్లు చింతించెను. అద్దిరే తాతాచార్యుం డెంత మోసగాఁడు.

## తాతాచార్యుని మోసపుచ్చుట.

తత్కాలోపయోగము లైనకొన్నిమాటలాడి తుదిఁ దన్నుం గాదన్న ట్లూరకున్నవాఁడు. సమయము వచ్చిననేకాని యెవరిస్వభావమును దెలియఁబోదు. ఇట్టిమోసగానియెడ నయం బనయంబును గూడనివన్ని

కావున మదీయమానోపాయములు చూపి వీనిమానము దొలఁగించి నాకోపము గొంత పాపికొనెదను. అని యిట్లు నిశ్చయించుకొని యిలు వెడలి యాచార్యుం డొకవిజనప్రదేశమునఁ గాలోచితకృత్యములు నిర్వర్తింపఁ గని యాతని బహుభంగుల వేసరింపఁ దొడంగెను. దానికి వెఱచి యాచార్యుఁడు సామమునఁ గార్యము చక్కఁ జేయ నిశ్చయించి ఓయీ! నీవుణ్యము గాని నన్నిఁకఁ జిక్కులం బెట్టక నీయిష్టానుసార మయినకార్యము నాచేఁ గొను మనియె. అనుడు రామకృష్ణుఁడు తాతా! నన్ను నీమూఁపున నిడికొని మాయింట నిలిపి రమ్మని యాజ్ఞ యొసంగెను. అపు డాచార్యుఁడు విన్నఁబోయి దైవమా యేమి సేయుదు నని యిట్లు చింతించెను. వృద్ధుఁడను నేను వీని నెట్లు భరింతును? అటు గాకున్న వీఁ డింకను నన్ను బన్నములపాలు సేయ నున్నాఁడు. పోని మ్ము. వానియిష్టమే చెల్లింత మనుచు, నింకను గనువెల్గున్నయది, చీఁకటి గ్రమ్మ నొరులు గానరారు. అని చింతించి అయ్యయో! చీఁకటి రాఁ గని నన్నితఁ డింకను నెన్నిపాట్లుపెట్టునో? శుభస్య శీఘ్ర మ్మని యున్నది. కావున వేగిరింత మని యాతనిఁ దనమూఁపుపై నెక్కించుకొని యొకకొంతదవ్వు సాఁగి నడిచెను. అంత నినుం డినగురు న కగునవమానమున కేమియుఁ జేయఁజాలక ఖిన్నుఁడై దుఃఖాబ్ధిలో మునిఁగె ననఁ బశ్చిమసముద్రములోఁ గ్రుంకెను. అపుడు రామ కృష్ణవాహకద్విజేంద్రుఁడు పదయుగళము పదిలము సేసికొని పతద్వ యము భద్రపఱిచి పురోపకంఠజలాశయతీరం బధిరోహించెను. అపు డచ్చోట నుండుజన మీవిచిత్ర మైనవాహనము జూచి నిర్వృతియ కా నోవు నని సమీపించి సందర్శింపఁగాఁ బరస్పరాహ్వానములు చెలఁగఁ గుమిగూడి రాఁ దొడంగిరి. అపుడు రాజు సఖులు గొలువఁ బ్రాగ్దిశా సౌధంబునఁ బొడసూపి వికసితకమలనయనుండై తారకలు సెదరనీయక చూచుచుండెను.

## రాజు కింకరులం బంపుట.

ఆచార్యుఁడును దన కగునవమానము తలవంపులు తేఁగా నితరులకు ముఖము సూపలేక తల వంచి తనయంగమచ్ఛము మాటుపడ నడువఁదొడఁగెను. ఇట్లుండ రా జాతని దూరమునుండి పొడగాంచి గురుం డని నిశ్చయించి నిజభటులఁ గొందఱిఁ బిలిచి యాయిరువురం జూచి వారిలోఁ బైవానిని గ్రిందికి దిగఁ ద్రోసి మర్దించి మా సమ్ముఖమ్మునకుఁ దెం డని యాజ్ఞయొసంగెను.

## కింకరు లాచార్యుని దండించుట.

అవు డాకింకరులు భయంకరాకారంబున శంకాతంకములు లేక జమునికింకరులవడువున బయలువెడలిరి. ఇట రామకృష్ణుఁడు పైనుండి చూచి యావృత్తాంత మంతయు నిమిషమాత్రమున గ్రహించి జాగరూకత కది సమయ మని యెంచి పుడమిపైఁ బడ వడి నుఱికి యాచార్యులపాదములు పట్టుకొని యిట్లనియె. "స్వామీ! నాయపరాధమును సైఁపుఁడు. స్వాముల ప్రభావం బీవఱకుఁ దెల్లము గాకుండుటం జేసి యిట్టి యెగ్గు గావించితిని. ఎఱిఁగియెఱిఁగి యనర్థావహ మగుతావున నెట్టియానృత్యము గల్గినను నుండుట మాబోంట్లకుఁ దగనిపని. నా ప్రవర్తనము నాకే భయదాయిమై యున్నది. ఇట్టిసమయమున దేవర పాదములు దక్క నా కభయదాయక మింకొక్కటి గలదే? కావున నిఁక నీపాదములు నాయాదల నుంచి నన్ను రక్షింపుమని యాతనిఁ దన భుజంబుపై నెక్కించుకొని నడువఁదొడఁగెను. రాజగురుఁడును మెల్లఁగఁ గూర్చుండి రామలింగనిప్రతిపత్తికి నచ్చెరు వంది బుధజనాపరాధమునఁ గల్గుదోసము వీని కిపుడు పొసంగందోఁప నోవు. మత్ప్రభావము వీని కిప్పటికిఁ దోఁచినట్లు గాన్పించుచున్నది" అనుచు స్వస్వరూపానుభవము సేయుచు నానందాబ్ధిమగ్నుఁడై మార్గాయాస మపనయించుకొనుచు బ్రహ్మారథమున నిజమనోరథములు సిద్ధించునట్లుండెను. అంతలో భూపతిభటు లేవునఁ జనుదెంచి కోపము దీపింప వీఁపునం జఱచి

గొబ్బున నేలకు దిగద్రోసి మొగముచూడక గాలపాశానుకారిపాశ
జాలముల సాభీలముగ గురుబలిని బంధించి కొట్టుఁడు, మట్టుఁ డనుచుఁ
జెట్టలు ప్రేలుచు రాజమందిరము ప్రవేశించి యాతని రాజేంద్రు
నకుఁ జూపిరి.

—— రాయఁడు పరితాపము నందుట. ——

అపుడు రాయఁడు గురునిజూచి తాపడి కొంతవడికిఁ దెలిసి అహా! గురుద్రోహి నైతి నిఁక నాకుఁ దారక మేది? అని కన్నీరు నించుచు "దేశికేంద్రా! నాయపరాధము సైఁపుఁ డని" పాదముల మీఁదఁ బడియుండెను. అట్టివానిం గాంచి గుర్వవసానవాక్యముల నిట్లనియె. "లెమ్మా రాజశేఖరా" యని యాతని గ్రుచ్చి యెత్తి "ఓభూపతిపుంగవా! నాకగునవమానమునకు వగవకుము. ప్రారబ్ధ మనుభవింపక తప్పించికొన నేరితరంబు? విధి యలంఘనీయము" అనునాచార్యుం జూచి వృత్తాంత మంతయుఁ దెలిసికొని లయకాలభైరవునిమాడ్కి భీషణాకారుఁడై "దీనికిఁ గుదురగునీద్రోహిని జమునిమందిరమునకనిచెదఁగాక" యని నిజకింకరులం జూచి "వీనిం దోడ్కొని చని మీఘోరతరకరవాలములచే శిరస్సు తెగనఱకరం" డని యాజ్ఞ యొసంగెను.

—— రామలింగని శిరస్సు నఱుకుమనుట. ——

రాజకింకరులు నాతనిం గొని యొకవనికిం జని వధియింప నుండుచో రామకృష్ణుఁడు వారికి ధన మొసంగి సమాధానము చేసికొని యొకమేఁకం జంపి తద్రక్తసిక్తమయినమీహేతి భీతి తొలంగి రాజునకుం జూపుం డని వారిం బంది తా నింటికిం జని స్వగృహోపరి చంద్రశాలాంతరస్థాయి యై ప్రచ్ఛన్నవేషముతో నుండి తనతల్లిం బిలిచి యిట్లనియె. అమ్మా! నీకోడలిం దోడ్కొని చని యేడ్చుచు రాజసభాభవనంబునకుం జని యచ్చోటున భూపతిపాదభూపతితులై యుండ నాతఁడు కారణ మడుగును. అపుడు భర్తకిఁ గర్మకుఁ గొంతధన మడు

గును. దానిచే మనకుఁ గొంతధనము రాఁగలదు. అని వారిం బనిచిన, వారును రోదనము సేయుచు రాజుం గాంచిరి. అపు డతఁడు కరుణాతరంగితాంతరంగుఁడై తత్కాలక్రియలకుఁ గొంతరొక్క మిచ్చి మాసవేతనమును నియమించెను. ఈవృత్తాంత మంతయుఁ దెలిసికొని రామకృష్ణుఁడు నిజమాయోపాయములకు నలరి గ్రాసవాసోదైన్యము లేక సుఖముగ నుండెను.

## రామకృష్ణుఁడు పిశాచవేషమును ధరించుట

ఇట్లుండ నొకయాఱుమాసములు గడచినవి. ప్రచ్ఛన్నుఁడై మిద్దెయింట నుండి రామకృష్ణుఁడు రక్కసికరాట మొకటి లక్కతోఁ జేయింపఁ దనవారల కాజ్ఞ యొసంగెను. తానును స్వర్గవిశేషదర్పణ మనునొకగ్రంథము రచియించుచుండెను. పూర్ణమయా రెండును సంపూర్ణము గాఁ గని చీలమండలల నంటునొకనీలకంచుకము గుట్టించెను. ఇట్టి వస్తుసమితిం బూని యొకనాఁటిరేయి మధూచ్ఛిష్టపువత్తియు గుగ్గిలపుతిత్తియుఁ బదిలంబు సేసికొని యొకగుడ్డపేలిక నగ్గి దగిల్చి యొడినిండఁ జిఱుతత్రా లుంచుకొని నిజగృహము వెడలి తత్సమీపమున నున్నబహుపాద్విటపివిటపాగ్రమునకు నెక్కి యొరులకుఁ గానరాకుండ నడఁగి మడఁగి యాకులచాటు పిండెకైవడి నుండెను. ఆవాసరము హరివాసరమగుటను నుపవాసమునఁ గృష్ణరాయఁ డచ్చోఁ బండితజనపరివేష్టితుఁడై వచ్చి నిలిచెను. అపు డాచార్యుఁడు భాగవతము చదువ నారంభించి హరికథాసుధారసమున సభ్యులమనస్సులు దనియింపుచుండెను. అట్టి సమయమునఁ బైనున్న రామకృష్ణుఁడు కంచుకము దొడిగి కరాటము శిరోవేష్టనముగ నమర్చి చేత నున్నయగ్నినిఁ బ్రజ్వరిలం జేసి వత్తి ముట్టించి క్రిందికిఁ జనుదెంచి యాడలసమీపమునఁ గూర్చుండి పండితులపై ఱాలవాన గురిపించెను. వార లదిమెద్ది యని తలయెత్తి మిన్నుం జూడ రామకృష్ణుఁడు తనచేత నున్నదీపము గుగ్గిలముచేఁ బ్రజ్వరిలం జేసి కరాటమున నున్నకరాళవక్త్రమును భీషణదంష్ట్రలును మిడిగ్రుడ్ల

ను జూపి తా నూర్ధ్వగామి యయ్యె. అపుడు సభ్యు లందఱును భయ కంపితాంగు లగుచు లేచి దయ్యము దయ్య మని మొక్కపెట్టున బొబ్బ లిడుచు నలుఁగెలంకులఁ బరువు లిడిరి. అపుడు రామకృష్ణుఁడు దీపము నూపక మరల శిలావృష్టిం గురిపించెను. అపుడు సభ్యు లాదెబ్బలకు నబ్బబ్బా యని యిఁక నేటిపురాణము? లేచి రంకు రం డనిరి. వారును బురాణము చాలించి దూరమున నిలువంబడి యిట్లుచింతించిరి. ఆహా! యిది యెద్దియో ప్రళయమునకు సంభవించినమహాభూతమురీతి నున్నది. ఇఁక నేమియుపాయము? నిక్కముగా నిది యొక్కబొమ్మరక్కసి యగును. ఈవఱకు మన రాజేంద్రుఁడు నీగురువులవారు నొక బ్రాహ్మణుని నిష్కారణముగాఁ జంపించియున్నారు. అది యూరక పోవునే? అధికార మున్నది గనుకఁ జంపించవచ్చును గాని తత్ఫల మనుభవింపక తప్పించుకొన నలవిగాదు గదా! బ్రహ్మరక్షస్సు కులాంతమునఁ గాని చలమువిడువ దని పెద్ద లనెదరు. ఏమి కాఁదలచి యున్నదో? ముందు భగవంతునకుఁ దెలియును. అని యట్లు సభ్యులు చింతించు చుండఁగా రాజు మాంత్రికులం బిలిచి దానికిఁ బ్రతీకార మొనరింపుఁడనుడు వారును జంకి రాజసన్నిధానమున నుండుటం జేసి కొంత భీతి వదలి భూతి చేతం గొని ఆగచ్ఛ ఆదచ్ఛ యని కేకలు వేయుచు భూతిం జల్లుచుఁ గొంతతంత్రము గావించి తుదిఁ జేయునది లేక రాజుతోఁ బ్రత్యూషమున సుస్నాతులమై యీ భూతమునకు వలయుమారణోపాయములఁ జూతుము. ఇపుడు పనివినియెద" మని నిజావాసములకుఁ జనిరి. రాజును సభ్యులఁగూడి చనియె. రామకృష్ణుఁడును గుప్తవేషుండై వృక్షము డిగి యిలు సేరెను.

## రామకృష్ణుఁడు రాజదర్శనము సేయుట.

మఱునాఁడు కృష్ణరాయఁడు కాల్యకృత్యములు నిర్వర్తించి కొని పేరోలగం బుండి ద్విజోత్తముల రావించి గ్రహమారణోపాయం బన్వేషింపుచుండెను. ఇట రామకృష్ణుఁడు వేకువ లేచి సుస్నాతుఁడై

కేశముల (వేలుముడి గీలించి తిరుమణి దీర్చి శ్రీచూర్ణము సాఁది పీతాంబరధరుఁడై తులసిమాలలు మెడ నిడి యుత్తరీయము వలెవాటుగ నమర్చి యుదకంపుఁ జాలియు నక్షమాలయు నొకచేత నుంచుకొని రెండవహస్తమున ''స్వర్గవిశేషదర్పణమును నాగబెత్తమును బట్టి పాదుకలం దొడిగి రాజమార్గమున నిర్గమించెను. అపుడు జనులందఱును నీతనిఁ జూచి సాక్షాద్విష్ణుండగు నని యెంచి నమస్కరించి దాసానుదాసులై తోడ నడువ నారంభించిరి. ఇట్లు బహుజనపరివేష్టితుఁడై రామకృష్ణుఁడు రాజమందిరద్వారము సేరి చౌవారికుం బిలిచి ''స్వాములు వచ్చియున్నా'' రని రాజునకుం దెల్పు మని చెప్పి పుచ్చె. వాఁడు నట్లే యొనరించిన నానరపతి గురున కవ్వార్తఁ దెలిపి యాతనిం దోడ్కొని యాసూరివరుకడ కరుదెంచి యాతఁడు సాకారుఁడై యున్న రామకృష్ణునిఁ గనుఁగొని వెఱఁగంది మదిం గుంది మూర్ఛనొంద నపు డారాజేంద్రుఁడును "దైవమా! యెట్టి యాపద తెచ్చితివి? ఇపు డీముప్పు తప్పించుకొనను నుపాయ మెద్ది? అని చింతింపుచు నాపడి నిలిచి యుండెను. రామకృష్ణుఁడు వారిం జూచి '' స్వామీ! నే దయ్యమును గాను, భూతమును గాను. దేవరకరుణాకటాక్షమున స్వర్గమునకుం జని యచ్చటిభోగములనుభవించి మీపితృజనప్రార్థితుండనై మీకు సౌఖ్యము సంపాదింప నీభువి కరుదెంచినరామకృష్ణుఁడను నన్నన్యునిఁగ భావింపవలదు. చంపఁబంచితి రనుకినుకింతయైన నాస్వాంతమున లేదు. ఆచార్యులయాన"అని పట్టుఁ బెట్టికొని యాయిర్వురం దేర్చియుండ వార లాతనిం గవుఁగిలించుకొని "అన్నా! నిన్ను బన్నముల నందించి చంపఁబంచిననిర్దాక్షిణ్యాలము మాయెడఁ గరుణించి మమ్ము మన్నింపు" మని యనేకవిధములఁ బ్రార్థించి యాస్థానమునకుం గొనిపోయి యచ్చో నత్యున్నతాసనమునఁ గూర్చుండఁబెట్టి తమపితృపితామహులకుశలసంప్రశ్నములు గావింపఁ దొడంగిరి. అపుడు రామకృష్ణుఁడు స్వర్గవిశేషదర్పణము విప్పి దాని వారల కందిచ్చి దీనిసావధానులరై చూచితి రేని విశేషము లింకను

గోచరము లగును. మార్గాయాసమున నున్నాఁడను కావున నే నిప్పటికిఁ బనివిసియెదను" అని నిజావాసమునకుం జనియెను. ధరణీధవుఁడును సంతుష్టాంతరంగుఁడై రామకృష్ణుని దలంచుచుఁ గొలువు చాలించి నిజావాసమునకుం జనియెను.

### —రామకృష్ణుఁడు పండితుఁడుగా రాజుం దర్శించుట.—

మఱునాఁ డా రాజదేవేంద్రుఁడు నిజసభాభవనంబునఁ గవిబుధనికరపరివేష్టితుఁడై గురునితో సంభాషించుచుఁ గొలువుండి విద్యాగోష్ఠి సలుపుచుండెను. అత్తఱిఁ దలవాకిటఁ గట్టఁబడియున్న నూతనపండితజనవిద్యాప్రకాశకఘంటానాదము వీనులకు విన వచ్చినది. అపుడు పుడమిఱేఁడు విబుధదర్శనోత్సుకుఁడై ఘంటానాదముతోడ నిజమోదము రెట్టింప దాని మరలమరల వినుచుండె. అపు డది మఱియొకపరి మొఱసినది. దాని విని పండితుఁడు రెండువిద్యల నేర్పరి యగు నని యేర్పరించుసమయమున నాధ్వని మరలమరలఁ గర్ణగోచరము గాఁ దొడఁగినది. దాని విని సభ్యులందఱును నత్యాశ్చర్యమున నుండిరి. అపుడు రాజోత్తముఁ డాపండితు నంతటితో ముగించి రమ్మని తెల్పుట కొక భటునిం బనిచె. వాఁడు రాజాజ్ఞానుసారముగ వచ్చి వృత్తాంతమును దెలిపెను. రామకృష్ణుఁడు దౌవారికపురస్కృతుఁడై వచ్చి రాజుకెట్టెదుట నిలువంబడియె. రాజు నాతనిం జూచి వెఱఁగంది "నీ నేర్చువిద్య లెన్ని గలవనుడు నాతఁ డిట్లనియె. "స్వామీ! నా నేర్చువిద్యల నెన్న నేండ్లు పట్టును సులభమార్గమునఁ జెల్పెద నాకర్ణింపుఁడు విద్యకు నొక్కవేయైన నీకంట బీఁటవాయు. దేవరసన్నిధానమునకుఁ బరీక్షార్థినై వచ్చియున్నాఁడను. కావున నాయభీష్టము దీర్చి నను నాస్థానకవిగాఁ గైకొన వేడెదను. అను పల్కులకు సభ్యులందఱును భయమందిరి.

### —రామకృష్ణుఁడు జ్యోతిషములోఁ బరీక్ష నిచ్చుట.—

అపుడు రాజు సభాసదులఁ జూచి యీమహావిద్వాంసునిఁ బరీక్షించుటకుఁ దగుశాస్త్రము నను దగుపండితుని వెదకింపుఁ డని యాజ్ఞ

కొనసంగెను. అపుడు వా రందఱును నాలోచించి జ్యోతిషమున నీతని నాంధ్రకవితాపితామహుఁడు పరీక్షింపఁదగు ననిరి. దానికి రాజును సమ్మతించెను. అపుడు పెద్దలపల్కులాలించి పెద్దన తనలోఁ దా నిట్లని చింతించె. ఆహా! యిదేటివృత్తాంతము? వీరందఱును నాపైఁ ద్రోచి యున్నారు. రామకృష్ణునిసామర్థ్యము మన మెవఱు నెఱుఁగము. ఎదిరి సామర్థ్యము స్వసామర్థ్యము నెఱుఁగక పరువులిడిన భంగపా టగును. గావున నూరకుండుట లెస్స యని యూహింప ననువు గాకున్నది. నన్నీ వఱకు నీసభ్యులు బలుమానిసిగా నెన్నుచున్నారు. ఈతఱి నూరకున్న బండితమాని యనరే? ఎట్లైనను నీయిక్కట్టుఁ దప్పించుకొనుటకై యూకున కందనిదియుఁ, బోఁకకుఁ బొందనిదియు, నగు నొకసంప్రశ్నము గావించెదను. అనంతరము భగవంతుం డున్నాఁడు. అని నిశ్చయించుకొని రామకృష్ణుం జూచి జ్యోతిషమున స్వర్గలోక వార్తావిశేషము లివు డెఱింగింపుమనియె. అట్టి ప్రశ్నమునకు రామకృష్ణుం డాతని నుతించి ఇదె చెప్పెదఁ జూడు మని కన్నులు మూసి మిన్ను జూచి యంగుష్ఠము లెన్ని ఛాయల లెక్కించి రెండుగీఱల గీచి యిట్లనియె. ఓభూపతిపుంగవా! మనశిరములకు సూటిగ నిపుడు నాకమున నాకేశుఁడు కొలువై యున్నాఁడు. ఎదుట నాతనియానందమునకై రంభాద్యప్సరసలు నాట్యము సలుపుచు వినోదములు సేయుచున్నారు. ఇపుడు రంభపాదనూపురము గళితమై ధరాతలమునం బడుచున్నది. ఒకయామములోపల నది యిచ్చోఁ బడును. నాబుద్ధిచే నాలోచింప నది యిం దొకగిరిం బడును. "భవంతి న భవంతిచ" అను పార్వతీదేవి శాపముచే దీనిస్థలము నిష్కర్షింప నలవి గాకున్నది, అనుడు రామకృష్ణునిపల్కులకు సభ్యులందఱును జిచ్చపాటున నుండిరి. యథాకాల మునకు నూపుర మొక్కటి ఘల్లుఘల్లున మ్రోయుచు నాతనియిష్టదేవతానుగ్రహంబున నొకగిరిం బడి రెండవదానికి దొర్లినది. అపుడు సభ్యు లందఱును రామకృష్ణుని బహుభంగుల నుతించిరి. రాజును

నాతనికి విశేషసన్మానము గావించి యీతఁడు మనకు లభించుట మన భాగ్యముసుఁడీ. ఈతని నష్టదిగ్గజములకు వలయువారిలో నొక్కనిఁగ నియమించితిమి. దానికి మీరు సమ్మతింపవలయు ననుడు సభ్యులు విశేషానందంబున సమ్మతించిరి.

## రామకృష్ణుఁడు వరాలపళ్లెరము నందుట.

ఇట్లు ప్రభుసన్మానమును గాంచి రామకృష్ణుఁడు నిజచిత్రవ్యాపారముల సకలజనవినోదములు గావించుచుండెను. ఇట్లుండఁగా నొకానొకదినమునఁ గృష్ణరాయఁడు వరా లుంచి యొక పళ్లెరము దెచ్చి నిర్దోషముగాఁ బద్యము సెప్పి దీని నందికొనుఁ డని పండితుల కాజ్ఞ యొసంగెను. అపుడు పెద్దన లేచి నేనే పద్యము సెప్పెదనని యీక్రిందిపద్యము సెప్పెను.

మ. శరసంధానబలక్షమాదివివిధైశ్వర్యంబులం గల్గి దు
ర్భరషండత్వబిలప్రవేశచలనబ్రహ్మఘ్నతల్మానినన్
నరసింహక్షితిమండలేశ్వరుల నెన్న న్వచ్చు నీసాటిగా
నరసింహక్షితిమండలేశ్వరునికృష్ణా రాజకంఠీరవా.

అని తనయాశుకవిత్వనైపుణిం జూపిన పెద్దనకవిం జూచి నవ్వి రామకృష్ణుఁడు తాతా! బిలముఁ జొచ్చినను రాజకంఠీరవా! రమ్మని తోఁకబట్టుకొని వెలి కీడ్చుచున్నావు. ఇది దోషమే కదా! మఱి నేను వచించెదఁ జూడు మని యీక్రిందిపద్యము నుడివెను.

"మ. కలనం దావకఖడ్గఖండితరిపుక్ష్మాభర్త మార్తాండమం
డలభేదం బొనరించి యేఁగునెడఁ దన్మధ్యంబునన్ హారకుం
డలకేయూరకిరీటభూషితుని శ్రీనారాయణుం గాంచి లోఁ
గలఁగం బాఱుచు నేఁగె నీవ యనుశంకం గృష్ణరాయాధిపా."

అనుపద్యము విని మెచ్చి పెద్దనయు సభ్యులును నీతని కీపారితోషికం బీయఁదగు ననిరి. రాజును సంతసమునఁ దదనుసారముగ నద్దాని నాతని కొసంగెను.

## రామకృష్ణుఁడు కవిధూర్జటిరహస్యముం బ్రకటించుట.

ఒకానొకదినమునఁ గాళహస్తిమాహాత్మ్యమును వెలిఁగించిన ధూర్జటి యనునొకకవీశ్వరుం డరుదెంచి కృష్ణరాయనితోఁ దనగ్రంథమునుగూర్చి ప్రశంస యొనరించెను. అపు డాతఁ డాగ్రంథముఁ దెప్పించి సావధానముగఁ బరిశీలించి యాకవివాక్ఛమత్కృతి కెంతయు నలరి పండితులం జూచి.—

"చ. స్తుతమతి యైనయాంధ్రకవిధూర్జటిపల్కుల కేల కల్గె నీ యతులితమాధురీమహిమ ?"

అనుసమస్య నిచ్చెను. పండితు లందఱు నేమియు నుత్తర మీఁ జాలక యూరకుండిరి. అవు డీరామకృష్ణుఁడు లేచి "స్వామీ! నాకొకపక్షమువఱకు వ్యవధానం బిచ్చితిరేని గ్రంథమంతయుఁ జూచి దీనికారణం బూహించెదను. పిమ్మట దేవరచిత్తమునకు నున్న తెఱం గెఱింగించెదను" అని రాజును సమ్మతింపంజేసి రామకృష్ణుండు నాఁటనుండియు సభకు రాఁడయ్యెను. ఇట్లింటికడ నుండి యాపక్షాంతమున మాఱువేషంబు ధరియించి యాధూర్జటి యున్నయింటికిం జని రాత్రియగువఱకు నటు నిటు దిరిగి యనంతరము మెల్లన నాయింటికడఁ బండియుండెను, నిశీథ మగుడు ధూర్జటి యిలు వెడలి నడువందొడంగెను. అపుడు రామకృష్ణుఁడు ధూర్జటికి దూరదూరంబుగ నుండి వెంటాడించి చనుదెంచుచుండెను. ధూర్జటియు దీని నేమియు నెఱుంగక యెప్పటియట్ల యొకనాగవాసంబునావాసంబులోనికిం జనియె. రామకృష్ణుండును వెనువెంట వచ్చి యాగృహముకడనె పవ్వళించి యుండెను. ధూర్జటి తడవులో నుండి వెలికిం జనుదెంచెను. అపుడు రామకృష్ణుం డాతనిపదంబుల పైఁ బడి లేచి "స్వామీ! నేను రామకృష్ణుండను యుక్తసమయము గాకుండ వచ్చియుండుటకు క్షమియింపుఁడు. నేను బనివినియెదను. అని యచ్చోటు వాసి త్వరతోఁ జనియె. అపుడు ధూర్జటి రామకృష్ణుం డిట్లు కాన్పించుటంజేసి వెఱఁగంది "యేమిదైవమా ? ముందుగతి" యని కొంతతడవు చింతించి యింటికి వచ్చి నిద్రించెను. మఱునాఁడు

సూర్యోదయం బగుడు నెప్పటియట్ల కాల్యకృత్యములు దీర్చుకొని ధూర్జటి యొంటిప్రాణంబుతో నాస్థానంబునకుం జనుదెంచెను. అంతకుము న్నె రామకృష్ణుండు వచ్చి యొకచోc గూర్చుండి యుండెను. విభూతి యు రుద్రాక్షలు మెఱయc గేవలము ధూర్జటివడువున వచ్చెడిధూర్జటిం గని రాయcడు మిక్కిలి సంతసంబున :—

"చ. స్తుతమతి యైనయాంధ్రకవిధూర్జటిపల్కుల కేల కల్గె నీ
యతులితమాధురీమహిమ ?

అనుడు రామకృష్ణుండు లేచి :—

"హా తెలిసెన్ భువనైక మోహనో
ద్ధతసుకుమార వారవనితాజన తాఘన తాపహారిసం
తతమధు రాధరోదితసుధారసధారలc గ్రోలుటం జుమీ."

అనుడు రాజును సభ్యులు రామలింగము పల్కులకు నెంతయు నవ్విరి. ధూర్జటియుc దలవంచుకొనియెను.

## రామకృష్ణుcడు సహస్రఘంటకవి నోడించుట.

ఒకానొకదినమున రాజదర్శనార్థమై సహస్రఘంటకవి యగుపెగడ రాజు నర్సన యనునాతcడు వచ్చి సముచితంబుగc దనరాక నెఱింగించి పుచ్చె. సహస్రఘంటకవిరాక విని రాజు మిగులc జింతించి పండితుల రావించి యిట్లనియె. "ఓసభ్యులారా! సహస్రఘంటకవి వాదార్థియై వచ్చియున్నాcడు. ఇచ్చో నాతని కీడగువా రున్నట్లు గానరాదు. కర్తవ్యం బెద్ది? మనసభకుc బండితసభ యనుమాట నేటితో ముగియ నున్నది. దీనికి మీ రేమిచేయ నున్నా రనుడుc బండితు లుల్కి మొగంబులు వెల్వెలcబాఱ, బయలు సూచుచు డోలాయమానమానసులై యొకరి నొకరు వీక్షించుచు గుసగుసలాడ నారంభించిరి. ఇట్లు కొంత సే పుండి వారందరుc బెద్దనను దలంచికొని "పెద్దన మనకుం బెద్ద. కావున మనల నుద్ధరింప నతcడె సమర్థుం" డని యాతని నుపాయము సెప్పు మనిరి. అతcడును నించుక చింతించి వికసన్ముఖుcడై ప్రభునిం జూచి యిట్లనియె. "స్వామీ! యిట్టితంత్రం బెచ్చో నైనc గాంచితిరే.

రామకృష్ణుఁడు మనల నుద్ధరింప సమర్థుం డయ్యెను సమయం బగుడు నిజప్రతాపము గుప్తము సేసి వానరాలాపము లాలింపుచు మిన్నక యున్న పవమానసూనుంబలె నున్నాఁడు. అట్లు గావున నీతఁ డాయంజనాసుతుమాడ్కి రాజకార్యమును బంధుకార్యమును జక్కఁగ జేయఁగ విరోధిసముద్రం బవలీల దాఁట నున్నాఁడు. దేవర యాజ్ఞ యొసంగుఁ డనుడు, రాజును మిగులం బొంగి రామకృష్ణుఁ జూచి "నీ విక్కార్యము నెఱవేర్ప నుత్సహింపు" మనుడు, రామకృష్ణుఁడు భాసురమందహాసవికసితముఖపంకజుం డై యేకగ్రీవం బైనసభం జూచి యిట్లనియె. "పండితర్షభులారా! నా కీవఱకట్టిసామర్థ్యము లేకున్నను మహాకవిపరామోఘవాక్పటిమచేతను బుధజనాశీర్వాదముచేతను ప్రభునియాజ్ఞచేతను గల్గెడిని. తొల్లి యంజనాసూతి వృద్ధభల్లూకాధిపుచే నుత్సహింపం బడియెకదా! స్వామికార్యనిర్వాహం బొనర్చె. అట్లే నే నీవృద్ధునిమాట పాటించి పగతు నక్రమంబున గెల్చి రాజకార్యనిర్వహణం బొనర్చెద. కావున విరోధివలన భయ ముడుగుఁడు. ఎల్లి యాతని నేలికదర్శనమునకు రాఁబంపుఁడు. అపు డేను లక్షఘంటకవినామమున వేషధారినై వచ్చెద. అనంతరవృత్తాంతము తనంతనే విస్పష్టం బగును. నే నిపుడే పసివినియెదను. అనుడు రాజు వల్లె యన్ని తనయాస్థానము సాలించి నర్సనకు మఱునాఁడు దర్శనమునకు రా నాజ్ఞ యొసంగెను.

నర్సనయు మఱునాఁడు రాజాజ్ఞానుసారంబుగఁ జనుదెంచి రాజమందిరద్వారమున నిలిచి ప్రతీహారులవలన నాత్మభర్తకుఁ దనరాక యెఱింగించి పుచ్చెను. అపు డా రాజు సహస్రఘంటకవిం దోడ్కొనిరాఁ దగువారలం బనిచె. వారును నాతని సగౌరవంబుగఁ దోడ్తెచ్చిన నాధరణీజానియు సామంతజనపరివృతుండై కతిపయపదంబులు దూరము నడిచి యెదురుగ వచ్చి కవిం గౌరవించి యాస్థానమునకుం దెచ్చి యర్ఘ్యపాద్యము లొసంగి ధన్యుండ నైతిఁ జూడీ యనునవసరంబున, ద్వారికుం డొక్కరుండు వచ్చి రాజుం గైవారంబు సేసి "దేవరా! హాజారమున

లక్షఘంటకవి యనునొక మహానుభావుండు దర్శనార్థంబై వచ్చియు న్నాఁడు. సెలవే” యనుడు, రాజు సభ్యులం జూచి “యాహా! యిది బహుసుదినంబు. పండితులపైఁ బండితు లేతెంచుచున్నారు. వారి నిట కుఁ దోడ్కొని రాఁదగువారిం బంపుఁడని తిమ్మరుసున కాజ్ఞ యొసంగె. అతండును గొందఱుబుధజనులం దోడ్కొని వేషధారికడ కేఁగి రాజా జ్ఞఁ దెలిపెను. అతండును రాజాను మతంబు దెలిసి లోనికిఁ జనుదెంచు చో శిష్యజనులకుఁ బాఠంబు లుపన్యసించుచు జను లచ్చెరువంది చూడ సభామంటపంబు సమీపించె. అంత నాభూకాంతుం డెదురుగఁ జనుదెం చి నితాంతభక్తి నాతనిపదంబుల కెఱఁగి సభాభవనమునకుం దోడ్కొ నివచ్చి నిజసింహాసనపురోభాగమున నున్న యత్యున్న తాసనమునఁ గూ ర్చుండ నియమించి బహుమానపూర్వకముగఁ బూజలు సేసి నిజసింహాసన మున నుండెను.ఇట్లు కూర్చుండి యున్న రాజశిఖామణిం గాంచి వేషధారి యచ్చో నుండువిద్వజ్జనంబులఁ జూపి మృదుమధురభాషణముల వారివారి నామములును సామర్థ్యాతిశయములు నడుగం దొడంగెను.అనంతరము తమయెడమప్రక్కను గించిదున్న తాసనమునఁ గూర్చుండి యున్న నరస న్న దిక్కు మొగంబై వీ రెవ్వార లనియె. రా జాతఁడు సహస్రఘంటకవి యని తెల్పెను. తెల్పిన నతఁడు వీరు సహస్రఘంటకవులా? వీరినామం బేమి యనుడు ప్రెగడరాజు నరసన యని వాక్రుచ్చె. అపు డతనితో ముచ్చటింప నుద్యుక్తుం డైన ట్లభినయించి స్వామీ! యీకవిశిఖామ ణిముఖము చూచినతోడనే సంభాషింప మనస్సున నుత్సాహము కల్గు చున్నది. సెలవే? అనుడు రాజు లక్షఘంటకవిం జూచి “విద్వా నేవ విజానాతి విద్వజ్జనపరిశ్రమమ్.” అనునట్లు మీమీసామర్థ్యబోధంబున కై సంభాషింపఁ దగు ననుడు రామకృష్ణుండు మందహాసకందళితము ఖారవిందుండై నరసనకవిం జూచి యిట్లనియె.

“అరసికజనసంభాషణముకంటె రసికజనవాక్కలహము మేలు” అని యున్నది. కావున నే నిపు డామేలిపని నొనర్ప గమకించుచున్నాఁ

డను కినియకుఁడీ'' అని యాతని బుజ్జగించి, స్వామీ! నా కొకటిరెండు సంశయము లున్నవి. ఆసందియములఁ దొలంగించి నామనస్సును నిశ్శంకముగఁ జేయుఁ డనుడు నర్సన "అబ్బా! నే నంతవాఁడనే? అయిన నాయెడం గరుణించి యాప్రశ్నము లానతిచ్చిన విని కొంత తెలిసెదను.'' అనుడు రామకృష్ణుం డిట్లనియె. పండితవర్యా! నా కీవఱకు నుక్తలేఖనంబునఁ బ్రజ్ఞావంతుండును, దప్పులు దిద్దుటయందు నేర్పరియు నగు పండితుండును, కవియుఁ గాన్పించఁడయ్యె. మీర లేమైన వీనిని నేర్చియుంటిరే? అనుడు నర్సన గర్వించి యిస్సిరో! యీతం డిట్టిప్రశ్నములా నన్నడుగుట ఈతనిచేవ తెలిసినది. అని నిశ్చయించుకొని పండితోత్తమా! మేలుమేలు! గొప్పసంశయము లడిగితిరి. కవికి ముఖ్యముగా వలయునీరెంటిని నేర్చి యుండకున్న నేపండితుండును గవి యగు టెట్లు గల్గు? నాశిష్యు లందఱును మొదట నాకడ నీరెంటినే యభ్యసింతురు. వలయునేని నాశిష్యుం డొక్కరుండు మీకు నుత్తరం బిచ్చి మిమ్ముఁ దృప్తి నొందించును. ఇట్టిప్రశ్నము వేదమా? శాస్త్రమా! నేను యోజించుటకు? అని నర్సన లక్షుఘంటకవి యనుభయ మింతయైన లేక యహంకారమునఁ బల్కినఁ గనలి రామకృష్ణుండు స్వామీ! మీశిష్యులకుం గఱపిన తెఱఁ గెఱిగింపుఁడు. చూడ వేడుక గల్గుచున్నది. నానుడువుపద్యం బిపుడు వ్రాసి నన్ను గారవింపుఁడు. అని తనచేతియాకును ఘంటము నందిచ్చి;—

క. తృవ్వఁట బాబా, తలపై పువ్వఁట జాబిల్లి, వల్వ బూచఁట, చేఁ దుం
బు వ్వఁట, చూడఁగ నుళుళు క్కవ్వఁట, యరయంగ నట్టివారునకు జేజే.

అని చదివి వ్రాయుము వ్రాయు మని వేగిరింపుడు, నర్సన మొదటియక్కరము నుచ్చారణానుసారముగ వ్రాయఁ జేయాడక క్రిందుమీఁదు చూచుచు నొకపరి వ్రాసినయక్షరము మరలఁ దుడుపు పెట్టుచు నింకొకవిధముగ లిఖించి దానిం జెఱిపి వేయుచు నీతీరున నదియే వ్రాయుచునుండె. అపుడు రామకృష్ణుం డాతనిం జూచి చాలు! చాలు!

నీ కిందు సంపూర్ణ పాండిత్యము గలదు. ఇఁక దప్పులు దిద్దుటయం దెట్టిప్రజ్ఞ గలదో దానింగూడ సభ్యులు చూడఁ దలఁచి యున్నారు. ఇదె యీపద్యములోనితప్పుల దిద్దు మని యీక్రిందిపద్యము చేతి కిచ్చెను:—

మ. గననీహారగు రామపద్మ ధళరంగ తీక్ష్ణ త్రి చాణూరమ
ద్ధనకుకాత్రిక్షికశేఖరాణ్మ్రగపతీ త్రైలోక్య ధామోదరా
యనగాశంఖర వాంఛితార్థదగదా ద్యష్టైక పాణీజనా
ర్ధనవానేకపవైరి విగ్రహాముకుంధా మిత్రవింధాదిపా.

దీనిం జూచి నర్సన పైకిఁ దప్పులుగా నగపడుచుండునట్టిచాణూరమద్ధనాదిశబ్దంబులఁ గొన్నిటిఁ జాణూరమర్దన మొదలగురూపములుంచి దిద్ది యాతనికిం జూపె. రామలింగ మపుడు పక్కున నవ్వి సభాసదులం జూచి యిట్లనియె. అహాహా ! యీమహాకవిప్రజ్ఞావిశేషము లమేయములు. తనఁకుఁ దెలియని వన్నియుఁ దప్పులఁట ! నాపద్యంబునఁ దప్పు లున్నవియఁట ! చూడుఁడు ! అని తా నాపద్యము క్రమముగ నన్వయించి చాణూరమద్ధన మొదలగుశబ్దములకుఁ జాణూరమత్ హన అని విరిచి యర్థము సెప్పి సభ్యుల నాయర్థమునకు మెచ్చించి నర్సనం జూచి యిట్లనియె ;—

చ. తెలియని వన్ని తప్పు లని దిట్టతనాన సభాంతరంబునన్
బలుకఁగ రాదురోరి పలుమాఱు పిశాచపుపాడగట్టి నీ
పలికిన మాట దమ్మ వడ భావ్య మెఱుంగక పెద్దలైనవా
రల నిరసింతురా ప్రెగడరాణ్ణరసా విరసా తుసా భుసా.

అని యంతటితోఁ బోనీయక,

చ. ఒకనికవిత్వమం దెవఁడునొప్పులు తప్పులు నాకవిత్వమం
దొకనికిఁ దప్పు పట్టుపని యుండను కాదని తప్పు పట్టినన్
మొకమటు క్రిందుగా దిగిచి మొక్కలు పోవవినుంపకత్తితో
సికమొదలంటఁ గోతు మఱి చెప్పునఁ గొట్టుదు మోము దన్నుదున్.

అని రామకృష్ణుఁ డుక్కుమిగిలి ధిక్కరించిన నక్కవిశిఖామణి యేమియు ననఁజాలక లజ్జితుం డై తనరాకఁ దిట్టుచుఁ జేఱుచెమ్మట

మొగమ్మునఁ గ్రమ్మఁ దల వాంచి కాల నేల వ్రాయుచు నూరకుండెను. అంతట రాజు నాయుర్వేరం జూచి కార్యము మించుటకుఁ జింతించి యూరకుండుట తగనిపని యని యెంచి లేచి వారికరంబులు నిజకరంబులఁ బట్టి వజ్రం బెన్నండైన వజ్రంబునకుఁ దక్కువ యగునే. మీ రిరువురు సమానులే యగుదురు. అని యాయుర్వేరకుఁ గాంచనాంబరాభరణంబులు చీనిచీనాంబరంబులు నిచ్చి విశేషధనము నొసంగి యాపండితులకు సెలవొసంగెను. అపుడు కపటకిరీటయైన పుణుం డగు రామకృష్ణుఁడు రాజుం జూచి, "స్వామీ! పండితమాని యగునీతని కీపండిత గండ యనుపెండేరం బుండఁదగునా యనుశంక వొడముచున్నది. దేవ రచిత్త"మనుఁడు నర్సన వేషధారిపల్కు లాలించి రానియభిప్రాయము ను గ్రహించి త్వరతోఁ దనకాలియందియ నూడ్చి లక్షుఘంటకవి కిచ్చి రాజుకడఁ బనివిని వీథిం దిట్టుచు వచ్చినత్రోవం జనెను. రాజును లక్షుఘంటకవికి సెల వొసంగి నిజావాసమునకుం జనియె. సభ్యులు లక్షుఘంటకవిప్రజ్ఞావిశేషంబులఁ దలంచుచు యథేచ్ఛం జనిరి.

రామకృష్ణుఁడు భట్టుమూర్తివలన ముత్యాలహారముం గైకొనుట.

ఒకానొకదినంబున భట్టుమూర్తి కృష్ణరాయల నీక్రిందిపద్యము సెప్పి నుతించె నదెట్లన్నను :—

క. నరసింహాకృష్ణరాయని, కర మరు దగుకీర్తి యొప్పెఁ గరిభిద్గిరిభిత్
కరికరిభిద్గిరిగిరిభిత్, కరిభిద్గిరిభిత్తురంగకమనీయం బై.

దీని విని రాయఁడు మిగుల సంతసించి తనమెడ వ్రేలుచున్న తారహారం బాభట్టుమూర్తి మెడఁ గీలుకొల్పెను. దాని ధరియించి భట్టుమూర్తి పండితసభలోఁ దారామధ్యస్థితుం డగుచంద్రుని భంగిఁ బ్రకాశింపఁ దొడంగె. ఇట్టిగౌరవం బీతనికిం గల్గుటంజేసి సభ్యులేరును సమ్మతింపరైరి. కావున నిందలిముఖ్యపండితులు కొందఱు సభ చాలించినయనంతరము రామకృష్ణునియింటికి వచ్చి యాతనిరాకకు వేచియుండిరి. అతఁడును గొంతరాత్రి కింటికిం జనుదెంచె. అపు డీపండితులు సకరుణం

బుగా నాతనికిట్లనిరి. ఈవఱకు రాజు మనలనందఱను సమానంబుగ గారవించుచుండె నని తలంచుచుంటిమి. అది యంతయు నేఁటికిఁ దెల్లం బయ్యె. భట్టుమూర్తి మన ముప్పునకును నూరగాయకుంగూడఁ గొఱగా మని రాజునకుం దోఁచియున్నది. ఇట్టుండ మన మిచ్చో నుండులాభ మెద్ది? దేశాంతరగతుల మైన నీవంత కొంత మానును. అనుడు రామకృష్ణుఁడు వారలం జూచి కడచినదానికి వగచుట గతజలసేతుబంధనము. కర్తవ్యము నిర్ణయించిన నాకుం బోలిన సహాయంబు సేసెద. అనుడు వార లాతనిం గాంచి "రోయీ! యుపాయంబు తోఁచకుండుటచేతనే కదా నీకడ కరుదెంచితిమి; యేదియేని యుపాయము చేసి మమ్ము నుద్ధరింపుము." నా విని రామకృష్ణుఁ డిట్లనియె. "నాకుంబోలినయుపాయంబు చెప్పెదవినుండు. చేతగానిపర్వు లిడుట నాచేతఁ గాదు. ఎట్టియుపాయంబున నైన నాభట్టుమెడం బెట్టియున్న హారంబు శోరంబుగఁ బట్టి నామెడ నిడికొని వచ్చెద. ఇది మీకు సమ్మతంబె" అనుడు వారలగుంగాక యని తమయంగీకారమును దెలిపిరి. అపుడె బయలువెడలి రామకృష్ణుఁడు భట్టుమూర్తినికిపట్టు చేరి యొకభటునిచేఁ దనరాక నాతనికిఁ జెప్పి పుచ్చె. రామకృష్ణుఁడు వచ్చియున్నాఁ డనుపల్కు విని కడు నుల్కి కారణం బేమని మూర్తి కడుఁ జింతించి యేమియుఁ గానక తుద కేదిరో మునిఁగె నని యెంచి యొంటిప్రాణంబుతోఁ జనుదెంచె. అపుడు రామకృష్ణుఁ డెదురుగఁ జని యాతని గాఢాలింగనంబు సేసి యిట్లనియె. "ఓయీ: నాయుల్లం బిపుడు గదా చల్లనయ్యె, ఇంతదనుక నే నిట నుండుపండితులమాటలకు లోనై నిన్నున్యునిగ నెంచి నీ ప్రజ్ఞాతిశయంబులకు సహింపలేనైతి. ఈ దినంబుతో నాసంశయంబులన్నియుఁ దీఱె. నామనంబు నిష్కళంకం బగుడు నేస్తంబున కానవాడమె. కావున నాయీప్సితంబు సమకూర్చుకొన నీకడ కరుదెంచితిని. నీవును బరేంగితజ్ఞానివి గావున మద్వాంఛితార్థంబు నొసంగుదువు, అనురామలింగనిపల్కుల కేమియు ననఁజాలక వెఱఁగంది చూచుచున్న

భట్టుమూర్తిం జూచి యాతఁ డిట్లనియె. "ఓయీ! నిన్నుం జూడఁజూ
డ నీకవితసరసతయుఁ బ్రజ్ఞావిశేషంబులు నుతియింప నుత్సాహంబు వొడముచున్న యది నీప్రజ్ఞావిశేషంబు లల్పంబులే ?

"గీ. అలసాని పెద్దన యల్లికజిగిబిగి, ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకు
పాండురంగవిభుని పదగుంభనంబును. కాకమాను రాయ! నీకుఁ దగుర.

అనురామకృష్ణునిమధురవాక్యంబులు వీనులకు నమృతంపుసోనలై సోఁకిన భట్టుమూర్తి పెల్లుబ్బి వెల్లువయై పాఱునానందంబునం దేలి నిజకంఠలగ్న తారహారం బూడ్చి యాతనిమెడ నిడి గాఢపరీరంభ మాచరించి లోనికిం దోడ్కొని చని యున్నతాసనంబునం గూర్చుండఁబెట్టి, యర్ఘ్యపాద్యంబు లొసంగి కర్పూరతాంబూలం బందిచ్చి "యిదియే నేస్తంపు విడెం బని తెల్పెను. రామకృష్ణుం డట్లే దానిఁ గైకొని పోయివచ్చెద నని తెల్పి నిజగృహంబున కేతెంచి తనరాక కెదురుచూచుచున్న పండితులం గాంచి, "యిదె మీహారంబు మీయిష్టానుసారంబుగ దీని వాడికొనుం డని వారిపైఁ బడవైచె. దానికి వారందఱును గడు సంతసిల్లి "యోయీ దీని హరింపను ధరింపను నీవ సమర్థుండవు. కావున నీకు దీని మేమందఱము బహుమానంబుగ నిచ్చితి మని యతనిమెడ దాని నుంచి యథేచ్ఛం జనిరి.

ఇట భట్టుమూర్తి యప్పుడే రాజదర్శనార్థము చని తనరాక యాతని కెఱింగించి పుచ్చిన నాతఁడు భట్టిటిసమయంబున వచ్చుటచే నాతని కెద్దియేని యాపద సంభవించుటగా నిశ్చయించి దిగ్గన లేచి వచ్చి నీరాకకుఁ గారణం బే మని యడిగెను. అవు డాతఁడు నవ్వుచుఁ జిన్న విన్నపం బన రామకృష్ణుఁడు స్నేహార్థియై వచ్చిపల్కినపల్కు లన్నియుం జెప్పె. వాని విని రాజును గడు సంతసించి యీతఁ డొక్కఁడు మనవాఁడై యుంటం జేసి తక్కుంగలపండితుల నశ్రమంబునఁ గెలువ వచ్చును. మన కీదినంబు మిగుల సుదినంబు. ఎల్లి యెల్లవృత్తాంతంబు మాటలాడుదము. చను మని యారాత్రి నిద్రించి మఱునాడు రాత్రి

వృత్తాంతంబు మనంబునకు సంతసంబు పుట్టింప నాస్థానంబునకు వైళంబ వచ్చి రామకృష్ణుం బిలిచి యిట్లనియె. "ఓయీ ! పైత్యరోగికిఁ బాలు రుచ్యంబులుగాక తద్రోగాంతంబున దానిమేలిగుణంబు లగపడునట్లు భట్టుమూర్తిగుణంబు లిపుడిపుడు గొప్ప పండితులకుఁ గాన్పించెడినికంటే ?" అనుడు నవ్వి "దేవర యట్టిపండితు లెవ్వరో యెఱిఁగించిన ననంతరవృత్తాంతంబు మనవి సేయుదు ననుడు రాజు తొల్లింటిపద్యము చదివెను. దానికి రామలింగము నవ్వుచు నా పద్యము మరలఁ జదివితుదిని కాక, మానురాయ నీకుఁ దగురా అని కాక అనుదాని వేఱుచేసిన రాజు నీయభిప్రాయంబు స్పష్టీకరింపు మనియె. అపుడు రామకృష్ణుఁడు భట్టుం జూపి "యీతనికంచుకము దీయించిన మనసంశయము లుండ వనుడు రాజు దాని కాజ్ఞ యొసంగె. అపుడు రామకృష్ణుం డతనివీఁపున నున్న తామరం జూపి యతఁడు కూర్చుండెడుస్థలంబున నున్న స్తంభంబుఁ జూపి మానురాయ నీకుఁదగురా. అని యర్థంబుగాని యింకొకటి గాదనియె. దాని విని రాజును తేజు చెడి యూరకుండె. భట్టుమియుఁ బల్కనే లేఁ డయ్యెను.

### —రామకృష్ణుఁడు వసుచరిత్రకృతి నాక్షేపించుట.—

భట్టు రామరాజభూషణుఁడు వసుచరిత్రను రచియించి తెచ్చి సభలో వినిపింప నుండ రామలింగ మొకచిత్రకథ చేసె. అదెట్లనిన:—

ఒకానొకదినంబున భట్టురామరాజభూషణుఁడు పెద్దనమనుచరిత్రపాకచమత్కృతికి మనంబున నలరి యట్లు తాను నొకరసవత్ప్రబంధంబు గల్పింప నుత్సహించి రాయల కెఱింగించిన నాతఁడు కర్పూరతాంబూలజాంబూనదాంబరాభరణంబు లొసంగి కృతి నిర్మింపు మనుడు రామభూషణుం డత్యంతానందంబునం జని మిగుల బరిశ్రమం బొనర్చి మనుచరిత్రకు నెక్కుడురసోదంచితం బగువసుచరిత్ర యనునొకగ్రంథంబు రచియించి కృతి నొసంగ రాజున కెఱిఁగించిన నాతఁ డొకశుభదినంబున సభ సేసెద నని యాజ్ఞ యొసంగెను. అపుడు రామభూషణుండు

రాజున కొకవిస్మయం బని యిట్లనియె. "దేనర రామకృష్ణునివృత్తాంత మంతయు నెఱుంగుదువు గద. ఇట్టిదుష్టుఁడు ముందు తమసభ కేతెంచిన నాకష్టంబు గట్టెక్కదు. కావున నాతని నాఁటిదినంబు సభకు రాకుండ నుత్తరం బొసంగవలయు." అనుడు రాయఁడు రామలింగనిచేష్టల నాలోచించి "పరరంధ్రాన్వేషి యగునీతం డెద్దియైనఁ బల్కునో వును. అపుడు నామది కెట్లు దోఁచునో? కావున వీని నాఁటిసభకు రాకుండ నుండుటయే కర్జం" బని తనభటులకు నట్లుత్తర మొసంగి రామలింగనికి నట్లాజ్ఞ యొసంగె. అట్టిరాజాజ్ఞకు మిగులఁ గుపితుం డై రామకృష్ణుండు తనలోఁ దా నిట్లు చింతించె. "హా! భట్టెట్టి సాహసకార్యం బొనర్చె. ఏ నెన్నండేనియు వీనికిఁ గీడు దలఁచి యుంటినే? ఇట్టి నన్ను నిష్కారణవైరంబున నవమానింపఁ దలంచె. తన్నుఁ గట్టు త్రాళ్లు తాన తెచ్చికొన్నట్లు నాకు భంగంబు సేయఁదలంచె. ఈతని ప్రబంధంబున కేదియేని యంతరాయంబు గల్పించి రాజు వినకుండ నుండనట్లు సేసెదఁగాక" యని యిష్టదేవతకు నమస్కరించి తా నొక ముదుసలియువ్వరివేషంబు దాల్చి సభామండపమీపంబునఁ బనిసేయు నుప్పరులం గూడి యుండెను.

అంతట శుభదినంబునఁ బ్రభునియాజ్ఞఁగంపుజనులు సభకు నలంకరణం బొనరించిరి. రాజును సర్వసేనాపరివృతుం డై నిజవిభవం బేపారనేతెంచి కొలువు బలిసియుండె. అపుడు రామభూషణుండు తననేరువు సభ్యులందఱకు విస్పష్టంబు సేయఁదలంచి యొకయున్నతాసనంబునఁ బ్రభుసన్నిధిం గూర్చుండి యొప్పిదంబు లగుగీతంబుల మంగళగీతంబులు పాడుచు స్వకృతకృతిముఖశ్లోకంబున సుశ్లోకుం డగుకాకుత్స్థతిలకు వర్ణించిచెప్పిన "శ్రీభూపుత్రి వివాహవేళ" అనుపద్యంబు చదివె. అపుడు దూరంబున నుండి యాఁగుఁ డాఁగుఁ డని" యొక్కధ్వని వీతెంచె. అట్టి ధ్వని కర్ణగోచరం బైనతోన సభికులందఱును నుల్లంబులు తల్లడిల్ల నివ్వెఱఁగంది యుండిరి. నిశ్శబ్దంబుగ నున్నసభామధ్యంబునకు

నుప్పరులమధ్యంబు వెలువడి యొకముదుసలి యుప్పరి తనచే నున్నతట్ట యుఁ బారయుఁ బాఱవైచి "పాయరా లచ్చి" యని కేకవేసి గుండెలు మోఁదికొనుచు రాజసన్నిధి కేతెంచి "సామీ! యేలికమేలుగోరి యీకవి కవితంబు సెప్పఁడు. నేఁటితోన ప్రభునకుఁ బ్రజకు ఋణంబు సెల్లె. ఇఁక నేమి సెప్పుదు" ననుడు రాజు "కారణం బే" మని యడిగె. అప్పుడు ముసలియుప్పరి రాజుం జూచి "యయ్యా! కొంత బూది తెప్పించిన నున్నదూ పెఱిగించెద" ననుడు రాజు నట్లు గావించె. ఆభూతి గొని యుప్పరి తనయఱచేత నొకబరి నేసి శ్రీ యనునక్కరమందు వ్రాసి భూ అని చేతికడ నొరుంచి పట్కె. దానిచే భూతియందున్న శ్రీ రూపుమాసె. దాని రాజునకుం జూపి యిట్లనియె. "ఏలికసంపద నెల్ల సిభ ట్టిట్టిచెట్టు వెట్టి తొలఁగించె చూచితిరే! భూతిలోని శ్రీ దొలంగె. ఇట్టికబ్బ మందుట కర్జంబు గా దని నాకుఁ బోలినట్లువక్కాణించితిని. ఇఁక దేవరచిత్తంబు అని యాయుప్పరి యచ్చోటు వాసి చనియె. రాజును నేమియు ననఁజాలక మఱియొకదినంబున నీగ్రంథంబు చూచెద మని యాస్థానంబు చాలించి యథేచ్ఛం జనియెను.

## వసుచరిత్రమును పిండములపాలు ధారపోయించుట

అనంతరము రామరాజభూషణుండు విచారసాగరనిమగ్నుండై పుస్తకంబు హస్తంబున నిడికొని యిల్లు సేరి విఘ్నకారుం డగునాముదుసలియుప్పరి యెవ్వం డగు నని యూహించి రామకృష్ణుం డగునని నిశ్చయించి స్వయంకృతాపరాధంబునకు వగచి యుపాయాంతరంబు లేమింజేసి యాతనిపదంబు లాశ్రయించి కార్యంబు పొందుపఱచికొందుగాక యని నిశ్చయించుకొని యాతనికడ కేఁగి చేతులు పట్టి నాయజ్ఞానంబు సైఁపు మని యిట్లనియె. అన్నా! నే నిన్న వమానింపఁదలచి కావలసినట్టు లవమానంబు బొందితి. ఇప్పుడు నాకు జ్ఞానంబు వచ్చెను. ఇఁక నాయందుఁ గరుణించి నాకృతి రాజునకు శ్రుతిగోచర మగునట్లొనరించిన నీకు బహుపుణ్య ముండును. అంతటితోన నాయుల్లంబు

చల్లనగు. అని దీనాననుండై ప్రపన్నుండై యున్న రామరాజభూషణుం
గాంచి సదయుండై రామకృష్ణుం డిట్లనియె. ఓయీ! వగవకుము ఎవ్వం
డో నీవిరోధి నీకిట్టి విఘ్నం బొనరించె. అయిన నేమాయె. నేను రాజు
కడ కరిగి నిన్నుఁగూర్చియు నీగ్రంథంబుఁగూర్చియు నాతనికి నెక్కుడు
గఁ దెల్పి కార్యం బనుకూల మవున ట్లొనరించెదను. ఇదె పోయి వచ్చె
ద నని యప్పుడ ప్రభువు కడ కరుదెంచి యాతనితో నిట్లనియె. దేవర
కు రామభూషణుండు నాఁడు కృతి నొసంగ రా నాతనిదురదృష్టంబున
దానికి నంతరాయంబు సంప్రాప్తంబయ్యె. నాటంగోలె యాతం డన్న
పానంబులు మాని దుఃఖంబునఁ గృశించుచున్నాఁడు. దేవర దాసి నొక
పరి విన్నంతమాత్రంబున నాతఁడు సంతుష్టాంతరంగుం డగును. కావున
నాతనిఁ గరుణింపఁదగును. అనుడు రాజును గొంతవడవు చింతించి యో
యీ! మున్ను కృతి నందక తిరస్కరించి మరల నాగ్రంథంబు విన
మన మెట్లుత్సహించును. అనిన రామకృష్ణుఁ డిట్లనియె. సందియంబు
దేవరడెందంబునఁ గ్రందుకొని యున్న దేని యొకయుపాయంబు సేయుద
ము. గతించినవారికేరికైన నీకృతి నిచ్చి యనంతరము దాని నిటఁ దెచ్చు
న ట్లొనరింతము. ఇతరులు కృతిపతులైన గ్రంథంబు మనము వినుటకు
శంక యుండదు. దోషంబులు గ్రంథంబున నుండునేని తద్దోషంబులు
కృతిపతిని బాధించుఁగాని శ్రోతలకేమి? కృతిపతి గతించి యుండుటచే
నాతని నైన బాధించు ననుభయంబు లేదు. అనుడు రాజును దానికి
సమ్మతించె. అప్పుడు రామకృష్ణుఁడు భట్టుకడ కేతెంచి యీ వృత్తాంత
మంతయుఁ దెల్పి కృత్యాదిని నాశ్వాసాద్యంతములు మార్చి వైళంబ
తెమ్మనుడు నాతఁ డట్లొనరించెను. అనంతరము రాజున కీవృత్తాంతంబు
రామకృష్ణుఁడు దెల్పిన నాతఁడు సంతసంబున దాని వినుటకు సెలవొ
సంగెను. పిమ్మట రామరాజభూషణుఁడు వసుచరిత్రము నామూలాగ్రం
బుగఁ జదివెను. దాని సావధానముగ విని రా జాతనిప్రజ్ఞా విశేషంబు
ల కెంతయు నలరి యిట్టిరామభూషణకృతికిఁ దాఁ గృతిపతి గాకుండ

కూర్చుండుట యక్కడనే చేసితి రేని యెండవానలవలన శ్రమ తప్పును. నాగృహమును బావన మగును. కాఁబట్టి నన్నుఁ గటాక్షించి యరుఁగుపై దయసేయుం'' డని ప్రార్థించెను. అట్టిప్రార్థన వినియును వినన ట్లూరకుండి రామకృష్ణుఁడు రాత్రివేళ జనులందఱును నిండ్లకుఁ బోయినతఱి నావేశ్యయరుఁగుపైకి వచ్చి ప్రవేశించెను. మఱునాఁ డతఁడు తనయరుఁగుపైకి వచ్చి యుండుటఁ జూచి "గాలి విశేషముగ వీఁచుచున్నది గావున స్వాములు లోపలిసావిడిలోనికి వచ్చి కూర్చుండిన విచ్చుగ నుండును. తాను సర్వకాలములలోఁ బరిచర్య చేయుట కనువై యుండును. కావున నట్లుగా ననుగ్రహింపుఁ" డని మఱియొకసారి ప్రార్థించెను. దానికి నుత్తర మేమియుం" జెప్పక యారాత్రి తొల్లింటి యట్లనే యంతఃప్రవేశము చేసెను. కాని యీరెండుదినంబులును బైరాగి మాటలాడుట మాని మౌనవ్రతస్థునివలెనే చేతిసంజ్ఞలనే కాలము గడపుచువచ్చెను. మూఁడవనాఁ డెవ్వరును తనచుట్టు లేని సమయమున నాలుగైదువరహాలం దీసి వేశ్యమాత చేతి కిచ్చి తనకుఁ గావలసినయొక సేరుపాలును, పంచదారయును, కర్పూరము మొదలగుపూజాద్రవ్యంబులును తెచ్చి యిమ్మని పల్కెను. అట్లుగా నైనను తనతో మాటాడుట గొప్పభాగ్య మని సంతోషించి వేశ్యమాత కావలసినవస్తువులం దెప్పించి యిచ్చెను. రామకృష్ణుండు మరల రెండవనాఁడు మఱినాల్గువరాల నిచ్చి తొల్లింటిదినమువలెనే పాలును, పంచదార మొదలగువస్తువులం దెమ్మని చెప్పెను. "పాలునకును పంచదారకును నిత్యమును నాలుగేసివరహాల నిచ్చుబైరాగి యొకగొప్పమహానుభావుఁడు గాకయుండునా" అని యావేశ్యమాత యతనికడ నెద్దియో స్వర్ణయోగ ముండక తప్పదు. దాని నొకదానిని పరిగ్రహించిన నిఁక నెన్నఁటికిని ధనలోప ముండ దని నిశ్చయించుకొని తనకూఁతుం బిల్చి "మన మెటులనైన నతనియుల్లము రంజిల్లంజేసి యాదివ్యక్రియ సంపాదింపవలయు" నని చెప్పి దానిని సమ్మతింపంజేసి నాఁటినుండి స్వాములవారిపరిచర్యకు

దానినే యప్పగించెను. ఆహారనారియును దననేర్పు బైరాగికిం దోఁపించుకోర్కెతో ననేకచమత్కారంబులు చేయుచు నాబైరాగికిఁ బరిచర్య సేయ నారంభించినది. బైరాగియును మొదటఁ దాను స్త్రీలతోఁ బ్రసంగము నైనం జేయ నని తెల్పియుఁ గ్రమక్రమంబుగ నాసుందరాంగితోఁ దల యెత్తక యే మాటలాడుచు, నది దరిఁ జేర వచ్చినపుడు వలదు వల దని తత్తరముతో నివారించుచు, నది దరిని వచ్చి కూర్చున్న వ్రతము వ్రత మని కేక వేయుచు నిటుల యథార్థముగ విరాగివలెనే యభినయించుచుండెను. ఇట్లుండ మఱికొన్ని దినంబులు జరిగెను. క్రమముగ నొకనాఁటికంటె నొకనాఁటికి వేశ్యకుఁ జనవు చిక్కుచు గావున నది యతని కృష్ణాజినముమీఁదనే కూర్చుండుటయును, అతనికి ఫలాహారమును స్వయముగ నోటి కందిచ్చుటయును, అతఁ డటునిటుఁ బోయినపు డతని జపమాలయు, గోముఖియుఁ దానే ధరియించి యాతని యాసనంబుననే నిద్రఁబోవుచున్నట్లుగాఁ బడియుంటయు జరుగుచుండెను. ఎన్ని యున్న నాతఁ డింద్రియనిగ్రహము గలవాఁడుగాఁ గాన్పించుటం జేసి తుద కతనికి స్వర్ణయోగమనోరథముం దెల్పి యతనిమనోరథంబు పడయుఁ డని ప్రార్థించెను. అపుడు యోగి సుముఖుండు గాఁగ నతనివిభూత్యుద్ధూళనావృతవికృతాకారముం జూచి కన్నులు మూసికొని రెండవప్రక్కకుం దిరిగి పండియుండె. అపుడు కపటయోగి యగు రామకృష్ణుం డాభోగినీపతివ్రతకు స్వస్వరూపప్రకటనముం జేయుట కదియ తఱి యని నిశ్చయించి యిట్లనియె :—

"మ. వరబింబాధరమున్ పయోరుహములున్ వక్రాలకంబుల్ మనో
హరలోలాక్షులు చూప కవ్వలిమొగం బైనంత నేమాయె? నీ
గురుభాస్వజ్జఘనంబు క్రొమ్ముడియు మాకుం జాలవే గంగ క
ద్దరి మే మిద్దరి కీడునం గలదె యుష్మద్రాజబింబాననా."

అని యిట్లు చదివినపద్యంబు విని యాజవరా లతఁడు రామకృష్ణుఁడు గా నిశ్చయించి మోసమాయెఁ గదా యని యెంచి కుప్పించి యొక్కదాఁటున నింటిలోఁ బడి తల్లిం బిల్చి రామకృష్ణుఁడు భంగపఱిచె

నని తెల్పెను. ఇంతలో రామకృష్ణుఁడును గృష్ణాజినదండకమండలువు లచ్చటనే వదిలి వడివడి నిలు సేరి సూర్యోదయంబుననే రాజాస్థానంబు నకుం బోయి

“గంగ కద్దరి మే లిద్దరి కీరునుం గలదె యుద్యద్రాజబింబాననా”

అనుసమస్య పూర్తిచేయింపుఁ డని రాజుతో విన్నవించెను. దానికి నాస్థానములోనివిద్వాంసు లందఱును రామకృష్ణునిసమస్య లతఁడే పూర్తిచేయవలెనుగాని మాచేతఁ గా దనిరి. అపుడు రామకృష్ణుఁడే దానిం బూర్తిచేయునట్లుగా నిశ్చయించి రాజాతనిచే పూర్తి చేయు మనఁగాఁ బద్యముయొక్క పూర్వభాగ మందలి పాదత్రయమును జదివెను. ఆ పద్యముయొక్క రమణీయత కందఱును సంతసించి “యిది యేగ్రంథములోనిది, యేసందర్భములోనిది” అని యడిగిరి. అపుడు రామలింగ మాపద్యము “స్వర్ణయోగచింతామణిలోని వ్యాఘ్రాజినశయ్యాసందర్భములో యోగిభోగినీసంవాదపద్య” మని పల్కెను. దానికి రా జెంతయు నాశ్చర్యంబునంది “పైకథ యింకను విస్పష్టపఱుపుఁ” డని యడిగెను. అపుడు రామకృష్ణుఁ డొకదేశములో నొక రాజు గలఁ డనియును, అతని కొక వెలయాలుండె ననియు, అది తన పాతివ్రత్యముంగూర్చి రాజును నమ్మింపఁగా నొకయోగి దానిపాతివ్రత్యమును గనిపెట్టుటకు స్వర్ణయోగోపదేశమిషంబున దానియింటికిం బోయి పీఠము పెట్టఁగాఁ దద్యోగసంపాదనార్థమై యాభోగినియు యోగిని గాఁ దలంచి, వ్యాఘ్రాజినశయ్యం బవ్వళించి యుండియు నాయోగి వికృతాకారంబునకు నోడి యవ్వలిమొగమై పరుండుడు నపు డాయోగి తనభోగినిం జూచి తెల్పినపద్య మని చెప్పెను. దాని నంతయు విని రాజును నదియంతయుఁ దనసానివృత్తాంతమే యని యూహించికొని “సెబాసు! యోగిని మెచ్చవచ్చును,” అని పల్కెను. “యోగియు నంత మాత్రమునే కోరియుండెను. చిత్రము” అని రామకృష్ణుఁ డుత్తర మిచ్చి కూర్చుండెను.

## పాతివ్రత్యప్రదర్శినీ తిరస్కారము.

ఒకానొకసమయంబున నొకకవి స్త్రీలకుఁ బాతివ్రత్యవిశేషములం దెల్పు "పాతివ్రత్యప్రదర్శిని" అను నొక గ్రంథమును రచియించి తెచ్చి రాయలసభలో సమర్పించెను. ఇట్లు సమర్పించుటయే కాక తా ననేకగ్రంథములు శోధించి వానిలోనిసారము నంతయు సంగ్రహించి నిర్దుష్టముగాఁ జేసి తా నాగ్రంథము రచియించితి ననియు నది తేటతెల్లముమాటలలో నుండు ననియు నాత్మస్తుతిగాఁ గొన్నిమాటలు ప్రస్తావించెను. అట్టిప్రస్తావనకు రామకృష్ణుఁడు కొంచెము కోపించి లేచి నిలువంబడి యోయీ! నీ మనస్సునకు నిశ్చయముగ దోషరహితముగాఁ గానుపించుపద్యము నొకదానిం జదువు మని యడిగెను. దానికి లెస్స యని యాకవి యీక్రిందిపద్యము చదువ నారంభించెను. ఎట్లన్నను;—

"సీ. పతికి మాఱాడక పలుమఱు సేద్యక, యలియక మిగుల గయ్యాళి గాక."

అనుడు రామకృష్ణుం డీకఁ జాలుఁ జాలును. పైచరణములు చదువ నక్కఱలేదు గ్రంథ మంతయు నీలాగుననే యుండును. అనుడు రాయలు అట్లైన నీయభిప్రాయానుసారముగ నాచరణమున కేమియర్థము చెప్పెదవో చెప్పు మనుడు రామకృష్ణుం డిట్లనియె. అర్థమునకేమి? అందఱికును స్పష్టమైనయర్థమే. ఇది విన్నంతమాత్రమున నీకనే యాఁడుదియును మగనికి నాజ్ఞావర్తిని గాకుండుటయే కాక వంటగూడఁ జేసిపెట్టు మని యాజ్ఞాపించును. ఇఁక మాబోంట్లకు నాబాధకూడఁ దటస్థింపక మానదు. అయినను పద్యము వినినయంతనే నాకుం దోఁచినయర్థము విశదీకరించెదను, చిత్తగింపుఁ డని యిట్లనియె.

ఆఁడుదానికిఁ జెప్పవలసినబుద్ధులలో మొదటిది భర్త పిలిచినయపుడు మాటాడకుండుట. రెండవది పలుమాఱు సేద్యఁగూడ దనుట. (అనఁగా నింటిలోఁ బనిపాటులు చక్కఁగాఁ జేసికొనినపిమ్మట నాల్గుసారులో యయిదుసారులో నియతముగా నిత్యమును సేదుకవలసినదనుట.) మూఁడవది ఎట్టియవసరమైనపని యున్నను శరీర మలియక యుండునంతవఱకే పని చేయవలెను గాని ప్రాణావసరము వచ్చినను

శరీరము నలియఁబెట్టకుండుట. ఇఁక నాల్గవనీతి యెట్లనఁగా;— మిగుల గయ్యాళి గాక యుండుట. అనఁగాఁ గొంతవఱకైనను గయ్యాళి గానిచో నాఁడుది కాఁపురము చేయఁజాలదు గనుక నామట్టుకు గయ్యాళిగా నుండవలయు ననియు నంత కధికముగా గయ్యాళి కాఁగూడ దనియు దీనియర్థము. అనురామకృష్ణునిపల్కులకు సభ్యులు రాజును విశేషధ్వనితో నవ్వందొడంగిరి. గ్రంథకర్త డగ్గుత్తిక దోఁప మూఁదరిచరణముం జదువలేకయుఁ జదివిన నిఁక నది యెట్లుగా నుపన్యసింపఁబడునో? అనుభీతిచేత నోరు మెదపక యూరకుండెను. రాయఁడును గ్రంథకర్తయొక్క యట్టిని శ్చేష్టితవ్యాపారములఁ జూచి సదయుండై "రామకృష్ణుని పూర్వపక్షము లట్లే యుండును గావున సందియుఁబు వలదు. గ్రంథము మాకందఱకు నాదరణపాత్రము కాకపోదు" అనిపల్కి తద్గ్రంథకర్తకుఁ దగుబహుమానంబు లొనర్చి సాగంబనిచెను.

## పంచతంత్రిపద్యకావ్యవిషయము.

కృష్ణరాయని బావమఱఁది యగు "బైసరాజు వెంగళరాజు" అను నతఁ డొకగొప్పయాంధ్రకవి. ఇతఁడు పంచతంత్రిని బద్యకావ్యముగా నొనరించినవారిలో నొకఁడు, తనగ్రంథము సంపూర్తియయినతోడనే వెంగళరాజు దానిని రాయలసభలోనిపండితులకు వినిపింపఁగోరి రాయనికిం దెల్పిన మంచిది యని పల్కెను. ఇట్లనుజ్ఞాతుండై పైకవి తనశపథములుగా గ్రంథపఠనమునకు ముందుగఁ గొన్నిమాటలఁ దెల్పెను. అందు మొదటిది తనకవిత్వమం దెవ్వరైనం దప్పు పట్టినచోఁ దన నాలుకం గోసికొనుట. రెండవది. తప్పులేకుండఁ దనగ్రంథములోఁ దప్పున్నట్లుగా నెవ్వరైనఁ జెప్పిరేని యట్లక్రమముగాఁ జెప్పినవారినాలుకం గోయుట. అనునిట్టిదుర్ధూర్తనృపబంధుశపథంబులు విని కోపించి రామకృష్ణుండు లేచి

"ఈరాచకవిత్వబాధ పడరాదు గదా యెటువంటివారికిన్"

అని చెప్పి సభ వదలి వచ్చెను అతనివెంబడినే తక్కినపండితులును లేచి నిలువంబడిరి. అట్టిపండితులయుద్దేశముల నారసి రాయఁడా గ్రంథమును మఱియొకతఱి వినుపింపవచ్చు నని గ్రంథకర్తకుం దెల్పి యానాఁటికి సభ చాలించెను.

## వాకిలికావలి తిమ్మన్నపైని జెప్పిన పద్యశేషము

ఒకానొకదినంబున రాయలు తనవాకిలికావలిగా నున్నతిమ్మన్న యనునొకదండనాయకునియెడల నతనిశౌర్యవిశేషమునకుగా సంతసించి యతని కొక విలువ గలపట్టుపచ్చడమును (సేలును) బహుమానమిచ్చెను. అట్టిబహుమానము నాతఁ డంది తనయింటికివచ్చి వీథియరుఁగు పయిఁ గూర్చుండెను. అంతట నావీథినే, అల్లసాని పెద్దన్న, ముక్కుతిమ్మన్న, భట్టుమూర్తి, రామకృష్ణుఁడును బోవుచుండి రాయనికడ బహుమానము నంది వచ్చియున్నతిమ్మనదండనాయకునిఁ జూచి తమ సంతోషముంగూడ నాతనికిం దెలుపుకొనుటకై యతనికడఁ గొంతసేపు కూర్చుండి యతనిని మాటలతో నలరించిరి. అపుడు వారిలోఁ బెద్దన యొకపద్యముఁ జెప్పె నుతలంపున :—

క. వాటికి కావలితిమ్మా

అనుడు - ముక్కుతిమ్మన్న లేచి

ప్రాకటముగ సుకవివరులపాలిటిసామ్మా

అనుడు, భట్టుమూర్తి లేచి

నీ కీపచ్చడము కొమ్మా

అనెను. అంత రామకృష్ణుఁడు లేచి:—

"నా కాపచ్చడమె చాలు నయముగ నిమ్మా"

అని పూర్తిచేసెను. తిమ్మనదండనాయకుఁ డాపద్యమున కెంతయు నలరి యందలితుదిభాగములో భావప్రకటన చేసిఁ రామకృష్ణునకుఁ దాను బహుమానముగ నందివచ్చినపచ్చడ మిచ్చి తక్కినవారికి మఱికొన్ని బహుమానముల నిచ్చి పంపెను.

ఇట్లింకను రామకృష్ణునివిశేషములం దెల్పుగాథలు పెక్కులు చెప్పంబడును. ప్రస్తుతము నాకు లభ్యమైనవానిలో రసికులు మెచ్చఁదగినట్టియు, పండితులకు శ్రవణయోగ్యము లగునట్టియు, నీరసములు కానట్టియుఁ గొన్నిగాథల వివరించితిని. తెనాలిరామకృష్ణునికథ లను నామముతో నొప్పునవి పామరజనమనోరంజకములుమాత్రమే గానవాని నిందుఁ జేర్పక రామకృష్ణుఁడు కేవలము పండితుఁడుగా నుండిపండితులతోఁ జేసినసంవాదవిశేషములనే చేర్చి వక్కాణించుట యయినది.

## రామకృష్ణునిచాటుధారాపద్యములు.

ఈ రామకృష్ణుఁడు పదగుంభనకవిత్వంబునకు మిగులఁ బ్రసిద్ధుఁడు కావున నీతఁడు పాండురంగవిభునిపదగుంభన మని తొంటిపద్యంబున వాక్రుచ్చెను. దానికిఁ దార్కాణంబుగ నీక్రిందఁ గొన్నిపద్యంబుల వివరింతము.

గీ. అతివకచనాభిజఘనదేహోన్నతము లు, మీనదరసాలతారాజపానిరాక
రణ మనంత మనాది నేత్రగళభుజన, ఖోష్ఠకుచవచోదంత ముభయగతిని.

ఈచిన్నిపద్యంబున నొకస్త్రీయవయవంబులవర్ణన మంతయు నిమిడ్చె.

మఱికొన్నిపద్యంబుల వివరింతము.

"సీ. భుజగలోకాధీశభోగితల్పశయాన, హరిరూపధరమహాపురుష యనుచు
నతులాబ్జముకుటవర్ణితపాదరాజీవ, రామార్చనీయశ్రీరంగ యనుచు
మారీచమదభంగమహితవాయవ్యాస్త్ర, శరదనిద్రితనేత్రజలజ యనుచు
సముద్రగర్వగ్రావసరయోగనిద్రాణ, కరిరాజవరద శ్రీకాంత యనుచుఁ
గీ. దలఁకు నులుకు నలంకు బెగ్గిలుచుఁ బలుకు, సఖులనయనస్వనశిరోజచరణకలన
పవనకందర్పఘనహంసజవనతురగ, ఘటనటప్రియసముదాయపటిమ దోఁప.

క. విధుకృతకదనము వదనము, మధుకరనికరముల గేరు మగువచికురముల్,
విధుమధుకరలీలాజయ, మధురోక్తులు పిక్క లౌర మధురాధరకున్.

సీ. ద్విరదంబు నడతోడ సరి రాక ముఖభంగ, దశ నొంది నవ్వుతోఁ దనరఁ జూచె
గగనంబు నడుముతోఁ బగఁ జెంది మధ్యమాంతము నొంది వేణితో సమతఁ బూనె
పారసంబంధిత్రితో సరి రాక సావర్ణ్య, గతి మాని మోవితోఁ గదియఁ జూచెఁ
గనకారి కటితోడ నెన మాని నారివే, షముఁ బూని మేనితో సరిగఁ జూచెఁ
గీ. దిరిగి సతికంఠకుచబాహుసరసనాసి, కలకు భయ మంది మొఱపెట్టి గతులు మాని
యొరగి ధరఁ గూల వత్తులై యొకట రెంట, మూఁట నాల్గింటితో సరి మొనయవయ్యె.

గీ. అధఃముఖవర్ణశూన్యంబు లతివకుచము, లాననాకారరహిత మబ్జాక్షిమేను
అజజఘనమండలము లంచయానకురులు, చరమఖాదిశకరములు చానతొడలు.

చ. సతికుచవాక్సమత్వ మరిజాతసుధ ల్గొనఁ బూని వాదులై
హతులయి పారిజాతవసుధాకృతు లూని యయు ద్విజ్ఞితంబని
ద్విజరుచి గాంచియుం దుది నరిత్వముఁ జెందినచంద్రసేవధి
స్థితిని ముఖాంగము ల్గలిచె నీ తగ దిన్నిట నొంటి నోడినన్.

గీ. పల్లవం బూని నకియమే నెల్లఁ జేసి, పద్మగర్భుండు లాఁ దీసి వాగుడిచ్చి
బూఁకసక్తించి తప్పు దప్పు వుఁబోఁడి, డెంద మొనరించె సందేహ మొంద నేల."

ఇంకను ననేకపద్యంబు లున్నయవి. ఇవి యన్నియుఁ బాండురంగవిజయంబులోని వని యందురు. పాండురంగవిజయమునకుఁ గథానాయకుఁ దనపేరిటివానినే నిర్మింపం దలంచి తననామాంతర మైనపాండురంగఁ డనుపే రిడెనఁట! చాటుధార సీతఁ డనేకపద్యంబులు సెప్పియుండెను :—

## దశావతారపద్యములు.

విష్ణునిదశావతారంబులఁ బద్యదశకంబున వర్ణించె. దానిం జూచిన సీతనిసంస్కృతసాహితిపటిమయు సమాసకల్పనలోనిప్రజ్ఞయుఁ గాన్పించును కావున వాని నీక్రింద వివరింతము :—

శా. సాధీశౌఘామఖపూరతోద్యమితతాసత్తోశ్చ్యగోదస్వద
గ్లోధారాంతరటత్తిమింగిలగిల ప్రోద్ధాన నిధ్యానల
బాధీశప్రభుతాస్వభాగహరణాద్ధాయాయినాథానుజ
పారీధాన్యాతివిలోలవాగ్దరికటబ్రహ్మన్ స్తుమ స్త్వాం వయమ్. ౧

శా. దూర్యత్తుంభద్గిరికల్పితావతరణద్యోదాహినీసంగమో
పాత్తేందూదయనిష్ఠితత్త్వాంజలధిపారీరబ్ధపుత్త్రోత్సవో
దాత్తక్ష్వాక్త్తగజాశ్వవన్యకనకశ్యాగోమణీదానసం
పత్తిప్రీణితదేవధుర్యధిపతిబ్రహ్మన్ స్తుమ స్త్వాం వయమ్. ౨

శా. అద్యాలోకనభక్తి శంభరీమదనేమాఃపూరువత్యక్తస
త్త్వాద్యాంభస్తులసీధరీమప్రదఖురప్రక్షాళనామాత్రిజా
క్రోద్యోగాంబుధిదంష్ట్రికాగ్రరిపుహ్వాత్కలామివపారీ ఋషుం
భద్యాదోనిధిసత్తకీర్తిలికిటిబ్రహ్మన్ స్తుమ స్త్వాం వయమ్. 3

శా. డింభదోర్హిహిరణ్యకోత్కటోత్కటీమణదుష్టికిష్టతారోమకూ
పాంభోజప్రభవాండభాండదళనోద్యద్ధ్వానధీకృత్సభా
స్తంభాంతస్ఫుటనస్ఫురత్స్వర వెళధ్వన్యస్త నిశ్చేష్టని
ర్దంభోద్యోగదితావశాపన్నహరిబ్రహ్మన్ స్తుమ స్త్వాం వయమ్. ౪

శా. స్వతలస్వచ్ఛతరాయణత్వరచితస్వస్త్రీపరేడ్భారింతివా
కృతికాలత్వదశానుకారిగళగాద్గద్యత్రుమాంభోజభూ

నుతిహాసన్నఖరప్రసారితపదాఙ్ఘ్రిరుద్ధగంగాసవా
ప్రతిమాళీశకపర్దమండలవటుబ్రహ్మాఙ్ఞ స్తుమ స్తావ మనుః. ౫

శా. ఆజిప్రౌఢిమదుర్జయార్జునగళోదగ్రిస్పృగాస్వాదన
వ్యాజాపోశనభాక్తదస్వపహృతిప్రాణాహుతిప్రస్ఫుర
ద్రాజాళీనిఘసాంవసానఘసప్రాయేందుఫేలాయితా
భ్రాజాధ్యక్షకుశాగధారిభృగురాడ్బ్రహ్మాఙ్ఞ స్తుమ స్తావ మనుః. ౬

శా. చాపచ్ఛత్రనిషంగభంగకుపితక్ష్మాభృద్ధనుఃపంచవ
క్త్రీపంచాళికదృష్టిదోష్కృహుతభుగ్గ్రీవాద్వయీపంచక
వ్యాపారభ్రమకారిపంక్తిగళగళ్యాఖండనాఖండదో
ర్దైన్యపుణ్యప్రదరాఘురాఘవపరబ్రహ్మాఙ్ఞ స్తుమ స్తావ మనుః. ౭

మ. కఠిపూరుద్ధరశోర్థలాంగలవిభగ్నక్ష్మాభరాదక్షుది
క్కరిపాదప్రహారస్ఫుటత్స్ఫటిపభోగవ్యాపృతగ్రీవనూ
కరపీఠీకృతిపృష్ఠతాహితమహాగాఢాధికూర్మాధిరా
ట్పరిక్షిప్త ప్రళయాంబుగాహనహలిబ్రహ్మాఙ్ఞ స్తుమ స్తావ మనుః. ౮

మ. అతిదోఃపీడనకర్కరీఫలితకంఠాధత్వదుగ్ధర్త్వధూ
ర్తతృణావర్తదృఢాంగపాతహితగోత్రీభర్తృకోత్పాదిత
క్రతుభుగ్గ్రీహాణాగ్రహోన్ముఖళతాదిత్యస్తమైనాకని
ష్ప్రతనభ్రాంతిగనందగోపకసుతబ్రహ్మాఙ్ఞ స్తుమ స్తావ మనుః. ౯

మ. స్వమహాబాహుకృపాణకృత్తగళతుచ్ఛమ్లేచ్ఛవీరస్ఫుటో
త్కరీమణాపాదితపద్మినీరమణమధ్యచ్ఛిద్రఖళ్యామికా
గమనానాసమయోపరాగముదితక్ష్మాసారగంగానదీ
భ్రమకృత్కీర్తిక కల్కిమూర్తిక పరబ్రహ్మాఙ్ఞ స్తుమ స్తావ మనుః. ౧౦

ఈ పద్యంబులలో నేకసమాసము లుండుటయు అను నను తెనుఁగుపద ముండుటయుఁ జిత్రము.

## రామకృష్ణునిచాటువు లని వాడుక గలపద్యములు.

చ. దర, భుజగేశ, సింహములు, తద్గళ, వేణ్య, వలోకనద్వయో
దరముల క్రోడి, వారిధిపదంబులఁ బుట్టలఁ బూరులం, గుహాం
తరముల పూన నిక్కు, తిన, డాఁగ, స్రవింప, నిటూర్చు బార్చ స
త్వరముగ నేఁగి నీడ గని తత్తర మందఁగఁ జేసి తా చెలీ. ౧

శా. శైవాలంబును సైకతంబు లెదురై, చంద్ర, ప్రవాళాం, బుజ
గ్రీవా, కాశ, భుజంగ, కూపములు దూరంబైన నే తత్పరీ

త్వావిద్యావిభవంబొనర్పఁగ దళాబ్జజ్యోత్స్నలో నర్ధచం
ద్రావిర్భావముఁ జూపినం గలిసెఁ దా నాత్మేశు భావజ్ఞయై. ౨

చ. సరసిజనేత్ర! నీవిభునిచక్కనిపేరు వచింపు మన్న న
ప్పరమపతివ్రతామణియు భావమునన్ ఘన మైనసిగ్గునన్
గరియును, రక్కసుండు, హరుకార్ముకమున్, శర, మద్దమున్ శుకం
బరువగువానిలోనినడిమక్కరమున్ గణుతింపఁ జేరెనన్. 3

సీ. శరదంబు వేణికి శాంతభావము నందె, దరహాస మహరి వెంటనె యమర్చె
మతి క్రొత్త మెదిరింపఁ దిరిగి సమం బయ్యెఁ బిరుదాదినుంచి పైఁ దరలఁద్రిప్పె
నునుపెక్కు కలిగించి మెనమార్చె నంతట, జంఘలు ముఖభంగ సరణి మించె
పెందొడ సిరితక్కు పొందక సవరించె, కరములు వెనుకముం దరుగఁ జేసె.

గీ. తనురుచిస్ఫూర్తి సానుబంధత యొనర్చె, గతివిసర మెంచె నంతరంగములు గలఁగ
నవరసప్రాప్తి యొనఁగూర్చె నాఁడునాఁటి, కలరుచన్గుత్తు లీకొమ్మ కలదుఁ జుమ్మ.

సీ. ఘనకేశ యని నీవు చెనకరాదు సమీర, భుజగరోమాళి యీపువ్వుఁబోఁడి
మీనాక్షి యనినచో మీరదు శోకంబ, చంద్రికాహాస యీచంద్రవదన
బింబోష్ఠి యనినచో బెదరింపదు శుకంబ, సాంకవామోద యీసన్నుతాంగి
కంజాస్య యనినచోఁ గలహించదు మృగాంక, స్వర్భానువేణి యీజలజపాణి.

గీ. శ్వాస, వక్షోజ, వచనా, స్యబాంధవముల, బంధువులు గాన మీకుఁ జెప్పంగవలసె
నిట్లు వినకున్నఁ బరువులు నిడుట, యొగిర్చి పసుట పసరుపు కందుట ఫలము సుమ్మి.

క. తారకములఁ గోరకముల, వారకముల కెల్ల నెల్ల వారకము లిడున్
శ్రీరమణీహారమణీ, భారమణీయత్వదీయ పదనఖరంబుల్. ౬

గీ. తామర బిడారు కొమ్మకెమ్మోమునకును, సారచంద్రచంద్రస్ఫూర్తి సాటి యగునె
నాతితలమిన్న చెక్కిలివాతెరకును, సారచంద్రచంద్ర స్ఫూర్తి సాటి యగునె. ౭

సీ. చక్రస్తని యటంచు జగడించకు శశాంక, గురుతమోవేణి యీసుందరరదన
మధురాధర యటంచు మట్టుమీఱకు తేఁటి, చంపకనాస యీజలజవదన
బిసబాహ యని మాఱు మసలకు రాయంచ, జలధరచికుర యీ కలువకంటి
పల్లవకర యని త్రుళ్లకు కోయిల, శ్రీరామమూర్తి యీకీరవాణి

గీ. వదన కుంతల, యాన, సుస్వరసఖిత్వ
మెనపి యుండినకతన మీ కిత వొనర్చు
నమచు నళి, చంద్ర, పగభృత, హంసములకు
ధయము, నయమును దెలియంగఁ బలికె మఱియు. ౮

చ. వనలక హ్రాయము వాంఘ్రిక వివాహపదస్థిత హేమనూపురం
బుదితమురాళికంఠవినవోద్ధతి నేమనిపల్కఁ? బల్కఁగా

ముదిసినకాలమందునను ముంచటియట్లుగ భాగ్యరేఖ నీ
నుదుటను లేదు లే దనుచు నొచ్చిన మెచ్చిన భూవరుం డిలన్. ౯

మ. సతతోత్సర్జనవార్ధనీసముదితస్వర్ణాద్రిరాట్కర్ణికా
భరితశ్రేందిందిరడింభగుంభితయశోభాసిజచ్ఛితాంభోరుహా
తతవిస్ఫూర్తికరోరుదోఃప్రథిమసత్రాప్రాగావజాగ్రన్నిజా
ద్భుతతేజోనవహేళిసంవరణభూభృన్మౌళి యొప్పెన్ భువిన్. ౧౦

మ. బలవద్దర్పకళ స్త్రికానిహతి సైప న్లేక యవ్వేళ న
య్యలినీలాలక యంబరాంతపరిణీతాత్మీయభిన్నాననో
త్పలినీబాంధవు యాచు నేడ్చెఁ గడు భూపాలైకరాగంబునన్
గలకంఠీ, కలకంఠ, కంఠ, నినదైక్యస్ఫూర్తి శోభిల్లఁగన్. ౧౧

గీ. ఓయి కురురాజ! నీకొడు కుత్తగోల, కొండవలె నుండు విను మాల ముండ దింక
ఖండనంబునఁ గెల్పింతుఁ బాండుసుతుల,నురమునను బూలదండ రే కొత్తపండ. ౧౨

క. జలచరము మిడుత మ్రింగెను, జలచరమును మ్రింగె మిడుత జగతీస్థలిలో
వలరాజు రాజు మ్రింగెను, వలరాజును రాజు మ్రింగ వచ్చినఁ బడియెన్. ౧౩

ఉ. అక్షరపక్షపాతమున నక్షము నాళ్ళ నొసంగ నుబ్బుచున్
భిక్షుజటాధరాదిమలు భిన్ననిజవ్రతు లౌదు రైన దు
ర్భిక్షరుజాళికుచ్చ్యుతులు పెక్కగుభక్తియ చాలు దానవా
తక్షుభితత్వమే యఘము దార్పఁడు శంక దొఱంగు మీరెడన్. ౧౪

చ. అలఘునచంద్రబింబనిభ మై తగుకాంత మొగంబు, దానిలోఁ
గలిగినయర్థభేదములఁ గైకొని చెప్పఁగ నొప్పుకొప్పు, చె
క్కులు రదనాంశుకంబు నవి గుబ్బలనన్ సరిరాక పోయెఁ జే
తులు సరి యయ్యె దానిగతి దోఁచెను బొంకపుటూరు దానికిన్. ౧౫

ఉ. ఆనలినాక్షి వేసలికి నంబుధరంబు సమంబు గామిచే
దా నిరువ్రయ్యలై చనినఁ దద్దశఁ జూచి దయార్ద్రులై బుధుల్
దానిపదాంతరంబునను దారు వసించినవారు గావునన్
బూని తదంశమున్ సమతఁ బోల్చిరి తత్సతిదృక్కుచంబులన్. ౧౬

పైపద్యములలో నన్నియుఁగాని కొన్నిగాని రామకృష్ణుని వని నిస్సంశయముగఁ జెప్పంజాలము. కావనియు నిర్ధారణ జేయ వలనుపడదు.

శ్రీ ర స్తు.

# క వి జీ వి త ము లు.

ఆంధ్రపంచకావ్యకవులచరిత్రము.

## 13.

## శ్రీ నా థుఁ డు.

ఈకవిరచితములగు గ్రంథములు పెక్కులు గలవు. అందు శృంగారనైషధమును భీమఖండ, కాశీఖండములును, కావ్యపాకమున నొప్పియుండును. అందు రెంటిని రెండుకావ్యములుగాఁ బరిగణియింపఁబడును. మఱికొందఱవలన శృంగారనైషధ, కాశీఖండములుమాత్రమే కావ్యములుగా లెక్కింపఁబడును. ఈ రెండవపక్షమునే యవలంబించి దీని నిపుడు వ్రాయుచున్నాను.

శ్రీనాథుఁడు భారద్వాజసగోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు, నియోగిబ్రాహ్మణుఁడు కమలనాభకవిపుత్త్రుఁడగుమారయమంత్రి కీకవి కుమారుఁడు. తల్లిపేరు భీమాంబ. ఇతఁడును నొకసుప్రసిద్ధాంధ్రకవి. భారతకవిత్రయమువారియందు మనయాంధ్రపండితుల కెట్టి గౌరవము గలదో యీ శ్రీనాథునియెడల నట్టి గౌరవమే వారికిఁ గలదు. ఇతఁడు పండితాదరణీయ మగుకావ్యములం జెప్పుటయే కాక స్త్రీశూద్రాదుల కుపయుక్తము లై సులభశైలితో నొప్పు పాటలు పద్యములు రచియించెను. మనదేశములోఁ బెండ్లిపాటలు, మొదలగునవియు, గొల్లలు మొదలగుపాటకపుజాతి పాడుకొను గొల్లసుద్దులు మొదలగునవియును, పగటివేషగాండ్రు చెప్పెడుకొన్నికథాకలాపములును శ్రీనాథునిచే విరచితములే యని ప్రసిద్ధి గలదు.

శ్రీనాథకృతము లగునాంధ్రగ్రంథములలోఁ గాశీఖండము పురాణములలో మిక్కిలి కఠినమై "కాశీఖండ మయఃపిండ" మ్మని విఖ్యాతి గనిన గ్రంథమునకుఁ దెలుఁగు. నైషధము సంస్కృతకావ్యములలో నారికేళపాకంబున నొప్పి "నైషధం విద్వదౌషధ" మ్మనువిఖ్యాతిం గాంచిన దై యుండుటు. ఇట్టిగ్రంథద్వయము నాంధ్రీకరించుటకుఁగాను శ్రీనాథునకుఁ బూర్వులగువా రెవ్వరును యత్నింపరైరి. అతనియనంతర కాలములోనివా రాయాగ్రంథములం జూచినపిమ్మటఁ దామట్టి ప్రయత్న మంతకంటె విశేషముగాఁ జేయులే మనుతలంపుశో నట్టియుద్యమమును వదలుకొనిరి. ఇట్లుగా నున్నగ్రంథముల రెంటిని నతిప్రాగల్భ్యముతో నీశ్రీనాథుఁడు తెనిఁగించెను. ఆగ్రంథము లాంధ్రీకరించిన విధమంతయును ముందుముందు వివరించెదను.

## శ్రీనాథకృతగ్రంథములవివరము.

శ్రీనాథుఁడు తాను రచియించిన గ్రంథములలో నావఱకుఁ జేసిన వానిలో ముఖ్యము లగువానిని నైషధములోపలను, భీమఖండములోపలను, గాశీఖండములోపలను నీక్రిందివిధంబున వివరించె అందు నైషధములో:—

క. జగము నుతింపఁగ జెప్పితి, ప్రెగడయ్యకు నాయనుంగు పెద్దనకుఁ గృతుల్
నిగమార్థ సారసంగ్రహ, మగు నాయాచార్యచరిత మాదిగఁ బెక్కుల్.

భీమఖండములో మఱికొన్ని గ్రంథములు రచియించినట్లుగాఁ జెప్పె. ఎట్లన్నను:—

గీ. ఐనమరు చ్చరిత్రంబు నైషధంబు, సప్తశతి పండితారాధ్యచరిత మనఁగఁ
గావ్యములు పెక్కు చెప్పియుఁ గాంక్ష చనక, యెండియును గావ్య మొకటి గావింపఁదలఁచి.

కాశీఖండములో మఱికొన్ని గ్రంథములు రచియించినట్లు చెప్పియున్నది. అందుఁ బైగ్రంథములలోఁ బెక్కులు చేర్పఁబడినవి. ఎట్లన్నను.—

"సీ. చిన్నారిపొన్నారి చిఱుతకూఁకటినాఁడు, రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూఁగుమీసాలనూత్నయౌవనమున, శాలివాహనసప్తశతి నొడివితి

సంతరించితి నిండుజవ్వనంబునయందు, హర్ష నైషధకావ్య మాంధ్రభాష
బ్రౌఢనిర్భరవయఃపరిపాకమునఁ గొనియాడితి భీమనాయకునిమహిమ
గీ. బ్రాయ మెంతయు మిగులఁ గైప్రాలయుండఁ, గాశికాఖండ మనుమహాగ్రంథ మేను
దెనుఁగుజేసెదఁ గర్ణాటదేశకటక, పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి.

పైపద్యములు పర్యాలోచింపఁగా శ్రీనాథకృత గ్రంథములలో, ౧ నిగమార్థసారసంగ్రహము, ౨ మరుచ్చరిత్రము, ౩ నైషధము, ౪ శాలివాహనసప్తశతి, ౫ పండితారాధ్యచరితము, ౬ భీమఖండము, ౭ కాశీఖండము అనునవి. పైగ్రంథములలోఁ దన యతిబాల్యవయస్సులో మరుత్తరాట్చరిత్రమును, యౌవనప్రాదుర్భావసమయములో శాలివాహనసప్తశతియును, నిండుయౌవనకాలములో నైషధకావ్యమును, ప్రౌఢవయఃకాలములో భీమఖండమును, వార్ధకావస్థ సమీపించక యుండు సమయములోఁ గాశీఖండమును రచియించినట్లు చెప్పియుండె. కాశీఖండముతరువాత గ్రంథములు రచియించినట్లు కానరాదు. పల్నాటివీరచరిత్ర మొదలగునవి యున్నట్లు కలదు. దానికి గ్రంథదృష్టాంతములు లేవు.

ఇపు డీపైగ్రంథములలో శృంగారనైషధమును, భీమఖండ, కాశీఖండములుమాత్రమే నిలిచి దేశమందు వ్యాప్తములై యున్నవి. తక్కినవి నామావశిష్టము లైనవి. శ్రీనాథునివీథినాటక మను నొక్క గ్రంథభాగమును గొంత వ్యాపకములో నున్నది. అందలిపద్యము లప్పకవి మొదలగువారివలన లక్షణగ్రంథములలో నుదాహరింపఁ బడుచు వచ్చెను. శ్రీనాథునికథలుగా ననేకములు వుక్కిటిపురాణములు వాడుకొనంబడినను సాధ్యమగునంతవఱకు గ్రంథస్థము లగువానిని నగర్హణీయము లగువానినిమాత్రమే యచ్చో వివరించెదను.

## శ్రీనాథునియుపాసనావిషయము.

ఈశ్రీనాథుఁడు బ్రాహ్మీదత్తమగువరము కలవాఁడుగాను, ఈశ్వరార్చనాపరుండుగా నున్నట్లును, శృంగారనైషధములోఁ దత్కృతిపతి

యితని నుతియించిన ట్లొగ్రంథమువలనం గాన్పించును. దానింబట్టి యి తఁడును, తొల్లింటి కవులంబోలె శైవమంత్రోపాసకుఁడే యని చెప్ప నొప్పి యున్నది.' ఆపద్య మెట్లన్నను :—

" శా. బ్రాహ్మీదత్తవరప్రసాదుఁడ వురుప్రజ్ఞావిశేషోదయా
జిహ్మస్వాంతుఁడ వీశ్వరార్చనకళాశీలుండ వభ్యర్హిత
బ్రహ్మాండాదిమహాపురాణచయతాత్పర్యార్థనిర్ధారిత
బ్రహ్మజ్ఞానకళానిధానమవు నీభాగ్యంబు సామాన్యమే. "

ఈశ్రీనాథుఁ డీశ్వరార్చనకళాశీలుఁ డని యుండుటచేతను, ఆవ ఱకుం గలకవులందఱును శైవోపాసకులే యయి యుండుటచేతను నం తవఱకును రామానుజమతము వ్యాపించి యుండనట్లును శంకరాచార్య మతమే ప్రబలమై యుండినట్లును నూహింపనై యున్నది. అట్టివైష్ణవ మతము నవలంబించినకవులలో నల్లసానిపెద్దన ముఖ్యుఁడుగాఁ గాను పించును. అక్కడనుండి తఱచుగ నాంధ్రకవు లందఱును వైష్ణవమతా నుసారులై యున్నట్లుగా, తెనాలిరామకృష్ణుఁడును, అయ్యలరాజు రామభద్రకవియుచు, కవికర్ణరసాయనకవి యగునరసింహకవి మొద లగువారలకవితలంబట్టి యూహింపనై యున్నది.

ఈశ్రీనాథకవి తనగోత్రాదికము నొకపద్యమునం దెల్పెను. దాని నీచారిత్రారంభమున ముందే చెప్పి యుంటిమి ఇపు డాపద్యము నిక్రిం ద వివరించెదము. ఎట్లన్నను :—

" శా. భారద్వాజపవిత్రగోత్రుని శుభాపస్తంబసత్సూత్రు వి
ద్యారాజీవభవుండు మారయకుఁ బుణ్యాచార భీమాంబకున్
గారామైనతనూజు నన్ననఘు శ్రీనాథాఖ్యునిం బిల్చి స
త్కారం బొప్పఁగ గారవించి పలికెన్ గంభీరవాక్ప్రౌఢిమన్."

## ఇతరకవిప్రశంస.

ఈశ్రీనాథుఁడు రచియించిననైషధ, భీమఖండ, కాశీఖండము లనుగ్రంథత్రయము కావ్యత్రయముగను, శ్రీనాథుఁ డాంధ్రకాళిదాసుఁ డనియునుఁ జెప్పఁదగి యున్నది, కాళిదాసత్రయము సంస్కృతసాహితీ

ప్రారంభమందుఁ జదువుదురు. శ్రీనాథకావ్యత్రయము మాంధ్రసాహిత్యాభికిం గలయవధిని బఠియించెదరు. సంస్కృతమునంగూడఁ బంచ కావ్యములు చదివినపిమ్మటనే నైషధముం జదువుదురు గావున నాంధ్రమునందును నీనటిలో జెప్పంబడిన మనుచరిత్రము, పారిజాతాపహరణమును, పాండురంగ క్షేత్రమహాత్మ్యమును. భీమఖండమును, కాశీఖండమును జదివిన పిమ్మట నైన శ్రీనాథకృతిశృంగారనైషధముం జదువవచ్చును. లేదా భీమఖండము లభియింపనిచోఁ గాశీఖండము చదివియే శృంగారనైషధముం జదువవచ్చును. లేదా ప్రారంభమునందే కాళిదాసకృతము లగు కావ్యత్రయము నభ్యసించినట్లుగా నీశ్రీనాథుని కావ్యత్రయముం జదివి పిమ్మటనే మనుచరిత్రమును, పారిజాతాపహరణ, పాండురంగ క్షేత్రమాహాత్మ్యములను జదువవచ్చును. అది పాఠకులదార్ఢ్యముం బట్టియు నుపాధ్యాయుల ప్రాగల్భ్యముం బట్టియునుండును. కావున నాయుభయులు సమ్మతించినవానినే యవలంబింతురుగాక.

## శ్రీనాథకృతకవిస్తుతి.

ఈ శ్రీనాథుఁడు తాను రచియించినగ్రంథములలో భారతకవిత్రయము నన్నిచోట్లను, తనతాత యగుకమలనాభుని, వేములవాడభీమకవిని, కొన్నిచోట్లను నుతియించెను. దానివలనఁ నతని కాలమునకుఁ బైకవులే ప్రసిద్ధులై యున్నట్లుగా నెన్నందగియున్నారు.

ఆపద్యము లెవ్వి యనఁగా :— శృంగారనైషధములోనికవిత్రయనతి :—

"ధీరమతి నన్నపార్యునిఁ దిక్కయజ్వ, శంభుదాసునిఁ గర మస్థి సంస్మరింతు."

భీమఖండములో శ్రీనాథుఁడు ప్రత్యేకముగాఁ జేసిననన్నయభట్టువర్ణన మెట్లన్నను :—

క. సెట్టికొని కొలఁతు నన్నయ్య, భట్టోపాధ్యాయసార్వభౌముని గవితా
పట్టాభిషిక్తు భారత, ఘట్టోల్లంఘనపటిష్ఠ గాథప్రతిభున్.

ఇఁక తిక్కనసోమయాజింగూర్చి చెప్పినపద్యము :—

ఉ. పంచమవేద మై పరఁగు భారతసంహిత నాంధ్రభాష గా
వించెఁ బదేనుపర్వముల విశ్వజగద్ధితబుద్ధి నెవ్వఁ డ
క్కాంచనగర్భతుల్యున కఖండితభక్తి నమస్కరింతు ని
ర్వంచితకీర్తివైభవవిరాజికిఁ దిక్కనసోమయాజికిన్.

మఱియొకకవిం జేర్చి కాశీఖండములో నీపైముగ్గురు కవులను గృతిపతి తనకుఁగాను వర్ణించిన ట్లింకొకపద్యముం జెప్పెను. అం దధికముగాఁ జేర్పంబడినకవి వేములవాడభీమకవి. ఆపద్యమువలన నానల్గురు కవులపరిగణనలోనిముఖ్యతయును కవిత్వశయ్యాదులుంగూడఁ దెలియును గావున నాపద్యము నిట వివరించెదను. ఎట్లన్నను :—

“సీ. వచియింతు వేములవాడభీమనభంగి, నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టుమార్గంబున, నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాక్రుత్తు తిక్కయజ్వప్రకారము రసాభ్యుచితబంధముల నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధపరమేశ్వరునిత్రోవ, సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు.”

అని యిట్లు కృతిపతివాక్యంబుగా నొకపద్యము చెప్పెను. అందే శ్రీనాథుఁడు కవిత్రయమును వర్ణించి మఱియొకవర్ణనముం జెప్పెను. దానింబట్టి చూడ నీశ్రీనాథునకు భారతకవిత్రయమందే విశేషాదరమున్నట్లుమాత్రము కానుపించును ఆపద్య మెద్ది యనఁగా:—

“గీ. శబ్దశాసను నన్నపాచార్యవర్యు, సత్కవిశ్రేష్ఠుఁ దిక్కయజ్వను భజించి
సత్ప్రబంధమహేశ్వరు శంభుదాసు, నధికతరభక్తిసంయుక్తి నాదరించి”

ఇట్లుగా శ్రీనాథుఁడు ప్రాచీనాంధ్రకవుల నుతియించి యాగ్రంథములోపలనే తనతాత యగుకమలనాభకవి నీక్రిందివిధంబున వర్ణించెనది యెట్లన్నను :—

“గీ. మత్పితామహుఁ డగుపితామహునిఁ దలఁచి, కలితకావ్యకళానాథుఁ గమలనాభు
జంద్రచందనమందారసదృశకీర్తి, సరససాహిత్యసామ్రాజ్యచక్రవర్తి.”

ఈకమలనాభునే శ్రీనాథుఁడు కాశీఖండమునకంటెఁ బూర్వరచిత మగుభీమఖండములోపలంగూడ నుతియించెను. ఎట్లన్నను:—

"మ. కనకక్ష్మాధరధీరు వారిధితటీకాల్పట్టణాధీశ్వరున్
ఘనునిన్ పద్మపురాణసంగ్రహకళాకావ్యప్రబంధాధిపున్
వినుమధ్యాంతకసార్వభౌముఁ గవితావిద్యాధరుం గొల్తు మా
యనుగుం దాతఁ బ్రదాత శ్రీకమలనాభామాత్యచూడామణిన్"

## శ్రీనాథస్తోత్రాభిప్రాయము.

పైకవులవర్ణన చేయునపుడు శ్రీనాథుఁడు వారివారికవిత్వములోనివిశేషములును వారిమహత్తులును విశేషముగ గుర్తెఱిఁగినవాఁడ వుటం జేసి యథార్థవర్ణనమునే చేసినట్లుగా నూహింపవలసి యుండును. అందు వేములవాడభీమకవింగూర్చి చెప్పుచో నుద్దండలీలలఁ గవిత్వము చెప్పునట్లుగా వ్రాసెను. నన్నయభట్టును వర్ణించుచో ధీరమతి యనియు ను, ఉపాధ్యాయసార్వభౌముఁ డనియును, కవితాపట్టాభిషిక్తుఁడనియు ను,ఉభయవాక్ప్రౌఢి గలవాఁ డనుటంబట్టి యుభయభాషావాగనుశాస నుఁడనియును, శబ్దశాసనుం డనియును వివరించె. ఇఁక శంభుదాసాపర నాముం డగునెఱ్ఱాప్రగ్గడను వర్ణించునపుడు సత్ప్రబంధమహేశ్వరుఁ డనియును, సూక్తివైచిత్రి గలవాఁ డనియుం దెల్పెను. తనతాత యగు కమలనాభుంగూర్చి చెప్పునపుడు, సరససాహిత్యసామ్రాజ్యచక్రవర్తి యనియుఁ గవితావిద్యాగురుం డనియుం జెప్పెను.

తిక్కనసోమయాజింగూర్చి వ్రాయుచో శ్రీనాథుఁడు తనకుఁ గల విశేషాదరముం దెల్పునట్లుగ రసాభ్యుచితబంధములం జెప్పుననియును, సత్కవిశ్రేష్ఠుఁ డనియును నుడివెను.

ఇట్లుగా నీతిక్కనసోమయాజిని జతురాననతుల్యుం డని చెప్పుట కుఁ గారణము పంచమవేదతుల్య మగుభారతము నాంధ్రీకరించుటయే యని చెప్పఁగా నద్దానిం దెనిఁగించిన నన్నయశంభుదాసుల నేమికారణ మున నట్లుగా శ్రీనాథుఁడు వర్ణింపఁడయ్యె నని యొకశంక పొడముచు న్నది. దానికిఁ గారణమును మన మూహింపఁగలము. ఎట్లన్నను:— భారతములోని మొదటి మూఁడుపర్వములలో వేదవేదాంతార్థ ప్రతిపాద

కము లగు ఘట్టములు లేవు. అట్టి పర్వత్రయముం దెనిఁగించిననన్నయ భట్టుగాని, భారతపరాంశ మగుహరివంశముం దెనిఁగించినశంభుదాసుఁడుగాని కేవలము వేదాంతార్థప్రతిపాదకము లగుఘట్టములం దెనిఁగింపరైరి. అందుచేతఁ బైయిర్వురుకవుల కట్టిసామార్థ్య మున్న దని చెప్పెడు గ్రంథదృష్టాంతములు శ్రీనాథునకుం గానుపించక పోవచ్చును. ఇఁక తిక్కనసోమయాజి కవిత్వములో నట్టివేదాంతార్థప్రతిపాదకము లగు నుద్యోగ, శాం, త్యానుశాసనికపర్వము లుండుటంబట్టియు, నట్టివానిని వేదాంతరహస్యములు దెలియనివారికిఁ దెనిగింప నసాధ్యము లవుటయుం జూచి శ్రీనాథుం డట్లు వ్రాసి యుండె నని యూహింపనై యున్నది. ఇదియునుగాక వేదవేదాంతార్థములు కేవలము తెలిసినను దదుక్తకర్మాచరణము లేనివారల కట్టిపట్లు తెనిఁగింప సమర్థత యుండ దని శ్రీనాథుఁడు తా నట్టివాఁడు గాకుండుటంబట్టి యూహించి యుండును. శ్రీనాథుఁడేగాక యతనితండ్రియును దాతయుఁగూడ వైదికసంపత్తి లేనివారే. తిక్కన సోమయాజివంశ మట్లు గాదు. సోమయాజితండ్రి యగు కొమ్మనామాత్యుఁడు సాంగవేదవేది యని యుండె. తిక్కనసోమయాజి వేదవేదాంగముల నేర్చినవాఁడేగాక వైదికమార్గనిష్ఠమగువర్తనమును నిర్వహించు నట్టియజ్వగా నుండెను. కావునఁ బైవిషయములలో శ్రీనాథుఁడు తన కంటెను నన్నయభట్టాది పూర్వకవులకంటెను భారతామ్నాయముం దెనిఁగించుటకుఁ దిక్కన యొక్కఁడే లౌక్యవైదికములు రెండింటను సమర్థుఁ డని యెంచి యారీతిగా వర్ణించెను. "నాబ్రహ్మా క్రమపాతకః" అని సామాన్యపుక్రమపాతకులనే బ్రహ్మాయంతవాఁ డని చెప్పఁగా వేదవేదాంగములం జదివి తదర్థావబోధము కల్గి తద్రహస్యవేది యై, తదుక్తశ్రౌతస్మార్తకర్మముల నాచరించుచు, నాంధ్రమునఁ గవిత్వమహాదీక్షావిధి నుండి యందు నిరుపమాన కవిత్వమహత్త్వముం జూపి భారతము నాంధ్రీకరించినతిక్కనయజ్వను సర్వవిధములఁ గవిబ్రహ్మ యని శ్రీనాథుఁడు చెప్పుట యెంతయు నొప్పి యున్నది. ఇట్లు శ్రీనాథుఁడే

కాక యతనికిఁ బూర్వుండును భారతకవులలో నెక్కుడును నగునెఱ్ఱాప్రెగ్గడయు నీతిక్కనసోమయాజి నాంధ్రకవి బ్రహ్మగానే వినుతించెను. ఇట్లిర్వురు ప్రామాణికకవులచే నిర్ణయింపఁబడినవిధంబున తిక్కనసోమయాజి యాంధ్రకవిబ్రహ్మయే యని నిర్ణయించెదము. ఇటులనే యనన్యసాధ్యము లగుభాగవతరహస్యార్థములం దెలిసి వాని నాంధ్రీకరించినపోతరాజు, ఆంధ్రవేదవ్యాసుం డనియును, వసిష్ఠ, విశ్వామిత్ర, బ్రహ్మఋషుల యద్వైతతత్త్వార్థముల గ్రంథరూపములుగ నాంధ్రంబునఁ బ్రకటించిన మడికిసింగనకవియు, పరశురామపంతులలింగమూర్తిగురుమూర్తియుఁ గ్రమంబుగ నాంధ్రవశిష్ట, విశ్వామిత్రఋషు లనియును, నితరపురాణాదులం దెనిఁగించినశ్రీనాథాదికవు లాంధ్రగౌతమాదిఋషు లనియు వర్ణించి చెప్పెదము. ఇట్టిఋషికల్పు లగునాంధ్రకవులసహాయముననే యీవఱకు వేదాభ్యాసాధికారులు గాని స్త్రీశూద్రులును, సంస్కృతభాషాభ్యసనాశక్తు లగునాంధ్రద్విజులును తరణోపాయము నంది యుండి రనుటకు సందియము లేదు. ఇఁక ముందు దేశభాషలే ప్రబలఁగ సంస్కృతము పరిక్షీణింపఁగ వేదశాస్త్రాభ్యాసము లేక యాంధ్రు లందఱును నికపై నాంధ్రగ్రంథములే వేదకల్పములుగఁ జదువుదు రనుదాని కొకసందియమును నుండదు. కావున లోకోపకారు లగునాధునికపండితు లందఱును పైకవులగ్రంథములలోనితత్త్వము నేకముఖము చేసి సంగ్రహగ్రంథములం జేసి యుంచెదరుగాక.

## శ్రీనాథునితాతంగూర్చి.

భారతకవుల వృత్తాంతము వ్రాయుచు శ్రీనాథునితాతంగూర్చిన కథ వ్రాయుట కెడయయ్యెను. అతనింగూర్చినపద్యములలో నతఁడు నము ద్రతీరమున నొప్పుకాల్పట్టనమున కధీశ్వరుం డని శ్రీనాథునిచేఁ జెప్పంబడియె. ఈకాల్పట్టణముయొక్క తావు ప్రస్తుతము ద్యోతకము కాక యున్నది. దానిం దెలియుట కతనిచేత రచితమైనపద్మపురాణసంగ్రహకావ్యములో నేమైన నాధార ముండునేమో? అని దానింగూర్చి విచా

రింపఁగా నాగ్రంథము నట్లుగనే నామావశిష్ట మయ్యె. కావున మన మిపుడు కమలనాభకవినివాసస్థలము నిర్ణయింపలేము. అతఁడు సరససాహిత్యచక్రవర్తి యని శ్రీనాథునిచేఁ జెప్పంబడుటచే నతఁడును తిక్కనసోమయాజి పితామహునివలెనే యొకగొప్ప యాంధ్రకవి యని మాత్ర మూహింపనై యున్నది. దీనింబట్టి శ్రీనాథునితండ్రియును శ్రీనాథుఁడును సంప్రదాయసిద్ధాంధ్రకవులని నిశ్చయింప వచ్చును. వంశపరంపరాగతము లగువిద్యల నందిన కవులతో నితరకవులు సాటిరా రని చెప్పటకుఁ దిక్కన సోమయాజులును శ్రీనాథుఁడును సాక్షులై యున్నారు.

### ఆంధ్రభాష కర్ణాటభాష యనుట.

ఈశ్రీనాథుఁడు తనకవిత్వమును గర్ణాటభాష యని వచియించెను. దానికి భీమఖండములోని పద్యము:—

గీ. ప్రౌఢిఁ బరికిఁప సంస్కృతభాష యండ్రు, పలుకునుడికారమున నాంధ్రభాష యండ్రు
ఎవ్వ రేమన్న నండ్రు నా కేమికొఱఁత, నాకవిత్వంబు నిజము కర్ణాటభాష.

### శ్రీనాథునికవిసార్వభౌమ బిరుదు.

ఈశ్రీనాథునకుం గవిసార్వభౌమబిరుదు గల్గినట్లుగా నొకటిరెండుస్థలంబులం గాన్పించును. అం దొకటి యితనికాశీఖండములోపలను రెండవది యితనివీథినాటకములోపలను గాన్పించును. కాశీఖండములో నితనిప్రభుం డగువేమారెడ్డి యితనినుద్దేశించి చెప్పినపద్యము. ఎద్దియన:

"శా. ఈక్షోణి న్నినుఁ బోలుసత్కవులు లే రీమేటికాలంబులో
ద్రాక్షారామ చళుక్యభీమవర గంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయగంధసారఘుసృణద్వైరాజ్యభారంబు న
ధ్యక్షించుం గవిసార్వభౌమ భవదీయప్రౌఢసాహిత్యముల్"

### శ్రీనాథునివీథినాటకములోని సీసపాదము.

" చంద్రశేఖరక్రియాశక్తి రాయలయొద్ద, బాదుకొల్పితి సార్వభౌమబిరుదు "

### శ్రీనాథుని దిగ్విజయము.

ఈశ్రీనాథకవి యనేకసంస్థానములఁ జూడఁ బోవుచు నచ్చటిపండితుల జయించి విశేషబహుమానముల నంది విశేషవిఖ్యాతిఁ గాంచినట్లు

గా నితసవీథినాటకములోని యీక్రిందిపద్యమువలనఁ గాన్పించును. అది యెట్లన్నను :—

"సీ. దీనారటంకాలఁ దీర్థ మాడించితి, దక్షిణాధీశుముత్యాలశాలఁ
బలుకు తోడై తాంధ్రభాషామహాకావ్య, నైషధగ్రంథసందర్భమునకుఁ
బగులఁ గొట్టించి తుద్భటవివాదప్రౌఢి, గౌడడిండిమభట్టుకంచుఢక్క
చంద్రశేఖరక్రియాశక్తి రాయలయొద్దఁ, బాదుకొల్పితి సార్వభౌమబిరుద.
గీ. మెటుల మెప్పించెదో నన్ను నిఁక మీఁద, రావుసింగన్నభూపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొని యుండి నీవు, సరససద్గుణనికురుంబ శారదాంబ!"

ఈ పద్యమువలన నీశ్రీనాథకవి దక్షిణాధీశ్వరునియాస్థానంబునకును రాయలసంస్థానమునకును, రావుసింగ నృపాలునిసభకును బోయి యున్నట్లు గానుపించును. గౌడడిండిమ భట్టుతో సంవాదము చేసి యతని కంచుఢక్కం బగులఁ గొట్టించునట్లు కాన్పించెడిని. గౌడదేశమునకుఁగూడఁ బోయి యుండవచ్చును. లేదా డిండిమభట్టు శ్రీనాథుఁ డుండు సంస్థానమునకు వచ్చి యుండునపు డాతనితో వాదించి యైన నుండునోపు. ఆంధ్రదేశమునకు సమీపంబున నొకయెల్లగా నున్న గౌడదేశమునకు నోఢ్రదేశ మని పేరు. దానియందే జగన్నాథ మనుపురుషోత్తమక్షేత్ర ముండుటం జేసియు నది మధ్యాంధ్రదేశస్థులకు సమీపయాత్రస్థాన మగుటం జేసియు, నీశ్రీనాథునిప్రభుం డగు వేమభూపాలునితమ్ముం డగువీరభద్రారెడ్డి దేశములోనిచిల్క సముద్రమున కతిసమీపంబున నుండుటంబట్టియు శ్రీనాథుఁడే జగన్నాథమునకుం బోయియుండె ననియును నట్టిసమయములో నచ్చోఁ బండితుఁడుగా నుండు డిండిమభట్టు పరదేశమునుండి వచ్చియున్నశ్రీనాథకవినిఁ దిరస్కరించి యుండినట్లును నూహించుట యే సయుక్తికముగా నున్నది. ఇది యాంధ్రదేశమున కుత్తరముగ నున్నది. రాయలసంస్థాన మనునది యాంద్రదేశమునకుఁ బశ్చిమమున నున్నకర్ణాటదేశములోనియానెగొందె యనుపేర నొప్పు విజయనగర మై (Buja-nagar) యున్నది. రావుసింగభూపాలునిసంస్థానమును దేశమును నెల్లూరును నుత్తరార్కాడుజిల్లాలలోనివై యున్నది. ఇవి యాంధ్రదేశమునకుఁ

ప్రాగ్దక్షిణభాగముల నున్నవి. "దక్షిణాశీశునిముత్యాలశాల" అనునది కేవలమును దక్షిణదిక్కున నున్న శ్లాఘింపనై యున్నది. దీనింబట్టి చూడ శ్రీనాథుఁ డాంధ్రదేశము నలుప్రక్కలం దిరుగుటయే గాక యీ దేశమునకు సమీపంబున నున్న ద్రావిడకర్ణాటదేశములను నోఢ్రదేశము నుంగూడ దిగ్విజయార్థమై చూచియున్న శ్లాఘింపనై యున్నది.

## శ్రీనాథుఁడు రాయనిసంస్థానమునకుం బోవుట.

పైపద్యములో వివరించినశ్రీనాథునిదిగ్విజయములలో మొదటి రెండును స్థలనిర్దేశములే కానివి కావున వానిని వదలి యితఁడు రాయలసంస్థానమునకుఁ బోయి యున్నపుడు జరిగిన వృత్తాంతమును, రావుసింగభూపాలునిసభకుం బోయియున్నపుడు జరిగినవృత్తాంతములను గొంత వివరించెదను. అందు మొదటిది రాయలయాస్థానమందు జరిగినవిశేషములు. అచ్చోటికి శ్రీనాథుఁడు పోయియున్నపుడు శ్రీనాథుఁ డని యెఱుఁగక రాయలు నీవాసస్థాన మెచ్చోటను అని యడిగినసంప్రశ్నమునకు శ్రీనాథుం డిట్లుగా నుత్తర మిచ్చెను. ఎట్లన్నను:—

## కొండవీటివర్ణనము.

సీ. పరరాజపరదుర్గపరవైభవశ్రీల, గొనకొని విడనాడు కొండవీడు
పరిపంథిరాజన్యబలముల బంధిప, గురువైనయుతిత్రాఁడు కొండవీడు
చటులవిక్రమకళాసాహసం బొనరించు, కుటిలాంగులకుఁ జోడు కొండవీడు
ముగురురాజులకును మోహంబు పుట్టించు, కోమటిన మించినకొండవీడు

గీ. చటులమత్తేభసామంతసారవీర, భటనటానేక హాటక ప్రకటగ్రంథ
సింధురార్భట మోహనశ్రీలఁ దనరు, కూర్మి నమరావతికిఁ జోడు కొండవీడు.

ఇట్లు శ్రీనాథుఁడు పలుకఁగా రాయ లతనిని శ్రీనాథునిగా నెఱింగి యథోచితసత్కారంబు లాచరించి తమపట్టణమునఁ గొన్నిదినంబు లుండుటకుఁ బ్రార్థించెను. శ్రీనాథుఁడును దానికి నమ్మతించి యుండెను. ఇదివఱలో శ్రీనాథునిచేఁ జెప్పఁబడినసార్వభౌమబిరుదము స్థిరపఱుచుటకు జరిగినసంవాదము గాని దానికిం గల్గు కారణములుగాని తెలు

పుగ్రంథములసహాయము లేకుండుటంబట్టి యట్టివృత్తాంతము దెలుపక శ్రీనాథుఁ డాసిగొంవెలో నున్నపుడు జరిగినమఱియొకకథ వివరించెద నది యెద్ది యనఁగా:—

### గృహరాజుమేడవృత్తాంతము.

శ్రీనాథుఁడు పైఁ జెప్పినవిధంబున రాయలకడ నుండ నొక నాఁడు రాయలవలన గృహరాజుమేడ యనునొకసౌధవిశేషంబు గట్టించుయత్నము చేయఁబడుచుండెను. అట్టివృత్తాంతమును దెలిసికొని యామేడ తమప్రభుం డగుకోమటివేమారెడ్డికే యుండవలయు ననుకోర్కెతో శ్రీనాథుఁ డాగృహరాజుమేడ మాప్రభుం డగు వేమారెడ్డి కట్టించి యుండెను. దానిం జూచి మీరును గట్టింపవచ్చునని పల్కెను. అట్టిమేడ మిగుల నపురూపమైనదగుటం జేసి వేమారెడ్డి దానిం గట్టించియే యున్నఁ దాఁ గట్టించు నవసరములే దనియు నైన నది యేవిధముగాఁ గట్టంబడెనో యారసి రం డని తన భృత్యులలోఁ దగువారిం బంప నిర్ణయించెను. ఆవృత్తాంతము తెలిసికొని శ్రీనాథుఁడు తనజనములోఁ గొందఱిం బిలిచి వేమారెడ్డి కావార్తం దెలిపి తనమాట బోటుపోకుండఁ ద్వరలో గృహరాజుమేడం గట్టి సిద్ధము చేసి యుంచు మని చెప్పి పంచెను. అట్టివృత్తాంతము వినినతోడనే వేమారెడ్డి యట్టిగృహరాజుమేడ కట్టించలేనేమో యని దిగులుపడి యుండఁగా నతనియిలువేల్పగుముల్లగూరిశక్తి యతని స్వప్నములో వచ్చి కొండవీటిలో నున్నపోతరాజుగుడిద్వారమందున నొకముసలితుమ్మమ్రా నున్న దనియును, దానిని దెచ్చి స్తంభముగా వేసినచో గృహరాజుమేడ కట్టవచ్చు ననియుం జెప్పెనఁట. అపుడు వేమారెడ్డి లేచి స్వప్నానుసారముగా తుమ్మం గొట్టి తెప్పించి తొమ్మిదిదినములలో గృహరాజుమేడం గట్టించి సిద్ధము చేసెనఁట. ఇట్లుండ రాయప్రేషితు లగుభటులు వచ్చి గృహరాజుమేడం జూడ వచ్చితి మని తెలిపిరి. అపుడు వేమభూమినాథుఁడు వారిని సగౌరవంబుగాఁ బిలువ నంపించి గృహరాజుమేడ నంతయుం జూపి వారికి బహు

మతుల నిచ్చి మరల రాయలకడకుం బంపివేసెనఁట. శ్రీనాథుఁడును వీరు మరల రాయలకడకు వచ్చినసంగతి తెలిసికొని తనమాట నెగ్గుటకు సంతసించి రాయలఁ దనకవిత్వంబున నలరింపఁజేసి బహుమతుల నందికొని మరలఁ గొండవీటిలో నున్న తనప్రభునికడకు వచ్చి చేరెను.

## శ్రీనాథుఁడు రావుసింగభూపాలునొద్దకుం బోవుట.

వేమభూపాలుఁడు తనకు రావుసింగభూపాలునితోఁ బని గల్గ శ్రీనాథుని అతనిసభకుఁ బంప నుద్యోగించెను. కాని ఆసింగభూపునకు నీ వేమభూపాలునకును విశేషముగ నంతస్తాపము లుండుటంబట్టియు సింగభూపాలునకు సర్వజ్ఞుం డనుప్రసిద్ధి యుండుటంబట్టియు నాతనియాస్థానమునకుం బోయినచోఁ దనకుఁ బరాజయము గల్గునేమో యనునంశయంబు శ్రీనాథునకుం గలిగెను. అట్టిసందేహము తనకుఁ గల్గి దానిం దెలియపఱుపక సభ్యులును సింగభూపుఁడును సంతసిల్లునట్లుగా సరస్వతీప్రార్థనామిషంబున శ్రీనాథుఁడు

"ఎటుల మెప్పించెదో నన్ను నింకమీఁద, రావుసింగన్నభూపాలు ధీవిశాలు/
నిండుకొలువున నెలకొని యుండి యిపుడు, సరసనద్గుణనికురంబ శారదాంబ"

అని తనపూర్వదిగ్విజయప్రకటనమును, సింగభూపునివిద్యావైదుష్యముం బొగడి చెప్పెను. దానికి వా రందఱును సంతసించిరి. అంతట శ్రీనాథుఁడు సింగభూపు నీక్రిందివిధంబున నుతియించె. ఎట్లన్నను:—

"క. సర్వజ్ఞనామధేయము, శర్వునకే రావుసింగజనపాలునకే
యుర్విం జెల్లును నితరుని, సర్వజ్ఞం డనుట కుక్క సామజ మనుటే."

అనుపద్యము వినియును సింగభూపాలుఁడు శ్రీనాథుఁ డని తెలిసికొని విశేషముగ బహుమానింప కుంకుట కలిగి యతఁడు సింగప్రభుని యర్ధసింహాసనంబునఁ బోయి కూర్చుండెఁ. దానికిం గనలి యంతట నచ్చటి సింగభూపసభా పండితులు శ్రీనాథున కీక్రిందిసమస్య యిచ్చిరి.

అది యెట్లన్నను :—

"కుక్కవో, నక్కవో, పులివో, కోఁతివో, పిల్లివో, భూతపిల్లివో"

దాని నీక్రిందివిధంబున శ్రీనాథుఁడు పూర్తిచేసెను. ఎట్లన్నను:—

ఉ. తక్కక రావుసింగవసుధావరుఁ డర్థుల కర్థ మియ్య నే
డిక్కన లేనికర్ణుని, దధీచిని, ఖేచరు, వేల్పుచెట్టుఁ, బెం
పెక్కినకామధేనువు, శశీంద్రుని వేఁడఁగ నేల యాచకా
కుక్కవొ, నక్కవో, పులివొ, కోఁతివొ, పిల్లివొ, భూతపిల్లివో.

అని యిట్లు సమస్యాపూరణముం జేసియున్న శ్రీనాథుని సింగభూపుఁడు మహాకవిగఁ దెలిసికొని సగౌరవంబుగా నతనికోర్కె యడిగినఁ దనప్రభునికోర్కె యతఁడు దెల్పె. దానిం జేసి శ్రీనాథుం బంప నతఁడు తనప్రభుం డగువేమనృపాలుకడకు వచ్చి సర్వజ్ఞసింగమనీనిఁ దా నలరించి వచ్చితి నని చెప్పెను. అపుడు వేమనృపాలుఁడు సర్వజ్ఞునిసభలో జరిగినవిశేషములు తెల్పు మనఁగా శ్రీనాథుఁడు వాని నన్నిటిని సవిస్తరముగాఁ జెప్పెను. వేమభూపాలుఁడు తనవిరోధి యగుసింగమనీని సర్వజ్ఞుఁ డని వర్ణింపఁగా మేము నట్టిబిరుదున కంగీకరించిన ట్లుండుదు గదా. కార్యార్థమై నిన్ను బంపియుంటిమి గాని నిజముగ నతని వర్ణించి యతనివలన బహుమాన మంది రాఁ బంపలేదే. నీ వెట్లుగ నతని సర్వజ్ఞుఁ డని నుతియించితివి నీలౌకికప్రజ్ఞకు లోప మాపాదించితి వని యధిక్షేపించెను. అట్టిపల్కులకు శ్రీనాథుఁడు నవ్వి నే నీవలనం బ్రేరేపింపఁబడి యచ్చటికిం బోయి యున్నచో నీ కవమానకర మగుపనిం జేసివత్తునా? అటుల నొనరింప లేదు. నేను యథార్థముం జెప్పినదానిని సర్వజ్ఞుఁడును నాతనియాస్థానపండితులును గ్రహింపలేక వారిసర్వజ్ఞత్వమును వారే పోఁగొట్టుకొనిరి. అనుడు సర్వజ్ఞుఁ డనుపద్యమున కేమియర్థము చెప్పితి వనుడు నాపద్యము నే మఱియొక విధంబునఁ జదివి చెప్పెను. ఎట్లన్నను:

క. సర్వజ్ఞనామధేయము, శర్వునకే రావుసింగజనపాలున కే
యుర్విం జెల్లును? నితరుని, సర్వజ్ఞం డనుట కుక్క సామజ మనుటే.

ఇట్లర్థము భేదించుటయే గాక రెండవపక్షములో దూషణము గూడఁ గన్పించునట్లు చదువుటకు వేమారెడ్డి యెంతయు సంతసించెను.

పైని వేమారెడ్డికి సర్వజ్ఞునితో నొకకార్యము గల్గి శ్రీనాథునిఁ దత్కార్యార్థము పంపినట్లు చెప్పియుంటిమి. అట్టికార్య మతినీచకార్య

మైనను నిటఁ జెప్పక తీఱదు గావున దాని నిట వివరించెదను. వేమారెడ్డికిని సింగమనీనికిం గలవైరముం దీర్చుకొనుట కనేకమార్గము లిర్వుర కున్నను సింగమనీఁడు దానిం దీర్చుటకొకపడిగెముం జేయించి దానికి వేమారెడ్డి యనునామ ముంచి, ఊచపలెను వేమారెడ్డిం దేరా" అని తన భృత్యునితోఁ జెప్పుచుఁ బ్రతిసమునమందున వేమారెడ్డిపేరు స్మరియింపుచు నెన్నిపరియాయములూ దినను నీవేమారెడ్డికిఁ దృప్తి లేదనియును, వేమారెడ్డివాతను సభ్యులంటుటుకు సుమిసినగాని యతని కడుపు నిండ దనియు నట్టివే కొన్ని కార్యంబులు చెప్పి వేమారెడ్డిం గేలి చేయుచుండెను. అది వేమారెడ్డి విని యును సర్వజ్ఞసింగమనిని దండించుటకుఁ దగిన శక్తి లేకుండుటకు మిక్కిలి ఖిన్నుండై శ్రీనాథుని సింగమనీనికడకుం బంపి యాతని మానుపింప యత్నించె. అట్లు గావున శ్రీనాథుఁడు సింగమనీనిమనస్సు ముందుగ రంజిల్లుపద్యములం జెప్పి తన యభీష్టంబు తెల్పు మని యడిగిన సింగమనీనితోఁ బైయనుచితకార్యము మానుట యే తన యభిష్టమనియె. ఆమాటకు సింగమనీఁడు రసికుఁడును బండితుఁడును గావునని తరమూర్ఖభూపతులవలెం గాక దానిని వెంటనే తీసివేసి యిఁక నెప్పుడును నట్టి యక్రమంబు గావింప నని పల్కెనఁట. సర్వజ్ఞ బిరుదు నందినభూపతి యే యిట్టిదుర్నీతిగ నడిచె నని చెప్పి యుండఁగా నిఁక భూపతులదుర్నీతుల నే మన్ని చెప్పవచ్చును. ఇది దేశచారిత్రము గావున నెట్టివృత్తాంతముల నైనం జెప్పక తప్పదు. దేశస్థు లందఱును నిట్టివి భావిజనోపకారులు గావున వీనిఁ బ్రకటించుట కనుజ్ఞ నీయంగోరఁబడుచున్నారు.

## శ్రీనాథుఁడు తెలుఁగురాయని సంస్థానమునకుఁ బోవుట.

సబ్బినాపిరాష్ట్రములోని రామగిరిదుర్గమున కధీశ్వరుం డగు తెలుంగురాయఁ డనునొకప్రభుండు గలఁడు. అతనిం దర్శించుటకుఁగాను శ్రీనాథుఁ డొకసమయంబునఁ బోయి యొకపద్యంబున నాశీర్వదించె. ఆపద్య మెద్ది యనఁగా:—

శా. ధాటీఘోటకరత్నఘట్టనమిళద్ధారాధిపస్థకళ్యాణఘం
టాటంకారవిలుంఠలుంఠితమహాసన్మత్తాహితక్షోణిభృ
త్కోటీఢౌకితకుంభినీధరసముత్కూటాటవీఝోటక
ఘ్ఘాటాంధ్రాధిప సాంపరాయని తెలుంగా నీకు దీర్ఘాయు వౌ.

ఇట్టి శ్రీనాథునిపద్యములోనిశయ్యాచమత్కృతి కెంతయు నలరి తెనుంగురాయఁ డతని శ్రీనాథునిగా నెఱింగి యతఁ డేమి కోరియుండెనో దానిఁ దెల్పు మనియె. అపుడు శ్రీనాథుఁ డొకపద్యంబునఁ దనకోర్కె తెల్పె. అది యెట్లన్నను:—

ఉ. అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ కస్తూరికా
భిక్షాదానము సేయురా సుకవిరాడ్బృందారకశ్రేణికిన్
ద్రాక్షారామపురీవిహారవరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించుఁ దద్వాసనల్.

ఇట్లు శ్రీనాథుఁడు తనకుఁ గస్తూరి కావలయు నని యడుగఁగాఁ దెలుఁగురాయఁ డతనికిఁ గస్తూరియును విశేషము లగునితర బహుమానంబులును నిచ్చి యతని దేశమునకుం బోవ సెల వొసంగె.

## తెలుఁగురాయ లెవ రని?

ఈపయిం జెప్పఁబడిన తెలుఁగురాయలు శ్రీనాథుని కాలములో మిగులఁ బ్రసిద్ధుండైనను నితనివిశేషములు తెల్పుగ్రంథసామగ్రి విశేషించి లేదు. ఇతనితండ్రి యగుసాంపరాయలంగూర్చి జైమినిభారతములో నొకసీసపద్యమున రెండుచరణము లున్నవి. అవి యెట్లన్నను:—

"సీ. ధరములో దక్షిణసురతాను నెదిరించి, కొనివచ్చి సాంపరాయనికి నిచ్చె
సామ్రాజ్యమున నిల్పి సాంపరాయస్థాప, నాచార్యబిరుదవిఖ్యాతిఁ గాంచె."

అని సాళ్వమంగరాజును వర్ణింపుచుఁ బిల్లలమఱ్ఱిపిన వీరభద్రకవి వ్రాసెను. ఇంతమాత్రమునఁ జరిత్రాంశములం దెలియంజాలు నాధారమది కాదయ్యెను. కావున గ్రంథాంతరములం జూడఁగోరి మడికిసింగన కవికృతపద్మపురాణోత్తరఖండముం జూడఁ దెలుంగురాయనివర్ణనముం డుటంబట్టి యతఁడును నితఁడును నొక్కఁడే కానవచ్చు నని యూహించి యాపద్యముల నిందుఁ గీల్కొల్పుచున్నాఁడను. ఆపద్యములలోన

తనికుమారుని బిరుదంబులంబట్టియు, జైమినిభారతములోనివర్ణనంబట్టియు, శ్రీనాథునిచే వర్ణింపఁబడినతెలుఁగురాయఁడును నీతెలుంగురాయఁడును నొక్కఁడే యని నిశ్చయింపఁదగి యుండును. ఆపద్యము లెవ్వి యనఁగా:—

మ. గురిజాలాన్వయదుగ్ధవార్ధిశశి దిక్కుంభీంద్రహస్తాభబం
ధురభూభారధురీణనిశ్చలమహాదోర్దండుఁ డుగ్రారిభీ
కరుఁడై దిక్పరివర్తికీర్తి నెగడంగా భూరిభోగాఢ్యుఁడై
పరఁగెం ధాత్రిఁ దెలుంగురాయఁడు జగత్ప్రఖ్యాతరాజోన్నతిన్.

చ. అతనికి నగ్రభార్య వినయాంచిత నిత్యశుభైకశీల సు
వ్రత నియతాత్మ సజ్జనపరాయణ ధర్మవివేకసార స
న్నుతహృదయానుకూల సుగుణోజ్జ్వల నాఁదగుమల్లమాంబయం
దతులితరామలక్ష్మణశుభాకృతు లిద్దఱు పుట్టి రాత్మజుల్.

వ. అందగ్రసంభవుండు.

క. శ్రీకంఠుఁడు సకలజనవ, శీకరణనుకీర్తియుతుఁడు చిరతరగుణర
త్నాకరుఁడు సతతదానద, యాకల్పుఁడు ముప్పదిక్షమాధీశుఁ డిలన్.

## ఆంధ్రపద్మపురాణోత్తరఖండము

"వ. ఇతఁడు సోదరుండగుమత్తభూపాలుండు సహాయుండుగా గౌతమీదక్షిణంబున బరమపావనంబైనసబ్బనాపిరాష్ట్రంబున, రామగిరిపట్టణంబు నిజరాజధానిగ, బురందరవిభవుండై రాజ్యంబు చేయుచు, నీరునెత్తురుగండ, గోపాలకాంచిరక్షపాలక, చోడరాజ్యస్థాపనాచార్య, దొంతిమన్నియవిభాళ, చలమర్తిగండ, గజగంధవారణ, రాజగజకేసరి, మూరురాయజగదళవిభాళాది నానాబిరుదవిఖ్యాతుండై ముప్పభూపాలుండుండు" అని యున్నది.

పైపద్యములంబట్టి తెలుంగురాయఁ డనునొక పెద్దరాజుగాఁ దెలియవచ్చుచున్నది. చోళరాజ్యస్థాపనాచార్యబిరుదు లితని వంశమువారికిఁ గల్గియుండుటంజేసి వారు చోళరాజులప్రభుత్వములో సామంతమండలాధిపులుగా నున్నట్లును, ఆచోళరాజులు క్షీణించుసమయములో నాసంస్థానమువారు కర్ణాటాంధ్రరాష్ట్రములలోఁ గొంతభాగము నాక్రమించుకొని యున్నట్లును నూహింపనై యున్నది. ఈ రాజులవంశనామము గురిజాలవారు అని కలదు. ఇతనింగూర్చి దేశచారిత్రములో విప

రించి వ్రాయఁబడుం గావున నిప్పటి కీతనికథ ముగించెదను. కాని శ్రీనాథునకు సార్వభౌమబిరుదు గల్గించినసంస్థాన మిది కా దనియును, అది యానెగొందెసంస్థానములో నున్నదనియును జెప్పఁదగి యున్నది.

శ్రీనాథునిప్రభుఁ డగువేమారెడ్డి యని యిదివఱలో వ్రాసి యున్నాను. కాని వేమారెడ్డినాము లనేకు లుండుటంబట్టి యితనిప్రభుం డగువేమన యెవ్వరో బోధకాకుండును. కొండవీటిదండకవిలెలోఁ గోమటివేమారెడ్డి యితనికిఁ బ్రభుం డని వ్రాయంబడి యున్నది. కాశీఖండముకృతిపతి యగువీరభద్రారెడ్డికన్న యగు వేమారెడ్డికూడ నీతనిప్రభుం డయినట్లు కాశీఖండములోఁ గానుపించును. ఆవేమనకు రాచవేమన యని పేరు గలదు. అతడు రాజమహేంద్రవరములో నున్నట్లు కాన్పించు. కోమటివేమన అనపోతరెడ్డికుమారుఁడు, ఇతనిది కొండవీడు. ఆవివరముంగూర్చి విశేషము చర్చింపవలసి యున్నదిగావున నిపు డద్దానిం దెల్పుటకుఁ బూర్వము కొండవీటిదండకవిలెలో నున్నకొన్నిమాటల నీక్రింద వ్రాసెను.

కొండవీటిదండకవిలెలో నీశ్రీనాథునకుఁ గోమటివేమన్నవలన రెండుపాలెము లీయఁబడె ననియును, అం దొకదానికి సోలసపాలె మనియు, రెండవదానికిఁ బాలెమనియు నామ మున్నట్లును జెప్పఁబడియె. ఆరెండుగ్రామములును దొంతి, అల్లాడరెడ్డికాలములో నల్లారెడ్డికూఁతునకు నతనివలన సంక్రాంతిపండుగబహుమానముగా నీయఁబడిన వనియు నున్నది. అల్లారెడ్డికూఁతురుపేరు వేమాంబ. ఆమెకు నామాంతరము మైలమ్మ యని కలదు. అయిలమ్మ కాగ్రామము లిచ్చి పొలిమేరహద్దులు పెట్టించి యం దొకదానికయిలమ్మపేట నయిలవర మనియును, రెండవదానికి సంక్రాంతిపండుగకుఁగా నీయఁబడుటచేత సంక్రాంతిపాలె మనియు నామకరణములు చేసిరి. నాఁడు మొద లవి ప్రత్యేకగ్రామము లాయె నని యున్నది.

కాశీఖండములో శ్రీనాథకవి తనప్రభుఁ డగువేమారెడ్డివంశము నీక్రిందివిధంబుగఁ జెప్పె.

దూపూరిలోని పెరుమాళ్లరెడ్డి, (భార్య అన్నాంబ.)
- అల్లయరెడ్డి
- పెదకోటరెడ్డి
- అన్నప్రోలిరెడ్డి
- దొడ్డయరెడ్డి
  - ప్రోలరెడ్డి
  - అన్నంరెడ్డి
  - అల్లాడరెడ్డి (భార్య అన్నమభూపాల పౌత్రి వేమాంబ)
    - వేమారెడ్డి (ఇతనికే అల్లయ వేమనయని పేరు) (కృతిపతి)
    - వీరభద్రరెడ్డి
- చిన్నకోటరెడ్డి

ఈపైవంశవృక్షముంబట్టి శ్రీనాథునిసమకాలీనుఁ డగువేమారెడ్డి అల్లాడరెడ్డికుమారుఁ డగునల్లయవేమన యని చెప్పఁదగును. పైదండకవిలెలోఁ గోమటివేమన్నకాలములో శ్రీనాథునకు గ్రామము లీయంబడినట్లుగాను, ఆగ్రామము లల్లాడరెడ్డికాలములో నతనికూఁతున కియ్యంబడినట్లును జెప్పంబడి యున్నది. శ్రీనాథుఁ డీయల్లాడరెడ్డికుమారుఁ డగువేమారెడ్డియధికారమునాఁటికి ముదుసలి యై యుండును. పైకోమటివేమనకాలము కొండవీటిదండకములో శా. స. ౧౨౭౮ మొదలు ౧౩౦౯ వఱకు నున్నట్లు వ్రాయఁబడినది. కాని కోమటి వేమనయనంతర మతనికొడుకగు రాచ వేమన యధికారమునకు వచ్చినట్లా గ్రంథములో నున్నది. కాని రాచవేమన కోమటివేమనకొడుకు గాక, అల్లాడరెడ్డి కుమారుఁడే యైనట్లు పై వంశవృక్షమువలనం గాన్పించును. కారణాంతరమునఁ గోమటివేమనయనంతరము, అల్లాడరెడ్డి (అనగా, అనవేమారెడ్డికొడుకున కల్లుఁడు) కొంతకాలము ప్రభుత్వము చేసెను. ఇతనిశాసనములు ౧౩౩౮ వ శా.స. మున నుండుటచేత నతఁ డంతవఱకుఁగాని యింకను బిమ్మటఁగాని రాజ్యముచేసినట్లు కాన్పించును. ( Lists of

Antiquities by Mr. R. S. Vol II.) దాక్షారామ శాసనములలో నల్లాడరెడ్డికుమారుని శాసనము ౧౩౪౯ లో నున్నది. దీనింబట్టిచూడ శ్రీనాథునకుఁ గోమటి వేమనచేఁ బైరెండుపాలెము లీయఁబడి యవి మరల నల్లారెడ్డిచే నాక్రమింపఁబడినట్లుగాఁ గాన్పించు. అంతట శ్రీనాథుడు అల్లాడరెడ్డి నాశ్రయింపక యుండి యతనియనంతరము రాజ్యమునకు వచ్చినరాచవేమనమన్నన నంది కాశీఖండ మతనికమ్మునకుఁ గృతి యిచ్చినట్లు కాన్పించు. తక్కినవిశేషములు ముందు దేశచరిత్రములో వ్రాసెదను.

### వేమారెడ్డిపండితుల కిచ్చినసమస్య.

శ్రీనాథుఁడు తాను దిగ్విజయార్థము పోవుచు, వేమారెడ్డిసభాపండితుల కొకసమస్య యిచ్చి తాను మరల నాఱుమాసములకు వచ్చి చేరెద ననియును సంతకులోపున నాపద్యముం బూర్తిచేసి యుంచవలయు ననియుం జెల్పెను. ఆపద్య మెద్దియనగా:—

"క. కొంచెపుజగములలోపల, నంచితముగ నీదుకీర్తి యలవేమనృపా"

పై సమస్యాపూరణంబు చేయుట కాపండితులకుఁ దెలియక యూరకుండిరి. అంతట మఱికొన్ని నాళ్లకు శ్రీనాథుఁడు తనప్రభునికడకు వచ్చి తనతొంటిపద్యము నిక్రిందివిధంబుగఁ బూరించె. ఎట్లన్నను:—

"మించెఁ గరి ముకురంబునఁ, బంచాక్షరి శివుఁడు మదిఁ బ్రపంచముపోలెన్"

ఈ శ్రీనాథుఁడు శృంగారనైషధము, భీమఖండ కాశీఖండములను గ్రంథములను రచియించుటకుఁ గొన్నిగాథలు కల్గియున్నట్లుగా నీదేశస్థులు చెప్పుకొనియెదరు. ఆగాథలు గ్రంథములో నెట్లుగా నున్నవో వానిం జూపి పిమ్మట విశేషముగా భేదించువానినిగూడ వివరించెదను.

### శృంగారనైషధకృతిని గుఱించినకథ.

ఇందుఁ గృతిపతి యగునతఁడు మామిడి సింగమంత్రి. ఇతని వృత్తాంత మెఱుఁగనివారిచేఁ జెప్పంబడుగాథను, అనంతరము చెప్పం దలంచి తొలుత శ్రీనాథకృతశృంగార నైషధములో వ్రాసినదాని న్వివరించెదను. ఎట్లన్నను:—

"వ. నవరసభావానుబంధబంధురంబుగా నే నొక్కప్రబంధంబు నిర్మింపందలంచి కౌతూహలాధీనమానసుండనై యిమ్మహాప్రబంధప్రారంభంబునకుం దగినపుణ్యశ్లోకపురాతనమహారాజచరిత్రం బెయ్యదియొకో యని వితర్కించుచున్న సమయంబున.

సీ. తనకృపాణము సముద్ధతవైరిశుద్ధాంత, తాటంకముల కెగ్గు దలఁపుచుండఁ
దనబాహుపీఠంబు ధరణిభృత్కమఠాహి, సామజంబులకు విశ్రాంతి యొసఁగఁ
దనకీర్తినర్తకి ఘనతరబ్రహ్మాండ, భవనభూముల గొండ్లఁ బరిఢవిల్లఁ
దనదానమహిమ సంతానచింతారత్న, జీమూతసురభుల సిగ్గుపఱుపఁ
గీ. బరఁగుశ్రీవేమమండలేశ్వరునిమంత్రి, యహితదుర్మంత్రివదనముద్రావతార
శాసనుఁడు రాయవేశ్యాభుజంగబిరుదు, మంత్రిపెద్దయసింగనామాత్యవరుఁడు.

వ. పృథుమధురచిత్రవిస్తారకవితావిలాసవాగీశ్వరు లగుకవీశ్వరులును, పతంజలి, కణాద, అక్షచరణ, పక్షిలాదిశాస్త్రసిద్ధాంతకమలవనహంసు లగువిద్వాంసులును, భరతమతంగదత్తిళ, కోహళాంజనేయప్రణీతసంగీతవిద్యారహస్యవిజ్ఞానవైజ్ఞానికస్వాంతు లగుకళావంతులును, శక్తిత్రయ, చతురుపాయ, షాడ్గుణ్యప్రయోగయోగ్యవిచారు లగురాయబారులును, నిఖిలపురాణేతిహాససంహితాతాత్పర్యపర్యాలోచనాధురంధరధిషణాసముత్సాహం బగుపౌరాణికసమూహంబును బరివేష్టింపం గొలువుండి, సరసవిద్యాపారంగతుండు సరససాహిత్యగోష్ఠివినోదప్రసంగంబున:—

శా. భారద్వాజపవిత్రగోత్రుని శుభాపస్తంబసత్సూత్రు వి
ద్యారాజీవభవుండు మారయకుఁ బుణ్యాచారభీమాంబకుం
గారామైనతనూజు నన్ననఘు శ్రీనాథాఖ్యునిం బిల్చి స
త్కారం బొప్పఁగ గారవించి పలికెం గంభీరవాక్ప్రౌఢిమన్.

..................................................

వ. కావున నాకు నొక్కప్రబంధంబు పుణ్యశ్లోకపురాతనరాజర్షిచరితానుబంధబంధురంబుగా రచియింపుము. అందు:—

గీ. భట్టహర్షుండు ప్రౌఢవాక్పాటవమున, నెద్ది రచియించి బుధలోకహితముఁ బొందె
నట్టినైషధసత్కావ్య మాంధ్రభాష, ననఘ యొనరింపు నాపేర నంకితముగ.

వ. అని పల్కి సబహుమానంబుగఁ గర్పూరతాంబూలం బొసంగి జాంబూనదాంబరాభరణంబులం గట్ట నిచ్చి వీడ్కొలిపిన, నేను నమ్మహాప్రధానునిం గృతినాయకుం జేసి నైషధకావ్యము చెప్పందొడంగితి."

ఇట్లున్నపద్యములం జూడఁగ లోకములోనియందఱుకృతిపతులను కవీశ్వరుని గృతి యిమ్మని యడిగినప్పు డెట్లుగా నడిగెదరో అట్టుల

వే శ్రీనాథకవిని సింగనామాత్యుండు నడిగినట్లున్నది. శ్రీనాథుఁడును
దాని కుత్తరము క్రమముగనే శ్లోకములో నికవులంబోలి యిచ్చియు
న్నాఁడు. అంతకంటె నధికప్రసంగమున కవసరము లేదు. ఇట్లుండఁగా
నీకథ లోకములో వ్యాపించియుండుగాథ మిక్కిలి నింద్యముగాను, లో
కానుభవముచే సందర్భహీన మైనదిగా నుండును. అట్టికథకు మూలము
శ్రీనాథకవి స్త్రీలోలుఁ డని లోకములోఁ గలమూఢజనాభిప్రాయమై
యున్నది. అట్టియభిప్రాయము సరియైనది కాదని నుడివి ముప్పదియిద్ద
ఱునియోగులచరిత్రములో వివరింపఁబడినవృత్తాంతము నీక్రింద వివరించి
పూర్వపక్షము చేసెదను. ఎట్లన్నను :—

శ్రీనాథుఁడు శృంగారనైషధము రచియించి రాచవేమన యను
వేమారెడ్డికిఁ గృతి నీయం గమకించి యతఁ డున్న యూరునకుఁ బోవుచుం
డఁ ద్రోవలో నొకవర్షము సంతతధారగాఁ గురియఁ బ్రయాణంబు నిలు
పు చేసి తనయానంబుతో నీ మామిడిసింగనామాత్యుఁడు కరణముగా
నున్నగ్రామమునకుఁ బోయి యుండెనఁట; అపు డాసింగన శ్రీనాథుని
రాక విని యతనిం జూడఁ బోయి యాదినంబు తనయింట విడిసి తనగృ
హంబు పావనము చేయుఁ డని ప్రార్థించెనఁట! అపుడు శ్రీనాథుం డట్ల
యని సమ్మతించి రాఁగని సింగన యాదినము తనపితృకార్యార్థమై సమ
కూర్చియుంచినవిశేషపదార్థము లన్నిటితో శ్రీనాథునకు ముందుగ
భోజన మిడి యనంతరము మఱికొన్నిపదార్థములు దెచ్చి తనపితృకా
ర్యంబు నెఱవేర్చెను, శ్రీనాథుం డట్టిమన్ననకు మిగుల సంతసించి
యుండెనఁట. సింగన శ్రీనాథునిఁ దనయింట భోజనమునకు నిల్వుఁ డని
కోరినయుదయము వేళనే శ్రీనాథుఁడు తన కారాత్రి యొకవేశ్యం దె
ప్పించి యిచ్చినం గాని తా నతనియింట భుజియింప రా నని నుడివినట్లు
ను, ఈసింగన యట్లు తాను సమకూర్చెద నని యనుటచేతనే శ్రీనా
థుఁ డాతనియింట భుజియింప నంగీకరించె ననియుం గలదు. ఆరాత్రి
కల్గినవర్షప్రతిబాధమువలన నీసింగనమంత్రి వెలయాలిం దెచ్చి గూర్చుట

కు సమర్థుఁడు గాక యావృత్తాంతముం దెల్పిన శ్రీనాథకవి శపియించునే మోయనుభీతిచేత మిగులఁ జింతించి తనభార్యకు వేశ్యా వేషం బమర్చి శ్రీనాథునిపడకటింటిలో నిల్పె ననియును. అంతట శ్రీనాథుం డాపతివ్రత తోముచ్చటించి యాపె వెలవెలఁదుక గాదని నిశ్చయించి యాపెవృత్తాంతమును సమూలముగా గ్రహియించి సింగనమంత్రియొక్క సాహసౌదార్యముల కెంతయు సంతసించి తాను రచియించియుంచినశృంగారనైషధ మాతనికిం గృతి యిచ్చి వేమారెడ్డిసభకుం బోయి జరిగినవృత్తాంత మంతయు నతనికిం దెల్పెనఁట ! అపు డారెడ్డి తన కాగ్రంథము కృతి యందునదృష్టము లేనందుకు మిగులఁ జింతించి మెల్లన నే నిచ్చెద నని వాగ్దానముం జేసిన నర్ధరాజ్యంబు నిచ్చివేసెద నను పలుకఁగా శ్రీనాథుఁడు తనకుఁగా నీయనుంచినరాజ్యార్ధము సింగమంత్రికి నిమ్మని పల్కెనఁట ! అపుడు వేమారెడ్డి కొంతవఱ కాలోచించి యర్ధరాజ్యంబు కవికిని సర్వరాజ్యమంత్రిత్వంబు సింగమంత్రికి నొసంగ నపుడు శ్రీనాథుండు మరలఁ దనయర్ధరాజ్యంబు రాజున కొసంగి మంత్రి నీక్రిందివిధంబుగా నుతియించెనఁట. ఎట్లన్నను :—

"క. శ్రీరాజరాజవేమ, క్ష్మారమణ కృపాకటాక్ష సంవర్ధిత ల
క్ష్మీరక్షితబుధలోకా, ధారగుణాధార సింగనామాత్యమణీ."

—= సింగనమంత్రివంశముంగూర్చి. =—

అని యిట్లు ద్వాత్రింశన్మంత్రి చరిత్రములో నున్నది :—

అట్టికథ యథార్థ మగునా యనుదానిఁ బరిశీలుంచుటకుఁ బూర్వము సింగమంత్రివంశస్థు లావఱకే మంత్రిత్వముం జేసియుండిరేని శ్రీనాథునిమూలముగ సింగన మంత్రి యయ్యె నని చెప్పెడుబలవత్తరమైనపూర్వపక్షము నిలిచిపోవును. ఆవిషయము శృంగారనైషధములో శ్రీనాథకవిచే వర్ణింపఁబడినసింగనవంశావళి నిక్రింద సంగ్రహించి వివరించెదను.

భారద్వాజ గోత్రములో
పెదతూర్కనమంత్రి.
అతని వంశములో

చిటి పెద్దప్రభుఁడు (ఇతఁడు విక్రమపురసింహాసనాధ్యక్షుఁడు.)

మామిడన్న.

పెద్దనామాత్యుఁడు. భార్య తల్లమ్మ (అనవేమారెడ్డియొక్కమంత్రి) | వీరభద్రుఁడు. | మారనమంత్రి. | నామనమంత్రి.

(ఇతఁడును వేమారెడ్డికి మంత్రిత్వము చేసెను. ఇతనికి స్వామిద్రోహరగండఁ డని కదనగాండీవి యని బిరుదులు గలవు.)

పెద్దనామాత్యుని కుమారులు: వేమమంత్రి | ప్రగ్గడదండనాథుఁడు. | సింగనమంత్రి (కృతిపతి)

కృతిపతి యగుసింగనమంత్రి పేరఁ జెప్పంబడినయీక్రిందిపద్యములలోనిబిరుదంబులంబట్టి చూడ నీసింగమంత్రి శృంగారనైషధముం గృతి నందునాఁటికే వేమభూమీశునియాస్థానమున రాజ్యనిర్వాహకతంత్రమున విశేషవిఖ్యాతిం గాంచి తనపూర్వు లగుమంత్రులకంటె నెక్కుడుబిరుదులు సంపాదించినట్లు కాన్పించును అది యెట్లనఁగా:—

సీ. గగనకల్లోలినీ కల్లోలమాలికా, హల్లీసకములతో నవఘళించి
చరమసంధ్యాకాలసంఫుల్లమల్లికా, స్తబకపంక్తులతోడ సరసమాడి
శరదాగమారంభసంపూర్ణపూర్ణిమా, విమలచంద్రికలతో వియ్యమంది
విసరుహాసనవధూపృథుపయోధరభార, హారవల్లరులతో నసఁగి పెనఁగి

గీ. వెలయు నెవ్వానియభిరామవిమలకీర్తి, యతఁడు త్రిభువనరాయవేశ్యాభుజంగ
కదనగాండీవి, జగదొబ్బగండబిరుదు, శాశ్వతుం డొప్పు సింగనసచివవరుఁడు.

మ. అరుదారన్ వివిధాగ్రహారములతో నాందోళికాఛత్రచా
మరకళ్యాణకళాచికాదిబహుసమ్మానార్హచిహ్నంబు లా
దర మొప్పారఁగ వేమభూవరునిచేతం గాంచె సామ్రాజ్యసం
భరణప్రౌఢుఁ డమాత్యసింగఁడు నయప్రాగల్భ్యగర్వోన్నతిన్.

ఈపైరెండు పద్యములవలనను సింగమంత్రికి శ్రీనాథునిచే శృంగారనైషధము కృతి నందువఱకే త్రిభువనరాయవేశ్యాభుజంగ, కదనగాండీవి, జగనొబ్బగండబిరుదు లున్నట్లును, అనేకాగ్రహారములతో ఆందోళిక, ఛత్రి, చామర, కళ్యాణకళాచి (పాందాను) కాది సన్మానార్హచిహ్నములు వేమభూమీశునివలన సంప్రాప్తములైనట్లును కనిపించుచున్నవి. ఇవియునుగాక షష్ఠ్యంతములలోను, ఆశ్వాసాదిమాంత్యపద్యములలోఁగూడ నుండినసింగమంత్రియొక్క మఱికొన్ని బిరుదులు మొదలగువాని నీక్రింద వివరించెదను:—

క. శ్రీమహితు పెద్దకోమరుఁడు, వేమక్షితిపాలరాజ్యవిభవకళార
క్షామణికి సింగసచివ, గ్రామణికిం పాండ్యరాజగజకేసరికిన్.

క. కేళాదిరాయ యభినవ, లీలాపక రాంకచంద్రలేఖాంకురచూ
డాలంకారపదాంబురు, హాలింగనసుఖితనిర్మలాంతఃకరణా.

ద్వితీయాశ్వాసాంతములో నీక్రిందిపద్యము లున్నవి.

"మ. నవరత్నోపలదివ్యలింగవరదానప్రీత దాక్షాయణీ
ధవ, కర్పూరవసంతరాయ, యనవద్య ద్వాదశీవాసరో
త్సవరుక్మాంగద వేమభూపతిమహాసామ్రాజ్యరక్షామణీ
యవనాధీశసభానిరంకుశవచోవ్యాపారపారంగతా."

మూఁడవయాశ్వాసాంతమున

"స్రగ్విణి. తల్లమాంబాసుతా ధైర్యహేమాచలా, పల్లవాదిత్య సౌభాగ్యభాగ్యోదయా
పల్లవోష్ఠీ కుచప్రాంతభాగద్వయీ, గల్లపాళీలసత్కారముద్రాంకురా."

నాల్గవయాశ్వాసాంతమున

"మాలిని. హరిచరణసరోజధ్యాననిష్ఠాగరిష్ఠా, ధరణిభరదధిష్ఠాథఃకృతాహార్యవర్యా
తరుణకమలనేత్రా తల్లమాంబాసుపుత్రా, విరహితమదశంకా, వీరనారాయణాంకా."

షష్ఠాశ్వాసాంతమున

'క. అరివీరబసవశంకర, శరణాగతరక్షణానుసంధానధురం
ధరసచివగంధసింధుర, ధరణీధరనైకదక్షదక్షిణహస్తా.

పైపద్యము లన్నియును బర్యాలోచించి చూడఁగా నీసింగమంత్రి
కిం గలబిరుదు లన్నియు స్పష్టము లగును.

౧. త్రిభువనరాయ వేశ్యాభుజంగుఁడు.
౨. కదనగాండీవి.
౩. జగనొబ్బగండఁడు.
౪. పాండ్యరాజ గజకేసరి.
౫. కేళాదిరాయఁడు.
౬. కర్పూరవసంతరాయఁడు.
౭. పల్లవాదిత్యుఁడు.
౮. వీరనారాయణుఁడు.
౯. అరివీరబసవశంకరుఁడు.

ఇట్టిమహాబిరుదము లన్నియు వేమారెడ్డి సింగమంత్రికి నొక్క మాఱుగనే యిచ్చి యుండె నని యూహింప లోకానుభవవ్యతిరేకమై యుండును. ఒక్కొక్కబిరుద మొక్కొకమహాకార్యము చేసినప్పు డీయంబడుట నైసర్గికము. ఇట్టిబిరుదు లన్నియు నీసింగనమంత్రిచేత నైషధగ్రంథరచనకుఁ బూర్వము పరిగ్రహింపఁబడినట్లుగనే యోచవల యును. కాఁబట్టి నైషధగ్రంథమునకుఁ బూర్వము సింగమంత్రి కేవల ము నొకగ్రామమునకు మిరాసీదారుఁడుగాక తండ్రితాతలనాఁటినుండి సంక్రమించిన రెడ్డిసంస్థాన మహామంత్రియై యుండె నని చెప్పవలసి యు న్నది. ఇదియును గాక? శ్రీనాథకవిచేత నావఱకే యీసింగనమంత్రి యన్న యగుపెద్దగడన దండనాథు డొకకృతి నందినట్లుగ నీ గ్రంథ ములోనే యున్నది. ఎట్లన్నను:—

"క. జగము నుతింపఁగఁ జెప్పితి, పెగడయ్యకు నాయనుంగుపెద్దనకుఁ గృతుల్
నిగమార్థసారసంగ్రహ, మగు నాయారాధ్యచరిత మాదిగఁ బెక్కుల్."

ఇట్లుండుటంబట్టి శ్రీనాథకవి సింగనమంత్రివంశస్థులకు నపుడపుడు గ్రంథములఁ గృతి నిచ్చుచు నుండునాస్థానకవిగా నూహింపనై యున్నాఁడు. ఇంతవఱకును శ్రీనాథునకు రాచవేమభూమీశునిసభలోఁ బ్రవేశము కల్గినట్లే తోఁచదు. శృంగారనైషధగ్రంథానంతరము రచి

యింపఁబడినభీమఖండములోఁ దద్గ్రంథకృతిపతి యగుబెండపూడి యన్నమంత్రి వంశవర్ణనము చేసి యప్రస్తుతముగా నాయన్నమంత్రికిఁ బ్రభుం డగువేమభూమీశ్వరునివంశమును వర్ణించుటంబట్టి చూడ నందు మూలముగ నైనఁ దనపేరు రాచవేమభూపాలుని చెవిం బడఁగల దను కోర్కెతో శ్రీనాథుఁ డట్లు చెప్పుటకు సందియము లేదు. అన్నమంత్రి మూలముగ శ్రీనాథుఁడు వేమభూపాలునిమన్నన వడసి యుండుటంబట్టియే చివరకావ్య మగు కాశీఖండము రచియించుటయును, తదాదిగ నాప్రభునియాస్థానపండితుఁడై యుండుటయును దటస్థించె నని యూహింపనై యున్నది. కావున శృంగారనైషధగ్రంథము నందిన మామిడిసింగన యొకభోగము దానిం దెచ్చియిచ్చినం గాని నీయింట భోజనమునకు నిలువ నని శ్రీనాథునిచేఁ బల్కింపఁబడునంత నీచస్థితిలోఁగాని నీచజన్మములోగాని యున్నాఁ డని చెప్పఁజాలియుండఁడు. శ్రీనాథుఁడు సింగనమంత్రి యనుగ్రహము సంపాదించుకొనినచోఁ దనకు విశేష ధనసహాయము గల్గుటయే కాక యెప్పటికైన నతనిప్రభుఁ డగువేమభూపాలునిదర్శనముగూడఁ గల్గు నని యాసించియు నుండును. అట్టిచో శ్రీనాథుఁడు సింగనకు నతని యజమానినైననుఁ జెప్పఁజాలనంత యతినీచకార్య మగుతార్పుడుపని చేయు మని చెప్పియుండఁడు. శ్రీనాథుఁడు స్త్రీలోలుఁ డని వాడుక యున్నది గావున నీకథ పామరజనములచేఁ బన్నంబడి యున్నట్లుగా నూహింపవలసి యున్నది.

ఈమామిడిసింగమంత్రి ముప్పదియిద్దఱు నియోగులలోని వాఁడు. ఆ సీసపద్యములో నతనింగూర్చినచరణ మెద్దియన.

"ఆంధ్ర నైషధకావ్య మందె శ్రీనాథుచే మామిడిసింగనామాత్యమౌళి"

## శృంగార నైషధగ్రంథ శయ్యాదికము.

ఇది సంస్కృతమునకు సరియైన తెనుఁగని చెప్పఁదగి యున్నను నక్కడక్కడ నుభయభాషలకును జాతీయభేదము లైనచో మాత్రము కొన్ని మార్పులు కాన్పించు. ఆ మార్పులు చేయక చెప్పుటయే సుల

భగును. అయినను అట్లు చెప్పిన నాంధ్రభాషలో నది రసహీన మగు న ని యెంచి శ్రీనాథుఁ డట్టిపట్లను మిక్కిలి మెలకువతోఁ దెనిఁగించుచు వచ్చెను. అవి సంస్కృతమాత్రకను దగ్గర నుంచుకొని పరిశీలించినంగాని స్పష్టములు కావు. అటుగావున వాని నిప్పుడు వివరింపక సమముగాఁ దె నిఁగించినయొకశ్లోకమును పద్యమును నిట వివరించెదను :—

" శ్లో. అధిగత్య జగత్యధీశ్వరా, దథ ముక్తిం పురుషోత్తమా త్తతః
వచసామపి గోచరో నయః, స్స త మానంద మవిందత ద్విజః. నైషధము ౨. సర్గము.
గీ. అట్లు పురుషోత్తముం డైనయతనివలన, ముక్తిఁ గాంచినయాద్విజముఖ్యుఁ డెలమి
డెందమునకును వాక్కున కందరాని, యధికతర మైనయానంద మనుభవించె."

ఈ గ్రంథములో గ్రంథాంతమునం దొకపద్యము భాస్కరరా మాయణములోనిపద్యముతోఁ బోల్పందగి యున్నది. ఆ పద్యముం జూ చిన నీశ్రీనాథుని కవిత్వనైపుణి బోధ యాగును.

రామాయణములోనిపద్యము.

శా. లాటీచందనచర్చ, చోళమహిళాలావణ్యసామగ్రి, క
ర్ణాటీగీతికళాసరస్వతి, కళింగాంతఃపురీమల్లికా
వాటీమంజరి, గౌడవామనయనావక్షోజహారాళియై
పాటింపం దగు నీదుకీర్తి రథినీపాలాగ్రణీ సాహిణీ."

శృంగారనైషధములోనిపద్యము.

శా. లాటీచిత్తసరోమరాళ, కుకురీలావణ్యలోలాత్మ, క
ర్ణాటీనృత్తకళావిలోకనసమారంభప్రియంభావుకా
భోటీనేత్రచకోరచంద్ర, మగధీపుష్పాస్త్ర, చోళీకుచా
ఘాటస్థాపితమన్మథాంక, కుహళీ గాఢాంకపాళిప్రియా."

శ్రీనాథుఁ డీగ్రంథమును దన ప్రౌఢవయఃకాలములో రచియించి నట్లుగఁ జెప్పె ఈగ్రంథమును బెండిపూడి యన్నమంత్రికిఁ గృతి యి చ్చె. ఇతఁడును ముప్పదియిద్దఱునియోగులలోనివాఁడు కావున సుప్ర సిద్ధుఁడే యగును. అం దితనిసీసచరణ మెట్లన్నను :—

"ఘనదైవతంబు దాక్షారామభీమేశుఁ, డని కొల్చె బెండపూఁ డన్నమంత్రి"

దీనింబట్టి చూడఁగా నన్నమంత్రి దాక్షారామ భీమేశ్వరభక్తుఁడని ప్రసిద్ధి నందెను. ఈయన్నమంత్రి శ్రీనాథు నొకనాఁడు పిలువనంపించి యీక్రిందివిధంబునం బల్కె. ఎట్లన్నను:—

"సీ. వినుపించినాఁడవు వేమభూపాలున, కఖిలపురాణవిద్యాగమములు
కల్పించినాఁడవు గాఢపాకం బైన, హర్షనైషధకావ్య మాంధ్రభాష
భాషించినాఁడవు బహుదేశబుధులతో, విద్యాపరీక్షణవేళలందు
వెదచల్లినాఁడవు విశదకీర్తిస్ఫూర్తి, కర్పూరముల దిశాంగణములందు."

గీ. పాకనాటింటివాఁడవు బాంధవుఁడవు, కమలనాభుని మనుమఁడ వమలమతివి
నాకుఁ గృతి సేయు మొకప్రబంధంబు నీవు, కలితగుణగణ్య శ్రీనాథకవివరేణ్య.

అన్నమంత్రి తన్నుం గోరఁగా శ్రీనాథుఁడు తా నీగ్రంథ మతని పేరఁ గృతి యిచ్చె నని తేలుచున్నది. పైపద్యములో వేమభూపాలున కఖిలపురాణాదికములను శ్రీనాథుఁడు వినుపించిన ట్లున్నది. ఇందుఁ బాకనాటింటివాఁడ వనుదాని కర్థము పాకనాటి కాఁపురస్థుఁడ వని కాక పాకనాటినియోగిశాఖలోనివాఁడ వని యర్థము.

పైపద్యములోనే శ్రీనాథుఁడు పాకలనాటినియోగిగాఁ జెప్పంబడియెను. ఈ శాఖవారు తాము పాకలనాటిశ్రేష్ఠుల మని వక్కాణించెదరు. వీరికి నాఱువేలనియోగిశాఖవారికిని సంబంధములు తఱుచుగా లేవు. శ్రీనాథునివా రనునతనివంశీయులలోఁ గొందఱుగోదావరీమండలములోని మొగలితుర్రులోఁ గొంతకాలముక్రిందట నివసించిరి. వారీదేశమునకు వచ్చియున్నకాలములోఁ బాకలనాటివారు పొత్తుగా లేనిగోదావరీమండలములో స్వశాఖవారితో సంబంధములు మాని యాఱువేలనియోగులతో సంబంధముల నడిపిరి. ఇటులనే పైరెండుశాఖలనియోగిబ్రాహ్మణులకు నేఁటివఱకు సంబంధబాంధవ్యములు సకృత్తుగా జరుగుచుండును.

### శ్రీనాథకవి వేమభూపాలునివంశావళి వర్ణించుట.

ఇందు శ్రీనాథుఁ డితరగ్రంథములలోవలెఁ దనకృతిపతివంశావళిని ప్రారంభింపక యతనికిఁ బ్రభుం డగువేమభూపాలునివంశముంగూర్చి ప్రథమములో వ్రాసె. ఇట్టివ్రాఁత కుద్దేశము వేమభూపాలునిగూడ నొకకృతి నందునట్లుగా నుత్సహించుట యని యూహింపవలసి యున్న

డి. వేమభూమిపాలుని వంశానువర్ణనమున మనదేశచారిత్ర కుపయోగింపఁదగినశూద్రులలోఁ గలశాఖాభేదంబులు వివరించి చెప్పెను. ఆభాగముమాత్ర మిచ్చో వివరించెదను. అది యెట్లన్నను:—

“ ఉ. కైటభదైత్యవైరిపదకంజమునం దుదయంబు నంది మి
న్నేటికి భ్రాతధాత్రికిని నెంతయు నచ్చినతోడఁబుట్టువై
పాటిఁ గర్భముఖ్యనిఖిలామరవర్గాళిమహామణిప్రభా
పాటలవర్ణ మైనయొకపావనవర్ణ ముదీర్ణసంపదన్.

వ. ఆపుణ్యవంశంబు కంసాసురధ్వంసిచరణపల్లవంబు తనకుఁ బుట్టినిల్లు గావున గారణ సంక్రమణంబునుంబోలెఁ జామర, తోమర, ఛత్ర, ధనుః,ఖడ్గాదిచిహ్నోపశోభితంబై, చెలరేఁటిసీటివలనిసోదరీయస్నేహాలబ్ధంబు లచ్చో నిపాతనత్వ, శుచిత్వ, గాంభీర్య, మాధుర్యంబులు ధరితమనః, స్వభావ, వచనంబులు ధరియించి సైదోడుం బోదవి విశ్వవిశ్వంభరాక్రీడనంబునకు విదిర్చినపరమశాంతి యంతరంగంబున సంతరించి నిఖిలప్రపంచంబునకు నాధారంబై ప్రవర్తిల్లె. అందుఁ, ౧ బద్మనాయకు లన, ౨ వెలమ లన, 3 కమ్మ లన, నడినల్లనంబంటు లన బహుప్రకారశాఖోపశాఖాభిన్నంబు లైనమార్గంబులం ద్రిమార్గగంగాప్రవాహంబునుంబోలె గోత్రంబు లెన్నెన్నియు జగత్పవిత్రంబులై ప్రవహించుచుండు. కల్పంబు లతిక్రమించి, మన్వంతరంబులు జరిగి, యుగంబులు సరిగడచి, వత్సరంబులు చని కాలచక్రంబు లతిక్రమించుచుండఁ జతుర్థవర్గాళిమండనంబై కీర్తివిహారఘంటాపథంబై వపంటవసటి మహాన్వయంబున,పాకనాటిదేశంబున భద్రపీఠంబున నధివసించి,సింహాచిక్రమనగర,దువ్వూరు,గండవరాళిపట్టణంబులు నిజనివాసంబులుగా, భవాలతాష్టాదశద్వీపాంతరాళ లగఁభూపాలగ్రామణులను, త్రిలింగభూమండలాఖండలులను, ప్రోలయవేమ, అన్నపోత, అన్నవేమ, కుమారగిరీశ్వరాదులన్ బూర్వసామ్రాజ్య పీఠస్థులం గావించె.శిత్సంబంధబాంధవంబున వసుంధరాభారధౌరంధర్యంబున, దిగ్గంధసింధురఘటుహాట, కపటకిటి, కచ్ఛపావతార నారాయణభుజంగభూధరంబులకుఁ దోడుజోడై, రాయగురుప మేశ్వర,సాధుజనవిధేయ,ఘోడెరాయ, సకలకళాధామ భీమయగురువరేణ్య పుణ్యకారుణ్యకటాక్షవీక్షాలబ్ధసుస్థిరైశ్వర్యధుర్యుఁడై విజయధాటీసమాటీకనంబుల దిశ లల్లాడ నల్లాడభూవల్లభుండు రాజమహేంద్రంబు రాజధానిగా సింహాద్రిపర్వతంబు లత్తుకళింగ,యవన, కర్ణాట, లాటాంతరీపం బైనప్రతాపంబున, దిలీప, నహుష, నాభాగ భరత, భగీరథ, మాంధాతృ, దుంధుమార, పూరు, పురూరవప్రాభవుండు, విశ్వవిశ్వంభరాభువనమండలంబు పరిపాలించె.”

పై పెద్దవచనమువలన విష్ణుపాదమందు శూద్రజాతి పుట్టె నని యుఁ అది ౧ పద్మనాయక, ౨ వెలమ, 3 కమ్మ లను శాఖాత్రయంబు

న నొప్పియున్న దనియును, కమ్మశాఖ పంటలు (రెడ్లు) మొద లగుబ హువిధశాఖలతోఁ బ్రకాశించె ననియుం దెలిసది పాక నాటిదేశములో సింహావిక్రమ నగరము, దువ్వూరు, గండవరాళి అనుపట్టణము లుండె ననియు వానిని, (౧) ప్రోలయ వేమన. (౨) అన్న పోతరెడ్డి. (౩) అన వేమారెడ్డి. (౪) కుమారగిరిరెడ్డి మొదలగువారు పాలించి రనియును, అట్టివారితో సంబంధ బాంధవ్యముం గల యల్లాడరెడ్డి రాజమహేంద్రవర ము నిజరాజధానిగాఁ జేసెనని దానికి సింహాచలపర్యంతము గలభూమికి లక్ష్మకళింగ మని నామమున్నట్లు నున్నది. దీనింబట్టి చూడ శ్రీనాథుఁడు పాక నాటిలో నున్న యన వేమారెడ్డిసభలోనివాఁడై యుండి పైయన వేమా రెడ్డిసంస్థాన మల్లాడరెడ్డివశము కాఁగాఁ దత్సంస్థానము నాక్రమించిన యల్లాడరెడ్డి నాశ్రయింపక యుండ నాతం డితనికి నన్న వేమారెడ్డి యిచ్చిన గ్రామములు రెండును హరించి తనకూఁతున కిచ్చినట్లును, అది కారణముగ శ్రీనాథుఁ డితరసంస్థానములకుం బోయి కాలక్షేపము చేసినట్లును, నితరులం గృతిపతులం జేసినట్లును గాన్పించు. పైయల్లాడరెడ్డికుమారుఁ డీ రాచవేమారెడ్డి. అతఁడు రాజమహేంద్రవరమునకు వచ్చి యా రాజ్యము తనతమ్ముం డగువీరభద్రారెడ్డికిచ్చి యతనిగుండ వ్యవహారములంజరిపించు చుండినట్లు పైవచనముయొక్క తరువాయి నున్నపద్యమువలనం గాన్పించు. అట్టివేమువీరభద్రారెడ్లను సంతసింపఁ జేయుట కీభీమఖండములో శ్రీనాథుఁడు పరిస్తుతముగనయిన రెడ్డివంశోత్కర్షయుఁ దన్మూలముగ రాచవేమ నవంశావళియును జెప్పె. ఇట్టిగ్రంథము వినిన యెన్నినాళ్లకు శ్రీనాథుఁడు కాశీఖండముఁ జేయంగోరఁబడెనో యది తెలియదుగాని ప్రౌఢనిర్భరవయః పరిపాకమున నీ భీమఖండము చెప్పినందునను.

"ప్రాయ మింతయు మిగులఁ గైవ్రాలకుండఁ, గాశికాఖండ మనుమహాగ్రంథ మేను దెనుఁగు చేసెద"

నని చెప్పుటంబట్టి చూడ నీరెండుగ్రంథములు నిరువదివత్సరముల వ్యవధిలోఁ బుట్టి యుండవచ్చునని తోఁచునుగాని శృంగారనైషధముమాత్రము నిండైన వయఃకాలములోఁ జెప్పఁబడియున్నది. అందు లోఁగూడ నీవేమారెడ్డియే నుడువఁబడెం గావున నాతని రాజ్యము ముప్పదినలువది సంవత్సరములు పొడుగుగలదిగాఁ గాన్పించును. పైని

జెప్పినకొంతపిటి రెడ్లలోనన్న వేమనకు నల్లాడరెడ్డి కొడుకున కల్లుఁ డ వ్రుటం జేసి యన వేమారెడ్డిక్రిందఁ గలపాకలనాటిభాగమునకుఁగూడ నల్లాడరెడ్డి యధికారి యయి యుండును. ఆభాగమునకు రాచవేమన యధికారి యయ్యె, రాజమహేంద్రివరముగూడ రాచవేమనకు వచ్చిన విధము రెడ్లచరిత్రలో వివరింపంబడును.

## బెండపూఁడి అన్నమంత్రి వంశము.

శ్రీనాథుఁడు వేమారెడ్డివంశమును వర్ణించి యనంతరము భీమఖండముఁ గృతినందిన యన్నమంత్రి వంశముంగూర్చి కొంత వ్రాసెను. అట్టివంశవిస్తార మంతయు "ప్రసిద్ధమంత్రి చరిత్రము" అనునాదేశచారిత్రములో వ్రాయంబడెం గావున నిపు డందలివివరముం దెలుపక యన్నమంత్రివంశస్థులలోనివా రేయేప్రభువుల కాలములో నుండిరో దానిమాత్ర మిచ్చుటఁ జూపెదను.

- కాశ్యపసగోత్రములో
  పోలమంత్రి.
  - అల్లాడమంత్రి
  - అన్నయమంత్రి (౧. కాకతిరాజుయొక్క గజసైన్య సేనాధిపతి. ౨ వీరరుద్రుని వద్ద మంత్రి.
    - దేవమంత్రి
      - లింగమంత్రి
        - (ఇతఁ డల్లాడవేమారెడ్డిచేత సెన్నుదేశ మేలించెను.) ప్రతాపవేమరాజావలన చోడపక్షుద్దగ్గర నన్న చోడవరాగ్రహార మందెను.
        - మంత్రి
        - మంత్రి
        - దేవమంత్రి
      - తల్లమంత్రి.
      - (భీమఖండఅన్నమంత్రి.) కృతిపతి (అహమ్మదుషాపాదుషాను నొప్పించెను.)
    - తల్లప్పమంత్రి

## కాశీఖండ విరచనము.

ఈగ్రంథములోపలనే శ్రీనాథుఁడు తా నీగ్రంథమును.

"ప్రాయ మింతకు మిగులఁ గైవ్రాలకుండఁ, గాశికాఖ్యం మహాప్రబంధ మేను, దెలుఁగుజేసెద"

అని వ్రాసియుండెను. ఈగ్రంథములోఁ గావ్యములుగాఁ బరిగణింప నెక్కుడగిన గ్రంథములు శ్రీనాథకృతములు సమాప్తములు. అనంతరముగూడ మఱికొన్ని గ్రంథములు చాటుపద్యముల నీకవి రచియించి యుండవచ్చునుగాని యవి వ్యాపకములో లేవు. సంస్కృతకాశీఖండము కావ్యములలో నైషధకావ్యమువలెనే పురాణములలోఁ గఠినశయ్యకుఁ బ్రసిద్ధము. కావుననే దీనికి "కాశీఖండ మయఃపిండమ్" అను పేరు కల్గినది. ఈగ్రంథము వేమ భూపాలుఁడు కోరకమునుపే శ్రీనాథుఁ డాంధ్రీకరించుచున్నట్లును, అట్టి వృత్తాంతము విని యారాజు శ్రీనాథుం బిలుపించి నీవు రచియించుచున్న గ్రంథము మాతమ్ముం డగువీరభద్రారెడ్డిపేరిటఁ గృతి నియ్యవలయు నని కోరినట్లును దీనిలోని యొకపద్యమువలన నొకవచనమువలనను గాన్పించును. ఎట్లన్నను:—

ఉ. స్కాందపురాణసంహితకు ఖండము లేఁబది యందులోన నా
నందవనానుభావకథనంబున శ్రోతకు వక్తకున్ శుభా
నందపరంపరావహము నైజగుణంబునఁ గాశిఖండ మా
కందువ యే నెఱింగి సుమకట్టితిఁ గావ్యముగా నొనర్పఁగన్.

వ. ఇమ్మహాప్రారంభంబు కర్ణాకర్ణికావశంబున నాకర్ణించి, కర్ణాంత విశ్రాంతవిశాల నేత్రుండును, బంటవంశకమలమిత్రుండును, సకలశాంతవిశ్రాణనక్రీడాపరాయణుండును వీరనారాయణుండును, నిత్యసత్యుండును, భూభువనభారభరణదీక్షాదక్షదక్షిణభుజా, భుజంగుండును, రాయవేశ్యా భుజంగుండును, కీర్తిగంగాతరంగిణీప్రవాహపవిత్రిత స్వర్గమర్త్యపాతాళుండును, జగనగోపాలుండును, విమల ధర్మశీలుండును, నగునల్లయ వీరభద్రభూపాలుం డొక్కనాఁడు.

గీ. నిజభుజావిక్రమంబున నిఖిలదిశలు, గెలిచి తను రాజ్యపీఠ మెక్కించినట్టి
యన్న వేమేశ్వరునియంక మాశ్రయించి, నిండుకొలు వుండెఁ గన్నులపండు వగుచు.

వ. అప్పుడు నన్నుం బిలువం బంచి సముచితాసనంబునం గూర్చుండ నియమించి యు న్నయవసరంబున.

సీ. రాయవేశ్యాభుజంగసంగ్రామపార్థ, గాయగోపాళవేమనక్ష్మావరుండు
కూర్మియనుజన్ముహృదయంబుకోర్కి యెఱింగి,యర్థి ననుం జూచి యిట్లని యానతిచ్చె.

సీ. నైషధాదిమహాప్రబంధములు పెక్కు, చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడ వనఘ
యిపుడు చెప్పం దొడంగినయీప్రబంధ, మంకితము సేయు వీరభద్రయ్యపేర.

పైపద్యములలోఁ "గర్ణాకర్ణికగా"అని వ్రాసి యుండుటంబట్టి శ్రీనాథుఁ డుదివఱకు పైరాజమహేంద్రవరపు రెడ్లసభలో (లేక) అక్కడ క్కడ కాలక్షేపము చేయుచున్నట్లును, అనంతరము కాశీఖండమునిమూలముగ వేమారెడ్డిసభలోఁ బ్రవేశము నందినట్లును గానుపించును.

శ్రీనాథుఁడు పైవిధంబున గ్రంథరచనకై కోరంబడి కాశీఖండ ములోఁగూఁడ నింకొకపరి వేమభూపాలునివంశవర్ణనముం జేసె.

## వీథినాటకము.

ఈ వీథినాటకముంగూర్చి శ్రీనాథకృతము లగుగ్రంథములలో నత నివలన నెక్కడను నుదాహరింపఁబడకపోయినను అప్పకవి మొదలగు తొంటి లక్షణగ్రంథకర్తలు వీథినాటకములోని కొన్నిపద్యముల నుదా హరించి యుండుటచేత నది శ్రీనాథునికృతిగానే నిర్ణయించి దానింగూ ర్చి యిపుడు డీచారిత్రములో వ్రాయుచున్నాము. అందలికథాసందర్భ ముంగూర్చి వ్రాయక పూర్వ మాగ్రంథమువలన దేశచారిత్రమునకుం గల్గినయొకలాభము నిచ్చో ముందు వివరించెదము. అది యెద్దియనంగా ఆంధ్రదేశములో శ్రీనాథునికాలమునం గలజాతులును వారిస్త్రీలభూష ణాదులును శృంగారవిశేషములును దెలియుటయే. స్త్రీలం జెప్పినప్పు డు పురుషుల జాతులుగూడఁ దెలియును. కావున వివిధజాతులు తెలి యుపరిజ్ఞాన మిందువలనం గలుగకమానదు. అవి యెవ్వియనంగా :—

౧. విప్రభామ. కేవలము వైదికవృత్తి నుండుబ్రాహ్మణుని భార్య.

౨. నరేంద్రభామ. సామాన్యక్షత్త్రియునిభార్య, అనఁగా మూర్ధాభిషిక్తులు కాకున్నను రాజు లని వ్యవహరింపఁబడుశాఖవారి స్త్రీ.

3. వైశ్యభామ, కోమటు లని యాంధ్రదేశములో వ్యవహరింపఁబడువైశ్యజాతి స్త్రీ.

౪. శూద్రభామ. ఇందు శూద్రులలో గౌరవముగా నుండి తెలగా లని వంటరు లని వ్యవహరింపఁబడుజాతి స్త్రీ.

౫. ఆంధ్రనియోగిభామ. ఆంధ్రబ్రాహ్మణులలో స్మార్తశాఖలోని లౌకికులకు నియోగు లని పేరు. అట్టినియోగులు కేవల మాంధ్రదేశములో నుండువారే కావున వారికి నాంధ్రనియోగిశాఖ యని నామంబు చెప్పెను. శ్రీనాథకవియు నాశాఖలోనివాఁడే. అన్నిశాఖల స్త్రీలను వర్ణించునపుడు తనశాఖ స్త్రీనికూడ వర్ణింపవలయుం గావున నదియును జెప్పెను.

౬. నియోగిస్త్రీ. నియోగులలోఁ దెలగాణ్యు లనియు, నందవరీకు లనియు నింకను వివిధశాఖ లున్నవి. అట్టిశాఖల నన్నిటింగూర్చి యుక్కపర్యాయము నియోగిశాఖాస్త్రీని వర్ణించెను.

౭. వేపార్యంగన. ఆంధ్రదేశములోని మధ్వమతస్థు లగుబ్రాహ్మణశాఖవారికి "వేపారు" లనువ్యవహారము కలదు. వీరికి కన్నడము, ద్రవిడము, మొదలగుదేశములలో వైష్ణవు లని వ్యవహారము కలదు. రామానుజమతస్థులు వైష్ణవశబ్దవాచ్యులుగా నున్నను వారి నాదేశములలో మూఁడునామములవైష్ణవు లని వ్యవహరింతురు. అట్టివారిని శ్రీనాథుఁ డాంధ్రదేశవ్యవహారానుసారముగ వైష్ణవు లని వ్రాసియున్నాఁడు.

౮. మఱియొకవేపారిస్త్రీ. ఆంధ్రదేశములో ఋక్శాఖాబ్రాహ్మణులలోఁ గొందఱకుఁ గరణకమ్మవేపారు లనియు, తెలగాణ్యులలో

వైష్ణవమతప్రవిష్టులుగా నున్నవారికి గోలకొండవేపారు లనియు నామము గలదు. కావున మఱియొకవేపారీస్త్రీనిగూడ వర్ణించెను.

౯. కర్ణాటాంగన. ఋక్శాఖాబ్రాహ్మణులలో వైదికవృత్తి నుండువారికిఁ గర్ణాటకు లనియు, కరణకమ్మలు (కనడాకమ్మెవా రని యర్థము) అనియు వ్యవహారము గలదు. అట్టివారింగూర్చి యిందుఁ జెప్పెను.

౧౦. కాసలనాటి స్త్రీ. ఆంధ్రదేశములోని వైదికశాఖాబ్రాహ్మణులు వెలనాటివారు, వేఁగినాటివారు, కాసలనాటివారు, తెలగాణ్యులు మొదలగు నామములతో నొప్పియున్నారు. కాని వారిలో శ్రీనాథునిచే నొక్కకాసలనాటివారుమాత్రమే చెప్పఁబడుటచేత నాకాలమునకుఁ దక్షిణశాఖలబ్రాహ్మణు లీదేశమునకు వచ్చియుండకపోవచ్చును. ద్రావిడు లనుదాక్షిణాత్యశాఖయు వర్ణింపఁబడియె.

౧౧. వైష్ణవస్త్రీ. రామానుజమతస్థు లగుబ్రాహ్మణశాఖవారికి వైష్ణవు లని యాంధ్రదేశములో వ్యవహార మున్నట్లీవఱకే చెప్పియుంటిమి. ఇందులో నట్టిశాఖలోని స్త్రీని వర్ణించెను.

౧౨. నంబిస్త్రీ. పైరామానుజమతస్థులలోనే "పాంచరాత్రము వైఖానసము" అనురెండుశాఖ లున్నవి. అందు వైఖానసశాఖనుబట్టి విష్ణ్వాలయములలో నర్చనాదికములఁ జేయుశాఖవారిని నంబులని వ్యవహరించెదరు. ఆనంబులస్త్రీ యిందు వర్ణింపఁబడియె.

౧౩. పూజారిస్త్రీ. స్మార్తులలో శివాలయములలో నర్చాదికము జరుపుటకు వెలనాటిపూజారు లనియును, తంబళు లనియు రెండు శాఖలబ్రాహ్మణు లున్నారు. ఈపద్యములో వర్ణింపఁబడినస్త్రీ లాయిర్వురని యెంచవలయును.

౧౪. అగసాలిస్త్రీ. ఆంధ్రదేశములోఁ బంచాణ్ణమువా రనుపేరుతో నొప్పునైదుశాఖలవిశ్వకర్మకులస్థు లున్నారు. వారిలో బంగారు

పనిచేయుశాఖకు "అగసాల" లనియు, "కంసాలు" లనియు నామము గలదు. ఆశాఖలోని స్త్రీ లిందు వర్ణింపఁబడిరి.

౧౫. బొందిలీ స్త్రీ. బుందేలు ఖండ మనునుత్తరహిందూస్థాన దేశములో నుండునొక దేశమునుండి వచ్చి యనేకసంవత్సరములక్రిందట నాంధ్రదేశములో స్థిరపడియున్న గౌడదేశపు బ్రహ్మ, క్షత్రి, శూద్రశాఖలవారు బొందిలీలుగా వ్యవహరింపఁబడుదురు. వారి స్త్రీ లిందు వర్ణింపఁబడిరి.

౧౬. జంగముభామ. కన్నడదేశమునుండి చిరకాలముక్రిందట నాంధ్రదేశమునకు వచ్చినశూద్రశాఖలోనిలింగాయతులగురుపీఠస్థులకు జంగము లని పేరు. అట్టి శాఖ స్త్రీ నిందువర్ణించె.

౧౭. లింగబలిజె స్త్రీ, శూద్రులలోపలనే లౌకికవ్యాపారమును జేసికొనుచు లింగాయతులుగా నున్నశాఖలు లింగబలిజె లని పేరు. వారి స్త్రీ యిందు వివరింపం బడియెను. లింగాయతులు కానిబలిజెకులము వారిని గాజులబలిజెశాఖ యని చెప్పుదురు. వీరి కాంధ్రశూద్రులలో శ్రేష్ఠు లైనతెలగా లనివ్రాఁతకలదు.

౧౮. రెడ్డి స్త్రీ. పైశూద్రశాఖలోఁ గొందఱు రెడ్లని పిలువఁబడుదురు. శ్రీనాథకవి యీరెడ్డివంశస్థులగు వేమ, వీరభద్రరెడ్లకే కాశీఖండము కృతి యిచ్చెను, ఆరెడ్ల స్త్రీ లిందు వర్ణింపఁబడిరి.

౧౯. సాతానిభామ. ఆంధ్రదేశములోని వైష్ణవమతస్థులై లౌకికవ్యాపారమును వదలుకొని కేవలము మతబోధమును, వైష్ణవధర్మాచరణమును ప్రధానముగాఁ గలశాఖకు సాతాను లని పేరు. అట్టిసాతానుల స్త్రీ యిందు వర్ణింపఁబడియెను.

౨౦. సాలెత. లింగాయతమతస్థులలోని జంగముశాఖను గురువులుగా నేర్పఱిచికొని యున్నశూద్రశాఖకు, సాలె లని, దేవాంగ లని, కరిణిబత్తు లని మొదలగునామము లున్నవి. వీరందఱును తంతుకారులు. వీరి స్త్రీ లిందు వర్ణింపఁబడిరి.

౨౧. భోగభామినీ. ఆంధ్రదేశములో నవివాహిత స్త్రీసంతతికి సాను లని నామము గలదు. ఇందు సానిశాఖ, భోగముశాఖ, జక్కులశాఖ, కాళింగశాఖ మొదలగుశాఖ లనేకములు గలవు. పై యందఱకును భోగిపిశాఖ యని పేరు. ఆ స్త్రీ లిందు వర్ణింపఁబడిరి.

౨౨. ఒడ్డెయువతి. ఓడ్రదేశమునుండి యాంధ్రదేశమునకు వచ్చి యుండువారికి "ఒడ్డె" లని పేరు. అందులో శిష్టకరణమనియు,పండాలనియు ఒడ్డెవారనియుఁ పలువిధనామములు గలశాఖ లున్నవి. కేవల లౌకికవ్యాపారము గల్గి చదువరులుగా వచ్చినశాఖవారిని "శిష్టకరణము" లందురు. వర్తకవ్యాపారము చేసికొనుశాఖవారిని "పండా" లందురు. నీచకృత్యములం జేయు వారిని "ఒడ్డె" లందురు. ఈ పద్యములో నట్టియొడ్డెలు చెప్పంబడిరి.

౨౩. తమలపాకుల స్త్రీ. పైయోఢ్రదేశపు శాఖలోని యాంధ్రులే తమలపాకులవ్యాపారముమాత్రము చేయువారిని పండా లని వ్యవహరింతురు. అట్టిపండాల స్త్రీ లిందు వివరింపఁబడిరి.

౨౪. కుమ్మరి స్త్రీ. కుంభకారునియువిద.

౨౫. చాకలియువతి. రజకి.

౨౬. బిబ్బీలు. తురుష్కుల స్త్రీలు.

౨౭. పింజారీ స్త్రీ. దూదేకులకుల మని వ్యవహరింపఁబడుశాఖ. ఈశాఖకు భాష ఆంధ్రము, మతము మహమ్మదీయము.

ఇట్లుగా దేశచారిత్రమునకు వలయువృత్తాంతములం దెల్పిన శ్రీనాథుఁ వీథినాటకముంగూర్చి వ్రాయుచో నాగ్రంథమునకుం గలదోషములును, దానిని రచియించుటచేత శ్రీనాథునకుఁ గల్గినయపయశస్సును జెప్పవలసియున్నను, ఈవీథినాటకము చదివినతోడనే శ్రీనాథకవి స్త్రీలోలుఁ డని జారుఁడని యుండుటచేతఁ దనకుం గలిగినయనుభవంబు నిట్లుగా గ్రంథస్థము చేసె నని పండితపామరు లందఱకును దోఁచకపోదు. అట్టియభిప్రాయము గలుగకపూర్వము లోకానుభవము

కొంచెము తెలిసియుంట మంచి దని విన్నవించెదను. లోకములో నెట్టి మూర్ఖుఁడైనను దాను జేసిన తప్పులను బైటఁ బెట్టికొనఁడు. అట్టిచో శ్రీనాథుని వంటి మహాప్రాజ్ఞుఁడు లోకములో నందఱిచేతను గర్హితమగునట్టి వర్ణనలు తనపయిం బెట్టికొని ప్రకటించునా? అట్లుగా నతఁడు చెప్పియున్నను, అతని కాప్తులుగా నుండువారు నివారింపరా! కాఁబట్టి పైగ్రంథమును శ్రీనాథుఁడు స్వకామపూరణార్థముగానీ, కామప్రకటనార్థముగానీ చెప్పిన ట్లూహింపఁదగదు. ఇఁక నీ గ్రంథరచనమున కేమి కారణ ముండు నని యూహింపవలసి యున్నది. దాని నీక్రింద వివరించెదను.

నాటకములు పదివిధములుగా నుండును. అందు వీథి యనునది యొక నాటకభేదము. ఎట్లన్నను — ప్రతాపరుద్రీయము.

శ్లో. నాటకం సప్రకరణం భాణః ప్రహసనం డిమః,
వ్యాయోగ సమవాకారౌ వీథ్యంకేహామృగా దశ.

శ్రీనాథకృతనాటకమునకు వీథి యను నాటకలక్షణము పట్టును. ఇట్టిచో నిది శ్రీనాథునివలన వీథిలో నాటకు నేర్పఱుపఁ బడిన ట్లూహింపఁగూడదు. ఈవీథినాటకములో నొకవిటుఁడు తనకుఁ గల లోకానుభవమును దనమిత్త్రునితోఁ జెప్పినట్లుగా వ్రాయంబడెను. అంతమాత్రమున వానిలోని యభిప్రాయానుసారముగ శ్రీనాథుఁడు తననే యుద్దేశించి చెప్పిన ట్లూహించుట పొరపాటు. ఈనాటకములో నుద్దేశింపఁబడిన స్థలములు రెండుమూఁడు గలవు. అందు నాంధ్రదేశములో నుత్తరముగా నుండు సింహాచలదేవస్థాన మొకటి. ఆంధ్రదేశములో దక్షిణమున నుండు నద్దంకిపట్టణ మొకటి. దానికిని దక్షిణముగా నుండు శ్రీరంగదివ్యస్థానము మూఁడవది. తీర్థవాసులు దివ్యస్థలములకు వచ్చుట సహజముగనుక కథానాయకుఁ డిటువంటిచోట్లకు వచ్చిన స్త్రీలను వర్ణించుచున్నాఁడు. సింహాచలము నాటకరంగ మైనందులకుఁ బ్రమాణము.

"సీ. హరినీలములఁ కప్పు లణఁగించుననుకొప్పు, సిరిపువ్వుదండతో వీఁగఁబాఱఁ
గోటిచందురుఁడాలు కొనివేయఁగాఁ జాలు, మొగమునందు ముక్కు సొగసుగుల్క
అలజక్కవలఁ జిక్కు లణఁగఁద్రొక్కఁగ నిక్కు, పాలిండ్లపై నాఁచు పైఁట జాఱ
నిసుకతిన్నెల మెట్టి పసిఁడిచెంపలఁ గొట్టు, పిఱుఁదుపై మొలనూలు బెళుకు దేర

తే. చిగురుకెమ్మోవి పగడంపుసిరులు మెఱయ, మాటలాడంగఁ గనుదోయి తేటలమర
చెమట లూరంగ సింహాద్రిఁ జేరవచ్చె, భోగగుణధామ యాంధ్రవియోగిభామ."

ఇంక ననేకపద్యము లున్నవి. అద్దంకిపట్టణము రెండవరంగ మైనందుల కుదాహరణము:

"సీ. తళ్కుతళ్కున కాంతి బెళ్కుకెంపులముంగ, అందమై కెమ్మోవియందుఁ గుల్క
ధగధగద్ధగలచేఁ దసరారు బంగారు, గొలుసులింగపుకాయ కొమరుమిగుల
నిగనిగన్నిగలచే నెఱసి చెల్వగు గబ్బి, పేనుమిన్నందుల మెలఁగుచుండ
రాజహంసవిలాస రాజితం బగు యాన, మందు మట్టెలు రెండు సందడింప

గీ. సరసచూపుల పటువను గరఁగఁజూచి, పొందికైనట్టి మోమున భూతిరేఖ
రాజకళలొప్ప నద్దంకి రాజవీథి, బొలిచె నొకకొమ్మ గాజులముద్దుగుమ్మ."

శ్రీరంగ మొకరంగస్థల మైనందులకు.

"గీ. చెమటచేఁ బసనామంబు చెమ్మగిల్ల, పాళి డాచేత విడియంబు గీలుకొల్ప
రంగపురిరాజవీథిఁ గానంగ నయ్యె, నాదు మది కోర్కెలూర వైష్ణవవధూటి"

ఈవీథినాటకములోనిపద్యములలోఁ గొన్ని వర్ణన లద్భుతంబుగను మఱికొన్ని వర్ణనాంశములో నొకలోపమును లేకున్నను నిప్పటికాలమువారికి నేహ్యములుగాను నుండును. ఆగ్రంథము కేవలము పండితులకుగా నుద్దేశింపఁబడకపోఁబట్టి యెట్లుచెప్పఁబడినను పరిగణియింప నవసరములేదు. గుణగ్రహణపారీణులు దోషమును వదలి గుణమునే యవలంబించెదరుగదా.

## రాజమహేంద్రవరపండితులంగూర్చి.

వీథినాటకములో నుదాహరింపఁబడిన పద్యములంగూర్చి నాకుం బోలినమట్టుకు వ్రాసియున్నాను. ఆగ్రంథము చివరనే శ్రీనాథునిపద్యము లని మఱికొన్ని చాటుధార లుదాహరింపఁబడియున్నవి. వానిలోని పద్యములే యిదివఱకును జారిత్రములోఁ గైకొనందగినవి. అట్టిపద్యములలో రాజమహేంద్రవరములోని పండితుల నిందించుచు నొకపద్యము వ్రాయంబడినది. దానికిఁ గారణము మాత్రము విస్పష్టము కాలేదు. శ్రీనాథుఁడు పరస్థలస్థుఁ డగుటంజేసి యతనిరాక రాజమహేంద్రవరములో వీరభద్రారెడ్డి సభలోనిపండితుల కయిష్టముగా నుండుట స్వభా

వమే యగును. ఈశ్రీనాథుండు ప్రభునియొద్దఁ ప్రవేశము గల్గించుకొను టయ కాక యతని కనన్యసాధ్య మగుకృతి నిచ్చి యతనివలనఁ గృతిస దృశ మగుగౌరవము నందియుండును. దాని కాతనిసభలోనిపండితులు తార్కికులు కుయుక్తిని నెగతాళి చేసియుందురు. దానికిగాను శ్రీనా థునివలనఁ బైపద్యము రచియింపంబడియుండును. ఆపండితులు చేసిన యాక్షేపణలు జీర్ణములై హాస్యగతములైనవియు శ్రీనాథునియాక్షేపణ శాశ్వతమైనదియు నయ్యె. ఆపద్యములో రసము తక్కువ యన్నటం జేసి దాని నిట వివరింపక రాజమహేంద్రవరము పండితులమార్గము గైకొని న పండితు లున్నచో శ్రీనాథకవిమార్గము గైకొన్న గ్రంథికు లుండుట గూడ సహజ మనియు, అది యుభయపక్షములం గూడ దనియు విప్పి చెప్పెదను.

ఈవీథినాటకవిశేషములు నాదేశచారిత్రములో మరల విస్తరిం పఁబడుం గావున నిప్పటి కీగ్రంథముంగూర్చి విస్తరింపను. శ్రీనాథకవిచా రిత్రములోఁగూడఁ పెంచి వ్రాయుట కాధారములు లేవు గావున నింకొకవృత్తాంతంబుతో దీనిని ముగించెదను. అది యెద్దియన శ్రీనాథు నిచరమావస్థలోఁ జెప్పఁబడె నని యాంధ్రకవి చరిత్రములో వ్రాసిన పద్యవిమర్శనము. అం దె ట్లుండె నన;—

"శ్రీనాథుఁడు తన కాశ్రయు లైన వేమారెడ్డియు వీరభద్రారెడ్డి యు మరణము నందినతరువాతఁ గూడఁ గొంతకాలము బ్రతికియుండె ను. ఆకాలమునం దతఁడు కృష్ణాతీరమునందు బొడ్డుపల్లె యనునొకగ్రా మము గుత్తచేసి నదీప్రవాహమువలన సస్యము పోఁగా గుత్తధనము రాజునకుఁ గట్టలేక వారిచే బహువిధము లైన బాధలు పొంది తుదకు మిక్కిలి బీదతన మనుభవించెను. ఈసంగతి శ్రీనాథకృతము లైనయీ క్రిందిపద్యములవలన నెఱుఁగవచ్చును :—

సీ. కవిరాజుకంఠంబుఁ గౌఁగిలించెనుగదా, పురవీథి నెదురెండ పొగడదండ
సార్వభౌమునిభుజాస్తంభ మెక్కెనుగదా, నగరివాకిట నుండునల్లగుండు
ఆంధ్రనైషధకర్తయంఘ్రియుగ్మంబునఁ, దగిలియుండెనుగదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేత, వియ్యమందెనుగదా వెదురుగొడియ,

గీ. కృష్ణవేణమ్మ కొనిపోయె నింతఫలము, బిలబిలాక్షులు తినిపోయెఁ దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేటి మోసపోతి, నెట్లు చెల్లింతుఁ దంకంబు లేడునూర్లు.

సీ. కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి, రత్నాంబరంబు లేరాయఁ డిచ్చుఁ
గైలాసగిరిఁ బండె మైలారువిభుఁ డేఁగి, దినవెచ్చ మేరాజు దీర్పఁగలఁడు
రంభఁ గూడెఁ దెనుంగురాయరాహుత్తుండు, కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు
స్వర్గస్థుఁ డయ్యె విస్సనమంత్రి మఱి హేమ, పాత్రాన్న మెవ్వని పంక్తిఁగలదు.

గీ. భాస్కరుండను మున్నె దేవునిపాలి కరిగెఁ,గలియుగంబున నిఁక నుండఁగష్టమనుచు
దివిజకవివరుగుండియల్ దిగ్గురనఁగ, నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి.

ఇట్లున్న పై సీసపద్యములు రెండును శ్రీనాథకృతములు లగునా యని యొకశంక పొడముచున్నది. దీనికి గ్రంథదృష్టాంతములు కానరావు. శ్రీనాథకృత గ్రంథములలో నివి యుండు నని చెప్పుట యసందర్భమే. అటు గాకున్న శ్రీనాథునిపద్యములుగా నితరలాక్షణికులచే నుదాహరింపఁబడియు నుండలేదు. పద్యములు చదివినతోడనే యివి శ్రీనాథకృతములు కావేమో అను నొకశంక పొడముచున్నది. దానికి మొదటి కారణము శ్రీనాథుఁడు తనచివరకాలములోఁ గృష్ణాతీరమునందుండునట్లు చెప్పుట. రెండవది యప్పటిరాజుదగ్గఱ నొకగ్రామము గుత్తకుఁ గొనుట, మూఁడవది యాగుత్త సొమ్మియ్యలేకున్న నతనికాలికి సంకెలలు వేయంబడెననియు,వీఁపుపైని నల్లని యొకఱాతిగుం డెత్తింపఁబడె ననియు నుండుట. పైవానిలో మొదటిది యగుచివరకాలములోఁ గృష్ణాతీరమున శ్రీనాథుఁ డున్నాఁడని చెప్పుమాటకు సహకారము లగుగాథలు లేవు. దీనికి వ్యతిరేకముగా శ్రీనాథునిబాల్యవయసు మొదలు రాజమహేంద్రవరప్రభువు లగురెడ్లకును వారిమంత్రులకును గృతుల నిచ్చుచుండుటయే అతనిముసలితనములోఁ గృష్ణాతీరమున వసియించి యుండె ననుమాటను బూర్వపక్షము చేయుచున్నది.

రెండవయంశ మగుకృష్ణాతీరములోనిరాజకడ నతఁడు బొడ్డుపల్లె యనుగ్రామము గుత్తకుఁ గొనె ననునది. పూర్వకాలము కవులకు ననేకగ్రామములు శాశ్వతముగాఁ గాకున్న జీవితకాల మనుభవించుటకైన నియ్యఁబడునాచారంబు కాన్పించుచున్నది కాని పైవిధమున

గుత్తకీయంబడినట్లుగా నీకట కెక్కడను దృష్టాంతములుకాన్పించ లేదు. శ్రీనాథునకుఁ గాశీఖండరచననాఁటికే ముసలితనము వచ్చియుండును. అట్టిచో నంతవయస్సు చెల్లినపిమ్మట గ్రామములు గుత్తకుఁ దీసియుండుటయు, సంశయింపవలసినయంశమే యయి యుండును. ఇఁక మూఁడవయంశములోఁ జెప్పంబడిన నల్లగుండెత్తించుటయును, సంకెలలు వేయించుటయు మఱియు నసందర్భములుగాఁ గాన్పించుచున్నవి. పూర్వకాలములో వ్యవసాయదారులు పన్నియ్యలేనిచోఁ గొందఱు క్రూరు లగుగ్రామయజమానులవలన నిట్టిదండనలు సామాన్యక్షుద్రప్రజలవిషయమై చేయంబడి యున్నట్లు వినుచున్నాము గాని శ్రీనాథునివంటి కవివరునకు గ్రామమును గుత్తకుఁగొని యున్నవానికిఁగూఁడ నిట్టిశిక్ష గ్రామయజమానివలనఁ గాక రాజువలననే చేయంబడియుండె ననుమాట మఱియు నసందర్భముగా గాన్పించు. కవుల కుపకారము చేయుతలంపునఁ బ్రభువులు గ్రామములు బహుమానముగాఁ గాని గుత్తగాఁ గాని యిచ్చియున్నను వానిపైఁ దమ కుండుస్వాతంత్ర్యమును వదలకున్న నుండెడరుగాని యందుకుఁగా నొకపన్నేర్పర్చుటయు నది యియ్యనినాఁడు వారిఁగూఁడ నితరులవలె దండించుటయు నిప్పుడు మనము వ్రాయుచున్నశ్రీనాథునికాలము జరిగియుండదు ననుట కేవలమసందర్భము. ఆకాలము కవు లలిగినఁ దిట్టిచంపుదు రనుభయము విశేషముగాఁ గలిగి యుండెను. ఒకవేళ శ్రీనాథుఁడు సొమ్మియ్యలేకున్న నేదియేని గ్రంథ మొకదానిని రచించి యారాజునకో లేక తత్సమీపవాసస్థు లగు మఱియొకరికో కృతి యిచ్చి సొమ్ము తెచ్చి యిచ్చివైచునుగాని యిందులకుఁగాను నిగళబద్ధుఁడై యాసంగతి గ్రంథస్థము చేసియుండుట తటస్థింపదు. కాఁబట్టి యీపద్యములోనిసంగతులు యథార్థము లని చెప్పుట సరికాదు.

ఇఁక రెండవపద్యములో శ్రీనాథుఁడు దివి కేఁగుట వ్రాయంబడినది. అదియు నసందర్భముగానే కాన్పించుచున్నది. ఈశ్రీనాథుఁడు

చనిపోవునప్పటికి నతనికాలములో నతనికి దాతలుగా నుండు ప్రభువు లందఱు చనిపోయి యుండిరనియును, అందుచేత నతఁడు బ్రతికి యుండఁగూడ దని చెప్పినట్లున్నది. అట్లుండునా యని యూహింప వలసి యున్నది. ఇందఱు ప్రభువులు గతించువఱకు శ్రీనాథుఁ డున్నాఁ డనఁగ శ్రీనాథుఁడు విశేషకాలము జీవించియుండు నని చెప్పుట కీపద్యము కల్పింపఁబడినట్లు కాన్పించుఁగాని యిది యథార్థ మని చెప్పుటకుం జాలదు. కవి కొకప్పుడు దాత లున్నారు ఒకప్పుడు లే రని యూహింపఁబని యుండదు. కొందఱు దాతలు గతించినను క్రొత్తదాత లేర్పడకపోరు. పై రెండుపద్యములును కల్పితములే యయి యుండిన నీక నతని నిర్యాణకాలముం జెప్పుటకుఁ దగినయాధారములు మఱియేవి యున్నవో వానిని మనమారయవలయును. ఆపని యిప్పటికిఁ జేయుంజాలము గనుక నింతటితో నీవృత్తాంతము నిల్పియుంచెదను.

## శ్రీనాథునిసమకాలీనుఁ డగురాయ లెవ రని.

పై రాయలసంస్థానమునకు శ్రీనాథునికాలములో నధికారియెవ్వ రని యొకశంక పొడముచున్నది. ఆశంకఁ దీర్చుటకుఁగాను దండకవిలోఁ జెప్పంబడియున్న రాయలపేరుంగూర్చి విచారింపవలసియున్నది. అందుఁ గృష్ణదేవరాయ లని యున్నది. ఇంతియ కాక యీకృష్ణరాయలే కొండపల్లి కొండవీడు మొదలగు దుర్గములం జయించి గజపతికూఁతుం బరిణయంబై సింహాచలములో జయస్తంభములు వేయించి తిమ్మరసు మంత్రితోఁగూడి రాజ్యపరిపాలన చేసిన కృష్ణరాయలే యనియుం జెప్పంబడి యున్నది. శ్రీనాథునికాలము శా. స. ౧౩౫౦, సమీపకాల మగుటచేతను, ఇదివఱలో స్థిరపఱుపఁబడినచారిత్రాంశము లన్నియు దీనివలనఁ దాఱుమాఱుగాఁ జేయంబడును. కాని దీనికి సహాయముగాఁ గృష్ణరాయనిర్యాణముంగూర్చి చెప్పంబడియున్న యొకపద్యము కానుపించుచున్నది. ఆపద్యము నీక్రింద వివరించి దాని కెట్లు సమాధానము చెప్పవలయునో ఆలోచించెదము.

ఆపద్య మెట్టిదనిన :—

" ఉ. భోరున యాచకప్రతతిబుద్ధి విపజ్జలరాశిఁ గ్రుంగఁగా
నారయ శాలివాహనశకాబ్దము లద్రి, గజాగ్ని, సోములన్
దారణనామవత్సరనిదాఘదినంబున జ్యేష్ఠశుద్ధష
ష్ఠీరవివాసరంబున నృసింహునికృష్ణుఁడు నస్తమిల్లె నా
ద్వారక నున్నకృష్ణుఁ డవతారసమాప్తము నందు కైవడిన్."

పైపద్యమునందు వివరింపఁబడిన కాలము :—

అద్రి=౭. గజ=౮. అగ్ని=౩. సోమ=౧. అనఁగా "అంకానాం వామతో గతిః" అను సూత్రముంబట్టి ౧౩౮౭ అయినది.

దీనిని రూఢిపఱుచునట్టికృష్ణరాయకృతభూదానశాసనములు గలవు. అందు శా. స. ౧౩౩౩ స్వభానుసంవత్సరమున అత్తోటపాటిలోఁ గొంతభూమి విడఁదీసి దానికిఁ గంచవర మనునామ ముంచి, అగస్త్యేశ్వరస్వామికి నిత్యదీపారాధనఖర్చులకు "కుంచే అమ్మసాని" అను వేశ్యవశమున నిచ్చె నని యున్నది.

అటుపిమ్మట దేశము నశ్వపతు లేలి రనియును, అనంతరము సదాశివరాయ లేలినకాలములో ననఁగా శా. స. ౧౪౬౪ అగుశోభకృతు సంవత్సరములో చిలకమర్తి వల్లభాచార్యులకు "గోవాడ" అనుగ్రామ మిచ్చినట్లును, శా. స. ౧౪౬౭ మునకు సరియైన విశ్వావసుసంవత్సరములో కందాళ్లఅయ్యవార్లంగారికి అనుమర్లపూడి గ్రామము నిచ్చె ననియుం జెప్పి యున్నది. ఇట్లుగా వివరింపఁబడినపేరు లన్నియును, నసంగతము లని యెంచి కృష్ణరాయ నిర్యాణపద్యమును "ఆంధ్రకవిచరిత్రము" లో వలెనే శాలివాహన శతాబ్దమును పదునేనవశతాబ్దముగా సవరించుటకంటె నిట్టిభేదము లుండుట కేమైనను గారణము లుండునా? అని యూహించుట న్యాయమై యుండును. అట్టిసంవాదము కృష్ణరాయ చరిత్రములోఁ జేయవలసిన దగుటంజేసి దాని నిచ్చో వివరింప మానినాఁడను. కాని యీచరిత్రము చదివినపిమ్మట శ్రీనాథకవికాల

ములోఁగూడ నొకకృష్ణరాయ లున్నాఁడనియును, అతఁడును, అల్లసాని పెద్దనకవిసమకాలీనుఁ డగుకృష్ణరాయనివలెనే విశేషఖ్యాతిం గల్గి యుండె ననియును, అతనినిర్యాణము కొండవీటిసీమలో సర్వత్ర శా.స ౧౩౭౮ గనే వ్యవహరింపఁబడుచున్న దనియును, నీ కృష్ణరాయఁడు రావు సర్వజ్ఞసింగమనీనిసమకాలీనుఁడనియును, సింగమనీఁడు కృష్ణరాయని సామంతప్రభులలో నొక్కఁడుగా నుండి యతని స్తోత్రముచేయు బిరుదులలో నొకబిరుదును కృష్ణరాయఁడు దాసీపుత్త్రుఁడనుకారణము వలన నుచ్చరింప నొల్లక తుదిని సింగమనీఁడు ప్రాణంబులు విడిచె నని యును గలకథల కన్నింటికిని సమన్వయము కావలసి యున్నది. కృష్ణరాయనిర్యాణాదికముంగూర్చి చిరకాలము క్రిందటఁ బురుషార్థప్రదాయనీ పత్త్రిక పైపద్యానుసారమే యని నిష్కర్షించినది. కావున నీశ్రీనాథుని కాలములోని కృష్ణరాయ లెవ్వ రనుదాని నిందు నిర్ధారణచేయక యిద్దరు కృష్ణరాయ లుండి రనుమాటమాత్రము జ్ఞప్తిలో నుంచుకొనఁ గోరెదను.

ఆంధ్రపంచకావ్యకవులచరిత్రము

స మా ప్త ము.

శ్రీరస్తు.

# కవిజీవితములు.

ఆంధ్రద్వ్యర్థికావ్యకవులచరిత్రము.

## 14.

## పింగళిసూరన.

ఇతఁడు ద్వ్యర్థికావ్యకర్తలలో మొదటివాఁడు. ఈతనికి ముందు ద్వ్యర్థికావ్యరచనకై వేములవాడ, భీమకవి యత్నించె ననిమాత్రము తెలియవచ్చునుగాని ఆగ్రంథము కొనసాగినట్లు తెలియదు. ఉన్నను అది యెచ్చటను దొరకుటయును లేదు. ఈసూరనకావ్యములలోఁ బ్రథమమైనది రాఘవపాండవీయ మనుద్వ్యర్థికావ్యము. ఇది పుట్టినకొన్ని దినములకే భట్టు రామరాజభూషణునివలన హరిశ్చంద్రనలోపాఖ్యానమనుమఱియొకద్వ్యర్థికావ్య ముద్భవించినది. ఈరెండుగ్రంథములైన పిమ్మట మఱికొందఱు కవు లాంధ్రంబున ద్వ్యర్థికావ్యములు రచియించుటకు యత్నించినారు. మూఁడర్థములు వచ్చునట్లుగాఁ గూడ కొందఱాంధ్రకావ్యములం జేసియున్నారు. కాని వాని కన్నిఁటికి నీపైరెండుగ్రంథములకు వచ్చిన వ్యాపకము గాని ప్రతిష్ఠ గాని వచ్చియుండలేదు. ఆధునిక కవులలోఁ బిండిప్రోలు లక్ష్మణకవి యనునొకయాంధ్రకవి లంకావిజయ మనునామాంతరము గల "రావణదమ్మీయము" అనునొక ద్వ్యర్థికావ్యమును రచియించినాఁడు. ఇతఁడును తనసమకాలీనులలో విశేషవిఖ్యాతిఁ గాంచినవాఁ డౌటంబట్టియు, గ్రంథ మతిప్రాగల్భ్య

తత్తో నొప్పుటంబట్టియు నీతనిద్వ్యర్థికావ్యము బుధజనాదరణీయం బయ్యెను.

పై ముగ్గురు గాక ద్వ్యర్థికావ్యకవులు కొంద అున్నను వారి చారిత్రములు వ్యాపకములో లేవుగావున వారిని వదలివేసి యీభాగ ములోఁ బైముగ్గురుకవులచారిత్రములు మాత్రము తెలిసినవఱకు వినిపించెదను.

## పింగళిసూరనకవి వంశవర్ణనముంగూర్చి.

ఈకవి తాను ప్రథమమునలో రచియించిన రాఘవపాండవీయము లోఁ దనవంశముంగూర్చి చెప్పికొని యుండలేదు. అనంతరగ్రంథ మగు కళాపూర్ణోదయములోఁ బలఁగూడఁ జెప్పియుండఁ డయ్యె. పిమ్మట మఱి కొన్నిదినములకు దాను రచియించుటకు నేర్పఱచుకొనినప్రభావతీప్ర ద్యుమ్న మనుప్రబంధములోఁ దనవంశమంతయు సవిశేషముగఁ జెప్పె ను. సూరనకవి తాను రచియించినగ్రంథములలో నావఱకు తనవంశా వళి వర్ణింపకపోవుట యొకకొఱంతగావున దాని నివారించెద నని ప్రభా వతీప్రద్యుమ్నములో నీక్రిందివిధంబునఁ జెప్పికొనియెను.

మ. జనముల్ మెచ్చఁగ మున్రచించితి నుదంచద్వ్యర్థిన్ గారుడం
బును శ్రీరాఘవపాండవీయము కళాపూర్ణోదయంబుకా మఱికా
దెనుఁగుంగబ్బము లెన్నియేనియును మత్పిత్రాది దినంకాభివ
ర్ణన లేమిం బరతుష్టి నా కవి యొనర్పం జాల వత్కృన్న తికా.

దీనింబట్టి ఆవఱకు సూరనకవిచే రచియింపఁబడినగ్రంథములన్ని టిలో నాతనివంశవర్ణనము లేనట్లు స్పష్ట మగుచున్నది. ప్రభావతీప్ర ద్యుమ్న మనుగ్రంథము తనతండ్రిపేరిటనే కృతియిచ్చి అందుఁ గృతిపతి వంశవర్ణనము గాఁ దనవంశమును వర్ణించికొనియెను.

## సూరనకవి తండ్రిం గృతిపతిం జేయుట.

సూరనకవి తనతండ్రినిఁ గృతిపతిం జేయుటకు రెండుకారణము

లఁ జెప్పికొన్నాఁడు. అందు మొదటిది పితృభక్తి యని యీక్రిందిపద్యములవలనఁ దెలియును.

క. తండ్రియ సుతులకు దైవం, బండ్రుగదా వేదవాదు లని వినియును నే
వీండ్రను వాండ్రనుబలెమా, తండ్రిఁ బరమపూజ్యుఁ గాఁగఁ దలపమి తగునే.

ఇఁక రెండవకారణము తనకంటెఁ జిన్న యగుతనతమ్ముఁడు గయావర్జనాదికముం జేసి పితృఋణవిముక్తుండు గాఁగఁ దా నట్లు చేయ లేనైతి నని చింతించి పిదప తండ్రివంశమును వర్ణించి తన్మూలముగఁ దన తండ్రిని శాశ్వతనామునిఁ జేయుతలంపయియున్నది. దానిని సూచించుట కీక్రిందిపద్యములు వ్రాయఁబడినవి.

మ. గయలోఁ గాశి ప్రయాగ శ్రీగిరిని గంగాద్వార నీలాచలో
జ్జయినీ ద్వారకలం దయోధ్య మధురన్ సంస్తుత్యపుణ్యస్థలా
గ్రియతన్ వెండియు మించునైమిశ కురుక్షేత్రాదులం దర్పణ
క్రియచే నాపినతమ్ముఁ డట్టిన యొనర్చెన్ దండ్రి కాహ్లాదమున్.

క. ఏను సుచితపూజను నా, చే నైన ట్లిద్ధరమైనఁ జేయఁగవలయున్
గానఁ గృతి నిచ్చి మేదిని, పై నెఱుపుదు నతనికీర్తి పరమేశుకృపన్.

## సూరకవివంశావళి.

ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁ డైనట్లును, గౌతమగోత్రుఁ డైనట్లును, ఇతనివంశనామము పింగళివారనియు సూరనయే చెప్పియున్నాఁడు. ఇతనివంశమునకు మూలపురుషుఁడు పింగళి గోకనామాత్యుఁడు. ఇతఁడు "పేకి" అను నొక క్షుద్రగంధర్వస్త్రీని దాసిగాఁ జేసి కొనియె. నాఁట నుండియు నది "పింగళివారిపేకి" అని పిలువంబడుచు వచ్చెను. ఈపేకివృత్తాంతము గోకనామాత్యచరిత్రలో వ్రాసెదను. ప్రస్తుతమున సూరకవి వంశవృక్షము నీక్రింద వివరించెదను.

గౌతమగోత్రములో (ఆపస్తంబసూత్రము. యజుశ్శాఖ)
పింగళిగోకన్న. ఇతనివంశమున
గంగన.

- గంగన
  - సూరన
    - సూరన
      - ⋮
        - అన్నయ
        - సూరన
          - ⋮
            - ఆమరన
              - ⋮
                - సూరన గ్రంథకర్త.
                - ఆమరన
        - మల్లన
          - ⋮
            - సూరయ
              - మల్లన్న
                - జగ్గన
                - తిమ్మన
                  - ఎఱ్ఱన.
                - సూరయ
                - చిన్నయ
                - తిమ్మయ
              - అక్కమంత్రి.
        - లింగన
          - పుల్లన
          - అక్కయ మంత్రి.
  - కుప్పన
    - సూరన
      - భానయ
      - భద్రయ
      - కుప్పన
        - ఎఱ్ఱయ్య
        - పాపయ ప్రభృతులు.
  - రామన
    - గంగన
      - గాదన
        - పెద్దన

సూరకవి తల్లివంశము.
చరుమనమంత్రి.

- చరుమనమంత్రి
  - కేసయ్య
    - అన్నయ్య
      - కేసయ్య
    - భీమయ్య
      - కొండయ
      - అంబాంబిక (సూరకవి తల్లి.)
      - రామయ్య
    - బాపయ్య
      - గంగయ్య

## సూరనకవివంశచారిత్రము.

### మూలపురుషుఁడు పింగళి గోకమంత్రి.

ఈగోకమంత్రి సూరనాదివంశజులకు మూలపురుషుఁ డని యీవఱకే చెప్పియున్నాఁడను. అతఁడు ప్రథమమున సంతానము లేక సూర్యదేవో పాసనఁ జేయుచుండఁగా నాసూర్యుఁడు గోకమంత్రిభార్య స్వప్నమున నొకబ్రాహ్మణవేషముతో వచ్చి యగపడి యొకదొండచెట్టు చేతి కిచ్చి యీచెట్టు భూమిలో నాటి పెంచితివేని యిది ఫలింపఁగల దని చెప్పెనఁట. అటుపిమ్మట నాగోకమంత్రి కనేకులు పుత్త్రులు కల్గి అతనివంశము దొండతీఁగె శాఖోపశాఖలుగా నల్లుకొనురీతినే పుత్త్రపౌత్త్రపరంపరలచేఁ బ్రకాశించెను. ఇట్టిగోకమంత్రిసంతతి కొన్నితరము లైనపిమ్మట ననేకస్థలములలో స్థిరపడి ఆయాగ్రామములే వంశనామమునుగా ధరించిరి. గోకనమంత్రి యొుంటునూర నుండువారికి మాత్రము పింగళివారనుగృహనామంబు నిల్చియుండెను. అనంతరకాలములో సీపింగళివారు కొందఱు గోదావరీతీరమందును, మఱికొందఱు కృష్ణాతీరమందును, పింగళిరామయ మొదలగువారు పల్నాటి సీమలోను, పాకనాటిసీమలోను, పింగళిగాదయామాత్యులు గోకనమంత్రి యున్నచోట నుండిరి. సూరకవి మొదలగువారును గోకమంత్రికి నింటిపే రైనపింగళి యనుస్థలమునందే యుండి ప్రసిద్ధులైరి.

### పేకికథ.

పిదప పింగలిగోకమంత్రి పేకి యనుగంధర్వస్త్రీని వశపఱుచుకొనిన ట్లొకగాథ దేశములో వ్యాపించి యున్నది. అయితే ఆకథ జనసామాన్యముగఁ బిశాచపుకథగా వాడుకొనంబడుచున్నది. కాని మంత్రయోగు లిట్టిగంధర్వవిద్యల వశపఱుచుకొని వానివలన ననేకచమత్కారకార్యములఁ జేయుంచుట కలదు. యక్షిణీవిద్య యిట్టిశాబరదేవతోపాసనమూలముగనే చేయుచుండెదరు. యక్షిణి యనునామమునకు యక్షభార్య యని పేరు. అట్టియక్షుణులు పరివారముగాఁ గల్గుదేవతలు

గాంధర్వవిద్యలు. దీనిని వశపఱచుకొనినవారి కెల్ల నైహికసుఖములు లభియింపఁ గలవనియును, ఆముష్మికవిద్యల కివి నిరోధకము లనియు మంత్రశాస్త్రజ్ఞుల యభిప్రాయము. ఈవిధ మగువిద్య నొకదానిని గోకమంత్రి వశపఱచుకొనె నని సామాన్యముగాఁ జెప్పంబడక

" పేకి యనుదానిని దాసి గ నేలె యోగి తా
గుర్వనుభావుఁ డై"

అనియుండుటచేత గోకమంత్రి యోగియై యీగంధర్వస్త్రీని దాసిగఁ జేసె నని చెప్పియుండుటచే లోకములో వాడుకగా నుండు మఱియొకకథ మాంత్రికులు వాడుకొనునదియే యీపేకికథ యేమో యని తలంచెదను. ఆకథలోని విశేషము లేవియనఁగా, ఒకగంధర్వవిద్య నొకమాంత్రికుఁడు ప్రత్యక్షముచేసికొనియె ననియును, ఆవిద్యవలన నైహికసౌఖ్యముల నన్నిటి నంది తనకు నాముష్మికసుఖమును గల్గింపవలయునని యాగంధర్విని గోరఁగా నట్లేచేసెదనన చెప్పి మాంత్రికుని మరణకాలములో వియద్గమనమున నెత్తుకొనిపోయి కాశిలో గంగాతీరమం దాతని నుంచె ననియు నామాంత్రికుఁ డవిముక్తక్షేత్రమున మరణము నందుటంజేసి ముక్తుఁ డయ్యె ననియుం గలదు. ఇఁకఁ బామరజనసాధారణకథను వివరించెదను.

పింగళి వారి పేకికథకు మఱియొకయనువాదము.

దానింగూర్చి యిప్పుడును వాడుకలోనున్న కథను వివరించెదను. ఇక్కథ యెన్నివిధములచేత వదలించుకొనినను వదలనిమనుష్యులవిషయమై పింగళివారిపేకి వలె పట్టుకొనిన వదలఁ డని చెప్పెడునొక సామెత యగుచునది. దీనికి వాడుకలోఁ గలకథ యెట్లనఁగా :—

ఒకబ్రాహ్మణుఁడును అతనిభార్యయును గారణాంతరమున దేశాంతరమున నుండిరనియును. అవు డాబ్రాహ్మణునిభార్యకు పరిచారిక యొకతె కావలసివచ్చె ననియు అందుకుగాను ప్రయత్నము చేయుచుండ నీపేకి యనునది యొకస్త్రీవేషము వేసికొని తాను

పరిచర్య చేసెదననియు, తన కొకవ్రత మున్నదిగావున ఆవ్రతము జరిపినచో జీతబత్తెము లక్కఱ లేకయే సేవచేసెద ననుడు బ్రాహ్మణుఁడు లెస్స యని దానివ్రతముం దెల్పు మనియెనఁట. అపు డాపేకి తనకు విరామము లేకుండ సర్వకాలమును పనులు చెప్పుచుండుప్రభుని గాని అన్యులఁ దాఁ గొలువ ననునదియే తనవ్రత మని తెల్పె. దానికాబ్రాహ్మణుఁ డెంతయు సంతసించి చెప్పినపనులు చేయలేనిపరిచారకులే దొరకుచుందురుగాని యిట్లు పనిచెప్పకున్న నుండ ననుచాకిరులు కుదురరు. పని చెప్పుట సులభమే చేయుటయే కష్టము. అని విచారించి "చెప్పినపని చేయ లేకున్ననో" అని సంప్రశ్నము చేసెను. "ఎడతెగకుండ పనిచెప్ప లేకున్ననో" అని పేకి తిరుగ ప్రశ్న చేసెను. దానికి బ్రాహ్మణుఁడు నవ్వి యోడిపోయినవారికి తగినట్లుగా నాలోచించవచ్చు ననియె. అందులకు పేకి సమ్మతించి ఆబ్రాహ్మణునికడ పరిచారికగాఁ గుదిరెనఁట ఆ నిముసము మొదలా బ్రాహ్మణుఁడు పనులు చెప్పుటకుఁ బ్రారంభించి త్వరలో వంటచేసి వడ్డించి యింటిపను లన్నియుఁ జేయు మనుడుఁ బేకియు నట్లే యని అతిశీఘ్రముగఁ గార్యముల నన్నిటిం జేసి మఱియేమిపని చెప్పెద వని యడిగెను. అప్పటికిం జేయవలసినపను లేమియుఁ జేయునవి లేక బ్రాహ్మణుఁడు ఆలోచించుచుండ నాతనిభార్య నవ్వి మాదొడ్డిలో రెండుబావు లున్నవి. అందులో నీరంతయుఁ దోఁడి తెల్లవాఱునంతలో మాపొలములన్నియుఁ దడిపి రమ్మని చెప్పిపంపెను. పేకియు నటులనే తెల్లవాఱులోపలఁ బొలమంతట మళ్లు కట్టి నూతులలో నుండు నీరంతయు రెండు మోటగూనలతోఁ దోఁడి ఆమళ్లు తడిపి సూర్యోదయసమయమునకుఁ దిరిగి తనప్రభుని దర్శించి యేమిపని చెప్పెద వని సంప్రశ్నించెను. దానిం జూచినతోడనే ఆబ్రాహ్మణుఁడు భయాక్రాంతుఁడై నిత్యకృత్యములు చేయు మని చెప్పి భోజనాదికము లైనపిమ్మట మఱి యేదియో యొకపని కల్పించి పేకిని పంపి తానును తనభార్యయును రాత్రివేళ నొకనిర్జనస్థలంబునకుం బోయి విడిసియుండిరి. పేకి తనకుఁ

జెప్పఁబడినపని నెఱవేర్చి తనప్రభునికడకు వచ్చి యతఁడుగాని అతనిభా ర్యగాని యింట నుండు పరికరములుగాని అచ్చో లేకుండుటచేత యజ మాని పలాయితుఁ డయ్యె నని గ్రహించి అతఁ డున్న స్థలంబును గనిపట్టి అతనియింట నుండునొకదాతిబోలు పదుగురు మగవార్రైనఁ గదల్పలే నిదాని నూఁడబెఱికి నెత్తి కెత్తుకొని మఱునాఁడు సూర్యోదయమునకు బ్రాహ్మణునిఁ జేరి "ఏమయ్యా! నీవు సంసారివి కావా" నీయింటిలో నుండుసమస్తవస్తువులును జాగ్రత్త చేసికొని యేమికారణమున నీలో లు వదలి వచ్చితివి. గ్రామమందు దొంగలభయము విశేషము గదా అని యిది తెచ్చితి నని పల్కె. దాని నాబ్రాహ్మణుఁడు వెఱగంది పేకి మనుష్యస్త్రీ కాదు. బ్రహ్మరాక్షసియో, కామినీగ్రహ మో అయియుండును. అటులైన నిఁక జీవితేచ్ఛ లేదని భయాక్రాం తుఁడై తలకట్టికొని పండియుండఁగా నవు డాబ్రాహ్మణునిభార్య పెని మిటి నూరార్చి తాను పేకిచేతఁ బరిచర్యఁ గొని దాని నోడించెద నని పెనిమిటికి ధైర్యంబు చెప్పఁగా బ్రాహ్మణుఁడు కొంత తేటెనఁట. పి మ్మట నాబ్రాహ్మణి తాను అభ్యంగనస్నానము చేయవలయుంగావున నుష్ణోదక ముంచు మని పేకిం గోరి తలకు తైలము రాఁచుకొని వెండ్రు కలు చిక్కు తీయించుకొని యూడినతలవెండ్రుకల చిక్కు పేకిచేతి కి చ్చి యీవెండ్రుకలం గొనిపోయి ఒక్కొక్కదానిచే తెగకుండ పీడఁదీ సి కదురువలె నిలువంబడునట్లు తోమి తేవలె నని ఆజ్ఞ యొసంగె. అపుడు పేకి తలవెండ్రుకల తుట్టెను తీసికొని యొక యేటి యొడ్డునఁ గూ ర్చుండి యొకటియైనఁ దెగిపోకుండ నన్నిటిని పీడఁదీసి దూరదూరము గ నుంచి యొకవెండ్రుక నిలువంబెట్టుటకు గోటితో లాగిచూచెను. ఆ వెండ్రుక చుట్టుకొనిపోయెను. అది బాగుగ నుండలేదని దానిని నీటిలో ముంచి పులుసు పెట్టి మరలఁ దోమి గోటితో మఱియొకపర్యాయము లాగిచూచెను. అవు డది మఱిరెండుచుట్లు పడుటకుఁ జింతించి మఱియు మఱియు లాగి నిలువంబెట్టుడు నది మఱియును జుట్టుకొనిపోవుచుండ

నంత నావెండ్రుకం గొని నిప్పుసెగ చూపి సరిచేయంబోవ నది చూర్ణముకాఁగాని ట్లొకవెండ్రుక చెడుటకు భయపడి, అన్నియు నట్లే చెడు నని పేకి విచారించి చెప్పినపని పూర్తిచేయనిది తనప్రభువులకడకుం బోయినఁ బ్రతిజ్ఞాభంగ మగునని యెంచి తిరుగ వారలకుఁ గాన్పించకుండఁ బలాయిత యయ్యెను." అని, యొకకథ గలదు.

పైకథ యంతయు నాలోచింపగా నిది చమత్కారార్థము కల్పింపఁబడియుండునుగాని యథార్థము కా దని తోఁచెడిని. అయినను లోకములోనివాడుకనుగూడ మనము తెలియఁ జేసినాము. దేని నెట్లు గ్రైకొనవలయునో బుద్ధిమంతులు దాని నట్లే కైకొనియెదరుగాక. ఈపేకివృత్తాంతము చెప్పితిమి కావున నిఁక గోకనమంత్రిచరిత్రము ముగింపము. అయితే పైపద్యములో "నెరపె గోపకుమారుని ఖడ్గవర్ణనము" అను కథ మాత్రము చెప్పవలసియున్నది. దీనిం బట్టిచూడ నీగోకనమంత్రి కవిత్వమునందును ప్రజ్ఞ కలవాఁ డని నిశ్చయించి చెప్పవలసియున్నది. అతని కవిత్వవిశేషములు సూరకవికే తెలిసియుండక పోవచ్చును ఇఁక మన కెట్లు తెలియఁగలవు. కావున నావృత్తాంతము వ్రాయఁజాలము.

### గోకనమంత్రి వంశములోని సూరకవిశాఖ.

పైగోకమంత్రి వంశస్థు లనేకశాఖలైరి. వారిలో గంగయమంత్రి నుండి సూరకవిశాఖ విభజింపఁబడినది. ఈగంగయమంత్రికి బంగరుకామ. గలకుంచెలు, పల్లకి మొదలగు సర్వాంగసమృద్ధితో నొప్పు రాజ్యలక్ష్మి సంప్రాప్తమయ్యె నని కలదు. అందుల కారణము వ్రాయఁజాలము. గంగమంత్రి మనుమనికుమారుం డగుసూరయకవియును, శివభక్తిపరాయణుఁ డైన ట్లీక్రిందపద్యమువలనం గాన్పించు.

క. వారలకు నగ్రజుం డగు, సూరయ సూరప్రభుండు సుకవిత్వసుధా,
చార శివభక్తి వినయో దారత్వాదులఁ బ్రసిద్ధతముఁ డై మించెన్.

సూరన కుమారుం డగునమరన మంత్రి కుమారుఁడు మనచరిత్రకుఁ బ్రధానుఁ డగుసూరకవి. ఇతఁడు తనతాత యగుసూరకవి ప్రతి

ష్ణసిల్పె ననియు నంతకంటె నధికుఁడై యుండె ననియుం జెప్పవలసియు న్నది. అట్టియాధిక్యమునకుఁ గారణములు ముం దుచితస్థలంబున వ్రాయుదును.

## సూరన కాలవిమర్శనము.

దీనివిషయమై యిదివఱలో సీసూరకవి చారిత్రము వ్రాసినదక్షి ణామూర్తిపండితుఁడును, ఆంధ్రకవిచరిత్రము వ్రాసిన కందుకూరి వీరేశ లింగముపంతులును విశేషముగఁ జర్చించి యుండిరి. అం దాయుభ యులసిద్ధాంతములు వేర్వేఱుగ నిట వివరించి అనంతరము నాసిద్ధాంత ముం దెల్పెదను.

దక్షిణామూర్తిపండితుఁడు వ్రాసినదానిలోఁ గళాపూర్ణోదయ కృతిపతి యగునంద్యాలకృష్ణరాయల కన్నయగు తిమ్మరాజు విజయన గరాధి పతి యగుసదాశివరాయనికాలమునందు నంద్యాల కధిపతియై యున్నట్లును అది శా.స. 1490 (A.D.1490 + 77=1567) మనియు నొ కచోటఁ జెప్పి అనంతరము వెంకటపతిరాయలు పెనుగొండయందు సిం హాసనాసీనుఁడై యుండఁగ నంద్యాలను పైకృష్ణరాయ లేలుచున్నట్లు నంద్యాలగ్రామచరిత్రమునందు వ్రాయఁబడి యుండె నని తెల్పి వెంక టపతిరాయల కాలము క్రీ. శ1585—77=(1508 శా. స.) ప్రారంభమై క్రీ.శ1614—77=(1537 శా.స.)రమున ముగిసె నని చెప్పియుండె. ఇట్లు చెప్పి అనంతరము సూరకవి రాఘవపాండవీయము రచియించునప్పటికిఁ జిన్నవయస్సులో నుండె ననియు నాగ్రంథముం బట్టి చూడ సూరకవి చాలకాలమువఱకు జీవించియున్నట్లును అనఁగా శా స.1465 మొదలు శా స. 1523వఱకు నని సిద్ధాంతీకరించెను.

పైదానిలో మనయభిప్రాయము తెలుపవలసియున్నది. అందు వ్రాయఁబడినప్రకారము కరిమద్దుల గ్రామశాసనములోని తిమ్మరా జు కృష్ణమరాజు నన్నయే అగునేని కృష్ణమరాజుకాలము దానింబట్టి యూహింప నను కూలముగనే యున్నది. అయినను ఇతరములైన

యాధారములు లేనిది ప్రత్యేకము పై (లోకల్ రికార్డుస్‌లోని) వ్రాఁతలను నమ్మి సిద్ధాంతము చేయఁగూడదు. ఆవృత్తాంతములు తత్కాలీనులవలన వ్రాయఁబడక ఇప్పటికి నూఱుసంవత్సరములకుఁ బూర్వమున నున్న యాగ్రామజనులవలన విన్నవృత్తాంతములఁ బట్టి వ్రాయంబడినవి. ఒకవేళ పైకథలు నమ్మఁ బడినను పింగళిసూరనకవి కళాపూర్ణోదయముం జేసినకాల మదియే యని చెప్పుటకుఁగాని అప్పటికే అతఁడు ముదుసలి కాక యుండె నని చెప్పుటకుఁగాని ఆకథ చాలదు. శా. ౧౪౯౦ సం. నాఁటికే సూరకవి కళాపూర్ణోదయమును రచించి అప్పుడు అధికారము చేయుచున్నతిమ్మరాజు తమ్ముండగుకృష్ణరాయలకుఁ గృతి యీయవచ్చునప్పటికే సూరకవి మిక్కిలి ముసలివాఁడై యుండవచ్చును. కళాపూర్ణోదయము కృతి నందినకొంతకాలమునకుఁ గృష్ణరాయఁడే ప్రభుండై వెంకటపతిరాయలు పెనుగొండలో రాజ్యముచేయుచున్న కాలములోఁగూడ నుండవచ్చును. ఇంతమాత్రమున సూరనకూడ వెంకటపతిరాయల కాలములోనివాఁ డని యూహింప వీలుపడదుగదా శా.౧౪౯౦ నాఁటికే సూరకవి యేఁబది అఱువదిసంవత్సరములయీడువాఁ డయ్యెనేని అతనిజననకాలము శా. స ౧౪౨౦ గలకాలమై యుండును. అప్పుడు సూరకవి పదునేనవ శతాబ్దపూర్వఖండములోనివాఁ డని చెప్పవలసియుండునుగాని పదియాఱు పదునేడు శతాబ్దములలోనివాఁ డయినట్లు నిశ్చయింపఁగూడదు. కావున నీసిద్ధాంత మంగీకరింప వీలుపడదు.

### ఆంధ్రకవిచరిత్రముపై విమర్శనము.

ఇఁక నాంధ్రకవిచరిత్రములోఁ జేయంబడినసంవాద మీపైదానికంటె విపులముగా నున్నను పాఠకునకు మఱియును దిగ్భ్రమ నందించును. కావున దానిలోనియంశములను వేర్వేఱుగ వివరించి దానిపైఁ బూర్వపక్షములం దెల్పెదను. గుణగ్రాహులు లాసిద్ధాంతములోఁ గలభేదములం గనిపెట్టెదరు గాక.

**ఆంధ్రకవిచరిత్రాంశములు.**

(౧) కృష్ణదేవరాయని యాస్థాన కవీశ్వరులలో నీనూరనకవి యొక్కఁడని కొందఱు చెప్పుదురుగాని అతఁడాకాలమునందు గాని ఆసంస్థానమునందు గాని యున్నట్లు నిదర్శనము లేమియుఁ గానరావు. ఈనూరకవి పదునాఱవ శతాబ్ద మధ్యమున నున్నట్లూహించుట కనేకనిదర్శనములు కనఁబడుచున్నవి.

**పూర్వపక్షములు.**

(౧) ఏసంస్థానము లోనైనను అందుండు కవీశ్వరు లందఱును ఆసంస్థానాధిపునిపైకృతి నిచ్చునాచారము లేదు. పూర్వకాలములో ముసలివారుగా నుండుకవీశ్వరులే కృతి యిచ్చునాచారము కాన్పించును. నూరనకంటె ముసలికవు లిర్వురు మాత్రమే కృష్ణరాయలను మనుచరిత్ర పారిజాతాపహరణ గ్రంథములకుఁ గృతి పతిం జేసిరి. అంతమాత్రమునఁ గృష్ణరాయని యాస్థానములోనిఁక యితరకవులు లేరని చెప్పఁగాఁ గృష్ణరాయల సంస్థానములో ననేకులు కవులుండి రనుజగద్వ్యాపకమగు ప్రతీతి యంతయు నబద్ధము కావలసి వచ్చును. పైగ్రంథకర్త లిర్వురు గాక కృష్ణరాయలసభలో కవులుగా నున్న యితరు లెవ్వరని యొకశంక జేసియుంచెదము.

(౨) నూరనకవి కళాపూర్ణోదయమును నంద్యాలసంస్థానాధిపతియు నార్వీటి బుక్కరాజు సంతతిలో నతని కాఱవ పురుషుఁడగుకృష్ణరాయలకుఁ గృతి యిచ్చె ననియు, నార్వీటిబుక్కరాజు కాలము క్రీ. శ. 1473-77 (శా. స. 1396) మొదట క్రీశ. 1481-77 శా. స. 1404 వఱ

(౨) ఈప్రశ్నమునకు సమాధానము చెప్పుటకుఁ బూర్వము విజయనగరమున నధికారము చేసిన ముఖ్యు లగుప్రభువులకాలనిర్ణయము చేయవలసియున్నది. అది యిదివఱకే ప్రభుత్వమువారివలన శాసనాదికముల సహాయమున నిర్ధారణ చేయఁబడియుండెఁ గావున నందు

కును రాజ్యము చేసెననియును, అతనిపిమ్మట రాజ్యము చేసిన యతని సంతతిలోని నల్గురు రాజులకును పురుషున కిరువది (20 years) సంవత్సరముల వంతున లెక్కింపఁగా వారిపిమ్మట రాజ్యమునకు వచ్చిన కృష్ణరాయలు క్రీశ. 1560-77 శా. స. 1483 ప్రాంతమున నున్నట్లెంచవలయును.

లోని ముఖ్యాంశముల నీక్రింద వివరించెదను. (see R. Swell's lists Antiquities of the Southern India Vol II) ఎట్లన్నను:—

| | క్రీ. శ. శా. స. |
|---|---|
| బుక్కరాజు No I. | 1300-77=1223 |
| బుక్కరాజు No II. | 1354-77=1277 |
| బుక్కరాజు No III. | 1369-97=1292 |
| కృష్ణరాయలు | 1509-77=1432 మొదలు. 1530-77=1453 |
| సదాశివరాయలు | 1542-77=1465 మొదలు. 1563-77=1486 |
| తిరుమలదేవరాయలు | 1567-77=1490 మొదలు. 1577-77=1500 |
| శ్రీరంగరాజు | 1572-77=1495 మొదలు. 1584-77=1507 |
| వేంకటపతిరాజు | 1585-77=1508 మొదలు. 1614-77=1537 |

అనియున్నది. దీనింబట్టి చూడ బుక్కరాజనామములలోఁ జివర నున్న యతఁడుగూడ క్రీ.శ. 1369 అనఁగా శా. శ. 1292 నకు పిమ్మట నున్నట్లుగా కానరాఁడు. కాఁబట్టి బుక్కరాజుకాలము క్రీ. శ. 1473 మొదలు క్రీ. శ. 1481 వఱకు అని చెప్పిన ఆంధ్రకవిచరిత్రములోని కాల

నిర్ణయము నిలువదు. * చారిత్రములో రాజులయొక్క అధికార కాలము నిర్ణయించవలసి వచ్చినప్పుడు దామాషాగా నంగీకరింపఁబడిన సంవత్సరములు 15 (పదునేను) అని పూర్ణచరిత్ర కారులందఱియొక్కయు మతమై యున్నదిగాని అది 20 (యిరువది) కాదు. అట్లు పదేను సంవత్సరముల లెక్కను బుక్కరాజు తరువాత రాజ్యము చేసిననల్గురు రాజులకు నఱువది (60) సంవత్సరము లైనది. క్రీ. శ. 1369 సంవత్సరమునకు పై సంఖ్య కలుపఁగా క్రీ. శ. 1429 లేక 1430 (శా.న. 1353) అయినది. ఇది నంద్యాలప్రభుం డగుకృష్ణమరాజు రాజ్యారంభసమయము కావలయును. ఇది ఆంధ్రకవిచరిత్రములో వ్రాయంబడిన కాలమునకు నూటముప్పది సంవత్సరములు పూర్వమై కాన్పించుచున్నది. కాఁబట్టి దీనిం బట్టి నంద్యాల కృష్ణరాయల కాలముగాని అతని కాలీనుఁ డగుపింగళి సూరకవి కాలముగాని నిశ్చయింప వీలుపడలేదు.

(3.) ఈకృష్ణరాజు విజయనగరమును సదాశివరాయలు పాలించుచుండిన కాలములో నంద్యాలరాజైనట్లు కానఁబడుచున్నది.

(3.) ఈకారణముచేత సూరకవి అతనికిఁ బూర్వుఁ డైనయచ్యుతదేవరాయల కాలములోఁ గాని అచ్యుత దేవరాయలతో సమానకాలములో వ్యవహరించిన కృష్ణరాయల కాలములోఁ గాని లేఁడని చెప్ప వీలుపడదు గదా. న్యాయలుదొరలిష్టులప్రకారము క్రీ. శ 1528 వత్సరము మొదలువిజయనగరములో నీయఁబడిన శాసనములను బట్టి కృష్ణరాయలు, అచ్యుతరాయలు నుభయులుగూడ విజయనగరసంస్థానాధిపతులు గా నున్నట్లు కానుపించును.

* ఈకవిచరిత్రము లోపలనే కృష్ణరాయల చరిత్రము వ్రాయుచో నీబుక్కరాజు కాలము నేను పైన వ్రాసిన విధముగనే యున్నది. కాని సూరకవి చరిత్రములో మాత్రము దానికి మఱియొక పాఠాంతరము కాన్పించును. దీనికిఁ గారణ మూహింపలేను.

(౪.) ఈకృష్ణదేవరాయల యనంతరము ౧౫౩౦ సంవత్సరమున రాజ్యమునకు వచ్చినయచ్యుత దేవరాయలు ౧౫౪౨ సంవత్సరమున మృతి నొందెను. ఆకాలమునందు సదాశివ దేవరాయలు బాలుఁడౌటచేత రామరాజతనిని సింహాసన మెక్కించి రామరాజు౧౫౬౪ సంవత్సరమున మృతినొందెను. సదాశివరాయఁడు ౧౫౬౭ సంవత్సరమున మృతుఁడయ్యె. ఆసంవత్సరమునందే తిరుమల దేవరాయఁడు విజయనగరమును విడిచి పెనుగొండఁజేరి ౧౫౬౫ లో పెనుగొండరాజ్యము స్థిరపర్చి ౧౫౭౨ సం. మునందు లోకాంతరగతుఁ డయ్యెను. ౧౫౭౨ సంవత్సరమున నతనిపుత్త్రుఁడైన శ్రీరంగరాజు రాజ్యమునకు వచ్చి ౧౫౮౫సంవత్సరము వఱకును రాజ్యము చేసెను. ౧౫౮౫ సంవత్సరమున నాతని తమ్ముఁడు వేంకటపతి రాజు సింహాసనమునకు వచ్చి తనరాజధాని పెనుగొండనుండి చంద్రగిరికి మార్చెను. ౧౬౧౪ సంవత్సరములో సంతానము లేనివాఁడై మరణము నొందెను.

(౪.) దీనిలోనిసంగతులు చూడ నందుఁ గలకృష్ణరాయఁడు సదాశివదేవరాయలు విజయనగరమును పాలించుసమయములో నున్నాఁడని చూపించుటకై చాలియున్నవి. కాని విజయనగరరాజులజనన మరణకాలములం దెల్పుటకుఁ గాదు. పైకథలోఁ దెల్పఁబడినకాలనిర్ణయము స్యూయల్ దొర గ్రంథములోని కాలనిర్ణయ పట్టికలకు మిక్కిలి సరిపడి యుండలేదు. అట్టిదానిం గూర్చి ప్రస్తుతము మనము సంవాదింపఁ బనిలేదు. కావున నేనిపుడు సిద్ధాంతమునకు సమాధానము చెప్ప విడిచెదను. ఇవి యన్నియు యథార్థములే యనుకొన్నను అవి సూరకవికాలమును నిర్ణయింపం జాల వని మాత్రము విస్పష్టముగాఁ జెప్పవలసియున్నది.

(౫.) నంద్యాలరాజైనకృష్ణమరాజు సదాశివదేవరాయని కాల

(౫.) నంద్యాలరాజైనకృష్ణమరాజు సదాశివరాయలు వీరికాలము

ముహూర్తైనంమున నతని రాజ్యకాలము ౧౫౬౪ సంవత్సరమునకు లోపల నారంభ మైయుండును. కాఁబట్టి పింగళి సూరన్న నంద్యాల సంస్థానమునం దుండి కృష్ణరాజునకుఁ గళాపూర్ణోదయము నంకితము చేసినకాల మించు మించుగా ౧౫౬౦ సంవత్సరప్రాంత మని చెప్పవచ్చును.

(౬.) ఈసదాశివరాయఁడు అచ్యుతదేవరాయనికుమారుఁ డైనట్లు కొన్ని శిలా తామ్రశాసనముల యందుఁ జెప్పఁబడియున్నది కాని కృష్ణామండలములోని సత్తెనపల్లితాలూకాలో దొరకిన శా. స. ౧౪౮౨ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౫౬౦ సంవత్సరపు తామ్రశాసనములో నతఁడు రంగరాజునకు తిమ్మాంబకు పుత్త్రుఁడైనట్లును రామరాజునకు మఱఁది యైనట్లు నున్నది.

లలో సింహాసనము నెక్కినరాజైనం గావచ్చును. రాజు కాకపూర్వము కృతి నందఁ గూడ దనుని బంధన లేనిచో నంతకుఁ బూర్వమే కష్ణరాయ లీకళాపూర్ణోదయకృతి నందియుండవచ్చు ననునూహా నది యెట్లు బాధించఁగలదు? కాఁబట్టి నంద్యాల కృష్ణంరాజు రాజ్యకాలమునుబట్టి పింగళి సూరనకాలనిర్ణయము చేయఁబడఁ గూడ దని యింకొకసారి చెప్పెదను.

(౬.) ఇం దుదాహరింపఁబడినశిలాశాసనము కృష్ణామండలములోనిదిదియై కన్నడరాజ్యములో దొరకిన యనేకశిలా తామ్రశాసనములఁ బూర్వపక్షముసేయు నదియై యున్నది. కాఁబట్టి కన్నడరాజులు ఆరాజ్యములో నిచ్చిన శాసనములు యథార్థములుగాని ఈసత్తెనపల్లితామ్రశాసనము నమ్మఁగూడదు. విజయనగరరాష్ట్రచారిత్రములోఁ గాలనిర్ణయములోఁ గల్గినచిక్కు లిక్కడఁ జెప్పుట యప్రస్తుతము గనుకను, ఈసంవాదము సూరకవికాలనిర్ణయమునకు నిరుపయోగము గనుకను సమాధానము వ్రాయమానెదను.

(౭.) పైఅంశములోని రంగరాజు అనునది ప్రమాదజనిత మేమో? నంద్యాల కృష్ణమరాజు వేంకటపతిరాయల రాజ్యారంభదశలోను జీవించి యున్నాఁడఁట. అందుచేత నతఁడు ౧౫౮౫ సంవత్సరమునకుఁ దరువాతఁ గూడ నల్పకాలము రాజ్యమేలి యుండును.

(౮.) కళాపూర్ణోదయములోఁ గృష్ణమరాజుతాత యయిననారపరాజు కుతుబ్ ముల్కును కొండవీటియొద్ద నోడించిన ట్లున్నది. ఈకుతుబ్ ముల్కు గోలకొండలో కుతుబ్ షా రాజవంశమును స్థాపించెను. ఇతఁడు క్రీ.శ. ౧౫౧౨-౨౨(=౧౪౩౫ శా స.) మొదలు ౧౫౪౩-౨౨= (శా స. ౧౪౬౬) వఱకును గోలకొండయందు రాజ్యముచేసెను. కృష్ణదేవరాయని కాలములోఁ గొండవీటి దగ్గఱ జరిగినపైయుద్ధము క్రీ శ ౧౫౧౨-౨౨ శా స. ౧౪౩౫ (సంవత్సరమం దనుటచేత నాతనితో యుద్ధము చేసిననారపరాజు మనమఁడైన కృష్ణమరాజు తర్వాతను ముప్పదినలువదిసంవత్సరములకు రాజ్యము చేసె ననుట సత్యమునకు దూరమై యుండదు. కాఁబట్టి దీనింబట్టియు సూరకవి౧౫౬౦ స. ప్రాంతముననున్నట్లు నిశ్చయించవలసియున్నది.

(౭) రంగరాజు పేరు ప్రమాదజనితమే కావచ్చును. కాకపోవచ్చును. అది ప్రస్తుతము మనకథకు సంబంధింపదు. నంద్యాలకృష్ణమరాజు వెంకటపతిరాయల రాజ్యారంభదశలో రాజ్యము చేయుచుండిన నంతవఱకును సూరకవి బ్రతికియున్నాఁడని చెప్పుట కది చాలదుగదా.

(౮.) ఇది నిజమైనగాథయే కావచ్చును. ఇదియును సూరకవికాలనిర్ణయము చేయుటకుఁ జాలియుండదు. నారపరాజునకు నిరువది సంవత్సరముల లోపున కొమారుఁడును నలువది సంవత్సరములలోపున ఆకుమారునివలన మనుమఁడును గలిగి యుండవచ్చును. ఆమనుమఁడు తన యిరువదియవసంవత్సరమునఁ గళాపూర్ణోదయము కృతినందిన నప్పటికి నారపరాజునకు ౫౪ సంవత్సరము లుండవచ్చును.

అప్పుడు నారపరాజు యుద్ధములోనికిం బోవచ్చును. నారపరాజుతో సమానవయస్కుఁడగుసూరకవి నారపరాజు మనుమని పేర కృతియు నిచ్చియుండ వచ్చును. కావున నిదియును సూరకవికాలమును కృష్ణరాయలకాలమును కా దని నిశ్చయించుటకుఁ జాలి యుండదు. పూర్వకాలములో గొప్ప యుద్ధో

గము లనఁగా సేనాధిపత్యములును మంత్రిత్వములును నలుబది యేఁబది సంవత్సరములు గడచినవారికిఁ గాని లభియించెడు నాచారము లేదు. కాఁబట్టి పైకథలో సూరకవి సదాశివరాయల కాలములోనివాఁడనుట కేమాత్రము చాలియుండ లేదు.

(౯.) ఈవిషయమునే రాఘవపాండవీయములోని కృతిపతివంశాను వర్ణనమునుండియు నొకవిధముగా నూహింపనై యున్నది. ఈగ్రంథము కర్నూలుమండలములోనిఆకువీడుసంస్థానాధిపతి యైనపెదవేంకటాద్రి కంకితము చేయఁబడినది. ఈ వేంకటాద్రికి తాత యైనయిమ్మరాజు రాజమహేంద్రవరమును జయించిన ట్లున్నది. రాఘవపాండవీయ కృతిపతితాత యగుతిమ్మరాజును, కళాపూర్ణోదయకృతిపతితాత యగునారపరాజును కృష్ణదేవరాయని కాలములో నాతనికి లోఁబడినసామంతరాజులై యుండి అతనితోఁ గలసి సేనాధిపతులుగా మహమ్మదీయులతో యుద్ధములు చేసి రని తెలియవచ్చుచున్నది. ౧౫౧౫-౧౬ (శా. స. ౧౪౩౭) సంవత్సరమునందు కృష్ణరాయలు రాజమహేంద్రవరమును జయించెను. కాఁబట్టి

(౯.) రాఘవ పాండవీయములోని యీగాథలవలన నిమ్మరాజు కృష్ణరాయల సేనానిగా కనుపడడు. అందు,

క. రాజమహేంద్రవరాధిపు
రీజైత్రవిచిత్రములఁ బరిభ్రాజితుఁడై,
యాజిఘనుం డాయిమ్మమ
హీజానిప్రసిద్ధిఁగాంచె నెంతయుమహిమన్.

అనియున్నది. దీనింబట్టి యీ యిమ్మరాజు స్వయముగనే రాజమహేంద్రవరమును జయించినట్లు కాన్పించును. కృష్ణదేవరాయనివంటి రాజాధిరాజునకు సహాయులుగా నుండినయితరసామంత ప్రభువులను వర్ణించుచో నతని ప్రభునిపేరు వక్కాణింపకుండుట యుండదు. అది యొంతమాత్రము లేదు. కావున నీగాథ విశ్వసనీయము కాదు. దీనింబట్టి సూరనకవి కాలనిర్ణయము జేయ ననువుపడదు.

యిమ్మరాజుకాలమునం దాతనితో నుండియుండనోఁవు. దీనింబట్టి చూచిన సూర నార్యునికాలము పైనిఁ జెప్పఁబడినదే యయి యుండును.

(౧౦) విజయనగర రాజ్యము చెడక ముందు అనఁగా ౧౫౬౪-౬౬ (శా. ౧౪౮౬) సంవత్సరమునకుఁ బూర్వమే రాఘవపాండవీయము రచియింపఁబడినట్లూహించుటకు "వడిగలతనాన" అనుపద్యము చాలియుండును.

(౧౦) ఇందలిపద్యము విజయనగర రాజ్యము బాగున్నసమయమును గాని చెడిపోయిన సమయమును గాని సూచింపదు.

"క. వడి గలతనాన నీగిని
విడిముడి సత్ప్రాభవమున విజయనగరిలోఁ,
గడు నెన్న నేర్వఁగలమే
నడకల పెద వేంకటాద్రినడవడు లొప్పన్."

దీనిలో విజయనగరపట్టణములో పెదవేంకటాద్రి యెన్నఁ దగుమనుజుఁ డని యున్నదికాని విజయనగర రాజ్యమునకు నది ముఖ్యపట్టణముగా నున్నప్పు డని లేదు. విజయనగరము చెడిపోయినను ఆగ్రామవాస్తవ్యులు మఱియొక్కచో నుండుసమయములో వారి గౌరవము చెప్పునప్పు డిట్లు చెప్పుట కేమియాక్షేపణ గలదు.

ఇదియాయూరిలోని గొప్పగృహస్థులం జెప్పునపు డీతఁడు తగినవాఁడని చెప్పినపద్యముగాని యంత కెక్కుడుగ దాని కర్థము కల్పింపఁగూడదు. దీనివలన సూరకవి కాలము తేలదు.

(౧౧) కృష్ణరాయనికాలములో నున్న ధూర్జటికవి మనుమఁ డగుకు

(౧౧) కృష్ణరాయని కాలములో ధూర్జటికవి యున్నందులకు ధూర్జ

మారధూర్జటి కృష్ణరాయవిజయ మును రచించి ఆకు వీటి. చినవేంకటరాయనికిఁ గృతియిచ్చెను. ఈ చినవేంకటరాయలు రాఘవపాండవీయములో వర్ణించఁబడినకృతిపతి తమ్ముఁడైన చినవేంకటాద్రియే అయినపక్షమున నీపద్యము పైకాలమును స్థిరపఱుచుచున్నది.

(౧౨) గ్రంథస్థములైనయీనిదర్శనములు కాక నూరకవి అల్లసాని పెద్దన్నమనుమరాలిభర్తయను కట్టుకథకూడ అతని కాలము పైఁ జెప్పినదే యని నిశ్చయము చేయుచున్నది. అల్లసాని పెద్దన కృష్ణదేవరాయని యనంతరమందనఁగా ౧౫౩౦-౭౭. (శా. స. ౧౪౫౩) సంవత్సరమునకు తరువాతఁ గూడ జీవించి యున్నందున నూరన్న అల్లసానిపెద్దన్న మనుమరాలి మగఁడైనను కావచ్చును.

టి కృత మగుకాళహస్తి మాహాత్మ్యములో నాధారములు లేవు. అతనిమనుమఁ డని చెప్పఁబడునీకుమారధూర్జటివలనఁ గృతినందిన చినవేంకటరాయలు రాఘవపాండవీయములో వర్ణింపఁబడినకృతిపతికిఁ దమ్ముం డనియు నెందును గానరాదు. ఈరెంటివలన నూరకవి కాలమును నిర్ణయింపరాదు.

(౧౨) కట్టుకథ యైన నిది నూరకవి కాలనిర్ణయమును చేయుటకుఁ జాలియున్నది. అల్లసానిపెద్దనకు మనుమరా లుండవచ్చును. ఆమె పౌత్త్రియో దౌహిత్రియో తెలియదు. దౌహిత్రియే అయినచోఁ బెద్దనకవికంటె నలుపది సంవత్సరములు చిన్నదై యుండవచ్చును. ఆచిన్నదాని పెనిమిటి ఆమెకంటె పదియిరువది సంవత్సరములు పెద్దయైయుండ వచ్చును. అట్లైనచోఁ బెద్దనకవికంటె నతని మనమరాలి పెనిమిటి యిరువది సంవత్సరములు చిన్నదైయుండ వచ్చును.తనబంధువుఁడుకవియైయున్నపుడు పెద్దన అతనిని కృష్ణరాయలకడఁ బ్రవేశపెట్టక యుండఁడు. కాఁబట్టి నూరనకవి కృష్ణరాయలయాస్థానములోని వాఁడే య

(౧౩) కళాపూర్ణోదయమును రచి
యింపక పూర్వము సూరకవియా
కుపీటిరాజులవద్ద మొదట నుం
డి రాఘవపాండవీయముం జేసి
వారి కంకితము చేయుటచే రాఘవ
పాండవీయము ౧౫౫౦, ౭౭.(శా.
స. ౧౪౭౩) సంవత్సర ప్రాంతమం
దు మంచి పడుచుతనములో రచి
యించి యుండును.

ని నిశ్చయింపఁజాలను. సూరనకవి
బాలుఁడవుటంజేసి కృష్ణరాయల
కుఁ గృతి నీయక పోవచ్చును. కృ
ష్ణరాయనియనంతరము తత్సంస్థా
నకవు లితరసంస్థానములు జేరి తమ
తమ వార్ధక్యదశలో వారిపేరిటఁ
గృతుల నిచ్చి యుండవచ్చును.
కావున నీకట్టుకథ సూరకవికాలీ
నుఁడని చెప్పుటకుఁ జాలియుండదు.
(౧౩) సూరకవి యాకుపీటిరాజు
లవద్ద మొదట కాఁపుర మున్నందు
లకుఁగాని, రాఘవపాండవీయము
క్రీ. శ. ౧౫౫౦ సంవత్సర ప్రాంత
మందుఁ జేసి యున్నందులకుఁగాని
అప్పటికి సూరకవి మంచిపడుచుఁద
నములో నున్నందులకుఁ గాని గ్రం
థదృష్టాంతములు లేవుగావున నిది
సిద్ధాంత మని నిశ్చయింప వీలు
పడదు.

## సూరకవి కాలనిర్ణయము.

ఇంతవఱకును జెప్పఁబడిన పూర్వపక్షములఁబట్టి సూరనకాలమింకను స్థిరపడలేదు. ఇఁక దానిని స్థిరపఱచుటకు నొకటి రెండు గాథలు క్రొత్తవి వక్కాణించెదను. వానిని పైపూర్వపక్షములతోఁ గల్పి యోఁచించినయెడల సూరనకాలము యొక్క పరిజ్ఞానము కొంచెము కల్గును. అందు మొదటిది సూరనకృత మగురాఘవపాండవీయము మొదటిదా? లేక వసుచరిత్రకారుఁ డగురామరాజభూషణకవికృత మగుహరిశ్చంద్ర నలోపాఖ్యానము మొదటిదా? అను సంప్రశ్న మై యున్నది. రాఘవపాండవీయము కృతినందునపు డందలికృతిపతి సూరకవితో నీక్రింది వాక్యంబులు పల్కిన ట్లాగ్రంథములోఁ గాన్పించును.

"శా. రెండర్థంబులపద్య మొక్కటియు నిర్మింపంగ శక్యంబు గా
కుండన్ దద్గతిఁ గావ్యమెల్ల నగు నే నోహో యనన్ జేయదే
పాండిత్యంబున నందునుం దెనుఁగునం గబ్బం బద్భుతం బంద్రు ద
క్షుం డెవ్వాఁ డిల రామ భారతకథల్ జోడింప భాషాకృతిన్."

ఉ. భీమన తొల్లి చెప్పె నను పెద్దలమాటయ కాని యందు నొం
డేమియు నేయెడ న్నిలుచు టెవ్వరుఁ గాన రటుండ నిమ్మ నా
నా మహిత ప్రబంధ రచనా ఘన విశ్రుతి నీవుఁ గల్గుటన్
నామదిఁ దద్ద్వ్యర్థకృతి నైపుణియుం గల దంచు నెంచెదన్.

ఈ రెండు పద్యములం బట్టి యాలోచింప నంతకుము న్నాంధ్రభాషయందు ద్వ్యర్థికావ్యములు లే వనియును, భీమకవి అట్టికావ్యరచనకై ప్రయత్నించి దానిని వదలివేసె ననియును, కావున ననన్యసాధ్యముగా రామభారతకథలు జోడింపు మని చెప్పినట్లు నున్నది. దేశములో నివాడుకయు రాఘవపాండవీయమే మొదటిద్వ్యర్థికావ్య మనియు హరిశ్చంద్రనలోపాఖ్యానము రెండవద్వ్యర్థికావ్యమనియుఁ గలదు. కాఁబట్టి పైగ్రంథకర్త లగునూరకవియు, రామభూషణకవియును నేకకాలీనులైనం గావలయును. లేనియెడల మొదటికవి రెండవకవికి ప్రాచీనుఁ డైనం గావలయును. ఈరామభూషణకవి కృష్ణరాయనియల్లుం డగునళియ రామరాజుకడ నుండెడు పండితుఁడు. కావున రామరాజుకాలీనుఁ డై కృష్ణరాయలకాలీనుఁడుకూడ నై నాఁడు. సూరనకవి రామభూషణకవి కాలీనుఁ డైనఁ గృష్ణరాయనియల్లునికాలమువాఁ డగును. అంతకుఁ బూర్వుఁడే యయినఁ గృష్ణరాయనికాలీనుఁడే యగును. కావున నీవిషయమున శంకించం బనియుండదు. ఇదివఱకే అల్లసానిపెద్దన దౌహిత్రికి పెనిమిటి సూరకవి యైన నై యుండవచ్చు నని చెప్పియుంటిమి. అల్లసాని పెద్దన మనుచరిత్రము రచియించునాఁటికి ముసలివాఁ డై యున్నట్లుగాఁ దెలియవచ్చుచున్నది. అతనికడనే భట్టురామభూషణుఁడు బాలుఁడై యుండి కవిత్వమును నేర్చుకొనునట్లు చెప్పెడుకథ లున్నవి.

ఆయుర్వేరలో స్సూరన పెద్దనకంటెం జిన్నయును రామభూషణునికంటె బెద్దయు నై యుండుట సరిపడును.

ఈ సంవాదమునే మరియొక గ్రంథోదహారణముచేత బలపఱ చెదను :—

హరిశ్చంద్రనలోపాఖ్యాన కవి యగు రామభూషణునిచారిత్రము గ్రంథపీఠికలో బ్ర. పూండ్ల. రామకృష్ణయ్య పంతుల వలన కొంతకొం త వ్రాయఁబడినది. అందా రామభూషణకవిరచిత మగుద్వ్యర్థికావ్య ము ప్రథమమైనదా లేక పింగళిసూరన కృతద్వ్యర్థికావ్య మగు రాఘ వపాండవీయము ప్రథమ మైనదా యనుసంప్రశ్నమునకు సప్రమాణము గ నుత్తరమీయఁబడినది కావుననే నిపు డాపంక్తులనే బొందుఁబొందు పఱిచి ప్రామాణిక పండితాభిప్రాయము సూరనకవిగ్రంథమే ప్రథమమై నదని గాని రామరాజకృత గ్రంథము ప్రథమ మైనది కా దనియు, రామ రాజభూషణునికంటె సూరనకవియే పూర్వుఁ డనియుం జెప్పెదను.

హరిశ్చంద్రనలోపాఖ్యానపీఠిక, పుటగ౨లో ఈద్వ్యర్థి కావ్యము లలోఁ బ్రథమకావ్యము పింగళిసూరకవికృత మగు రాఘవపాండవీయ ము గ నున్నను వేములవాడ భీమకవి యంతకుముందే మఱియొక రా ఘవపాండవీయమును రచియించినట్లు నందే వ్రాయంబడియున్నది. ఇఁక మనమెఱిఁగిన శ్లేషకావ్యములలోఁ బ్రథమకావ్యము పింగళిసూరన రా ఘవపాండవీయము. అది వ్రాయఁబడినతరువాత నీహరిశ్చంద్రనలోపా ఖ్యానమును రామభూషణకవి రచియించెను. అట్లు కానిచో రాఘవ పాండవీయములో "భీమన తొల్లిచెప్పె నని" అనుపద్యము వ్రాయఁబడి యుండదు గదా. పింగళిసూరనకవియును రామభూషణకవియు శ్రీకృష్ణ రాయ సంస్థానకవు లని కొందఱుపండితులయభిప్రాయము గావున రా మభూషణకవి యీగ్రంథమును రచియించియున్నయెడల సూరన కది తెలియకపోవునా! తెలిసిన సూరనగ్రంథమునం దట్లు వ్రాయునా? అ ఖండశ్లేషకావ్యమును బ్రథమమున వ్రాసినవాఁడు పింగళిసూరన యు

నియే మొట్ట మొదటినుండియు కవులయభిప్రాయము. అట్లు కాని నాఁడు రామకృష్ణోపాఖ్యాన మనుద్వ్యర్థికావ్యమునందు శ్రీపాద వేంకటాచలకవి.

"ఉ. సూరకవీంద్రుఁ డేర్పఱచుచో ప్రౌఢయిందుక గాంచి సెమ్మదిఁ
గూరిమి రామకృష్ణుల గనుంగొనఁగోరి తదీయసత్కథా
సారము జోడు చేసి యొకసత్కృతిఁ గూర్పఁగ సాహసించితిఁ
ధీరవరేణ్యులార యిది తెల్లముగా దయ నాదరింపుఁడీ.

ఉ. వెంగలు లెందఱో కడు వివేకము లేకను దామె యర్థపుం
భంగులు రెండుమూఁడు గలభవ్యకవిత్వముచేఁ బ్రబంధముల్
రంగుగఁ గూర్చినా మనుచు రాజస మొప్పఁగ నుందు రందుకై
పింగళిసూరనార్యుఁడు పెట్టినమార్గముగాక కల్గునే."

అని యివ్విధముగ నేల యుదాహరించి యుండును? మఱియు గణపవరపు వేంకటకవి ప్రబంధ రాజ వెంకటేశ్వరవిలాసమునందు.

"సీ. అల నన్నెచోడు పెద్దన లక్షణజ్ఞత, శబ్దశాసనకవి శబ్దశుద్ధి
ప్రాబంధికపరమేశ్వరు నర్థమహిమంబు, భయకవిమిత్రుని పదలలితము
శ్రీనాథు వార్తాప్రసిద్ధి నాచనసోము, భూరికాఠిన్యంబు పోతరాజు
యమకవిధము మల్లయమనీషి చిత్రంబు, పింగళిసూరకవివరు శ్లేష."

అనియును వ్రాసియుండెఁ గాన రాఘవపాండవీయమును వ్రాసినతరువాత రామరాజభూషణకవి హరిశ్చంద్రనలోపాఖ్యానము వ్రాసియే యుండును. పైపీఠికలోపలనే శ్లేషకవుల సూరకవి మొదటను రామరాజభూషణకవి యనంతరమందు నుదాహరించఁబడిన (నైషధ పారిజాతీయము) అనుకృష్ణార్జునేతర ద్వ్యర్థికావ్యములోని యొకపద్యము దాహరింపఁబడినది.

ఉ. శ్రేషము లేమియుం గనమిఁ బింగళిసూరప రామరాజభూ
షణభాషితంబు లగుపుణ్యకథాద్వయసంగ్రహాద్భుత
శ్లేష కృతుల్ ప్రసిద్ధిఁ గని శ్రీరఘునాథనృపాలమౌళి నా
నైషధపారిజాతకృతినాయకరత్నముఁ జేఁది హెచ్చఁగన్.

కృష్ణరాయలయల్లుం డగునళియరామరాజు కాలీనుఁడై అతనిపై ననేకగ్రంథములు రచియించిన రామరాజ భూషణకవి రచితము

గుహారిశ్చంద్రనలోపాఖ్యానమునకు ముందుగ పింగళిసూరనకృత రాఘవపాండవీయము రచియింపఁబడిన మాత్రముననే రామభూషణ కవి కంటె సూరనకవి ప్రాచీనుఁ డని చెప్పవచ్చునా యని శంక జనింపఁ గలదు. అట్లని మాయభిప్రాయము కా దనియు,నీయిర్వురును సమకాలీనులని చెప్పుటకు పైయుక్తులే చాలుననియు, ప్రథమగ్రంథము రచియించినవాఁడే పూర్వుఁడు కావలయు నని చెప్పెడు వారిమతముం బట్టి చూడ సూరనకవియే రామభూషణునకుఁ బ్రాచీనుఁడు కావలయు ననియు నట్లైన రామభూషణునికాలీనుఁ డగు నళియ రామరాజు కంటెంగూడ సూరన ప్రాచీనుఁడు కావలసి వచ్చు ననియును, అనఁగా నళియ రామరాజునకుఁ బ్రాచీను డగునతనిమామ యగుకృష్ణదేవరాయలును నళియ రామరాజు సంస్థానకవి యగురామభూషణునికంటెఁ బ్రాచీనుఁ డగుపింగళి సూరకవియును సమకాలీను లని సమాధానము చెప్పవలసి యున్నది.

### గ్రంథాంతరముం బట్టి నిర్ణయింపఁబడిన పింగళిసూరకవి కాలము.

ఇతని కాలనిర్ణయమున కింకొకమార్గము కలదు. అది మిక్కిలి చిక్కైనమార్గమును, చాలశ్రమ పెట్టునదియు నై యున్నది. అయిన నది సూరనకవివలననే చెప్పఁబడియున్నది కావున దాని నిచ్చో మనము వివరింపక తప్పదు.

కళాపూర్ణోదయకృతిపతి యగుకృష్ణమరాజుయొక్క వర్ణనముం జేయుచుఁ జెప్పంబడిన షష్ఠ్యంతపద్యములలో.

"క. విశ్రుత తిరుమల తాతా, ర్య శ్రేష్ఠాన్వయ సుదర్శనాచార్య తనూ
జ శ్రీనివాస గురుచర, ణాశ్రయణ సమార్జితాఖిలాభ్యుదయునకున్."

అని యిట్లొకపద్యము వ్రాయఁబడినది. కాని యింతమాత్రము చేత మనకు కృష్ణమరాజుకాలముగాని అతని కాలీనుఁ డగు పింగళి సూరకవి కాలముగాని నిర్ణయింపఁబడ లేదు. అట్టికాలనిర్ణయముఁ జేయుటకుఁ

బూర్వము ద్రావిడ ప్రాణాయామముగాఁ దిరుమల తాతాచార్యుల వంశ చారిత్రమును తత్తత్కాలీను లగు రాయల కాలమును వివరింపఁబడవల యును. గ్రంథవిస్తర భయ మున్నను దేశచారిత్రముగావున మఱియొ కచో వ్రాయవలసినగాథ లిచ్చోటనే వ్రాయ గమకించినాఁడను.

### తిరుమల తాతాచార్యుల వంశగాథ.

నృసింహాచార్యులు (ఏటూరినగరనివాసి. ఇతఁడు విజయనగరప్రభు వగు విరూపాక్షరాజునకు గురువు).
|
తాతాచార్యులు.
|
శ్రీశైలపూర్ణులు.
|
శ్రీనివాసాచార్యులు.
|
తాతాచార్యులు.
|
వేంకటాచార్యులు.
|
సుదర్శనా (సుందరా) చార్యులు.
|
శ్రీనివాసాచార్యులు. (నంద్యాల కృష్ణమరాజుగురువు.)
|
తాతాచార్యులు. బహుప్రసిద్ధుఁడు కృష్ణదేవరాయ రామదేవరాయల గురువు.
|
లక్ష్మీకుమార తాతాచార్యులు. అప్పయదీక్షితకాలీనుఁడు.
|
వేంకటాచార్యులు.

పైవంశవృక్షము ప్రపన్నామృత మను నొక ప్రసిద్ధ రామానుజచారిత్ర గ్రంథమునుండి యెత్తి వ్రాయఁబడినది. తద్గ్రంథకర్త యగు నసం తాచార్యులు వేంకటవరదాచార్యుల శిష్యుఁ డగుటం జేసి అతఁడు వ్రాయుచున్న స్వగురువంశావళి నైన లెస్సగాఁ బరిశోధించక యుండఁ డని యూహింపఁదగి యున్నది.

పైవంశావళిలోఁ బ్రసిద్ధులం గూర్చినకొన్ని శ్లోకములు వివరించె దను. అవి చూచిన తోడనే వారివారి కాలనిర్ణయములు తెలిసిపోవును.

పైఁజెప్పినవిరూపాక్షరాజు శైవమతమును వదలి వైష్ణవమతము నందియుండుటకుఁ గొన్ని కారణములు చెప్పఁబడినవి.

ఈకథాసందర్భములలో నున్నశ్లోకములు.

" విరూపాక్ష స్తతో ధీమా న్స్వకశైవమతోఽపి సః,
శ్రీశైలవంశసంభూతౌ జ్ఞాత్వా తౌ రామలక్ష్మణౌ.
పుత్రమిత్రకళత్రాదిసహిత శ్చ సనాగరః,
శ్రీశైలవంశతిలకా న్నృసింహార్యా జ్జగద్గురోః.
పంచసంస్కారసంపన్నో బభూవ సుమహాయశాః." (పుట ౪౨౭.)

అని యున్నది. పై విరూపాక్షరాజుకాలము సీవలకే శాసనాదికసహాయమున(Mr. R. Sewell) దొరవలన నిర్ణయించఁబడియున్నది. (Vide Vol. II of his Lists of Antiquities.) అందు విరూపాక్ష శాసనములు క్రీ.శ. 1470-77=1396 శా. స. లో నొకటియును, క్రీ.శ. 1473-77=1396 శా. స లో నొకటియుం గాన్పించును. మనకు సరియైనకాలనిర్ణయము దొరకనిచో నీకాలమునుండి లెక్క చూచుకొనుటకుగా దీనినుంచికొందము.

పై నృసింహాచార్య వంశావళిలో నీక్రిందివిధముగా నున్నది. పుట౪౨౮.

" నృసింహార్యస్య పుత్రోఽభూ త్తాతార్య ఇతి విశ్రుతః,
శ్రీశైలపూర్ణనా మాభూ త్తాతార్య స్యాత్మజో మహాన్,
త స్యాభూ చ్ఛ్రీనివాసార్యః తస్య శ్రీతాతదేశికః,
త స్యాభవ ద్వేంకటార్యః తస్య సున్దరదేశికః.
పుత్ర శ్శ్రీ సున్దరార్యస్య శ్రీనివాసాభిధో గురుః,
శ్రీనివాసగురోః పుత్ర స్తాతార్యో లోకవిశ్రుతః,
స తాతదేశిక శ్శ్రీమా న్మహాత్మా శాస్త్రవిత్తమః,
గ్రన్థం విధాయ విఖ్యాతం యః పఞ్చమతభఞ్జనమ్,
విఖ్యాత స్సర్వలోకేషు మహాత్మా విబుధాగ్రణీః,
..........................................
శ్రీరామదేవరాయాఖ్యః కృష్ణరాయాదనంతరమ్,
శశాస రాజ్యం ధర్మేణ గురుభక్తిపరాయణః,

స భూపతి ర్మహాతేజా యయౌ చన్ద్రగిరిం ప్రతి,
గురుం తాతార్య మాదాయ రామరాయాభిధ స్తదా,
.........................................
రామరాయసహాయేన మహాచార్యో మహాయశాః,
దుర్జయా నపి నిర్జిత్య శైవాన్ శాస్త్రవిదు త్తమః,
.........................................
శైవశాస్త్ర విదాం శ్రేష్ఠో ధీమా నప్పయదీక్షితః,
చిత్రకూటే జితారాతి రశోభత మహాయశాః,
అద్వైతదీపికాభిఖ్యం గ్రన్థ మప్పయదీక్షితః,
చకార భగవద్ద్వేషీ శైవధర్మరత స్సదా,
మహాచార్య స్స తాం శ్రుత్వా తస్య ప్రతిభటం తదా,
చండమారుతనామానం విదధే గ్రంథ ముత్తమమ్. ”

అని యున్నది.

దీనింబట్టి గూడ నృసింహాచార్యులకు నప్పయ్యదీక్షితకాలీనుఁడును చండమారుతగ్రంథకర్తయు నగుతాతాచార్యులకు నడుమ 2 (ఏడ్గురు) పురుషు లున్నారు. అందుతాతాచార్యనాములు మువ్వురు కానుపించుచున్నారు. శ్రీనివాసాచార్యనాము లిర్వు రున్నారు. అందు నంద్యాలకృష్ణమరాజుకాలీనుఁడు పై పద్యానుసారముగఁ గృష్ణదేవరాయానంతరము వచ్చినరామరాజునకు గురు వని చెప్పఁబడినతాతాచార్యులతండ్రి యగుశ్రీనివాసాచార్యు లై యున్నాఁడు. అందు విశ్రుతుఁడగుతాతాచార్యు లని యుండుటచేతను అతనియన్వయమందుఁ బుట్టిన సుదర్శనాచార్యు లని యుండుటచేతను ఆతాతాచార్యులు నృసింహాచార్యులకుమారుఁ డగుతాతాచార్యులు కావచ్చు నని తోఁచుచున్నది. అట్లు కానిచో నతని మనుమఁ డగుతాతాచార్యు లైనను కావచ్చును. ఎటులైనను తాతాచార్యవంశస్థుఁడు సుదర్శనాచార్యులు గావచ్చును. అతనికుమారుఁ డగుశ్రీనివాసాచార్యులు నంద్యాలకృష్ణమరాజును సమకాలీను లగుటకు సందియము లేదు. పింగళినూరన కృష్ణమరాజు కాలీనుఁడు గనుక పై శ్రీనివాసాచార్యులకాలీనుఁ డగుటకు సంశయ ముండఁగూడదు. ఒకవేళ శ్రీనివాసాచార్యులు విశే

షముగా ముసలివాఁడైనతఁడె కృష్ణమరాజతనికడ నుపదేశమంది శిష్యుఁడై యుండి తనముసలికాలములో బాల్యవయస్సున నుండు పింగళిసూరకవి శ్రీనివాసాచారి కాలీనుఁడు కాకున్న నేకశతాబ్దములోనివాఁడు మాత్రము కాక తప్పదు. కృష్ణరాయల గురు వని ప్రసిద్ధిం జెందినట్టియుఁ గృష్ణరాయానంతరము రాజ్యమునకు వచ్చినరామరాయనికాలములో దేవస్థానప్రతిష్ఠాదిక మొనరించినట్టి తాతాచార్యునికాలము క్రీ. శ. ౧౫౦౯-౭౭—౧౪౩౨ శా. స మొదలు అనఁగాఁ గృష్ణరాయరాజ్యారంభకాలమునుండి మొదలయి యుండును. కాఁబట్టి తాతాచారితండ్రి యగుశ్రీనివాసాచారియును, అతనిశిష్యుఁడగు నంద్యాల కృష్ణమరాజును. అతనిపైని కృతి రచియించిన పింగళిసూరనయును సమకాలీను లని గాని లేక యొకశతాబ్దములోని వారే యని గాని నిశ్చయించిన సూరకవి తాతాచార్యకాలీనుఁడై తద్ద్వారముగఁ గృష్ణదేవరాయల కాలీనుఁడై రామరాయలపైఁ గృతి నిచ్చిన హరిశ్చంద్రనలోపాఖ్యానగ్రంథకర్త యగు రామరాజభూషణకవికిఁ బూర్వుఁడై యుండుట కెంతమాత్రము సందేహింపఁ బడనివాఁడై యుండును గదా. కృష్ణమరాజుపైఁ గృతి యీఁబడినకళాపూర్ణోదయగ్రంథముకంటెఁ బూర్వము రచియింపఁబడినరాఘవపాండవీయద్వ్యర్థికావ్యము హరిశ్చంద్రనలోపాఖ్యానమునకంటెఁ బ్రాచీన మైనది యగుటయు నిస్సంశయాంశమే కదా. కాఁబట్టి పైసంవాదద్వితయమును బరిశీలించిన వారు పింగళిసూరనకవి పదియాఱవశతాబ్దములోనివాఁడని నిర్ణయింపక అతఁడు కృష్ణదేవరాయనివలె పదునేనవశతాబ్దములోనివాఁడని సిద్ధాంతీకరించుటయే కాక అతఁడు కృష్ణరాయనిసంస్థానాష్టదిగ్గజములలోనివాఁడు కావచ్చు నని నిశ్చయించి చెప్పుట దోషయుక్తమేమో శ్రద్ధతో నాలోచించి తీర్మానించుటకుఁ బ్రార్థింపఁబడుచున్నారు.

## పింగళి సూరకవి రచియించినగ్రంథప్రశంస.

ఇంతవఱకును మనము సూరకవియొక్క కాలనిర్ణయము చేయుటలోఁ గాలక్షేపము చేసి తత్కవికృతము లగుగ్రంథ విశేషముల వివ

రింపఁ బ్రాలుమాలినారము. ఇపుడు మన మట్టికొఱఁత నివారించుకొని యెదము గాక.

ఈసూరనకృతగ్రంథములపేరు లీవఱకు చెప్పియున్నారము. ఇపు డాగ్రంథరచనావిషయము తత్కృతిపతు లతనివిషయమై చేసి నమర్యాదలును వివరించవలసియున్నదిగనుక మఱియొకపరి వాని నీ క్రింద వివరించెదను.

అందు

౧. గారుడపురాణము (సంస్కృతమునకుఁ దెనుఁగున భాషాంతరీకరణము.)

౨. రాఘవపాండవీయము (ద్వ్యర్థికావ్యము)

౩. కళాపూర్ణోదయము (అభూతకల్పనాకథాప్రబంధము)

౪. ప్రభావతీప్రద్యుమ్నము(స్వవంశావళియుక్తప్రబంధము)

ఈ గ్రంథములలో గారుడపురాణము తప్ప తక్కిన గ్రంథములు మూఁడును ముద్రితములై ప్రకటింపఁ బడి యున్నవి. మొదటి గ్రంథమగుగారుడపురాణము, గొప్పగ్రంథమై యుండుటచేత బహుప్రతిముఖంబున సర్వదేశంబులలోను వ్యాపింపక పో వచ్చును. ఆ కారణమున ప్రస్తుతకాలములో నది యచ్చొత్తువారికిని లభ్యము కాక యుండవచ్చును. మూఁడుసంవత్సరముల క్రితమువఱకుఁ గళాపూర్ణోదయమును సంవత్సరముక్రిందటిదాఁక ప్రభావతీప్రద్యుమ్నమును అచ్చుపడియుండక పోవుటచేత దుర్లభములుగా నుండినవి. ఇట్టిస్థితిలో వందలకొలఁది పుటలుగలపురాణములకు ప్రత్యంతరములు దొరకునా? నేఁటివఱకును చిరకాలముక్రిందటనాంధ్రీకృతములైనపురాణము లనేకము లముద్రితములుగా నేయున్నవి. వీనిలో సూరనకృతం బగు ప్రథమపురాణగ్రంథమును జేరి యుండును. ఇట్లూహించుట న్యాయముగాని ఆంధ్రకవిచరిత్రములో వలె సూరకవియొక్క బాల్యకవిత్వమగుటచే నాగ్రంథము నశించి పోయి యుండెనేమో అని యూహించుట న్యాయము కాదు. ప్రాచీనుల కవిత్వములు ప్రథమములోనే విశేషప్రౌఢముగా నుండు నాచా

రము గలదు. దానికి దృష్టాంతము తిక్కనసోమయాజికృతనిర్వచనోత్తర రామాయణమును, శ్రీనాథకృతనైషధము నై యున్నది. గరుడపురాణముంగూర్చి యీతకంటె విశేషించి వ్రాయంజాలము. నాల్గవగ్రంథ మగుప్రభావతీప్రద్యుమ్నముంగూర్చి మొదటనే వ్రాసియున్నాఁడను. ఇఁక రాఘవపాండవీయముంగూర్చి యిపుడు వ్రాసెదను.

### రాఘవపాండవీయము.

దీనియుత్పత్తిం గూర్చి యిదివఱకే కొంతకొంత వ్రాసియున్నాము. ఇపు డిందలి కృతిపతి వంశవృత్తమును కవికవిత్వవిశేషములు నడువుటయు మాత్రము చెప్పవలసినదిగా నున్నది. కృతిపతి యగు ఆకువీటి పెదవేంకటాద్రిరాజుయొక్క వంశావళి యీక్రింది విధముగా నున్నది.

క్షత్త్రియులు కౌండిన్యసగోత్రులు.
|
ఇమ్మరాజు. (ఆకువీటి పట్టణాధిపతి.)
|
భావరాజు.
|
ఇమ్మరాజు. (రాజమహేంద్రవరముం జయించెను.
- బొమ్మరాజు
- తిమ్మరాజు (విజయభైరవ బిరుదందినవాఁడు)
  - (విజయనగరనివాసి) పెదవేంకటాద్రి (కృతిపతి)
  - చినవేంకటాద్రి
  - వేంకటరాయఁడు
  - వేంకటవరదరాజు.

### గ్రంథరచనాకారణము.

ఈపైకృతిపతి యగుపెద్దవేంకటాద్రిరా జొకనాఁడు సంగీతసాహిత్యాది వివిధవిద్యాపరిసంగంబులఁ బరివర్తిల్లుచు సూరనకవిం బిలుపించి సముచితసత్కారంబుల గౌరవించి రెండర్థములపద్యము చెప్పుటయే

కష్టమైయుండఁగా నట్టియర్థద్వయముతో నొప్పుకావ్యము చేయుట యెంతయుఁ గష్టమైయుండును. అట్టికావ్యము నీయట్టిపండితుఁడే రచియింపవలెనుగాని అది యన్యులకు సాధ్యము కా దనుచు నీక్రిందిపద్యములం జెప్పిన ట్లున్నది.

ఉ. భీమన తొల్లి చెప్పె ననుపెద్దలమాటయ కాని యందు నొం
డేమియుఁ జేరెడ న్నిలుచు టెవ్వరు గాన రటుండనిమ్ము నా
నామహితప్రబంధరచనాఘనవిశ్రుతి నీకుఁ గల్గుటన్
నామదిఁ దద్ద్వయార్థకృతి నైపుణియుం గల దంచు నెంచెదన్.

క. చాటుప్రబంధరచనా, పాటవకలితుఁడవు శబ్దపరిచితియందున్
మేటివి దీనం దెనుఁగునఁ, బాటించి రచింప నీవ ప్రౌఢుఁడ వరయన్.

ఉ. దక్షత యింత కల్మి విశదంబుగఁ గాంచియు నీమది న్భలా
పేక్ష ఘనంబు గామి నిది యిట్టనఁ గొంకెద నీవ నోలలా
పేక్షణభక్తిశీల రచియించుట యిష్టముగాదె శ్రీవిరూ
పాక్షున కంకితంబుగ శుభార్థము రాఘవపాండవీయమున్.

ఇట్లుపెదవేంకటాద్రివలననే సూరన కవిత్వవిశేషములు కొన్ని వర్ణింపఁబడినవి. అట్టిశ్లాఘాపూర్వకము లగుప్రభుని యుత్సాహవాక్యముల కలరి, తాఁ జేయందొరకొనినరాఘవపాండవీయములోఁ దానుచూపింపవలసినశయ్యావిశేషముల నీక్రిందివిధంబున వివరించెను.

సీ. ఆంధ్రభాషాసంస్కృతాభిభాషాశ్లేష, యొక్కొకచోట నొక్కొక్కచోట
సుచితశబ్దశ్లేష యొక్కొక్కచోట న, ర్థశ్లేష యొక్కొక్కతఱిని ముఖ్య
గౌణవృత్తిశ్లేషఘటన యొక్కొకతఱి, నర్థాన్వయము వేఱె యగుచు నునికి
శబ్దాన్వయవిభేదసంగతి యొక్కొక,తఱి నవి యొక్కొక్కతఱిని రెండు
తే. మూఁడు కూడుట యన సముజ్జ్వలముగాఁగ
నాకుఁ దోఁచినగతిఁ బెక్కుపోక లమర
రామభారతకథలు పర్యాయదృష్టిఁ
జూచునమతుల కేర్పడ నాచరింతు.

పైపద్యములోని విశేషములు స్పష్టపఱుచుచో గ్రంథబాహుళ్య మగు నని యెంచియు నవి యలంకారగ్రంథములలోఁ దెలియందగి

నయంశము లవుటంబట్టియు వాని నిట వివరించుట మాని సూరకవి పదశయ్యాదులలో నెఱ్ఱప్రెగ్గడం బోలినవాఁడనియును, అతనివలె నీసూర కవియును, దీర్ఘసమాసములును. సంస్కృతములోఁగూడ నసాధారణములుగాఁ బ్రయోగింపఁబడు వైయాకరణుల ప్రయోగములీయాంధ్రములోఁ బ్రయోగించునిష్టము కలవాఁ డనియుం జెప్పఁదగియున్నది. శ్లేష లేక యున్న పద్యములలో నిట్టిచమత్కృతులు విశేషించి కానుపించును. శ్లేషలోఁగూడ ప్రౌఢప్రయోగములఁ జేయును. దీనిం జూపుటకుఁ గొన్ని పద్యముల నీక్రింద వివరించెదను.

శా. శ్రీచస్గుండలు రెండు నండగొని వాసిం బేర్చుచు న్భక్తిసా
మీచీన్యాముల పెద్దవేంకటనృపోన్మీలన్మనశ్చాతక
వ్యాచిక్రీంసకుఁ గైవసం బయి సదోదంచత్కృపాదృష్టి స
ధ్రీచీనం బగుకృష్ణమేఘము జగత్ప్రీతిం గడుం జేయుతన్.

శా. లోకత్రాణరతిం దదాదిమమహీలోకప్రబంధోత్కభా
షా[illegible]క్ష్ప్తప్రథమ ద్వితీయ పదగుంజన్మంజుమంజీరగ
ర్జాకల్పామలరామభారత కథాసర్గంబుల న్మించు వా
ల్మీకివ్యాసుల గొల్చెదన్ దదుభయశ్లేషార్థసంసిద్ధికిన్.

దీర్ఘసంస్కృత సమాసమునకు :—

ఉ. అంత వసంత మొప్పెఁ జరమాగ్రిమభాగచరాఖిలర్తుసా
మంత మనంతజాలకసమంజసరంజితకుంజకుంజరో
ద్ధ్వాంతనితాంతసాంద్రమధుదానవిజృంభితబంభరస్వనా
త్యంతనిరంతరీకృతదిగంత మతాంతలతాంతకుంత మై.

—— మిశ్రకవిత్వమున కుదాహరణము. ——

సీ. అచ్చంపు లేఁజిగురాకుజొంపము కెంపు, మేలిచెందిరపుఁగెందూళి గాఁగ
గ్రుచ్చినట్టుగ జాదుకొన్న మొగ్గలగుంపు, ప్రకటపాటలబిందుపాళి గాఁగ
విచ్చినపరువంపువిరులతండము పెంపు, శోభితభూతిరింఛోళి గాఁగ
నిచ్చలం బైన తేనియవానజడి సొంపు, లాలితదానధారాళి గాఁగ
తే. కుసుమపరాగము కేళిపాంసువులు గాఁగ, భ్రమరపఙ్క్తులు పైసరపణులు గాఁగ
బుడమి నెల్లను వాహ్యాళి వెడలుమదను, మదపుటేనుఁగుబోలె నామనిఁ దనర్చె.

శ్లేషోదాహరణము :—

సీ. క్రీడాపరుం డైనక్రీవరుం డిట్లు తా, త్రిపురికిరియను విజయప్రసక్తి
నిర్వహించుచు శత్రునిర్మూలనము సల్పి సొంపుమై దనకును శుభసదనిక
లంకాధిరాజ్యవిలాసపట్టాభిషే, కము స్వపురస్ఫూర్జితముగ నడప
వసుధ నప్పుడు దానవప్రభుత్వవిశేష, పృథుతరదీప్తివిభీషణుండు

తే. తేజరిల్లె ధర్మరాజితరక్షమా, పాలదుర్లభతరభాగ్యలక్ష్మి
నేడు గా ఫలించె నెఱయ నస్మత్పూర్వ, సుకృత మద్భుత మని సుజను లలర.
[ఆశ్వా. ౪. ప. ౨౧౯.

## రాఘవపాండవీయకృతివిషయము.

ఈగ్రంథమును సూరనకవి తనయితరగ్రంథములవలెఁ గాని లేక యితరకవుల గ్రంథములవలెఁగాని చెప్పక గ్రంథమున కిర్వురుకృతిపతులఁ జేసె. అందు పెదవేంకటాద్రి యొకకృతిపతిగాను, విరూపాక్షక్షేత్రాధిపతి యగువిరూపాక్షేశ్వరుఁ డనుశివుఁ డొకకృతిపతిగా నున్నట్లు కానుపించును. దానికిఁ గారణము తానావఱకే గ్రంథ మారభించి విరూపాక్షస్వామికిఁ గృతి నీయవలయు ననుకోర్కె కలవాఁడై యుండి అనంతరము రాజసన్మానార్థమై తన తొల్లింటియభిప్రాయము మానియుఁ గేవల మట్లు మానుటవలన స్వప్రతిజ్ఞాభంగ మగు నని యూహించి, తదర్థమై రెండుపేరులును గల్పి యుంచు నని తోఁచుచున్నది. లేదా మఱియొకకారణ మేదియైన నుండవచ్చును. దీనింగూర్చి రాఘవపాండవీయములో నీక్రిందివిధంబుగ వ్రాయఁబడినది. అది చూచినవారల కది నిశ్చయమే అని తోఁచక పోవునేమో యని యూహించి పైకారణ మూహించుట యయినది, ఆవచన మెట్లన్నను :—

"వ. అని యిట్లు కృతోత్సాహుండ నగుచు నేతత్ప్రబంధనిబంధనారంభంబున కుఁ బ్రేరకుం డైనసకలాంతర్యామి హేమకూటాధ్యక్షుఁడు శ్రీవిరూపాక్షుండు నిర్విఘ్న పరిసమాప్తి ప్రచయగమనంబులకుం దాన కలండు. అతని సంకల్పానుసారంబున నెట్లు కావలయు నట్లగుంగాక నాకు భారం బేమి యనుతలంపున నిశ్చితుండ నై కడంగి దీనికిఁ బ్రత్యక్షనియామకుం డైనపెదవేంకటాద్రి మహీవల్లభు వంశక్రమం బభివర్ణించెద.
ఆశ్వా 1-ప ౨౦.

షష్ఠ్యంతములలోఁగూడ విరూపాక్షేశ్వరుని పేరే యున్నది. అటుపిమ్మట విరూపాక్షేశ్వరునకు సభక్తికసమర్పితంబుగా నాయొనర్పం బూనినరాఘవపాండవీయమునకుఁ గథాక్రమం బెట్లనిన యనియున్నది. ప్రతియాశ్వాసాద్యంతములయందును విరూపాక్షదేవుని పేరే యున్నది. గ్రంథసమాప్తినిఁ గూడ నీక్రిందివిధంబున విరూపాక్షదేవుని పేరే చేర్పఁబడియున్నది.

శా. దేవా దేవరప్రేరణంబునన యుద్దీపించువాగ్వైభవ
శ్రీవిస్ఫూర్తిని రామభారత కథాశేషప్రబంధోత్తమ
వ్యావిర్భావము నిట్లు సెందె నిది భవ్యాభవ్యత ల్సూడ కిం
పై వర్తిల్లఁ బరిగ్రహింపుము విరూపాక్షా జగద్రక్షకా.

శా. క్రీడామాత్రకృతత్రిమూర్తిభరణాంగీకారచూడాపరి
భ్రాజద్దివ్యధునీప్రవత్ప్లుషితపంపాశైత్యవేధోమరు
ద్రాడారాధితపాద యంఘ్రినఖచంద్రద్యోత సిద్ధ్యత్పరి
వ్రాడాఖండలమండలీహృదయజీవంజీవసంజీవనా.

## వ్యాఖ్యాతం గూర్చి.

ఈ రాఘవపాండవీయమునకు ముద్దరాజు పెదరామమంత్రి వ్యాఖ్యానముం జేసెను. ఇతనికాలముగాని యునికిపట్టుగాని తెలియుట కా గ్రంథములో నేమియును వ్రాయంబడలేదు. వ్రాతప్రతులలోఁ గొంత యున్నట్లుగాఁ దెలియవచ్చినది. అవి ప్రస్తుతము దొరకుట యరుదుగా నున్నది. అతఁడు ఆశ్వాసాంతములయందు వ్రాసియుండు గద్యలంబట్టి ముద్దరాజు గణపమంత్రికుమారుఁ డని మాత్రము తేలుచున్నది. ఇదియునుగాక నందవరీకశాఖానియోగులనియును స్పష్టమగు.

ఆగద్య మెట్లన్నను:—

“ఇది శ్రీమదనగోపాల కృపాకటాక్ష సంప్రాప్త సారసారస్వత సంపదానంద నందవరకుల క్షీరపారావార రాకాసుధాధామ ముద్దరాజు గణపయామాత్య పెద్దరామ ధీమణి ప్రదర్శితం బైన రాఘవపాండవీయ దర్పణంబు”

అని యున్నది. కాలము లోనగునవి యచ్చొత్తువారికిని లభ్యములు కాకయుండవచ్చును. ఇఁక రాఘవపాండవీయశయ్యాదికముం గూర్చి యిప్పుడు వ్రాసెదను:—

## రాఘవపాండవీయశయ్యాదికము.

దీనియుత్పత్తింగూర్చి యిదివఱకే కొంత కొంత వ్రాసియున్నాము. ఇపు డిందలి కవి కవిత్వవిశేషములు నుడువుట మాత్రము కావలసినదిగా నున్నది.

## రాఘవపాండవీయములోని పదప్రయోగాది విషయము.

దీనివిషయమై దక్షిణామూర్తి పండితునివలన వ్రాయఁబడినది మిక్కిలి పరిశీలనము చేయంబడినయభిప్రాయము కాదు. అట్టి పరిశీలనమంతయు సరియైనట్టుగా నే నొప్పుకొనఁజాలను. శ్లేషకావ్య మాటంజేసి యీగ్రంథములో సూరకవి చేయవలసి చేసినకొన్నిప్రయోగములు లాక్షణికులందఱికి సమ్మతములు కావయ్యెను. వైయాకరణులలోఁగూడ నహోబలపతి మొదలగువారలు కొన్ని యాక్షేపణలు చెప్పిరి. ద్వివిధరేఫలవిషయమై పెనఁగులాడువారు గూడ నిసూరకవి చేయుఱకార ప్రయోగములలోఁ గొన్నిటికి సమ్మతింపరైరి. వాని నన్నిఁటి నిట వివరించుట మిక్కిలి కష్టసాధ్యమును స్వల్పలాభయుతము నై యుండుంగావున ఆ పని మాని వానింగూర్చి అప్పకవీయములో నహోబలపండితీయములోఁ జూడం దగు నని వక్కాణించెదను. శ్లేషకావ్యములలో నర్ధానుస్వారములును, శకటరేఫములును, అఖండయతులును బిబంధముల లోపలెః కల్గుట తటస్థించదు. సంస్కృతశబ్దములు తెలుగులో శ్లేషించి విడఁదీయునపు డిట్టినిర్యామకములు కొన్ని పొసఁగియుండవు. అట్టివట్ల సూరనకేకాక యితరకవుల కెంత వారికి నైన మార్చి చెప్పుట దుష్కరము కావున పైదోషము లున్నంతమాత్రమున శ్లేషకావ్యమున కొక లోప మాపాదింపఁగూడదు. ఎ ట్లైనను సూరనప్రయోగములు విజాతీ

యము లైనవి. అనంతరకాలములో శ్లేషకావ్యములం జెప్పినకవు లంద ఱును సూరనకవిమార్గముసే యవలంబించి నడిచిరిగావున సూరనమా ర్గమే శ్లేషకవనమునకు నిబంధనగ్రంథ మైనది. కావున నావిషయ మై విశేషించి వ్రాయ గమకింపను.

శయ్యాదులవిషయము.

సూరన శయ్యాదులంగూర్చి దక్షిణామూర్తిపండితుఁడు వ్రాసి నవిశేషములో నేవి యంగీకరింపఁదగినవియో ఏవి పరిహరింపఁదగినవో వానినిమాత్రము వివరించెదను. అట్లు వివరింపకున్న నందలి గుణాగుణ ములు పాఠకులకు బోధపడకపోవును.

Critical Essas on Pingali Surana.

PAGE 6.

ఉపన్యాసకాభిప్రాయము.

"సూరనార్యకవియుఁ గడుబాల్యమునందే కవితాకౌశలమును సంపాదించిన ట్లూహింపఁదగియున్నది."

చారిత్రకాభిప్రాయము.

లోకములోని కట్టుకథయే నిజ మగునేని సూరన బాల్యకాల ములో విద్యాభ్యాసము లేక మూఢుఁడై తిరుగుచుండె ననియును. భా ర్యవంకవార లతనిం బరిహసింపఁగా నతఁడు రోషమున దేశాంతరమున కుఁబోయి విద్యాభ్యాసము చేసి పండితుఁడై వచ్చె ననియు, ననంతరము మఱికొంతకాలమునకు నతఁడు తనభార్యకుఁ దాత యగునల్లసాని పెద్ద నం జూడఁబోవుడు నతనికవిత్వముం బరీక్షింప నొకపద్యముం జదువుఁడ నుడు నపుడు.

"తలఁపం జొప్పడి యొప్పె నప్పుడు"

అనుపద్యము ప్రారంభింపఁగా ప్రారంభమునందే నాల్గువిఱువులా యని అడిగినట్లును, అందుపైని సూరనపద్యమంతయు విని యాక్షే పించిన బాగుగదా యనుచుఁ బెద్దన చదువు మనుడు.

"                                        తదుద్యజ్జైత్రయాత్రాసము
త్కాలికారింఖదసంఖ్యసంఖ్యజయమత్కాంఖాణరింఖావిశృం
ఖలసంఘాతధరాపరాగపటలాక్రాంతంబు మిన్నే యన
ర్గళభేరీరవనిర్దళద్గగనరేఖాలేపపంకాకృతిన్."

అని చదివి పెద్దనకవిని మెప్పించిన ట్లున్నది. ఇంతియ కాక బాల్యమునందే కవిత్వము చెప్పిన శ్రీనాథాదులు ఆవృత్తాంతమును స్వకీయ గ్రంథములలో వ్రాసియుంచిరి. సూరన యట్లు చెప్పియుండక పోవుటచే నతఁడు బాల్యవయస్సులోఁ గవి యని చెప్ప వీలుపడదు.

2 ఊ. ఇతఁడు సంస్కృతపాండిత్యము మిగులఁ గలవాఁడు. ఇతని కద్భుతజనకము లగు గ్రహణధారణశక్తులు కలవు. ఈతఁడు బాల్యమునం దభ్యసించినవిద్య యెట్టిదో చూడుఁడు. ఈయనయు నందఱివలెనే పంచకావ్యపఠనముం జేసినాఁడు, తర్వాత నాటకములంగూడ చదివెను. ఈనాటకములందలి రహస్యముల నెల్ల ననర్గళముగా గ్రహించినాఁడు. కావుననే యాంధ్రభాషను బునరుద్ధారణము చేయుటకుఁ దగినశక్తినిఁ బడసియున్నాఁడు. నాటకశైలి యతనిమనస్సున మిగుల నాటుకొనినది. ఇది యతనిగ్రంథములయం దెల్లెడ నాతనిచేఁ బ్రకటీకృత మై యున్నది."

చా. ఇందు వ్రాయఁబడినయంశములలోఁ బెక్కులు సర్వకవిజనసామాన్యలక్షణములే కాని విశేషములు కావు. ఇతని కద్భుతము లగు గ్రహణధారణశక్తులు కల వనుటకు గ్రంథదృష్టాంతములు లేవు. పంచకావ్యములు నాటకములు చదివినాఁ డని చెప్పుట అంతకుఁ బూర్వము బాలరామాయణముంగూడఁ జదివె నని చెప్పుట యట్టిదే. ఆంధ్రభాషను పునరుద్ధారణము చేసె ననుదాని కాధారము లేదు. నాటకశైలి యనుమాటకు నాంగ్లేయభాషలో నగుభావము ఆంధ్రగీర్వాణభాషలలోఁ జెప్పవలసివచ్చిన నది సంస్కృత ప్రాకృతములతో నున్నది. కావున నాటకశైలి ఈసూరనకవిగ్రంథములలో లే దని నిశ్చయించెదము.

3 ఊ. ఏయది చదివినను దానిని సమగ్రముగా గ్రహించి కాని విడువలేఁడు. కావుననే యితని కనర్గళధారాశక్తి లంభించినది.

చా. ఈమాటల్ల నెఱిఁగియున్నట్లుగా మాటాలాడుటకు మనకుఁ

దగినయాధారములు లేవు. ఇతని కవర్గళధారాశక్తి యున్నది లేనిది చెప్ప వలనుపడదు.

౪ ఉ. రాఘవపాండవీయరచన కట్టిశక్తి యుండవలెనా యోజింపుఁడు.

చా. హరిశ్చంద్రనలోపాఖ్యానము మొదలగుద్వ్యర్థికావ్యములను యాదవరాఘవపాండవీయత్ర్యర్థికావ్యమును నలయాదవరాఘవపాండవీయాదిచతురర్థకావ్యములను రచియించువారికి నెట్టిశక్తి యుండవలయునో!

౫ ఉ. ఈతఁడు పదగుంభన కెంతమాత్రము గౌరవ మిచ్చియుండలేదు.

చా. ఇది పరిశీలన లేనివాక్యమని సూరకవిగ్రంథములఁ బరిశీలించినవారి యభిప్రాయము.

౬ ఉ. కాళిదాసుకవిత్వ మితనికి మిగుల గుఱియైనది. అతనియం దితనికి మిగుల గౌరవము కలదు. ఇట్టి బుద్ధితోఁ గవిత్వము వ్రాయఁ బూనినవాఁ డెట్టి వాఁ డగునో విశేష మాలోచింపఁ బనిలేదు.

చా. దీనిని స్థిరపఱుచువ్రాఁతలు లేవు. ఇట్టియూహాలు శైలిని పరిశీలించుటలోఁ జాలియుండవు.

౭ ఉ. ఇతని నడవడిఁగూర్చి చూపుఁడు. నమ్రతయు నిగర్వమతియు మొదలగునవి యీతని సహజగుణములు.

చా. కృతిముఖంబునఁ జెప్పెడుమాటలంబట్టియే యొకరిప్రవర్తనము నిర్ణయింపఁ గల్గితిమేని ప్రతికృతిపతియు నైశ్వర్యంబున కుబేరసమానుఁడును, విభవమున నింద్రతుల్యుఁడు సత్యమున హరిశ్చంద్రుఁడును బరాక్రమమున శ్రీరాములు నగుదురు. కాఁబట్టి యిట్టివానిం బట్టి కృతిపతి యొక్కగాని, కవియొక్కగాని ప్రవర్తనల నెంచఁగూడ దని చెప్పెదను.

౮ ఉ. ఆంధ్రకవు లందఱిలోను శబ్దసౌష్ఠవమునం దేమి యర్థగౌరవము నం దేమి శయ్యాపాకములం దేమి శైలీపరిపూర్ణతయం దేమి తిక్కన సోమయాజితోడ సరి రాఁదగుకవి యొక్కఁడును లేఁడు.

చా. ఇది పురాణకవులం గూర్చి చెప్పఁదగినమాటగాని ప్రబంధకవు

లం గూర్చి కాదు. ప్రబాధకవులను ప్రబంధకవులతో సరిచూడవలెను. అం దీతనికంటెఁ బెద్దనాదు లన్నివిధముల నధికు లనుటకు సందియమే లేదు.

౯ ఉ. తిక్కనతర్వాత నాచనసోమునిం జెప్పవచ్చును. ఈయిరువురితరువాతను సూరన గణనకు రాఁదగినయాన్నాఁ డని తలంచెదను.

చా. పైన వ్రాసినదే దీనికిఁగూడ సమాధానము. కావున దీనికి వేఱుగ నుత్తరమీయను.

౧౦ ఉ. ఇతఁడు ఒకరు త్రొక్కినమార్గములం ద్రొక్కువాఁడు కాఁడు. తాను సం పాదించినలోకానుభవము, స్వీయ మగుతనబుద్ధివైశద్యము, ప్రతిభాసమా సాదిత మగుగు ణాగుణ వివేచ నాశక్తియుఁ గలుగఁజేసినయభిరుచులమూలముగఁ గావ్యములు వ్రాసిన వాఁడుగాని కబ్బపుదొంతుల సత్పదార్థములు వెదికి వ్రాసినవాఁడు కాఁడు.

చా. ఈసిద్ధాంతము కాళిదాసుమార్గమునే యితఁ డవలంబించి నాఁ డనియును, రాఘవపాండవీయములోని "శ్రమ ముడుగుండు" అను పద్యము కాళిదాసకృత "పరిచయం చలలక్ష్యనిపాతనే" అను శ్లోక మునకు సరియైన తెలుఁగుగాఁ గాన్పించుచుండు నని యుపన్యాసకుఁడు ౧౧ పుటలో వ్రాసిన మాటలకును బాధక మగుచున్నది. "బాణోచ్ఛి ష్టం జగ త్సర్వ" మ్మని యున్న బుధజనోక్తియు దీనిని బలపఱుచుచున్న ది. సూరకవియొక్కఁడే గ్రంథచోరుఁడు కాఁ డని చెప్పఁగాఁ దక్కినకా వ్యకవులందఱును గ్రంథచోరు లని యర్థాత్తు సిద్ధించుచున్నది. అట్లైన పెద్దనాదులపెద్దఱికము చెడిపోవును. సూరనకు పైవారికంటె గాన వాధిక్యము లేదనుమాట సర్వత్ర విదితమే. కావున సూరనంగూర్చి విశేషించి చెప్పుట యత్యుక్తి యగును.

౧౧ ఉ. నూతనసృష్టి చేయుట యితనిమతము. చిలుకపలుకులవలె పూర్వకవి కృతవర్ణనలవెంబడి పోవుట యితనిమతము కాదు. కావుననే తనకావ్యములం దితఁ డాం ధ్రగీర్వాణభాషలయందాదిమకవులం జేర్కొని యున్నాఁడే కాని తక్కుంగలవారి పేళ్లై నను దడవియుండలేదు.

చా. నూతనసృష్టి చేయుట యితనికే కాక కావ్యరచనచేయు వారి యందఱిమతము నై యున్నది. ఇతనిపూర్వులు సీతనివలెనే పూ

ర్వాకవికృతవర్ణనలవెంబడి పోయిరే గాని కేవలము స్వకపోలకల్పితము లకై పోవువారు కారు. ఇతఁడు నట్టివాఁడే యని కంఠోక్తిగాఁ జెప్పవలసియున్నది కాని యిం దీతనివిశేష మేమియుఁ గాన్పించదు. ఆంధ్రగీర్వాణభాషలయందలి యాదిమకవులం జేర్కొనుట యితరుల నిరసించుటకుఁ గాదు. అట్లే అయిన కాళిదాసాది మహాకవులం దిరస్కరించి నట్లగును. సంస్కృతములోఁ గవిత్వము చెప్పినవారు ప్రాచీను లగు ఋషు లై యున్నారు. కావున వ్యాసవాల్మీకులు సర్వజనులవలనఁ బరిగణింపఁ బడుచున్నారు. సూరన వారిగ్రంథముల రెండిటిం జోడింపఁ గమకించినాఁడు గనుక

"వాల్మీకి వ్యాసులఁ గొల్చెదఁ దదుభయశ్లేషార్థసంసిద్ధికిన్."

అని చెప్పినాఁడు. ఆంధ్రములోఁగూడ భారతకవిత్రయము వారు ఆంధ్రభాషా మహోపకారులలోఁ బ్రధానులు కావున వారు మాత్ర మనేకులవలనఁ గొనియాడఁబడుచున్నారు. అంతమాత్రమున వారికి గౌరవము తక్కినవారికగౌరవమును జేయుతలంపు సూరనకుఁగాని యే యితరకవులకుఁగాని యుండ దని నిశ్చయించవలసియున్నది. అట్లుండిన నాతఁడు శ్లాఘాపాత్రుఁడు కాక యే పోవచ్చును.

౧౨ ఉ. కల్పనాశక్తి యీతనికి మెండుగ నుండుటచేతనే యాశక్తిచే నలంకరింపఁ బడినకవులను మాత్రము వర్ణించినాఁడు.

చా. పైనిఁ జెప్పంబడినయాంధ్రగీర్వాణకవులు పురాణకవులు. వారికిఁ గల్పనాశక్తితోఁ బనిసక్తి లేదు. వారు చెప్పినదంతయుఁ జారిత్రములుగాని కావ్యములు కావు. ఒకవేళ నుపన్యాసకునియభిప్రాయములోఁ బురాణము లన్నియుఁ గల్పితము లని యున్నదేమో. అట్లుండిన వ్యాసవాల్మీకులు గాని వారికథలను కలిపిచెప్పినసూరన గాని శ్లాఘాపాత్రులు కాకపోవలెను. వీరలలో నెవ్వరును క్రొత్తకథలఁ గల్పించలేదు గదా.

౧౩ ఉ. ఈతఁడు . వ్రాసినగ్రంథములెల్ల నూతనఫక్కికములై యున్నవి. మొదల నితనికి సహజ మగుశక్తి కలదఁట. పిదప కాళిదాసాదిమహాకవుల కావ్య

సారముం గ్రహించినాడఁట. ఇఁక నితనిశక్తి యే మని యనుకొన వచ్చును ? ఈశక్తి యెట్టిపనుల నొనర్చినదో చూతము."

చా. ఈమాటల కాధారము లెవ్వియును లేవు. ఇతఁడు వ్రాసినగ్రంథములన్నియు నూతనఫక్కికములే యనుట యత్యుక్తి యగును. గరుడపురాణము పురాణఫక్కి కలదే. రాఘవపాండవీయము సంస్కృతములో నంతకుఁబూర్వమున్న రాఘవపాండవీయఫక్కి కలదే. కళాపూర్ణోదయము సంస్కృతకాదంబరి ఫక్కి కలదే, ప్రభావతీప్రద్యుమ్నము ప్రబంధఫక్కి కలదే. ఇతనిశక్తి యే మని యనుకొనవచ్చు ననునంత యద్భుతమైనది కాదు సరికదా ప్రథమతః సంస్కృతాంధ్రములయందు నవీనమార్గములఁ గల్పించినమహాకవులశక్తికి నెంతమాత్రము చాలి యుండ దని చెప్పవలసియుండును.

## నూరనకాలమందుఁ గవిత్వ మెట్టిదశయందున్న దను దానిం గూర్చి విమర్శనము.

౧ ఉ. ఆంధ్రకవు లెల్లరును వారలకాలములం బట్టి ప్రాథమిక మాధ్యమి కాధునికు లని మూఁడు భాగములుగ నగుచున్నారు. ఈ మువ్వురియందును శైలీభేదము మిగులఁ గాన్పించుచున్నది.

చా. లోకమందంతటఁ బ్రాచీనులు నాధునికు లని రెండుభేదములే గాని మూఁడుభేదములు కల్గుటకు ప్రసక్తి లేదు. అట్లే అప్పకవి మొదలగులాక్షణికులు నెవ్వరును వివరించి యుండలేదు. మనము కవిత్వశయ్యావిషయములలో భేదాభేదములఁ గనిపెట్టవలయు నని కోరెద మేని యొక్కొకశతాబ్దములో నుండెడుకవులపదశయ్యాదులఁ బరిశీలింపవలయుంగాని నాలుగేసి శతాబ్దములలోని కవులశయ్యాదులం బోల్పఁ గూడదు.

౨ ఉ. భారతశైలితోడ సరితూఁగునది యాంధ్రంబున నేదియు లేదు.

చా. అట్లు చెప్పెడు మాట కర్థము లేదు. భారతశైలి మూఁడు తెన్నులుగా నున్నది. అందు నన్నయభట్టుశైలి వంటిది తిక్కనసోమయాజిది కాదు. తిక్కనసోమయాజి శైలివంటిది యెఱ్ఱాప్రెగ్గడది కాదు.

అందు నన్నయభట్టు శైలి అతిసులభమైనదియు నెఱ్ఱాప్రెగ్గడ శైలి అతి కఠినమైనదియు నై యున్నది. తిక్కనసోమయాజి శైలి యీయుభయ విధముల నుండునది. కవిత్వప్రౌఢిమలో నన్నయభట్టు మిక్కిలి నేర్పరి కానివానివలెఁ గాన్పించును. తిక్కన యెఱ్ఱాప్రగ్గడలు ఇంచుమించుగా సమర్థులుగాను సమానులుగాను గాన్పించుచున్నారు.

3 ఉ. తర్వాతికవులు కొందఱు ప్రయత్నించి యీశైలి నవలంబించి గ్రంథముల వ్రాసియున్నారు.

చా. కవిత్వము జెప్పువారు ఇతరుల శైలి నవలంబించి వ్రాయుట యుండనట్లుగా నాత్మానుభవమునఁ జెప్పవలసియున్నది. కవిత్వప్రారంభసమయములో నందఱిశైలియును గొంచెము కఠినపదయుక్తముగాను, కఠినాన్వయయుక్తముగాను, నాతిమధురముగా నుండుట స్వభావము. పోవంబోవ గఠినపదప్రయోగమునం దిష్టముగలవారికవనము అతికఠినముగాను సులభపదప్రయోగము లిష్టముగా నుండువారి కవిత్వ మతిసులభముగా నుండును. ఇటులనే రసాలంకారములఁ గృషి చేయువారికవితయు నుండుననుటకు సందియ ముండదు. ఇట్లుండుటం జేసి మనము ఒకరి కవిత్వముంబోలి యొకరికవిత్వ మున్న దని గాని యొకరివర్ణనలం జూచి యొకరు వర్ణనలం జేసి రని గాని యూహింపఁ గూడదు. చమత్కారార్థముగా నెవ్వ రైన మహాకవి చెప్పిన వర్ణనాంశముల నంతకు నెక్కు డగురసము పుట్టింపఁగోరి మఱికొందఱు మహాకవులచేతం బ్రయత్నింపఁబడినను అంతమాత్రమున నాయిర్వురు నొక్క శైలి వా రనిగాని లేక వారినుండి వీరు దొంగిలి రని గాని చెప్పుట కవిత్వపరిపాటిలోనిది కాదు.

4 ఉ. పూర్వకవులు వలయుచోటుల సంస్కృతము దెచ్చిపెట్టిరి. కాని గ్రంథముల నెల్ల సంస్కృతభూయిష్ఠములు చేసి యుండలేదు, తర్వాతికవులు వ్రాసిన గ్రంథముల యం దాంధ్రచిహ్నము లించుకైనను లేవు.

చా. దీనికిఁ గారణ మాలోచింపక పోరాదు. పూర్వకవులు సంస్కృతముం దెలిఁగించుచోఁగూడ సంస్కృతము లుంచియుండఁగా సం

స్కృతములోని కావ్యనాటకములు నలంకారములు తెనుఁగులోనికిఁ
దెచ్చెడిప్రబంధకవులుమాత్రము సంస్కృతము నెందు కవలంబించఁ
గూడదు. అటులనే కాకున్న సంస్కృతములోనియలంకారములకు నాం
ధ్రమున నిష్ప్రయోజనత్వము తటస్థించును. ఆంధ్రభాష తత్సమ త
ద్భవ దేశ్యాత్మక మై యున్న దగుచో నీమూఁడును కల్పి యైనఁ జెప్ప
వచ్చును. దేని కది విడఁదీసియైనఁ జెప్పవచ్చును. ప్రబంధములలోఁ బ్ర
త్యేకము వర్ణనాంశములే ప్రధానములు గావున నిట్టివర్ణనాంశములలోఁ
గొన్ని సంస్కృతజటిల మగుటచేతనే రసావిర్భావ మగుటయు, శ్రావ్య
మగుటంబట్టి ప్రబంధకవులందఱు నట్టిత్రోవ నవలంబించిరి కాఁబట్టి ప్ర
బంధము లనుపేరితో నొప్పుగ్రంథము లట్లె యుండవలెం గాని వేఱుగ
నుండఁగూడదు. ఇట్టి విశేషములు లేని నవీనుల ప్రబంధములు పండితా
దరణీయములు కాక సామాన్యగౌరవమున నొప్పియున్నవి. కావున గ్రం
థగౌరవమే కోరువారు ఆంధ్రచిహ్నములు లేనిలోప మెంచ రని తలం
చెదను.

గీ. తే. శబ్దార్థ గౌరవ మూహించునలవాటు మాధ్యమిక కవులయందుఁ బ్రబలినది.
ఇంతటినుండియుఁ గవులయందు స్వశక్తి మాటువడినది. వీరలు తమ వ్రాసినగ్రంథముల
నెల్ల నొక్కరీతిగాఁ జర్వితచర్వణ మన్నట్లు వ్రాసిరే గాని తమబుద్ధివిశేషము నేనిఁ
గల్పనాశక్తి నేని వెల్లడి చేసియున్నవారు కారు.

చా. ఈయాక్షేపమునందు న్యాయ మేమియుం గానిపించదు. ప్ర
బంధమున కేర్పడినవి యిరువదియొక్కవర్ణనములు. అవి లేనిచో నది ప్ర
బంధము కాదు. అందు ప్రథమములో వర్ణించినవానికి సౌలభ్యము విశే
షించి కలదు. ఆవర్ణనముననే వందలకొలఁది జనము చేయనారంభించిన
నొకరిదానిం బోలి యొకరిది యుండక తీఱదు. అంతమాత్రముచేత ప్రా
చీనులఁ జూచి నవీను లావర్ణనములనే చేసి రని చెప్పుట యుక్తియుక్త
ము కాదు. ఇట్టివన్నియుఁ జర్వితచర్వణము లని చెప్పుటయు న్యాయ
ము కాదు. ఈవర్ణనాంశములయందేమి తదితరస్థలములయం దేమి ప్రతి
ప్రబంధములోనను హృదయాహ్లాదకరము లగుకొన్నికొన్ని క్రొత్తవి

శేషము లుండి యవి యాయాకవులబుద్ధివిశేషమును, గల్పనాశక్తిని బ్రకటించుచునే యున్నవి కాని యుపన్యాసకుఁ డనినట్లు హాస్యాస్పదములుగా లేవు. కవిత్వవ్యవసాయము చేసినవార లిచ్చెడియభిప్రాయ మిది గా దనియుం గూడ చెప్పవలసియున్నది.

౬ ఉ. ఈప్రబంధకవులకు మార్గదర్శి యగుపెద్దనమాత్రము కొంతపొగడ్తకుఁ దగియున్నాఁడు. కాని తక్కినవారందఱు నాయనవర్ణనలకు నచ్చటచ్చట మెఱుఁగుపెట్టియేని పూర్వకవివర్ణనాంశములఁ గలిపియేని వ్రాసినారుకాని తమస్వశక్తిని జూపియుండలేదు. పెద్దనకూడ తనవర్ణనల నితరులనుండి చేకొనియున్నాఁడు.

చా. ఉపన్యాసకుని దృష్టిలోఁ బెద్దనకవియే గ్రంథచోరుఁడుగాఁ గాన్పించఁగా నిఁక తక్కినకవులంగూర్చి చెప్పనేల ? ప్రబంధములవిషయములో నిట్టిన్యూనాభిప్రాయ మీవఱకే విమర్శకులు నీయలేదు. ఇందు విమర్శకునకుఁ బ్రబంధపరిపాటి తెలియ దని చెప్పుటయే యుత్తరువు. దీనికి వివరణము చేయుటకై యత్నించుట నిష్ఫల మగును.

ఉ. ప్రబంధములలో నెద్దానిం జేకొన్నను దానికథ చదువకయ చెప్పవచ్చును.

చా. ఇది యొక గొప్పశక్తి. మనుచరిత్రమునకుఁ గలకథ గ్రంథము పేరు విన్నంతమాత్రముననే బోధించు నేమొ ? చదువఁగాఁగాని నాకాకథ తెలియలే దని చెప్పుట ఆత్మానుభవము. అటులనే పారిజాతాపహరణము యొక్కయు, నాముక్తమాల్యదయొక్కయు, పాండురంగక్షేత్ర మహాత్మ్యముయొక్కయు, యయాతిచరిత్రయొక్కయు మఱియు నిట్టిప్రబంధములయొక్క కథలు పేరు విన్నంతమాత్రమున నవగాహనకు రాకున్నవి. అటుగాకున్న నుపన్యాసకునివాక్యమునకు వేఱేదియైన నర్థ మున్న నుండవచ్చును.

౭ ఉ. రామరాజభూషణకవిరచిత మగువసుచరిత్రఁ జేకొనుఁడు. అందలి కథ నెల్ల నొక్కవాక్యమునఁ బొందుపఱుపవచ్చును. వర్ణనలుమాత్ర మతిమాత్రములై యున్నవి. చంద్రోదయవర్ణనమున ముప్పదిపద్యములును సూర్యోదయవర్ణనమున నలువదిపద్యములును, నాయికానాయకుల విరహావస్థావర్ణనమున రెండాశ్వాసములును వ్రాసి కాలము గడపినాఁడేకాని కథాంశముల వర్ణించి రసము పుట్టించినవాఁడు కాఁడు.

చా. వసుచరిత్రముపై యాక్షేపణచేసినపరిశీలకు లెవ్వరు నీవ ఱకుం గాన్పించ లేదు. ఉపన్యాసకున కేకారణముననో సాహిత్యరసపో షణుం డగురామరాజభూషణునికవితారసము వెగటై పోయినది. తా మె చ్చెడుసూరనకవి కన్ని విధముల నితఁ డధికుఁ డగుటకు నలిగినాఁడేమో! లేకున్న కారణాంతర మేమైన నున్నదో! వసుచరిత్రములో రాజరాజ భూషణుఁడు కురిపించినసాహిత్యరసవర్షము అతనికిఁ బూర్వమున నున్న కవులకు లభింపకపోవుట మంచిపని యాయె నని తదనంతరకవులు దాని నంతయుఁ దమకవితాసస్యములకే వినియోగింపఁ జేసికొని బలవంత ములై ఫలవంతము లగుకవితాసస్యగర్భు లగుచున్నారు. వసుచరిత్ర కవిం గూర్చి వ్రాయుచో నాగ్రంథవిశేషముల వక్కాణించెదను. ముం దుపన్యాసకాధిక్షేపణములకుఁ గొంచెము సమాధానము వ్రాసె దను. అందలి కథనెల్ల నొక్కవాక్యమునఁ బొందుపఱుపవచ్చు నను దానికి బుద్ధిమంతులైనవారు రామాయణకథనుగూడ నట్లే చేయవచ్చు ను. భారతకథ నట్లే చేయవచ్చును. సర్వకథల నట్లే చెప్పవచ్చును. ప్ర బంధములు కథాచమత్కారముల కొఱకుగా నేర్పడినవి కావు. ఇవి ప్రత్యేకము వర్ణనప్రజ్ఞను చూపుటకే యేర్పడినవి. రామభూషణుం డది వఱకు పెద్దన చెప్పినమనుచరిత్రములోని కథాచమత్కృతి తెలియని వాఁడై యీవసుచరిత్రము నారంభించి యుండఁడు. అందుఁ గథాప్ర యుక్తచమత్కృతియేగాని కవిత్వ రసప్రయుక్తచమత్కారము విశేష ముగ లేకుండుట నూహించి కథాచమత్కారము లేనిగాథనే యేర్చి కొని యుండును, అటులే కాకున్న చమత్కారకథలు తెల్పుగాథలు మ నపురాణములలో లేవా? అట్టివానిని రామరాజభూషణుఁడు చది వియుండకుండునా? కావున నిట్టియుద్యమము శ్లాఘాపాత్రమే. వర్ణ నలుమాత్ర మతిమాత్రములై యున్న నని దానికిఁ జెప్పవలసినమాట యొకటి యున్నది. కల్పన లత్యద్భుతము లనియో లేక అతివిస్తారము లనియో ఇందు కల్పన లత్యద్భుతము లగు ననుట ఆంధ్రసంస్కృత కవి

జనసామాన్యధర్మమేను. ఇఁక నతివిస్తారములన్నచో నది రామరాజభూషణ సాహిత్యబలమునే చూపును. సామాన్యముగ నొక్కొకవర్ణనకు రెండేసి మూఁడేసి పద్యములకంటె నధికముగా నితరకవులు చెప్పలేదు. పెద్దనకవిమాత్రము పదివఱకుం జెప్పె. ఆవిషయములో నాలోచింపఁగా రామరాజభూషణుఁడు ముప్పది పద్యములు నలుబది పద్యములు చెప్పుటచేఁ బెద్దనకంటెఁ గూడ నీతఁడు కల్పనాశక్తియందనేకమడుఁగు లాధిక్యత నందినవాఁడని చెప్పవలయును. ఈవర్ణనలనునవి ముప్పదిముప్పది విధములుగ నున్నవికాని యొకదానిం బోలినది యొకటికాదు. ఒకదానికంటె నొకదానియందు విశేషము లున్నవి. ఒకటిరెండుపద్యములం జూపెదను.

మ. హరిదంభోరుహలోచనల్ గగనరంగాభోగరంగత్తమో
భరనేపథ్యము నెయ్యనొయ్య సడలింపన్ రాత్రిశైలూషికన్
వరుసన్ మౌక్తికపట్టమున్ నిటలమున్ వక్త్రంబునుం దోఁచె నా
హరిణాంకాకృతి వొల్చె రేకయి సగంబై బింబమై తూర్పునన్.

శా. ఉదరోలూఖల మెక్కి నిక్కి సహజాంకోత్సేంద్రసంయుక్తుఁడై
చదలన్ బూదశశాంకసీరి కరవిస్తారంబులం బట్టి బి
ట్టెదుమన్ గాఁ జకోరగోపతతిపాలై చంద్రికాక్షీరముల్
పొదలెన్ ఘూర్ణితదుగ్ధధామనిబిడప్రోద్భూతసంరంభముల్.

ఇట్టివర్ణనలోఁగూడ నెక్కడనో పదియునైదుగాని తక్కిన చోటుల రెండుమూఁడు చెప్పి పైకిఁ బోవుచు వచ్చెను. చమత్కరించుటకవధియున్నంతవఱకుఁ జమత్కరించుటయే రామరాజభూషణుని కోర్కె గాని సంగ్రహించి చెప్పుట యాతనిమార్గము కాదు. నాయికానాయకుల విరహాదశావర్ణనమున రెండాశ్వాసములు వ్రాసి కాలము గడపినాఁడేకాని కథాంశముల వర్ణించి రసము పుట్టించినవాఁడు కాఁడనుదానికిఁ బైసమాధానమే చాలియుండును. ఇది కథాంశవర్ణనకై యేర్పడినకావ్యము కాదు. విరహాదశావర్ణన లెవ్వరెంతవఱకుఁ జేయఁగలరో అట్టిమనోదార్ఢ్యములు చూపుకొనుటకై రచియింపఁబడిన వర్ణనలై యున్నవి. ఆగ్రంథము చూడకుండ నిప్పటికాలములోఁ బండి

తులందఱుఁ గలసి యొకయంశముంగూర్చి రెండాశ్వాసములవర్ణనముం జేయ గమకింపుఁ డని ప్రార్థించెదను. వా రట్లుచేయఁజాలినప్పుడుగదా రామభూషణునికష్టము వృథ యై పోవును.

౯ ఉ. రసపుష్టి నొక్కశబ్దముచేతనే కలిగింపవచ్చును. దాని నమితముగా వర్ణించినచో నది విరస మై పోవును.

చా. అది నిజమే అయిన గొప్పశక్తియే ! రసపుష్టి యనునది యే రెండుమాటలు గలది. ఇఁక రసపుష్టి నొక్కమాటచేఁ గల్గించుట యెట్లో నాకు గోచరంబు కాకున్నది. కవిత్వవ్యవసాయము మాటలు చల్లిన ఫలియింపదు. దానికి కృషియును, నైసర్గికప్రతిభయు నుండవలయును. అవుడుగాని రసోదయము కాఁజాలదు. అట్టిరసాస్వాదనము ప్రారంభకులకు ముఖపిధానము చేయును. అవుడు విరసముగునేమో కాని అభ్యాసవంతులకు మధురరసాదులవలెఁ బ్రౌఢులకు కావ్యరసము కడుం గడుఁ బ్రీతి గావించు. అట్టివారిం దనియించువాఁ డందఱికంటెను రసలోలుఁడై యుండవలయును. కావుననే రామరాజభూషణునకు సాహిత్యరసపోషణుఁ డనుబిరుదు కల్గినది. రసము తెచ్చిన నతఁడే తేవలయునుగాని యిఁక నన్యులవశ మగునా ?

౧౦ ఉ. స్వాభావికము లగువర్ణనలు పెక్కు లుండిన మనోహరముగా నుండునుగాని మిథ్యావాదము లగుచు త్ప్రేక్షాతిశయోక్తులు మితి మీఱ వర్ణించినచో నది మనస్సున కానంద మీయకుంటయకాక వేసటఁ గల్గించుటకుఁగూడ మూలము లగును.

చా. ఇక్కడ స్వాభావికము లగువర్ణన లన నాకర్థము గోచరంబు కాలేదు “ శుష్కోవృక్షస్తిష్ఠత్యగ్రే ” అనునట్టివి స్వాభావికవర్ణనములు. ఇట్టివి ప్రబంధములలోఁ జేర్పఁబడక పోవుటకుఁ గారణ మేమైన నుండవచ్చును. కేవలము వర్ణనాంశములకే యిది యేర్పడినది. వలయునేని స్వాభావికవర్ణనలు పురాణాదికములలోఁ జూడఁదగును. ఉత్ప్రేక్షాతిశయోక్తులు మనస్సున కానంద మీయకుంటయే కాక వేసటఁ గూడ గల్గించు నన దీనికి వ్రాయవలసినసమాధానము లేదు. ఇది పండితానుభవవేద్యము.

౧౧ ఉ. చక్కనిజవరాలికి శరీరమం దంతట తొడవులు తొడిగినచో నెట్టులుండును. అట్లు గాక ప్రశస్తము లగురెండుమూఁడుతొడవు లాయాచోటులం గైచేసిన నెట్టు లుండును.

చా. ఈయుదాహరణము లోకానుభవముం బట్టి వ్రాయఁబడవలయును. శరీరమంతయు కనకాంగివిధముగ నగలుంచుట అసహజమే గద. ఇఁక నగ లెక్కువ తక్కువగా నుండినచోఁ గల్గుస్త్రీసౌందర్యాదికములు దేశానుసారములై యుండును. ఆంధ్రులు వివిధము లగునలంకారములచేతంగాని తనియరు. ద్రావిడదేశస్థులు దీనికి వ్యతిరేకాభిప్రాయులు. ఆంధ్రులలోఁ గొంచెమునగ లుంచికొనుట మంచిది యని యే స్త్రీయుచు బల్కఁ జూడము. ధనాధికారము లేక తొడవులు తొడిగింప నెట్లు సాధ్యము కాదో అటులనే అంధ్రులలో సాహితీరసపోషణాధికారము లేక కవితాయువతిని భూషణభూషితం జేసి సంతసింపం జేయరాదు. కావ్యాలంకారసంగ్రహములో

క. తను వగు శబ్దార్థంబులు, ధ్వని జీవ మలంక్రియావితానము సొమ్ముల్
తనరుగుణంబులు గుణములు, ఘనవృత్తులు వృత్తు. లార కావ్యందిరమున్.

అని యున్నది. కావున నాంధ్రసరస్వతి రెండుమూఁడు తొడవులతో సంతోషించునది కా దని నిష్కర్షించెదను.

కాలీనుల కవిత్వమున కున్నదశను సూరన వృద్ధి నొందించినవిధము.

౧ ఉ. ఈకవి తనకవితాకన్యకకుఁ దొడవులు తొడిగి మెఱయింపలేదు. ఆమె స్వభావసౌందర్యమునే వెల్లడిచేసినాఁడు.

చా. ఈయభిప్రాయ మేమియు సరియైనది కాదు. సూరనకవి కావ్యాలంకారములం గైకొనియుండ లేదనుమాట కాధారములు లేవు. ద్వ్యర్థికావ్య మగురాఘవపాండవీయములోఁ గూడ నీకావ్యాలంకారములు మెండుగ నున్నవి. ప్రభావతీప్రద్యుమ్నము కేవలము ప్రబంధమే. కళాపూర్ణోదయము కల్పనాకథ యైనను అందు ననేకాలంకారములుండినవి.

౨ ఉ. మాధ్యమికకవు లందఱిలోను సూరనతో సరి యగునంతటివాఁ డొక్కఁడైన లేఁడు. పెద్దనకూడ లోఁగువాఁడే అని నాతలంపు.

చా. దీనిం గారణములు చెప్పింనంగాని అంగీకరింప వీలుపడదు. సూరనయెడ నిబంధనకారుల కేమి యభిప్రాయము కలదో అది ప్రమాణముగాని ఆధునికులలో నొక రిద్దఱి యభిప్రాయము గణనీయము కానేరదు. పెద్దనకూడ సీసూరనకుం జాలువాఁడు గాఁ డనుట ఆయిద్దరికవితాతారతమ్యము తెలియంగక పొర్వుట యై యుండును.

3 ఉ. కాళిదాసుకవిత్వమం దపారగౌరవ ముంచియున్నాఁడు గనుక నే యితఁడు లాతికవులవలెఁగాక రసవంత మగుకావ్యరచనకు సమర్థుఁ డైనాఁడు.

చా. దీనికి సమాధాన మిదివఱకే చెప్పియున్నాఁడను. లాతికవుల కావ్యములు రసవంతములు కావనియు నితనికవన మొక్కటియే రసవంత మైన దని చెప్పుట కేవల మనృతమైనం గావలె లేకున్న పక్షపాతవృత్తి యైనం గావలెను.

౪ ఉ. ఇతఁడు నాటకాలంకార సాహిత్యము కలవాఁడు. ఇతఁడు సంస్కృతమున శాస్త్రాభ్యసనము చేసినట్లు కనుపించుచున్నది.

చా. ఇది సర్వప్రబంధకవిసామాన్యలక్షణమే కాని విశేషమైనది కాదు. సంస్కృతిశాస్త్రాభ్యసనము చేయని ప్రసిద్ధప్రబంధకవు లెవ్వరును లేరు,

౫ ఉ. రాఘవపాండవీయమునందు నయోధ్యాహస్తిపురములను వర్ణించినాఁడు. అంతటను కథాభాగములను వర్ణించినాఁడేకాని ఛాందసవృత్తిఁ గైకొని నిరుపయోగములగువర్ణనములను జేయఁడేవు.

సూరనకవి రెండుకథలను కల్పి గ్రంథముచేయు భారమునందు మునిఁగి యున్నాఁడు గావునను, అది ప్రథమప్రయత్నము కావునను దృష్టి, కథాసందర్భముఁ గూర్చుటయందే వినియోగించెఁ గావునను తక్కినవర్ణనలు సాధ్య మగునంతవఱకు తగ్గించి యుండును. కాని వర్ణనలయందలియనూయచేతఁగాని లేక యాధునికాభిప్రాయము దివ్యదృష్టిం జూచుటచేతగాని కాదు.

౬ ఉ. రామరాజభూషణకవి తనహరిశ్చంద్రనలోపాఖ్యానమునఁ బురవర్ణన చేసి దానికిం దోడుగ బెక్కువర్ణనల వర్ణించినాఁడు.

చా. దీనిచేతనే రామభూషణకవికంటె సూరన వర్ణనావిషయములోఁ గించిత్తు తగ్గినాఁడని చెప్పవలసియున్నది. రామభూషణునివలె వర్ణనలు సర్వతోముఖముగఁ జేయఁగలవా రాంధ్రకవులలో లేరు సరిగదా సంస్కృతములో లక్ష్మీసహస్రము రచియించినకవిగూడ నాతనిఁ బోలఁజాలఁడని చెప్పవలసియున్నది.

౨ ఊ. ఏహేతువుననో సూరన తనమూఁడవకావ్య మగుకళాపూర్ణోదయమున నీఛాందసవృత్తికి లోనైనాఁడు. తనకాలమందలి కవులయం దీవర్ణనలు చేయుట యాచారమై యుండుటంబట్టి తనకావ్యములం దేదేని యొక్కదానియందు వానిఁ జేర్చిన నెట్టు లుండునో చూత మనుతాత్పర్యమున వ్రాసినను వ్రాసియుండునుగాని యావర్ణనలందు సూరన కేమాత్రమును గౌరవము లేదు.

చా. సూరన వర్ణనావిషయ మగుఛాందసవృత్తి నవలంబించుటకుఁ గారణము విస్పష్టమే. తన ప్రథమకృతి పురాణ మవుటం జేసియుఁ రెండవకృతి ద్వ్యర్థికావ్య మగుటం జేసియుఁ దనవర్ణనాసామర్థ్యముఁ జూపుట కనువుపడలేదు. ప్రబంధకవిత్వమునకు వర్ణనాపాండిత్యమే ప్రధానము. అవి కల్గియుండనినాఁడు ఏకృతియుఁ బ్రబంధము కాదు. ఆకవి ప్రబంధకవి కాఁడు. ప్రబంధకవి యనిపించుకొనిన నాతనికాలములో గౌరవమున్నదిగాని పురాణముం దెనిఁగించినను, ద్వ్యర్థికావ్యము రచించినను గౌరవము లేదు. కావున సూరన కళాపూర్ణోదయము నందైనఁ దాను ప్రబంధకవి ననిపించుకొనవలయు నని యత్నించి ప్రబంధవర్ణనల నన్నిటిం జేసియున్నాఁడు. అది యిప్పటివారిసాహిత్యభేదముం బట్టి ఛాందసముగాఁ గానుపించినను సూరకవికాలమువారి కాప్రజ్ఞ విశేషముగా నుండెను. అట్టిగౌరవకార్యముగనుకనే దానిని మనఃపూర్వకముగ నారంభించెను.

౩ ఊ. ప్రభావతీప్రద్యుమ్నమునందుఁ బురవర్ణన మైనఁ జేయకమునుపే మొదటి పద్యమునందే కథాప్రారంభము చేసి భూమికి దిగివచ్చుచుండఁ గ్రిందఁ గనుపించుచున్న ద్వారకాపట్టణవైచిత్ర్యములను ఇంద్రమాతలులు చెప్పుకొనునట్లు వ్రాసినాఁడు.

చా. ప్రబంధములోఁ గొన్నివర్ణన లుండవలయు నని యున్నదిగాని అందు ప్రథమములో నీవర్ణన లుండవలె నని లేదు. ఆకారణము

న పురవర్ణనమునకు మొదలనే యక్కఱ కాదు. పురమును వర్ణించున పుడు క్రిందనుండి మీఁదికి వర్ణించువారు కొందఱును మీఁదినుండి క్రిందికి వర్ణించువారు మఱికొందఱు నైయున్నారు. ఆచేయుచున్న వర్ణనాంశములో నేదియైన క్రొత్తత్రోవ యలవడిన నంతఁ జేయువర్ణనము కొంచెమయిన గొప్పగా నుండును. క్రిందినుండి పైకి పురమును వర్ణించుమార్గదర్శి యగుటకు నాముక్తమాల్యదాకారుఁడు.

“ అడుగున నుండియుఁగ్ బడిలనై చెద లంటెడుకోట నొప్పుప్రోల్ ”

అని మొదలిడెను. సూరన పైనుండి పట్టణము చూచిన నెట్లుండునో దానిని నూహించి వర్ణించుట విశేషములోనిది కాదు కావున సూరనయు పురవర్ణనము చేసినవాఁడే.

౯ ఉ. ఇతఁడు కవితాప్రశంసలోఁ దనకావ్యములందుఁ గొన్ని లక్షణములు వ్రాసి యున్నాఁడు. ఇం దలంకారశాస్త్రజ్ఞానము వెల్లడిచేసినాఁడు

చా నూరనకవి యుదాహరించినపద్యము నిట వివరించి యనంతర మందలివిశేషములు పైయుపన్యాసకునియభిప్రాయములతో నెట్లు నరిపడియుండవో తెలియపఱిచెదను.

సీ. ప్రాసఁగ ముత్తెపుసరుల్ పోహళించినయట్లు, తమలోనఁ దొరయుశబ్దములఁ గూర్చి
యర్థంబు వాచ్య లక్ష్య వ్యంగ్యభేదంబు, లెఱిఁగి సర్వోపత సొసఁగఁ జేసి
రసభావములకు సర్వాంగ బగ వైదర్భి, మొదలైనరీతు లిమ్ముగ నమర్చి
రీతుల కుచితంబులై తనరారెడు, ప్రాణంబు లింపుగాఁ బాదుకొల్పి
గీ. యమర నుపమాదులును యమకాదులు నగు, నట్టియర్థశబ్దాలంక్రియలు ఘటించి
కవితఁ జెప్పంగ నేర్చునతఁడెక్కువరుసకు, నభిమతార్థంబు లొసఁగనివారు గలరె

అను సీపద్యములో నుడువఁబడిన వెవ్వి యన:—

౧. అర్థ మెఱుంగుట.
౨. లక్ష్య మెఱుంగుట.
3. వ్యంగ్య మెఱుంగుట.
౪. రస భావముల కర్హంబగు వైదర్భి మొదలగురీతులు చేర్చుట.
౫. రీతుల కుచిత మగుప్రాణంబు లుంచుట.
౬. ఉపమాదులఁ గూర్చుట (అర్థాలంకారములు)
౭. యమకాదులఁ జెప్పుట (శబ్దాలంకారములు)

ఈరీతిని కవిత్వముఁ జెప్పినచో రసికులు మనోరథముల నిచ్చెద రనియే. ఉపన్యాసకుఁడు పైనఁ జెప్పుచు వచ్చిన "ఈకవి తన కవితాకన్యకు తొడవులు తొడిగింపలే దనియు, ఇతఁడు అయోధ్యా హస్తిపురముల వర్ణించి అంతట కథాభాగములను వర్ణించినాఁడే కాని ఛాందసవృత్తిం గైకొని నిరుపయోగము లగువర్ణనలఁ జేయలేదనియు, కళాపూర్ణోదయములోఁ జేయంబడినతనఛాందసవర్ణనలయందు సూరన కెంతమాత్రము గౌరవము లే"దనునవి మొద లగువాక్యములు సూరకవి మత మెఱుఁగక పోవుటచేత వ్రాసియున్నాఁడుగాని మఱియొకటి కాదని స్పష్టపఱుచు. సూరనకవి తనమతమును తానే స్పష్టీకరించి చెప్పుచుండఁగా నది సూరనమతము కా దని యేరైన నొక్క వక్కాణించుటకు నధికార మే మున్నది. సూరకవి తనయభిప్రాయము నొక్కకళాపూర్ణోదయములోఁ జెప్పుటయే చాలు నని తలంచక తననాల్గవకృతియగుప్రభావతీప్రద్యుమ్నములోఁగూడ మఱికొన్నివిశేషములఁ జేర్చి చెప్పె. ఇది యాంధ్రకవిత్వాభ్యాసకులకు మిగుల నుపయోగకర మైనదియును కావ్యాలంకారములను సంగ్రహముగాఁ జెప్పునదియు నై యున్నది. దాని నిట వివరించెదను.

"సీ. శబ్దసంస్కార మెచ్చటను జాఱఁగనీక, పదమైత్త్రి యర్థసంపదలఁ బొదల
తల వెల్ల నక్లిష్టతను బ్రదీపితము గాఁ, బునరుక్తిదోషంబుపొంతఁ బోక
యాకాంక్షితన్యాప్తి యాచరించుచును శ, బ్దాచంక్రమక్రియఁ గడవఁజనక
ప్రకృతార్థభావంబు పాదుకో నడుపుచు, నుపపత్తి యెందు నత్యూర్జితముగ
గీ. సుకటఁ బూర్వోత్తరవిరోధ మొందవకుండఁ, దత్తదవయవవాక్య తాత్పర్యభేద
ములు మహాకావ్యతాత్పర్యమునకు నొనరఁ, బలుక నేర్చుట బహుతపఃఫలము గాదె.

కళాపూర్ణోదయమున సూరన కవితావిశేషముల నెన్నుచుఁ జెప్పినపద్యమును పైపద్యములతోటిపాటిదే. ఇవియున్నియుఁ గలిసియే సూరకవి కవితాశైలిం దేటపఱుచు. అట్టిపద్యము నీక్రింద నుదహరించిన సూరనకు కావ్యవర్ణనలయం దెంతమాత్రము గౌరవము లేదను మాట మొదటికి దుడిచికొనిపోవును. ఆపద్య మెట్లన్నను.

లయగ్రాహి.

"చలువ గల వెన్నెలల చెలువుఁ గను సౌరభము కలిగినను సౌరభముఁ జలువయును దలిర్పం బోలు వెసఁగుకప్పుపుఁ బలుకునకుఁ గోమలత వెలకొనిన సౌరభముఁ జలువపసయుం గోమలతయును గలిగి జగముల మిగులఁ బెంపెసఁగు మలయపవనంపుఁ గొదమలకు మధురత్వం బలవడిన నీదు మతి గల దనఁగ వచ్చుఁ గదు వెలయఁ గలనీసుకవిపలుకులకు వెంచక."

అని చెప్పెను.

౧౦ ఉ. ఈకవి కావ్యములందు నాటకశైలి కాన్పించుచున్నది. శ్రవ్యకావ్యములయం దున్నరమ్యత శ్రవ్యకావ్యములయం దున్నది. దృశ్యకావ్యములయం దున్నరమ్యత దృశ్యకావ్యములయం దున్నది. వీనిరెంటిని గలిపి వ్రాసినయెడల నెంతమనోహరముగాఁ గూడునో వేఱే చెప్ప నక్కఱ యుండదు.

చా. నాటకశైలియును దానికంటెఁ బ్రసంగశైలి యని చెప్పిన నది లెస్సయై యుండును. ప్రబంధాదులు కేవలము శ్రవ్యకావ్యములై నప్పటికి నిందు ప్రసంగశైలి యుంచుట ప్రౌఢకవులలోఁ గాన్పించు. తారాశశాంకవిజయాదిశృంగారరసప్రబంధకవులు గూడ నీశైలినే అవసరసమయములలో నవలంబించుచు వచ్చిరి. అంతమాత్రమున నాంధ్రములలో నీవఱకు లేని నాటకఫక్కిక నీసూరకవి కల్పించె నని చెప్ప నొప్పియుండదు.

౧౧ ఉ. అంశములన్నియు నాటకములవలె నెట్లు వర్ణింపఁబడినవి. సంధివచనములు లేనిచోఁ గావ్య మెల్ల రూపక మగు నని యెంచెదను. ఈవిషయముల నెల్లఁ జాగ్రత్తతోఁ బరీక్షించి చూచినపుడు సూరనకు నీతనిసమకాలికు లగునితరకవులకు నెట్టితారతమ్యము కలదో స్పష్ట మగును. ఇతరమాధ్యమికకవులందఱికంటె నీతఁడు వేయిమడుంగు లెక్కుడని యొప్పుకొనకతీఱదు.

చా. నాటకపద్ధతింగూర్చి యిదివఱకే వ్రాసియున్నాను. నాటకఫక్కి ఆంధ్రంబునకు లేదు. సంధివచనములే నాటకమునకు ప్రధానాంగములు కావు. నాటకమునకు ప్రస్తావనాద్యంగములు లుండును. అవి యుండనిచో దానికి నాటకనామము చెల్లదు. ప్రసంగశైలి విశేషముగా నున్నంత మాత్రమున నిది యొకవిశేషముగా నెన్నంబడదు. ఇతరమాధ్యమికకవు లందఱికంటె నీతఁ డెక్కుడువాఁ డని చెప్పుటయే సాహసకృత్యము. అట్టిచో వేయిమడుంగు లెక్కు డని చెప్పినమాట అర్థము లేనియత్యుక్తి యనక తప్పదు.

౧౨ ఉ. ఇతఁడు వచనములుగూడ మిగుల సులభముగా వ్రాయును. మనుచరిత్రవసుచరిత్రాదులందుఁ బద్యములకంటె వచనములు మిగులఁ గఠినశైలిని వ్రాయఁబడియున్నవి. అందులకర్తృకర్మక్రియలను గ్రహించి వాక్యాన్వయము చేసుకొను నప్పటికే దుర్లభము. ఈయలవాటు సూరన తనకళాపూర్ణోదయమునఁ బీఠికయందు నిల్పినాఁడు కాని తర్వాత వ్రాసినవచనములనెల్ల మిగుల సులభముగాను, సరసముగాను వ్రాసియున్నాఁడు. ఈతనివచనములు భారతము నందలివచనములతోడఁ బోల్పఁదగియున్నవి. పద్యములు కఠినశైలిని వ్రాయఁబడియుండినను, వచనములు నడుమ నుంచినఁ గ్రంథసందర్భము బాగుగాఁ దెలిసికొనవచ్చుననియు, గ్రంథ మంతయుఁ బద్యమయమై యుండక అక్కడక్కడ వచనములుకూడ నుండినచోఁ జదువరుల మనస్సునకు విశ్రాంతి నొసఁగు ననియు వచనములు పద్యకావ్యములయందుఁ జేర్పఁబడుచున్నవి. అది పోవం బోవ పద్యములకంటె వచనములు మిగులఁ గఠినశైలిని వ్రాయుటలోనికి దిగినది.

చా. ఉపన్యాసకుఁడు చెప్పినట్లు వచనములు సులభముగ వ్రాయుట యిప్పటికాలపుచదువరులలో శ్లాఘనీయకార్య మైన నగునుగాని సూరనకాలములో నది యట్లుకాదు. వర్ణనావిషయమై కలనిరంకుశప్రజ్ఞ జూపుటకుఁ గలకోర్కెను చందోబద్ధము లైన పద్యములలో జూపుటకు వలనుపడక ప్రబంధకవులు విశేషకథాసందర్భ మవసరము లేనిచోట నాశ్వాసమున కొక్కటియో రెండో వచనము లుంచుచుండు నాచార మేర్పర్చికొనిరి. కొందఱు కవులు వచనములు పెక్కులు చెప్పుట వివిధవృత్తములయెడ నాదరణము గలచదువరులకు నానందకారులు కాకపోవు నని యెంచి అనేకచరణయుక్తములుగాఁ జేయందగు రగడలు, దండకములు, మొదలగువానిని విశేషించి వ్రాసి వచనముల గొన్నిఁటిం దగ్గించిరి. కావున వచనములు మొదలగునవి పద్యములకంటె స్వభావముగఁ గఠినశైలిలో నుండుట కాన్పించు. సూరనకవియు నావఱకు తనచే విరచితము లైనప్రథమద్వితీయకావ్యములు ప్రబంధములు కాకుండుటంబట్టి అందు కొన్నిలోపము లున్నట్లు గ్రహించి తనమూఁడవగ్రంథమును ప్రబంధముగా రచియించి యందుఁ దనతొల్లింటిగ్రంథములలో నుండులోపములఁ బెక్కులు నివారించెను. ఇట్లు ప్రభావతీప్రద్యుమ్నములో నేల లేవనఁ గారణము చెప్పెదను. ప్రభావతీ

ప్రద్యుమ్నము సూరకవి తనముదుసలికాలములో రచియించినప్రబంధ మాటం జేసియుచు,తనతండ్రి పేరిటఁ గృతి యిచ్చి తాను తీర్థయాత్రాదికము తనతమ్మునివలెఁ జేయలేకపోయిన లోపముఁ దీర్చికొనుటకై యత్నించు టంజేసియుచు అందు గ్రంథపూర్తికొఱకే యత్నించియుండునుగాని కే వలము ప్రజ్ఞాప్రకటనకే యత్నించియుండఁడు. ఆకారణముచే నందు కఠినవచనములు గాని గొప్పవర్ణనలు గాని తఱచుగాఁ గానుపించవు, ఇట్టిగ్రంథమ్మును ఆధారము చేసుకొని ఉపన్యాసకుఁడు సూరన నప్పటి కాలమువారికంటె నధికుఁ డని ప్రస్తుతవచనకావ్యకర్తలలోఁ గొందఱి పక్ష నను సరించి చెప్పుట అసంగతము. ఎవ్వఁడును సమానులలో ను త్తముఁడు గాఁ బ్రయత్నించుంగాని తద్వ్యతిరిక్తము కాదు గావున సూరనయు న ట్లొనరించినవాఁ డనియే సిద్ధాంతీకరించెదము.

→ కళాపూర్ణోదయకల్పనావిషయము. ←

ఇదివఱకే సూరకవికృతము లగుగ్రంథములు కళాపూర్ణోదయ ము తరువాయిగ నన్నింటిం దెల్పినాఁడను. ఇఁక నీవిషయమునఁ గొంచె ముగా వ్రాసి సూరకవిచరిత్రము వ్రాయ విరమించెదను. పాఠకులు నావలన నింతవఱకు నీయఁబడిన విమర్శశ్రమకు సహించి కొంచె మ వకాశముతో నీగ్రంథవిషయమునఁగూడ నే నిచ్చుశ్రమకు మన్నిం చెదరుగాక,

ఈపైగ్రంథములోఁ గవిత్వశయ్యాదులయందుఁదప్ప కల్పనావిష యమై సూరకవిని నేను శ్లాఘించను. ఆ ౧౮౭౭ వ సంవత్సరము లోనో అనమీాపకాలములోనో యిది మొదట ముద్రిత మైనపుడు దీనిని మామిత్త్రులొకరు నామొద లగుస్నేహితులు కొందఱికి మాయ భిప్రాయప్రకటనకుఁగా నిచ్చియుండిరి. అపు డట్టిమాయభిప్రాయ మిచ్చుట కును గథాసందర్భము బోధపఱుచుకొనుటకును దీనికి సంగ్రహము వచనముతో నావలన వ్రాయంబడినది. దాని నిందుఁ బ్రకటింప గ్రంథ విస్తరభయంబున మానుచున్నాఁడను. అయ్యాది ప్రత్యేకవచనకావ్య

మాయెఁ గావున వేఱుగఁ బ్రకటించెదను. అపు డందులకథాసందర్భములోని పూర్వపక్షముల విస్తరించి చూపెదను. ఇపు డిందు నేనందులఁ గనిపట్టిన లోకములలోఁ గొన్నిటినిమాత్రము వివరించెదను, దానికి ముందుగ కవిత్వశయ్యాదులలో నీకవిచమత్కృతిం జూపు నొకటిరెండు పద్యములం జూపెదను ఒక ముదుసలి స్త్రీని వర్ణించిన పద్యము.

సీ. పసిమి పోనెండినకసవుబట్టయుఁబోలె, నెఱవెండ్రుకలఁ బర్వుశిరమువలన
నులిగొన్న చెలఁదిపుర్వులనూలివళ్లునా, నమరెడుముడుతకన్బొమలవలనఁ
గడుఁ జిట్లినట్టిబంగరుపోఁతపాకిక్రాళ్ల,వడువుఁ జూపెడుమేనివళులవలనఁ
దునిసి వ్రేలెడుస్రాఁతతునుకల వలపించు, బాహువల్లీజలంబనమువలనఁ
తే. ఘూకరవములచాడ్పున ఘోరవృత్తిఁ, దనరుఘనకాసశుహిశుహిధ్వనులవలన
భావజాఁడు వెళ్లిపోయినపాడుమేడ, పగిదిఁ గాన్పించు ముసలిపడఁతియొకతె.

కళాపూర్ణో. ఆశ్వా 3 ప ౨౮.

ఈముదుసలినే తిరుగ నింకొకపరి శాపవిమోచనానంతరము యౌవనప్రాదుర్భావము నందిన స్త్రీనిగాని వర్ణించె.

సీ. నిండుచందురు నవ్వు నెమ్మోముసిరితోడ, నిరులు గ్రమ్మెడువేణిభరముతోడ
నాకర్ణలోలంబు లగునేత్రములతోడఁ, దళుకొత్తు చెక్కుటద్దములతోడ
మిగుల మిటారించుబిగిచనుంగవతోడ, లలితంపుబాహువల్లరులతోడ
నతికృశత్వమున జవ్వాడుమధ్యముతోడ, నభినవం బైననూఁగారుతోడఁ
తే. వలుదమీఁదికిఁ దొలఁకు సువర్ణపులిన, గురునితంబప్రభాపరంపరలతోడ
మసి తనర్వాఁగలావణ్యమహిమతోడ,నమృతప్రాయంపురూపుచిత్రముగఁదాల్చె.

కళా. ఆశ్వా, 3 ప ౧౨౨.

ఈసందర్భములోఁ బైముదుసలియువతియొక్క వర్ణనము మిక్కిలి కఠినమైనపని. సాధారణముగ శృంగారవర్ణనమే అందఱు చేయుదురు గాని తద్వ్యతిరేకముగా వర్ణించుటకుఁ గవులు యత్నింపరు. సూరకవి అట్టివర్ణనమును స్వభావోక్తితోఁ జేయుటయే కాక తిరుగ నాస్త్రీనే రూపాంత మందఁగా వర్ణించుటయు నందు రసము స్వాభావికమైనది తెచ్చుటయు వర్ణనీయము. ఇటులనే సూరకవి తనకుఁ గలవర్ణనావిశేషము లోని ప్రజ్ఞ నగపఱచిన పద్యముల నేకము లీగ్రంథములోఁ జూపెను.

అట్టివానికి నెంతయు నలరియుఁ గథాకల్పనలోఁ జేసియున్న కొన్ని సందర్భములకుఁ గాఁ గల్గియున్న శంకల నిట వివరింపకున్న యెడల విమర్శనకు లోప మని యట్టివానిలోనిలోపము లఁ గొన్నిటి నిట వివరించెదను. అయితే యీగ్రంథమందు విశేషాభిమానము గలవార లట్టిశంకలయెడల నాదర ముంచి యథార్థ మరయఁ గోరెదను.

నారదమునికిని తుంబురునకును సంగీతవిద్యలో వివాదము కల్గెననియు, నపుడు నారదుండు తుంబురుని జయించుటకుఁగాను గానవిద్యావిశేషంబులు నేర్చుకొనుటకై ద్వారకాపట్టణంబునకుఁ బోవ శ్రీకృష్ణుండాతనిఁ దోడ్కొని తనభార్యలలో నొక్కతె యగుజాంబవతి కొప్పింప నామెకడ నారదుం డొకవత్సరంబు గానంబె నేర్చుకొనె ననియును; పిమ్మట నారదుండు శ్రీకృష్ణునియుక్తుం డై సత్యారుక్మిణులకడ నొక్కొక్కవత్సరంబు గానవిద్య నభ్యసించె ననియును మణిమందరుండును, కలభాషిణి నారదునివలె నంతఃపురకాంతలవలన సంగీతశిక్ష లేకయుండియు శ్రీకృష్ణుని యనుగ్రహంబున సకలసంగీతకళారహస్యంబులం గ్రహించి రని చెప్పఁబడినది. లోకములో సంగీతవర్ణనముఁ జేయుచో నందు నారదునియట్టి ప్రజ్ఞగలవా రని చెప్పుటయే అత్యుక్తి. నారదుఁడును నేర్చుకోఁ దగినసంగీత మని చెప్పుట అత్యుక్తికి పైది. అదియునుగాక నారదుఁడు వచ్చి శ్రీకృష్ణునిభార్యలకడ మూఁడుసంవత్సరములు విద్య నేర్చుకొనియె నని చెప్పుటయు నంతదనుక అతని శిష్యుం డగుమణికంధరుండు రాణివాసంబు ద్వారంబుననే నిల్చియుండె ననియు నిట్లున్న మణికంధరుఁడు శ్రీకృష్ణునియనుగ్రహంబున నొక్కపెట్టున సకలసంగీతరహస్యంబులు నేర్చుకొని నారదునితో సమానుఁ డయ్యె నని చేసినకల్పన యత్యుక్తికింగూడ మించినదై భక్తాగ్రగణ్యుఁ డైననారదుండు సంపాదింపలేని శ్రీకృష్ణసంబంధ మగుసంగీతవిద్యను నారదశిష్యుఁడుగాఁగల్పింపఁబడినమణికంధరుఁడు శ్రీకృష్ణుని నిర్హేతుకజాయమానకటాక్షమునకు పాత్రుఁడై యొక్కమాఱుగ గ్రహించె

నని చెప్పినకల్పన యుక్తియుక్తమై యున్నట్లు కానరాదు. ఇంతియ కాక ఆసందర్భములోనే నారదుఁడు తనసంగీతంబును కృష్ణమహిషులు వర్ణించుట వినియు నది ముఖప్రీతి కానోపు నని యూహించి దాని నరయుటకై కలభాషిణిం గోరఁగా నాపె కామరూపంబు వేఁడి దానిఁ గైకొని కృష్ణమహిషుల సఖీరూపంబు దాల్చి పోయి నారద సంగీతవిశేషంబులం గూర్చి ప్రశంసించి వారు దాని నిజముగ స్తోత్రముచేయుటయే యని మరలి వచ్చి నారదునకుఁ దెల్పె నని తెల్పినకథ కలభాషిణికి నారదుఁడు కామరూపశక్తి యిచ్చుటకుఁ గారణరూపముగాఁ జెప్పఁబడినను తా నెవ్వరికడ మూఁడుసంవత్సరములు విద్యాభ్యాసము చేసెనో వారు తనసంగీతమును స్తోత్రముచేయుదు రని చేసినకల్పితయుక్తికిని శాస్త్రమునకుంగూడ సరిపడనిది యై యున్నది.

ఇటులనే తుంబురుని జయించుటకుఁగాను నారదుఁడు యత్నించి తపంబు చేసి విష్ణునివలన వరంబు గొనినకథయును గానుపించును. అటుపిమ్మట మణికంధరుతపఃప్రభావంబును సిద్ధునిసమావేశంబును చిలుక కథయును, సందర్భశుద్ధములుగాఁ గానుపింపకుండుటయే కాక లోకసామాన్యములుగాఁగూడ కాన్పింపవు. ఇటులనే వ్రాయఁదొడంగిన గ్రంథంబులోనిగాథ లన్నియు పరస్పరసందర్భము లేకయు, నమ్మ నర్హములు కాకయు పరిశీలనము చేయం జేయ నసాధ్యంబు లౌను. కాని మనుచరిత్రాదికములోఁ గల్పింపఁబడినకల్పనలవిధంబున యుక్తిసహంబు లై యుండవు. కావున నీక నింతటితో నీకథాసందర్భములంగూర్చి వ్రాయ విరమించెదను.

శ్రీరస్తు.

# కవిజీవితములు.

## ఆంధ్రద్వ్యర్థికావ్యకవులచరిత్రము.

## 15.

## రామరాజభూషణకవి.

ప్రబంధాంకము రామరాజభూషణుఁడు హరిశ్చంద్రనలోపాఖ్యాన గ్రంథకర్త. ఆంధ్రములో రాఘవపాండవీయముతో సమానమై అంతకంటెను గవిత్వశయ్యాదులలో గౌరవాధిక్యము నందినకావ్యమీహరిశ్చంద్రనలోపాఖ్యాన ద్వ్యర్థికావ్యమైయున్నది. అట్టికావ్యములోని విశేషముల నుడువుటకుఁ బూర్వ మాకావ్యమును రచించినకవి యెవరు అనుసంప్రశ్నముంగూర్చి వ్రాయవలసియున్నది.

నరసభూపాలీయకర్త యగుభట్టుమూర్తియే దీనినిఁగూడ రచియించినట్లు వాడుక గలదు. అట్లు కాదనియు నీయిర్వురు వేఱనియు సంగ్రహముగాఁ గొన్నిమాటలు పూర్వము నాచే రచియించఁబడిన కవిజీవితపు మొదటికూర్పులో వ్రాయంబడినవి. అట్టివానినిఁ దిరస్కరించి కొందఱును బలపఱ్చి కొందఱును వాదింప నారంభించిరి. పిమ్మట నందులో నిర్వురు పండితు లీవిషయమై విస్తారము సంవాదము చేసి వారియభిప్రాయముల వ్యక్తీకరించుచుఁ గొన్ని గ్రంథములు వ్రాసి ప్రకటించిరి. అట్టిగ్రంథములు రెండును నాకడకు వచ్చి యుండుటం జేసియు నేను తిరుగ నాకవిజీవితములను రెండవకూర్పునఁ బ్రకటించుచుండుటం జేసియుఁ బైపండితులగ్రంథంబులపై నావలన నీవఱలో నీయంబడియున్నయభిప్రాయము గలయొకసిద్ధాంతోపన్యాసము నిందులో ముందు ప్రకటించుట మంచి దని యెంచి

యట్లు చేయుచున్నాను. అది కొంచెము గ్రంథవిస్తరము గలదిగా నున్నను ఇప్పుడు మనము చరిత్ర వ్రాయుచున్న రామరాజభూషణుఁడు నరసభూపాలీయకృతిపతి యగుభట్టుమూర్తి స్పష్టముగా గాఁడని నిశ్చయించి చెప్పుటకు చాలియుండుఁగా, అట్టిసిద్ధాంతము ప్రత్యేక మాయిర్వ్యారివలనను జేయంబడిన వసుచరిత్ర హరిశ్చంద్రనలోపాఖ్యాన నరసభూపాలీయములనుండియే చూపింపఁబడినది గావున నది సర్వజనాదరణీయము కాకపోదు కావున నాయుపన్యాససంగ్రహము నిట వివరించెదను.

## భట్టుమూర్తి రామరాజభూషణుఁడా ?

ఆ ౧౮౯౬ సంవత్సరములోని పట్టపరీక్ష (B. A. Degree Examination) కుఁ బఠనీయాంధ్రగ్రంథములలో నొక్కటి యగు హరిశ్చంద్రనలోపాఖ్యానగ్రంథమును ముద్రించి ప్రకటించుచున్న బ్ర. మ. పూండ్ల రామకృష్ణయ్యపంతులవారివలన నెల్లూరినుండి పంపఁబడిన(౬౮) పుటలగ్రంథసంచిక యొకటి యీనడుమ మాకార్యస్థానముం జేరినది ఆగ్రంథములోనివిశేషముల నారయుటకై కోరి మొదటిపుట తిరుగ వేసి చూచినతోడనే యముద్రితగ్రంథచింతామణిపత్రికాధిపతి యగు పైరామకృష్ణయ్యపంతులవారిచే రచియింపఁబడినపీఠిక యనుశీర్షిక యొకటి కానవచ్చెను. అందలియంశములు చూడఁజూడ ప్రథమమున దాని పైని మాయభిప్రాయ మీయనిదే గ్రంథవిషయ మైనయభిప్రాయ మీయ వీలు లేనందున నిపు డాపీఠికపై యభిప్రాయమునే వ్రాయుదము.

ఆపీఠికలో ౭ పేరాలవఱకును కవి యగురామరాజభూషణుని చారిత్రవిషయమై బ్ర. కందుకూరివీరేశలింగము పంతులవారికిని రామకృష్ణయ్య పంతులవారికిని నడచిన సంవాద మై యున్నది. అట్టియుభయులసంవాదమును ప్రస్తుతము మేము విమర్శన చేసి మాఅభిప్రాయముతోఁ బ్రకటించెదము.

రా. కృ. పీఠికలో హరిశ్చంద్రనలోపాఖ్యానమును వసుచరిత్రాది కావ్యములను రచియించినసూరపాత్మజుఁ డగుప్రబంధాంకము రామరాజభూషణకవి విరచించెను, ఇక్కవి నిజమైననామముబట్టి మూర్తి యనియును, రామరాజభూషణుఁ డనునది రామరాజుయొక్క యాస్థానమం దుండుటచేత వచ్చినబిరుదునామముగాఁ గొందఱనుచున్నారని క. పీ. ఆంధ్రకవులచరిత్రమునఁ బ్రకటించి తా మట్టివారి యభిప్రాయములను ఖండించి వ్రాయునంమున నందుల కొప్పుకొనినవారుగఁ గనుపించుచున్నా రని వ్రాసియుండిరి. అయితే ఇట్టిచోటుల ఆంధ్రకవుల చరిత్రములో నెట్లు వ్రాయఁబడినదో దాని నుదాహరింపనిదే మాయభిప్రాయ మీయ వలనుపడదు. గావున దాని నీక్రింద వివరించెదము.

ఆంధ్రకవులచరిత్రము ౩౩౭ పుటలో

"మూర్తి యనియు రామరాజభూషణుఁ డనియును ఇద్దఱు వేఱువేఱుకవు లనియును, అందు మూర్తికవి నరసభూపాలీయమును, రామరాజభూషణకవి వసుచరిత్ర హరిశ్చంద్రనలోపాఖ్యానములను రచియించి రని కొందఱును, ఇద్దఱు నొక్కరే యనియును, మూర్తి యనునది నిజమైనపేరు అనియు రామరాజభూషణుఁ డన్నది రామరాజుయొక్కసభ కలంకారముగా నుండుటచేత వచ్చినబిరుదుపే రనియును నతఁడు సూరపరాజున కౌరసపుత్త్రుఁడై తదగ్రజుఁడైనవేంకటరాయభూషణునకు స్వీకృతపుత్త్రుఁ డని మఱికొందఱును చెప్పుచున్నా రనియును, వసుచరిత్రములోనిగద్య యొకవిధముగాను నరసభూపాలీయములోని గద్య మింకొకవిధముగా నుండుటంబట్టియు, హరిశ్చంద్రనలోపాఖ్యానములో సూరపాత్మజుఁడు రామభూషణుఁడనియు, నరసభూపాలీయములో వేంకటరామభూషణ సుపుత్త్రుఁ డగుమూర్తియనియు తండ్రులను వేఱువేఱుగాఁ జెప్పుటనుబట్టియు వారు వేఱుకవు లైనట్లు పైకి కానవచ్చుచున్నను కొన్ని హేతువులం బట్టి రెండవపక్షమువారు చెప్పెడియంశములు కూడ సావధానముగా విచారించ వలసినవి గానున్నవి"

ఇట్లు వ్రాయఁబడి ఆంధ్రకవులచరిత్రములోఁ బైయుభయపక్షములవారును జెప్పెడుయుక్తులను చక్కఁగా గ్రహింపఁగలుగుటకై వంశక్రమమును తెల్పెడురెండుపద్యము లుదాహరింపఁబడినవి. అయితే క. వీ. గారి కావలెను పైకవు లిద్దరు వేఱువేఱని కల్గినయభిప్రాయము రెండవ వృత్తాంతము వినినతోడనే మాఱినట్లును దాని నేకసిద్ధాంతము చేయుటకు శోధకచదువరు లట్టిసిద్ధాంతము చేసికొనుటకు పైకవు లిద్దరు నొక్కఁడిగానే భావించి ఆపక్షములో నితరులు చెప్పుయుక్తులు తామే చెప్పి వారిపక్షమును తామే అవలంబించి వ్రాసిన ట్లున్నది. రెండుపక్షములును వినినచదువరులు సిద్ధాంతముఁ జెప్పవలసినవారు కావున నే నిపుడట్టి సిద్ధాంతమును స్పష్టీకరించెదను. వారిసిద్ధాంతమునకు ప్రధానమైనయొకవిశేషముగూడ వివరింపఁబడినది. అది యెద్దియనఁగా, ఇరువురును భిన్ను లైనను కాకపోయినను చరిత్రభాగమునందు వేఱు వేఱుగ వ్రాయవలసినయంశము లేవియుఁ గానఁబడవు అను దీనితో నే నేకీభవింపను. ఇరువురు భిన్ను లైనపుడు వ్రాయవలసిన చరిత్రభాగ మున్నదనియే నాయభిప్రాయము. కావున నీ సంప్రశ్నము సంపూర్ణముగా విచారించవలసిన దని చెప్పెదను. దానికిగా నుదాహరింపఁబడిన పద్యము లెవ్వి యనగా :—

నరసభూపాలీయము.

సీ. శతలేఖినీపద్యసంధానధౌరేయుఁ, ఘటికాశతగ్రంథకరణధుర్యు
నాశుప్రబంధబంధాభిజ్ఞుఁ డోష్ఠ్య నిరోష్ఠ్యజ్ఞుఁ డచలజిహ్వోక్తినిపుణుఁ
దత్సమభాషావితానజ్ఞుఁ బహుపద్య, సాధితకవ్యస్త్రాక్షరీఘటికీను
నేకసంధోచితశ్లోకభాషాకృత్య, చతుర నోష్ఠ్యనిరోష్ఠ్యసంకరజ్ఞుఁ
నచలయమకాశుధీప్రబంధాంక సింగ, రాజసుతతిమ్మరాజపుత్త్రప్రసిద్ధ
సరసవేంకటరాయభూషణసుపుత్త్రి,నను బుధవిధేయుఁ శుభమూర్తి నామధేయుఁ.

హరిశ్చంద్రనలోపాఖ్యానము.

సీ. వనధిలంఘనకృపావార్ధితో భయకవి, తాశశారత్నరత్నాకరుండ
సకలకర్ణాటరక్షాధురంధరరామ, విభుదత్తశుభచిహ్నవిభవయుతుఁడ
వసుచరిత్రాదికావ్యశ్రీతబహునృప, ప్రాపితానేకరత్నప్లవుండ
శాశ్వతశ్రీవేంకటేశ్వరానుగ్రహ, నిరుపాధికైశ్వర్యనిత్యయుతుఁడ

శ్రీకరమహాప్రబంధాంక సింగరాజ,తిమ్మరాజప్రపౌత్రతనూజధీరనూర
పాత్మజుఁడ రామభూపాఖ్యుఁ బరగుసుకవి,నంకితము సేసె నీకావ్య మనఘభక్తి.

## వసుచరిత్రము.

మ. వసు శ్రీరామపదారవిందభజనానందుక్ జగత్ప్రాణనం
దనకారుణ్యకటాక్షలబ్ధకవితాధారాసుధారాశిసం
జనితైకైకదినప్రబంధఘుటికాసద్యశ్శతగ్రంథక
ల్పను సంగీతకళారహస్యనిధిఁ బిల్వం బంచి పల్కెం గృపన్.

మూఁడుపద్యము లుదాహరింపఁబడినవి. కాని యీమూఁటికి స హచరములుగా నున్నయాశ్వాసాంతగద్యములలో నున్నవిశేషము లీస్థలములో నుదాహరింపఁబడనందున వానింగూడ నిటఁ జేర్చి యనంతర మందులోనిభేదాభేదగుణంబులం జూపెదను.

## నరసభూపాలీయము.

౪. "ఇది శ్రీహనుమత్ప్రసాదలబ్ధకవితాసార, సారస్వతాలంకార, నిరంకుశ ప్రతిభాబంధురప్రబంధరచనపతనధురంధర, ప్రబంధాంక వేంకటరాయభూషణ సుపుత్త్ర, తిమ్మరాజపౌత్త్ర, సకలభాషావిశేషనిరుపమావధాన శారదామూర్తి మూర్తి ప్రణీతము"

## వసుచరిత్రము.

౫. "ఇది శ్రీరామచంద్రచరణారవిందవందన, పవననందనప్రసాదసమాసాదిత సంస్కృతాంధ్ర భాషాసామ్రాజ్య సర్వంకష చతుర్విధకవితానిర్వాహక, సాహిత్యరస పోషణ రామరాజభూషణ ప్రణీతము"

ఇట్లు పైగ్రంథములలోఁ జెప్పంబడినకవిత్వవిశేషములఁ బర్యాలోచించుట కొఱకుఁ గదానినే పరిశీలించి చూచెదము.

## అందులో నరసభూపాలీయ సంబంధులు.

౧. శతలేఖినీపద్యసంధాన ధారేయత=అనఁగా శతఘంటకవిత్వము చెప్పెడు నేర్పు.

౨. ఘటికాశతగ్రంథకరణశక్తి=అనఁగా గడియకు నూఱనుష్టుప్పు (శ్లోకము)లు రచియించుప్రజ్ఞ.

3. ఆశుప్రబంధ, బంధాభిజ్ఞత=ఆశుధారగా (Extempore.) ప్రబంధములు చెప్పుట, అటులనే బంధకవిత్వము నుడువుట.

౪. ఓష్ఠ్య, నిరోష్ఠ్యాభిజ్ఞత=పెదవులు తగులునటులను అవి తగులనటులను కవిత్వము చెప్పుట.

౫. అచలజిహ్వోక్తిసై పుణ్యము=నాలుక కదల్పక కవనము చెప్పుట.

౬. తత్సమభాషావితానజ్ఞత=తత్సమ, తద్భవ, దేశ్యాదిభాగములు గలయాంధ్ర భాషలోఁ గేవలము తత్సమభాషనే కవిత్వము చెప్ప నేర్చుట.

౭. బహుపద్యసాధితవ్యస్తాక్షరీధురీణత=వ్యస్తాక్షరి చేయు నేర్పు పండిత సాధారణప్రజ్ఞ; అందులో ననేక పద్యములలో నొక్కసారి వ్యస్తాక్షరిం జేయుట యసాధారణప్రజ్ఞ, ఇట్టిపనిం జేయుట.

౮. ఏకసంధోచితశ్లోకభాషాకృత్యచతురత=ఒక్కసంద కల్గునట్లుగా శ్లోకమంతయుం జెప్పుట.

౯. ఓష్ఠ్యనిరోష్ఠ్య సంకరజ్ఞత=ఓష్ఠ్యములు తగులునటులను, తగులనటులను కలిపి కవిత్వము చెప్ప నేర్పు.

౧౦. అచలయమకాశుధీ=చలించినట్టియు, యమకయుక్తమగునట్టి ఆశుధారాకవిత్వము చెప్పెడుబుద్ధి

గద్యము.

౧. హనుమత్ప్రసాదలబ్ధకవితాసారుఁడ నని.

౨. సారస్వతాలంకారుఁ డనని.

3. నిరంకుశప్రతిభాబంధురుఁడ నని.

౪. ప్రబంధపఠనరచనాధురంధరు డ నని.

౫. సకలభాషావిశేషనిరుపమావధానశారదామూర్తి నని.

ఇట్లుండు వానికిఁ గారణము లూహించవలసియుండును. అందు (౧) మొదటివిశేషణముం బట్టి యితఁ డాంజనేయోపాసకుఁ డనియు తనయుపాసనాదేవుని కటాక్షముచేత సంప్రాప్తమైనకవిత్వశక్తి కలదనియుఁ దెలియుచున్నది.

(౨) రెండవవిశేషణములోఁ దాను సారస్వతాలంకారుఁ డని చెప్పుటచే విద్యాలంకారము గలవాఁ డని తేలినది.

(3) మూఁడవవిశేషణములో నిరంకుశప్రతిభాబంధురుఁడ ననుటంజేసి కవిత్వమునకుఁ బ్రధానసాధన మగునట్టిప్రతిభ కలవాఁడనియు, నదియు నిరంకుశమైన దనియుం దేలినది.

(౪) నాల్గవవిశేషణములో "ప్రబంధపఠనరచనా ధురంధరుఁ డనుటంజేసి" తనకు ప్రబంధపఠనమందును, ప్రబంధరచనయందుంగూడ

సమర్థత కలదని వక్కాణించును. తానావఱకొకప్రబంధమును రచియిం పకున్నను, ప్రస్తుతములో నైన నట్టిరచనకు ననుకూలసమయము తటస్థించక పోవుటయును లోనూహించి అది దేశములో ప్రబంధరచనాకాల మవుటంజేసి అట్టిప్రజ్ఞ తనయొద్ద నున్నట్లగుపఱుచుకొనుట ప్రబంధకర్తల కవసర ముండదు. అది లేనినాఁడే దాని నేర్పైన విశదీకరించుట కవసరము కలుగును. వసుచరిత్ర నరసభూపాలీయకవులు వేఱుగ నుండవచ్చు నని సూచించు కారణములలో నిది యొకటి.

(౫) ఇఁక నైదవబిరుదములోఁ దాను సకలభాషలలో నిరుపమాన మగు నవధానతంత్రము చేయఁగలవాఁడ నని సూచించె. ఇది యొక గొప్ప ప్రజ్ఞ. కవిత్వప్రజ్ఞ గలయందఱికిని అష్టావధానతంత్రప్రజ్ఞ యుండదు. అష్టావధానికిమాత్రము కవిత్వప్రజ్ఞ యుండక తీఱదు. అది లేనిచో నవధానప్రజ్ఞ నిరుపయోగ మగును. నరసభూపాలీయకవి కారెండుప్రజ్ఞలు కలవు.

రామభూషణునియొక్క పద్యములలోను గద్యములో నుండునవియే రామభూషణకవి కవితావిశేషము లని చెప్పవలసియున్నది. కావున వానిని వేఱ్వేరుగ నీక్రిందఁ బరిశీలింతము.

౧. ఏకైక దినప్రబంధఘటన=ఒక్కొక్కదినమున నొక్కప్రబంధము సంఘటింపఁ జేయుశక్తి.

౨. సద్యఃకృతగ్రంథకల్పన=అప్పటి కప్పుడు నూఱనుష్టుప్పులు చెప్పునట్టిశక్తి.

3. సంగీతకళారహస్యవేదిత్వము=సంగీతశాస్త్రరహస్యములు తెలియు నని గాని సంగీతశాస్త్ర, చతుష్షష్టి కళాశాస్త్ర రహస్యములు దెలియునని గాని చెప్పవచ్చును.

ఇట్లు కానుపించు పై కవిత్వప్రజ్ఞలు నిష్పక్షపాతబుద్ధితోఁ బరిశీలించినచో నాప్రజ్ఞలు గలవా రొకరైనదియు నిర్వురైనదియు స్పష్టము కాక మానదు.

వసుచరిత్ర, హరిశ్చంద్ర నలోపాఖ్యానములు రచియించినకవికిఁ గలప్రజ్ఞలును, ఉపాసనావిశేషంబు లెట్లు చెప్పంబడినవో చూతము.

అందు

౧. మొదటిది శ్రీరామచంద్రచరణారవింద వందనము, ఇది కొందఱివలన కవియొక్క విశేషణముగా నూహింపఁబడక ఆవాక్యము వెంబడినే వచ్చు "పవననందన" శబ్దముతో నన్వయింపఁబడుచున్నది. అట్లు సరి కాదని చెప్పుటకనేకనిదర్శనము లున్నవి. వాని నీగద్యలోని విశేషములు చెప్పినతోడనే వివరింపఁదలంచి ప్రస్తుతము గద్యములోని విశేషముల నుడివెదము. అంతవఱకును ఆరెండువిశేషణములు వేఱుగాఁ గ్రహింప వేడుచున్నాము. అట్టిచో మొదటివిశేషణాభిప్రాయముంబట్టి పైరెండుగ్రంథముల రచియించినకవిమాత్రము పరమార్థవిషయమై కానోపు రామోపాసనము విశేషించి చేసె నని తేలుచున్నది.

౨. రెండవ విశేషణమువలనఁ బవననందనప్రసాద సమాసాదిత సంస్కృతాంధ్రభాషాసామ్రాజ్యకవి యని తేటపడు. ఉపాసకులలోఁ గొందఱు ఆముష్మికమున కొకదేవతోపాసనయును, ఐహికమున కొకదేవతోపాసనయుఁ జేయుట కలదు. అటులనే వసుచరిత్రకవి ఆముష్మికమునకు రామోపాసనయు, నైహికమున కాంజనేయోపాసనయుం జేసినట్లును స్పష్ట మగుచున్నది. ఇట్టి యైహికఫలముకొఱకుఁగాఁ జేసిన యుపాసనవలనఁ దనకు సంస్కృతాంధ్రభాషలలో గొప్పకవిత్వ ప్రజ్ఞ కల్గెనని చెప్పెను.

3. చతుర్విధ కవితా నిర్వాహక అను విశేషణము మూఁడవది చతుర్విధకవిత్వ మనఁగా గద్యకవిత్వము, పద్యకవిత్వము, పదకవిత్వము, బంధకవిత్వము అనునవి. అట్టిచతుర్విధకవిత్వప్రజ్ఞ కలవాఁడు.

౪. "సాహిత్యరసపోషణుఁడు" అను బిరుదు వసుచరిత్రకవి కొక్కనికే ఆంధ్రభాషలోనికవులందఱిలో మిక్కిలి తగియుండు నని చెప్పవలసియున్నది. ఇది సరసభూపాలీయకవి కున్న ట్లాగ్రంథ మొక సంస్కృతగ్రంథమున కాంధ్రీకరణ మగుటం జేసియు దానిం దెల్పు మఱియొకగ్రంథ మతనిపేరిట లేకుండుటం జేసియు, నతనిగద్యములోఁగాని

కవిత్వవిశేషములం జెప్పినపద్యములోఁ గాని యీవిశేషణము చెప్పం బడకుండుటం జేసియు, నిష్పక్షపాతబుద్ధితో నెవ్వరును జెప్పఁజాలరు.

ఇట్లు వసుచరిత్రము, నరసభూపాలీయము ఈకృతియుగంబులోఁ గాన్పించినగ్రంథకర్తల కవితావిశేషంబులం జూపియున్నను రామోపాసనావిషయమై చెప్పవలసినవిశేషములు చెప్పకయే యితరాంశముల వ్రాయ వలనుపడదు. కాన దానిని ముందుగ నిట వివరించెదను.

—— వసుచరిత్రములో మొట్టమొదటి పద్యము. ——

శా. శ్రీభూపుత్రి వివాహవేళ నిజమంజీరాగ్రరత్నస్వలీ
లాభివ్యక్తి వరాంఘ్రిరేణుభవకన్యాలీల యంచున్ మదిన్
దా భావింప శుభక్రమాకలనచేఁ దద్రత్నముం గప్పునీ
తా భామాపతి బ్రోవుతన్ దిరుమలేంద్రశ్రీమహారాయనిన్.

అని స్వేష్టదేవతానతిపూర్వకముగాఁ గృతిపతి నాశీర్వదించి కవివలనఁ బై పద్యము చెప్పంబడియెను. ఇటులనే కావ్యప్రబంధకవులం దఱు స్వేష్టదేవతానతి చేసి యొకరికి కృతి యిచ్చుట సర్వత్ర విదితవృత్తాంతమే. కొంద ఱొకకృతి దేవునకే యియ్యఁదలఁచుకొనినయెడలఁ గృతి కధీశ్వరుం డగుదేవుని స్తుతియుంచి అనంతర మిష్టదేవతను నుతియించుటయుంగూడఁ గలదు. కాని నరాంకిత కృతులందుఁ గవియొక్క యిష్టదేవతానమస్కారమే తఱుచుగాఁ గాన్పించును. వసుచరిత్రములోనే కృతిపతి తన్నుం బిలువనంపె నని చెప్పినసందర్భములోఁగూడ నను శ్రీరామపాదారవిందభజనానందున్ అని విస్పష్టముగా వివరింపఁ బడియున్నది. దీనినే స్థిరపఱుచుటకును, బలపఱుచుటకును హారిశ్చంద్రనలోపాఖ్యానములో మఱియును బుంఖానుపుంఖముగా శ్రీరామవర్ణనమును, తనకు శ్రీరామునియెడఁ గలభక్తి చూపుటకుఁగాను దాఁ జేసినకార్యాదికములంగూడఁ దెల్పె. అందుఁ గొన్నిటి నిట వివరించెదను:—

హారిశ్చంద్రనలోపాఖ్యానము. ప్రథమాశ్వాసము
కృతిముఖపద్యము.

శా. శ్రీవైదేహిసుతన్ భృగూద్వహజయశ్రీసబ్జభృచ్చాపలీ
లావాప్తిన్వరియించి సత్కులవత్యామూల్యమాంగల్యదీ

శ్రీవాలం బగు సాపరిగ్రహామునం బనోభ్యస్యహార్దంబునన్
సేవింపం దగు రామచంద్రుఁడు శుభశ్రీ లిచ్చు మా కెప్పుడున్.

అని గ్రంథారంభమందు వసుచరిత్రములో వలెనే శ్రీరామునిఁ గవి వినుతించె. అంతటితోఁ దనివి నందక శ్రీరామసహచరు లగు సీతామహాదేవిని, భరతుని, లక్ష్మణుని, శత్రుఘ్నుని, హనుమంతుని, నుతియించి యిట్టివారికథను కావ్యము చేసినవాల్మీకింగూడ ప్రత్యేక ప్రత్యేకపద్యములతో నుతియించె. ఇట్లు కృతికార్యములోఁ దనకవిత్వే ష్టదేవత యగునాంజనేయుని యాజ్ఞయు నైనదనియును, ఆంజనేయుఁడుగూడ నీతనికిఁ గలరామభక్తికి సంతసించి తనకుం బ్రియుం డగురామునకుఁ గృతి యిమ్మని యుత్సహింపఁ జేసి యట్లొనంగితి నని చెప్పెను. వసుచరిత్రకవి విశేషముగా రామభక్తుం డైనందునఁ దత్ప్రతికోటి కాతనిచేఁ జేయఁబడిన కార్యములు తనకుఁగా దాఁ జెప్పుకొనిన నాత్మస్తుతిదోషము కల్గు నని తోఁచి కాఁబోవు నాంజనేయవాక్యములుగా నీక్రిందివిధమున వర్ణించె.

సీ. సుతులఁ బెక్కండ్ర శాశ్వతరామనామధ,న్యులఁ జేసిపిలుచుభాగ్యోదయంబు
రచితాగ్రహారంబు రామచంద్ర పురాంక,పూతం బొనర్చినపుణ్యరేఖ
నవదివ్యభవనంబు నవిరించి శ్రీరామ,విభుఁ బ్రతిష్ఠించినవిపులమహిమ
రామసరోనామ రమణీయముగఁ దటా,కము వినిర్మించినఘనయశంబు

తే. సఫలత వహించు నీహరిశ్చంద్రనలక, థాయుగనిబంధచిత్రబంధప్రబంధ
మంకిత మొనర్చు రఘుభర్త కఖిలకర్త, కురుతరాభీప్సితము లెల్ల నొదవు నీకు.

దీనింబట్టి చూడఁగా నీవసుచరిత్ర, హరిశ్చంద్ర నలోపాఖ్యానముల రచియించినకవి తనకుఁ గలరామభక్తిం దెల్పుటకుంగాను, (౧) తన కుమారులలో ననేకులకు రామనామ ముంచెననియును (౨) ఒక గ్రామము గట్టించి దానికి రామచంద్రపుర మనునామ ముంచె నని యును, (౩) సుందర మైనదేవతాభవనము (దేవాలయము) కట్టించి దానిలో శ్రీరామవిగ్రహప్రతిష్ఠ చేయించెననియును, (౪) చెరువు త్రవ్వించి దానికి రామసరోవర మనునామం బుంచెననియు (౫) ఇవు డీహ

రిశ్చంద్రనళోపాఖ్యానకృతి రచియించి దీని శ్రీరామునకే సమర్పింప నుండె నని తేలినది.

ఇట్లు చెప్పి దానితోఁ దృప్తి నొందక ఆగ్రంథములోనే రామాయణకథ నంతయు నిరువదేసుపద్యంబులు గలనక్షత్రమాలికగా నొనరించి రామునకు సమర్పించె. ఇది వసుచరిత్రము, హరిశ్చంద్ర నళోపాఖ్యానము రచియించినకవియొక్క రామభక్తి కథాసంగ్రహము.

ఇఁక నరసభూపాలీయకవికిఁ రామభక్తి యెంతవఱ కున్నదో దాని నాలోచింతము. అందు ప్రథమపద్యము.

"శా. శ్రీలీలావతి తా నురోమణిసభాసింహాసనత్కౌస్తుభా
వేలాభాప్రతిబింబితాఁగి యయిన న్వీక్షించి తం బొల్చినాఁ
డౌలే యంచుఁ దలంచు నో యని యమందానందుఁ డై లక్ష్మి నే
వేళం గౌఁగిటఁ జేర్చుశౌరి నరసోర్వీనాథునిం బ్రోవుతన్."

ఇందలిస్తోత్రము వైష్ణవపరమైనను అది కేవల మర్చావతారమగు శ్రీరామవర్ణనముగాక పరమపదనాథుఁ డై లక్ష్మీసనాథుఁ డై యుండిననారాయణుని వర్ణన మై కానుపించుచు. దీని ననుసరించియే క్రిందిపద్యములో సముద్రమునకు పుత్త్రిక యై చందురునకు సోదరి యై, కంఠర్పునకుం దల్లి యై ముకుందసుందరి యైనయిందిరాసుందరి వర్ణింపఁ బడినది. ఈదేవి అవతారాంతరమందు సీతామహాదేవి యైన రామోపాసకులవలన నిట్లు వర్ణింపఁబడను. అటనుండి సర్వప్రబంధ సామాన్య దేవతావర్ణనలు కొన్ని రచియింపఁబడినవి. అటుపిమ్మట తనకుఁ బ్రధానోపాస్య దైవం బగునాంజనేయునిమాత్రి మీఁకిరిందివిధంబున వర్ణించెను.

సీ. తనయాస్యగహ్వరంబునకు ఖద్యోతజృం, భణము ఖద్యోతజృంభణము గాఁగ
తనకరాంభోజాతమున కలగంధమాదన, మొకగంధమాదనము గాఁగ
తనశౌర్యహర్యక్షమునకు మైరావణ, స్ఫురణ మైరావణస్ఫురణ గాఁగ
తనవాఁడదంభోళి కెనయు కర్బురగోత్ర, గరిమ కర్బురగోత్రగరిమ గాఁగ

తే. వరలు రామానుజన్మ జీవప్రధాన, ధుర్యపర్యాయధాత మేదురవిరోధి
బలపయోధి విలంఘనప్రబలశక్తి, యొంబయన్నృసింహాభూభర్త కొసగుఁగాత.

ఈపద్యములోఁ జేసినవర్ణనయంతయు కేవల మాంజనేయునంత్రికల్పప్రోక్తమహిమానువర్ణనమే కాని వసుచరిత్రములోను హరిశ్చంద్రనళోపాఖ్యానములోను జెప్పినవిధముగ రామభక్తిపరాయణతచే నాంజనేయునకుఁ గల్గినమహిమావిశేషములుగా వర్ణింపఁబడవు. అందు వసుచరిత్రయందలి వర్ణన.

సీ. తరుణార్కకబళనోద్ధతిఁ జూపె నెవ్వాఁడు, రుచులచే ఫలమోహరుచులచేత
అకలంక రామముద్రికఁ బూనె నెవ్వాఁడు, శయముచే హృత్కుశేశయముచేత
మున్నీరు పల్వలంబుగఁ దాఁటె నెవ్వాఁడు, జవముచే గుణగణార్జవముచేత
అక్షశిక్షాప్రౌఢి నలరారె నెవ్వాఁడు, రణముచే నియమధారణముచేత
తే. ధరణి నెవ్వాఁడు దానవద్విరదదళన, విఖ్యాతిఁ దనకేసరికిశోరవృత్తిఁ దెలిపె
నతని మత్కావ్యమంజువాగమృతఘటన, మంజులస్వాంతు హనుమంతు మతిఁదలంతు.

హరిశ్చంద్రనళోపాఖ్యానములో:—

సీ. రామభక్తునకు భారమె ఘోరపంకాబ్ధి, తరణపాటవ మన శరధి దాఁటి
రామస్తుత్యున కరుదా మృత్యునిరసనం, బన మహాచ్ఛాయాగ్రహంబుఁ జీరి
రామకింకరున కబ్రమె రమాసాన్నిధ్య, మన విదేహాధీశతనయఁ గాంచి
రామైకమతికిఁ జిత్రమె పాశవిగళనో, పాయం బన నజాస్త్రబంధ మెడలి
తే. రామపరతంత్రునకు దుర్భరంబె విలయ, వహ్ని యన వాలశిఖి శిఖావ్యాప్తి నోర్చి
యరిపురం బేర్చినయజేయు నప్రమేయు, నాంజనేయు మునిధ్యేయు నభినుతింతు.

నరసభూపాలీయకవికి రామవర్ణనఁ జేయుప్రసక్తి కల్గెనా యను దాని నూహింతము. కృతిపతివంశము వర్ణించుచుఁ జెప్పిన సూర్యవంశానువర్ణనములోఁగూడ నరసభూపాలీయకవి శ్రీరామవర్ణనములో విశేషవర్ణన చేయక అతనిపూర్వులందఱితోఁ గలిపి సామాన్యముగా వర్ణించియున్నాఁడు. చూడుఁడు.

సీ. భవ్యుఁ డాతఁడు దీర్ఘబాహునిఁ గనియె నా, తఁడు గాంచె రఘువు నాతనికిఁ గలిగె
బురుపాదుఁ డతనికిఁ బొడమెఁ గల్మాషపా, దుఁడు తత్సుతుఁడు శంఖనుఁడు సుదర్శ
నుఁడు తత్తనూజుఁ డాతఁడు గాంచె నగ్నివర్ణమహీశు నతఁడు శీఘ్రగునిఁ బడసె
నతనికి మరుఁడు తదాత్మజుఁడు శుశ్రుతుఁ డా, తని కంబరీషుఁ డాతనికి నహుషుఁ
తే. డతనికి యయాతి నాభాగుఁ డతని కతని, కజుఁడు దశరథుఁ డతనికి నతని కొడుకు
రామభద్రుఁడు తద్వంశరత్న మయ్యె, సారిదిఁ గలివేళ గలికాలచోళవిభుఁడు.

తిరుగ నాయకగుణవర్ణనములోఁ గులముఁగూర్చి చెప్పుచో.

"నేవంశమునఁ బుట్టె నిలఁ జతుర్దశలోక రక్షణకుముఁ డైనరావణారి"

అని చెప్పెను. ఇట్లు రామదేవతోపాసనాదికములలోఁగూడ భేదంబులేక యున్నవసుచరిత్ర హరిశ్చంద్రనళోపాఖ్యానగ్రంథకర్తయును, అట్టియుపాసనలలోఁ బ్రధాన రామదేవతోపాసన లేనినరసభూపాలీయకావ్యకర్తయు నొక్కఁడే యని నిర్దేశించి చెప్పఁగలిగినచో నిఁక యుక్తిశాస్త్రమును, గ్రంథదృష్టాంతములు పుక్కిటిపురాణములమందర నిష్ప్రయోజనములు కావలయు నని చెప్పక తప్పదు.

## సంక్షేపాభిప్రాయము.

ఇదివఱలో నచ్చటచ్చట వివరించి యున్ననరసభూపాలీయవసుచరిత్రకవులభేదప్రజ్ఞ లరయుటకుగా నేను పైయుపన్యాసములో నుదాహరించినకవిత్వవిశేషముల సంగ్రహముగాఁ జూపెదను.

| నరసభూపాలీయకవి. | వసుచరిత్రకవి. |
|---|---|
| ౧. శతఘంటకవి | ఈబిరుదితనికి లేదు. |
| ౨. గడియకు నూఱుపద్యములు చెప్పఁగలఁడు | ఇది యితనికిని బిరుదే. |
| ౩. ఆశుధారను ప్రబంధమును, బంధకవిత్వంబును చెప్పును | ఈబిరుదు లేదు. |
| ౪. సోష్ఠ్యముగా, నిరోష్ఠ్యముగాఁ గవిత్వము జెప్పును | ఇదియును లేదు. |
| ౫. నాలుక కదల్పనక్కఱ యుండనికవిత్వము చెప్పును | ఇదియును లేదు. |
| ౬. తత్సమభాషాకవి | సంస్కృతాంధ్రభాషాసామ్రాజ్యబిరుదు గలదు. |
| ౭. అనేకపద్యవ్యస్తాక్షరి చేయఁగలఁడు | ఈబిరుదు లేదు. |
| ౮. ఏకసంధోచిత శ్లోక భాషాకృత్యచతురత | ఇదియును లేదు. |
| ౯. ఓష్ఠ్యనిరోష్ఠ్యములం గల్పి చెప్పఁగల్గుట | ఇదియును లేదు. |
| ౧౦. అచల మగునట్టియు, యమకముతోఁ గూడిన యాశుధారగలవాఁడు | ఇదియును లేదు. |
| ౧౧. హనుమత్ప్రసాదలబ్ధకవితాసారము గలవాఁడు | జగత్ప్రాణనందన కారుణ్యకటాక్షలబ్ధకవితాధారాసుధారాశి. |
| ౧౨. సారస్వతాలంకారుఁడు | ఇది చెప్పఁబడలేదు. |
| ౧౩. నిరంకుశప్రతిభాబంధురుఁడు | ఇదియుం జెప్పఁబడలేదు. |

౧౪. ప్రబంధపఠనరచనాధురంధరుఁడు — ఇతఁడు ప్రబంధనిర్మాత యావుటంజేసి యీబిరుదు లేకున్న లోపము లేదు.

౧౫. సకలభాషావిశేషనిరుపమావధాని — ఇతని కీబిరుదు లేదు.

కాని వసుచరిత్రకవి కధికముగా నున్నవిశేషములు వక్కాణించెదము:

౧. దినమున కొకప్రబంధము రచించుట.
౨. సంగీత కళారహస్యములం దెలియుట.
3. శ్రీరామమంత్రోపాసన.
౪. చతుర్విధకవిత్వనిర్వాహకత్వము.
౫. సాహిత్యరసపోషకత్వము.

నరసభూపాలీయకవి.

ఇట్లీతనికి పదునైదుప్రజ్ఞలు కానిపించును. వసుచరిత్రగ్రంథకర్తయొద్దఁ గల్గియుండినవిశేషప్రజ్ఞలలో నాల్గుప్రజ్ఞ లీతనికి లేవు. అట్లున్నను శతఘంటకవిత్వము అష్టావధానాదిప్రజ్ఞలు నుండుటచేత ననేకదేశములలో నితనిపేరు ప్రసిద్ధి నందుటకును తనప్రాగల్భ్యముం జూపుటకు ననువైనది. ఆ కారణముచేతనే "లొట్టయి దేటిమాట" అనుపద్యముం జెప్పుట కల్గెను.

వసుచరిత్రకవి.

నరసభూపాలీయకవికిఁ గల్గియుండినపదునైదుప్రజ్ఞలలో నితనికి పదునొకొండు ప్రజ్ఞలు లేవు. కాని యితనికి మఱినాల్గు విశేషప్రజ్ఞ లుండుటచేత నీతనికవిత్వము నరసభూపాలీయ కృతికంటె మధురమై రసవంతమయ్యెఁగాని సభారంజనముం జేయునట్టియవధానతంత్రము, శతఘంటకవిత్వాదిప్రజ్ఞలుగలనరసభూపాలీయకవికిఁగల ప్రఖ్యాతి యితనికి తేఁజాలకపోయినవి.

పైరెండు గ్రంథములలో నుండు కవిత్వతారతమ్యములం దెలిసినపిమ్మటనైన పైగ్రంథకర్త లిర్వురును ఒక్కరే యనుసిద్ధాంతమును విడువజాలక యుండుబుద్ధిశాలురకు మఱికొన్ని చమత్కారములఁగూడఁ జూపెను.

నరసభూపాలీయకవియొక్క ప్రజ్ఞావిశేషము లధికములనియు నట్టివిశేషములు వసుచరిత్రకవిత్వములో నుండవని చెప్పుటకుంగాకున్నను స్వప్రజ్ఞాప్రకటనాదికములు విశేషించి చేయుస్వభావము నరసభూపాలీయ కవి కెక్కుడుగ నున్నందుల కీక్రిందిపద్యము చాలియుండును.

సీ. బాణవేగంబును భవభూతిసుకుమార, తయు మాఘుశైత్యంబు దండిసమత
అలమయూరశుష్కకలన చోరునియర్థ, సంగ్రహంబు మురారిశయ్యానేర్పు

సోమప్రసాదంబు సోమయాజుల, నియమంబు భాస్కరుని సన్మార్గఘటన
శ్రీనాథునిపదప్రసిద్ధధారాశుద్ధి, యమరేశ్వరుని సహస్రముఖదృష్టి
తే. నీకకలదటుగాన ననేకవదన, పదనసంచారభేదంబు పడలుపఱచి
భారతీదేవి నీజిహ్వఁ బాదుకొనియె, మూర్తిరవిచంద్ర విఖ్యాతకీర్తిసాంద్ర

ఈపద్యముం బట్టి చూడ నీకవి వీనినన్నింటిని డంబమునకై చెప్పియుండునా యని తోఁచకపోదు. కాని పరిశీలింప నట్లనుటలో న్యాయము లేదు. ఇతనికడ ననేకులగుకవులలో నరిదిగఁ గన్పడుప్రజ్ఞలు చాలగ నున్నవి యనియు నది కారణముగా నీతఁ డాయాగుణములు గలకవులపేరులు చెప్పి వర్ణించినాఁ డనియుం జెప్పఁదగియున్నది. ఇట్టి ధైర్యశాలి గనుకనే 'లొట్ట యిదేటిమాట, యను పద్యముం జెప్పె.

ఇఁక వసుచరిత్రకారుఁడు వసుచరిత్రములోఁగాని హరిశ్చంద్రనలోపాఖ్యానములోఁగాని చెప్పుకొనినబిరుదులు సర్వకవిసామాన్యధర్మము లైనవగుటం జేసి యట్టివానింగూర్చి సాధారణముగాఁ జెప్పుకొని తనకవిత్వమందుఁ దా జెప్పినవిశేషములు విస్పష్టముగాఁ గాన్పించునట్లు చేసెను. అందులో సరసభూపాలీయకవి యత్నించలేని సంగీతవిద్యాసంప్రదాయవివరణము. ఇయ్యది కవి కనువైనవు డెల్లనాతనిచేఁ బ్రకటింపఁబడియె. అందు సంగీతవర్ణన లున్నపద్యములు రెంటిని జూపెదను.

మ. సకలామోదకతాళవృత్తగతులన్ సంగీతసాహిత్యనా
మకవిద్యాయుగళంబు పల్కఁజెలికిం బాలింద్ల జో డైసిరుల్
ప్రకటింపన్ నఖరేఖలందు నఘుప్రస్తారము ల్సేయుస
ర్వకళాకాంతుఁడు బ్రోవుతన్ దిరుమలేంద్రశ్రీమహారాయనిన్.

వసుచరిత్రము. అశ్వా ౧. ప 3

సీ. ఒకటి యక్షరవిలాసోల్లాసమున మించ, నొకటి తాళప్రౌఢి నుల్లసిల్ల
నొక్కటి నారికేళోన్నతిఁ దాల్ప నొ, క్కటి గోస్తనీగుచ్ఛకలనఁ దవర
నొకటి సువృత్తభావోన్మేష మొంద నొ, క్కటి వల్లకీతుంబికలనఁ జెలఁగ
నొకటి భారుకేవయుక్తిఁ బెం పొంద నొ, క్కటి గిరీశమతానుకారి గాఁగ
వసుమసాహిత్యసంగీతరసము లనెడు, గుబ్బపాలిండ్లు దాల్చుపల్కులవెలంది
సరసగుణహారనోబయనరసధీగు, నవ్యకృతినాయకుని గా నొనర్చుఁగాత.

ఈరెండుపద్యములం జూచినచో నీరెండు గ్రంథములు కవులకుం గలప్రజ్ఞా భేదము స్పష్టము కాఁగలదు. వసుచరిత్రములోఁ గలసంగీతరహస్యములం దెల్పుపద్యములు పెక్కు లున్నను అట్టిపద్యములు నరసభూపాలీయములో నుండుటకు నవుపు లేక యుండుటంబట్టి రెంటిని విరళించి చూపునవకాశము లేక యున్నది. అయినను వసుచరిత్రములోని యింకొకపద్యముం జూపి యీవిషయమై వ్రాయుట వదలెను.

మ. అరిగాఁ బంచమ మేవగించి నవలా లవ్వేళ హిందోళవై
ఖరిఁ జూపన్ పికజాతి మాత్సరకభంగవ్యాకులం బై వనీ
ధర నాలంబిత పల్లవవ్రతవిధుల్ దాల్పక్ తదీయధ్వనిక్
సరిగాఁ గైకొనియెక్ వసంతము మహాసంపూర్ణభావోన్నతిన్. ఆ. ౧.ప.౧౩౦.

ఈయిర్వురుకవులకుం గలప్రజ్ఞల స్పష్టీకరించుటకుఁ గొన్ని ప్రతీతులు గూడ పుట్టియుండును. వానిలో వసుచరిత్రకవి ప్రస్తుతపువీణియలమెట్లలోఁ జేసినవిశేషాదిక మతని సంగీతవిద్యాప్రాగల్భ్యముం జూపుటకును నరసభూపాలీయకృతికర్త అయ్యలరాజురామభద్రకవి నాక్షేపించఁబోయి

"పృథులషడ్జస్వరోదీర్ణ ఖిల్లపల్ల, వాధరీగీతికాకర్ణనాతిభీత,
పరవశాత్మపటీరకోటరకటీర, లీనఫణి యాగునక్కాన కాన నయ్యె"

అనుపద్యములోనిసంగీతసంప్రదాయము తెలియనివాఁడై సభలో నవమానించఁబడె ననుకథలోని న్యూనతయును, పైవృత్తాంతముల బలపఱచుటకుం జాలియుండు.

ఇట్లుండుటం బట్టి పైపద్యములో నుపయోగింపఁబడిన విశేషములు కొన్ని భిన్నములుగా నున్నను, పరస్పరవిరుద్ధము లైన వేవియును లేనందున వానినిఁ బట్టి గ్రంథకర్తలు భిన్ను లని సాధించుట కాధార మేదియు లేదు'' అని వీరేశలింగముగారు చేసినసిద్ధాంత మందఱివలెనే స్థూలదృష్టితోఁ జేసినది కాని శ్రమచేసి సూక్ష్మదృష్టితో నాలోచించినది కా దని చెప్పవలసినందులకు వగచుచున్నాను. కాఁబట్టి ఆసిద్ధాంతము మనస్సునం దుంచుకొని వ్రాసియున్నతరువాయి వచనము లన్ని నిరస్తములయ్యె నని వక్కాణించెదను.

ఇంతదనుక మనము ప్రత్యేకము క్రొత్తమార్గమున భట్టుమూర్తిరాజు, రామరాజభూషణకవి వేఱని చూపుటకుఁ జర్చించుచుంటిమి గాని యీమనయుపన్యాసమునకుఁ బ్రధానకారణ మగు పూండ్ల, రామకృష్ణయ్య పండితుఁడు కందుకూరి వీరేశలింగము పండితుఁడును చేయు సంవాదములోని యాథార్థ్య మారసి చెప్పం బ్రాలుమాలినాము. అయినను అట్లూహించంబనిలేదు. పైయుపన్యాసములో నేదియో యొక పక్షము స్పష్టమే అగుచున్నది కావున నిఁక మనయభిప్రాయము చెప్పుటలో శ్రమ యుండనేరదు. పైయుపన్యాసము వినినతోడనే పైయుభ్యుభయుక్తులలో నేది ప్రశస్తమో యేది కాదో అది కరతలామలక మై కాన్పించు. ఇది మొదటిపేరాకు విమర్శనము.

(౨) అందులో రామరాజభూషణుఁ డనుకవి వసుచరిత్రము నరసభూపాలీయము, హరిశ్చంద్రనలోపాఖ్యానముదు వరుసగా రచియించినాఁ డని క. వీ. గారు చెప్పినమాట నిలిచినది కాదు. భట్టుమూర్తికి రామరాజుయొక్క ఆస్థానము దుండుటచేత వచ్చినబిరుదాంక మిది కాదని రా. కృ. గారు చెప్పినయుక్తులు సహేతుకములు. అందు రా.కృ. గారు చెప్పినబంధకవిత్వ దృష్టాంతము మట్టుకు రామభూషణుఁడు చతుర్విధ కవితానిర్వాహకుఁడని నని చెప్పుకొని యుండుటం బట్టియు నట్టిప్రజ్ఞ తన కున్నట్లు చెప్పుకొననినరసభూపాలీయకవి దానిం జెప్పుటం బట్టియుంజూడ నీస్థలములో రా. కృ. గా రుద్దేశించినయుక్తి నిర్ధారణకుఁ జాలి యుండ దని చెప్పవలసి యున్నది. క. వీ. గారు జనశ్రుతినిఁ బాటించి గ్రంథస్థగాథలఁ బరిహరించుటలో న్యాయము లేదు.

(3) I. పురాణనామచంద్రికలోను, II. దక్షిణహిందూస్థానకవులచారిత్రములోను, III. ఆంధ్ర్యనిఘంటువునందును, VI. సుజనరంజనిపత్రికయందును, V. ముద్రిత మైనవసుచరిత్ర ముఖపత్రము నందును, VI. పాండురంగవిజయములోని దని పుట్టినచాటువునందును, VII. శ్రీరాధాకృష్ణసంవాదమునందును, వ్రాయఁబడిన సిద్ధాంతములు గతానుగతికములు కాని పరిశీలనా జన్యములు కావు. కావున నందలి

సిద్ధాంతములు పూర్వపక్షకోటిలోనివై ప్రస్తుతకాలములో నగ్రాహ్యాము లయ్యె నని గ్రంథస్థ మగుసాక్ష్యమును బట్టి చెప్పవలయును.

(౪) అందులో రామరాజభూషణుఁడు వేసికొనిన "శుభచిహ్న" అను దానికి క. వీ. గారు చెప్పినట్లు శుభ మనుబిరు దర్థము కాక రా. కృ. గారి సిద్ధాంతానుసారముగ నాందోళికాదిచిహ్నము లని చెప్పుటయే యుక్తము.

(౫) "సంగీతకళారహస్యనిధి" నని వసుచరిత్రములో రామభూషణుఁడు వ్రాసియున్న దానికన్న వీణియకు మెట్లు కల్పించుటంజేసి కర్త నను దానివృత్తాంతమంతయు నిపుడు ప్రకటింపవలసి యున్నది. దాని నిటుపైని సయుక్తికముగా విస్పష్టపఱుచుచున్నాను. కాని యందెచ్చటను రామభూషణుఁడు రచియించె నని వాడఁబడుచుసంస్కృతాంధ్రకృతులు (పదకవిత్వము) గాని వానివిశేషములుగాని వినరింపఁబడలేదు. ప్రబంధములలో సంస్కృతాంధ్రకృతు లావఱకే రచియించి యుంటి నని చెప్పినదానికి ప్రబంధములుగా నన్వయించుటయు, యక్షగానములు రచియించుగ్రంథములలోఁగూడఁ సంస్కృతాంధ్రకృతు లని యున్నను పైరీతిని గ్రంథములే అని చెప్పుట సహజముగా నున్నది. సంగీతములో నుండుకృతు లనునామముతో నొప్పు ప్రస్తుతగీతభేదములు నవీనము లనియుఁ బూర్వకాలములో నిట్టి నామ మున్నందులకు నిదర్శనములు గాని నిబంధనగ్రంథములలో వాని నిర్వచనములుకాని కానుపించుట లే దనియుం జెప్పవలసియున్నది. కావున నిందులోఁగూడ రా. కృ. గారిసిద్ధాంతమే సరియైన దని చెప్పవలసియున్నది.

(౬) ఇందులో రామరాజభూషణుఁ డనుపేరితో నున్నకవి "సూరపాత్మజుఁడ" నని వ్రాసుకొనుటచేత నతని కితఁ డౌరసుఁ డనియు, నరసభూపాలీయములో "వేంకటరాయ భూషణసుపుత్త్రి" అని వ్రాసియుండుటచేత పైకవియే వేంకటరాయభూషణునకు దత్తుఁడని దృఢపఱుచుచున్నట్లు కొంద ఱనుచున్నారని క.వీ. గారు వ్రాసినది అట్లు చెప్పువారికి ధర్మశాస్త్రజ్ఞానము లే దని సూచించుటకై యుండునుగాని వారిసిద్ధాంతబోధమునకుఁ గాదు. అట్లుగానిచో క.వీ. గారిధర్మశాస్త్రాభిప్రాయ మదియే యని యూహించుటకుఁ మే మెంతమాత్ర

ము నుత్సహింపము రా. కృ. గారి ఆక్షేపణలు ధర్మశాస్త్రసంరక్షక ములనియు నిర్దుష్టములనియు, సిద్ధాంతీకరించెదము.

(2) ఇందులో రా. కృ. గారు నరసభూపాలీయకవి వేఱనియు నతనిపేరు మూర్తి (లేక మూర్తిరాజు) అను భట్టుమూర్తి యనియు ను, వసుచరిత్ర హరిశ్చంద్ర నళోపాఖ్యానముల రచియించినకవి పైకవి కి వేఱై రామరాజభూషణనామమున వ్యవహరింపఁ బడువాఁడనియు, నాయిర్వురు నొక్కరే యని యిదివఱకు భ్రమపడుటకుఁ గారణములు కొన్ని యున్నను అవి యన్నియుఁ బూర్వపక్షములుగా భావింప వల యు నని చెప్పిన సిద్ధాంతవచనము సీయుపన్యాసారంభములో మేము చూపినగ్రంథసాక్ష్యనిదర్శనములంబట్టి జనిగపడినదై పుక్కిటిపురాణగాథల ను నిర్మూలముచేసి యిఁక బూర్వపక్షోక్తి శతముల కైన కదలింపరా ని పూనాది గలదైన దని మఱిమఱి వక్కాణించుచున్నాము.

కాకమానిమూర్తి యెవ రని.

కాకమానిమూర్తియే భట్టుమూర్తి అని యిదివఱలో నాకవిజీవిత ములో వ్రాసియున్న దనియు నట్లు వ్రాయుట కేవలము హాస్యాస్ప ద మని పూ. రామకృష్ణయ్యపండితుఁడు వ్రాసియున్న దానికి సమా ధాన మీయక యిపుడు మనము వ్రాయుచున్న చారిత్రకథాభాగముల లోనికిం దిగ రాదు. అందువిషయమై చెప్పవలసినసమాధానము విశే షించి యుండదు. ఈకథావిషయమై భట్టుమూర్తింగూర్చియు, రామ రాజభూషణుంగూర్చియు వ్రాయంబడినచారిత్రగ్రంథములో నీకాకమా నిమూర్తింగూర్చి వ్రాసియుండలేదు. ఆభాగములో భట్టుమూర్తి యింటిపేరు ప్రబంధాంకమువా రనునట్లు నిశ్చయించియే ౫౭ పుటలోఁ బ్రబంధాంకము సింగరాజు మూలపురుషుఁ డని చెప్పుటచేత సూచింప నైయున్నది. ఆవిషయమైనవేఱుసంవాద మున్నట్లు సూచన యైనఁ జేయంబడనిచోట మఱియొకవిధముగ శంకకల్గించుకొనుట కవకాశ ముండదు. నేను చారిత్రము వ్రాయుచో గ్రంథస్థగాథ లేవియో ఉదా హరణములతోను, గ్రంథస్థములు కానిగాథలను వాడుకనుబట్టియు వ్రాయుచున్నానని వివరించుచునే యుంటిని. దీనింగూర్చి ప్రస్తుతము నేను ప్రకటించిన రామకృష్ణునిచారిత్రములోఁ జూడఁదగును. అట్లే

గ్రంథములోఁ గానుపించనివానిఁ గుఱించి విమర్శకులు పట్టిపల్లార్చవలసిన పని యుండదు.

ఇఁక తెనాలి రామకృష్ణునిగాథలు నుడువుచో లోకములో వాడుకొనంబడుచున్న కొన్ని వృత్తాంతములు వ్రాయఁబడినవి. వానిలోఁ గూడ సాధ్యము లగునన్ని యంశములు యుక్తిచేతను, గ్రంథదృష్టాంతరములచేతను యథార్థబోధమునకై వ్రాయఁబడుచుండెను. అట్టివానిలో లోపము లున్నయెడల వానిం దెల్పి గ్రంథము సవరణ చేయించుటకుగా నీవఱలో నాంధ్రపండితు లందఱు ప్రార్థింపఁబడియున్నారు. అందులో నీ రా. కృ. గారు నొక్కరు కావచ్చు నని యూహించియుంటిని. కాని వారు నీపైవిషయమును నవీనముగాఁ గనిపెట్టిరే యుందురు. ఆవిషయములో నైన తాము వ్రాయుచున్న హరిశ్చంద్ర నలోపాఖ్యానకవిచరిత్రము నాగ్రంథముకంటె నాధిక్యత నందఁ గల దని యూహించి దానిని లోపలనే జీర్ణింపఁజేసి యుంచియుందురు. అటు గాకున్న నీకవిజీవితము ఆ ౧౮౭౭-౭౮ సంవత్సరములలోఁ బ్రకటింపఁబడినది. అది మొదలు ౧౮౯౩ సంవత్సరమువఱకు నీవిశేషమును బ్రకటింపకపోవుటకుఁ గారణము కానుపించదు. ఇట్టిగొప్పవృత్తాంతము నెంతవిస్పష్టముగాఁ బ్రకటించిన నంతచారిత్రానుభవశక్తి వెల్లడి యగు నని యెంచి కాఁబోలు పైయిర్వురుమూర్తులు నొకరు కారని చెప్పినఁ జాల దని యూహించి ఆయిర్వురి వర్గత్రయములోఁ గలభేదము నీక్రిందివిధంబున వ్యక్తీకరించిరి.

“అల్లసానివాని అనునది కాకమానిమూర్తిని గుఱించి చెప్పఁబడినపద్యము. దీని లోకులు భట్టుమూర్తి కన్వయించి చెప్పుట యెంత హాస్యాస్పదముగా నున్నదో విచారింపుఁడు. భట్టుమూర్తిగారియింటిపేరు కాకమానివా రని యాతనిమెడఁ గట్టిరి. గమనించి చూడుఁడు.

౧. కాకమానిమూర్తి కౌండిన్యసగోత్రుఁడైన బ్రాహ్మణుఁడు=బట్టుమూర్తి బట్టువంశజుఁడైనశూద్రుఁడు.

౨. కాకమానిమూర్తి బుధకవిసార్వభౌముపౌత్త్రుఁడు = బట్టుమూర్తి తిమ్మరాజపౌత్త్రుఁడు.

3. కాకమానిమూర్తి రామలింగభట్టుపుత్త్రుఁడు=బట్టుమూర్తి వేంకటరాయభూషణపుత్త్రుఁడు.

ర. కాకమానిమూర్తి కాద్రవేయాధిపవరప్రసాదకవితావిలాసుఁడు=భట్టుమూర్తి హనుమత్ప్రసాదాసాదితకవితావిలాసుఁడు.

ఇట్లించుకయైన వర్ణసంబంధము లేనియియ్యిరువురు నొక్కరేయని చెప్పుచుఁ గాకమాని మూర్తివిషయమై వ్రాయఁబడినపైపద్యమును భట్టుమూర్తికి నన్వయించుటకంటె మఱియొకచిత్రము కన్పట్టదు.'' అని విశేషోక్తిపరంపరలచే వ్రాసిరి. ఇంత శ్రమ అక్కఱలేకయే వీరీపద్యమున కెట్లు సమన్వయింపవచ్చు నని నన్నడుగుటయే కల్గిన దీని కపుడే సమాధానము పంపియుందును. అట్టియదృష్టమునకుఁ బ్రాతులము మే మిర్వురముం గాకుండుటఁ జేసి ఆసమాధానమును నేనును గ్రంథరూపముగాఁ జేయవలసివచ్చినది. అది యెట్లన్నను:—లోకములో నెట్టికవియైన నొకయంశముంగూర్చి యితరుల నెగతాళిచేయవలసివచ్చినప్పుడు అట్టిభావమును జూపించుటకుఁగాను తాఁ బ్రత్యేకము పద్యము కల్పించి చెప్పుటకంటెఁ అంతక్రితము వ్యాపకములోనుండెడు ననుయోచిత మగునితరకవికృతపద్యములంగాని శ్లోకములం గాని ప్రస్తావనముచేయుట సర్వత్రవిదితాంశమే. అట్టిపట్ల ఆప్రస్తావకుఁడు స్వయముగా శ్లోకము చెప్పుటకంటె నన్యుల ప్రస్తావనశ్లోకమునే ప్రకటించిన రసవంత మగును.

కాళిదాసకృతశ్లోకములును, పండితరాయకృత శ్లోకములును, నీతిసంగ్రహములోని శ్లోకములును, వేమనపద్యములు సహితము ప్రస్తావనకు మున్నున్నుగ వచ్చుచుండుట అనుభవసిద్ధమే. అట్టిచోఁ రామలింగము భట్టుమూర్తివీఁపున తామరయున్నదని రాజునకుం దెల్పి యపహసించుటకు లోనూహించుకొని, ఆవఱలో వ్యాప్తమై యున్నపద్యముం జదివి దానిని సమన్వయించిన నన్వయించి యుండవచ్చును. లేకున్న ఆపద్యము తాఁ జేసినదే యని బాలుఁడై యున్నభట్టుమూర్తిని మోసపుచ్చినవాఁడైన నుండవచ్చును. అది తిరుగ రాజసన్నిధిం జదువు మనినపు డందులోనిచమత్కారభాగము చదివి నట్లు పద్యమున్నది. ఇక్కడ కాక మానురాయ అని విడఁదీసినచోఁ గల్గెడువిశేషము బట్టుమూర్తికంచుక మూడఁదీసిన మొడలఁ గాన్పించు నని పరిహాసించినం జాలియుండును. ఇట్లు వ్రాసియున్నంతమాత్రమున నీకథ కట్టుకథ కాకపోలేదు. ఈలాటికథలను నమ్మిరయే సిద్ధాంతము లే

ర్పఱుపంబడ లేదు. ఇట్లుండ పైమూర్తు లిర్వురియొక్కయు వర్తత్రయ మును, వంశసాంప్రదాయములు తెలియక యొకరిపిల్లల నొకరి కిప్పించి సంబంధ బాంధవ్యములు జరిపినట్లు చెప్పియుండ లేదు. కావున కట్టుకథల నువాసికిని శాస్త్రీయవిమర్శనకుం గలభేదము ముందుగఁ దెలిసికొనన నిదే యీచారిత్రములు వ్రాయ గమకింపఁగూడ దని విన్నవించెదను.

## రామభూషణునిసంగీతప్రజ్ఞ.

దీనిం దెల్పునట్టి "సంగీతకళారహస్యనిధి" యనుబిరుద మీకవి కున్న ట్లిదివఱకే చెప్పియున్నాము. ఇపు డట్టిబిరుదు గల్గుటకు కారణ ము జెప్పవలసియున్నది. ఇది కేవలము గ్రంథస్థ మగుగాథ కాకున్నను దేశమందు సంప్రదాయజ్ఞులవలన వినియున్నదియు నట్టివని సమర్థులవల నఁగాని కాని దగుటంజేసియు సంగీతరహస్యకళానిధి నని రామభూషణుఁ డు స్వస్వరూపప్రకటన తానే చేసుకొని యుండుటంబట్టియు నట్టిమాట ను వక్కాణించుటకు నీసంప్రదాయము సాక్ష్యముగా నగుచుండుటవల న దాని నిట వివరించెదను. దానిని బలపఱచు గ్రంథప్రమాణములను వసుచరిత్రమునుండియే సంపాదించెదు. దీనింగూర్చి వ్రాయుటకుఁ బూర్వము సంగీతవిద్యాసాధనాగ్రేసర మగువీణావిషయిక మైన కొన్ని సంప్రదాయములు సంగ్రహముగా వక్కాణింప వలసియున్నది. అందు లో నాకు విశేషపరిచయము లేకుండుటం జేసి ఆవిద్యాపారంగతులయభి ప్రాయము కొంత కొంతయారసి దానినిటవక్కాణించెదను.ఎట్లనఁగా—

## వీణియలసంప్రదాయము.

దీనిం దెల్పుగ్రంథములు కొన్ని కలవు. అవి సామాన్యముగ వీణావిద్యాసంప్రదాయము స్పష్టీకరించును. అందు వీణియలు నాల్గు భేదములు గల వని యీక్రిందిశ్లోకమువలనఁ జెప్పఁబడును.

శ్లో. నారదస్యాపి మహతీ తుమ్బురోస్తు కళావతీ,
విశ్వావసోస్తు బృహతీ సరస్వత్యాస్తు కచ్ఛపీ.

అని దీనింబట్టి సంగీతవిద్యాసాధనములు వీణియలనునామము తోనే యొప్పుననియును అవి నాల్గుభేదములు గల వనియు వానిని మొదట కల్పించినవారు నల్గు రనియుఁ దేలినది. వాని భేదములును ఒక్కొ క్కదానివిశేషములు నీక్రిందిపట్టికలోఁ గనబఱిచెదను.

| నంబరు. | వీణాపేరు. | ధరించినవారి పేరు. | తంత్రుల సంఖ్య. | రూపము. | వ్యాపక దేశము. | పర్దాలుఅనఁగా మెట్లు. | రిమార్కులు. |
|---|---|---|---|---|---|---|---|
| ౧ | ౨ | ౩ | ౪ | ౫ | ౬ | ౭ | ౮ |
| ౧ | మహతి. | నారదుఁడు | ౭ | రెండుతుంబలు నొక వెదురుబొంగు మొదలచివర నదుకఁబడును. | ఉత్తర హిందూస్థాన మనఁగా వింధ్యోత్తర దేశములు. | ౨౦ | అరణ్యవాసు లగుమునులకు దండకమండలువులు గా నేర్పడినసారకాయబుఱ్ఱలు, వెదురుబొంగులు దీనిపరికరములు. |
| ౨ | కళావతి. | తుంబురుఁడు. | ౪ | తంబురాదీనిరూపమే | సర్వదేశములలో. | ,, | కళలుగలదిగానఁ గళావతి యాయెను. కళ యనఁగా శ్రుతి ఇది గానముచేయువారివలన శ్రుతికొఱకుపయోగింపఁబడును. |
| ౩ | బృహతి. | విశ్వావసునామ గంధర్వుఁడు. | ౧౫ | 'సారంగ రూప' ము అనఁగా లేడిరూపము లేడికి కాళ్లునాల్గులేకున్న నెట్లుండునో యట్లుండును. | ఉత్తర హిందూస్థానము. | ,, | దీనిని సారంగు అని వాడుదురు. పిడేలువలె దీనిని విల్లువంటియాకారముగల యొక వెండ్రుకలుకట్టిన కోలతో వాయించెదరు. |
| ౪ | కచ్ఛపి. | సరస్వతి. | ౭ | తాఁబేటియాకారము. | వింధ్యకు దక్షిణదేశము. | ౨౪ | దీనిని వెండితోను బంగారుతోను, ఏనుఁగుదంతముతోను నలంకరించెదరు. |

పైనాల్గింటిలో మెట్లు(పర్దాలు)గలిగి యుండునది మొదటి మహతీవీణె యనియు, నాల్గవది కచ్ఛపివీణె యైయున్నట్లును స్పష్టమే గదా. ఈరెంటికే వీణె యనునామ మిప్పుడు సర్వత్ర వాడుకొనఁబడుచున్నది. అందు మహతి మధ్యమశ్రుతి గలదియును, కచ్ఛపి షడ్జమశ్రుతి గలదియు నై యున్నవి. ఇట్టిభేదములు ప్రథమవీణెలో మొదటిశ్రుతిలో మకారము పల్కుటఁబట్టియును, రెండవకచ్ఛపివీణెలో మొదటిశ్రుతిలో సకారము బల్కుటం జేసియు నేర్పడినవి.

సప్తస్వరములలోను, స, ప అనునవి రెండును కళలు అనఁగా శ్రుతిపర్యాయములు. తక్కినవైన నవగా, రి, గ, మ, ధ, ని, పేరుగల స్వరములు హెచ్చు తగ్గు స్వరములు గలవియై రెండేసి యయినవి. ఈ పదియును పై. స. ప స్వరములు కలిసి పండ్రెండు (౧౨) స్వరము లైనవి.

## మేళవించుటను గూర్చి

దీని నుత్తరదేశీయభాషలో "టాట్" అని వాడెదరు. ఇట్టి టాట్ చలము, అచలము నని రెండువిధములు గలదు. అనఁగా వీణె యొక్క మెట్లు రాగానుసారముగాఁ గొంచెము క్రిందికిని మీఁదికిని జరుపుకొనవలసియున్నది. ఈయాచారమే పూర్వము విశేషమైయున్నట్లు కనఁబడును. చితారు అను నుత్తరదేశీయ సంగీతవిద్యాసాధన మిప్పటికి నిట్లే యున్నది. ఈవిధముగనే రుద్రవీణెకును, కచ్ఛపివీణకును చల టాట్ మార్గము స్వభావసిద్ధమైనట్లు కానుపించును. అయితే కొందఱు బుద్ధిశాలు రట్టిదానిలో రాగములు మార్చుటలోఁ గల్గుభేదములు చిక్కులు నాలోచించి దాని నచలటాట్ గాఁ జేయ యత్నించిరి. అప్పు డుత్తరదేశస్థు లొకవిధముగా దాని నచలముం జేసిరి. అందుకు గా నింకొక యెనిమిదిస్వరములు గలయావృత్తమునకుం దగిన మఱియెనిమిది మెట్లు (పరదాలు) చేర్చి మొత్తమునకు నిరువది (౨౦) మెట్లును బిగించిరి.

ఇంక దక్షిణదేశములోని వీణె నచలటాటు (అనఁగా నచలమేళనము) చేయుపని నవలంబించవలసివచ్చినది. అట్టిపని చేయుటకు నావిద్యలో సంపూర్ణపాండిత్యము గలవారు యత్నింపవలసివచ్చును. ఆపనికై రామభూషణునికాలమువఱకును యత్నించినవా రెవరును గానుపించలేదు. పిమ్మట రామభూషణుఁ డట్టికార్యముఁ జేయం బూనుకొనియెను. అందాఁకను చేసినవి యెట్లున్న దనఁగా, ఉత్తరదేశీయు లిరువది మెట్లు కల్పించినవానికి నింకొక నాల్గుమెట్లధికముగా వేసెను. అనఁగా రెండుగాంధారములును, రెండుఋషభములను నధికముగాఁ జేసెను. దీనింబట్టి యీవీణెకు నిరువదినాల్గు (౨౪) మెట్లేర్పడినవి. అనఁగా మొదటఁ జెప్పియున్న పండ్రెండుస్వరములును రెండావృత్తములు తిరిగినవి. ఇట్లుండటంజేసి యుత్తరదేశీయుల అచలటాట్ కంటెను దక్షిణదేశీయులఅచలటాట్ సులభమార్గమైనది. కావున సరస్వతి వీణ యగు కచ్ఛపి పండ్రెండేసి మెట్లు గలరెండుస్థాయిలు కలదిగా రామరాజభూషణకవివలనఁ జేయంబడినది. దాని కనుగుణముగ రాగాలాపములు సరిపుచ్చవచ్చును.

## సంగీత శాస్త్రముం దెల్పుపద్యములు.

వసుచరిత్రములో సంగీతసంప్రదాయముం దెల్పుపద్యములు పెక్కు లున్నవి. అందుఁ గొన్నిటిని పైయుపన్యాసార్థము వివరించెదను. ఇదివఱలో వివరింపఁబడినవి తిరుగ వివరింపఁబడవలసిన యవసరము లేదు గావున వానిని వదలివేసెదను. తక్కిన వెట్లనఁగా :—

“ మ. సకలామోదకతాళవృత్తగతులన్ సంగీతసాహిత్యనా
యకవిద్యాయుగళంబు పల్కఁజెలికిం బాలిండ్లజోడై సిరుల్
ప్రకటింపన్ నఖరేఖలందు నలఘుప్రస్తారము ల్సేయుస
ర్వకళాకాంతుడు బ్రోవుతం దిరుమలేంద్రశ్రీమహారాయనిన్. ”

వసు ఆశ్వా ౧. పద్య 3.

“ చ. అన విని కేళికాసచివుఁ డాస్వన మల్లన నాలకించి యో
జనవర వల్లకీరవము సంగతిఁ బాడెద రెవ్వరో వినూ

తనగతి నిమ్మహోద్రిపయిఁ దన్కృదుపంచమ పడ్జ శయ్య కొ
య్యన సెలఁగిచ్చె వింటె ప్రమదాకులకోకిలకేకిలోకమున్." ఆశ్వా2 పద్య17.

"సీ. వలుదగుబ్బలు ప్రసేవకవృత్తిఁ దగుగుబ్బ,కాయల కపఁజిచాయ లొసఁగ
లలితాంగుళీదళంబులు సమేళము లైన,సారెలపై రాగసంపద లిడ
పాణికంకణరుతుల్ పాణిణానుబంధంబు, గలతాళగతి కనుగ్రహము లీన
నాలాపభంగి యత్యక్తసంవాదిస,మస్వరంబులకు గ్రామంబు లునుప
గీ. ప్రచురతానామృతముల మూర్ఛనలచేన, చేతనంబులు చేతనరీతిఁ దనర
చేతనంబు లచేతనభాతి నొనర, వీణె వాయించు నొకయలివేణిఁ గంటి."

దీనిలోని విశేషము లావణకు వీణావాద్యముంగూర్చి వర్ణించిన వారిపద్యములంజూచిన గోచరంబు లగు దృష్టాంతమునకు మనుచరిత్రంబునుండి యొకపద్యముం జూపెదను. ఎట్లన్నను:—

"సీ. తతనితంబాభోగధవళాంశుకములోని, యంగదట్టపుకావిరంగువలన
శశికాంతమణిపీఠి జాజువారఁగ కాయ, లుత్తుంగకుచపాళినత్తమిల్ల
తరుణాంగుళీధూతతంత్రీస్వనంబుతో, జిలిబిలిపాట ముద్దులు నటింప
నాలాపగతి సొక్కి యరమోడ్పుకనుదోయి, రతిపారవశ్యవిభ్రమముఁ దెలుప
గీ. ప్రౌఢిఁ బలికించుగీతప్రబంధములకుఁ, గ్రమకరపంకరుహరత్నకటకఝుంఝు
ణధ్వనిస్ఫూర్తి తాళమానములు గొలుప,నింపు దళుకొత్త వీణ వాయింపుచుండె."

"శా. ఆజాబిల్లి వెలుంగువెల్లికల డాయ న్లేక రాకానిశా
రాజశ్రీసఖ మైనమోమునఁ బటాగ్రం బొత్తి యొ త్తి యా
రాజీవానన యేడ్చెఁ గిన్నరవధూరాజత్కరాంభోజకాం
భోజీమేళవిపంచికారవసుధాపూరంబు తోరంబుగాన్." ఆశ్వా 4 పద్యం.5

ఇక్కడ కాంభోజ రాగము జాలిరాగములలోనిది కావున నట్టిసమయమునందు సంగీతసంప్రదాయము ననుసరించి రామభూషణుడు చెప్పెను. ఇట్టి దుఃఖమునే వర్ణించుచు నాంధ్రకవితాపితామహుఁ డొకపద్యముం జెప్పె. ఆపద్యముకును దీనికిం గలభేదముం జూపుటకు దాని నీక్రింద వివరించెదను. ఎట్లన్నను:—

"ఉ. పాటున కింతు లోర్తురె కృపారహితాత్మక నీవు ద్రోచినన్
చ్చోటభవన్నఖాంకురము సోఁకెఁ గనుంగొనుమంచుఁ జూపి యా
ప్పాటలగంధి వేదనెపం బిడి యేడ్చెఁ గలస్వనంబుతో
మీటినఁ గ్రచ్చవిచ్చిచను మిట్టల నశ్రులు చిందఁ బొందగన్."

"సీ. వైణికవల్లకీశ్రేణి నిమ్ముల మీటె, గాయక గాంధర్వగమక రేఖ
గాంధర్వగమక రేఖఁ బరాహతము చేసె, వాంశికవంశికావైభవంబు

వాంశికవంశికావైభవం బెగ నూఁదెఁ, గాళికాధరకరతాళగరిమ
కరతాళగరిమంబు కంచుమించుగ నొత్తె, సానద్ధచటులతూర్యవ్రజంబు
గీ. చటులతూర్యవ్రజం బంటఁ జరచెఁ బరిణ, యాగతదిగంతనృపతినాగాశ్వరథప
దాతికోలాహలంబు రోదసి నఖండ, మగుచు నాదాత్మకబ్రహ్మ మతిశయిల్ల."
ఆశ్వా ౫. ప ౬౯

"చ. అకుటిలసౌమ్యమాననిలయస్ఫురణంబున నాతిమాత్రతా
రకపరివర్తనంబు శుభరాగమిళత్పదపల్లవాంకము
ద్రికయును పెంపు మీఱ నిజదృష్టులఁ బోలినసింధుకన్యకా
ప్రకటవివాహగీతికలు పాడిరి పుణ్యపురంధ్రికామణుల్." ఆశ్వా ౫. ప ౭.

ఇంక నిట్టివే సంగీత సంప్రదాయబోధకము లగుపద్యముల నేకము లుగలవు. గ్రంథవిస్తరభీతిచే వివరింపను.

రామభూషణకవితావిశేషములు.

ఇదివఱకే రామభూషణునికవిత్వములోని కొన్ని పద్యములతో నాంధ్రకవితాపితామహునిపద్యములఁ బోల్చి చూపియున్నాము. ఇప్పు డంతకంటె విశేషించి చూపించవలసినయవసర ముండదు. అయినను ఆంధ్రకవితాపితామహునిమార్గ మవలంబించి కవిత్వము చెప్పినవారిలో నతనితో సమానముగా రసము తెచ్చినవారిలోను కొన్నికొన్ని పట్ల నత నికంటెను విశేషసరసముగాఁ జెప్పినవారిలో నీభట్టురామభూషణుఁడు మొదటివాఁ డని చూపుటకుఁగాను ఆయిర్వురికవిత్వములలో సమాన వర్ణన లున్న కొన్నిపద్యములఁ దెల్పి జూపెదను.

చంద్రవంశకరుం డగుచంద్రునివర్ణనము.

"సీ. కలశపాథోరాశి గర్భవీచిమతల్లి, కడుపార నెవ్వాని గన్నతల్లి
అనలాక్షుఘనజటావనవాటి కెవ్వాఁడు, చన్నె వెట్టునవార్తవంపుబువ్వ
సకలదైవతబుభుక్షాపూర్తి కెవ్వాఁడు, పుట్టు గాననిమేనిమెట్టపంట
కటికిచీఁకటితిండికిరవులగిలిగింత, యెవ్వాఁడు తొగకన్నెనవ్వఁజెనటు
తే. అతఁడు వొగడొందు మధుకైటభారిమఱఁది, కళల నెలవగువాఁడు చుక్కలవిభుఁడు
మిసిమిపరసీమ కలరాజు మేనమామ, వేవెలుంగులదొరజోడు రేవెలుంగు." ఆ౧.ప౧౭

"సీ. జనకక్షేత్రఫలం బయినపాలపాపఁడు, వరవృద్ధిఁ గాంచుజైవాతృకుండు
శ్యామాభిరాముఁడై యమరులేఖాశాలి, రహిఁ గళలవ్యాసుసర్వజ్ఞహాళి

కువలయానందంబుఁ గూర్చుచల్లనిరాజా, తమ మెల్ల నడఁచుసత్పథవిహారి
వసువులు గురియుదివ్యవదాన్యతిలకుండు, లచ్చితోఁ బుట్టినలక్షణాఢ్యుఁ
తే. డంబుజాసనుఁ డన విధుఁ డనఁగ సోముఁ, డన నెసఁడి హంససంగతి నడరఁ సురలఁ
బ్రోవ దాక్షాయణీప్రేమఁ బూనఁ నేర్చు, జాణ చంద్రుండుకాంతిని స్తంద్రుఁడలరు."

ఆశ్వా ౧. ప ౭౧.

"సీ. వదనప్రభూతలావణ్యాంబుసంభూత, కమలంబు లన వీనికన్ను లమరు
నిక్క వీనులతోఁడ నెక్కసక్కెము లాడు, కరణి నున్నవి వీనిఘనభుజములు
సంకల్పసంభవాస్థానపీఠికబోలె, వెడఁద యై కనుపట్టు వీనియురము
ప్రతిఘటించుచిగుళ్లపై నెట్టివారిన, రీతి నున్నవి వీనిమృదుపదములు
తే. నేరకేటియుస ద్దెచ్చి నీరజాప్త, సాన బట్టినరాపాడి చల్లి మెదిపి
పసను సుధ నిడి చేసెనో పద్మభవుఁడు, వీనిఁ గాకున్న గలదె యీమేనికాంతి."

ఆశ్వా ౨. ప 3౪.

"సీ. తలిరుప్రాయమువాని వలరాజు నలరాజు, నలరాజుఁ దెగడుసోయగమువానిఁ
బసిడిచాయలవానిఁ బగడంబు జగడంబు, జగడంబు గలమోవిసొగసువానిఁ
దళుకుఁ జెక్కులవానిఁ దులకింపుపలు కెంపు, పలుకెంపు లోలయు నవ్వులువానిఁ
జికిలిచూపులవాని సిరిమించు దొరయించు, దొరయించు కాంచనాంబరమువాని
తే. సొంపు గలవాని మకుట కేయూర హార, కటక కుండలచాకచక్యములవాని
నమ్మహీజానిఁ గని లేచి యమితవినయ, సంభ్రమము దోఁప నిలిచి రబ్జాతముఖులు."

వసు. ఆశ్వా. 3. ప ౪౬.

### కోడికూఁతను వర్ణించుట.

"మ. సకలాశాగతినర్మకోపవిరతిప్రాతఃక్రియారంభణా
త్మకవర్గత్రయికిన్ మనుచ్చరితశబ్దజ్ఞానమే మూల మిం
తకుఁ బోలన్ వినుఁ డంచుఁ దెల్పుగతిఁ జెంతం గొండపై పల్లెలం
గృకవాకు ల్మొరసెన్ గృహాశోపరిఁ ద్రిభంగిన్ భుగ్నకంఠధ్వనిన్."

మను. ఆశ్వా3. ౫౫

"మ. ఒకనాఁ డింద్రునితుంత వేలుపు మదీయోక్తిన్ విడంబించి తా
నొకకాలం బెటుఁగింప వచ్చి మునిశాపోక్త్యప్రాప్తిపాలయ్యె మా
పుకళ్ళబ్దం బిది యల్పమే త్రిమునిసంభావ్యత్రికాలీవిబో
ధక మన్ రీతిఁ ద్రిభంగిగా మొరసెఁ జెంతన్ దామ్రచూడౌఘముల్."

వసు. ఆశ్వా. ౪. ప ౧౨౬

అని యిట్లు కొన్నిటిని మాత్రమే వివరించినాఁడను. ఇఁక నితర వర్ణనలో సనఁగా స్త్రీశృంగారవర్ణనలో చంద్రాద్యుపాలంభనలలో మన్మథాదివర్ణనలలో నితరము లైనఋతువర్ణన పుష్పలావికావర్ణనాదులలో మనుచరిత్రకారుఁ డూహింపని వర్ణన లనేకము లున్నవి. వానిని గ్రంథము చదివియే తెలియవలెఁగాని వ్రాయ వీలులేదు. హరిశ్చంద్రనలోపాఖ్యానము రాఘవపాండవీయముకంటె మిన్న యై యున్నదనుటకంటె విశేషించి చెప్పను.

## భట్టురామరాజభూషణునిజన్మస్థానాదివిషయము.

దీనింగూర్చి యిదివఱలో నొకరిద్ద ఱొకటిరెండువిధముల వ్రాసియున్నారు. అం దాంధ్రకవిచరిత్రములో నితనిజన్మభూమి భట్టుపల్లె యనియును, ఈగ్రామము కృష్ణదేవరాయలవలనఁ గవిత్వమునందు ప్రవీణు లై ప్రబంధాంకములవా రని బిరు దందినయీతనిపూర్వు లగుభట్టురాజుల కీయఁబడె ననియు, నీగ్రామము బళ్లారి మండలములోని పాలమండలం తాలూకాలో నున్నట్లు కొందఱును, కడపమండలములోని పులివెందలతాలూకాలో నున్నట్లు మఱికొందరు చెప్పినట్లు నున్నది. దీని కాధారము లేమియుం జూపఁబడలేదు.

ఇఁకఁ గృష్ణామండలములోని చోడుకూ రనుగ్రామములో నుండుకొందఱు బట్టుకులస్థులు తాము భట్టుమూర్తి వంశస్థుల మనియు నాతనికాఁపురస్థలము తమగ్రామమే యనియు కొంతకాలముక్రిందట కాకినాడలో నాతోఁ జెప్పియుండిరి. కాని తమకును భట్టుమూర్తికి నెందఱుపురుషులు మధ్యను గలరో ఆవృత్తాంతముగాని వంశవృక్షముంగాని చూపలేరైరి.

భట్టుమూర్తి, రామరాజభూషణుఁడు అనుపేరులు గలపురుషు లొక్కరే యని ప్రప్రథమములో నాతోడ వాదించినవారు వారే. అప్పటిలో అద్వైతవాదమున కనుకూలము లైనచాటుధారలం జదువలేదు. కాని తమదేశమునం దున్నట్లును వానిం బంపెదమనియును నాతోఁ

జెప్పియుండిరి. తిరుగ వారు పిఠాపురము మొదలగుస్థలములకు వచ్చియుం డిరిగాని వారు తెచ్చి యిచ్చెద మనినపద్యములు తెచ్చి యియ్యలేదు. నాఁటనుండియుం గొన్నిచాటుధారలు మాత్ర మచ్చటచ్చట వ్యాపక ములోనికి వచ్చుటఁ జూచుచున్నాఁడను. వానికి కారణము పైబ్రా జులు కావచ్చు నని యోఁచించెదను.

రామభూషణునికథ ముగించుటకుఁ బూర్వ మతనిపినతండ్రికొ డుకై అతఁడే యితఁ డని యూహించి భ్రమ నందించుచున్నభట్టు మూర్తింగూర్చి కొంతవ్రాయుచు నాసందర్భములో రామరాజభూష ణుంగూర్చి మొదట నావలనఁ గవిజీవితము రెండవభాగములో వ్రా యంబడినచారిత్రము పూర్వమువలెనే వక్కాణించి అచట నచట తిరుగ రామభూషణుని కవిత్వశయ్యాదుల నుడివెదను.

## భట్టుమూర్తి.

ఈవఱకుచు మన మల్లసాని పెద్దనచారిత్రములో వ్రాకుచ్చిన భట్టుపేరు మూర్తి. అతనినే జనులు భట్టుమూర్తి యని మూర్తిరా జనియు వాడెదరు. ఇతనివృత్తాంతముం గొంత యిదివఱకే పెద్దనచారి త్రములో వ్రాయంబడినది. ఇతనికిఁ గృష్ణరాయనియాస్థానపండితుఁ డని విశేషవిఖ్యాతి గలదు. ఆరాజకవిని బహుభంగులుగా గారవించి తుదిని తనసింహాసనార్ధమునఁ గూర్చుండఁబెట్టె నని వాడుక గలదు నరసభూపాలీయగ్రంథరచనాకుశలుఁ డితఁడే యని యిదివఱకే చెప్పి యుంటిమి. ఆగ్రంథము కృష్ణరాయునిర్యాణానంతరము మఱికొంత కాల మునకుఁ బుట్టినది.

కృష్ణరాయలకాలములో నీతఁడు గ్రంథము లేమియుఁ జేసినట్లు కాన్పించదు. చాటుపద్యంబులు విశేషంబుగఁ జెప్పియుండె, వసుచరి త్రంబు రచించినవాఁ డీతఁడే యని ప్రసిద్ధి గలదు, దానికి పైరెండుగ్రం థంబుల దృష్టాంతము లేమియు గానరావు. అయిన వసుచరిత్రములో నిజ్ఞాపకలు కొన్ని దీనిలోఁ గాన్పించుటఁజేసియు వసుచరిత్ర కారుఁ డాగ్రం

థంబునఁ దనతండ్రిపేరు స్పష్టీకరింపకుండుటంజేసియు నతఁడును హను మదుపాసనాపరుం డౌటంజేసియు నతఁడే భట్టుమూర్తి యని చెప్పినపల్కులు నిజమా యేమి ? యని తోఁచుచున్నది. గ్రంథంబులు రెండునుం జదువునపుడును మనము వినుచున్నకథంబట్టి యోఁచించునపుడును గొన్నిసంశయములు బుట్టుచున్నవి. మనము వినుచున్నవృత్తాంత మెద్దియనిన భట్టుమూర్తి ముందు వసుచరిత్రంబు రచించి యనంతరము నరసభూపాలీయమును విరచించె నని కాని వసుచరిత్రము రచించినకవియే పిమ్మట దీని రచియించునట్లైన నిందలిశయ్యావిశేషంబులంతకంటెను బ్రౌఢంబుగ నుండవలయు. లేకున్న దానికి సమానంబుగనైన నుండవలయును. అటుగాక న్యూనం బగుటకుఁ గారణం బేమి యని యూహింపవలసియున్నది. ఇట్టిభేదంబులు రెండుగ్రంథములలోనికొన్నికొన్ని పద్యంబులు గైకొని వాటిరసపుష్టిం బరీక్షించిన స్పష్టంబు లగు. ఇంతియకాక వసుచరిత్రకారుఁడు తనకు మూర్తి యనునామాంతర మున్నట్లు చెప్పెఁడు. నరసభూపాలీయకారుండును తనకు రామభూషణనామ మున్నట్లు జెప్పియుండలేదు. నామాంతర మున్నయెడల నెట్టిప్రగ్గడయుంబోలె దానిని వివరింపక మానఁడు, వసుచరిత్రంబు రచించినయనంతరము రామభూషణునకు సాహిత్యరసపోషణుఁ డని బిరుదు కల్గెను. అట్టి బిరుదునే మఱియొకగ్రంథంబు విరచించుతఱిఁ గవి యొకఁడైన తప్పక నుడువును. అట్లు నరసభూపాలీయంబునందు లేదు. ఈయిరువురుకవులకు సాహిత్యవిషయంబు లైనకొన్నిప్రజ్ఞలు సమానములుగఁ జెప్పఁబడియె. వసుచరిత్రకారుఁడు సంగీతకళారహస్యనిధి. ఇతఁడే వీణియలకు మెట్లు కల్పించినాఁ డని యున్నది. దీనింగూర్చి మఱియొకస్థలములో వివరించుట యైనది అట్లైన నీతండు పుంభావసరస్వతి యని చెప్పవలదా ? అగును కాకున్న నితనికి సంగీతసాహిత్యపాండిత్యబు గలదు? ఇంతియకాక యాశ్వాసాంతంబుల నీయిర్వురిప్రజ్ఞలు వేఱ్వేఱుగ నున్నట్లు చెప్పంబడియె. ఇట్లుండ నీయి

ద్వారు నొక్కరే యని చెప్పుటకు మిక్కిలి సంశయంబు గల్గుచున్నది. ఇట్టిసంశయములు నివారింపఁబడుటకు నీగ్రంథంబులుగాక యింకొక గ్రంథ సహాయంబు గావలసివచ్చెను. ఈవిషయమున మనము యుక్తిచే దీని సాధించినను గ్రంథదృష్టాంతముగూడఁ జూపిన మేలై యుండు నని భట్టుమూర్తిచే రచియింపఁబడె నను గ్రంథంబులఁగూర్చి యత్నంబు సేయఁ జిరకాలంబునకుఁ దాళపత్త్రిగ్రంథం బొకటి "హరిశ్చంద్రనలో పాఖ్యానంబు" అనుద్వ్యర్థికావ్యంబు సంప్రాప్తం బయ్యె. దానియా శ్వాసాంతగద్యలఁ బరికించుచో వసుచరిత్రంబున నున్నట్లే కాన్పించె. అపుడు కొంత మనంబున సందియ సందైన రామభూషణుఁడు తండ్రిపేరు చెప్ప కుండునా యని యూహించి గ్రంథానుక్రమణికం జూడ నీక్రిందిపద్యం బున్నయది. దానిచే మనసంశయంబు లన్నియు నివారింపఁబడియె. ఆపద్యం బెద్దియనిన ;—

"సీ. వనధిలంఘనకృపావార్ధిరితోఽధియకవి, తాకశౌరత్నరత్నాకరుండ
సకల కర్ణాట రక్షాధురంధర రామ, విభు దత్త శుభచిహ్న విభవయుతుఁడ
వసుచరిత్రాది కావ్యప్రీత బహునృప, ప్రాపితానేకరత్నప్లవుండ
శాశ్వత శ్రీవేంకటేశ్వరానుగ్రహ, నిరుపాధికైశ్వర్యనిత్యయశుఁడ
గీ. శ్రీ మహాప్రబంధాంక సింగరాజ, తిమ్మరాజ ప్రియతనూజ ధీరసూర
పాత్మజుఁడ రామభూషాఖ్యఁ బరఁగుసుకవి, నంకితము సేసెద నీకావ్యమనఘభక్తి"

దీనిచే నీతనివంశంబు దెలసె. ఇఁక భట్టుమూర్తివంశంబు దె ల్పుపద్యంబు నిట వివరింతము.

గీ. అమితయమకాశుధీప్రబంధాంకసింగ, రాజసుతతిమ్మరాజపుత్త్రిప్రసిద్ధ
నరసవేంకటరాయభూషణసుపుత్త్రి, నను బుధవిధేయ శుభమూర్తినామధేయు.

ఇపు డీరెండుపద్యంబులంబట్టి చూడ నీయిద్దరకు మూలపురు షుం డొక్కం డనియు నీయిద్దఱుఁ బినతండ్రి పెదతండ్రి కుమారు లని యు స్పష్టం బయ్యె. ఇట్టి వృత్తాంతం బే మఱియును స్పష్టం బగునటుల నీక్రిందివంశవృక్షముం జూపెదను.

(ప్రబంధాంక సింగరాజు.)

|

(తిమ్మరాజు.)

|

వేంకటరాయభూషణుఁడు. | నూరపరాజు.

భట్టుమూర్తి. | రామరాజభూషణుఁడు

దీనిచేత మనము భట్టుమూర్తి రామరాజు కాఁడని రూఢంబుగాఁ దెల్పితిమి.

వసుచరిత్రములో రామరాజభూషణుఁడు స్మార్తులు గ్రంథారంభము చేసినట్లే కృతిపద్యంబులలో నీశ్వరత్రయమును శక్తిత్రయమును గజాననుఁ నుతియించె. ఇతఁ డాంజనేయోపాసకుం డగుటంజేసి యాంజనేయస్తోత్రమును జేసి సంస్కృతమహాకవుల నుతియించి తనకుఁ బూర్వులగు నాంధ్రకవుల నీక్రిందివిధంబున నుతియించెను.

మ. మహిమున్ వాగనుశాసనుండు సృజియింపం గుండలీంద్రుండు త
న్మహనీయస్థితిమూలమై నిలువ శ్రీనాథుండు బ్రోవన్మహా
మహులై సోముఁడు భాస్కరుండు వెలయింపన్ సొంపువాటించు నీ
బహుళాంధ్రోక్తిమయప్రపంచమునఁదత్ప్రాగల్భ్యమూహించెదన్. ఆశ్వా. ౧. ప. ౧౧౦.

దీనింబట్టి రామభూషణునకుఁ బూర్వులు ౧ నన్నయభట్టు ౨ తిక్కనసోమయాజి ౩ శ్రీనాథుడు ౪ సోముఁడు (నాచనసోముఁడు) ౫ భాస్కరుఁడు (మల్లికార్జునభాస్కరుఁడు) మొదలగువారై యున్నారు. ఇతఁడు తనకృతిపతి యగుతిరుమలరాయని వర్ణించి యొకపద్యమున నతనిబిరుదంబులం దెల్పుచు నొకవచనంబును చెప్పెను. బిరుదంబు లున్న వచనము దేశచారిత్రములోఁ జేర్చెదనుగావున నిపుడు పద్యముమాత్రము కృతిపతి గౌరవాదికము సంగ్రహముగాఁ దెలియుట కిట వివరించెదను-

“సీ. వసుమతీభారధూర్వహత యెవ్వనియుర్వ, రావణాహంకృ మర్దము వహించు
కరగతచక్రవిక్రమశక్తి యెవ్వాని, రామానుజత్వంబు రమణఁ గైకొ
త్తీర్ణకర్ణాటలక్ష్మీపునస్సృష్టి యె, వ్వానిలో కేశ్వరత్వము ఘటించుఁ
జటులశార్వరమగ్న సర్వవర్ణోద్ధార, పటిమ యెవ్వని రాజభావ మెసఁగు

తే. అతఁడు వీరప్రతాపరాజాధిరాజ, రాజపరమేశ్వరాష్టదిగ్రాజకులమ
నోభయంకరబిరుదసన్నుతజయాభి, రామగుణహారి తిరుమలరాయశౌరి. ఆ౧. ప౧౩

అనుదీనిం బట్టి చూడ నీతిరుమలరాయనికి భూవరాహలాంఛనమును, జీర్ణకర్ణాటరాజ్య పునరుజ్జీవనబిరుదమును వీరప్రతాప రాజాధిరాజ రాజపరమేశ్వర రాష్టదిగ్రాజకులమనోభయంకరబిరుదులు గలవని తేలును.

ఈ తిరుమలరాయఁడు సింహాసనాసీనుండై యుండె నని తత్సింహాసనవిభవము రామభూషణునిచే నీక్రిందివిధంబున వర్ణింపఁబడియె. ఎట్లన్నను:—

సీ. కటకేంద్రుఁ డంపినగంధసింధురములా, త్మస్వామిమాఱు హస్తములు మొగుప
హయనాథుఁ డంపినహరులు కైజామోర, లాస్చుచుఁ బతికి జోహారు సేయ
నావాడపతి పంపినయమూల్యకటకముల్, కర్తపేరుగఁ బదాగ్రములఁ బెనగ
బాండ్యేశుఁ డంపినభర్మంబు లధిపతి, ప్రతిగా నిజాంకముద్రలు వహింప
తే. శౌర్యకీర్తులలో వచ్చుసకలదిక్కు, లేంద్రరాజ్యేందిరలమాడ్కి నిగురుబోండ్లు
చటులమాణిక్యమయదండచారుచామ, రములు వీవంగఁ జేరోలగమున నుండి.
ఆశ్వా.౧. ప౧౫

ఈపద్యమువలన గజపతియు నశ్వపతియు నీయిద్దఱితనిం గొల్చి యుండి రనియు నావాడపతియును, పాండ్యదేశాధిపుఁడును ఇతనికి పన్నుల నిచ్చువా రనియుఁ దేలినది. పైపద్యమున అశ్వపతి గజపతులం జెప్పి నరపతి నేల చెప్పలేదనుశంక వొడమును. ఇతఁడు నరపతియే గావున నాపే రిట వదలివేయఁబడియెను. కృష్ణరాయ లీమూఁడువంశములలోఁ జేరనివాఁ డగుటచే నతనికి మూరురాయరగండఁ డను పేరు చెల్లఁగల్గెను.

రామభూషణుండు తిరుమలరాయఁడు సింహాసనాసీనుఁడై యుండి తనకు వర్తమానంబు పంపె నని యాక్రిందిపద్యములోఁ జెప్పుచున్నాఁడు :—

ఉ. నను శ్రీరామపదారవిందభజనానందుఁ జగత్ప్రాణనం
దనకారుణ్యకటాక్షలబ్ధకవితాధారాసుధారాశిసం
జనితైకైకదినప్రబంధఘటికాసద్యశ్శతగ్రంథక
ల్పను సంగీతకళారహస్యనిధిఁ బిల్వం బంచి పల్కెన్ గృపన్. ఆశ్వా౧. ప ౧౬

అను నీపద్యమువలన రామరాజభూషణుఁడు శ్రీరామ ఆంజనే యోపాసకుడనియు, ఏకదినప్రబంధఘటనానమర్థుఁ డనియును, సద్యః కాలమున నూఱుగ్రంథము లనఁగా ననుష్టుప్పులు చెప్పఁగల డనియును, సంగీత శాస్త్రి రహస్య వేది యనియుం దేలినది. ఇంతియకాక ఆశ్వా సాంతగద్యమువలన నీతఁడు సంస్కృతాంధ్రిభాషాసామ్రాజ్యసర్వంక షుఁ డనియును, చతుర్విధకవితానిర్వాహకుఁ డనియు, సాహిత్యరసపో షణుఁ డనియును దేలుచున్నది.

కాని వీర లిర్వురు కృష్ణరాయల కన్నఁ బిన్నలగు రాజులఁ గృతిపతు లఁ జేయుటకుఁ గారణంబు న డువమైతిమి. దానిఁగూడ వివరించినపిమ్మ ట వీరివ్యాపారాదుల వ్రాయవచ్చును. మన మీావఱకే రామభూషణా దులు కృష్ణరాయలకాలంబునఁ బిన్నవయసున నున్నవా రని తెల్పితిమి. వా రందఱు నాతనియనంతరము తత్సింహాసనము నధిష్ఠించినరాజుల కడ మిగులఁ బ్రబలి గ్రంథంబుల రచియించిరి. కృష్ణరాయలయనంతర ము జరిగినవృత్తాంతము కొంత తెలిపి పిమ్మట నీగ్రంథోత్పత్తులంగూ ర్చి వ్రాసెదము.

కృష్ణరాయలు శా. సం. ౧౪౫౧ మృతినొందెను. అపుడు త త్సింహాసనము కృష్ణరాయుని యన్నకొడుకగునచ్యుతరాయునిచేఁ దీసి కొనంబడియె. ఈతనికి సల్కుయతిమ్మన యనుకృష్ణరాయసేనాని సహా యం బొనరించెను. ఈయచ్యుతరాయఁడు నాలుగైదువత్సరములు రా జ్యంబు సేసి తుదిఁ దురుష్కులతోఁ బోరి కాలగతిం జెందె. అపు డాత నిపుత్త్రిని నీతిమ్మరాజు సింహాసన మెక్కించె. ఈబుడుతఁడు పదివత్సరం బులవాఁడై యుండుటంజేసి యాతిమ్మరాజు వానిం దనపోషణలోనుంచి

కొని తానే రాజ్యంబు చేయుచుండెను. ఇట్లు కొన్నిదినంబు లుండి యా సంస్థానంబునకుఁ దానె ప్రభుండై యుండ మదిఁ గోరి తనసంరక్షణమున నున్న సదాశివరాయునికి విషప్రయోగంబు సేయించె. ఇట్టి ద్రోహకార్యంబు చేసి తా రాజ్యంబు జేయఁదలంచిన నది దైవంబునకు సమ్మతంబు కాదయ్యె. కావున నీతని సంహరింపఁ దగు నుపాయంబు లూహింపఁబడియెను:—

రాష్ట్రంబులోని జనులందఱుఁ గృష్ణరాయనియల్లుం డగునళియ శ్రీరామరాజును సింహాసనం బధిరోహింపుఁ డనియు, దాము సహాయ మొనర్చెద మనియుఁ బ్రార్థించిరి. ఈ రాజు కృష్ణరాయుని యనంతరమే రాజ్యమునకు రా నిశ్చయించి యుండఁగా సల్కయతిమ్మరాజు విఘ్నంబు కల్పించి యచ్యుతరాయునికి రాజ్యమిచ్చెను. ఈ రామరాజునకుఁ బట్టాభిషేక కాలంబునఁ గల్గిన విఘ్నంబు సూచించి వసుచరిత్రంబున నొక పద్యంబు చెప్పఁబడియెను. అది యెట్లనిన :—

సీ. పట్టాభిషేకవిపర్యయంబునఁ బోరిలు, వెడలి ప్రియానుజా ర్వెంటఁ గొలువఁ
జిత్రకూటాభిఖ్యఁ జెలఁగుఁ బెన్గొండసాం, ద్రహరిద్విపేంద్రనా దవనిఁ జెంది
ఖలజనస్థానవాసులఁ బల్వురవధించి, మహిమ సలకఖరస్మయ మణఁచి
హరివీరభటమహోద్ధతి నబ్ధి గంపింప, దురమునఁ గదిసి తద్ద్రోహిఁ దునిమి
గీ. యనఘతరపార్థివేందిర నధిగమించి, సాధుకర్ణాటవిభవసంస్థాపనంబు
పూని శరణాగతుల నెల్లఁ బ్రోచె రాముఁ, డతఁడు నిజచరితంబు రామాయణముగ.

(ఆశ్వా-1. ప 44.)

ఈ వృత్తాంతమునే నరసభూపాలీయంబునం గూడఁ జూడనగు. ఆ కవియు నీతని పేరు చెప్పి యుండుటకుఁ గారణంబు కలదు. దాని ముందు వివరింతము. ఈ రామరాజు సల్కయ తిమ్మని జయించి యింకఁ గొన్ని దేశములు స్వాధీనము చేసికొనినట్లు నరసభూపాలీయమున నున్నది

సీ. ఖలు నతిద్రోహు సల్కయతిమ్మని హరించి, సకలకర్ణాటదేశంబు నిల్పె
నతని వర్ధితునిఁ దత్సుతునిఁ బట్టము గట్టి, కుతుపనమల్కున క్షోణి నిలిపె
పడిలుఁ డై రాచూరుముదిగల్లు కప్పంబు, నేయఁ గాంచి సపాదుసీమ నిలిపె
శర ణన్న మల్కనిజామున కభయం బొ, సఁగి తదీయరాజ్యంబు నిలిపె

గీ. నవనియంతయు గాను రాజ్యంబుజేసె, తనగుణంబులు కవికల్పితములు గాఁగ
నలవియె రచింపసత్కావ్యములను వెలయ, భూమి నొక రాజమాత్రుండె రామవిభుఁడు.

ఈ రామరాజు కృష్ణరాయలయల్లుఁడై నందులకును సదాశివ రాయనిరాజ్యంబు నందినందులకును రామాభ్యుదయమునందలిపద్యము.

ఉ. ఆపటుకీర్తి రామవసుధాధిపచంద్రుఁడు కృష్ణరాయధా
త్రీపతిసార్వభౌమసుహితప్రియుఁడై వితతప్రతాపసం
తాపితశత్రుఁడై యలసదాశివరాయనిరంతరాయ
విద్యాపురరాజ్యలక్ష్మికి నిదానము తా నయి మించె నెంతయున్.

ఇట్లు పైనఁ జెప్పఁబడిన మూఁడుగ్రంథంబుల నీయళియరామ రాజు చెప్పఁబడుటకుఁ గారణం బేమనిన :—

వసుచరిత్రకృతి నాయకుఁ డీతనితమ్ముఁడు. రామాభ్యుదయ నరసభూపాలీయ కృతిపతు లితని మేనల్లుండ్రు. వారివారివంశంబులు నుతింపఁబడుచో వంశశ్రేష్ఠుం డగునీతఁడు మిగుల వర్ణింపఁబడియెను. వీరి వంశవృక్షంబున వీరిసంబంధంబులఁ దెలుపుచున్నాఁడను.

చంద్రవంశము.

తాత పిన్నమరాజు.

అర్వీటి బుక్కశౌరి.

రామరాజు 1.

తిమ్మరాజు. కొండశౌరి. శ్రీరంగరాజు.

| | | | |
|---|---|---|---|
| కృష్ణరాయని యల్లుఁడు రామరాజు. | వసుచరిత్ర కృతిపతి. తిరుమలరాజు. | నరసభూపాలీయ కృతిపతి యగు నహోబలనరస రాజుతల్లి లక్కమ్మ | రామాభ్యుదయ కృతిపతి యగు గొబ్బూరినరస రాజుతల్లి ఓబమ్మ. |

ఇతఁడు కొంతకాలంబు రాజ్యంబు చేసి కాలపరిపాకంబు నందెను. ఈతనియనంతర మీతనితమ్ముం డగుతిరుమలదేవరాయఁడు సింహాసనం

బునకు వచ్చెను. ఇతఁడే వసుచరిత్రను కృతినందినరసికుండు. ఈవృత్తాంతంబు స్పష్టపఱుచు వసుచరిత్రంబులోని పద్యము.—

క. ఆరామశౌరిపిమ్మట, ధీరాముఁ శాఖి వీరతిరుమలరాయం
డా రామసేతుహిమవత్, క్ష్మారమణీరమణుఁ డై జగంబు భరించెన్.

అశ్వా ౧. ౫౫.

ఇతని చెల్లె లైనలక్కమాంబకుఁ బుత్రుం డైనయహోబల నరస భూపాలుఁ డితనికి మంత్రిగ నుండియుండెను. రామభూషణుఁడు మేన మామపేర వసుచరిత్రంబును, భట్టుమూర్తి మేనల్లునిపేర నరసభూపాలీయంబును రచియించిరి. ఇంతవఱకు తెనాలిరామకృష్ణుం డున్నట్లు మనకు దృష్టాంతము లున్నవి. అతనిపాండురంగవిజయంబు నీకాలంబు నాఁటిదే. ఈకాలంబులోనివసుచరిత్రంబుఁ జూచి యాముక్తమాల్యద రచియింపఁబడె నని చెప్పుటకంటె వింత యింకొకటి గలదే. ఈతిరుమల రాయనితో రామభూషణ రామలింగములనామంబు లంతరించెను. తిరుమలరాయనియనంతరము వేంకటాద్రి యను శ్రీరామరాజు రెండవతమ్ముఁడు రాజ్యమునకు వచ్చెను. అతనికడ నోబమాంబ యనురెండవ సహోదరికుమారు లగుగోబ్బూరినరసరాజును జగ్గరాజును మంత్రులు. అందు రామాభ్యుదయంబు గోబ్బూరినరసరాజుపేరిట రచియింపఁ బడెను. దీని రచియించినవాఁడు అయ్యలరాజు. రామభద్రకవి, ఇతనితోఁగూడ భట్టుమూర్తి యున్నట్లు మనకు నిదర్శనంబులు గాన్పించెను. కృతిపతులకుఁ గలసంబంధంబులును కవులజీవితకాలంబులను వ్రాసుచ్చితిమిగావున నిఁక వీరిగ్రంథవిశేషంబులు వ్రాయంజనును.

## వసుచరిత్రమునకుఁ గల్గినవిఘ్నము.

(౧) రామభూషణుఁడు వసుచరిత్రమును గృష్ణరాయనికాలంబున రచియించినట్లును దాని నతఁడు కృతినందకుండ రామకృష్ణుం డంతరాయంబు కల్పించినట్లును పిమ్మట రామభూషణుఁడు దాని నెంతయుఁ బ్రార్థింప నతఁడు రాజుకడకుం జని యొకయుపాయంబు సెప్పెద నని దాని మృతు లగునితరవంశీయులకుఁ గృతి నొప్పించి పిమ్మట దానిఁ బిం

డంబులపై ధారవోయించె ననియు వాడుక గలదు. దీనిచే వసుచరిత్ర కృతినాయకుం డగుతిరుమలరాయండు కృష్ణరాయలకుం బూర్వంబే మృతి నొందినట్లు తేలుచున్నది. ఈరాజు కృష్ణరాయలకుఁ బూర్వుండు కాఁడనియును గృష్ణరాయని యనంతరము రాజ్యము చేసిన యళియ రామరాజుతమ్ముఁ డనియు నీకతకే మనము చెప్పియుంటిమి. కాఁబట్టి కృష్ణరాయలకంటెను వసుచరిత్రకృతిపతి పూర్వమే మృతి నొందె నను ట యెట్లు సరి యగును.

(౨) ఒకవేళఁ గృష్ణరాయలకాలంబున నీవిఘ్నంబు వచ్చుటంజేసి రామభూషణుం డపుడు దీనిం బ్రకటింపక కాలాంతరమునఁ దిరుమలరాయనికిఁ గృతియిచ్చె నని యోఁచింతము. అట్లయినఁ దొల్లి తనకు నప యశస్సుఁ దెచ్చిన "శ్రీభూపుత్త్రి వివాహవేళ" అను కృతిముఖ పద్యంబు మార్చి దీని రామభూషణుఁ డొరులకుఁ జూపునుగాని తనత ప్పుం జెప్పుపద్యంబుమాత్ర మందుంచి కడమపద్యంబులు కృతిముఖంబున మార్పఁడుగద. కావున నిదియు సెన్నయై యుండలేదు.

(3) కృష్ణరాయని యనంతరము తత్సింహాసనాసీనుం డగునీతిరుమల రాయనికడ రామలింగము మొదలగుకవు లున్నారు. కావున న ప్పుడే యీగ్రంథంబు రచియించి తేఁ గని రామలింగ మాక్షేపించినాఁ డని యూహింతము. అట్లయిన నిది మృతు లగునితరవంశీయులకు నీఁ బడియె ననుమాటయుఁ, దీఁ బిండంబులపై ధారవోయించె ననుమా టయు బూటకమే యని చెప్పవలయును. ఈవృత్తాంతము కల్పిత మని చెప్పుటయే నిజముగఁ గాన్పించును. రామకృష్ణుండు తొంటియాక్షే పణముఁ జేసియుండిన నుండుగాక. రాజు నాఁడుగాకున్న మఱునాఁడైన రామలింగనిచేష్ట లవి యని యూహించి మరల గ్రంథమును దనంతట తానే వినకుండునా. కావున నీకథ నెంతమాత్రమును నమ్ముట న్యా యముగాఁ గాన్పించకున్నయది.

## బట్టుమూర్తి తిమ్మరసుపైఁ గోపించుట

ఇదివఱలో నేను వివరించియున్న మోదుకూరి కాఁపురస్థులగు భట్రాజులు "ద్వాత్రింశన్మంత్రులచరిత్రము" అనుగ్రంథములో నీభట్టుమూర్తిప్రతాప మున్నట్లుగాఁ జెప్పి దానిని సూచించుటకుఁగాను ఈగ్రంథమంతయుఁ బీఠాపురములో నుండు బ్ర. పెద్దాడ. చిట్టిరామయ్యనాము లగునామాతామహజ్ఞాతుల కొసంగిరి. దానిని వా రచ్చువేయించి ప్రకటించిరి. అందులో నీభట్టుమూర్తిప్రతాప మున్నను అది ద్వాత్రింశన్మంత్రి ప్రతాపములున్నట్లు మనదేశములో మిక్కిలి విఖ్యాతి నందిన కృష్ణదేవరాయసార్వభౌముని ప్రసిద్ధప్రధానమంత్రి యగుతిమ్మరసుమంత్రిప్రతాప మందు లేదుగావున నందలిభట్టుమూర్తికథలు కల్పితములని యూహించవలసియున్నది. తిమ్మరసు వృత్తాంతము వేఱుచారిత్రముగా వ్రాసియుంటినిగనుక నిపు డీమంత్రిచరిత్రములో వ్రాయంబడిన భట్టుమూర్తి ప్రతాపమునే యిందుఁ బొందుపఱిచెదను. "కథకు కాళ్లును, ముంతకుఁ జెవులును లే" వని యున్నది. గావున పుక్కిటిపురాణము లెవరి వెవరి కదికిన నదుకవచ్చును. కావున నే నీవఱకు రామలింగముచరిత్రములోఁ జెప్పినభట్టుమూర్తిపద్యము రామలింగముపద్యమని చెప్పెడుదానికి సంశయింపం బనిలేదు. ఏదియైన నున్న నది పాఠాంతర మని యూహించుట మంచిది. అదియెట్లున్నదనఁగా:—

## ౨౧ మంత్రి యగుతిమ్మరసుకథ.

"భట్టుమూర్తికి కిక్కరెట్టింప పచ్చలహార మర్పించె తిమ్మరసుమాళి."

ఈయన రాయలవారియొద్ద ముఖ్యప్రధానుఁడు. తిమ్మరసను పేరుగలవాఁడు. బహుబుద్ధిశాలి. ఈయనను రాయలు బిత్రుసముఁ డని యప్పాజీ యని పిలుచుంగావున నప్పాజీ యనియుంగూడ నామంబు గలదు. ఈయన సర్వాధ్యక్షుండుగా రాయలవారియొద్ద నుండునపుడు భట్టుమూర్తి యెన్నండును కైవారంబు సేయకుండుటచే మనంబున నించుక మత్సరంబు గలవాఁడై యుండి యాకవికి నెప్పుడు వంచనము గావించెద

నాయని యూహించుచుండఁ బెద్దన్న, రామలింగము మొదలగువారును తాము రాజాస్థానమున దిగువం గూర్చుండియుండ, మూర్తికవి రాజుతో నర్ధసింహాసనారూఢుం డై యుండు నని యెంతయు చింతచేఁ గుందుచు నొకసమయమున నీతిని కెత్తిఁగింప నతఁడును మీర లూరక యుందురు. ఏ నేమిసేతు. మీర లాతనిఁ గ్రిందికి డించుయత్నంబు జేసిన నేనును సహాయభూతుండ నయ్యెదనని వక్కాణించెను. ఇటులుండ నొక్క నాఁడు రాయల సంభాషణంబున రామలింగము వారింగూర్చి యొకపద్య మిటుల జెప్పెను:

క. నరసింహకృష్ణరాయని, కర మరు దగుకీర్తి వెలసె కరిభిద్గిరిభి
త్కరికరిభిద్గిరిగిరిభిత్కరిభి, ద్గిరిభిత్తురంగకమనీయం బై.

అని చెప్ప నందఱు నానందింప భట్టుమూర్తి యూరకుండిన, నేమి యూరకుండితి వీపద్యం బెటులుండె ననవుడు నందఱకుం బాగుగా నుండ నాకుం బాగుగాదే యనఁ దిమ్మర సిది యేమో శ్లేషగాఁ బలుక నోవు నన రామలింగ మిది బాగుండకుండిన నీతకు బాగుగా నీవు జెప్పిన నాసింహాసనంబునం గూర్చుండుము. లేనియెడ దిగు మనఁ దిమ్మరసు ఔను రామలింగముమాట బాగుగా నుండె నన నవుడు భట్టుమూర్తి యాగ్రహించి నన్ను సింహాసనంబు డిగు మని తిమ్మరసు పలుకుంగాన యిదిగో తిమ్మరసును నిన్నుగూడఁ దిట్టెద నని వక్కాణించుచుఁ రాయలంగూర్చి జెప్పినపద్యము :—

ఉ. లొట్ట యిదేటిమాట వెనలోభులతో మొగమాట మేల తాఁ
గుట్టకయున్న వృశ్చికముఁ గుమ్మరపుర్వని యందురే కదా
పట్టపురాజుపట్టిసరిపల్లె సరాసరి యియ్యకున్న నేఁ
దిట్టకమాన నామతము తీవ్రమహోగ్రభయంకరంబుగాఁ
దిట్టితిజా మహోగ్రగహమత్తెజ మకరగ్రాహజర్జరీభటా
పట్టపుదట్టఘోలఫణిభర్తృజహాకృతపట్టసుఫ్కటా
ఘట్టనఘట్టణాలకవి ఘట్టకనిర్గళ రాజభృత్యకీ
చట్టచటార్భటీనయనజర్జరకీలలు రాలఁగావలెజా

జొట్టతికంబునం, బొగడఁ జూచితినా రజతాద్ర్యధిత్యకా
పట్టణమధ్యరంగగతభవ్యనభూవదనానుషంగసం
ఘట్టశిరస్థగాంగఝరహల్లకజాలసుధాతరంగముల్
చుట్టుకొనన్ వెలెన్ భువనచోద్యముగా భయదంబుగా మతిం
దిట్టితినా సభాభవనధీంకృతిభీమనృసింహరాడ్ధ్వజా
తాట్టమహాట్టహాసచతురాస్య సముద్భ్రుకుటీతటీనటీ
కోట్టణరోమజాలహృతకుంఠితకంఠగభీరనాదసం
ఘట్టవిజృంభమాణగతిఁ గావలె దీవనపద్య మిచ్చి చే
పట్టితినా మణీకనకభాజనభూషణభాసురాంబరా
రట్టతురంగగంధగజరాజనమూల్యఘనాతపత్రభూ.
పట్టణభర్మహార్మ్యభటపంక్తి చిరాయు వనామయంబు నై
గట్టిగ తోడుతో వెలయఁగావలె నెక్కువఠీవిఁ జూడఁడీ
యట్టిటు మందె మేలముల నందఱినింబలెఁ జొక్కఁ జూచి యే
పట్టున నైన కేరడము వల్కఁడుఁడీ పయివచ్చు నంతలన్
గొట్టుము మహ్కవిద్విరదకోటుల బంచముఖోద్భటాకృతిం
బెట్టుము దండముల్ సుకవిబృందము కే నతిభక్తి సారెకున్
గట్టితి ముల్లె లేఁబదివేలుఁ గాఁగలనూటపదాఱు లెమ్యెడన్
రట్టడి భట్టుమూర్తికవిరాయనిమార్గ మెఱుంగఁ జెప్పితిన్.

అని యాగ్రహించిన రాయ లీబ్రాహ్మణు లొనరించు నీదురాలోచన నే నెఱుంగ. నీయాన. నన్నేల తిట్టెద వని యనర్ఘ్యబహుమానం బొసర్చి గాఢాలింగనంబు గావించిన సంతసించుచు భట్టుమూర్తి రాయలమీఁదఁ జెప్పినపద్యము.

ప. అబ్జముఖీమనోజ నరపాధిపనందన కృష్ణ నీయశం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీపరాక్రమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీవితీర్ణిమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము చిత్ర మిద్ధరన్. *

* ఈపద్యము పంచపాషాణము లని ప్రసిద్ధిం జెందినవైయెమపద్యములలో నొక్కటి. దీనికిని తక్కినవానిలింటికిని వ్యాఖ్యానమున్నచోఁ బాఠకుల కుపయుక్త మని యాచరిత్రాంతమందు వానివ్యాఖ్యం బ్రకటించెదను. తక్కినవి నాల్గుపద్యములుకూడ మూర్తికవి వని యూహింపఁగూడదు. వానికవులు ప్రత్యేకముగా నున్నారు ఆపద్యము లిది కఱలో నొక్కటి కొఱఁతగాఁ దక్కినవాని నుదాహరించియే యున్నారు.

అని స్తుతించిన నది రామలింగనిపద్యముకంటె బాగుగా నున్న దని పెద్దన మొదలగుకవులు సంతసించిన రాజు గారవించెను. అప్పుడు భట్టుమూర్తి తిమ్మరసుం జూచి రాజీదు రాలోచనంబు గానఁడు. నీపాత్రత్వాహంబున కవులీవిమ మాలోచనంబు గావించిరి. నేను నీకు కైవారంబొసంగకుండుట కారణంబుగా వీరిం బురస్కరించుకొని నన్ను వంచింపంజూచితివైనను నీవృత్తాంతంబు జెప్పెద వినుమని చెప్పినపద్యము.

"శా. గుత్తిం బుల్లెలు గుట్టి చంద్రగిరిలోఁ గూడెత్తి పెన్గొండలో
హత్తికా సత్త్రిమునందు వెండిబలుదుర్గాధీశుతాంబూలపుం
దిత్తు ల్లోక్కసి పదస్థు లైనఘనులం దీవించ............"

అని మూఁడుచరణములు జెప్పవఱకు తిమ్మరసు దుష్కీర్తిభీతుండై రాయలవారు తాఁబట్టాభిషేకంబు నొనర్చుకొనునప్పు డిచ్చిన యమూల్యం బగుగారుత్మతరత్నహారంబు కవికంఠంబున నలంకరించిన పూర్తి జేసిననాలవచరణము.

" దీవించెదన్
మత్తారాతియయాతినాగమనుతున్ మంత్రీశ్వరున్ దిమ్మరున్."

అని దీవించి మఱియును రచించినపద్యము.—

క. అయ్యా యనిపించుకొంటివి, యయ్యంబునఁ గృష్ణరాయనృపపుంగవుచే
నయ్యా నీసరి యేరీ తియ్యనివిలుకాఁడ వయ్య తిమ్మరసయ్యా.

అని కైవారం బొనర్చిన నత్యంతకౌతూహలం బొంది యది మొదలు నఖ్యంబుగా నుండి నిరంతరైశ్వర్యంబు లనుభవించుచుండెనని యున్నది.

(1) భట్టుమూర్తి ంగూర్చి మఱికొందఱు వ్రాసినచరిత్ర విషయము.

ఈభట్టుమూర్తింగూర్చి. "Dekkan Poets" అనుగ్రంథములో నొకకొంతగ్రంథము వ్రాయంబడియున్నది. అదియాంగ్లేయభాషయం దుండుటచేత దాని నస్లే యిందుఁ బొందుపఱిచి యాకవి చెప్పినపొరపాటుల నక్కడక్కడ సవరించెదను. ఈగ్రంథము

---

BHATTU MURTI.

(1) This poet was born in a village called Bhattu Palla in the district of Pulivendle, in the Ceded Districts; he was a distinguished orator, and possessed a critical knowledge of the Sanscrit & Telugu dialects. As the poets of his time were greatly patronized by the

లోను భట్టుమూర్తి కృష్ణదేవరాయలకాలములోనివాఁడని పైద్వాత్రింశన్మంత్రి చరిత్రములోవలెనే వ్రాసియున్నది. అందులో నీతఁడు కృష్ణదేవరాయని యాస్థానాష్టదిగ్గజములలో నొకండుగా నున్నట్లును, కృష్ణదేవరాయలు జీవించియుండఁగా నితఁడు నరసభూపాలీయగ్రంథమును రచియించినట్లుం జెప్పెను. ఇతఁడును. (Rev. Taylor) దొరవలె నీనరసభూపాలీయము కృష్ణదేవరాయల తండ్రియగు నరసరాజుపై రచియించియుండెనని యభిప్రాయపడి యున్నట్లు తోఁచెడిని. అట్లు కాదనియును కెంబెలుదొరలవ్రాయఁబడినవ్రాఁత పొరపాటనియును చెప్పెదను.

అందులో వసుచరిత్రము నీభట్టుమూర్తి రచియించినట్లే యున్నది. అది పొరపాటని యిదివఱకే నాయుపన్యాసములోఁ జూపించియు

---

sovereigns of various provinces, Bhattu Murti chiefly confined his labours to versification in the vernacular tongue, and the harmony of his numbers were so much admired that he obtained a great many scholars whom he made proficients in prosody. He in course of time, proceeded to the Court of Kristna Raya, who admiring his talents, retained him as one of his eight celebrated bards; during the life time of this monarch, he composed an epic poem entitled "Narasa Bhupaliyam," or the history of Narasa Bhupal, which was a work of great labour, and much admired by his comtemporaries, and by posterity. After the death of Kristna Rayaloo, he wrote another epic poem called "Vasoo Charitra," the subject of which is the loves and nuptials of king Vasoo and the beautiful nymph Gireka; the work was dedicated to king Tirumala, and the invocation of the poem commences in the following manner:—

The foregoing poem of the Vasoo Charitra was much admired by the contemporaries of Bhattu Murti, and became a model for after poets who composed in the Telugu language. Bhattu Murti was highly rewarded by Tirumala Raya for this and other works that he composed at the command of that monarch, so that he passed his days in peace and happiness until his death, which happened at his residence in the sixtieth year of his age.

It runs thus:-old nos. 36&37. The two manuscripts are copies of a poem, by one of the Ashta Diggajas at Vijianagaram; there having been eight learned men, so termed, by way of distinction. Timmaraju or by title Bhattu Murti from poetical eminence, was one of these poets of Krisha Rayer's court. This work, written by him, is entitled after the father of Krishna Rayer and as usual contains the geneology of the patron. Its subject is rhetorical and poetical, on the Laws of the drama, and poetical composition. It is highly esteemed, and regarded as a very superior work.

50

న్నాను. కాఁబట్టి అందుకుగా నాతనిచే నీయంబడినవి శేషములు రామ
రాజభూషణునివిగా భావించి గ్రహింపఁబడవలసినది. భట్టుమూర్తి య
ఱువదిసంవత్సరములు జీవించి తనయింటివద్దనే కాలధర్మము నందె నని
వ్రాయఁబడియున్నది. దీనికి వేఱువ్రాఁతలయాధారము లేదుగావునఁ
బాఠకు లెట్లు గ్రహించినను జిక్కులేదు. టెయిలరుదొర వ్రాసిన
దెట్లనఁగా:—

vide page 206 vol. 2 Catalogue Raisonnee by the Rev. W. Taylor.

దీనింబట్టి చూడఁగాఁ బై టెయిలరు దొరగారికే కాక వారికి నరస
భూపాలీయము బోధపఱిచినపండితులకుఁగూడ నరసభూపాలీయపురాజు
లపరిజ్ఞానము లేనట్లు కానుపించును. అట్లు కాకున్న భట్టుమూర్తి నా
మాంతరము తిమ్మరా జనియును, ఆగ్రంథము కృష్ణరాయలతండ్రి
యగునరసరాజునకుఁ గృతియియ్యఁబడినదనియును, అందులఁ గృష్ణరా
యలవంశావళి యున్నదనియును, ఆగ్రంథము ప్రబంధాలంకారములనే
కాక నాటకసంప్రదాయములంగూడ చెప్పునదనియును జెప్పుట తటస్థిం
చదు. దానిని మనము పరిశీలించి చూడఁగా నది కృష్ణరాయలతండ్రి
యగునరసింగరాయనిపై నీయఁబడిన కృతి కాక తోరగంటి నరసరా జ
నునొకసామంతప్రభున కీయంబడినట్లును, ఈ నరసరాజు కృష్ణరాయనివ
లె చంద్రవంశపురాజు కాక సూర్యవంశస్థుఁ డైనట్లును, ఆకృష్ణరాయ
నివంశము వర్ణింపఁబడనట్లును, అందు నాటకములతోఁ జేరినభాగమం
తయు వదలివేయఁబడినట్లును స్పష్ట మగును. కాఁబట్టి యిట్టిసంశయ
ములు దీర్చువట్టుల దేశస్థు లగుపండితులే పొరపడుచుండఁగా నిఁక
నితరదేశీయు లగునాంగ్లేయపండితులు పొరపడుట కేమియబ్బురంబు?
ఇట్టివట్ల మిక్కిలి మెలఁకువతోఁ బరిశీలించవలయు నని పాఠకుల నుత్స
హించెదను.

## పంచపాషాణములు.

### వాని టీకయును.

౧. ఉ. ఖండనభీమ నిన్నెదిరి పాఱక నిల్చినశాత్రవుల్ బృహ
న్మండలపుండరీకహరిశాఖనివాసులు పాతియుఁ గ్ బృహ

న్మండలపుండరీకహరినాకనివాసులు చచ్చిరయుక్ బృహ
న్మండలపుండరీకహరినాకనివాసులు చిత్ర మెన్నఁగన్.

అర్థము. భండనభీమ=యుద్ధములయందు (శత్రువులకు)భయము బుట్టించువాఁడా, నిన్ను, ఎదిరి=తాఁకి, పాఱక = (వెన్నిచ్చి) పఱుగెత్తక, నిల్చిన, శాత్రవుల్=పగతులు, బృహ...సులు,బృహత్=గొప్పవైన, మండల=గుండ్రములైన, పుండరీక=వెల్లగొడుగులతోడ, హరి=గుఱ్ఱములమీఁద నాక=సుఖముగా, ని, మిగుల, వా=తిరుగుటకు, ఆస=స్థానమైనవారు. పాఱియుక్=పాఱిపోయియు, బృహ...సులు, బృహత్=గొప్ప, మండల=(ఒకదినుసు) పాములకును, పుండరీక=పులులకును, నాక=నెలవగు (అడవినేలల) చోటుల, ని, పోయిన, వాసులు=కట్టుబట్టలు గలవారై యుందురు. చచ్చియుక్,బృహ...సులు—బృహత్=విశాలమైన, మండల=ఎఱ్ఱనైన, పుండరీక=కమలములవంటి,హరి=సూర్యునియందును, నాక=వైకుంఠమందును నివాసులు=ఉండువారు.

వీనికి నిఘంటు ప్రమాణములు :—

మండలశబ్దమునకు. మండలం వర్తులే రాష్ట్రే శోణే ద్వాదశరాజకే, దేశే దేవాలయే బింబే స్థలేషు నికదంబకే. శాశ్వతనిఘంటువు. పుండరీకశబ్దమునకు. పుణ్డరీకస్తు శార్దూలే దిగ్గజే సర్పపుంగవే, మునౌ ఛత్రే రాజభఛే కృష్ణే క్లీ బేచ పంకజే. నానార్థరత్నమాల. హరిశబ్దమునకు. యమానిలేంద్ర చంద్రార్క విష్ణుసింహాంశువాజిషు, శుకాహికపిభేకేషు హరిర్నా కపిలేత్రిషు. అమరము. నాకశబ్దమునకు. నాకస్తు గగనే స్వర్గే వైకుణ్ఠే భూతలే శుభే. అని. ని. ఉపసర్గ. వా. వా గతిగన్ధనయోః అని ధాతువు ఆసవువలె శె అను ధాతువు వీనిమీఁద పరిచూచునది.

౨. ఉ. వీరరసాలిశేకరణవిశ్రుత వేమనరేంద్ర నీయశం
భారభమాన తారకరహారసమానము నీభుజామహం

భారభమానతారకరహారసమానము నీనికేతనం
భారభమానతారకరహారసమానము చిత్ర మిద్ధరన్.

అర్థము. నీయశంబు=నీకీర్తి, ఆర=పాదరసముతోడను భ=నక్షత్రములతోడను, మాన=తులలేని,తార=వెండితోడను,కర=వర్షోపముల (వడగండ్ల)తోడను, హార=ముక్తామణిసరములతోడను, సమానము, నీ భుజామహంబు=నీ బాహుప్రతాపము, ఆర=అంగారకునితోడను, భ=అనలునితోడను, మాన=విద్రుమముతోడను, సమానము=సరియైనది. నీ నికేతనంబు=నీగృహము, ఆర=ధనమునకును, భ = ఈశ్వరునియొక్క, మా=సంపదవంటి సంపదగలిగిన, ఆనత=నమ్రములైన, ఆర=అరిసమూహముయొక్క, కర=కానుకలకును, హా=వీణెలయొక్క, రస=ధ్వనులకును, మా=లక్ష్మికిని, ఆస=స్థానమయినది.

పైనికి కోశప్రమాణములు :—

ఆరశబ్దమునకు. ఆరస్తు పారదే విత్తే భౌమే వాయుసుతే రవౌ. శాశ్వతుఁడు. భశబ్దమునకు. భశ్శంభౌ భ్రమరే భావే శుక్రాంశే జలదే పుమాన్. మఱియు,భస్స్యాత్ స్మథూకే శుక్రేచ. నానార్థరత్నమాల. మానశబ్దమునకు.మానస్తు నిస్తులే వ్యోమ్ని విద్రుమే జ్వలనే ద్యుతౌ, చిత్తేఽభిమానే ప్రమదే విమానే పరిమాణకే. కేశవనిఘంటువు. మఱియు, మానో మణౌ చకనకే విమానే విద్రుమే ద్యుతౌ, గర్వే ప్రమాదేహ్యాదయే నిస్తులే నికలీనివత్. విశ్వము. తారశబ్దమునకు. తారో ముక్తాఫలే శుద్ధే రజతే కనకేఽపిచ, నక్షత్రే తరలే శ్రేష్ఠే కాంతారం హాసిలక్షణః.హలాయుధనిఘంటువు. కరశబ్దమునకు. కరో వర్షోపలే హస్తే భానౌ తటితి వారిదే,ఉపదాయాం ద్యుతౌ శ్రేష్టే శుద్దాయాం ప్రత్యయోధనమ్.హైమవతి.హారశబ్దమునకు "హారిహింసా మతౌ హారే వాసవే కనకేఽంబరే. కేవళనిఘంటువు. మఱియు, హారశ్చక్రే వరే నస్త్రే భూతుకే హేమ్ని మార్తికే. ఉత్పలమాల. హాశబ్దమునకు, హాత్యాగే గతిహీనయోః. రసశబ్దమునకు. రస శబ్దే అనుధాతువు.మాశబ్దమునకు. ఇంది

రా లోకమాతా మా. అమరకోశము. అనశబ్దమునకు, అన ప్రాణనే అనుధాతువు. వీనింబట్టి సరిచూచునది. ౨.

3. ఉ. అబ్జముఖీమనోజ నరసాధిపనందన కృష్ణ నీయశం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీపరాక్రమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీ * విహాపితం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము చిత్ర మిద్ధరన్.

అర్థము. నీయశంబు=నీకీర్తి, అబ్జ=అమృతముయొక్కయు, కర=కాంతియొక్కయు, అబ్జజ=చతురాననునియొక్క, అబ్జనయనా = కమలములవంటి కన్నులుగల సరస్వతీదేవి యొక్కయు. అబ్జ = శంఖము యొక్కయు, విలాసము = కాంతివంటి కాంతిగలిగినది. నీపరాక్రమంబు, అబ్జ = అనలము, కర = హస్తమందుగలశివునియొక్కయు, అబ్జజ, అబ్జ=హుతాశనునియందు, జ=పుట్టిన కుమారస్వామి యొక్కయు, అబ్జనయన=వనరుహాక్షుఁడైన శ్రియఃపతియొక్కయును, అబ్జ=అర్జునుని యొక్కయును, విలాసము = విలాసమువంటి విలాసముగలది, నీవిహాపితంబు=నీయొక్కదాతృత్వము. అబ్జ=సముద్రములలో, కర=శ్రేష్ఠమైన సముద్రమును, అబ్జ=సూర్యునియందు, జ=పుట్టిన కర్ణునిన్ని, అబ్జ = నిధిని. నయన=పొందినకుబేరుని, అబ్జ=చంద్రుని, వి=విశేషముగా, ల=గ్రహించుటకు, ఆసము=స్థానమైనది.

ఇందుకు నిఘంటుప్రమాణములు :—

అబ్జశబ్దమునకు. అబ్జశ్శశాంకే విజయే జ్వలనేజ్వలశంబుధౌ. అని శుభాంగుఁడు. కించ. అబ్జః పద్మే ఽర్జునే హేమ్నిమీనే చన్ద్రే ప్రభాకరే. అని విజయుఁడు. మఱియు, కించ అబ్జః పద్మే సుధాయాం చ తపనే పావకే దధ్నే, స్కన్దే చన్ద్రే శ్వేతవాహే సముద్రే కనకే నిధౌ. మఱియు, అబ్జ స్సుధాయామిందౌచ నిధౌ శక్తిధరేఽనలే. ఉత్పలమాల. కించ. అబ్జో ధన్వంతరౌ శంఖే శశాంకే చ షడాననే వైజయంతి. కరశబ్దమునకు. కరో వర్షోపలే హస్తే భానౌ తటితి వారిదే, ఉపదాయాం ద్యు

* విత్తీర్ణి యుక్.

తౌ।శ్రేష్ఠే శుండాయాంప్రత్యయోధనే. హైమవతి. మఱియును. బలిహ స్తాంశవః కరాః. అమరము. నయనశబ్దమునకు. నయనం లోచనే ప్రాప్తౌ జటాయా మంశుకే యుగే. భాగురి. వి ఉపసర్గ. లా ఆదానే. అస ఉపవేశనే. అనుధాతువులు. వీనిమీఁద సరిచూచునది. 3.

ర. సీ. రాజనందనరాజరాజాత్మజులు సాటి, తలఁప నన్నయవేమధరణిపతికి
రాజనందనరాజరాజాత్మజులు సాటి, తలఁప నన్నయవేమధరణిపతికి
రాజనందనరాజరాజాత్మజులు సాటి, తలఁప నన్నయవేమధరణిపతికి
రాజనందనరాజరాజాత్మజులు సాటి, తలఁప నన్నయవేమధరణిపతికి
భావభవభోగసత్కళాభావములను, భావభవభోగసత్కళాభావములను
భావభవభోగసత్కళాభావములను, భావభవభోగసత్కళాభావములను.

అర్థము. రాజ...లు, రాజ=చంద్రునికి, నందన=కుమారుఁడైన బుధుఁడును, రాజ, ర=సమర్థుఁడైనఁ అజ=ఈశ్వరుఁడును. రాజ=దేవేంద్రుఁడును.ఆత్మజ=బ్రహ్మదేవుఁడును, వీరలు సాటి. భావ=బుద్ధియందును, భవ=ఐశ్వర్యమందును,భోగ=విభవమందును, సత్కళా=శ్రేష్ఠమైన విద్యలయొక్క, భావ=అతిశయమందును, ఇట్లుసీసము మొదటిచరణమునకు గీతము మొదటి చరణమునకును సరి. రాజనందన, ర=మనోహరమైన, అజ=శివునికి,నందన=కుమారుఁడైనకుమారస్వామియు,రాజ=కుబేరుఁడును, రాజ, ర=శ్రేష్ఠుఁడైన,అజ=రఘుకుమారుఁడైనయజుఁడును, ఆత్మజ=చంద్రుఁడును=వీరలు సాటి. వేనిలో ననఁగా భావ=క్రియయందును,భవ=ధనమందును,భోగ=పాలనయందును,సత్కళా,సత్=యోగ్యమైన,కళా=కాంతియొక్క, భావ=బృందమందును. సీసగీతముల రెండవచరణములు సరి. రాజనందన, ర=బంగారంవంటిదీప్తిగల్గిన, అజ=బ్రహ్మకు, నందన=పుత్రుఁడైన సనత్కుమారుఁడును, రాజ=క్షత్రియుఁడును, రాజ, ర=శ్రేష్ఠుఁడైన, అ=బ్రహ్మకు, జ=పుట్టినట్టి వసిష్ఠుఁడును, ఆత్మ=బృహస్పతియందు, జ=పుట్టినకచుఁడును సాటి. ఎందులోననఁగా భావ=ఆత్మజ్ఞానమందును, భవ=జననమందును, భోగ=అనుభవమందును, సత్కళా=అభివృద్ధిపొందునట్టి భావ=పద్ధతియందును.మూఁడవచరణములు సరి. రాజ

నందన, ర=గౌరవయుక్తుఁన, అజ=మన్మథునికి, నందన=కుమారుఁడైన అనిరుద్ధుఁడును, రాజ,ర=అంతట వ్యాపకుడైన, అజ=విష్ణువును, రాజ=యక్షుఁడును. ఆత్మజ=మన్మథుఁడును,వీరలు సాటి ఎందన్గాఁగా, భావ=ఆకారమందును, భవ=సంసారమందును, భోగ=సంభోగమందును, సత్కళా=సౌందర్యముయొక్క భావ=రీతియందును.ర. నాల్గుచరణములకును నాల్గు మెత్తుగీతలకున్ను అర్థము సరిపోయినది.

వీనికి నిఘంటువులు :—

రాజశబ్దమునకు. రాజా ధనపతౌ చన్ద్రే యక్షే క్షత్త్రియశక్రయోః, విశ్వము. రశ్శబ్దమునకు. రా స్త్రియాం హేమ్ని శాలాయా మాశంసాయాం గతావపి నానార్థరత్నమాల. మఱియు. రః పుమాన్ వ్యాపకే దీప్తౌ సమర్థేఽతిశయే బలే. శుభాంగుఁడు. అజశబ్దమునకు. అజః పితామహే విష్ణౌ కందర్పే శంకరై డకే. విజయుఁడు. మఱియు. అజః పితామహే నాథే భాగే విష్ణౌ హరేఽబ్జజే. వైజయంతి. అజా విధిరజా విష్ణు రజశ్శంభు రజస్తుభః. అజోఽస్త్రీ వార్షకా వ్రీహి రజో రామపితామహే. ధనంజయుఁడు. అకారో బ్రహ్మవిష్ణ్వీశకమఠే ష్వంగణే రణే, గౌరవేఽంతఃపురే హేతౌ భూషణేఽంఘ్రౌ పుమేజ్యయోః. మఱియు. అకారోభూషణే చంద్రేఽంతఃపురే గౌరవేఽంగణే, విధివిష్ణు మహేశానకమఠే ష్వంబికేజ్యయోః. ఆత్మశబ్దమునకు. ఆత్మా యత్న ధృతి స్వాంత స్వభావ పరమాత్మని,జీవబుద్ధిశరీరేషు. నానార్థరత్నమాల. మఱియు. ఆత్మాయత్నో ధృతిర్బుద్ధిస్స్వభావా బ్రహ్మవర్ష్మచ. అమరము. ఆత్మా బృహస్పతౌ గాత్రే చిత్తే పద్మభవే ద్యుతౌ, పరమాత్మని యత్నే చ స్వభావే నిర్మలే ధృతౌ. హైమవతి. మఱియు. ఆత్మా ధృతౌ సురాచార్యే పరమాత్మని మానసే, దేవే ప్రయత్నే ప్రజ్ఞాయాం స్వభావే పద్మజే ద్యుతౌ. తారపలాశుఁడు. భావశబ్దమునకు. భావః పదార్థేఽతిశయే జ్ఞానే బృన్దేచ పద్ధతౌ, లీలాయాం చ మనిప్రాభూ చాకారే హృదయే మతౌ. మఱియు, భావః పదార్థసత్తాధ్యాంక్రియా చేష్టాత్మయోనిషు. ధనంజయుఁడు. మఱియు, భావస్స్వభా

వేఽభిప్రాయే జ్యేష్ఠానంతాత్మయోనిషు,క్రియాలీలపదార్థేషుబుధజంతు
విభూతిషు.విశ్వము.భవశబ్దమునకు.భవస్సత్తాభద్రభర్గప్రాప్తిసంసారజన్మ
సు. వైజయంతి. మఱియు, భవఃసంసారసంప్రాప్తిశ్రేయశ్శంకరజన్మసు.
విశ్వము. భవ శ్శుభే ధనే రుద్రే విభూతౌ జననే సుఖే. భాగురి. భోగ
శబ్దమునకు. భోగస్తు భోజనే విత్తే నిర్వేశే పాలనే సుఖే. శబ్దరత్నాక
రము. భోగ ప్రబంధసుఖయో రుత్సాహే ఽహిఫణాంగయోః. కేశవ
నిఘంటువు. మఱియు, భోగ స్సుఖే ధనే చాపే శరీర ఫణయో రపి, పా
లనే వ్యవహారే చ నిర్వేశే పణ్యయోషితి. విశ్వము. మఱియు, భోగ
స్సుభోజనే విత్తే నిర్వేశే పాలనే సుఖే, వనితాదిభృతౌ రాజ్యే సర్ప
స్సఫణభోగయోః. నానార్థ రత్నమాల. కించ. భోగస్తు విభవే విత్తే
కోదండే ఽహిఫణాంగయోః, సంభోగిపాలనే హర్షే భోజనే పణ్యయో
షితి. తారపలాశుఁడు. కళాశబ్దమునకు. కళా చంద్రకళాయాంచ సౌం
దర్యే చ ధనే ద్యుతౌ,విద్యాయా మభివృద్ధౌచ శిల్పాదా వంశమాత్ర
కే. శుభాంగుఁడు. మఱియు, కళా స్యా న్మూలనే వృద్ధౌ శిల్పాదా
వంశ మాత్రకే, షోడశాంశేచ చంద్రస్య కలంకాకలయోరపి, కలంకు
క్లేకలోజీర్ణే ఽప్యవ్యక్త మధురధ్వనౌ.విశ్వప్రకాశము,మఱియు.కళాంశ
మాత్రే శిల్పాదౌ కళాస్యాత్కాలభేదయోః,ఇందోశ్చషోడశో భాగే స్యా
న్మూల ధనవర్ధనే నానార్థ రత్నమాల.

గ. సీ. మేఁకతోఁకకు మేఁక తోఁకమేఁకకు తోఁక,మేఁకతోఁకా మేఁక తోక మేఁక
”
”
”
గీ. మేఁకతోకతోఁక మెకమేఁక తోఁకమేఁక
”
”
”

---

ఈ యర్థములును నిఘంటువులును మూలగ్రంథానుసారములే. మావికావు.

శ్రీ ర స్తు.

# క వి జీ వి త ము లు.

ఆంధ్రదేశ్య ప్రసిద్ధ కావ్యకవులచరిత్రము.

## 16.

## పిం డి ప్రో లు ల క్ష్మ ణ క వి.

ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు కాఁపురము గోదావరి జిల్లాలోని రామచంద్రపురము తాలూకాలోని 'కుమ్మెరు' అనుగ్రామము. ఇతఁ డాగ్రామమునకు మిరాసీదారుఁడు, ఇతనిగ్రామము పిఠాపురపుజమీన్ దారీలోనిది. ఇతనినాఁడు తత్సంస్థానమునకుఁ బ్రభుఁడు రావు నీలాద్రిరాయనామకపద్మనాయకవంశభూషణుఁడు

ఇతనికాలీనులు.

౧. రాజా కొచ్చెర్లకోట. వేంకటరాయనామక మంత్రిశిఖామణి ఈయన అత్తిలి, ఆచంట సంస్థానాధిపతి.

౨. బులుసు అచ్చయ్యశాస్త్రి. ఈయన మొన్నటివఱకు విశేష విఖ్యాతిం జెందిన కీర్తిశేషు లగు బులుసుపాపయ్యశాస్త్రినామకాపర విద్యారణ్యుని తండ్రి.

౩. ఒక్కలంకవీరభద్ర కవివరుఁడు. ఇతఁడే వాసవదత్తాపరిణయమనుసంస్కృత వాసవదత్తనామకగ్రంథమును ప్రబంధముగా నాంధ్రీకరించినవాఁడు.

౪. శిష్టుకృష్ణమూర్తిశాస్త్రి. వేంకటాచల మహాత్మ్యము,సర్వకామదా పరిణయము మొదలగునాంధ్రకావ్యకర్త.

౫. ఇంద్రకంటి విశ్వపతిశాస్త్రి. నారాయణ మననాదిక వేదాంత గ్రంథకర్త. వేదశాస్త్రరహస్యవేది.

౬. రాజా కాకర్లపూడి పద్మనాభరాజు, రామచంద్రరాజు. వీరు రామచంద్రపురం కోట జమీన్దారీసంస్థానాధిపులు.

౭. మొక్కపాటి పేరిశాస్త్రి. తర్కవ్యాకరణశాస్త్రవేత్త.

౮. Mr. C. P. Brown, the Telugu Lexicographer. సి. పి. బ్రౌనుదొర. బ్రౌణ్య నిఘంటు వను నాంధ్రాంగ్లేయ నిఘంటుద్వయము రచియించినవాఁడు.

## లక్ష్మణకవి ప్రజ్ఞావిశేషములు.

ఇతఁ డాంధ్రగీర్వాణములలో విశేషప్రజ్ఞ గలవాఁ డని ప్రతీతి నందెను. అం దాంధ్రమున మిక్కిలి ప్రజ్ఞ గలవాఁడు. ఇతఁడు తెనాలి రామకృష్ణునివలె హాస్యస్వభావుఁడు. ఆకారణముచేత నితనిపేరు గోదావరీ మండలములో నాధునికులలో విశేషవిఖ్యాతిం జెందె. అట్టిచమత్కారములలోఁ బెక్కులు రసహీనము లవుటం జేసి వానిలోఁ గొన్నిమాత్రమే యుదాహరింపవలసియుండును. అవి యథాస్థలములలో నవసరము ననుసరించి ప్రకటింపంబడును. ప్రస్తుత మతనిప్రధానగ్రంథ మగు లంకావిజయా పరనామక "రావణదమ్మీయము" గూర్చి వ్రాసెదను. అం దొకకథ యతనిదియును, అతనికి విరోధి యగు రావు దమ్మారాయఁ డనునొక సామంతునిదియు నై యున్నది. ఇఁక రెండవ యర్థమునందు వచ్చెడుకథ కేవలము రామాయణకథయే అయియున్నది. అందు దమ్మరాయఁడే రావణస్థానీయుఁడు. కావున దానికి రావణదమ్మీయ నామము కల్గినది. కవిచరిత్రము కొంత పూర్ణముఁగా నతనిచే రచియింపఁబడిన గ్రంథమునందే యున్నది కావున నందలి సంగ్రహమే యీమనచరిత్రమునకుం జాలియుండును. ఆసంగ్రహమే వ్రాసెదను.

## గ్రంథపీఠిక.

దీనిలో నీకవి గోపాలదేవుని కృతిపతిం జేసెను పిమ్మట శివ,చతురాననులను, రమా, గౌరీ, సరస్వతులను, వినాయకుని నుతించి, నవగ్రహములంగూడ వినుతించె. ఇట్లు నవగ్రహముల నుతియించుట నవీనకవులలో నవీనపద్ధతి. అనంతరము సంస్కృతాంధ్రప్రసిద్ధకవుల వినుతించె. అం దాంధ్రకవులంగూర్చి చెప్పినపద్యములో వారికవిత్వవిశేషములు గొంచెము నుడువఁబడెంగావున నాపద్యము నీక్రింద వివరించెదను. ఎట్లన్నను: —

సీ. ఆర్యవర్యుని నన్నపార్యుని రమ్యయ, శోరాజి తిక్కనసోమయాజి
రమణీయసుగుణాభిరాము నాచనసోము, రసికతస్సాంద్రు వెల్గుసుకవీంద్రు
సకలకవినుతయశస్కరు భాస్కరు, గీతగుణసమాజు పోతరాజు
భూనుతవాక్యభాషానాథు శ్రీనాథు, పృథుకకవిస్వాంతభీము భీము

తే. సూక్తిచాతుర్య పింగళిసూరనార్యు, బ్రీతబుధముఖ్యు నలసాని పెద్దనాఖ్యు
నాంధ్రభాషా విశారదు లైనయట్టి, సకలసత్కవివర్యుల సన్నుతింతు.

ఇతఁడు తనకు గురుండు కీర్తియనంతయ్య యని చెప్పి యతని గోత్రాదికముం జెప్పక యీక్రిందివిధంబున వ్రాసెను.

క. సేవింతు నస్మద్గురుని య, శోవిలసితవిమలచిత్తు సురుచిరవిద్యా
ప్రావీణ్యు కీర్తికులజా మ, హావినుతచరిత్రు నయ్యనంతాఖ్యుఁ దగన్.

## లక్ష్మణకవి వంశావళి.

భరద్వాజరగోత్రములో
పిండిప్రోలు వీరమంత్రి.

- పెదవేంకటేశ్వరుఁడు.
  - వీరభద్రుఁడు
    - గోపరాజు
      - భద్రిరాజు
        - వేంకటరాయఁడు
          - బాపయ్య మొదలగు నలుగురు కొడుకులు
        - సర్వమంత్రి
- చినవేంకటేశ్వరుఁడు.
  - వీరయ్య
    - సింగమంత్రి. (ఇతఁడు గణపతిరాజువారను జమీందారులయొద్ద దివాన్గిరీ చేసెను.)
      - తిమ్మన్న
        - రామకృష్ణయ్య
          - గోపాలయ్య
            - తిరుపతయ్య
            - రామకృష్ణయ్య
            - లక్ష్మణకవి (గ్రంథకర్త).
            - రామయ్య
          - తిమ్మన్న
          - పద్మనాభుఁడు
          - వేంకటాచలము.
          - రామమంత్రి.
        - తమ్మయ్య
        - బుచ్చివెంకయ్య
      - వీరరాఘవుఁడు
      - సింగయ
      - వరదయ్య
      - నరసయ్య
    - కృష్ణమరాజు

## గ్రంథరచనాకాలవివరము.

ఈవిషయమై గ్రంథములో కవివలనే యొకవచనము వ్రాయంబడెఁగావున దాని నీక్రింద వివరించెదను. అందులో నీలకణ్ఠకవి గ్రంథరచనాకాలముం దెల్పియున్నాఁడుగావున దానింబట్టి యించుమించుగా నీకవిజననకాలముంగూడ నూహింపవచ్చును. ఆవచన మెట్లున్న దనఁగా :—

"వ. అని యిష్టదేవతా వందనంబును, నవగ్రహ ధ్యానంబును, మద్గురుసేవనంబును, సుకవిజనస్తుతియును, కుకవిప్రతారణంబును, మజ్జననస్థలంబైన కుర్యేరు పురవర్ణనంబును, మద్వంశసూచనంబును, గావించి, యే నొకప్రబంధంబు నవరసభావార్థలక్షణానుబంధంబుగా నూహించి కల్యబ్దములు ౪౮౯౮ శాలివాహనశకాబ్దములు ౧౭౧౯ ఇంగ్లీషు సంవత్సరములు ౧౭౯౭ (A. D. 1797) ఫసలీ౧౨౦౭) 1207 అగు పింగళసంవత్సర శ్రావణమాసములో రచియింప నుద్యోగించియున్న సమయంబున"

అని యున్నది.

దీనింబట్టి చూడ నీలకణ్ఠకవి యీగ్రంథమును రచియించిన కాలము శాలివాహన సంవత్సరముయొక్క పదునేనిమిదవశతాబ్ద ప్రారంభమం దని తేలుచున్నది. అప్పటి కతఁడేఁబదిసంవత్సరముల వయసువాఁడే అయ్యెనేని అతని జననకాలము శా. స. ౧౬౭౦ సమీపకాలమై యుండును. కాఁబట్టి యీకవి శాలివాహన శతాబ్దముయొక్క పదునేడవ శతాబ్దమధ్యము మొదలు పదునేనిమిదవశతాబ్దముయొక్క మధ్యము దనుక నున్న ట్లూహింపనై యున్నది. ఇదివఱలో నీచరిత్రాదిలో నీలకణ్ఠకవి నైఘంటికుఁ డగు సి. పి. బ్రౌన్ (Mr. C. P. Brown.) దొరకాలీనుఁ డని చెప్పియుంటిం గావున నాదొరకాలమువఱకు నీకవి జీవించియుండె నని చెప్పవలసియున్నది. ఆకాలమునాఁటికి కీకవి మిక్కిలి ముదుసలివాఁడై యుండనోపును. అట్లుండియు లక్ష్మణకవి పై దొరనుదొర రాజమహేంద్రవరము జిల్లాకోర్టులోనో లేక బందరుప్రొవిన్షియల్ కోర్టులోనో సివిల్‌జడ్జీగా పనిచేయుచున్నపుడు తనమేనల్లునివిషయమై పద్యరూపక మగునొకవిజ్ఞాపన పత్త్రము వ్రాసి పంపినట్లు వాడుక గలదు.

ఆపద్యము లుదాహరించుతఱి నావృత్తాంత మంతయు వివరించెదను. కావున నిపు డాకథ వదిలి లక్ష్మణకవి క్రీ. శ. ౧౭౭౦ సం. మొదలు క్రీ. శ. ౧౮౪౦ సం సంవత్సరమువఱకు జీవించియున్నట్లు నిశ్చయించెదను.

## ⟶ గ్రంథరచనాకారణము. ⟵

దీనింగూర్చి గ్రంథకర్తయే కొన్ని కారణములు వివరించె. అవి నమ్మఁదగిన వైనను కాకున్నను వానిని వివరించుట మంచిదికావున వివరించెదను. ఎట్లనగాఁ దన కొకనాఁడు స్వప్నం బయ్యె నని యును, అపు డాస్వప్నంబునఁ దనతండ్రి యగుగోపాలమంత్రి తనకుఁ గనుపించి తాను కావించుభక్తిపూర్వకనమస్కారంబు లంగీకరించి తన్నుంగూర్చి యీక్రింది వృత్తాంతమును గ్రంథము చేయు మని ఆజ్ఞాపించెనఁట. అదెట్లనఁగా :—

"సీ. 'ఆరివెట్టం' బన్నయూర నుండెడు రావు, బుచ్చయ్య సరసమపుత్త్రికుండు
దమ్మనరా వన ధర్మరాయుం డన, నిరువేళ్లతోడుత నెసఁగు జెలమ
యరయ భద్రయ్య, జగ్గయ్య, తమ్మయ్య, భావయ్య లన్నలుగురి కగ్రజుండు
పుత్త్రాదిసంపత్తిఁ బొసఁగునతఁడు మన, కుయ్యేరు ప్రీతితో గుత్తసేసి
గీ. నీడులంకమాన్యము బల్మినిహరించెఁ, గానతత్ప్రీతికై రామకథయు మనక
థయును జతగాఁగ నర్థంబు ఘటనపఱచి, కృతి రచించి గోపాలున కిమ్ము తనయ"
అని యున్నది.

ఇట్లు పల్కి పిమ్మట నీలక్ష్మణకవినే తనకవిత్వ మీక్రిందివిధంబుగ నుండవలె నని చెప్పినట్లు చెప్పె. ఎట్లన్నను :—

ఉ. కొందఱు శబ్దసౌష్ఠవముఁ గొందఱు భావముఁ గొంద ఱర్థముం
గొందఱు సంధిసంఘటనఁ గొంద ఱలంకృతి వృత్తిఁ గొందఱున్
గొందఱు దేశ్య సంస్కృతముఁ గొందఱు ఛందముఁ గొంద ఱన్నియున్
గొందఱు జూతు రెల్ల కవికోటి భళీ యనఁ జేయుమీ కృతిన్.

అని తాఁ జేయంబోవుగ్రంథములోఁ బైవిశేషము లుండవల యు నని చెప్పినట్లున్నది. అంతియకాక తాఁ జేయఁబోవుగ్రంథమున కుఁ దా నుంచుకొనవలసినపేళ్లుగూడఁ దనతండ్రిచేతనే నిర్ణయించఁబడి నట్లు చెప్పియున్నాఁడు. అవి యెట్లన్నను:—

సీ. లక్ష్మణుఁడు లంకాపతి లక్ష్మణాగ్ర, జుఁడు కవనచారి గోపాలసూనుఁ డజసు
వంశజాతుఁడు రాజాంబవత్సపిండి, ప్రోలికవివరుఁ డనుపేళ్లఁ బొదలుమీవు.

అని యిట్లిన్నిదిపేళ్లుంచి కవిత్వముఁ జెప్పు మనియుం జెప్పినట్లున్నది. ఇదియంతయు స్వప్నగతార్థమే కావునఁ బాఠకులు దేని నెట్లు గ్రహించినను గ్రహింపవచ్చును.

అని యిట్లు స్వప్నంబున తండ్రి యాజ్ఞ కాఁగా లక్ష్మణకవి మేల్కాంచి తనహితులకు తనస్వప్నంబు తెలిపి తాను పింగళిసూరన మొదలగు కవులవలె ద్వ్యర్థికావ్యము రచియింపఁగలనా యని వారితోఁ జెల్పఁగా వారు తన్నుంగూర్చి యీక్రిందివిధంబుగాఁ బల్కి రని చెప్పె. ఎట్లన్నను :—

"చ. గణుతికి నెక్కినట్టి ఘనకావ్యము లొప్పఁగఁ జేయ శాస్త్రవి
ద్గణములు మెచ్చ భావములు కల్పనసేయ రసంబు లొప్ప భా
షణముల కర్థగుంభనము సమ్మతి సేయఁగఁ బిండిప్రోలిల
క్ష్మణకవివర్య నీవె తగుజాణుఁడ వన్యులు నీసమానులే.

క. శ్రీమన్నారాయణకరు, ణామహిమప్రాప్తసహజనవరసభావా
ర్థామలవాగ్విలసనుఁడవు, సామాన్యకవీశ్వరుఁడవె చర్చింపంగన్".

ఇట్లుగాఁ బైని చెప్పిన పద్యయుగళములో లక్ష్మణకవికవితావిశేషములు గొన్ని బోధపడుచున్నవి కావున నిఁక వానింగూర్చి మనము వేఱుగ వ్రాయవలసినయవసర ముండదు. ఇట్లుగాఁ దనమిత్త్రిలుగూడ గ్రంథరచనకుఁ గాను తన నుత్సహింపఁ జేయుటచేతఁ దాను గ్రంథము చేయనారంభించితి ననియును అందులోఁ దన కథ రామకథతోఁ జేర్చి చెప్పుటచేతఁ దన కైహికఫలప్రాప్తి కల్గుటయకాక ఆముష్మికఫలమును గల్గు నని నిశ్చయించుకొని గ్రంథారంభము చేసెను. అందలి లక్ష్మణకవి చరిత్రసంగ్రహ మిప్పుడు మనము వివరింపవలసియున్నది. అ దెట్లన్నను.

## కథాసంగ్రహము.

లక్ష్మణకవితండ్రి యగుగోపాలమంత్రి రావుమహీపతిరాయాజ్ఞచేతఁ గుర్యో రనుగ్రామములో నధికారము చేయుచుండెను. అతనికి

నల్గురుకుమారు లుండిరి. వారి నల్వురికిని క్రమముగ వివాహము లొనరించె. అందుఁ బెద్దకుమారుఁ డగుతిరుపతయ్యకు రమణమ్మయను చిన్నదానిని, రామకృష్ణయ్యకు తిరుపతమ్మ యనుచిన్నదానిని, లక్ష్మణకవికి జగ్గమ్మ అనుచిన్నదానిని, రామయ్యకు వేంకటలక్ష్మి యనుచిన్నదానిని వివాహము చేసెను. ఇట్లుండఁ గొందఱు బ్రాహ్మణులబృందములు వచ్చి గోపాలమంత్రిని ధన మిప్పింపుఁ డని యాచింపఁగ నాతండు వారల కట్లే యిచ్చెను. ఆధనముం గైకొని వారలు సంతోషించి అతని నతసపుత్త్రిలను దీవించి చనిరి.

ఇట్లుండ గోపాలమంత్రి తనచుట్టును బరివేష్టించి యున్నసభ్యజనులయనుమతంబున ప్రతిభాసంపన్నుఁ డగు తనపెద్దకుమారుని తిరుపతయ్యను బిలిచి నియోగులలో నుండునట్టి యాచారానుసారముగా వ్యవహారము నడుపుకొమ్మని ఆజ్ఞ యిచ్చెను. అనంతరము గోపాలమంత్రి తనభార్య రాజమ్మ స్వర్గస్థురాలు కాఁగా రెండవవివాహమాడెను. ఆరెండవభార్యపే రచ్చమ్మ. అట్లు వివాహమైన యనంతరము. తిరుపతయ్యకు వేఱ యొక లోఁగిలి కట్టించి అం దాతనిఁ గాఁపుర ముంచెను. అతఁ డట్లుండి యిర్వురు పుత్త్రిలం బడసి పిదప కాలధర్మము నందెను. ఇట్టిపుత్త్రిదుఃఖములో నుండిన గోపాలమంత్రి క్రమముగఁ గృశింపనారంభించి మఱికొన్ని నాళ్లకు నిర్యాణము నందెను.

అంతట గోపాలమంత్రి రెండవకుమారుఁ డగురామకృష్ణయ్య తనతండ్రికి నుత్తరక్రియలు గావించి కుయ్యేరు గ్రామమునకుఁ గరిణీకకమును వహించెను.

ఇట్లుండి యొకకాలమున నీరామకృష్ణయ్య తమ్ములను వెంటఁ బెట్టుకొని ఆత్రేయీనామక గోదావరీశాఖలో స్నానమునకుం బోయి సుస్నాతుఁడై తిరిగి యింటికి వచ్చుచు నచ్చట వేంచేసియున్న గోపాలస్వామి యాలయమునకుం బోయి ఆస్వామి ననేకవిధముల నుతియించి సాష్టాంగదండప్రణామం బాచరించి వెడలి శివాలయంబునకుం బోయి

అచ్చట శివుని దర్శించి నమస్కారము లొనరించి యింటికిం బోయియుం డె. అంతట నొక్కనాఁడు సరస్వతీదేవి లక్ష్మణకవియన్న యగురామ కృష్ణయ్య యెదుటఁ బత్యక్షమై నిన్ను వరియింప వచ్చితిఁ గైకొ మ్మనుఁడు నాతఁడు తనతమ్ముం డగులక్ష్మణకవిం జూపి అతని వరియింపు మనుఁడు నట్లన చేసెను. లక్ష్మణకవి ఆభారతిని చేపట్టెను. వేదముల నుపనిషత్తులలోనియర్థముల నరసి ప్రసిద్ధికెక్కునట్లుగా బ్రహ్మతత్త్వ మును గ్రహించెను. అని కొంతపూర్వోత్తరము చెప్పంబడినది.

ఇట నుండి లక్ష్మణకవి కవితాప్రాగల్భ్యము వర్ణింపఁబడెం గావున నతని మూలవచనమునే యీక్రిందఁ బొందు పఱిచెదను. ఎట్లన్నను:—

"వ. మఱియు సత్కృతిరచనావిచక్షణుం డగులక్ష్మణాగ్రజుండు విబుధా భినందితాత్మీయశ్లోకాసహిష్ణువులై యిది మహాక్రియ యనక నుప్పనక వాక్యంబుల న్నిటం దుర్బోధంబుఁ జెందినకతంబున నాగ్రహించి యెదిర్చినఖరదూషణముఖ్యు లగు విరోధులం దనశాస్త్రబలసంపత్తిచేత జయించి నిజసామర్థ్యంబు ప్రకటంబుగ నెఱపు చున్నంత"

అని చెప్పెను.

దీనిచేత తనబద్యములయం దసూయాపరులై యున్నవారి ననఁగా శత్రువులను తనశాస్త్రసామర్థ్యముచేత గెల్చి తనసామర్థ్యము లక్ష్మణకవి చూపుచుండె నని తేలుచున్నది. ఇట్లుండఁగా జయశీలుఁ డగు దమ్మన్న యను వెలమ లక్ష్మణకవియొక్కలంక నేల నున్నగోతిచేను అను భూమిని వివాదములోనికిం జేర్చెను. అపుడు లక్ష్మణకవి నల్లనై భూసారము గలతనబంకభూమిని హరింపఁగోరి దమ్మన్న తనతమ్ముఁ డగు భావన్న యనునతని నధికారికడకుఁబంపుట విని ఆవిషయములో సామోపాయము చేయుచుండెను. ఇట్లుండి లక్ష్మణకవి ప్రభునికడ కేఁగి తనలంకభూమికి మాన్యముగ పట్టా నందవచ్చెను. ఈవృత్తాంతమును దమ్మన్న విని మఱియును క్రోధము బూనినవాఁ డాయెను. ఇట్లుండి దమ్మన్న లక్ష్మణకవి కాభూమి చెల్లకుండఁజేయ యత్నింపసాగెను. పిమ్మట దమ్మన్న తనకాఁపురస్థల మగునారెవెట్ల మనుగ్రామమునుండి

బయలు వెడలి, తనయుద్దేశ మితరులకుఁ దెలియకుండఁగ తనయిజారాగ్రామ మగుకుయ్యేరునకు వచ్చి లక్ష్మణకవియొక్క లంకమాన్యము తనభూమిలోనిదిగా నిర్ణయించి పోయెను.

ఇట్లు తనమాన్యము దమ్మన్నవలన నపహరింపఁబడఁగా లక్ష్మణకవి దానిని సంపాదించుటకుగాను భగవంతుని బ్రార్థించుటయుఁ దమ్మరాయని శపించుటయుఁ గర్జం బని తలంచి అటనుండి చెప్పెడు కథలో నంతట నతని రావణుంగాఁ బోల్చి చెప్పుచుండెను.

అట్లు దమ్మన్న లక్ష్మణకవియొక్కమాన్య మాక్రమించుకొని దున్నించి దానికి పాలికాపుంచి తనయూరికిం దిరిగి పోయెను. ఇట్లు దమ్మన్న తనభూమి నాక్రమించె నని విని లక్ష్మణకవి మిక్కిలి విచారించి తన కాభూమికిగా నీయంబడిన పట్టా వెదకి తీసి యుంచి ముందు సామోపాయముచేతఁ గార్యసాధనము చేయుదునుగాక యని యోఁచించి దమ్మన్న యున్నగ్రామంబునకుం బోయి అతనియింటఁ గూర్చుండి యున్న అతని పరిజనంబుతోఁ పాటుగఁ దానును లక్ష్మణకవి ప్రచ్ఛన్నుం డై కూర్చుండి యుండె. అపు డాదమ్మరాజుపరిజనములు పెక్కుకొన్ని వ్యర్థాలాపంబు లాడుకొనుచుండఁగా విని లక్ష్మణకవి తనవిశేషములు స్పష్టీకరించు తలంపున నీక్రిందిపద్యములం జదివె అవి యెట్లన్నను :—

"మ. ఏ-నిను నాశ్రయించి హృదయేప్సిత మెల్లను దీర్చుకొందునన్
పూనికఁ జేరవచ్చిన ననున్ గడకంటను జూడవేమి యిం
పూనఁగ మాటలాడుటకు నొప్ప వి దేమిచలంబు వద్దిఁకన్
మాననిరూఢ సత్కృపను మన్నుము దమ్మన యిమ్మహీతలిఁగన్.

క. నగుమొగముతోడ నను దయ, యెఁగురొత్తఁగఁ జూచి తొల్లి నెవవేడుక మీ
ఱఁగ లంక విడిచి యీనం, దగరిమ మానదగ దీవనను బొందఁగదే"

అని పల్కి నిజసామర్థ్యంబు ప్రకటించువాఁడై యిట్లనును.

"గీ. ఒనరు మద్వాక్కులం దెలుంగునకు బద్ధుఁ, డగునువాగనుశాసనుఁ డైన నన్ను
మలఘుమద్దివ్యగోచయంబులకు బద్ధుఁ, డగును శ్రీమనోవసుచోరుఁ డైన నిజము.

క. తెలియ విను రామకవ్యా, దులు నూరకవిప్రముఖపృథుప్రతిభావం
తులు భీమశ్రీనాథు, ల్వెలయఁగ నాకరణిఁ దిట్ట శే రూఢమతిన్.

వ. అని సామభేదోక్తు లాడినం గణింపక తృణీకరించు నతనితో నరసాసంతతి యిట్లనియె.

క. ఖరదూషణముఖ్యులు కవి, గురులు నడచినట్టితోవఁ గోరి నడవ ను
ద్ధురుఁడ వగు నీదువాక్యవి, సరపరుషత్వమున కేను జంకుదునె మదిన్.

గీ. విన్ము లక్ష్మణాగ్ర జన్మ మాన్యక్షేత్రి, మేను విడువ నెపుడు మానగుణము
మద్వరోగ్రశక్తి మఱి యింక లంక నే, లగలవాఁడ నగుచు నెగడ వీవు."

అని యిట్లు దమ్మన్న యుత్తర మీయఁగా లక్ష్మణకవి కోపాటో పంబున నుత్తరమీయ నున్న నతని హితు లతని నివారించిరి. అటు పిమ్మట లేచి తనయింటికిం బోవఁ గమకించి లక్ష్మణకవి దమ్మన్న నుద్దేశించి సాధువాక్యంబుల ధర్మంబు బోధించిన నంతకంతకు దమ్మన మూర్ఖ్యము నే యవలంబించుటకుం గనలి.

"క. ధరశ్రీరామేద్భక్తుఁడ, గరిమన్నమ్మవినినాదు కత నరసాజా
నిరయంబున నినుఁ జేర్చుక్, దురిత మణఁచి నెమ్మి రాదు దొసఁగొంద నిఁకన్.

క. లేదమ్మా కష్టము నీ, కేదమ్మా నేగి భీతి ఘృణ నీవొందన్
రాదమ్మా యిఁక మిన్నక, పోదమ్మా యుక్తి నిజము పొలుపుగదమ్మా.

క. అని యిట్లనేక ములు నెం, పెనయంగాఁ బలికి జీవితేశునికడకున్
జనుసమయము నీ కిదె వ, చ్చెను వేగిరపడకు మనుచుఁ జెప్పుచు మఱియున్.

క. నీపతితత్వం బంతయు, వ్యాపకతం జెందునట్లు వర్ణించెద నే
నోపిక వాణీ రచనా, నైపుణి నీమదికి నొప్పి నాటుకొనంగన్."

అని పల్కి మఱికొన్ని వాక్యము లతనితోఁ జెప్పెను.

" గీ. ఏడుపందు మాల్లోకంబు లెటుఁగ లంక, నేలకొలపరక్షేత్రాప్తి మేలు గాదు
పేర్మి నాభూమిజాత సంప్రీతితోడ, నీడు మదియె సౌఖ్యము లిచ్చు వేయునేల."

ఇట్లెన్నివిధంబులఁ జెప్పినను లక్ష్యము సేయక దమ్మన్న మూర్ఖవృత్తి నుండఁగ లక్ష్మణకవి తనయూరికిఁ దిరిగి పోయెను. అంతట దమ్మన్న తమ్ముఁ డగుభద్రయ్య యనుబుద్ధిశాలి తనయన్న చేసినది అక్రమముగ గ్రహించి అట్టిపని కూడ దని అనేకవిధంబులఁ జెప్పి లక్ష్మణకవి ప్రజ్ఞావిశేషంబులు నాతనిక్షేత్రంబు హరింప నతఁడు యత్నింపఁగూడదని పనియనియు నీక్రిందివిధంబునఁ జెప్పినట్లు వ్రాయుచున్నాఁడు. ఎట్లన్నను.

"గీ. జ్యేష్ఠుఁడా లక్ష్మణాగ్రజక్షేత్రమీవు, వదలకుండిన మోసంబు వచ్చు నింక
చండనిర్భీకవనచారి పిండిప్రోలి, కవికులవరుతో రిపుత ముఖ్యముగ వలదు."

అట్లుగా వలదనుట కీక్రిందికారణములఁ జెప్పుచున్నాఁడు ఎట్లన్నను :—

"సీ. లలి భూతలంబునం దెలుఁగులరాజాంబ, వత్సమాఖ్యప్రసిద్ధి వర లెడునిపు
ణుండు వాగనుశాసనుఁడు తిమ్మఁడొకఁడు, ధూర్జటిరామలింగసంజ్ఞాప్రథితుఁడు
బుధవరుల్ భాస్కరపోతనలాదిక, వనచారులు మఱియు ననుపమాన
కృతిరామభద్రుఁడు శ్రీనాథుఁడు గణింపఁ, దత్సముల్ దధికులు ధరణి లేరు
తే. కళల సోముఁడు పెద్దన్న కరణి వెలయు, చుండు రెండవవీరుండనూనమతిని
రూపణము సేయకుండలీంద్రుండు సుమ్ము, లక్ష్మణాఖ్యుఁడు గాన చలంబు విడువు."

ఇఁక సంస్కృతకవులతో సీతనిం బోల్చి చెప్పిన పద్యమును తెలియఁదగినదే. ఎట్లన్నను :—

"ఉ. బాణుని, భారవిన్, ఘనసుబంధుని, నాథవభూతి, సర్వగీ
ర్వాణపదంబులన్ గొనినవారిఁ దదన్యుల విందుమే కదా
క్షోణిని వారికన్న మతినూత్నుఁ డవారణవిద్య నిన్ను ని
ష్ప్రాణునిఁ జేయు నాఁతఁ డరయన్ బురుషోత్తముఁ డౌకతంబునన్."

అని యున్నది. ఈపద్యములో లక్ష్మణకవి శ్లేషనైపుణ్యముం జూపుటయేగాక తనకవిత్వప్రజ్ఞయు విశేషించి చూపెను.

ఇటులనే మఱికొన్నిపద్యములు చెప్పి లక్ష్మణకవి రామాయణ యుద్ధమును తనవివాదసమాప్తియు నీక్రింది గద్యపద్యములలోఁ జూపుచున్నాఁడు. లక్ష్మణకవియొక్క యితరచర్యలు చూపుట కీగాథ యడ్డగించుచున్నది కావున దీనిని ముందుగ ముగించెదను. ఎట్లన్నను :—

"వ. తదనంతరంబ నిజవిజయంబు గోరుచుఁ బయలుదేఱినయాలంకాధిపతి పటుతరగోళక్షిపారిబలంబున దృఢత గలయంగదాదుల లీల నాక్రమించి సుదర్శన హస్తనాభివత్సజఘునదృఢత్వం బడంచుచుఁ, బృథు జంఘాతిశయబలంబుఁ గ్రుంచుచు సుబాహు గంధవహాత్మజానుతాపంబొనరించుచు, నీలతార కోపస్థితి విఫలంబుచేయుచు, సుముఖ సుగ్రీవాదులకు వివర్ణతం బుట్టింపుచుం జేరియున్నరసమాజవర్యు సౌకిక్కంత వివశత నొందింప నాలక్ష్మణాగ్రజుం డంత ముఖ్యశత్రు వధార్థంబుగా ననుపమానా

గస్తి మితవచనాంగీకృత హరిమంత్రుం డై కమలాప్తుం డగుభగవంతు వేదవిధ్యుక్తముగా నిశ్చలభావంబున ధ్యానంబుజేసి తత్ప్రసాదలబ్ధదివ్యతేజోబలవిరాజితుం డై ఆత్మీయామోఘ గోశక్తి ప్రకటం బగునట్లుగా విజృంభించిన.

క. లలి మున్నలబుధవైరికి, బొలుపు సెరయ నాభిముఖ్యమున నున్నసుధా
తులసద్బల మడఁగెను జే, ర్చులక్ష్మణాగ్రజుని దివ్యశుచిగోశక్తిన్.

వ. తదనంతరంబ.

క. ఏపుచెడి నవకము లడఁగి, గోపాలతనూజాతతనుగురువాణీశా
స్త్రోపాసనము సఫలమున, నాపరుఁడు హృదయము సెదరి యసువులఁ బాసెన్.

క. శ్రితసురమాకాంతుని బుధ, నుతు నాసురవర్య లక్ష్మణుం డాలంకా
పతి గారాము సెరయగ నా, నతిఁ జేసి గభీరభాషణంబులఁ బలికెన్.

క. రవియును శశియును దారలు, నవనియు రామకథ నుండునన్నాళ్లును దా
నవనాథ విభీషణ లంక విమతభయవిరహితంబుగా నేలు మిఁకన్.''

ఇట్లు తన చారిత్రమును లక్ష్మణకవి కొంత గ్రంథస్థముగాఁ జేసెను. ఇట్లు స్వచారిత్రము వ్రాయుపద్ధతి ఆంధ్రులలో నంతకుఁ బూర్వమున్నట్లు కానరాదు. అయిన నిది యాంధ్రభాషకు నొకనవీన మగు నలంకార సంపాదన మని చెప్పవలసియున్నది. దీనింబట్టి లక్ష్మణకవిచారిత్రమంతయుఁ దెలియకున్న మనకు నతనినాఁడు ముఖ్యకార్య మగు నష్టభూలాభముం దెలియఁజేయుటయే కాక దానితో సంబంధించినవృత్తాంతములు గొన్ని తెలియఁగలవు. తక్కినవానిలో మఱికొన్నిటి నిఁక ముందు మనము వ్రాయఁబోవు నీచారిత్రభాగములో వివరించెదము. అవి కేవలము గ్రంథస్థగాథలు కాకున్నను గోదావరీ మండలములోని సంప్రదాయజ్ఞుల వలన వాడుకొనంబడినవి గావునను, విశేష కాలముక్రిందటివృత్తాంతములు కావు గనుకను కేవల మవిశ్వసనీయము లని చెప్పవలసినది లేదు. పైచారిత్రములోని పద్యములకు టీక ప్రకటించినఁగాని అందలిచమత్కారార్థము బోధ కాదు. కావున వాని నన్నిటి నొకచోఁ బ్రకటించెదను.

## లంకావిజయోదాహృతపద్యవ్యాఖ్యానము

౭౭.* రాఘవార్థము. చలంబు వద్దు ఇఁకన్, ఓమానిని=మానవంతురాలా, ముదమ్ము=సంతోషమును, అనఁగా రూఢసత్కృపన్=దయచేతను, మన్నుము=జీవింపఁజేయుము.

లక్ష్మణకవియర్థము. ఏన్ = నేను, నినున్, ఆశ్రయించి = అనుసరించి, హృదయేప్సితము=మనస్సునందున్న కోర్కెను, తీర్చికొందున్ అనన్=అనెడు, పూనికన్=ప్రతిజ్ఞచేత, చేరవచ్చినన్=చేరఁగా, ననున్, కడకంటను=కీఁగంటిచేతనైనను, చూడవు ఏమి, ఇంపు=ఇష్టము, ఊనఁగన్, మాటలు, ఆడుటకున్, ఒప్పవు. ఇదేమి, చలంబు వద్దిఁకన్=మత్సరముతో గలసియుండుటను, మాని, ఓదమ్మనా, ఇమ్ము మీఱఁగన్=రహస్యము అతిశయింపగా, నిరూఢసత్కృపను=నిశ్చయమయిన దయను, మన్నుము=వృద్ధిబొందింపుము.

౭౮. రా. లంకన్, విడచి, ఆనందగరిమము, అనఁదగదు, ఈవ=నీవే, ననున్, పొందఁగదే.

ల. నగు మొగముతోడన్=నవ్వుచున్న మోముతో, దయ ఇగుర్తన్=చిగిరింపఁగా, ననున్, చూచి, తాల్మిన్=ఓరిమిచేత, ఎదన్=ఉల్లమునందు వేడుక=కౌతుకము, మీఱఁగన్, లంకన్=లంక నేలను, విడిచి, ఆనందగరిమము సంతోషాతిశయము, అనన్=పొందఁగా, తగన్. దీవనను=ఆశీర్వచనమును, పొందఁగదే.

౭౯. రా. ఒనరుమద్వాక్కులందున్, ఎలుంగునకున్=కంఠమునకు, వాగనుశాసనుఁడైనను=బ్రహ్మయయినను. బద్ధుఁడగును కంఠమెత్తి నేను మాట్లాడునపుడు బ్రహ్మయైనను నా కోడుననుట, అలఘు మద్దివ్యగోచయంబులకున్=బాణపరంపరలకు, శ్రీ=లక్ష్మియొక్క, మనః=మనస్సనెడు, వసు=ధనమునకు, చోరుఁడు=హరించువాఁడగు విష్ణువైనను, బద్ధుఁడగును=ఓడుననుట.

ల. ఒనరుమద్వాక్కులన్ = ప్రకాశించునట్టి నామాటలచేత, తెలుంగునకున్=ఆంధ్రభాషకు, వాగనుశాసనుండైనను=ఆంధ్రవ్యాకరణ సూత్రములు చేసి భారతము గొంత తెనిఁగించిన నన్నయభట్టైనను, బద్ధుండగును=కట్టువడును, నాప్రయోగమందు తప్పించఁడనుట, అలఘు=విస్తారములగు, మత్=నాయొక్క, దివ్య=ప్రకాశించుచున్న, గోచయంబులకు=మాటలకు, శ్రీ=శోభాయుక్తమగు, మనః=మనస్సును, వసు=ధనముగల, చోరుఁడైనను ఈపేరుగల కవియైనను, బద్ధుఁడగును= అంగీకరించు ననుట.

రా. ఓ రామ = ఓసీతా, కవ్యాదులు=పితృదేవతలును, సూర=సూర్యుఁడు, ని. సూరసూర్యార్యమాదిత్యద్వాదశాత్మదివాకరాః. అమరము కవి=శుక్రుఁడు, ప్రముఖ=మొదలుగాఁగల, పృథుప్రతిభావంతులు=గొప్పకాంతి గలవారు, భీమశ్రీనాథుల్=శివకేశవులైనను, రూఢధృతిన్=నిశ్చితమైన ధైర్యముచేత, వెలయఁగన్=కూడఁగా, నాకరణి దిట్టలే=నావలె గట్టివారా? కారనుట.

ల. తెలియన్= తెలియు నట్లు, విను రామకవ్యాదులు =తురగా రామకవి మొదలగువారును, సూరకవి=పింగళిసూరన, ప్రముఖ= మొదలుగాగల, పృథుప్రతిభావంతులు=అధికబుద్ధిశాలులు, భీమశ్రీనాథుల్=వేములవాడ భీమన్నయు, శ్రీనాథుఁడును, రూఢధృతిన్=వహింపఁబడిన ధైర్యముచేత, నాకరణిన్=నావలె, తిట్టలేరు=వారికన్న గట్టిగా బాధించునట్లు తిట్టెద ననుట.

రా. అతనితోన=రావణునితోనే, రసాసంతతి=సీత.

ల. అతనితోన్=లక్ష్మణకవితో, నరసాసంతతి=దమ్మన్న.

రా. ఖరదూషణముఖ్యులు = ఖరదూషణులు మొదలుగాఁగల, కవిగురులు=శుక్రుఁడు గురువుగాఁగలవారు, శుక్రశిష్యులు=రాక్షసులు, నడచినట్టిత్రోవన్=రామబాణ హతులైనవారు పోయినట్లనుట, కోరినదుర్వన్, ఉద్ధురుఁడవు, అగు, మదిన్.

ల. ఖరదూషణముఖ్యులు = రేఫలకారముల కభేదము, ఖల=దుష్టులగునట్టియు, దూషణముఖ్యులు=దూషించుటేముఖ్యముగాఁగల, కవిగురులు=కవిశ్రేష్ఠులు, నడచినట్టిత్రోవన్=నడిచినమార్గమును, కోరి, నడువన్=నడుచుటకు, ఉద్ధురుఁడవు=భారమును వహించినవాఁడవు, అవు=అగునట్టి, నీదు= నీయొక్క, వాక్యవిసర = వాక్యసముదాయముయొక్క, పరుషత్వమునకున్=కాఠిన్యమునకు, మదిన్, ఏను జంకుదును=భయపడుదును.

రా. విన్మా, ఏను, లక్ష్మణాగ్రజన్మమాన్యక్షేత్రము, రాముభార్యను, ఎపుడు, మానగుణము—మాన అభిమానమనెడు, గుణము, లేక, మాన గుణము, పాతివ్రత్యము=ద్వంద్వైకవద్భావము, విడువ, ఈవు, మద్వరోగ్రశక్తిన్=మత్ నాయొక్క, వర=భర్తయొక్క, ఉగ్ర=భయంకరమైన శక్తిన్=శక్తిచేత, లంకన్=ఈలంకను, ఏలఁగలవాఁడవు=పాలించఁగలవాఁడవు, అగుచున్, నెగడవు=వృద్ధినొందవు.

ల. ఓలక్ష్మణాగ్రజన్మ=ఓలక్ష్మణకవీ, విన్మా=ఆకర్ణింపుము, మాన్యక్షేత్రము=నీమాన్యమైనచేను, ఎపుడు, విడువన్=విడిచిపెట్టను, గుణము, పరక్షేత్రాపహారణమును, మానన్=మానను, మద్వరోగ్రశక్తిన్-మత్=నాయొక్క,వర=శ్రేష్ఠమగు, ఉగ్ర=భయంకరమైన,శక్తిన్=సామర్థ్యమును, మానన్, మఱి=ఇంకను, ఈవు=నీవు, లంకనేలగలవాఁడవగుచున్=లంకభూమిగలవాఁడవగుచును, నెగడవు=వృద్ధిఁబొందవు.

రా. ధరన్, ఏను, శ్రీరామేడ్భక్తుఁడన్ = శ్రీరాముఁడనెడు ప్రభువునకు భక్తుఁడను, గరిమన్, నమ్మా, నాదుకతనన్=నావలన, విని=నీవృత్తాంతముననుట. రసాజాని=రాముఁడు, దురితము=ఈ పాపస్వరూపుఁడైన రావణుని, అణఁచి నినున్,రయంబునన్=త్వరఁగానే, నెమ్మిన్=ప్రియముతో, చేన్బన్=తనసమీపమును బొందించికొనుననుట, ఇఁకన్, దొసఁగు=వ్యసనము, ఒందరాదు.

ల. ధరన్=పుడమియందు, నేను, ఇది, అధ్యాహారము శ్రీరామే డ్భక్తుఁడన్, గరిమన్=గౌరవముచేత, నామకతన్=నావృత్తాంతమును, విని, నమ్మ, నరసాజా=దమ్మన్నా, దురితము=ఈబ్రహ్మక్షేత్రాపహరణ దోషము, నినున్, అణఁచి=సంహారించి, నిరయంబునన్=నరకమునందు, చేర్చు, ప్రమాణవచనము. "స్వదత్తాం పరదత్తాం వా యోహరేతి వసుంధరాం, షష్టిర్వర్ష సహస్రాణి విష్ఠాయాం జాయతే క్రిమిః" నెమ్మి= ఇష్టము, రాదు,ఇఁకన్, దొసఁగున్=ఆపదను, ఒందన్=పొందను.

రా. అమ్మా = ఓతల్లీ, నీకున్ కష్టము లేదు, అమ్మా ఇఁక నేగి = కీడును, భీతి=భయమును, ఏది= ఎక్కడ. నీవు, ఘృణన్=జుగుప్స ను, నిందననుట, ఒందన్ రాదు=పొందఁగూడదు, అమ్మా, మదుక్తిన్ నామాట, నిజము, పొలువుగదా=ఇష్టముగదా.

ల. దమ్మా=ఓదమ్మన్నా, లే=లెమ్ము, దమ్మా, కష్టము=ఆయాసము, నేగి=అనుభవమును, భీతి=భయమును, (నీకేవచ్చునని శేషము,) దమ్మా. నీవు, ఘృణన్=జుగుప్సను. ని. ఘృణా జిగుప్సా కృపయోః. జుగుప్స యనఁగా నింద. ఒందన్=పొందుటకు, రా=రమ్ము, దమ్మా, ఇంకన్, మిన్నక=ఊరక, పో=వెళ్లు. ఓదమ్మా! మదుక్తి, నామాట, పొలువుగన్=ఇష్టముగా, నిజము=వాస్తవము.

ఉ౧ రా. నీవు జీవితేశునికడకుఁ=ప్రాణనాథుఁ డగురామునివద్దకు. ని. జీవితేశో యమ ప్రియా. చనుసమయము, ఇదె వచ్చెను, వేగిరపడకుము=ఉద్బంధనాదియత్నమును జేయవలదనుట.

ల. అనియిట్లు, అనేకములు, పెంపు=వృద్ధి, ఎనయంగాన్=ఒప్పఁగా, పలికి, నీకున్, జీవితేశునికడకున్ = యమునివద్దకు, చనుసమయము=వెళ్లెడుకాలము. ఇదె వచ్చెను=ఇదిగో వచ్చినది. వేగిరపడకుము= త్వరపడవలదు, అనుచుఁ=చెప్పెను. మఱియున్.

రా. ఓపికవాణీ = కోకిలపలుకులవంటి పలుకులు గల ఓసీ తా, నేను, రచనానైపుణీ=కల్పనాచమత్కారము, నీమదికిన్=నీయుల్లమునకు, ఒప్పి=ఇష్టమై, నాటుకొనంగన్=నీపతితత్వంబు నీపతియొక్క నిజమును. వ్యాపకతన్=చెందునట్లు, వర్ణించెదన్.

ల. ఓదమ్మన్నా నేను, ఓపికన్=ఒపికచేత, నీమదికిన్ = నీమనస్సునకు, నొప్పి=ఆయాసము, నాటుకొనంగన్=నాటుకొనునట్లు, నీపతితత్వంబు=నీపాపాత్ముఁడౌటను, వ్యాపకతన్=వ్యాపకత్వమును, చెందునట్లు, వర్ణించెదన్=వర్ణింతును.

రా. లంకనేల=ఈద్వీపము, కొలన్ = యుద్ధమందు ముల్లోకంబులెఱుఁగన్, ఏడుపున్=రోదనమును. అందున్=పొందును, లంకలోనున్న జనులు రోదనము చేతురనుట, ఇది అజహాత్స్వార్థ యనులక్షణ. పరక్షేత్రాప్తి=పరునిభార్యను పట్టుట, మేలు కాదు, ఆభూమిజాతన్=సీతను, ప్రీతితోడ, వీడుము. భారతప్రమాణము.—"క. పరదారగమన మొప్పదు, పురుషులకది యెల్లపాపములకంటె నరేశ్వర పరమాయుస్సంక్షయ, కరంబు తద్వర్జనంబు కడు మేలరయన్."

ల. లంకనేలకొల=లంకనేలయొక్క ప్రమాణము, లోకంబులెఱుఁగన్, ఏడుపందుకుల్=మూఁడుపుట్లపందుము, పరక్షేత్రాప్తి=పరునిమాన్యముగొనుట, మేలుకాదు, పేర్మిన్=ఇష్టముగా, నాభూమిన్=నామాన్యమును, జాతసంప్రీతితోడన్=పుట్టిన సంతోషముతో, వీడుము=విడిచిపెట్టుము, అదియె=ఆ యిచ్చుటె. ఇచ్చున్.

రా. జ్యేష్ఠుఁడా = రావణా, లక్ష్మణాగ్రజక్షేత్రము = రాముని భార్యను, ఈవు=నీవు, వదలకుండుట, మోసంబు=కార్యకారణముల కభేదము, ఇంకన్, చండ=యమభటుల వంటియు, ని. "చండో దైత్యవిశేషే యమదాసే త్రిషు తు తీవ్రకోపనయోః." నిర్భీక=భయములేనట్టి వనచారి=వానరములయొక్క, పిండి=సమూహము, ప్రోలికిన్=ఈద్వీపమునకు వచ్చున్=ఏతెంచును, అవి సూర్యునియొక్క, ని. "అవి శ్శైలే

రవా మేషే "కుల=వంశమునందు, వరుత్తో౯=శ్రేష్ఠుఁడగు రామునితో, రిపుత=వలదు.

ల. జ్యేష్ఠుఁడా=అన్నయ్యా, లక్ష్మణాగ్రజ= లక్ష్మణకవియొక్క, క్షేత్రము=మాన్యమును, ఈవు=నీవు, వదలకుండుటన్, దీనిచేత, మోసంబు=హాని, వచ్చు౯; ఇఁకన్, చండ=కోపముగల, నిర్భీ=భయములేనట్టియు, కవనచారి=కవిత్వముచేత తిరుగునట్టి, పిండిప్రోలి=ఈపద మింటిపేరుగల, కవికులవరుళ్తోన్=కవిసమూహ శ్రేష్ఠునితో, రిపుత=వైరము ముఖ్యముగన్, వలదు.

రా. భూతలంబునందున్, ఎలుంగులరా=ఎలుఁగుబంట్లకు రాజు, జాంబవత్=జాంబవంతుఁడను, సమాఖ్య=పేరుచేత, వఱలెడు=ప్రకాశించునట్టి,నిపుణుండు=నేర్పరి,వాగనుశాసనుండు=బ్రహ్మవంటివాఁడు,బ్రహ్మవలనఁ బుట్టినవాఁడు, తిమ్మఁడు=ఒకఁడు=ఒక వానరుఁడు హనుమంతుఁడు, ధూర్జటి=శివసమానుఁడు, శివాంశవలనఁ బుట్టినవాఁడు, కాఁబట్టి, రామలింగసంజ్ఞాప్రథితుఁడు=రామునియొక్క ఉంగరమనెడు చిహ్నకలవాఁడు గనుక ఈసంజ్ఞ చేత ప్రథితుఁడు, భాస్కరపోత=సూర్యపుత్రుఁడగు, సుగ్రీవుఁడును, నల=నలుండును, ఆదిక=మొదలు గాఁగల. వనచారులు, బుధవరుల్=దేవతాశ్రేష్ఠులు, తదంశజులనుట, మఱియున్,అనుపమాన=సాటిలేని,కృతి=కుశలుఁడు, రామభద్రుండు=శ్రీరాముండు. శ్రీనాథుఁడు=విష్ణ్వంశవలనఁ బుట్టినవాఁడు=, కళలన్=కళలచేత, సోముండు=చంద్రసమానుఁడు,పెద్దనకరణిన్=రామునివలె, వెలయు,రెండవవీరుండు, లక్ష్మణాఖ్యుఁడు=ఈపేరుగలవాఁడు,అనూనమతి=అధికబుద్ధిశాలి,నిరూపణము సేయన్,కుండిలీంద్రుఁడునుమ్ము=శేషుఁడునుమూ, "ని. కుండలీ గూఢపాచ్చక్షుశ్శ్రివాః కాకోదరః ఫణీ." కాన చలంబు వలదు.

ల. లలిన్=క్రమముగా, భూతలంబునన్, రాజాంబవత్స=లక్ష్మణకవి, తెలుఁగులన్=తెలుఁగుఁబలుకుబడులయందు,మాఖ్య=మల్లెపువ్వవలె,శుభ్రమయిన, ప్రసిద్ధిన్=కీర్తిచేత,వఱలెడు=ప్రకాశించునట్టి, నిపు

ణుఁడు=నేర్పరి, వాగనుశాసనుఁడు=నన్నయభట్టును, తిమ్మఁడు=ముక్కు తిమ్మనయొకఁడు, ధూర్జటి=ఈపేరుగల కవియును, రామలింగ సంజ్ఞాప్రథితుఁడు=తెనాలిరామలింగకవియు, భాస్కర=హుళిక్కి భాస్కరుఁడును. పోతనలు=బమ్మెర పోతరాజు, ఇక్కడ. నకారమున కుత్వము రావల యు నని కొందఱనిరి. పోతనశబ్దము దేశ్యము. ఇది స్త్రీసమముగాన "పర వల్లింగం ద్వంద్వతత్పురుషయోః." అను న్యాయముచేత స్త్రీలింగసమ మైనపోతనశబ్దమునకు "మహత్తో ఉత ఉ ద్విభక్తౌ" అని ఉత్వము రా కపోయెను. వీరు, ఆది=మొదలుగాగల, కవనచారులు=కవిత్వమందు వర్తించువారు, అనుపమాన=సాటిలేని, కృతి=గ్రంథముగల, రామభ ద్రుఁడు=అనుపతఁడును, శ్రీనాథుఁడు=అను కవియు,గణింపన్, బుధవరుల్ పండితశ్రేష్ఠులు, తదధికులు, తత్సములు, ధరణిన్, లేరు, కళలన్= వి ద్యలచేత, సోముఁడు=సోమకవి, పెద్దన్నకరణిన్=అలసాని పెద్దనవలె, వెలయుచుండున్=ప్రకాశించుచుండును, రెండవవీరుండు=పిల్లలమఱ్ఱి చిన వీరన్న, అనూనమతి=గొప్పబుద్ధి గలవాఁడు, సిరూపణము సేయున్, లక్ష్మణాఖ్యుఁడు= ఈలక్ష్మణకవి, కుండలీంద్రుండు సుమ్ము=తిక్కనసోమ యాజిసుమా, తత్సదృశుఁడనుట. యజ్ఞము చేసి కుండలేష్టి చేసినవా రు కుండలములను ధరించుదురు. అందఱికన్నను గొప్పవాఁడనుట. కా నన్, చలంబు=మత్సరము, వలదు=వద్దు.

రా. భారవిన్ = కాంతిచేత సూర్యసమానుఁడయినట్టియు, ఘన=గొప్పవారగు, సుబంధున్=మంచిబంధువులుగలిగినట్టియు, ఆభవ భూతిన్=ఆశివునివల్లనైన సంపదగలిగినట్టియు, బాణుసన్=బాణాసురు ని, సర్వగీర్వాణపదంబులన్=సమస్త దేవతాస్థలములను, కొనినవారి న్=పుచ్చుకొనినవారిన్=పుచ్చుకొనినవారిని, తదన్యులన్=హిరణ్యాక్షుఁ డు మొదలగువారిని, ఆయనతోడ కలహించి యోడినవారిననుట, విం దుమేకదా. అన్నా, రణవిద్యన్=యుద్ధవిద్యయందు, వారికన్నన్ మ తినూక్ష్ముఁడవా = సూక్ష్మబుద్ధి గలవాఁడవా, అతఁడు, పురుషోత్తముఁ డు = విష్ణుమూర్తి, అపుకతఁబునన్; నినుఁ, నిష్ప్రాణున్, చేయున్,

ల. సర్వగీర్వాణపదంబులన్=సమస్తసంస్కృతపదములను, కొనినవారిన్=గ్రహించినట్టివారిని, బాణ, భారవి. సుబంధు. భవభూతులను. తదన్యులన్=లాతివారిని, విందుమేకదా, పేరికన్నన్, అతండు అవారణవిద్యన్=అడ్డులేని కవిత్వవిద్యయందు, మతిసూక్ష్ముఁడు=సూక్ష్మబుద్ధిగలవాఁడు, అతఁడు, పురుషోత్తముఁడు=పురుషశ్రేష్ఠుఁడు, ఔకతంబునన్=అయినందున, నినున్, నిష్ప్రాణున్, చేయున్.

రా. తదనంతరంబ, నిజవిజయంబుఁ గోరుచుఁ బయలు వెడలినట్టి, ఆలంకాపతి=రావణుఁడు, పటుతరగోశక్తి=సమర్థమగుబాణసామర్థ్యముచేత, హరిబలంబున=వానరసేనయందు, ధృఢతగల=ధృఢత్వము గలిగినట్టి, అంగదాదుల=అంగదుఁడు మొదలగువారిని, లీలనాక్రమించి=యుద్ధవిలాసముచేత నాక్రమించినవాఁడై, సుదర్శనహస్తనాభివత్స జఘనధృఢత్వంబడంచుచు=రథాంగపాణియొక్క నాభికమలమునకు శిశువగుబ్రహ్మవలనఁ బుట్టినట్టి జాంబవంతునియొక్క యధికమగుధృఢత్వము నడంచివైచుచు, పృథుజంఘాతిశయబలంబు ద్రుంచుచు=పృథుండు, జంఘుండునువానరులయొక్క యధికశక్తి నపహరించుచు, సుబాహు గంధవహాత్మజానుతాపం బొనరింపుచు=సుబాహునకు హనుమంతునకుం దాపంబు సేయుచు, నీలతారకోపస్థితి విఫలంబు జేయుచు=నీలునియొక్క తారునియొక్క గోపస్థితిని వ్యర్థమును జేయుచును,సుముఖ సుగ్రీవాదులకు వివర్ణతం బుట్టించుచు=సుముఖుఁడు=సుగ్రీవుఁడు మొదలగు వానరులకుం గాంతిహైన్యముం గలుగఁ జేయుచు, చేరి=సమీపమునకు వచ్చి, అన్నరసమాజనిన్=రాముని, ఒక్కింత వివశతనొందింపన్=ఇంచుకంత మూర్ఛనందింపఁగా,ఆలక్ష్మణాగ్రజుండు=ఆరాముఁడు అంత, ముఖ్యశత్రు వధార్థంబుగాన్=రావణవధనిమిత్తముగా, అనుపమానాగస్తిమితవచనాంగీ కృతహరిమంత్రుండై=అసమానుఁడగునగస్తునియొక్క మితవాక్యములచే నంగీకరింపఁబడిన సూర్యమంత్రము గలవాఁడై, "అగస్త్యఉగస్తిః" ద్విరూపకోశము.కమలాప్తుం డగుభగవంతున్=పద్మమిత్రుఁడగు భగవంతుని,వేదవి

ధ్యుక్తంబుగా, నిశ్చలభావంబున ధ్యానంబు జేసి=శ్రుతి విధ్యుక్త మగు నటుల నిశ్చలత్వముచే ధ్యానించి, తత్ప్రసాద శుచిగోశక్తిఁ వృద్ధిబొందుచున్న రామునియొక్క దివ్యమగునట్టి యగ్నిరూపబాణ సామర్థ్యముచేత, అడఁగెను. 'శుచిరప్పిత్తమ్.' అమరము.

ల. తదనంతరంబ నిజవిజయంబుఁ గోరుచుం బయలుదేఱినట్టి యాలంకాపతి=ఆలక్ష్మణకవియొక్క, పటుగోశక్తి=తిక్కవగానట్టి వాక్యసామర్థ్యము, హరిబలంబున=విష్ణుబలము చేత, ధృషత కలయన్=ధృషత్వము వ్యాపింపఁగా, గదాదులలీలన్=రోగములు మొదలగువాటివలెను, 'రోగవ్యాధి గదామయాః.' అమరము. ఆక్రమించి=అతిమినదై, సుదర్శన=సుదర్శనముయొక్క, హస్త=కరములయొక్క, నాభి=పొక్కిలియొక్క, వత్స=వత్సముయొక్క, జఘన=కటిపురోభాగముయొక్క దృఢత్వం బడంచుచున్, పృథు=విశాలములగు, జంఘా=పిక్కలయొక్క అతిశయబలంబుద్రుంచుచు, సుబాహు=శుభమగుభుజములకును, గంధవాహ=నాసికకును, ఆత్మ=మనస్సునకును, జాను=మోఁకాళ్లకును, అనుతాపం బొనరింపుచును. "క్లీబే ఘ్రాణం గంధవహా ఘోణా నాసా చ నాసికా" అమరము. నీలతారకోపస్థితి=నల్లనైనకనుగుడ్లయొక్కయునికిని, "తారకాక్ష్ణః కనీనికా." అమరము. విఫలంబుఁ జేయుచు, సుముఖసుగ్రీవాదులకు=సుందర మగుముఖము శుభ మగుకంఠము మొదలగువాటికి, వివర్ణతం బుట్టింపుచు. చేరి, అన్నరసమాజవర్యు=అనరసమ్మ కుమారులలో శ్రేష్ఠుం డగుదమ్మనను, ఒక్కింత వివశతనొందింపన్, ఆలక్ష్మణాగ్రజుండు=ఆలక్ష్మణకవి, అంతట, ముఖ్యశత్రువధార్థంబుగాన్=దమ్మన్నయొక్క వధనిమిత్తముగా, అనుపమానాగస్తి మితవచనాంగీకృత హరిమంత్రుండై, ఉపమలేనట్టియు, నిర్దోషములగునట్టియు, నిశ్చలములగునట్టియు వాక్యములచే నంగీకరింపఁబడిన విష్ణుమంత్రము కలవాఁడై కమలాప్తుండగు భగవంతున్=లక్ష్మికి నాప్తుఁడగు భగవంతుని వేదవిధ్యుక్తముగా నిశ్చలభావంబున ధ్యానంబుజేసి, తత్ప్రసాదలబ్ధ దివ్యతేజో

బలవిశాజితుండై, యాత్మీయామోఘగోశక్తి=తనసంబంధమగు వ్యర్థము కాని వాక్యసామర్థ్యము, ప్రకటం బగునట్లుగా విజృంభించిన.

రా. లలిక్=సుందరముగా, మున్ను, అలబుధవైరికిక్=ఆరావణునకు పొలుపు నెఱయ నాభిముఖ్యముగనున్న సొగసుప్రకటనమగు నటుల నాభియందు ముఖ్యముగనున్న యట్టి, సుధాతులసద్బలము=అమృతముయొక్క యసమానమగు బలము, పేర్చు లక్ష్మణాగ్రజుని దివ్య కమలాప్తుండగు భగవంతుక్=లక్ష్మికి నాత్ముఁడగు భగవంతుని, ఆలక్ష్మణుండు, గారాము నెఱయు నానతిఁ జేసి=ప్రీతిప్రకటమగునట్టి నమస్కారమును గావించినవాఁడై, గభీరభాషణంబులఁబలికెక్=గంభీరవాక్యములను వక్ష్యమాణప్రకారముగాఁ బలికెను

ల. లలి మున్ను, అలబుధవైరికన్=పండితవిరోధియగుదమ్మన్నకు, పొలుపు నెఱయన్, అభిముఖ్యముగానున్న=స్వభావసిద్ధముగానున్నట్టి, సుధాతులసద్బలము=శుభ మగుధాతువులయొక్క ప్రశస్త మగుబలము, పేర్చులక్ష్మణాగ్రజుని దివ్యశుచిగోశక్తిన్=వృద్ధినందుచున్నట్టి లక్ష్మణకవియొక్క దివ్యము లగునట్టియుఁ బవిత్రము లగునట్టియు వాక్యములయొక్క సామర్థ్యముచేతను, అడఁగెను.

రా. ఏపుచెడి=హెచ్చడంగి, నవకములడఁగి=తొమ్మిదితలలు పోయి, 'కంశిరోంబునోః.' అమరము. గోపాలతనూజు=దశరథరాజతనూజునియొక్క, అతను=అధికమగునట్టియు, గురు=శ్రేష్ఠమగునట్టిదియు, వాణీశ=బ్రహ్మసంబంధమగు, అస్త్రోపాసనము=అస్త్రముయొక్క యుపాసనము, అనఁగా బ్రహ్మాస్త్రోపాసనమనుట, సఫలముగన్=సార్థకముగ. ఆపరుఁడు=శత్రుడగునారావణుఁడు, హృదయము సెదరి=వక్షము వ్రక్కలై, అసువులఁబాసెక్=ప్రాణములు వదలెను.

ల. ఏపుచెడి=అతిశయముపోయి, నవకములడఁగి= శరీరముయొక్కనవకముపోయి, గోపాలతనూజుక్=లక్ష్మణకవియొక్క, అతనుగురు=విష్ణువునుగూర్చినట్టి, వాణీ=సరస్వతినిగూర్చినట్టి, శాస్త్రోపాసనము=శా

స్తోత్ర మగునుపాసనము, సఫలముగన్=సార్థకముగ, ఆపరుఁడు=ఆద మ్మన్న, హృదయము సెదరి=మనస్సు చెదరి, అసువులఁబాసెన్=ప్రాణ ముల విడచెను.

రా. శ్రితు = ఆశ్రితుఁడగునట్టియు, సరమాకాంతుని = సర మయను స్త్రీమగఁడగునట్టియు, బుధనుతున్=దేవతలచేఁ గొనియాడఁబ డునట్టియు, అసురవర్యు=రాక్షస శ్రేష్ఠుఁడగునట్టియు, విభీషణుని, లక్ష్మ ణుండు=లక్ష్మణస్వామి, రాము నెఱయునానతిన్=రామునియొక్క ప్రకట మగునాజ్ఞచేత, లంకాపతిగాఁజేసి=లంకకు రాజునుగాఁజేసి, గభీర భాష ణంబులఁబలికెన్=గభీర వాక్యములను బల్కెను,

ల. శ్రితు=ఆశ్రయింపఁబడినట్టియు, సరమాకాంతుని=లక్ష్మియ ను స్త్రీకి పెనిమిటియగునట్టియు, బుధనుతున్=పండితులచేఁగొనియా డఁబడునట్టియు, అసురవస్య=సురశ్రేష్ఠుఁడగునట్టియు నావిష్ణునిగూర్చి, లంకాపతి=లంకభూమికి నధిపతియు, లబ్ధదివ్య తేజోబలవిరాజితుండై= సూర్యప్రసాదముచే నొందఁబడిన దివ్యతేజముచే బలముచేఁ బ్రకాశిం పఁబడినవాఁడై, ఆత్మీయామోఘగోశక్తి ప్రకటంబగునట్లుగా విజృం భించిన, తనసంబాధ మగువ్యర్థము కానివాక్యసామర్థ్యము ప్రకట మ గునట్లు విజృంభించిన.

రా, సూర్యుఁడు చంద్రుఁడు నక్షత్రములు భూమి రాము నికథయును, నెన్నిదినంబు లుండునో యన్నిదినములును శత్రుభయ విర హితముగా దానవనాథుఁడ వగుచు నోవిభీషణుఁడా లంక నేలుమిఁకన్=ఇంత టనుండి లంకాపురిని బాలింపుము.

ల. దానవనాథవిభీషణా=రాక్షసశ్రేష్ఠులకు మిగుల భయంక రుఁడ వైనట్టి యోస్వామీ, లంక=లంకపాలమును, ఏలుమిఁకన్=ఇఁక పరిపాలింపుమా (శేష మొకటే రీతి యని గ్రహింపవలయును.)

ఇట్లింతవఱకును లక్ష్మణకవిచరిత్రమును గ్రంథస్థ మైనదానిని వివరించి యున్నాను. ఇఁక వ్రాయఁబోవుచారిత్రము గ్రంథస్థము కా నిదై యుండును.

ఈచరిత్రారంభములో నీకవి సకాలీనుల నుదాహరించి యున్నాఁడను. అందులోని యందఱితోడ నీకవి చరిత్రకు సంబంధమున్నట్లు వినియున్నాఁడను. వారిలోఁ గథలుగా వాడుకొనంబడునవి యీకవికిని శిష్టుకృష్ణమూర్తిశాస్త్రి కవికిని నడచిన సంవాదాదికములై యున్నవి. ఇట్టివాని నుదాహరించుటలోఁ గవిచారిత్రములు ప్రకటించుతలంపే గాని వేఱుగాదు. కావున వారివారిప్రస్తుతసంబంధు లగువంశములవారు మాయెడ నాగ్రహించఁగూడదనియును ఈగాథ లిపుడు వ్రాఁతమూలములు గానియెడల మఱికొన్నిదినములకైన నివి బయలువెడలక మానవనియును అపుడు మనము చేసినమాత్రమైనఁ బరిశీలన చేయుట కవకాశముండక మఱికొన్ని యసందర్భవాక్యములు చేర్పఁబడుననియుఁ గావున నిదివఱలోఁ జేయఁబడిన పరిశీలనమునే యిపుడు ప్రకటింపుదు ననియుఁ జెప్పుచున్నాను.

### కృష్ణమూర్తికవి గ్రంథరచనాకారణాదికము.

పైకృష్ణమూర్తిశాస్త్రికవి కోటరామచంద్రపురము పరగణాలకు జమీందారుఁడగు కాకర్లపూఁడి రామచంద్రరాజును దర్శింపఁబోవుడు నా ప్రభుండు కృష్ణమూర్తిశాస్త్రికవి విద్యావిశేషములు వినియున్నవాఁడు గావున తనపేరిట నొకగ్రంథము రచియింపఁ గోరెను. దానికి సమ్మతించి కృష్ణమూర్తిశాస్త్రికవి సర్వకామదాపరిణయ మను నొకప్రబంధమును తనప్రజ్ఞ వెల్లడి యగునట్లుగా రచియించి తెచ్చెను. అట్టిగ్రంథమును కృతి నందుతలంపున సుముహూర్తంబు నిశ్చయించుకొని ఆనాఁడు సభ చేసి గ్రంథము నందెద నని రాజు పైకవికిఁ దెలియఁబఱిచెను. కవియును దానికి సమ్మతించి సభకు నాహ్వానము చేయవలసినపండితులకుఁ బత్త్రికలు వ్రాయించి పంపుఁడని కోరఁగా రాజు దానికి సమ్మతించి అప్పటికి రాఁదగుపండితులపేరులు తెలుపు మని చెప్పెను. అపుడు కృ. కవి తనజ్ఞాపకములో నున్నకొందఱి పేరులు చెప్పెను. రాజసన్నిధానవర్తులు మఱికొందఱి పేరులు వక్కాణించిరి. వానికిని కృ. కవి సమ్మ

తించెను. అపుడు వారిలోఁ గొందఱవలన పిండిప్రోలి లక్ష్మణకవియొక్క నామమును తెలుపంబడినది. ఆపేరు వినినతోడనే కృ. కవి మీరు చెప్పినయతఁడు కవిత్వసంభావన లిచ్చెడు పెండ్లిపందిళ్లలో జరిగెడుసభలకుఁ బోవలసినవాఁడేకాని యిట్టిసభకు రావలసినవాఁడు కాఁడు. కాఁబట్టి అతనిపేరు జాబితాలోఁ జేర్చవల దని యధిక్షేపించి చెప్పెను. దానికి రాజసన్నిధానవర్తులుగాని రాజుగాని సమాధానము చెప్పక మీ యిష్టము వచ్చిన వారినే పిలువ నంపుఁ డని చెప్పి యూరకుండిరి. కృ. కవియు నటులనే తనయిష్టమువచ్చిన వారిపేరిటనే శుభలేఖల నంపించెను. వానింబట్టి సభ కందఱును వచ్చియుండిరి.

## లక్ష్మణకవి రామచంద్రపురమునకు వచ్చుట.

రాజసన్నిధి తనవిషయమై జరిగినవృత్తాంతమంతయు హితులవలన విని లక్ష్మణకవి తనయందు కృ. కవికిఁ గలయసూయచే నట్టి ప్రస్తావన చేసియున్నను రాజు వివేకియే అయిన దానిం దిరస్కరించి పదిమందిపండితులతోఁ బాటుగాఁ దనకును వర్తమానము బంపక పోవుటకు వగచి పిలువకున్న నైన సభలోనికిఁ బోయి తనప్రజ్ఞాదికములం జూపి రావలయు నని నిశ్చయించి ఆనాఁటికిఁ దాను రామచంద్రపురము వచ్చి చేరెను. అంతట ల. కవికి రాజాస్థానమున జరిగినవృత్తాంతముఁ జెప్పినమధ్యవర్తులే. కృ. కవితో లక్ష్మణకవి గ్రామములో వచ్చియున్నాఁడు. కావున వర్తమానము బంపుట మంచి దనియును, ల. కవి కోటకుఁ బోవుమార్గములోనే బస చేసియుండెం గావున మర్యాదకు స్వయముగా నాహ్వానము చేసిన మఱియును మంచి దనియుంజెప్పిరి. ఆమాటలను గృ. కవి లక్ష్యము పెట్టక తనయూర నుండి యింతదూరము రాఁగల ల. కవి యీయూరిలో నుండు రాజ సభకు రాలేఁడుగనుక నా? మనము పిలువకుండినను బోప ముండ దని సమాధానము చెప్పెను. ఆవృత్తాంతముం దెలుసుకొని ల. కవి తనంతటనే సభ ప్రారంభమైన కొంతసేపటికి బైలుదేఱిపోయి తనరాక రాజునకుఁ

దెలియ వర్తమానంబు పంచెను. అది విని రాజు లోకమునకు జడిసి రమ్మని మాఱువర్తమానంబు పంపెను. అంతట ల. కవి సభలోనికి వచ్చెను. రాజనుచితగౌరవంబున ల.కవిని కూర్చుండనియమించి కృష్ణమూర్తిశాస్త్రిలు చేసినప్రబంధము వినుచున్నాము మీరును సమయమునకే వచ్చినారుగావున దీనిని విని యిందలి గుణదోషములను బరిశీలించి మాకుం గృతినిప్పింపుం డని యుపచారముగఁ జెప్పెను. దానికి లక్ష్మణకవి సమ్మతించక నే నెంతవాఁడను. కృ.కవి మహాపండితులు, మీరు మహాప్రభువులు సభచేసి చిత్తగించుచున్నారు, కావున నేనును మీతోపాటుగ వినుచుం గూర్చుండెద ననియెను.

ఆమాటలకు రాజు సమ్మతింపక అలభ్యయోగంబుగ మీయట్టి మహాకవులు తటస్థించినయపుడు గ్రంథము పరిశీలించఁబడకపోయిన నిఁక మఱియెప్పుడు పరిశీలింపఁబడవలయును. కావున నంగీకరించక తప్ప దనుడు మీ రంగీకరించినశాస్త్రి యంగీకరింపవలయునుగదా ? శాస్త్రికిని మాకును సరిపడదుకావున నన్ను బలవంతపెట్టవల దన నా పల్కులు విని కృ.కవి యాగ్రహించి రాజుంజూచి యిట్లనియె. ఈయాస్థానములో లక్ష్మణకవిని విద్వాంసుఁ డని వచియించుట హాస్యాస్పదము కాకపోవునా ? అనేకులు మహావిద్వాంసు లుండఁగా నీతని నేమేమొ పెద్ద వని ప్రభుఁ డనుచుండ సిగ్గులేక తానును తగుదు నని ల.కవి యొప్పుకొనుచున్నాఁడు. నాగ్రంథములోఁ దప్పుపట్టువా రుండుటయే కల్గిన నతఁడు లక్ష్మణకవి కన్యుఁ డగుఁగాని లక్ష్మణకవి కాఁడు. ఈతఁడు పేరునకు లక్ష్మణకవి యేమైనను కవితావిషయములో నవలక్షణకవియే యనవలెను గదా ? అని కృష్ణమూర్తిశాస్త్రి గద్దించి పల్కిన దానికి రాజేమియుననఁజాలక యూరకుండెను. అట్టి రాజుయొక్క శక్తిహీనతయును, కృ. కవియొక్క విజృంభణమును జూచి ల. కవి కృష్ణమూర్తికవిని యడికించినం గాని కార్యము గా దని నవ్వుచు రాజుదిక్కు మొగంబై చూచి ఆసమీపమునఁ బడియున్న యొకకటికుక్కం జూచి

" ఈశునకము కృష్ణమూర్తియే యెన్నంగన్ "

అని యూరకుండెను. అట్టిమాటకుఁ గ్రుద్ధుండై కృ. కవి యిట్లనియె :—

"క. దాశరథీశబ్దంబును, దా శరధిపరంబు చేయుదైవ్యయుక్తికి దు
ర్ధీశక్తిబిడాలమునకు, నీశునకము కృష్ణమూర్తియే యెన్నంగన్."

అని కృ కవి ల.కవి ఆనటలోఁ బ్రయోగించిన యొకప్రయోగములోనితప్పుం జూపెను. ఇట్టివాక్యంబులు విని ల. కవి నవ్వుచు నేను గౌరవార్థముగా నీ కృ.కవిని నుతించిన నీతఁడు తా నంతస్తోత్రమునకుఁ దగనని తాను శునకసామ్యముగలిగియున్న ట్లొప్పుకొనుచున్నాఁడు. ముందు దాశరథిశబ్దమునకు నేను చేసినప్రయోగములోని సాధుత్వము చూపి అనంతరము నేను కృ.కవిని చేసియున్నస్తోత్రముం జెప్పెద నని సభవారిం జూచి యిట్లనియె. దాశరథిశబ్దముతోనితవర్గద్వితీయవర్ణమునకుఁ దద్వర్గములోని చతుర్థవర్ణముం జెప్పితి నని శాస్త్రి దురాగ్రహావేశంబునఁ దా శునకమగుట కొప్పికొనుటయే కాక అట్లే ధ్వనియునుఁ జేయుచున్నాఁడు. దాశరథిశబ్దము సముద్రపరముగాఁ జెప్పంబడియున్నమాట నిజమే. అక్కడఁ దా శరధి అని నేను చెప్పియుండిన కృ.కవి చేసినయాక్షేపణ సరియైనదియే అయియుండును. నామతమున నది యట్లుగాఁ బ్రయోగింపఁబడలేదు. దాశ=పల్లీలయొక్క, రథ=రథములు అనఁగా యానపాత్రములు అట్టివి కలవాఁడు దాశరథి అని సముద్రపరముగా నుపయోగించితిని. ఇం దేమైన దోష మున్నదేమో వైయాకరణశిఖామణులు నిర్దేశించి చెప్పెదరుగాక యనఁగా నచట నుండుపండితులాపక్షములో దాశరథిశబ్దము నిర్దుష్టమే అని యొప్పికొనిరి. దానిపైని కృ. కవి పూర్వపక్షము చెప్పలేక యూరక చూచుచుండెను. అంతట లక్ష్మణకవి నవ్వుచు నిటులనే కృష్ణమూర్తి అని నేను ప్రయోగించిన శబ్దములోఁ గూడఁ గృష్ణకవి పొరుపడి తాను శునకముగా నొప్పికొనియె. చూచితిరే పాండిత్యమున నీకృష్ణశాస్త్రిదే గాక యితరులది పాండిత్యమా! అని ఈశు=శివునియొక్క, నకము=బాణము, కృష్ణమూర్తి

యని నేను కృష్ణకవిని స్తోత్రము చేయం జూచిన నీపండితుఁ డట్టిస్తోత్ర మునకుం దగ నని శునకసామ్య మంగీకరించెను. సభవారు నేను చెప్పిన వాక్యముల లోప మున్న యెడల నన్నును లేకున్నను కృ.కవిని మందలించెదరుగాక. అనుచుఁ బల్కి ఇట్టిలోకోత్తరపాండిత్యముఁ గల దని గర్వించు నీపండితుని గ్రంథంబున నెరులు తప్పు పట్టలే రని సభలో పాగ్యల్భ్యముఁ జూపుట యెందులకు? ప్రసక్తియే తటస్థించినఁ దప్పు లున్నవో లేవో చూడవచ్చును. అధికముగఁ బ్రసంగించిన లాభ మే మున్న దని యూరకుండెను.

## కృ. కవిని గ్రంథము చదువు మని రాజు కోరుట.

ఇట్లుగాఁ బ్రస్తావన నడచినపిమ్మట రాజు కృష్ణమూర్తికవితో సంవాదసమయ మిది కా దనియును, పూర్వపక్షమునకు లక్ష్మణకవి సమాధానము చెప్పియుండెఁగావున నాసంవాదము ముగిసినదియును, ఇఁక మీరు గ్రంథము చదివి నీగ్రంథములో దోషములు లేవనిపించుకొను పని మీ యెందే యున్న దనియు ల.కవి అడిగినప్రశ్నముల కన్నిటికిని సమాధానములు చెప్పి అతని నొప్పించుటయే పండితధర్మ మని చెప్పఁగా దానికి సమాధానము లేక లక్ష్మణకవియే కాదు, ఎవ్వరు వచ్చియడిగిన నేమి భయమున్నది. గ్రంథ మటులనే చదివెదను. అని ల.కవిదిక్కు మొగంబై కృ. కవి యేవర్ణనచదువు మని కోరెదవు. లేక యింకేమి చెప్పు మని కోరెదవో సంప్రశ్నింపు మని విజృంభించెను. దానికి ల. కవి నవ్వుచు నీ కంతయుత్సాహ మే యుండిన నడిగెదను. సమాధానములును జెప్పవచ్చును అని యిట్లనియె

## కృతిపతినిగూర్చి యడుగుట.

ఇపుడు నీవు కృతియిచ్చుచున్న గ్రంథ మెద్ది? ఎవ్వరికిఁ గృతి నిచ్చినావు? ఇపు డేకథాభాగము చదువుచున్నావు? అని ల.కవి సంప్రశ్నము చేసెను. దానికిఁ గృ. కవి నేను కృతియిచ్చుచున్నగ్రంథముపేరు సర్వకామదాపరిణయము. దీనిని శ్రీ రాజా శ్రీకాకర్లపూడి రామచంద్ర

రాజుగారి పేరిటఁ గృతియిచ్చినాను. ఇపుడు చదువుచున్న గ్రంథభాగము కథానాయకుఁ డగుప్రభునివిషయమై యున్నది. అని యుత్తర మిచ్చెను. అటుపైని ల.కవి యిట్లనియె. సర్వకామదకుఁ బరిణయ మేమి అని ప్రశ్నించెను. దానికి కృ.కవి సర్వకామద యనునది యొకదేవత పేరు. ఆదేవతయొక్క కళ్యాణముం జెప్పుచుండుటంజేసి ఆగ్రంథమునకు సర్వకామదాపరిణయ మని పే రుంచితి ననియె.

ల. కవి సర్వకామద నీ కుపాసనాదేవత యైనఁ గానిమ్ము. అట్టిసర్వకామదకు వివాహము చేయఁగమకించినవారి నేఁ గానము. అయినను ఇక్కడ నుండువారివలననే నీసంశయము నివారించెద నని ఆసభయందు నృత్తగీతార్థమై వచ్చి నిలువంబడియున్న యొకవెలయాలిం బిలచి మీ సంప్రదాయములు మీకే తెలియవలెఁగాని మాబోంట్లకుఁ దెలియవు. నీకుఁ బెండ్లి యయినదా లేకున్న నెప్పుడు కాఁగలదు.అని ల.కవి యడిగిన తోడనే నవ్వుచు నా వెలయాలు తనను హాస్యముచేయుటకుఁగాకున్న వెలయాలిపెండ్లిసంగతి తన నేల యడిగెదరనియు బెండ్లియే యయి యుండిన మే మీ సభకు వచ్చుట యెట్లు కల్గు ననియు నుత్తరము చెప్పెను. ఆమాటకు ల. కవి సమాధానము చెప్పక కృ. కవిని జూచి వెలయాలు చెప్పుచున్న సంప్రదాయము విని దానికి సమాధానము చెప్పుట యవసర మనిరి.

కృ. కవి సర్వకామద యనుదేవతంగూర్చి నేను మాటలాడు చుండ నిచ్చట వెలయాలి ప్రసంగ మేల వచ్చెను.

ల. కవి. సర్వకామద వెలయా లగును. గనుక నే నట్లు ముచ్చటించితిని. మీ కిష్టము లేనియెడల మఱియొక ప్రశ్నం బాలోచించెదను. కానిండు. అన్నదమ్ములలోఁ బెద్దవాఁ డుండఁగాఁ జిన్నవానికి వివాహము చేయవచ్చునా ?

కృ. కవి. ఇక్కడ అట్టి ప్రస్తావన యే మున్నది. లేనిపోని ప్రశ్న లేల ?

ల. కవి. ఇక్కడ నట్టి ప్రస్తావన వచ్చినది గనుకనే అడుగుట యైనది. రామచంద్రరా జనుజుండనియును, పద్మనాభ రా జగ్రజుండు నని యెఱుఁగినయంశమే గదా, అట్లుండ నన్నకుఁ గృతినీయనిచోఁ దమ్మున కీకృతికన్యక నెటులఁ బరిణయము చేసెదరు. ఇది ధర్మశాస్త్ర విరుద్ధ మను సంగతి కవికిఁ దెలియకున్నను మీయట్టియాజ్ఞికునకైనఁ దెలిసియుండవలసినదే. అయిన నేమాయెను ఇపుడు. చదువుచున్న కథా భాగములో నీకు నిర్దోషముగాఁ గాన్పించు పద్యము నొకదానిం జదువుము.

కృ. కవి. నా కన్నిపద్యములు నిర్దోషములుగానే కాన్పించుచున్నవి. ఇదివఱలో నిలిచియున్న పద్యము తరువాయి పద్యముం జదివెదను. అది కృతిపతియొక్క ధర్మపత్నీవర్ణనము, అని యీక్రింది పద్యముం జదివె.

చ. తరణిశశాంకు లాభరణదంభమున న్వదనాక్షికైతవాం
బురుహసితోత్పలాగ్రమున ముద్దియకుంతలదేశమాక్రమిం
చి రాకసెపంబుగా ననఁగు చిహ్నముచుం బరరూపయుక్తిని
బ్బరమగ నంత సాంతముగ బ్రహ్మయొనర్చినసీమ పొల్పగున్.

అను పద్యంబు విని లక్ష్మణ కవి రాజుంజూచి యిందులో నొక రహస్యము వ్యక్తమగుచున్నది. అది తెలిసినంగాని యీపద్యము నా కన్వయించదు. కావున దయచేసి నాసందియము నివారించఁ గోరెద నని యడిగెను. దానికి రాజు సమాధానము చెప్పెద నడుగు మనుడు ల. కవి యిట్లనియె.

ల. కవి. మీరాణికి నొకవైపుకంటిలోఁ బువ్వుగాని లేక రెండవ వైపుముఖభాగములో గొప్పపుట్టుమచ్చ గాని యున్నదా?

రాజు. ఇది నాయనుభవమునఁ గనిపెట్టఁబడిన యంశము కాదు. ఇఁక ముం దిట్టిపుట్టు మచ్చ యుండినఁ గనిపట్టఁబడును. కన్నులలోఁ బువ్వులుగాని కాయలుగాని లేవని యిదివఱలో నున్న యనుభవము అనెను.

ల. కవి. అట్లు లేనిచోఁ గృ. కవి యీపద్య మిట్లు చెప్పుటకుఁ

గారణ ముండదే. ఇదివఱలో నట్టిశరీరలాంఛనములు లేకున్న మహాకవి ప్రణీత కృతిలో నున్నవర్ణనానుసారము జరుగునేమో. ఇట్టి కవిత్వప్రజ్ఞ యుండెను గనుకనే కృ. కవి. తనగ్రంథము నెరులు పరీక్షించఁగూడ దని నిశ్చయించుకొనియుండెను. అట్టివారియుద్దేశమును జెడఁగొట్టి ఆగ్రంథము నను బరిశీలించుటకుఁ గోరియున్నారు. గ్రంథమంతయుఁ బరిశీలించుట మిక్కిలి శ్రమకర మైనపని కాకపోదు. ప్రస్తుతపద్యమును బరిశీలించి తక్కినగ్రంథపరిశీలనా విషయముం బిమ్మట జెప్పెదను. అదె ట్లన్నను :—

(౧). "తరణిశశాంకు" లనుపేరు లాభరణపర మైనయవు డుండఁగూడదు. ఆభరణము లర్థము లగునపుడు సూర్య, చంద్రు లనుపేరులు రూఢములు.

(౨) వదనాత్ము లనుచో నివి రెండు నేకదేశములు. కావున మొదటిది చెప్పినమాత్రముననే రెండును జెప్పిన ట్లగును.

(3) ముద్దియ కుంతలదేశ మాక్రమించి రనుచోఁ గుంతలదేశ మొకప్రసిద్ధమైనది కాదనియును త్రిలోకముల నాక్రమించు సూర్య చంద్రు లొకకుంతలదేశమును మాత్రమే ఆక్రమించి రని చేసినవర్ణనలో నదివఱకున్న గౌరవము దీసివేయఁబడిన దనియును, ఇంతియ కాక యొక్క కుంతలదేశమునందే యీసూర్య చంద్రు లనుభూషలుండె నని చెప్పుట స్వభావవిరుద్ధ మనియుఁ జెప్పె.

(౪) వదనాగ్రము నేత్రాగ్రము ననుచో వదనమున కగ్రము నిర్ణయించఁ బడవలయుననియు, నేత్రముయొక్క అగ్రము కనుకొలుకు లగుననియు నక్కడ సూర్యచంద్రులను నాభరణము లుంచిన నానాయిక నగ లుంచుకొనుతావులనైన నెఱుఁగనిస్త్రీ యగునుగనుక న ట్లనుట ప్రస్తుతము చెప్పుచున్నరాజుభార్యయెడలఁ జెప్పఁగూడ దు.

(౫) సాంతముగ బ్రహ్మ యొనర్చిన సీమ పోల్పఁగుఁ అనుచో నిక్కడ సీమాంతమును బ్రహ్మ చేసె నని చెప్పంబడియుండె. ఇది యొ

కగొప్పయాక్షేపణయగును. సీమంతము చేసెడివాఁడు ధర్మశాస్త్రముం బట్టిచూడ భర్త యగును. రాజస్త్రీలకు నిత్యమును సీమంతముం జేయువారలు చెలికత్తెలుగాని బ్రహ్మదేవుఁడుగాఁడు. ఇతఁడు పాపట దిద్దె నని చెప్పుట యాక్షేపణార్హము. ఇది మనుష్యరచితముగాన బ్రహ్మ రచించె నని చెప్పుట అలంకారజ్ఞానహీనతం దెల్పును.

(౬) బ్రహ్మ సూర్య చంద్రుల గమనమునకు వేర్వేఱు సీమ లేర్పరిచె నని చెప్పుటయు ననందర్భమే. లోకములో సూర్యుఁడు సంచరించు మార్గముననే చంద్రుఁడును బోవుచుండుట యనుభవసిద్ధమే. సూర్యుఁడు కొన్ని దేశములలోను జంద్రుఁడు గొన్ని దేశములలోను నగపడుటకు శాస్త్రసహాయము లేదు. పై యిద్దరకును గాలభేదము చెప్పిన నొప్పునుగాని సీమాభేదము చెప్ప నొప్పియుండదు.

(౭) మఱియును వదనము పద్మ మని సూర్యుఁడును, నేత్రములుత్పలము లని చంద్రుఁడును వచ్చి యుండె నని చెప్పుటంజేసి సూర్యప్రచారము కల్గిన ముఖభాగము వికసించి యుండవలయు ననియును, చంద్రప్రచారము కల్గిన ముఖభాగము ముడుచుకొని యుండవలయుననియు, నటులనే చంద్రప్రచారము కల్గిననేత్రోత్పలము వికసించియుండుననియును సూర్యప్రచారము కల్గిననేత్రోత్పలము ముడుచుకొని యుండవలయు నని చెప్పి యిట్టి కాంతముఖ మమానుష్యముగా నుండకుండునా యని పల్కెను. పైయాక్షేపణలలో నాల్గవ యాక్షేపణ చేసిన వెంటనే అచ్చో సంచరించెడు రాజదాసీలలో నొకదానిం బిలచి పిల్లదానా సూర్యుఁడు చంద్రుఁడుఅనునగలు కంటికొలకుల నుంచుకొనియెదరా లేక నొసట నుంచుకొనియెదరా ? అని లక్ష్మణకవి ప్రశ్నసేయ నది అయ్యో తలమీఁద నమర్చుకొను నగలు కంటిమీఁదను ముఖముమీఁదను బెట్టుకొందురా? అని యడిగెద వేమి బాగు బాగు అని యుత్తర మిచ్చెను. అప్పుడు లక్ష్మణకవి మేము బీదబ్రాహ్మణుల మగుటంజేసి వస్తువుల మొగమైన నెఱుఁగము.ఎక్కడ యేవస్తువు నుంచుకోవలయునో తెలి

సికొనఁ జాలము. నీవు దివాణములోని స్త్రీల కలంకారముచేయు దానవుగావున నీకుఁ దెలిసియుండును. ఈసంగతియే శాస్త్రి సందేహము తీఱుటకుం జెప్పింపఁ గోరినా నని చెప్పి పాపట ముక్కు చెవులవలెగాని లేక కనుబొమలవలెఁగాని దేవుఁడు చేసిన దా లేక నీవు తీసినదా అది మాఱుపవచ్చునా అని అడిగెను. దానికుత్తర మది మేమే తీయుదుమనియు నొకప్పుడు పాపటయిరుప్రక్కలఁ దీసి నడుమ తమలపాకు వేసెదమనియు నభ్యంజనసమయములోఁ బాపట లేకుండఁ గలిపివేసి అనంతర మెట్టి యలంకారము కోరిన నట్టిదాని కుపయుక్త మగుపాపటఁ దీయుదు మనియుం జెప్పె. నీకుఁ దెలిసినమాత్రము శాస్త్రిగారికిఁ దెలిసియున్న గ్రంథము బాగుపడి పోవునుగదా అని చెప్పి, ల. కవి దిగ్గున లేచి మహాప్రభూ యిట్టివిశేషములు గలప్రబంధమును రచియించుటకు కృ. కవి. యే తగును. దీనిని విని మంచిచెడ్డల నిరూపించి సంతసించుట కీనభవారే తగుదురుగాక. మాబోఁట్లిట్టిసభలో నాహ్వానమునకుం దగియుండరు. కావున నే నీపాటికి సెలవు గైకొనియెదను. అని చెప్పి లక్ష్మణకవి సభ వదలి బసలోనికిం జనియె. అంతట రాజు కృ. కవిం జూచి ల. కవి. చెప్పినపూర్వపక్షములకు సిద్ధాంతములు విననిది యీ గ్రంథములోని తరువాయి వినఁగూడదుగావున నేఁటికి పుస్తకముఁ గట్టి సభ చాలించవలయు ననియు మఱియొకనాఁడు సభ చేసెద మనియుఁ జెప్పి ఆస్థానము చాలించి నగరులోనికిం బోయెను. పిమ్మట కృ. కవియును ఖిన్నుఁడై పుస్తకముఁ గట్టుకొని తనబసలోనికి వెడలిపోయెను. ఇది సర్వకామదాపరిణయ వృత్తాంతము.

## రాజా కొచ్చెర్లకోట వేంకటరాయమంత్రి సభకు ల. కవి పోవుట.

పై వేంకటరాయమంత్రి యొకగొప్పజమీన్దారుఁడు. రాజమహేంద్రపురనివాసి. కాని మిక్కిలి భయంకరచర్యలు గలవాఁడు ఇట్టి జమీన్దారునిదౌష్ట్య ముదుపుతలంపున లక్ష్మణకవి యొకనాఁడుబయలు

చేత అతని హజారమున ప్రభునికై వేసి యున్న యున్న తాసనమందుఁ గూర్చుండెను. దానికిఁ గోపించి వేంకటరాయమంత్రి గొంతెత్తి అతి వాసీ నీ దనియే కూర్చుంటివా? అని యడిగెను. దానికి లక్ష్మణకవి సమానకంఠధ్వనితో నిది సీతివాసేనా? సీతివాసేనా? సీతివాసేనా? అని ముమ్మారు కేకవేసి సమాధానము చెప్పెను. దానిని విని యితఁడు లక్ష్మణకవి యని భావించలేక వేంకట్రాయమంత్రి యితఁ డెవ్వఁడో అధిక ప్రసంగిలాగున నున్నాఁడు. తగినట్లుగా జరిపి పంపినంగాని బాగు లే దని నిశ్చయించుకొని మీవారిలో నీవే అధికుఁడవులాగున నున్నావే అని యడిగెను. అపుడు ల. కవి. జంకక యొకటిరెండు వర్ణము లెచ్చు తగ్గుకాఁగా నందఱు సమానులే అగుదు రనియెను. ఆమాట బోధ కు రాక వర్ణభేదము చెప్పితివేమిటి దానిని స్పష్టీకరింపు మని వేం. మంత్రి యడుగఁగా ల. కవి యిట్లనియెను. ర్యాలివారికి వర్ణములు రెండు. పిండిప్రోలివారికి వర్ణములు నాల్గు. కొచ్చెర్లకోటవారికి వర్ణము లైదు. ఇందు మొదటివారు ద్వివర్ణులు. రెండవవారు చతుర్వర్ణులు. మీరు పంచ వర్ణులు అనిపల్కిన, ల. కవిం జూచి వేం. మంత్రి ఇతఁడేమి యోగివలె నర్థములేనిమాటలు పల్కుచున్నాఁడు ఎవఁడీతఁడు అనుడు ల. కవి ఇట్లనియె. ఇపుడు మాటలాడునతఁడు యోగికంటె పైవాఁ డగుని యోగి పిండిప్రోలు లక్ష్మణుఁ డనువాఁడు. అనుపల్కులు విని వేం. మంత్రి తా నావఱకుఁ జేసిన ప్రసంగమున ల. కవి మనస్సు నొచ్చెనేమో యని శంకించి తా నతనిం బోల్చలేకపోతిననియును తనతొందరపాటును క్షమించవలయు ననియును బ్రార్థించె. అపుడు ల. కవి తా నట్టితొందర పాటు గల ప్రభులను శాంతింపఁ జేయవచ్చితినిగావున సెలవు గైకొని యెద ననుడు వేం. మంత్రి యతనిం గూర్చుండఁబెట్టి యథావిధి సబహుమానంబుగా గారవించి పనిచె నఁట.

## భగవద్గీతలఁ దెనిఁగింప మానుట.

ఈ ల. కవి ప్రస్థానత్రయమ్మును జదువుకొని వానిలో నాంధ్రీకరిం

వ్రదగిన గ్రంథము భగవద్గీతలుగా నెంచి ఆగ్రంథము నాంధ్రీకరింప బ్రారంభించెనఁట. అట్టి వర్తమానంబు వృద్ధగౌతమి కవ్వలియొడ్డున నివసించి యున్న బులుసు, అచ్చయ్యశాస్త్రి అనుపండితుఁడు (బులుసు.పాపయ్యశాస్త్రికిఁ దండ్రి.) విని వేదాంతరహస్యములు గలగీతలు తెలుగుగాఁ జేయంబడుచుండెనే. దీనిమూలముగ వేదాంత శాస్త్రము వెల్లడియగునే అని చింతించి దానిని మాన్పింప నెట్లుగా నగు నని మనంబున నూహించుచుండి యొకనాఁటిమధ్యాహ్నసమయమునకు ల. కవి యొక్కగ్రామ మగురుయ్యేరుం జేరెను. అట్లు చేరి ల. కవి యింటికిం బోయి అతనితో తడవు మాటలాడుచునుండెను. అవుడు ల. కవి ప్రొద్దుపోయినది కావున మాధ్యాహ్నిక కృత్యము తన యింటనే జరిగింపుఁడని అచ్చయ్యశాస్త్రిగారిని బ్రార్థించెను. ఆయన మొదట తనయూరునకుం బోవలయు నని చెప్పి తుద కక్కడనే యుండుట కంగీకరించెను. అటు పిమ్మట నిర్వురును స్నానాదికృత్యములం జరుపుకొని భోజనార్థము పరిషేచనము చేసి హస్తోదకముం గైకొనుచో నచ్చయ్యశాస్త్రి హస్తోదకముం గైకొనక యూరక చూచుచుండెను. ల. కవి ఆలస్యము లేదు హస్తోదకముం గైకొనుఁడని వేగిరించినను, ఆశాస్త్రి అటుల చూచుచునూరకొన, ల. కవి ఆయన కెద్దియో కోర్కె కలదని యూహించి మీయభిప్రాయ మెద్దియో దానిం జేయ సిద్ధముగా నున్నాను. హస్తోదకముం గైకొని భోజనము చేసి చెప్పవలసినది చెప్పవచ్చునా యని యడుగ ఆశాస్త్రి అటులైన మంచిది యని హస్తోదకముం గైగొని భోజనము ముగించెను. పిమ్మట ల. కవి ఆ. శాస్త్రిమనోగతాభిప్రాయ మరసి అదివఱలోఁ దానాంధ్రీకరించుచున్న భగవద్గీత సంచికలను శాస్త్రిగారిపరముగా నిచ్చి యింతటనుండి యీలాటిగ్రంథంబులఁ దెనిఁగించ నని చెప్పి అ. శాస్త్రి నింటికిఁ బంచెనఁట.

— లక్ష్మణకవి తనకాలీనులపైఁ జెప్పినకొన్ని పద్యములు. —

మొక్కపాటిపేరిశాస్త్రి యనుపండితునకు నీలక్ష్మణకవికి నొకప్పుడు విద్యావివాదము తటస్థించెను. అందులోఁ బైశాస్త్రి లక్ష్మణక

వికిఁ గవిత్వమేగాని శాస్త్రము లేమి తెలియు నని యాక్షేపించెనఁట. ఆవార్త విని ల. కవి యీక్రిందిపద్యము వ్రాసి పంపె. ఎట్లన్నను :—

"గీ. ఉక్కు చెద దిన్న దశదిక్కు లొక్కటైన
చుక్క లిలఁ బడ్డఁ గులగిరు లెక్కలైన
మొక్కపాటింట నోటను ముక్క లేమ
పేరిశాస్త్రికిఁ గలిగెరా పెదవిపాటు."

ఇట్టి లక్ష్మణకవి చెప్పిపంపినపద్యము విని ఆగ్రహంబున పేరిశాస్త్రి యిట్టి పద్యములు చెప్పిన పైజాఱులఁ గొట్టించెద నని వర్తమానంబు పంపె ననియుచు దానికి సమాధానముగ ల. కవి లోజారుల ముందు గొట్టించి పిమ్మట పైజాఱుల సంగతి యోచింపు మని వర్తమానంబు పంచెనఁట.

ఇటులనే కూరపాటి, వేంకటశాస్త్రి యనునతఁ డొకపరి ల. కవితో విరోధించిన లక్ష్మణకవి యీక్రిందిపద్యంబు వ్రాసిపంపెను.

"గీ. కూరపాటి వెంక కుక్కలు దినుకంక, లేనిపోనిశంక మాను మింక
ముఖము చూడఁ గుంకముండ వసెతుశంక, నాకుఁ దోచెఁ జంక నాఁకు మింక."

## ల. రావునీలాద్రి రాయని నధిక్షేపించుట.

ఈలక్ష్మణకవి యొకపరి పిఠాపురాధిపుఁ డగురావునీలాద్రిరాయని దర్శింపఁబోయెను. అపుడచట జంగము బసవయ్య యను నొకరాజవైద్యుని మూలమున బ్రాహ్మణుల గౌరవము నిషేధింపఁబడుట తెలిసికొని లక్ష్మణకవి వ్యాజస్తుతిగా రాయని నీక్రిందివిధమున నుతియింప నారంభించెనఁట. ఎట్లన్నను :—

"రావువారిసంస్థానములోనే మర్యాదలు. రావువారిసంస్థానములోనే బహుమానములు. రావువారిసంస్థానములోనే పరువులు." అని ప్రారంభింప నం దేదియో అపహాస్య మున్న దని నీలాద్రిరావు లక్ష్మణకవిని సగౌరవంబుగా బహుమానించి పంచె నఁట.

## పెండ్లిండ్లకుఁ బోవుట.

లక్ష్మణకవి చుట్టుపట్ల నుండుగ్రామములలో మహాజనుల యిండ్ల

లో నగు పెండ్లిండ్లకుఁ బిలువంబడినప్పుడు కవిత్వగౌరవతాంబూలము తనకే యిచ్చునట్లుగాఁ బ్రసంగించుచు వచ్చెనఁట. అట్టియాచారము క్రమముగ బలము కాఁగా నతఁడు పెండ్లికిఁ బోయినను పోకున్నను మహాజను లతని సభాతాంబూలం బతనికిఁ బంపుచుండిరఁట. అటులఁ గొన్ని దినములు జరిగినపిమ్మటఁ దనకుఁ గట్నము పంపక యెవ్వరైన నతఁడు రాలేదని ఆక్షేపణ చెప్పునెడల లక్ష్మణకవి వారితోఁ దాను రాకయుండినఁ బెండ్లి యెట్లగు ననియుఁ దాను వచ్చియే పెండ్లిపూర్తి జేసియుంటి నని పల్కుచుండునఁట. దానికిఁ గారణ మీక్రింది విధముగాఁ జెప్పుచుండునఁట. ఎట్లన్నను:— మీయింట జరిగిన పెండ్లిలో నాకబలి జరిగెనా లేదా? అట్టినాకబలికి పిండితో ప్రోలుపోసియుంటిరా లేదా? అటుపిమ్మట నది లక్షణముగా నుండెనా లేదా? కాదంటి రేని వివాహసిద్ధి లేదు. పైగా నశుభప్రసంగ మగును. అగునంటి రేని పిండి ప్రోలు లక్ష్మణలక్షితము కాఁగాఁ బిండిప్రోలు లక్ష్మణకవి సాన్నిధ్యమున లేఁ డని యెట్లుచెప్పవచ్చు నని చమత్కరించి కట్నములం గైకొనినట్లు చెప్పంబడును. ఇట్టివట్లనే దమ్మన్న రావునకు నీతనికి విరోధము కల్గె నని చెప్పుదురు.

## లక్ష్మణకవి తనమేనల్లుని వ్యవహారములోఁ బ్రవేశించుట.

ఈలక్ష్మణకవి మేనల్లుఁడు చింతలూరిమిరాసీదారుఁ డగుమంగన్న యనునతఁ డుండెను. అతఁడు జగ్గరా జనునొకజ్ఞాతికి దత్తత కావింపఁబడియెను. ఆవృత్తాంతముఁ దెలిసికొనినజ్ఞాతులు జగ్గరాజు గతించిన పిమ్మట మంగన్నకు సంక్రమించిన గృహక్షేత్రారామములంగూర్చి పండితసదరమీనుకోర్టులో రాజమహేంద్రవరములో దావా తెచ్చి యుండిరి. అపుడు శంకరమంచి అనంతంపంతు లనుబ్రాహ్మణుఁడు పండితసదరమీనుగా నుండెను. అతఁడు మంగన్న దత్తుఁడు కాఁ డని తీర్పుచేసి అతనిస్వాధీనములో నుండెడి జగ్గరాజుయొక్క చరస్థిర రూపపదార్థము లన్నియును జగ్గరాజుయొక్క సన్నిహితజ్ఞాతులపర మొనరించెను. అట్టి

తీర్పునకుఁ గారణ మేమి యై యుండు నని విచారించి అది ధనకారణ మకాట యెఱింగి లక్ష్మణకవి పండితునిపైఁ గొన్ని పద్యంబులు చెప్పి వ్యాపింపఁజేసెను. అవి యెట్లన్నను:—

సీ. మహనీయ శంకర మంచిగోత్రమునఁ బ్రపాతకుం డన ధరిత్రీతలమున
బండితుండువలెఁ గన్పడును స్థాణుత్వ మేర్పడ నొక సాధులపలుకు వినవు
పుక్కిటి విషమె యొప్పడు నీకు నుండును, మది వీడ వెపుడుఁ దామసగుణంబు
భీముఁ డుగ్రుడు ననుపేరుఁ గాంచి నశింతు, వంబికాపతివి బ్రహ్మఘ్నుఁడవు న
గీ. నంతనాముండ వరయంగ నష్టమూర్తి, వగుచుఁబిత్రువనమందు భస్మాంగుఁడవయి
భూతములును బిశాచాముల్ బ్రోదిఁగూడు,కొనఁగనుండుదువంద్రునిన్ జనములెల్ల.

మ. సరవిజ్ఞ శంకరమంచిపండితుఁ డనన్ జానొప్పువాఁ డర్థసౌ
ఖ్యరుచిన్ జెందియుఁ జింతలూరి యలమంగామాత్యసాధ్వ్యాత్మమం
దిరసుక్షేత్రములన్ హరించి కపటాన్వీతుండు నౌవాదిక
ల్లరి గాఁ డంచునుఁ దీర్పు చేసి జనముల్ నవ్వం బడున్ దుర్గతిన్.

ఉ. దక్షిణదిక్కు నుండి యు యదంతముఁ దెచ్చినధర్మరాజు ప్ర
త్యక్షు మనంత పాతకున కిచ్చెడు మార్గము వోవునట్లు గా
దీక్షవహింపవే ధవళ దేహుఁడ శంకరమంచి కూళ్లపై
పక్ష మదేల దుష్టజనభంజన సజ్జనభావరంజనా.

సీ. పరశురాముఁడు తండ్రిపంపున రేణుకన్, దనతల్లియనకను నతిక్షిపైచె
జనకజాపతి తండ్రిపనుపున రాజ్యంబు, వాసి మహారణ్యవాసి యయ్యెఁ
గుండినముని జనకునియాజ్ఞచే సంశ, యింపక గోవుల హింసచేసె
భీష్ముఁడు తండ్రి యభీష్టంబు దీర్ప రా,జ్యశ్రీసుఖాదికార్యములు విడిచె
గీ. తండ్రిపంపునఁ దనకన్న తండ్రిపేరు, చెప్పకతన నదత్తుఁడే చింతలూరి
మంగరా జిట్లు శంకరమంచిపండి, తుండు దీర్చుట జీవన్మృతుండు గాఁడె.

సీ. వసుదేవసుతుఁ డన్నవాక్యంబునసె పద్మ, నాభుండు నందనందనుఁడు గాఁడె
మాద్రీతనయుఁ డన్న మాత్రంబునసె కవల్, కౌంతేయు లన్నవిఖ్యాతిఁ గనరె
పార్వతీసుతుఁ డని పల్కినంతసె కుమా, రుఁడును దాఁగా ర్తికేయుండు గాఁడె
బాపిరాట్సుతుఁ డన్నభావసె మంగన్న, ధృతి జగ్గరాడ్దత్తసుతుఁడుగాఁడె
గీ. వేదశాస్త్రపురాణము ల్వినియుఁ గనియు,నెఱిఁగి యెఱుఁగనివాఁడునై యిట్లువిత్త
వాంఛ నన్యాయముగఁ దీర్చుపండితుండు,ఘోరనరకంబులందుఁ గూలకున్నె.

ఇ ట్లనేకపద్యంబులు చెప్పి పండితుని యన్యాయంబు జగంబున శాశ్వతముగా నుండునట్లు లక్ష్మకవి కావించెను. లక్ష్మణకవి చెప్పినట్టి

పండితునివంటి వార లిప్పటికి ననేకు లున్నను ఆధునికకవులు ప్రభుత్వమువారిభయమువలన రవ్వ చేయక యున్నారు. ల. కవి ద్వ్యర్థికావ్యకవియును ధీరుఁడు నవుటంజేసి యిట్టిపద్యంబులఁ బ్రకటించుటయకాక యొకనాఁటిసమయములో దేవళంబునకుఁ బోవుచున్న పైపండితుం జూచి అతని యెదురుగా నిలువంబడి అతనిదుర్మార్గత యతనికిం దెలుప నిశ్చయించుకొని తానును స్వామిదర్శనార్థంబు బోయినట్లుగాఁ బోయి అనంతంపంతుల కెదుట నిలువంబడి శంకరు నుద్దేశించి నుతియించినట్లుగా నీక్రిందిపద్యంబు చెప్పెను. ఎట్లన్నను:—

మ. అవురా శంకర మంచి వాఁడవు ననంతాఖ్యుండ వై తీర్పెఱుం
గవు మంగన్నరఁజేసి నీవు బుధమార్గభ్రష్టతం జోగిరా
గ వరాలంది పినాకినిం బశుపతీకల్లోలివిం బట్టి స
త్యవధూసత్వము దానియం దిడితి వాళాయత్తు లిట్లేకదా.

అని జోగిరాజు వరాలు లంచమియ్యాగాఁ నక్రమ మగుతీర్పు చేసి తని పండితుని ముఖముమీఁదఁ గొట్టినట్లు చెప్పి తనసమీపమున నుండెడువారితోఁ దాని కెట్లీశ్వరపరముగా నర్థము చెప్పవలయునో దాని నన్వయించి యుపన్యసింపుచు, వినుచున్న పండితుఁడు తన్ను బాహాటముగఁ దిట్టుచున్నను ల.కవిపద్యమున కర్థాంతరముం జెప్పి తనపని యర్థాంతరము చేసె నని చిన్నవోయి మాటలాడక తొలఁగిపోయెను.

### ల. కవి సి. పి. బ్రౌనుదొరం జూచుట.

ఇట్లుగా ల. కవి పండితుఁడు తనమేనల్లునకుఁ జేసినయపకారము నకు మిగులఁ జింతించినవాఁడై అప్పీలు చేయించియైన నతని ధనమును వనతియు నిలుప నూహించి మేనల్లుని వెంటఁ దీసుకొని బందరుపట్టణమునకుఁ బ్రయాణంబై పోయెను. అచ్చట నుండుప్రొవిన్షియల్ కోర్టులో నప్పీలు చేయించుట కేర్పర్చుకొని ల. కవి అందులో నొకజడ్జిగా నుండిన బ్రౌనుదొరను ముందుగా దర్శించి ఆతఁడు తెలుగులలోఁ బండితుఁ డవుటంజేసి యందులో నుండెడితనప్రజ్ఞ నతనికిఁ దెల్పి కార్యసాధనము చేసుకొన గమకించి యీక్రింది సీసమాలికను జదివె. ఎట్లన్నను.

## సీ స మా లి క.

మ ధువైరికి న్వనమాలికిఁ గౌస్తుభ
హా రునకును సంశ్రితావనునకు
రా ధికాప్రియునకు రామసోదరునకు
జ గదీశునకు దయాసాగరునకు
శ్రీ నాథునకును రక్షితదేవసమితికిఁ
బ్రా షభావునకు నారాయణునకు
ను రగేంద్రతల్పున కరిశంఖధరునకుఁ
ద్రా గలరాయనిఁ గేరుమొగమువోరకు
ర ణనిహతదుష్టరాక్షసరమణునకును
గా నమోహితవల్లవీకాంతునకును
రి పువిదారికి హరికి శ్రీకృష్ణునకును
కి ల్బిషారికి నే నమస్కృతి యొనర్తు.

అనుపద్యంబు చూచి బ్రానుదొర సంతసించి ల.కవి వృత్తాంతమంతయు నరసి అతని కాంధ్ర గీర్వాణములలో దేనిలో విశేషపరిశ్రమము గల దని ప్రశ్నింపఁగ ల.కవి తాను శుద్ధాంధ్రకవి నని వక్కాణించె. అటు లైన నీ వమరసింహాకృత నిఘంటువులో వివరింపఁబడిన సంస్కృత శబ్దముల కన్నిటికిఁ దెలుగులో సమానముగ నర్థము చెప్పఁగలవా యని యడిగిన నది పరీక్షించినఁగాని తెలియ దని ల.కవి చెప్పెను. అంతట బ్రౌనుదొర యమరములోని యరుదైనశబ్దములలోఁ గొన్నిటికి శుద్ధాంధ్రపదముల నడుగ నారంభించె ననియు వాని కన్నిటికి ల.కవి సమ మగునాంధ్రపదములు చెప్పె ననియు దానికి మిగుల సంతసించి బ్రౌనుదొర ల. కవిరాకకు కతం బేమి యని యడుగఁ దనమేనల్లుం డగు చింతలూరి. మంగన్నం జూపి అతనినిమిత్తమై వచ్చియుంటి నని తెల్పెను. దానిపై బ్రౌనుదొర అతఁ డేమిపనికై వచ్చియుండె ననఁగా నతనినే నీవు వచ్చినకార్యము విన్నవింపు మని తెల్పఁగా మంగన్న యీక్రింది పద్యములం దెల్పెను. అవి యెట్లన్నను:—

సీ. చింతలూరికి మిరాసీదారుఁ డగుజగ్గ, రాజునకుఁ బుత్రు లౌరసులు లేమిఁ
దనమను బిన్న యతాతండ్రి నందను నన్ను,బాపిరాట్సుతు దత్తభావుఁ జేసి
కొనుటచే నిదివఱకును తద్గృహక్షేత్ర, కర్తనై యుండుట కలకటరుక
చేరిలెక్కలఁ జిత్తగించినఁ జాలు, నేది నేనెఱుఁగనియిట్టిపనికి

తే. బాపిరాట్పుత్రుఁ డని నేను పల్కినట్లు, వాది పన్నినకపటభావమె నిజ మని
పట్టి దత్తుఁడు గాఁ డంచుఁ బండితుండు, చేసె తీరు పుభయభ్రష్టుఁ జేసె నన్ను.

ఉ. అత్తినధర్మశాస్త్రవిధి కడ్డని చూడక కల్కటర్లసం
సత్తులలెక్క లారయ విచారము సేయక రాజ్య మేలుభూ
భృత్తు సభాస్థపత్త్రిలిపిరీతిఁ దలంపక విత్తవాంఛచే
దత్తు నదత్తు డం చనునధార్మికపండితు డుంట యొప్పునే.

ఉ. పప్పసఁ జేసె నాబ్రతుకు పండితుఁ డింకెటు నిల్తు నందు నే
నిస్పృహావృత్తి నుండఁగను నిన్నటిరేఁ గలలోనఁ గోర్టువా
రిప్పిసి యాలు పట్టి రిఁక నేర్పడ న్యాయము తీర్తు మంచు నై
ర్యాస్పదసూక్తిఁ బల్కినటు లైన మిముం బొడగానవచ్చితిన్.

అని చదివిన విని బ్రౌనుదొర సంతసించి మంగన్న దాఖలుచేసిన అపీలు స్పెషల్ అప్పీలుగా నంగీకరించె ననియు నద్దానిం దెలిసికొని మంగన్నవిరోధులు పండితునితీర్పు భంగ మగునేమో యని భయపడి మంగన్నతో సమాధానము పడి మంగన్న మరల బ్రౌనుదొరకడఁ జెప్పుకొన నక్కఱ లేకుండ సంతోషపెట్టి రని కలదు.

ల.కవి విశేషములు పెక్కులు గలవు. తెనాలి రామకృష్ణునివాక్కులయం దెట్టిచమత్కృతి కలదో ల.కవివాక్కులయం దట్టిచమత్కృతి కలదనియును, నీతఁడును సమయస్ఫురణము కలవాఁ డనియు, జంగము బసవయ్య మొద లగువారిపై ననేకచాటుధారపద్యంబుల రచించె ననియు వాడుక గలదు.అట్టిపద్యము లసభ్యములుగా నుండుటచేత వానిని వివరింపలేదు.

ఆంధ్రద్వ్యర్థికావ్యకవులచరిత్రము ముగిసెను.

శ్రీరస్తు.

# కవిజీవితములు.

## 17.

## శిష్టు కృష్ణమూర్తి కవి.

ఇతఁడు ద్వ్యర్థికావ్యకవి యగు ల. కవియొక్క కాలీనప్రసిద్ధ కవి. ల. కవితో నెదిరింపఁదగుకవిత్వసమర్థతయును, ల. కవి యెదిరింపలేని సంగీతప్రజ్ఞయుఁ గలవాఁ డని యీకృష్ణమూర్తికవి చెప్పఁదగి యున్నాఁడు. అయినను సర్వకామదాపరిణయపూర్వపక్షములచేఁ గానో వు నీకృష్ణమూర్తికవి కవిత్వవ్యాపారమునకంటె సంగీతవ్యాపారములో నెక్కుడు ప్రతిష్ఠ సంపాదించెను. నేఁటికిని ఆంధ్రదేశమున నీకృష్ణమూర్తి కవి శిష్యులు పెక్కండ్రు సంగీతములోను బెక్కండ్రు సాహిత్యములోఁ గూడ బ్రసిద్ధు లగుముదుసలిపండితులుగా నున్నారు. ఈకృష్ణమూర్తి కవిని వృద్ధావస్థలో నీచరిత్రకారుఁడు తనబాల్యములో ననఁగా ఆ॥ ౧౮౨౦ సంవత్సరప్రాంతములోఁ జూచియున్నాఁడు. అప్పటి కాకవికి ౭౦ సంవత్సరములకుఁ బైగా నుండినట్లు కాన్పించెను. ఎటులనైన నీకవి జననకాలము (క్రీ.శ. ౧౮౦౦-౭౭)=౧౭౨౩ శాలివాహన సంవత్సరప్రాంతమై యుండును. ఈపండితుఁడు సర్ వాల్టరు ఎల్లియట్టుదొర (Sir Walter Elliot దొర చరిత్రవిషయమై చేసినయుద్యమములో సహాయభూతుఁడుగా నుండుటంబట్టి యీచారిత్రోద్యమములోఁగూడ సహాయభూతుఁడైన వాఁడే అనిచెప్పవలసియున్నది. పైదొర శిలాశాసన పరీక్ష చేయునప్పు డీకృష్ణమూర్తికవి శాసనాక్షరశోధకుఁడై యుండెననియును బ్రౌనుదొర మములో నుండెడునసంఖ్య మగుశిలాశాసనములన్నియు నీకవివలననే యెత్తి వ్రాయంబడెననియు సంప్రదాయజ్ఞాభిప్రాయము.

ఈకవికాఁపురస్థలము గోదావరీమండలములోని రామచంద్రపురము తాలూకాలోఁ జేరినగొల్లపాలెముగ్రామము పిత్రార్జితస్థల మనియు నీతఁడు బాల్యమునం దచ్చటనే యుండి విద్యాభ్యాసము చేసి తదనంతరము రామచంద్రపురము వచ్చి కొన్నిదినము లుండెననియు వాడుకొనంబడు. ఈకవి ఆంధ్రదేశములో నుండుసర్వభాగములం జూచి అచ్చటచ్చటఁ గొన్నికొన్నిసంవత్సరములు నివసించియుండెను. రామచంద్రపురమునుండి విశాఖపట్టణము మండలములోని కొన్నిగ్రామములలోఁ గొన్ని సంవత్సరము లితఁడు నివసించెను. అనంతపురము చిత్తూరుజిల్లాలోని కాళహస్తిలోఁ గొన్నిసంవత్సరములు నివసించెను. పిమ్మట గోదావరీ మండలములోని పెద్దాపురము తాలూకాలో జగ్గంపేటగ్రామములో తుదిని మాడుగులు గ్రామములో స్థిరపడెను. పైగ్రామములలో నుండెడు జమీాందారు లీకవిశిఖామణిని ఆదరించి యుండఁగోరినమీాఁదట నీతఁ డాయాస్థలములలో నివసించినట్లుగాఁ గానిపించును. కృ. కవిని మాడుగులు కృష్ణభూపతి విశేషమాన్యక్షేత్రము లిచ్చి నిల్పఁగా నాగ్రామములోనే నిర్యాణము నందెను.

## కృ. కవి కాలీనులు.

కొంచె మెచ్చుతగ్గుగాఁ గ్రీస్తుశకము పందొమ్మిదవశతాబ్దము యొక్క మొదటిమూఁడుఖండములలోనిపండితులును, కవులును కృ. కవి కాలీనులనియే చెప్పవలసిన్నది. అందులోఁ గృష్ణమూర్తికవి యుత్తరార్థవయః కాలములోఁ బరవస్తు చిన్నయసూరియును, ఓగిరాలవారిలో ద్విరేఫవర్ణ దర్పణకారుఁ డగురంగనాథకవియును, నతని పితృవ్యపుత్రుఁడును సుమనోమనోభిరంజనప్రబంధకర్త యగు నోగిరాల జగన్నాథకవియును, పై యిర్వురికిని గురుం డగు మంత్రిప్రగడ. వేంకటరామన మంత్రియును కాలీను లని చెప్పవలసియున్నది. ఆనాఁటికిఁ గృ.కవియును వేంకటరామన మంత్రియును సంగీత సాహిత్యవిద్యాప్రవీణు లగు గురువులుగా నుండిరి. రంగనాథకవి మొదలగువారు తమగురుఁ డధికుఁడని

ప్రకటించువారుగను, కృ. కవి యధికుఁ డని అతనిశిష్యవర్గముం జెప్పు కొనుస్థితిలో నుండెను. అందుఁ గృ. కవి శిష్యులు పెక్కండ్రు వైదికశాకలోనివారును, వేంకటరామనమంత్రి శిష్యులు పెక్కండ్రు నియోగి శాఖలోని వారు నై యుండిరి. రెండవ తెగవారందఱును కోరంగి, తాళ్ల రేవు, సీలపల్లి, సీతారామపుర మనుకోరంగిగ్రామ సమీపవాసులు. కృ. కవి సీలపల్లిమొదలగు స్థలములలోనికిం బోవునప్పటికి పైరంగనాథ జగన్నాథకవులు కృ. కవితోఁ బ్రసంగించి రనియు, నందుఁ గృష్ణకమూర్తికవికే పరాజయము కల్గె నని జగన్నాథకవివలనఁ జరిత్రకారుఁడు తెలిసికొనెను. ఆప్రసంగముయొక్క వివరమును జ్ఞాపకముంచుకొన లేకపోతి నని విచారించుచు చారిత్రకారుఁడు కృ. కవి యొక్క యితరవిశేషముల వ్రాయును.

## కృ. కవి. విద్యావిశేషము.

ఈకవి యాంధ్రమునకంటెను. గీర్వాణమందు విశేషప్రజ్ఞ కలవాఁ డని చెప్పవలసియున్నది. అందు సిద్ధాంతకౌముదీవ్యాకరణమం దీతనికి సంపూర్ణజ్ఞానము కల దని వాడుక గలదు. ఆంధ్రంబునం గూడ నసాధారణకవిత్వప్రజ్ఞ కల దని ప్రబంధకవి యగుటయే కాక ఆవలిలోఁ బ్రసిద్ధిం జెందియున్న పిండిప్రోలు. లక్ష్మణకవితో సమానుఁడ ననిపించుకోవలయు నని చేసిన విద్యాప్రసంగమువలన నతని కాలీన కవులలోఁ బెక్కండ్రకంటె నధిక ప్రజ్ఞాశాలి యని చెప్పవలసియున్నది. ఆశుకవిత్వమునకు కృ. కవి. మిగులఁ బ్రసిద్ధుండు. పురాణమును, ప్రత్యత్తు, బాహాట, పాంచాల, నటన శయ్యలఁ జదువుట యితనినాఁడే ప్రసిద్ధివడసెను. ఇతనికంటెం గొంచెము పూర్వుఁ డగుఁ వక్కలంకవీరభద్రకవి తన ప్రజ్ఞావిశేషంబు లితరులు వర్ణించినట్లు చెప్పుకొను పద్యములలోఁ

"ప్రత్యత్తు బాహాట పాంచాల నటనలఁ జదివింప నేర్చుఁదాఁ జదువ నేర్చు"

వని చెప్పుకొనియుండిన నిప్పటికిఁ బ్రస్తుతములోఁ బురాణికులు చదువువారందఱును సంగీత విద్యాప్రవీణుం డగు నీ కృ.

కవి శయ్యనే యవలంబించిచదువుచున్నారు. ఈ కృ, కవికిఁ గలప్రజ్ఞ లలో మఱియొక గొప్పప్రజ్ఞ యేమనఁగా. ఏపురాణముఁ జదువుచున్నను ఏ రసము గలపట్టు చదువుచున్నను ఆగ్రంథ మటు నిల్పి తరువాయి గ్రంథమును స్వకపోలకల్పితముం జేయు మనఁగా నటనుండి ఆభాగము లో నుండుశయ్యతో నారసములోనే చాలు నని చెప్పవఱకు నాశు ధారను గవనము చెప్పుటయును అది చాలించి తిరుగ నటుపై నుండు కథాభాగముఁ జదువఁగా నించుకయైన శైలీభేదముగాని, రసభేదము గాని లేకుండుటయుఁ గల్గె నని అనేకపండితులు చూచి వచ్చి చెప్పిన వృత్తాంతమై యున్నది. ఈప్రజ్ఞ అసాధారణము. వసుచరిత్ర కావ్యము నకు నీపండితుఁ డెన్మిదియర్థములు చెప్పుచువచ్చె నని వాడుక గలదు. ఈకవి భళిరకవి వేల్పుశతకములోఁ గొఱఁతపడియున్న పద్యములఁ బూర్తిచేసె ననియు నతనిశయ్య యాపూర్వపద్యములశయ్యతో సమాన ముగా నుండె ననియు నెన్నంబడును.

### కృ. కవిగ్రంథవివరము.

ఈ కవియు ననేకచాటువులు చెప్పినట్లును వానివలన నాయాకృతిపతులు విశేష బహుమానాదికముం జేసినట్లును వాడుక గలదు. ప్రస్తుతములో దొరికినవఱకు దీనిలోఁ బ్రకటించెదను. ఇట్టిచాటుకవిత్వము చెప్పుటయేకాక సంగీతములోఁగూడ ననేకకృతులును, వర్ణములును గాయకుల కుపయోగించునట్లు విశేషముగా రచియించెను. వానిలోఁ బెక్కులు కృ. కవితమ్మునికుమారులకడ జగ్గమపేటలో నున్నవి. గోదావరిమండలములో నుండువైణికులు పెక్కండ్రు వానిని నేర్చుకొని యున్నారు. వసుచరిత్రకారుఁ డగురామభూషణుని సంగీత సాహిత్యప్రజ్ఞ లెట్టివో ఆధునికులలోఁ గృష్ణమూర్తికవియు నట్లే యున్నవి. వీణావిషయములో నతనినాఁడు లోకోపకారకార్యములు జరిగిన ట్లీకవినాఁడు వీణోపయోగము లగున నేకవిశేషములు చేయంబడినవి. అవి కాలాంతరమున నైన లోకములో సర్వవైణికులకు లభ్యములై విశే

షోపయోగకారులు కాఁగోరుచున్నాము. ఈయనప్రబంధములు కొన్ని రచియించె నని వాడుక గలదు. వానిలోఁ బయలువెడలినది యొక్కటే సర్వకామదాపరిణయమే. అది పూర్వపక్షకోటిలోఁ బడిపోవుటచేతఁ దక్కినగ్రంథములు వ్యాపకములోనికి రాలే దని తోఁచెడిని. సర్వకామదాపరిణయముకూడఁ జిరకాలము పేరైన వినఁబడకయుండెను. ఈసంవత్సరమే మామిత్త్రునివలన యత్నించఁబడి అతని కతికష్టముపైని సర్వకామదా పరిణయ గ్రంథముపుట్టుకు దొరకిన దనియు నింకను కృ. కవి గ్రంథములంగూర్చి యత్నించుచుండె ననియు విని అత్యానందము నందినాఁడను. ఈ కృ. కవి కాళహస్తిసంస్థానములో నుండఁగ వేంకటేశ్వర మాహాత్మ్యము నాంధ్రీకరించెను. అది కొంతకాలముక్రిందట ముద్రితమై ప్రకటింపఁబడినది. అదియొక్కటియే ప్రస్తుతములో కృ. కవిప్రణీతగ్రంథ మని చెప్పవలసియున్నది. అది ప్రబంధశైలిని లేక సామాన్యశైలి నుండును గావున నందలి విశేషములఁ గూర్చి వివరింప మానెదను.

→ కాకర్లపూఁడివారిపై కృ. కవి చెప్పినయుత్పలమాలికలు. ←

" ఉ. వీరు తెనుంగుసాము ఒరబీతఁబీయతు నొప్పుగొప్పస
ర్కారువరే జమీలు దరఖాస్తుగ నేలిన రాజమాన్యహం
వీరులు ఫక్కణేలు తజవీజుకులాహిఖు లున్న మేటిమం
జూరు జొహారు యాఖిసుమష్హూరు ఖరారు మదారు బారుబ
ర్దారు మితా ర్గురాలసరదారులతారు కడాని తేరులం
బారుమిశాలనాబతు సుమారు పుకారును మీరుమ స్తినీ
దారుగుడారుపైకము బిడారుబజారుకొటారులందు నే
దారుపశాణిబారుదళ దారుసవారు షికారులందు బి
ల్యారుసతాసవారు పిలగోలతుపాకులఫైరులఁదు లే
ఖ్యారుగఁ బెక్కుమారులు తయారుగ వీరిహజారులందు వె
య్యాఋలు పెద్దపేరుల జొహారులు చూచి హమీరు లెంచి ద
ర్బారుపసందుమీఅ వహవా యని మెచ్చునవాబుఖానుషేం
షేరు బహాదరుల్ పెరవజీరుల నూఋలమాఋకెన్న తా
ర్మాఋగ మోఁది గీములు త మాము వదల్చి మఖాముతెల్ల క్షీ
ర్మారొనరించి మిక్కిలి మరాతబులందిరి చేరుమాలు త

ల్వారుల శేయదాయ దళవాయుల చాయలమీఱుచారుకై
జారుకరారుబాఁకు నెలజాలుతళుక్కునబందుబస్తుగా
పోరుభుజోరుకాకరలపూఁడివజీరు లదే యన న్మహో
దారులు పూర్ణనిర్మల సుధాకరకాంతికలాపకీర్తివి
స్తారులు భూరిభూసుర వితానమహాహుతిగంధగౌతమీ
తీరనిసర్గదుర్గపుర దీపితహర్మ్యతలాగ్రభాగసం
చారులు దేవవారవనజాతముఖీసమవారకామినీ
వారకరాబ్జకీలితసువర్ణమణీద్యుతిదండచామర
ప్రేరితవాతధూతనవఫేనసమానవితానమంగళా
కారసువర్ణపీఠపరికల్పితరాజ్యరమామహామహో
దారులు సేతుశీతవసుధాధరమధ్యతలస్ఫురల్లస
ద్వీరవిశేషసంజనితతీవ్రదవానలబాడబాగ్నిత
త్వారినృపాలజాలమకుటార్పితపాదపయోధిపీఠసం
స్కారులు రామచంద్రపురపాలనివాసులు రామచంద్రవం
దారులు రామచంద్రవసుధావరపాత్రులు రామచంద్రధా
త్రీరమణాభిధానులు వరిష్ఠవసిష్ఠసగోత్రపావనుల్
కారణజన్మలబ్ధిశశికల్పకమేఘసమానగానదీ
క్షారతులిందిరాసుత జయంత వసంత సమాన సుందరా
కారులు బ్రహ్మకల్పము సుఖంబుగ వర్ధిలువార లీధరణ్."

ఈ పద్యము విశాఖపట్టణముజిల్లా వేముపాడు గ్రామకాఁపురస్థుఁడు గుంటూరి పెద్దకవివలనఁ జెప్పఁబడిన ట్లాజిల్లాలోఁ బ్రసిద్ధి గలదు.

### కాళహస్తి ప్రభునిపైఁ జెప్పినపద్యము.

ఉ. దామెరవేంకటక్షితిప తావకపాండురకీర్తిదీధితి
స్తోమము లింమభాస్తతులతో నెదిరించి తృణీకరించె నా
గాములకేమి రోజనలుకాని యశంబులు మేయు శంబరం
శేమరకుబ్బుమీఱ వసియించునె డాసి తదంతరంబునన్.

### వైణికజనోపయోగిగాఁ జెప్పినయుత్పలమాలికావృత్తములు.

"ఉ. ఏయెడనో యదెక్కడనొ యెవ్వరియొద్దనొ యెందు కెందుకో
చేయది సేర్చి యున్నయది చెల్లునె వీణె యనంగఁ గొండెలన్
గోయలు దండివచ్చు మెఱుఁగుం బచరించినయట్లుగాక నో

హాఁ యెవ్వరైన నిద్దమగునొద్దికనేర్పుగ నేర్చువైణికా
గ్రణియునిశిక్ష గాంచి పలికించు విపంచిని రేఁబగళ్లుబం
టాయనిసాధకంబు పరిపాటిగఁ జేతురొ వారివిద్య ని
ర్మాయికవృత్తి రాజసభమాని తమ్మై హితమ్మై తనర్చుఁ దర
న్యాయ మొకింత దెల్పెదనయంబలరన్ శ్రుతిరంజనశ్రుతిం
గాయనగాయనీహృదయకంజ వికాసము మున్నుగా మొదల్
సేయుచు నాటతేట సవిశేషముగా ఘటియించి గౌళయున్,
శ్రీయు, వరాళి, యారభియు, సింధు, ఘనధ్వని, గౌళి, పాడి, నా
రాయణగౌళి ఆదిఘనరాగము లెన్నిక కొన్నికొన్ని వా
లాయము గాఁగఁ బూర్వమతలక్షణలక్ష్యత విన్కిఁ జేసి యౌ
రా యని విన్నవారు తమయాఁదల లాదట నూఁచి సన్నుతుల్
సేయఁగ వేళ్లు సాకెలకుఁ జేరినయట్లును జేరనట్లు నా
డాయ నెడల్ దడల్ దగుకడంక తడంబడకుండఁ దంత్రులన్
వేయువిధంబులన్ నడచువ్రేఁకఁబడన్ బగుతూటుధాటిషో
డాయనఁగాఁగఁ జాలగను సాలు బెడంగుతులంగుహంగుతో
సేయముఁ జెందియుండవలెఁ గేల్గదలించి యొకింత మీట నీ
లైయలరారి గౌరి, గిరిశాభరణంబు, ముఖారి, తోడి, పూ
రీయు, వసంతయున్ బిలహరీ మొదలౌనయరాగసంజ్ఞ బా
గై యటు లింపునింపవలె నట్టుల భట్టుల నట్టిరామఖ
ల్లీ, యమునా, అహంగు, మహరీ, గుజరీ, శహానా, బెహాగు, త
క్కారియు, నవ్రోజు, మారువయు. కాఫీ, ఖమాచి, హుసేని యాది దే
శీయవిశేషరాగములఁ జెప్పవలెన్ దననేర్పుమీఱ సు
మ్మాయతరాగమర్థనసమాన మరిస్ఫురితాహతోగ్రహ
స్థాయితురంగసంచరణసంకుచితోత్కుచితప్రచారిమ
స్త్రాయివిభేదతాన కటనస్ఫుట తానతనాగ్రమూర్ఛనో
చ్చాస్త్రియుమువాదియాదిస్వర జాతియుగీతిననుగ్రహింపఁ బ్ర
త్యాయతమైనగాత్రమయుగ మందము చందము సత్ప్రబంధగీ
తాయతి దాయసంగతి యుదారత దారకమంద్రమధ్యమ
స్థాయిపదచ్యుతాచ్యుతవిచారములన్ గమకప్రచారముల్
ధీయుతవేద్య మిట్టి గడి దేటినవాద్యము నెందుఁ జూడ మీ
దాయల చాయలంచును రసజ్ఞులు తజ్జ్ఞులు మెచ్చఁగావలెన్
హాయిగఁ బామరావళియు నచ్చెరువందఁగ మచ్చుమంతటీ

రై యతిరక్తి హెచ్చి మది నంటుట నొక్కటఁ జొక్కఁగావలెఁ గా
బ్రాయపుసాయగంబు గనుపట్టి తయారగు మేలొయారితో
ధీయను సొక్కుపల్లవి కడిందివడిం దగి యొల్లవారి కా
ప్యాయనలీలఁ గూర్పవలెఁ బ్రాయములు, గాదులు నాదు లెన్న రెం
డై యుగయుగ్మమయ్యు తనరారిననౌనటగోటిమీటులా
ప్పై యొనయంగ నిబ్బరము నబ్బుర మూనినతాళలీలఁ బ్రా
ణాయితకాలషట్కకలనం జలనం బొకయింతయైన లే
దాయె నయారె యంచు భరతాగమభాగవతప్రచారులా
మ్నాయవిచేయధుగ్రహనిమగ్రహ భాగ్వివమాదిభేరజా
త్యాయతఖండమిశ్రచతురశ్రముఖాఖిలభేదయుక్తశా
ఖాయికసల్లయద్వియుగబంధమృదంగపిపీలికాదిని
శ్చేయయతిప్రసంగపరిశీలన ఖేలననిర్వ్యపాయగో
పాయితదక్షిణానుగత వార్తిక చిత్రముఖాఖిలాయన
స్థాయదమేయశబ్దయుతశబ్దవిహీనముఖాక్రియానుసం
ధేయ మటంచు నెంచవలె నిశ్చలచంచలవృత్తు లిట్టు ల
ట్లై యటు లిట్టులై వెలయు నద్భుతవృత్తి సుధాబ్ధిపూరప
ర్యాయసమాప్లవోత్ప్లవనరంజన సంజనసాంతరాత్మని
ధ్యాయపరాత్మభావనియతిస్థిరనాదవినోదధీరని
ర్ణేయవివర్తకత్వపరినిష్ఠితలక్షణతం బ్రతిష్ఠిత
త్వాయన మంది యుండవలె నందటికిన్ దర మౌనె యట్టివి
ద్యాయతకోటి కెక్కఁ దగు నట్టిప్రవీణుఁడు పక్కిశాసను
న్నాయక కాళహస్తిపుర నాయక సన్నిధిదేశ సంగతిం
బాయక కొల్చి యున్న ననపాయకథాగ్రసమృద్ధి నిత్యసా
ఖ్యాయతసత్త్వసిద్ధి యగు నం దిక సందియ మంద నేల వి
ద్యాయతు లైనవారల కుపాయ మిదే నిరపాయ మై తగున్."

ఇంతియకాక కృ. కవి కొన్ని సాహిత్యముల జేసె. అం దిమిడించిన కొన్ని వర్ణనల చమత్కృతుల నీక్రింద వివరించెదను.

౧ "శ్రీరమణపాదజలరుహ బంభరాయమాన హృదయ, మదనమథ ధరరూప, దానరాధేయ, సుజన విధేయ, సద్గుణవిధేయ, శ్రీరావుకుల జలధి చంద్ర నీలాద్రిరాయచంద్ర, శ్రీవేంకటరాయచంద్ర, సుగుణసాంద్ర.

౨ నయవినయాదిక సుగుణాకర, సకల దిగంతరాశ్రిత విశేషపాలితా, శేషబుధజన పాలిత, మకుటాళి మణిదీప, మధురాలాప, మరవిజయ, రవిజయ, విజయ,

జయ, సంపత్ప్రతాప బలశీలా సుమహితల సదయ, మహితల సదయ, హితలసద
య, తలసదయ, లసదయ, సదయ, దయ, యనకలితవిమత శ్రీవేంకటరాయచం
ద్ర, సుగుణసాంద్ర."

ఈరెండును సావేరీ రాగములో ధ్రువతాళమున స్వరములువేసి వానికి సాహిత్యముగా రచియింపఁబడినవి. ఇం దుదాహరింపఁబడిన రావు వేంకటరాయ ప్రభుఁడు బుచ్చితమ్మరాయాపరనాముఁ డగుజగ్గముపేఁట జమీదారుఁడు. వెలమకులస్థుఁడు.

కృష్ణమూర్తికవి మురుమళ్ల పోలవరం జమీందా రగు దంతులూరి వేంకటకృష్ణమరాజు భద్రాచలయాత్ర పోవుట వర్ణించి చెప్పిన సీసమాలిక.

"సీ. శ్రీనాయకతులితభూనాయకం బగు, నలదంతులూర్యన్వయమున వెలసి
విలసితసత్కీర్తివిస్ఫూర్తులకును వి, శాలాక్షులకు ధౌతచేలము లయి
వెలయఁగ చతురంబుధులు మేరగా ధార, ణీరాజ్య మేలుచు నెగడఁజాలు
వీలుగలుగురాజ పాలితాశ్రితజాలుఁ, డతివేలసౌందర్యజితకమలని
వాసినీబాలుఁ డై వాసిమీఱఁగఁ దను, వేంకటకృష్ణ భూవిభుఁ డొకప్డు
శ్రీభద్రగిరియాత్రఁ జేయుటకై మది, నెంచి సౌందర్యసమంచితముగ
శుభముహూర్తంబున విభవానుసారి యై, చతురంగబలముతో నతులితముగ
రాజధాని యగుచు తేజరిల్లెడుపోల, వరము వెడలి తొడరుపరమసమ్మ
దమ్ము నెమ్మది నిండ దతమహోపాపాగ్ని, మండలం బగుమునిమండలంబు
ఫుల్లసముల్లసన్మల్లి యన్నమపల్లి, మణిరంగదల్లికుమానపల్లి
నిహతకళలంక శాణేలంక శృంగారి, కులమునకు చదరు కొండకుదురు
బహుదరమాధవీవల్లి యైనవిల్లి లే, వెలవెలపల్లి సద్ద్విజమతల్లి
వరమానవల్లి యౌవానపల్లి సురల, ప్రౌఢపారంబగువాడపాలె
మఘదురంతాతపహరణంబునకు వెల్లి, వాడపల్లి కుముదబాంధవమణి
వేదికాతతిజితవిమలత రాత్రేయ, పురమగు నాత్రేయపుర మనింద్య
తీరైపర్తినిరంతరకిసాల, శితసుమేరు వెళ్ళేరు దివికి
దంటనఁ దగుబేడిగుంట సర్వపురప్ర, వరమైనయులముప్పవరము పాంథ
జనసంతతులకు విశ్రాంతిఁ దా నిడఁజాలు, నిడదోలు మణిమయనిరుపమాన
వాటంబుగా కోటకూటేశ్వరము వింత, ధనదుపురికి పిల్లతాడిమళ్ల
పారిజాతముతోడ పోరుమామిడి గల, వోరుమామిడి బలుసౌరుమీఱు
రాజమానం బగుత్యాజమపూఁడి, యారామ దృశ్యద్విజప్రకరనీడ

మెట్టనగూడె మాయాగనియోధుల, నాయోధనాంబుధియందుఁ దేల్చి
పోతవరంబగుపోతవరంబది, రాజవరం బగురాజవరము
ప్రాకటనికటతటాకతటస్థలి, గుగ్గురా రావనిరర్గళప్ర
కారక్రోడంబు జంగారెడ్డిగూడెంబు, తాదృక్ప్రమదదాయి తాడువాయి
రమ్యమాకరుమవరాలబల్లూటయు, శ్వారావుపేట భవ్యమధుమాధ
వీసుపాకయునైనయాసుపాక సపత్ని, చతురంగసేనాద్రిశస్త్రహస్త
దళనకేళికయందు తరవారు కుకునూరు, సాధుతరం బగుమాధవరము
పరమపావనజలభారభాసుర తర, గోదావరీఘనకూలవిచర
దమరవరం బగునమరవరము భూ, దేవికి క్రీడము రావి గూడె
మనఁ బ్రసిద్ధికి నెక్కునట్టిగ్రామంబుల, ననుకూలముననె దన్నలరుసుకవి
పండితక్షత్త్రియమండలితోడఁ దా, దిగుబస చేయుచుఁ దీవ్రవప్ర
చాకచిక్యసచ్చక్రభద్రాచల, రామభద్రవిమాన రాజమెదుట
గన నైన సాష్టాంగ మొనరించి గౌతమీ, నది కవలదరిని బొదలునున్న
సలిలగుండంబుల స్నానం బొనర్చి శ్రీ, భద్రాద్రినాథునిపట్టణమున
నెట్టన సమ్మోదనిర్మలచిత్తులై, యత్యుత్తమం బగువార్యత్ర నొకటి
యానసభ నొనర్చి యనుదినంబును దక్షి, గోదావరీఝరీ కూర్మి చేర్మి
మజ్జన మొనరించి సజ్జనశ్రేణితో, శ్రీరామచంద్రునిశ్చింతనికట
నివసన్మునీంద్ర వినీతలక్షణ భజ, నాతినిస్తంద్రవామాంకభాస
మావ నై దివితనరైనయనోత్పల, పూర్ణిమాంచంద్రుసంపూర్ణసత్త్వ
సాంద్రు సేవింపుచు నిందిరతులిత భాగ్యుఁ, డితఁడని పురజను లతులితముగఁ
బొగడఁగ నగణితసుగుణసంపద మీఱ, నచటివిప్రులకు ధనాన్నదాన
విధి తృప్తిగావించి విశ్రుతసత్కీర్తి, దిక్కుల నెల్లెడఁ బిక్కటిల్ల
ము న్నేఁగినట్టులు సన్నిగ్రామంబులు, దరియుచుఁ గోపూరు ధవళగిరియు
కపిలేశ్వరపురంబు గాంచు టెక్కుడు గాఁగ, పోలవరం బతివేలలీల

గీ. జెందె నిభ్భంగి నాశ్రితబృందమునక, గణ్యపుణ్యక్రియాతిసై పుణ్యమహిమ
సులభముగఁ గూర్పనేర్పరి యిలమతియొక, రాజు గల్గునెయిమ్మహారాజుదక్క."

## పై వేంకటకృష్ణమరాజుపై మఱికొన్ని పద్యములు.

"ఉ. పండితమాళి శిష్టకులవార్నిధిసోముఁడు కృష్ణమూర్తి కా
ఖండలతుల్యవైభవు లఖండిత దానవినోదు లౌర భూ
ఖండ మొసంగి రిప్పు డది కాఁపుర ముండమిఁ బోవ దగ్గగా
నుండనిమాకు తుమ్మిన మఱుండునె కృష్ణనృపాలకాగ్రణీ."

మఱియొకపద్యము.

ఉ. సలలితలీల నెత్తతిని సత్యపదస్థితి తప్ప కల్లనూ
రులకుఁ బ్రమోదసంతతి నిరూఢిఁ దగన్ సమకూర్చి జీవనం
బు లిడెడుమర్త్యమూర్తి మనుఁ బోవఁడె కృష్ణమహేంద్రచక్రవ
ర్తి లసదనంతకీర్తి యవధీరిత మామకవ్యగ్రతార్తియై."

పై దంతులూరి వేంకట కృష్ణమరాజును గూర్చియే కృ. కవి మఱికొన్ని పద్యములు చెప్పినట్లు కానుపించును. అందులోనియొక యుత్పలమాలికమాత్రము నాకు దొరికినదాని నీక్రింద వివరించెదను ఎట్లన్నను :—

దంతులూరివారిపైఁ జెప్పఁబడినయుత్పలమాలిక.

ఉ. వైపయిరంగులం గదిసి పన్నుగ బోగవుటన్నువన్నె పెం
పై పసుపడ్డకబ్బముల కబ్బురమౌ వెర మాను మేలువా
ల్జూపులు పాఁపులన్ వలపు జూపుచు నీ టగుమాట తేట బ
ల్దీపులు పుట్ట నెట్టనఁ బదింబదిగా నెదఁ జిక్కు చొక్కపుం
బూఁవచనుంగవం గలపి పోడిమి వేఁడిమిటారపుంగటా
రీపస మీఱినారు జిగిరించెడిమించడరం గడంగి, మే
లీపని యంచు నెంచు మది హెచ్చుగ మెచ్చుగ నిచ్చవచ్చిన
ట్లోపినయంతపట్టు బిగియూఁతగ వాతెఱమార్పు నేర్పులన్
దాఁపగుముద్దుగుమ్మరసితద్దయు గద్దరి పైదిప్రోది మేల్
గోపు లెఱుంగఁజేయు నలకోయిలకూఁకలచాయనింపుతీ
రై పాసఁగన్ బ్రవలెన్ జవుల నందినదంటతనాన విచ్చిక
న్నోర్మిపిన పేరుటామని గనుంగొనపై కనుసీట తేటలన్
దూ పెడలించి పెంచఁదగుతో పసు గొజ్జెగ పూలశాలు తీ
రై పాసఁగన్ వలెన్ చవుల నందిన నమ్మరు తేరు దారులౌ
పూఁప పవళింపుమేడగదిపందిరి నొప్పెడుపట్టెమంచమం
దాపనిముందునాడిగ ఫుటందము జిందగ నందకత్తెచే
జాఁపి రొమ్ముసంగు వీడెముపసన్ వలపుల్ మొలపింపఁగావలెన్
దీపముఁ దేప కిప్పగిదిఁ దెస్గొనరించెడి పట్ల సంస్కృతా
టోపముఁ జూపుచో నలి కుటుంబిక ఝాంకరణాంక
కల్పవల్లీపరివేల్లనోల్ల సదలీనవ వీనసదావపాయనూ
నోపలసత్ప్రభూత ప్రరహాలాతవ నీభవనిర్జరావనీ

జోపరిపుష్పనిష్పతదనూనమరందఝరీపరీతసం
త్తాపహరాంబుపూరపరితస్సరణోత్థఘులంఘులధ్వని
వ్యాపిసురాపగాంతర సమగ్రతమగ్రమహానాయకాన్యాపే
క్షాపరిహీనచారుతర సౌరభసారభరాతిభాసురా
ష్టాపదకంజపుంజనివసత్కనకచ్ఛద హంససంసదా
లాపకలాపసమ్మిళితలాస్యకలావలమానకాంచికా
నూపురకింకిణీగణవినూత్నతరద్యుతిరత్నకంకణ
ప్రాంపిఝుణంఝుణక్వణనరంజితమంజులరూపరేఖపై
ఖీపరగీతతారతరగీతవినూతనజాతమాధురీ
రూపనిరూపణీయ మయి రూఢికి నెక్కివెలెం గవిత్వవి
ద్యాపటిమం బటంచు నను నంతటివానిగ నెంచి నాదుపు
ణ్యోపచయంబునన్ బిలిచి యుర్వర సర్వరసజ్ఞులెన్నఁ జూ
పోపనివారు చిన్నతనమూనఁగ సన్నిధియందు నిల్పి పృ
థ్వీపథవిష్ణుమూర్తి యనధీరిత కర్ణవితీర్ణనైపుణా
శాపరిపూర్ణకీర్తివిల సద్గుణసంతతి దంతులూరువం
శోపధిసింధుబాంధవసముజ్జ్వల పూర్ణసుధాంశుమూర్తియు
ర్వీపతిచక్రవర్తి యనఁ జేరగు వేంకటకృష్ణమూర్తియా
శాపరిపూర్తి సేయఁగ విచారము నీదు ప్రచార మేలగున్.

## పిఠాపురపు సంస్థానికునిపైఁ జెప్పినయుత్పలమాలిక.

ఉ. శ్రీరమణీమణీరమణసింధుసదృక్షుకటాక్షు వీక్షణాం
భూరసమృద్ధిసంతతని గూఢనిగాఢ సమస్తభాగ్యపా
శీరమణీయదేవనగరీవర మాచిరమా పిఠాపురీ
భూరిమణీగణాకలితభూరి నిరంతర కాంత కాంతివి
స్తార నిరస్తచిత్రకరసౌధ సుధాకరకాంతవేదికా
చారుచిరత్నరత్న రుచిసాంద్రనగేంద్ర మృగేంద్రపీఠదు
ర్వారగతిక్ష పయోజలధిపన్నగ నాథశిరోధి వీథికా
సారరు హాత్ముదీక్షను విచక్షతతోఁ గొలువుండి మీ రసా
ధారణవాక్సుధా మధురధారల మీ రలఘు ప్రచారవా
చారు చిచాతురిం గఁహాసాధనరాజవిరాజి తారిరాడ్ద్వారు
విదారణక్రకచదారుణ మండితమండలాగ్రభృ
ద్వీరులఁ బిల్చి కృత్యము సవిస్తరతం దగ నెంచి మించి యిం
పారెడు వృద్ధ్యవాద్యకలనాఖిల గీతకళాకలాపని

స్తారకులం గవి ప్రకరతార్కిక శాబ్దిక వేదవాదులన్
గౌరవ మొప్ప గొప్పగ నగణ్యధనాది సనాథులన్ ధృతిన్
గోరిక మీఱఁ జేయుచు నఖంతనటత్పద కుంజమంజుమం
జీరసురత్న పుంజమ్ముదు శింజితముల్ గల రావహంసికా
సారస సారసధ్వనుల సందడులన్ దుడుకొందఁ జేయువా
ణీరభసంబుడం బొదవ నిస్తులభూభృదపాత్తజీవికా
చారరమాసమానులగు పానలజానలు మీరు నాట్యవి
స్తారపదక్రమాభినయతానవితానవిభాగరాగగో
ష్ఠీరుతి ధీరతిన్ బుధులచిత్తము నత్తిగఁ జిత్తగింపుచోఁ
గోరిక దెల్పువేళ యని కొంకణ టెంకణ లాటభోటసౌ
వీరళకాదిదేశపృథివీవరు లందఱు ముందు ముందు జోహారులు
చేసి నిల్వ సెలవాయను మీ కిట జేర నంచు చో
ప్దారులు దెల్ప జోహుకుము వాదర బారుపసందు మీఱు స
ర్కారుఖోదాబరాబరు ఖరారు మదారుల మీఱుతీరు దర్బా
రనిరొన్ని పన్నెసఁగి పన్నగ సన్నుతు లెన్నె సేయుచో
మీఱిన వేడ్కతోడ పుడమిం గడు బ్రోచుచు నిత్యసత్యవా
ణీరతిభారతీరమణునిం బరమాప్తిని మాధవున్ శివా
చారత నీశు సద్గతిని చంద్రపదాసుమనః ప్రయుక్తిచే
సారధరావరుం గని యజస్రము గేరుచు మీఱుచుందుగా
వీరవరేణ్య రావుకుల వేంకటరామమహీపతీ కృతీ
మారసమాకృతీసదసమానయశశ్చరదాన నిందిత
క్షీరపయోధిసారమణిశీతికరామర భూమిరుట్త తీ
భూరమణాగ్రగణ్య మిముఁ బ్రోవుత దేవత లెల్లకాలమున్.

అని యిట్లు వర్ణించి యున్నతఱి నాయనశిష్యుఁడు తనగురునియొక్క సంస్కృతనైపుణిఁ జూపుటకు యత్నించి అందులో నావఱకు కృశవివలన రచియింపఁబడిన యీక్రింది శ్లోకముం జదివెనఁట. ఎట్లన్నను:-

శ్లో. రావురామనృపతా వుదారతా, భావుకేఽత్ర నక దాపి లోపితా,
కింతు సాధు సదలబ్ధవృత్తితా, హంత పూర్వభవ పాపవృత్తితః.

అని చదివిన శ్లోకము పూర్వము బులుసు పాపయ శాస్త్రికీయఁబడిన భూస్వాస్థ్యములో జరిగిన కృత్రిమముంబట్టి పండితులకు భూము

లిచ్చుట ప్రభుఁడు మానినట్లు కృ. కవి చెప్పి తనశిష్యునిచేఁ జదివించె నని యాగ్రహించి ప్రభుఁడు కృ. కవి యెడ ననాదరముం జూపెను. ఇది దైవకృతమే కాని కృ. కవియుద్దేశము కా దని వాడుక.

## అశ్వశాస్త్రరచన.

ఈ కృ. కవి మాడుగులలో నుండగాఁ గృష్ణ భూపతి యొక్క మోహపుత్త్రుఁడగు జగన్నాథుఁ డనునతఁ డొకగుఱ్ఱముం దీయుటకు యత్నింప దానికి నశ్వశాస్త్రవేత్తలు గొందఱు మెడక్రింద గోఁగుగల దనియు అది యొక్క దోషమనియుఁ జెప్పిరి. అయిన నాగుఱ్ఱముయొక్క పొంకమును సురూపముం జూచి జగన్నాథుఁ డద్దానిని వదలలేక యీ కృ.కవికిఁ గనుసైగ చేసి, కృష్ణభూపతితో నీ కృ. కవియును అశ్వశాస్త్రములో మిగులఁ బండితుఁడు. వారికడ గ్రంథము లేవైన నుండును. వారియభిప్రాయము నరయుట మంచి దని విన్నవింప నట్లైన మీకడ నుండు గ్రంథముం దెప్పింపుఁ డని కృష్ణభూపతి కృ. కవికిఁ జెప్పెను. అపుడు కృ. కవి తాను మఱునాఁడు దర్శనమునకు వచ్చినపుడు తెచ్చెదనని విన్నవించెను. అంతట నీజగన్నాథుఁడు కృ. కవి యింటికిఁ బోయి తన గాగుఱ్ఱముం గొనిపించునట్లు గ్రంథము జూపించిన విశేషధన మొసంగెద నని చెప్పిపోయెనఁట. దానికిఁ గృ. కవి సమ్మతించి ఆరాత్రి భోజనముచేసి తనదౌహిత్త్రుం డగుకృష్ణమూర్తి నామునిం బిలిచి ప్రాఁతతాటాకుల యలేఖములం దెమ్మని చెప్పి వాని నొకగ్రంథములో మధ్య నిమిడించి సంస్కృతముతో నారదమహాముని యొకరాజన్యునకుఁ జెప్పిన ట్లశ్వశాస్త్రసంప్రదాయములన్నియుఁ బుంఖానుపుంఖములుగ మూఁడునాల్గువందల శ్లోకములు చెప్పి తెల్లవాఱునరికి గ్రంథము సిద్ధముచేసి దానికి వర్ణము వేసి ప్రభువునకుం జూపించెనఁట. అట్టిగ్రంథము వినుట కందఱు నద్భుత మంది రనియు నందు గుఱ్ఱములకు గోఁగు కల్గియుండిన దానివలన దోషములేకుండుటయే కాక గుణవిశేషములుకూడఁ బెక్కులు కల వని సూచింప దానికి నభవారందఱు

నంగీకరించి, ఆగుఱ్ఱమును పిలిపించి ఆముహూర్తముననే జగన్నాథుని దానిపై నెక్కించిరఁట. పిమ్మట జగన్నాథుఁడు మిక్కిలి సంతసించి కృ. కవికి విశేషబహుమానంబుల నిచ్చెనఁట. ఈకథనంతయు నా రాత్రి కృష్ణమూర్తికవి యున్నస్థలములోనే కూర్చుండి కృ. కవివలన నాచమత్కృతిఁ జూడఁ గోరబడినట్టియు నపు డిరువది సంవత్సరముల వయస్సులో నుండియు నిపుడేఁబడిది సంవత్సరముల వయస్సులో నుండునాస్నేహితు లొకరు చెప్పుటచే దీని నిందుఁ బొందుపఱిచితిని. పాఠకులు నమ్మినను నమ్మకున్న నింతకంటె నేను వ్రాయవలసినది లేదు.

### కృ. కవికృత మని వాడుకొనంబడుపద్యము.

"సీ. దురుసానిమైనున్న బురుసాపనిరుమాలు, కరసారసమున నొక్కపరి విసర
కురదాపడనిలీల పరదా వెడలి వచ్చు, సరదా తెలియఁ బైఁట జాఱవిడిచి
అఱజారుకురులు క్రమ్మఁగ జాటిపడి స్రాలు, విరజాజిపువ్వుల విసరి విసరి
వెరబాఱుగాలి నాపారబాటు విడఁ మారుదరబారుపావడ దార్చి తార్చి
తే. పకడుగలకమ్మవిలుకాని హుకుమతీమ, తలబు జాహీరుగా మస్తుతలఁపుచేయు
దీనివక్తృతమాషాఖుషీనిషాల, ఖేఁవతురభీకు నయినను దెలియ వశమె."

శ్రీ ర స్తు.

# క వి జీ వి త ము లు.

ప్రౌఢప్రబంధకవులచరిత్రము.

## 18.

## స ం కు సా ల న్నృ సిం హా క వి.

ఈవఱకును గొందఱు ప్రబంధకవులచరిత్రములు వివరించినాము. వారు పౌఢకవులయినను గొన్నిభాగములలోఁ గథానుగుణ్యమున మృదుశయ్యంగూడ నవలంబించియుండుటచేత వా రుభయవిధకవు లయిరి, ఇపుడు మనము వ్రాయుచున్నకవులు కేవలము పౌఢరచనయే ప్రధానముగాఁ జేసి కవిత్వము చెప్పినవా రవుటం జేసి వీరిని బౌఢకవులుగా నిర్ణయించవలసివచ్చెను. వీరిపేరులును గ్రంథముల పేరులు నీక్రింద వివరించెదను.

౧ నృసింహాకవి. కవికర్ణరసాయనము.

౨ కృష్ణరాయలు. విష్ణుచిత్తీయము.

3 కామకవి. సత్యాభామాసాంత్వనము.

౪ వేంకటేశ్వరవిలాసము. గణపవరపు వేంకటపతి.

౫ ధరణదేవుల రామమంత్రి. దశావతారచరిత్రము.

ఇట్టి కవుల చరిత్రములలోఁ బైయిద్దఱుకవుల చరిత్రమును బూర్వము కొంత చెప్పియున్నాను. ఇకఁ దక్కిన కవులచారిత్రము విశేషముగ వ్యాపకములో లేదుగావున గ్రంథస్థమగుదానిమట్టుకు వివరించెదను. కృష్ణరాయనిచారిత్రములో నిదివఱ కతఁడు కవిగా వివరించి కొంతగాథయు దేశాధిపునిగా వివరించి కొంతగాథయు వ్రాసియున్నా

ము. అట్టిగాథల నిపుడు దొరికినమట్టుకు విశేషములఁ జేర్చి పెంచి వ్రాసెదను. కృష్ణరాయచారిత్రము కేవలప్రభుచారిత్రములలోఁ జేర్చి చెప్పవలసిన దైనను, రాజచారిత్రము లేనిది కేవలకవిచారిత్ర మంత శ్లాఘాపాత్ర మైయుండదు గావున నీ పట్టున రాజచారిత్రములలో నున్న దానిని విడఁదీసి దీనియందే పొందుపఱిచెదను. కావున చరిత్రాభిమానులు దీని నంగీకరింపఁ బ్రార్థింపఁబడుచున్నారు.

## కవికర్ణరసాయనము.

పైప్రోక్తప్రబంధములలో మొదటిగ్రంథ మగుకవికర్ణరసాయన మనునీగ్రంథము నరసింహకవి యనునతఁడు రచియించెను. అల్లసాని పెద్దనయు నీతనికిఁ బూర్వులగు కొందఱు కావ్యకర్తలును గనుపఱిచినమార్గములలోని విశేషముల ననుసరించి కేవలము ప్రబంధవర్ణనల న్నియుఁ దెచ్చుటకు నొకకథను విశేషకథాచమత్కృతి లేనిదానిం గైకొని ఆఱాశ్వాసములగ్రంథము రచియించెను. ఇట్టిగ్రంథములో నుండు వర్ణనావిశేషములు దెలుపుటకుఁ బూర్వము ప్రబంధావసరము లగువర్ణనలకు నిబంధనపద్యములఁ దెల్పి యనంతరము వర్ణనలలో నెన్ని పెంచి రచియింపఁబడియెనో చూపెదను. ఇతనినాఁటికి లక్షణగ్రంథము కావ్యాలంకార చూడామణి యనంబరఁగు విన్నకోట. పెద్దనకవిరచిత లక్షణ మై యున్నది. కాని అంతకంటె ననంతరకాలములో రచియింపఁ బడిన ప్రతాపరుద్రీయములో నుండువిశేషము లీనరసింహకవికి లక్ష్యములుగా నున్న ట్లూహింపఁబడును. అది నరసింహకవికాలమునాఁటికిఁ దెనుఁగు కాకున్నను ఇపుడు వ్యాపకములో నాగ్రంథ ముండుటం బట్టి దానిలోని ప్రబంధ నిబంధనమునే యీక్రింద వివరించెదను. ఎట్లన్నను :—

"గీ. ఇంకఁ గావ్యప్రభేదంబు లేర్పఱింతు, వరుస నష్టాదశ విశిష్టవర్ణనములు
గలుగవలయు మహాకావ్యతిలకమునకు, నెలమిఁ దన్నామధేయంబు లెట్టి వనిన.

క. పుర, సింధు, నగ, ఋత్విన, శశి. సరసీ, వన, మధు, రతిప్రసంగ, విరహముల్
పరిణయ, తనయోదయ, నయ. విరచన, యా, త్రాజి, దౌత్య, విభువర్ణనముల్.

గీ. ఇరుదు నొకకొన్ని కడయైన నెంచిచూడ, నదియు నవనిమహాకావ్యమనఁగ బరఁగు
మఱియు క్షుద్రప్రబంధ నిర్మాణమర్మ, లక్షణము తేర్పఱింతు చెద లలితఫణితి. "

మహాకావ్య లక్షణముల వివరించితిగావున నిఁక నష్టాదశవర్ణనలలో నీ నృసింహకవి హెచ్చించి చెప్పిన వర్ణనములం జూపెదను, దానికిఁగాను నరసింహకవిచేతనే చెప్పఁబడిన యాశ్వాసాంత గద్యములే చాలియుండుంగావున నీక్రిందివానిఁ బ్రత్యేకించి చూపెదను. అందులో :—

౧. ప్రథమాశ్వాసములో ౧. కావ్యారంభము. ౨. పురవర్ణనము. ౩. నాయకనిరూపణము.

౨. రెండవయాశ్వాసములో. ౧. రాజనీతి. ౨. శరత్కాలవర్ణనము. ౩. దండయాత్ర. ౪. దిగ్విజయంబు. ౫. సేనాసన్నివేశనిరూపణము. ౬. దూతాలాపంబును. ౭. వీరాలాపంబును. ౮. యుద్ధము. ౯. శైలవర్ణనము.

౩. మూఁడవ యాశ్వాసములో. ౧. నాయికానిరూపణము. ౨. యౌవనవర్ణనము. ౩. విప్రలంభంబును. ౪. ఆ విప్రలంభవర్ణనములో దశదశానిరూపణము. ౫. వివాహము. ౬. నవవధూసంగమము.

౪. నాల్గవ యాశ్వాసములో. ౧. వసంతవర్ణనము. ౨. వనవిహారము. ౩. జలక్రీడ. ౪. సూర్యాస్తమయము. ౫. తమోవర్ణనము. ౬. తారకావర్ణనము. ౭. జారవిట విటీవర్ణనము. ౮. చంద్రోదయము. ౯. మధుపానము. ౧౦. రతినిరూపణము. ౧౧. ప్రభాతవర్ణనము. ౧౨. సూర్యోదయవర్ణనము.

౫. అయిదవ యాశ్వాసములో. ౧. వసిష్ఠాగమనము. ౨. రాజప్రశ్న ప్రతి వచనంబులు. ౩. అట్టిప్రశ్నలలో కర్మస్వరూప బ్రహ్మస్వరూపములు. ౪. వేద వేదాంత పురాణ నిరూపణము. ౫. భక్తి ప్రపత్తిరూపసాధన నిరూపణము. ౬. సంసారనిరూపణము. ౭. మోక్షోపకరణము.

౬. ఆఱవ యాశ్వాసములో. ౧. తపశ్చరణము. ౨. అందులో గ్రీష్మ, వర్ష, శిశిర ర్తు వర్ణనము. ౩అప్సరస్సమాగమనప్రకారమ్ము. ౪. నృత్తప్రపంచము. ౫. సముద్రవర్ణనము. ౬. వైకుంఠవర్ణనము. ౭. భగవద్దివ్య మంగళవర్ణనము. ౮. భగవత్ స్తోత్రము.

పైవర్ణన లెట్టు లున్న వనఁగా:—

1-వ దానిలో 3. 2-వ దానిలో ౯. 3-వ దానిలో ౬. 4-వ దానిలో ౧౨. 5-వ దానిలో ౭. 6-వ దానిలో ౮. మొత్తము. ౪౫.

ఇటులఁ జేసి తిరుగ నొక్కొకదానిలో ననేక వర్ణనలు చేర్చి చెప్పుటయే కాక నరసింహకవి తిరిగి యొక్కొక వర్ణనలో ననేక భేదములుగూడ కల్పించెను. ఎట్లనగాఁ బురవర్ణనలో కోటలు, కొమ్మలు సౌధములు వర్ణించుటయేగాక బ్రహ్మక్షత్త్రాది వర్ణచతుష్టయమును, చతురంగబలంబులను, పుష్పలావికాది స్త్రీవర్ణనాంశాదికములం జేర్చి పెంచి చెప్పెను. పారిజాతాపహరణమునకంటె మనుచరిత్రంబునను, మనుచరిత్రమునకంటె నీకవికర్ణరసాయనంబున ననేక విశేష వర్ణనాంశములు కాన నయ్యెడిని. ఇట్టి నరసింహకవి మార్గమునే కైకొని ఆముక్తమాల్యద, వసుచరిత్రము మొదలగుప్రబంధములు రచియింపఁబడినవి. తదనంతరకాలములోనికవులందఱు నాయావర్ణనలనే చేయుచువారిబుద్ధివైశద్యముచేత నాయావర్ణనలలో నింకను విశేషించి గ్రంథము జేర్చిరి. శా. స. ౧౬. ౧౭ శతాబ్దములలోని కవులు పైవర్ణనలన్నిటిం జేకొనినను శృంగారాదివర్ణనలు ప్రధానములుగాఁ జేసి అందుఁ బ్రఖ్యాతిం జెందిరి. వారిచారిత్రములు మఱియొక భాగములోఁ జేర్పంబడినవికావున నందలి విశేషము లాచరిత్రములలోపలనే వివరించెదను. ప్రస్తుత మీకవిచరిత్రముం జెప్పి మనుచరిత్రమునకు నీకవికర్ణరసాయనమునకుం గలకైలీవిశేషములం జూపెదను.

## నృసింహకవిచరిత్రము.

దీనిని దెలుపుట కీగ్రంథములో విశేషాధారములు లేవు. ఇతని

వలన నావఱకుఁ జేయంబడిన గ్రంథనామములం దుదాహరింపఁబడియుం డలేదు. కావున గ్రంథాంతరముల వలననైనం దానిం దెలియుట కా ధారములు లేవు. గ్రంథముఖంబున నీకవి యొకపద్యముం జెప్పెంగాని దానివలన నీతనివంశానువర్ణనము తెలియదు. ఆపద్య మెట్లున్నను :—

క. గురువరభట్టపరాశర, చరణసరోరుహసముల్లసన్మానసుఁడన్
నరసింహనామధేయుఁడ, పరిమితసత్కృతిరసానుభవహేతువునన్.

ఆశ్వాసాంతగద్యములోఁగూడ నరసింహకవియొక్క చారిత్ర ము కొంచెమైనను లేదు. గద్య మెట్లున్న దనఁగా:—

"శ్రీమద్భట్ట పరాశర దేశికేంద్ర చరణసరసిజసేవకోప సేవక నరసింహ నామ ధేయ ప్రణీతను."

అని యున్నది. ఇట్లాశ్వాసారంభములోఁగానీ యాశ్వాసాంత గద్యములోఁగానీ స్వప్రజ్ఞాప్రకటనముగానీ వంశవర్ణనముగానీ చేసి కొనినవాఁడీనరసింహకవియొక్కఁడే యీప్రబంధకవులలోఁ గాన్పించు చున్నాఁడు. ప్రజ్ఞావిశేషము లేదేమో అని యూహింపఁగా నిత నితో సమానుఁడగు ప్రబంధకవి ఆంధ్రములో నున్నట్టుగనే కానుపిం చఁడు. ఇట్టికవి నేమికారణముననో ఆంధ్రకవిచరిత్రములో "ఇతఁడు స్వాతిశయభావము గలవాఁడైనట్లు కనుపట్టుచున్నాఁడ"ని వ్రాయం బడియున్నది. ఇది మిక్కిలి పరాలోచన చేయకయే యియ్యంబడిన అ భిప్రాయముగా నిర్ణయించి అట్లుగా నభిప్రాయ పడుటకుఁ గారణభూత ములైనపద్యములరచనకుఁ గలకారణముల నుచితస్థలంబున వివరిం చెదను.

## కవికర్ణరసాయనము కృష్ణరాయలకడకుం గొంపోయినకథ.

ఆంధ్రకవితాపితామహుఁడగునల్లసానిపెద్దన మనుచరిత్రము రచియించి కృష్ణరాయలకడ విశేషగౌరవము నందినవృత్తాంతంబు విని నరసింహకవి తాను నొక ప్రబంధంబు రచియించి రాజునకుం గృతినిచ్చి గౌరవము నందంగోరెను. అట్లుగా నూహించి "కవికర్ణరసాయనమ"ను గ్రంథమును రచియించి దానిని కృష్ణరాయలకుఁ గృతినిచ్చు తలంపున

నద్దానిం గొని విజయనగరమునకుఁ బోయి అట్టిప్రబంధ విషయమై లెస్సగ నెఱిఁగినట్టియు రాజునకు మిగుల గౌరవనీయుఁ డగునల్లసాని పెద్దనకుం జూపించి తనకు రాజదర్శనంబు చేయించు మని కోరఁగాఁ బెద్దన దానిని సావకాశంబుగఁ జూచి అది రాజుకడకుఁ బోయినవిశేష సన్మానం బాకవికిం దెచ్చు నని తలంచి ఆకవికి రాజదర్శనంబు కాకుండు నుపాయ మారయుచుండెను. ఈ నూతనకవియును రాజదర్శనం బగున నుకోర్కెచేఁ దాఁ జిరకాలం బచ్చో సొంతసొమ్ము వెచ్చించుచు నుండెను. తుదకుఁ జేతనున్న ధనంబు వ్యయమగుడు నేమియుఁ దోఁచక యూరకున్న నే మగు నని తనగ్రంథములో నున్న నాల్గుపద్యములం దీసి వానిం దనపరిచారకుచే నంగడికిం బంపి విక్రయించి రమ్మనెను. వాఁడును ఆపద్యంబులం గొని గ్రామంబంతయుఁ దిరుగుచు పద్యమునకు వేయి వరాలు విలువ యని కేక వేయుచు రాజుకోటలోనికి వచ్చెను. ఆదిన మా కోటలో రాజకుమారిక హర్మ్యాగ్రంబున విహరించుచుండెను. ఈకేక నాపె విని యాపద్యంబులం దెప్పించి చూచి మిగుల సంతసించి వాఁడడిగినమూల్యము నిచ్చి వానిని విలిచి తాఁ బఠియించెను.

ఇట కవికర్ణరసాయన గ్రంథకర్త యావచ్చినధనంబు పుచ్చుకుని మఱికొన్ని దినంబు లుండి అప్పటికిని రాజదర్శనంబు గాకుండుటకు లోవగచి ధనాశచే నిట్టికృతి మనుజుల కిచ్చుట తుచ్ఛం బనియు దీని నిఁక నాముష్మికార్థి నై శ్రీరంగనాథున కిచ్చి ధన్యుండ నయ్యెద నని నిశ్చయించి యచ్చోటు వాసి శ్రీరంగంబునకుం బోయి అచ్చో నద్దాని భగవదర్పణచేసి కృత్యాదిని శ్రీరంగమాహాత్మ్యంబు వచియించి ధన్యుం డయ్యె నని ప్రతీతి గలదు.

అట కృష్ణరాయనికూఁతురు పద్యంబుల గ్రహియించి సంతసంబుననుండి యొకనాఁడు తండ్రి వచ్చిన నతనితోఁ జతురంగమాడఁ దొడంగె. అవు డొకపేదా (బంటు) రెండు పెద్దజంతువులనడుమం బడినఁ గని యాచిన్నది "ఉద్ధతులమధ్యఁ బేదల కుండఁ దరమె." అనుచు రా జా

వాక్యమునకు నలరి ఏది పద్యమంతయుఁ జదువుమనుడు నాప్పె యట్లు కావించెను.

కృష్ణరాయం డాపద్యమున కలరి అది యేవారికవిత్వ మనుడునా చిన్నది తాఁ గవి నెఱుఁగ ననియుఁ దాను వాని విలిచితి ననియుఁ జెప్పిన రాజు విని విస్మితుండై దిగ్గున లేచి యాస్థానంబునకుం జనుదెంచి ఆపద్యంబు చదివి యిది యెవరికవిత్వ మనుడు నచ్చో నున్న కొందఱు కవికర్ణరసాయన మను కృతిలోని దని తెల్పి ఆకవి అచటికి వచ్చుట మొదలగువృత్తాంతంబు చెప్పిరి. ఆమాట విని రాజు మిక్కిలి వగచి అతనికి వర్తమానంబు పంపె. ఆకవియును తనగ్రంథంబు రంగనాథునకుఁ గృతినిచ్చుట మొదలగు వృత్తాంతంబులు జెప్పిపుచ్చెను. ఆమాటలు విని కృష్ణరాయం డెంతయుఁ జింతించి ఆగ్రంథం బైన తనకడకుఁ బంపినఁ జూచెద ననుడు నాకవి తనగ్రంథంబును రాజునకుం బంచె. దానిలోని విశేషంబులకు రా జెంతయు నాశ్చర్యంబు నంది హా! ఇట్టి గ్రంథంబునకుఁ దాఁ గృతిపతి యగు భాగ్యంబు పట్టదయ్యె నని చింతించి తానట్టిగ్రథం బొకదానిని రచియించినంగాని తన విచారంబు పో దని నిశ్చయించి యపు డాముక్తమాల్యద రచియించె నని కొందఱ యభిప్రాయము. అట్టి గ్రంథము తన పేరిట రచియించి ప్రకటించుటయే పెద్దనకుఁ దగు నపరాధముగా నూహించి పెద్దన నట్లు నియమించె నని మఱికొందఱియభిప్రాయము. పెద్దనయెడ రాజునకుం గల గౌరవాధిక్యముం బట్టి యిట్టి యమర్యాద కార్యంబు చేయునా యని యూహించ వలసియున్నది. ఏది యెట్లున్నను పెద్దన యాగ్రంథము రాజుకడకుం బోకయుండఁ జేసినట్లు ప్రతీతి కలదు. ఆంధ్రకవిచరిత్రములో.

"ఆంధ్రకవితాపితామహుఁ డయిన యల్లసాని పెద్దన్న యంత యసూయాగ్రస్తుఁ డగుటకుఁ దగినకారణ మేమియుఁ గానరాదు. కవికర్ణరసాయనము మొత్తముమీఁద మంచిదే యయినను పెద్దనార్యకృత మైనమనుచరిత్రముకంటె నేవిషయమునందును గుణాతిశయము కలది కాదు."

అని యున్న దానితో నన్ని యంశములలో నే నేకీభవింపను. ఆంగ్లేయులప్రభుత్వములో క్రీస్తుని పందొమ్మిదవ శతాబ్దాంతములో నభివృద్ధిలో నుండు నాంగ్లేయవిద్యాప్రాబల్యము నందియు, వారినాగరకతాలక్షణములు తెలిసికొని వారితోఁ గలసి మెలసి వ్యవహరించుచుండు మన యాంధ్రపండితులు నేఁటివఱకు స్వదేశ జన్య మైనయసూయాపిశాచగ్రస్తులు కాక తప్పించుకొనలేక యెవరైన కష్టపడి యొకగొప్ప యుద్యమము చేయుచుండ నోర్వలేక దానికి విఘ్నములు గాని లేక అది తాముం జేసితి మనిపించుకొనినఁ గొంత యెదటి వానిప్రతిష్ఠ తగ్గినఁ దగ్గుంగాక యని యుద్యమించుచుండ, నాల్గుశతాబ్దముల క్రింద నన్నసర్వాధికారుల మనుకొనురాజులసభలలో నగ్రతాంబూలము గ్రహించి మించుచున్న పెద్దన్నవంటి హిందూపండితుఁడు. తనతో సమానుఁడుగాఁ గానీ తనకంటె నధికుఁడనిగానీ భావించఁదగినకవికర్ణరసాయనగ్రంథకర్త యగునారసింహకవిని రాజదర్శనార్థంబుగఁ దోడ్కొనిపోవు నని యాధునికాచారముం బట్టి చూచిన నిర్ణయింప వశమై యుండదు. కావున ననూయయే యితనిగ్రంథము కృష్ణరాయుల సన్నిధికిం బోకుండఁ జేసిన దానికిఁ గారణ మై యుండును. పెద్దనార్యమనుచరిత్రమునకంటె నారసింహ కవికృత కవి కర్ణ రసాయనము ఎన్నివిధముల నధికమైనదో దాని నాయిర్వురి శైలీవిశేషంబులఁ జూపుచో వివరించెదను. ఇపు డీనృసింహకవి గ్రంథము రాజునకుఁ గృతినిచ్చుటకు యత్నించెనా అనుదానిం గూర్చి చర్చించెదను. ఎట్లన్నను:—

## నృసింహకవి గ్రంథరచనావిషయము

దీనింగూర్చి నృసింహకవివలననే కొన్ని వాక్యంబులు చెప్పంబడినవి. అవియెట్లన్నను:—

"వ. అని వితర్కితపూర్వకంబుగా నపూర్వవిరచనా చాతుర్యంబు నెఱయ మెఱయ నన్వర్థనామంబు గాఁ గవికర్ణరసాయన మనునొక్క కావ్యంబు రచియింప నున్ముఖుండనై యనుకూలనాయకా న్వేషణపరాయత్తం బైనచిత్తంబున"

అని యున్నది. దీనిక్రింద వ్రాసిన పద్యములో ననుకూలనాయకాన్వేషణంబు జేయుటకు మాఱుగ ముందుగఁ బ్రతికూలనాయక నిర్ణయంబు చేసి నరకృతినిందం జేసి పిమ్మట ననుకూలనాయకుని నిర్ణయించుకొని నట్లుగా నున్నది. నరకృతి జేయనివారలందఱు నవలంబించిన ఫక్కిక యిది కాదని ఆంధ్రభాగవతముతక్క తక్కిన గ్రంథములన్నియు సాక్ష్య మిచ్చుచున్నవి. ఆయాంధ్రభాగవతములోఁగూడ నరకృతి చేయ వలసిన యవసర మొకటి యేర్పడిన పిమ్మటనే దానిం దిరస్కరించి అట్టి తిరస్కరణమును లిఖితరూపంబుగాఁ జేయంబడినదికాని అది లేనిది కాలేదు. అటులనేయీనృసింహకవికిఁగూడ మొదట నరకృతి చేయునవసరము కలిగినపిమ్మటనే ఆయూహ మార్చుకొనినట్లు కానుపించును. దాని నెట్లుచెప్పె ననఁగా :—

"సీ. ఆందోళికలయందు నంతరచరు లైన, శవకృతాకృతులఁ బిశాచజనుల
వాలవీజనములఁ గ్రాలుచు నీఁగకుఁ, గాలునిఖరవర్తులాండసముల
వేత్రపరంపరావిలకంటకాకృతిఁ, జేరఁబోరాని బర్బూరతరుల
పరకరాలఁబులై ప్రార్థింపఁ గై కోక, వాయెత్తకుండుజీవచ్ఛవముల.
గీ. శంఖనాగస్వరాదిక శ్రీవణసమద, విస్ఫుటచ్ఛత్ర విస్ఫారితస్ఫటాక
దిష్టవిషవైద్య వశవర్తిదుష్టఫణుల, ప్రభుదురాత్ముల వెవ్వాఁడు ప్రస్తుతించు.
గీ. నరగుణాంకిత మయ్యెనే సరసకృతియు, దూష్య మగు శునకోద్వృత్తదుగ్ధ మట్ల
హరిగుణాంకిత మయ్యె నే సరసకృతియు, హారసూత్రంబుగతి హృదయంగమంబు."

అని అప్రస్తుత మగునరకృతినింద నొనరించి పిమ్మట తా నేర్పఱుచుకొనిన కృతిపతి గుణవిశేషముల నీక్రింది విధంబునం జెప్పె. ఎట్లన్నను :—

"సీ. జగదేకపతి యయ్యు సకలాభిగమ్యుండు, సర్వశాసకుఁ డయ్యు సదయహృదయుఁ
డభిమతప్రదుఁ డయ్యు నంజలిసాధ్యుండు, పరిపూర్ణుఁ డయ్యును బ్రణతికాముఁ
డతిగ శేంద్రియుఁ డయ్యు ననిమేషదృగ్గ్రాహ్యుఁ, డనిరోధ్యుఁ డయ్యు భక్తానుయాయి
సాక్షి యయ్యు నతాపచారానభిజ్ఞుఁడు, సముఁ డయ్యు నార్తరక్షాపరుండు
గీ. భద్రగుణనిధి దుర్గుణప్రతిభటుండు, సముఁడు నధికుండు లేనియుత్తమపరుండు
వెదకి చూచిన శ్రీరంగవిభునివంటి, ప్రభువు నత్యంతసులభుండు పరుఁడు గలఁడె.

శా. జ్ఞానప్రౌఢమహాజనాధికవచస్సంస్తూయమానుండు ల
క్ష్మీనాథుండు మదల్పవాక్య రచనాస్వీకర్త కాకుండునే
నానాభూపతులైఁ గానుకలు రత్నశ్రేణు లర్పించగాఁ
ధానాముష్టిముచుం గుచేలుఁ గరుణన్ ధన్యాత్ముఁ గాఁ జేయఁడే."

అని సకలలోక నాయకుం డైన శ్రీరంగనాయకుండు కృతినాయకుండు గా నిశ్చయించి

అని యున్నది. పైపద్యసందర్భముతో దీనిని బరిశీలించి చూడఁగా నీకవి మొదట నీగ్రంథము నరకృతి చేయ యత్నించి యుండె నని యు నది యేకారణముననో మాఱి దైవకృతి కంగీకరించె నని చెప్పెడు లోకప్రతీతి సరియైనదిగానే కానుపించుచున్నది.

## గ్రంథరచనాప్రకారము.

ఈ నృసింహకవి తా నేశాఖాబ్రాహ్మణుఁడైనదిగానీ లేక బ్రాహ్మణుఁడైనదిగానీ చెప్పియుండ లేదు. అట్లుండుటంబట్టి నృసింహకవి యేవర్ణస్థుఁ డైనదియును జెప్ప వీలుపడదు. ఇతఁడు బ్రాహ్మణుఁ డని యు నియోగి యనియు లోకములో నున్నవాడుకనే నమ్మవలసినది గా వచ్చుటంజేసి అటు లైయుండిన నేమతస్థుఁ డనుదానిం దెల్పుటకు గా నాతనివలనఁ గృత్యాదిని చేయంబడిన యిష్టదేవతాస్తోత్రపాఠము లను బట్టి నిర్ణయించెదను. అందులో మొదట విష్ణుని, పిమ్మట బ్రహ్మ ను, శంకరుని, వినాయకుని, సరస్వతిం బ్రార్థించె. ఇది స్మార్తులుగా నుం డుబ్రహ్మక్షత్రియులు చేయుస్తోత్రప్రక్రియ యై యున్నది. కాని భట్టు పరాశర శిష్యుండ నని చెప్పుటంజేసి యితఁడు నల్లసాని పెద్దనవలె స్మార్తుఁ డయ్యును వైష్ణవేష్టి చేసికొని రామానుజసిద్ధాంతప్రధానుఁ డై యుండిననియోగి యని యూహింప నై యున్నది.

## సుకవిస్తుతి, కుకవినిరాకరణము.

ఈకవి యేకారణముననో ప్రాచీనకవుల నేరిం బ్రశంసించి యుండఁడాయెను, ఆస్థలములలోఁ గొన్ని సుకవి లక్షణములును, కుకవి లక్షణములం జెప్పి అనదుమ సత్కావ్యముల యొక్కయు దుష్కా

వ్యముల యొక్కయుఁ బ్రసంగంబు చేసి అందులోఁ దనకావ్యవిశేషములఁ గొన్నిటిం జెప్పెను. ఈ ఫక్కిక ప్రాచీననవీనకావ్యములలోఁ జూపట్ట నిదై మురారికవియొక్క ఫక్కికయై కాన్పించు. పైపద్యములలో సుక విసంబంధము లగుపద్యముల ముందు వివరించెదను. ఎట్లన్నను:—

"చ. మనమునఁ గొన్న సెవ్వగలు మాన్పి ఘటింతు రకాండసమ్మదం
బనఘకథాముఖంబున హితాహితబోధ మొనర్తు రింపుగాఁ
గనుఁగొనకంటె నద్భుతముగా నెఱిగింతు రతీంద్రియార్థముల్
ఘనమతు లెల్లవారికి నకారణబంధులుగారె సత్కవుల్."

ఇఁకఁ గువికనిరాకరణ మీక్రింది విధంబునం జేయుచున్నాఁడు.—

ఉ. అంతము గాఁగ శబ్ద హృదయజ్ఞులు గా రుచిరప్రయోగముల్
వింతలుగాఁ బ్రబంధముల వీథులు ద్రొక్కఁగలే రకస్తుతై
దొంతరజిల్లిబొంత లెడ దూర్చి గతార్థమె కూర్చుదుష్కవి
భ్రాంతుల సందడిం దడవఁ బాసె రసజ్ఞులకుం గవిత్వముల్. అని.

## కవిత్వవిశేషములు.

పురాణకవులలోఁ దిక్కనసోమయాజివలెఁ గావ్యకవులలో నీ నారసింహకవి స్వోద్దిష్టకావ్యములలోఁ గల్గెడుకొన్నివిశేషములు వివ రించెను. దానియభిప్రాయ మారియ నావఱకుఁ గల్గినకావ్యములలో నట్టి విశేషములు లే వనియు నవి ముఖ్యములు కాకున్న నాకావ్యముల లోఁ బ్రౌఢిమ తక్కువగుననియు వారియంతరం గాభిప్రాయము గా దోఁచెడిని. నన్నయ భట్టుకవనంబులో లేనిమెఱుఁగు లెట్లు తిక్కనసోమ యాజి తన కవిత్వములోఁ దేఁగోరెనో అటులనే నృసింహకవి అల్లసాని పెద్దనకవిత్వములో లేనిమెఱుఁగులు తనకావ్యములోఁ దెచ్చెదనని కొన్ని విశేషములఁ బ్రదర్శించినట్లు కానుపించును. పురాణకవనముఁ లో నన్నయతిక్కనల కెట్టితారతమ్య మున్నదో ప్రబంధకవిత్వములో పెద్దననారసింహకవుల కట్టి భేద మున్నదని యూహింపవలసియుండును. ఇట్లు చెప్పుటవలన నన్నయపెద్దనలకవిత్వములో లోపము లున్న వని చెప్పుట కాదు. ఆకవు లిర్వురకు నవ్యవహితముగ నట్టికావ్యము లే రచియిం?

చిన తిక్కన నారసింహకవులు అంతకంటెను మెఱుఁగులు తెచ్చి రనియు నట్టిసంగతి ప్రకాశముగఁ జెప్పినచోఁ బరనింద కాకున్న నలౌక్యమనియు నెంచి మఱియొకచమత్క్రియామార్గమున తమతమ సామర్థ్యంబులు వెల్లడించి రనియుఁ జెప్ప నొప్పియుండును. ఆపద్యము లెట్లున్నవన :—

"గీ. కావ్య మత్యాద్య మైన సత్కావ్య మింక, నుక్తకావ్యంబయోఁ బునరుక్తిఁ దెచ్చుఁ
గాన కవితాభిముఖుఁ డైనఁ గవివరునకు, మిశ్రకావ్యంబె కావ్యమై మెచ్చుఁ దెచ్చు.

క. నేరిచినసుకవి కృతిచే, బేరెఱిఁగించికొని జగతిఁ బెంపగు టొప్పుఁ గా
నేరక కృతి చెప్పుట తగ, నేరమి యపకీర్తి జగతి నిలుపుట గాదే.

క. ఏరసము చెప్పఁబూనిన, నారస మాలించువాని నలరించని యా
నీరసపు కావ్యశవముల, దూరముననఁ బరిహరింపుదురు నీతిజ్ఞుల్.

చ. ఫణుతుల రెంట మూఁట నొకపద్యముఁ గూరుచువారు లక్ష్యల
క్షణసహకావ్యనిర్వహతఁ గల్గుట చిత్రముగాని యట్లపో
ఫణమణిమాత్రధారు లగుపాము లసంఖ్యము గాక తత్ఫణా
మణివిధవిశ్వభూభృతిసమర్థుఁడు శేషుఁడు గాక కల్గునే.

క. ఆకుల నిడిమొద కవితా, పాకంబులు మొదలు చెడినప్రాఁతప్పుల నా
లోకము జిహ్వాంచలములె, యాకులుగా నుండు నెవ్వి యవియొకొ కవితల్.

క. పరభుక్తము లైనయలం, కరణముల జుగుప్స లేక కైకొని పదవి
స్ఫురణంబు చూపుమకవితఁ, బరికింపఁగ లజ్జ లేనిబానిస గాదే.

క. కలకంఠ కలన చూపక, కలకంఠం బూరకున్నఁ గాకము కాదే
కవిత నిజవాగ్విలాసం, బలరింపనితజ్ఞుఁ డైన నజ్ఞుఁడు కాఁడే.

చ. ఖలుఁ డిల దప్పులే వెదకుఁ గావ్యరసానుభవంబుఁ జేయలేఁ
డోలుకులు గోరుగాక మద మూనఁగ గర్దభ మొంద నేర్చునే
మలయమరుద్విధూతమధుమాసవికస్వరకేసరావలీ
కలితపరాగయోగపరికల్పితపేశలతల్పసౌఖ్యముల్.

క. ఎల్లరు మెచ్చని మత్కృతి, నుల్లంబున మెచ్చఁగాత యొకఁ డుష్ట్రికులం
బొల్లనిపల్లవితామ్రముఁ, గొల్లలుగాఁ బొగడ నొక్క కోయిల లేదే.

సీ. తప్పు గల్గెనేని తారె తెల్పి రసజ్ఞు, లస్మదీయకవిత ననుమతింతు
రించుకలుక గలిగినేఁ దెచ్చి ప్రేయసి, నుల్లమున వరింప కోర్తు రెట్లు."

పైపద్యముల వివరించితిని గావున నిఁక వానిలోని సందర్భము నాలోచింపవలయును. దీనిలోఁ గవిత్వము చెప్పఁబూనినవాఁడు

ప్రాచీనమార్గము నవలంబించక పోరాదనియు నట్లవలంబించు నపు డది పునరుక్తి యగు ననిపించుకొనునట్లు చెప్పరా దనియు న్న, నేర్పుగలవాఁడే కావ్యము చేసిన ప్రతిష్ఠ కల్గునుగాని నేర్పు లేనిచోఁ గవిత్వము చెప్పుట తన తెలివి లోపమును ప్రపంచమందు స్థిరపఱచి యుంచుట యగుననియును, నేర్పు కల్గి కవిత్వము చెప్పు వాఁడు తా నేరసముం జెప్పఁబోవుచున్నాఁడో ఆరసమును బైకి నుద్దీపించి దానివలన నితరుల రంజింపఁ జేయ వలయు ననియు, నట్లు చేయలేనిచో రసజ్ఞు లాకావ్యముం దిలకించక పరిహరించెద రనియును, ఫణామండితము లగుపాము లసంఖ్యము లై యుండినను విశ్వవిశ్వం భరాభరణదక్షత యొక శేషునకే కాక యితరఫణులకు లేనట్లు పద్య ము లల్లఁగల మనుకొనువా రందఱు ప్రబంధములు రచియింపలే రని యు, నితరులు చెప్పిన గ్రంథములలోని యలంకారాదికములు దొంగి లి తాను గ్రంథము చేసినట్లు చెప్పుకొనువాఁడు లజ్జాహీనుఁడు గాఁ దెలి యఁబడునని యు, నెంత రసజ్ఞుడైనఁ దనకుఁ గలరసికత్వమును వాగ్విలా సమును జూపింపకున్న నజ్ఞుఁడుగా భావింపఁబడు ననియును, గావ్యముల లోని తప్పులు వెదకి సంతోషపడువాఁడు దుర్మార్గుం డనియును, లేమా విచిగురు కోకిలమునకువలె నాకవిత్వ మొకరసికునకు నైన సంతోష కారి కాకపోదు. రసికులు తప్పు గల ప్రియురాలిం దేర్చి సంతసింపం జేయునట్లుగా నాకవనంబునఁ ద ప్పున్న దిద్ది దానిం దిలకించెదరు గాక అనువఱకుం జెప్పియుండెఁగావున నప్పుడు తనకవిత్వములోఁ దప్పున్నట్లు తానే యొప్పికొనిన ట్లగుకావున నట్టి సందియము తనకవిత్వములో లే దనియును, తనకవిత్వములో నేవర్ణనఁ దాఁ జేయుచున్ననట్టికావ్యరస ము స్ఫురియించుటయేకాక ఆయాపట్లు వినెడువారికిఁ దమ తమ వర్ణా శ్రమ వ్యాపారముల మఱపు గల్గి రసపారవశ్యంబున కేవలము తద్వ్య తిరేకధర్మావలంబనము కలుగుననియును జెప్పుటకై యీక్రిందిపద్యముం తెల్పె. అది యెద్దియనిన :—

"గీ. యతి విటుఁడు కాకపోవునే యస్మదీయ, కావ్యశృంగారవర్ణనాకర్ణనమున
విటుడు యతి కాక పోవునే వెస మదీయ, కావ్యవైరాగ్యవర్ణనాకర్ణనమున."

ఇట్లున్నదానికి నాంధ్రకవుల చారిత్రములో వ్రాయంబడిన యీక్రిందివాక్యము లనాలోచితము లని చెప్పవలసియున్నది. అవి యెట్లన్నను :—

"ఆనృసింహకవి తనకవిత్వసామర్థ్యముం గూర్చి గ్రంథాదియం దాత్మస్తుతిఁ జేసుకొనియున్నాఁడు, మఱియుఁ దక్కిన కవులవలెఁ గాక కుకవిధూషణముం బెక్కు పద్యంబులం జేసియున్నాఁడు. కాఁబట్టి యితఁడు స్వాతిశయభావము గలవాఁడై నట్లు కన్పట్టుచున్నాఁడు."

అని యున్నది. ఈవిషయములోఁ బెద్దనకవి యింతకంటె శ్లాఘాపాత్రుఁ డగు నని చెప్పవచ్చునేమో ఆసంగతి పెద్దనగ్రంథంబునుండి వెదకి చూతము. అందులోఁ గుకవినింద యున్నది. ఎట్లనఁగా:—

"మ. భరమై తోఁచుకుటుంబరక్షణముఁగా బ్రాల్మాలి చింతన్ నిరం
తరతాళీదళసంపుటప్రకరకాంతారంబునం దర్థపుం
దెరవాటుల్ తెగి కొట్టి తజ్జపరిష ద్విజ్ఞాతచౌర్యక్రియా
విరసుం డై కొఱతం బడుం గుకవి పృథ్వీభృత్సమీపక్షితిన్."

స్వప్రజ్ఞాప్రకటనముంగూడ నీక్రిందివిధంబునఁ జేసికొనియె.

"క. హితుఁడవు చతురవచోనిధి, వతులపురాణాగమేతిహాసకథార్థ
స్మృతియుతుఁడ వాంధ్రకవితాపితామహుఁడ వెవ్వ రీడు పేర్కొన నీకున్."

ఈపద్యము కృతిపతి చెప్పిన ట్లుండుటం జేసి అది పెద్దనార్యుని కవిత్వము కా దనిగానీ యది యాత్మస్తుతి కా దనిగానీ చెప్పవలనువడునా? ఇంతియ కాక ఆశ్వాసాంత గద్యములో నున్న వాక్యంబు లాత్మస్తుతిని దెల్పునవి కాకపోవునా ఆగద్య మెట్లున్న దన :—

"ఇది శ్రీమదాంధ్రకవితాపితామహ సర్వతోముఖాంక పంకజాక్ష పాదాంబుజాధీనమానసేందిందిర నందవరపు వంశోత్తంస శఠగోపతాపసప్రసాదాసాదిత చతుర్విధకవితామతల్లికాల్లసానిచొక్కయామాత్యపుత్త్రపెద్దనార్యప్రణీతము"

అని యున్నది. నృసింహకవి పెద్దనార్యునివలె నాత్మస్తుతి అతిమాత్రముగఁ జేసి యుండలేదే. ఇట్లుండఁ బెద్దనకంటె నధికముగ నరసింహకవి నిందాపాత్రుఁ డని చెప్పుట సహేతుకము కా దని చెప్పవలయును.

### కవిత్వవిషయము.

ఇఁక నాంధ్రకవులచరిత్రములోని యింకొకయాక్షేపణకు సమాధానము చెప్పక తీఱదు. అందులో

"కవికర్ణ రసాయనము మొత్తము మీఁద మంచిదే అయినను, పెద్దనార్య కృతమయిన మనుచరిత్రకంటె నే విషయమునందును గుణాతిశయము కలది కాదు."

అనియున్నది. దీనికి సమాధానము మిక్కిలి శ్రమలేకయే అచ్చటచ్చటనుండు సమానాంశములలోనివర్ణనలు సూపినం జాలియుండును. ప్రస్తుత మీయుభయుల కవిత్వశయ్యాదులం గూర్చి చూపందలఁచుకొని యున్నాఁడను గనుక దీనిలోనే పైరెండువిషయములుగూడ చూడఁదగును. అంతవఱకును పెద్దనకంటె నృసింహకవి గుణాధికుఁ డని కానీ లేక నృసింహకవికంటెఁ బెద్దన గుణాధికుఁడనికానీఁ నిర్ణయింపక యుంచెదను.

### పురవర్ణనము.

"మ. వరణాద్వీపవతీతటాంచలమునన్ వప్రస్థలీచుంబితాం
బర మై సౌధసుధాప్రభాధవళితప్రాలేయరుఙ్మండలీ
హరిణం బై యరుణాస్పదం బనఁగ నార్యావర్తదేశంబునం
బుర మొప్పున్ మహికంఠహారతరళస్ఫూర్తి న్విడంబించుచున్." మను.

"సీ. జాతరూపమనోజ్ఞజాతరూపం బైన, కోటచే వెండియాద్రి నోటుపఱిచి
మధుసుధారసపూరమధురనీరం బైన, పరిఖచే వారాశి భంగపఱిచి
నవరత్నచిత్రాభినవయత్నకము లైన, యిండ్లచేఁ గనకాద్రి యేపుగఱచి
కాంతనిర్మలచంద్రకాంతబద్ధము లైన, కుట్టిమంబుల ధాత్రి కొంచెపఱిచి
కమలగర్భుండు తన సృష్టి గాఁ ద్రిభువన, కోశగర్వంబు నడఁగించుకోలఁది దీని
వేడ్కఁ నిర్మించె ననఁ బొల్చు విమతహృదయ, ఘట్టనం బైనసాకేతపట్టణంబు."
కవిక. ర.

మనుచరిత్రములో నల్లసాని పెద్దన పురవర్ణనతోఁ గల్పిబ్రహ్మక్షత్త్రివణిక్శూద్రులను వెలయాండ్రను ఒకసీసపద్యమున వర్ణించెను. ఆపద్యమెట్లన్నను :—

సీ. అచటివిప్రులు మెచ్చ రఖిలవిద్యాప్రౌఢి, ముది మదిదప్పిన మొదటివేల్పు
యచటిరాజులు బంటు నంపి భార్గవు నైన, బింకానఁ గెలిపింతు రంకమునను

నచటి పేటికిరాటు లలకాధిపతు లైన, మును సంచి పొదవ లిచ్చి మనుప దక్షు
లచటి నాలవజాతి హాలముఖాంత విభూతి, నాదిభిక్షువు భైక్ష్య మైన మాన్పు
నచటి వెలయాండ్రు రంభాదు లైన నోరయుఁ, గాసెకొంగున వారించి గడపఁగలరు
నాట్యరేఖాకళాధురంధరనిరూఢి, నచటఁ బుట్టినచిగురుఁగొమ్మైనఁ జేవ.''

కవికర్ణ రసాయనములోఁ బైని సంగ్రహముగా వర్ణింపఁబడిన పట్టణాంగములు విపులములుగాఁ జేసి వర్ణింపఁబడియె. అందలిపద్యము లన్నియు వివరించుట గ్రంథవిస్తర మగుటయుఁ, జారిత్రోపయోగము కాకుండుటయు నగును గావున నందులవివరముమాత్రము తెలిపి చమత్కారము లగు నొకటి రెండుపద్యములు వివరించెదను. ఎట్లన్నను.

పురవర్ణముతోఁ జేర్చి ౧ పట్టణముపై సంచరించు సూర్యచంద్రులను, ౨ నక్షత్రములను, ౩ బ్రహ్మక్షత్రియ వైశ్యశూద్రులను, ౪ పట్టణమునందుండు వారణములను ౫ ఉత్తమాశ్వములను, ౬ క్రీడామందిరములను ౭ తన్మందిరవిహారులను, ౮ వారయువతులను, ౯ పుష్పలావికాజనమును; ౧౦ ఉద్యానవనములను; ౧౧ సరస్సులను, ౧౨ కోడెగాండ్రను చెప్పెను.

ఇట్లుగా వర్ణించిన నరసింహకవియొక్కయు పెద్దనార్యునియొక్కయు దృష్టిలోఁ బుర మెట్లుగా నున్నదో. అందు వర్ణింపవలసిన వర్ణనలు పెద్దనార్యునివలన నెన్ని వదలివేయఁబడియెనో చూడవలయును. పెద్దనార్యుఁ డొక సీసపద్యములోఁ జెప్పిన పైవర్ణనలను నృసింహకవి యిరువదిపద్యములతో నతిప్రౌఢముగా వర్ణించి చెప్పెను. అట్టి వర్ణనలలోఁ బుష్పలావికావర్ణన, సరోవరవర్ణనల పద్యముల నిట వివరించెదను. ఎట్లన్నను :—

## పుష్పలావికలు.

సీ. కరమూలకందిచ్చు విరులబంతులకంటె, వెడఁ దోఁచుచన్నులు వేడ్కఁ బెనుప
మవ్వంబుఁ గొనసెత్తుపువ్వుబెత్తులకంటెఁ, గరమూలరుచి చూడ్కిఁ గమిచితిగువ
కోరిన నొసఁగెడుకొసరుపువ్వులకంటె, మొలకనవ్వులు డెందములు గరంప
నిండారునెలవ్రలనెత్తావిగమికంటె, ముఖసౌరభములు చొక్కఁ బెనుప

తే. జట్టికాండ్రఁ దమదు సరససుందరవిలా, సములచేతఁ దార జట్టికొనుచుఁ
బుర్రమువీథులకును భూషణప్రాయమై, క్రాలుఁ బుష్పలావికాజనంబు.

→ స ర స్సు లు. ←

“చ. అలికులకుంతలంబులు, రథాంగకుచంబులు, పద్మవక్త్రముల్
గలరవపద్మినుల్ గడువికాసముతోఁ దమయందు సక్తలై
యలరువిహారవేళఁ దము నంటినకాంతల మేనికస్తురిం
జాలకన జోడుముట్ట సరసుల్ సరసు ల్బలె నొప్పు నప్పురిన్.”

→ బాల్యవర్ణనము. ←

“చ. మఱియు నతండు సంయమిసమాజవినిర్మితజాతకర్ముఁడై
నెలఁ బరివర్ధితుండు నుపనీతుఁడునై వివిధాయుధంబులం
గలకరియై రణస్థలుల గద్దఱియై నిగమార్థవేదియై
నెఱతనకాఁడునై మెఱసె నిర్మలకాంతివిలాసరేఖలన్.” మను.

అని స్వారోచి పుట్టె నని చెప్పినపద్యము వెంబడినే పై వర్ణనము చేయంబడినది.

“గీ. జాతవేదుండు బీజశాక్తివోలె, నుష్ణకరుఁడు తపర్తుసంయుక్తిఁ బోలె
నక్కుమారుఁడు జాతకర్మానుషక్తి, సమధికాశ్చర్యచర్యతేజమును బొంది.

సీ. కను దెప్ప యిడ నెఱుంగనిచూడ్కిఁ జూచుచు, జిగివీఁపుఁ దోఁపఁ బోరగిలఁబడుచుఁ
గరజానువుల చతుశ్చరణుఁడై తిరుగుచు, శిశునిదర్శితదృఢస్నేహుఁడగుచు
భాసురమితపదన్యాసంబు చూపుచు, బ్రౌఢవిహారమున దుర్వారుఁడగుచు
జనకజానందబీజత్వంబుఁ గైకొంచు, గుణముల మసలినాఁ బ్రబలుతఁ గనుచు
తే. వసననిరపేక్ష నిచ్ఛాప్రవర్తి యగుచు, హయసమారోహణంబు సేయంగఁగలిగి
• రాసుతుఁడు తన శైశవక్రమదశావ, తారములచేతఁ బూరుషోత్తమతఁ దెలిపె.

క. కాలోపనీతుఁడై భూ, పాలతనూభవుఁడు గురునిపాలన్ బ్రచుర
వ్యాలోలకాకపక్షు, శ్రీలక్షితుఁ డగుచు నభ్యసించెన్ విద్యల్.

క. మందానిలుచే నలరుల, కందువ గని తావు లెల్లఁ గైకొనునవిమా
ఢ్యుం డగుగురువశమున నృప, నందనుమతి శాస్త్రవాసనల దూఁకొనియెన్.

సీ. తూరి బాల్యముఁ బోవఁ ద్రోచి ప్రాయంబు వెట్టినకవాటంబుఁ బాటించె నురము
జయరమాలంబనశాఖలై బాహువు, లాజానుదీర్ఘంబు లధిగమించె

వదనచంద్రునిఁ గొల్చి బ్రదికెడు చీఁకట్ల, గతి నవశ్మశ్రురేఖలు జనించె
నర్థిధైర్యములపై నడరుకెంపునుబోలె నీక్షణాంచలముల నెఱ్ఱతోఁచె
గీ. సుందరత్వమునకుఁ జోటిచ్చి తాసంకుచించె ననఁగఁ గడుఁ గృశించె నడుము
జనవరాత్మజునకు సకలలోకోత్సవా, పాదియైనయౌవనోదయమున. "

దీనిలోఁ మనము చెప్పవలపిన దేమున్న దనఁగా నలసానిపెద్దనార్యునివలన మనుచరిత్రములోఁ జూపింపఁబడిన, ౧ జాతకర్మము, ౨ ఉపనయనము, 3 విద్యాభ్యాసము, ౪ యౌవనావిర్భావములు కవికర్ణరసాయన కవివలనఁ బ్రత్యేక ప్రత్యేకము పద్యములతో నతిప్రౌఢవర్ణనలఁ బ్రకాశింపఁజేయఁబడినవి. దీనింబట్టియుఁ బైపురవర్ణనముంబట్టియు మనుచరిత్రకవికంటెఁ గవికర్ణరసాయనకవి వర్ణనాంశములు పెంచి కథాభాగమును దగ్గించె నని సూచింపఁబడుచున్నది.

శ్రీ ర స్తు.

# క వి జీ వి త ము లు.

ప్రౌఢప్రబంధకవులచరిత్రము.

## 19.

తు ళు వ వం శ ము

## శ్రీ కృ ష్ణ దే వ రా య లు.

(ఇపుడు వ్రాయఁబూనుకథ సంప్రదాయజ్ఞులచే వాడికొనఁబడు.)

ఈతఁడు చంద్రవంశ సంజాతుం డగునరసింహరాయనికుమారుండు. ఆనెగొంది యనియు, * విజయనగర మనియుఁ బలుకంబడు తుంగభద్రాతీరంబున నున్నపట్టణం బీతనిరాజధాని. ఈతనికి నాంధ్రభోజుం డనుప్రసిద్ధి గలదు. ఆంధ్రభాష సంపూర్ణంబుగ నీతని కాలంబుననే వృద్ధిఁబొందెను. ప్రబంధరచనం బీతనినాఁడే కలిగె. అందు మొదటి ప్రబంధం బగు మనుచరిత్రం బంధ్రకవితాపితామహుం డనంబరగిన యల్లసాని పెద్దనచే రచియింపఁబడియె. దాని కీతండు కృతినాయకుండు. ఈరాజెల్లప్పుడుఁ బండితజన గోష్ఠి నుండి వారితో విద్యావినోదంబులు సలుపుచుండు. వారిలో నాంధ్రకవనమున కెనమండ్రు ముఖ్యులు. వీరికే యష్టదిగ్గజంబు లని పేరు. అం దల్లసాని పెద్దన, పారిజాతాపహరణరచనాధురంధరుం డగునందితిమ్మన, పాండురంగవిజయనిర్మాణకుఁ డగు తెనాలిరామకృష్ణకవి, నరసభూపాలీయనిర్మాణదక్షుం డగుభట్టుమూర్తియు, రామాభ్యుదయమును రచించినయయ్యలరాజు రామభద్రకవియు, కాళహస్తిమహాత్మ్యకర్త యగుకవిధూర్జటియును, ద్విపదకావ్య రచనాప్రవీణుం డగు తాళ్లపాకచిన్నన్నయును,

* బీజనగరము.

రాఘవపాండవీయకళాపూర్ణోదయాదిగ్రంథకర్త యగు పింగళిసూరనయు నష్టదిగ్గజములు. అపరశంకరాచార్యనాముఁడు నశీతిగ్రంథకర్తయైనయప్పయదీక్షితులును, సంస్కృతమహాకవియు, సరసవచనరచనానల్పకల్పనాచతురుండును ప్రతిభాసమన్వితుండును నగుతిమ్మరుసుమంత్రివర్యుండును, రాజగురుం డగుతాతాచార్యులును, కృష్ణదేవరాయ ప్రసిద్ధాస్థాన పండితు లని వాడుక గలదు. ఇందలి యాంధ్రకవులచే రచియింపంబడిన గ్రంథంబులలో మనుచరిత్రమును పారిజాతాపహరణమును, కవినామంబును, కృతిపతినామంబును, జగద్విఖ్యాతిం గాంచునట్లొనరించె. ఇంకను గొన్నిగ్రంథంబుల కీరాయండు కృతినాయకుం డని వినుము. ఆగ్రంథంబు లిపుడు నామావశిష్టంబు లై మనకు లభ్యములు కాలేదు. కొండవీటి దండకవిలెలో నున్న వృత్తాంతమును పురుషార్థప్రదాయిని యీక్రింది విధంబుగఁ బ్రకటించెను.

"ఈకృష్ణదేవరాయలు పిన్నవయస్సులోనే సమస్తశాస్త్రములు నేర్చి అప్పాజీ లేక తిమ్మరుసు అను నాయనవద్ద రాజనీతి దండనీతి మొదలగు విద్యలు గ్రహించె. ఆయన జీవితకాలము యావత్తు ఆంధ్రవిద్యాభివృద్ధికొఱకు పాటుబడుచునుండువాఁడు. ఈయనయొక్క సభయందు అష్టదిగ్గజము లనునామముచేత నెనిమిదిమంది గొప్పపండితులు ప్రసిద్ధిం జెందిరి. అష్టదిగ్గజములపేళ్లను, వారిచే రచియింపఁబడినముఖ్యగ్రంథములపేళ్లను నీక్రింద దెలియఁజేయుచున్నాను.

| కవీశ్వరులపేళ్లు. | గ్రంథములపేళ్లు. |
| --- | --- |
| ౧. అల్లసాని పెద్దన్న. ఈయన దూపాటి సీమలోని ద్రోణాదుల కాఁపురస్థుఁడు. ఈయనకు నాంధ్రకవితాపితామహుఁ డను పేరు గలదు. | ౧. మనుచరిత్రము, ౨. రామస్తవరాజము 3. అద్వైతము. |
| ౨. భట్టుమూర్తి ఈయన భట్టుపల్లె కాఁపురస్థుఁడు. | ౧. నరసభూపాలీయము, ౨. వసుచరిత్రము. |
| ౩. ముక్కుతిమ్మన్న. ఈయన గన్నవరము కాఁపురస్థుఁడు. | ౧. పారిజాతాపహరణము. |

| | |
|---|---|
| ४. పింగళిసూరన్న. | రాఘవపాండవీయము. |
| ५. తెనాలి కాఁపురస్థుఁ డగు తెనాలి రామలింగము. ఈయన యింటి పేరు ఈశ్వరప్రెగ్గడవారు. | పాండురంగవిజయము (పాండురంగమాహాత్మ్యము.) |
| ౬. నీడెడ్డు డిస్ట్రిక్టు కాఁపురస్థుఁడు రామభద్రకవి. | రామాభ్యుదయము. |
| ౭. శంకరకవి. | |
| ౮. ధూర్జటి. | |

N.—B. ఈచివర నిద్దఱు కవులయొక్క కాఁపురస్థలమును వారు రచించినగ్రంథముల పేళ్లను తెలియదు. అల్లసానిపెద్దన మనుచరిత్రమును రచించి కృష్ణదేవరాయలకుఁ గృతియియ్యఁగా నట్టికావ్యము వెనుక రాయలవారు ఆముక్తమాల్యదను చేసిరి. ఇది గాక సకలకథాసారసంగ్రహము, రసమంజరి మొదలగు ననేకగ్రంథములు రాయలవారు రచించిరి. అని యున్నది. పైదానిలో భట్టుమూర్తి వసుచరిత్ర రచియించినట్లు చెప్పితిని. శంకరకవి కృష్ణరాయల సంస్థానములోనివాఁడు కాఁ డని మాత్రము చెప్పవలసియున్నది.

## కృష్ణరాయని జననవృత్తాంతము.

ఈ కృష్ణదేవరాయలజననంబున కొకకథ కలదు. దీని నిచటి సంప్రదాయజ్ఞు లందఱు వాడుకొనునట్లు క్రింద వివరింతము. ఈతనితండ్రియైన తెలుఁగుదేశపు నరసింహరాయఁడు త్రిలింగదేశంబున రాజ్యంబు సేయుచుండె. ఈతం డొకనాఁటిరాత్రి కాలోచిత కృత్యంబులు నివర్తింప బహిర్దేశంబునకుం జనియుండ నంతరిక్షంబునుండి యొక్క రిక్క మిక్కిలి తేజంబుతో నాతని యుదకస్థాలింబడియె. దానిం జూచి యారాజు తనచేత నాపాత్రంబు మూసి యనతిదూరంబున నున్న నిజభటుం బిలిచి యోరీ అప్పనికి (తిమ్మరుసునకు) ఈ వార్త దెల్పుము అనుడు నాభృత్యుండు వేగిరంబ చని దాని నెఱిఁగించిన నాతం డాసీరుద్రావు మని రాజుతోఁ జెప్ప నుత్తరం బిచ్చె. వాఁ డావార్తను రాజునకుఁ దెలిపినతోడనే యాతండు తిమ్మరుసు నాజ్ఞానుసారంబుగాఁ గార్యం

బు నడపె. అనంతరము తిమ్మరుసు రాజుకడ కేతెంచి యాతని నాశా స్త్రీయతో సుఖంబుగ నుండుమని తెల్పె. రాజును తిమ్మరుసు మాటలయెడం గౌరవ ముంచి యంతిపురికిం జని పట్టపుదేవిం బిలువంబంచిన నాపె కారణాంతరముచే రాలేదయ్యె. దాని కెంతయు వగచుచు నాపెచెలికత్తెలలో నొక్కజవరాలిం గూడి యాదినంబు సుఖంబుగ నుండె. తోడనే యాయింతి గర్భంబు దాల్చె. నవమాసంబులు నిండినయనంతర మాయింతి యొక శుభముహూర్తంబున దేవకి కృష్ణునిం గన్నట్లు తాం గృష్ణరాయనిం గనియె. ఆవార్త విని నరసింహరాయండు విశేషోత్సవంబు సేయించె. పుత్రుని జూచి యాతని తేజోధికతకుం దండ్రి యెంతయు సంతసిల్లె. అప్పటి నుండియు నీతని నతిప్రేమచేతం గాపాడుచుండె. అప్పు డీ నరసింహరాయనికి బీజనగరదేశమంతయు స్వాధీనమయ్యె. దానిచేం గృష్ణరాయం డెంతయు నదృష్టవంతుం డని యాతంపు మఱియుం బ్రేమాతిశయంబున నాదరింపుచుండె. రా జిట్లుండుటచే నోర్వలేక రాజభార్య లతనిం జంపయత్నంబులొనరించి యాతనిం జంపంబంపిరి. అపుడు తిమ్మరుసు కృష్ణరాయనియెడ మిగుల నెన రుంచి యాతనిం దనమందిరంబునకుం గొనితెచ్చి యచ్చటం జిరకాల ముంచి సంరక్షించె. కృష్ణరాయ లిలువెడలు సమయంబున నెనిమిదితొమ్మిది సంవత్సరములవాండు. ఈతనికిం దిమ్మరుసు జాగరూకుండై విద్యాబుద్ధుల నేర్పుచుండె. ఇట్టిసమయంబునం దిమ్మరుసును అప్పా అని యీరాయండు పిల్చుటం జేసి యీతనికి నప్పరుసను నామాంతరంబు గల్గె.

నరసింహరాయనికి స్వీయాసంభవు లగుకొడుకులు గలరు. నరసింహరాయనికి శరీరంబున జాడ్యంబు సంప్రాప్తమై అది క్రమక్రమంబుగ హెచ్చినపుడు జీవితేచ్ఛ వదలి నరసింహరాయండు తనపుత్త్రులం బిలిచి వారిలో ధైర్యసాహసంబులు గలవానికి రాజ్యం బిచ్చెదంగాక యని నిశ్చయించి తనచే నున్న భద్రముద్రికం జూపి యోపుత్త్రులారా

నాదేహంబు జాడ్యంబున నుబ్బియున్నయది. కావున నీయుంగరం బే యుపాయంబుచేతను రాకుండ నున్నయది. దీని నెవ్వనిం దీసికొన సమర్థుం డగువానికి నారాజ్యం బిచ్చెద ననుచు వాఁడు క్రమంబునఁ జను దెంచి దానిం దీయ ననేకవిధంబుల యత్నించి వేసరి సేయునది లేక యూరకుండిరి. అపుడు నారసింహుండు తిమ్మరుసుం జూచి కృష్ణరాయం డుండిన నివు డెంత మేలై యుండు నాతని దుర్మార్గులు చంపించి రనుచు తిమ్మరుసు సెలవేని కృష్ణరాయనిం దెచ్చెద నని తెల్పిన సంతసించి యాతనిఁబిలువనంపి కౌఁగలించుకొని కృష్ణా ! ఉంగరము దీసికొ మ్మనుడు మొల నున్నకత్తిచే నాతని వ్రేలు దునిమి రాయం డాయుంగరముఁ గైకొనియె నరసింహరాయం డాతని సాహసంబునకు మెచ్చి తనసామంతమంత్రివరుల కాతనిం జూపి తనయనంతరంబున నాతనినే రాజుగ నియమించి పట్టముం గట్టుఁ డని తాఁ బరమపదప్రాప్తుం డయ్యె. అనంతర మామంత్రివరులు రాజాజ్ఞానుసారంబుగ నతనికిఁ బట్టాభిషేకం బొనరించిరి. అని యుండుకథయాతయుచు కల్పిత మయినట్లు నిది యేమతియొకరాజుకథయో యీాతని కతుకంబడినట్లునుతోఁచెడిని శూద్రస్త్రీసంభవుఁ డనుకథ ప్రౌఢదేవరాయని దని వెలమలచారిత్రము వలనం గాన్పించెడిని. నరపతు లగువిజయనగర రాజుల చారిత్రములోఁ బ్రౌఢదేవరాయవృత్తాంతములోఁ జూడనగును. కొండవీటిదండకవిలెలో నీపైవృత్తాంతము కొంచెము విపులముగా నున్నట్లును దానిసంగ్రహమును తాఁ బ్రచురించుచున్నట్లుగాఁ బురుషార్థప్రదాయిని అనుపత్రికలోఁ గొన్ని సంగతు లొకపాంథునివలనఁ బ్రకటింపఁబడియెను. అదెట్లన్నను:—

## కృష్ణదేవరాయలజన్మకర్మము.

"రాచవేమనతో రెడ్లప్రభుత్వ మంతరించిన దని యీ దివటిలోఁ దెలియఁజేసియుంటిని. రాచవేమనగారు అపుత్రివంతుఁ డగుటంజేసి కొండవీటిరాజ్యమంతయు వేమనయొక్క దెబ్బదియిద్దఱు పాలెగాం

ద్రము అపహరించ యత్నము చేసిరి. గాని జనబాహుళ్యముచేత నొక రిమాట యొకరికిఁ గాక, సుమారు నలువది సంవత్సరంబులవఱకు ఒక రితో నొకరు కలహించుచుండిరి. ఇంతలో శా. శ. ౧౩౭౧ సంవత్సరములో నుత్కలదేశాధీశు లగుగజపతివారు ప్రబలులై విస్తరించి 'బలమును గూర్చుకొని కొండపల్లి మొదలగు దుర్గముల నాక్రమించి, కొండపల్లిలో మకాము జేసిరి. ఇట్లుండ తుంగభద్రాతీరస్థం బగువిజయనగరపురా జగుకృష్ణదేవరాయలు ఆంధ్రదేశమంతయు నాహుతి వేసికొనుటకు యత్నించెను."

—⊷ కృష్ణదేవరాయలజన్మకథాప్రశంస. ⊷—

"విజయనగరపురాజులలో * పదియాఱవ వాఁ డగువీరనృసింహరాయలు చిరకాలము పుత్త్రులు లేక ఖేదపడుచుండఁగా నొకనాఁ డొక విప్రశ్రేష్ఠుఁ డేతెంచి రాజా! నే నేర్పఱిచిన ముహూర్తకాలమందు నీవు నీభార్యతోఁ గూడినచోఁ దప్పకుండ నీకు పుత్త్రుఁడు కలుగును అని చెప్పెను. అందుల కారాజు సంతసించి ముహూర్తకాలమునకు సిద్ధముగా నుండునటుల నిజపత్ని యగు తిప్పాంబకు వర్తమానము పంపెను. "చీరె సింగారించువఱకు పట్నము కొల్లబోయెను." అనులోకమువాడుక నిక్కము గాఁ దిప్పాంబగారు దిద్దుకొని తీర్చుకొని రాజుసమ్ముఖమున కేతెంచువఱకు ముహూర్తకాలము మించిపోయెను. ఈమధ్యకాలములో రాజుగారి పడకటింటిలో దీపాలు బాగుచేసెడి నాగి యను నొకదాసి ముహూర్తకాలమునకు హాజరుగా నుండఁగ రాజు దానితో రమించెను. తత్క్షణమే నాగికి గర్భోత్పత్తి ఆయెను. నవమాసపూర్తి యైనతర్వాత దివ్యతేజస్సు కలిగినశిశువును గనెను. ఈశిశువునకు కృష్ణదేవరాయలు అనునామ మేర్పడెను."

—⊷ కృష్ణదేవరాయలు రాజ్యభారము వహించినవిధము. ⊷—

"పూర్వము వక్కాణించిన నాగి యనునది గర్భవతి యైన కొం

---

* విమర్శించవలెను.

తకాలమునకు పిదప పట్టమహిషి యగుతిప్పాంబకూడ గర్భముదాల్చి మొగశిశువును గనెను, ఈశిశువునకు నృసింహారాయ లనునామ మే ర్పడెను. నాగి యనుదానికి రాజుగారితో స్నేహ మగుటంజేసి నాగమాం బ యనుపేరు వచ్చెను. తిప్పాంబకుమారుఁడును నాగమాంబ కుమా రుఁడును వయస్సులో సమానులైనను, రూపలావణ్యములయందు ను, విద్యావినయములయందును, ధైర్యస్థైర్యములయందును., దాసీపు త్త్రుఁడు రాణిపుత్త్రునికంటె నూఱురె ట్లతిశయించియుండెను" అని యు న్నది. ఈరెండుకథల నమ్మినను నమ్మకున్నను వేఱుచరిత్ర లేదు.

## కృష్ణరాయని పూర్వుల వృత్తాంతము.

దీనింగూర్చి పారిజాతాపహరణ, మనుచరిత్రములలోఁ గొంత కానుపించును. మఱికొంత "కొంగదేశ రాజకాల్" అను వచనగ్రంథ ములోపలను గానుపించును. ఇందులో మొదటిరెండుగ్రంథములును గృష్ణరాయాస్థాన విద్వాంసులవలన రచియింపంబడెఁ గావున విశ్వసనీ యములు. మూఁడవ గ్రంథము గవర్నమెంటు Oriental M. s. s. లైబ్రేరీలో, నూఱుసంవత్సరములక్రిందటఁ జేరియుండిన దైనను కృష్ణరాయలకాలీనులవలన రచియింపఁబడక అటుపిమ్మటఁ గొన్నిశతా బ్దము లైన యనంతర మొకనిచే రచియింపంబడుటచేత విశేషవిశ్వస నీయము కాదు. ఎట్లున్నను చారిత్రములలోఁ జేరి నిల్చియున్న గ్రంథ మగుటంజేసి దానినిగూడఁ జేర్చుకొని యితరగ్రంథసహాయమున నందు లో భేదించునట్టి యంశముల వివరించి చెప్పెదను. కృష్ణరాయని పూ ర్వులవంశము చంద్రవంశ మైనట్లును, తుళువ యను పౌరుషనామంబు గలది అయినట్లు నీక్రింది పద్యమువలనం గాన్పించును.

## చంద్రవంశములో నొకపురుషుఁడు.

"క. అతనికి యదుతుర్వసులను, సుతు లుద్భవమంది రహితనూదనులు బలా
న్వితమతులం వారిలో వి, శ్రుతకీర్తి వహించెఁ దుర్వసుఁడు గుణనిధియై.

గీ. వానివంశంబు తుళువాన్వవాయమయ్యె, నందుఁ బెక్కండ్రు నృపులుదయంబునంది
నిఖిలభువనప్రపూర్ణనిస్తంద్రకీర్తి, నధిపులైరి తదీయాన్వయమునఁ బుట్టి."
మనుచరిత్రము.

ఇట్టివారిలో మొదటివాఁడు తిమ్మరాజు. ఇతనింగూర్చినకథ పారిజాతాపహరణములో మాత్రము చెప్పఁబడలేదుగాని మనుచరిత్రములో నతని విశేషములు వ్రాయఁబడినవి. ఎట్లన్నను:—

"మహాస్రగ్ధర. ఘనుఁడై తిమ్మక్షితీశాగ్రణి శకకమతగాత్రిసంఘాతవాతా
శనరాడాశాందంతిస్థపిరకిరులజంఝాటము ల్మాన్పి యిమ్మే
దిని దోర్దండైకపీఠిం దిరముపఱిచి కీర్తిద్యుతుల్ రోదసిం బ
ర్వ నరాతుల్ నమ్రులై పార్శ్వముల నిలువ తీవ్రప్రతాపంబు సూపెన్.

క. వితరణఖని యాతిమ్మ, క్షితిపగ్రామణికి దేవకీదేవికి నం
చితమూర్తి యీశ్వరప్రభుఁ, డతిపుణ్యుఁడు పుట్టె సజ్జనావనపరుఁడై."

ఈ ఈశ్వరరాజుంగూర్చి పైరెండు గ్రంథములలోఁగూడ వివరింపఁబడియున్నది. అందు పారిజాతాపహరణములో

"ఉ. రాజులనెత్తుటం బరశురాముఁడు వంతలు చేసె రెండుమూఁ
డీజగతిం గణింప నది యెంతటి విస్మయ మబ్జనీనువ్యా
త్తేజుఁడు కందుకూరికడఁ దిమ్మయయీశ్వరుచే జనించె ఘో
రాజి బెడంగదకోట యవనాశ్వికరక్తనదీసహస్రముల్."

అనుదానివలన నీయీశ్వరరాజు కందుకూరి సమీపములో బెడఁదకోట తురుష్కులం జయించె నని మాత్రము చెప్పంబడినది. మనచరిత్రములో నీతనివిజయవిశేషములు చెప్పంబడకపోయిన ననేకులగు రాజులవలనఁ గప్పంబులు మొదలగునవి గ్రహింపఁబడినట్లును, శత్రుజయము చేసినట్లుగా రెండుపద్యములు చెప్పఁబడినవి. ఎట్లన్నను:—

"చ. బలమదమత్తదుష్టపురభంజనుఁడై పరిపాలితార్యుఁడై
యిలపయిఁ దొంటియీశ్వరుఁడె యీశ్వరుఁడై జనియింప రూపరెక్క
జలరుహనేత్రలం దొఱఁగి శైలవనంబుల భీతచిత్తులై
మెలఁగెడుశత్రుభూపతుల మేనులఁ దాల్చె నమన్మథాంకముల్.

సీ. నిజభుజాశ్రితధారుణీవజ్రకవచంబు, దుష్టభుజంగాహితుండికుండు
వనజేక్షణామనోదనపశ్యతోహరుం, డరిరాజసంసదభ్రాగమంబు

మార్గణగణపికమధుమాసదివసంబు, గుణరత్నరోహణక్షోణిధరము
బ్బాంధవసందోహపద్మవనీహేళి, కారుణ్యరసనిమ్నగాకళత్రుఁ
తే. డన జగంబుల మిగులఁ బ్రఖ్యాతిఁ గాంచె, ధరణిధవదత్తవివిధోపదావిభాస
మార్జితశ్రీవినిర్జిత నిర్జరాల, యేశ్వరుఁడు తిమ్మభూపతి యీశ్వరుండు."

## నరసింహరాజు.

పై ఈశ్వరరాజు కుమారులు నరసింహరాజు, తిమ్మరాజు. నరసింహరాజు వృత్తాంతము పై రెండు గ్రంథములలోనే కాక 'కొంగదేశరాజకాల్' అను గ్రంథములోను, 'విజయనగరరాజులచరిత్రము' అనుదానిలోఁగూడ నున్నది. కావున మొదట మనుచరిత్రములో నున్నదానిం దెల్పెదము.

"క. ఆయీశ్వరనృపతికిఁ బు, ణ్యాయతమతి యైనబుక్కమాంబకుఁ దేజ
స్తోయజహితు లుదయించిరి, ధీయుతు లగు నారసింహ తిమ్మనరేంద్రుల్."

ఇట్లు చెప్పి యనంతరము నరసింగరాజు విశేషములు మాత్రము కొన్ని వివరింపఁబడినవి. ఇటులనే పారిజాతాపహరణములోఁగూడ నీశ్వరరాజు కుమారుల యిర్వురపేరులును వివరింపఁబడినవి. * అందుఁగూడ నరసింగరాయని వృత్తాంతమే వివరింపఁబడెనుగాని తిమ్మరాజుంగూర్చిన విశేషములు వివరింపఁబడవాయెను. కావున మన మిప్పుడు నరసింగరాయనివిశేషములే వ్రాయవలసియున్నది. ఇఁక తిమ్మరాజునుగూర్చి చెప్పవలసినవృత్తాంత మొకటి యున్నది. అందులో ఈతిమ్మరాజే కృష్ణదేవరాయనిప్రసిద్ధమంత్రి యగుతిమ్మరుసని కొందఱూహించుచున్నారు. అది సరియైనది కానట్లు కొన్నిగ్రంథదృష్టాంతము లుండుటంబట్టి ఆసంవాదము మఱియొక స్థలములోఁ జూడఁదగు నని చెప్పి ప్రస్తుతము నరసింగరాయనికథలోనికి దిగెదను. కో. రా. లో ౪౭ "నరసింగరాయపట్టము" ఇతఁ డుద్దండుఁ డనుమంత్రితోఁగూడి తెన్గుదేశము

* ఇది పొరపాటు. పారిజాతాపహరణమున నిద్దఱుకొడుకులపేరులు లేవు. ఉన్నదొక్కటే. అచట తిమ్మయయీశ్వరనృపతికిఁ = తిమ్మరాజుకొడుకగునీశ్వరరాజునకు, అని యన్వయింప నొప్పను.

రక్షించుచు అందుమీఁద కర్ణాటక దేశములో నున్న పాలెగాండ్రు కప్పమీయకున్న వారితో యుద్ధము చేసి జయించి, మళయాళ, కేరళములలో విజయరాజుతో బహుయుద్ధము చేసి జయించి, అతనివలన ననేకద్రవ్యముం దీసుకొని పాండ్యరాజుతో స్నేహముచేసి, చోళద్రవిడదేశములలోఁ గప్పము తీసుకొని అక్కడనుండి యుత్తరదేశములకుం బోయి కళింగ, బంగాళ దేశరాజుల జయించి, అనేక తురుష్కులం జయించి గజపతిరాజుం జంపి, గంగరాజును జయించి వచ్చిన ఆమంత్రికి "విజయోద్దండేంద్రుఁ"డని బిరు దిచ్చెను. ఈనరసింగరాయనికి రాజాధిరాజరొందరలేశ్వర మహారాయ లని పేరుపెట్టెను." అని యున్నది. ఇట్టిచారిత్రివిశేషము లితరగ్రంథసహాయము లేనిది సిద్ధాంతములుగా నెంచఁబడఁగూడదు. కావున పైమనుచరిత్రపారిజాతాపహరణములలో నుండు కొన్నిపద్యములంబట్టి కొంత నిర్ణయింతము. అందు మనుచరిత్రములో నరసింహరాజుయొక్క ప్రతాపము విశేషముగ వర్ణింపఁబడియెంగాని, యేయేస్థలములలో నేయేప్రతాపముఁ జూపెనో వ్రాయంబడి యుండలేదు. ఇఁకఁ బారిజాతాపహరణములో :—

"సీ. ఎవ్వనివిజయంబు లెఱిఁగించుశాసన, స్తంభంబు లాశాంతశైలవితతు
లెవ్వానియసిగాపు లేపారుకాళింగ, యవనాదివివిధదేశాధినాథు
లెవ్వానినిత్యదానైకవిలాసంబు, లారూఢతరతులాపూరుషంబు
లెవ్వానిచిరకీర్తి యింద్రలోకాంగనా, భోగినీగీతికాభోగపదము

తే. వాఁడు వొగడొందు సర్వసర్వంసహాధి, దేవతాముఖదర్పణద్విజయనగర
భద్రసింహాసనస్థుఁ డుపేంద్రతేజుఁ, డీశ్వరాధిపునరసభూమీశ్వరుండు.

సీ. కుంతలేశ్వరుఁడు పిక్కువడంగ విద్యాపు, రంబు గైకొని నిజప్రౌఢి నెఱపెఁ
బారసీకునకు దుర్భరమానవత్వంబుఁ, దొలఁగించె మానవదుర్గసీమఁ
జోళవల్లభునకు సురవధూమధురాధ, రము లిచ్చి మధురాపురంబుఁ గొనియె
శ్రీరంగపట్టణసీమ ఖడ్గనటీవి, నోదంబు యావనేంద్రునకుఁ జూపె

తే. నతఁడు నుతికెక్కె రామసేత్వంతరాళ, కలితషోడశదానవిఖ్యాతయశుఁడు
మండలీకరమేఘమార్తాండబిరుదుఁ, డీశ్వరాధిపునరసపృథ్వీశ్వరుండు."

ఇట్లుండుటంబట్టి యీనరసింహరాజు చారిత్రాంశములు కొన్ని స్పష్టమగుచున్నవి. అవి యెట్లనఁగా:—

౧. దిగ్విజయము చేసి శాసనస్తంభంబులు నిలిపెను.
౨. కళింగరాజు, యవనరాజు మొదలగువారిచేఁ బన్నులు గొనుచుండెను.
౩. విజయనగరసింహాసనాధ్యక్షుఁడు.
౪. కుంతలేశ్వరుం జయించి విద్యాపురము(Beejapore) ను స్వాధీనమును చేసికొనియెను.
౫. పారసీకసనకు (తురుష్కరాజపర్యాయముగా నోపు) మానవదుర్గ సీమలో ప్రాణహానిం జేసెను.
౬. చోళరాజును సంహరించి మధురాపురముం గైకొనెను.
౭. శ్రీరంగపట్టణ సీమయం దుండుయావనేంద్రునితో యుద్ధముచేసెను.
౮. మండలీకర మేఘమార్తాండ బిరుదు గలవాఁడు.

ఈ యెన్మిది యంశములును సప్రమాణములు. వీనితోఁ బ్రతిఘటించని పైచారిత్రాంశములను విశ్వసించుట కభ్యంతర ముండదు. విజయనగరరాజచారిత్రములో నీరాజుంగూర్చి యీక్రిందివిధముగా నున్నది. అందులో నృసింహదేవరాయనివఱకును వ్రాయంబడినచరిత్రము బీజనగరరా జగు బుక్కరాజుచరిత్ర మై యున్నది. ఆచారిత్రకుని కందుఁ గలభేదములు పరిశీలనలోనికి రానికారణమున నాకెంకుకథలును గలిపి వానిని నరసింహరాయునిపూర్వులకథలుగా వివరించె ననియుఁ జెప్పవలసియున్నది. అట్టిభేదమును బీజనగర రాజచారిత్రములోఁ జూపఁదలంచి ప్రస్తుతము నరసింగరాయునింగూర్చి వ్రాసిన కథాభాగము మాత్ర మిచ్చుట వివరించెదను. ఎట్లన్నను:—

"ఆబుక్క దేవరాయనికి నరసింహుఁ డనుకుమారుఁడు పుట్టెను. నృసింహదేవరాయలు విజయనగరమందు రాజ్యపరిపాలన చేయుచుఁ దమతండ్రి యేప్రకార మాజ్ఞాపించెనో ఆప్రకారము దేవబ్రాహ్మణులయందు భక్తి నుంచి అనేకు లగుబ్రాహ్మణులకు ననేకాగ్రహారములు తామ్రశాసన పత్త్రికలపై వ్రాసి యిచ్చి తండ్రికంటె నుత్త

ముఁ డవి ప్రజలవలనఁ గొనియాడఁబడుచు బహుదినములు విజయనగర మున నుండి కొన్ని దినములకు సకలదేశములం జయించి, సకల కిరీటాధి పతులచేతను మ్రొక్కులు తీసికొనుటకు దిగ్విజయార్థము తరలి దక్షిణ సముద్ర పర్యంతము నుండు సకలదేశములం గొట్టి తద్దేశాధిపతులను దనయాజ్ఞానువర్తులుగాఁ జేసికొని, యాయాదేశములకుఁ దగినట్లుగా నర్థముం గూర్చుకొని కొంత విజయనగరమునకుం బంపి కొంత దన తోఁ బట్టించుకొని అక్కడనుండి రామేశ్వరమునకుఁ బోయి ఆ దేశములం దర్థము కట్టుకొని, అక్కడ సర్వాగ్రహారము లిచ్చి అటులనే సకలపుణ్యక్షేత్రములలో ధర్మముల నడిపెను. అటు తరువాత చోళ, పాండ్య, కేరళ, దేశపురాజులను, మధుర దేశపుప్రభువును మ్లేచ్ఛ ప్రభువులం జయించి, అది మొదలు గంగాతీరముదాఁక సకలదేశములం జయించి శ్రీరంగమునకు వచ్చి చేరెను. అక్కడఁ జోళదేశమునకుఁ గేవలము కావేరినదియొక్క యుదకము ప్రవహించిన ఫలాధిక్య మగు నని యెంచి, వేయికాల్వలఁ ద్రవ్వించి, అవి శాశ్వతము లగుటకుఁ గాను పంచలోహములతోఁ గట్టలు వేయించి, వేలూరునకుఁ బోయి యచ్చోఁ దమసంస్థానము శ్రీరంగమునకుఁ గాంచీపురమునకును సమీపముగా నుండవలె నని యెంచి ఆవేలూరునకుఁ గోట కట్టించి అందులో దివ్యభవనంబులు గట్టించి అక్కడ దక్షిణదేశములకు తఖ్తు (సింహాసనము) నేర్పఱిచి, కొన్ని దినము లచ్చటఁ బ్రభుత్వము చేసి, పిమ్మట మఱికొన్ని దినములకు వేలూరున కుత్తరముగ నుండుచంద్రగిరియందు శత్రుభయము లేక యుండును గావునఁ దాను సంపాదించినద్రవ్య మచ్చట నుంచుట మంచిదని యెంచి, దానికిం గోటఁ గట్టించి, తాము నివసించుటకు మహల్లు గట్టించి అందుఁ దా సంపాదించిన ద్రవ్య ముంచి ఆస్థలమును భద్రపఱిచి తిరుగ విజయనగరమునకు నరసింగరాయఁడు వచ్చి చేరెను. ఇట్లు చేరిన రాయఁడు తన పెద్దకుమారుఁ డగువీర నరసింహదేవరాయనికిఁ బట్టాభిషేకము చేసి, కృష్ణరాయనిం బిలిచి వీర

నరసింహదేవరాయనిచేత నొప్పగించి సకలకార్యములలో నీకృష్ణ రాయనిఁ గూడ నుంచుకొని వ్యవహారము చేయుటచేఁ గీర్తిప్రతిష్ఠలు రాఁగల వని బోధించి లోకాంతరము నందెను. అని యున్నది. ఇందు లోఁ బైకథలకు విరోధించనిభాగము నమ్మవచ్చును.

## —— నరసింహరాయని భార్యలు పుత్త్రులు. ——

పైగ్రంథములోను "కొంగదేశరాజకాల్" అనుగ్రంథము లోఁగూడ నరసింహదేవరాయని యాలుబిడ్డలఁ గూర్చి వివరింపఁ బడియున్నది. అందులోని పైగ్రంథములో "తిప్పాంబ యను భార్య యందు వీరనృసింహేంద్రుఁడు అనుకుమారుఁడు పుట్టెను. నాగులాంబ అను భార్యయందుఁ గృష్ణరాయఁడు పుట్టెను. ఓబాంబయనుభార్యయాం దు రంగదేవరాయలు, అచ్యుతదేవరాయలు అను నిద్ధరుపుత్త్రులు పుట్టిరి. వారు నల్గురును బహుధర్మాత్ములై శౌర్యాదిగుణములు గలవా రలై యుండిరి." అని యున్నది. ఇటులనే కొంగదేశరాజకాల్, అను గ్రంథములోఁగూడ నున్నది. వీనింబట్టి చూడఁగ నరసింగరాయనికి ముగ్వురు భార్యలు, నల్వురు కొడుకులు నున్నట్లుగాఁ గానుపించుచున్న ది. ఈరెండు గ్రంథములలోఁ గృష్ణరాయలు కృతులందినపారిజాతాపహా రణ, మనుచరిత్రగ్రంథములును, కృష్ణరాయకృత మగునాముక్తమా ల్యదయు నేకీభవింపవు. ఎట్లన్నను :—

"క. ఆనరసమహీమహిళా, జానికిఁ గులసకులు పుణ్యచరితలు తిప్పాం
బానాగాంబిక లిరువురు, దానవదమనునకు రమయు ధరయును బోలెన్." పారి.

పుత్త్రులవిషయమై

"క. వారలలోఁ దిప్పాంబకు, మారుఁడు పరిపంథికంధిమంథాచలమై
వీరనరసింహరాయఁడు, వారాశిపరీతభూమివలయం బేలెన్." పారి.

"తే. అన్నసింహప్రభుండు తిప్పాంబవలన, నాగమాంబికవలన నందనులఁ గాంచె
వీరనరసింహరాయ భూవిభుని నచ్యు, తాంశసంభవుఁ గృష్ణరాయక్షితీంద్రు." మను.

ఇట్లీపైరెండుగ్రంథములలో నొక్కతీరుగనే చెప్పి యుండుటం బట్టి వీనిలోఁ జెప్పంబడినవారే నరసింహరాయని పత్నీపుత్త్రులు

గాని పైకొంగదేశపురాజకాలులోఁ జెప్పినవిధమునఁ గాదు. కావున నరసింహరాయనికి నిర్వురు భార్య లనియు, వారియిర్వురివలన నిర్వురు కుమారులు గల్గి రని సిద్ధాంతము చేసెదను. అయితే పైన చెప్పంబడిన యోబాంబికకుఁ గల్గి రనిన రంగరాయ అచ్యుతరాయ లెవ్వరికుమారు లనుదాని నాలోచించవలసియున్నది. దానికి గ్రంథ దృష్టాంతము లగపడువఱకు సరియైన సమాధానము రానేరదు, నరసింగరాయనామము గలకుమారుఁడు పైనరసింగరాయనికే యున్నాఁడు. అతఁడు వీరనరసింగరాయఁ డని పైగ్రంథత్రయమందును గానుపించుచున్నది. కావున నీయిర్వురు పుత్త్రు లావీరనరసింగరాయని కుమారులుగా భావించెదను. *

ఇఁక నరసింగరాయనిమృతి యెప్పుడో వ్రాయవలసియున్నది. అందువిషయమై కొ. రా. లులో శా. శ. ౧౪౦౧ అగుశార్వరి (A. D. 1478)గా వివరింపఁబడినది. విజయనగర రాజుల శాసనములలో క్రీ. శ. 1471 లో నొకశాసనమును, 1487 లో నొకశాసనమును నరసింగరాయని శాసనములు కానుపించుచున్నవి. ప్రిన్సెపుదొరశాసనములలో క్రీ. శ. 1490 లో వీరనరసింహరాయనిశాసనము కానుపించును. 1490 సంవత్సరములోఁ గాన్పించిన శాసనము వీరనరసింహరాయని దవుటచేత నాతనితండ్రి 1487 వఱకు నున్నట్లును, వీరనరసింహరాయఁడు తదనంతరము రాజ్యమునకు వచ్చె ననియు నూహింపనైయున్నది. క్రీ. శ. 1487—77=శా, స. 1410 అగును.

## వీరనరసింగరాయఁడు.

ఇతనిం గూర్చియు కొంగదేశరాజకాల్ కొంతచరిత్రము చెప్పుచున్నది. అది యెట్లనఁగా:—"శార్వరిసంవత్సరములో నితనికిఁ బట్టాభిషేక మాయెను. ఇతఁడు తండ్రివలె ననేకదేశములలోఁ గప్పముఁ గొనియెను. ద్రావిడ పాండ్యచోళ దేశములవారు కొంతద్రవ్యమిచ్చి యితని

* చింత్యము.

స్నేహము చేసుకొనిరి. కర్ణాటదేశము కొంకణదేశము, ఉమ్మత్తూరు, తలకాడు మొదలయిన గళ్లలోనున్న పాలెగాండ్రు కప్పము పంపకపోయి నందున వీరనరసింగరాయఁడు కోపించి అనేక సేనలం జేర్చుకొని తనకు తమ్ముఁడైనకృష్ణరాయలను విజయనగరములోనుంచి తాను అచ్యుత రాయ, శ్రీరంగరాయలును, మఱికొందఱు రాకొమరులు ప్రయాణమై పోయి ఉమ్మత్తూరు సమీపములో దండుదిగి, తమకు పూర్వమిచ్చెడుప న్నిచ్చినచో రాజ్యములో నుంచెదమనియు, లేకున్నఁ గోటలగ్గలఁ బట్టెదమనియుఁ జెప్పిపంపెను. దానికి మాఱుగా నుమ్మత్తూరిరాజు యీక్రిందివిధంబుగఁ జెప్పిపంపె. ఎట్లన్నను:—“మేమీదేశమును బహు దినములుగాఁ బాలించుచున్నాము, మావంశములో నుండువారుగాని కొంకణవర్మరాజులుగాని యీదేశమును పరిపాలించిరి. వారెవ్వరికిని కప్పమిచ్చెడునాచారము లేదు. అట్లుండ మీతండ్రి నరసింగరాయఁడు బలము కల్గియుండుటవలన జయించి కప్పము దీసికొనియెను. గాని అట్లు తీసుకొనుటకు న్యాయములేదు. కావున మేము కప్పము గట్టము.” అట్టిసమాచారమునకు వీరనరసింగరాయఁడు కోపించి తమకుఁ బూర్వులగు హరిహర రాయఁడు మొదలగువారికిఁ గప్పముకట్టి తనకుఁ గట్టనని చెప్పుట అక్రమమని యూహించి ఉమ్మత్తూరుకోట ముట్టడించెను. అట్లుగా మూఁడుమాసములు ముట్టడి వదలకయుండినను దానిని లక్ష్యపెట్టక ఉమ్మత్తూరురాజు కోట శత్రులకు స్వాధీనము కాకుండ కాపాడి శత్రువులను విశేషముగాఁ దూలించెను. అపుడు వీరనరసింగరాయఁడా కోటను పట్టుకొనలేక దండును మఱల్చుకొని శ్రీరంగపట్టణమునకు వచ్చి అక్కడి కోటను ముట్టడించెను. అయితే ఆకోటలోని ప్రభుఁడు పెద్దనరసింగరాయనివలనే పట్టముగట్టఁబడిన జీవగ్రాహ్యునికొడుకై యుండెను. అతఁడు తనకోటను గట్టిచేసుకొని ఉమ్మత్తూరు,తలకాడు పాలెగాండ్రకు వర్తమానముచేసి, వారిసేనాసహాయమునంది, కోటవెలుపలికి వచ్చి వీర నరసింగరాయనిసేనలలోఁ జొరఁబడి విశేషయుద్ధముచేసి యోడించిన వీరనరసింగరాయఁడు కొంతనష్టముతో విజయనగరమునకు వచ్చిచేరెను.

ఇట్లుచేసి తనతమ్ముఁడగుకృష్ణరాయని విశేషసేనలను ధనమును తీసుకొని ఉమ్మత్తూరు శ్రీరంగపట్టణముల జయించుటకై పంపెను. మఱికొన్నిదినములకు అనఁగా శా. స. 1425 అగు రుధిరోద్గారి సంవత్సరములో మరణమునొందెను." అనియున్నది. అయితే క్రీ. శ. 1487 మొదలు 1507వఱకు వీరనరసింగరాయల శాసనములు కానుపించుటంజేసి యితఁడంతవఱకు నన:గా 20 సంవత్సరములు రాజ్యముచేసినట్లు చెప్పవలసియున్నది. అది శా. స. 1430 సంవత్సరము కావలసియున్నది. కాని 1425 కాదు. ఇఁక విజయనగరమునుగుఱించినకథ యన్నుగ్రంథములో వీరనరసింగరాయల అధికారముంగూర్చి యీక్రిందివిధంబునం జెప్పంబడియున్నది. అందు :—

"ఆనరసింహదేవరాయనికి పెద్దకుమారుఁడైనవీరనృసింహదేవరాయల కతఁడు పట్టాభిషేకముంజేసి కృష్ణరాయలం బిలిచి వీరనృసింహదేవరాయని చేతికి నొప్పగించి ఈకృష్ణరాయని కూడ నుంచుకొని నీవు సకలకార్యములు నడిపింపుము. అట్లైన నీకుకీర్తి ప్రతిష్ఠలు రాఁగలవు. అనిచెప్పఁగా నరసింహదేవరాయలును కొన్నిదినములు కృష్ణరాయని దగ్గఱనుంచుకొని రాజ్యవ్యవహారము చేయుచువచ్చెను. ఇట్లుండఁగా వీరనృసింహరాయఁడు బాలుఁడౌటచేతను, వ్యవహారదక్షత తక్కువయై యుండుటచేతను ఇతనితండ్రి రాజ్యకాలములో పన్నిచ్చుచువచ్చినరాజు లీతనికి పన్నిచ్చుట మానివేసిరి.

ఇట్లుండ వీరనరసింహరాయఁడు తనతమ్ముఁడగుకృష్ణరాయని బిలిచి యిట్లనియె. మనదేశమునందుండు రాజు లిదివఱకు భృత్యులై యుండి కప్పములం గట్టుచుండిరి. ఇపుడు మనము పిన్నల మవుటచేత లక్ష్యము చేయక వీరనరసింగరాయఁడు శూరుఁడని భయమున పన్నిచ్చినారము గాని యీపిల్లవాండ్రకుంగూడ పన్నిచ్చెదమా అని చెప్పి శఠించినారు. కావున సర్వసేనావృతులమై మనలో నొకఁడు శత్రువులంజయించుటకు వారిదేశములకుం బోవలయును. కావున నీరాజధానిని గనిపెట్టికొని

నీ పుంమును. నేను బోయి శత్రువులం జయించి వచ్చెద నని పలికెను. అపుడు కృష్ణరాయలు లేచి అంజలిబంధముం జేసి యిట్లనియె. నే నుండఁగ మీరు దండయాత్రకుఁ బోనేల? యోఁచించవలయు ను. నేను పోయి శత్రులం జయించి కప్పములం గట్టించుకొని వచ్చెదను. అన వీరనృసింహ దేవరాయలు కృష్ణరాయనితో నిట్లనియె. నీవు చిన్న వాఁడవు. పదియాఱు సంవత్సరములే నిండైనవి. ఇట్టి నీవు యుద్ధము లకుం బోఁగూడదు. నీవు కోటం గనిపెట్టియుంట మంచి దని చెప్పగాఁ గృష్ణరాయం డంములకు సమ్మతింపక తానే యుద్ధయాత్రకై తరలెను.'' అని యున్నది. ఇది పైకథతోఁ గొంత భేదించును. అయినను విరుద్ధము కాదు.

వీరనరసింహరాయనికి రాజాధిరాజ రాజపరమేశ్వర పౌరిషప్ర తాప మహారాయ లనుబిరుదు లున్నట్లుగాఁ గొంగదేశరాజకాల్ చెప్పును. ఇతని రాజ్యవిశేషములు మనుచరిత్రాదులలో నసాధార ణములుగా వర్ణించఁబడినవి. ఎట్లన్నను :—

"క. వీరనృసింహుఁడు నిజభుజ, దారుణకరవాలపరుషధారాహతవీ
రారి యగుచు నేకాతప, వారణముగ నేలె ధర నవారణమహిమన్."

ఇఁక పారిజాతాపహరణములో.

"క. వారలలోఁ దిపాంబుజు, మారుఁడు పరిపంథికంధి మంథాచల మై
వీరనరసింహరాయఁడు, వారాశిపరీతభూమివలయం బేలెన్."

ఈరెండు పద్యములలో వీరనరసింహరాయని విక్రమము మా త్రమే చెప్పఁబడెంగావున నతఁడట్టివాఁడని చెప్పవచ్చునుకాని ఇతని నాఁడు వీరిరాజ్యమునకు విశేషదేశములు కలియు లే దని మాత్రము చెప్పవలసియున్నది.

## కృష్ణరాయనివృత్తాంతము.

దీనింగూర్చి కొం. రా. లో నిట్లున్నది. "ఇతఁడు విజయనగర ములో నవరత్న సింహాసనాధిరోహణము శాస. ౧౪౩౧ అగు నేఁటి రక్తాక్షి సంవత్సర చైత్రమాసములోఁ బట్టాభిషేకము అయినపిమ్మట

చేసెను." అని యున్నది. శాసనములలో క్రీ. శ. ౧౫౦౯, ౨౭=శా స. ౧౪౩౧ మొదలు కృష్ణదేవరాయ లధికారము చేసినట్లు కానుపించును. వీరనరసింహరాయని శాసనము శా. స. ౧౪౩౦ వఱకు నుండుటచేత నతనిమరణమునకును కృష్ణరాయని పట్టాభిషేకమునకును వ్యవధి యుండక పోవుటచేతను ఆకాలము పైరెండు శాసనముల మధ్యకాలమై యుండును. అందు విశేష భేదములేదు గనుక దానిని క్రీ. శ. ౧౫౦౮, ౨౭=శా స. ౧౪౩౦ గా నిర్ణయించెదను. ఇది విభవ సంవత్సరమని కర్ణాటరాజుల కాలనిర్ణయ పట్టికలో నున్నది. వీరనరసింహరాయని యనంతరమే కృష్ణరాయ లధికారి యయినందులకు పైపద్యకావ్యములు నుపబృంహణము చేయుచున్నవి. అందు పారిజాతాపహరణములో

"శా. వీరశ్రీనరసింహశౌరిపిదప న్విశ్వక్షమామండలీ
ధౌరంధర్యమునన్ జనంబు ముదమందన్ నాగమాంబాసుతుం
డారూఢోన్నతిఁ గృష్ణరాయఁడు విభుండై రాజ్యసింహాసనం
బారోహించె విరోధులున్ గగన శైలారోహముం జేయఁగన్."

"క. ఆవిభునసంతరంబ ధ, రావలయముఁ దాల్చెఁ గృష్ణరాయఁడు చిన్నా
దేవియు శుభమతి తిరుమల, దేవియునుం దనకుఁగూర్చుదేవేరులు గాన్." మను.

## కృష్ణరాయనిధర్మపత్నులు.

వీరిపేరులు చిన్నాదేవియు తిరుమలదేవియు నని పైమనుచరిత్ర పద్యములోఁ గాన్పించుచున్నది. పారిజాతాపహరణములోఁ గృతిముఖంబున నీయంశము వివరింపఁబడలేదుకాని ద్వితీయాశ్వాసములో "తిరుమలదేవీవల్లభ" అనియును, తృతీయాశ్వాసములో

"క. శ్రీవేంకటగిరివల్లభ, సేవాపరతంత్రహృదయ చిన్నమదేవీ
జీవితనాయక కవితా, ప్రావీణ్యఫణీశ కృష్ణరాయమహీశా."

అని యున్నది. వీని యనంతర కృతి యగునాముక్తమాల్యదలో మాత్రము కృష్ణరాయనిభార్యలు, తిరుమలదేవి, అన్నపూర్ణాదేవి అని చెప్పంబడి యుండెను. ఎట్లన్నను:—

"క. అవిభునసంతరంబ ధ, రావలయముఁ బూని తీవు రహిమైఁ దిరుమ
ల్దేవియును నన్నపూర్ణా, దేవియుఁ గమలాబ్జముఖులు దేవేరులు గాన్."

అని యున్నది. విశాఖపట్టణమండలములోఁ జేరిన సింహాచల క్షేత్రము సేవింపఁబోయి పోట్నూరుకడఁ బాతించిన స్తంభముమీఁదఁ జెక్కించిన శాసనముంబట్టి యితని భార్యలపేరులు చిన్నాదేవి తిరుమలదేవులుగాఁ గాన్పించెడిని. అన్నపూర్ణనామము చిన్నాదేవియొక్క నామాంతరముగా నూహించుట నిర్వివాదాంశమగును. దీనింగూర్చి

## కృష్ణరాయరాజ్యవిశేషములు.

"కొంగదేశరాజకాల్" లోను, విజయనగరరాజచరిత్రములోను, గొండవీటి దండకవిలెలోఁ గొంత వివరింపఁబడి యున్నది. కృష్ణరాయ, తత్పండితజన రచిత గ్రంథములలో సూత్రప్రాయముగ నావృత్తాంతములే వివరింపఁబడినవి. కావున ముందుగ పైగ్రంథములలో నేమి వ్రాయఁబడినదో చూపి అనంతరము పద్యకావ్యములవృత్తాంతము వివరించెదను. అందు " కొంగదేశరాజకాల్ " అను గ్రంథములో "కృష్ణరాయఁడు పట్టాభిషేకము చేసుకొని తనతమ్ముఁడు అచ్యుతరాయఁడు, రంగరాయఁడు వీరలతోడను, తనమంత్రితోను రాజ్యముచేయుచు విజయనగరము కోట లెస్సగాఁ గట్టించి, పెనుగొండ, చంద్రగిరి మొదలగు కోటలు వెట్టించి, అనేకసేనలం జేర్చి యితరదేశములంజయించుటకుఁ గోరి ద్రావిడదేశమునకుఁ బోయి అక్కడ కాంచి, సెంజి, వేలూరు మొదలగు గడీలను వశముచేసుకొని, వేలూరు కోట బహుభద్రపఱిచి దానిలో తనసేనలను రాజకుమారుల నుంచి రాజ్యపాలనము జేయుచుండెను. అపుడు కర్ణాటకరాజులలో నుమ్మత్తూరు శివసముద్రముల వారిని వశము చేసుకొనవలె నని యత్నించెను. ఉమ్మత్తూరుస్వాధీనమాయెను. అపుడు శివసముద్రముకోటలో రాజ్యముచేయుచున్న త్యావరా

## శివసముద్రముపై దండెత్తుట.

జు కాలధర్మము నందఁగా నతనికుమారుఁ డగు గంగరాయఁడు శివసముద్రము కోటలో నుండి ఆయుధములతోను సేనలతోను గోడను భద్రపఱిచెను. ఇతని తండ్రియే ఫిరంగులు మొదలయిన వానిం జేర్చి యుంచె.

పైపాలెగాఁడును, మఱికొందఱును గృష్ణరాయని లక్ష్యము చేయక అతనితో యుద్ధము చేసి పరాజితుం జేసి రను కోపముతోఁ గృష్ణరాయలు చతురంగబలసమేతుఁడై ఫిరంగులు మొద లగునాయుధములతోను మఱి కొందఱు పాలెగాండ్రతోడను ప్రయాణమై పోయి కర్ణాటకదేశములో కావేరితీరమందున నుండు పశ్చిమరంగమునకుఁ దూర్పుగానున్న శివసముద్రముకోటను ముట్టడించి, ఆశివసముద్రపు పాలెనానికి శత్రువైన చిక్కరాయనిం జేర్చుకొనిమఱికొందఱుపాలెగాండ్రను చేర్చుకొని ప్రేతపర్వతము, గొరికొండ అనుస్థలములలో దండు దిగి యొక సంవత్సరముపైని ఒత్తినకనుమ కావేరిమార్గములో కోటను హల్లాచేసెను. అపు డాగంగయరాయఁడు గంగఁడు శుచి అను కావేరి మడుఁగులోఁ బడి పోయెను. అటుపిమ్మట కృష్ణరాయఁ డాకోటను స్వాధీనము చేసికొనెను" అనియున్నది. ఉమ్మత్తూరు శివసముద్రము లనుకోటలను గృష్ణరాయలు భేదించినవృత్తాంతము పారిజాతాపహరణములో రెండవ యాశ్వాసమున నీక్రిందివిధముగ వర్ణింపఁబడియె, ఎట్లన్నను.——

శా. సమ్మర్దక్షమధీనిబంధనవిధాసంక్రందనాచార్య భూ
రమ్యవ్యాపవజ్రపాతజగతీరక్షాంబుజాక్షా శర
ధ్యామ్నాగ్రస్థదశాస్యరాజ్యసమసహ్యాపోద్ధవాత్తీరభా
గుమ్మత్తూరి శివంసముద్రపురవప్రోన్మూలనాడంబరా."

అని చెప్పఁబడియున్నది. కొంగవంశపురాజకాల్" గ్రంథములోఁ బై రెండుకోటలును పట్టినపిమ్మటఁ గృష్ణరాయఁడు శ్రీరంగపట్టణమునకుఁ బోయి కెంబగౌడఁడు,వీరప్పగౌడఁడు అనువారి స్వాధీనములోఁ గొన్ని దేశములును, చిక్కరాయని వశములోఁ గొన్ని దేశములును విడిచి, ఆసమీప మందుండెడుమఱికొన్ని పాళియంపట్టులు జయించి వానిం బరిపాలింప తగవరులనియమించి శేరీజుద్రవ్యము నేర్పాటుచేసి కర్ణాటదేశము కోటిద్రవ్యమునిచ్చుదానిఁగాఁ జేసెను. అట్టి కర్ణాటదేశమున కంతకు నధికారస్థానముగా నుండుటకుఁ దగిన శ్రీరంగపట్టణము దిట్టపఱిచి ప్రభవసంవత్సరములో మహాబిరుదు కలుగఁ జేసికొని దానియందుఁ గృ

ష్ణరాయధ్వజ,శంఖ, చక్రములఁ గలధ్వజ మెత్తించెను అని యున్నది. అనంతరము కృష్ణరాయలు శ్రీరంగపట్టణము విడచి ౧. కొంకణ ౨. మళయాళము ౩. గౌడము మొదలుగాఁగల దేశములకుఁబోయి అచ్చటఁ గప్పముల నందుకొని పాండ్య-చోళదేశముల స్వాధీనపఱుచుకొని అట నుండి విజయనగర పట్టణమునకు వచ్చి అచ్చట ననేక సేనలను, పాలెగాండ్రను, అనేకగోత్రములవారిని సిద్ధపఱిచి, మందుగుండుసామానులను, ఆయుధములను సన్నాహపఱుచుకొని యుత్తరదేశపు దండయాత్రకు బయలువెడలెను.ఇట్లు వెడలి కళింగదేశపురాజును స్నేహితుంగా నొనరించి ఆతని వెంటఁ బెట్టుకొని పోయి హిందూదేశపుమార్గముగా ఘూర్జర మగధ దేశముల జయించి కప్పముం గైకొని అనేకులఁ దురుష్కులం జయించి తిరుగ విజయనగర పట్టణమునకు వచ్చి సింహాసనాధిరోహణముం జేసి, యదుకులోద్భవ రాజమార్తాండ రాజగంభీర మహారాజపూజిత కృష్ణరాయ మహారాయ లని హిమవత్సేతుపర్యంతము బహుకీర్తి నంది సదాశివరాయఁ డనుసేనానాయకుని తోఁగూడ రాజ్యరక్షణముం జేయుచు ననేకధర్మముల నడిపెను. అని యును కొంగదేశరాజకాల్ లోనున్నది.

అయితే యీగ్రంథము పశ్చిమసముద్ర తీరవాసులచేత రచియింపఁబడియుండెఁగావున వారికిఁ గర్ణాటకదేశవృత్తాంతము లెస్సగఁ దెలిసి యుండవచ్చును. కాని కృ. రాయని యుత్తరదేశపు దండయాత్రయొక్క విశేషముల నిది విపులముగాఁ జెప్పఁజాల. కృ. రాయని ప్రతాపాదిక ముత్తరదేశమందె విశేషము గావున అట్టి విశేషములం దెల్పుటకు మఱికొన్ని గ్రంథములు చూపినాని న్వివరించెదను. అందు వురుషార్థప్రదాయినిలోని కొండవీటి దండకవిలెలో శ్రేష్ఠయొక్క దెబ్బదియి

## కొండవీటిఖిల్లాను స్వాధీనముచేసికొనుట.

ద్దఱు పాలెగాండ్రశస్థితిని తలఁపఁ దలఁప రాయలవారికి నారాజ్యాధిపత్యము రావలయునని యత్యాశకలుగుచుండెను. ఈయనగారు తనమనో

వేదనను తనయిష్టు లగుకొంతమందికిఁ జెలుపఁగా, స్వామీ మీకోరిక బూరుగవృక్షము వలెనే వున్న దని కొందఱును, అందని మ్రానిపండ్లకు అఱ్ఱుచాఁచుట యుక్తము కాదని కొందఱును, అయ్యా తాము జేయు నుద్యమము పిచ్చుకుంటూకఁ డాకగొప్పమ్రాను కొనయందుండెడు తేని య నపేక్షించి పొందఁ బూనుకొనునట్లున్నది. అని మఱికొందఱును ప్రత్యుత్తరములు చెప్పసాగిరి. ఐనను రాజు కొండవీటి సింహాసనమును న్నాక్రమించుకొనుటయందే యేకాగ్రచిత్తము కలవాఁడైయుండెను. ఒకనాఁ డీరాజు శకునము చూతమని విచారించి ఉపశ్రుతి దేవతను బిలచి, రజకుని గృహముమీఁద శకునానికి అక్షతలు జల్లెను. ఆరజకుఁడు తనలోఁ గాను "కొండవీడు మనదేవా! కొండపల్లి మనదేవా! కాదని యెవరు వాదమునకు వచ్చినా కటకందను కామనదేవా!" అని యొకపదముగా బాడెను. ఈవాక్యములు వినఁగా మాయావ్యక్తులయొక్క మంగళవాక్యములు వినినవుడు రాయలవారి మనమునందుఁ బట్టిన యాశ్చర్య సంభ్రమాతిశయములు పదిరెట్లు హెచ్చుగా నుండెను. ఈరాయలు రజకుఁడు చెప్పిన మాటలన్నియు తనవద్ద నమ్మకముగాది విరుగుచుండెడునొక బ్రాహ్మణునితోఁ జెప్పఁగా నతఁడు మనస్సునందు మితిలేని యుల్లాసముగలవాఁడై రాజుయొక్క యుద్దేశ్యమున కనుకూలముగాఁ గొన్ని మాటలను పలికెను, ఇంతియకాదు ఎట్టి పాపకృత్యము జేసినైనను తనరాజు మనోయభీష్టము తీర్చుట యుక్త మని యోచించి ప్రాణహింసచేయుటవలన తనకుఁ గలుగఁబోవు పాపమునకు వెనుదీయక స్వామీ నాకు కావలసినద్రవ్యసహాయముం జేసితిరా డెబ్బదియిద్దఱుపాలెగాండ్రను హింసించి కొండవీటిసీమకు నిన్ను పట్టాభిషిక్తునిఁగాఁ జేసెదను అని రాజుతో ధైర్యముగా నీవిప్రుండుపలికెను. అందుకు రాయలు ఆనందించి కావలసినద్రవ్యము బ్రాహ్మణున కిచ్చివేయుటకు ఖజాజీకి నుత్తర్వు చేసెను. అంత విప్రుఁడు కొండవీటికిఁ జని అచట మాయోపాయములచేత పాలెగాండ్రను మంచిమాట జేసికొని, ఒకగొప్పదేవాలయము కట్టించి అందు గోపీనాథస్వామి యను నొకశిలాప్రతిమను

ప్రతిష్ఠచేసి, పాలెగాండ్రందఱిని యాదేవాలయమునకు రావించి అచ్చట కృత్రిమోపాయముచేత వారిని హతజీవితులనుగాఁ జేసెను. పిదప కృష్ణదేవరాయలు అత్యానందభరితుఁడై నిజబలసమేతంబుగాఁ గొండవీటిసీమ కేతెంచి, కొండవీడు, బెల్లముకొండ నాగార్జునకొండ, వినుగొండ దుర్గముల నాక్రమించుకొనెను. ఈయనగారు ఖిల్లాలో నుండుట కిష్టములేక కొండక్రింద నొకకోట కట్టించి దానికిఁ గొండపల్లిగవిడి, నాదేళ్లగవిడి యనురెండుద్వారము లుంచి తగుసైన్యమును కాపుంచి పదునాల్గుసీమలు స్వాధీనము చేసికొనెను. ఈయన ప్రభుత్వకాలమునందు కైతేపల్లి యనుగ్రామము ఉదయగిరి సీమక్రిందను, పరుచూరు అద్దంకిసీమక్రిందను, కేసానిపల్లె, యమ్మలమంద, మాదల, తొండపి, కోనూరు, జువ్వలకల్లు అను నాలుగ్రామంబులు బెల్లముకొండ సీమక్రిందను ముసి యనునదికి దక్షిణమందున్న పాకాల, చింగనపల్లి, తుమ్మలపేట, కరేడు అను నాలుగు గ్రామములు కందుకూరు సీమక్రిందను చేర్పంబడెను. కొండవీటిసీమను మట్టుకు హవేలి యను నామముచే నిలిపి, వినుకొండ, బెల్లముకొండ నాగార్జునకొండ సీమలు మూఁటిని పరగణాలుగాఁ జేసి, శేషించిన పదిసీమలు కర్నాటకముక్రింద కలిపివేసిరి. రాయలవారు భూసురులకు ననేకగ్రామములను అగ్రహారములుగా నిచ్చినదేగాక, మున్నంగికి కొల్లిపరగ్రామమునకు మాచెర్లవారు మహంకాళివార్లను మున్నంగికి కేతనభొట్లచారిని, ఈవనికి నగరంవారిని, అతుమూరికి శిష్ఠ్లావారిని, తెనాలికి పిల్లలమఱ్ఱివారిని, సుద్దపల్లికి దంటువారిని పడమటి జొన్నలగడ్డకును పోతవరముకును పానలవారిని యజమాన పెత్తనదార్లనుగా నేర్పర్చెను. సీమలు యావత్తు కర్ణాటకముక్రింద చేరినవెనుక పూర్వమందు రెడ్లవలన యియ్యఁబడిన యగ్రహారములన్నియు నడువవేమో అనుభీతిచే అగ్రహారికులందఱు కృష్ణునివద్ద కేతెంచి ఆయనను మిక్కిలి కొనియాడి, తమమనోభావముల నెఱింగించఁగా నేయ

గ్రహారపు యజమానత్వము ఆయగ్రహారీకులకే స్థిరపఱచఁబడెను. అందుమీఁద రాయదత్త యజమానపెత్తన మని వ్యవహారము జరిగెను. కృష్ణదేవరాయలు కొండవీడుప్రభుత్వము చేయుకాలములో కొండపల్లి దుర్గము సంపాదించవలె నని యనేకసైన్యముతోఁ గొండపల్లికి దక్షిణముగా నున్నకొండగూటూరు (ఇపు డిభరాంపట్ట మని వాడెదరు) అను గ్రామములో బ్రవేశించి అచ్చట శుకరాజు బాహుబలేంద్రుఁడు అను రాజులతోఁ బండ్రెండు సంవత్సరములవఱకుం బోరాడెను. గజపతుల నోడించి కొండపల్లి స్వాధీనపఱచుకొనినట్లు కనుపించదు. అను మొదలగువృత్తాంతము లున్నవి. ఇందలి కథలలోఁ జివర నుండుశుకరాజు బాహుబలేంద్రులకథకు పద్యకావ్యములలో నాధారములు గాన్పించవు. కావున వీనికినిటనుండి పద్యకావ్యములోవివరించిన చారిత్రమును దానితో సంబంధించిన హాకీ ఖత్తులను వివరించెదను. ఇదివఱలోఁ జెప్పినవృత్తాంతము కొండవీడు దండకవిలెలోనిది.అది కేవలము విశ్వసనీయ మనుటకు వీలుపడదు. కావున మనుచరిత్రము పారిజాతాపహరణము, ఆముక్తమాల్యద వీనిలోఁ జెప్పంబడినప్రకారము కృష్ణరాయని విజయములం జెప్పి అతని రాజ్యకాలము అతనిరాజ్యవిస్తీర్ణతను నిర్ణయించెదము గాక.

### కృష్ణరాయల రాజ్యవిస్తీర్ణత కటకప్రదేశముం జయించుట.

ఇఁకఁ గృష్ణరాయని కాలములో నీవిజయనగర రాజ్యమెంతవఱకు వ్యాపించియున్నదో దానిని తెలియవలయును దానికి పారిజాతాపహరణములోని పద్యము.

"సీ. ఉదయాద్రి వేగ నత్యుద్ధతి సాధించె, వినుకొండ మాటమాత్రన హరించె
కూటముల్ సెదరంగఁ గొండవీ డగలించె, బెల్లముకొండయచ్చెల్లఁ జెఱిచె
వేలుపుకొండ నవ్వృత్తిభంగముజేసెఁ, జల్లిపల్లి సమగ్రశక్తిఁ గూల్చె
కినుక మీఱ ననంతగిరి క్రిందుపడఁజేసెఁ, గంబముమెట్టు గ్రక్కునఁ గదల్చె"

అని యున్న పద్యముంబట్టి పారిజాతాపహరణ రచనకాలంబు నాఁటి కాకృష్ణరాయలు, ౧ ఉదయగిరి, ౨ వినుకొండ, 3 కొండవీడు ౪ బెల్లముకొండ, ౫ వేలుపుకొండ, ౬ జల్లిపల్లి, ౭ అనంతగిరి, ౮ కంబము

మెట్టును జయించె. ఆనాఁటికి కటకము పై దండెత్తి వెళ్లవలె నని కృష్ణరాయల కభిప్రాయ మున్నట్లును, తనదేశముపైకి వచ్చునేమో నని ఆకటకాధిపుం డగునుత్కలరాజు జడియుచున్నట్లును పైపద్యములోని మొత్తుగీతలవలనఁ గాన్పించును. ఎట్లన్నను:—

"గీ. బలనికాయంబు కాలుమట్టుల నడంచు, కటకమును నింక ననుచు నుత్కలమహీశుఁ
డనుదినమ్మును వెఱచు నెవ్వనికి నతఁడు, రాజమాత్రుండె శ్రీకృష్ణరాయవిభుఁడు.

దీని యనంతర కాలమున రచియింపఁబడిన యాముక్తమాల్యదలో కృష్ణరాయ లుత్కలదేశముం జయించుటకుఁ బోవుచో మార్గమున జయించిన మఱికొన్ని రాజ్యములపేళ్లు చెప్పెను. దానివలన బెజవాడ మొదలు కటకమువఱకున్న దేశములు కృష్ణరాయల స్వాధీన మైనట్లు కాన్పించు. ఆ పద్య మెద్దియన:—

"సీ. తొలుదొల్త నుదయాద్రిశిలఁ దాఁకి తీండ్రించె, నసిలోహమున వెచ్చనై జనించె
మఱి కొండవీ డెక్కి మార్కొని నలి యైన, యలకసవాపాత్రు నంటి రాఁజె
నట సాగి జమ్మిలోయఁ బడి వేఁగి దహించి, కోన బీట్వెచ్చి కొట్టానఁ దగిలెఁ
గనకగిరిస్ఫూర్తి గఱచె గౌతమిఁ గ్రాఁచె, నవుల నాపొట్నూరు రవులుకొలిపె
తే. మాడెములు వేల్చె నొడ్డాది మసియొనర్చె, కటకపురిఁ గాల్చె గజరాజుకలఁగిపఱవ
తోఁకచుక్కన నార నీ దురవగాహ, ఖేలదుగ్రప్రతాపాగ్ని కృష్ణరాయ.

ఆముక్తమాల్యద.

పైపద్యములో నుదహరింపఁబడినవి:—

౧. ఉదయాద్రి.

౨. కొండవీడు.

3. వేఁగిదేశము, జమ్మిలోయ.

౪. కోనసీమ.

౫. కొటాన (కొట్టాముతాలూకా.)

౬. కనకగిరి రాజమహేంద్రవరము దగ్గఱ, హేమగిరి యని యొక గ్రామము దుర్గము నుగలవు. పైపేరు దానిపర్యాయ మై యుండనోపు. నెల్లూరిజిల్లాలోని కనిగిరి దీని పర్యాయనామ మని కొందఱందురు.

౭. గౌతమిఁ గ్రాఁచె ననుటచేత గౌతమీనదికి రాజమహేంద్రవరమునకు నుత్తరముగ నుండు రహితాపురము మొదలగు మన్యపు సంస్థానముల స్వాధీనపఱచుకొనె నని భావము.

౮. పొట్నూరు :—ఇది విశాఖపట్టణము జిల్లాలోనిది. బాహుబలేంద్రుని వంశస్థులకు కొంతకాలము ముఖ్యపట్టణ మై యుండెను.

౯. మాడెములు :—మన్యసంస్థానము లనియును, మాడుగులు సంస్థానమనియు నగును.

౧౦. వడ్డాది :—ఇది మత్స్యవంశస్థు లని చెప్పంబడు నొక సంస్థానమువారి ముఖ్యపట్టణము.

౧౧. కటకపురి :—ఇది యుత్కళదేశ మనఁబరఁగు నోఢ్రదేశమునకు ముఖ్యపట్టణము. గజపతిప్రభువులలో ముఖ్యుఁ డగు ప్రతాపరుద్రగజపతి యిక్కడ నుండు సింహాసనముపై నెక్కెను.

కొండవీడువఱకు నుత్కళరాజు లగుగజపతుల ప్రభుత్వము క్రింద నుండినట్లుగాఁ గానుపించును. కాఁబట్టి పైపద్యమువలన గజపతుల సర్వరాజ్యము కృష్ణరాయలు జయించె నని చెప్పనొప్పు.

### కలుబరిగిం జయించుట

ఈవఱకు నుడివిన దంతయుఁ గృష్ణరాయని రాజ్యము తూర్పు బెజవాడ మొద లుత్తరము కటకపురివఱకును వ్యాప్తమై యుండె నని తెల్పుటకై యున్నది. ఆ ముక్తమాల్యదలోపలనే వివరింపఁబడిన మఱికొన్నిపద్యములవలన నది పశ్చిమోత్తరములయం దెంతవఱకు వ్యాపించియుండెనో అది సూచింపఁబడియె. అది యెట్లన్నను :—

"తే. తిరుగు వారిపురి సురతరు సురల మరిగి, బహుళహాళిహాళి భరితకల్బరిగనగర
సగరపురవరపరిబృఢ జవనయవన, పృతన భవదసి ననిఁ దెగి కృష్ణరాయ."

దీనింబట్టి కృష్ణరాయఁడు కలుబరిగె (ప్రస్తుతములో కుల్బర్గ) అను స్థలములోపలను, సగరపురి (సాగర్) అను పట్టణమున నుండు తురుష్కులం జయించె నని యున్నది.

### ఖురాసాన్ దేశముం జయించుట.

పై ఆముక్తమాల్యదలోనే కృష్ణరాయలు ఖురాసాన్ దేశముపై దండెత్తిపోయి తద్దేశ ప్రభుం డగుయేదుల్ ఖాన్ అను తురుష్కుం జయించిన ట్లున్నది. ఎట్లన్నను:—

"మ. అలుకన్ఘోటకథట్టికాఖురపుటీహల్యం గురాసానిపు
చ్చలవోదున్ని చలచ్చమూగజమదాసారప్లుతిం గీర్తిపు
ష్కలసస్యం బిడి యేకధాటి భళిరా కట్టించి తౌ దృష్టి కే
దులఖానోగ్రకపాలమర్థపహరిద్భూభృజాంగలశ్రేణికిన్.

## గౌడదేశమును జయించుట.

కృష్ణరాయఁడు గౌడదేశముం జయించినట్లు మనుచరిత్రలోఁ గలదు. మఱియొక చాటు ధారయుఁ గలదు. రెండవది అతని ఆస్థానకవులలో నొక్కరు చెప్పినట్లుగా నున్నది. పెద్దన్న మొదలగువారు చెప్పిన మఱికొన్నిపద్యములవలన నీరాయ లుత్తరహిందూదేశముపై దండెత్తినట్లు తెలియుంగావున గౌడదేశముం గూర్చి చెప్పిన చాటుధార కేవలము కల్పితము కా దని తలఁచవలసియున్నది. ఆచాటువును, పెద్దన చెప్పిన పద్యముల నీ క్రింద వివరించెదను. ఎట్లన :—

"ఉ. గౌళపతీ యనేవు చిలుకా యిటు పల్కుట నీకు న్యాయమా
మూలల నున్నవారి నిటు ముంగిట. బెట్టెడువారు నుందురే."

పెద్దన్న చాటుధార :—

"మ. గవను ల్బల్లిదమయ్యె ఢిల్లి కిల మక్కాకోట మే టయ్యె నీ
భువనంబెల్ల నదల్చిపుచ్చె ననఁగాఁ బోలేరు సందేరులన్
దవసంబెక్కె బెడందకోట పురకాంతాగర్భనిర్భేదన
శ్రవణం బయ్యె భవత్ప్రతాపజయవార్తల్ కృష్ణరాయాధిపా."

మనుచరిత్రములో:—

"ఆపంచగౌడ ధాత్రీతలం బెవ్వాని, కసివారుగా నేఁగునట్టిబయలు"

## కృష్ణరాయ శాసన వివరము కాలనిర్ణయము.

ఆంధ్రులలోనే కాక హిందూప్రభువులు పెక్కండ్రు తమ రేడైన విశేషకార్యములం జేయునపుడు దేవబ్రాహ్మణులకు దానధర్మములు విశేషించి చేయుటయును, వానిని స్థిరీకరించుటకు శాసనములం జెక్కించుటయును గలదు. ఈకృష్ణరాయలు గూడ నట్లే యొనరించె నని అతనిచే నీయంబడిన కొన్ని శాసనములవలనం గాన్పించును. ఇట్టి కృష్ణ

రాయశాసనముల సంగ్రహ మాంగ్లేయభాషలో(Mr. Robert Sewell) దొరవలన (Lists of Antiquities.) అను గ్రంథములో వివరింపఁబడినది. అందులోఁ బెక్కులు(Oriental Govet, Manuscript Library, Madras.) అను దానిలో నిలువచేయఁబడినవి. కావున పై రెంటికి సహాయమునను కృష్ణరాయల దానశాసనము లే యేదేశములలో వ్యాపించియున్నవో తెల్పి అనంతర మతని దిగ్విజయ మెంతవఱకు వ్యాపించెనో యోఁచింతము. అం దాంగ్లేయసంగ్రహ శాసనపట్టికను తెన్గులోఁ దెల్పుదును.

| శా. స. | గ్రామము పేరు. | జిల్లావివరము. | రిమార్కులు |
|---|---|---|---|
| ౧౪౩౨ | విజయనగరము ౧ ... | బళ్లారి * | * లోకల్ రికార్డులో ౧౪౩౦-౩౧ సం. శాసనము లున్నవి. స్యూయల్ దొర శాసనసంగ్రహము వివరించినను పై రెండుసంవత్సరముల శాసనముల నమ్మినట్లు కానుపించదు. |
| ,, | నిడుముక్కల ... | కృష్ణ | |
| ,, | పాలెము ... | కర్నూలు | |
| ,, | బళ్లారి ... | బళ్లారి | |
| ౧౪౩౩ | కాంచీపురము ... | చెంగల్పట్టు ... | |
| ౧౪౩౪ | బళ్లారి ... | బళ్లారి ... | |
| ౧౪౩౫ | ,, ... | ,, ... | |
| ౧౪౩౬ | విజయనగరము ౨ ... | ,, ... | |
| ,, | సంకలపురము ... | ,, ... | |
| ౧౪౩౭ | కాంచి ... | చెంగల్ పట్టు ... | |
| ,, | ఉగర్ గోల్ ... | బెల్గాము ... | |
| ౧౪౩౮ | నెల్లూరు ... | నెల్లూరు ... | |
| ,, | అమరావతి ... | కృష్ణ ... | |
| ౧౪౩౯ | విజయనగరము ౩ ... | బళ్లారి ... | |
| ,, | తిరువణ్ణామల ... | దక్షిణార్కాడు ... | |
| ,, | మేడూరు ... | కృష్ణ ... | |
| ,, | కాంచీ ... | చెంగల్పట్టు ... | |
| ,, | అహోబలము ... | కర్నూలు ... | |
| ,, | శ్రీశైలము ... | ,, ... | |
| ,, | కొమ్మూరు ... | కృష్ణా ... | |
| ౧౪౪౦ | ఎరుమెట్టపాల్యము ... | చెంగల్పట్టు ... | |
| ౧౪౪౧ | బెజవాడ ... | కృష్ణా ... | |
| ,, | ,, | ,, ... | |

| శా. స. | గ్రామము పేరు. | జిల్లావివరము. | రిమార్కులు |
|---|---|---|---|
| ౧౪౪౧ | పట్లవీడు | కృష్ణ | |
| ,, | చేజెర్ల | ,, | |
| ,, | బాపట్ల | ,, | |
| ,, | శ్రీకాకుళము | ,, | |
| ,, | బాపట్ల | ,, | |
| ,, | కాకాని | ,, | |
| ,, | కొండకావూరు | ,, | |
| ,, | దుగ్గి | ,, | |
| ,, | తిరుప్పడిర్కూరం | చెంగల్పట్టు | |
| ,, | కాంచి | ,, | |
| ౧౪౪౨ | కలువాయి | నెల్లూరు | |
| ౧౪౪౩ | అన్నియ్యూర్ | దక్షిణఆర్కాడు | |
| ,, | పల్ని | మధుర | |
| ,, | విజయనగరము ౪ | బళ్లారి | |
| ,, | మంగళగిరి | కృష్ణ | |
| ౧౪౪౪ | గార్లదిన్నె | నెల్లూరు | |
| ,, | వల్లభాపురము | బల్లారి | |
| ,, | కందుకూరు | కడప | |
| ,, | అనంతసాగరం | నెల్లూరు | |
| ౧౪౪౫ | శివమొగ్గ | మైసూర్ | |
| ౧౪౪౬ | ఈగలపాడు | నెల్లూరు | |
| ౧౪౪౭ | కొండవీడు | కృష్ణ | |
| ౧౪౪౯ | కత్తెరగండ్ల | కడప | |
| ౧౪౫౦ | గుడిహళ్లి | బళ్లారి | * కృష్ణరాయలు శా స ౧౪౫౨ లోనే మృతినొందినట్లు నిశ్చయము. ౧౪౫౩ లో శాసనము ఉండుటకు కారణము లేదు. |
| ౧౪౫౨ | కాంచి | చెంగల్పట్టు | |
| ,, | పాలెము | కర్నూలు | |
| ,, | విజయనగరము ౫ | బళ్లారి | |
| ,, | కాంచి | చెంగల్పట్టు | |
| * ౧౪౫౩ | తిరువణ్ణామలై | దక్షిణఆర్కాడు | |
| ,, | సింగరాయనికొండ | నెల్లూరు | |
| తారీఖులేదు | సంకలపురం | బళ్లారి | |
| ,, | పొట్నూరు | విశాఖపట్టణము | |
| ,, | సింహాచలము | ,, | |
| ,, | ఉండవిల్లి | కృష్ణ | |

ఇట్లు (Antiquities.) అను గ్రంథములో నుదాహరింపఁబడిన శాసనములలో ౧ బళ్లారిజిల్లాకు ౧౨ శాసనము లున్నవి.' వానికాలముయొక్క వివరము.

శా. స.
౧—౧౪౩౨
౨ { ౧౪౩౪, ౧౪౩౪
౧—౧౪౩౫
౨ { ౧౪౩౬, ౧౪౩౬
౧—౧౪౩౯
౧—౧౪౪౩
౧—౧౪౪౪
౧—౧౪౫౦
౧—౧౪౫౨
౧ తేదిలేనిది.

౧౨

ఇట్లు పండ్రెండు శాసనములు కాన్పించెడిని. ఇందులో నైదుశాసనములు ప్రత్యేకము కృష్ణరాయని ప్రధాన పట్టణ మగువిజయనగరములో నీయంబడినశాసనములై యున్నవి. పైశాసన కాలములలో ౧౪౩౬ మొదలు ౧౪౩౯వఱకు మూఁడుసంవత్సరములును, అది మొదలు ౧౪౩౪ వఱకు నాల్గుసంవత్సరములును ౧౪౪౪ మొదలు ౧౪౫౦ వఱకు ఆఱుసంవత్సరములకాలమును వ్యవధి యున్నది. ఆవ్యవధికాలములే కృష్ణరాయఁడు విస్తార క్రమసాధ్యము లగుదేశములపై దండయాత్రలు చేయుచు నన్యదేశములలో నున్నట్లు భావించుటకు దగియుండును.

## కృష్ణాజిల్లా శాసనములు.

౨ ఇందలి శాసనగ్రామములు పూర్వము కృష్ణాజిల్లా నామముతో నొప్పు దేశములోనివి కావు. అవి కృష్ణరాయలకాలము నాఁటికి సీమ లనునామముతో నుండెను. మఱికొంతకాలమున కవి తురుష్కుల యధికారములో కొండవీడు, కొండపల్లి, ఏలూరునిజాంపట్నం సర్కార్లుగా నుండెను. పిమ్మట ఇంగ్లీషువారికాలములోఁ గొన్నాళ్లు గుంటూరుజిల్లా, బందరుజిల్లాలుగా నుండి ప్రస్తుతములో నవి యన్నియు కృష్ణా గోదావరీజిల్లాలోని వైనవి. ఇట్టి చిక్కులలో నుండుటచేత పైగ్రామములు కృష్ణరాయలకాలములో నేసీములోనివో వివరించలేను.

శా. స. ౧౪౩౨, ౧౪౩౭, ౧౪౩౯, ౧౪౩౯ ౧౪౪౧ లోనివి. ౧౪౪౩, ౧౪౪౭, ౧ తారీఖులేనిది. మొట్టున ౧౭ శాసనములు. ఈసంవత్సరములలోఁ గృష్ణరాయలు ప్రస్తుతపు కృష్ణాజిల్లాలోఁ జేరిన సీమలను జయించె నని చెప్పవలసియున్నది.

౩. కర్నూలుజిల్లాశాసనములలో శా. స. ౧౪౩౨, ౧౪౩౯, ౧౪౫౨ మెట్టున శాసనములు నాలుగు. కృష్ణాజిల్లాకుఁ బోవుట కీజిల్లా మార్గము కావునను, ఇందుఁ గూడ శ్రీశైలము, అహోబలము మొదలగుదేవస్థలము లుండుటచేతను పైసంవత్సరములలోఁ గృష్ణరాయలు ప్రాగ్దేశములోనే విశేషకాల ముండె నని యూహింపవచ్చును.

౪. చెంగల్పట్టుజిల్లా శాసనములో. శా. స. ౧౪౩౩, ౧౪౩౭, ౧౪౩౯, ౧౪౪౦, ౧౪౪౧, ౧౪౪౧, ౧౪౫౨, ౧౪౫౨, అనునవి యెనిమిది శాసనములు.

౫. బెల్గాంజిల్లాశాసనములు, ౧౪౩౭ ఇది యొక్కటియే శాసనము. ఇట్టితేదీశాసనములలో నొక్క చెంగల్పట్టుజిల్లాలోనే గాని కానుపించదుకావున నాసంవత్సరమం తయుఁ గృష్ణరాయలు ఆరెండుదేశములలోనే యున్న ట్లూహించవలసి యున్నది.

౬. నెల్లూరిజిల్లా శాసనములలో. శా. స. ౧౪౩౮, ౧౪౪౨, ౧౪౪౪.౧౪౪౪, ౧౪౪౬, ౧౪౫౩, అను నివి యారు.

౭. దక్షిణ ఆర్కాడుజిల్లా శాసనములలో ౧౪౩౯, ౧౪౪౩, ౧౪౫౩ అను నివి మూఁడు.

౮. మధురజిల్లా శాసనము ౧౪౪౩. ఈతేదీశాసనము దక్షిణ ఆర్కాడులో మాత్రము కానుపించును. కాఁబట్టి కృష్ణరాయలావత్సర మారెండుదేశముల కార్యములు నడిపి యుండవచ్చును.

౯. కడపశాసనములు ౧౪౪౪, ౧౪౪౯ అనునవి రెండు.

౧౦. మైసూరుశాసనము ౧౪౪౫ అనునది యొకటి.

౧౧ విశాఖపట్టణముజిల్లా శాసనములలో రెంటికి తేదులు లేవు.

శా. స. ౧౪౩౨ లో బళ్లారి, కృష్ణా, కర్నూలు. ౧౪౩౩ లో చెంగల్పట్టు. ౧౪౩౪లో బళ్లారి. ౧౪౩౫ లో బళ్లారి. ౧౪౩౬లో బళ్లారి. ౧౪౩౭లో చెంగల్పట్టు, బెల్గాం. ౧౩౪౮ లో కృష్ణా, నెల్లూరు. ౧౪౩౯ లోబళ్లారి, కృష్ణా, కర్నూలు చెంగల్పట్టు, దక్షిణ ఆర్కాడు. ౧౪౪౦ లో చెంగల్ పట్టు. ౧౪౪౧ లో చెంగల్పట్టు, కృష్ణా. ౧౪౪౨ లో నెల్లూరు. ౧౪౪౩ లో బళ్లారి, కృష్ణా, దక్షిణఆర్కాడు, మధుర. ౧౪౪౪ లో బళ్లారి, నెల్లూరు, కడప. ౧౪౪౫ లో మైసూరు. ౧౪౪౬, ౧౪౪౭ లో నెల్లూరు. ౧౪౪౮లో కృష్ణా. ౧౪౪౯లో కడప. ౧౪౫౦, ౧౪౫౧లో బళ్లారి. ౧౪౫౨ లో బళ్లారి. కర్నూలు, చెంగల్పట్టు. ౧౫౫౩ లో నెల్లూరు, దక్షిణ ఆర్కాడు.

పైసంవత్సరములోఁ గృష్ణరాయఁ డేయేదేశములతో వ్యవహరించుచుండెనో బోధయగును. వీనింబట్టి కృష్ణరాయనిరాజ్యము పైస్థలము లున్నంతవఱకు వ్యాపించియుండె ననుటకు సందియము లేదు. తారీఖులు లేని విశాఖపట్టణపు శాసనములు నేను సంపాదించియున్నాఁ

డను. అందుల తారీఖులు వివరింపఁబడియే యుండెంగావున నాజిల్లా అంతయు నందులో నప్పటికాలములో జేరిన కటకపురాజ్యమునం గలిసి యున్నవి. ఇదియంతయు స్యూయల్ దొర పుస్తకమునుబట్టి వ్రాయఁ

## కృష్ణరాయల శాసన వివరము.

బడినది. కృష్ణరాయల పూర్వ దిగ్విజయ యాత్రావిశేషములు దెల్పు కొన్ని శాసనములు మనకు లభ్యములైనవి. కృష్ణరాయచారిత్ర విశేష ములం దెల్పుట కవి ముఖ్యములుకావున వానిలో ముఖ్యము లగువా నిని శకవర్షముల రీతి నమర్చి యీక్రింద వివరించెదను ఎట్లన్నను:—

| శా. స. ప్రభవాది సం॥ము | గ్రామము. | విశేషములు. |
|---|---|---|
| I. ౧౪౩౭=యువ. | ధరణికోట. | ఉదయగిరి,కొండ వీడులజయించిన కథ. [సాధించుట. |
| II. ౧౪౩౮=ధాత. | సింహాచలము. | రాజ మహేంద్రవరము మొదలు |
| III. ౧౪౩౮=ధాత. | అహోబలము. | మన్నెవారిని పట్టుకొనుట. |
| IV. ౧౪౪౧=ప్రమాది. | సింహాచలము. | ప్రతాపరుద్రునికడ గైకొనినగ్రామముల లోఁ గొన్ని స్వామి కిచ్చుట. |

No. 1: శాసనము. శా. స. ౧౪౩౭ యువ సం. ధరణికోట:—

స్వస్తి శ్రీమన్మహారాజాధిరాజ, రాజపరమేశ్వర, మూరురాయర గండ, అరిరాయవిభాడ, భాషిగె తప్పువరాయరగండ, అష్టదిక్కు రాయ మనోభయంకర, పూర్వ దక్షిణ పశ్చిమసముద్రాధీశ్వర, యవన రాజ్య స్థాపనాచార్య, గజపతివిభాడ, శ్రీవీరప్రతాప, శ్రీకృష్ణదేవ మహారాయ లు విజయనగరానుండి పూర్వదిగ్విజయయాత్రకు వేంచేసి, ఉదయగిరి దుర్గము సాధించి తిరుమల ప్రియతరాయ మహాపాత్రుని పట్టుకొని, అద్దంకి, వినుకొండ, బెల్లముకొండ, నాగార్జునకొండ, తంగేడు కేత వరము మొదలైన గిరిదుర్గ స్థలదుర్గాలు అన్ని ఏకధాటిం గైకొని కొండవీటిదుర్గము లగ్గలు పుచ్చుకొని, ప్రతాపరుద్ర గజపతికొమారుఁడు వీరభద్రరాయనిన్ని, కుమారహం వీరమహాపాత్రునికొడుకు వీరమహా పాత్రుఁడు, రాచూరి మల్లుఖానుఁడు, ఉద్దండఖానుఁడు, పూసపాటి రాచి

రాజు, శ్రీనాథరాజు లక్ష్మీపతిరాజు, జన్యామలక సవాపాత్రుఁడు, పశ్చిమ బాలచంద్రమహాపాత్రుఁడు, మొదలుగాను పాత్రసామంతులను, మన్న వారిని, జీవగ్రాహముగాను పట్టుకుని వారికి అభయదానమిచ్చి, ధరణికోటకు అమరేశ్వరులకై వేంచేసి, స్వస్తి శ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు ౧౪౩౭ అగు నేఁటి యువసంవత్సర, ఆషాఢ బ. ౧౨ భానువారమునకు కృష్ణవేణీనదీతీరమందు అమరేశ్వరదేవుల సన్నిధిని తులాపురుష మహాదానము సేయ నవధరించి తమదేవులు, చిన్నాదేవమ్మచేతను రత్నధేను మహాదానమున్ను, తిరుమల దేవమ్మగారిచేతను సప్తసాగర మహాదానమున్ను, చేయించ నవధరించి తమ తండ్రి నరసారాయణం గారికిన్ని, తమతల్లి నాగాదేవమ్మకున్ను పుణ్యముగాను అమరేశ్వరదేవుని నైవేద్యమహాపూజలకు ధారాపూర్వకముగాను సమర్పించిన పెద్దమద్దూరిగ్రామ మొకటి చతుర్వేద విద్యాపారగులైన బ్రాహ్మణోత్తములకు, నూట యెనమండ్రకు గ్రామములు. ౪

౨. ౧ అద్దంకి సీమలో నిచ్చిన నిడమానూరుగ్రామము.

౧ అమ్మనబ్రోలు సీమలో వల్లూరుగ్రామము

౨

తమపురోహితులకు సర్వక్రతు సర్వతోముఖ వాజపేయయాజులైన రంగనాథదీక్షితులకున్ను శివాదీక్షితులకున్ను.

౨. ౧ అమ్మనబ్రోలుసీమలో ధారాపూర్వకముగా నిచ్చిన క్రొత్తపల్లి,

౧ త్రోవగుంట.

౪. ౨

ఈ ధర్మాలు ఆచంద్రార్కముగాను ఎవరు తప్పకనడుపుదురో ఆ పుణ్యపురుషులయొక్క పాదాలు మాశిరస్సున ధరించేము. ఈధర్మములకు ఎవరు హాని తలఁచినా నడుపని పాతకులు తమతల్లిదండ్రులను, బ్రాహ్మణులను, కపిలధేనువులను, కాశిలో గంగాతీరమందు చంపిన పాపాన పోఁగలవారు.

౧ శ్లో. స్వదత్తా ద్ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనమ్,
పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్.
౨ శ్లో. ఏకైవ భగినీ లోకే సర్వేషామపి భూభుజామ్,
నభోగ్యా నకరగ్రాహ్యా విప్రదత్తా వసుంధరా.
౩ శ్లో. సామాన్యోఽయం ధర్మసేతు ర్నృపాణాం
కాలే కాలే పాలనీయో భవద్భిః,
సర్వానేతాన్ భావినః పార్థివేంద్రాన్
భూయో భూయో యాచతే రామచంద్రః.

అను నీశాసనార్థములవలనఁ దేలిన చారిత్రవిశేషము లెవ్వియనఁగా శా. స. ౧౪౩౭ సంవత్సరము నాఁటికి ౧. కృష్ణరాయని కెన్ని బిరుదులున్నవో అవియును, ౨. యేయే దేశములు స్వాధీనములైనవో ఆసంగతియును, ౩ ఆదేశాధిపతులలో నెవ్వరు స్వాధీనులుకాలేదో ఆవృత్తాంతమును, ౪. ఎందఱు బ్రాహ్మణులకుఁ గృష్ణరాయఁడు ఆసమయమున వృత్తు లిచ్చెనో ఆకథయును, ౫. రాజపురోహితు లెవ్వరో ఆవివరమును దెలిసినది. కావున వానినన్నిటి నిట సంగ్రహముగా వివరించెదను.

## ౧ కృష్ణరాయనిబిరుదులు.

౧ శ్రీమన్మహారాజాధిరాజ. ౨ రాజపరమేశ్వర. ౩ మూరు రాయరగండ. ౪ అరిరాయవిభాడ. ౫ భాషిగెతప్పువరాయరగండ. ౬ అష్టదిగ్గజ మనోభయంకర. ౭ పూర్వ, దక్షిణ, పశ్చిమసముద్రాధీశ్వర. ౮ యవన రాజ్యస్థాపనాచార్య. ౯ గజపతివిభాడ. ౧౦ శ్రీవీరప్రతాప. మొత్తము. ౧౦.

౨. శా. శ. ౧౪౩౭ సంవత్సరమునాఁటి కేయేదేశములు స్వాధీనములైనవి.

౧ ఉదయగిరి దుర్గము. ౨ అద్దంకిసీమ. ౩ వినుకొండసీమ. ౪ బెల్లముకొండసీమ. ౫ నాగార్జునకొండసీమ. ౬ తంగేడుసీమ. ౭ కేతవరముసీమ. ౮ కొండవీటిసీమ, కొండవీటిదుర్గము. మొత్తము. ౮.

౩. పైదేశాధిపతులలో నెవ్వరు స్వాధీనము కాలేదు. ఎవరు పట్టుఁబడినారు.

౧ ప్రతాపరుద్ర గజపతి కుమారుఁడు వీరభద్రుఁడు. ౨ కుమారహంవీరమహాపాత్రునికొడుకు వీరభద్రుఁడు. ౩ రాచూరి మల్లుఖానుఁడు. ౪ ఉద్దండఖానుఁడు. ౫ పూసపాటి రాచిరాజు. ౬ శ్రీనాథరాజు లక్ష్మీపతిరాజు. ౭ జన్యాముల కసవాపాత్రుఁడు ౮ పశ్చిమ బాలచంద్ర మహాపాత్రుఁడు. మొత్తము. ౮.

వీరు స్వాధీనము కాని వారు.

ఉదయగిరి దుర్గాధిపతి యగు తిరుమల ప్రేతరాయ మహాపాత్రుఁడు పట్టుపడినాఁడు.

౪. ఆసమయములో కృష్ణరాయ లెందఱు బ్రాహ్మణులకు వృత్తుల నిచ్చెను ?
౧౦౮ చతుర్వేదపారగు లగువారికి.

౫. రాజపురోహితు లెవ్వరు ?

రంగనాథ దీక్షితులు, శివాదీక్షితులు.

వీ రిర్వురును స్మార్తబ్రాహ్మణులు గాన వీరు సర్వక్రతు సర్వతోముఖ వాజపేయ యజ్ఞ దీక్షాపరులు గాఁ గాన్పించుచున్నారు. దీనింబట్టి కృష్ణరాయఁడు కేవల వైష్ణవగురువుల నవలంబించి స్మార్తుల నిరాకరించినట్లు గాఁ గానంబడదు.

నెం. II. శాసనము 1438 సం. (ధాత) సింహాచలము.

శ్రీమన్మహారాజాధిరాజ, రాజపరమేశ్వర, మూరు రాయరగండ, అరిరాయవిభాడ, భాషిగె తప్పు వరాయరగండ, యవనరాజ్యస్థాపనాచార్య, శ్రీవీరప్రతాప కృష్ణదేవ మహారాయలు విజయనగర సింహాసనారూఢుఁడై పూర్వదిగ్విజయ యాత్రకు విచ్చేసి, ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి, రాజమహేంద్రవరము మొదలయిన దుర్గాలు సాధించిరి. సింహాద్రికి విచ్చేసి స్వస్తి శ్రీ విజయాభ్యుదయ శా. స. ౧౪౩౮ అగునేఁటి ధాతసంవత్సర. చైత్ర. బ. ద్వాదశి వారాన సింహాద్రినాథుని దర్శించి తమతల్లి నాగాదేవమ్మగారికిన్ని, తమతండ్రి నరసారాయణింగారికిన్ని పుణ్యమునకుగాను దేవునకు సమర్పించిన కంఠమాల ౧కి ముత్యాలు ౬౧. వజ్రమాణిక్యాల కడియాలు జోడు ౧కి శంఖచక్రాలపతకము ౧. పైఁడిపళ్లెము ౧కి తూకాలుగా ౪౪౨౬౨. కానికి మాడలు ౨౦౦౦. తమ రాణీలు తిరుమల దేవమ్మగారిచేతను పతకము ౧కి వరహాలు ౯౦౦. తమచిన్నాదేవమ్మగారిచేత సమర్పించిన పతకము ౧కి. గా ౫౦౦. యింతవట్టు సమర్పించిన ధర్మశాసనము.

ఈ రెండవశాసనమువలనఁ దేలిన విశేషములు వివరింపఁబడవలసియున్నది. ఇందు తొల్లిటి శాసనములోని బిరుదులకు వ్యతిరేకమై

నవి లేవు. ౧౪౩౭ సంవత్సరములోని ఆషాఢమాసము మొదలు ౧౪౩౮ సంవత్సరము చైత్రమాసమునాఁటికి ననగాఁ దొమ్మిదిమాసములలో గృష్ణరాయలు కొండవీటి దుర్గము, కొండపల్లిదుర్గము, రాజమహేంద్రవరదుర్గము జయించినాఁ డనియును, అట నుండి కళింగదేశము జయించుటకుఁగాను సింహాచల క్షేత్రమునకు వచ్చి విజయార్థమై సింహాచలేశుని సేవించి అచ్చోఁ దాన ధర్మముల నడిపెననియుఁ దెలియును.

నెం ౩౮ శా. స. ౧౪౩౮. ధాతసం. అహోబలశాసనం, లోకల్ రికార్డులు, ౧౦ సంపుటము, ౫౫౫ పుటలో నహోబలగ్రామము, కైఫీయతు వ్రాయుచు నీపై నుదాహరించిన శాసనము నను రించెను. అది ఎట్లన్నను:—

“స్వస్తి శ్రీమన్మహారాజాధిరాజ, రాజపరమేశ్వర, మూరురాయరగండ, అరిరాయవిభాడ, అష్టదిక్కురాయ మనోభయంకర, పూర్వ, పశ్చిమ, దక్షిణ, సముద్రాధీశ్వర, యవన రాజ్యస్థాపనాచార్య, గజపతి దళవిభాడ, శ్రీవీరప్రతాప శ్రీవీర కృష్ణదేవ మహారాయలు పూర్వ దిగ్విజయ యాత్రకు విచ్చేసి ఉదయగిరి దుర్గమును సాధించి తిరుమల ప్రేతరాయ మహాపాత్రుని పట్టుకొని వినుకొండ, బెల్లముకొండ, నాగార్జునకొండ, అద్దంకి, అమ్మనబ్రోలు, తంగేడు, కేతవరము మొదలయిన గిరిదుర్గాలు ఏకఘాటిని గైకొని కొండవీటికి విచ్చేసి దుర్గంచుట్టు వాఱుకుని నడచప్పరాలు పెట్టి, కోట పడదోయించి నాల్గుదిక్కులాను లగ్గలు విడిపించి దుర్గం తీసుకుని దుర్గంమీఁద నున్న ప్రతాపరుద్ర గజపతి మహారాజుల కొమారుఁడు వీరభద్రరాయఁడు, కుమార హంవీరపాత్రుని కొడుకు నరహరిదేవు శ్రీనాథరాజు, రామరాజు కొడుకు లక్ష్మీపతిరాజు రాచూరి యలువఖానుఁడు, ఉద్దండఖానుఁడు జన్యామల కనవాపాత్రుఁడు, తమ్మపాలచంద్రమహాపాత్రుఁడు వీరు మొదలైన పాత్రసామంతులనున్ను, మన్నె వారిని జీవగ్రాహముగా పట్టుకొని వారికి అభయదానమున్ను యిచ్చి, ధరణికోటకు విచ్చేసి అమరేశ్వర మ

హాదేవుని తులాపురుష మహాదానమున్ను చేయ నవధరించి, తిరిగి విజ
యనగరానకు విచ్చేసి, రత్నసింహాసనస్థులై సామ్రాజ్యము చేయుచు
న్న మఱి కళింగదేశదిగ్విజయార్థ మై విచ్చేయుచు అహోబలానకు
వేంచేసి దేవుని దర్శించి, శ్రీవిజయాభ్యుదయ శా. స. ౧౪౩౮ అగు నేఁ
టియువసం. పుష్య శు. ౧౫ శుక్రవారమందు శ్రీ అహోబలదేవునికి
కంఠమాల ౧, పచ్చలు చెక్కినవజ్రాల మాణిక్యాలపతకము ౧, మాణి
క్యాల కడియాల జోడు ౧, పైడిపళ్లెము ౧, కాక ౧౦౦౦ వరహాలున్ను
తమ దేవులు సమర్పించిన పతకము౧౦౧ తాకట్టున్ను సమర్పించి దేవర
అమృతపడి నైవేద్యము అంతరంగ వైభవాల కున్ను, చాగలమఱ్ఱి సీ
మలోని మద్దూరు అనే గ్రామమున్ను సమర్పించిరి. ఈసేవ ఆచంద్రా
ర్కస్థాయి అయి నడచవలె నని యిచ్చినధర్మశాసనం.

ఈ శాసనములోని సంగతులు ముఖ్యముగా విచారించవలసిన
వి. ఇందులో వివరింపఁబడిన శాలివాహన శకముతో సరియైన ప్రభ
వాది సంవత్సరము వ్రాయఁబడలేదు. ఇది పొరపాటు కావచ్చును.
మొదటి శాసనకాలము మొదలు రెండవశాసనసమయమువఱకు
నడుమనుండిన తొమ్మిదిమాసములలోఁ గృష్ణరాయఁడు పూర్వదేశపు
దండయాత్ర చేయుచున్నట్లు స్పష్టమే. ఇవు డీశాసనములోఁ గృష్ణదేవ
రాయలు తిరుగ తనరాజధాని యగువిజయనగరమునకుఁ బోవునసమయ
ములోఁ జేసియున్న విశేషముల వక్కాణించెను. శా. స. ౧౪౩౮ సం
వత్సరము చైత్రమాసము మొదలు పుష్యమాసమువఱకుఁ దొమ్మిది
మాసములు పట్టియుండును. కాఁబట్టి యీకాలము గల ప్రభవాది సం
వత్సరము ధాత సంవత్సరముగాఁ జెప్పుటయే యుక్తియుక్తముగా
నుండును. అయితే కృష్ణదేవరాయలు గతసంవత్సర దండయాత్రలో
సింహాచలమునకుఁ దూర్పుననున్న దేశముల స్వాధీనపఱుచుకొనియుం
డలేదు గనుక నక్కడ నుండి తిరిగి స్వదేశమునకుఁ బోయి సేనలను
ధనముం గూర్చుకొని పూర్వ దండయాత్రకు బయలువెడలిన సమయ

మీశాసన సమయము కావచ్చును. శాసనార్థము నట్లె కానుపించును గావున దాని సంగ్రహ మిట వివరించెదను. ఎట్లన్నను :—

కృష్ణదేవరాయలు పూర్వ దిగ్విజయ యాత్రకు విచ్చేసి మొదలు పాత్రసామంతులనున్ను మన్నెవారినిన్ని అనువఱకుఁ బూర్వపుశాసనార్థమే తిరుగ వివరింపఁబడినది. ఈశాసనకాలమునాఁటికి నట్టి సామంతులలో నొకరిద్దఱు తప్పతక్కినవారిని జీవగ్రాహముగా (ప్రాణములతో) పట్టుకొని వారికి నభయదాన మిచ్చె ననునది విశేషము. పైశాసనములోని వారిపేరులు కొన్నియు నీశాసినములో వారిపేరులు సరిపడి యుండకుండుటం జేసి ఆరెంటుపట్టికల నిట వివరించెదను.

| మొదటిశాసనము పేరులు. | ప్రస్తుత శాసనముల పేరులు. |
| --- | --- |
| ౧. ప్రతాపరుద్ర గజపతికుమారుఁడు వీరభద్రరాయఁడు, | ౧. ప్రతాపరుద్ర గజపతి మహారాయల కొమారుఁడు వీరభద్రరాయఁడు. |
| ౨. కుమారహంవీరమహాపాత్రుని కొడుకు వీరమహాపాత్రుఁడు, | ౨. కుమార హంవీర మహాపాత్రుని కొడుకు నరహరిదేవు. |
| ౩. రాచూరి మల్లవఖానుఁడు, | ౩. రాచూరియెలువఖానుఁడు. |
| ౪. ఉద్దండభానుఁడు, | ౪. ఉద్దండఖానుఁడు. |
| ౫. పూసపాటి రాచిరాజు, | ,, ,, ,, ,, |
| ౬. శ్రీనాథరాజు, లక్ష్మీపతిరాజు, | ౬. శ్రీనాథరాజు రామరాజు కొడుకు లక్ష్మీపతిరాజు. |
| ౭. జన్యామలక సవాపాత్రుఁడు, ... | ౭. జన్యాములకసవాపాత్రుఁడు, |
| ౮. పశ్చిమబాలచంద్రమహాపాత్రుఁడు. | ౮. తుమ్మపాలచంద్రమహాపాత్రుఁడు. |

పైపట్టికలలోని పేరులలోఁ గొంచెము భేద మున్నను అవి పాఠాంతరములుగాఁ గైకొనఁదగియున్నవి. పైపట్టికలోని అయిదవపేరుగల పూసపాటి రాచిరాజుపేరు కాన్పించకుండుటకుఁ గారణ మరయవలసియున్నది. ఇది ప్రమాణ మైన నై యుండు నని యెంచి దాని నివర్తించుటకు గ్రంథాంతర మరయుదు నని నలసంవత్సర పంచాంగము పీఠికలోఁ బ్రచురింపఁబడిన కర్ణాటకరాజులపేరులున్నపట్టికం జూడ దానిలో నీక్రిందివిధంబుగఁ గృష్ణరాయ రాజ్యవిశేషము లున్నవి. అవి

యును మనచరిత్రమునకు ముఖ్యములే. వాని నీక్రింద వివరించెదను. ఎట్లన్నను :—

శా.స. ౧౪౩౦-కు క్షత్రియవంశస్థుఁ డగుసాళ్వనరసింహరాయలు ప్రబలెను. ఇతనిమంత్రి సాళ్వతిమ్మయ, ఈనరసింహరాయలయనంతరము కీర్తికాముఁ డగుప్రతాప వీరకృష్ణరాయలు ప్రభుత్వమునకు వచ్చెను. ఇతని మంత్రి అప్పాజీ. కృష్ణరాయలు విభవసంవత్సరమాఘ శు- ౧౪ పట్టాభిషిక్తుఁడాయెను. ఇదే శక సంవత్సరము. (Note:—ఇందులో వ్రాయంబడిన నరసింహరాయలు కృష్ణరాయని యన్న యగువీరసింహరాయలు.)

౧౪౩౯. సుల్తాన్ కులీ ఖుతుబ్ ముల్కు, ఢిల్లీపాదుషాతో యుద్ధము ప్రారంభించి ఆంధ్రదేశమును స్వాధీన పఱచుకొనియెను.

,, అమీనాబాద్ బీదర్ ప్రదేశములయందు ప్రారంభింపఁబడినయుద్ధములో మహమ్మదు పాదుషా పరాజితుఁడైనాఁడు.

,, కళింగదేశము నేలుచుండిన వీరభద్ర గజపతిరాజును కృష్ణదేవరాయలు జయించెను.

౧౪౩౭. పూసపాటి మాధవవర్మ వెలమవారికి అనేక దుర్మార్గములు చేయుచుండెను.

౧౪౪౧. కృష్ణానదివడ్డున ప్రబలయుద్ధము జరిగినది. అప్పటిలో విజయనగరము నేలుచుండు కృష్ణదేవరాయలను ఆదిలిషా ఎదిరించినందున వారిని కృష్ణదేవరాయలు జయించి తఱిమెను.

౧౪౪౯. విరించిపురం అప్పయ్య దీక్షితులును, కోటి కన్యాప్రదానముల తాతాచార్యులను పండితుఁడును ప్రబలిరి.

౧౪౫౦. వీరభద్ర ప్రతాపదేవుఁడు కటకమును పాలించెను.

౧౪౫౨. జగదేకప్రసిద్ధుఁ డగుకృష్ణదేవరాయలు మృతి నందెను. గోలకొండలో తానీషా ప్రభుత్వము ప్రారంభించఁబడినది.

అనియున్న పైపట్టికలో పూసపాటి రాచిరాజు విషయము వ్రాయవలసియున్నది. పైదానిలో వ్రాయంబడిన పూసపాటి మాధవవర్మయే యీ పూసపాటి రాచిరాజు పూసపాటి వారివంశమునం జెప్పెదు కృష్ణవిజయాదిగ్రంథములంబట్టి పైరాచిరాజు చేసినవిశేషములు స్పష్టము లగును. ఇపుడు మనము వ్రాయుచున్న కాలములోఁ బూసపాటి

వారిలోఁ గృష్ణరాయనితో నెదిరించుటకుఁ దగిన స్థితిలో నున్నవాఁడీరాచిరాజొక్కఁడే. ఇతనినే వెలమలలో రావువారి వంశచారిత్రములో పూసపాటి మాధవవర్మ యని వివరించిరి. ప్రస్తుతములో నీసంశయ నివారణ చేయుట మనపని కాదు గనుక నీవిషయమై చర్చింపక రాచిరాజు కృష్ణరాయలతోఁ జలము సాధించి పోరుటకుం గలకారణముమాత్రము వివరింపవలసియున్నది. దానికిఁ గారణము రాచిరాజు కేవలశూరుఁ డగుటయే కాక కృష్ణరాయనివలనఁ బరాజితుఁడైన వీరరుద్ర గజపతి కుమారుఁడగు వీరభద్ర గజపతియొక్క తోఁబుట్టువునకు భర్తయై యుండుటయు కొండవీటిలోని కేతవర దుర్గాధ్యక్షుఁడై యుంటయు నై యున్నది. అట్టిసంబంధ మున్నందులకుఁ గృష్ణవిజయములోని యీక్రింది పద్యము చాలియుండును. ఎట్లన్నను :—

సీ. నవభారతాఖ్యాననవ్యకావ్యమునకు, నాయకుం డయ్యె నేనరవరుండు
కటకేశ్వరునిచేతఁ గని కేతవర మాత్మ, పురముగా నేలె నేభూవిభుండు
నిలిపె భారహమన్నెనృపగండపెండేర, మెపుడు డాకాల నేన్నృపతిమౌళి
యఖిలసద్గుణవతి యక్కమాంబాదేవి, పాణిగ్రహీతుఁడయ్యె నేపార్థివుండు
ప్రథితగజపతిరాజ వీరప్రతాప, రుద్రతనయాధినాయకారూఢతమ్మి
రాజజనకతఁ గాంచె నేరాజతిలక, మతఁ డలరుతమ్మవిభురాచయప్రభుండు.

దీనింబట్టి రాచిరాజు వీరరుద్ర గజపతి యల్లుం డై, అతని కుమారుం డగువీరభద్ర గజపతికి బావమఱఁది అయియున్నాఁడు. వీరభద్ర గజపతి కృష్ణరాయనికి స్వాధీనుఁడైనను నీరాచిరాజు వీరరుద్ర గజపతి సేనలను వెంటఁ దీసుకొని బెజవాడ, వేఁగిదేశములకుఁ బోయి అక్కడ నుండు చిన్న సంస్థానములను దోఁపిడిచేయుచుఁ గృష్ణరాయనికి దూరదూరమున నున్నట్లుగా మఱికొన్ని కైఫీయతులవలనం గాన్పించు. అందులో నొకదానిలో నీపైవిషయముతోపాటు కృష్ణరాయల తూర్పుదేశపు దండయాత్రా విశేషములును ఇదివఱలో మనము వ్రాయుచున్న పాత్రసామంతాదుల స్థితిగతులును, వారిని కృష్ణరాయలు పట్టిన తెఱఁగును విస్పష్టముగా నున్నది. గనుక అవృత్తాంతము మట్టుకు

వివరించెదను. ఇది చర్విత చర్వణముగా భావించక పాఠకులు దీనిం జదువ శ్రద్ధాళువు లగుదురుగాక.

Local Records Vol. XIX page 125 to 188.

కైఫీయతు మవ్రుజే చామర్లకోట.

"కపిలేశ్వర గజపతి కుమారుఁడైనపురుషోత్తమగజపతి ఆంధ్రి కళింగ దేశముల ప్రభుత్వముచేసినాఁడు. ఈ యనకుమారుఁడైన ప్రతాపరుద్ర గజపతి కళింగాంధ్రదేశము లేలుచుండి పశ్చిమ ముదయగిరి పర్యంతము ప్రభుత్వముచేసిరి. ఉదయగిరి దుర్గములోను గజపతి వారితరపున తిరుమల దేవరాయ మహాపాత్రుని నుంచిరి. కొండవీటిదుర్గములోఁ బ్రతాపరుద్రగజపతి కుమారుఁడు వీరభద్రగజపతి, కుమారహంవీర పాత్రుని కుమారుఁడు నరహరిదేవు, శ్రీనాధరాజు రామరాజు, కుమారుఁడు లక్ష్మీపతిరాజు, జన్యామల కసవాపాత్రుఁడు, సుప్రపాల చంద్ర మహాపాత్రుఁడు, పూసపాటి రాచిరాజు, రాచూరిమల్లయఖాను, ఉద్దండఖానుఁడు, వీరుతగినసైన్యములతోనుండిరి. కళింగదేశపు ప్రభుత్వము చేయుచున్న ప్రతాపరుద్ర గజపతి కటకపురియందు సింహాసనస్థుండై ప్రభుత్వము చేయుచుండేవాఁడు."

"పశ్చిమరాజ్యమందు విద్యానగర పట్టణమందు నరపతి రాయ సింహాసన మునకు అధిపతులైన శ్రీమన్మహారాజాధిరాజ రాజపరమేశ్వర శ్రీవీరప్రతాప శ్రీవీరకృష్ణదేవరాయమహారాయలు సైన్యముతోఁ గూడ తరలిపోయి, ఉదయగిరి దుర్గము సాధించి, దుర్గముమీఁద నున్న తిరుమల రాతరాయ మహాపాత్రునిఁ బట్టుకొని, అక్కడనుండి సైన్యముతోఁగూడ కదిలివచ్చి వినుకొండ, బెల్లముకొండ, నాగార్జునకొండ, అద్దంకిఁ అమ్మనబ్రోలు, తంగేడు, కేతవరము మొదలయిన గిరిదుర్గ స్థలదుర్గములను సాధించి, కొండవీటికి విచ్చేసి దుర్గము చుట్టువాఱునడ చప్పరములు వెట్టించి, దుర్గము లగ్గలు విడిపించి అందుమీఁదనున్న పాత్రసామంతులను,మన్నె వారిని జీవగ్రాహముగా బట్టుకొని, వారికి అభయదానము నిచ్చి అక్కడినుండి విద్యానగరమునకు విజయముచేసి

శా. స. ౧౪౩౭ (A. D. 1515) అగునేఁటి యువనామసంవత్సరమందు కళింగదేశము జయించవలె నని విచ్చేసి కర్ణాటకదేశము విడిచి, జమ్మిలోయఁబడి కోననుంచి కొండామూర్గానను పొట్నూరునుండి వడ్డాదిమాడుగులు సాధించి, కటకమునీఁద మోహరముచేసి ప్రతాపరుద్ర గజపతితో యుద్ధముచేయఁగా గజపతి కటకపురి విడిచి పరారీ అయి లేచిపోయినాఁడు. తరువాతను సలహా అయి, నరపతికృష్ణరాయలకుఁ దనకుమార్తెను ఇచ్చినాఁడు. అంతట నరపతికృష్ణరాయలవారు తిరిగీ విద్యానగరమునకు లేచిపోయినారు. ''

"ఈప్రకారము జరుగుచుండఁగా రావువారనేకొండ జిల్లి, పశ్చిమరాజ్యమందు బెజవాడదగ్గఱ పూసపాటి మాధవర్మ అనేరాజు సహించలేక వారితో యుద్ధముచేసి అపజయము అయినవారిని గలగానుగల ఆడించి చంపించినాఁడు" అను మొదలగు సంగతులు వ్రాయంబడియున్నవి. ఇట్లుపూసపాటి మాధవవర్మ వృత్తాంతమే రావువారి వంశావళీ గ్రంథ మగువాసవదత్తా పరిణయ మనుపద్యకావ్యములోఁ గూడ వివరింపఁబడియున్నది. కావున పైవృత్తాంతము లన్నిటింబట్టి పూసపాటి రాచిరాజుమాత్రము కృష్ణరాయలవలన జీవగ్రాహముగాఁ బట్టుకొనంబడి నట్లుగాని పిమ్మట వదలివేయఁబడినట్లుగాని కానుపించలేను. తక్కిన పైశాసనాంశముల దృఢపఱుచునట్టిగాథ లీవఱకే మన మీచామర్ల కోట కైఫీయతులో వివరించియుంటిమి. గావున నింక నీశాసన విశేషములు వ్రాయమానెదను. అదివఱకు పూసపాటి రాచిరాజును పట్టుకొనుటకుఁ గృష్ణరాయండు యత్నించినను వీరరుద్ర గజపతితోఁ గల్గిన పై సవీనసంబంధముబట్టి తనకుఁ దోడియల్లుఁడైన కారణంబుననైన నాప్రయత్నము మాని మిన్నకుండకపోఁడు. ఇది రాచిరాజు వృత్తాంతము.

నెం ౮ శాసనము. శా. స. ౧౪౪౧ నం. సింహాచలము.

"స్వస్తి శ్రీ విజయాభ్యుదయ శాలివాహాన శకవర్షంబులు ౧౪౪౧ అగునేఁటి ప్రమాది నామసంవత్సర శ్రావణ శు. ౧౩ సోమ

హారాన శ్రీమన్మహారాజాధిరాజ, రాజపరమేశ్వర మూరురాయర గండ అరిరాయవిభాడ, భాషగిత ప్పవరాయరగండ, యవన రాజ్యస్థాపనాచార్య, శ్రీవీరప్రతాప కృష్ణదేవరాయలు విజనగర సింహాసనారూఢుఁడై సింహాద్రినాథునికి తమపేరిట భోగము నడిచేటందుకు ప్రతాప రుద్ర గజపతి మహారాయలచేతను పుచ్చుకున్న గ్రామాలు,కళింగ దండపాటలోని గ్రామాలు, పెదగాని గ్రామం, ౧. అగనంపూడి గ్రామం, ౧. అమ్మచెల్లెపల్లెలు, ౧. గంగవరంపల్లె, ౧. పిన్న అగనంపూడి పల్లె, ఉభయగ్రామాలు, ౨-కి సింహాగిరి అప్పనికి నడిచే భోగ బలిహరణం కట్టడి దినం ౧-కి శ్రీఅంగరంగ భోగానకు గంధం, ౧. పలం. అగరు, ౨. ప, కర్పూరం, ౧ చిన్నము. కస్తూరి ౨ చిన్నాలు. పన్నీరు ౪ చిన్నాలు. కుంకుమపువ్వు, ౧ చిన్నం. పువ్వులదండలు ౪. మాలెలు. ౪. నైవేద్యానకు బియ్యం పుట్టి, ౧. పకాళం తు ౨. పాయసం తూనికె, ౬. దోరలు. ౪. ఫేడాలు సోడీలు, ౮. సారసత్తులు, ౮. అరిశెలు, ౮. సాదుమనోహరాలు, ౮. చిన్నమనోహరాలు, ౪. నందిమొడ్డినం, ౮. అప్పాలు, ౮. హాసకేళీలు, ౮. కర్పూరకాలత్తులు బడాలు, ౮. కక్కరాలు (చక్కిలాలు,) ౪. వెరసి ౮౦ పానకాలు ౨. గట్టిగా కుంచం, ౧. నైవేద్యానకున్ను పేరాలమున్ను కూడా నైనవి యేడు తూములు, వడ్లు ఏఁడుమున్ను కుంచెఁడుపప్పు, పోఁకలు, ౫౦. తమల పాకులు, ౧౦౦ మిర్యాల సంబారాలు ౨౭. డబ్బులమెత్తు జాజికాయలు. ౧౦. ఇందుకు వైనము సత్రం ౩౦-కి బ్రాహ్మణభోజనం యీ ధర్మానకు యెవరు తప్పితే వారు గంగలో గోహత్యఁ బ్రహ్మహత్య మాతృ పితృహత్య చేసినపాపాన పోతారు.

శ్లో. స్వదత్తాం పరదత్తాం వా యో హరేత వసుంధరామ్,
షష్టి ర్వర్షసహస్రాణి విష్ఠాయాం జాయతే క్రిమిః.

అని యున్నపైశాసనమును బట్టి యీక్రిందిచారిత్ర మూహింపవలసియున్నది. ఎట్లన్నను. వెనుకటి శాశనమును బట్టి శా. ౧౪౩౫వ సంవత్సరములోఁ గృష్ణరాయలు కటకపుదండయాత్రకై బయలువె

డలి జమ్మిలోయ మార్గముగాఁ బోయి వడ్డాది మాడుగులు మొదలగు సంస్థానములం జయించి కటకముంగూడ స్వాధీనము చేసుకొని కటకేశుఁ డగు ప్రతాపరుద్ర గజపతికూఁతుం బరిణయంబై తిరిగి తనదేశమునకు నీశాసనకాల మగు ౧౪౪౧ సంవత్సరమునాఁటికి సింహాచలము వచ్చి యుండును. ఈసంవత్సరము చేసినశాసనములోఁ గొన్ని గ్రామములు సింహాచలస్వామి కిచ్చి యుండుటచేతను, వెనుకటి శాసనకాలము నాఁటికి భూదానము చేయలేక కేవలము ధనమునే సింహాచలేశ్వరునికి సమర్పించి యుండుటచేతను, కటకదేశజయము తొల్లిటి శాసనమునాఁటికి కాలేదనియు ౧౪౪౧ సంవత్సరముననే అయినదనియును నిశ్చయించవలసియున్నది. ఇందులోఁ బ్రతాపరుద్ర గజపతివలనఁ బుచ్చుకున్న గ్రామములు కళింగదండపాటలోనివి, అని చెప్పుటచేతఁ గృష్ణరాయలు ప్రతాపరుద్ర గజపతిని జయించినను, అతనిరాజ్య మతనికి తిరిగి యిచ్చివేసియుండె ననియును, తనయొక్క విజయమును జూపుటకుఁగా నా ప్రతాపరుద్ర గజపతి దేశములోని కొన్ని గ్రామములు తన స్వాధీనములో నుంచుకొని వానిని సింహాచలేశ్వరునకు సమర్పించె ననియు నూహింపవలయును. పైశాసనములు నాలిగింటిచేతను కృష్ణదేవరాయలు తూర్పుదేశమును జయించుటకై శా. స. ౧౪౩౭ లో బయలుదేఱి కొంతదేశమును స్వాధీనము చేసుకొని విజయనగరమునకుం బోయి తిరుగ ౧౪౩౮ సంవత్సరాంతమున వచ్చి ౧౪౪౧ సంవత్సరము సగమగువఱకు నుండెననియు నిదమైనపిమ్మటఁ గృష్ణా చెంగల్పట్టు జిల్లాలలోని కార్యములు జరుపుమ ౧౪౪౨ సంవత్సరమంతయు నుండి ౧౪౪౩ సంవత్సరములోఁ దిరుగ దేశములోఁ బ్రవేశించియుండు ననియు నూహింపనై యున్నది.

పైనుదాహరించిన శాసనములన్నియు (Col. Mackenzie Collections) లోనివై గవర్నమెంటువారి ఓరియంటల్ మ్యానస్క్రిప్టులైబ్రరీలోఁ జేరినవై యుండుటచేత నమ్మఁదగిన వనియును, వానివలన మనము పైని నిర్ధారణ చేసిన కథయంతయు విశేషదోషయుక్తమై యుం

డదనియుఁ జెప్పవచ్చును. ఇటులనే కృష్ణరాయని కాలములోని శాసనము లన్నియుం దొరికినఁ గొంతచారిత్రము తేలును. అవి దొరకుట సుగమముకాదు. కావున పై కళింగ దండయాత్రానంతరము కృష్ణరాయలు చేసిన విశేషములు గ్రంథాంతరములనుండి సంపాదించి సాధ్యమగునంతవఱకు వివరించెదను. ఎట్లన్నను :—

కామలాపురమునకు వాయవ్యము ౨ పరువులదూరమునఁ గోకట యను గ్రామమునకు ప్రతినామము కమలాజీ పుర మనునామము పొలిమేరలో వలయవామనముద్ర రాళ్లపై వ్రాసియున్నది. అవి జయసింగు మహారాజు వకీలు కమలాజీ యనువాఁడు అగ్రహారమును చేయించెను. అని స్థలవాసులు వాడుచున్నారు. తరువాత శ్రీకృష్ణదేవరాలలనాఁడు అల్లసాని పెద్దన్న అను ఆంధ్రకవీశ్వరుం డైననందవరీక బ్రాహ్మణుఁడు బహుప్రసిద్ధిగా మనుచరిత్ర మను ఆంధ్రప్రబంధమును చేసినాఁడు. ఆకవీశ్వరునకుఁ గృష్ణదేవరాయలు ఈకోటక మను గ్రామమును సర్వమాన్యాగ్రహారముగా ధారబోసి యిచ్చినాఁడు. ఈ కవీశ్వరుఁడు బ్రాహ్మణులకు సర్వాగ్రహారముగ నిచ్చి కోకటానికి ప్రతినామము శఠగోపపురము అని యీగ్రామాన వాకిటివద్ద యిరికిఱాతికి వ్రాసియున్నది. ఇదిగాక యీ కవీశ్వరుఁడు ఈగ్రామమునఁ జెన్న కేశవుని దేవాలయములో నిలువు రాతికి వేయించిన శాసనము అన్వయసారాంశము. "శాలివాహన శకవర్షంబులు ౧౪౪౦ అగునేటి బహుధాన్య సంవత్సర వైశాఖ శు. ౧౫ లు అల్లసాని చొక్కరాజుగారి కుమారుఁడు పెద్దయ్యంగారు కోకట సకలనాథునిలింగమునకు ఇచ్చిన భూదాన ధర్మశాసనము, శ్రీకృష్ణదేవమహారాయలు మాకును, ఘండికోట సీమలోను పుంబళికెపాలించ నవధరించిన కోకటగ్రామమందును సకలేశ్వరదేవుని నైవేద్యమునకును, దీపారాధనకును చేను ఖ ౨ ను సర్వసామాన్యముగా కృష్ణాతీరమందు బెజవాడ మల్లికార్జునదేవుని సన్నిధిని సోమగ్రహణ పుణ్యకాలమందు సహిరణ్యోదక దానధారా పూర్వకముగాను ధారవోసి యిస్తి మని వ్రాసియున్నది.

ఇందుకు దిగువనుండేది. శ్రీమన్మహాదేవుని నగరు కోకటం స్థళ కరణం కట్టము మంగ్రాజు తిప్పనకొడుకు ముమ్మంగ్రాజు కోకటం సక లేశ్వరుని నగరు ఈ బహుధాన్య సంవత్సరమునకు పునఃప్రతిష్ఠ శ్రీకారం మూలానను చేయించెను. అనిత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వ తః, నిత్యం సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మసంగ్రహః.

ఇదిగాక యీశాసనమువద్దనే యుండు రెండవశాసనము, ఈ శకసంవత్సరములో నీ కవీశ్వరునినాఁడే కార్తీక బ. ౧౨ లు కోకట ము చెన్నకేశవపెరుమాళ్లకు అల్లసాని చొక్కయ్యంగారి పుత్రుండు పె ద్దయ్యంగారు యిచ్చిన భూదాన ధర్మశాసనము క్రమ మెట్లన్నను:— కృష్ణదేవరాయలు ఘండికోట సీమలోను, మాకు వుంబళిగా నీయ నవధరించిన కోకటానను దేవుని నైవేద్యమునకును, దీపారాధనకును, మేము ఉత్థానద్వాదశి పుణ్యకాలమందు సమర్పించినచో చర్మంచేను ఖ ర. అని వ్రాసియున్నది.

శా. స. ౧౪౫౦ (A. D.) ౧౫౨౮.

కొండపల్లి మాలకాపురములమధ్య నొకఱాతిపలకయున్నది. అం దుపైని శా. స. ౧౪౫౦ గల యొక శాసనమున్నది. అది యొక తురు ష్కునివలనఁ గొండపల్లికోటను పట్టుకున్నందున నతిని సంతోషమును సూచించుటకుగా నొక సత్రము కట్టిననాఁటిదిగా నున్నది. ఈశాసన ము దానికిగా నీయంబడిన భూదాన ధర్మశాసనమై యున్నది. రెండవ శాసనములోఁ గృష్ణరాయ నిర్యాణము శా. స ౧౪౫౨ (A. D. 1530( అయినట్లు కానుపించును.

ఆదవాని సమీపి గ్రామవృత్తాంతములో శా. స. ౧౪౫౦లోని కృష్ణరాయని వ్యహార విశేషములం జెప్పుచు నాగ్రామము నింకను అభివృద్ధి నందించె నని చెప్పెము.

పైని వ్రాసిన తిప్పలూరు గ్రామము అష్టదిగ్గజ కవీశ్వరులకు స ర్వాగ్రహారముగా నిచ్చి నందులకు రెండుదాఖలా లున్నవి. వానిలో

తిప్పలూరు గ్రామమునకుఁ దూర్పుచొప్పవామిలో నున్న శాసనము:—

శాలివాహన శకవర్షములు ౧౪౫౦ అగునేటి సర్వజిత్తు సం॥ శ్రావణ బ. ౩౦ సోమవారము శ్రీకృష్ణదేవరాయ మహారాయలవారు అష్టదిగ్గజకవీశ్వరులకు ధారవోసి యిచ్చిన తిప్పలూరు అగ్రహారమందు దొమ్మర్లు ఇచ్చు పన్ను ఈగ్రామమున నున్న శివ, విష్ణువుల దేవాలయముల యొక్క ఆరగింపులకు సమర్పించిరి.

కామలాపురమునకు రెండుపరుగుల దూరమున నాగ్నేయమున కొప్పులూ రనుగ్రామము కృష్ణరాయలతో చదరంగమాడి గెలుచుకొనిన తిమ్మన్న యనునాంధ్రకవీశ్వరునకు బ్రాహ్మణునకు సర్వమాన్యాగ్రహారముగా నిచ్చెను. ఇందులకు దాఖలా యీకవీశ్వరునిచేతఁ జెప్పంబడినపద్యములో నున్నది. * అది యెట్లనఁగా :—

పారిజాతాపహరణములో

సీ. కౌశికగోత్రవిఖ్యాతుఁ డాపస్తంబ, సూత్రుఁ డార్వేలపవిత్రకులుఁడు
నందిసింగామాత్యునకును దిమ్మాంబకుఁ, దనయుండు సకలవిద్యావివేక
చతురుఁడు మలయమారుతకవీంద్రునకు మేనల్లుండు కృష్ణరాయక్షితీశ
కరుణాసమాలబ్ధఘనచతురంతయా, న మహాగ్రహారసన్మానయుతుఁడు
తే. తిమ్మయార్యుండు శివపరాధీనమతి య, ఘోరశివగురుశిష్యుండు పారిజాత
హరణ మనుకావ్య మొనరించె నాంధ్రభాష, నాదివాకరతారాసుధాకరముగ.

శా. స. ౧౪౬౫.

వేలూరులో నొక గొప్పకోట కలదు. ఒకదేవళమును గలదు. ఈ గుడి కట్టించినవా రనేకవిధములుగా ననేకులుగాఁ జెప్పంబడుదురు. కృష్ణదేవరాయలు నందులోని వారిలో నొకఁడు. ఇతఁడు (A. D. ౧౫౨౬-౨౭ (౧౫౦౯ శా. శ.) సంవత్సరములో దీనిం గట్టించిన ట్లున్నది. (ఈ కాలమునకు ౨౫ సంవత్సరముల క్రిందటనే కృష్ణరాయుని ర్యాణ మగుటంజేసి పై సంవత్సరము తప్పు) కృష్ణదేవరాయలకుఁ బూ

* ఇది పొరపాటు. ఈపద్యమున నాసంగతియే లేదు. రాయలతోఁ జదరంగ మాడి మెప్పువడసినది మఱియొక తిమ్మన.

ర్వ మిఁసువదియైదు సంవత్సరముల క్రిందట నొకరెడ్డి అక్కడ కోటఁ గ ట్టించినట్లు వాడుక గలదు. అపు డాకాలము శా. స. ౧౪౪౫ సమీప కాల మగును. కృష్ణరాయ లీయూర నుండుసూర్యగుంటచెర్వు త్రవ్వించెను. ఆయనభార్య కృష్ణాజీ అమ్మ యొకగ్రామమును రెండు దేవాలయములును దీని సమీపమునఁ గట్టించెను. మఱియొక కథలోఁ గృష్ణరాయని చాకలివాఁడును, బారికవాఁడును గొండ పై నుండుకోటలఁ గట్టినట్లు వాడుక గలదు. వారిపేరిటనే అవి నేఁటివఱకుం బిలువఁబడు చున్నవి. మఱి కొందఱి మతములో నీరెండు కోటలును మహారాష్ట్రులవలనఁ గట్టబడినట్లున్నది.

పురటూరు గ్రామమునకుఁ దూర్పు రెండు పరువుల దూరమున కోడూరు గ్రామము మజరా భూమెపల్లిగ్రామము శ్రీకృష్ణరాయలకుఁ గొడుగుపట్టెడు గొడుగుభూమానాయఁడు అనునాయన కోడూరు గ్రామమున కాగ్నేయభాగము సామీప్యమున తనపేరితో పల్లెకట్టించి తెలికిచెర్ల గోపాలాచార్యులకు నేకభోగసర్వమాన్య అగ్రహారము లో నిచ్చెను. ఇందుకు దాఖలా యీ భూమెపల్లె పొలిమేరలో వలయు వామన ముద్ర చెక్కి దిగువ వ్రాసియుండునది :—

"శ్రీమతే రామానుజాయనమః తెలికచెర్ల గోపాలాచార్యులకు నేకభోగపుసర్వమాన్యము అగ్రహార మైన భూమానాయని పల్లెకు ప్రతినామ మైనవేదాంతాచార్యపురమునకు వలయశాసనము వామన ముద్ర స్తంభము."

చంద్రగిరిపరిపాలకుల మాకీఖత్తు యాదవవంశస్థుల చరిత్రముగా కృష్ణరాలయవంశములో నుండెడు రాజుల చరిత్రములం జెప్పెడు వ్రాఁతమూలములాకోట నున్నవి వానినుండి సంగ్రహించఁబడినది, తరువాత కాలములో యాదవరాజులలోనియొకప్రభుఁడు విజయనగరము దండయాత్రకై యత్నించి కృష్ణరాయని అధికారబలములను, అతని ఠాఁబడిని తెలుసుకొని యాప్రయత్నము మానుకొనియెను. అందు

లోఁ గృష్ణరాయని దిగ్విజయవిశేషములు సంగ్రహముగా వివరించఁబడినవి. గజపతిరాజు తనకొమార్తెను కృష్ణరాయని కిచ్చి వివాహము చేసి సంధి చేసుకొనె నని చెప్పవలసియున్నది.కృష్ణరాయని మరణకాల మందులో శా. స. ౧౪౫౨(A.D.19th November,1531) కార్తిక శు. ౮ అని యున్నది. ఈతేదీ పొరపాటు కావచ్చును.

శా. స. ౧౪౪౩ (A. D. ౧౫౨౧)

వల్లభాపురములో కృష్ణదేవరాయనివలన తుంగభద్రానదికి అడ్డముగా వంతెన కట్టఁబడినట్లున్నది. ఇది శా. స. ౧౪౪౩ లో జరగినది. దీనికి దాఖలా ఆవంతెనకు రెండు వైపుల నుండు రాళ్లపైని శాసనములు చెక్కఁబడినవి.

page 484.

## ➻ కృష్ణదేవరాయలు పెక్కు కోటలం బట్టుకొనుట. ➻

ఓరుగల్లు రాజులవృత్తాంతములోఁ గృష్ణరాయలు విజయనగరములో రాజ్యము చేయుచు కొండవీడు, కొండపల్లి, ఇనమకొండ బలవకొండ, నాగార్జునకొండ, మొదలగు కోటలను బట్టుకొనియెను. అతఁడోరుగల్లులో నుండుతురుష్కులం జయించి ఆస్థలము న్నాక్రమించుకొనియెను. అతఁడు తాకతీయవంశస్థులకు భుక్తికి నదిపదుమట్టుకు నిచ్చెను. అచ్యుతరాయనికాలములోఁ గూడ నోరుగల్లతనిక్రిందనే యుండెను. రామరాయలును సదాశివరాయనితో సమానాధికారిగా నుండెను.

page 656.

## ➻ కృష్ణరాయలు తనరాజ్యమును దొమ్మిది ఖండములు చేయుట. ➻

కమలాచల నామాంతరము గలగోవిందగిరి క్షైత్రీచుతు.

గోవర్ధనగిరిచుట్టును ఎనిమిదికొండలు గలవు.ఇవి యన్నియుఁ గలిసినచో నావర్వత మష్టదళపద్మమువంటి యాకారము కలదిగాఁ గానుపించును. ఈదేశములో నెనుబదియొక్క(౮౧)కోటలు గలవు. వీనిని పాచీనకాలములో మకుటవర్ధనరాయఁడు, విక్రమార్కుఁడు, శాలివాహనుఁడు

అను రాజులు పాలించిరి. శకవత్సరము ప్రారంభమైనపిమ్మట దక్షిణదేశమున కధిపతులు విజయనగరములో నుండెడు నరపతిరాజులై యుండిరి. ఈ వంశములో నలువదినల్గురు (౬౪) పురుషు లుండిరి. (ఇది తప్పుగాఁ దోఁచును) ఆయలువది నల్గురిలో నరసింగరాయఁడు ప్రధానుఁడు. ఇతఁడు యాదవ వంశస్థుఁడు. విజయనగరముం జయించెను. అతఁడు తనస్వాధీనములో మూఁడుకోట లుంచుకొనెను. నరసింగరాయని కుమారుఁడు కృష్ణరాయలు. అతనిమంత్రి సాళ్వతిమ్మన్న. అతని సహాయము వలనఁగృష్ణరాయలు నలుబది (౪౦) కోటలఁ జయించెను. శా.స.౧౪౫౧ (ఇది శా. స. ౧౪౬౧ - ౨ కావలెను) వఱకును రాజ్యము చేసెను.

కృష్ణరాయలు దేశమంతయు నొక్కఁడుగాఁ బాలించుటకు నదివిస్తీర్ణతలో మిక్కిలి అధికమూటచేఁ దనమంత్రి నడిగి యతని యనుమతిపైని దానినంతయుఁ దొమ్మిది ఖండములుగా భాగించి యొక్కొక రాజప్రతినిధిని (Viceroy) నియమించి పంపెను. ఇట్టిఖండములలోఁ గర్ణాటదేశ మొకఖండ మై యుండెను. దీని పరిపాలక రాజప్రతినిధి (Governor and Viceroy) ధర్మానాయకుఁడు. అతని వంశస్థులు శా. స. ౫౨౦ మొదలు శా. స. ౬౯౪ వఱకు నుండిరి (ఇందలికాలనిర్ణయము తప్పు.)

శా. స. (౬౭౦ మొదలు ౭౧౨ వఱకును ద్రవిడదేశము గొండ చోళరాయలు పై తొమ్మిదవ ఖండము గైకొనెను. శా. స. ౭౧౧ మొదలు ౭౨౦ వఱకును బాలించెను. పర్వతరాయలు శా. స. ౭౨౧ మొదలు ౭౫౦ వఱకును, గోవిందరాయ, అచ్యుతరాయ, విద్యాధరరాయ లనువారు శా. స. ౭౫౧ మొదలు ౯౦౦ వఱకును బరిపాలించిరి. చిక్కరాయలు ౯౦౧ మొదలు ౯౭౧ వఱకుం బాలించెను. శివానీసముద్ర మాధవరాయలు శా. స. ౯౭౧ మొదలు వేంకటపతివఱకును, అతనివంశములో (౧౦౫౦) వేంకటపతిరాయలు వ్యవహరించెను. సోమశేఖరరాయలు ౧౦౫౧ మొదలు ౧౧౧౦, ఆనగొండె

రాయలు ఇంతవఱకు నతని వంశ్యులు పాలించిరి. శా. స. ౧౨౮౦ చివర వఱకును దేశము అ రాజకముగా (ప్రభువు లేకుండ) నుండెను. శా. స. ౧౩౦౦ మొదలు ౧౩౪౦ వఱకును ఇమ్మడిరాయ లతనివంశ్యులు, శా. స. ౧౩౪౧ మొదలు ౧౩౮౪ వఱకుఁ బాలించిరి. నంజరాయలు ౧౩౮౫ మొదలు ౧౪౧౬ వఱకు గోవర్ధనరాయలు పాలించెను. జయదేవరాయలు దేశ మాక్రమించుకొని శా. స. ౧౪౫౨ వఱకును పాలించెను. ఇమ్మడి జగదేవరాయలు ౧౫౧౫ చివరవఱకుం బాలించిరి. కుమారజగదేవరాయలు శా. స. ౧౨౨౨ వఱకుం బాలించిరి. (ఇందలి కాల మేలెక్కకును సరిపడియుండలేదు.)

page 527.

నెల్లూరిజిల్లాలోని మముతులూరుగ్రామకైఫియ్యతులోఁ గృష్ణదేవరాయలు గజపతిరాజుం జయించినప్పుడు లాకరాజు, చిట్టమరాజు, నారాయణరాజు, అను ముగ్వురను ఆస్థలమందుండి వ్యవహరించుటకుఁ బంపెను. ఆ ముగ్వురిలో ప్రతిమనుజుఁడును తనపేరితో నొక్కొకమండలము నేర్పఱిచిరి.

కామలాపుర వృత్తాంతములో:—

కామలాపురమునకుఁ బడమర నొక పరుగు దూరమున చదిపిరేల అను గ్రామమును బ్రాహ్మణులకు సర్వాగ్రహార మిచ్చినందులకు దాఖలా చదిపిరేల గ్రామమున అగస్త్యేశ్వరుని ప్రాకారము లోతట్టుకాతికి శాసనమున్నది. అందలి యక్షరములు శిథిలమైనవి. ఆ శాసనములో నాగ్రామస్థుల గోత్రము, సూత్రము, వారి వారికి నిర్ణయించిన వృత్తులు వివరముగానున్నవి. మధ్యమధ్య నక్షరములు చెడిపోయినవి గ్రామస్థులు కృష్ణదేవమహారాయలనాఁడు ధారాగృహీత మైనఅగ్రహారమని వాడుకొనుచున్నారు.

ఈ చదిపిరేల గ్రామమునకు దక్షిణమున జమ్మాపుర మను నగ్రహారమును కృష్ణదేవరాయలనాఁడే బ్రాహ్మణుల కీయఁబడె నని

వాడుక గలదు. ఇంతియే కాక దాఖలా యున్నది. అది యెద్దియనఁగా సీగ్రామముయొక్క పొలిమేరలోని రాళ్లపైని జమ్మలమడుగుపురమునకుఁ బ్రతి నామమగు శ్రీరామానుజపురము (కృష్ణరాయపురము) పొలిమేర అని వ్రాయఁబడియున్నది.

page 39.

కృష్ణరాయలు కర్ణాటకదేశమును జయించి విభజించుట.

కర్ణాటక రాజ్యవృత్తాంతములో వీరవిజయ రాయలు లా దేశమునకుఁ బ్రభుఁడుగా నున్నట్లు కలదు. వెల్లాలరాయర్ ఫసలీ ౭౧౦ లో వ్యవహరించెను. త్రినామలిగుడుకిఁ గొన్ని కార్యముల నతిశయముగాఁ జేసెను. అతఁడు రాయల వంశస్థులకుఁ బన్ని చ్చుచుండెను. అతఁడు పడిపోయిన యనంతరము దేశము చిన్నచిన్న ఖండములుగా విభాగింపఁబడి ప్రత్యేక ప్రభువులస్వాధీనమాయెను. అనంతర మది కృష్ణరాయనికి స్వాధీనపడెను. ఇతఁడు కర్ణాటకదేశమున నొక గొప్పసేనను బంపెను. అది ౧౦౦ ౦౦౦ (లక్ష) జనము కలదై యుండెను. దానిలోని సేనాజనులు. ౧. విజయప్పనాయఁకుఁడు, ౨ తుపాకీ కృష్ణప్పనాయకుఁడు, 3 విజయరాఘవ యకుఁడు, ౪ వేంకటప్పనాయకుఁడు, నై యుండిరి. ఫసలీ ౮౭౦ లో విజయనాయకర్ విశేషముగాఁ బన్ను వసూలుచేసెను. అతఁడు వెల్లూరికడ విడిసియుండెను. చిత్తూరి పాళెగాఁడును తొండమండలములోని యితర పాలెగాండ్రును విజయప్పనాయకునితో భేటీ చేసిరి. అతఁడు పైవారలు ఇచ్చుకోవలసిన పన్నులు నిర్ధారణచేసెను. ఇతర పాలెగాండ్రతోటిపాటు కాళహస్తిప్రభుఁడగు బొమ్మిరెడ్డి వృత్తాంతముగూడ జెప్పంబడెను. రాయలయొక్క సర్దారుఁడు వేలూరినుండి జింజీపట్టణమునకుం బోయెను. చోళమండలములోని పాలెగాండ్రు ఆసర్దారుని గలుసుకొనిరి. అప్పటిలో వా రియ్యవలసిన కప్పములు నిర్ణయించఁబడెను. విజయప్పనాయకుఁడు జంజీలోనే తనసేనలతో నుండెను. అతఁడు దానిక్రింద నుండు ప్రభువు లగు పాండ్య, చోళ, చేరరాజుల దేశములకుం

బోయి కప్పముల నిర్ణయించి వచ్చెను. తంజావూరు, తిరుచునాపల్లి, మధుర, తిరునగరు రాజులు పైసర్దారుని యిష్టానుసారముగా వ్యవహార కట్టుబాటులకు నంగీకరించిరి. ఈప్రకారముగాఁ దూర్పున నుండుకర్ణాటకదేశము (మయిసూరు మొదలగునవి చేరని దేశము) రాయలయధికారముక్రిందికి వచ్చెను. ఈ దేశమువలన రాయలకు మూఁడు కోటులు రూపాయిలు వచ్చెడివి ఆ దేశమంతయు మూఁడుఖండములుగా నేర్పఱుపఁబడినది. ఆమూఁటిని బరిపాలించుటకు ముగ్గురు పరిపాలకులు (Governors) నియమింపఁబడిరి. జింజీలో నుండుకృష్ణప్పనాయకుఁడు నెల్లూరు మొదలు కొల్లడం (Colaroon) నదివఱకును బరిపాలించుచుండెను. తంజావూరిలో నుండెడు విజయరాఘవుఁడను. నతఁడు కావేరీనది ప్రవహించుటవలన ఫలవంత మై యుండిన దేశ మంతయుఁ బాలించెను. దానికి దక్షిణముం దుండుదేశమంతయు వేంకటప్పనాయకునివలనఁ బాలింపఁబడెను. ఇట్టిరాయల యధికారము చెడఁగొట్టుటకు దురుష్క ప్రభువులు కొంద ఱేకీభవించిరి. రాయలతాలూకు రాజప్రతినిధి (Viceroy) అతనిసేనలతోఁగూడ రాయలనన్నిధికిం బోవ నాజ్ఞాపింపఁబడెను. అది మొదలు జింజీలో నున్న తుపాకీనాయకరు తనస్వాతంత్ర్యముం బ్రకటింప నారంభించెను.

## Page 691.

### కృష్ణ రాయనికిఁ గల్గినశాపము.

ఆనెగొందెకైఫీయతులో నీక్రింది వృత్తాంతము లున్నవి—

కృష్ణరాయలు నర్మదానదికి దక్షిణముం దుండుదేశమంతయు జయించెను. అతనికి లక్షసేన లుండెను. ఆనెగొందె సర్కారునకు లోఁబడియుండెడు నొకసామంతప్రభుఁడు దానిక్రింద నుండునిరువదికోటలు గల దేశమును బాలించుచుండును. కృష్ణరాయని యేనుఁగుబలమంతయు పతనివశములోనే యుండెను. అట్టి సామంతప్రభుఁడు కృష్ణరాయనివలన నొక సమయములో నానె గొందె విడిచి మఱియొక స్థలమున

కుం బోవ నాజ్ఞాపింపఁబడియెను. ఆవృత్తాంతము వినినయిర్వురు గోసాయీలు కృష్ణరాయనితో నాసామంతప్రభుఁడు ధర్మాత్ముఁడనియు నతనిని దేశాంతరమునకుఁ బంపకుఁ డనియు విన్నవించుకొనిరి. కృష్ణరాయలు కనికరములేనివాఁడై సాధులబోధ లక్ష్యములేనివాఁడై ఆసామంతుఁడు దేశాంతరము పోక తప్ప దనితీర్మానించెను. అపు డాయిర్వురుమహాత్ములును కృష్ణరాయనికిఁ గొన్నినీతు లుపదేశించిరి. అట్టివానిని వినియైనను లక్ష్యము సేయక కృష్ణరాయలు వారిని వదలి పొమ్మని యాజ్ఞచేసెను. అపు డాసాధువులు కోపముతోఁ గృష్ణరాయలు సంతానహీనుఁ డౌఁగాక యనియును, అతని సింహాసన మెక్కుటకు న్యాయమగువారసుఁ డుండక పోఁగాక యనియు శపించిరి. వారిశాపానుసారముగనే కార్యములుజరిగె నని కలదు.

## కృష్ణరాయుని యల్లునకుఁ గల్గినలోపము.

ఇటులనే కృష్ణరాయని యల్లుఁడగు రామరా జధికారము చేయుచుండఁగా నొక తురుష్కుఁడు (ఫకీరు) హిందువులు గౌరవించెడు నొక సరస్సులో స్నానముఁ జేయుచుండెను. అపుడు రాజభటు లా ఫకీరును బట్టుకొని రామరాజుకడకుం గొంపోయిరి. ఆఫకీరుతో నతని మతస్థు లిర్వు రుండిరి. అపుడు రామరాజు వారి ముగ్వురం గొట్టించి వస్త్రవిహీనులం జేసి వారిని ప్రాణములతో వదలిపెట్టెను అపు డాఫకీరులు ఢిల్లికిఁ (ఆకాలమున తురుష్కప్రభువుల లాజధాని) బోయి విజయనగరమును స్వాధీనము చేసికొనననినాఁడు ఢిల్లీప్రభువులు తురుష్కమతస్థులు కాకపోదు రని వట్టుబెట్టిరి. ఇట్లు ఫకీరులు పెట్టినమొఱ లాలించి ఆతురుష్క ప్రభువు లవుడే విజయనగరముపై దండెత్తుటకు సన్నాహములు చేయ నారంభించిరి, పిమ్మట విజయనగరము వారివలన ముట్టడింపఁబడెను. అది అయినపిమ్మట రామరాజు వంశస్థులలో మఱికొందఱు అనెగొందెపైఁ గొంత కాలమువఱకును గొంచె మధికారము కల్గియుండిరి. రామరాజువంశస్థులలోనివారు టిప్పుసుల్తానుకాలములో నానెగొందె విడిచి పోలాపురమునకు లేచిపోయిరి. వా రిప్పటికి నచ్చటనే యున్నారు.

Mr, Taylor's Catalogue Raisonnee Vol III.

Page 55.

పై గ్రంథకర్త తాను చేసిన (Analysis) అను గ్రంథములోఁ కృష్ణరాయని గుఱించి కొంత వివరించితి నని చెప్పెను.

Page 191

నెం. ౬౫౬ లో కృష్ణరాయ అగ్రహారముయొక్క చెఱువువిషయము చెప్పంబడినది. ఈగ్రామములో నుండెడు చెరువులు మూఁడును తెగిపోవుటచేత నచ్చో నుండెడు బ్రాహ్మణ కరణములు కృష్ణరాయుని సహాయార్థమై వేడుకొనిరి. కృష్ణరాయలు మిక్కిలి యౌదార్యముతో వారు గోరిన సహాయముం జేసెను.

Pagə 400. (Catalogue Again.)

కూరంబరు లనుపేరుగల యొక యారణ్యక శాఖామనుజుల వృత్తాంతమును దెల్పెడు నొకపుస్తకము సన్యాసికృత మైనది కలదు. దానిలో నీప్రజలయధికారము ఆదొండెచక్రవర్తి అధికారము దనుకను జైనమతము ప్రబలువఱకు నున్నట్లు చెప్పంబడును. ఇంతియకాక యీ ప్రజలయధికారము కృష్ణరాయల అధికారమువఱకును బ్రబలముగా నున్నందులకు దృష్టాంతములు గలవు. వీరు గర్విష్ఠు లై యుండుటంబట్టి వేళ్లాలరు లనుజాతిప్రజలు కూరంబరుల సంహారించుటకుఁగాను ముందర నారణ్యకులం బంపిరి. కృష్ణరాయల సేవలును, విద్యాలవా రను పాలగాండ్ర సేనలును గూడి కూరంబర జాతివారిని మూలముట్టుగ సంహరించిరి.

Page 430.

Cullattur (కల్లత్తూరు) అను గ్రామములోని ప్రాచీనము లైన బంగారు పంట విషయము చెప్పుచు నీగ్రామము కూరంబరులయొక్క రెండవకోట గలదని చెప్పెను. ఆదొండచక్రవర్తి వారిని జయించినపిమ్మట ఆ కోటను పదిమంది స్వాధీనములో నుంచెను, వారిలో కొండయికట్టవేళ్లాలరు నుండెను. వీఱందఱు రాజునకుఁగ్రింది వారుగానుండి దేశమును

పాలించిరి. ఒకబీద పురోహిత బ్రాహ్మణుఁడు తిరువల్లేశ్వర కోవెలకు వచ్చెను. వచ్చి కల్లత్తూరులో నొకభూమిని నిలిచెను. దేవుఁ డొకనాఁ డా బ్రాహ్మణునకుఁ గాన్పించి యాభూమి దున్నించినపుడు తనతోఁ జెప్ప మనికోరెను. ఆబ్రాహ్మణుఁడు నట్లు కావించెను. అపుడు దేవుఁడువాహనముపై నెక్కివచ్చి గుప్పెడు విత్తనములు చల్లి అంతర్ధానము నందెను. తక్కిన విత్తనము లాబ్రాహ్మణునివలననే విత్తఁబడెను. ఆ సస్యము మిక్కిలి గోవగా నెదిగెను. ఆచుట్టుపట్ల నుండెడు నితరుల సస్యములు నీరసముగా నెదిగెను. బ్రాహ్మణుని సస్యము మనుష్యున కందనంత యెత్తు ఆయెను. కాని వెన్నుమాత్రము వేయక యుండెను. దాని కా బ్రాహ్మణుఁడు మిక్కిలి చింతించెను. తోవంబోవు నొక వెల్లాలరు వాఁడు పైసస్యముయొక్క యొక దంటు తీసి విప్పిచూచెరు. అపుడందులో నొకబంగారువెన్నుండెను. అంతట వాఁ డాబ్రాహ్మణునితోఁ దనసస్యముతో నతని సస్యము మార్చుకొ మ్మని కోరియొప్పించి దానికి వ్రాఁతమూలముల నేర్పఱచెను. ఇట్లుండఁ జిరకాలమున కాసస్యము వెన్నులు వేసెను. భూమియును బంగారురంగును బూనెను. ఆ వృత్తాంతమాకాలములో నాదేశముం బాలించుచుండిన హరిహరరాయలు విని సేనాపరివృతుఁడై వచ్చి సస్యముం గోయించి నూర్పించి దానిని విభాగించి యొకపాలు వ్యవసాయకునకు, నొకపాలు భూస్వామికి, నొకపాలు రాజునకు నిర్ణయించి యెవరిది వారి కిచ్చి తనపాలు తాను గైకొని పోయెను. పైదినుసు యిటుకలతోఁ గట్టఁబడిన చప్టాపై నూర్చఁబడినది. ఆచప్టాకే కళ్ల మని పేరు. దానింబట్టి ఆ గ్రామమునకు పఱవెలెనాత కళ్లత్తూరు, అనగా బంగారము సస్యముగఁ బండునది. అని యర్థము. పైగ్రామములోని కోట తొండమాను చక్రవర్తి కాలము మొదలు కృష్ణరాయని కాలమువఱకును వెల్లాన్ హార్, అనఁగా వ్యవసాయదారులను జాతివారి క్రింద నుండునది. ఆ జాతివారితోఁ గృష్ణరాయలు బ్రాహ్మణుల కొక యగ్రహారము కట్టి యియ్యుమని ఆజ్ఞాపిం

చెను. అపు డాజాతివారు దానిం జేయమని తిరస్కరించి పలికిరి. దానికిం గోపించి కృష్ణదేవరాయలు వారిపై దండెత్తిపోయెను. ఆ యిర్వురకు నాలుమాసములు మహాయుద్ధమాయెను. అందు పైజాతిప్రజ లనేకులు కృష్ణరాయని వలన సంహరింపఁబడిరి. అపు డాప్రజలు కృష్ణరాయని తో సంధిగావించుకొనుట మంచిదిగా నెంచి కృష్ణరాయనియాజ్ఞానుసారముగ నగ్రహారము కట్టి యిచ్చుట కంగీకరించిరి. ఇదియునుగాక రెండు సత్త్రములును గట్టి యందొక దానికిఁ గృష్ణరాయని నామ ముంచి ప్రకటించిరి.

## Page 524.

కాంచీపురముయొక్క కైకీయతులో జైనులను శంకరాచార్యుల వారు కొట్టి హిందూమతమును స్థాపించె ననియు నిప్పటికిని జైన కాంచి యనుచిన్నయూ రున్నట్లును, జైను లచ్చో నున్నారన్నందులకు గృష్ణరాయనివలనఁ గట్టింపఁబడిన గోడలలోపలను, దేవళములలోపలఁ గూడ జైనవిగ్రహాదులు లుంచఁబడియున్నవి.

### కృష్ణరాయ విజయకథా సంగ్రహము.

౧. తురుష్కులను జయించుట, ౨. ఒరిస్సారాజకూఁతుం బరిణయమగుట, ౩. సింహాసన మెక్కుట, ౪. గజపతిని క్షమించుట ౫. తురుష్కులపై యుద్ధమునకు వెడలుట, ౬. సేనానులు లోఁబడుట, ౭. అహమదు నగరమును గైకొనుట, ౮. గుణాగుణ విచక్షణము, ౯. సాళువ తిమ్మరుసు(లేక అప్పాజీ) అను నతఁ డతనిమంత్రి. ౧౦. శిదావిఖాన్ తో ఘోరముగాఁ బోరాడుట మొదలగు వంశము లున్నవి.

ఈ గ్రంథము కృష్ణదేవరాయలు తురుష్కులతోఁ జేసిన యుద్ధ వివరమును, తరువాత వారిం జయించిన రీతియును, గజపతిరాజు అనఁగా నోఢ్రిరాజు కుమార్తెను కృష్ణరాయలు వివాహము చేసికొనివారితోఁ జేసిన సంధివిశేషములను విస్తరించుటకునై యున్నది. తురుష్క

లను జయించిన పిమ్మట వారితో స్నేహముగా నున్న గజపతి అధికారము తగ్గించుట అవసర మని కృష్ణదేవరాయనివలన నూహింపఁబడెను. మొదటయుద్ధారంభమైనది. కాని యితరచిక్కులు కల్గుటచేత రాయని యొక్క ముఖ్య మంత్రి యగుఅప్పాజీ చెప్పిన ఆలోచనము ననుసరించి గజపతితో సంధిచేయుటకుఁ బ్రయత్నము చేయంబడెను. అపుడు గజపతి తనకుమార్తెను కృష్ణరాయల కిచ్చి వివాహముచేయుట కంగీకరించెను. అటుపిమ్మట దేశానుచారముగఁ జిలుక రాయబారము వచ్చిన ట్లును అది రాయనితో గజపతి కూఁతువృత్తాంతమును సౌందర్యాదులును జెప్పినట్లు నుండి పిమ్మట అట్టివృత్తాంతముల ననుసరించి వివాహమును జరుపఁబడె నని యున్నది.

## కథావిశేషములు.

ఈ గ్రంథము వెంగయ్య కవివలనఁ జేయంబడినది ఇతఁడు కాలయ యను నతని కుమారుఁడు. హాఁవాడిచిన వేంకటభూపాలుఁ డీగ్రంథమునకుఁ గృతిపతి. అతఁడు కృష్ణరాయని చారిత్రమంతయుఁ గావ్యముగాఁ జేయఁగోరెను. గ్రంథారంభములో విజయనగర పట్టణముం గూర్చి వ్రాసెను. అనంతరము కృష్ణరాయని తండ్రి యగునరసింహరాయని చారిత్రవిశేషములు వివరింపఁబడెను. అటుపైని నరసింహరాయఁడు విద్యారణ్యస్వామియొక్కయు విరూపాక్షేశ్వరుని యొక్కయుఁ బ్రభావముం గూర్చి సంప్రశ్నించినట్లును, దానికి సమాధానము చెప్పుటలో విజయనగరము కట్టుటకు పూర్వ మున్నవిద్యారణ్యుని చర్యలును వివరింపఁబడినవి. అవి యన్నియు నీక్రింది విధంబుగా నుండును. ఎట్లన్నను:—

ఈశ్వరుఁడు విద్యారణ్యుల యవతార మెత్తెను. ఆవిద్యారణ్యులనంతరము శంకరాచార్య పీఠారోహణముఁ జేసెను. విద్యారణ్యులు లక్ష్మినిగూర్చి తపస్సుచేసి ఆమెకటాక్షము నంది ఆయడవిలో నొకపట్టణము తనపేరిటఁ గట్టెను. అది లక్ష్మికి నివాసస్థానముగాఁ జేయంబ

డినది. మొదట లక్ష్మీదేవి అతని నొకస్థల మన్వేషించు మని కోరెను. అతఁ డప్పుడు తుంగభద్రానదీతీరమునకుఁ బోయి అచ్చో విరుపాక్ష దేవు నాలయముం జూచి ఆస్థలమాహాత్మ్యముం దెలిసికొని అది రామాయణములోని యొకయితిహాసముం దెల్పుస్థల మవుటం జేసి అది నివాసార్హ మని భావించెను. ఆ పర్వతముపైకి సుగ్రీవుఁ డెక్కఁగా వాలి యెక్కలేకపోయెనఁట. మాల్యవంత మనుపేరుతో నైదుపర్వతము లచ్చో నుండును. యమకూటము, బసవశృంగము, మతంగ పర్వతము, కిష్కింధ అనునవి మిగిలిన నాల్గుపర్వతములు నై యున్నవి. అచ్చటి వారందఱు నాప్రదేశము నివాస యోగ్యమైన దని విద్యారణ్యులకుం దెల్పిరి. ఆసమయమందున నొకచెవులపిల్లి యొకసింహముం దఱుమఁగా నద్దానిని విద్యారణ్యు లీక్షించెను. అట్టి దాని కాశ్చర్యము నంది అది శూరులకు ముఖ్యస్థానముగా నిశ్చయించెను. ఆస్థలమం దొక పట్టణముం గట్టి విద్యారణ్యస్వామి దానికిఁ దనపేరిట విద్యానగరమ నునామం బుంచెను.

ఈ పైగ్రంథములో మఱికొన్నికథలు తెల్పంబడిన యనంతరము నరసింహ రాయ లనురాజు పైస్థలవిశేషముల విని తనమంత్రి యగునప్పాజీని పిలిచి తనకుమారుఁ డగుకృష్ణరాయని ఆస్థలమందు పట్టాభిషేకము చేయు మని చెప్పెను. ఆమంత్రియు నటులనే కావించెను. కృష్ణరాయ లప్పాజీని రాజకార్యములలో సహాయము చేయఁగోరుచుండెను. అప్పాజీ యట్లే చేయుచుండెను. అనంతరము కృష్ణరాయలు తనరాజ్యములోని కోటలును, ఇతరము లైన దుర్గస్థలములను జూడఁగోరెను. పిమ్మట ననేక రాజకీయ వ్యవహార విశేషములఁ బూర్ణముగాఁ దెలిసికొని రాయ లట్లుగా విన్నసంగతులు యథార్థము లగునో కావో కనిపెట్టుటకు మాఱువేషంబునఁ దిరుగుచున్న కాలములోఁ గృష్ణరాయ లొకప్పెడొక బ్రాహ్మణులయింటి వద్ద ప్రచ్ఛన్నముగా నుండెను.

అప్పు డతని హరకారులు వచ్చి అతనితో మాట్లాడుచుండుట

చూచి అతఁడు రాజుగా గ్రహించి అచటి బ్రాహ్మణులు కలిసి అతఁ డట్లు వచ్చుటకుఁ గారణ మే మని అతనినే (రాయలను) సంప్రశ్నించిరి. దానికి రాయలు సమాధానముగా నది దుష్టశిక్షణార్థము శిష్ట రక్షణార్థముగా నని వివరించెను.

సాళువ తిమ్మన్న యనుమంత్రి కృష్ణరాయనికి విశేషధన నిక్షేపములఁ జూపెను. అట్టి సమయములోఁ జారులుగా నుండుహరకారలు విజయపురము ప్రభునియొక్కయు (Bejapoore) నైజామునియొక్కయు వ్యవహారములు కొన్నిటిం గృష్ణరాయనికిం దెల్పిరి. నరసింహరాయని సింహాసనమునకుఁ గృష్ణరాయలు వచ్చెననుమాట పై సంస్థానముల ప్రభువులు విని భయాక్రాంతులగుటంజేసియో లేక సహింపఁజాలకనో గాని నైజామును గజపతిరాజును విజయపురపు ప్రభుఁడును తమలోఁ దమ రొకసంధిఁ గావించికొనిరి. వారిలో గజపతిరాజు జగన్నాథస్వామికి భక్తుఁ డవుటంజేసియు, బ్రాహ్మణపోషకుం డవుటంజేసియు నతఁడు క్షమియింపఁదగినవాఁ డని కృష్ణరాయని ముఖ్య మంత్రి కృష్ణరాయనితోఁ జెప్పెను. అటుపైఁ గృష్ణరాయలు డిల్లీపైకి (అనగాఁ దురుష్కులపైకి) దండెత్తుటకు నిశ్చయించెను. అట్టికార్యము నిర్వహించుటకుఁ దగిన సన్నాహములు ముందుగాఁ జేయఁబడెను. పిమ్మటఁ గృష్ణరాయలు తనదాణువం దీసుకొని తరలెను. అట్టిసమయములో ననేకములగుశుభశకునములు గాన్పించెను.

ఇట్లుగా బయలువెడలి కృష్ణరాయలుపైరాజుల దేశములలో నుండెడు సామంతరాజులం జయించి వారిదేశములను స్వాధీనముచేసికొనియెను. ఎదిరించకనే లొంగినవారినందఱిని సంరక్షించెను. ఇట్టి యుద్ధములు పెక్కు లైనపిమ్మటఁ గృష్ణరాయలు గోలకొండపై దండయాత్ర నడిపెను. అపుడు లక్షగుఱ్ఱపుదళము గల తురుష్కసేన కృష్ణానదియొక్క ఉవతలదరిని వచ్చి నిలిచెను. అంతఁ గృష్ణరాయని సేనామలలో నొకఁడు తాను పోయి పైతురుష్కసేనలం జయించెద నని

యును దన కాజ్ఞ యొసంగుమనియుఁ గృష్ణరాయనిం బ్రార్థించెను. దానిని విని కృష్ణరాయం డట్లే చేయు మని యాజ్ఞ నొసంగఁగా నాసేనాని తనసేనలతోఁ గృష్ణానది దాఁటి శత్రుసేనలపైఁ బడి యుద్ధము ప్రారంభించెను. అపుడు తురుష్కసేనయును ముష్కరముగఁ బోరనారంభించెను. ఆ యుద్ధము క్రమక్రమముగ నొక చండభండన మాయెను. తురుష్కులలోఁ బెక్కండ్రు హతులైరి. మిగిలినవారు నిలువలేక పలాయితులైరి.

ఇట్లుగా శత్రువులు పలాయనముచేసిన యనంతరము కృష్ణరాయని సేనానులలోఁ గొందఱు శత్రుపట్టణములను వెంటనే పట్టుకొనుట మంచిది యని విన్నపము చేసిరి. కాని కృష్ణరాయుని మంత్రిమాత్ర మట్టిపని చేయఁగూడదనియు నాస్థలములు మిగులఁ జతురంగబలయుక్తములై యున్న వనియుఁ జెప్పి ఆపట్టణములపైఁబోవు యత్నము గజపతిపైఁ బోవం జేయవలయు నని రాయనితో విన్నవించెను. ఇంతియ కాక గజపతియొక్క సేనలు కృష్ణరాయనిసేనలు నడుచునపు డనేకవిధముల మార్గవిరోధముం గల్గించుచుండెననియుఁగూడ విన్నవించెను. అట్టి మంత్రి వాక్యములకుఁ బ్రభుఁడు సమ్మతించి తనసేనల గజపతిపై నడిపించుట కాజ్ఞ యొసంగెను. పిమ్మట గృష్ణరాయుని సేనలు గజపతిదేశముపై నడువ నారంభించెను. అట్టిసమయములో నాదేశములో నుండు సామంతప్రభువులు రాయలసేనల నెదిరించుచుండిరి. ఆసేన లొకవ్యూహముగా, గాని సంఘముగాఁగాని చేరి యుద్ధము చేసి యుండలేదు. కావున వారందఱును గృష్ణరాయునివలన సులభముగా జయింపఁబడిరి. కాని కృష్ణరాయలు వారినందఱ నాదరించి గారవించి వారివారిస్థలములు వారికిఁ దిరుగ నిచ్చి కప్పము కట్టుకొని వారివి వారిస్థానములలోనిలిపెను.

అటుపిమ్మటఁ గృష్ణదేవరాయలు ముందు నడిచి అహమదునగరములో (Ahmadnagar) లో తనసేనల నిలిపెను. అవు డచ్చో నుండు తురుష్కసేనలు భయంకర మైనయుద్ధముం జేసి తుదకుఁ బరాజయము

నందిరి. అటుతరువాత కృష్ణరాయ లచ్చటనుండు పర్వతదుర్గముం బట్టు కొని తనజయస్తంభము నచ్చోట నాటించెను. కృష్ణరాయలసేనలు గజ పతిదేశమున కింకను నడుచుచునేయుండఁగా నతనిమంత్రి యగుసాళ్వ తిమ్మన్న కృష్ణరాయనితో నిట్లనియె. గజపతిని మనము నిస్సంశయము గా జయించఁగల్గినను, అతని దేశమునకుం బోవుమార్గ మతిదుర్గమముగా నుండుననియు, ఆకారణముచేత నాప్రదేశములలో జరిగెడుయుద్ధ మతికష్టతరముగా నుండుననియు, కావున నోఢ్రరాజుతో సంధిచేసు కొనుట తగ వని నిశ్చయించి చెప్పెను.

అట్టి మంత్రివాక్యములకు సమ్మతించనివాఁడై కృష్ణరాయ లిట్ల నియె. అడవియున్న దని చెప్పితివి కావున నది నతిక్రమింపవచ్చును. గజపతి రాజును జయించుట యొక గొప్పకార్య మనవలసినది లేదు. అతనిని సు లభముగా జయించఁగలము. అని యిట్లుగా మంత్రివాక్యముల నిరాద రణచేయుటయేకాక కృష్ణరాయ లహంకరించి సేనలను ముందుకు నడి పెను. ఇట్లుండ మార్గమధ్యములో నుండెడు శిదాపుఖాన్ అనునతఁ డఱువదివేలు (౬౦ వేలు) ధానుష్కులతో వచ్చి యెదిరించెను. అతఁడు గజపతిరాజునకు జయము సమకూర్చుటకు నాయత్తపడి యుండెఁగా వున నాయుద్ధము కృష్ణరాయని కతికష్టసాధ్య మాయెను.

కృష్ణరాయఁలు సమీపించుచుండె ననువర్తమానము నోఢ్రరా జగుగజపతికి వచ్చి చేరెను. అపు డారాజుయొక్క మంత్రులు తమకు సహాయముగాఁ దురుష్కసామంతులసేనలం గూర్చుకొనుట కర్జ మని విన్నవించిరి. ఇంతియకాక గజపతి చుట్టునుండుసామంతులలోఁ బది యార్గురు లేచి కృష్ణరాయని సేనలతో యుద్ధము చేయ ననుజ్ఞ యిప్పిం పుఁడని గజపతి రాజుతోఁ బ్రార్థన మొనరించిరి. గజపతి రాజును దానికి సమ్మతించి యుద్ధమున కనుజ్ఞ నిచ్చెను. అపుడు గజపతిసేనలు కృష్ణరా యనిసేనలతో యుద్ధమారంభించిరి. కృష్ణరాయ లిట్లుగాఁ బరసేనలు వచ్చుటకు జంకి నిరుత్సాహుఁడై తనమంత్రి యగునప్పాజీ చెప్పినహిత

బోధముం జెవిఁ బెట్టనందులకు విచారింప నారంభించెను. పిమ్మట రాయలు తనమంత్రికి వర్తమానంబు పంపి పిలిపించి తా నావటిలోఁ బడినది తప్పుమార్గ మని యొప్పుకొని కార్యసాధక మగుకర్తవ్య మాలోచింపుఁ డని ప్రార్థించెను. అందుపైని అప్పాజీ అపుడు శత్రువుల జయించుట సులభము కా దని విన్నవించెను. అయినను అపుడు కర్తవ్య మా గజపతిసేనలకు భేదము కల్పింపవలె నని చెప్పెను.

పిమ్మట తిమ్మరుసు రాయనికడఁ గొంతధనముం గైకొని గజపతిరాజు సేనానులుగా నుండినపదియాఱు (౧౬) గురు సామంతప్రభువుల పేరిటను భ్రామకము లగువార్తలు గలజాబులు వ్రాసి, సిద్ధపఱిచి వానిలో పిలువ గలసొమ్ములు, ధనము, చీని చీనాంబరములును ఉంచి ఆపెట్టెలును జాబులును తనమనుజుల పరముగా నిచ్చి, వారి నేకాంగులుగాఁ బోయి పెట్టెల నిచ్చినట్లు మరల జాబులు పట్టుకొనిరం డని పంపెను. అట్లుగా నాజ్ఞాపితులై యాపరిచారకులు గజపతిసేనలకడకుఁ బోవుచుండిరి. అంతట గజపతిసైనికులు రాయనిపరిచారకులఁ బట్టుకొని గపతికడకుం గొంపోయిరి. గజపతిరాజు ఆజాబులు జదువుకొని, తనసేనానులవర్తనమున కత్యాశ్చర్యము నందెను. ఆ జాబులలోని యంశము లెట్లు నున్న వనఁగా:—

"కృష్ణరాయలు మీరుకోరినపద్ధతుల కంగీకరించె నినియును, ఆపద్ధతులప్రకారము మీరు గజపతిరాజును దనకు నప్పగించెదరేని యిదివఱలో నిర్ణయమైనప్రకారము గ్రామములును, ధనమును, ఆభరణాదికములు మీపరము చేసెదము" అని తిమ్మరుసు వ్రాసినట్లుగా నున్నది. ఇట్లున్న జాబులం జదువుకొని గజపతిరాజు తాను పట్టుబడకుండు నుపాయ మాలోచించుచు నితరులకుఁ దెలియకుండఁ గొంతదూరమునం దున్నయొకస్థలమునకుఁ బోయి రహస్యముగా నుండెను. పైసామంత ప్రభువు లట్టితఱిలో గజపతిరాజు యుద్ధభూమియందుఁ గావరాకుండుటం జేసియు, నతనిక్షేమము తెలియకపోవుటం జేసియు యుద్ధము చాలించిరి. అట్టి సంగతిం దెలిసికొనినవాఁడు కావునఁ గృష్ణరాయలు

తనసేనలను యుద్ధమునకుఁ బురికొల్పక పైసామంతులకు నలజడి కల్గింపక నిల్చియుండెను.

ఇంతలో నప్పాజీ గజపతిరాజు కడకుం బోయి కృష్ణరాయ లాతని యోగక్షేమ మరయుటకుం బంపె నని వర్తమానంబుపనిచె. అట్టి మాట యెట్టిదో యని గజపతి కొంతవఱకు సందేహించి కృష్ణరాయలు న్యాయ మైనరా జగుటచేత నమ్మఁదగినవాఁడుగా నిశ్చయించి అప్పాజీకి సమయ మిచ్చి అతని రాయబారము విని సంతసించి అతనికి విశేషబహుమతులు గావించె. అపుడు తిమ్మరుసు రాయలయోగక్షేమము గజపతికిం దెల్పి రాయలకు మీకొమార్తె నిచ్చి వివాహముచేయుఁడని గజపతికి విన్నవించిన దానికి గజపతియును నంగీకరించెను. అప్పాజీయు నట్టి వృత్తాంతమున కెంతయు సమ్మతించి అట్టి సంబంధ మవశ్యము జరుగవలసినదిగా బలపఱిచి చెప్పెను. పిమ్మట నోఢ్రరాజుకోర్కెపైని యప్పాజీ అతనితో నగరులోనికి బహుమతుల నందుకొనుటకుం బోయెను. ఇట్లుగాఁ బోయి అచ్చట నప్పాజీ రాజకుమారికం జూచుట కనుజ్ఞాతుండయి యాపెను వీక్షించి తిరిగి వచ్చెను. అట్టిసమయులో గజపతి పుత్త్రి యగుతుక్కారా మనుచిన్నది తనతండ్రి కడ కొకచిలుకం బంపెను. ఆ శుకమును గజపతి అప్పాజీద్వారముగఁ గృష్ణరాయనికడకుం బంపెను. రాయునిదరి నిల్చి యాకీరము తన్నుం బంపిన గజపతి పుత్త్రికయొక్కవిద్యా, రూప, లావణ్యాదికములు రాయనికిఁ దృప్తికర మగునట్లు చెప్పెను. అనంతరము కృష్ణరాయ కళ్యాణములో జగిరిన విశేషములును, రాయలు విజయనగరమునకుఁ దిరుగఁ జనుటయు వివరింపఁబడినది.

నోటు:—ఇది కృష్ణరాయ. విజయ కథాసంగ్రహము. ఫిరిస్తా (Ferishta.) అను తురుష్క చారిత్రకారుఁడును కృష్ణరాయలు తురుష్కులబహుధా పరాజయము నందించె ననియు నొప్పికొని యుండెను. కృష్ణరాయని మంత్రియొక్క యథార్థ మైన నామము సాళ్వతిమ్మన్న యనియు, అప్పాజీ అనుపేరు వ్యవహార మగుననియుం జెప్పెను. కృష్ణ

రాయని మంత్రి యగునప్పాజీయొక్క బుద్ధిచమత్కారములు దెల్పుకథలనేకములు దేశములో వ్యాప్తమై యున్నవి. అని హైబరు అను చరిత్రకారుఁడు వ్రాయుచున్నాఁడు.

### కృష్ణరాయవిజయములోని కొన్ని యంశములు.

పై నుదాహరించిన కృష్ణరాయవిజయములోని కొన్ని యంశములు మాత్రము సంగ్రహించఁబడినవి. వాటిని గొంచెము విస్పష్ట పఱుపవలయును గావున నీక్రింద వివరించెదను.

1. కృష్ణరాయనికి సహాయులుగా నుండు నితరరాజులు.

1. ఆర్వీటివారు 2. సాళువారు 8. నంద్యాలవారు 4. వెల్గోటివారు (వెలమలు). పెమ్మసానివారు 6. బూడహాళివారు 7. తొరగంటివారు 8. తుళువదొరలు రావెలవారు.

2. కృష్ణరాయని రాజ్యకోశాముల వివరము.

*a*. విజయనగరపట్టణమును గట్టించునపుడు విద్యారణ్యస్వాములవారు చేర్చినరూకలు తొంబదియాఱుకోట్లు భూషణములు నాలుగుకోట్లు. అవిగాక విద్యారణ్యులవారి యనంతర రాజులు కృష్ణదేవరాయలనాఁటికిఁ జేర్చినధనము తొమ్మిదికోట్లు.

*b*. కన్నడరాజ్యమంతయు నెనుబదినాల్గు వరహ లక్షలు చెల్లుచుండెను.

*c*. వేయి జిరాగురాలకు లక్షవంతున నిరువదినాల్గువేల జిరాగురాలు నిరువది నాల్గులక్షలు కాల్బలము.

*d*. కరికి వేయిచొప్పున నూఱుకరిఘటలకు పన్నెండులక్షలవరాలు.

*e*. వేయిమంది భటులకు నిరువదినాల్గువేలచొప్పున లక్షయఱువదివేలప్రజలకు నలుబదిలక్షలు జీతములు. ఈప్రకారముగానే తన్నాశ్రయించియుండు దొరలకు ముజరా యిచ్చుచుండెను.

*f*. కృష్ణదేవరాయ లధికారమునకు వచ్చునాఁటికి కృష్ణాకావేరీ మధ్యదేశ మతనియధికారముక్రింద నుండెను.

### కృష్ణరాయలు తురుష్కులపైఁ బోవునపు డున్న సేనలవివరము.

1. భటులు ఆఱులక్షలు 6 00 000.
2. గుఱ్ఱములు అఱువదాఱువేలు 66 000.
8. ఏన్గులు రెండువేలు 2000.
4. సామంతు లగురాజులు, వెలమలు, కమ్మవారు తోడ నుండిరి.

౨. దండయాత్రను వర్ణించిన కవులు, 1. మాదయగారి మల్లన్న, 2. అల్లసాని పెద్దన్న 3. ముక్కు తిమ్మన్న మొదలగువారు.

౩. గజపతిరాజునకు సహాయులై వచ్చిన పాత్రసామంతులు ౧౬.

౧. బలభద్రపాత్రుఁడుపాత్రుఁడు ౨. దుర్గా 3. భీమాపాత్రుఁడు ౪. ముకుందపాత్రుఁడు ౫. భీకరపాత్రుఁడు ౬. బేరుపాత్రుఁడు ౭.రణరంగపాత్రుఁడు ౮. ఖడ్గాపాత్రుఁడు ౯. ఆఖండలపాత్రుఁడు ౧౦. మురారిపాత్రుఁడు ౧౧. వజ్రముష్టిపాత్రుఁడు ౧౨. తురగరేవంతపాత్రుఁడు ౧3. గజాంకుశపాత్రుఁడు ౧౪. అసహాయపాత్రుఁడు ౧౫. మృగేంద్రపాత్రుఁడు ౧౬. పేరు తెలియలేదు.

4 గజపతికూఁతుపేరు తుఖ్కాజీ అంబ.

గజపతికూఁతురు కృష్ణరాయని వెంబడించక మార్గములో నిల్చిపోవుట.

దీనింగూర్చి దేశములో నున్న కథలు మెకంజీదొర రికార్డులంబట్టి వెయిలరు దొర వ్రాసియున్న సంగ్రహమును మఱియొకచో నక్కుఱించెదను.

కృష్ణరాయల కాలములోఁ దురుష్కుల యధికార ప్రాబల్యతవారితోఁ గృష్ణరాయలు పోరుట. (కుటుబ్‌షాహి తవారిక్ చరిత్రలో) సుల్తాన్‌ఖాన్ కులీ కుట్బుషాహి హిజీరా. 918.

పై నుదహరించిన పుస్తకము ప్రస్తుతమం దనఁగా 1893 సం. మందు సజీవులై యున్న వాలాజావంశస్థుఁడైన హాసనల్లిఖాన్ నవాబుగారియొక్క చెన్నపురి పుస్తక సముదాయములోనిది. (Library)

క్షత్రియుల విషయము.

కల్‌కుట్బుషా గోలుకొండ పట్టణమును కట్టించెను. గోలుకొండ రాజ్యాధిపత్యము ఆయన పుచ్చుకొనినపిమ్మట మొదటి యుద్ధము రాజకొండవద్ద జరిగినది. ఆస్థలము పరిపాలించువాఁడు వేంకటనాయకనాముఁడు. దీనిపిమ్మట దేవరకొండకోట తీసుకొనఁబడెను. పైఁజెప్పిన యుద్ధమైనపిమ్మట పాంకల్, ఖాన్పురయను కోటలు తీసుకొనఁబడెను. ఖాన్పురకోట పాంకల్‌కును, కోయిల్ కొండకును మధ్య నున్నది. ఈరెండును బీజనగరు రాజ్యమునకుఁ జెందియున్నవి. కోయిల్ కొండయు పిమ్మట ఆక్రమింపఁబడెను. పిమ్మట చక్రవర్తిషితాబ్ ఖాన్ అను రాజునకు చెందియున్న కంబముమెట్టు, ఓరంగల్ వేలం

కొండ అను నీమూఁడు స్థలముల నాక్రమించుటకు బయలుదేఱెను. వేలంకొండ మొట్టమొదట తీసుకొనఁబడెను. పిమ్మట షితాబ్ ఖానుఁడు చక్రవర్తి సైన్యమును యుద్ధముచేసెను. షితాబ్ ఖాన్ పాఱిపోయి కంబముమెట్టుకోటయందు దాఁగుండెను. ఈసంగతి నతఁడు దగ్గఱరాజులకుఁ దెల్పి వారిసహాయము కోరి వారినందఱిని కంబముమెట్టు వోరంగల్ కోటలకు తీసుకొనివచ్చెను. ఘోరయుద్ధ మైనపిమ్మట షితాబ్ ఖానుని ఆతనిమిత్త్రులను షామషా యోడించెను. షితాబ్ ఖాన్ తెల్లింగానా రా జైనరామచంద్రదేవువద్ద శరణుజొచ్చెను. ఈతఁడు విశేషబలము కలవాఁడు. అతిగిరి, ఇంద్రకొండ, నాయలకొండ, కొండపల్లి మొదలగు దుర్గము లీతనిస్వాధీనములాయెను. బాదిషా కంబముమెట్టు దుర్గమును పట్టుకొని, వాని యావదాస్తిని దోఁచికొని. వానికుటుంబమును బంధువులను ఖైదీలనుగాఁ దీసుకొని పోయెను. బాదిషా ఓరంగల్ కోటను నెవరిచే నెదుర్కొనబడకుండ నాక్రమించెను.

గజపతిరాజు పుత్త్రుఁడైన రామచందర్ తెలింగానాదేశమును బెంగాల్ దేశపు సరిహద్దువఱకు వ్యాపించియున్న ఒరిస్సాదేశమును తన స్వాధీనమం దుంచుకొని, కొండపల్లి రాజధానిగాఁ జేసుకొని రాజ్యము చేయుచుండెను.

ఈరాజు గొప్పధనవంతుఁడు. ఇతనిసైన్యము, ధనము, మఱియు నితర మైనవస్తువులు నుత్తరహిందూస్థానపురాజులసైన్యము మొదలైన వానితో సరిపోల్పఁబడునపుడు వారందఱు నితనికంటెఁ దక్కువవారై యుందురు.

షెటాబీఖాను, రామచందరదేవువద్ద దాఁగొనియున్నప్పు డితని మూఁడులక్షలకాల్బలము, ముప్పదివేలగుఱ్ఱపుదళము, తనరాజ్యము చుట్టుపట్ల నున్న దేశపురాజు లైనవిద్యాధర్, హరిశ్చంద్రుఁడు, ఇంకను మఱికొందఱు తెలింగనా దేశపురాజులు, గలసైన్యముఁ గూర్చికొని పాదిషా నెదిరించుటకు సిద్ధపడెను. పాదిషా యీసంగతి వినఁగా

నే రామచంద్రునిపై నైదువేలగుఱ్ఱపుదళముతో బయలుదేఱెను. రెండు సైన్యములు పిలంకజిన్నరీవద్ద నున్ననదివద్ద కలుసుకొనెను. రామచందరు పదివేల గుఱ్ఱపుదళముతోను, లక్షకాల్బలముతోను, మూఁడువందలయేనుఁగులతోను మధ్యను నిలువఁబడెను. వానికుడిపార్శ్వమున పదివేలగుఱ్ఱములతోను, లక్షకాల్బలముతోను రెండువందలయేనుఁగులతోను వానియన్నకుమారుఁ డగువిద్యాధరుఁ డుండెను. వానియెడమపార్శ్వమున పదివేలగుఱ్ఱములతోను, లక్షకాల్బలముతోను, రెండువందలయేనుఁగులతోను హరిశ్చంద్రుఁడు, షెటాబీఖాను, ఇంకను మిగిలిన రాజులును ఉండిరి. విలుకాండ్రు ఏనుఁగులపై నున్నహావుదాలపైఁ గూర్చుండిరి. ఈహావుదాలు తుపాకులు మొదలైనవి పట్టుకున్న వారిచే కాపాడఁబడెను.

పాదిషా యిరువదివేలగుఱ్ఱములతో మధ్యను నిలువఁబడెను. వానికుడిపార్శ్వమున వానికొడుకు (షాజాడా) హైదర్‌ఖాన్ పదునేనువందల గుఱ్ఱములతో నుండిరి. వాని యెడమపార్శ్వమున ఫాట్‌హిఖాన్ పదనైదువందలగుఱ్ఱములతో నుండెను. అప్పుడు జరిగినపోట్లాటలో, విద్యాధరుఁడు షాజాదాచేఁ జంపబడెను. రామచంద్రుఁడు ఖయిదీగాఁ బట్టుకోఁబడెను. యుద్ధమునకు వచ్చినయితరరాజులు పాఱిపోయిరి. వారియేనుఁగులు ద్రవ్యము ఇతరమైన ఆస్తి పాదిషా తీసికొనెను.

అప్పుడు పాదిషా కొండపల్లికి బయలుదేఱెను. అక్కడ రేషీద్‌ఖాన్ అను వానిని కోటను తీసుకొమ్మని కొంతసైన్యముతో నుంచి, తాను రాజమహేంద్రవరము, ఏలూరు వైపులకు బయలుదేఱెను.

ఏలూరు ప్రవేశించిన పిమ్మట అతఁడు అక్కడికొండయధికారులను జయించుమని తనసేనానాయకులను బంపెను. వారు వెళ్లి ఏలూరుపరగణాయం దున్నముఖ్యుల నందఱను జయించి వచ్చిరి.

పాదుసా రాజమహేంద్రవరమువద్ద నున్ననదిసమీపమునకు రాఁగానే, ఆదగ్గఱ నున్నయడవులయందు కొందఱు శత్రువులు రాత్రి

వేళ సెదిరించుటకై దాఁగుండి రని అతనికిఁ దెలియవచ్చెను. అప్పు డ తఁడు పాట్‌హిఖాన్, రస్తుమ్‌ఖాను, అనువారలను రెండువేలగుఱ్ఱపు దళముతో పంపెను.

వారిద్దఱు అడవులకు వెల్లి వారితో యుద్ధము చేయఁగా ఆశ త్రువులు వారియాస్తిని కుటుంబములను వెనుకకు విడిచిపెట్టి కొండ లకు పాఱిపోయిరి. పాదుషా సేనానాయకులు వారిని ఖైదీలఁగాఁ బట్టు కుని వారిసొమ్ము దోఁచుకొని తమ ప్రభువువద్దకు జయముతో వచ్చిరి.

## వాసన్నాద్రన్ ఒడంబడిక చేయుట.

### గజపతి.

రామచంద్రదేవు తన రాజ్యమునుండి పాఱిపోఁగానే తెలింగ నాకును, బంగాళా సరిహద్దులకును మధ్య నున్న దేశపు రాజైనవాస న్నాద్రన్ అనువాఁడు పాదుషాతో నొడంబడిక చేసుకొనెను. ఒడంబడిక షరతు లేమనఁగా గోదావరీనది ఒకవైపు సరిహద్దుగా బంగాళాదేశము మఱియొకవైపు సరిహద్దుగాను గల్గి తెలింగనా, ఒరిస్సా దేశములతోఁ గూడుకొనిన దేశము తనకు నీయఁబడవలె ననియు, గోదావరినదికి పైగా నున్న దేశమంతయు పాదుషాకు నిచ్చివేయుట యనియు. ఈ షరతులకు పాదుషా యిష్టపడి యారాజునకు సంధిషరతులప్రకారము పట్టా యిచ్చె ను. అప్పటినుండి ఏలూరు మొదలు పాదుషా రాజ్యము వఱకు నున్న పరగణాలు పాదుషావలన నేలఁబడెను.

## బీజనగరముతో యుద్ధము.

పాదుషా తెలంగనా, ఒరెస్సాలపై దండెత్తియుండఁగా, బీజ నగరపురాజైన కృష్ణరాజు పాదుషాదేశమునకుఁ జుట్టుపట్లు నున్న దేశమును దోఁచుకొని, పాదుషా వచ్చుచుండుట విని తాను తన దేశమునకుఁ బోయెను. ఆ సంగతి వినఁగానే పాదుషా క్రిందనున్న అమీరులు, కృష్ణానదికి అవతలివైపున నున్నట్టియు, కొండపల్లికి యెదురుగా నున్నట్టి కొండబీర్ అనుదేశమును తీసుకొమ్మని సలహా

యిచ్చిరి. అతఁడు అప్పుడు కొండబీర్‌నకు వెళ్లి ఆకోటపై నెదిరించెను. అంతట రాజు సైన్యమును విల్లంకొండ, పెనుగొండవద్దనుండి, రాత్రులు ఫాదుపా సైన్యముల నెదిరించి, సొమ్ము దోఁచుకొనుచుండెను. పిమ్మట ఫాదుపా వారి రెండుకోటలు ముందుగాఁ దీసుకొని, కొండబీర్‌కోటను దీసుకొనుటకు నిశ్చయించెను. తరువాత విల్లంకొండ కోటపైకిఁబోయి, దాని నాక్రమించి, సోవాయిల్ ఖాన్ అనువానిని కోటకాపుగా నుంచెను. షాజాదా కొండపల్లిని జయించిన పిమ్మట ఫాదుపా కొండపల్లిని షాజాదా స్వాధీనములో నుంచి కొండపల్లిచుట్టు నున్నరాజుల వలన అల్లరులు జరుగుచుండె నని విని, యీయల్లరు లణఁచివేయుటకు కొండపల్లికి బయలుదేఱెను.

కృష్ణరాజు ఫాదుపా కొండబీర్‌కోట నెదిరించుట విని, కొండబీరును గాపాడుటకుఁగానే బదివేల కాల్బలము, ఐదువేల గుఱ్ఱపుదళము గలసైన్యము, తనయొక్క చెల్లెలికుమారుని యధికారముక్రింద నుంచి, పంపెను. ఈసైన్యము కొండబీర్ చేరఁగా ఫాదుపావిల్లంకొండ కోట నెదిరించుటయు కొండపల్లివైపు వెళ్లుటయు వారికిఁ దెలియజేయఁబడెను. వారు విల్లంకొండవద్ద ఫాదుపా లేకపోవుట చూచుకొని విల్లంకొండపైకి బయలుదేఱిరి. అక్కడ సోహిాయల్‌ఖాను, ఎదిరించుకుండ కోట నిచ్చివేయుట కొప్పుకొని మూఁడురోజులు తనకు వాయిదా యిమ్మని కోరెను. తత్‌క్షణమే అతఁడు బీజనగరము సైన్యములు విల్లంకొండకు వచ్చి కోట నెదిరించినవార్త ఫాదుపాకు పంపించెను ఫాదుపా విల్లంకొండకు తిరిగివచ్చి బీజనగరపుసైన్యము నోడించఁగా, వారు తమ సొమ్ము విడిచి పెట్టి యుద్ధభూమినుండి పాఱిపోయిరి. ఫాదుపా ఆయాస్తిని తీసుకొనెను. ద్రవ్యమునుమాత్రమే అఱువదియేనుఁగుల పై వేసి తనబొక్కసమునకుఁ బంపించెను.

### కొండబీరు తీసుకొనఁబడుట.

ఫాదుపా పిమ్మట కొండబీరుపైకి వెళ్లి కోట నెదిరించెను. ఫాదుపాతో నెదిరించలే మని రాజుసైన్యములు తెలుసుకొని, తాము కో

టనిచ్చివేయుచున్నాముగావున తనప్రాణములు రక్షింపుఁ డని ఫాదుషాను వేడుకొనిరి. ఫాదుషా అందుల కొప్పుకొని కోటలో నున్న ధనముతోఁగూడ రాజు నాక్రమించి, రాజుయొక్క సైన్యములను వారిదేశము నకుఁ బోనిచ్చెను.

### కృష్ణరాజు తనయల్లునిఁ బంపుట.

ఫాదుషా కొండబీడుకోటను తీసుకొనె ననుభయంకర మైనవార్త వినఁగానే, కృష్ణరాజు తనయల్లుఁ డైనబసవరాజుపుత్రుశివరాజును లక్షకాల్బముతోను, ఇరువదివేల గుఱ్ఱపుదళముతోను, ఫాదుషానుండి కోటను తిరిగి తీసుకొమ్మని పంపెను. బీజనగరపు సైన్యము వచ్చుచున్న దని ఫాదుషా విని అప్పుడు తనఅమీరులను సలహా అడిగెను. అందుకు, వారు, కొండపల్లినుండి కొండబీడునకు కొద్దిరోజులలో రావచ్చును. గనుక కొండబీడుకోట విడిచి కొండపల్లికి పొమ్మని సలహా యిచ్చిరి. అతఁడు ఆప్రకారముగాఁ జేసెను. రాజుసేనలు ఫాదుషా కొండబీడుకోట విడిచిపెట్టి కొండపల్లి వైపునకుఁ బోయె నని విని, కొండబీడుకోట నాక్రమించి, వారి బరు వైనసామానులు కోటలో నుంచి ఫాదుషాపైకి వెడలెను. ఫాదుషా కొండబీడు పైఁ దిరిగెను. అక్కడ జరిగిన యుద్ధములో, రాజుసేనలు రెండుజాములు పోట్లాడి, ఓడిపోయి కొండబీడుకోటలో దాఁగుండిరి. ఫాదుషా కొండబీడుకోటను ముట్టడించెను. అప్పుడు కృష్ణరాజుసేనలు, ప్రతిసంవత్సరము ఫాదుషా బొక్కసమునకు మూఁడులక్షలపెగోడాలు చెల్లించెద మనియు, ఆస్థలమందే అప్పుడు రెండులక్షలు చెల్లించి, తక్కిన లక్ష చెల్లించువఱకు తమరాజకుమారులలోఁ గొంతమందిని పూచీదార్లుగా నుంచెద మని చెప్పి, ఫాదుషాతో సంధి జేసికొనిరి. ఫాదుషా అందుకు నొప్పుకొని, కొండబీడు తనరాష్ట్రములోఁ జేర్చుకొని వారిని విడిచిపెట్టెను.

### కొండపల్లివద్ద అల్లరు లణఁచివేయుట.

ఫాదుషా కొండబీడుకోట నాక్రమించె నని వినఁగానే కొండప

ల్లిలో నున్న నాయికీవారు ఫాదుషా తమవైపు వచ్చునని మిక్కిలి భయపడి, కొండపల్లికోట తాళము లిచ్చివేసెదమని,అదివఱకు తాము చేసిన పనులను క్షమించు మని వేడి షాజెడాతో సంధి జేసుకొనిరి. అందుపైని షాజెడా వారిని చూచి క్షమించి వారిఅప్పటిహక్కులలో నుంచుటకు ఫాదుషాతో సిఫార్సు చేసెను. ఫాదుషా అందుకు సమ్మతించి, వారిని కాన్పురకోటకుఁ బొమ్మని కొండపల్లికోటను విడిచిపెట్టు మని యాజ్ఞాపించెను. కొండపల్లికోట తుదకు షాజెడా కిచ్చివేయఁబడెను. ఫాదుషా వలన చేయఁబడిన తెలింగనా యుద్ధముల వృత్తాంతమిది. ఇటనుండి వినికి మీఁద నేను పూర్వము వ్రాసినకథలు వ్రాసెదను.

## కృష్ణరాయని ప్రథమవివాహచారిత్రము.

కృష్ణరాయనికి దాసీపుత్త్రుం డని ప్రసిద్ధి గల్గి యుండుటం జేసి సత్కులీను లగురాజు లెవరును కన్నియ నీయ సంశయింపఁ దొడఁగిరఁట. దానికిఁ గృష్ణరాయండును మిగులం జింతించుచుఁ దిమ్మరుసునకుఁ దెల్పిన నాతండు సంశయింపకుము సత్కుల ప్రసూతన యగునొకప్రసవకోమలిం దెచ్చి వివాహంబు సేసెద నని తెల్పి అప్పుడే బయలువెడలి సేనాపరివృతుం డై వినుకొండకుం జనుదెంచి యచ్చోఁ దమకుఁ గప్పము గట్టుగజపతికిఁ దనరాక యెఱింగించి పుచ్చె. సర్వాధికారంబు సేయు కృష్ణరాయనిముఖ్యమంత్రి వచ్చియున్నాఁ డని విని యారాజు నెదురుగ వచ్చి యాతనిం దోడ్కొని గృహంబునకుం జని సగౌరవంబుగ నాతని సత్కరించి మీరాకకుఁ గతం బేమి, దేవరయాజ్ఞ శిరసావహించెదము, సెలవిండనుడుఁ దిమ్మరుసు నవ్వుచు మీరు సత్యానాక్య పాత్రమాణికులగు. నాయాజ్ఞ నడిపెద మని తెల్పితిరిగానఁ జెప్పెద వినుండు. మీకూఁతును మారాజశిఖామణి కిచ్చి పరిణయంబు సేయుఁడు. ఇదియ నాయభిమతంబు, అనుడు నారా జేమియు ననలేక వెలంవెలంబాఱి కొంతతడవు చింతించి మీయిష్టానుసారంబుగాఁ గార్యంబు నడిపెద నని తాంబూలం బిచ్చి యాతని సాగఁబనిచె. తిమ్మరుసును మిక్కిలి యా

నందముతోఁ జనుదెంచి కృష్ణరాయని కాసుభవార్తం దెలిపె. అప్పుడు కృష్ణరాయుం డావనిత సత్కులసంజాత యవుటకు సంతసించెఁగాని దాని రూపలావణ్యంబు లెట్టివో చూడవలె నని తెల్పె. దానికి తిమ్మరుసు మీ కాచిన్నది యక్షిగోచరం బగు నట్లు గల్గు ననినఁ గృష్ణరాయం డేదియేని యుపాయంబుచే నావనితం జూచి గాని పరిణయంబు గా నని తెల్పె. అట్టిపల్కులు విని తిమ్మరుసు క్రొంచెము చింతించి మంచిది బయలువెడలుద మని తనపల్లకీలో రాజుంగూడఁ గూర్చుండఁ బెట్టికొని రాణువ తోడ నడువఁ గదిలి పెనుగొండ చేరి లగ్ననిశ్చయంబునకుఁ బ్రధానంబునకు వచ్చుచున్నా మని గజపతికి వర్తమానంబుఁ బంచె. ఇట నాగజపతి తిమ్మరుసును బంచి నిజాంతఃపురంబునకుం జని తన బంధుల కవ్వార్త: దెలిపిన వారందఱుఁ గృష్ణరాయని నెంతయు నిందించి నీకూఁతుం గులము తక్కువవాని కిచ్చుట యనుచితం బని కోపించి పల్కఁ దొడంగిరి.

గజపతి అట్టిపలుకులు విని యేమియుఁ బల్క నోరాడక తిమ్మరుసున కేను మాట నిచ్చియుంటిని, నాపలుకు ననుసరించి కార్యంబు నడపెద. ఎవరియదృష్టం బెట్లున్న నట్లగు. పొ మ్మని యాతండుమాత్రము దానికి సమ్మతించె. బంధువులందఱును స్త్రీజనంబును దాని కిష్టపడరైరి. అట్లగుటచే వారందఱుం గలిసి కృష్ణరాయని సంహరించియైనఁ దమనింద వాపికొనఁ దలంచిరి.

గజపతి తిమ్మరసుకోర్కె ననుసరించి ప్రధానతాంబూలంబు గొనుటకు నాతని రమ్మని వర్తమానంబు బనిచె. అప్పుడు తిమ్మరుసుం దగుపరివారజనంబులం గొని కృష్ణరాయనికి తాంబూల మందిచ్చువాని వేషం బమర్చి తనకంచుకంబునంచిలో నాకుల నునిచికొని రాజుచుట్టిన యాకులన్నియుఁ బదిమందియుఁ జూచునట్లుగ నందికొని మఱియొకసంచి నుంచి మొదటిసంచిలోని మడుపులు నములుచు గజపతికోటలోనికిం జనుదెంచె. ఆరాజు నెదురుగ వచ్చి తిమ్మరసును లోనికిం దో

డొక్కానిచనియె. అతండు తాంబూలంబు దెచ్చువానిం దనతో రమ్మనియె. లోనికిం జని తిమ్మరుసు గజపతిం జూచి మాతల్లి యగుభవిష్యత్పట్ట మహిషిని దర్శించు వేడుక గలదు. అనుడు వల్లెయని యారాజు తన యంతిపురి కవ్వార్తం బనిచి యాపెకు సన్నాహంబున నుండ నాజ్ఞ యొసంగి యాతనిం దోడ్కొని చనియె. అచ్చో నాచిన్నది సర్వాభరణ భూషితయై మేఘంబుచాటు నుండి బయలువెడలు మెఱపుచందంబున తెర దాఁటి వచ్చి యెదుట నిలచి తిమ్మరుసు నాతనితో నున్న పరిచారకుం జూచె. పరిచారకు నెగదిగంజూచుచో నాపెకు నాతని పాదంబున నున్న పచ్చలమట్టియ గాన్పించె దానిచే నాతండే కృష్ణరాయండగు నని గ్రహించి గిఱ్ఱున వెనుకకు దిరిగి లోనికిం జని ఆపరిచారకుండే కృష్ణరాయం డని తమవారికిం దెలిపె. అప్పు డాయాండువారలందఱు నాతనిం దమ కోటలోపలనే మృతినొందింపఁదలంచి యేమియుపాయంబని కలవెలంబడసాగిరి, దీనినంతయుం దిమ్మరుసు నిమిషమాత్రంబున గ్రహించి కృతకభృత్యునిదిక్కు మొగంబై కనుగీటి యారా తమలంబున సున్నం బింతగ వేసితివేలరా యని యుగ్రుండై లేచి తత్తిమికొనుచు గృహాంగణంబు లన్నియుం దాఁటి సింహద్వారంబునుండి నిర్గమించె. రాజభార్యలు లోనుండి దేవిడీ బంధింపు మని వర్తమానంబు పంచిరి.అంతకుముందు వీరలిరువురును గోటవెలుపట వచ్చి నిల్చిరి.వర్తమానంబు రా వేగమే ద్వారపాలకులు తలుపులు బిగించి మార్గావరోధంబు గల్గించిరి. అంతట దిమ్మరుసు పఱచినవార్త రాజభార్యలు విని యాతనిం బట్టి తెం డని కొందఱిని దుమికించిరి. వారికిని ద్వారావరోధంబే గలుగుటం జేసి మరలివచ్చి యవ్వార్త నగరునకుం బంచిరి. ఇటుఁ గృష్ణరాయండును తిమ్మరుసు ప్రజ్ఞావిశేషంబున నిశ్చింతతో శిబిరంబు లోనికిం జేరె.

గజపతి తనకోటలోని వృత్తాంతమంతయు నరసి తనవారిని వారించి లగ్ననిశ్చయంబు సేయుం డని తిమ్మరుసునకుం జెప్పిపంచె. అప్పుడు

తిమ్మరుసు లగ్న నిశ్చయంబు సేసి మా రాజులయింటఁ బెళ్ళికుమారుఁడు బాకునకు బాసికంబు గట్టి దానినే వివాహంబునకు బంపెడు నాచారంబు గలదు. సుముహూర్తదినంబునకు బాకుం దోడ్కొని మేమందఱమును వచ్చెద మని వర్తమానంబు పంపించె. దాని విని గజపతి తిమ్మరుసుని యాలోచనమునకు సంతసిల్లి వల్లెయనియె. అప్పుడు తిమ్మరుసు కృష్ణరాయని నాతనిపురంబు చేరం బనిచి సుముహూర్తంబునాఁటికి నుత్సవంబుతో బాకుం దెప్పించుకొనియె. ఆబాకునకే గజపతిపుత్త్రిం బరిణయంబు సేయించి మరల దానిని గొని చిన్నదానిని మంచిదినంబున మా రాజుకడకుఁ బంచివేయుండని చెల్పి సపరివారంబుగఁ దానుఁ దన ప్రభునిపట్టణంబునకుఁ జనియె.

గజపతియుఁ దనకూఁతుని నల్లునికడకు సంపుతలంపున నొకశుభదినంబున సర్వసన్నాహంబులుఁ గావించి దాసీదాసాదులను కనకాంబరాభరణంబులను నిచ్చి ప్రయాణంబు సేసె. అపుడుపెండ్లికూఁతు తల్లి మొదలగువారందఱుఁ పెండ్లికూఁతుకడ కరుదెంచి బుద్ధులుసెప్పెడు తెఱంగున రహస్యంబుగఁ గృష్ణరాయల నెట్లైనం జంపి తమకొలంబునకు విఖ్యాతి దెమ్మని బోధించిరి. అత్యబల వీఁరిబుద్ధులకు నేమియుం బల్కకోడి తా నట్టికార్యంబునకుఁ జాల ననియె. దాని విని వారలు దాసీజనంబులలోఁ గొందఱకు నాతనిం జంపుబుద్ధులం దెల్పి వధూవరులం గదిలోని కనుపుచో నయ్యంతికిఁ గోప్యంబుగఁ గత్తులు గట్టుఁ డనిరి. వారును మంచిదని తత్ప్రయత్నంబుననే యుండిరి. సన్నాహం బైతిమని రాజునకుం దెల్ప నాతండు వారినందఱనానెగొందికి సాగఁబనిచె. వారును కతిపయదినంబులకు రాజధానికి వచ్చి చేరిరి. రాజును తనపట్టమహిషి వచ్చెననుమాట విని యూరును నగరును నలంకరింప భటులం బనిచె. తనరాణికిఁ దగు భవనంబుఁ జూప దాసీజనంబుల నియమించె. వారు నామెం దోడ్కొని చని యాభవనంబున విడియించిరి. ఇట్లు కొన్నిదినంబు లుండం దిమ్మరుసు నూతన రాజదంపతులకుఁ బున

స్సంధాన ముహూర్తంబు దైవజ్ఞులచే నుంపించి యానాఁటిరేయి నొకభవనంబు విచిత్రంబుగ నలంకరింపఁ బంచి యందావధూవరులనుఁ బ్రవేశంబు సేయించె. అంతకుము న్నాపట్టమహిషి చెలికత్తియలందఱు లతాంగికి కంటకంబుల నంటించు తెఱుంగున నాలతాంగికి మొలచుట్టును కత్తులఁ గట్టి పైని మృదుదుకూలంబులు కప్పి పయోముఖ విషకుంభంబుంబలె నుండ నలంకరించి యాయింట నొంటిగ నిల్పి వారందఱుఁ దాంబూలంబుల నందికొని యొకరొకరుగ గదిలోనుండి జాటి తలుపు బిగించిరి. అపుడు కృష్ణరాయం డాలలనామణి కట్టియున్నగాగరఁ దనకాల నొడిసి పట్టి సామీప్యంబునకుఁ జేరదీసె. అపు డాకత్తుల మొలనూ లుల్కాపాతంబుంబలె నేలపై నాచిన్నదానియరిష్టంబుఁ దెల్పుచుం బడియె. రాయఁ డాకత్తుల మొత్తంబుఁ జూచి యప్పా యేమి చిత్రము అని తిమ్మరుసును బిలిచె. ఎచ్చటనో నక్కియున్న తిమ్మర సవ్వార్త విని "జాగ్రతో భయం నాస్తి" అని యుత్తరం బిచ్చి యొకభటునిచే సేనల సన్నాహంబున నుండ వర్తమానంబు పంచి వెంటనే కొందఱ దాసీజనంబులఁ బిలువఁబంచి దాసీజనం బిదె వచ్చియున్నా రని తెల్పె. అప్పల్కులు విని రాయండు తలుపు విచ్చి వెలికిం జనుదెంచి వారలతో నాచిన్నదానిని దోడ్కొని చని ఆపెజనకునియింట దిగవిడిచి రమ్మని యాజ్ఞ యొసంగె. అపుడు వారొకపల్లకిం దెప్పించి యాచిన్నదాని నం దుంచి యారాత్రియే బయలువెడలిరి. వీరికి సాహాయ్యంబుగఁ గొన్ని సేనలు తిమ్మరుసుచే నడిపింపఁబడియె అపు డాచిన్నది తనద్రోహబుద్ధికి రాజుదాక్షిణ్యచిత్తంబునకు గలతారతమ్యం బాలోచించి యహాహా! యిట్టిపతికి దూరం భైతి. ఇఁకఁ బుట్టినయింటికి వారు చెప్పినకార్యంబు నమపక యూరక చని తిరిగి వారిముఖ మెట్లు చూచెద. కావున నీసమీపంబున నున్నవనంబులో నుండి నేజేసిన మహాద్రోహంబునకుఁ బ్రాయశ్చిత్తవిధానం బరయుచు భగవంతుని స్మరించుచుండి కాలంబు గడిపెద నని నిశ్చయిం

చుకొని యామీఁద పోనని పరిచారకులకుం దెల్పె. అప్పు డందులోని కొందఱుపరిచారకు లవ్వార్త రాజునకుఁ దెల్పిన నాతండు తిమ్మరుసుతో నాలోచన నేసి యామెయెడ సదయుం డై యచటనే యుండుటకు నాజ్ఞ యొసంగి యాపెకు వలయునపుడు కోరినధనం బి మ్మని యాతని కాజ్ఞ యొసంగె. ఇంతియకాక యాపె కచ్చోటనుండ నొక భవనంబు గట్టించి తగుసామగ్రిని దాసీదాసాదులను నియమించె. ఆచిన్నది యచ్చోట ననేక ధర్మకార్యంబులఁ జేయుచు మునివృత్తిశోఁ బరంబు జింతింపుచుఁ గాలంబు గడపసాగెను.

ఈమెనామంబు వరదరాజమ్మ యందురు. ఈమెవాసముచేసినవనంబు కడప జిల్లాలోనిది. అచ్చోట దూరదూరంబున నుండు నాలుగుపర్వతంబులలోనికి కట్టలు గట్టించి దాని నొక చెఱువుగ నేర్పఱిచె. తత్సమీపంబున నున్నకొన్ని శిలాశాసనంబులలో వరదరాజమ్మ రూపు చెక్కఁబడియున్న దని వాడుక గలదు. ఈతటాకంబు మిగుల విశాలమైనదియు రమణీయ మైనదియు నెటు జూచిన నాఱుక్రోశంబులు (౧౨మైళ్లు) కట్టలు కలదియునై యున్నది. ఇం దనేకములైన లంకలు వ్యవసాయపుభూములు చిన్నపల్లెలుంగూడఁ గల వని వినంబడు. ఈచెఱువు సంపూర్ణ మగుచో జరిగె నని చెప్పంబడు నొకకథ కలదు. అది మిగుల నద్భుతంబుగఁ గాన్పించు. ఏదియేని విశేషకార్యంబు నెఱవేర్పుతఱి నిట్టిపనులు జరుగక తప్ప దని యిప్పటికిని కొందఱుహిందువుల యభిప్రాయంబు ఆకథ నీక్రింద వివరింతము.

ఈచెఱువు సిద్ధమగుతఱి రెండుకనుమలు విశేషవిస్తీర్ణంబుగలవి కట్టలలో నేర్పడెనఁట. దానిం గప్పింప నాయిల్లాలు విశేషంబుగ సొమ్ము వమ్ముచేసిన నది కార్యకారి కాదయ్యె. దానికి వరదరాజమ్మ చింతాకులమానస యై యేమిగతి స్వామీ యని యోచించుచుండె. ఇట్లుండు తఱి వీరియింటి కనుదినంబును మజ్జిగ నిచ్చునొక ముసలిగొల్లది వచ్చి యాపె చింతించుటకుఁ గారణం బడిగె. దాని విని వరదరాజ

మ్మ వృత్తాంతం బంతయుఁ దెల్పి యుపాయం బేమియుం గానరాకుం
డుటం జేసి యిట్లు వగచుచుంటి నని చెప్పె. అప్పు డాపలుకులు విని యా
వృద్ధాంగన యి ట్లనియె. అమ్మా దానికి కారణంబు నాకుఁ దెల్లం బయ్యె.
ఆచెఱువు నరబలిం గోరుచున్న యది. ఆకనమల నొక్కొక మనుజుని బలి
యిచ్చినఁ గట్ట లెప్పటియట్టుల నుండు. ఈపని యెట్లు సిద్ధించు నని
విచారింపవలదు. నే దానికిఁ దగునుపాయం బరసితి. నా కిర్వురుసుతు
లు గలరు. వారి నిర్దఱ నాపని నెఱవేఱుప బనిచెద. నీవు సంశయింపం
బనిలేదు. వారిని వానియం దుంచి యీసారి కనములఁ బూడ్పింపుము.
కార్యంబు గట్టెక్కు అను నా గొల్లదానిపల్కుల కులికి వరదరాజమ్మ
భయకంపిత స్వాంతయై అయ్యయ్యో? యిట్లు పల్కువెఱ్ఱులు గలరే?
సుతుల బలికై యిచ్చెద మని సతు లనవచ్చునే నా చెరువు కనములు
పూడకున్నను మేలాయె నీకొడుకులఁ జంపఁదలంపకుము. అని బుద్ధులు
సెప్ప నట్టిపల్కు లాలింపక గొల్లది యేయుపాయంబుననైనం బురుషు
లలోఁ బ్రసిద్ధిని జెందినవానిజన్మంబే సఫలంబు. వగవకుము. పోయివ
చ్చెద నని యింటికిం జని తనపుత్త్రులం గని వారల కవ్వార్తఁ దెలిపి
మీనామంబు లీభువి నాచంద్రార్కంబు లై యుండు సుకాలంబు సం
ప్రాప్తంబయ్యె, సముత్సాహు లై చనుండని తెల్పె. వారును మాతృ
వాక్యపరిపాలనదక్షు లై పెండ్లికిం బోవునట్లుగ సంతసంబుతోఁ జను
దెంచి వరదరాజమ్మకుఁ గాన్పించి తల్లీ సుతులనామంబులు జగద్విదితం
బు లగున ట్లొనరింపం గరుణింపవే యని పలికిరి. వారిసాహసంబునకు
మెచ్చి మీకుఁ బ్రత్యుపకృతిఁ జేయ నే నెంతదాన, అయినఁ గొంతధ
నం బిచ్చెదఁ గైకొని ధర్మంబు సేసికొం డనుడు వార లిట్లనిరి. తల్లీ
మాకు ధనం బేల మాయెడ నీకు దయ గలదేని మా నామంబు లీజగం
బున శాశ్వతంబు లై యుండునట్లుగ మాపేరిట రెండూళ్లఁ గట్టింపుఁ
డని తెల్పిరి. దానికి వరదరాజమ్మ సంతసించి వాగ్దానంబు చేసెను.
అనంతర మాయిర్వురు సోదరులు పోలికలనుకుం జను మహాశూరులభం

గి నిర్భయంబుగఁ జని వీరంబు సారించి యాజలదేవతను జయించుభంగిఁ జేతు లెత్తుకొని భగవన్నామంబు దలంచుచుఁ జెఱియొకకనమం బ్రవేశించిరి. అపు డాచెఱువుఁ ద్రవ్వు పనివాండ్రు వాని పైఁ గొన్ని తట్టల మన్నును క్రుమ్మరించిరి. కోడనే యాకనములు మరలఁ దెగక యిప్పటియట్లనుండెనఁట. అనంతరము వరదరాజమ్మ తనవాక్యాను సారంబుగ నాయిర్వురపేరిట రెండుగ్రామంబులు గట్టించె. వారిలో నన్నపేరు పెదకంబఁడు. తమ్మునిపేరు చినకంబఁడు. కావున నాగ్రామంబులకుఁ బెదకంబము చినకంబము నని నామంబు లుంచె. ఇపు డీరెంటినిం గల్పి కంబమని యొకగ్రామంబుగ వ్యవహరింతురు. కృష్ణరాయపత్నికి సనఁగా నీ వరదరాజమ్మకు తుక్కాజీ యను నామాంతర మున్నట్లును, ఆమె కొన్నిశ్లోకములు కృష్ణరాయనికి దయగల్గునట్లు రచియించె ననియును ప్రతీతి గలదు. ఆశ్లోకము లీక్రింద వివరించెదము.

## తుక్కాపంచరత్నములు.

'తుక్కానామ గజపతిపుత్త్రీ కృష్ణదేవరాయ పత్నీ' అని యున్నది.

### శ్లో క ము లు.

౧. చర న్వనాంతే నవమంజరీషు న షట్పదో గంధఫలీ మజిఘ్రత్,
సా కిం నర మ్యా స చ కిం న రంతా బలీయసీ కేవల మీశ్వరాజ్ఞా.

౨. మా కింశుక ప్రకటయాత్మని మేవమాత్రిం మన్మ స్తకే విహరతీతి మధువ్రతోఽయమ్,
కిం మాలతీ విరహవేదనయా త్వదీయం దృష్ట్వా ప్రసూన మచిరా దనలభ్రమేణ.

౩. భ్రమర భ్రమతా దిగన్తరాళే క్వచి దాస్వాదిత మీక్షితం శ్రుతంవా,
వద సత్య మపాస్య పక్షపాతం యది జాతీకుసుమానుకారి పుష్పమ్.

౪. కుసుమాని లిఖన్తు నామ చిత్రే కతిచి త్కారువిశేషరూపశిక్షాః,
సురభిత్వ మమూని కిం లభంతే కిము చైతేషు రసం పిబన్తి భృఙ్గాః.

౫. కిం మాలతీం మ్లాయసి మాం విహాయ చుచుంబ కుంబీకుసుమం షడంఘ్రిః,
లోకే చతుర్భి శ్చరణైః పశు స్స్యా త్స షడ్భి రత్యర్థ పశు ర్న కిం స్యాత్.

అనునీశ్లోకములు వరదరాజమ్మచేఁ గృష్ణరాయనికిఁ దనయెడఁ దిరుగ ననుగ్రహము గలుగుటకునై రచియింపఁబడెననియును, అట్టి శ్లోకంబులఁ గృష్ణరాయనిహృదయము కరఁగెనని తెలియును.

ఇదివఱలోఁ గృష్ణరాయ విజయములో గజపతి తనకూఁతునిచ్చి కృష్ణరాయనితో సంధిచేసుకొనె నని చెప్పఁబడినది. అది మొదటిదో యీకథ మొదటిదో తెలియఁజేయు గ్రంథములు దొరకకపోవుటచేత నిపుడు మనము వ్రాయుచున్న గాథ కాధారము లేదు పైగా నీచిన్నది వినుకొండలోనుండు గజపతివంశీయుల పిల్లగాఁ జెప్పఁబడును. కాని టైలరు దొర తావ్రాసిన యనాలిసెస్ (Anatises) అను గ్రంథములో మాత్రము కృష్ణరాయనిభార్య విజయనగరమునకుం బోవుచుఁ దా నొక స్థలములో నిలిచి అంతకుఁబైకి బోవ నని చెప్పె ననియు, నాకారణమునఁ గృష్ణరాయ లాపె నచటనే నిల్పి తగినవసతి యేర్పఱిచె నని ఈక్రిందివిధంబుగాఁ దెల్పును—*

అంతమాత్రమున పైకథ కృష్ణవిజయకథతోఁ గలుపఁ గూడ దని తలంచెదను.

## కృష్ణరాయలద్వితీయవివాహము.

వరదరాజమ్మ కార్యములనుడుపు తఱి మఱిచి పైదానిఁ దెల్పుట కెడమీయమైతిమి మన మీతనిప్రథమవివాహవృత్తాంతము దెల్పియూరకుండిన నీఁక నీతండును వరదరాజమ్మపోలిక మునివృత్తి నుండెనని తోఁచనోఁపు. అటుగావున నాతని ద్వితీయ వివాహవృత్తాంతంబును దెల్పెదము. అదియుఁ దొల్లిటికథయట్లే యుండుటంజేసి మరలఁ దొంటి వృత్తాంతమునే చెప్పుచుంటి మని చదువువార లూహింపఁగలరు. కావున మనము ముందుగా నీరెంటుకథలకుం గలపోలికఁ జూపి దీనిలో భ్రమ యుండఁగల దని సూచించి కథ వ్రాయుచ్చుట మంచిపనికావున

*"The Gajapati king's daughter named Ruchi Devi (?) felt disposed to remain near Stambam (Cumbam) and the Rayar directed to do so, while he returned to Vizianagaram. That daughter of Gajapati, Ruchidevi said that as Kristnadevaraya was the son of a Dasi, and she herself of noble tribe illustrious by her birth, she preferred to abide by Kambam-Her father sent her thither large sums of money; she sold those jewels and had a very large water reservoir excavated near Cambam and she distributed very extensive charities.

నట్లే చేయుదము. వరదరాజమ్మను సాగఁబనిచి కృష్ణరాయఁడు మరల వివాహంబునకు బ్రయత్నంబుఁ జేయుచుండె. ఇట్లుండ నీతనికి నుత్కలదేశంబునకు (Orrissa) దండయాత్రాస్థితియై చనవలసినపని వచ్చె. అతఁడచ్చోఁ గొన్నిదినంబు లుండి యాభూమిపాలుని జయించిన నాతఁడు సంధికినొడఁబడియె ననియు నపుడు కృష్ణరాయం డాతనికూఁతుఁ దనకుద్వాహంబు సేసిన సమాధానంబు కల్గుననియె ననియుం జెప్పితిమి. (ఇపుడు వ్రాయుచున్న గాథ కృష్ణరాయ విజయగ్రంథానంతరగాథ) దాని కాతండు సమ్మతించి తనపట్టణంబు నలంకరింప చాటఁబనిచి తన నగరు నగురు ధూపాది సుగంధవస్తు సంవాసిత మగున ట్లొనరించె. ఆ వార్తలు విని యాభూపతి పుత్త్రిక తాఁ గులహీనుని భార్య గావలసె నేమి సేయుదు దైవమా యని చింతించి తుదకు నాకృష్ణరాయునిం జంపి తానుం జచ్చెద నని నిశ్చయించుకొనియె.

ఇట్లు నిశ్చయించుకొని తనకు మిక్కిలి యిష్టురా లగు తనచెలికత్తెతో నావృత్తాంతంబు మెల్లనఁ దెల్పి తనయుపాయంబున కపాయంబు లేదుగదా యనుడు నయ్యింతి యాచిన్నదానివాక్యము నెంతయుఁ బోషించి యాపెబుద్ధిం భూషించి దానిం దప్పక సేయు మని తెల్పి నిజావాసంబునకుం జని తనకు మిక్కిలి హితురా లగునొక్క పూఁబోణికి శ్రుతపఱిచె. ఆఁడుదాని నోట నూవుగింజ దాఁగ దను నట్లు అది తనప్రాణసఖికిఁ దెల్పె. అయ్యింతి తనచేస్తపుఁగత్తెతో విన్నవించె. ఇట్టివర్తమానం బానోటనుండి యానోటఁ జేరి క్రమంబుగఁ దిమ్మరుసు చెవిం బడియె. ఆలోఁ గృష్ణరాయలను మంగళస్నానంబునకుం గొంపోయి యభ్యంజనంబు గావించుచుండిరి. తిమ్మరు సెంతయు దనలో నాలోచనంబు సేసి యిపు డేమైన నోరు మెదపినఁ గార్యభంగం బౌ నని యెంచి తగునుపాయం బాలోచించుచుండె. ఇచటఁ గృష్ణరాయలఁ దెచ్చి పెండ్లిపీటపైఁ గూర్చుండఁబెట్టి యాయుంగనామణికి మంగళసూత్రంబు గట్టించి. ఆరాత్రి యొకశుభముహూర్తంబున శ్రీపుష్పయోగం

బునకుఁ బంపందలంచిరి. అపుడు తిమ్మరుసు కృష్ణరాయలకడ కరుగుదెంచి యాతనికి రహస్యంబున నావృత్తాంత మంతయుం జెప్పె. దాని కాతం డెంతయుఁ జింతించి యిదియుఁ దొంటిచందంబే యయ్యెనా యని యోచించుతఱిఁ దిమ్మరు సాతని కిట్లనియె. స్వామీ నీవు చింతింపవలదు. నీకు బ్రాణభయం బేమియు లేదు. నేనొక యుపాయంబు వన్నియున్నవాఁడ. దానిచే నాయింతిమనంబు సుపథంబునకు వచ్చు నని తలంచెద. ఈ దినం బేలిక యేవారికిఁ గాన్పింపకుండ నొకరహస్యస్థలంబునం బడియుండుఁడు. అని తెల్పి యాతనిం బనిచి తిమ్మరుసాపునస్సంధానభవనంబునకుం జనియందుఁ గృష్ణరాయునికి మాఱుగ నొక విగ్రహంబు సిద్ధంబు సేసి దానిలోఁ దేనె బోయించి హంసతూలికాతల్పంబున దాని నుంచి పైనుత్తరీయంబు గప్పి రాయండు బడలి యున్నాఁడు గావున నాతనిఁ గొంత వఱకు లేపవల దని యచ్చటిస్త్రీజనంబులకుం దెల్పె. వారును జరగనున్న వృత్తాంతంబు దెలిసియున్నవార లే కావున సంతసమేమియు లేక వల్లె యని పెళ్ళికూఁతు నచ్చో దిగ విడిచి తలుపుమూసి తమత్రోవం జనిరి. అంతకుమున్నె తిమ్మరుసు నలుదిక్కులు బరికించి యేరికిఁ గానరాకుండఁ గృష్ణరాయల మంచముక్రింద నొదిగియుండె. చెలులందఱుఁ జనినతోడనే యారాజకన్యక తాను దాఁచి తెచ్చినబాకుం దీసి యారాజు నొక పోటు పొడిచె. తోడనే యందున్న మధుద్రవంబు పైకిఁ జింది యా యింతిముఖంబుపయిని నోటంబడియెను. దానిరుచి వెంటనే చూచి యాహా? యీరాజురక్తం బింతరుచిమై యున్నది. రా జెట్టివాఁడో గదా! మన కనుభవించుపంతు లేదయ్యె ననుడుఁ దిమ్మరుసు మెల్లన వెలికివచ్చి తల్లీ యారాజు వలయునేని నీ కాతనిం దెచ్చి యొప్పింతు. నీతొంటిబుద్ధి మానునట్లు వరమిమ్ము. అనుడు నాయింతి నిశ్చేష్టితయై కొంత తడవుండి యాతండు తిమ్మరుసుగ నెఱింగి తాఁ జేసినద్రోహంబునకు క్షమియించి రక్షింప రాజునకుం జెప్పి యాతనిం దోడితెమ్మని ప్రార్థించె. అపుడు తిమ్మరుసు పెండ్లికూఁతుచే బాస లనేకంబులు

చేయించి రెండవగదిలోఁ బంపియున్న రాయల కవ్వార్తఁ దెలపి తోడి తెచ్చి యీ వధూవరులఁ గలిపి యొకరియెడ నొకరికి గల్మషం బుండకుండఁ బ్రమాణంబులు సేయించి వారల దీవించి తనయింటికిఁ జనియె. అతని యాశీర్వచనబలంబుచే నాదంపతులు విశేష మైత్త్రి గల్గి చిరకాలంబు సకలభోగభాగ్యంబు లనుభవించి సంతసమున నుండిరి. ఆచిన్నదాని పేరు తిరుమలదేవి. మొదటి భార్యకుఁ జిన్నాదేవి యను నామాంతరము గలదు.

## కృష్ణరాయని సంతానము.

కృష్ణరాయనికిఁ బురుషసంతానము లేదని యిదివఱకే చెప్పియున్నారము. అతనికి స్త్రీసంతాన మున్నట్లుగ దృష్టాంతము లున్నవి. ఆ గ్రంథములలో నొకటి రామాభ్యుదయము. అందు అళియరామరాజుం గూర్చి వర్ణించుచు.

"ఆపటుకీర్తి రామవసుధాధిపచంద్రుఁడు కృష్ణరాయధా
త్రీపతిసార్వభౌమదుహితృప్రియుఁడై."

అని చెప్పంబడియున్నది. ఇఁక రెండవగ్రంథము హైదాబాదాతురుష్కప్రభువుల వ్యవహారచరిత్రము. అందులోఁ బాదుషా కొండబీరుకోట పట్టుకొనినప్పుడు కృష్ణదేవరాయలు తనయల్లుం డగు "శివరాజు లేక బసవరాజను" నతని లక్షసైన్యములతోఁ బంపినట్లుగా వివరించఁబడి యున్నది. ఈ బసవరాజు బెజవాడలో నధికారము చేయుచుండిన పూసపాటివారి వంశములోనివాఁడు. ఇతని నాఁ డుదయగిరి దుర్గము మొదలు రాయవేలూరువఱకునుండుదేశము పూసపాటివారి స్వాధీనములో నుండె నని చెప్పియుంటిమి. పై యిర్వురు రాజులయొక్క భార్యలు కృష్ణరాయనికూఁతులుగాఁ గాన్పించుచున్నారు. ఇంక నెవరైనఁ గలరేమొ తెలియదు.

## కృష్ణదేవరాయల సాహిత్యవిషయము.

ఈ కృష్ణరాయండు నొక గొప్పకవి. ఈతని ప్రజ్ఞావిశేషంబు

లును సాహితీపతియును నీతనిచే రచియింపంబడిన యీయాముక్తమాల్యదం జూచిన గోచరంబవు. ఈతండు తత్పూర్వము రసమంజరీ ప్రముఖ సంస్కృత గ్రంథంబు లనేకంబులు రచియించె. ఈతఁడు గతించిన పిమ్మటఁ గొంద ఱాముక్తమాల్యదకుఁ గవి యీతండు కాఁ డనిరి. దానికి వారి వలనఁ గొన్ని కారణంబులు చెప్పఁబడినవి. వానిని సంగ్రహంబుగ నిట వివరింతము.

పెద్దన ముందు మనుచరిత్రంబు వ్రాసె ననియు దానిం జూచి రామభూషణుఁడు వసుచరిత్రము నంతకు నెక్కుడు రసమంచితముగ నొనర్చెననియు దానికిఁ గనలి పెద్దన యీయాముక్తమాల్యదను వ్రాసెనని యు, నది కఠినం బగుటచేఁ దానిఁ దనపేరిటఁ బ్రకటింపక కృష్ణరాయల పే రందుఁ గీల్కొల్పె ననియు దీనికి దృష్టాంతంబుగఁ బెద్దన మనుచరి త్రంబులోఁ జెప్పినపద్యంబులే కొన్ని యం దున్నవనియుఁ నట్టివచోధో రణి పెద్దనకుం దక్క నన్యులకు నలవడ దనియుఁ బల్కుదురు. ఇవుడి పుడు కొంద ఱాధునికులు రెండు గ్రంథంబులు సావధానంబుగఁ జూచి మనుచరిత్రములోనిజాడ లాముక్తమాల్యదలోఁ గానరాకుండుటం జేసియు గొన్ని ఛందోభేదంబులును వ్యాకరణభంగంబులు నిం దుం డుటంజేసియు నిది పెద్దనకృతంబు గా దనియు మఱియొకండు కల్ప నాంశంబునఁ బెద్దన యంత వాఁ డైనను శాస్త్రంబున నాతనిం బోలె విశేష పరిశ్రమంబు లేనివాఁడు రచించి నట్లున్నదనియు నిర్ణయించిరి. గ్రంథంబున నున్నస్ఖాలిత్యంబులం గూర్చి తర్వాత విచారింతము. అది పెద్దన కవనంబు స్పష్టంబుగఁ గా దనుటకు నిప్పటివారిచే మఱికొన్ని హేతువు లూహింపఁబడుచున్నవి. అందుల నిజం బాలోచింపక తెలి యరాదు.

౧. వసుచరిత్రముం జూచి పెద్దన యీర్ష్యచే నాముక్తమాల్య ద రచించె నని యుండెనుగదా దానికిఁ గారణం బూహింప వలయు. పెద్దన ప్రబంధమునకు వలయువర్ణనలును దానికిఁ దగు రచనావిశేషం

బుల రీతులు నేర్పఱిచి యాంధ్రకవితా పితామహుం డని బిరుదంబె. పిమ్మట లక్ష్యగ్రంథంబుగ మనుచరిత్రంబు రచియించి స్వసామర్థ్యంబు నూపె. ఇట్టిపని యీతనికిం బూర్వు లగు నన్నయభట్టారక ప్రముఖ పురాణకవులును శ్రీనాథప్రముఖ కావ్యజ్ఞులును జేసియుండరైరి. కావున నీతనికి విశేషసన్మానంబు గలిగె. ఇట్టి యుత్తమోత్తమ మగుగౌరవమును బొందినయీతండు రామరాజభూషణుండు వసుచరిత్ర రచించె నను నీర్ష్యచే నతనికంటెను గౌరవంబు వడయ నింకొక ప్రబంధంబు వ్రాయ నుద్యోగించినాఁడను మాట యుక్తియుక్తముగ నుండ లేదు. ఇంతియ గాక పెద్దనయే యట్లు వ్రాయుపొరకొన్న నెట్టిదానినైనను వ్రాయసమ ర్థుండగుటకు సందేహంబు లేదు. కఠిన మాయె నని యెంచిన దాని విస ర్జించుఁగాక చించుఁగాక రాజుపే రం దుంచుటకు యత్నించునా. మనుచ రిత్రంబు ముం దిడుకొని వ్రాసి రామభూషణుఁడు వసుచరిత్రమును రస నమంచితముగఁ జేయ వసుచరిత్రంబు ముం దిడుకొని భూషణుని కె క్కుడగు పెద్దన యాముక్తమాల్యద వ్రాయ నుద్యోగించిన దాని నెట్టి రసవంతముగఁ జేయవలయు ? అట్లుగాక కఠినమాయెనని యెంచియు రసపుష్టింగూర్చి తలంచియు దాని పండితులకుం జూపుటెట్లు గలుగు దీనిం బరస్పర భేదంబు లుండుటచేత నీయాముక్తమాల్యద పెద్దన కృ తం బనుట సరి కా దని తోఁచెడిని.

౨. గ్రంథంబున వ్రాసియుండు సంగతులంగూర్చి కొంత యోచించి యీవలఁ దొంటి యభిప్రాయంబు స్థిరపఱుతము. “ అని యిష్టదేవతా ప్రార్థనంబు సేసి మున్నే కళింగదేశ విజిగీషాయనీమన్ దండెత్తిపోయి విజయవాటిం * గొన్ని దినంబు లుండి శ్రీకాకుళనికేతనుం డగు నాంధ్ర మధుమథను సేవింపంబోయి హరివాసరోపవాసం బచ్చటఁ గావింప నప్పు ణ్యరాత్రచతుర్థయామంబున నాయీశ్వరుండు స్వప్నంబున సాక్షాత్క రించి యి ట్లనియె:—

* దీని నిప్పుడు బెజవాడ యందురు.

సీ. పలికి తుత్పే ప్రిక్షోపమలజాతి వెంపెక్క, రసిక లౌనన మదాలసచరిత్ర
భావధ్వనివ్యంగ్యసేవధి గాఁగ జె, ప్పితివి సత్యావధూప్రీణనంబు
శ్రుతిపురాణోపసంహిత లేర్చి కూర్చితి, సకలకథాపారసంగ్రహంబు
శ్రోత్రఘచ్ఛటలు విచ్చుగ రచించితినూ క్తి, నైపుణిజ్ఞాన చింతామణికృతి
తే. మఱియు రసమంజరీ ముఖ్యమధురకావ్య, రచన మెప్పించికొంటి గీర్వాణభాష
సంధ్రిభాష యసాధ్యంబె యంసు నొక్క, కృతినినిర్మింపుమిఁకమాకుఁ బ్రియము గాఁగ.

అని పల్కి యాముక్తమాల్యద రచించుమని భగవంతుండాజ్ఞయొసంగి, అంతర్హితుం డైన నిద్రమేల్కాంచి సిండోలగం బుండి విద్వజ్జనుల కత్తెఱం గెఱింగించిన వార లాస్వప్నఫలంబు విప్పి సెప్పి యఖర్వమహిమాతి ధూర్వహుఁ డగుతుర్వసు వంశంబునం బుట్టిన నీ కిట్టి శోభనంబు లే మద్భుతంబు లవధరింపు మని యాతనివంశప్రణాళిక పెద్దనచే మనుచరిత్రంబున వర్ణింపఁబడినరీతిఁ జదివి.

తే. ప్రబల రాజాధిరాజ వీరప్రతాప, రాజపరమేశ్వరార్థదుర్గాసటీశ
సాహితీసమరాంగణ సార్వభౌమ, కృష్ణరాయేంద్ర కృతిని నిర్మింపు మనిరి.

అని పండితులు తనకు నాజ్ఞయొసంగఁ దా నాకృతిని నిర్మించితి నని కృష్ణదేవరాయండు చెప్పిన ట్లున్నయది. మనము తొంటిపల్కులఁ జాటించిన నిది యంతయు బూటకంబు గా వలయు. గ్రంథంబు రచియింప నసమర్థుం డై యొరులచేఁ జేయంబడిన గ్రంథమందుఁ దనపే రుంచనుంచువాఁడు తాఁ బూర్వ మనేక గ్రంథంబులు రచించినట్లు చెప్పించుకొనుటచేఁ గల్గెడులాభ మపహాస్యంబుకంటె వేఱుండదు. తొంటి సంస్కృతాంధ్ర కవులు స్వకృత గ్రథంబుల నితరులపేరు లిడునపు డబద్ధము లిట్లాడుట లేదు. ఇట్టిహీనకార్యంబునకు లోఁబడి కృష్ణరాయం డబద్ధంబుల నాడించుకొని పండితుల మొగంబు లెట్లు చూచు నని సంశయంబు వొడమెడిని.

3. ఇంతియకాక పెద్దనయే దీనింగూడ రచించి రాజుపేరిటం బ్రకటింపఁ దొరకొన్నఁ దా నా వఱకు మనుచరిత్రంబునఁ జెప్పినపద్యంబుల దీనియందుంచ నితరులు స్వకృత మని యెఱింగిన రాజునకు గౌరవహీ

నం బగు నని యెంచి వాని నం దుంచుట కెంతమాత్రంబు నుద్యోగిం చియుండఁడు. అ ట్లుంచెననుటకుఁ గారణంబును వినుము. అతండు క్రొ త్తవాని రచించు సామర్థ్యంబు లేమిం జేసి వీనినే యుం దుంచెనా లేక యివియ లోకంబులోని పద్యములలో రమణీయంబు లనియుంచెనా? మఱియొకరు పెద్దనకానివారు వీని నిందుంచినా రని యూహించుట యుక్తమై కానవచ్చుచున్నది. పెద్దనపద్యంబు లిం దుండుటం జేసియే యిది యాతని కృతి గా దని కంఠోక్తిగాఁ జెప్పుటకు హేతువై యున్న ది గాని యాతనికృతంబే యనుటకుం గాదు. వంశావళి పద్యంబులు కాని వింకొకగొన్ని యుం దున్నట్లు మనకుఁ గాన్పించు. అవి పెద్దనపై గ్రంథకర్తకుం గలగౌరవమును సూచించుటకుఁగాఁ గైకొనంబడియె నని యూహించుట యుక్తము.

౮. గ్రంథంబున నున్నకథం గూర్చి కొంత యాలోచింతము. వైష్ణవ మతానుసారంబుగ గ్రంథారంభం బున్నయది. కథయు వైష్ణవసంబంధ మైనదే. వైష్ణవధర్మంబులును, తద్రహస్యంబులును, దత్సంబంధే తిహాసంబులు నున్నయవి. కావున నీగ్రంథంబు వైష్ణవమతావలం బకునిచే వ్రాయఁబడిన ట్లూహింపఁబడుచున్నది. పెద్దన స్మార్తుఁడే యని యాతని మనుచరిత్రారంభస్తోత్రపాఠంబులచే నూహింపనయ్యెడి. అయిననేమి పెద్దన పైగ్రంథము రాజుపేరిటఁ బ్రకటించఁ దలఁచెఁగావు న నాతనికి నిష్టం బగు వైష్ణవమతానుసారంబుగనే రచించె నని చెప్ప వచ్చు. కాని పెద్దన కీయభిప్రాయంబు మొదటనుండియు నుండినట్లు కానరాదు. ఉండుటకుఁ గూడ ప్రసక్తి లేదు. అనంతర మొక వేళ గ్రంథం బు మార్చుటకుఁ బెద్దన కిష్టంబున్నఁ గృతిముఖంబు మాఱుప యత్నిం చుఁగాని కథగూడ మాఱుపఁదలఁచెడుగదా.

కావున వైష్ణవుండే వ్రాసె నని తోఁచెడిని. పెద్దన తాను శఠ గోపాచార్యశిష్యుఁడ నని మనుచరిత్ర కృతిముఖమునఁ జెప్పియున్నను స్మార్తులలోని వాఁడే యవుటం జేసి కృతిముఖములోనే స్వమతాచార

ము వదలలేకపోయెను. ఇఁక నాముక్తమాల్యదాకారుఁడో ప్రారంభమునందే వైష్ణవమతానుసారముగ స్తోత్రపాఠంబులు చెప్పెను. కథాసందర్భములోఁగూడ భాగవత ధర్మబోధక మైనదాని నెత్తుకొనియె. దీనికి నాలవయాశ్వాసంబులోని యామునాచార్యవర్ణనంబునం గలవైష్ణవమతసాంప్రదాయంబులే దృష్టాంతములు. ఇతరమతస్థులచే నిది రచింపఁబడినవైష్ణవభక్తియుఁ బ్రపత్తియుఁ జూపుటకుఁ దగిన వచోధోరణిచేఁ బ్రకాశించుట గడుదుర్లభంబు. కావునఁ దన్మతస్థుఁ డొకఁడు వ్రాసె ననుటకు సందియంబులేదు. కృష్ణరాయండు తాతాచార్యుల శిష్యుం డనియు, విశిష్టాద్వైతి యనియు జగత్ప్రసిద్ధి గలదు. ఈతం డీగ్రంథమును రచించె ననుటచే నివియన్నియు నీతనికడ నన్వయించు.

౫. రాజులకుం గలసామర్థ్యాతిశయంబు సమీపవర్తు లగుపండితులమూలముగ నూహింపందగియుండు. జగత్ప్రసిద్ధు లగునష్టదిగ్గజంబులు నీతని యాస్థానపండితులేగద. వారివారికవననైపుణిం జూచి యొక్కొకతఱి నెక్కుడుగ సంతసించి విశేషబహుమతుల నిచ్చుచుండె ననియు, విద్యల భోజుం డనియు విఖ్యాతి గలదు. ఇట్లు భోజునిఖ్యాతి గలిగి యున్నాఁ డని నుడివినచో భోజకృతగ్రంథంబులు కాళిదాసకృతంబు లని యేరైన ననుచుండిరా. రాజును ప్రసిద్ధుఁడైన కవి యయ్యెనేని యట్టి మాటలు పుట్ట వని యనవచ్చు. ఈ రాజు లిర్వురును బ్రసిద్ధులైనకవులే. అందు భోజునకు నాతని ముఖంబు చూచువారెల్ల కవులయ్యెదరని వాడుక గలదు. కావున భోజుండు కవియవుటకు సందియ ముండదని యొప్పికొనిరి. కృష్ణరాయల కట్టి విఖ్యాతి లేదు గావునఁ గవి యని సందియంబుపడకుండ సమ్మతింపరైరి. పెద్దనకృష్ణరాయ లుత్ప్రేక్షోపమస్వాభావోక్తులఁ గవనంబు నుడువువారును గఠినవచోధోరణిగలవారును గావున వీరిభేదంబు నరయుట దుర్లభం బై యుండు. పెద్దనకుఁ బండితఖ్యాతి విశేషంబుగ నుంటం జేసియు నాముక్తమాల్యదలోఁ గొన్ని ప్రౌఢకల్పన లుండుటం జేసియు మనమీవఱకుఁ దెల్పిన సమానప్రజ్ఞలు

కొన్ని యిర్వురకు సహజంబు లవ్వుటం జేసియు అక్కడక్కడ పెద్దన్న పద్యంబులు కొన్ని యుం దుంటం జేసియు నీగ్రంథమునకుం గూడం బెద్దన యే కవి యని భ్రమగలుగుచున్నది. పెద్దన కృతం బీగ్రంథము కాదనుటకు దృష్టాంతములు పెక్కులు గలవు. అందు ముఖ్యమైనది రేఫ శకట రేఫల మైత్త్రి సమ్మతము. ఇది యీగ్రంథంబులోం దఱుచుగం గానవచ్చెడి. దీనికిం గొందఱు లాక్షణికులు కొన్ని విధంబులుగను మఱికొందఱు మఱికొన్ని విధంబులుగం జెప్పుదురు. ఈగ్రంథంబునందే కొన్ని ప్రయోగములు గాన్పించుటంబట్టి ఆశబ్దములకు ద్వైరూప్యము లున్నట్లు కొందఱులాక్షణికుల మతము. తొల్లిటి యాంధ్రగ్రంథంబులలో నిట్టివానికి ద్వైరూప్యములు కానరావు గావున నీకవికూడ వీనిమైత్త్రికి సమ్మతించినవాఁడే యని మఱి కొందఱిమతము. అందుం గొన్నింటి నిచ్చట వివరింతము—"ఆముక్తమాల్యదా కారుండు లఘు రేఫములుగం బ్రయోగించిన వాని నితరకవు లట్లు ప్రయోగింప కుండుటచే నతఁడును లఘ్వలఘు రేఫములకు మైత్త్రి చెప్పిన వారిలోఁ జేరినవాఁడని యెంచుట యుక్తము. శైలి లోనగువానిం బట్టి చూడ నాముక్తమాల్యద చేసినాతఁడు పెద్దన కాఁడని దృఢముగా దోఁచుచున్నయది. పెద్దనకవి రచితగ్రంథంబులోని పద్యంబులు కొన్ని యందున్న వని చెప్పవచ్చెదరేమో దానికిం గారణాంతర మేదేని యుండనోపు." నని యలఘుకౌముదికారుల యభిప్రాయంబు. ఇంతియ కాక:—

ఉ. "సదన మింక కొక్క మా టరసి చంచలలోచనఁ గానకున్న దూ,
రెదు మఱి కాని బుద్ధి విపరీతతఁ బొందక చూడుమా"

"అనుదానిలో దూఱు" లఘు రేఫము గలదిగం బ్రయోగించినందులకుం దిమ్మకవి యాక్షేపించినాఁడు.

౨. చ. తరుణులకౌఁగిట న్మనుచుఁ దమ్ము వృథా విరు లెత్తుచేసి పో
పరులఁగఁ జైతు్రిడంచుఁ దదభావమనోభవవహ్ని వేల్చి ని
ర్ఝరమధుపాళి ధూమము బరాగపునీరును దేసె కట్టి చా
దరమునగఁ దాల్పగాఁ గొఱవు లై యెఱుఁగంబడెఁ గొన్ని భూజముల్.

అని ఇంవలి కొఱవిశబ్దము రెండర్థములు గలది. ఒకయర్థము కాలి చల్లారినకఱ్ఱ. రెండవయర్థము కురువకవృక్షము. కురువకవృక్షభవ మగునప్పుడు గురు రేఫం బుండవచ్చునా యని యొక యాక్షేపణ. ఏమనిన సంస్కృతంబున గురు రేఫములు లేవు. తద్భవంబులకుఁగూడ నెచ్చోట ను నున్నట్లు గానరాదు. "తద్భవంబుల శకట రేఫ ముండకూడదు" అని కవి సంశయవిచ్ఛేదము. దీని నూహించి ద్విరేఫవర్ణదర్పణకారులు నాముక్తమాల్యదలోని శ్లేషరచనవలనను లఘువుగ దీనికిఁబ్రయోగంబు గానరాకుండుటం జేసియు గురువుగ నిర్ణయింపవలసి వచ్చినట్లు చెప్పి యుండిరి.

ఇంతియకాక యీగ్రంథంబున నచ్చటచ్చటఁ గొన్ని వ్యాకరణ స్ఖాలిత్యంబులుగూడఁ గానన య్యెడి. వీనిం బట్టి యూహించిన నీగ్రంథం బునకుఁ బెద్దన కృతికర్త యెట్లగు నని తోఁచకపోదు. వానినన్నిఁటి నిట నగపఱుచుట గ్రంథవిస్తర కారణము గావున నేదేని నొకదానిం జూపి ముందువృత్తాంతంబు నుడువుదము.

౪. చ. అడుగున నుండియూ స్ఫదిల పై చదలం బెడుకోట, నొప్పు పో
ర్చెడనిక డంకదంచనవుచేతుల గంగను కాసె దూఱుగా
నడుమున యున్కిఁజేసి యలనాకపురి నృరికై పెనంగి లా
వడలఁగఁ బట్టి వేఁయుటకు నెత్తినసం జను మల్లుపోరునన్.

ఇందు గంగను కాసె యనుచో సంధి విచార్యము. "బహుళ గ్రహణముచేత స్త్రీవాచక తత్సమ సంబోధనాంతములకు సంధిలేదు. గంగను కాసె నెల తిచ్చె నని యాధునిక ప్రయోగంబులు గాన్పిం చు. వీనికిఁబూర్వకావ్యంబులఁ బ్రయోగంబులు మృగ్యంబులు. అని బాల వ్యాకరణము. ఇంకనుఁ గొన్ని ప్రయోగంబు లిట్టివే యచ్చటచ్చట గాన నయ్యెడి. పెద్దనయే యీ యాముక్తమాల్యదకును మనుచరిత్రమునకును గవియైన రెండవగ్రంథం బగుదీని రచించుతఱి నెక్కుడనుభవము గల్గియుం డునా. లేక మొదటరచించిన మనుచరిత్రబున కెక్కుడనుభవము గల్గియుం డునా? రెండవగ్రంథంబును రచించుటినే యని సర్వసామాన్యముగఁ

దోఁచును. అటులైన సీక్షాలిత్యంబు లుంటకుం గారణంబు లేదు. మొదటి దానికే యెక్కుడు గల్గియుండు ననినఁ జెప్పనేల. ఇట్టి భేదంబులంబట్టిచూడ నిది పెద్దనకృతంబు గా దని స్పష్టంబుగ దోఁచెడిని. దీనియందు మనుచరిత్రంబులోని పద లాలిత్యంబును లేదు. రసపుష్టియు నంతమాత్రంబ. అటు లనినచో దీనికవి కవి యేమియుం దెలియవు గాఁబోలు నని యూహింపఁగూడదు. ఇట్లుండుటకుఁ గారణంబు లుండనోవు. కృష్ణరాయండు పెద్దన మొదలగు కవులరీతిని గురుశుశ్రూష చేసి క్రమకోర్చి చదువు నభ్యసించి యున్నవాఁడు కాకపోవచ్చు. అయిన నెల్లపుడుఁ బండిత గోష్ఠి నుండువాఁడు గావున ముందు శృతపాండిత్యంబు విశేషంబుగ సంపాదించి పిమ్మట శాస్త్రసంప్రదాయంబులు నేర్చి బుద్ధిమంతుండుగావున కవియై గ్రంథముల రచియించి యుండు. విద్యలఁ గ్రమశిక్షితుండు గాఁడనుట కీతనిపదలాలిత్యంబే దృష్టాంతంబు. ఇష్టానుసారంబుగఁ బ్రయోగించిన పదంబు లవుటం జేసి యవి యొకచో నిర్ణీతార్థంబుకంటె నధికంబుగ వేఱొకచో న్యూనంబుగ నుండి త్వరలో భావద్యోతకంబులు గావు. ఇట్టి చిక్కులు పెద్దన మొదలగు వారి గ్రంథంబులఁ గానరావు. శబ్దంబుల నర్థకాఠిన్య మున్నను, భావకాఠిన్య మింతగా నెందును గానరాదు. ఈ పైఁజెప్పిన హేతువులనుబట్టి యూహింప నీగ్రంథంబు విశిష్టాద్వైతిచేతను సహజపాండిత్యునిచేతను రచియింపఁబడినట్లు గాన్పించెడిని. కృష్ణరాయలయం దీధర్మంబు లన్నియుఁ గాన్పించుటచేత నాతఁడే దీని రచించినాఁ డని నిశ్చయింపఁదగియున్నది. ఈతఁ డచ్చటచ్చట నాశ్వాసాంతములఁ జెప్పిన పద్యంబులును మననిశ్చయమున కెంతయు బలము నిచ్చుచున్నవి. అం దొకదాని నిట వివరింతము.

మ. ఇది భూమండన కొండవీటిధరణీ భృద్దుర్గపూర్వాద్రిభా
స్వదిభేశాత్మజవీరభద్రజనజీవగ్రాహ రాహుచ్ఛాయమా
ణదృఢాంచద్భుజకృష్ణరాయమహిరాట్ప్రామాస్మదాము క్తమా
ల్యద నాశ్వాసము గద్యపద్యము ద్వితీయం బై మహిం బొల్పగున్.

ఇట్టిపద్యంబులంబట్టి మనకు సంశయంబుతోఁ బని లేదు.

ఇంతియకాక యీ యాముక్తమాల్యద పుట్టుటకును గవికర్ణరసాయనము కారణ మని యిదివఱకే వ్రాసియున్నాము దానినే మఱి యొకపరి చూడఁదగును.

కవికర్ణరసాయనముతో సరిగా నుండుటకు నుద్దేశించి రచియింపఁబడినయాముక్తమాల్యదమాత్రము ఆమృదుశైలి నొప్పదాయెను. కవికర్ణరసాయనములోఁ గల్పనా చమత్కృతులును శాస్త్రసాంప్రదాయములును, పాండిత్యవిశేషంబులుగూడ నాముక్తమాల్యద కెక్కుడుగా నున్నట్లే పండితుల యభిప్రాయము. అయిన నాముక్తమాల్యద అనేకప్రబంధములకంటె మిన్నయై యున్న దనుటకు సందియము లేదు.

పై రెండుగ్రంథరీతులనే యనుసరించి కవిరాజమనోరంజన మను నొక గ్రంథము కనుపర్తి అబ్బయాకవిచే మఱికొన్నిదినంబు లైన పిమ్మట రచియింపఁబడినది. ఆ గ్రంథము మాత్రము కవితాసౌకుమార్యాదులయందుఁ గవికర్ణరసాయనమును ఆముక్తమాల్యదను మించియుండినను శాస్త్రపాండిత్యాదులలో నారెంటివలె ప్రౌఢముగా నుండదు.

ఆముక్తమాల్యద కృష్ణరాయకృత మనుటకు సందేహములేదు

ఈ నడుమ నొక క్షత్త్రియమిత్త్రుం గలిసికొని ఆముక్తమాల్యద యొక్క కవినిగూర్చి మాటలాడుచుండఁగాఁ నతఁ డాముక్తమాల్యద కవి క్షత్త్రియుఁ డని చెప్పుటకును, అట్టి క్షత్త్రియుఁడు సామాన్యుఁడు గాక విశేషరాజభోగముల ననుభవించు మహారాజై యుండు నని తెలుపుటకుఁ దగిన దని యా ముక్తమాల్యదలోని యీక్రిందిపద్యంబుఁ జదివె. ఎట్లన్నను:—

శా. తారుణ్యాతిగఁ జాతనూత్న ఫలయుక్తైలాభిఘాతస్వనో
ద్గారాధూతశిఖండికుండంబుప్యాతమాత్న్యచ్ఛేదపాకోద్గతో
ద్గారంబున్ గనరార్చుభోగులకు సంధ్యావేళలన్ గోళికాం
తారాభ్యంతరవాలుకాస్థితహిమాంతర్నారికేళాంబువుల్.

అని యీపద్యముం జదివి కేవలము మత్స్యములు తినువాఁడు నున్నటువంటి యిందులోఁగూడ రాజభోగ్యముగా దానిని పచనము చేయువిధములం దెలిసినవాఁడుగాని యిట్టిఅపరూపవర్ణనలు చేయంజాలఁడు. కావున నీ యాముక్తమాల్యద పైలక్షణములు గల్గినక్షత్రియుని వలనఁగాని లేక అతనికి సమానుఁ డగుమఱియొకవర్ణాంతరునివలనఁ గాని రచియింపఁబడవలయును గాని అట్టిమత్స్యభుక్కులు కాని బ్రాహ్మణు లగుపెద్దనాదులవలన రచియింపఁ బడఁజాల దని నిష్కర్షించి చెప్పెను.

మా పైసిద్ధాంతములపై వచ్చిన పూర్వపక్షములఖండనము.

కొంతకాలము క్రిందట నముద్రితగ్రంథ చింతామణి కొకరిద్దఱు బుద్ధిశాలురు పెద్దనామాత్యుఁడే ఆముక్తమాల్యదను రచియించినకవి యని కొన్నిజాబులు వంపిరి. వానికిఁగూడ సమాధానములు చెప్పక పై యంశమును సిద్ధాంతీకరించితి మనఁగూడదు గావున వాని నీక్రింద వివరించి చూపెదను. ఎట్లన్నను :—

{ అముద్రితగ్రంథచింతామణి. సంపుటము. 2
7 నెంబరు సంచిక అ 1888 సం. డిసంబరునెల. }

శ్రీమదముద్రితగ్రంథ చింతామణి పత్త్రికాధిపతిగారి సముఖమునకు.

మీపత్త్రికాచంద్రముపై నే నీక్రిందఁ బొందుపఱచు చందంబు మందంబైనను మీకు నందించినయెడ నానందంబు సందియంబు బొందెడి.

సీ. శ్రీపూండ్లవులరామకృష్ణయార్యోదయ, ర్వీరవానగయకవివీరపత్త్రి
కామణ్యముద్రితగ్రంథచింతామణి, చింతామణియుఁబోలె వంతతోన
శించు నని నిరాశ జేసికొన్నప్రబంధ, ముల నుద్ధరించుచు మోదమలర
హృద్యంబు లగుననవద్యపద్యముల, నభేద్యసమస్యల గద్యములను
తే-గీ. గలిగి సత్కవిజీవితములనుగూడ, సంశయాంశస్థలంబులఁ జాటుచుండి
సింహపురమున వెలఁవడి సింహ మగుచు వెలయుచుండెడుకాకవిద్విషయులకును.

ఇందుఁ బొందుపఱచుచు దాని మీపత్త్రికయందు ముద్రించి తావకాభిప్రాయం బు నియ్యఁ గోరెద.

ఆముక్తమాల్యద పెద్దనార్యకృతంబు కా దనియుఁ, కృష్ణరాయకృతంబే యని యుఁ గవిజీవితకారాద్యాధునికుల యభిప్రాయం బై యున్నది. ఈదిగువను గనుపఱచిన కారణంబులచే నయ్యది సరి యని నేఁ దలంపఁజాల.

1. ఈగ్రంథంబు నిక్కంబుగఁ గృష్ణరాయకృతం బేని సర్వజనోపకారియు రాజ్యాధికారియుఁ గవిజనజీవనాధారకారియు నగురాయం డసమర్థుం డనియు నాముక్తమాల్యదాకారుండు కాఁడనియుఁ బెద్దనయె రయించి రాయలపేరు బెట్టె ననియు నిట్టి యపవాద పుట్టుటకుఁ గారణంబు గానరాదు. భోజరాజకృతం బగుచంపూప్రబంధాదులను గాళిదాసుఁడు చేసె ననరే. ఇట్టిపట్టుల నబద్ధంబు పుట్టె దని దిట్టంబుగఁ జెప్ప నొప్పు.

2. లోకంబులో నొకరు గ్రంథంబుఁ జేసి మఱియొకరి పేరఁ బెట్టుట సర్వసాధారణంబుగా నున్నదిగదా. ఇందుకుఁ బెద్దిభట్టు చేసినవ్యాఖ్యానంబులును పుష్పగిరితిమ్మన కృతం బగుదశావతారచరిత్రయు నుత్తరరామాయణంబును దార్కాణంబులు గావున “ఇట్లు హీనకార్యంబునకు లోఁబడి కృష్ణరాయం డబద్ధంబుల నాడించుకొని పండితుల మొగంబు లెట్లు జూచు నని సంశయంబు వొడమెడిని” యనునది సహేతుకంబుగ నుండలేదు.

3. ఈక్రిందిపద్యంబులు, పైయభిప్రాయంబునకు బలీయంబులు.

(*a*) సీ. కృష్ణరాయలపేరు నిడి నీవు రచియించి,తివి తొల్త విష్ణుచిత్తీయ మనఁగఁ
గాఠిన్య మర్థంబు గ్రాహ్యంబు గాదు, సాధారణుల కని భూధవుఁడు బలుకఁ
దరువాత మనుచరిత్రము నొనరించి తు,త్తమకావ్యము మహాద్భుతముగఁ బిదపఁ
బెక్కుకావ్యంబులు పెం పెక్క విరచించి, మంటివి రాజసన్మానమునను

తే. భంగ మొందిన యలరామలింగముఖులు,సాటిరాఁగలవారె నీతోటి నార
యాంధ్రకవితాపితామహ యల్లసాని, పెద్దనార్య విశేషవివేకధుర్య. (చాటువు)

(*b*) పాండురంగవిజయమునందలి “ప్రౌఢదీర్ఘసమాస” పదముఖసీసమునందు ద్వితీయచరణము.

“దానితల్లిగ నల్లసాని పెద్దన, చెప్పె మది దుది దప్పి యాముక్తమాల్య, దా”

(*c*) అప్పకవీయమునందుఁ బ్రథమాశ్వాసాంతమున “ఆంధ్రకవితాపితామహుఁడు కొనియె ననుటకుఁ గొనె నని చెప్పె” నని అప్పకవి వ్రాయుచు నుదాహరణంబుగ విష్ణుచిత్తీయమునందలి “పూనిముకుందునాజ్ఞఁ గను బొమ్మనె గాండివి” యను పద్యంబు వ్రాసె.

[దీనినిఁబట్టి చూడ నాముక్తమాల్యద పెద్దనార్యకృతం బని యప్పకవియభిప్రాయము]

(*d*) బ్రౌణ్యనైఘంటిక పీఠికయందు విష్ణుచిత్తీయము [ఆముక్తమాల్యద] పెద్దన చేసిన దని వ్రాయఁబడినది. ఈరీతిగనే ఆముక్తమాల్యద వ్యాఖ్యాత యగు రామశాస్త్రుల వారును *

---

*వావిళ్ల. రామస్వామిశాస్త్రులు పీఠికయందు వ్రాసియున్నారు.

4. కవికర్ణరసాయనమును కృతినొందకుండఁ బెద్దన విఘ్నంబుచేసె నని రాయలు కోపించినఁ దత్కోపనివారణార్థంబు రాయల పేరిడి యాముక్తమాల్యదఁ బెద్దన చేసె ననువాడుకయుఁ గలదు.

5. పెద్దన యద్వైతి యై వైష్ణవమతానుసారం బగుగ్రంథంబు నెట్లు రచియింపగలఁ డని యందురేమో. విశేషపండితుండును "అతులపురాణాగమేతిహాసకథార్థస్మృతియుతుఁడును" వైష్ణవాచారి యగుశఠకోపయతిశిష్యుండును వైష్ణవమతస్థుం డగుకృష్ణరాయల పరమహితుండును నగుపెద్దనకు నీగ్రంథంబుఁ జేయ సుకరంబు గాదె.

6. ఈప్రబంధంబు పేటుకగా నుండుటకును నచ్చటచ్చటఁ గొన్ని స్ఖాలిత్యంబులు గల్గియుండుటకును గారణంబుఁ జూడ నీగ్రంథంబు పెద్దనకృతంబు కాదనియు రాయల కృతం బనియు లోకులకుఁ దోఁచుటకై పెద్దన బుద్ధిపూర్వకంబుగాఁ జన్నినయుక్తి యై యుండవలె. లేదా, 8 (a) పద్యప్రకారము విష్ణుచిత్తీయము మనుచరిత్రకంటె మొదట వ్రాయఁబడినయెడల ప్రథమరచిత గ్రంథంబున నొకటిరెండుతప్పు లుండుట సహజంబు.

7. ఆముక్తమాల్యదలోను మనుచరిత్రములోను వంశావళిపద్యంబులును మఱికొన్ని పద్యంబులును నొక్కటిగా నుంటకుం గారణంబు 8 (a) పద్యంబు యథార్థమైనచో రాయలయెడ గౌరవముఁ జూపుటకు నాముక్తమాల్యద నుండి పెద్దన మనుచరిత్రమునకుఁ జేకొని వ్రాసి యుండవలె. లేక మనుచరిత్రము పూర్వగ్రంథమైనచోఁ గవులావంశావళి పద్యంబులు చదివినట్టుగా నాముక్తమాల్యదాకారుఁ డాగ్రంథంబులో వానిం జేకొనియుండవలె. మనుచరిత్రములోనిపద్యంబులు జగద్విదితంబులు. అవి పూజనీయుండగుపెద్దనార్యునిచే విరచితంబులు గావున సభ్యులాపద్యములనే చదివియుందురు. గ్రంథకర్త వారు చదివినట్టుగానే గ్రంథమందు వాని వ్రాసె. పెద్దన ఆముక్తమాల్యదను వ్రాసినప్పుడు తన్ను రాయలగాఁ భావించుకొని వ్రాసెనుగాని పెద్దన యనుకొని వ్రాసియుండలేదు. ఈసూత్రంబు తెలిసినఁ బెక్కుసందియంబులు వీడును.

ఇంక విస్తరభీతిచే నెక్కుడు కారణంబులు వ్రాయ విరమించితిని. ఈమీఁదికారణంబులు బాగుగ గ్రహించిన నితరపక్షవాదంబు పూర్వపక్షంబుచేయ సులభంబు. ఈయంశంబు బి. ఏ. విద్యార్థులకు నావశ్యకంబుగనుక పూర్తిగా ముద్రింపఁ గోరెద. ఆముక్తమాల్యదాకారుఁ డెవఁడో, విష్ణుచిత్తీయ మనుచరిత్రములలోఁ బూర్వగ్రంథ మెద్దియో యీపత్రికారత్నమును జదువుకవివరులు వారియభిప్రాయంబులఁ బ్రకటింపఁ బ్రార్థితులు.

శివకోడు.
గోదావరిజిల్లా.
సెప్టంబరు 27 తేది. 1886

ఇట్లు తమవిధేయుఁడు,
బోడపాటి. రామలింగేశ్వరప్ప.
చందావారు-సబ్ రిజిస్ట్రారు.

## పైయుపన్యాసమునకు సమాధానము.

ఇట్టి యుపన్యాసము కవిజీవిత గ్రంథకర్త నగునాకొఱ కుద్దేశింపఁబడినను నెల్లూరునం దుండుపత్త్రికకుఁ బంపఁబడుటంబట్టి దాని ప్రకటన సంగతియే కొంత కాలమువఱకు నాకుఁ దెలియలేదు. అనంతరము మఱి కొంతకాలమునకు సముద్రితగ్రంథచింతామణి పత్త్రికాధిపతి తమ చింతామణి మయూఖములు చేర్చిన సంచిక యొకటి కార్యాంతరముపై నాకుఁ బంపఁగా దానిం జూచుచుండి పైయుపన్యాసముం గాంచితిని. అప్పటికిఁ గాలాతిక్రమణమై యుండుటంబట్టియు నాకవిజీవితములు రెండవకూర్పునకుఁ దిరుగ సిద్ధము చేయంబడుటఁబట్టియు వెంటనే నాయభిప్రాయముఁ బ్రకటింపనైతిని. ఇపుడు కృష్ణరాయచారిత్రము ప్రకటించుచున్నాఁడను గావునఁ బైయాక్షేపణలకు సమాధానము వ్రాయక విధిలేకవచ్చినది. కావున దాని నీక్రింద వివరించెదను. ఎట్లన్నను:—

(౧. పూర్వపక్షము.)

ఈగ్రంథము నిక్కంబుగఁ గృష్ణరాయనికృతంబేని రాయం డసమర్థుం డనియు, నాముక్తమాల్యదాకారుండు కాఁ డనియుఁ బెద్దనయే రచియించి రాయలపేరు పెట్టె ననియు నిట్టియపవాద పుట్టుటకుఁ గారణంబు కానరాదు. భోజరాజకృతంబు లగుప్రబంధాదులను గాళిదాసు చేసె నని యనిరే. ఇట్టిపట్టుల నబద్ధంబు పుట్టదని దిట్టంబుగ జెప్ప నొప్పు.

౧. (సమాధానము.)

పెద్దన కృతము లగుపద్యములు కొన్ని మనుచరిత్రిలోనివి ఆముక్తమాల్యదలోఁ గానుపించుచుండుటం జేసియే పైయపవాదకుఁ గారణ మని చెప్పితిమి. అట్టిది కా దనుట కేమికారణము చెప్పిరో తెలియదు. భోజునిముఖము చూచువారందఱును కవు లవుదు రని ప్రతీతి యుండుటబట్టిం భోజుఁడు చాఁటుకొనిపోయెను. కాని లేకున్న భోజకృత గ్రంథంబులును గాళిదాసాదిమహాకవికృతము లని లోకప్రతీతి యేల

కలుగకపోవు నని యీావఱకే నేను వ్రాసియున్నాఁడను. కావున దీనికి వేఱుగ సమాధానము చెప్పనక్కఱ యుండదు.

౨. పూ. పెద్దిబట్టుచేసిన వ్యాఖ్యానములును, పుష్పగిరి తిమ్మన కృతం బగు దశావతారచరిత్రయు నుత్తరరామాయణంబును లోకములో నొకరుచేసి మఱియొకరు పేరు పెట్టుటకు దృష్టాంతము లని యిట్టివనులు సర్వసాధారణములుగా నున్న వని.

౨. స. ఈ పైరెండుపుక్కిటిపురాణములకును గ్రంథ దృష్టాంతములు లేవు. పెద్దిభట్టు అనునది వేఱనుకొనుట భ్రమ. లోకములో నబ్బిశాస్త్రి యని, పిల్లావుధాను లని, బొజ్జబాబు అని, బంగారు అబ్బాయి, అని కొన్ని బాల్యకాలనామంబులు వ్యాపకములో నుండుట గలదు. ఆపేరులు గలవారికి వేఱునామంబులు లే వని యూహించుట లోకానుభవము లేకుండుటం దెల్పును. పెద్దిభ ట్టనునది బాల్యనామము. ఆనామముతో నొప్పునతనిపేరు మల్లినాథుఁడు. వాని యింటిపేరు కొలిచెలమల(కోలాచలము)వారు. అతనికేమహామహోపాధ్యాయుఁ డని బిరుదు కలదు. పెద్దిభట్టు చేసినాఁ డని చెప్పెడు వ్యాఖ్యానగ్రంథము లన్నిటిలో నిట్లె యున్నదిగాని ఇతి పెద్దిభట్ట విరచిత మని లేదు. పుక్కిటి పురాణముల నమ్మిన నింతకంటెను బ్రమాదములు గలుగఁగల వు కావున గ్రంథస్థగాథల నమ్ముటకు నుపన్యాసకుం బ్రార్థించెదను. ఇఁక పుష్పగిరితిమ్మన్న దశావతార చరిత్రము చేసి యొకరిపేరిట,నుత్తర రామాయణముచేసి మఱియొకరిపేరిటను బ్రకటించె ననుదానికిఁ గూడ వ్రాఁతమూలము లైనయాధారములు లేవు. ఇంతియకాక కంకంటిపాపరాజు చేసినయుత్తరరామాయణములో నిట్టిసందేహము నివారింపఁబడినది. అందులోఁ గంకంటిపాపరాజు తాను గ్రంథము చేయుద్వారకొని తనమిత్రుఁడును సహాధ్యాయుఁడు నగుపుష్పగిరితిమ్మన్నయొక్క సహాయము నంది తనగ్రంథము రచియించినట్లుగాఁ జెప్పె. ఆపద్య మెట్లున్నదన:—

"తే. అని కిరీటికి శౌరి తో డైనయట్టుల, నమ్మహాకవి సాహాయ్య మాచరింపఁ
కృతి నొనర్పఁగఁ బూనినయేను మొదట, నెంతు మద్వంశవిధ మది యెట్టు లనిన."

ఇట్లు ధారాళముగాఁ జెప్పినపద్యమున కే సందియము నుండఁ గూడదు. నన్నయభట్టారకుఁడు తనకు సహాయుఁడయిన నారాయణ భట్టుంగూర్చి యిట్లు వ్రాసెను. దానికిఁగూడ నారాయణభట్టు భారతము చేసి నన్నయభట్టుపేరు పెట్టె నని చెప్పవచ్చును. ఎట్లన్నను:—

ఉ. పాయక పాకశాసనికి భారతఘోరరణంబునందు నా
రాయణుఁ డట్లు వానును ధరామరవంశవిభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయధురంధరుఁడుం దన కిష్టుఁడుక్ సహా
ధ్యాయుఁడు నైనవాఁ డభిమతంబుగఁ దో డయి నిర్వహింపఁగక్.

అని నన్నయభట్టును ధారాళముగఁ జెప్పెను. పుష్పగిరితిమ్మన్న పాపరాజునకును, నారాయణభట్టు నన్నయభట్టునకును సహాధ్యాయు లని చెప్పియుండ నట్టి సహాధ్యాయు లుభయులు సమానప్రజ్ఞ గలవా రని లోక మెంచ నూహించదో తెలియదు. పుక్కిటిపురాణముల నమ్మి వ్రాఁతమూలమును దిరస్కరించులోపము మనయాంధ్రులలో నింక నెంతకాలమువఱకుండునో దాని నూహింపలేకయున్నాను. కంకంటి పాపరాజు మఱియొకపద్యములోఁ బుష్పగిరి తిమ్మన్న తనకు సహాయుం డని చెప్పె. ఎట్లన్నను :—

"మ. హనుమద్దివ్యపదారవిందమకరందానందసేందిందిరా
త్ము ననేకాంధ్రకృతిప్రకల్పనసమర్థుం బుష్పగిర్యప్పనా
ర్యునిసత్పుత్త్రినిఁ దిమ్మనాఖ్యకవిచంద్రుక్ మత్సహస్రోతఁ బ్రౌ
ఢ్ధున నే పిల్వఁగఁ బంచి కన్నకల సంతోషంబుతోఁ జెప్పినక్."

పాపరాజుప్రజ్ఞావిశేషము లెఱుఁగనివా రాతనియాశ్వాసాంత గద్యములో నుండు కొన్నిబిరుదులం జూచియైన నతని పాండిత్య మరయుదురుగాక. అందులో.

౧. చతుర్విధ అనవద్య కవిత్వ విద్యావధానుఁడు. ౨. అభినవభోజరాజు. 3. బంధురమనీషావిశేషమంథానవసుంధరాధర శోధితగణితశాస్త్రరత్నాకరుఁడు. ౪. విష్ణుమాయావిలాసాభిధానయక్షగాన నిర్మాణ ప్రవీణతానిధానుఁడు.

పుష్పగిరి తిమ్మన కవిత్వవిశేషము లతని సమీరకుమారవిజయములోఁ జూడఁదగు. పుష్పగిరితిమ్మన కవిత్వమునకు కంకంటిపాపరాజు కవిత్వమునకును అల్లసాని పెద్దనకవిత్వమునకుఁ గృష్ణరాయని కవిత్వమునకుఁ గలభేదమే యున్నది. ఆయుభయులలోఁ బుష్పగిరితిమ్మన, యల్లసానిపెద్దనలు కేవలము కవిత్వవృత్తినే జీవించువారు. ఈపాపరాజును గృష్ణరాయలును రాజకీయవ్యవహార నిమగ్నులైయుండి విద్యావినోదంబులు చేయువారై యుండిరి. ఆకారణమునఁ బైయిద్దఱికవుల సహాయము నీయిద్దరు పండితప్రభువులకుఁ గావలసివచ్చెను.

ఈప్రభువు లిద్దరును వ్యాపారాంతముల నుండువారుకావునఁ గవిత్వవ్యాసంగము చాలినంత చేసియుండకపోవచ్చును. ఆకారణమున నచ్చటచ్చట వ్యాకరణములోని మెలఁకువలఁ దెలేక పోవచ్చును అట్టిలోపములను పైకవులిద్దరును సాధ్యమగునంతవఱకు సవరించియుందురు. అట్లున్నను మార్చుటకు వీలులేనియంశములుగాని దిద్దనపుడు మఱచియున్న యంశములుగాని గ్రంథములయందుఁ జూపట్టి, ఆకవులకవిత్వము లాగ్రంథములు కావనుటకు సాక్షిభూతములు లైయున్నవి.

ఇఁక కంకంటిపాపరాజు త్తరరామాయణ మను గ్రంథముం జేసియుండెనా లేదా యనుదానినిస్థిరపఱచుటకు కాతనితమ్ముండగునరసింహకవి రచియించినవిష్ణుమాయావిలాస నాటకము నుండి కొన్ని వాక్యములుదాహరించెదము ఎట్లన్నను: —

ద్విపద.

“ఈవిశ్వహితకృతి కేవేల్పు నధిపుఁ, గావింతు నని యాత్మ గణియించునపుడు.
ఆర్వేలవంశాబ్ధి హరిణలాంఛనుఁడు, గర్వితరిపుమంత్రి గర్వభంజనుడు.
గురుతరశ్రీవత్స గోత్రపావనుఁడు, పరిలబ్ధమదనగోపాలభావనుఁడు.
ప్రపితామహునివల్లభప్రభుఁ బోలి, యెప్పుడు బంధుఁ బ్రోచుహితకీర్తిశాలి.
కంకంటియప్పయాగ్రణి కుమారుండు,మాయన్న సరసమాంబాగర్భశుక్తి.
కాయతవార్తికం బగుభవ్యమూర్తి, వరవర్ణ్య వేంకట నరసింహుఁగన్న.
పరమపుణ్యుఁడు దయాపరులలో మిన్న, సరసుండు పాపరాజప్రధానుండు.

నాకలలో నొక్కనాఁడు గాన్పించి, యేకతంబునఁ గూర్చి యిట్లనిపల్కె.
నాకూర్మిసోదర నరసింహ నీవు, చేకొని ద్విపదగాఁ జేసినయట్టి.
అనుపమ విష్ణుమాయానాటకమున, కనురూప విభుఁ డెవ్వఁ డని తలంచెదవు.
దానికి విభుఁడు సీతామనోహరుఁడె, రసికత నుత్తరరామాయణంబు.
పొసగ నే రచియించి భూవలయమున, వెలయించు వేడుఁగవే విడువక భక్తి.
సంధ్యాదికృత్యంబు (ఇక్కడ క్షప్తి వచ్చినది)
లొనరించి హితగోష్ఠి నుండి శీఘ్రమున, ననఘుని పుష్పగిర్యప్పన్నతనయు.
ఘను సంస్కృతాంధ్రైకకవనాతిదక్షు, మాయన్నసఖుని తిమ్మకవిఁ గృతిస.
హాయుని బిలిపించి యమ్మేటితోడ, నాకన్నకలఁ దెల్పినను సంతసిల్లె.”

అని యున్న దానింబట్టి యుత్తరరామాయణము పాపరాజప్రణీత మే యనియు, నపుడు సహాయ మొనరించిన పుష్పగిరి తిమ్మన యనుపాఁడి తుఁడే పాపరాజు గతించినపిమ్మటగూడ జీవించియుండి అతనితమ్ముఁ డగునరసింహకవి యీ ప్రస్తుతగ్రంథ మగువిష్ణుమాయావిలాసనాట కముం జేయునపుడుగూడ సహాయ మొనరించె నని యుండుటచేతఁ గం కంటిపాపరాజు రచించినగ్రంథము నీపుష్పగిరితిమ్మన సరిచూచెనుగాని ఆగ్రంథము తాను రచియించి పాపరాజుపేరిటఁ బ్రకటించియుండ లేద నియు న ట్లనుట అయుక్తమనియుఁ దేలినది.

పూ 3 (a) ఈక్రిందిపద్యము పైయభిప్రాయమునకు బలీయము.

“సీ. కృష్ణరాయలపేరు నిడి నీవు రచియించి, తివి తొల్త విష్ణుచిత్తీయ మనఁగ
కాఠిన్య మర్థంబు గాహ్యంబు గాను సా, ధారణుల కని భూధవుఁడు బలుకఁ
దరువాతమనుచరిత్రము నొనరించి తు, త్తమ కావ్యము మహాద్భుతముగఁ బిదప
బెక్కుకావ్యంబులు పెంపెక్క నిరచించి మంటివి రాజసమ్మానమునను
భంగ మందిన యలరామలింగముఖులు, సాటి రాఁగ వార నీతోటి నార
యాంధ్రకవితాపితామహ యల్లసాని, పెద్దనార్యాది శేషవివేకధుర్య.” చాటువు.

స. 3. షబాషు! ఇంత విశేషాధార ముండఁగ నిఁక ఆముక్త మాల్యదకుఁ బెద్దన యేలకవి కాకుండును? ఆంధ్రకవిత్వమహత్తును దెలి యఁగోరువా రిట్టిపద్యముల నాదరింపవలెఁగదా! అని ఆశ్చర్యసాగర మున మున్గుటకంటె నీపద్యమునకుఁ జెప్పవలసిన సమాధానము ప్రధాన

మైనది లేదు. ఇట్టి పద్యము నముద్రితగ్రంథ చింతామణి ప్రకటించినంపు లకు విచారపడవలసియున్నది. ఇట్లుగాఁ దల మొల లేనిపద్యముం బట్టి యే కదా ఆముక్తమాల్యదలోని గ్రంథప్రణాళిక నాశ్వాసాంతపద్యముల నిరసించి ఇదివఱలోఁ జేయఁబడియున్న సిద్ధాంతమును దిరస్కరించుట ? కాని అట్లు తిరస్కరించుటకుఁ బూర్వము, ఆముక్తమాల్యద ముందు రచియింపఁబడినదో లేక మనుచరిత్రము ముందు రచియింపఁబడినదో పరిశీలించెదము గాక. ఆపరిశీలన అగుపఱకును పెద్దనయే యా రెండు గ్రంథముల రచియించె నని యూహించెదము.

## మనుచరిత్రములోఁ జెప్పంబడిన కృష్ణరాయ విజయములు.

౧. ఉదయాద్రిని జయించె. ౧. కొండవీడు జయించె. ౧. వేఁగి దేశమును జయించె. ౧. కనకగిరిం జయించె. ౧. గౌతమీనదిని దాఁటె. ౧. పొట్నూరు జయించెను. ౧. మాడుగుల. ౧. (వడ్డాది) జయించెను. ౧. కటకపురిం గాల్చెను. అపుడు గజరాజు పాఱెను.

## ఆముక్తమాల్యదలోఁ జెప్పంబడిన కృష్ణరాయ విజయములలోని విశేషములు.

మనుచరిత్రములోఁ జెప్పిన విజయములన్నియుఁ జెప్పి పిమ్మటఁ కలబరిగె (Kalbarga) లో నుండుయవనప్రభువుల జయించిన ట్లీక్రింది పద్యములో నున్నది.

"సీ. తిరుగు హరిపురి సురతరు సురల మరిగి, బహుళహళహళి భరితకల్బరిగనగర
సగరపురవరపరిబృఢజవనయవన, పృతన భవదసి ననిఁ జెగి కృష్ణరాయ."

అనియున్న దానింబట్టి ౧. కలబరిగ. ౨ సాగర్ (Sauger) అను రెండు స్థలములలోనుండు దురుష్కప్రముఖుల జయించె. ఇంతియ కాక పారసీక దేశము (Pershya) లో నుండెడుఖురాసాన్ (Khorasan) ఖండములోని తురుష్కులం జయించె నని మఱియొకపద్య మున్నది.

అది యెట్లనఁగా:—

మ. అలుకన్ ఘోటకధట్టికాఖురపుటీహల్య స్థరాసానిపు
 చ్చలువో దున్ని చలచ్చమూగజమదాసారప్లుతిం గీర్తి పు
 ష్కలసస్యం బిడి యేకధాటి ఖళిరా కట్టించి తా తొల్లి యే
 దులఖానోగ్రకపాలమగ్ధపహరిద్భూభాంగలశ్రేణికిన్.

ఇది యంతయు మనుచరిత్రానంతర వృత్తాంతమే. ఇట్లు ఘంటాపథముగా మనుచరిత్రమునకుఁ దరువాతికాలములో నాముక్తమాల్యద రచించినందులకు గ్రంథదృష్టాంతము లగపడుచుండఁగా వాని నూహించికొని, లోకములో సంప్రదాయజ్ఞులవలన పాడుకొనంబడుచున్న కవికర్ణరసాయనవృత్తాంతము నమ్మక కృష్ణరాయనికాలములోనికవిత్వమని యూహింప ననువులేని పైచాటుధార పద్యము నమ్మిన నిఁక వందలకొలఁది చారిత్రగ్రంథములు పుట్టవచ్చును. కాఁబట్టి పాఠకు లిట్టిచాటువుల నెంతమాత్రమును విశ్వసించక పోదురు గాక.

పూ. ౪. (b) పాండురంగ విజయమునందలి ప్రౌఢదీర్ఘసమా సపదముఖసీసమునందు ద్వితీయచరణము "దానతల్లిగ నల్లసాని పెద్దనచెప్పె ముది మది దప్పి యాముక్తమాల్యదా" అని యున్నది.

స. ౪. (b) కాని ఈ పద్యచరణమును పైపద్యమును దాని నీపద్యచరణమును బూర్వపక్షము చేయుచున్నవి. ఈపద్యచరణమొకగ్రంథములోనిదే యయియుండిన పైచాటుపులోఁ జెప్పినగాథ తప్పేగద. కావున నాముక్తమాల్యద(విష్ణుచిత్తీయము) మనుచరిత్రముకంటె మొదట రచియింపఁబడక పెద్దనవలన నతనిముసలితనములో మదితప్పియున్నపుడు వ్రాయఁబడినదని యూహింపవలయుఁగాక. కాని యిట్లుగా నొకదాని నొకటి తిరస్కరించు రెండుదాహరణ లుపన్యాసకునివలనఁ జూపింపఁబడుటకుఁ గారణమేమో నే నూహింపలేకయున్నాను. ఆముక్తమాల్యదలో నచ్చటచ్చటఁ గాన్పించుస్ఖాలిత్యములు పెద్దన ముసలితనములో నాగ్రంథము వ్రాయంబడుటంజేసి కల్గె నని చెప్పుటకుఁ గానోపు. అటులనే యైనచో (౬) నాలవపూర్వపక్షములోని ౪ (a) ప్రకారము విష్ణుచిత్తీయము మను

చరిత్రకంటె మొదట వ్రాయఁబడినయెడల ప్రథమ రచితగ్రంథంబున నొకటి రెండు తప్పులుండుట సహజంబు" అని వ్రాసిన దానికర్థమేమో యూహింపలేక యున్నాను. విద్యావిషయకోపన్యాసములలోను, అందు లోఁ జారిత్రాంశములఁ బూర్వపక్షము చేయునప్పుడు నిట్లుగా నేరేవిఁ దాను చేసినసిద్ధాంతమును తానే పూర్వపక్షము చేసికొనుచుండఁగా నిప్పుడద్దానికి నేను సమాధానము చెప్పవలసియుండునో యూహింపలేక యున్నాను. మనుచరిత్రకంటె నాముక్తమాల్యద ముందనని చో సరికా దని చెప్పవచ్చును. లేదా మనుచరిత్రమునకంటె తరువాత ననఁగా దానినైన కా దని చెప్పవచ్చును. ఒకపరి ముందు, మఱియొకపరి వెనుక నని చేయు పూర్వపక్షమునకు సమాధానము చేయువా రెవరైన దేవాంశ సంభూతులు రావలెనుగాని నాయట్టివాస కది సాధ్య కార్యము కాదు.

అదియటుండ "దానితల్లిగ నల్లసానిపెద్దన చెప్పె ముది మది తప్పి యాముక్తమాల్యద" అనుదానికి దేసితల్లిగాఁ జెప్పెనో నాకు బోధించలేదు. ఇది పాండురంగవిజయములోని పద్యమఁట. అనఁగా గగనకుసుమములను జంద్రునిలో నుండు లేడి మేయఁగా దానిని శశవిషాణముతోఁ బొడిచినట్లు కాన్పించుచున్నది. పాండురంగవిజయము పుట్టుట హుళక్కి యని రామలింగము చారిత్రములో సిదివఱకే నేను చెప్పియుంటిని. కావున నిప్పు డద్దానిం జూచుటకుఁ బాలకులం గోరుట కంటె వేఱుసమాధానము వ్రాయను.

పూ. శి. (c) అప్పకవీయమునందుఁ బ్రథమాశ్వాసాంతమున "ఆంధ్రకవితా పితామహుఁడు చెప్పిన విష్ణుచిత్తీయమునం దున్న "పూనిమకంౘు నాజ్ఞఁగను బొమ్మ" ను గాంచి " అనుపద్యమును నప్పకవి వ్రాసెను."

స. శి. (c) అప్పకవి చెప్పినదే వేదవాక్య మనుకొనువా రెట్లూహించిన నూహింపవచ్చును. అప్పకవి పైవారి (అనఁగాఁ బెద్దన్నయొక్క కృష్ణదేవరాయలయొక్క) కాలీనుఁడు కాఁడని పైవార లిర్వురును శా స 1430 కాలమువా రగుటం బట్టియు నప్పకవి శా స 1600 కాలవు

వాఁ డగుటంబట్టియు నిశ్చయింపవలసియున్నది. ప్రస్తుతకాలములో వలెఁ దెనుగుదేశములోని అన్ని భాగముల వారును కలుసుకొనుటకుఁగాని యుత్తరప్రత్యుత్తరములు నడుచుటకుఁగాని అవకాశములు లేక యుండుటంబట్టి యితరదేశపు వృత్తాంతములు విశేష విస్పష్టముగాఁ దెలియునని నిశ్చయించుట కవకాశము లేదు. అట్టిచోఁ గృష్ణాజిల్లాలో నుండెడు నప్పకవికి మిక్కిలి సమీపములో నుండుగోదావరిజిల్లాలోనివృత్తాంతములే తెలియరానిచో నిఁక కృష్ణాజిల్లాకు మూఁడునాల్గు జిల్లాలుదాఁటిన పైనుండిన విజయనగరసంస్థానములోని కథానూత్నములు స్పష్టముగాఁ దెలియు నని యెట్లూహింపఁగలము. గోదావరిజిల్లాలోని వృత్తాంతము తెలియ దని చెప్పియున్నారము. ఆమాట ప్రస్తావరీతిం జెప్పినది కాదు. అతఁడు రాజనరేంద్రునిఁగూర్చియు నన్నయ్యభట్టుంగూర్చియువ్రాయుచు నీక్రిందివిధమున వ్రాసె:—

"ఉ. ఎన్నఁగ నన్నయాఖ్యకవి యాకలి కాదినిఁ జెప్ప దాని భీ
మన్న హరించెఁ గ్రమ్మర మహాత్ముఁడు రాజనరేంద్రుపట్టి దా
మెన్న నొసంగె విప్రునకు మూలమతం డొనరించెఁ డీక నా
కన్నది మున్ను విన్నదియుఁ గాదు మహాద్భుత మబ్బె నా కిటన్."

దీనిలోని 'కలి కాదిని' అనుదానికి వేఱర్థము లేనందుల నప్పకవీయము రెండవ యాశ్వాసప్రారంభములో నతనివలన మఱియొక పద్యములోఁ జెప్పంబడియెను. అదియెట్లన్నను:—

౨. "క. అవధారు శబ్దశాసను, డవనిఁ గలియుగమున కాది నారాజమహేం
ద్రవరంబునఁ జెప్పిన యాం, ధ్రవచోవ్యాకరణసూత్రతతిఁ దెనిఁగింతున్."

అని వ్రాసియుండెఁ. దీనింబట్టి అప్పకవికిఁ గలదేశకాలవిజ్ఞానము యొక్క సిద్ధాంతసామర్థ్యము బోధ కాకపోదు. కావున నప్పకవి చెప్పినాఁ డనుమాత్రమున నితరసందర్భము లేనిచో నతని సిద్ధాంతము నుతరాం అంగీకరింపఁగూడదు.

పు. 8. (*d*) "ద్రౌణ్యాసైఘంటిక పీఠికయందు, విష్ణుచిత్తీయము (ఆముక్తమాల్యద) పెద్దనచేసిన దని వ్రాయఁబడినది. ఈరీతిగనే ఆముక్తమాల్యదావ్యాఖ్యాత యగు రామస్వామిశాస్త్రులు పీఠిక యందు వ్రాసియున్నారు.

స. 3. (d) "శతాంధాః కూపం ప్రవిశంతి" అను బుధజనోక్తి పుట్టుటకుఁ గారణ మేమై యుండును. ఇట్టులనే యెవరో పదిమంది విచారణచేయకనే యొకరుచెప్పినా రని యొకరు, వారు చెప్పి రని మఱి యొకరు వ్యవహరించుటనుబట్టి ఆసామెత పుట్టియుండు. బ్రౌణ్యనైఘంటికుఁడును మఱికొందఱు గ్రంథికులును భట్టుమూర్తియు రామరాజభూషణుఁడు నొక్కఁడే అని నిర్ధారణచేసిరి. అవిమర్శకమైనసిద్ధాంతము త్రిప్పుట కెంతశ్రమ తమవాఱు పండితుల కాయనో చూడుఁడు. ప్రస్తుతో పన్యాస సిద్ధాంతమును ఖండించుటయు నటువలె యగుఁగదా! ఇంతశ్రమ చేసినను కల్గెడుఫలము పూజ్యమునకంటె వేఱు లేదు కావున నీప్రశ్నము విడిచెదను.

పూ. 4. "కవికర్ణ రసాయనమును కృతినొందకుండఁ బెద్దన్న విఘ్నముచేసె నని రాయలు కోపించినఁ దత్క్రోపనివారణార్థంబు రాయలపేరిడి యాముక్తమాల్యద పెద్దన చేసె ననువాడుకయుఁ గలదు.

స. 4 "ఈవాడుకయే కల దని యుపన్యాసకునకుఁ దెలిసియున్న యెడల పై 3 (a) లోనిసీసపద్య మేల వ్రాసియుండవలయును. అది నమ్మి వ్రాసియున్న యుపన్యాసకునకు దిగువ నీనాల్గవప్రశ్నము వ్రాయుట కెడ మెట్లు కల్గును. పూర్వోత్తరసందర్భము లేని వ్రాఁతలకు సమాధానము చెప్పఁగమకించుటకంటె నూరకుండుట యుత్తమ మని తలచెదను.

పూ. 5. "పెద్దన యద్వైతియై వైష్ణవమతానుసారం బగు గ్రంథంబుల నెట్లు రచియింపఁగలఁ డని యందు రేమో. విశేషపండితుఁడును అతులపురాణాగమేతిహాసకథార్థస్మృతియుతుఁడును" వైష్ణవాచారి యగుశఠగోపయతిశిష్యుండును, వైష్ణవమతదుం డగుకృష్ణరాయల పరమహితుండును నగుపెద్దనకు నీగ్రంథంబు సేయ సుకరంబుగాదె"

స. 5. ఈ పైసిద్ధాంతములో మతసంబంధ మగువిచారణఁగూడ బయలువెడలుచున్నది. ద్వైతాద్వైతశాస్త్రములలో గ్రంథములఁ జేయుట "అతులపురాణాగమేతిహాస కథార్థస్మృతియుతుఁడ" గుటం జేసి పెద్దనకు సుకరమే అని యుపన్యాసకుఁడు సూచించు. ఇదివఱ కాంధ్ర గీర్వాణములలో వేదాంత శాస్త్రాధ్యయనముం జేసిన వారిలో నద్వైత

గ్రంథములఁ జేసినవారు ద్వైతగ్రంథములు చేసినట్లుగాని, ద్వైతశాస్త్రోద్ధృత లద్వైతములో గ్రంథములు చేసినట్లుగాని వినలేదు. పరమతనిరాస పూర్వక స్వమతస్థాపనకై కొందఱుపండితులు పరమత పూర్వపక్షములఁ గొన్నిటి నేర్చుకొనియున్నను వానిలో గ్రంథముల రచియించి ఆయామతములలోని అనుభవశాలులకు మార్గదర్శు లయినారని వినియుండుట అనుభవవ్యతిరేకము. పెద్దన అట్లుగా వైష్ణవమతస్థుఁడు కానట్లు మనుచరిత్రవలనఁ గానుపించినను కేవలము శఠగోపస్వామిశిష్యుఁడ నని చెప్పుకొని నంతమాత్రముచేత విశిష్టాద్వైతభాష్యము నెఱిఁగి దానిసంగ్రహము ఆంధ్రములో గ్రంథరూపము చేసియున్నఁ జేసియుండ డనేమో. అది అనుభవ వ్యతిరేక మైనమాట. అన్యమతస్థులకడ సంస్కృతముగాని మఱియేభాషగాని నేర్చుకొనినవారికిఁ దమగురువులపరమార్థ మతమంతయు దెలుసుకొను ప్రజ్ఞయే యుండిన మహాగౌరవావహకార్యమే. అయితే లోకానుభవము దానికి వ్యతిరేకమై యుండుటచేతను పైసిద్ధాంతము మనస్సునకుఁ బట్టకయున్నది స్మార్తులలో వైష్ణవమతము నవలంబించి ననియోగులు పెక్కండ్రు గలరు. వారు కేవలము విష్ణునియెడలఁ గల్గుభక్తినిఁబట్టి వైష్ణవులకడ శిష్యులైనను, తమవంశక్రమాగత మగుస్మార్తదేవతోపాసనలు వదులునాచారముండదు. కేవలము వైష్ణవమత ప్రవర్తకులు శివశక్త్యాదిభిన్న దేవతానుతులు మాని విష్ణుని ఆయుధాదులను వాహనాదులను తఱచుగా నుతియించెదరు. పెద్దన మనుచరిత్రములో నీపైదారిం గైకొనక శివశక్త్యాదుల నుతియించుటంజేసి అందులో భగవద్విషయమై వివరించునప్పుడు కేవల శేష శేషిభావము ప్రధానముగాఁ జెప్పక యద్వైతమతస్థు లగు బమ్మెరపోతన మొదలగువారు చెప్పిన విధముననే చెప్పుటచేతను పై గ్రంథకర్త లిద్దరును భిన్ను లని నేనూహించితిని. ప్రస్తుతములో నింతకంటెఁ బాఠకుల కవసరముండదు గనుక నీసంప్రశ్నము విడువవలసినదే అని చెప్పెదను.

పూ. ౬. "ఈ ప్రబంధము పెటుకుగా నుండుటకును, అచ్చటచ్చట నొన్ని స్ఖాలిత్యములఁ గల్గియుండుటయును గారణంబు జూచి యీగ్రంథంబు పెద్దన కృతంబుగా దని యును, రాయల కృతం బనియు లోకులకుఁ దోఁచుటకై పెద్దన బుద్ధిపూర్వకముగా బన్నిన యుక్తియై యుండవలెను. లేదా, 3 (a) పద్యప్రకారము విష్ణుచిత్తీయము మనుచరిత్రకంటె మొదట వ్రాయఁబడినయెడల ప్రథమరచితగ్రంథంబున నొకటిరెండు తప్పు లుండుట సహజంబు.

స. ౬ దీనిలో గ్రంథము పెటుకుగానుండుట యనుదాని కర్థము తెలియలేదు. పండితాభిప్రాయ మిది నారికేళ పాకమున నుండు ననిగాని అది యొకలోప మగుపాకము గల దని కాదు. పెద్దన కావలెనని కొన్ని తప్పులు చెప్పినఁ జెప్పుట గల్గుగాని తనకవిత్వముకంటె నధికమైన కవిత్వముగాని తనశక్తికి మించినవర్ణనలుగాని చెప్పలేఁడుగదా. ఆముక్త మాల్యద మనుచరిత్రమునకంటెఁ గఠినమైనను అంతకంటె వర్ణనాంశ ములో నధిక మనియే సర్వపండితులవలన నంగీకరింపఁబడును. కావున నిందులోఁ బెద్దన బుద్ధిపూర్వకముగాఁ జేసినయుక్తిగాని చేయఁగల యుక్తిగాని లేదుగావున నివిషయ మింతకంటె వ్రాయ నక్కఱలేదు. విష్ణుచిత్తీయము మనుచరిత్రకంటె మొదట వ్రాయఁబడినయెడల ప్రథ మరచితగ్రంథంబున నొకటిరెండుతప్పు లుండుట సహజం బని చెప్పిన దానికి గ్రంథదృష్టాంతరములు లేవు. ఒకవేళ నుండు నెడల భారతమున కంటె ముందుగ రచియింపబడినయుత్తరరామాయణములోఁ దిక్కనవ లన నెన్నితప్పులు వ్రాయంబడినవో హరిశ్చంద్రనలోపాఖ్యానమున కంటె ముందుగ రచియింపఁబడిన వసుచరిత్రమున రామరాజభూషణుఁ డెన్నితప్పు లుంచెనో, భీమఖండమునకంటెఁ బూర్వము రచియింపఁబడి న శృంగారనైషధమున శ్రీనాథుఁ డెన్నితప్పు లుంచెనో చూపినయెడలఁ బెద్దన మనుచరిత్రమునకంటె ముందుగ రచియించిన ఆముక్తమాల్యద లో నన్నితప్పు లుంచెను. అని చెప్పెదము అటుగానిచో 3(d) లోఁ జెప్పంబడిన విధముగ నాముక్తమాల్యదకంటె ముందుగ రచియించిన మనుచరిత్రములో నెన్నితప్పు లుంచెనో యోచింపవచ్చును. ఈపట్టునఁ

పెద్దనకవిత్వమునకుఁ గల్గినలోపమును నివారించుటకుఁగాను కుందవరపు కవిచౌడప్ప యనునతనిగ్రంథములోనుండి యొకపద్యము నెత్తి వ్రాసి దానిని నిర్దుష్టము చేసెదను. అదియెద్ది యనగా :—

క. పెద్దనవలెఁ గృతి సెప్పినఁ, బెద్దనవలె నల్పకవినిఁ బెద్దనవలెనా
యొద్దనవలె మొద్దనవలె, గ్రద్దనవలెఁ గుందవరపుకవిచౌడప్పా.

అని యున్నది. ఇట్టి పెద్దనకుం గూడఁ దప్పు లున్నట్లు చెప్పువారి పెద్దఱిక మడుగనేల ?

పూ. 2. ఆముక్తమాల్యదలోపలను, మనుచరిత్రంబులోను వంశావళీ పద్యములును, మఱికొన్ని పద్యములును, ఒక్కటిగా నుండుటకుఁ గారణంబు 8 (a) పద్యంబు యథార్థమైనచో రాయలయెడ గౌరవముఁజూపుటకు నాముక్తమాల్యదనుండి పెద్దన మనుచరిత్రమునకుఁ జేకొని వ్రాసియుండవలయును. లేక మనుచరిత్రమే ముందైనచో నాముక్తమాల్యదాకారుఁడా గ్రంథములలో వానిం జేకొని యుండవలెను.

సమా. 2. దీనిలో మనుచరిత్రము నాముక్తమాల్యద అను గ్రంథద్వయ మొకరి కృతమే అని నిశ్చయించుకొని మొదటిదే ముందుగ రచియింపఁబడిన దానిలోనివానిఁ గైకొనుట గాక సమాధానమును, రెండవదియే ముందుగ రచియింపఁబడిన దానిలోనిపద్యములు మొదటిదానికి వచ్చుటకుఁ గారణములును జెప్పంబడినవి. కాని ఆగ్రంథకర్త లుభయులు వేర్వేఱైనచో నెట్లు చెప్పవలయునో ఆసమాధానములు వ్రాయంబడ వాయెను. కావున మన మిపు డీరెండవ పక్షమునుబట్టి యూహింపఁగ మనుచరిత్రములోఁ బెద్దనవలన రచియింపఁబడిన కృష్ణరాయ వంశావళినే ఆముక్తమాల్యదలోఁ గృష్ణరాయనివలనఁ దనవంశానువర్ణనము స్వకృతముగాక అన్యకృత మని తెలియఁజేయుటకుఁ గైకొనంబడె నని యూహింపవలసియుండును. స్వవంశవర్ణనయే గాక ఆముక్తమాల్యదలోఁ గృష్ణరాయనివలన స్వవర్ణనముగూడఁ జేయఁబడినది. అట్టివర్ణనఁ గృష్ణరాయఁడు స్వయముగఁ జేసికొనఁగ వాకింపఁడు కావున నన్యకవిరచితమునే అం దుంచఁగోరు ననునది యెంతయు యుక్తియుక్త మగును.

"పెద్దన ఆముక్తమాల్యద వ్రాసినప్పుడు తన్ను రాయలఁగా భావించుకొని వ్రాసెను గాని పెద్దన యనుకొని వ్రాసియుండలేదు "ఈసూక్ష్మంబు తెలిసినఁ బెక్కుసందియంబులు వీడును"

అనియున్న దానిం గూర్చి వ్రాయవలసినది యొక్కటిమాత్రమున్నది. ఆముక్తమాల్యద యేకారణమున నుద్దేశింపఁబడెనో, యెవనివలన నెపుడు రచియింపఁబడెనో ఆ మీమాంసపై యుపన్యాసమువలనఁ దేలలేదు. ఇపుడు పెద్దన కృష్ణరాయలుగా భావించి వ్రాసెను గావున గ్రంథమంతయు నట్లుగానే వ్రాసె ననియు నది యొకసూక్ష్మమైనయంశం బనియు దీనిం దెలిసినపెక్కుసందియములు వీడు ననియు నున్న సిద్ధాంతమువలనఁ దేలినది ఏమియు లేదనియు, నేని యేని యొకయభిప్రాయము మనసులో నిమిడించుకొనినచో న్యాయము మనస్సునకుఁ బొడకట్టకయుండఁ దాఁ బట్టినకుందేటికిఁ గాళ్లు మూఁడని చెప్పెడు సిద్ధాంతము తోఁచును. అట్టిచో యుక్తిగాని, శాస్త్రముగాని నిలువం బడఁజాల వని తెలుపవలసినదై యున్నది.

పూ. ర. ఇంక విస్తరభీతిచే నెక్కుడుకారణంబులు వ్రాయ విరమించితిని. ఈమీఁదికారణములు బాగుగ గ్రహించిన నితరపక్షవాదంబు పూర్వపక్షంబు సేయ సులభంబు

స. ర. కాని యుపన్యాసకున కెక్కడికైనను గ్రంథవిస్తరభీతి కల్గినందుల కానందించవలసియుండును. తనకుఁ బాఠకుల కుపకారము చేయఁగోర్కెయే యున్న యెడల నిదివఱలోఁ జెప్పిన యనేకపూర్వపక్షములు వదులుకొనియే యుండును. అపుడు దానికి సమాధానము వ్రాయువారికి గ్రంథము పెంచవలసినంత యవసరమే లేకపోవును. దానివలనఁ బాఠకులకు నతిసదుపాయము గల్గియుండును. ఇకఁ జెప్పవలసిన యుక్తులు లే వని యిదివఱలోఁ జెప్పిన యుక్తులే నీరసములగుటం జేసి యూహించవలసియున్నది. ఉపన్యాసకునియుపన్యాసము బాగుగ గ్రహించినపిమ్మట నముద్రితగ్రంథచింతామణి పత్రికాధిపతిగారు ఆముక్తమాల్యదకాదుఁ డెవ్వఁడో, విష్ణుచిత్తీయ, మనుచరిత్రములఁ బూ

ద్వగ్రంథ మెద్దియో ఆపత్రికలో వ్రాయుటకు నుపన్యాసకునివలనఁ గోరఁబడినట్లు పైయుపన్యాసాంతమువలనఁ గాన్పించునుగదా. పిమ్మట నముద్రిత గ్రంథచింతామణి పత్రికాధిపతి పైయుపన్యాసమునకంతకు నతిచమత్కారముగఁ దనయభిప్రాయమిచ్చె. అదియెట్లన్నను :—

తేది 1 జనవరి ఆ ౧౮౯౭ సం. అముద్రితగ్రంథచింతామణిలో

"పైనుదాహరించిన మూర్తి రామరాజభూషణుల భేదమును గుఱించి శబ్దరత్నాకరమును జూచుచో, గతమాసమున బోడపాటి. రామలింగేశ్వరప్పగారు, విష్ణుచిత్తీయమునుగూర్చి వ్రాసిన యంశమునకును బరస్పరము విరుద్ధముగా నున్నది. గావునఁ జదువరులకు నీభేదముఁ దెలుపుటకుగా నీక్రిందివిషయమును బ్రకటించితిమి. 'పత్రికాధిపతి' అనియీక్రిందియంశము శబ్దరత్నాకరములోనిది యెత్తివ్రాసెను. ఎట్లన్నను :—

"అల్లసానిపెద్దన. ఈయన కృష్ణదేవరాయలకాలమందలి పండితులలో ముఖ్యుఁడుగా నుండెను. ఇతఁడు స్వారోచిషమనుసంభవ మనునొకకావ్యమును వ్రాసెను. దానిని మనుచరిత్ర మని చెప్పుదురు. అది మృదుశైలియు "అల్లసానివానియల్లికబిగియును" అన్నట్లు కవిత్వగాంభీర్యము గలిగి శృంగారరసప్రధాన మై యున్నది. అందు నాలవయాశ్వాసము కేవలాంధ్రపదభూయిష్ట మై యుండును. పూర్వకవితాధోరణి ననుసరించి యుండుటంజేసి కొన్ని యెడల నైషధమార్కండేయపురాణములయందలివాక్యములకును, నిందలి వాక్యములకు నిసుమంతయేనియు భేద మగపడకయుండును. ఇతఁడే విష్ణుచిత్తీయ మని ప్రసిద్ధిఁ బొందినయాముక్తమాల్యద యనుకావ్యమును వ్రాసినవాఁ డని చెప్పుదురు. శైలి భేదిల్లి వ్యాకరణదోషయుక్త మై యుండుటంజేసి అందుఁ జెప్పబడినయట్లది కృష్ణదేవరాయనిచేతనో మఱియొకకవిచేతనో వ్రాయఁబడినది గాని పెద్దనచే వ్రాయంబడినది గా దని తోఁచుచున్నది. స్వారోచిషమను సంభవములోని కొన్ని పద్యము లం దుండుట

చేతనే అట్టిదానిని పెద్దనవిరచితముగాఁ జెప్పుట యుక్తము కాదు. పెద్దన తదాస్థాన ముఖ్యపండితుఁ డగుటంజేసి స్వారోచిషమనుసంభవమునందలి పద్యము లిం దుండుటకుఁ గారణ మై యుండు. కావలసియుండిన్ఁ గారణాంతరముల వలసినన్ని కల్పించుకొనవచ్చును.

మఱియు సీతారామాచార్యకృత మగు "అలఘుకౌముది" యందు నాముక్తమాల్యదా విషయమునుగూర్చి వ్రాసిన యంశము పైయభిప్రాయమునకుఁ దోబుట్టువుగాన దాని నిట వ్రాయుదము.

ఇట్లు,
పత్రికాధిపతి.

"ఆముక్తమాల్యదాకారుఁ డలఘురేఫములుగాఁ బ్రయోగించినవాని నితరకవు లట్లు ప్రయోగింపకుండుటచేత నతఁడును లఘ్వలఘురేఫములకు మైత్రిఁ గలుగఁజెప్పినవారిలో నొక్కఁడనియుఁ దలఁపవలయును. శైలి లోనగువానిఁ బట్టి చూడ నాముక్తమాల్యదఁ జేసినాతఁడు పెద్దన కాఁ డని దృఢముగాఁ దోఁచుచున్నది. పెద్దనకవి విరచించిన స్వారోచిషమనుసంభవమునందు లక్షణదోష మొండేనియుఁ గానరాదు. తద్విరచితం బగుగ్రంథములోని పద్యములు గొన్ని యం దున్న వని చెప్పవత్తురేమో, అయిన దానికిఁ గారణాంతరమేమేనియు నుండవచ్చు." అని యిట్లుగా నుపన్యాసకునియుపన్యాసముపై నీయంబడిన పండితాభిప్రాయముం దెలిపి యిపుడు నేను చేసినసంవాదము పై పండితాభిప్రాయములకు విశేషముగా భేదించి యుండ దని తెల్పి యిప్పటి కీసంవాదము మానెదను.

## విజ్ఞాపనము.

పాఠకులతో నే నీభాగము ముగించుచుంటి నని విన్నవించుకొనుచున్నాఁడను. ఏమనఁగా—నిదివఱలో వివరింపఁబడినకృష్ణరాయచారిత్రము అతివిపులమైనను పాఠకుల కింకను విపులగాథ లున్నచారిత్రము లు చదువవలయు ననుకుతూహలమును బుట్టించును. అట్టివిషయములోఁ జారిత్రము వ్యాపకములో లేనట్టియుఁ గేవలము పుస్తకగాథలే ప్రధానములుగాఁ గలకవులచారిత్రముల నిందు జేర్చుట యుచితముగాఁ గాన్పిం

చలేదు. ఇట్టిగాథలన్నిటిం జేర్చిన *“కవికావ్య ప్రశంసాచంద్రిక” అను పేరు గలయొక అనుబంధగ్రంథము ఈకవిజీవితముల వెంటనే ప్రకటింపఁబడుచున్నది. కావున దీనిలో వదలఁబడినవారిచారిత్రములు దీని యనుబంధములోఁ జూచెదరుగాక యని వివరించి యింకొక విజ్ఞాపన యుఁ జేయుచున్నాఁడను. ప్రౌఢప్రబంధకవులం జెప్పిన తోడనే శృంగారప్రబంధములఁ జెప్పినవారి చారిత్రలును వినునిచ్ఛవొడమగలదు. అట్టి భాగములోఁ జేర్పఁదగిన వారిలోఁ జారిత్రములు గలవారు శాస్త్రి కవులుగూడ నై యుండుటచేత వారిచారిత్రములు ‘శాస్త్రకవులు’ అను మఱియొక భాగములోఁ జూడవలసియుండును. ఈవఱకే యీకవిజీవితము లై దాఱుఖండములైనది. ఇంతకు విశేషఖండములు చేసినఁ గొన్ని బాధ లున్నవి కావున నీక్రింద వివరింపఁబడు ‘శృంగారకవులప్రశంస” జూచి ఆకవిత్వ కాల మెట్టిదయో అపుడు పేరందినవా రెవ్వరో చూచి వలయునేని వారిచారిత్రములు ‘కవికావ్యప్రశంసాచంద్రిక’ అను దీనియనుబంధములోఁ జూచెదరుగాక.

## శృంగారప్రబంధకవులప్రశంస.

ఇదివఱలో. నాంధ్రభాషలోఁ బుట్టిన ప్రబంధములలోఁ గొన్నిటింగూర్చి వ్రాసియుంటిమి. ఆప్రబంధములు పుట్టిన కాలానంతరమునందనఁగా శాలివాహనశకము ౧౬-౧౭వ శతాబ్దములలో బయలు వెడలిన కావ్యములంగూర్చి విచరించవలసియున్నది. పైప్రబంధముల పోల్కినే పైశతాబ్దములకవులు గ్రంథరచన చేయం దొరకొన నంతకంతకుఁ బాకమునందు మార్దవమును వర్ణనాంశములలో శృంగారరసము ప్రధానమగుచు వచ్చెను. ఆకావ్యములఁ దఱుచుగా శృంగారకావ్యము లని, శృంగారప్రబంధము లని కొందఱు వివరించిరి. కేవలము ప్రబంధములే యని కొందఱు వివరించిరి. ఎట్లన్న నీగ్రంథములు ద్రాక్షాపాక విలసితములై సర్వజనరంజకము లై యుండి పండితపామర పఠనీయంబులైనవి. ఇట్టికావ్యరచనలో వివిధరసంబులు హృదయాహ్లాదకరంబుగఁ దెచ్చుట సులభము కాదు. ఈకావ్యములు క్రమక్రమముగఁ బంచకా

* కాల మీాఱని నీగ్రంథముం బ్రకటింపనీయలే దని తోఁచెడిని.

వ్యము లని ప్రసిద్ధి నొందిన గ్రంథములస్థాన మాక్రమించుకొని వానిం గఠినకావ్యము లనిపించి తామే సరసకావ్యము లై సర్వజన పఠన పాఠన ములలో నున్నవి అట్టికావ్యము లాకాలములలో నాంధ్రదేశములోని యన్ని దిక్కులం బుట్టుచువచ్చినట్లుగాం గాన్పించు. ఆగ్రంథముల నన్నిటిం దెల్పుట శ్రమసాధ్యము నుపయోగము లేకుండుటయు నగుంగావున నట్టి వానిం దెల్పక స్థాలీపులాకన్యాయముగాం గొన్నిటినిమాత్రము వివరిం చెదను. అట్టిపనిం జేయుటకుం బూర్వమున్న వివిధసీమలు (ఖండములు) దెలియంబఱచవలసియున్నది. కావున వాని నొకవిధముగా నిర్ణయించు కొని పిమ్మట నట్టిఖండములలోం బుట్టినగ్రంథముల వివరించెదను. ఎట్లన్నను:—

ఆంధ్రదేశమునకుం దూర్పున సముద్ర మున్నదిగదా. ఆకారణ మున నాసముద్రతీరముననే గంజాము, విశాఖపట్టణము, గోదావరి, కృష్ణా నెల్లూరనుమండలములు (ఖండములు) న్నవి. ఈమండలములలోని దేశములనే పూర్వము కళింగము, వేంగి, విదర్భ మనుదేశములుగా వ్యవ హరించిరి. ఈవిదర్భదేశము కృష్ణామండలములోనిది. దీనిం బురస్క రించుకొని నెల్లూరు, కడప, కర్నూలు, చిత్తూరు, బళ్లారు లనుమండల ములున్నవి. ఇవి కొంచె మెచ్చుతగ్గుగాం గృష్ణానదికి దక్షిణభాగములో నుండును. ఆకృష్ణానదికుత్తరభాగములో బెజవాడ మొదలు హైదరా బాదువఱకుం గలతెనుంగుదేశము త్రిలింగదేశ మని పూర్వము వాడు కొనంబడు తెలింగానా ఖండము. ప్రస్తుత మది 'గోలకొండ' దేశ ముగాం జెప్పవలసియుండును కాంబట్టి, ౧. ఖండములోని కళింగ, వేంగి దేశములకుం బ్రాగుదీచీఖండమనియు, ౨. ఖండములోని విదర్భదేశము (నెల్లూరుజిల్లాలోని అద్దంకి సీమ) నకు బ్రాగ్దక్షిణఖండమనియు, ౩. కృష్ణానదికి నుత్తరముగా నుండు దేశమునకుం బశ్చిమోత్తరఖండ మని యు గోలకొండఖండ మనియు, ౪. కృష్ణానదికి దక్షిణముగా నుండు ఖండమును దక్షిణఖండ మనియుం జెప్పెదను.

ఇట్లుగా నేర్పర్చితిం గావున నాయాఖండములలో నత్యాదరణీ యము లగుప్రబంధంబులం గొన్నిటి వివరించెదను. ఎట్లన్నను:—

| గ్రంథనామము. | కవినామము. | దేశము. | ఖండము. |
|---|---|---|---|
| ౧. కవిజనరంజనము. | అడిదము సూరకవి. | ౧. కళింగదేశము | ౧. ప్రాగుదీచీఖండము. |
| ౨. శ్రీకృష్ణవిజయము | పూసపాటి తమ్మభూపాలకవి. | ,, | ,, |
| ౧. రసికజనమనోభిరామము. | కూచిమంచి తిమ్మకవి. | ౨. వేఁగిదేశము. | ,, |
| ౨. రామవిలాసము. | ఏనుఁగు లక్ష్మణకవి. | ,, | ,, |
| ౧. భానుమతీపరిణయము. | రెంటూరి రంగరాజు. | విదర్భదేశము (అద్దంకిసీమ.) | ౨. ప్రాగ్దక్షిణఖండము. |
| ౨. కవిరాజమనోరంజనము. | కనుపర్తి అబ్బయకవి. | ,, | ,, |
| ౧. చమత్కారమంజరి. | వేంకటాచారి. | కృష్ణానదికి ఉత్తరము. (గోలకొండసీమ) | ౩. పశ్చిమోత్తరఖండము. |
| ౨. వైజయంతీవిలాసము. | సారంగు తమ్మయకవి. | ,, | ,, |
| ౧. తారాశశాంకవిజయము. | శేషము వేంకటపతికవి. | కృష్ణకు దక్షిణదేశము. | ౪. దక్షిణఖండము. |
| ౨. బిల్హణీయము. | పండి పెద్ది కృష్ణస్వామికవి. | ,, | ,, |
| ౩. విజయవిలాసము. | చేమకూర వేంకటరాజకవి. | ,, | ,, |

పైపట్టికలో వివరింపఁబడినవారిలో దక్షిణఖండములో నొకతతి కవులు విశేషించి యున్నారు. వారు చోళ, పాండ్యదేశములకుఁ బోయి యచ్చోఁ బ్రభుత్వముసేయుచున్న నాయకవంశసంబంధు లగువార

లపైఁ గృతులిచ్చియుండిరి. కాఁబట్టి వారు కేవలము దక్షిణదేశకవులే కాక చోళ పాండ్యదేశాంధ్ర కవులని కూడఁ జెప్పఁదగియుందురు. ఇట్టి వారి గాథలు చాలభాగము కవికావ్యప్రశంసాచంద్రికలోఁ జూడఁదగు నని చెప్పి యీనావిజ్ఞాపన ముగించెదను.

---

శ్రీ ర స్తు.

# క వి జీ వి త ము లు.

పురాణకవులచరిత్రము.

## 20.

## బ మ్మె ర పో త రా జు.

ఈ భాగములోఁ బురాణముల నాంధ్రీకరించిన కవులచారిత్రము లుండును. వానిలోఁ బ్రధానుఁడు భాగవతపురాణమును రచించిన బమ్మెరపోతనామాత్యుఁడు. అదియునుగాక అతనికాలము పురాణకవనమునకును ప్రబంధకవనంబునకును నడిమి దగు 'కావ్యరచనాకాల మగుటచేతఁ బ్రాచీనగ్రంథములకంటె నవఁగా సంస్కృతమాతృకాగ్రంథమునకంటె వర్ణనాంశములో వేదాంతభాగములోఁ బెంచి యీభాగవతపురాణముఁ బ్రకటించెను. ఇట్టిగ్రంథరచనాప్రధానుఁ డగుపోతనామాత్యునిచారిత్రముఁ బ్రథమములోఁ గైకొనుచున్నారము. ఇతనివలెనే భాగవతకథావిశేషంబులఁ దెనిఁగించుటలో నతిసమర్థుఁడును, అద్వైత శాస్త్రప్రధానం బగువసిష్ఠరామాయణపద్మపురాణోత్తరభాగాది గ్రంథములఁ దెనిఁగించిన 'మడికి సింగన' యొక్కయుఁ జారిత్రము తెలిసిన వఱకు వెల్లడింపఁబడును. వీరితో నించుమించుగా నరిసూఁగు విష్ణుపురాణగ్రంథకర్త యగు 'వెన్నెలకంటి సూరన' అను నతని చరిత్రమును

దొరికినవఱకు కిందుఁ గాన్పించు. తక్కుంగలపురాణకవులపేరులు వివరించి యేవఱకు వారిచారిత్రములు ప్రసిద్ధములో తెల్పి వాని నుచితస్థలంబున వివరించెదను.

పై ప్రసిద్ధపురాణకవుల ముప్వురిలో భాగవత గ్రంథకవి యగు బమ్మెరపోతరాజుచారిత్రము ప్రథమములోఁ బ్రారంభింపఁబడుచున్నది.

ఈపోతనామాత్యుఁడు నియోగిబ్రాహ్మణుఁడు. కౌండిన్యగోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. ఇంటిపేరు బమ్మెరవారు. తండ్రిపేరు కేసన్న. తల్లిపేరు లక్కాంబిక. ఈ కవి తనవంశావళి నీక్రింది పద్యములలో స్పష్టపఱిచెను. ఎట్లన్నను :—

" సీ. కౌండిన్యగోత్రసంకలితుఁ డాపస్తంబ, సూత్రుండు పుణ్యుండు సుభగుఁ డైన
భీమనమంత్రికిఁ బ్రియపుత్త్రిఁ డన్నయ, కలకంఠి తద్భార్య గౌరమాంబ
కమలాప్తువరమునఁ గనియె సోమనమంత్రి, వల్లభ మల్లమ వారితనయుఁ
డెల్లన యతనికి నిల్లాలు మాచమ, వారిపుత్త్రుఁడు వంశవర్ధనుండు
లలితమూర్తి బహుకళావేది కేసన, దానమాననీతిధనుఁడు ఘనుఁడు
తనకు లక్కమాంబ ధర్మగేహిని గాఁగ, మనియె శైవశాస్త్రమతము గనియె."

ఇట్లు చెప్పి తనతల్లి యగులక్కమగుణములను వర్ణించి రెండు పద్యములు చెప్పెను. అం దొకటి మనము వివరింపఁదగియుండును. ఎట్లన్నను:—

" ఉ. మానిను లీడు గారు బహుమాననివారిత దీనమానస
గ్లానికి దానధర్మమతిగౌరవమంజులతాగభీరతా
స్థానికి ముద్దుసానికి సదాశివపాదయుగార్చనానుకం
పానయవాగ్భవానికిని బమ్మెరకేసయ లక్కసానికిన్."

అని తనతల్లిదండ్రుల వర్ణించి

" క. ఆమిథునమునకుఁ బుట్టితి, మే మిరువుర మగ్రజాతుఁ డీశ్వరసేవా
కాముఁడు తిప్పయ పోతయ, నామవ్యక్తుండ సాధునయయుక్తుండన్."

అని తనవంశావళిని తనవఱకే చెప్పి ముగించెను అప్పటి కీతనికిం గుమారు లున్నట్లు తోఁచదు. దీనింబట్టి యితనివంశవృత్తము ప్రస్తరించెదను.

కౌండిన్యసగోత్రుఁ డగు
భీమనమంత్రి.
|
అన్నయ్య. (భార్య గౌరమాంబ.)
|
సోమనమంత్రి. (భార్య మల్లమాంబ.)
|
ఎల్లనమంత్రి. (భార్య మాచమ్మ.)
|
కేసనమంత్రి. (భార్య లక్కమాంబ.)
(ఇతఁడు శైవశాస్త్రిమతము నందెను.)
|
తిప్పయ్య. పోతయ్య. (గ్రంథకర్త)

## పోతనమతము శైవము.

ఈకవి సహజపాండిత్యుఁ డైన ట్లాతనిచేఁ జెప్పంబడినయాశ్వాసాంత గద్యములవలనఁ గోచరించును. అది యెట్లంటేని:—

"ఇది శ్రీపరమేశ్వరకరుణాకలితకవితావిచిత్ర కేసనమంత్రిపుత్త్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రణీతము."

ఇచ్చటి పరమేశ్వర శబ్దమునకు శివుఁ డనియే అర్థము చెప్పవలసియున్నది, దీని కీతనితండ్రి శైవమతము నందె నని చెప్పినది కారణము. ఇతఁడు శైవమతస్థుఁ డై యుండుటయేకాక భాగవతమును దెనిఁగించుటకుముందుగ గంగాస్నానంబు చేసి యవ్వడు మహేశ్వరధ్యానంబు సేయుచున్నట్లును జెప్పెను—

## పోతన భాగవతముం దెన్గించుటకుఁ గారణము.

పోతనామాత్యుఁడు తాను భాగవతముఁ దెనిఁగించుటకుఁ గల కారణం బీక్రిందివచనంబున నిట్లు వ్రాసెను —

"మదీయ పూర్వజన్మ సహస్ర సంచిత తపఃఫలంబున శ్రీమన్నారాయణకథా ప్రపంచరచనా కుతూహలుండనై యొక్కరాకానిశాకాలంబున సోమోపరాగంబు రాకగని సజ్జనానుమతంబున నభ్రంకషశుభ్రసముత్తుంగభంగ యగుగంగకుం జని గ్రుంకు లిడి

లెడలి మహనీయమంజులపులిన శోభితప్రదేశంబున మహేశ్వరధ్యానంబు సేయుచుఁ గించిదున్మీలితలోచనుండనై యున్నయెడ రామభద్రుండు తననామాంకితంబుగా శ్రీమహాభాగవతంబు తెనుంగుసేయ నానతిచ్చి తిరోహితుం డయ్యె''

నని వ్రాసె. దీనిం బట్టిచూడ పోతనామాత్యునకు బహుకాలమునుండి నారాయణకథావిధానంబుల నాంధ్రీకరించు కోర్కె యున్నట్లును దానికి శ్రీరామచంద్రునియాజ్ఞయు నైనట్లును స్పష్ట మగును. లీలాశుకుఁడు మొదలగుకొందఱు శైవమతప్రవిష్టులకు వైష్ణవగ్రంథరచనయందును, హరదత్తాచార్యుఁడు మొదలగు వైష్ణవమతప్రవిష్టులు కొందఱకు శైవమతగ్రంథరచనయందును గోర్కెలు గలుగునట్లుగ నీవఱకే దృష్టాంతములున్నవి. అటులనే పోతనామాత్యుఁడును శైవమంత్రోపాసకుం డైనను వైష్ణవకథానువర్ణనాసక్తియు తద్భక్తియు మిగులఁ గలిగియున్నట్లు స్పష్టం బగుచున్నది.

## భాగవతరచనాప్రకారము.

ఇతఁడు తాను రచియింపఁబోవుభాగవతములో సంస్కృతమునకంటె అధికగ్రంథము చేర్చుటకు తనకుం గలయిష్టమును సూచించుటకీక్రిందివిధంబున నొకపద్యంబు వ్రాసెను:—

“ తే. భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు, శూలికైనఁ దమ్మిచూలికైన
విబుధజనులవలన విన్నంత కన్నంత, తెలియవచ్చినంత తేటపఱుతు. ”

ఈపోతన తన శైలింగూర్చి మఱియొకపద్యంబు వ్రాసెను:—

క. కొందఱకుఁ దెనుఁగు గుణ మగుఁ, గొందఱకును సంస్కృతంబు గుణ మగు రెండుం
గొందఱకు గుణము లగు నే, నందఱ మెప్పింతుఁ గృతుల నయ్యైయెడలన్.

అని పోతన తనకుఁ బూర్వు లగుతిక్కనాదికవులందఱు పురాణాదులు తెనిఁగించినను భాగవతమును దెనిఁగించక యుండి రనియు దానిం దెనిఁగించినచో లోకము తన్నాక్షేపించెదరేమో అనుశంక మనంబున నుంచుకొని యిట్లీక్రిందిపద్యంబున పూర్వులు దీని దెనిఁగించకుంటకుఁ గారణము తనను దరింపఁజేయుటకుఁగా నని తెల్పెను. అదెట్లన్నను:—

"మ. ఒనరన్ నన్నయ తిక్కనాదికవు లీయుర్విం బురాణావళుల్
దెనుఁగుల్ సేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దా నెట్టిదో
తెనుఁగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిం దెనింగించి నా
జననంబున్ సఫలంబు సేసెదఁ బునర్జన్మంబు లేకుండఁగన్."

పోతన భాగవతమును దాను గంగాతీరమున నున్నసమయమం దుననే చేయక తిరిగి యేకశిలానగరమునకు వచ్చినపిమ్మట దానిం జేయ నారంభించె నని యీక్రిందివచనసందర్భంబువలన స్పష్టంబగు. ఎట్లనిన:—

"వ. ఇట్లు భాసిల్లెడు శ్రీమహాభాగవత పురాణ పారిజాతపాదప సమాశ్రయంబున హరికరుణావిశేషంబున కృతార్థత్వంబు సిద్ధించె నని బుద్ధి నెఱింగి లేచి మఱికొన్ని దినంబులకు నేకశిలానగరంబునకుం జనుదెంచి యందు గురువృద్ధబుధబంధుజనానుజ్ఞాతుండనై నాచిత్తంబునఁ బెన్నిధానంబుం బోని శ్రీరామచంద్రునిసన్నిధానంబుఁ గల్పించుకొని శేషశాయికి సమర్పణంబుగా నే నాంధ్రంబున నొనర్పం బూనిన శ్రీమహాభాగవత పురాణంబునకుఁ గథాప్రారంభం బెట్టిదనిన"

అని వ్రాసె. దీనింబట్టి చూడ నీతండు గంగాతీరంబు వదలి స్వగ్రామం బగునేకశిలానగరంబునకు వచ్చి యనంతరము భాగవత మాంధ్రీకరింప నారంభించినట్లు స్పష్ట మగును. ఇం దుదాహరింపంబడిన యేకశిలానగర మెక్కడిదై యుండు నని యొక శంక వొడముచున్నది. కడపజిల్లాలోని యొంటిమిట్టకే యీనామ మున్నట్లు కొందఱిమతము. ప్రతాపరుద్రునిరాజధాని యగునోరుగల్లునకే యీనామ మున్నదని మఱి కొందఱి యభిప్రాయము. గ్రంథాదులలో సర్వత్ర రెండవదే ప్రసిద్ధనామ మై కాన్పించును. దీనికి వ్యతిరేక మగుగ్రంథదృష్టాంత మాగపడువఱకు నీరెండవస్థలమే యితనినివాసస్థలముగా నిర్ణయింతము.

## నరకృతి నిషేధించుట.

ఈ బమ్మెరపోతరాజు భాగవతమున నరకృతి చేయఁగూడనట్లుగాఁ జెప్పికొనియె. అ దెట్లం టేని:—

"ఉ. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలుచే

సమ్మెటవ్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరా జొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్."

అను దీనిం బట్టి పోతరాజు నరకృతి నిషేధించినట్లు స్పష్టమే యగు. అయితే దీనికి బూర్వమునందో పరమందోగాని యీపోతరాజు వేంకటగిరి ప్రభుం డగుసర్వజ్ఞసింగమనీని కోర్కెపై నొక దండకము చెప్పి యాప్రభునిపైఁ గృతియిచ్చినట్లు వేంకటగిరివారివంశచారిత్రమువలనఁ గాన్పించును. అది కేవలము నిజమనుటకు నబద్ధమనుటకు మనకుఁ దగినన్ని నిదర్శనములు కానరావు. భాగవతమున నరకృతి నిచ్చుటచేఁ గల్గినమనఃపరితాపముచేతనే అయియుండు నని యూహింపవచ్చును. అట్లైన నది భాగవతమునకు ముందే అగును. పోతనకృతగ్రంథములలో నెచ్చట నది వివరింపఁబడలేదు. ఆకారణముచేత భాగవత రచనానంతరమే అని యూహింతు మనిన నదియుం బొసఁగియుండలేదు. భాగవతానంతరము పోతనవిషయమై సింగమనీఁడు జరిగించియున్నాఁ డనినచర్యయే యథార్థమేని అపుడును భోగినీదండకము పుట్టుట కవకాశము లేదు. కావున నీగ్రంథము పోతన చేసియుండె ననుటకన్యగ్రంథసాక్ష్యము కావలసియుండును. ఆంధ్రభాగవత మచ్చొత్తించిన పండితులు దీనివిషయ మెట్లుగా వ్రాసిరో దానిం జూపెదము.

## పోతరాజుకాలము.

" శాలివాహనశకసంవత్సరములు ౧౩౦౦ గల కాలంబుగతంబై యుండు సమయంబున ............ వ్యాసాపరావతారుం డని పొగడొందఁదగిన సుగుణాకరుం డైనపోతనామాత్యుఁడు బమ్మెరవంశప్రసూతుం డైన కేసనమంత్రికిఁ దనూజుండుగా జనించె. ఇది కొంచె మించుమించుగా నితని దండకమును గృతినందె నని చెప్పెడు వేంకటగిరి ప్రభునికాలముంబట్టి నిర్ణయింపఁదగియున్నది. ఆప్రభునిపేరు సర్వజ్ఞసింగమనీఁడు." అతఁడు శా. స. ౧౩౦౦ మున ప్రభుత్వమునకు వచ్చి శా. స ౧౩౫౦ వఱకును వ్యవహరించినట్లుగా వేంకటగిరివారి వంశావళీ గ్రంథ

మువలనఁ గానుపించును. అదిగావున పోతరాజుకాల మదియె కావచ్చును. ఆసర్వజ్ఞ సింగమనీఁడు విజయనగర ప్రభుం డగు ప్రౌఢదేవరాయల కాలీనుం డని ఆగ్రంథమందే వ్రాయఁబడినది. కావున నతని కాలీనుఁడ.

### పోతరాజు బాల్య చేష్టితము.

పోతరాజు బాల్యవ్యాపారాదికములంగూర్చి పైపండితులు వ్రాసిన దె ట్లనగా:—

“ఇమ్మహాత్ముండు బాల్యంబునందు గోసంరక్షణార్థంబుగ స్వగ్రామంబగు నేకశిలానగరంబునకు సన్నికృష్టపర్వతాగ్రంబున సంచరించుసమయంబున నచ్చట తనపూర్వజన్మసుకృత పరిపాకాతిశయంబునఁ జిదానందయోగీంద్రుం డనునొక ఋషిశ్రేష్ఠుం డతనికి దృగ్గోచరుం డైన నంత నాపోతనామాత్యుం డమ్మహాత్మునిం గాంచి యతని చెంతకుం జని యత్యంతభయభక్తుల నవనతశరీరుం డై యభివందనం బొనర్చి శరణుఁజొచ్చితినని పలుక నాతపోధనుండు బాలుం డగుపోతనామాత్యునియం దవ్యాజకరుణ నుంచి శ్రీరామమంత్రరాజం బనుగ్రహించి తదనుష్ఠానక్రమం బశేషంబుగఁ దెల్పి కృతార్థుండవు గమ్మని తెల్పె”

అయితే భాగవతములో నిట్టివృత్తాంత మేమైన నున్నదా యని యారయవలసి యున్నది.

### పోతన గురువిషయము.

భాగవతంబున నీకథ కెంతమాత్రము నాధారము గాన్పించదు. చిదానందయోగీంద్రుండు పోతనకు గురుం డే అయినచో నాతనింగూర్చి స్తోత్రము గానీ స్మరణము గానీ అం దుండకపోవునా అని తోఁచుచున్నది అ దెట్లున్నదన—

“అని యిష్టదేవతలం జింతించి దినకరకుమారప్రముఖులం దలంచి ప్రథమకవితావిరచన విద్యావిలాసాతిరేకి వాల్మీకి నుతియించి హయగ్రీవదనుజ కర పరిమళిత నిగమనివహ విభాగ నిర్ణయ నిపుణతా సముల్లాసుం డగువ్యాసునకు మ్రొక్కి శ్రీ మహాభాగవతకథాసుధారస ప్రయోగికి శుకయోగికి నమస్కరించి మృదుమధుర వచనవర్గ పల్లవితస్థాణునకు బాణునకుం బ్రణమిల్లి కతిపయ శ్లోకసమ్మోదిత సూరు మయూరు నభినందించి మహాకావ్యకళా విలాసుం గాళిదాసుం గొనియాడి కవికమలరవిం భారవిం బొగడి విదళితాఘు మాఘు భూషించి యాంధ్రకవితాగౌరవజన మనోహారి నన్న

యనూరిం నైవారంబు చేసి హరిహరచరణారవింద వందనాభిలాషిం దిక్కమనీషిం భూషించి మఱియు నితరపూర్వకవిజన సంభావనంబు కావించి వర్తమానకవులకుం బ్రియంబు పల్కి భావికవుల బహూకరించి యుభయకావ్యకరణదక్షుండ నై"

అని యున్నది, పోతన తనకు మంత్రోపదేశము చేసి తరియింపం జేసిన చిదానంద యోగీంద్రునివంటిగురుండే యుండఁగ నాతని తన గ్రంథంబులో నెచ్చోటనైన స్మరియించక యుండునా? కావున నీవృత్తాంతంబు యుక్తిసహముగ నుండలేదు. ఇదియునుగాక ఇతఁడు రామమంత్రోపాసన చేసె నని చెప్పినవృత్తాంతంబు నంతమాత్రముగనే యున్నది. శ్రీరాముఁడు కృతిపతియేని అతనిస్తోత్ర ముండునుగదా. దానిం జూచిన శ్రీకృష్ణస్తుతిగాఁ గాన్పించు. ఎట్లనఁగా:—

"ఉ. శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలనకళాసంరంభకున్ దానవో
ద్రేకస్తంభకుఁ గేళిలోలవిలసద్దృగ్జాలసంభూతనా
నాకంజాతభవాండకుంభకు మహానందాంగనాడింభకున్."

అని యందు "నందాంగనాడింభకున్" అనువాక్యము శ్రీరామపరము కాదనియు శ్రీకృష్ణపరమే అనియును స్పష్టము. షష్ఠ్యంతములలో నేదేవుని వక్కాణించినాఁడో అని చూడఁగా నందు నీప్రకారము శ్రీకృష్ణుని నుద్ఘాటించినట్లు స్పష్టమగుచున్నది. ఎట్లంటేని:—

"ఉ. హారికి నందగోకులవిహారికిఁ జక్రసమీరదైత్యసం
హారికి భక్తదుఃఖపరిహారికి గోపనితంబినీమనో
హారికి దుష్టసంపదపహారికి ఘోషకుటీపయోఘృతా
హారికి బాలకగ్రహమహాసురదుర్వనితాప్రహారికిన్."

ఇట్లు స్పష్టముగా శ్రీకృష్ణునిపేరిట కృతిముఖము కాన్పించుచున్నపుడు నీ శ్రీకృష్ణుఁడే పోతనామాత్యున కుపాసనాదేవతగా భావించవలసియున్నది. ఇతని నుద్దేశించియే మొదటిరచనకు గమకించి యుండును. అయితే భాగవత కథానాయకుండును కృతినాయకుండు నొక్కఁ డవుటకంటె శ్రీకృష్ణునకు రూపభేదంబుగా నున్నశ్రీరాముని దీనికిఁ గృతిపతిగాఁ జేసిన లెస్స యై యుండునని యూహిం

చి ప్రథమస్కంధము చివరనుండియును శ్రీరాముని సంభాషించి అవతరింపు మని చెప్పినట్లు కాన్పించును. అయితే తాను గంగాతీరంబున మహేశ్వరధ్యానంబు సేయుచుఁ గించిదున్మీలితలోచనుండ నై యుండఁగ నపు డొకరాజ్యముఖ్యుఁడు గన్పించె ననియును నాతఁడు తాను శ్రీరాముఁడ నైనట్లు తనపేరిట శ్రీమహాభాగవతముఁ దెనిఁగింపు మని కోరినట్లుగా మాత్రము వ్రాయంబడియున్నది. దానికిఁ బోతన తనయంగీకారము చెప్పినట్లుగాఁ గానుపించదు. ఈక్రిందిపద్యము తాను మేల్కాంచి తన మనంబులో ననుకొనినట్లుగాఁ గాన్పించును.

"క. పలికెడిది భాగవత మఁట, పలికించెడివాఁడు రామభద్రుం డఁట నేఁ
బలికిన భవహర మగు నఁట, పలికెద వేఱొండు గాథ పలుకఁగ నేలా."

దీనింబట్టిచూడ నారాజశేఖరునకుఁ గృతి నిచ్చెద నని పోతరాజు సన్నద్ధుఁ డైనట్లు కాన్పించదు. ఈపద్యమునకు మఱియొక తాత్పర్యమే చెప్పవచ్చినయెడల దీనితర్వాయిని వెంటనే వచ్చిన షష్ఠ్యంతములు శ్రీకృష్ణునిపేరిట నుండ దీనినంతయుం జూచినచో చిదానందయోగీంద్రుని కథయును, శ్రీరామ మంత్రోపాసనంబును రెండును కల్పనాకథలుగా నూహింపవలసియున్నది. గీర్వాణభాగవతగ్రంథసంఖ్య యిరువది

ఆంధ్రభాగవత గ్రంథపద్యాదికము

రెండువేలు. ఆంధ్రంబున ముప్పదివేలవఱకును భాగవతగ్రంథ సంఖ్య కలదు. ఇట్లధికముగాఁ జేయుటకు తలంపు గలిగియే పోతన గ్రంథారంభంబున నొక్కపద్యంబు వ్రాసి యుండెను. అందు:—

"గీ. భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు, శూలికైనఁ దమ్మిచూలికైన
విబుధజనులవలన విన్నంత కన్నంత, దెలియవచ్చినంత దేటపఱుతు."

సంస్కృతభాగవతమునే తెనిఁగింతు ననుతలంపు గలదేని యిట్లు తెలుపనవసరము లేదు. ఇందు గ్రంథసంఖ్య పెరుగుటకుఁ గారణ మష్టాదశపురాణములలో విష్ణుమహిమానువర్ణనముం జేయుకథలను కథాసందర్భానుసారు లైన ప్రబంధవర్ణనలుం జేర్చుటయై యున్నది. అందుకు సత్యాభామ యుద్ధాదికములును గంగావతరణాది విశేషవర్ణనలును దృష్టాం

తములుగా నున్నవి. పోతన భాగవతంబునం దంతట వ్యాసకృత శ్లోకముల యభిప్రాయమును వదలక సరిగా నాంధ్రీకరించినాఁడు. ఇట్లాంధ్రీకరించుట యెంతయు శ్లాఘాపాత్రమైనపని యై యున్నది. ఈ గ్రం

### అన్యకవిరచితగ్రంథప్రక్షేపకారణము.

థము రామాయణ భారతములవలె నేకారణముననో యొక్క కవివలనఁ బూరింపఁబడక తచ్ఛిష్యులును తన్మిత్రులును నగుమఱికొందఱివలనఁ బూర్ణంబుచేయఁబడినట్లుగాఁ గాన్పించును. దీనికి దేశదేశములలో వేఱువేఱు కథలు వ్యాపించియున్నవి. అవి నమ్ముటకుంగాని నమ్మమని పరిహరించుటకుఁగాని వ్రాతమూలము లగునాధారము లెవ్వియుఁ గానరావు. ఆంధ్రభాగవతమును ముద్రించి ప్రకటించిన వారు బమ్మెరపోతనామాత్యుని జన్మకర్మ ప్రభావములు తెలిపెడువచనరూపం బగుప్రాచీనపండితజనలిఖితగ్రంథంబును తాము తెప్పించి దానిం బట్టి తాము వ్రాసిన చారిత్రము వ్రాసియుంటి మని చెప్పిరి. దాని సంగ్రహమును చేసి వారు వ్రాసి ప్రకటించుటకంటె మూలగ్రంథమునే ప్రకటించిన లోకోపకారముగ నుండును. అట్టిమూలగ్రంథము లేనిదే ఆకథయెడ నేయభిప్రాయంబు నీయ వీలుపడదు. అట్టిగ్రంథంబు వచ్చి యథార్థకథనుసూచించువఱకును పోతన తనశిష్యులకుఁ గొంతభాగమును మిత్రులకుఁ గొంతభాగము నిచ్చి తాను కొంతభాగముఁ గొని పెద్దగ్రంథము గావున దీనిని పరిసమాప్తి నొందించె నని చెప్పిన నొప్పియుండును. అట్లు నిశ్చయించి దీనిలో నుండెడు నన్యకవిరచనంగూర్చి వ్రాయుదము. ఈ భాగవతములోని పంచమ షష్ఠ ఏకాదశ ద్వాదశ స్కంధములు అన్యకవిరచితములుగాఁ గాన్పించు. అట్టివానిని రచియించిన వానింగూర్చి వ్రాయవలసియున్నది.

### ఆంధ్రభాగవతకవులు.

మనము పై నూహించినయూహ కనుగుణముగనే భాగవతము భాగములుగా విడదీయఁబడినచో పోతరాజు భాగమునకు (౬) స్కం

ధములును, తచ్ఛిష్యుల భాగమునకు ౬ స్కంధములును వచ్చినట్లు గాఁగాన్పించు. అందు ౫ పంచమస్కంధము గంగనార్య ప్రణీతము. షష్ఠ స్కంధము సింగనార్య ప్రణీతము. ౧౧ ఏకాదశ ౧౨ ద్వాదశ స్కంధములు వెలిగంధల నారాయణకవి ప్రణీతములై యున్నవి. ఇందు మొదటికవి గాక తక్కిన యిద్దరును పోతనార్యునియెడల గురుభక్తి గలవారుగా వారిపద్యములవలనను, గద్యములవలనను స్పష్టమగుచున్నది. గంగనార్యుఁడు తన వంశావళి మొదలగువానిం జెప్పకుండుటచేత నెట్టిసంబంధము కల్గియుండునో చెప్ప వీలులేకున్నది. అయితే ఇతఁడును పోతనామాత్యునివిధంబుననే తనగ్రంథము కృష్ణున కంకితముగాఁ జేసెను. ఇతనివలెనే సింగనార్యుఁడును తనగ్రంథము కృష్ణునకే యంకితము చేసి రచియించెను. దీనింబట్టి చూడఁగా నీకవులందఱును తమతమ భాగములు కృష్ణునకే అంకితములు చేయుటకు నిర్ణయించుకొనినట్లును అనంతరము కారణాంతరముచేత రామాంకితముగా దానిని మార్చిన సతని ప్రియశిష్యుండగు వెలింగందల నారాయణ కవిమాత్రము తాను పోతనవిధంబుగ రామనామాంకితముగనే గ్రంథము రచియించినట్లు నూహింపనై యున్నది. ఇదియునుగాక యీమువ్వురుకవుల భాగములకు నిల్చిన గ్రంథ మించుమించుగా సరసూర్ధభాగములో సమానముగనే యున్నట్లు కాన్పించుచున్నది. ౫ స్కంధము ౩౦ పుటలలో ఋషభరాజుచరిత్రమును భరతోపాఖ్యానములును ముఖ్యములు. ౬ స్కంధము ౩౬ పుటలలో అజామిళోపాఖ్యానము, హంసగుహ్యస్తవరాజము, నారాయణకవచము నున్నది. ౧౧ ౧౨ స్కంధలు ౨౦పుటలలో ఋషభకుమారుల పరమార్థోపదేశము కృష్ణుండుద్ధవునకుఁ జేసినపరమార్థోపదేశము, అవధూతయదుసంవాదము నున్నది. పోతన ఇట్లుగా పరమార్థోపదేశము గల్గిన భాగము విడదీసి యొక్కొకని కొక్కొకదాని నిచ్చి గ్రంథము పూర్తిచేయించినట్లుగాఁ గానుపించు. ఈమువ్వురిలో సింగన తాను రచియించిన షష్ఠస్కంధము

నకుఁ గృత్యాది పద్యములును తన వంశవర్ణనయు తాను దానిం జేయుటకుఁ గలకారణములను కొన్నింటి వ్రాసి యుంచెను. వాని నిట వివరించుట అవసరముగావున సంగ్రహముగా వివరించెదను.

### ఏర్చూరి సింగనమంత్రి

ఇతఁడు భారతశేషమును, హరివంశమును ఆంధ్రీకరించిన యెఱ్ఱాప్రెగ్గడయొక్కయో లేక కోకోకమనుకళాశాస్త్రముం దెనిఁగించిన యెఱ్ఱాప్రెగ్గడయొక్కయో వంశస్థుఁ డని చెప్పవలసియున్నది. ఈ విషయమైన కొంత వృత్తాంతము ౩అధ్యాయములో ౬౦-౬౧-౬౨ పుటలలో వ్రాయఁబడినది. ఇపుడు సింగనవిషయమైన గ్రంథస్థచారిత్రము వ్రాసెదను. ఎఱ్ఱాప్రెగ్గడనుండి ఎఱ్ఱాప్రెగ్గడవారనియు పోతరాజునుండి పోతరాజువారనియు నియోగికుటుంబములు రెం డేర్పడినట్లు కాననగు. దానికి దృష్టాంతముగ నెఱ్ఱాప్రెగ్గడవారిది శ్రీవత్సగోత్రమును పోతరాజువారిది కౌండిన్యసగోత్రము నై యున్నది. ఇదియే యథార్థమైన నీసింగనార్యుని యింటిపేరు ఎఱ్ఱాప్రెగ్గడవారు కావచ్చును. కొండవీటి సీమలోను అద్దంకి సీమలో నుండు పెక్కండ్రు నియోగిబ్రాహ్మణులు ఆదేశప్రభువు లీదేశము జయించి వచ్చినపుడు వారితో వేఁగిదేశమున గోదావరీ తీరమునకు వచ్చి అచ్చటనే స్థిరపడిరి. పైకుటుంబములవారును అట్టి వారిలోనివారే కావచ్చును. కావున నిపుడు మనము వ్రాయుచున్న సింగన యెఱ్ఱాప్రెగ్గడవారికి మూలపురుషుఁడు కానోపును.

ఈసింగన తాను భాగవతముం జేయుటకుఁ గలకారణంబు నొక విధంబుగఁ జెప్పుచున్నాఁడు. అది యెట్లనిన:—

"ఉ. ఎయ్యది కర్మబంధముల నెల్ల హరించు విభూతికారణం
బెయ్యది సన్మునీంద్రులకు నెల్ల కవిత్వసమాశ్రయంబు ము
న్నెయ్యది సర్వమంత్రములఁ జేలిన దెయ్యది మోక్షలక్ష్మిరూ
పెయ్యది దానిఁ బల్కెద సుహృద్యము భాగవతార్థమంత్రమున్.

వ. అని శ్రీ మహాభాగవత పురాణంబునందు షష్ఠస్కంధం బాంధ్రీభాష విరచింపం బూని యాకృతికిం బతిగా నర్హుండు గలం డని వితర్కించి నాకుం గవిత్వమాహాత్మ్యంబు

సంప్రాప్తం బగుకాలంబుఁ దలంచి నారాయణుండే దైవం బని యెఱింగి మనోరథంబు సఫలం బయ్యె నని యీకృతి కృష్ణార్పణంబు చేసితి నది యెట్లనిన నేను విద్యాభ్యాసం బునం దగిలి కొండిక నై యుండ నొక్కనాఁడు దివంబున.

చ. కలితవిశేషవస్త్రములు గట్టి హిమాంబు సుగంధ చందనం
బలఁది వినూత్న భూషణము లారఁగఁ దాల్చి వినోదలీల నిం
పుల మృదుశయ్య నిద్రఁ దగఁ బొందినచోఁ గనుపట్టెఁ బల్మఱుం
దలమున గ్రమ్మ క్రొమ్మెఱుఁగుదండము రూపున నిల్చుపోల్కిగన్.

సీ. ఉరవడిఁ బ్రాగ్వీథి నుదయించు మార్తాండ, కోటిబింబచ్ఛాయ గూడినట్లు
హరిహరబ్రహ్మల యాత్మలలో నుబ్బి, కరుణ యొక్కట మూర్తి పెరసినట్లు
ఖరకరకరతీవ్రగతిని గరంగుచు, హేమాద్రిచెంతఁ దెల్లగిసినట్లు
ఫణిరాజఫణరాజిమణిగణవిస్ఫూర్తి, సుషిరంపువెలి దలచూపినట్లు
ఉట్టిపడ్డట్లు కట్టెఱ నూఁదినట్లు, తేజ మెసఁగంగ నాపాలి దివ్యవాణి
పూని సాక్షాత్కరించి సంపూర్ణదృష్టిఁ, జూచి యిట్లని పలికె మంజులము గాను.

ఉ. ఆటలు పాటలుం జదువు లద్భుతముల్ వినవొప్పువాద్యముల్
సాటి దలంపరానిబలుసాములు మున్నగువిద్య లెల్ల నీ
కాటలుఁ బాట లయ్యె విను మన్నిటికి న్మఱుఁ గిద్దభంగి నా
చాటున జాటుకారపదసాధుకవిత్వము చెప్పు మింపుగన్.

వ. అని యానతిచ్చె జగన్మాత కృపావలోకన సుశ్లోకుండనై యే నొకశ్లోకంబు నాక్షణంబ నుడివితి నది యెట్టిదనిన.

శ్లో. హంసాయ సత్త్వనిలయాయ సదాశ్రయాయ
నారాయణాయ నిఖిలాయ నిరాశ్రయాయ
సత్సంగ్రహాయ సగుణాయ సదీశ్వరాయ
సంపూర్ణపుణ్యపతయే హరయే నమోఽస్తు.

వ. ఈశ్లోకం బద్దేవి యంగీకరించె నంత మేలుకాంచి యానందభరితుండ నై నాఁటనుండి చంద్రానుగత యగుచంద్రికయుంబోలె నారాయణాంకితం బైనకవిత్వ తత్త్వజ్ఞానంబు గోచరం బయ్యె దానికి ఫలంబుగా గోపికావల్లభుని నుల్లంబున నిడుకొని.

గీ. పలుకఁ గలిగె మొదల భాగవతార్థంబు, భర్త కృష్ణుఁ డాయె భాగ్య మొదవె,
నమృతరసము గోర నమరుచింతామణి, పాత్రి సంభవించుభంగి నిపుడు.

గీ. భాగవతము తేటపఱుప నెవ్వఁడు సాలు, శుకుఁడు దక్క నరునిసఖుఁడు దక్క
బుద్ధిఁ దోఁచినంత బుధులచే విన్నంత, భక్తి నిగిడినంత పలికినాఁడ. "

ఇట్లుగా సింగన తాను భాగవతకథ నాంధ్రీకరించుటకుఁ గారణంబులు వ్రాసెచ్చె. ఇతఁడు ప్రాచీనాంధ్రకవులను వర్ణించుచోఁ నన్నయభట్టును, తిక్కన సోమయాజులను,ఎఱ్ఱాప్రెగ్గడను, భాస్కరుని నాచనసోముని, శ్రీనాథుని వర్ణనజేసి పోతనామాత్యు నీక్రిందివిధంబున నుతియించె.

"ఉ. ఎమ్మెలు సెప్ప నేల జగ మెన్నఁగ పన్నగరాజశాయికిన్
సొమ్ముగ వాక్యసంపదలు సూరలు సేసినవాని భక్తిలో
నమ్మినవాని భాగవతనైష్ఠికుఁడై తగువానిఁ బేర్మితో
బమ్మెరపోతరాజుఁ గవిపట్టపురాజుఁ దలంచి మ్రొక్కెదన్."

అని నుతియించుటంజేసి యితఁ డీగ్రంథంబు రచియించుటకుఁ బూర్వమే పోతన భాగవతస్థ నున్నట్లుగా నూహింప నైయున్నది. ఈసింగన పోతనామాత్యునివిధంబున తనకృతిముఖమంతయు నమర్చుటంజేసి యితఁ డాతనిశిష్యుం డగునేమో యని తోఁచుచుండును. ఇతని కృతిముఖంబున పోతనవలెనే శ్రీకృష్ణవర్ణనయు ననంతరపద్యములో శివవర్ణనయు, పిమ్మట బ్రహ్మకు వందనమును దరువాత విఘ్నేశ్వరవర్ణనయు సరస్వతీస్తుతియును, అనంతరము లక్ష్మీస్తుతియు నున్నది. షష్ఠస్కంధములోను ప్రథమస్కంధములోవలెనే శ్రీకృష్ణునకు షష్ఠ్యంతములు వ్రాయంబడినవి. దీనిం జూడ నీతండు భాగవత మారంభమైన కొన్నిదినములకు గ్రంథారంభంబు చేసి తన గ్రంథారంభముకూడ పోతనగ్రంథమువలెనే యుండఁగోరి యటులనే దాని నంతయు రచియించినట్లు మాత్రము గాన్పించును. ఇంతకంటె నీగ్రంథమునుబట్టి వ్రాయఁదగినది కాన్పించదు. ఇతఁడును షష్ఠస్కంధము చివరను శ్రీరామాంకితముగానే ముగించి చెప్పెను. దీనికి పోతనవలె ముగించెద నను తాత్పర్యము తప్ప వేఱే కాన్పించదు.

### వెలిగందల నారాయణకవి వంశముంగూర్చి

ఇతనిం గూర్చిన కథాసందర్భము లేమియు విస్పష్టము కాలేదు. పైని మనము నిర్ణయించినప్రకారము వెలిగందల అనునామము

గాత్రమనామముగాక పౌరుషనామమే అగునెడల "కందన" అను పద్మపురాణోత్తరఖండ కృతిపతియొక్క వంశస్థుఁడు కానోపును. అయితే తగినన్ని ఆధారములు లేనిదే దీనిం బెంచి వ్రాయఁగూడదుగావున దీని నిల్పెదను.

## భాగవతాంధ్రకవులు.

ఈక్రింద సంప్రదాయజ్ఞులవలన విన్నంతవఱకు నావలన నిదివఱలో వివరింపఁబడిన గాథలు పైకథాసందర్భములకు వ్యతిరేకించనట్లుగా దిద్ది పునరుక్తి లేకుండఁ జేసి వివరించెదను.

## శ్రీనాథుఁడు కర్ణాటకునకుఁ గృతి నిప్పింపవచ్చుట.

ఇదివఱలో నీభాగవత గ్రంథమును గృతియిమ్మని రాజు సింగన కోరినట్లు దానిం జేయకుంట కలిగి యాతఁ డపకారము చేసెననియును జెప్పియున్నాము. అటువలెనే కర్ణాటకప్రభుఁడుగూడ నీభాగవత గ్రంథము తనకు గృతినిప్పింపవలయు నని కోరి తనమిత్రుఁడును, పోతనకు బంధువుఁడు నగుశ్రీనాథకవిం బంచినట్లును; అతఁడు వచ్చువఱకుఁ బోతరాజు వ్యవసాయము చేయుచు పొలముగట్టునఁ గూర్చుండఁగా 'హాలికులకు మీకుం గుశలంబె' అని యడుగుచుఁ బోతన యీక్రిందిపద్యంబు చదివినట్లును గలదు. ఎట్లన్నను:—

"ఉ. బాలరసాలసాలనవపల్లవ కోమలకావ్యకన్యకం
గూళుల కిచ్చి యప్పడుపుగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికు లైన నేమి గహనాంతరసీమలఁ గందమూలకౌ
ద్దాలిక లైన నేమి నిజదారసుతోదర పోషణార్థమై."

అట్టిమాటకు శ్రీనాథుఁడు సమాధానము చెప్పఁజాలక నీవు వచించినది నిజమే ప్రపంచములో ధనికునకు నేకొఱఁత యుండదు. 'ధనమూల మిదం జగత్' అని యుండలేదా! బ్రతికియున్నంతవఱకు నింత యన్నముం బట్టయుఁ గలిగియుండవలెఁగదా! నీ కంత యిష్ట మున్న మఱి యొకకృతి దేవున కిమ్ము. ఇప్డు నాపలు కాలించి నీభాగవతంబుఁ గర్ణాటమహీపాలునకుఁ గృతియొసంగి సంపదల నందుము. దీనికి మాఱువలి

కిన నామాటకుఁ దప్పినట్లు దలంచెద. అనుడు పోతన శ్రీనాథునినిర్బంధ వాక్యముల కేమియుఁ బ్రతివచనం బీయ నోరాడకుండుటం జేసి యూర కుండె. దాని నంగీకారపిశునంబుగ భావించి శ్రీనాథుండు కర్ణాటమహీజాని కడ కరిగి పోతనవృత్తాంతంబంతయుఁ దెలిపి భాగవతంబునకుఁ గృతిపతివి గా నీవ తగు దని తెల్పి పోతనకవనంబు గొనియాడి యాతని పదలాలిత్యంబు నిన్నును నీపదలాలిత్యం బాతని సంతుష్టులఁ జేయు నని తలంచెద ననియె. రాజును శ్రీనాథుపలుకులకు సంతసిల్లి వల్లె యనియె.

## పోతన చింత.

అంతఁ బోతన శ్రీనాథుపల్కులు మనంబునం దలపోసి యిట్లు చింతించె. అయ్యయో యిది యేటివృత్తాంతంబు! కర్ణాటునకుం గృతియొసఁగు మని నన్నితండు ప్రేరేపించెడిని. నే నెటు జేసిన నీతని కేమాయె. నీతం డీవృత్తాంతి మంతయు గర్ణాటమహీధవునకుఁ దెల్పియుండనోవు. అతఁడు కృతిఁ దెమ్మన్న నే నెట్లు దెత్తు. అటు గాకున్న నేమి చేటు వాటిలునో బుద్ధిజాడ్యంబునం జేసి స్వాభిప్రాయంబు తేటపడం బల్కనైతి. ఇట్టిబుద్ధిమాంద్యము గలవానికిఁ జెట్టలు తప్పక రావలయు. అని తన్ను నిందించి కొనుచు నేమియుఁ జేయఁ జేయూడకున్న నొకచోఁ గూర్చుండియుండి కనులుమూసె. అంతఁ గమలపాణి యగువాణి కన్నీరు వఱదలై పాఱ నేడ్చుచుఁ గాన్పించె. పోతన యాపె కమలభవునిరాణిగ నెఱింగి రోదనము సేయుటకుఁ గతం బూహించి స్వాపరాధంబ దానికిం గారణం బని యెంచి యద్దేవిం గాంచి యిట్లనియె:—

"ఉ. కాటుకకంటినీరు చనుకట్టుపయిం బడ నేల యేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలికోడల యోమదంబ యో
హాటకగర్భురాణి నిను నాఁకటికిం గొనిపోయి యల్లక
ర్ణాట కిరాట కీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్మ భారతీ."

అని పల్కి యాపె నూరార్చి నాఁటనుండియుఁ గర్ణాటునకుం గృతినిచ్చుతలంపు మానియుండెనఁట. ఇట నొక్కనాఁడు కర్ణాటమహీ

## కర్ణాటప్రభుఁడు వచ్చుట.

జాని భాగవతనామంబుఁ దలంచి యిట్లు చింతించె. బహుదినంబులాయెఁ బోతన భాగవతంబు దెనిఁగించుచుండె నని వింటిమి. ఇంతకు నాతండు రాకుండుటకుఁ గారణం బేమి. మృగయావినోదమిషంబున నతం డుండు దేశంబునకుఁ బోయివత్తుఁగాక యని బయలువెడలి యాతఁ డయ్యూరు సేరి యాతనిం బిలువ దూతలం బనిచె. అత్తఱిఁ బోతనామాత్యుండు భాగవత తృతీయస్కంధంబున శ్రీయజ్ఞవరాహావతారఘట్టంబు దెనిఁగించుచుండె. భక్తపరాధీనుండగు నారాయణుండు పోతనతో నల్లపుడు లీలావినోదంబులఁ గాలంబు గడుపుచుండుఁగావున వర్ణితవరాహరూపంబున నచ్చో విహరించుచుండె. భూవిభుని బంట్లు వచ్చిన వర్తాంతమెఱిఁగి యాదేవుండు భక్తరక్షణార్థంబు తద్ద్వారోపరిభాగంబున నూత్నగాత్రంబునఁ గూర్చుండియుండె. భటకోటిలోనికిఁ జనను ద్యుక్తు లగుడుఁ దనదేహంబు హుంకారధ్వనితోఁ బెంచి వారి నదల్చిన నారాజకింకరులు తమయొడయనికడ కేఁగి సంప్రాప్త మగునంకిలిఁ దెల్ప నాతండు శంకలుడుగుం డని భయంకర సేనాపరివృతుం డై చని కిటిస్వామిం గని సామాన్యవరాహంబని యెంచి పంది కై యిటు భయమంద నేల? చూడుఁడు. నే నిపుడ దీని మడియింతు. అని తన సేనానులం బురికొల్పి పొడువుఁడు పొడువుఁడు పెంపు డింపుఁ డనుచు వెంట నంటె. అంత నాక్రోడంబు సక్రోధం బై కన్నుల నిప్పు లొలుక వారినందఱఁ దనకోప పావకునకు నింధనీభూతులఁ జేయఁదలంచి విజృంభించి దంతహతి నరాతిచమూపతుల నింతింతలు తునియలుగ విదారించి పొట్టలు చించి మించె. ఇట్లుండుపాలికలనిం గాంచి యారా జిట్లు చింతించె. ఏమీ యీ యద్భుతంబు! ఇక్కిటి యొక్కటియ మదీయసేన నుక్కడంచె. నే నొక్కండ దీనిపని చక్కఁ జేసెద నని మిక్కుటంపు కోపంబున ధిక్కరింపుచు నలుప్రక్కలం బరికించుచో నయ్యాదివరాహం బవార్యతర శౌర్యంబున మాఱులేనివిహారంబు సల్పుచు ధర బాఱియగఁ ద్రవ్వుచుఁ జెలరేఁగియుండె.

దానింజూచి రాజు కన్నులు మిఱుమిట్లుగొన శరీరంబు కంపింప నిశ్చేష్టితుం డయ్యె. ఇట్లుండి కొంతతడవునకుఁ దెలిసి యదియంతయుఁ బోతనామాత్య ప్రభావప్రకటనంబునకుఁ గా నాతనియిష్టదైవంబు చేసినచేఁతఁగా నెఱింగి యపరాధంబు సేసితి నని పోతనను దనమది నెంచి యపరాధక్షమ యని నమస్కరించె. అంత నావరాహం బంతర్ధానంబు నొందె. ఆరాజేంద్రుం డామంత్రిశిఖామణికడకుం జని యాతని యడుగుఁదమ్ముల కెఱఁగి కర్ణాటుండ దీనుండ రక్షింపుఁడు. అనుఁడు పోతన యాతనిం గ్రుచ్చియెత్తి యాతని వృత్తాంత మడిగిన నాతం డిట్లనియె. "చెఱుపకురా చెడెద వ" న్నట్లు నిను నవమానింపఁదలంచి నేన యాపదలపాలైతి. సర్వబలంబులు నమసె. నీవాకిటికిటి నా కిటుల నగునటుల నొనర్చె. ఇదియంతయు భవదీయానుగ్రహాతిశయంబుచే నివారితంబు గావలయు. అనుపూర్వకవృపల్కు లాలించి కించి త్తాలోచించి భగవత్కృతం బని యెఱింగి యపమానంబునకు వగవకు మని యారాజునో దార్చి యి ట్లనియె. నీకు సర్వంబును మంగళం బగు. రమేశు ధ్యానింపుచుఁ గాలంబు గడుపు మనుఁడు నాతండు శ్రీహరిని తనహృత్సరసిజంబున నిల్పి ధ్యానింపుచుఁ బోతనామాత్యుమాహాత్మ్యంబు దలంచుచు నాయిలు వెడలె. అపుడు మోహనాస్త్ర విముక్తులభంగి నింగిముట్టఁ గోలాహాలస్వనంబు సేయుచు భగవదనుగ్రహ దత్తంబులై యతనిసేనలుండ నాతండు కొలఁదికి మీఱినసంతసముఁ బొందితనయూరు సేరెనఁట.

## భగవద్దర్శనము.

అనంతరము పోతనామాత్యుండు భగవద్భక్తి యుక్తుండై చతుర్థాదిస్కంధంబులఁ దెనిఁగించి యష్టమస్కంధంబున గజేంద్రమోక్షణంబు వ్రాయుచు నందు గజేంద్రుండు స్వామిని రక్షించు మని పలుకఁగ నావచనంబులు వైకుంఠనాథుం డాలించె ననుచో " అలవైకుంఠపురంబులో నగరిలో నామూల " అని నుడివె. అంతట నేమియుం దోఁచకుండె. అపుడు తనకూఁతుం బిలచి తా వ్రాయుచున్న పత్త్రం బాపెచేతి కిచ్చి యిదె వచ్చెద నని యొకనిర్జనప్రదేశంబునకుం జని తొంటివా

క్యంబ మరల నూహించుచుండె. ఇట పోతనయిష్టదైవంబు తద్రూప
ధారి యై యాతనిగృహంబునకుం జని పోతనకూఁతుం బిలచి పుస్త
కము దెప్పించి యం దున్నయసంపూర్ణవాక్యంబు నూచి "సౌధం
బుదాపల" అని వ్రాసి దాని నాపె కొసంగి తా నంతర్ధానంబు నొం
దె. పోతనకు రహస్యస్థలంబున నీవాక్యంబ స్ఫురింప వైళంబుగ నిలు
సేరి తనపొత్తంబు మరలఁ గైకొని యం దున్న స్వమనోగోచరార్థంబుఁ
జూచి యత్యాశ్చర్యంబునఁ గూఁతుఁ బిలచి దానియం దెవ్వరు వ్రాసి
యుండి రని యడిగె. అనుడు నాపె 'నీవకదా యింతకుము న్నిటకు
నేతెంచి వ్రాసియుంటివి.' అనినం గూఁతుపల్కులు విని కొంతతడవు
చింతించి యి ట్లనియె. అమ్మా నీపుణ్యం బెంతయు శ్లాఘనీయంబు.
నీక గపడినమత్స్యరూపధారుం డాత్మారాముం డగుశ్రీరాముండు గాని యే
గాను. అని తెల్పి ప్రచ్ఛన్నుండై తనవెనువెంట నంటి తిరుగునించువిల్దంట
తండ్రికి మ్రొక్కి ప్రసన్నుండ వగుదుగా కని సంతసంబున నాపద్యంబు
పూర్ణంబు సేసె. పిమ్మట నాస్కంధంబును ముగించెను.

### శ్రీనాథునియాక్షేపము.

అంత శ్రీనాథుం డొకదినంబున మరలఁ జనుదెంచి పోతన వ్రా
సినయష్టమస్కంధముఁ జూచి యందున్న

"మ. సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ డే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లము చక్క నొత్తఁడు వివాదప్రోద్ధతశ్రీకుచో
పరిచేలాంచల మైన వీడఁడు గజప్రాణావనోత్సాహి యై."

అనుపద్యంబుఁ జూచి పోతనం బిలిచి బావా నా కీపద్యంబు
సమ్మతంబు గాకున్నదిసుమీ అని యిట్లనియె. సిరికిఁ జెప్పఁడు. శంఖ
చక్రములఁ బట్టఁడు. తదితరసాధనముల ముట్టఁడు, ఊరక గజేంద్రుం
జూడ విష్ణుండు సనియె నని వ్రాసితివి. అతండు పరికరరహితుం
డై యేమిసేయం జనె. ఇట్లు వ్రాయుటం జేసి నీవ్రాఁత యుక్తి
యుక్తముగ నుండినట్లు గానరాదు. అనుడుఁ బోతన యిట్లనియె. భక్తా

వనుం డగు శ్రియఃపతి అట్లు పరితాపంబుపా లగుట భక్తులయెడఁ దన కుండుకారుణ్యంబు జూపుటకేకదా. ఇదియ సాకుంబోలినయర్థంబు. సహేతుకంబు గాకున్న భక్తికిం గొదువయేమి. అనుడు శ్రీనాథుం డూరకుండె. మఱికొన్నిదినంబులైనతర్వాతఁ బోతనామాత్యుండు తనమనంబున శ్రీనాథుండు శ్రీనాథు నాడిన వాఁడిమాటలవేఁడిమి సహింపలేక యథార్థం బాతనికి గోచరం బగున ట్లొనరింపఁ దలంచి యాతనిపుత్త్రి వాఁచి బావా నీకొడుకు నూతం గూలెనని తెల్పె. శ్రీనాథుం డాపల్కులు విని మనంబునఁ గలఁగి దిగ్గున లేచి కళవళపడి యెచ్చటెచ్చట నని విలపించుచుఁ బరువులిడఁదొడంగె. దానిం జూచి పోతన యాతనితో నిట్లనియె. ఓయీ నిలు నిలుము. ఊరక చనెదవేమి. త్రాడేది నిచ్చెన యేది. ఇట్లు విలపించుచుఁ జని నీవు నందుఁ గూలుదువు గాఁబోలు. అని యడ్డంబువచ్చి నిలిపిన శ్రీనాథుండు పోతనతో నిట్లనియె. వేగంబునఁ జనిన న్నాకుఱ్ఱనిం గననిమ్ము. కన్నారం జూచినఁ గొంత వంత మాను. అనునాతనిం గాంచి పోతన యిట్లనియె. బావా జడియకుము. నీ కుమారుండు నూతం బడలేదు. గజేంద్రరక్షణంబునకు నార్తావనుం డగు శ్రియఃపతి యిటులనే పరితాపంబు నొందె. నీ వసమర్థుండవయ్యుఁ బరికరరహితుండవయ్యు మిన్నక చూచినంతనే కర్జం బగు నని తలంప నఖిలలోకాధీశ్వరుం డగుకరివరదుం డూరక యచ్చోటి కరిగినఁ గొఱఁత యొక్కటి గలదే. భక్తులయెడ భగవంతునకుం గల ప్రేమ జనులకును నీకును గోచరంబు గా నే నట్లుపలికితి. నీవు వాగపరాధం బొనర్చితివి. కావునఁ బశ్చాత్తప్తుండవై యాహరిశరణంబు వేఁడు మని నిజనివాసంబు కుం జనియె. ఇట్లనేకసమయంబులఁ బోతనామాత్యుండు భగవన్మాహాత్మ్య ప్రకటనంబు సేయుచు భాగవతంబుఁ దెనిఁగించి భగవదర్పణంబు సేసె. ఇం దీతండు శివపరాత్పరత్వము చెప్పకుంటం జేసి వాగ్దోషంబు సంభవించె ననియుఁ దద్దోషపరిహారార్థంబు వీరభద్రవిజయం బనునొకగ్రంథంబు వ్రాసి తత్పాపంబు పాపికొనె ననియుం గలదు. ఇటీవల నావలనఁ

జేయంబడిన "వీరభద్రవిజయవివేకము" అను నొకదీర్ఘోపన్యాసములో భాగవత గ్రంథకర్త ఆగ్రంథకర్త కాఁడని సిద్ధాంతమాయెఁ గావునఁ బారకు లీవ్యాసాంతమందుఁ బొందుపఱచి యుంచిన 'వీరభద్రవిజయవివేక' ముం జదివి తమసందియములు వాఁపఁ గోరెదను. భక్తాగ్రగణ్యుం డగునీపోతనామాత్యుండు పదలాలిత్యంబునకుమిగులఁ బ్రసిద్ధుండు. ఇట్టికవికృతగ్రంథంబునఁ గొన్నిస్థలంబుల నీతనికవనంపుజాడలఁ జూడనోపుదుము. అట్టిపట్లు రచించినవాఁ డీతం డౌనా యన్ని శంక ప్రసమెడిని. ఆశంక నిష్కళంకంబుసేయు నొకవృత్తాంతంబు గలదు. దానిక్రింద

## పోతన భాగవతముం దాఁచుట.

వివరింతము. ఈకవి యాంధ్రభాగవతంబు పూర్ణంబుసేసి యది యైహికసుఖేచ్ఛాపరు లగుపామరులకునధ్యేయం బైనవేదాంతార్థంబులగౌరవంబు సెడు నని యెంచి ప్రచురింపక పరమార్థు లగుముముక్షుజనుల వెదుకుచు నుండె. ఇట్లుండ నిర్యాణసమయం బగుటఁ దనకుమారుం డగు మల్లనను రావించి యతనికి నఖిలరహస్యార్థప్రతిపాదకం బగుస్వకృతభాగవతం బిచ్చి దానిని సాధనచతుష్టయసంపన్ను లగుముముక్షువులకధ్యేయం బగునట్లొనరింపు మని తెల్పి తాఁ బరమపదప్రాప్తుం డయ్యె. అంత మల్లన పితృవాక్యపరిపాలనేచ్ఛాపరుం డై తదర్హజనాన్వేషణంబు సేయుచు దానిఁ బేటికాంతర్గతంబు సేసి దేవతార్చనావితర్ది సమీపంబున నుంచి సముచితభక్తిఁ బూజించుచుండె. అనంతర మాతండు తనకును గాలావసానం బగుడు నాత్మసఖుండును సహాధ్యాయియు నగు వెలిగందలనారయకవిం బిలిచి రహస్యంబుగఁ దనపైతృకధనంబుఁ గొమ్మని దేవతార్చనపూర్వకంబుగ నా పేటిక నిచ్చి తా లోకాంతరగతుండయ్యె. పిమ్మట నారయ తనగురుధనంబు నారయ దానిం దీసి యందుఁ జీనాంబరముల నతిశిథిలంబు నొందియున్న జీర్ణభాగవతంబుఁ జూచి యది స్వగురుప్రణీతంబ కాఁ దెలిసి శైథిల్యంబు నొందుట కెంతయు డెందంబునఁ గుంది దానిఁ గట్టి మగల నొకచోఁ బెట్టియుంచి నాఁటిరేయి

దానింగూర్చి చింతింపుచు నిద్రింపఁ బోతనామాత్యుం డాతనికి స్వప్నంబునఁ గాన్పించి యిట్లనియె. ఓయీ దీని నే నీవఱకు లోకంబున వ్యాపకంబవ్వున ట్లొనరింపకుండుటం జేసి యీగతి వగవవలసివచ్చె. ఇప్పుడు విభ్రష్టంబులైన ఘట్టంబుల నట్లింపు దోఁప సంపూర్ణంబు సేసి తూర్ణంబ దీని జగద్వ్యాపక మవ్వున ట్లొనరింపు మని తిరోహితుం డైన, నా రయ మేల్కాంచి స్వప్నంబు తెఱంగు పోతనామాత్యశిష్యులకుఁ దెల్పె. వారును నాతనిం గూడి దానినంతయు సంపూర్ణంబు సేసిరి. అని కొందఱి మతము. ఇందుఁ గొంతపూర్వపక్ష మాయెను. దానిని మఱియొకచోఁ

## పోతనకవనంబును శిష్యకవనంబును.

దెల్పితి. పోతనామాత్య కవనంబునకుఁ దచ్ఛిష్యజన కవనంబునకుఁ గల భేదంబులు సమానవర్ణన లున్న తావులఁ గొన్ని కొన్ని పద్యంబులఁ జూచిన గోచరంబగు. దీనికిఁ దార్కాణంబుగ సప్తమంబునఁ బ్రహ్లాదునిపద్యము.

"సీ. మందార మకరంద మాధుర్యమునఁ దేలు, మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁ దూఁగు, రాయంచ సనునె తరంగిణులకు
లలితరసాలపల్లవ ఖాది యై చొక్కు, కోయిల సేరునే కుటజములకుఁ
బూర్ణేందుచంద్రికా స్ఫురిత చకోరక, మరుగునే సాంద్ర నీహారములకు
తే. నంబుజోదరదివ్య పాదారవింద, చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరులఁ జేరనేర్చు, వినుతగుణశీల మాటలు వేయు నేల."

ఇది పోతనామాత్యకవనంబు. తచ్ఛిష్యకృతం బగుదశమోత్తర భాగంబున రుక్మిణితోఁ గృష్ణుండు విరసోక్తు లాడిన యనంతరము శ్రీకృష్ణుఁ డాపెను దేర్చియుండ ననంతర మాయమ శ్రీకృష్ణు నుతించుతఱి పద్యము :—

"సీ. నీరదాగమమేఘనిర్యత్పయఃపాన, చాతకం బేఁగునే చాటిపడెకు
పరిపక్వమాకందఫలరసంబులఁ గ్రోలు, కీరముల్ సనునె దుత్తూరములకు
ఘనరవాకర్ణనోత్కలికమయూరము, ల్గోరునే కఠినఝల్లీరవంబు
కరికుంభపిశితసద్గ్రాసమోదితసింహ, మరుగునే శునకమాంసాభిలాషఁ
గీ. బ్రవిమలాకార భవదీయపాదపద్మ, యుగసమాశ్రయనైపుణోద్యోగచిత్త
మన్యుఁ గోరునె తన కుపాస్యంబు గాఁగ, భక్తమందార దుర్భవభయవిదూర."

ఇంకను భేదంబుచే నెప్పుతావు లనేకము లున్నవి. ఆయాస్థలంబులలోఁ, గొన్ని క్త్వార్థకసంధులును గొన్ని వ్యాకరణస్ఖాలిత్యంబులు దృష్టిగోచరం బయ్యెడి. ఇట్టిపొరబాటులుండుటచే నీ గ్రంథంబు ప్రామాణికగ్రంథంబు కాదయ్యె. ఇందులతప్పులన్నియుఁ బోతనామాత్యునివని కొందఱూహింతురు. మఱికొందఱు మహాకవి యిట్టితప్పులు వ్రాయునా యనేకు లందు వ్రాసియుంటచే నవి కర్తగాని వేఱొకటి కాదందురు. పోతనవిరచితంబును దచ్ఛిష్యవిరచితంబును మొత్తంబున మనకుఁ దెలిసియున్నను, దీని విభజింపఁజాలను. మూలముట్టుగఁ గొంత గ్రంథము చెడుటయే సహజమయ్యెనేని ఆచెడినగ్రంథంబులోని స్కంధంబులును దశమోత్తర భాగంబున నున్న "కాటుకనెఱయుంగ" అను పద్యోపరిభాగంబును పోతనకృతంబులు గా వనుట స్పష్టమే. తాళపత్త్రి గ్రంథంబుఁ జెదలుదిన్నపుడు కొన్నిఘట్టంబులును మఱికొన్ని పద్యంబులు నష్టంబులై యుండనోపు. అట్టిపట్లును వీరిచేతనే వ్రాయఁబడియుండునుగదా వీనికిని బోతనకుం గలతారతమ్యంబు వీరిచే వ్రాయఁబడినగ్రంథముచేతనే మనకు గోచరం బగు. అచ్చటచ్చట మనకుం గానఁబడునెఱసులు పోతనచే వ్రాయంబడినవో లేక వీరు వ్రాసియుండు తఱి నుత్పన్నంబు లాయెనో తెలిసికొనుట దుర్లభంబు. గ్రంథమునఁ గాన్పించుతప్పులు పోతనశిష్యులవిగాని పోతనవి గావని తలఁచదగియున్నది. దీని కనుగుణంబుగ నప్పకవియు నొకపద్యంబు పూర్వలాక్షణికులది యుదాహరించె అదెట్లనిన:—

"ఉ. బమ్మెరపోతరాజకృత భాగవతంబు సలక్షణంబు గా
కిమ్మహి నేమిటం గొదవ యేతయు నారసి చూడఁగాను రే
ఫమ్ములు ఱాలునుం గలసి ప్రాసము లైనకతంబునం గదా
యిమ్ముగ నాదిలాక్షణికు లెల్లను మాని రుదాహరింపఁగన్."

దీనిచేఁ బోతనకృత గ్రంథంబున నీరేఫయుగమైత్త్రి దోషంబు తప్ప కడమ దోషంబులు లే వని యప్పకవియు సమ్మతించె. ఈరేఫయుగ

మైత్రిదోష మొకదోషములోనిది గా దనియును, కావునఁ బోతనకృతం బంతయు నిర్దోషం బే యనియు మఱికొందఱయభిప్రాయంబు. రేఫ గయుమైత్రికి సమ్మతించుటచే దోషంబు గల్గు నని యప్పకవి యిట్లు వ్రాయుట స్వాభిప్రాయ స్థాపనంబునకుఁ గాని మఱియొకటి గాదు. ఈవిషయం బీతనిచే వ్రాయంబడిన పద్యంబు విచిత్రంబుగ నుండును. పారపాటున రేఫమైత్రి చెప్పిన నది సమ్మతంబు చేతనే చెప్పిన ట్లీతండు వ్రాయు. వీనిమైత్రి శాస్త్రసమ్మతము గాకున్న నుంనుట కేరైన నిచ్ఛయింతురా. అట్టియిచ్ఛ లేకున్నను గొన్నికొన్ని స్థలంబులఁ బ్రమాదంబుచేఁ గొన్ని ప్రయోగంబులు సంప్రాప్తంబులవు. ఇట్టి ప్రమాదము నే స్థిరపఱిచి రేఫమైత్రియు స్థిరపఱుచుట న్యాయంబు గాదు. ఒకటి రెండున్నఁ బ్రమాదంబుగాని విశేషించియున్నఁ బ్రమాదంబు గా దనవలదు,అది గ్రంథబాహుళ్యమునుబట్టి తటస్థించు.'ఎంత చెట్టుకంతనీడ' యను నట్లు గ్రంథంబు స్వల్పమయినఁ దప్పులును దానికిఁ దగినట్లే యుండును. అధికమైనదానికిఁ దగినట్లే యుండును.న్యాయబుద్ధిచే నేద్దియేని గ్రంథంబు చూచి యాకవికి వీనిమైత్రికి సమ్మతి యున్నదా లేదా యని యోఁచించునప్పుడంతలోఁ గొన్ని పద్యంబులు ప్రత్యేకించి చూచి దానియథార్థ మూఁరయవలయు. ఇట్టిబుద్ధిచే యోచించినయెడ భాగవతంబున నీలాటియనుమానమునకుఁ గారణ మున్న ట్లేమియుఁ గానరాదు. పోతనామాత్యున కీమాత్రమం దిష్టమే లేకున్నఁ బెక్కులు శకటరేఫములకు మైత్రి యున్నపద్యంబులేల కాన్పించు? ఇఁక నెచ్చోటనైన వీటిమైత్రి కానుపించిన నది ప్రమాద మనక తప్పదు.ఇట్టిప్రమాదంబు లొరుల కుండుట కేమియబ్బురంబు? వీనిమైత్రి కెంతమాత్రము సమ్మతింపనియప్పకవికే కలవు. దృష్టాంతమునకుఁ గొన్నిటిం జూడఁదగు నని యప్పకవీయంబులోని కొన్ని పద్యంబు లిట వివరించెదను:—

## అప్పకవితప్పులు.

"గ.క. కేరుచు నయ్యాన డగ్గఱిఁ, జేరుచు నురుముష్టిహతికిఁ జిక్కక వేగం
బాఱు చపాంశ్రుతిఁ గ్రమ్మఱ,దూఱు చధోముఖుఁడు మల్లుఁ ద్రుంచె ననంగన్."

ఇందులోని తాఱుట అప్పకవిచేత శకటరేఫముగ అకారసీసమాలికలోఁ జెప్పంబడియె. "తాఱుమెకంబు లీతీరున" అని యప్పకవీయము. ఇది ప్రయోగంబులో మాత్రము లఘువులతోఁ గూడి యున్నది. 'దూఱు' అనునది యిచ్చోనున్న యర్థముంబట్టి శకట రేఫముగ నుండవలయును.

౨. "ఇట్టి వెట్టియు" నని యిట్లు క్రింద జజ్జ లుండెడిలిపులెల్ల బండిఱాలు. వీనిద్విత్వము లోక వేళఁ బోయినం బోవును. 'జెఱిపోతు కటిమేఁక గొఱియ యనఁగ' అని ముందు సూత్రము వ్రాసి పిమ్మట కొఱ్ఱుశబ్దము లుప్తశేషమయినపుడు 'కొఱ' యని వ్రాయక 'కొర' యని లఘురేఫముతో వ్రాసెను. ఇది యితరలాక్షణికుల మతంబు గాదు.

3. 'ఱావక్క సకలాక్షరములమీఁదను' అని రేఫసీసమాలికలో వ్రాసియున్నాఁడు. ఇందు 'ఱా' శకటరేఫసంజ్ఞకము.

౪. "మ. పురుటింటం బసిబిడ్డచందమున వాపోవంగ నాఁడాత్మలో
మురవొప్పన్ విమదగ్ధయుక్తకుచ యై ముద్దాడు రాకాసి గ
ర్తెఱిఁ గిట్టంబుగఁ బాలు ద్రావుమిషచే నిర్జీవనకాలంబునం
ధరణిం గూల్చి నందపుత్త్రివలనన్ దార్క్ష్యాణ ధర్మక్షితుల్."

ఇందు నెఱిఁగిశబ్దము లఘురేఫముతోఁ జేర్చి ప్రయోగింపఁబడినది. 'ఈశబ్దమునకు రూపాంతరమును బద్యమునకుఁ బాఠాంతరమును గానరాదు.' అని ద్విరేఫవర్ణదర్పణకారుని యభిప్రాయంబు. ఎఱుఁగుట శకటరేఫము గల దని యీ అప్పకవియే చెప్పియుండె. ఇంక నిట్టిపొరపాట్లనేకము లుండనోవు. ఇట్టి భ్రమప్రమాదంబుల కెడ మియ్యకుండున ట్లింకొకపద్యంబు వ్రాసె. అ దెట్లనిన:—

"క. బ్రిమయక రేఫములకు రే, ఫములును ఱాలకును ఱాలు ప్రాసములను వి
క్రమములను జెప్పఁదగు నీక్రమ మెఱుఁగక రెండునుం గుకవిగూర్చుఁ గృతిన్."

అని యిట్లు వ్రాసి తానే యనేకస్థలంబులలో బ్రిమసి యీరెంటిని వివేచింపలేక యొకదాని కొకటి ప్రయోగించె. ఇప్పుడు రేఫని యమము నప్పకవి తనయిష్టానుసారంబుగఁ జేసియుండియుం దాఁ జెప్పిన

సూత్రమును దా సమర్థింపలేక తాను పైనఁ జెప్పినపద్యార్థము నకుఁ బాత్రుఁ డయ్యె నని యొరు లాక్షేపింప మన మే మని సమర్థింపఁ గలము? అట్లు సమర్థింపలేనిచో నీతని గ్రంథంబును సలక్షణంబు గాదన వలసివచ్చును. దీనిని రేఫమైత్రికి సమ్మతించని వా రేమని సమర్థింతురో! ఆముక్తమాల్యదలోని కొన్ని గురువులై లఘువులుగాఁ గాన్పించు రేఫములకు వీరు ద్విరూపము లున్న వన్నట్లు వీనికిని ద్విరూపముల నైనఁ జెప్పవలెను. లేకున్న నింకొక విశేషవిధాన మేమైనఁ గల్పింపవలయును. సర్వజనులకుఁ బ్రామాణికగ్రంథం బగు భారతంబున గాన్పించు ప్రయోగములఁ బట్టి సూత్రములను సవరించిన నేమికొఱంత? భారతమునందుఁ బ్రయోగము లున్న వని వీరికిఁ దెలియక యుండునా? అట్లుండుటకుఁ గారణముమాత్రము కానరాదు. ఇట్టిప్రయోగంబులు భారతంబునం గలవా యనవలదు. వానిం గొన్నిటిని వివరింతము—

౧. "క. సర్వముఖశరము గల దని, దర్పంబునఁ గ్రీడిఁ దొడరఁ దలఁపకు వారిం
పేర్పడఁగ నదియు కా దట, తీర్పవలయువాని నెల్లఁ దీర్చు నరునకై."

ఇందులో 'తీఱు' శకటరేఫము గలది. ఇచ్చట నీ గురురేఫమునకును మిగిలిన లఘురేఫములకు మైత్రి చెప్పంబడియె. దీనికి రేఫాక్షరమైత్రి సమ్మతింపనివారిచే గొన్ని విశేషవిధానంబులు గల్పింపంబడియె. అం దొకదాని నిట వివరింతము. "రేఫమునకు సవర్ణముతో సంశ్లేషము వచ్చినప్పుడు గురుత్వలఘుత్వవైపరీత్యము గలుగదు." అని యిట్లు చిత్రంబుగ వ్రాయంబడియె. అహహా చూడుఁడు! ఈసూత్రకారునిచే సంశ్లేషాక్షరమున కెట్టిసామర్థ్యంబు చెప్పఁబడినదో! తనపై యక్షరములు దేవ*దానవులవంటివైనను సంయుక్తాక్షరములు తాము దలఁచినట్లైన వాని నెట్లు చేయదొరకొన్న నట్లు సేయఁగలవఁట. భారతంబులోనే యున్న మఱియొక ప్రయోగంబు చూపుదము—

* గీ. జ్ఞాతివైరంబు నంది పోరాసంబులందు, విక్రమము లందుఁ దమలోన 'వేఱు' గలిగి
దేవదానవులట్లన తెనుఁగులందు, మించి రేఫఱకారముల్ మెఱయుఁ గృష్ణ. అ.క.

"క. తెంపున బెంపున గదురని, లింప్రలు వెఱఁగందిచూడ రిపుసైన్యములుం
గంపింపఁ దమబలంబులు, నంపిలి కిట్టార్వ సింధురాజుం డాఁకెన్."

ఈపద్యములోని అంపిలిశబ్దము సర్వత్ర గురురేఫముగాన లఘువు గాదు. దీనికిని లఘురేఫమునకును మైత్రి సోమయాజిచేఁ జెప్పఁబడియె. ఇచట మైత్రిగలలఘురేఫము తత్సమంబుగావున వైయాకరణ్యము చెప్ప వీలులేదు. కావున నిచ్చో లఘ్వలఘురేఫములమైత్రికి నొప్పికొనక తప్పదు. అని యిట్లు సులక్షణసారవ్యాఖ్యాత వ్రాసె.

ఈ పై నుదాహరించినపద్యంబున నింకొకవివాదాంశంబు గూడ కాన్పించుచున్నది. అదియు నప్పకవికి సమ్మతము గానిదే. దానిం గూర్చి వాదించునవసరము మన కీవఱకు లేకున్నను గొన్ని స్థలంబుల నప్పకవి భారతముం జూడకయే స్వాభిప్రాయమును వ్రాసె ననుమాట యథార్థపఱుచుటకునై దాని నిట వివరింతము.

"తే. భరితభువనార్ణవంబుతో వంత సరియె, రమ్యమణిరాజరాజితో లక్క సరియె
లలితవీణారవంబుతో ఢక్క సరియె, వసగఁ జెల్లు నభేదాఖ్య నమరువళ్లు. అ. ఆ. 3.

వ. ఈ మూఁటిలోపలను భకారంబునకు వకారంబునకు నభేదవర్గయతులు గావునఁ బ్రయోగింపవచ్చు. లవర్ణమునకు డవర్ణమునకు నభేదవర్గయతులు గావు గావునఁ బ్రయోగింపరాదు. రవర్ణమునకు లకారమునకు గ్రాహ్యంబు గాదు. వానికి లక్షణవిలాసమువారు తెలియక కొన్ని యుదాహరణంబులు వ్రాసినారు. అవియు నిట వివరించెద. నైషధములో 'లీలామకరాంకచంద్రరేఖాంకుర' అనియు రామాయణములో 'శారదాభ్రవిలీనత నేపారు చంద్రలేఖయుబోలెన్' అనునదియుం గలవు. సంస్కృతమునందు రేఖాలేఖాశబ్దములు రెండునుం గలవు. కావున నీరెండుపద్యములయందుఁ జెప్పిన లేఖాశబ్దము మొదలిది ద్వితీయాంతస్థమని యెఱుంగునది.

అని వ్రాసియనంతరము వసుచరిత్రలో

"రోలంబాలక యోర్తు గుబ్బిలిసపల్లుల్ దున్మి తూటాడి" అనునీచరణంబులో 'లోలంబాలక' అని కవిహృదయము. దీనిం గానక కొందఱు 'ఇందిందిరస్తంచరీకో రోలంబో భంభరో ఒపిచ' అనియున్నది గావున రోలంబాలక యని చదువుదురు. ఇట్లని రామరాజభూషణకవి తలంపు గాదు."

అనియు వ్రాసి,

"క. నణ లనురెండక్షరముల, ళను డడీఁ బ్రాసంబుఁ బెట్టికొనవచ్చుఁ దగన్
విను రఱఁ కిట్లు పెట్టం, జను లళల కభేద మరయ సర్వజ్ఞనిధీ."

వ. ఈచెప్పిన మాటలోపలను మొదలఁ జెప్పిన 'నణలకు' సరసళడలయును కడ మఁ జెప్పినళళల కభేదవిగతియును గనుక నీరెండును గూర్పవచ్చును. నడుమఁ జెప్పిన రఱలకు 'రయోస్తు నిత్యం స్యాత్' అను శబ్దానుశాసన సూత్రము కలిమిం జేసి యేకతర యతు లవుటం జేపి కూర్పరాదు." అటుగావున నీపద్యము ప్రశస్తము కాదు."

అని యిట్లప్పకవి కొన్నిచోట్లఁ గవిహృదయంబు గాదని యును వీరందఱు నప్రశస్తముల వ్రాసి రనియుఁ జెప్పియుండెఁగాని వీ రట్లు వ్రాయుటకుఁ గారణం బేమి యని యూహింపఁ డయ్యె. ఇంతి యకాక తాఁ జెప్పినదే కవిహృదయ మనియు నొరులు దాని నెఱుఁగ రనియుఁ జెప్పుట మఱియు వింతగ నున్నయది. తనకు నూటయేఁబదిసంవ త్సరములకుఁ బూర్వంబున నున్న రామభూషణునిహృదయంబు తన కును బూర్వు లగులక్షణవిలాసమువారికంటెఁ దనకే యెక్కుడుగఁ దె లియు నెట్లు గలుగు? వారిహృదయంబు లిట్లే కావున రలలకును మైత్రి యుండఁగూడ దనుటకంటె సర్వజనులకు సుగమం బగుభారతము లోనున్న

"క. తెంపును బెంపును గనరని, లింపులు వెఱఁ గంది చూడ రిపుసైన్యములన్
గంపింపఁ దమబలంబులు, జంపిలి బిట్టార్వ సింధురాజుం డాఁకెన్."

అనుపద్యమును సులక్షణసారములో భారతములోనిది గావున పరిహరింపఁ గూడ దని వ్యాఖ్యాత వివరించెను. పైపద్యంబునందలి రెం డవపాదంబులోని లకారరకారమైత్రియును నాల్గవపాదంబున నున్న జ కారరేఫమైత్రియుఁ జూపిన నీయప్పకవిప ల్కెంతశ్లాఘనీయముగ నుండును? కవుల కెంతసంతసంబు గల్గును? భారతప్రమాణంబు లేకుం డఁ జెప్పంబడినయీయప్పకవి పల్కులంగూర్చి యీవిషయంబున నిఁక నంవాదంబు సేయంబనిలేదు. ఈరేఫములు రెండును దఱుచుగ నొక చో నుండుటం జేసి విన వీనులకు సొంపుగ నుండదుగావునఁ బ్రయో గించునప్పు డెల్లరు వశశేయుంతురు. అయిన వీని నేత్సరింపలేక కవులు

బ్రిమయుదురు. ఇట్టిచోటనే యప్పకవి దోషబాహుళ్యంబుగా వ్రాసె. ఇట్లు వ్రాసినవాఁడన్నిశబ్దంబులును రూఢముగా నెఱింగించినవాఁడును గాఁడయ్యె.* తా వ్రాసిన దానినైన దా సమర్థింపలేఁడయ్యె. ఈతని యనంతర మహోబలపండితుం డీరేఫయుగవిషయం బెంతయు వ్రాసి వీనిమైత్రికి సమ్మతించినవారిని మఱియు నిందించె. భాగవతంబుఁ దెనిఁగించిన బమ్మెరపోతరాజునకును రాఘవపాండవీయంబు వ్రాసినపింగళి సూరన్నకు ననామకకవిద్వయ మని పేరుంచె. చూడుఁడు తా వ్రాసినదే యథార్థ మని యితఁడు మహాకవుల నిందించె. అహోబలపతి యనంతరము మఱికొందఱు ప్రత్యేకంబు దీనివిషయంబే వ్రాసి పరుషవాక్యంబులచే దీనిమైత్రి తప్పింప యత్నించిరి. ఇంతియ యోచించిరిగాని దీనిలోని ముఖ్యాంశంబు గనుపఱుపరయిరి. అది యెటుండనిండు. మన యీయక్కర మెక్కడనుండి వచ్చినదియో యోచించి దానియుపయోగముం గూర్చి పిమ్మట నాలోచింతము.

## ఆంధ్రాక్షరవిమర్శనము.

ప్రప్రథమంబునఁ దెనుఁగుబాసలోనివర్ణంబులఁ దేటపఱుతము. అ ఆ, ఇ ఈ, ఉ ఊ, ఎ ఏ ఐ, ఒ ఓ ఔ, ం-ఁ, క గ, చ చే, జ జే, ట డ ణ, త ద న, ప బ మ, య ర ల వ స హ ళ. అనునక్షరములు ముప్పదియాఱు. ఇవియే యచ్చతెనుఁగు వర్ణంబు లైనట్లు వ్యాకరణంబులలో స్పష్టంబగు. అందుచే ఱకారంబు మొదటనుండియు నుండినట్లు నిశ్చయింపఁదగియున్నది. అట్లే కాకున్న నీభాషకు వర్ణంబులు ముప్పదియేను గాకుండునే. అట్లైన నీఱ నీవర్ణం బెచ్చటిదో యరయవలయు. ఇది కన్నడభాషలోనిదని చెప్పంబడు. మనదేశపురాజు లాదేశంబుం జయించి యచ్చోఁ గాఁపుర మున్నకాలంబులు కొన్ని గలవు. అవుడీయక్షరము మనకు సంప్రాప్తంబయియుండు. ఈఱకారమునకు మనరేఫమునకు సంబంధంబు లేకుండుటం జేసియే సూత్రకారులు దీనికి వైధర్మ్యంబు సెప్పిరి. మనభాషలోనిది

* చేఁగుశబ్దము లఘురేఫ మూంచి వ్రాసె. దాని కితరలాక్షణికులు సమ్మతింపరైరి.

కానియక్షరము నుంచి దాని ప్రయోగంబునకుఁ జర్చించుటకుఁ గారణంబుమాత్రము కానరాదు. వీనిప్రయోగంబునకు శాస్త్రంబు సమ్మతించినను గ్రంథంబుల దాని నుంచకున్న బాధకం బేమి కలదు. ఇదియకాదు సర్వభాషలు దెనుఁగుతోఁ గలిపి ప్రయోగింపవచ్చును. ఇతరభాషలలోనియక్షరము మనభాషలో నుంచి దానిప్రయోగంబునకు సంశయించుకంటె నాయక్షరమును దొలఁగించి మనభాషలోని యక్షరమునే గొను టెంతయు శ్లాఘనీయంబుగాదె. అకారంబునకుంబోలె ళకారంబునకు సంస్కృతంబున నొకవివాదము సంభవించుచున్న కొందఱు (ళ) యీశ్వరఢక్కచే నుద్భవించలేదనియుఁ గావున నిది వర్ణసమామ్నాయంబున లేదనియు ళకారయుతంబు లైనశబ్దములలో లకారముంచి యుచ్చరించుటయేయుక్త మని వాదించుచున్నారు. దీని కనేకులు పండితులు సమ్మతించియున్నారు. ఈశ్వరఢక్కవలనఁ బుట్టినలకారమునకుఁ గొన్ని కొన్ని దేశములవారిచే నిట్టియుచ్చారణభేదంబు గల్పింపఁబడినది. దాక్షిణాత్యులుదీనినే తఱుచుగ గురువుగ నుచ్చరించుచున్నారు. ఉత్తరదేశవాసులు దీనిని స్వభావసిద్ధ మైనయుచ్చారణతోఁ బల్కుచున్నారు. మధ్యదేశస్థుల మైనమన ముభయోచ్చారణలును వినియున్నాము కావున నారెంటినిగూడఁ బల్కుచున్నాము. ఇంతమాత్రముచే లకారముయొక్క గురురూపము శివునిఢక్కచే నుత్భవించినట్లే లెక్కించి వాక్యంబు దిద్ద నలవికాదుగదా. తెలుఁగున ఱకార రేఫములకు నుచ్చారణయం దిట్టి సామ్యమే యున్నది. ఇందలిపండితులును శాస్త్రిసమ్మతింబైన రేఫోచ్చారణం బేయుంచుట మే లనిన మనకు ఱకారముంగూర్చి మాటలాడు నవసరంబే లేదు. మనకే కాదు తొంటికవులలోఁగూడ నిట్టి భేదాభిప్రాయంబులు గలవు. దీనికి దృష్టాంతముగఁ గవిత్రయము వారిమతంబు చూచిన వృత్తాంతమంతయు గోచరంబగు. నన్నయభట్టున కున్నంతయిష్టంబు తిక్కనసోమయాజికి ఏనిమిత్తి లేమికి లేదు. ఎఱ్ఱాప్రెగ్గడయుం దిక్కనమార్గంబునే యవలంబించినట్లు కానంబడు. ఈ

ముప్పదింగాక తక్కిన వారిని జూచిన వారికి నిట్టిభేదంబే గలదు. అందుఁ బోతనామాత్యుని కాలీనులచే నిది మిగులఁ బాటింపంబడినట్లు గానరాదు. కృష్ణరాయలకాలీనులు తాము కర్ణాటదేశంబున నుండుటంజేసి దీని నెంతయుఁ బాటించినట్లు గాన్పించు. కర్ణాటదేశ వాసంబు లేకపోయినత్తోడనే మనవారికి వీనిమైత్త్రి లేమికి మిక్కిలి యాదరంబు లేదయ్యె. మఱికొంతకాలంబున కప్పకవి దీనివైధర్మ్యమును మరల నుద్ధరించి దీని మైత్త్రికి సమ్మతించినవారిని గుకవులనియు వారిగ్రంథంబులు సలక్షణంబులు గావనియుం బల్కె. నాఁటనుండియుఁ గొందఱు కొందఱు వ్యాకరణకారులు వీనిమైత్త్రి తప్పింప నతితీక్ష్ణముగ వ్రాసిరి. వీరందఱును ఋకారంబునకును రేఫమునకు మైత్త్రియుండవచ్చు ననిరి. దానికి కారణంబు ఋకారంబు రేఫలోనిభాగంబే కావున నట్లున్న దోషము లే దనిరి. ఆకారముమాత్రము రేఫములోనిది గా దని వారియభిప్రాయము. ఈ రేఫమే గురువుగ నొకపరియు లఘువుగ నొకపరియు నుచ్చరింపఁబడు ననుచో ఋకారంబున కున్నంతమైత్త్రియైన లేకుండునా యని యేల యూహింపఁ గూడదు అచ్చగుఋకారమునకును, హల్లగురేఫమునకును మైత్త్రి వీరికి సమ్మతమైయుండ వీరికి గురులఘురేఫములమైత్త్రి సమ్మతించిన దోషమేమిగలదు. సూత్రమునఁ జెప్పఁబడినది కావున దీనికి నేమియుఁ జేయఁగూడ దని యనెద రేమో సూత్రమున్నను బ్రయోగంబున భేదంబులు గాన్పించుచుండ నాసూత్రమునకు విశేషవిధానములు కల్పించుచుండ నిచ్చో నది యేల కూడదు. ప్రయోగంబు ననుసరించి సూత్రముల నేఁటివఱకును గల్పింపఁబడుట లేదే? పండితులును బుద్ధిమంతులును భాషలోని చిక్కులు తప్పింప యత్నింపవలయుఁగాని యిట్టిపట్టునే యవలంబించిన నేమిలాభంబు ? ఈ రేఫయుగమైత్త్రి దోషమును సవరింపకుండిన గ్రంథంబులన్నియు సలక్షణంబులు గావు. వైకల్పికమైత్త్రి కైన సమ్మతింపక తప్పదు. అటుగాకున్న బ్రతిగ్రంథంబులో నీలోపం బొకమాత్రైనఁ గాన్పించి దా

నిం దుచ్ఛంబు సేయు. దీనికి నప్పకవీయమే దృష్టాంతము. ఏదేని యొకసూత్రంబు సవరించి గ్రంథంబులు నిర్దోషములు చేయుట ముఖ్యముగాని దానినే యుంచి వానిని చెఱుచుట ప్రశస్తము గాదు. ఈదోష మొక్కటి లేకున్నఁ బోతనకృత గ్రంథంబు సలక్షణ మనుటకు సందియంబు లేదు. ఈతండు పదశయ్యాదులందుఁ దిక్కనతో సరిసేయం

పోతనపదశయ్యావిశేషములు.

దగువాఁడు. సమానవర్ణన లున్నతావులు చూచిన నీయిరువుర కవనంబునకుం గలసామ్యంబు గోచరంబయ్యెడిని. కావున మన మిప్పు డొకటిరెండుపద్యంబుల వ్రాయుదము.

“ సీ. ప్రాణంబుతోఁగూడ రక్కసిచన్నుల, పాలు ద్రావినప్రౌఢబాలుఁ డితఁడె
వ్రేల్మిడిఁ జాణూరు విఱిచి లోకముల మెచ్చించినయాజగజెట్టి యితఁడె
సర్వజ్ఞుఁ డగుకంసుఁ దునిమి యాతనితండ్రిఁ, బట్టంబు గట్టినప్రభుఁ డితండె
సత్యభామకుఁ బారిజాతంబుపైఁ గల, కోర్కి దీర్చినరసికుం డితండె
తే. వెన్నలును గోపికాచిత్తవృత్తులును, నరసి ముచ్చిల నేర్చినహరి యితండె
శ్రుతిశిరోభాగములఁ దనశుభగచరణ, సరసిజామోదమునుగూర్చుచతురుఁ డితఁడె.”

భార. ఉద్యో. ప. ఆ. 3.

“సీ. వీఁడఁటే రక్కసి విగతజీవగఁ జన్ను, బాలుఁ ద్రావినమేటిబాలకుండు
వీఁడఁటే నందునివెలఁదికి జగమెల్ల, ముఖమందుఁ జూపినముద్దులాఁడు
వీఁడఁటే మందలో వెన్నలు దొంగిలి, దర్పించి మెక్కినదాఁపరీఁడు
వీఁడఁటే యలయించి వ్రేతలమానంబుఁ, జూరలాడినలోకసుందరుండు
వీఁడు లేకున్న పుర మటవీస్థలంబు, వీనిఁ బొందనిజన్మంబు విగతఫలము
వీనిఁ బల్కని వచనంబు విహగరుతము, వీనిఁ జూడనిచూడ్కులు వృథలు వృథలు.”

భాగ. స్కం. ౧౦. పూ. భా.

ఇట్లింక ననేకపద్యంబు లున్నయవి. ఎచ్చోఁ బరిశోధించినను పోతనపాండిత్యవిశేషంబులు పూర్వసుకవులవానితో సమానముగను కొంచెమధికముగ నుండునుగాని న్యూనంబుగ నెన్నండు నుండవు. తిక్కన సంగ్రహ శయ్యకును, పోతన యమకకవనంబునకుం బ్రసిద్ధులు. తిక్కన రౌద్ర భీభత్స రసప్రధానంబు లగునారభటీవృత్తులును వీరభ

యానకరసప్రధాన సాత్వతీవృత్తులును జెప్పెడి స్వభావము గలవాఁడు. పోతన శృంగార కరుణారసంబులచే నొప్పు కైశికీ వృత్తులును, హాస్య శాంతాద్భుత రసప్రధాన భారతీవృత్తులును జెప్పెడి స్వభావము గల వాఁడు. తిక్కన ప్రత్యక్షశయ్య ననుప నుత్సహించు. పోతన భక్తిరస మొల్కునట్లు పల్కు. సోమయాజి తెనుఁగుపదంబులు ప్రయోగించుట యందు విశేషాసక్తి కలవాఁడు. పోతన సంస్కృతపద ప్రయోగపటిష్ఠుఁడు. శృంగారవర్ణనలఁ దొంటి పురాణకవులలోఁ బోతన కవనంబే మిగుల శ్లాఘనీయంబు. దానిం జూపుటకు రుక్మిణీకల్యాణమునుండి యొక పద్యము చూపెదను. ఎట్లన్నను.—

"సీ. పల్లవవైభవాస్పదములు పదములు, కనకరంభాతిరస్కారరు లూరు
లరుణప్రభామనోహరములు కరములు, కంబుసౌందర్యమంగళము గళము
మహిత భావాభావ మధ్యంబు మధ్యంబు, చక్షురత్యాదరదాయి చన్నుదోయి
పరిహసితార్ధేందుపటలంబు నిటలంబు, జితమత్తమధుకరశ్రేణి వేణి
తే. భావజాతుగముల ప్రాపులు చూపులు, కుసుమశరునివింటికోమలు బొమలు
చిత్తశోషణములు చెలియభాషణములు, జలజనయనముఖము చంద్రసఖము."

రుక్మిణీకల్యాణము సత్యభామయుద్ధము మొదలగుపట్లు హరి వంశంబున నెఱ్ఱాప్రెగ్గడచే వర్ణితంబులయ్యె. వానిం బరిశోధించిన నీయిరువురకుం గలతారతమ్యంబులు గోచరంబు లగు. శృంగారవర్ణనలు కానిచోట్లను జూచినఁ బోతన శంభుదాసునకు సరి యగు ననియుఁ, గొంచె మతిశయించు ననియుం దోఁచు. దానికి దృష్టాంతముగ హరివంశ భాగవతంబులలోని కొన్నిసమానవర్ణన లున్నపద్యంబుల వివరింతము.

## శ్రీ రా మ చ రి త్ర ము.

మ. అమలాంభోజదళాక్షుఁ డక్షతఘనశ్యామాంగుఁ డాజానుదీ
ర్ఘమహాబాహుఁడు సంహతోరుకఠినోరస్కుండు సింహోరువి
క్రముఁడుం దుద్ధత శౌర్యధుర్యకలనాకల్పుండు కళ్యాణధీ
రమణీయుండును వెలింగె రాముఁడు గుణారాముండు భూమండలిన్.

హరి. పూ. భా. అశ్వా. ౪.

మ. అమరేంద్రాశకుఁ బూర్ణచంద్రుఁ డుదితం బైనట్లు నారాయణాం
శమునం బుట్టె మదాంధరావణశిరస్స్కంధాతిసంఛేదన
క్రమణోద్దాముఁడు రాముఁ డాగజితకుం గౌసల్యకుం సన్నుతా
సమనైర్మల్య కతుల్య కంచితజనుస్సంసారసాఫల్యకున్. భాగ. స్కం. ౯.

శా. ఈవానం బరిపీడ నొందవసుల న్వీక్షించి రక్షార్థినై
వేవే యిద్ధరణీధ్రముం బెఱికితిన్ విస్తీర్ణ మీక్రింద మీ
రేవ్రా లిచ్చట నుండఁ గోరితిరి మీరెల్లం బశుశ్రేణితో
భావంబు న్భయ ముజ్జగించి చనుఁడీ భవ్యాద్రిచాటుందరుల్. హరి.పూ.భా.ఆ.౬.

శా. బాలుం డీతఁడు కొండ దొడ్డది మహాభారంబు సైరింపఁగాఁ
జాలండో యని దీనిక్రింద నిలువ న్శంకింపఁగాఁ బోల దీ
శైలాంభోనిధిజంతుసంయుతధరాచక్రంబు పైఁబడ్డ నా
కేలల్లాడదు బంధులార నిలుఁ డీక్రిందన్ బ్రమోదంబునన్. భాగ.స్కం.౧౦.పూ.

ఇంకను ననేకస్థలంబులు గలవు. వానిం బరికించిచూచినఁ బోతన కవిత్రయమువారితో సమానుఁ డని నంతోక్తిగఁ జెప్పఁదగు. వారు చేసినపద్యములు చూచి యీతండు కొన్నిట్టి వ్రాసెఁ గావుననంతకంటెను గొంచెము బాగుగ వ్రాసె నని యనవలదు. ఈతనిం జూచి వ్రాసిన యీతనిశిష్యుల కవనంబును తర్వాత మఱికొందఱు వ్రాసిన కొన్నికొన్ని భక్తిరసపద్యంబులును వీనికి సీడుగ నున్న వే? కావున నిది పోతనకవిత్వపటిమయే యని చెప్పఁదగు.

## వీరభద్రవిజయవివేకము.

బమ్మెర పోతరాజు వీరభద్రవిజయ మనుగ్రంథము రచియించి యుండె నని యొకప్రతీతి గలదు. అయ్యది భాగవతశైలి నుండలే దనియు నది పోతరాజు వార్ధకదశలోఁ జేసియుండుటచేత నందులోఁ గొన్ని దోషంబులు కలిగె ననియు నాంధ్రకవి చరిత్రములో వివరింపంబడియె. లోకములోనివారుకగూడ నట్లే యుంచుటచేత నాగ్రంథము విమర్శనాపూర్వకముగాఁ గొంత చదివి యందలి పరస్పరభేదంబులఁ బరికించి యది భాగవతగ్రంథకర్త యగు బమ్మెరపోతనకృతం బగునా యని యీక్రిందికారణములనుబట్టి సంశయించుట కలుగుచున్నది. చదువరు లద్దానిలోని విశేషముల నరయుదురుగాక.

"1. గీ. తెలయు మఱియుఁ గల్గువీరమాహేశ్వరా, చారవరుల వీరసత్యవ్రతుల
వీరసచ్చరితుల వీరవిక్రములను, పన్నగదలంచి మ్రొక్కెద భక్తితోడ.

వ. తత్ప్రసాద కరుణావిశేష ప్రవర్ధమాన కవితామహత్త్వ సంపన్నుండ నైన మదీయాంతరంగంబున."

2. దీనిం బట్టి చూడ నీయంశము భాగవతరచనావిచక్షణుఁ డగు పోతానామాత్యుని కథవలె వ్రాయంబడక వేఱువిధంబుగ నున్నట్లు కాన్పించుచున్నది. అది స్పష్టముగా నందలియాశ్వాసాంతరగద్యములో నున్నది, ఎట్లన్నను:—"ఇది శ్రీపరమేశ్వర కరుణాకలిత కవితావిచిత్ర" అని పైగ్రంథకర్త యగుపోతయ వీరమహేశ్వరు లనుశైవభక్తులకరుణచేతఁ దనకుఁ గవిత్వప్రజ్ఞ గలిగినట్లు చెప్పెను. వీరభద్రవిజయగ్రంథకర్త యగు పోతయు తా నాగ్రంథరచనాకారణ మొకచో నొక విధముగను, మఱియొకచో మఱియొకవిధంబుగను వ్రాసె. దానిని ముందుఁగఁ దెల్పెదను—

"వ. అత్యవసరంబున సోమశేఖరుండు (ఇవటూరి సోమశేఖరుఁడు) ఇట్లనియె.

సీసగీతము. ఉన్నవైనను మాకెల్ల నూహలోన, వింతపండువు బోలెను వీరభద్ర
విజయమెల్లను వినఁ గడు వేడ్కయయ్యె,నది తెలుఁగున రచియింప్ర మభిమతముగ.

ఆ. పిన్నవాఁడ ననియుఁ బెక్కుసత్కృతులను, విననివాఁడ ననియు వెఱపు మాని
మత్ప్రభావదివ్యమహిమచే నైతైన, కవిత చెప్ప లావు గలదు నీకు.

వ. అదియునుంగాక నీకు వీరభద్రేశ్వరప్రసాదంబు గలదు."

అని యిట్లు తా మొదట నొకచోట వ్రాసి వీ. వి. లోఁ బోతయ కవి స్వవంశమును వర్ణించి తిరుగ మఱియొకపరి స్వసామర్థ్యంబును, గ్రంథరచనాకారణంబు నిక్రిందివిధంబుగ వ్రాసెను. ఎట్లన్నను:—

"వ. తదనుజుండ నై నేను జన్మించి పోతయనామధేయుండ నై పరఁగి జనకశిక్షితవిహితాభ్యాసుండ నై వీరభద్రప్రసాదలబ్ధ కవితాతిశయంబున.

ఉ. భాగవతప్రబంధ మతిభాసురతన్ రచియింప దక్షకృ
ద్భాగకథాప్రసంగమున నల్పవమన్కుఁడ నైతిఁ దన్నిమి
త్తాగమవక్త్రదోష పరిహారతకై యజ నైక శైవశా
స్త్రాగమ వీరభద్రవిజయంబు రచించెద వేడ్కనామదిన్."

అని యున్నది. దీనింబట్టియే భాగవత మాంధ్రీకరించిన పిమ్మటఁ బోతనామాత్యునివలన నీ వీరభద్రవిజయము రచియింపఁబడినట్లు వాదు కగలిగెను. అయితే మొదట నుదాహరింపఁబడిన పద్యమువలన వీరభద్రవిజయము రచియించునాఁటికి దద్గ్రంథకర్త యగుపోతయకవి పిన్నవాఁడనియు పెక్కుసత్కృతులను విననివాఁడనియుఁ జెప్పంబడియున్నది. కావున భాగవతగ్రంథ మావలనే యీపోతన రచియించె నని చెప్పినమాట నిలువనేరదు. ఇఁక భాగవత ప్రబంధ మనునొకగ్రంథ మాతఁడావలకు రచియించియుంటి నని చెప్పిన దాని కర్థము బమ్మెరపోతనామాత్యకృతభాగవతపురాణాంధ్రగ్రంథము కాక ప్రత్యేకము భాగవత మనునొకప్రబంధము రచియించియుండె ననియు నందులో దక్షయాగకథాసందర్భములో నీశ్వరుని నిందించినట్లును అర్థము చెప్పినచో దోషము లేదు. బమ్మెరపోతరాజు భాగవతము తనబాల్యకాలములోపలనే రచియించినట్లు చెప్పియుండలేదు. ఇంతియకాక ఆగ్రంథముయొక్క విశేష కథాంశములం బట్టియును, పద్యబాహుళ్యముం బట్టియు నిది పదియిరువదిసంవత్సరముల కాలములోఁగాక త్వరలో ముగించఁదగినగ్రంథము కాదనియు భాగవతగ్రంథము నాంధ్రీకరింపఁ దొడంగునాఁటికే పోతనామాత్యుఁ డద్వైతశాస్త్ర సంబంధము లగునానేకగ్రంథములను, భాష్యముల నధ్యయనము చేసియుండవలసియుండుననియు నది పది యిరువది సంవత్సరముల కాలమునంగాని సమకూడునది కా దనియు నూహింపవలసి యుండును. పోతన బాల్యమునుండి యనఁగాఁ బదిసంవత్సరములనుండి వేదాంత శాస్త్రాభ్యాసము చేసి యుండినను ముప్పదవ యేటం గాని భాగవతముఁ దెనిఁగింపఁ గడఁగుటకు సమర్థుఁడై యుండఁడు. అట్లుగా యత్నించి దానిం దెనిఁగింప నారంభించినను నేఁబదియవసంవత్సరము నాఁటికిగాని దాని ముగియించియుండఁడు. అటు పిమ్మట వీరభద్రవిజయగ్రంథరచన యై యుండును, ఇట్లుండఁగా నా నాఁటికి నీపోతనామాత్యుఁడు పిన్నవయసువాఁడనియుఁ బెక్కు

సత్కృతులను వినని వాఁడనియును జెప్పుట కవకాశ ముండు నని యూహించను. ఇంతియకాక వీరభద్రవిజయగ్రంథకర్త దాను వీరభద్రోపాసనఁ జేసినాఁడ ననియుం జెప్పుచుండును. పోతనామాత్యుఁడు భాగవతములోఁ దాను పరమేశ్వరోపాసనఁ జేసినాఁడ నని చెప్పెను. మంత్రశాస్త్రిను సారంబుగ వీరభద్రోపాసన కేవలము కామ్యమును, పరమేశ్వరోపాసన కేవలము మోక్షదాయకము నై యున్నది. కావున నీయుపాసనాభేదములు గలవా రిర్వురు నొక్క రని చెప్పుటకు సంశయము కలుగుచున్నది, ఇదియునుగాక పోతనామాత్యుఁడు శైవుఁడును శైవమంత్రోపాసకుఁ డయ్యును భాగవతమును దెనిఁగించుటకుఁ గలకారణముల నీక్రింవిధంబున. జెప్పెను. ఎట్లన్నను :—

"వ. అని మఱియు మదీయ పూర్వజన్మ సహస్ర సంచిత తపఃఫలంబున శ్రీమన్నారాయణ కథా ప్రపంచ విరచనాకుతూహలుండ నై"

అని యొకచో వ్రాసి, మఱియొకచో

"ఇట్లు భాసిల్లెదం శ్రీమహాభాగవతపురాణపారిజాతపాదపసమాశ్రయంబున హరికరుణా విశేషంబునఁ గృతార్థత్వంబు సిద్ధించె నని బుద్ధి నెఱింగి"

అని వ్రాసెను. పోతరాజును లీలాశుకుఁడు మొదలగువారింబలె శైవమంత్రోపాసకుం డయ్యును వైష్ణవమహిమాను వర్ణనమునఁ దత్సంకీర్తనవలనను వైష్ణవుఁ డయినవాఁడుగాని శైవుండు గాఁడు. ఇట్టిదార్ఢ్య బుద్ధితో భాగవతముం దెనిఁగించి తనకుం గలభక్తిపారవశ్యముం జూపుచు నానందించుపోతనామాత్యునకు వాచాదోషము గలుగుటయుఁ దన్నివారణార్థముగా నట్టిమతమును వదలుకొని తిరుగ శైవుఁ డయి వీరభద్రోపాసన జేసి యుపటూరి సోమనారాధ్యుని సేవించి ఆయనసెలవుపయిని వీరభద్రవిజయము నాంధ్రీకరించుటయుః గలుగు నని చెప్పుటకంటె హాస్యాస్పదకార్యము మఱియొకటి లేదు. ఇట్లుగాఁ బోతనామాత్యుఁడు తనమతము మార్చుకొనుటయే కాక ఆశ్వాసాంతగద్యనుగూడ మాఱ్చుకొనె నని చెప్పుట మఱియు హాస్యాస్పదముగా నున్నది. అది యెట్లనఁగా :—

### భాగవతగద్యము.

"ఇది శ్రీపరమేశ్వర కరుణా కలిత కవితా విచిత్ర కేసనమంత్రి పుత్త్ర సహజ పాండిత్య పోతనామాత్య"

అని యున్నది.

### వీరభద్రవిజయగద్యము.

"ఇది శ్రీమ న్మహా మాహేశ్వర యివటూరి సోమనారాధ్య దివ్యప్రసాద పాద పద్మారాధక కేసనామాత్య పుత్త్ర పోతయనామధేయ"

అని యున్నది.

ఈ రెండుగద్యములం జూచినతోడనే గ్రంథకర్త లిద్దరు నొక్కరు కా రనియు నట్లే యైన రెండుగద్యములును రెండువిధంబుల వ్రాసి యుండ రనియుఁ జెప్పవలసియున్నది. భాగవతకవికిం గల 'సహజపాండిత్య' శబ్దము రెండవయతనికి లేదు. ఇదివఱలో మొదటియతని కవిత్వ మీశ్వరవరప్రసాదలబ్ధ మనియు, రెండవయతనికవిత్వము వీర మాహేశ్వరాది కటాక్షసంప్రాప్త మనియుఁ జెప్పియే యున్నాను.

3. భాగవతములో దక్షయజ్ఞ సమయములో బోతనామాత్యునివలన నీశ్వరనింద చేయంబడినట్లుగా వీరభద్ర విజయములోఁ జెప్పంబడినది. దానికిఁగాను చతుర్థస్కంధములో దక్షయజ్ఞకథాభాగమంతయుఁ జదివినాఁడను. అందు శివనింద లేదు సరిగదా పైగా శివ పరాత్పరత్వ వర్ణనమే పోతనామాత్యునివలన విశేషించి చేయంబడినది. పోతనామాత్యుఁడు కేవలాద్వైతి యై యుండియు

"చేతులారంగ శివునిఁ బూజింపఁడేని, నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని
దయయు సత్యంబు సమముగాఁ దలఁపడేని, కలుగ నేటికిఁ దల్లులకడుపుచేటు."

అని చెప్పి గ్రంథారంభము చేసినవాఁడు నీశ్వరోపాసనాపరుండు గూడ నైనచో శివస్తోత్రము చేయుటలో లోపముచేయునా? ఇది గాక పోతనామాత్యుఁడు తాఁ దెలిగించుచున్న గ్రంథమంతయు స్వకపోలకల్పితము కానందున నద్దానిలో స్వాభిప్రాయము మాత్రకాగ్రంథములలో ననఁగా భాగవతాది విష్ణుకథాప్రధానగ్రంథములలోఁ జెప్పం

బడనివాని నేల చేర్చును? దక్షుఁడు కైలాసమునకుం బోయి యీశ్వరునివలన గౌరవము కలుగ లేదనుకోపము నంది యీశ్వరుని శపియించినపట్టున నాతనివెంబడినే నందికేశ్వరుఁడు లేచి దక్షుని, బ్రాహ్మణుల శపియించె ననియు, నది విని భృగుమహర్షి లేచి శివానుచరుల నాతఁడు శపియించె ననియుఁ జెప్పినకథాభాగములో నందికేశ్వరునివలన బ్రాహ్మణనిందయు భృగుమహర్షివలన శైవులనిందయుఁ జేయంబడినవి. ఇట్టి వృత్తాంతముఁ దెనిఁగించుటచేతనే పోతనామాత్యునకు వాచాదోషము కలుగు ననఁగా నిఁకఁ జెప్పవలసిన దేమున్నది. అయిన నాపట్టులోఁ బోతనామాత్యుం డెంతవఱకు నిందార్హుఁడో చూచిగాని నిర్ణయించను. పోతనామాత్యునిఁవ్రాఁత లెట్టులున్నవో యీక్రింద చూపెదను.

భాగవతచతుర్థస్కంధమున నీశ్వరునకును దక్షప్రజాపతికిని విరోధము సంభవించినకథలో దక్షుఁ డీశ్వరుం జేసిననిఁద.

"సీ. అనయంబు లుప్తక్రియాకలాపుఁడు మాన, హీనుఁడు మర్యాద లేనివాఁడు
మత్తప్రచారుఁ డున్మత్తప్రియుఁడు దిగం, బరుఁడు భూత ప్రేతపరివృతుండు
తామసప్రథమభూతములకు నాథుండు, భూతిలిప్తుం డస్థిభూషణుండు
నష్టశౌచుండు నున్మదనాంగుఁడును దుష్ట, హృదయుండు నుగ్రపరేతభూని
కేతనుఁడు వితతశ్మశ్రుకేశుఁ డశుచి, యైనయితనికి శివనాముఁ డనుప్రవాద
మెట్టుఁ గలిగె నశివుఁ డగు నితని నెఱిఁగి, యెఱిఁగి వేదంబు శూద్రున కిచ్చినట్టుల.

వ. ఇతనికి నస్మత్తనయను విధిప్రేరితుండ నయి యిచ్చితి.

క. ఇతఁ డింద్రోపేంద్రపరి, వృతుఁ డై మఖసమయమున హవిర్భాగము దే
వతలం గూడఁగ మహితని, యతిఁ బొందక యుండుగాక యని శపియించెన్."

ఇది దక్షుఁడు చేసినట్టుగాఁ బోతనామాత్యుఁడు శివుని చేసె నని చెప్పిన యొకనిందకాని యీవెంటనే చెప్పినవచనముంబట్టి దక్షునినింద శివునకు నుతియే యైన దనియు నంతియ కాక అక్కడ వచ్చి యుండిన ఋషు లందఱు దక్షుని నిందించి రనియుఁగూడఁ బోతనామాత్యునివలననే చెప్పఁబడినది. ఎట్లన్నను :—

"వ. ఇట్లు దక్షుండు పలికిన గర్హితవాక్యంబులు వినిందితంబులుగ నుండినను యథార్థంబున వాస్తవంబు లగుచు భగవంతుం డగురుద్రునందు ననిందితంబు లై స్తుతిరూపంబున నొప్పు తదనంతరంబున రుద్రునకు శాపం బిచ్చి దక్షుండు సదస్యముఖ్యులచే నకృత్యం బని నిషేధింపఁబడి ప్రవృద్ధం బయిన క్రోధంబుతో నిజనివాసంబునకుం జనియె.

అని యుండుటచేతఁ బోతనామాత్యుఁ డిప్పట్లు స్వకపోల కల్పితము గాని స్వాభిప్రాయ ప్రకటనముగాని చేసియుండ లేదు. ఇఁక నందికేశ్వర శాపాదికముంగూర్చి వ్రాసెదను. ఎట్లన్నను:—

"అంత గిరీశానుచరాగ్రేసరుం డగునందికేశ్వరుండు దక్షుండు నిటలాక్షుని శపియించినశాపంబు నతఁడు పల్కిన యనర్హవాక్యంబులును వినికోపారుణితలోచనుం డై యిట్లను ఈ దక్షుండు మర్త్యశరీరంబు శ్రేష్ఠంబు గాఁ దలంచి యప్రతిద్రోహి యైన భగవంతునందు భేదదర్శి యై యపరాధంబుఁ గావించె. అట్టిమూఢాత్ముండు తత్త్వవిముఖుం డగు మఱియును గూటధర్మంబు లైననివాసంబుల గ్రామ్యసుఖాకాంక్షులం జేసి సక్తుం డై యర్థవాదంబు లైనవేదంబులచేత నష్టమనీషం గలిగి కర్మతంత్రంబు విస్తృతంబు సేయుచు దేహాదికంబులు పాథేయంబు గాఁ దలఁచుచు బుద్ధిచే నాత్మతత్త్వంబు మఱచి వర్తించి పశుప్రాయుం డై స్త్రీకాముం డగు నగు నిదియునుం గాక దక్షుం డచిరకాలంబున మేషముఖుం డగు నని మఱియును.

మ. అనయంబుం దనమానసంబున నవిద్య న్మఖ్యతత్త్వంబుఁ గా
గని గౌరీశుఁ దిరస్కరించినయసత్కర్మాత్ము నీదక్షుఁ దా
మనువర్తించినవారు సంస్మరణ కర్మారంభు లై నిచ్చలున్
జననం బందుచుఁ జచ్చుచున్ మరల నోజం బుట్టుచున్ వర్తిలుక్.

వ. అదియునుం గాక యీహారద్వేషు లైనద్విజు లర్థవాద బహుళంబు లైనవేదవాక్యంబులవలన మధుగంధసమం బయిన చిత్తక్షోభంబుచేత విమోహితమనస్కు లై కర్మాసక్తు లగుదురు మఱియును భక్ష్యాభక్ష్య విచారశూన్యు లై దేహాదిపోషణంబు నొఱకు ధరింపఁబడు విద్యాతపోవ్రతంబుఁ గలవారయి ధన దేహేంద్రియంబులందుఁ బ్రీతిఁ బొంది యాచకు లై విహరింతురు అని నందికేశ్వరుండు బ్రాహ్మణుల శపియించె"

అనియున్న పయివాక్యములలో శివనింద లేదు సరికదా యట్టి శివనిందఁ జేయుబ్రాహ్మణులకు (అనఁగా వైష్ణవులకు) అఖండ మయిన శాపమును పెట్టినట్లు పోతనామాత్యుఁడు చెప్పియుండెను. అయిన నంతటితో నాగ్రంథంబు ముగియలేదు గావున ననంతరము వైష్ణవమతస్థుఁ డగునొకఋషి లేచి నందికేశ్వరు శాపంబునకుఁ బ్రతిహతముగా వతనిమతమువా రగుశైవులకు శాపముఁ బెట్టి యుండుటను వ్యక్తీకరిం

చెను. అదియును బోతనామాత్యుని నిష్పక్షపాతబుద్ధిని దెలియఁజేయు నుగాని పోతనామాత్యునియెడల దోషారోపము చేయదు. ఆవాక్యము లెట్లున్న వనఁగా——

"వ. నందికేశ్వరు వచనంబులు విని భృగుమహాముని మరల శపియింపఁబూని యిట్లనియె.

గీ. వసుధ నెవ్వారు ధూర్జటివ్రతులు వారు, వారి కనుకూలు లగుదు రెవ్వారు వార
లట్టిసచ్ఛాస్త్రపరిపంథు లైనవారు, నవనిఁ బాషండు లయ్యెద రని శపించె.

సీ. సకలవర్ణాశ్రమాచారహేతువు లోక,ములకు మంగళమార్గమును సనాత
నము పూర్వఋషిసమ్మతము జనార్దనమూల, మును నిత్యమును శుద్ధమును శివంబు
నార్యపథానుగం బగు వేదమును విప్ర, గణము నిందించినకారణమున
శైవదీక్షయందేని మధ్యమపూజ్యులై భూతపతి దైవ మగుచునుండు

తే. నందు మీరలు భస్మజటాస్థి ధార,ణములఁ దగి మూఢబుద్ధులు నష్టశౌచు
లై చరింతురు పాషండు లగుచు ననుచు, శాప మొసరించె నాద్విజసత్తముండు.

వ. ఇట్లన్యోన్యంబును శాపంబులం బొందియు భగవదనుగ్రహంబు గలవా రగుటంజేసి నాశంబు నొందరైరి."

అని చెప్పిన పోతనామాత్యు నెంతని కొనియాడవలయును! ఇతఁ డొకఁడే యద్వైతి యని చెప్పవలదే? శైవులకు వైష్ణవులును, వైష్ణవులకు శైవులును శాపము లిచ్చి రని చెప్పియు నీశాపము నిచ్చినవారిర్వురికంటెను దత్తస్మృతప్రవర్తకు లధికు లగుభగవదవతారపురుషు లగుశివకేశవులు గావున వారివలన నిర్మింపఁబడినపాశుపత, పాంచరాత్రాగమ తంత్రమాహాత్మ్యంబు చెడక లోకంబున రెంటను నేఁటివఱకును నిల్చియుండె ననుదాని నెంతసొగసుగ వ్యక్తీకరించెను! ఇట్టిపోతనామాత్యునియెడ లోపముఁ దెల్పినవారు కేవలపాషండులే కానోపుదురు. అహా! యది యట్లేగదా! పోతనామాత్యుఁడు జన్మచేత శైవాచారపరుని కుమారుఁ డయినను * తనతాతముత్తాతల మతానుసారంబుగనే శైవమంత్రోపాసన మాత్రము చేయుచు లింగాంక

* పోతనామాత్యుని తండ్రి నాఁడే శైవశాస్త్రమతము కల్గె నని భాగవతిములోఁ బోతనామాత్యునిచేత నే 'మనియె శైవశాస్త్రమతముఁ గనియె' అని చెప్పఁబడియె.

నాఁడి శైవాచారవర్జితుఁడై సర్వాద్వైతమతస్థులవలె నుండెను. కావున నీకవికి శైవవైష్ణవమతభేదములు లేక యాయుభయ మతములను గూర్చి ప్రత్యేకించి చెప్పవలసివచ్చినప్పుడు వారిలో వా రెట్లుగాఁ జెప్పుకొనియెదరో అటులనే చెప్పుచు వచ్చెను. దూషణములు వచ్చినపుడు వారు పరస్పర మెట్లు చెప్పుకొనియెదరో అటులనే చెప్పుచు వచ్చెను. ఇది పూర్తిగా నూహింపఁజాలని శైవు లెవరో యొకకొందఱు పోతనామాత్యుఁడు శైవుఁడై యుండియును వైష్ణవగ్రంథము చెప్పుటయేకాక శివదూషణ కూడఁ జేసియున్నాఁడు. అట్టిదోషనివారణముం జేయుట కాతని పేరిటనే శైవప్రధానగ్రంథము నొకదానిం జేసి యుంచిన లెస్స యని యూహించి యీవీరభద్ర విజయగ్రంథమును రచియించి నట్లు తోఁచెడిని. యీగ్రంథము రచియించిన కవి సాధారణముగా నయిన ఆంధ్రకవిత్వము చెప్ప లేనివాఁ డవుటం జేసియు కథాసందర్భములఁ బొందుపఱుప లేనివాఁ డవుటం జేసియు నాగ్రంథమును తుదకు హాస్యాస్పదముగా రచియించె. అటులనే కామన్న నీగ్రంథము పోతనామాత్యకృతము కా దని భేదించి చెప్పుట కవకాశమే చిక్కకపోవును. వీరభద్ర విజయగ్రంథకర్త కేవల శైవుఁడే యౌటం జేసి భాగవతరచనాదక్షుఁ డగుపోతనామాత్యునకుంగూడ వీరభద్రోపాసన యున్నదనియు వీరమాహేశ్వరకరుణ కలదనియు, తద్వీరమాహేశ్వరప్రధానుం డగుచు వటూరి సోమేశ్వరగురుని శిష్యుం డై యుండి వారియాజ్ఞానుసారముగా వీరభద్రవిజయ మనుశైవగ్రంథమును రచియించె ననియుఁ గథం గల్పించె. దీని కనుగుణముగా నుండునట్లే దక్షుఁడు కైలాసమునకుఁ బోవునప్పు డచ్చో జరగినశాపాదికముల వదలివేసి మఱికొన్ని భాగములలోఁ బెంచి వ్రాసెను. ఆభాగంబుల వివరించెదను. వీరభద్రవిజయ ప్రథమాశ్వాసమున దక్షుఁడు రజతగిరి కరిగినకథలో

"క. చని గిరిమందిరసన్నిధి వినయంబున నిలిచి యున్న వేడుక నతఁడున్।
మునులను సంభావించిన, యనువునఁ దను గారవించె నప్పుడు కరుణన్.

వ. ఇట్లఖిలభువనాధీశ్వరుండు సంభావించిన.

ఉ. అద్దిర! శంకరుండు వినయంబున నా కిదు రేఁగుదెంచి నా
పెద్దతనం బెఱింగి తనపెద్దఱికం బొకయించుకైన దా
గద్దనఁ జేయఁడయ్యె నట గారవము న్ననసేయదయ్యె నీ
పెద్దలు నవ్వ లాతిమునిబృందముచాటువఁ జేసి రిమ్మెయిన్.

క. అని తనపాలిటికర్మము పెనగొని తనచుట్టుముట్టి ప్రేరేపంగాఁ
జెనటి యగుదక్షుఁ డప్పుడు మనమునఁ గోపంబు నొదవ మలహరు నిలిచెన్.

వ. ఇట్లు దేవదేవునిమహాత్మ్యంబు దెలియక వృథావైరంబున దక్షుం డటు వాసి చనియె నంత నమ్మహేశ్వరుఁ గొల్వవచ్చిన దేవేంద్రాది బృందారక సంఘంబులు పునః పునః ప్రణామంబు లాచరించి చనిరి తదనంతరంబ.''

వెనుకటి భాగవతవృత్తాంత మంతయుఁ జదివినవారు దీని నేమని యూహించెదరో మన మాలోచింపవలసియున్నది. పోతనామాత్యుఁ డొకొక్కయంశంబుననే యేపురాణములో నేయేవిశేషము లున్నవో అవియన్నియు నేకముఖము చేసి యథాస్థితి బయటఁ బెట్టుటయందు కోర్కెగలవాఁ డని తోఁచక మానదు. ఇఁక వీరభద్రవిజయగ్రంథకర్త అట్టి సందియము లేకయే తన కిష్టమైన కథ లుంచి తక్కినవానిని వదలివేసినాఁ డని చెప్పక తప్పదు.

౮. పైగ్రంథకర్త లిర్వురు నొక్కరు కా రని సూచించు నట్టి కొన్ని పద్యములు పార్వతీప్రయాణసమయములోనివానిం దెల్పెదను. అది చూచినవెంటనే పయికవు లిర్వురిలో సమయోచితవాక్కు లెట్లుగా నుండునో అదియును దెలియును. అపుడు కవులభేదమును, కవిత్వభేదముం దెలియకపోదు. వీరభద్రవిజయమున దాక్షాయణి శివుని యనుజ్ఞ గోరఁగా నాయన యనుజ్ఞ యిచ్చినయనంతరవృత్తాంతము.

"గీ. అనుచుఁ జంద్రచూడుఁ డానతియిచ్చిన, శివుఁడు తన్ను వేఱుచేసె ననుచు
ఫాలమందు పాణిపద్మముల్ ధరియించి, వెలఁది మ్రొక్కి నిలిచె వెఱపుతోడ.

మత్తకోకిల. తల్లి యాదిగఁ దండ్రి యాదిగఁ దాత యాదిగఁ గల్గువా
రెల్లభంగుల నీవె కాని మహేశ యన్య మెఱుంగ నే
నల్లమందుల జిత్తగించితి నొప్పముల్ దగునయ్య యా
ప్రల్లదుం డగు వాఁడు దండ్రి భరంబు వల్కితి శంకరా.

మత్తకోకిల. శ్రీలలాటము సంఘటించిన చేతులాన వినావినీ
లాలకర్మద భృంగముత్ నయనాదికల్వలు జక్కవల్
పాలయిండ్లు మరాళముల్ గద భక్తి నీరుకడల్ దగన్
గాలిఁగాఁ గలకంఠి నిల్చె కొలంకు భంగిఁ దలంచుమన్.

వ. అప్పుడు దరహాసితవదనుం డైయుప్పరమేశ్వరుఁ డిట్లనియె.

ఉ. మాటలు వేయు నేమిటికి మాకడ నీవును నేను మీఁదకన్
బాటలగంధి యుండుదము బాలకశబ్దము నర్థమట్లనా
మాటకుఁ దాఁటగా వలను మన్నన నీచెలులెల్లఁ గొల్వఁగా
బోటిరొ పొమ్ము నీజనకుపొందగునోముసకుం గుటుంబినీ.

చ. అని నియమించి శంభుఁడు గణాధిపులం బిలుపించి దక్షునం
దన తనపుట్టినింటికిని ధన్యతఁ బోయెడు నోము చూడఁగా
దినకరభాతిఁ బొల్చుతగుదివ్యవిమానముఁ దెండు రండు పొం
డనవుడు వారుఁ దెచ్చి రతిహాటకదివ్యవిమానరాజముక్.

అని యున్నది. ఇంక భాగవతంబున నీకథాభాగంబుననే దీనినం తయు మఱియొకవిధంబునఁ జెప్పుచున్నాఁడు—చతుర్థస్కంధములో శివుఁడు సతీదేవితోఁ జెప్పుచున్న వాక్యములలో

"వ. అదియునుంగాక నీ వతనికిం బ్రత్యుత్థానాభివందనంబులు గావింపకుండుటం జేసి యతండు తిరస్కృతుం డయ్యె నంటివేని లోకంబుల జను లన్యోన్యమును ప్రత్యుత్థానాభివందనంబులు గావింతురు అది ప్రాజ్ఞులయినవారు సర్వభూతాంతర్యామి యైన పరమపురుషుండు నిత్యపరిపూర్ణుండు గావునఁ గాయికవ్యాపారం బయుక్తం బని తదుద్దేశంబుగా మనంబునందు నమస్కారాదికములు గావింతురు కాని దేహాభిమానంబు గలుగుపురుషులందుఁ గావింపరు. కాన నేనును వాసుదేవశబ్దవాచ్యుండు శుద్ధసత్త్వమయుండు నంతఃకరణంబునందు నావరణవిరహితుం డయి ప్రకాశించు వాసుదేవునకు నాహృదయంబున నమస్కరింపుచుండుదు. ఇట్లనపరాధి నైయున్న నన్ను పూర్వంబున బ్రహ్మాదులు సేయుసత్త్రంబునందు దురుక్తులంజేసి పరాభవించిన మద్ద్వేషి యైన దక్షుండు భవజ్జనకుం డయిన నతఁడును తదనువర్తులయినవారలును జూడఁదగరు గావున మద్వచనాతిక్రమంబునంజేసి యరిగితివేని యచట నీకుఁ బరాభవంబు సంప్రాప్తం బగు లోకంబున బంధుజనులవలనఁ బూజవడయక తిరస్కారము నొందుట చచ్చుటయకాదే యని పలికి మఱియు నభవుండు పొమ్మని యనుజ్ఞయిచ్చిన నచ్చట నవమానంబునంజేసి యశుభం బగుననియు నిచ్చటఁ బొమ్మనక నివారించిన మనోవేదన యగు ననియు మనంబునఁ దలపోయుచు నూరకుండె నంత.

సీ. సతి సుహృద్దర్శనేచ్ఛాప్రతికూల దుఃఖస్వాంత యగుచు నంగములు కదలఁ
నందంద తోరఁగెడు నశ్రుకణపూరంబులు, గండభాగంబులఁ గడలుకొనఁగ
నున్నత స్తనమండలోపరిహారముల్, వేఁడినిట్టూర్పులవెచ్చఁ గంద
నతిశోకరోషాకులాత్యంతదోధూయ, మాన మై హృదయంబు మఱఁగుచుండ
తే. మఱియుఁ గుపితాత్మ యై స్వసమానరహిత, నాత్మదేహంబు సగ మిచ్చినట్టిభవుని
విడిచి మూఢాత్మ యగుచు నవ్వేలఁది చనియె జనకుఁ జూచెడువేడుక సందడింప.

వ. ఇట్లతిశీఘ్రగమనంబున.

సీ. మానిని చనఁ జండ మణిమన్మదాది, సహస్రసంఖ్యాతరుద్రానుచరులు
యక్షులు నిశ్చయు లై వృషభేంద్రుని, ము న్నిడికొనుచు నమ్మదిత వాల్చి
కందుకాంజనశారికాతాళవృంతద, ర్పణధవళాతపత్రప్రసూన
మాలికాసౌవర్ణమణివిభూషణఘన, సారకస్తూరికాచందనాది
తే. వస్తువులు గొంచు నేఁగి శర్వాణిఁ గదిసి, శంఖదుందుభివేణునిస్వనము లొప్ప
మానితం బైనవృషభేంద్రయానఁ జేసి యజ్ఞభూమార్గ లై యుర్వి నరిగి యరిగి."

అని యున్నది. పయిరెండుకథాసందర్భములఁ జూచినచోఁ గథాసందర్భ భేదము లుండుటయేకాక సందర్భోచితవర్ణన గలశైలి భాగవతములోనిది కా దనియు నాగ్రంథకర్త వియోగదుఃఖసమయములో నెట్టివర్ణన జేయవలయునో యిసుమంత యైనఁ దెలియని కేవలరసహీన హృదయము కలవాఁ డనియు నటుగావున నాతనికి ‘రసమున కనుచిత మగుపదవి రస మరీతి యనఁబరఁగు’ అనునట్లుగా నాతనికవన మరీతి దోఁప యుక్త మై యుండు ననియుఁ జెప్ప నొప్పియున్నది.

౫. ఇఁక దక్షుఁడు సతీదేవితోఁ జెప్పినవాక్యములు.

“ క. నీనాయకుఁ డల్లుం డగు, కానీ నను ధిక్కరించెఁ గాన భవానీ
మానుగఁ గనియును నీవును, కానని గతి నుండ నేల గర్వము నేలా.
క. చెలువా పిలువక ముందఱ, వలసరి మాయింటి కేల వచ్చితి చెపుమా
పిలువని పేరంటము పచ్చిగలవారును బోలెసిగ్గుగాదె రాఁగన్.” వీర.వి. ఆశ్వా. ౧.

అని యున్న పద్యములంబట్టి చూడ వీరభద్రవిజయగ్రంథకర్త కల్లునియెడఁ గోపము వచ్చియున్నపుడు కూఁతు నెట్లుగా గౌరవించవలయునో అపుడేయేమాటలు మాటలాడవలయునో లెస్సగా బోధ యై యున్నది. ఇట్లుగాఁ బుట్టినయింటికిఁ గూఁతురు వచ్చినపుడు దుర్భావ

లాడువాఁడుక బ్రాహ్మణాదిఅగ్రజాతులలో నుండక కేవల మతినీచజాతులలోఁగూడ నుండునో యుండదో యని యూహింపవలసిన దై యున్నది. తనయింటికిఁ గూఁతురు వచ్చినపుడు పలుకరింపకుండుటయే తండ్రికిఁ గలయసూయం దెలుపుట. అది యెట్లఁగియున్న భాగవతకవి యగు పోతనామాత్యునియట్టి పెద్దగృహస్థుఁడు దానినెట్లు వర్ణించెనో చూడుఁడు.

భాగవత చతుర్థ స్కంధమున దక్షప్రజాపతి యజ్ఞము చేయునపుడు దాక్షాయణి పోవుట అనుకథలో

"వ. ఇట్లు కనుఁగొని యజ్ఞశాలం బ్రవేశించిన.

క. చనుదెంచిన యమ్మగువను, జననియు సోదరులు దక్క సభ గలజనులెల్లను దక్షుకలనిభయమున, ననయము నపు డాదరింపరైరి మహాత్మా.

క. మఱి తల్లియుఁ బినతల్లులు, పరిరంభణ మాచరింపఁ బరితోషాశ్రుల్ దొరఁగఁగ డగ్గుత్తికతో, సరసిజముఖి నేమ మరయ సతి దానంతన్.

క. జనకుం డవమానించుట,యును సోదరు లర్థిఁ దనకు సంచితక్రియఁ జేసినపూజల నందక తో, భన మరసిన మాఱుమాట బలుకక యుండెన్."

అని యున్నపైపద్యములవలన భాగవతగ్రంథకర్తయొక్క మనోధర్మము బోధపడకమానదు. అదిమొదలు సతీదేవి దేహము విడిచిన దనువఱకుఁ గలకథలో దక్షుఁడు మౌనముద్రాధారియై యుంచం బడెనే గాని యొక్కవాక్య మైన నల్పప్రసంగ మతనినోట నుండి వచ్చినట్లుగాఁ జెప్పం బడదయ్యెను. తండ్రికిఁ గూఁతునెడలఁ గోపము లేక కేవల మల్లునియెడలనే కోప మున్నట్లుగాఁ జెప్పఁబడెఁ గావునఁ గూఁతు నాతఁడు నిందించుట కవకాశము లేదు. ఇట్లు లేనిచో నికఁ గూఁతునకు నల్లునియెడఁ గలుగు ననురాగాతిశయమునకు నిందింపవలయును గాని మఱియొకవిధమున నిందించుటకు వీలుపడదు. అది పతివ్రతాలక్షణమే కావున శ్లాఘ్యకార్య మని దక్షుండు కూఁతు నిందించినట్లు చెప్పంబడలేదు. ఇఁకఁ దనకూఁతు నుపేక్షించి యూరకొనుటలో నాపెకుఁ దండ్రి గౌరవము చూపకుంటకుఁ గారకుఁ డగునీశ్వరుఁ డట్టివ్య

త్తాంతము తదనుచరులవలన విని తనమూలముగాఁ దనభార్య కట్టియగౌరవము తటస్థించె నని సిగ్గుపడి అంతటినుండియైనఁ దనకు భయభక్తులు చూపు ననుతలంపుననైన యుండును. పైరెండుకథలు బరిశీలించినచో భాగవతగ్రంథకర్తయు, వీరభద్రవిజయగ్రంథకర్తయు నొక్కరని యెవరైనఁ జెప్ప గమకించెద రేమో నే నూహింపను.

### ౬. సతీదేవి తండ్రితోఁ బల్కినపల్కులు.

సతీదేవి తండ్రివలన నవమానింపఁబడియెంగావున స్త్రీస్వభావముచేతఁ గోపించి తనపెనిమిటియెడలఁ గలమహాత్త్వాదికమును దండ్రికిఁ దెల్పి అట్టివానితోడ విరోధము శ్రేయస్కరమైనది కాదనియు నందుమూలమునఁ గల్గెడులాభమునకంటె నష్టమే యెక్కువయైనదనియుఁ జెప్పుటయు లోకసామాన్యధర్మము. అందులో నాతఁడు భగవంతుఁడుగా సతీదేవి భావించుచున్నది కావున నట్టివారియెడలఁ గల్గునపాయమూలమున నైహికాముష్మికములు రెండును జెడు నని తండ్రికి నామె చెప్పుటయు నైసర్గికములే. ఇట్టిచోఁ బైయిర్వురుకవులు నెట్లుగాఁ బైవృత్తాంతముం జెప్పిరో చూచెదముగాక. వీరభద్రవిజయము ప్రథమాశ్వాసములో

"వ. అనవుడు నమ్మహాదేవి కోపవివశ యై యయ్యాగమంటపంబున శుభాసీనులై యున్నసభాసదుల వనలోకించి యిట్లనియె.

చ. నిగమములార ధర్మపదనిర్ణయులార మునీంద్రులార యో
నిగమ మహాత్ములార భవనిర్ణయులార గిరీంద్రులార భూ
గగన చరాదులార భవఖండనులార మునీంద్రులార యే
నిగమములందుఁ జెప్పె శివనింద యెఱింగితి రేనిఁ జెప్పరే."

అని యొకపద్యమున్నది. పాఠకులారా! ముం దీపద్యప్రశంస జేయుసెలవ్రసంగుఁడు. ఒక్కపద్యము పఠించినచో నీపద్యకవి భాగవతకవి యగుపోతనామాత్యుఁ డేమో మీకే బోధకాక మానదు. పోతనామాత్యుఁడు నిద్దురలో జెప్పినను నింతయుభాగ్యకవనముం జెప్పఁడుగదా!

పైవచనములో నాయాగమంటపంబున శుభాసీను లై యున్నసభాసదుల నుద్దేశించి దాక్షాయణి చెప్పినవాక్య మనిగదా యున్నది. అట్లయినచో నిగమములును గిరీంద్రులుగూడ నాసభలోనికి వచ్చి సుఖాసీను లై యున్నట్లుచెప్పెను వివేకహీను లుందురా. గగన చరులారా యని చెప్పినఁ జ్ఞాలకకావలయును గగనచరాదులార యని విశేషించి చెప్పె. ఇట్టి చేతగానిప్రయోగములు భాగవతకవి చెప్పె ననినచో మీరా రామా టలకు నంగీకరించెదరా ?ఇట్లు చెప్పుచుఁ బైకథ కెడమగుచున్నారము. కావునఁ గథలోనికిం దిగుచున్నాఁడను, సభాసదుల నుద్దేశించి పల్కు చున్న వాక్య మంతలోనే దక్షునియెడ సమన్వయించఁబడి యీక్రిందిపద్య ములు వ్రాయంబడినవి. ఎట్లన్నను :—

" ఉ. వేదములం దెఱింగినవివేకము లెక్కడఁ బోయె నేఁడు పు
ణ్యోదయబుద్ధి యెం దణఁగియున్నది నేఁడు తలంపఁ బొల్లయై,
నీ దగుదక్షతాదృక్షము నీతియు నెక్కడ దాఁగె నేఁడు బ్ర
హ్మాదులు బోనిపిప్రీతి యని యాఁడివోయెనె నీకు నక్కటా.

శా. ఏరా దక్ష యదక్షమానస వృథా యీదూషణం బేలరా
రారాకీ పాపములెల్లఁ బోవిడువరా యుగ్రాత్ముఁ జేపట్టరా
వైరం బొప్పదురా శివుం దలపరా వర్ణింపరా రాజితో
త్కారాత్ముం డగునీలకంఠుఁ డెగడంగా రాదురా దుర్మతీ.

క. చదువుల నాలుగు శివుఁ గని, యెదఁ దలఁచుచు వెదకుఁగాని యెబ్బంగులఁ ద
త్పదములరూపము కావున, వదలినమతితోడఁ జిక్కు వలదుర దక్షా.

క. విశ్వములోపలఁ దనరెను, శాశ్వత మగుశివునిమహిమ చెప్పఁగ నీకున్
విశ్వాసంబునఁ జెల్లదు, యీశ్వరుమహిమాబ్ధి నీకు నెఱుఁగక

క. ఈయొడలు రోఁతగాదే, పాయక పరమేశు నొంద పనిసేయంగా
జేయును నేటికి మాటల, పోయెదురా కీడు నొందఁబూని దురాత్మా. "

అను మొదలగుపద్యములు మఱికొన్ని యున్నవి. ఈపద్యములు చదివినమాత్రమున వీరభద్రవిజయగ్రంథకర్త కేవల నీచాతినీచుఁ డని యుఁ దలిదండ్రులు బిడ్డలు 'నీవు ఛీ అంటె నీవు ఛీ' "నీవురండా అంటే నీవు ముండా" అని వచియించుకొనుచు దినముల వెళ్లించునీచజాతులలోఁ

బుట్టినవాఁడుగాఁ గానిపించును. ఓరీ దక్షా, విషవరా, చేపట్టరా, వైర మొప్పదురా, శివుని దలంపరా, వద్దురా, దుర్మతీ, దురాత్మా, అని యొక సంపన్నుని కూఁతురు విద్యాబుద్ధులు గల్గియుండిన తనతండ్రిం గూర్చి యిట్లుగాఁ దుచ్ఛసంబోధన లుంచి చెప్పునా అనుదాని నాలోచింపఁగా నీతండు భాగవత గ్రంథకర్త కాక మఱియొకఁ డని స్పష్టము కాక పోదు. ఇఁక భాగవతములో శివమహిమ జెప్పలేదనియుఁ దాను వీర భద్రవిజయములో శివమహిమఁ జెప్పెద నని చెప్పినపద్యములు పై మూఁడుకందపద్యము లయియున్నవి. అవట్టివ మఱికొన్నిపద్యము లున్నవి. అవియును గ్రంథకర్తకుఁ గలశివభక్తివిశేషములం దెల్పును. గాని శివతత్త్వప్రతిపాదకములుమాత్రము కావు. ఈవిషయములో మ నయభిప్రాయముతోఁ బనిలేదని భాగవతములోనిపోతనామాత్యవాక్య విశేషములనే చూపెదను. భాగవతము చతుర్థ స్కంధము సతీదేవి వాక్యములో

"వ. ఇట్లు తండ్రిచే ననాదరింపఁబడినదై విభుం డైనయీశ్వరునందు సాహ్వాన క్రియాశూన్యత్వరూపం బైన తిరస్కారంబున రుద్రభాగం బైనయజ్ఞంబు గనుంగొని నిజరోషానలంబున లోకంబులు భస్మంబు సేయంబూనిన తెఱంగున సముద్రేకించి రుద్ర ద్వేషియుఁ గ్రతుకర్మాభ్యాస గర్విష్ఠుండు నగుదక్షుని వధియింతు మనుచు లేచిన భూత గణంబుల నివారించి రోషావ్యక్త భాషణంబుల నిట్లనియె. లోకంబున శరీరధారులైన జీవులకుఁ బ్రియాత్మకుం డైనయీశ్వరునకుఁ బ్రియాప్రియులు నధికులు లేరు. అట్టిసకలకా రణుండు నిర్మత్సరుం డైనరుద్రునందు నీవుదక్క నెవ్వండు బ్రతికూలం బాచరింపఁడు. అదియునుం గాక మీయట్టివారలు పరులకలిగుణంబులందు దుర్గుణంబుల నారోపిం తురు. మఱియుఁ గొందఱు మధ్యస్థు లైనవారలు పరులగుణంబులయందు దోషంబుల నారోపింపరు. కొందఱు సాధువర్తనంబు గలవారలు పరులదోషంబులనైన గుణంబులు గా ననుగ్రహింతురు. మఱియుం గొంద ఱుత్తమోత్తములు పరులయందు దోషంబు నారోపింపక తుచ్ఛగుణంబు గలిగినను సద్గుణంబులు గాఁ గైకొందురు. అట్టిమహాత్ముల యందు నీవు పాపబుద్ధి గల్పించితివి. అని వెండియు నిట్లను. మహాత్ము లగువారల పా దధూళిచే నిరస్తప్రభావు లై జడస్వభావంబు గలదేహంబు నాత్మ యని పలుకుచుండు లగువారు మహాత్ముల నిందించుట కార్యంబు గాదు. అదియు వారి కనుచితం బగు నని వెండియు నిట్లనియె.

సీ. అనయంబు శివ యనునక్షరద్వయమక్షి, వాక్యాసఁ బలుకఁ భావమునఁ దలఁప
సర్వజీవులపాపసంఘముల్ చెడునట్టి, మహితాత్మునందు నమంగళుండ
వగునీవు విద్వేషి వగుట కాశ్చర్యంబు నందెద వినుము నీ వనియుఁ గాక
చర్చింప నెవ్వనిచరణపద్మంబుల, నరసి బ్రహ్మానంద మనుమరంద

గీ. మతులభక్తిని దమహృదయంబులందు, తుమ్మెదలచేతఁ గ్రోలి సంతుష్టచిత్తు
లగుదు రత్యంతవిజ్ఞాను లట్టిదేవు, నందు ద్రోహంబు చేసి తేమందు నిన్ను.

క. మఱియును నమ్మహితాత్ముని, చరణసరోజాతయుగము సకలజగంబుల్
నెఱిఁగొలువఁ గోరకోర్కులఁ, దఱుమిడి వర్షించు నతనిఁ దను నే తెగడన్.

చ. పఱగఁ జితాస్థిభస్మనృకపాలజటాధరుఁడున్ పరేతభూ
చరుఁడు పిశాచయుక్తుఁడని శర్వు నమంగళుఁ గాఁ దలంప రె
వ్వరు నొకఁ డీవు దక్క మతి వాక్పతిముఖ్యులు నమ్మహాత్మున
చ్చరణసరోజరేణువులు సమ్మతిఁ దాల్తురు మస్తకంబులన్.

చ. తెలకొని ధర్మపాలనవినిర్మలు భక్తుఁ దిరస్కరించు మన
క్కలుషునిజిహ్వఁ గోయఁదగుఁగా కటు సేయఁగ నోపఁడేనిఁ దాఁ
బొలియుట యొప్పు రెంటికిని బ్రభుత్వము చాలమిఁ గర్ణరంధ్రముల్
బలువుగ మూసికొంచుఁ జనఁ బాడి యటందురు ధర్మవర్తనుల్.

వ. అది గావున.

మ. జనుఁ డజ్ఞానమునన్ ఘటించిన జుగుప్సం బైనయన్నంబు స
ద్యత్నన వెళ్లించి పవిత్రుఁ డైనగతి దుష్టాత్ముఁడ వై యీశ్వరున్
ఘను నిందించిననీవిమాధవ యనంగా నోర్వ నీ హేయభా
జన మైనట్టిశరీరము న్విడిచి భాస్వచ్ఛుద్ధి వాటిల్లెదన్.

వ. అదియునుంగాక దేవతల కాకాశగమనంబును, మనుష్యులకు భూతలగమనంబును, స్వాభావికంబులైనట్లు ప్రవృత్తినివృత్తికర్మంబులు రాగవైరాగ్యాధికారంబులుగా వేదంబులు విధించుటం జేసి రాగయుక్తులై కర్మతంత్రులైనసంసారులకు వైరాగ్యయుక్తులై యాత్మారాములైన యోగిజనులకు విధినిషేధరూపంబులైన వైదికకర్మంబులు గలుగుటయు లేకుండుటయు నైజంబులగుటంజేసి స్వధర్మనిష్ఠుఁడగువాని నిందింపం జన దాయుభయకర్మశూన్యుండు బ్రహ్మభూతుండు నైనసదాశివుని క్రియాశూన్యుం డని నిందించుట పాపం బగుఁ దండ్రీ సంకల్పమాత్రప్రభవంబు లగుటంజేసి మహాజనయోగిసేవ్యంబులైనయస్మదీయంబు లగు నణిమాద్యష్టైశ్వర్యంబులు నీకు సంభవింపవు. భవదీయంబు లగునైశ్వర్యంబులు ధూమమార్గప్రవృత్తులై యాగాన్నభోక్తలైనవారిచేత

యజ్ఞశాలయందె చాల నుతియింపంబడి యుండుఁ గావున నీమనంబున నేనధికసంపన్నుండ ననియుఁ జితాభస్మాస్థిధారుం డైనరుద్రుండు దరిద్రుం డనియు గర్వింపఁ జన దని వెండియు నిట్లనియె.

ఉ. నీలగళాపరాధి యగునీకుఁ దనూభవనాట చాలదా
 చాలఁగు మర్త్య నీదుతనుజాత ననన్ మది సిగ్గువుట్టెడిన్
 జాలధరున్ మహాత్ములకుఁ జయ్యన నెగ్గొనరించుజన్మమున్
 గాలుపనే తలంప జనకా కుటిలాత్మక యొంచిమాటఁగన్.

చ. వరవృషకేతనుండు భగవంతుఁడు నైనహరుండు నన్ను నా
 దరపరిహాసవాక్యముల దక్షతనూభవ యంచుఁ బిల్వ నేఁ
 బురపురఁ బొక్కుచున్ ముదముఁ బొందక నన్మవచస్స్మితంబులన్
 దొరఁగుదు నీతనూజ ననుదుఃఖముకంటెనుఁ జచ్చు టొప్పగున్. "

అని యున్నది. ఇట్లుగా నుండినకథాకల్పకు లిరువురిలోఁ గల్గువిశేషంబులు పాఠకులే యోచించెదరుగాక. భాగవతములోఁ బోతనామా

### అనంతరకథావృత్తాంతము.

త్యుఁ డట్లుగాఁ బల్కుచు దాక్షాయణి యోగాగ్నిచే దగ్ధ మయ్యె నని యు నపుడు రుద్రాణితో వచ్చియున్న రుద్రపార్షదులందఱును దక్షుని సంహరింప విజృంభించిన నధ్వర్యుం డగుభృగుమహర్షి యొకయభిచార హోమంబున ఋభునామధేయుల నగ్నికుండంబు నుండి యుదయింపఁ జేసిన వారు వచ్చి రుద్రపార్షదులఁ బాఱం దోలి రనియుఁ జెప్పి యా వృత్తాంతంబంతయు నారదునివలన నావెంటనే యీశ్వరుండు తెలిసికొని,

"శా. ఆద్యుం డుగ్రుఁడు నీలకంఠుఁ డిభదైత్యారాతి దష్టోష్ఠుఁడై
 మాద్యద్ఘోరమృగేంద్రఘోషమున భీమప్రక్రియన్ నవ్వుచున్
 విద్యుద్వహ్నిశిఖాసముచ్చయరుచి న్వెల్గొందు చంచజ్జటన్
 సద్యఃక్రోధముతోడఁ బుచ్చి వయిచెన్ క్ష్మాచక్రమధ్యంబునన్."

అని యీశ్వరునకు దాక్షాయణీవృత్తాంతశ్రవణానంతరమునఁ గలిగిన కోపవిశేషమంతయు వర్ణించి చెప్పె. పిమ్మట నట్లుగాఁ బెఱికి వైచినజడయందు వీరభద్రావతారము కలిగినట్లును అతఁ డీశ్వరుని

యెదుట నిలువంబడి కర్తవ్యం బడుగఁగా నీశ్వరశాసనంబుగా నీక్రింది పద్యంబు రచియింపఁబడినది. ఎట్లన్నను:—

"చ. గురుభుజశౌర్య భూరిగణకోవిద మద్భటకోటికెల్ల నీ
వరయ వరూథినీవరుఁడ వై చని యజ్ఞముతోడ దక్షునిన్
బరువడిఁ ద్రుంపు మీ వచట బ్రాహ్మణతేజ మజేయమంటివే
సరి మదంశసంభవుఁడ వై తగ నీకు నసాధ్య మెయ్యెడన్."

అని యిట్లుగా నాజ్ఞాపింపఁబడినవీరభద్రుం డట్టహాసంబున బయలువెడలి శివసేనాపరివృతుఁ డై దక్షయజ్ఞవాటంబునకు వచ్చి యజ్ఞంబుతోఁగూడ దక్షుని వధించి నిజనివాసం బయినకైలాసంబునకుఁ జనియె నని పోతనామాత్యుఁడు దక్షయజ్ఞపరిసమాప్తిం దెలిపెను.

వీరభద్రవిజయకథోపసంహారవిధానము.

"దాక్షాయణి దేహంబు దొరఁగిన యనంతరము తత్ప్రకారంబు వీక్షించి దక్షమఖమంటపంబున సుఖాసీను లై యున్న బ్రహ్మ విష్ణు సూర్య చంద్ర దేవేంద్ర దండధర వరుణ కుబేరాది దేవజనంబులు మహాభీతచిత్తు లై మూర్తివంతంబు లైన మంత్రంబులు చాలించి పాపకర్ముం డగుదక్షుని నిందించి బ్రహ్మ తనలోకంబునకుఁ బోయె మఱియుఁ దక్కినవా రందఱును దమతమనివాసంబులకుం జనిరి తత్సమయంబున"

అని యొకఘట్టము చెప్పంబడినది. దీనిలో నీగ్రంథకర్తవలన యజ్ఞసమాప్తి యెట్టులుగాఁ జేయంబడెననఁగా యజ్ఞశాలలో నొకశవంబు బడియెంగావున నక్కడిఋత్విక్కులందఱు నశుచికారణంబున మూర్తివంతంబులైనమంత్రంబులు చాలించి యాపాపాత్ముం దిట్టుచుం దమతమనివాసంబులకుంజనిరని చెప్పినలోకాచారంబు ననుసరించి యుండు నని యూహించెంగాని యజ్ఞాదులు జరుగుచున్నప్పుడు యజమానికిని ఋత్విక్కులకును దీక్షామధ్యంబున నుండుటం జేసి అవభృథాంతమువఱకును జాతాశౌచమృతాశౌచంబులు పట్టకుండుట విధిగాని ప్రారంభమైనయజ్ఞము పరిసమాప్తినొందింపక ఋత్విక్కులుగానీ యజమానిగానీ తమయిష్టానుసారము వదలివేసిపోఁగూడ దనువిధిగానీ తెలిసియుండలేదు. ఇవి సర్వద్విజులకును దెలియఁదగిన ధర్మంబులే కాని ఇట్టివానిలోఁగూడ నీవీర

భద్రవిజయగ్రంథకవి పరాకు జెందినందులకు నాలోచించెదను. ఇప్పటి కీపూర్వపక్షము వదలెదను. ఇఁక నీశ్వరుఁడు సతీదేవివృత్తాంత మెఱింగి నసందర్భముం బరిశీలింతము. అదియెట్లన్నను.—

"సీ. కైలాసగిరిమీఁద కరకంఠుఁ డొకనాఁడు, కరమొప్పఁ గొలువుండి గౌరిఁ దలఁచి
యిదియేమి రా దయ్యె నిద్యేణలోచన, యని యవ్విధంబెల్ల నంత యెఱిఁగి
సుందరి తనకుఁ గూర్చుటయెల్ల భావించి, శంభుండు మనమునఁ జాల నొచ్చి
యిఁద్రియేమి తా నంపితిని దక్షునింటికి, మీనాక్షి తా నేల మేనువాసె

తే. పొలఁతి తన్ను నేను పొమ్మని తఱిమినఁ, బోవనొల్ల ననియెఁ బువ్వుబోఁడి
పంకజాక్షి నొంటిఁ బంపినకతనఁ గా, వెఱ్ఱితనము వచ్చె వేయునేల.

వ. అని మఱియును పరమేశ్వరుండు గౌరీదేవి ననంతకరుణామానసుం డై తలంచి వెండియుఁ దనమనంబున.

మ. పురమిక్ష రాజ్యముఁ గోలుపోయి తగ నేర్పుం బొంది శోకించున
జ్జడధీశాత్మకుఁ డైనయిందునకు దా జన్మించి రోషాంబుధిం
బడ వైవస్వతమన్వు నాఁడు ముదమొప్పక రాజ్యముం జేయఁగా
గడతేర్తు న్నని పాపదక్షునకు వేగన్ శాపమిచ్చెన్ వడిన్.

వ. ఇట్లు పరమేశుండు శాపంబిచ్చిన దక్షుండు తదీయప్రకారంబున నుండె నంత."

అని దక్షయజ్ఞ వృత్తాంతము ముగించఁబడినది. ఆహా! యేమి యీకవికథాసందర్భనైపుణి. రుద్రునంతటివాని భార్య నవమానించి చచ్చునట్లుగాఁ జేసినదక్షున కపుడే రుద్రునివలన శిక్ష కలుగునట్లుగా వచియింపఁబడక అనేకమన్వంతరము లైనపిమ్మట వచ్చెడువైవస్వతమనువు కాలములో నీదక్షు నీశ్వరుఁడు సహరించెద నని చెప్పినట్లు కథ పొసఁగించి తిరుగ దక్షునకు మఱియొకజన్మమును మఱియొకయజ్ఞమును గల్పించి అందులో నీశ్వరుఁడు ప్రస్తుత మన్వంతరములోఁ దక్షుఁడు జేసియున్నయపచారమునకుఁ గాఁ దనకు లేనిదీర్ఘక్రోధము మనసులో నుంచుకొని వీరభద్రుం బుట్టించి యతనివలన నానాఁటియజ్ఞమునకు వచ్చినదేవతలనందఱఁగూడ శిక్షించె నని చెప్పుట యెంతశ్లాఘనీయము? పురాణములో నట్లుండెఁగావున నతఁడట్లుగాఁ జెప్పెనందు రేమో. భాగవతములోఁ బోతరాజు పురాణములఁ జూడక చెప్పెనా? అట్లుగా నొకచోటఁ జెప్పి నం

దర్భము గూడిచ్చిన పోతరాజే మఱియొకగ్రంథములో నాకథనే సంద ర్భహీనముగాఁ జెప్పునా? కావున నీరెండుకథలును జెప్పినవా రొకరు కాక యిరువురు వేఱ్వేఱుకవు లని నిర్ణయించి యాగ్రంథము నవీన మనియుఁ గల్పితమనియు సిద్ధాంతీకరించెదను.

### భోగినీదండకము.

ఇదివఱలో వీరభద్రవిజయ మీపోతరాజకృతంబు కా దని తగినయాధారము లుండుటంబట్టి నిష్కర్షించియుంటిమి. అటులనే నిష్కర్షింపవలసినయంశ మింకొకటి యున్నది. అది పోతరాజకృత మని ప్రసిద్ధి నొందిన 'భోగినీదండకము.' దీనిం బరిశీలింపఁ దగుగ్రంథములు లేవు. వేంకటగిరిసంస్థానచరిత్రములో నీక్రిందివిధంబుగా వివరింపఁబడియె. ఎట్లన్నను:—

" Biographical Sketebes of the Rajahs of Venkatagiri by Mr. T. Rama Rao, in 1875, pages 26.27.

It is highly interesting to learn that the eldest of them (Sarvagna Singama Naidu) was greatly learned in Sanskrit literature, poetry, drama, logic, grammar and rhetoric and that he himself composed a work on the last-mentioned subject called " Singabhupaleyam" His Court is soid to have been adorned by several poets among whom were Bammera Potarazu who translated 'Bhagavatam' in Tulugu, and Srinathudu, the Teugu Translator of 'Naishadham' Sarvagna Singama Naidu formed the subject of a Composition by the former called 'Bhogini Dandakam and of some stray verses by the latter. "

పైదానిం బట్టి సర్వజ్ఞసింగమనీనివిశేషములు కొన్ని కానవచ్చును. అయితే దానిలో నతనిసభాపండితులలో భాగవత మాంధ్రీకరించిన బమ్మెరపోతరాజును, నైషధ మాంధ్రీకరించిన శ్రీనాథకవియు నున్నట్లును, పై యిర్వురిలోఁ బోతరాజు 'భోగినీదండకమును' శ్రీనాథుఁడు కొన్నిచాటుధారాపద్యములును సింగమనీనిపైఁ గృతియిచ్చినట్లుగా నున్నది. పైయిర్వురిలో శ్రీనాథకవి యీసింగమనీనిసభాసదులలోనివాఁడు కానట్లును పైగా నతనికి బలవద్వైరి యగునన వేమారెడ్డియొక్క యాస్థానకవి యనియు నతనికార్యార్థమే సింగమనీనిం జూడఁబోయి

దానిం జేసికొనుటకై అతనిపై రెండర్థములు కల్గునట్లుగాఁ బద్యములు చెప్పి, దానిలోని సర్వజ్ఞశబ్దము గలపద్యములోఁ జేసినయుపహాస్యాదిక మిదివఱలో శ్రీనాథకవిచరిత్రములో నావలన వ్రాయంబడినది. ఆకథ శ్రీనాథుఁడు సింగమనీఁడును సమకాలీను లని చెప్పుటకుఁ జాలునుగాని శ్రీనాథకవి సింగమనీనియాస్థానపండితుఁ డని సూచింపదు. అటువలెనే కూచిమంచి తిమ్మకవి చెప్పిన పద్యమును భాగవతములోఁ బోతరాజు చెప్పిన' ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి, అనుపద్యము పోతరాజు సింగమనీని కాలీనుఁ డని తెల్పినను సింగమనీని పైఁ గృతియిచ్చి భోగినీదండకము చెప్పె ననుమాటను పూర్వపక్షము చేయుచున్నది. వీనికిఁ దోడుగా భోగినీదండకము చివర నున్నయీక్రిందిపద్యము మఱియొక పెద్దయనుమానమును కల్గించుచున్నది. ఆపద్య మెట్లన్నను :—

"ఉ. పండితకీర్తనీయుఁ డగుబమ్మెరపోతన యామృధాంశుమా
ర్తాండకులాచలాంబునిధితారక మై విలసిల్ల భోగినీ
దండకముక్ రచించె బహుదానవిహార్తను రావుసింగభూ
మండలభర్తను విమతమానవనాథమదాపహార్తను."

ఇట్లున్నపద్యమున పండితకీర్తనీయుఁడ నని బమ్మెరపోతన పైదండకమువంటిచిన్నవ్రాఁతకుఁగా నింతబిరుదాంకితము వేసికొని యింతగా అత్మస్తుతి చేసుకొనునా? యనియు నిది యొక గొప్పయంశ మని దీనికిఁగాను సర్వజ్ఞసింగమనీనివంటిమహాపండితుఁడు కృతిపతిగా నుండఁగోరి పోతరాజువంటి వైరాగ్యసంపన్నుని అట్టి కవిత్వము చెప్పుట కుత్సహింపజేయుట కల్గునా యనియుఁ దోఁచుచున్నది.

సర్వజ్ఞసింగమనీనివంశస్థులే యగు మఱియొకకుటుంబమువారు గోదావరీ మండలములోని పిఠాపురములో నున్నారు. వారిగృహనామము రావువా రని వ్యవహరింపంబడును. వారిలోఁగూడ నొకసామంతసంస్థాన మున్నది. వారు తమవంశావళిం బ్రకటించుచుఁ దమపూర్వుఁడగు పై "సర్వజ్ఞసింగమనీని" వృత్తాంత మీక్రిందివిధమునఁ గొంత వ్రాసినారు—

"(*vide* 'Row Vamsa Chatitra Tilaka translated by one Nadakuditi Seetanna, printed and pvblished in 1884)at page 16, we find the following:—Anapotam Naidu had a son named Sarvagna Singama Naidu Who was well versed in, as well as, in other branches of learning He collected a large army and conquered the ports of Methuku and Kylasa in the west and held them as Jaghire. He patronized many poets, Philosophers, and Metaphysicians of the day. Panditaraya, the celebrated Telegu translator of Naishadha and Kasikhanda, *i. e.*,Sreenadha and several others were highly respected and honored."

పైగాథనుబట్టి చూడఁగాఁ బండితరాయలు నైషధ, కాశీఖండములఁ దెనిగించిన శ్రీనాథకవి మొదలగువారును సింగమనీనివలన గౌరవింపఁబడిన ట్లున్నది. కాని అతనియాస్థానవిద్వాంసులుగాఁ గానీ కవులుగాఁ గానీ యున్నట్లు కనఁబడదు. ఇదియునుగాక సింగమనీనికిఁ గల యభిరుచి సంస్కృతభాషలోఁ గాని యాంధ్రంబునఁ గాదని అతనివలన రచితము లైనసింగభూపాలీయము నాటకపరిభాష మొదలగుగ్రంథములం బట్టి కాన్పించును. అట్టివాఁ డాంధ్రములో వారనారిపై నొకదండకముం జెప్పించి దానికిఁ దాను కృతిపతి యై యుండ నంగీకరించె నని పుట్టింపఁబడినకథ యే పొసఁగియుండ లేదు. ఆసింగమనీని యోగ్యతామహిమంబుల రేటూరి రంగరాజకవి తనభానుమతీపరిణయగ్రంథములోఁ గృతిపతివంశాను వర్ణనములో నీక్రింది విధంబుగా వివరించె. ఎట్లనఁగా.

" సీ. ఏమహాసేనాని యుద్ధతేజోరాశి, హితధనంజయజయోన్నతి వహించె
నేభోగిభూవణు హేలాధృతిగుణంబు, తుహినా ప్రజాతసంస్తుతి భరించు
నేమా స్త్రిబలవారి బాహువిక్రమలీలఁ, గర్వాంధకచ్ఛదకలనఁ గాంచు.
నేమహాపతి ధర్మసామోపయత్నంబు, సిద్ధసంకల్పరాజిని మెలంగు
గీ. నేసమాశ్రితవిద్యాధరేంద్రకీర్తి, సుగుణగణపాలనార్చితస్ఫూర్తిఁ గాంచు
నట్టిసర్వజ్ఞమూర్తి నా నలరుచుండుఁ, జిత్రకీర్తిమీఱి సర్వజ్ఞసింగశౌరి. "

కూచిమంచి తిమ్మకవిసార్వభౌముఁడు తనలక్షణగ్రంథములో భాగవతగ్రంథము రచియించిన బమ్మెర పోతరాజునకును పైసింగమనీనికిని బలవద్విరోధంబు కలదనియు నాకారణమున నాపోతరాజకృతభాగవతముమాపుమాపఁదలంచి దానిని భూమిలోఁ బాతించెననియుఁ

గావున నందులోని యనేక భాగములు శిలములైనవనియు నిట్టులే మఱికొన్ని వృత్తాంతంబులు చేర్చియొకపద్యము చెప్పె. దానింబట్టి చూడ నీపోతరాజునకును సింగమనీనికిం గల విహితవిశ్వాసములు బోధయగును. ఆపద్యానుసారముగాఁ జూచిన నాయిద్దరకును విరోధ మున్నట్లు కాన్పించునుగాని విహితమున్నట్లు కాన్పించదు. దానినూహించుటకుఁ బూర్వమాపద్యము నీక్రింద వివరించెదను. ఎట్లన్నను :—

" సీ. ఘనుఁడు పోతనమంత్రి మును భాగవతము ర, చించి చక్రికి సమర్పించు నెడల
సర్వజ్ఞసింగయక్ష్మాకవుం డది దన, కిమ్మని వేడిన నీయకున్న
నలిగి యాపుస్తకం బవనిఁ బాతించినఁ జివికి యం దొకకొంత శిథిలమయ్యెఁ
గ్రమ్మఱ నది వెలిగందలనారప, రాజును మఱి బొప్పరాజు గంగ
రాజు మొదలగుకవివరుల్ దేజ మెసఁగఁ, జెప్పి రాగ్రంథములయందె తప్పులాడె వెఁ
గాని పోతకవీంద్రుని కవనమందు, లక్షణం బెందుఁ దప్పునా దక్షవరణ. "

దీనింబట్టిచూడ సింగమనీనికిని పోతరాజునకు నెట్టిస్నేహ మున్నదో చూడనగును. ఈపద్యమునం గలలక్షణము(దీనిపేరేలక్షణసారసంగ్రహము) తిమ్మకవివలన శా. స. ౧౬౬౨ అనఁగా క్రీ. శ. ౧౭౪౦ నకు నరి యగురౌద్రిసంవత్సరమున రచియింపఁబడియె. దీఁకి వ్యతిరేకముగా ఆ. ౧౮౬౦ సంవత్సరప్రాంతమున ఆంధ్రభాగవతమును ముద్రించినపండితులు పోతరాజు జన్మకర్మములు దెల్పు ననువచనగ్రంథమునుండి తాము పరిశోధించి వ్రాసితి మని కొన్ని క్రొత్తమాటలు వ్రాసిరి. దాని వివర మీవలకే చేసియున్నాను. పైరెండుకథలలోఁ దిమ్మకవి వ్రాసినదే మధ్యాంధ్రమండలము నాఁ బరఁగువేంగీదేశములో వ్యాప్తమై యున్నది. తిమ్మకవినాఁటికే పైసర్వజ్ఞసింగమనీనికథ ప్రాచీనము. అట్లుండఁగా నాంధ్రభాగవతము ముద్రించినవారు మఱి నూటయిరువది సంవత్సరముల యనంతరకాలములోఁ దా మెద్దియో పోతరాజు జన్మకర్మములఁ దెలుపనున్న వచనగ్రంథము దెచ్చి తాము పరిశీలించితి మని మూలగ్రంథము ను బ్రకటింపకయే వ్రాసినమాటలను నమ్ముట యుక్తియుక్తముగాఁ గాన్పించదు. కావున సింగమనీనికిని పోతరాజునకును విహితవిశ్వాసములు లే వనియే నిశ్చయింపవలసి యున్నది.

సర్వజ్ఞసింగమనీఁడు పోతరాజును భాగవతము తనకుఁ గృతియిమ్మని యడుగుటయు దానిని స్పష్టముగా నీయనని పోతన తిరస్కరించెననుట యు యుక్తియుక్తముగాఁ గాన్పించదు. లోకములోఁ గవులు తాము గ్రంథములు రచియించి ప్రభువులపైఁ గృతినీయ ననుగ్రహింపుఁ డని యాశ్రయించుటయు, నట్టిగ్రంథముల గృతినంద నిష్టము గలవారు ఆగ్రంథమునకుఁ దగు సత్కార మెంతో దానిం జేయుటకుఁ దమరు చాలియుందురో లేదో చూచుకొనుటయు, నట్టిగొప్పవ్యయ మవశ్యమో కాదో చూచుకొని యనంతర మట్టి గ్రంథము గృతి నందలేమని చెప్పుటయును కవి కది సమ్మతము కానియెడల నాప్రభువును వదలి మఱియొకప్రభువు నాశ్రయించుటయు నున్నది కాని సింగమనీనివలె నొక గ్రంథము నాకుఁ గృతియియ్యవలె నని స్వయముగ యాచించుటయు, నట్లు యాచించు ప్రభుని నీ వీగ్రంథమునకుఁ గృతిపతివి కాఁదగవు కావున నే నీయను పొమ్మని పోతన మూర్ఖించి చెప్పుటయు లోకానుభవవ్యతిరేకమై యున్నది ఇటులఁ గానిచో గ్రంథమెందులకు బహుకవికృతమై యున్న దని ప్రశ్నము పుట్టఁగలదు. ఆప్రశ్నమున కీవఱకే కొంత యూహించి వ్రాసితిమి. గ్రంథము బాహుళ్యమైనది కావునఁ బోతరాజే తాఁ గొన్నిస్కంధములును దనశిష్యులు కొన్నిస్కంధములు విభజించి కొని ముగించినట్లు తోఁచెడిని. దానికి దృష్టాంతముగాఁ గేవలము వేదాంతరహస్యప్రతిపాదకంబు లగు ద్వితీయ స్కంధము మొదలగు వేదాంతభాగములును ప్రహ్లాదచరిత్రము గజేంద్రమోక్షణము, శ్రీరామచరిత్రము, దశమస్కంధపూర్వభాగము సత్యభామయుద్ధము మొదలగు ప్రసిద్ధకథలన్నియుఁ బోతరాజ కృతములే యగుటయు సామాన్యకథాభాగములుమాత్రమే తచ్ఛిష్యకృతము లగుటయుఁ గాన్పించు కావున పోతన తనకిష్టమైనభాగములును దనశిష్యులకు లొంగనిభాగములను దా స్వయముగాఁ గైకొని యాంధ్రీకరించిన ట్లూహించుటయే యుక్తియుక్తముగా నున్నది. ఇఁక భాగవతమును సింగమనీఁడు పాఁతివేయించిన

మాటయే నిజమేని దానికారణ మూహింతము. దానికొకకారణ మూహింప దగియున్నది. అది ప్రాచీనులలోఁ బెక్కండ్రకుఁ గలసామాన్య గుణవిశేషమై యున్నది. ఏమియనగా సింగమనీఁడు కేవలము సంస్కృత భాషాభిమాని భాగవతము కేవలరహస్యార్థప్రతిపాదక సంస్కృతగ్రంథము కావున దానిని పురాణకవులు వదలిరి. అట్టిగ్రంథము ను దెనిఁగించుపోతరాజున కా కాలములో నెంతమంచియుద్దేశమున్నను భాగవతము దెనిఁగించు టనునది సంస్కృతాభిమానుల కందఱకు మిగులఁ గోపకారణముగా నుండకపోదు. అట్టిపండితు లుత్సహింపఁ జేయఁగా గనలినట్టియుఁ దాను స్వయముగా సంస్కృతాభిమానియు నగుసింగమనీఁడు ప్రభుఁడై యుండుటంబట్టి, దుష్కార్య మని తా నూహించుదానిని నివారింపయత్నించుట కేల సంశయించును? కావునఁ దనయుద్దేశానుసారముఁగా బోతనకృత మగుగ్రంథము నశింపఁజేయఁగోరి యిప్పటికిఁ దోఁచినవిధముగ నాగ్రంథంబు భూస్థాపితము జేయించియుండును. అతఁడు ప్రభుండుగావున నాతనియాజ్ఞ చెల్లక తప్పదాయె. దానిం జరిగించిన పిమ్మట నాగ్రంథమందును, కవియగు పోతరాజునందు నభిమానము గలవారు దానిని రహస్యంబుగనైనఁ బయటికిఁ దీసి సింగమనీనికాలములోఁ దిరుగ దాని వ్యాపింపఁజేయక యుంచవచ్చును. అతని యనంతర మతనిశిష్యు లాగ్రంథమున కనేకప్రతులు వ్రాసి వాని నొక్కమాఱుగ దేశమునం దంతట వ్యాపింపఁ జేసి యుండవచ్చును. ఇట్లైన భాగవతగ్రంథము ద్రణకర్తలు వ్రాసినదానిలోఁ జాలభాగము యథార్థముగానుండె నని తలంచవచ్చును. అటుగానినాఁడు రెండుకథలును విశ్వాసపాత్రములు కాక చెడును. ఇట్లున్న పై వ్యాసముం జూచిన పిమ్మటనైన "భోగినీదండకము" సింగమనీని కోర్కెపైఁ బోతరాజువలన రచియింపంబడి, యాతనికిఁ గృతియీయఁబడె ననుమాట పూర్వపక్షమతములోనిదిగా: బాఠకులు భావింతు రని నమ్ముచున్నాఁడను.

శ్రీరస్తు.

# కవిజీవితములు.

## పురాణకవులచరిత్రము.

## 21.

## వెన్నెలకంటి సూరనార్యుఁడు.

ఇతఁడు విష్ణుపురాణముం దెన్గుబాస నొనరించినకవి. ఇతనిది హారీతసగోత్రము. ఇతనితండ్రి పేరమరనమంత్రి. ఈయన నియోగి శాఖా బ్రాహ్మణుఁడు. పైవిష్ణుపురాణము 'రాచూరి రాఘవరెడ్డి' యను నతనికిఁ గృతియియ్యఁబడినది. ఆకృతిపతి వృత్తాంతము జెప్పుటకుఁ బూర్వము సూరనకవి వక్కాణించియున్న పూర్వకవినామంబుల వివరించెదను. ఎట్లన్నను:—

"ఉ. మున్నిటు కాళిదాసకవిముఖ్యులకుం బ్రణమిల్లి వారిలో
నెన్నిక గాఁ బ్రబంధపరమేశ్వరుఁ దిక్కనసోమయాజినిన్
నన్నయభట్టు భాస్కరుని నాచనసోముని రంగనాథునిన్
వెన్నెలకంటి సూర్యుఁ బదివేలవిధంబులఁ గొల్చిభక్తితోన్."

అని యున్నపై పద్యముంబట్టి చూడ నీసూరకవివలన నుదాహరింపఁబడినకవులకుఁ బిమ్మట నీ సూరకవి పుట్టినట్లూహింపవలసియున్నది. అందుదాహరింపఁబడినకవులలో వెన్నెలకంటి సూర్యుఁ డనంబడు సూర్యకవి యెవ్వరని యూహింపవలసియున్నది. అతనింగూర్చి మఱియొకస్థలములో నీక్రిందివిధంబున నీసూరనకవి వివరించె. ఎట్లన్నను:—

"ఉ. ఈనిఖిలంబు మెచ్చ నమరేశ్వరదేవుఁడు చూడఁ గృష్ణవే
ణీనదిసాక్షిగా పనికి నిల్చినరావుతుఁ గేసభూవిభుం
గానకుఁ దోలి వెన్నడచి కాచినవేమయయన్నపోతభూ
జానికి సత్ప్రబంధము లొసంగిన వెన్నెలకంటివారిలోన్.

సీ. భవ్యచరిత్రుఁడాపస్తంబమునిసూత్రు, శుద్ధసారస్వతస్తోత్రపాత్రు
హారీత గోత్రపవిత్రు నాంధ్రభాషాకావ్య, రచనాభినయ విశారదుఁ బ్రబంధ
కర్తను వెన్నెలకంటి సూర్యునిమను, మనిఁ జెఱకూరి యమరనమంత్రి
సత్పుత్రునాఁకువిస్తారవిచిత్ర మౌ, ధుర్యకవిత్వచాతుర్యశీలు

తే. నిజకులాచారమార్గైకనిపుణుఁ బరమ, సాత్వికోదయ హృదయు వైష్ణవపురాణ
వేది సారస్వవిద్యాప్రవీణు సుకవి,మాననీయుని సూరనామాత్యవరుని "

ఇట్లున్న పైపద్యములంబట్టి పై వెన్నెలకంటి సూర్యకవి యీ విష్ణుపురాణకవి యగుసూరనకవికిఁ దాత యని తేలినది. ఆసూరకవి వేమ యయన్న పోతరెడ్డికాలీనుఁడని తేలినది. ఆసూర్యకవి యేప్రబంధములం జేసెనో బోధకాక యున్నది. ఈసూరనకవి తండ్రి చెఱకూ రను గ్రామములో వసియించుటం జేసి యాతఁడును చెఱకూరి యమరనమంత్రియని పిలువంబడినట్లు కాన్పించు. అంతమాత్రమున నాతనివంశ నామము చెఱకూరివా రని చెప్పఁగూడదు. కొందఱి కింటిపేరు వేఱైనను వారు కారణాంతరములవలన నన్యగ్రామనివాసము చేయునపు డాయూరి పేరిట వారు మాత్రము పిలువంబడునాచార మాంధ్రులలోఁ గలదు. అది గృహనామముమాత్రము కాదు. కావున నీసూరనకవి తనయాశ్వాసాంత్యగద్యములోఁ దనయింటిపేరు చెఱకూరివా రని చెప్పక వెన్నెలకంటివా రనియే యీక్రిందివిధంబునఁ జెప్పె. ఎట్లన్నను:—

" ఇది శ్రీమదమరనామాత్యపుత్త్ర హారీతగోత్రపవిత్ర సుకవిజనవిధేయ వెన్నెలకంటి సూరయ నామధేయప్రణీతం బైనయాదిమహాపురాణం బగుబ్రహ్మాండంబునందలి పరాశరసంహిత యగుశ్రీవిష్ణుపురాణంబు. "

అని యిట్లు వ్రాయుంబడుటచే వీరియింటిపేరు వెన్నెలకంటి వారనియే వాడఁబడును.

—⊨ వెన్నెలకంటివారివృత్తాంతము. ⊨—

ఈ యింటిపేరు గలవారిలోఁ బెక్కండ్రు కవు లున్నట్లు వాడుక గలదు. ఆకారణంబున

"కవితపుట్టిల్లు వెన్నెలకంటియిల్లు, వచ్చిపోచ్చెను మోచెర్లవారియిల్లు, "
అను మొదలగు పద్యములు పుట్టెను. దీనింబట్టి వెన్నెలకంటి

వారి కుటుంబ మొకటియు, మోచెర్లవారికుటుంబ మొకటియు నొక కాలములోఁ గవిత్వమునకు మిగులఁ బ్రసిద్ధికెక్కినకుటుంబము లనియు నాయిర్వురలోనే కవిత్వ విద్య నిలిచి యుండె ననియుఁ దేలినది. అట్టి వారిలో నిర్వురు ముఖ్యులు ప్రసిద్ధు లున్నట్లును వారిసమీపబంధువులై నట్లు తేలును. అందు మొదటివాఁడు సూర్యకవి. మఱియొకఁడు పైసూర్య కవి తమ్మునికొడుకైన విక్రమార్కచరిత్రములో వివరించఁబడినవెన్నెల కంటిసిద్ధన యొకఁడును, నీ సూరకవి యొకఁడు నై యున్నారు. ఇఁక మో చెర్లవారింగూర్చి వ్రాయవలసియున్నది. వారిలో వెంకన్న, దత్తప్ప లను కవు లిర్వురుమాత్రము మన మెఱిఁగినవారు. వారిగ్రంథములు వ్యాపకము లో లేవుకాని వారిసమస్యాపూరణములు పెక్కులు గలవు. ఆపద్యప్రశం స సేయుటకుఁ బూర్వము పైరెండుకుటుంబములకుఁ గలప్రత్యక్షసంబం ధము వివరింపవలసియున్నది. ఆసంబంధము దౌహిత్రసంబంధ మని చెప్పఁ దగియున్నది. అందులో నెవ్వా రెవ్వరు దౌహిత్రులోఁ జెప్పఁజాలము కాని పై పద్యానుసారముగాఁ గవితాకన్య వెన్నెలకంటి వారియింటఁ బుట్టి మోచెర్లవారి యింటికోడలైనదని చెప్పంబడుటచేత వెన్నెలకంటి వారి కన్యకను మోచెర్లవారి పిల్లని కిచ్చి వివాహము చేయఁబడియుండవ చ్చు నని తోఁచును. పైవెన్నెలకంటి కవులలో నెవ్వరిపుత్రి కానంతాన ములోనివారు మోచర్లకవులలో దానిని నిర్ణయింపలేము. వెన్నెలకంటి వారిలో ననేకులు కవు లున్నారినుచో నిమొచర్లవా రెవ్వరిదౌహిత్రు లో దాని నిర్ణయింప వీలులేదు. అట్టి మోచర్లవారిలో నిర్వురుకవులు బహుప్రసిద్ధులు. వారిపేరులు వెంకన్న, దత్తప్ప. వీరు రావు యాచమ నాయని కాలీను లని యుండుటచేతఁ బైకవులందఱికి వీరు మిగుల దూరస్థులుగాఁ గాన్పించెదరు.

## మోచర్లవారివిషయము.

పై మోచర్ల వెంకన్న, దత్తప్పకవులు 'ఏజళ్లవారు' అను తెట్టు జమీందారుల యాస్థాన కవీశ్వరులు. వారిలో వెంకన్న యనునతఁడెల్ల ప్పు డాస్థానముననే కనిపెట్టియుండుటయు దత్తప్ప యితరరాజుల సంస్థా

నములకుఁ బోయి తనవిద్యావిశేషములఁ జూపుచుండుటయు నచ్చటచ్చ
ట ననేకబహుమానంబు లంది వచ్చుచుండుటయుఁ గలదు అట్లతఁ డిత
రసంస్థానములకుఁ బోయి చేసిన విద్యావ్యాసంగములలో నొకసమయ
మునఁ బైరావు యాచమనాయని సభలోఁ జేసినయొక కార్యము
మిక్కిలి ప్రసిద్ధినొందెను. ఆకథనుమాత్రము వివరించి మోచర్లవారి
గాథను వదలెదను.

### ఒకపండితునికథ.

"ఒకదినమున నొకబ్రాహ్మణుఁడు మండువేసవిగా మధ్యాహ్న
సమయంబున నీమోచర్లవారియింటికి వచ్చె. అపుడు వార లాతని నభ్యా
గతునిగా భావించి యుచిత సత్కారంబులఁ జేసి యామాధ్యాహ్నిక కా
ర్యమచటనే కావింపఁ బ్రార్థించిరి. ఆపండితుఁడు నటులనే చేయుటకు స
మ్మతింప వెంకన్నకవి వెంటనే లేచి యతనిఁదోడ్కొని చని స్నానాదిక
ములం దీర్చి నందఱు భోజనమునకుం గూర్చుండిరి. అంతట వెంకన్నకవి
యప్పండితునకు హస్తోదకం బిచ్చి కైకొమ్మనుడు నాబ్రాహ్మణుఁ డట్లుచే
యక తలవాంచి యూరకుండె. దానింజూచి యతని కెద్దియో కోర్కె గ
లదని యూహించి "అభ్యాగతస్స్వయంవిష్ణుః" అనియుండుటం జేసి మీాయ
భీష్టం బెద్దియో యదిపడయవచ్చు ననుటకుసందియంబు లేదు. దానిం జెల్లిం
తును హస్తోదకంబు గైకొమ్మనుడు నాపండితుఁడునాయభీష్టవరంబు దయ
చేసితిరి కావునం గైకొనెద నని హస్తోదకంబు గైకొనియె. అపుడు వారంద
ఱు నుచితాలాపంబు లాడుచు భోజనంబులు గావించిరి. భోజనానంతరము
తాంబూల చర్వణార్థము రండని వెంకన్నకవి యాబ్రాహ్మణుని మేడపై
కిం గొనిపోయి యతని నుచితాసనంబున నునిచి ఆతని వృత్తాంతంబును,
వచ్చినకార్యంబును దెలుపవేఁడఁగా నాబ్రాహ్మణుఁడు విన్నంబోయిన వద
నంబున నాకవివర్యున కిట్లనియె. ఓకవికులావతంసా! నావంత యొక్కిం
త చిత్తగింపుఁడు. నే నొకపేదబ్రాహ్మణుఁడను. చిన్నతనముననే వారా
ణసికిం బోయి యిరువది ముప్పది సంవత్సరములు గురుశుశ్రూష చేసి
కష్టించి షట్ఛాస్త్రిములను గొంతవఱకు నేర్చికొంటిని. అంతట స్వజ

నులు వచ్చి నన్ను బ్రార్థించి స్వదేశంబునకుఁ దోడి తెచ్చిరి. ఇంటఁ బ్రవేశించినది మొదలుగృహకృత్యములు నేనే జరుపవలసినవాఁడ నగుటంజేసియు దానికిఁ దగువృత్తిస్వాస్థ్యములు లేకుండుటంజేసియు విద్యాధికులగుప్రభువుల నాశ్రయించి నాదరిద్రము వాపుకొనియెద నని నిశ్చయించుకొని అట్టివిద్యాప్రభువు లెవ్వరు గల రని విచారింపఁగాఁ బెక్కండ్రు వెలుగోటియాచమనాయఁ డనుమహాపురుషుఁ డున్నాఁడనియు,నాతఁడు విద్వత్పక్షపాతియనియు, నతనియాస్థానంబున ననేకులు విద్వాంసు లున్నా రనియు,పండితుఁడని వినిన వారిని మిక్కిలి గౌరవించు ననియుఁ జెప్పిరి. అట్టివృత్తాంతము దెలిసికొని మనంబున నెంతయు నలరి నాదరిద్ర విచ్ఛిన్న మగుసుకాలంబు సంప్రాప్తమయ్యె నని నిశ్చయించుకొని ఆశాపిశాచ మూత్సహింపఁ జేయుచుండ దూరమని యాలోచింపక రాత్రింబగలు నడిచి యతిత్వరలో నతని ముఖ్యపట్టణమునకుఁ బోతిని.అక్కడి పండితుల నాశ్రయించి వారు నాదైన్యముం జూచి కరుణించి ప్రభునితో విన్నవించి నన్నుం దోడ్కొనిపోయి ప్రభుదర్శనంబుఁ జేయించిరి. నేనునుఁ బ్రభు నాశీర్వదించి ఫలమంత్రాక్షతల నిచ్చి యుండుతఱి జరిగినవృత్తాంతంబు జెప్పుటకు సిగ్గును దుఃఖముగల్గుచున్నదని తలవాంచి కన్నీరు నించుచుఁ గొంత తడ వుండిన వెంకన్నకవి యాపండితుం దేర్చి స్వామీ మీయట్టిమహా విద్వాంసు లిట్లు పామరులవలె వ్యాకులచిత్తు లగుట న్యాయమగునా? ధైర్యముఁ బూని యనంతరవృత్తాంతంబు నివేదింపుఁడు. నా కున్న శాంతంబు నంతంబు నందునదియైయున్నది. అనుడు నాబ్రాహ్మణుఁడు కొంత వడికిఁ దేఱి యిట్లనియె.కవివర్యా విద్వత్ప్రభుం డని నేను జూడఁబోయిన నామహామహుఁడు సామాన్యగౌరవప్రపత్తులైనం జేయక యేవచనప్రయోగంబున నే నాయూరుం బేరు నడిగి తెలిసికొని నీ వాంధ్రంబున నెంతవఱకు వ్రేలు పెట్టినావోయీ? అందులో సమస్యలఁ బూర్తిచేయఁగలవా? అని ప్రస్తావింప నారంభించె. అట్టివాక్యములకు నామనం బెంతయు సంచలించుచుండఁ గార్యవాదులకు గర్వముతోఁ బనియే మని నిశ్చయించుకొని యాప్రభున కిట్లు త్తరమిచ్చితిని. నేనాంధ్రపండితుఁడను కాను. సంస్కృత

విద్యాభ్యాసముఁ గొంతచేసియున్నాఁడను. అందలి శాస్త్రములకుఁగాను స్వదేశము వదిలి కాశికిఁ బోయి యిరువది ముప్పది సంవత్సరములు గురుకులవాసముచేసి వానిఁగొంచెము తెలిసికొనివచ్చినాఁడను. వలయునేని మీయాస్థానవిద్వాంసులు నన్ను పరీక్షింపవచ్చును. అని నేను విన్నవింప నామాటలు చెవిఁ బెట్టకయె అబ్బో సంస్కృత పండితులా "తెనుఁగెఱుఁగఁడు సంస్కృతంబుఁ దెన్నెఱుఁగఁడు" అని యుండలేదా! యని యెగతాళి చేయనారంభించె. అంతటితోఁ బోనీయక పో పో యింటికిఁ బోయి కొన్ని దినములు తెలుఁగు చదువుకొని సమస్యాపూరణ మాంధ్రమునఁ జేయఁగల నేర్పు సంపాదించుకొని మఱియు రమ్మని చెప్పి, సదస్యులు వినుచుండఁ బండితవేషములు వేసుకొని యాచనార్థము వచ్చెదు వారి నింతటినుండి మాకడకుం దోడ్కొని రాఁగూడదని సభ్యులకుం దెల్పుచు యాచకుల ననేకనిందావాక్యముల నధిక్షేపించుచుఁ బూటబత్తెమైన నీ' కుండఁ బొమ్మని సాగఁబనిచె. అనంతరము నేను నాకు సంప్రాప్తమైనయవమానదుఃఖంబు మనంబు దహించుచుండ దానిఁ జల్లార్చుకొనుటకుఁగాని దానికిఁ బ్రతీకార మూహించుటకుఁగాని యసమర్థుండనై యుండ నామిత్రులు గొందఱు నన్నుం బోయి జరిగినవృత్తాంతంబు మీయన్నదమ్ములతో విన్నవించిరమ్మని పంచిరి. కావున నీయవమాన దుఃఖము విద్వాంసులు గావున మీతో విన్నవించినఁ గొంత వాయు ననితలంచివచ్చినాఁడను. నాకు మీరకృతపరిచయులుగావున నన్నెఱిఁగించుకొను తలంపుతో వాక్ప్రోదకసమయమున నట్లు మౌనముద్రను ధరియించితిని. అట్టి నాసాహసకార్యమును మెచ్చి నన్ను వెంటఁ గొనిపోయి ఆస్థానంబున మహాపండితుఁడ ననుకొని గర్వించి పండితుల నలయించు యాచమనాయనినమస్యలు బూరించి యితనిగుట్టు బయటఁబెట్టి యాతని నాయెదుట నవమానించిన నాతోఁటి యవమానంబు వాయును. ఇదియ యేఁ గోరువరము. ఇది నాకులభియించు వఱకు నేను మీయిల్లు వదలువాఁడం గాను. నామనోభీష్టంబు సఫలంబుచేయఁదగునని విన్నవించె. అట్టి మాటలు విని వెంకన్నకవి దత్తప్పకవిని రావించి ఆపండితుని వృత్తాంతంబంతయుఁ జెప్పి యితనికి

వచ్చినయవమానం బీతనిదొక్కనిదేకాదు. ఇది మనయందఱదియు న
నగును. ఇట్టియవమానంబులనే యాచమనీఁ డనేకులకుం జేసియున్నట్లు
చిరకాలమునుండి వినుచున్నాము. ఒక్కపరి తగిన వారివలన నతనికిఁ
బండితగౌరవము దెలిసినంగాని యిట్టి ద్రోహచింత యతనికి మానదు.
కావున నీవు మిక్కిలి త్వరతో బయలు వెడలియీపండితుని వెంటం
బోయి యాతనికార్యంబు సానుకూలంబు జేసి రావలయును. అని
యన్నఁగా రనుజ్ఞయియనం గని దత్తప్ప చిత్తమని తనప్రభునికడకుం
జని రామేశ్వరతీర్థయాత్రకుఁ బోయివచ్చెద నని యనుజ్ఞఁగొని నాఁటి
రాత్రియే బయలుదేఱి పండితుని తనవెంటనే యుంచుకొని మఱికొన్ని
దినంబులకు యాచమహీపతి యున్న పట్టణంబునకు వచ్చిచేరెను.

### దత్తప్పకవి యాచమహీపతిసభకుం బోవుట

ఇట్లు వచ్చి దత్తప్పయుఁ బండితుఁడు నొకబ్రాహ్మణగృహంబు
న విడిసి మఱునాఁ డుచితవిధంబున నాంధ్రకవి వచ్చియున్నాఁ డని యాచ
భూపాలునకు వర్తమానంబుపంచె. అవృత్తాంతము విని యాచమనీఁడు
తనకడ నున్న పండితు లావఱకె నేర్పఱిచియుంచినదుష్కరప్రాసయుక్త
ము లగుననేకపద్యసమస్య లున్నగ్రంథమును సిద్ధముగా నుంచికొని కవీ
శ్వరుండు రావచ్చు నని యాజ్ఞనొసంగె. అదత్తప్పకవియును బండితుని
వెంట నిడుకొని ప్రభుదర్శనమునకుఁ బోయె. అపుడు యాచమనాయఁడు
తూఁగుటుయ్యాలపయి నుండి యితఁడేనా ఆంధ్రకవి యని తనసన్నిధానవ
ర్తులతోఁ బ్రస్తావింప వా రగునని తెల్పిరి. అట్టివార్తవినియైన నాకవికి దండ
ప్రణామాదుల నొసరింపక కూర్చుండుటకైన సెలవొసంగక ఆకవి యూ
రుం బేరును దెలిసికొనునుద్దేశంబునఁ గొన్ని సంప్రశ్నంబులు చేయనారం
భించె. దానిం దెలిసికొని క్రుద్ధుండై దత్తప్పకవి నిలువంబడియే యుండె.
అపుడు యాచమనీఁ డితఁడేనా కవియనె. ఆమాట విని దత్తప్పకవి పరీక్షిం
చు పండితప్రభుఁ డున్నచో నీతఁడే కవి యగు నని తెల్పె. దానికి యాచమ
నీఁ డల్లి 'యేయూరో' అని ప్రశ్నించె. దానికి సమాధానముగా 'తెట్టు'
అనుడు 'మఱో' యని ప్రశ్నించె. దానికి సమాధానముగా దత్తప్ప
'కుమారకృష్ణవసుధేశ్వరనందనరాజ్యలక్ష్మికిం బట్టు' అనుడు 'మఱో'
'మఱో' అని యడిగెడు యాచమనీని ప్రశ్నములకు సమాధానముగా

నాపద్యమంతయుఁ బూర్తి చేసిన దత్తప్పకవిం జూచి యాచమనీఁడు దిగ్గన లేచి యుయ్యాలపైనే కూర్చుండి కవిం బరీక్షించు ప్రభుఁడిచటనే యున్నాఁడు. పరీక్షించిన నిల్చుకవి యుండఁగలఁడో యను సంశయము తీఱి నంగాని ప్రభుఁడు మెచ్చఁడని పల్కి యాచమనీఁడు తనకడ నున్న సమస్యల నొక్కొక్కదానినే దత్తప్పకవికి నీయఁ బ్రారంభించె. వా నిచ్చినంత వెంటనే దత్తప్పకవి పూర్తిచేయుచు వచ్చె. (తెలుఁగు సమస్యల పుస్తకములోని పెక్కుసమస్య లీదత్తప్పకవిపూరణములే యని వాడుకొనం బడు.) అట్టి దత్తప్పకవిసమయస్ఫురణమునకు నాశుధారకు నచ్చెరువం దుచు యాచభూమీశుఁడు దుష్కరప్రాసయుక్తము లగుసమస్యల నీయం బోడంగె. వానింగూడఁ బూర్తిసేయుదత్తప్పకవిం జూచి యాచమనీఁడు తనకు భంగపాటు కల్గు నను భయంబునఁ దనకడ బ్రహ్మాస్త్ర సమముగా నిల్పియుంచిన

'గుండ్రాతికిఁగాళ్లు వచ్చి గున గున నడిచెన్'

అను సమస్య నిచ్చె. అక్కడి కాతనిసమస్యాసామగ్రి ముగిసె నని దత్తప్ప యూహించి యిఁక నాతని వెఱపింపసమయ మని దాని నీక్రింది విధంబునఁ బూర్తిచేసె. ఎట్లన్నఁ రు——

"క. ఉండ్రా యాచిరిపులాధమ(దురాత్మక, యిండ్రాప్రాసంబు కవుల కియ్యందగునా
అండ్రాముకరుణచేతను, గుండ్రాతికిఁ గాళ్లు వచ్చి గున గున నడిచెన్."

అని యిట్లు చెప్పిన విని యాచభూవరుఁ డుయ్యాల డిగ్గనుఱికి దత్తప్పకు నమస్కరించి కూర్చుండుటకు సెలవొసంగినఁ జూచి దాని నంగీకరింపక కోపాటోపంబున దత్తప్ప "తిట్టుదునా" అని యొకపద్యమారంభించునట్లుగాఁ బలికె. దాని విని యాచభూపాలుఁడు వలదు వల దని దత్తప్పకవిచేతులు పట్టుకొని బ్రాహ్మణుఁడలుగఁదగునే సైరింప వలయును. అని యాతని వేడుకొని కూర్చుండఁబెట్టి చీనిచీనాంబరములు తెప్పించి యాతని కీయఁగ నెప్పె. అట్టివానిలో నొకదానింబట్టి అతనియెదుటనే దత్తప్ప ముక్కలుముక్కలుగాఁ జింప నారంభించె. దానిం జూచి యేమి స్వామీ యిటులొనరించుట న్యాయమా ? యని యడుగుయాచమనీనిం జూచి దత్తప్ప యిట్లనియె.

“క. యాచమహీపతివలువలు, గోచులకేఁ గాక కట్టుకోకల కగునా
కేచెర్లగోత్రమందున, నీచుఁడు జన్మించి వలువ నీఱుగఁ జెఱిచెన్. '

అని యిట్లుత్తరంబిచ్చిన కవికిఁ గల్గిన కోపకారణం బారాజడిగిన నాతం డిట్లనియె. ప్రభువులకు విద్యావిశేషంబులుండవలయు నని యనుటకుఁ గారణము తనుకడ కరుదెంచు విద్వాంసుల యోగ్యతల దెలిసి వారికి యథోచిత సత్కారంబులఁ జేయుటకుఁ గాని వారు స్వయముగ కష్టగట్టి పండితుల నలయించుటకుఁ గాదు. ఒక్కొకవిద్యలోఁ బెక్కేండ్లు గడపి గురుకులవాసంబుచేసి విద్యనేర్చిన పండితోత్తములఁ బరీక్షింప దానిలోఁ గొంచెము దీనిలోఁ గొంచెము తెలుసుకొనినవారితరంబగునే? అట్లుగాఁ దనబలంబు నెదిరిబలంబు నెఱుఁగక పండితుల నలయింప వారికాగ్రహంబు రాక అట్టివారియెడ ననుగ్రహం బేలకలుగు? 'సాధుసజ్జనసంతాపాత్క్షమాశ్చర్యం కులక్షయే' అనియుండుటం జేసి యట్టివారు పడినపరితాపం బూరక పోవునా? అట్టి పరమసాధులలో నొక్కండును వట్యాస్త్రపారంగతుఁడునగునీపండితశిఖామణి వచ్చినపుడీ యాస్థానములో నాతనికిఁ గల్గినయవమానంబే యిప్పుడీప్రత్యవమానకారణంబు. ఆ పండితుఁడు దయాళుండు గావున నీసంస్థానంబున కొకకీడు తలంపక నీవలనం గల్గినయవమానమునకు సమమగునవమానంబే కోరి నన్నుం బిలిచి తెచ్చె. ఆకారణంబుననే నంతకు నోనాడనైతి. కావున నీవుచేసినది మహాపచారంబగు. నావిప్రశిఖామణిం బ్రసన్నుం జేసికొమ్మనుడు రాజుపశ్చాత్తప్తుండై ఆపండితశిఖామణి దిక్కుమొగంబై యిట్లనియె. ఎఱిఁగియో యెఱుఁగకయో మీయెడ మహాపరాధంబు గావించితి. దానిని సహించి నన్నుఁ గరుణింప నీకవిశిఖామణిం బ్రసన్నుం జేయుఁ డనుడు నాతండు మహాప్రభూ మేమందఱ మీయాశ్రయమ్ముఁ గోరినవార మవుటం జేసి యిక్కడ జరుగుచుండుదురాచారంబు నివారింప నిట్లొనర్చితిమిగాని మీయెడఁ గోపంబు లేదు. అట్టియుద్దేశంబుతోడ నీదత్తప్పకవిశిఖామణియు వచ్చియున్నాఁడు. అతఁడు నైసర్గికముద దయాళుఁడు నీయెడ నొకకోపంబుదెచ్చుకొనునే? యనుడు రాజాయిర్వురఁ బూజింతు నని యిర్వురకును విశేషబహుమతు లొసర్చె. అప్పుడు దత్తప్పలేచి తనబహుమతులఁ గూడ నాపండితున కిచ్చి రాజుకడ ననుజ్ఞాతుం డై బండితుని వెంట నిడుకొని స్వ

గ్రామంబునకుఁ జనియె. ఇట్లు వచ్చి వెంకన్నకవితో నా సభలో జరిగిన వృత్తాంతమంతయుఁ దెలుప నాతం డాపండితుని సంతసించితివిగదా యని యడిగిన నాతండు బ్రహ్మానందభరితుండై నేను పట్టినది చింతకొమ్మ కాదా? నా కొక్కలోపముండునా యనిచెప్పి వారిరువుర వలన ననుజ్ఞాతుండై నిజనివాసగ్రామంబునకుఁ జనియె. ఇది వెన్నెలకంటివారి దౌహిత్రు లగు మోచెర్లవారివృత్తాంతము.

## కృతిపతి వంశావళి.

ఈవిష్ణుపురాణమునకుఁ గృతిపతి రావూరి బసవ భూపాలుని కుమారుఁ డగు రాఘవభూపాలుఁడని వక్కాణించితిమి. అం దాతని వంశావళి విపులముగా వివరింపఁబడినది. దానిసంగ్రహము నీక్రిందవివరించెదను.

శూద్రజాతి అందు అన్న వేమభూపాలుఁడు పుట్టినపంటకులములో

రావూరి లింగభూపాలుఁడు
- పేరమరెడ్డి.
  - తమ్మారెడ్డి.
    - బసవరెడ్డి.
      (1) { ఇతనిభార్య అల్లూరి యనవేమారెడ్డి కూఁతురు అమ్మలాంబ. }
      - రాఘవరెడ్డి. (2) (కృతిపతి).
      - తమ్మారెడ్డి.
      - లక్ష్మణరెడ్డి.
    - అన్నయ్య.
    - లింగారెడ్డి.

బసవరెడ్డిభార్యతండ్రివంశము.

అతనిపేరు అల్లూరి అనమారెడ్డి (పాకనాటిసీమలో)
- వెమ్మమహీనాయకుఁడు.
  - అమ్మలాంబ (బసవరెడ్డిభార్య)
  - అన్నయ్య
  - వల్లభయ్య
  - చింతయ్య
  - గంగయ్య.

(1) పైవారిలో నొకటి రెండుగుర్తులు గలవారిచారిత్రము కొంత దెలియఁదగియున్నది. అందు మొదటివాఁ డగుబసవరెడ్డి కటకాధిపుఁడగు గజపతిరాజుచేత పల్లకి బహుమానము నందె. కర్ణాటప్రభునిచేత ననేకరాజ్యభోగముల గైకొనియె. మలకవజీరులను సాధించె. తెలగాణ (probably Telingana) భూములలోనుండెడు మన్యరాజులచేత పన్నులు గ్రహించె. దీనిం దెల్పుపద్యమును వివరించెదను.

"సీ. కటకాధిపతి యైనగజపతిరాజుచేఁ, బ్రతి లేనిపల్లకిపదవి నందె
మహిమచేఁ గర్ణాటమండలాధిపుచేతఁ, గడలేనిరాజ్యభోగములఁ గాంచె
పాత్రిషపారవమున రాజిల్లి మెఱయఁగా, మలకవజీర్ల కుమ్మలిక జేసెఁ
దెలగాణభూములఁ గలమన్నెవారిచే, బలకంతముగను గప్పములు గొనియెఁ
తే. జాటుఘాటీనిరాఘాటఘోటకావ, లీఖురోద్ధూత నిబిడధూళీవిలిప్త
మండితాశాంగనాకుచమండలుండు, బాహుబలశాలితమ్మయబసవవిభుఁడు."

పై బసవారెడ్డియు నాతని తమ్ములు శిష్యులుగాఁ గల్గిన యొక మహాత్ముఁ డుండెననియు నాతనిపేరు పంగులూరి యన్నయ యనియుఁ గలదు. అతనికి 'ఘోడియరాయ' బిరుదు గలదు. అట్టిపంగులూరి యన్నయాచార్యుని కటాక్షము నంది పై బసవరెడ్డి సమస్తైశ్వర్యముల నందెనని యున్నది. ఈపంగులూరి యన్నయ మిగుల విశేషజ్ఞుఁ డని నూరయకవి యాతనిం గూర్చి చేసిన వర్ణనంబట్టి యూహించవలసియున్నది. ఆవర్ణన యెట్లున్నదనఁగా :—

"క. వీరుల కెల్లను గురుఁడై, రారాజులపూజలింగనై సుకవిమనః
పూరితఘనవితరణవి, ద్యారసికుఁడు పంగులూరి యన్నయ వెలసెన్.
సీ. వినుతనానావేదవేదాంగశాస్త్రిపు, రాణేతిహాసనిర్వాహకుండు
శైవవైష్ణవసౌరశాక్తగాణాపత్య, మంత్రతంత్రాగమమర్మవిదుఁడు
పరమపావనపరాపశ్యంతి మధ్యమా, వైఖరీమార్గప్రవర్తకుండు
ఆధారమణిపూరకాది పంకజపత్త్రి, నిత్యప్రపంచదళాతురుండు.
తే. కావ్యనాటకాలంకారభవ్యమూర్తి, పరమగురుసంప్రదాయప్రభావనిరతుఁ
డగుమఘోడియరాయవిఖ్యాతినొందె, పంగులూరన్నయార్యుండు బ్రహ్మవిదుఁడు."

అనియున్న యీస్తోత్రముంబట్టి యితఁడు శివాద్వైతిగాఁ గాన్పించు.

(౨) రాఘవరెడ్డి విశేషములు.

ఈ రెడ్డి తనతండ్రివలెఁ గాక తాను వైష్ణవమతప్రవిష్టుఁడై యొకవైష్ణవుని తనకు గురువుం జేసికొనియె. అతనిపేరు సింగరాచార్యుఁడు. ఆసింగరార్యుఁడు తిరుమల తాతాచార్యుని మనుమఁడని చెప్పంబడినది. ఆ యిర్వురినడుమ నున్న వారిపేరులు చెప్పంబడలేదు. మొదట సింగరాచార్యులవిశేషములం దెల్పి యనంతరమతనిం గూర్చి ఆగ్రంథములోనే అచ్చటచ్చట వివరింపఁబడినపద్యములం జూపెద. ఎట్లన్నను.

"క. ఆతనియాచార్యుఁడు వి, ఖ్యాతయశోధనుఁడు సింగరార్యుఁడు సెలసెఁ
భూతలమునందుఁ దిరుమల, తాతయవంశమున సకలధర్మజ్ఞుం డై.

సీ. వేదాంతవిద్యావివేకి షడ్దర్శన, పారంగతుఁడు పరాపరరహస్య
వేది బ్రహ్మాండాది వివిధ పురాణజ్ఞుఁ డసమానధర్మశాస్త్రాభినేయ
కుశలుఁడు పరమార్థకోవిదుఁ డఖిలాధ్వ, రక్రియానిపుణుఁడఁక్ర కావ్య
నాటకాలంకారనానాకళాభిజ్ఞుఁ, డుభయభాషాకవితోజ్జ్వలుండు

తే. పరమవైష్ణవమార్గతత్పరుఁడు కీర్తి, ధనుఁడు తిరుమలతాతయ్యమనుమఁ డైన
సింగరాచార్యు గురువుగా సేవజేసి, రమణఁ జెలువొందె బసవయరాఘవుండు."

షష్ఠ్యంతములలో నీరాఘవరెడ్డి తిరుమలతాతాచార్యుని శిష్యుఁడని యేయున్నది. ఎట్లన్నను:—

"క. తిరుమలతాతయదేశిక, వరశిష్యున కనుపమేయవైచుష్యునకుఁ
పరభూపాలతమస్సం, హరణాదిత్యునకుఁ బల్లవాదిత్యునకున్."

అష్టమాశ్వాసాంతమున మఱియొకపద్య మున్నది. అందు సింగరార్యుఁడు తిరుమలతాతాచార్యవంశ్యుఁడుగా వివరింపఁబడె. ఎట్లన్నను:—

"క. తిరుమలతాతయవంశా, భరణశ్రీసింగరార్యపరమగురుకృపా
పరిపూర్ణహృదయయాచక, వరచేతఃకమలినీదివాకరమూర్తీ."

ఈ శింగరాచార్యుఁ డేకాలపువాఁడో తెలిసిన నతనిశిష్యుం డగు రాఘవరెడ్డికాలంబును, అతనిపైఁ గృతిసచ్చిన వెన్నెలకంటి సూరన కవికాలమును విస్పష్టంబగును. ఇదివఱలో నావలనఁ బింగళిసూరన

చారిత్రములోఁ బ్రచురింపంబడిన తిరుమలతాతాచార్యుని వంశావళిం బరీక్షింప నందు సింగర్యనామము లభియింపలేదు. తత్పర్యాయ నామ్ముఁడగు నృసింహాచారి మొదటివాఁడే. అందులో ముప్వురు తాతాచార్యనాము లున్నారు. వారీసింగరార్యునితరువాతి వారు. అందు మొదటియతనిమనుమనిపేరు శ్రీనివాసాచార్యుఁడు. రెండవయతనిమను మనిపేరు సుదర్శన లేక సుందరాచార్యులు. మూఁడవయతని మనుమ నిపేరు వేంకటాచార్యులు, ఈ ముప్వురిలో నెవ్వరైన నీసింగరాచార్యాప రనాము లుండిరేమో తెలియదు. ఉన్నచో దానిం దెలుపుగ్రంథసామ గ్రిలేమ. మొదట నృసింహాచార్యులేమో అను సంశయము మఱియొక స్థలములోఁ దీర్చెదను. వియాస్థానమార్గమునకు విశేషాధారములు లేవు గావున దీనింబట్టి రాఘవరెడ్డి యొక్కయు, నత కవి యగువెన్నెలకంటి సూరనకవియొక్కయుఁ గాలము ధైర్యముతో నిర్ణయింపఁ జాలను. కావున దీని న్వదలి మార్గాంతరమున నీతని కాలము నిర్ణయింపఁజూచెదను. అట్టిదానికిఁగాను గ్రంథారంభంబున నచ్చటచ్చట వివరింపఁపడిన కొండవీటిరెడ్ల వృత్తాంతము పరిశీలించవలసియున్నది. దానిం దెలుపుటకు సూర కవి కొన్నికొన్ని వాక్యములను వివరించె. వాని నీక్రింద నేకముఖముచేసి చూచెదము గాక. అవి యెట్లనఁగా:—

→ప్రాచీను లగురెడ్లవిషయము.←

(1) "క. అనవేమమండలేశ్వరుఁ, డనఁ నల్లయవీరభద్రుఁడును మొదలుగఁ గ
లిగిన తొంటిరెడ్డిరాజులు, ఘనకీర్తులఁ గనిరి కృతిముఖంబున ననుచున్."

అనుదీనింబట్టి పైరెడ్డిరాజుల యనంతరకాలములో నీరాఘవరెడ్డి యున్నట్లు తేలును. పై అల్లయ వీరభద్రరెడ్డి శా. స. ౧౩౪౦ సమీప కాలములో నున్నాఁడు. కావున నీరాఘవరెడ్డి తదనంతరకాలమువాఁ డగుట నిశ్చయమే. వారిరువురకును నడుమ యెంతయవధియున్నదో తేలవలసియున్నది. దానికై మఱికొన్ని యాధారముల నరయుదము.

2. పైవెన్నెలకంటి సూరయ్యకవితాత యగుసూర్యకవింగూర్చి

వివరింపుచు నాతఁడు 'వేమయయన్న ప్రోతభూపాలునకు' సత్పౌత్రుఁడుగా బంధము లొసంగెనని వివరించె. ఆపద్యము మొదటనే వివరింపఁబడినది. పై వేమయయన్న ప్రోతభూపాలుఁ డెవ్వఁడనుశంకఁ బొడముచు. రెడ్డిరాజులలో వేమయనాములు పెక్కండ్రు గలరు. వారిలో శ్రీశైలములో నున్న పాతాళగంగకు సోపానములు కట్టించిన వేమభూపాలుఁడు ప్రసిద్ధుడు. ఇతఁడే కొండవీటిసీమలోఁ బ్రభుత్వము చేసిన రెడ్డిరాజులలో మొదటివాఁడు. ఇదియె రెడ్లసంస్థానములలోఁ బ్రధానమగునది. పై రెడ్డివేమభూపాలున కిద్దరు పుత్త్రులు గలరు. వారిలో మొదటి యతనిపేరు అనప్రోతరెడ్డి. రెండవ యతనిపేరు అనవేమారెడ్డి. పైపద్యములలో వివరింపబడిన రెడ్డిరాజు "వేమయయన్నప్రోతభూపాలుఁడు" వేమభూపాలుని పెద్దకుమారుఁడు. వెన్నెలకంటిసూర్యకవి యీ వేమయయన్నప్రోతభూపాలునిపైఁ గృతులిచ్చినట్లుగా నతని మనుమఁడగు సూరనకవి పద్మపురాణమున వివరించె. విక్రమార్కచరిత్రములోని యీక్రిందిపద్యముఁబట్టి పై వెన్నెలకంటి సూర్యకవి పై వేమభూపాలునిపేరఁ గూడఁ గృతినిచ్చినట్లు కాన్పించు. ఆపద్య మెట్లున్నదనఁగా:—

"ఉ. వెన్నెలకంటిసూర్యుఁడు వివేకగుణాఢ్యుఁడు వేదశాస్త్రసం
పన్నుఁడు రెడ్డివేమనరపాలునిచేత మహాగ్రహారముల్
గొన్న కవీంద్రకుంజరుఁ డసంశితతేజుఁడు పెద్దతండ్రిగా
సన్నుతి గన్న సిద్ధనకు సంతతదానకళావినోదికిన్."

దీనింబట్టి చూడఁగా సూర్యకవి వేమారెడ్డికాలములోఁ గూడఁ గృతినీయఁదగినవయస్సులో నున్నట్లు తేలినది. ఇచ్చట పై వేమారెడ్డి వంశావళిని ముందు వివరించెదను అదెట్లన్నను:—

పంటకులము వేమారెడ్డి.

- అన్నవోతరెడ్డి
  - మల్లాంబ.
    - నితల్లీదేవి (భర్త అల్లాడువీరభద్రారెడ్డి.)
  - కుమారగిరిరెడ్డి.
- అనవేమారెడ్డి

పై వేమారెడ్డికిని, అన్న పోతరెడ్డికిని గూడ వెన్నెలకంటిసూర్యుఁడే ఆస్థానకవి. కావున నతఁడు వేమారెడ్డికంటెఁ జిన్నవాఁడు నన్న పోతరెడ్డికంటెఁ బెద్దవాఁడు నై యుండవలెను. సూర్యకవిపుత్త్రుఁ డగునమరయామాత్యుఁ డన్నపోతభూపాలునికంటెఁ జిన్నవాఁడు నాతనిపుత్త్రుం డగుకుమారగిరిరెడ్డికంటెను పుత్త్రికయగు మల్లాంబకంటెఁ బెద్దవాఁడునగు. అటులనే అమరనామాత్యుని పుత్త్రుఁడగుసూర్యకవి మల్లాంబకంటెఁ జిన్నవాఁడును తత్పుత్త్రిక యగునితల్లీదేవికంటెఁ బెద్దవాఁడు నై యుండవచ్చును. కాని నితల్లీదేవి భర్త యగు నళ్లయ వీరభద్రరెడ్డివయస్సెంతో మనకుఁ దెలియదు గావున నతఁడు సూరనకంటెఁ బెద్దవాఁడో లేక ఆయుర్వారునొకయీడువారో యూహింపవీలులేదు. ఆవిషయమెట్లున్నను వీరభద్రరెడ్డి అనంతరకాలములోఁ గృతినందినరాఘవరెడ్డికంటె నాతఁడు పెద్దవాఁ డని చెప్పుటకు సందియ ముండదు. ఈ వీరభద్రరెడ్డియనంతర మతని తమ్ముం డగుదొడ్డయరెడ్డి అధికారము చేసినట్లుగా నాతనివలనఁ జేయుంబడినకొంకుదుటి తామ్రశాసనముంబట్టి కాన్పించు. దాని కాలము శా. స. ౧౩౪౨. ఇట్లుగా నీతఁడు రాజ్యము చేసినట్లున్నను రెడ్లసంపూర్ణాధికారము వీరభద్రరెడ్డితోనే ముగిసినట్లు కనుపించు. పై రాఘవరెడ్డి వీరభద్రరెడ్డి యనంతరము రాజ్యము చేయుచున్న దొడ్డారెడ్డిపేరు స్మరియింపక అతనియన్న వీరభద్రరెడ్డిపేరుమాత్రమే స్మరియించుటచే నతఁడు దొడ్డారెడ్డికాలీనుఁ డని యూహింపఁదగియున్నది. అప్పటికిఁ గృతినందినరెడ్డిరాజులలోఁ జివరవాఁ డీవీరభద్రరెడ్డియే కావున నళ్లయ వీరభద్రరెడ్డి మొదలగు తొల్లిటిరెడ్డిరాజులు కృతిముఖంబుననే కీర్తులు సంపాదించినట్లు రాఘవరెడ్డి వచించె. ఈ వీరభద్రరెడ్డి పైఁ గృతినిచ్చినవాఁడు శ్రీనాథుఁడు కావున నీశ్రీనాథుఁడును వెన్నెలకంటి సూరనకవియు సమకాలీనులు కాక తప్పదు. అటుకావున సూరనకవి శ్రీనాథుని ప్రాచీనాంధ్రకవులలోఁ జేర్చి వర్ణించనట్లు కాన్పించదు.

## → రాఘవరెడ్డి నివాసస్థానము. ←

ఇది గుడ్లూ రనునామంబునఁ బిలువం బడుచుండును. ఈగ్రామముయొక్క విశేషము లొకపద్యములో నీగ్రంథములోనే వివరింపఁబడినవి. ఎట్లనఁగా :—

“ సీ. గౌరీసమేతుఁడై గిరిమతో నేవీట, నేపార నీలకంఠేశ్వరుండు
వారాశికన్యతో వర్తించు నేవీట, గిరిభేదినుతుఁడై కేశవుండు
రోగినీసహితయై యొప్పారు నేవీటఁ, బసిఁడిపోలేరమ్మ భవునికొమ్మ
పాపవినాశనై ప్రవహించు నేవీట, మన్నేఱు మిన్నేటిమాఱటగుచుఁ
గుంజరములు వేయుఁ గొలువంగ నేవీటఁ, గొడగుచక్రవర్తి పుడమి యేలె
నట్టిరాజధాని నై యొప్పు గుడ్లూరి, కొనర నేలుచుండి యొక్క నాఁడు. ”

ఈ గుడ్లూరు గ్రామమే హరివంశమును రచియించిన యెఱ్ఱాప్రగడ నివాసస్థలము. దాని నాతఁ డీక్రింది విధంబున వర్ణించి చెప్పె.

ఆరణ్యపర్వశేష మగునాశ్వాసములలోఁ జివరనున్న
యాశ్వాసము చివరసీసపద్యము.

“సీ. భవ్యచరిత్రుఁ డాపస్తంబసూత్రుఁడు, శ్రీవత్సగోత్రుండు శివపదాబ్జ
సంతతధ్యానసంసక్తచిత్తుఁడు సూర, నార్యునకును బోతమాంబికకును
నందనుం డిల పాకనాటిలో నీలకంఠేశ్వర స్థానమై యెసకమెసఁగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు, ధన్యుఁడు ధర్మైకతత్పరాత్ముఁ
డెఱ్ఱనార్యుఁడు————”

ఇట్టిపద్యములంబట్టి పై గుడ్లూరుగ్రామము పాకనాటిసీమలోనిదని తేలినది. అది పై రావూరి రాఘవరెడ్డికి ముఖ్యపట్టణము. ఈ రాఘవరెడ్డియింటిపేరు రావూరివా రని యుండుటచేతను, రావూరను నొక గ్రామముండుటచేత నతని కాఁపురస్థలము రావూ రని కొందఱభిప్రాయపడుదురు. అది సరికాదు. గుడ్లూరనునది కొడగుచక్రవర్తికి ముఖ్యస్థానమనియు నది తదనంతరమున నీరాఘవరెడ్డిస్వాధీనమైనట్లుగా నున్నది. కావున నీ రాఘవరెడ్డి గుడ్లూరి సంస్థానాధిపతియని నిర్ణయించెదము. పైకొడగు చక్రవర్తి యెవరో దానిఁ దెల్పుగ్రంథసహాయములు

లేవు. పూర్వకాలములో గుడ్లూరు మొదలగుసీమలు అదొండుఁ డను చోళచక్రవర్తి పరిపాలనలో నున్నట్లు తెలియవచ్చును. అతనికే యీ కొండగుచక్రవర్తి యనుపేరీదేశస్థులవలన వాడఁబడెనేమో తెలియదు.

## కవిచరిత్రపై విమర్శనము.

బ్ర. కందుకూరివీరేశలింగము పంతులవారు తమ 'ఆంధ్రమధ్యకవుల' చరిత్రములో (రెండవభాగములో) నీవెన్నెలకంటి సూరకవి కాలము మఱియొకటిగా నిర్ణయించిరి. వారికిని మాకును పైవిష్ణుపురాణములోని యాధారములే కాని వేఱుసామగ్రి శోఁబనిలేదు. కావున వారు నిర్ణయించినకాలము సరియైనది యవునా కాదా యని పరిశీలించవలసియున్నది. అట్టిపని చేయుటకుఁ బూర్వ మాంధ్రదేశములోని వివిధఖండములను బాలించిన రెడ్లవంశము లెన్నియున్నవో, వారిలో వారికిఁగలసంబంధము లెట్టివో చూపవలసియున్నది. ఆవివరము దేశచారిత్రోపయోగముగా నీవఱకే నావలన మఱియొకసందర్భములోఁ గొంచెము విపులముఁగా వివరించఁబడియున్నది. దాని సంగ్రహమైన నిచ్చోఁ వివరింపకున్న నీ విష్ణుపురాణము కృతినందినరెడ్లవంశావళిలో వివరింపఁబడిన యితర రెడ్లసంబంధములు తేలవు కావున నావంశావళుల నిట వివరించెదను.

౧. ఆంధ్రహరివంశములోని యొక రెడ్డివంశావళి.

పంటకులములో

వేమభూపాలుఁడు.

- కోమటిపోలన్న
  - మాచన్న
  - అన్న వేమభూపాలుఁడు. (కృతిపతి)
    - పోతయరెడ్డి. (వేమాంబ)
    - కోమటిపోలయ.
  - అన్నంరెడ్డి.
  - మల్లారెడ్డి.

## ౨. ఆంధ్రహరివంశములోని మఱియొక రెడ్డివంశావళి.

దొడ్డయరెడ్డి.

- పోతయరెడ్డి.
- చిన్నయ్య.
  - సూకారెడ్డి.
- అన్నమ్మ. మొదటి కోమటి పోలని భార్య.
- నాగయ్యరెడ్డి.

## 3. ఆంధ్రకాశీఖండములోని రెడ్డివంశావళి. పంటకులములో

దూవూరి పెరుమాళ్లరెడ్డి (భార్య అన్నమాంబ).

- అల్లయరెడ్డి.
- పెద్దకోటిరెడ్డి.
- అన్నపోలరెడ్డి.
- దొడ్డయరెడ్డి (భార్య అన్నాంబ)
  - ప్రోలయ లేక అన్నప్రోలయరెడ్డి.
  - కోటభూపరెడ్డి.
  - అల్లాడభూపతి. అనవేమారెడ్డి పౌత్రి వేమాంబను పెండ్లాడినవాఁడు.
    - ౧ వేమభూపాలుఁడు. {ఇతని ముఖ్యపట్టణము రాజమహేంద్రవరము. కృతిపతి అన్న.}
    - ౨ వీరభద్రారెడ్డి. {కాటయవేమారెడ్డి కూఁతురనితల్లియను నామెను పెండ్లాడె. కృతిపతి.}
    - 3 దొడ్డారెడ్డి. శా. స. ౧3౫౨.
    - ౪ అన్నమరెడ్డి
- చిన్నకోటిరెడ్డి.

## ౪. మల్లవరముశాసనములోని రెడ్డివంశావళి. పంటకులములో

వేమారెడ్డి. {శ్రీశైలములోని పాతాళగంగకు సోపానములు కట్టించె.}

- దొడ్డాంబిక ఈమె కుమారుఁడు కాటయవేమారెడ్డి.
- అనపోతరెడ్డి.
- అనవేమారెడ్డి. ఇతనికి కర్పూరవసంతరాయబిరుదు గలదు.
  - మల్లాంబ కాటయవేమారెడ్డి భార్య

కుమారగిరిరెడ్డి

కొండవీటిలోఁ గులాగతమైన రాజ్యమునందె. ఇతని బాల్యములోఁ గాటయ వేమారెడ్డి మంత్రిగానుండి వ్యవహరించె. దానికిఁ బ్రత్యుపకృతిగా నీకాటయ వేమారెడ్డికి కుమారగిరిరెడ్డి రాజమహేంద్రవరము మొదలగు తూర్పుదేశము బహుమానమిచ్చెను.

౫. మల్లవరశాసనములోని రెండవ రెడ్డివంశావళి.

కాటయరెడ్డి.
|
మారయరెడ్డి.
|
కాటయరెడ్డి. { ఇతనిభార్య వేమారెడ్డి కొమార్తెయు అనవోత అనవేమారెడ్లతోఁబుట్టువగు దొడ్డాంబిక }
వేమారెడ్డి { ఇతనిభార్య అన్నవోతరెడ్డి కుమార్తెయు కుమారగిరిరెడ్డితోఁబుట్టువు మల్లాంబ }
ఈమె శాసనం శా. స. ౧౩౩౩.

౬. అమరుకకావ్య వ్యాఖ్యాత యగు రెడ్డివంశావళి.

శ్రీశైలములో పాతాళగంగకు సోపానములు కట్టించిన వేమారెడ్డికి జ్యేష్ఠసోదరుఁ డగుమాచభూపాలుఁడు.
- కేడిపోతరెడ్డి.
- కోమటిరెడ్డి.
  - వేమారెడ్డి (వ్యాఖ్యాత)
  - మాచరెడ్డి.
- నాగారెడ్డి.

ఇట్లుగాఁ బ్రస్తుతములోని విష్ణుపురాణ వంశావళిగాథలకు నవసరముగా వలయు రెడ్డివంశావళులమాత్రము వివరించినాఁడను. పైవానింబట్టి "వేమయ అన్నవోతభూపాలుఁడు" "అల్లయవీరభద్రరెడ్డి" ఎవరో స్పష్టము కాఁగలరు.

ఇట్లుండఁగా నాంధ్రకవిచరిత్రములో ౮౩ వ పుటలో "తాను అనవోతరెడ్డికి ప్రబంధము లొసఁగిన వెన్నెలకంటివారి వంశజుఁడననియు,

వెన్నెలకంటి సూర్యునిమనుమఁడ ననియు, వేఱువేఱుగాఁ జెప్పుకొనుట చేత నీతఁ డనవేమ రెడ్డికాలములో నున్న సూరన్నకు మనుమని మనుమఁ డగుట స్పష్టము. మొదటిసూరన్న కైదవతరమువాఁడగుటచేత నిరువదకును నూఱుసంవత్సరములకంటె నెక్కువకాలవ్యత్యాస ముండి యుండవలెను.'' అని యున్నది. దీనిలో నాలోచించవలసినది వెన్నెలకంటి సూర్యుఁ డనునతఁ డెవ్వఁడని? అతనికిని విష్ణుపురాణకవి యగుసూరన కవికిని గలసంబంధ మేమి? దీనికి వీరేశలింగముపంతులుగారు కనిపెట్టిన మార్గము గ్రంథాధారము లేనిదై యున్నది. "వెన్నెలకంటివారిలో" ననియున్న దానికి వెన్నెలకంటి వంశమందుఁ బుట్టిన కవీశ్వరు లందఱిలో నని యర్థమూహించిరి. అంత విశేషార్థము దానిలో నాలోచించవలసిన పనిలేదు "వెన్నెలకంటివారిలో" ననఁగా వెన్నెలకంటివా రనుగృహనామము గలవారిలో 'వెన్నెలకంటిసూర్యుఁ డనునతనిమనుమఁడ నని' చెప్పినాఁడు. ఈసూర్యకవి "వేమయఅన్నపోతరెడ్డి" పైఁ గృతినిచ్చినట్లుగా నీవిష్ణుపురాణములోను అంతకుముందే వేమయభూపాలునకుఁగూడ గృతినిచ్చి యగ్రహారములు గొనియె నని విక్రమార్కచరిత్రములో నుండఁగా నా యిద్దరు వేఱువేఱు కవీశ్వరు లనియు వారికీవిష్ణుపురాణ గ్రంథకర్తయగుసూరన మనుమనికి మనుమఁడనియు నిశ్చయించి అది స్పష్టమే యని పంతులవా రెట్లు నిష్కర్షించిరో తెలియదు. ఇట్టి నిష్కర్షకు పంతులవారికిఁ గలయాధారములు లేనిమాట స్పష్టమే.విక్రమార్క చరిత్రములోని పద్య మీవఱకే వివరించితి. కావున నీ వెన్నెలకంటి సూర్యకవి అనపోతభూపాలునిపైనేగాక అతని తండ్రి యగువేమభూపాలుని పైఁగూడ కృతియిచ్చినట్లు కానుపించును. దీనిఁబట్టి యీసూర్యకవి వేమభూమీశుని కాలములో బాలుఁడై యున్నట్లును, అతని కుమారుని కాలమునాఁటికి వార్ధకమం దున్నట్లును గానుపించు.అటులనే సూర్యకవి కొడుకుకొడు కగునీసూరనకవి వేమభూపాలునికొడుకు అతనికొడుకగు కుమారగిరి రెడ్డికాలములో బాలుఁడై యున్నట్లు నాకుమారగిరి మేన

గోడలి పెసమిటియగు వీరభద్రభూవిభునికాలంబులో నీతని కతిసమీపంబుననున్న యీ రావూరి రాఘవరెడ్డికాలములో ముదుసలియై యున్నట్లూహించుట సహేతుకమైయుండును గాని పంతులవారూహించిన ట్లుకాదు. ఇఁక పంతులవారు కనిపెట్టిన రెండవమార్గముకూడ సరియైనది కాదని తోఁచుచున్నది. అది తిరుమలతాతాచార్యులంబట్టి యతని మనుమని శిష్యుండగు నీరాఘవరెడ్డి కాలము నిర్ణయించుట. దీనింగూర్చి యిదివఱకే నాయభిప్రాయము నిచ్చియున్నాను.ఆపద్యములనే తిరుగఁ బరిశీలించి చూపెదను. అందు పంతులవా రుదాహరించినయొకపద్యములో తిరుమలతాతయ్య మనుమఁ డగుసింగరాచార్యునిశిష్యుఁ డీరాఘవరెడ్డి యని యున్నదిగాని షష్ఠ్యంతములలోని మఱియొకపద్యములో "తిరుమల తాతయదేశిక వరశిష్యునకు" నని యున్నది. దీనిఁబట్టిచూడ నీరాఘవరెడ్డి ప్రథమములో తిరుమలతాతాచార్యునివలన మంత్రోపదేశమునంది యున్నట్లు గాన్పించు. ఆకారణమున నతని తండ్రి యగునరసింహాచార్యుని (సింగరాచార్యులు) తన పరమ గురునిగా భావించినట్లు కాన్పించు, అదెట్లన్నను:—

"క. తిరుమలతాతయవంశా, భరణశ్రీసింగరార్యపరమగురుకృపా
పరిపూర్ణహృదయ యాచక, వరచేతఃకమలినీదివాకరమూర్తీ." ఆశ్వా-౮-చివర

పైనృసింహాచార్యులు మహామహిమావంతుఁడై కర్ణాటప్రభుండగువిరూపాక్షరాయలను శైవమతమునుండి వైష్ణవమతములోనికి మార్చినవాఁడు. అంత నారా జీనృసింహాచార్యునకు శిష్యుఁడై యుండి విరూపాక్షముద్ర వదిలె ననియు నాకారణమున నావంశపురాజులకు రాజ్యభ్రంశము కల్గెననియు రాయలవంశ చరిత్రములో నున్నది. ప్రపన్నామృతములోఁగూడ నీనృసింహాచారింగూర్చి యీక్రిందివిధంబున వ్రాయంబడినది. దాని నే మఱియొకపరి వివరించెదను. ఎట్లన్నను—

శ్లో. విరూపాక్ష స్తతో ధీమా న్వీరశైవమతోఽపి సః,
శ్రీశైలవంశసంభూతా జ్ఞాత్వా తౌ రామలక్ష్మణౌ.

పుత్రమిత్రకళత్రాది సహితస్స సనాగరః,
శ్రీశైలవంశతిలకా న్నృసింహాచ్చ జగద్గురోః.
పంచసంస్కారసంపన్నో బభూవ సుమహాయశాః." ప్రపన్నామృతము.

ఇఁక 'తిరుమలతాతయ్యమనుమఁడైనసింగరాచార్యుని' అనుదాని నాలోచించవలసియున్నది. నృసింహాచారి మొదలు తిరుగ నావంశము లో నాపేరు గలవారుగాని దాని పర్యాయనామమగు సింగరాచార్య నామము గలవారుగాని లేకుండుటంబట్టి యీనరసింహాచార్యుని తాత యును తాతాచారిగానే తేలినది. పై విరూపాక్షదేవరాయనికాలము క్రీ శ ౧౪౭౦ సమీపకాలముగాఁ గాన్పించు. అనఁగా శా. స ౧౩౯౦ సమీపగును. మనము పై నూహించిన సింగరాచార్యుఁడు నాకాలమునకే మిక్కిలి వృద్ధుగాఁ గనుపించును. రెడ్డివారికాలముంబట్టి చూచిన నావఱకే యీరాఘవరెడ్డికంటె నతని కవీశ్వరుం డగుసివెన్నెలకంటి సూరనకవి ముదుసలి యై యున్నట్లు తేలినది. కావున నతనికాల మించుమించుగా నంతకుఁ బూర్వమే యగును. బంతులవారిం కొకమార్గముగూడ విశదీకరించిరి. షష్ఠాశ్వాసాంతమునందలి యొక పద్యములో

" క, ర్ణాటనరేంద్రదత్తసముదంచిత శాశ్వతరాజ్యవైభవా. "

అని రాఘవరెడ్డిని సంబోధించుటచేతను ప్రథమాశ్వాసమునందలి కృతిపతివంశవర్ణనములో

"......మహిమచేఁ గడ లేనిరాజ్యభాగములు గాంచె."

నని రాఘవరెడ్డి తండ్రి యైనబసవయరెడ్డినిగూర్చి చెప్పియుండుటచేతను, ఈ రాఘవరెడ్డియుతండ్రియు కొండవీటి రాజ్యమును కృష్ణదేవరాయని తండ్రితాతలు జయించి యాక్రమించుకొన్న తరువాత వారిచే నియ్యఁబడిన చిన్న సంస్థానమును బాలించుచుండినట్లు కానుపించు." అని దీనిలోఁ బంతులవారు స్థూలదృష్టి నాలోచించిరిగాని సూక్ష్మముగాఁజూడ లేదు. ఈకథయంతయుఁ బూర్వపక్షమయ్యె నని చెప్పుటకుఁ గొండవీటిసీమ కృష్ణదేవరాయలనాఁడే జయింపఁబడె నని చెప్పుటచే నై యున్నది. అప్ప

త్తాంతవిశేషములు నావలన దీనికి వెనుకటిభాగములోఁ గృష్ణదేవరాయ చరిత్రములో స్పష్టపఱుపఁబడినది. కావున నిపుడు కృష్ణదేవరాయల తండ్రితాతలకాలములోఁ గొండవీఁడు కృష్ణరాయవంశస్థులస్వాధీనములో నుండెనని చెప్పవీలులేదు. ఇఁక పైకర్ణాటమండలేశ్వరుఁ డెవరని శంకింపవలసియున్నది. బుక్కరాజుయొక్క వంశమువారు శా. స ౧౨౭౦ మొదలు ౧౪౦౦ సంవత్సరములవఱకుఁ గర్ణాటకప్రభుత్వము చేసిరి అట్టివారిలోఁ బైవిరూపాక్షరాజు నతనియనంతర మతిప్రసిద్ధుఁ డగుప్రౌఢ దేవరాయలును క్రీ.శ.1476అనఁగా శా.స౧౪౦౦ వఱకును రాజ్యము చేసినట్లు ("Lists of Antiquities of Madras," Vol II. Page 128) గ్రంథదృష్టాంత మున్నది. రెడ్ల అధికారము తగ్గినదిమొదలు బెజవాడ ఖండము మొదలు కర్నూలు జిల్లా తుదవఱకుఁ గలదేశమంతయు బెజవాడరాజధానిగాఁ గలసూర్యవంశము వసిష్ఠగోత్రము గలసింగిరిరాజను నొకరాజు స్వాధీనములో నున్నట్లును, అతఁడు నాతనిపిమ్మట రాజ్యమునకు వచ్చిన అతనివంశస్థులును గర్ణాటకప్రభుఁ డగుబుక్కరాజు నతని వంశస్థులకు సామంతప్రభువులుగా నుండి వ్యవహరించినట్లును "Local Records" లో గ్రంథదృష్టాంతములు పెక్కులు కానంబడుచున్నవి. ఇట్లుండఁ గృష్ణదేవరాయలు నాతనితండ్రి తాతలు కొండవీఁడు రాజ్యమును జయించి ఆక్రమించిరని చెప్పినమాట చరిత్రానుభవవ్యతిరేక వాక్యముగాఁ బరిహరించవలసివచ్చినది. ఇఁక నీవెన్నెలకంటి సూరనకవి

## శ్రీనాథునివిషయము.

శ్రీనాథాదుల కాలమునకుఁ దరువాతివాఁ డైనట్లు విష్ణుపురాణ కృతిపతి యగురాఘవరెడ్డి కృతులందిన తన పూర్వులంగూర్చి చెప్పిన యీ క్రిందిపద్యమువలనఁ దేటపడుచున్నది.

" క. అనవేమమండలేశ్వరుఁ, డనఁ నల్లయవీరభద్రుఁడును మొదలుగఁ గ
ల్గినతొంటిరెడ్డిరాజులు, ఘనకీర్తులు గనిరి కృతిముఖంబున ననుచున్. "

క్రీ. శ ౧౪౩౫ సంవత్సర ప్రాంతములయం దుండిన వీరభద్రరెడ్డి తనపూర్వులలో నొకనిఁగాఁ గృతిపతి యైనరాఘవరెడ్డి చెప్పుటచేత

నీవిష్ణుపురాణము రచియింపఁబడినకాల మంతరువాత నలువది డెబ్బది సంవత్సరము లైన నై యుండవచ్చును." అని యున్నవి. ఇందులోఁ బంతులవా రొకసంగతి నాలోచింపనట్లు గాన్పించు. ఆకారణంబున వీరభద్రరెడ్డి పైరాఘవరెడ్డికి బూర్వులలో నొకఁ డని పంతులవారు నిర్ధారణ చేసిరి. అది పొరపాటుగా పైని నావలనఁ బ్రస్తరింపఁబడిన రాఘవరెడ్డి వంశావళివలన స్పష్టమే. దానిలోని రాఘవరెడ్డి తండ్రి బసవ రెడ్డి అయినట్లు, నాతనితండ్రి తమ్మారెడ్డి అయినట్లు నాతని తండ్రి పేరమారెడ్డియు, నాతనితండ్రి లింగభూపాలుఁ డైనట్లు కానుపించు. పై వీరభద్రరెడ్డి, రాఘవరెడ్డి పూర్వులలో నొక్కఁడు కావలసియుండు నేడల నైదుగురు పురుషులకుఁ బైవాఁడు కావలయును. అటులైన నాయిర్వురకుం గలకాలభేద మఱువది డెబ్బది సంవత్సరములుగాక నూటనలువది నూటయేఁబది సంవత్సరములవఱకు నుండవలసివచ్చును. ఇఁకఁ దొంటిరెడ్డిరాజు లను దాని కెట్టి యర్థము చెప్పవలయు నని శంకించుకొనియెదము. పైవీరభద్రరెడ్డివఱకును రెడ్లు మిగులఁ బ్రబలు లైనదేశాధిపు లై యుండిరి. మొట్టమొదట నీరెడ్లకుఁ గొండవీటి సీమ, అద్దంకి,అమ్మనబ్రోలు సీమలు ముఖ్యస్థానములై యుండిన నట్టివానిలో వీరి అధికారము క్రమముగా క్షీణించి తుదకు రాజమహేంద్రవరము మొదలు తూర్పున నున్న ఉత్కళలింగమునకు మాత్రమే ప్రభుత్వము నిల్చినది. అదియును శ్రీనాథుఁడు భీమఖండంబున వివరించిన విధంబునఁ బూర్వసామ్రాజ్య పీఠస్థు లగుప్రోలయవేమ అన్న పోత, అన్న వేమ, కుమార గిరీశ్వరాదుల సంబంధ బాంధవ్యంబున వసుంధరాభారధౌరంధర్యంబు అల్లయవేమ వీరభద్ర రెడ్లకు సంప్రాప్తంబయ్యె. పైరాఘవరెడ్డి తనకులస్థులలో దేశాధిపతు లని విఖ్యాతివహించి యున్న అల్లయవేమ, వీరభద్రాదులగు రెడ్డిరాజులు కృతులంది విశేషకీర్తి సంపాదించిరి కావునఁ దాను నట్టి పనినే చేసి శాశ్వత కీర్తినందె నని తాఁ జేయుచున్న కార్యోత్కృష్టతఁ దెల్పుటకుఁ బల్కె.

అంతమాత్రముచేతఁ బైవీరభద్రరెడ్డి రాఘవరెడ్డి పూర్వులలో నొకఁడని యూహించి, దానింబట్టి అతనికాలము నిర్ణయింపఁ గూడదు. పూర్వపు రెడ్డిరాజులను జెప్పునప్పుడు రాఘవరెడ్డి రాజు లనఁదగినవారిపై రెడ్లలోఁ జివరవాఁడగు వీరభద్రరెడ్డిని స్మరియించి అతఁడు తుదగాఁ బూర్వమందుండు రెడ్డిరాజులలోఁ గొందఱు కృతినందిరని చెప్పె. ఈరాఘవరెడ్డియొక చిన్నసంస్థానాధిపుఁడగుటచేత రాజశబ్దవాచ్యుఁడు కాఁడు. ఇతని సంస్థానము కర్ణాటప్రభువుల పరిపాలనలోని దగుటచేత నానైచ్యమును దెల్పుకొనక తానుగూడఁ దనకంటెఁ గొప్పవారగు రెడ్డిరాజులవిధముగాఁ గృతినందినట్లు తెల్పును. వీరభద్రరెడ్డియనంతర మనఁగా శా. స. ౧౩౪౭ సంవత్సరమును తత్సమీపకాలములో నాతనితమ్ముం డగు దొడ్డయరెడ్డి ఆరాజమహేంద్రవరప్రాంతములోని కొంత దేశమున కధికారము చేసినట్లుగా నొకతామ్రశాసనము గోదావరీజిల్లా రామచంద్రపురముతాలూకా కొంకుదురుగ్రామములోఁ గాన్పించుచున్నది. వీరభద్రరెడ్డి కవ్యవధిగా రాజ్యమునకువచ్చియున్నయీ దొడ్డారెడ్డిపేరు విడువఁబడి వీరభద్రరెడ్డిపేరుమాత్రమే వివరింపఁబడుటచేత నీరాఘవరెడ్డి వీరభద్రరెడ్డితో సమకాలీనుఁ డైయున్నట్లును, కృతులనందిన రెడ్డివారిలో నప్పటికి వీరభద్రరెడ్డియే తుదివాఁడు నవుటంజేసి అతనిపేరుమాత్రమే స్మరించె. అతనిపైఁ గృతి నిచ్చినకవి శ్రీనాథుఁడు. వీరరాఘవరెడ్డిపైఁ గృతి నిచ్చినవాఁడీవెన్నెలకంటి సూరనకవి. వీరిర్వురు రెండుస్థానములలోఁ గొంచెమెచ్చుతగ్గుగా నేకకాలములోనే కవీశ్వరులుగా నుండునపుడు కవీశ్వరుఁడు తనకాలములో నుండినమఱియొకకవీశ్వరుని పూర్వకవులలోఁ జేర్చియేల చెప్పును. ఆకారణమున నీసూరనకవివలన శ్రీనాథునిపేరు వివరింపఁబడనట్లు కానుపించును. ఇట్లు శ్రీనాథునిపేరు సూరనకవి వదలుటయే ఆయిర్వురు నేకకాలమువారు కావచ్చునను దానిని స్థిరపఱుచుచున్నది.

ఈవెన్నెలకంటి సూరనకవి చరిత్రములోఁ జేర్చవలసినవి మఱి రెండుకథలున్నవి. అందు మొదటిది ‘విక్రమార్కచరిత్రము:’ కృతినందిన వెన్నెలకంటి సిద్ధమంత్రికథ యొకటియుఁ గృష్ణవిలాసమును రచియించిన వెన్నెలకంటి వేంకటాచలకవి చరిత్ర మొకటియును. ఈరెంటిలో

సిద్ధమంత్రిచరిత్రము సూరయ కవికిఁ బ్రాచీనమైనదియును వేంకటాచలకవిచరిత్రము సూరనకవికి ననంతరకాలములో నిదియు నై యున్నది. ఈ రెండు చారిత్రములును గలిసినచో నీసూరన కాలనిర్ణయము తేలుటయేగాక అతని పూర్వులయొక్కయు ననంతరకాలములోని వారియొక్కయు చారిత్రములు దేలఁగలవు. కావున నా రెంటిని నా 'కవికావ్యప్రశంసాచంద్రిక' నుండి విడఁదీసి దీనిలోఁ జేర్చుచున్నాను.

## వెన్నెలకంటి సిద్ధయ్యచరిత్రము.

విక్రమార్కచరిత్ర మను గ్రంథమును పైసిద్ధయ్య కృతినందె. ఆ గ్రంథములో నీతనివంశావళి వివరింపఁబడియున్నది. ఇతనిచారిత్రము నుడువునపుడే ఆగ్రంధమును రచియించిన జక్కనకవి చారిత్రముగూడ నుడువవలసియుండును గావున నిపుడు మొదట సిద్ధయ్యవంశచారిత్రము వ్రాసి అనంతరము జక్కనకవిచరిత్రము వివరించెదను.

### సిద్ధనవంశము.

హారితసగోత్రములో

(రాజేంద్రచోళునికాలీనుఁడు) సూరనసోమయాజి. (౧)

|

కొడుకు (పేరులేదు)

|

సిద్ధనమంత్రి. (౨)

ఇతనిభార్య పేరయనన్నయచెల్లెలు సూరమ్మ.

{ రెడ్డివేమన్న కాలీనుఁడు } భాస్కరమంత్రి(రేకసూర్యుఁడు) (౩) జన్నయమంత్రి { దేవరాయని కాలీనుఁడు }

భాస్కరమంత్రి → ఆదిత్యమంత్రి → నారయమంత్రి.

జన్నయమంత్రి → (౪) సిద్ధయ్య { ఇతఁడు దేవరాయని మంత్రివలన రాజచిహ్నము లందె. (కృతిపతి) } → తిప్పయ్య

దేవరాయని కాలీనుఁడు → శైవపుండు

ఇట్లుగా వివరింపఁబడిన వంశవృక్షములోని పురుషులలో ౧-౨-౩-౪ గుర్తులు గలవారిచారిత్రము కొంత తెలియఁదగినదిగా నున్నది. ఎట్లన్నను:—

## ౧- సూరనసోమయాజి.

" సీ. వేదశాస్త్రపురాణ విజ్ఞానసరణిపై, నధిగతపరమార్థుఁ డై తనర్చి
పెద్దనపూఁడి రాజేంద్ర చోడక్షమా, రమణుచే నగ్రహారముగ వడసెఁ
గనకదండాందోళికాచ్ఛత్రచామర, ప్రముఖసామ్రాజ్య చిహ్నములనొప్పె
సర్వతోముఖముఖ్యసవనక్రియా ప్రౌఢి, నుభయవంశంబులనుద్ధరించె
నన్న దానాదిదానవిధాఘనుండు, పరమశైవసదాచార పారగుండు
హరితవంశాంబునిధిచంద్రుఁ డార్యనుతుఁడు, సుగుణవిభ్రాజి సూరనసోమయాజి. "

దీనింబట్టి యీ సూరనసోమయాజి రాజేంద్రచోళునివలన పెద్దనపూఁడి యనునగ్రహారము సామ్రాజ్యచిహ్నములు నందినట్లున్నది. ఈరాజేంద్రచోళు డనునతఁడు రాజనరేంద్రపుత్త్రుఁడు శా.స.౯౯౩ సంవత్సరములో సింహాసనమెక్కినట్లును శా. స. ౧౦౩౯ లో గతించినట్లు నుండుటచేత నీసూరన సోమయాజియును ఆకాలములోనివాఁడే అని తేలును. ఇతఁడును తిక్కన సోమయాజులును ఏకకాలీనులుగాఁ గాన్పించుచున్నారు.ఆకాలములోనినియోగిశాఖాబ్రాహ్మణులు యజ్ఞాదిక్రతువులుచేయుటయందు మిక్కిలి శ్రద్ధాళువులై యున్నట్లు కాన్పించు.ఈతఁడు కేవలము సోమము చేయుటయేకాక సర్వతోముఖము మొదలగు పైసంస్థలుగూడఁ జేసినట్లును, పరమశైవ సదాచారపరుఁ డైనట్లును గాన్పించు. ఇట్టి సూరన సోమయాజిపుత్త్రుని పేరుమాత్రము వివరింపఁబడలేదు. అతని మ

## (౨) సిద్ధనమంత్రి.

నుమఁ డగు సిద్ధన మంత్రిపేరు వివరింపఁబడెను. ఈ సిద్ధమంత్రి యొక్క గొప్పకవిగాను నన్నయగంధవారణ మను నతనికి మంత్రిగా నున్నట్లును గానుపించును. ఆపద్యము లెట్లున్నవనఁగా :—

" మ. శ్రుతుల న్వేన్ని యకెక్కుశాస్త్రములచే సొంపగల్గించెఁ మహో
న్నతిఁ బోషించెఁ బురాణ కావ్య రస నానానాటకాలంకృతుల్

క్రతువర్గంబుల సుప్రయోగ మహిమన్ గాఁచెన్విరించాన్వయో
ర్జితపుణ్యుం డగుసిద్ధమంత్రి సుగుణ శ్రీమించె సేవించిలన్.

మ. వనరుహనాభు సద్ధవుఁడు, వజ్రికి జీవుఁడు, వత్సధారుణీ
శునకు యుగంధరుండు, దితిసూతికి దైత్యగురుండు, విక్రమా
ర్కునకును భట్టి రీతి నధికుం డగునన్నయగంధవారణం
బునకుఁ బ్రధానుఁడై నుతులఁ బొందెను సిద్ధయమంత్రి యిద్ధరన్."

దీనిలో నింకొకవిశేషముగూడఁ దేలినది. యుగంధరుఁడని బిరుదునందినవాఁడు మొదట వత్సరాజునకు మంత్రియై యుండెననియు, నదిమొదలు బుద్ధిశాలిగాఁ బ్రవర్తించినమంత్రులకు యుగంధరుఁ డన్న బిరుదు కల్గుచు వచ్చినట్లును గానుపించును. ఈసిద్ధయమంత్రి పేరయనన్నార్యుఁ డనునొకమహాకవితోఁ బుట్టువును బెంట్లియూరై నని చెప్పఁబడి యున్నది. ఆపండితుఁ డేయేగ్రంథముల రచియించెనో దానిం దెలుపఁ జాలను కాని మఱియెచ్చటనైన నతనిపేరు కానుపించిన బరిశీలింపఁదగు నని చెప్పి అతనివిశేషములఁ జెప్పినపద్యముంగూడ వివరించెదను.

" వ. పరిణత నవ్యకావ్య రసభావవిజృంభిణ భూరివిక్రమా
స్ఫురితచరిత్రతత్త్వసరసుం డగుపేరయనన్నవార్యసో
దరి యగుసూరమాంబిక ముదం బెఱంగఁ బరిగ్రహించె
భాస్వరకమలాజనార్దనవివాహమహోత్సవలీల మీఱఁగన్."

ఈ సిద్ధయమంత్రి పైసూరనసోమయాజికి మనుమఁ డగుటంజేసి యునితకాలముగూడఁ గొంత యూహింపఁబడవచ్చును. శా. స. ౧౦౩౫ మీసపకాల మనఁగా శా. స. ౧౦౩౦ మొదలు ౧౦౫౦ వఱకు ఇతని తాతకాలము. అట నుండి యేఁబదిసంవత్సరము లితనితండ్రికిని మఱి యేఁబదిసంవత్సరములు సిద్ధనకును లెక్కించి చూడఁగా నీసిద్ధనకాలము శా. స. ౧౧౬౦ లు గల దగును.

## (3) జన్నమంత్రి.

ఈజన్నయ యనునతఁడు కర్ణాటాధిపుఁ డగుదేవరాయనిమంత్రిగా నున్నట్లుగా నీక్రిందిపద్యమువలనఁ గాన్పించును. ఆపద్య మెట్లున్నదనః—

“ సీ. విమలవర్తనమున వేదశాస్త్రపురాణ, వాక్యార్థసరణికి వన్నె వెట్టె
బరమహృద్యంబైనపద్యశతంబున, దేవకీతనయు విధేయుఁ జేసె
రసికత్వమున దేవరాయమహారాయ, కరుణాకటాక్షవీక్షణముఁ గాంచె
కర్ణాటకటకముల్ గలయంతయును మెచ్చ, గణకవిద్యాప్రౌఢి ఘనత కెక్కె
గురులఁ బోషించె సత్కవివరుల మనిచెఁ బ్రజల బాలించె భాగ్యసంపద వహించె
హారితమునిముఖ్యవంశరత్నాకరేంద్ర, చంద్రుఁడైయొప్పు సిద్ధయజన్నమంత్రి. ”

ఇందులో వివరింపఁబడిన దేవరాయ లెవ్వరనుశంయున్నది. కర్ణాటరాజచారిత్ర మింకను సంపూర్తిగా దొరికియుండకుండుటంబట్టి యీ దేవరాయని పోల్చుటకు వీలులేకున్నది. పైఁ జెప్పిన సిద్ధయమంత్రి శా. స. ౧౧౮౦గల కాలమువాఁడుగాఁ గాన్పించు. అతనికుమారులలో రెండవయతఁడీ జన్నయమంత్రి. కావున నితనికాలము శా. స. ౧౨౩౦ సమీపకాలము కావలసియున్నది. అప్పటికి కన్నడవిజయనగరపురనిర్మాణమే లేదు. బుక్కరాజు మొదలగువారివ్యవహారమే ఆరంభము కాలేదు. ఆకారణమున బుక్కరాజునకుఁ గొందఱు పురుషులైనపిమ్మట. ౧౪౦౬ లో ననఁగా శా. సి. ౧౩౨౮లోఁ గాన్పించు దేవరాజితని కాలీనుఁడు కాఁడని స్పష్టమే. ఈజన్నమంత్రియన్నయగుభాస్కరుఁడు లేక సూర్యుఁ డనునతఁడు రెడ్డివేమనృపునివలన నగ్రహారాదిక మందినవాఁ డగుటం జేసి అతనికాలము నొక్కటియే యగును. ఆవేమనృపాలునిపేరే అన్న వేమనృపాలుఁ డని చెప్పెదరు. అతఁడే యెఱ్ఱాప్రెగడవలనహరివంశమును గృతినందినవాఁడు. అతని శాసనము శా. స. ౧౨౬౮ మొదలు కాన్పించుచున్నది. ఆవఱకే అతఁడు బహుసంవత్సరములు రాజ్యము చేసె. అన్నదమ్ములగు సూరనకవి, జన్నయమంత్రియు నంతకుఁ బూర్వకాలములోనివారుగానే కాన్పించెదరు. అది శా. స. ౧౨౩౦ మొదలు ౧౨౬౮ వఱకు నగును.

(౪) సిద్ధయమంత్రి (కృతిపతి.)

ఈ సిద్ధయమంత్రి యనేకప్రజ్ఞలు గలవాఁడుగా ననేక దేశభాషల నభ్యసించినవాఁడుగాఁ గాన్పించును. ఎట్లన్నను :—

" సీ. చిత్రగుప్తునికైనఁ జింతింప నరుదైన, గణితవిద్యాప్రౌఢి ఘనతకెక్క-
నవసరంబులయందు నవ్యకావ్యంబులు, కవిజనములు మెచ్చఁగా నొనర్చ
నాణిముత్తెముల సోయగము మించిన వ్రాలు, వరుసతో నియగేల వ్రాయనేర్చ
నాత్మీయలిపి యట్టు లన్యదేశంబుల, లిపులను జదువంగ నిపుణుఁ డయ్యె
దేవరాయ మహారాయ ధీవిధేయ, మంత్రివల్లభ చామనామాత్యదత్త
చామరచ్ఛత్రశిబికాదిసకలభాగ్య, చిహ్నముల నొప్పె జన్నయసిద్ధమంత్రి."

దీనిలో వివరింపఁబడిన దేవరాయని మంత్రి యగుచామనామాత్యుని వివరము మనకింకను దెలియలేదు. అతనివలన నీసిద్దయమంత్రి ఛత్రచామరాందోళికాదిచిహ్నము లంది ధరియించె నని యున్నది. ఈ సిద్ధయతండ్రియు దేవరాజుకాలీనుఁడే అనియు సిద్ధనయతనిమంత్రికాలీనుఁ డనియు నుండుటచేత జక్కన వృద్ధావస్థలో దేవరాయనిమంత్రిగా నుండెననియు, నీసిద్ధన దేవరాయని వృద్ధావస్థలో నుండెననియు నూహింపవచ్చును. ఈసిద్ధమంత్రింగూర్చి షష్ఠ్యంతముల లోఁ గొంత వివరింపఁబడినది. ఎట్లన్నను:—

౧ " క. శ్రీమద్వల్లయవరసుత, చామనదండాధినాథసామ్రాజ్యరమా
సామగ్రీసంపాదక, సామాధికచతురుపాయసంపన్నునకున్.

౨. క. సముచితయజనాదివిధి, క్రమనిపుణున కుభయవంశఘనకీర్తిసము
ద్యమనియమాచారునకును, విమలాపస్తంబసూత్ర విఖ్యాతునకున్.

3. ఉ. వెన్నెలకంటిసూర్యుఁడు వివేకగుణాఢ్యుఁడు వేదశాస్త్రసం
పన్నుఁడు రెడ్డివేమనరపాలునిచేత మహాగ్రహారముల్
గొన్నకవీంద్రకుంజరుఁ దకుంఠితతేజుఁడు పెద్దతండ్రిగా
సన్నుతిఁ గన్నఁ గన్నసిద్ధనకు సంతతదానకళావినోదికిన్."

మొదటిపద్యములో వల్లయ్యాయను వల్లభయ్యాకుమారుఁ డగు చామన యనుదండనాయకునివలన సామ్రాజ్యలక్ష్మీసామగ్రి యనగా ఛత్రమరాందోళికాది రాజచిహ్నములను సిద్ధమంత్రి సంపాదించె ననియు, రెండవపద్యములోనీ సిద్ధమంత్రి యజ్ఞాదివిధులలో నిపుణుఁ డనియు, యమనియమయుతుఁ డనియు నాపస్తంబసూత్రుఁ డనియు, మూఁడవపద్యములో వెన్నెలకంటి సూర్యనాముఁ డగుభాస్కరుఁ డనుమహాకవిని యీసిద్ధమంత్రి పెద్దతండ్రిగాఁ గలవాఁ డనియుఁ దేలినది. ఈభా

స్కరుఁడే రెడ్డివేమనవలన ననేకాగ్రహారములఁ గొనియె. ఈవేమనయే హరివంశకృతిపతి. ఇఁక నాశ్వాసాంతపద్యములలో నున్నయీసిద్ధ మంత్రివిశేషము లరయఁగా నితఁడు బెల్లముకొండ భైరవునికృపచేత సామ్రాజ్యలక్ష్మిం గైకొనియె నని యున్నది. ఎట్లన—

"శా. శ్రీమద్బెల్లముకొండ భైరవకృపాశ్రీనిత్యసామ్రాజ్యల
క్ష్మీమాధుర్యగృహాంతరాంతర—" రెండవయాశ్వాసాంతము.

మూఁడవయాశ్వాసముచివరను కర్ణాటరాజును సేవించువాఁడని యున్నది. ఎట్లన.—

"శా. శ్రీ కర్ణాట మహామహేశ్వర సదా సేవా ప్రధానోత్తమా."

ఇతనికాలము శా. స. ౧౨౮౦ శా. స. ౧౩౦౦ వఱకు.

## 22.

## జక్కనకవి.

ఈకవి నియోగిశాఖాబ్రాహ్మణుఁడు. ఇతనితాతపేరు పెద్దన. తండ్రిపేరన్నయామాత్యుఁడు. ఇతనిచారిత్రము నుడువుటకుఁ బూర్వ మితని యాశ్వాసాంతగద్యమును వివరించెదను. ఎట్లన్నను.—

"ఇది శ్రీమదఖిలకవిమిత్త్రి పెద్దయతనూజ అన్నయామాత్యపుత్త్రి శారదాదయావిధేయ జక్కయనామధేయప్రణీతం బైనవిక్రమార్కచరిత్రం బనుమహాకావ్యంబునందు సర్వంబు నష్టమాశ్వాసము."

### ఆంధ్రకవినుతి.

ఇతఁడు భారతకవిత్రయమును వినుతించె. ఈకవి యెఱ్ఱాప్రెగ్గడ కుఁ దరువాతివాఁడుగాఁ గాన్పించు. ముందుగా నీతని కవిత్రయవర్ణనముం దెల్పి అనంతర మితనికాలము నిర్ణయించుటకు యత్నించెదను. ఎట్లన్నను:—

### నన్నయభట్టువర్ణనము.

"ఉ. వేయివిధంబులం జదివి వేవురు పెద్దలు సత్ప్రబంధముల్
వ్రాయక చెప్పి రిట్టు రసబంధురవాగ్వ్యథ వాఖి రామధా

రేయులు శబ్దశాసనవరేణ్యులు నాఁగఁ బ్రశస్తికెక్కెఁ దే
యేయెడ నన్నపార్యకవి నిద్ధర నట్టిమహాత్ముఁ గొల్చెదన్."

తిక్కనసోమయాజివర్ణనము.

"చ. పరువడి భారతాఖ్య గలపంచమవేదము నాంధ్రభాష ను
స్థిరత రచించుచోఁ గృతిపతిత్వము నొందఁ బ్రసన్నుఁ డైనయా
హరిహరనాథుచేఁ బడసి నవ్యయసౌఖ్యపదంబు నెవ్వఁ డా
పురుషవరేణ్యుఁ దిక్కకవిఁ బూని నుతింతుఁ గృతాధ్వరోత్సవున్."

ఎఱ్ఱాప్రెగడవర్ణనము.

"ఉ. ఈత్రయిఁ దాఁ బ్రబంధపరమేశ్వరుఁ డై రచించె సద్దశై
చిత్రి నరణ్యపర్వమున శేషము శ్రీనరసింహరామచా
రిత్రములున్ బుధవ్రజగరిష్ఠత నెఱ్ఱయశంభుదాసుఁ డా
చిత్రకవిత్వవాగ్విభవజృంభితుఁ గొల్చెద భక్తియుక్తితోన్."

సిద్ధమంత్రి జక్కయకవి తాతతండ్రులకావ్యవిశేషములు సభవారికిఁ దెలియునట్లు చెప్పుట.

"సీ. సంస్కృతప్రాకృత శౌరసేన్యాదుల, ఘటికలో నొకశతకంబుఁ జెప్పఁ
బ్రహసన ప్రకరణ భాణాదిబహువిధ, రూపకంబులయందు రూఢి మెఱయఁ
జక్రచతుర్భద్రచతురుత్తరాదిక, క్షుద్రకావ్యములు పెక్కులు రచింప
నాంధ్రకవిత్వంబునందుఁ బ్రబంధంబు, మేలుగా దజ్ఞులు మెచ్చఁ జెప్ప
నిర్మల నేరీతి నేధాతువుల నేమి, రసమున నైన వర్ణనము సేయ
సరి నేకసంధా ద్విసంధా త్రిసంధలఁ, బొదరింప బొరిపొరిఁ గడవఁ జదువ
నెవ్వఁ డేయవధాన మెఱుఁగు నయ్యవధాన, ముల వాని కించుక ముల్లు మోప
వృత్తకందముఁ గందవృత్తంబునుం జతు, ష్కందంబు మొదలుగాఁ గలుగుగర్భ
కావ్యవర్గము చెప్పఁగాఁ బ్రబంధంబులు, గ్రొత్తలు పుట్టించుకొని లిఖింపఁ
గా నక్షరచ్యుతకంబు మాత్రాచ్యుత, కంబు బిందుచ్యుతకంబు నామ
గోప్యంబులుం గ్రియాగోప్యంబులును భావ, గోప్యంబులును జెప్ప గోష్ఠియందు
బద్యంబు గీతికార్భటి నొంగిఁ జదువంగ, నెల్లవిద్యల సంచు లెఱుఁగ నేర్తు
ననుచు నెల్లూరితిరుకాళమనుజవిభుని, సమ్ముఖమ్మున సాహిత్యసరణి మెఱసి
మహిమఁ గాంచిన పెద్దనామాత్యసుకవి, మనుమఁడవు నీవు నీవంశమహిమ యొప్ప."

## జక్కనతండ్రివిషయము.

" క. ఆడఁడు మయూరశేఖను, గాడంబాఱండు బాణగతి మన మెరియన్
బోడగు పెద్దయయన్నయ, మాడకు మాడెత్త యతనిమాటలు జగతిన్.

క. అని మీతండ్రిమహాత్వము, జనవినుతరసప్రసంగసంగతకవితా
ఘనతేజాలు కవిరాజులు, గొనియాడుదు రఖిలరాజకుంజరసభలన్."

## జక్కనకవివర్ణనము.

" క. చక్కన నీవైదుష్యము, చక్కన నీకావ్యరచన చాతుర్యంబుల్
చక్కన నీవాగ్వైఖరి, చక్కన నీవంశమహిమ జక్కనసుకవీ.

క. స్వాభావికనవకవితా, ప్రాభవముల నుభయభాషఁ బ్రఖ్యాతింపన్
భూభువనంబుల సరిలే, రాభారతి నీవుఁ దక్క నన్నయజక్కా."

ఇట్లున్న జక్కనకవివంశచారిత్రములో మనకుఁ దేలవలసిన యంశ మొకటియున్నది. అది నెల్లూరితిరుకాళరాయుని కాలవివరమై యున్నది. ఇది తేలినయనంతరమే జక్కనకవి కాలమును తేలఁగలదు. దానిం గూర్చి గ్రంథాంతరములఁ జూడవలసి యున్నది. లోకల్ రికార్డులు ౫ సంపుటము ౨౭, ౨౮ పుటలలో (Local Records Vol V.P. 27 & 28 నీక్రింది విధంబున నున్నది.

" తిరుకాళతి చోళమహారాజు రాజ్యభారముచేసిన తరువాతను, గణపతి దేవమహారాజులు రాజ్యభారం యేలుతూవుండఁగా వారిఅగ్రసేనాపతి గంగయదేవమహారాజు సిద్ధవటం, పొత్తపినాటి మొదలగు సీమలు ప్రభుత్వము చేయుచుండి అప్పుడు తాలూకు మజాకూరు, పరగణే దువ్వూరికి పైకి మవుదుకూరు అను గ్రామము దుండిరి."

అని యున్నది. దీనింబట్టి కాకతీయగణపతి దేవుని రాజ్యమునకుఁ బూర్వము తిరుకాళచోడమహారాజు పైసీమను బాలించుచున్నట్లు గాన్పించును. కాకతీయులవంశచారిత్రముఁబట్టి యాగణపతిరాజుకాలము శా. స. ౧౦౫౩ సంవత్సరమునకుఁ బిమ్మట నైనట్లు స్పష్టమే. కావున నతనికిఁ బూర్వుఁడగుతిరుకాళచోళమహారాజుకాలము శా. స. ౧౦౫౩ నకుఁ బూర్వమే అయియుండును. ఆ రాజుపైఁ గృతులిచ్చి విఖ్యాతింగాంచిన పెద్దనకవి ఆనమీాపకాలములో ననఁగా ౧౦౫౦ మొదలు

౧౧౫౦ సం. వఱకు నుండుననుటకు సంశయము లేదు. అతనిపుత్త్రుఁడు నన్నయ యను నతఁడు శా. స.౧౧౫౦ మొదలు ౧౨౦౦ వఱకు నుండి యుండును. అతనికుమారుఁ డగుజక్కయకవి యేఁబదిసంవత్సరముల వాఁడే అయిన ౧౨౫౦ వఱకుగాని అంతకు నధికవయస్సువఱకు నుండిన శా. స. ౧౨౭౦ లేక ౧౩౦౦ వఱకుగాని యుండుటకు సందియముండదు. ఇది కృతిపతి యగు సిద్ధనకాలమై యుండినట్లుగా నీవఱకే మనము లెక్కించినారము ఆకారణమున నితఁ డెఱ్ఱాప్రెగ్గడకుఁ గొంచెము దరువాతివాఁ డగుననుటకు సందియముండదు.

# 23.

# వెన్నెలకంటి వేంకటాచలము.

(కృష్ణవిలాసకవి)

ఇతఁడు నాఱువేలశాఖానియోగిబ్రాహ్మణుఁడు. హారీతసగోత్రుఁడు. జగ్గనామాత్యునిపుత్త్రుఁడు. ఇతనివంశావళి వివరించుటకుఁ బూర్వమితనవలన వివరింపఁబడిన యాశ్వాసాంతగద్యమును వివరించెదను. ఎట్లన్నను:—

"ఇది శ్రీమదుమామహేశ్వర వరప్రసాదలబ్ధ శంకరభజనానంద మలంగు గురులింగారాధ్య పాదారవింద ధ్యానపరాయణ హారీతసగోత్ర సుజనవిధేయ జగ్గనామాత్యపుత్త్ర వెన్నెలకంటి వేంకటాచల నామధేయ ప్రణీతం బైనకృష్ణవిలాసం బను మహాప్రబంధంబునందు"


## — ఆంధ్రగీర్వాణకవివర్ణనము. —

ఈకవి యొకసీసములోఁ గొందఱఁ బ్రాచీన సంస్కృతకవులను మఱికొంద ఱాంధ్రకవులను గలిపి చెప్పియున్నాఁడు. ఇది యితరకవులలోఁ జూడఁదగుమార్గముకాదు. ఆపద్యమెట్లున్నదన:—

"సీ. కాళిదాసునిఁ దిక్కకవి నన్నపార్యుని, భారవి భవభూతి పాండురుకవి
మల్హణు బిల్హణు మాఘు మయూరుని, చోరుని నాచనసోము భీము
పింగళిసూరన్న పెద్దనామాత్యుని, పాలుపాంద బమ్మెరపోతరాజు
వంచెటిరంగన్న భాస్కరమంత్రిని, తెల్లంకితాతప్ప మల్లుభట్టు
తే. మహిమమీఱంగ నాస్థానమంటపముల, సకలరాజులచేతను సన్నుతింపఁ
బడినసుకవుల నందఱఁ బ్రస్తుతింతు, నింపుమీఱంగఁ గృతి రచియింపఁబూని."

## కవివంశావళి.

హారీతసగోత్రము - వెన్నెలకంటివారు.



ఇట్లుగా వివరింపఁబడిన పైవంశమువారిలో (౧) మొదలు (౯) వఱకుఁ గలపురుషులచారిత్రము వివరింపవలసియున్నది. ఈవంశములోఁ గవులు పెక్కండ్రుండుటంబట్టి వీరిచారిత్రమును, మీఁదికాలీనులచారిత్రమును ముఖ్యముగాఁ దెలియవలసిన దై యుండుఁగావున నే నీక్రింద దాని న్వివరించి చూపెదను.

౧. వెన్నెలకంటిసూర్యుఁడు.

ఇతనింగూర్చి వివరించుచో నీకవి విక్రమార్కచరిత్రములో నితనివర్ణనయున్నపద్యమునే విక్రమార్కచరిత్రములోని దని వివరించె. ఆపద్య మెట్లున్నదన:—

"ఉ. వెన్నెలకంటిసూరయ వివేకవదాన్యుఁడు వేదశాస్త్రసం
పన్నుఁడు రెడ్డివేమనరపాలునిచేత మహాగ్రహారముల్
గొన్నకవీంద్రకుంజరుఁ డకుంఠితతేజుఁడు పెద్దతండ్రి యా
జన్నయసిద్ధధీమణికి సంతతదానకళావినోదికిన్."

ఇట్లున్నదీనింబట్టి విక్రమార్కచరిత్రముఁ గృతినందిన జన్నయపెద్దనమంత్రి కితఁడు పెద్దతండ్రియైనట్లుగాఁ దేలినది. ఇతఁడు గొప్పకవియనియు నితఁడు రెడ్డివేమరాజువలన మహాగ్రహారములఁ నందె నని తేలినది. దీనిలో వివరింపఁబడిన రెడ్డివేమన యెవ రనుదాని నాలోచింపవలసియున్నది. అపేరు గలప్రభువులు రెడ్లలోఁ బెక్కండ్రుండుటంజేసి ఆవివరము దీనిలోఁ దేలదు. ఇతనింగూర్చి విష్ణుపురాణములో వివరించియున్నపద్యముంగూడ నిట వివరించి అనంతర మితనివృత్తాంత మరయుటకుఁ గోరెదను. ఆపద్య మెట్లున్నదనఁగా:—

"ఉ. ఈ నిఖిలంబు మెచ్చ నమరేశ్వరదేవుఁడు చూడఁ గృష్ణవే
ణీనది సాక్షిగాఁ దనికి నిల్చినరావుతుఁ గేసభూవిభుం
గానకుఁ దోలి వెన్నడచి కాచినవేమయయన్నపోతభూ
జానికి సత్ప్రబంధము లొసంగినవెన్నెలకంటివారిలోన్."

౨. జన్నయసిద్ధయ.

ఇతఁడు విక్రమార్కచరిత్రముఁ గృతినందినవాఁడు ఇతనింగూర్చి యీవేంకటాచలకవి యీక్రిందివిధంబునఁ జెప్పుచున్నాఁడు. ఎట్లన:—

" గీ. విక్రమార్కచరిత వేడ్కతో నందిన, సిద్ధిరాజు జగత్ప్రసిద్ధరాజు
అతని పెద్దతండ్రి యైనసూరపరాజు, పరమశైవశాస్త్రపారగుండు."

### 3. వెన్నెలకంటి సూరనకవి.

ఇతఁడు పైసూరపరాజకవికిఁ బౌత్త్రుఁడు. అనఁగాఁ బుత్రునిపుత్త్రుఁడు. ఈవిషయమై కవిచరిత్రము కొంత సంశయించి ఇతఁడు సూర్యుని మనుమనిమనుమఁ డని వ్రాసినట్లుండుటచేత నీతనివివరము దెల్పు పద్యముఁగూడ నిట వివరించెదను. ఎట్లన్నను:—

" చ. సురచిరసద్గుణాఢ్యుఁ డగుసూరసుధీమణిసంభవుండు శ్రీ
హరిపదసేవనుం డమరనార్యుఁడు పుత్త్రులఁగాంచె మువ్వురన్
స్థిరతరసత్కవిత్వ శుభశీలుఁడు సూరపమంత్రి చంద్రశే
ఖరబాధవద్య్యధీ వినయకర్మఁడు తిర్మలమంత్రిసత్తముల్."

ఈసూరకవింగూర్చి 'యాదవసేనము' అనుగ్రంథములోఁ గొంత వివరింపఁబడియున్నట్లుగాఁ గాన్పించు. ఆగ్రంథము మనకు లభ్యముకాలేదు కాని వేంకటాచలపతికవి ఆగ్రంథములోని యొకపద్యమునుమాత్రము వివరించెను. ఎట్లన్నను:—

" క. వీరలుమువ్వురిలోపల, సూరప విఖ్యాతయశుఁడు సుకవిస్తుతుఁడై
అరసి విష్ణుపురాణము, ధీరతఁ దెనిఁగించె నధికతేజ మెలర్పన్."

ఇట్లుగా వేంకటాచలకవి విష్ణుపురాణకర్తపై యితరగ్రంథకర్తల యభిప్రాయముం దెలిపి యిఁక తన యభిప్రాయముగా నీక్రిందిపద్యము వివరించె. ఎట్లన్నను.—

" సీ. సూరప కాంతిచే సూర్యప్రకాశుండు, వేదాదివిద్యల వెలసినాఁడు
విష్ణుపురాణంబు వేడుకఁ దెనుగించి, విమలయశంబున వెలసినాఁడు
రావూరిబసవన్నరమణతో నిచ్చిన, యలమొగుల్లూరగ్రహారమందె
వెలుగోటితిమ్మభూవిభునిచేఁగొనియెఁదా, నాందోళికాఛత్ర మగుపదవిని
తే. కవితపుట్టిల్లు వెన్నెలకంటియిల్లు, నని సుపౌరుష నామధేయంబు నిలిపె
సరసగుణములు గలిగినసాధుసుకవి, మాననీయుఁడు సూరనామాత్యవరుఁడు."

ఇట్లుగా వివరింపఁబడి యుండుటచేత నీసూరనకవి రావూరి బసవరెడ్డి సభలోనేకాక వెలుగోటి తిమ్మభూపాలుని సభలోఁగూడ

నుండి అతనివలన ఛత్రచామరాందోళికాది మహాగౌరవముల నందినట్లు తెలిసినది. ఈతిమ్మభూపాలుంగూర్చి స్యూయలుదొర కొంత వివరించె. అది వేంకటగిరివారివంశవృత్తములోనిదియై యున్నది. వెలుగోటివా రనునది వేంకటగిరిసంస్థానికు లగువెలమలయింటి పేరై యున్నది. వారిలోఁ దిమ్మానాయఁ డనునతఁడు వెలుగోటివారిలో మూలపురుషుఁడు మొదలు లెక్కింపఁగా నేడవపురుషుఁ డగుచున్నాఁడు. ఇతనికాలముమాత్ర మాగ్రంథములో వివరింపఁబడలేదు. కాని యితనికిఁ బూర్వులుగా నున్నవారిలోఁ గొందఱయొక్కయుఁ, బరమునున్నవారిలోఁ గొందఱ యొక్కయుఁ గాలములు వివరింపఁబడుటచేత నీతిమ్మానాయనికాలముఁ గొంత మనము దగ్గఱగాఁ దేవచ్చును. అదెట్లున్న దనఁగా:—

Vol. II Lists of Antiquities Page 241.

Singama Naidu.

(A bold warrioı ; was protected by Pratapa Rudra II.)

|

Anapota Naidu.

Won a battle in Sarwari year A D 1300.

|

Pedasingama Naidu — Dharma Naidu

Dharma Naidu
|
Timma Naidu.

దీనిం దెనుఁగులోఁ జూపెదను.

సింగమనాయఁడు.

(ఇతఁడు రెండవప్రతాపరుద్రునివలన సంరక్షింపఁబడెను.)

|

అనపోతనాయఁడు.

(ఇతఁడు క్రీ॥శ ౧౩౦౦లతో సరియగు శార్వరి సం. లో నొకగొప్పయుద్ధమున గెలిచెను.)

|

పెద్దసింగమనాయఁడు — ధర్మానాయఁడు.

ధర్మానాయఁడు.
|
తిమ్మనాయఁడు.

ఇట్లుగా నున్న పైసింగమనాయునికాలము మనకుఁ గొంత తెలిసి
నది. ఎట్లనఁగా రెండవప్రతాపరుద్రుఁ డతని సంరక్షించియుండుటచేత
నతని కాలము శా. స ౧౨౪౯+౭౪=౧౩౨౩ క్రీ. శకమువఱకు నగు
టచేతను సింగమనాయఁకుఁగూడ క్రి. స. ౧౩౨౩ వాఁడే కాఁగలఁడు.
అతనికుమారుఁ డగునన వ్రాతమనాయఁడు క్రీ.శ. ౧౩౦౦ శార్వరిలో
నొక యుద్ధము జయించియుండె నని యుండుటచేత పైసింగమనాయఁడు
క్రీ. శ. ౧౩౦౦లకుఁ బూర్వమే అనగాఁ బ్రతాపరుద్రుఁడు మృతినందు
టకుఁ బూర్వమే సుమారు ముప్పదిసంవత్సరములకు ముందు గతించి
యుండవచ్చు నని తేలును. ఈకాలవిషయమై న్యూయలుదొర సంశ
యపడి యది అసందర్భమని దీని మఱి యఱువదిసంవత్సరలకుఁ బైన
వచ్చు క్రీ. శ. ౧౩౬౦ గా సవరించెను. దీనికిఁ గారణము పై రెండవ
ప్రతాపరుద్రుఁడు క్రీ. శ. ౧౩౨౩లో గతించియుండుటం జేసియే అయి
యున్నది. అట్లుగా నూహింప నవసరము లేదు. ప్రతాపరుద్రుఁడు డెబ్బ
దియాఱుసంవత్సరములు రాజ్యముచేసినట్లుండఁగా నతనికాలములోని
వారందఱు డెబ్బదియాఱేండ్లవఱకు నుండిరని యూహించుట సయుక్తి
కముకాదు. ఇట్లుగా క్రీ. శ. ౧౩౦౦లను ౧౩౬౦గా సవరించుటయే
మాచెరుగాని న్యూయలుదొర యీయన పోతనాయనితమ్ముఁ డగు
మాదనాయని కాలమును జూచియుండలేదు. ఈసవరింపునకు వెనుకనే
మాదనాయని పేరుక్రింద నీక్రిందివాక్యములు వివరించె. ఎట్లన్నను :—

" Mada Naidu (Made additions to the Srisailam Temple) Killed Anapota Reddi, a relative of Ana Vema Reddi of Konda Veedu (A. D. 1339—1369 A. D.)"

అనఁగా నీమాదానాయఁడు కొండవీటిసీమకుఁ బ్రభుఁ డగునన వేమా
రెడ్డికి బంధువుఁ డగునన పోతారెడ్డిని సంహరించె ననియు నామాదానా
యనికాలము క్రీ.శ.౧౩౩౯ మొదలు క్రీ. శ. ౧౩౬౯ వఱకు నున్నట్లు వ్రా
సె. కావున మాదానాయనికిఁ బూర్వమధికారముచేసిన యతనియన్న
యగునన పోతానాయఁడు క్రీ.శ.౧౩౦౦లలోఁ గాని అంతకుఁ బూర్వముగా

ని యుండక మాదానాయని రాజ్యాంతము క్రీ.శ.౧౩౬౦ నాఁటికి నుండు నా? కావున క్రీ. శ. ౧౩౦౦ అను పాఠమే సరియైనదై యున్నది. అతని రాజ్య కాల మది మొదలు క్రీ.శ.౧౩౩౭వఱకు నుండియుండును. అనవోతమనా యనికొడుకు పెద్దసింగమనాయఁడును, ధర్మానాయఁడును గొంతకాల ము రాజ్యము చేసినట్లుగా శిలాశాసనములలోఁ గాన్పించును. ఆధర్మానా యనికొడుకు తిమ్మానాయఁడు. వీరిలో నొక్కొక్కఁడు రాజ్యము చేసిన నొక్కొక్కనికి ఇదేసివత్సరములు వచ్చినను మువ్వది సంవత్సరములు చెప్పఁగా క్రీ.శ.౧౩౭౦ + 3 = ౧౩౭౩ మొదలు అనఁగా శాలి ౧౨౯౫ మొదలు సీతిమ్మానాయని కాలము కాఁ గలదు. అతని కాలములో నున్న వెన్నెల కంటిసూరనయుఁ గొంచె మెచ్చుతగ్గుగా శాలి ౧౩౦౦ గల కాలమువా డని తేలును.

### (౪) చంద్రశేఖరుఁడు.

“సీ. పొగడఁ బ్రద్దలూరు బాలనొస్యులు జేసెఁ, జంద్రశేఖరయ్య జగతిలోన
దత్తవృత్తిఁ గొనియెడ గర్రసిద్ధికి సకల, మొదలిపేర నతఁడు బొదలుచుండె.”

### (౫) వెన్నెలకంటి వెంకయ్య.

ఈ వెంకయ్య యనువాఁడు వేజెళ్ల సత్త్వాజనుసంస్థానీకునకడ మంత్రిగా నున్నట్లు క్రింది పద్యములవలనఁ గాన్పించును. ఎట్లన్నను:—

“సీ. ఘనులు నెరకడలోపల గంగరాజు, అతనిపుత్త్రుఁడు వెంకయ యనువాఁడు
సరసుఁడైనట్టి వేజెళ్ల సత్త్వజునని, మంత్రియై యొప్పె రాజసన్మానమునను.

సీ. వేజెళ్ల సత్త్వాజి విభవాధిపత్యంబు, పూనిన సద్గుణ పుణ్యమూర్తి
పోలుపొంద నా కృష్ణభూపాలు పాలని, దొరఁ జేసికొని కార్యము లొసినడిపె
శ్రీరంగరాయలచే నొప్పఁగొని తెచ్చి, పంచవన్నెల డాలు పరగఁజేసె
కొండవీటిసరద్దు గడ్డూరి గనుకను, ఏలించెఁ గృష్ణభూపాలు నెమ్మి
తే. సకలప్రజ్ఞానిధియుఁడై జనులఁ బ్రోచె, రాజసన్మానములచేతఁ దేజమలర
బంధుజనములసకలసంపదలదనిపె మహితయశుఁడగు వెంగనమంత్రియపుడు.”

ఇపుడు వేజెళ్ల సత్త్వాజనునతఁ డెవ్వఁడనియు నతని కాల మెప్పుడని యు విచారించవలసినదిగా నున్నది. ఈనడుమనే నావలన పైవేజెళ్లవా

రను తెల్లుసంస్థానికుల వంశచారిత్ర మీగ్రామములో నున్న పైవేజె ళ్లవారి ద్వారమున సంపాదింపఁబడిన వంశావళీగ్రంథము పట్టాలనుబట్టి సంగ్రహింపఁబడినది. దానివలన పై వృత్తాంతము కొంత తేలుచున్నది. కావున నీసమయములో నవసర మగువృత్తాంతము నీక్రింద వివరించెదను.

వేజెళ్ల వారివంశావళి.

పోలంరాజు.

| పాపరాజు (శా. స. ౧౩౭౧.౧౪౧౬)

| కసవరాజు (శా. స. ౧౪౧౬.౧౪౪౪)

| అయ్యపరాజు (శా. స. ౧౪౪౪-౧౪౭౦) | సర్వరాజు

| పెద్దనరసరాజు | చిన్ననరసరాజు (శా. స.) ౧౪౭౦-౧౫౨౨.

| కృష్ణమరాజు (శా. స. ౧౫౨౨—౧౫౫౮)

| పెద్దనారాయణరాజు (శా. స. ౧౫౫౮—౧౬౦౦)

| కృష్ణమరాజు (శా. స. ౧౬౦౦—౧౬౧౫)

పైవారిలోఁ బ్రస్తుతములో మనకుఁ గావలసినవారి పేరులు కాలమును గై కొందము. వారెవ్వరనఁగా సర్వరాజు నతని యన్న యగునయ్యపరాజును. వీరి కాలము శా.స. ౧౪౧౬ మొదలు ౧౪౪౪ వఱకు నిరువది యెనిమిది సంవత్సరములై యున్నది. వంశావళీసంగ్రహములో వీరివృత్తాంత మీక్రిందివిధంబుగా నున్నది. ఎట్లన్నను:—

"అయ్యపరాజు హైద్రాబాదునకుఁ బోయి అక్కడి నుండి పూర్వము 'కొదగు చక్రవర్తి' అనురెడ్డికి జాగీరుగా నడుచుచున్న గుడ్లూరు సీమకు జాగీరు తెచ్చుకొని తన తమ్ముఁడు సర్వరాజును హైద్రాబాదులో నుంచి తాను సోమరాజుపల్లె యనుగ్రామములోఁ గోట కట్టుకొని జాగీ రనుభవించెను."

అని యిట్లున్న వేజెళ్లవారి వంశావళిలో సత్రాజను నామము గల వాఁ డతఁ డొక్కఁడేగాని యితరులు లేరు. ఈసత్రాజుకడ నీవెంగన్న మ్మంత్రి యై యుండుటయేగాక యితనియన్న యగు నయ్యపరాజు మనుమఁ డగుకృష్ణభూపాలుఁడు బాలుఁ డై యుండ నతని ద్వారను చేసుకొని కార్యము నడిపిన వాఁడనియుఁ బై పద్యములో నున్నది. ఈపట్టున వంశావళీగ్రంథ మెట్లున్నదో చూచెదము. అందులో నీక్రిందివిధంబుగా నున్నది. దాని వివర మెట్లనిన.——

"పై అయ్యపరాజపుత్రులు పెదనర్సరాజు చిననర్సరాజు అనువారలు. వీరిలో చిన్ననర్సరాజు తనయన్నతో కలించి తూర్పు విజయనగర సీమకు లేచిపోయెను. పెద్ద నర్సరాజు తండ్రి అనంతరము వ్యవహారములోఁ బ్రవేశించి చంద్రగిరి, తిరుపతి మొహరాలలోఁ (యుద్ధములలో) గష్టపడి, పూర్వము తమకు నడిచే అమరము, చీమకుర్తి గ్రామాదులును, జాగీరుగా నడిచే గుడ్లూరుతాలూకాయును, ఇదిగాక పాకల, జలదంకి మొదలగు కొన్ని సమతులును, జాగీరులుగాను, అంబారీ, డంకా, నౌబతు, గడియారము మొదలగు బిరుదునిషానులును బహుమతిగొని, సర్కారు నౌకరిలో హాజరు బాకీ చేయుచుండెను. ఇట్లుండ నీయనబావమఱఁది యగుమందపాటి మూర్తిరాజనునతఁడు పై అయ్యపరాజుకడ సర్దారుఁడై యుండి ప్రభుత్వ మాక్రమించుకొనవలయు నని దివాణములో పితూరీచేసి భీమవర మనుగ్రామములోఁ బెద్ద నర్సరాజు చిన్ననర్సరాజు చిన్నవారితోఁగూడఁ గోటలోనుండగా ఫౌంజును తెచ్చి కోటచుట్టుకొని పెద్దనర్సరాజును నష్టపెట్టెను. ఈపెద్ద నర్సరాజు ౩౬ సంవత్సరములు రాజ్యముచేసెను.

## —— కృష్ణమరాజుచరిత్రము. ——

అనంతరము పెద్దనర్సరాజు కుమారుఁడగు కృష్ణమరాజనునతఁడుమూఁడుసంవత్సరములయీడుగల బాలుఁడై యుండుటంబట్టి అతనిమంత్రి వర్గము కంమకూరిలో లష్కరుతోఁగూడ నుండిన ఫౌంజుదారుని దర్శించిరి. అప్పుడు ఫౌంజుదారుఁడు కృష్ణమరాజు బాలుఁ డనుకారణముచేతను గుడ్లూరు పరగణామాత్ర మతనికిచ్చి దానికి (౨౦౦) నేను వందలవరాలు పేష్కషు నిర్ణయించి తతిమ్మా పర్గణాలు సర్కారులో దాఖలు చేసుకొనియె. అంతట కృష్ణమరాజు భీమవరము మకాము చాలించుకొని గుడ్లూరిలోఁ గోటకట్టించుకొని పైతాలూకా అనుభవించుచు (౪౨ సం.) నలుబదిరెండేండ్లు ప్రభుత్వము చేసెను."

ఇట్లుండుటంబట్టి పైకథను వేంకటాచలకవి యీవంశావళీగ్రంథముల ననుసరించియే చెప్పెనని స్పష్టమే. కృష్ణమరాజు బాలుఁడుగానుం

డేఁగా నతని దొరనుచేసి పౌంజుదారుని క్రమముం గొంపోయి తిరుగ నతనికి ప్రభుత్వమును స్థిరపఱిచినవాఁ డీవెన్నెలకంటి వెంగనమంత్రియే. ఆకారణమున నతనిపుత్త్రులేవురును వేజెళ్లవారి మంత్రులే అని వివరింపఁబడియున్నది. ఆవివరము ముందు వివరించెదను. ఈ వెంగయ్య మంత్రివృత్తాంతములో నింకొక్కటికూడ వ్రాయవలసియున్నది. అది యెద్దియనగా శ్రీరంగరాయలమెప్పు గొని పంచవన్నెలడాలు తెచ్చెనని. ఈవృత్తాంతమును పర్యాలోచించుటకుఁ బూర్వముకృష్ణంరాజు రాజ్యకాలము మఱియొకపరి చూచుకోవలసియున్నది. అది శా.స. ౧౪౮౦ మొదలు ౧౫౨౨ వఱకై యున్నది. ఇఁక విజయనగర రాష్ట్రమున కధికారమున వహించిన సదాశివరాయుని మంత్రులుగా మొదటఁ బ్రవేశించి అనంతర మారాజ్యమునకు రాజులయిన తిరుమలదేవ శ్రీరంగరాజులు శా. స. ౧౪౯౪ మొదలు శా. స. ౧౫౦౭ వఱకును వ్యవహరించినట్లు శాసనములవలనఁ గాన్పించు. ఆకాలములో నీవెంగమంత్రి శ్రీరంగరాజును మెప్పించి అతని వలనఁ బైపంచవన్నెలడాలును సంపాదించి తనప్రభుఁడు కృష్ణంరాజున కిచ్చినట్లు కాన్పించు. ఈకృష్ణమరాజు రాజ్యము కొండవీడు మొదలు గుడ్లూరివఱకును వ్యాపించి యున్నట్లుగాఁ బైపద్యములోనే యున్నది. అదే గుడ్లూరుపరగణా అని వంశావళిలోఁ జెప్పంబడియె. ౯-౭-౮ గుర్తులుగలవారలు పై వెంగమంత్రిపుత్త్రులు. వీరిలో నాఱవగుర్తుగల వెంకన్న అందఱిలోఁ జిన్నవాఁడు. అతఁడు పైభీమవరగ్రామములోనే యుండెనని యుండుటచేతఁ దక్కినవారు గుడ్లూరునకుఁ దమప్రభువు పోయినవెంటనే తామును బోయిరనియు, నీవెంకన్న మాత్ర మట్లుగాఁ బోక తమతొల్లింటి గ్రామములోనే యున్నట్లును దేలుచున్నది. ఆపద్య మెట్లున్నదనఁగా:—

"సీ. సకలప్రజ్ఞావిచక్షణ శాలియైన, వేంకటయపాటివారిని వినఁగలేము
దానశీలుఁడు వెంకన్న దానపరుఁడు పరఁగ నతఁ డుండె నాభీమవరమునందు."

ఇతని మూఁడవయన్నయగు (౭. గుర్తుగల) రంగప్పవర్ణనము.

"క. రంగప్ప రూపసంపద, రంగప్పఁడు బుద్ధి నమరరాట్పురోహితుం డౌ
సంగరవిజయుఁ డుదారుఁడు, రంగుగ నాగోలకొండరాజులు మెచ్చన్."

ఈరంగప్పకు రెండవయన్నయగు (ర. గుర్తుగల) రామన్న వర్ణన మీక్రిందివిధంబున నున్నది. ఎట్లన:—

"సీ. రామన్న మర్యాదరామన్న వేఁజెళ్ళ, నారాయణేంద్రుఁడు గారవమునఁ
జనువీయ నాయనసంస్థానకర్తయై, పాలించుఁ బ్రజల సంపదఁ బొదల
గోలకొండవజీర్నఁ గూడి దుర్గాలపై, ముత్తికవార్తించి మొత్తి మొత్తి
కడుమన్నెసరదార్ల వడిచెడఁగాఁ గొట్టి, రాజుచే మెచ్చులు రమణ నందె
తే. పొదిలె లింగప్పతోఁ గూడి భూము లెల్లఁ, గొట్టి విప్రుల కన్నంబు బెట్టి మించెఁ
గలియుగంబున వెన్నెలకంటిరామ, మంత్రికెని నీడు లేరని మహికి చెక్క."

దీనిలో సీరామనమంత్రి విశేషము యుద్ధములు చేసినట్లుగా నున్నది. అట్టి యవసర మతనిప్రభుం డగు నారాయణరాజుచారిత్రములో వచ్చియున్న దేమో దానిం జూచుటయేకాక యీనారాయణరాజు వ్యవహార మెన్నివత్సరములో యెప్పటినుండి యెప్పటివఱకో దానింగూడఁ జూడవలసియున్నది. ఆవివర మెట్లున్నదనఁగా:—

"కృష్ణమరాజుకుమారుఁడు పెదనారాయణరాజు. ఇతఁడును దండ్రివిధముగనే గుడ్లూరుపరగణా ననుభవించుచుండె. ఇట్లుండఁగా నితనికి భువనగిరిపైకి మోహిం తర్లపోవుటకు హుకుమైనది. అప్రకార మతఁడు పోయి లడాయి చేయఁగా దేహమంతయు గాయములుపడెను. ఇట్లుగా నున్నను గార్యము పూర్తిచేసుకొని వచ్చుటచేత నతనికిఁ దెల్లజెండా మొదలగు బిరుదు లనేకము లీయంబడెనవి. వానిం దీసుకొని తిరుగ గుడ్లూరు చేరి ఆ గాయములవలననే పెదనారాయణరాజు మృతుఁడాయెను. ఇతనివ్యవహారకాలము శా. స. ౧౫౨౩ ప్లవసం. మొదలు శా. స. ౧౫౫౮ ధాత సం. కటకును ముప్పదియాఱుసంవత్సరము లై యున్నది."

అనియున్నది. కావున నీనారాయణరాజు మంత్రియు సేనానియు నైన వెన్నెలకంటి రామమంత్రికి యుద్ధము చేయవలసినయవసరము విస్తరించియే యున్నట్లు కానుపించెను. ఈ యిర్వురికాలము నొక్కటియే అయియుండును గావున దానింగూర్చి వివరింపను.

(౯) వేంకటాచలకవి.

పై రామన్నకు నన్న యగునూరనకు నీగ్రంథకర్త కుమారుని కుమారుఁడు. ఆనూరనపుత్త్రిలలోఁ బెద్దవాఁడగుతిప్పన్న పై వేజెళ్లపె

డఁగా నతని ద్వారనుచేసి పౌంజుదారుని కడకుం గొంపోయి తిరుగ నతనికి బ్రభుత్వమును స్థిరపఱిచినవాఁ డీవెన్నెలకంటి వెంగనమంత్రియే. ఆకారణమున నతనిపుత్త్రులేవురును వేజెళ్లవారి మంత్రులే అని వివరింపఁబడియున్నది. ఆవివరము ముందు వివరించెదను. ఈ వెంగయ్య మంత్రివృత్తాంతములో నింకొక్కటికూడ వ్రాయవలసియున్నది. అది యెద్దియనగా శ్రీరంగరాయలమెప్పు గొని పంచవన్నెలడాలు తెచ్చెనని. ఈవృత్తాంతమును పర్యాలోచించుటకుఁ బూర్వముకృష్ణంరాజు రాజ్యకాలము మఱియొకపరి చూచుకోవలసియున్నది. అది శా.స. ౧౪౯౪ మొదలు ౧౫౦౭ వఱకై యున్నది. ఇఁక విజయనగర రాష్ట్రమున కధికారమున వహించిన సదాశివరాయని మంత్రులుగా మొదటఁ బ్రవేశించి అనంతర మారాజ్యమునకు రాజులయిన తిరుమలదేవ శ్రీరంగరాజులు శా. స. ౧౪౭౪ మొదలు శా. స. ౧౫౨౨ వఱకును వ్యవహరించినట్లు శాసనములవలనఁ గాన్పించు. ఆకాలములో నీవెంగమంత్రి శ్రీరంగరాజును మెప్పించి అతనివలనఁ బైపంచవన్నెలడాలును సంపాదించి తనప్రభుఁడు కృష్ణంరాజున కిచ్చినట్లు కాన్పించు. ఈకృష్ణమరాజు రాజ్యము కొండవీడు మొదలు గుడ్లూరివఱకును వ్యాపించి యున్నట్లుగాఁ బైపద్యములోనే యున్నది. అదే గుడ్లూరుపరగణా అని వంశావళిలోఁ జెప్పంబడియె. ౬-౭-౮ గుర్తులుగలవారలు పై వెంగమంత్రిపుత్త్రులు. వీరిలో నాలవగుర్తుగల వెంకన్న అందఱిలోఁ జిన్నవాఁడు. అతఁడు పైభీమవరగ్రామములోనే యుండె నని యుండుటచేతఁ దక్కినవారు గుడ్లూరునకుఁ దమప్రభువు పోయినవెంటనే తామును బోయిరనియు, నీవెంకన్నమాత్ర మట్లుగాఁ బోక తమతొల్లింటి గ్రామములోనే యున్నట్లును దేలుచున్నది. ఆపద్య మెట్లున్నదనఁగా:—

"గీ. సకలప్రజ్ఞావిచక్షణ శాలియైన, వేంకటయసాటివారిని వినఁగలేము
దానశీలుఁడు సిరితాన్న దానపరుఁడు పరఁగ నతఁ డుండె నాభీమవరమునందు."

ఇతని మూఁడవయన్నయగు (౭. గుర్తుగల) రంగప్పవర్ణనము.

"క. రంగప్ప రూపసంపద, రంగప్పఁడు బుద్ధి నమరరాట్పుత్త్రిమం డౌ
సంగరవిజయుఁ డుదారుఁడు, రంగుగ నాగోలకొండరాజులు మెచ్చన్."

ఈరంగప్పకు రెండవయన్నయగు (వా. గు ర్తుగల) రామన్న వర్ణన మీక్రిందివిధంబున నున్నది. ఎట్లన:—

"సీ. రామన్న మర్యాదరామన్న వేఁజెళ్ళ, నారాయణేంద్రుఁడు గారవముగఁ
జనువీయ నాయనసంస్థానకర్తయై, పాలించుఁ బ్రజల సంపదఁ జొక్కల
గోలకొండవజీర్లఁ గూడి దుర్గాలపై, ముత్తికవా త్తించి మొత్తి మొత్తి
కడుమన్నెసరదార్ల వడిచెడఁగాఁ గొట్టి, రాజుచే మెచ్చులు రమణ నంది
తే. పాదిలె లింగప్పతోఁ గూడి భూము లెల్లఁ, గొట్టి విప్రుల కన్నంబు పెట్టి మించెఁ
గలియుగంబున వెన్నెలకంటిరామ, మంత్రికిని సాటి లేదని మహికి సొక్కి."

దీనిలో సీరామనమంత్రి విశేషము యుద్ధములు చేసినట్లుగా నున్నది. అట్టి యవసర మతనిప్రభుం డగునారాయణరాజుచారిత్రములో వచ్చియున్న దేమో దానిం జూచుటయేకాక యీనారాయణరాజు వ్యవహార మెన్నివత్సరములో యెప్పటినుండి యెప్పటివఱకో దానింగూడఁ జూడవలసియున్నది. ఆవివర మెట్లున్నదనఁగా:—

"కృష్ణమరాజుకుమారుఁడు పెదనారాయణరాజు. ఇతఁడును దండ్రివిధముగనే గుడ్లూరుపరగణా ననుభవించుచుండె. ఇట్లుండఁగా నితనికి భువనగిరిపైకి మొహిం తర్లపోవుటకు హుకుమైనది. ఆప్రకార మతఁడు పోయి ఉడాయి చేయఁగా దేహమంతయు గాయములుపడెను. ఇట్లుగా నున్నను గార్యము పూర్తిచేసుకొని వచ్చుటచేత నతనికిఁ దెల్లజెండా మొదలగు బిరుదు లనేకము లీయుంబడినవి. వానిం దీసుకొని తిరుగ గుడ్లూరు చేరి ఆగాయములవలననే పెదనారాయణరాజు మృతుఁడాయెను. ఇతనివ్యవహారకాలము శా. స. ౧౬౪౩ ప్లవసం. మొదలు శా. స. ౧౬౭౮ ధాత సం. వఱకును ముప్పదియాఱుసంవత్సరము లై యున్నది."

అనియున్నది. కావున నీనారాయణరాజు మంత్రియు సేనానియు నైనవెన్నెలకంటి రామమంత్రికి యుద్ధము చేయవలసినయవసరము విస్తరించియే యున్నట్లు కానుపించెను. ఈ యిర్వురికాలము నొక్కటియే అయియుండును గావున దానింగూర్చి వివరింపను.

## (౯) వేంకటాచలకవి.

పై రామన్నకు నన్న యగునూరనకు నీగ్రంథకర్త కుమారుని కుమారుఁడు. ఆనూరనపుత్త్రులలోఁ బెద్దవాఁ డగులిప్పన్న పై వేజెళ్లపె

దనారాయణరాజపుత్త్రుఁ డగుకృష్ణమరాజువలనఁ గరణీకమును సంపాదించిన ట్లున్నది. అ దెట్లనఁగా.—

" గీ. పరఁగ వేజెళ్లకృష్ణభూపాలుకరుణ కరణ, మన నేర్పు మీఱంగ ధరణిఁ బ్రజల-
నరసి పాలించి శుభముల నలవరించి, మించి బంధులఁ జాల పోషించె నెలమి."

ఈకృష్ణమరాజు శా. స. ౧౫౫౫ మొదలు శా. స. ౧౬౦౦ వఱకు నలుబదిరెండుసంవత్సరములు పాలించె. అతనికాలమువారలే తిప్పయ్య జగ్గయ్య యనువారలు. జగ్గయ్యపుత్త్రుఁ డగునీవేంకటాచలకవి మఱి యేఁబదిసంవత్సరములకాలములో నున్నట్లుగా నూహింపవచ్చును. అటులనైన శా. స. ౧౫౫౫ మొదలు శా. స. ౧౫౯౦లోపుగా జగ్గన్న యుండె ననియు నతనిపుత్త్రుఁ డగువేంకటాచలకవి శా. స. ౧౬౧౦ంగల కాలములో నున్నాఁ డనియుఁ దేలుచున్నది. ఈవేంకటాచలకవి తనకుఁ బైప్రభువులతో సంబంధ మున్నట్లుగా నుడువలేదు. తాను ములుగు గురులింగమూర్తికి శిష్యుఁడ నని అతనికృపవలనఁ దనకష్టాంగయోగసిద్ధి గలిగె నను మొదలగు నంశములఁ జెప్పె. కావున నీతనితండ్రి పెద్దతండ్రులను బట్టియే యితని కాలము నిర్ణయింపవలసివచ్చినది ఇతనివర్ణనపద్యముల వివరించెదను. ఎట్లన్నను.—

" క. ములుగు గురులింగమూర్తికి, పొలుపుగ శిష్యుండ నభవుపూజాపరుఁ డై
యెలమి నష్టాంగయోగము, లలవడి తన్మయత నంది యానందించున్.

చ. యమనియమాదియోగము లహర్నిశముల్ సలుపంగఁ గొంత చి
త్తము విమలత్వమంది వితతస్ఫురితేంద్రియజాలభీషణా
క్రమ మడఁగంగఁ బూర్వ ఘన కల్మషదూరతచే యనంతత
త్వము మది నాటఁగాఁ దనదుభావమునన్ గనియెన్ సదాశివున్.

గీ. అట్టినను గూర్చి జలదంకిపట్టణమున, నున్న జానకిరామేశుఁ డొయ్యనొయ్య
బలికె నీచేత నుడువఁగాఁబడినకృతికి, నన్ను నధినాథుఁ జేయుము మటన్న నలరి."

ఇట్లుగా నున్నగ్రంథములోని కవిత్వవిశేషాదులు తెలుపఁజాలు నన్నిపద్యయుల నీవఱకే వివరించియున్నాఁడను, కావున నీచారిత్ర మింకటితో వదలెదను.

## విష్ణుపురాణకవి యగు వెన్నెలకంటిసూరనయొక్క సంపూర్ణ వంశావళి.

హారితసగోత్రములో

- సూరనసోమయాజి (రాజేంద్రచోళునికాలీనుఁడు)
  - కొడుకు (పేరు లేదు)
    - సిద్ధనమంత్రి.
      - భాస్కరుఁడు లేక సూర్యుఁడు {రెడ్డిఅనవేమ భూపాలుని కాలీనుఁడు.}
        - ఆదిత్యుఁడు (అమరన్న)
          - సూరయ్య లేక సూరన్న {ఇతఁడు విష్ణుపురాణకవి}
            - వెన్నెలకంటి
              - గంగన
              - బాచిరాజు
              - పెద్దవెంకన్న
              - చిన్నవెంకన్న
              - చక్రప్ప
                - సూరన్న
                - అనంతుఁడు
                - రామకృష్ణయ్య
                - గంగయ్య
                  - సూరపరాజు
                    - తిప్పన్న
                    - జగ్గన్న
                      - వేంకటాచలకవి (కృష్ణవిలాసము రచించెను.)
                      - సుబ్బన్న
                      - నరసన్న
                  - రామన్న
                  - రంగయ్య
                  - ఉదయగిరి
                  - వెంకన్న
                - కందయ్య
              - బాలమరాజు
            - లక్ష్మన్న
      - జన్నయమంత్రి (దేవరాయనికాలీనుఁడు)
        - సిద్ధయ్యమంత్రి {పైరాజుకాలీనుఁడై విక్రమార్కచరిత్రకృతిపతి}
          - చంద్రశేఖరుఁడు.
          - తిరుమలయ్య.
            - భైరవుఁడు
            - పిన్నమరాజు
          - తిప్పయ్య.
        - భైరవమంత్రి

వెన్నెలకంటివారి కాలనిర్ణయము.

విష్ణుపురాణము, విక్రమార్కచరిత్రము, కృష్ణవిలాస మను మూఁడుగ్రంథములలో వివరింపఁబడిన వెన్నెలకంటివారికాలము నాయా గ్రంథములలోనియాధారములంబట్టి చేసిననిర్ణయము ఎట్లన్నను.—

| | | శా. స. మొదలు | — | శా. స + వఱకు. |
|---|---|---|---|---|
| ౧. సూరనసోమయాజి | ... | ౧౦౩౦ | — | ౧౦౮౦ |
| ౨. ఇతనికొడుకు | ... | ౧౦౮౦ | — | ౧౧౩౦ |
| ౩. ఇతనికొడుకు సిద్ధమంత్రి | ... | ౧౧౩౦ | — | ౧౧౮౦ |
| ౪. ఇనికొడుకు భాస్కరుఁడను సూర్యుడు, జన్నమంత్రియు, వీరిలో భాస్కరుఁడనవేమారెడ్డిపేరఁ గృతుల నిచ్చె. | ... | ౧౧౮౦ | — | ౧౨౩౦ |
| ౫. పైవారిలో జన్నయకుమారుఁడు సిద్ధమంత్రి | ... | ౧౨౩౦ | — | ౧౩౦౦ |
| ౬. పైవారిలో భాస్కరుని మనుమఁడగుసూరన్న [విష్ణుపురాణకవి] | ... | ౧౩౦౦ | — | ౧౩౫౦ |

౭. ఈ సూరకవి కొడుకు వెన్నెలకంటి
౮. ఇతనికొడుకు చక్రప్ప ...
౯. ఇతనికొడుకు గంగయ్య ...

{ వీరిలో నొక్కొక్కరికేఁబది సంవత్సరముల వంతున ముఫ్వురికిని నూటయేఁబది సంవత్సరములు...౧౩౫౦ + ౧౫౦ = ౧౫౦౦

౧౦. ఇతనికొడుకు వెంగయ్య ... ౧౫౦౦ లకు బూర్వమును బరమందుఁగూడ నున్నాఁడు.

| | | | | |
|---|---|---|---|---|
| ౧౧. ఇతనికొడుకు రామమంత్రి | ... | ౧౫౦౦ | — | ౧౫౫౦ |
| ౧౨. ఇతనికొడుకు జగ్గన్న | ... | ౧౫౫౦ | — | ౧౬౦౦ |
| ౧౩. ఇతనికొడుకు వేంకటాచలపతి | ... | ౧౬౦౦ | మొదలు | ౧౬౫౦ |

---

# 24.

# రామగిరి సింగనకవి.

(పద్మపురాణోత్తరఖండము)

ఇతఁడు పద్మపురాణోత్తరఖండమును వాసిష్ఠరామాయణమును రచించిన కవిశిఖామణి. నియోగిశాఖాబ్రాహ్మణుఁడు. అపస్తంబసూత్రుఁడు. భారద్వాజగోత్రుఁడు భారతముఁ దెనిఁగించినతిక్కనసోమయాజి సంతతివారితో సంబంధి. ఇతఁడు భాగవతదశమస్కంధముఁగూడఁ దెనిఁగించితి నని తెల్పె. ఈపైరెండుగాథలను స్థిరపఱుచుపద్యముల వాసిష్ఠరామాయణమునుండి యీక్రిందఁ బరించెదము. అవి యెట్లన్నఁగా :—

“ సీ. అతఁడు తిక్కనసోమయాజుల పౌత్త్రుఁడై, కొమరారు గుంటూరికొమ్మవిభుని
పుత్త్రి బిట్టాంబిక బుధలోకకల్పక, వల్లి వివాహమై వైభవమున
భూసార మగుకోటభూమి కృష్ణానదీ, దక్షిణతటమున ధన్యశీల
నలరు రావెల యనునగ్రహారము తన, కేకభోగంబుగా నేలుచుండి
యందుఁ గోవెలఁ గట్టి గోవింద సన్న, గోపినాథప్రతిష్ఠయుఁ గోరిచేసి
అఖిలవిభవంబులందున నతిశయిల్లె, మనుజమాన్యుఁ డల్లాడమంత్రివిభుఁడు.

అని పరబ్రహ్మోపాసనంబు నిష్టదేవతాభివందనంబును సుకవివిద్వజ్జనప్రార్థనంబును కుకవిజనవాగ్బంధనంబును గురుచరణస్మరణంబును పరమభాగవతసంకీర్తనంబునుం జేసి కృతకృత్యుండనై తొల్లి హరిభక్తిరసావేశంబునఁ గతిపయాక్షరాభ్యాసచాపలంబునం జేసి విష్ణువిభవాభిరామకథాప్రభూతంబు లగుపద్మపురాణోత్తరఖండంబును భాగవతదశమస్కంధంబును దెలుంగున రచియించి.

ఇక్కవి నన్నయతిక్కనల నిర్వురిని మాత్రమే ఆంధ్రకవులలో వినుతించె. ఎట్లన్నను——

“ గీ. వ్యాసవాల్మీకశుకకాళిదాసబాణ, హర్షణాదుల నాద్యుల నాత్మనిలిపి
సకలభాషావిజ్ఞుల సముల నన్న, యార్యతిక్కకవీంద్రుల నభినుతింతు. ”

## కవివంశము.

భారద్వాజగోత్రములో బ్రహ్మనమంత్రి.

|

గుండనార్యుఁడు.

|

అల్లాడమంత్రి. — గంగనమంత్రి.

అల్లాడమంత్రి.

|

ఇతఁడు తిక్కనసోమయాజులపౌత్త్రుని కుమార్తెను బెండ్లాడె ఆవిషయ మగుపద్యము ను మొదటనే వివరించినాఁడను. ఇతనిది కృష్ణానదీతీరమునందలి రావెలయగ్రహారము.

|

అయ్యలమంత్రి. ౨.

ఇతఁడు వేఁగిదేశములోని రాజమహేంద్రవరమున కధిపతి యగుతొయ్యేటిఅనపోత భూపాలునిమంత్రియై గోదావరి కుత్తరతీరమందలి పెద్దమణికి యనునగ్రహారమున నారామక్షేత్రాదులం సంపాదించె.

|

సింగన్న. (గ్రంథకర్త.) — అనంతయ్య. — అబ్బయ్య. — నారయ్య.

పైవివరించినవారిలోఁ ౧, ౨. గుర్తులు గలవారి చారిత్రములు కొంచెము వివరింపవలసియున్నది. అందులో ౧ గుర్తు గలయల్లాడమంత్రి విషయమై చెప్పంబడినపద్యావళి కే విరించినాఁడను. దానిలో నాతఁడు తిక్కన సోమయాజుల పౌత్త్రిఁ డైనగుంటూరి కొమ్మన ప్రభుని పుత్త్రి యగుబిట్టాంబ యనుచిన్నదానిం బరిణయం బైనట్లున్నది.

## తిక్కనసోమయాజి యింటిపేరు.

తిక్కనసోమయాజితాత యగుభాస్కరమంత్రి గుంటూరివిభుఁడని వ్రాయంబడుటచేత నతనికి గుంటూరిభాస్కరుఁ డనియే నామము కల్గినట్లు కాన్పించు. ఇతని కుమారుఁడును తిక్కసోమయాజులతండ్రియు నగు కొమ్మన దండనాథునకును గుంటూరివిభుఁ డనియుండుటచేత నతనికి నింటిపేరు గుంటూరి వారనియే తేలినది. ఇప్పుడు తిక్కసోనమయాజి పౌత్త్రునకుఁగూడ గుంటూరి కొమ్మవిభుఁ డనియుండుటబట్టి అతనికి నదియే యింటిపేరుగాఁ దేలినది.ఇట్లుగాఁ దిక్కన పై వారికిఁ దఱువాతవారికిం గూడ గుంటూరివా రనుగృహనామము కల్గినవుడు తిక్కనయింటిపేరు గూడ నదియే యగుటకు సందియము లేదు. తిక్కన తండ్రిపేరు తిక్కనకు మారున కుండుట లోకస్వభావము. కాని యిచ్చోఁ దిక్కన మనుమని కే ఆ పేరున్నట్లుగా నున్నది. ఇది అచ్చుపొరపాటైనఁ గావచ్చును. లేదా యిది కుమారుని పేరుగాక మనుమనిపేరైనఁ గావచ్చును. ఇట్టిదాని నిర్ధారణ చేయుటకు గ్రంథాంతరములు దొరుక వలయునవి ప్రస్తుతములో మనకు లభ్యములు కాలేదు. కావున దాని న్వదలెదను.

## సింగనకవియింటిపేరు.

ఇఁక సీవాసిష్ఠరామాయణముం దెనిఁగించిన సింగనకవి యింటిపే రేమని విచారింపవలసియున్నది. అట్టిదానిని గ్రంథకర్త యెచ్చటను స్పష్టముగా వివరించియుండలేదు. కవిచరిత్రములో బ్ర. కం. వీరేశలింగముపంతులవారు ఇతని యింటిపేరు మడికివారుగా నిశ్చయించి యితఁడు మడికి సింగన

యని వ్రాసిరి. దానికిఁ దగినయుక్తులు కాన్పించుటలేదు. పైనమనము వివరించినఅల్లాడమంత్రికాఁపురస్థలము కోటసీమ(ధరణికోటసీమ కానోవు)లో గౌతమీనదికి దక్షిణమున రావెల యనుయగ్రహారము. దానినతఁ డేకభోగముగా ననుభవించుటంజేసి అతని నొకగుప్తుని తెలుపుటకు గాను రావెల యల్లాడమంత్రి యని చెప్పవచ్చునుఁ ఇక కవియొక్కతండ్రి యగునయ్యలమంత్రి రాజమహేంద్రవరమును పాలించుచున్న తొయ్యేటియనపోతభూపాలుని మంత్రియగుటంజేసి అతనిని రాజమహేంద్రవరపు అయ్యలమంత్రియని చెప్పనొప్పియుండును. ఈ అయ్యలమంత్రి (౨) గుప్తుతో స్వీకరింప నుదహరించఁబడు పద్యానుసారముగా గోదావరీనదికుత్తరతీరమునందలి పెద్దమణికి యను గ్రామమందున నారామక్షేత్రములను సంపాదించె నని యుండుటంజేసి అతనిని పెద్దమణికి యయ్యలామాత్యుఁ డని చెప్పినఁ జెప్పవచ్చును. ఇఁక కవియగు సింగన తాను తన ప్రభుం డగుకుమారముప్పభూపాలునివలన రామాద్రిసీమలో ననేకవృత్తులు గ్రామములను బడసితి నని చెప్పుకొనెను. ఆకారణమున నతనియింటిపేరు రామాద్రిసీమ వా రనిగాని లేకున్న నతఁడు గైకొనిన గ్రామములలో నొక గ్రామ నామము గాని అతనికి నింటిపేరుగాఁజెల్లిన లెన్నయై యుండును. ఇవియె వ్వియుఁగాక నీకవియింటిపేరు మడికి వారని నిష్కర్షించుటకుఁ బంతుల వారికిఁ గలయాధారములు మాత్రము నాకుఁ గానరాకున్నవి. ఈవృత్తాంత మేమైన నీకవివలన రచియింపఁబడినపద్మపురాణోత్తరఖండములో నున్నదేమో ముం దరయుదముగాక.

## —అయ్యలుమంత్రివర్ణన.—

ప్రస్తుతములో నీ కవితండ్రి యగునయ్యలమంత్రివర్ణనముగల (౨) గుప్తు గలపద్యము నిట వివరించెదము అదెట్లన్నను:—

"సీ. ఆత్రేయగోత్రపవిత్రు పేరయమంత్రి, పుత్త్రి సింగాంబిక పుణ్యసాధ్వి,
వెలయ వివాహమై వేఁగిదేశంబులో, నేపారు రాజమహేంద్రపురికి,
నధిపతి తొయ్యేటి యనపోతభూపాలు, మంత్రి యై రాజ్య సంపదలఁ బొదలి
యుప్పొంగుగౌతమియుత్తరతటమున, మహనీయ మగు పెద్దమణికియందు

స్థిరతరారామతతులు సుక్షేత్రములును, బెక్కు లార్జించి సితకీర్తి పెంపుమిగిలి
యఖిలజగదన్నదాత నా నవని బరఁగె, మనుజమందారుఁ డల్లాడమంత్రివరుఁడు."

ఇందలి ప్రభుం డగుతో యేటి అవనోతభూపాలుఁ డెవరను నొకశంక పొడమెడిని. అతఁ డెవ్వఁడో తెలిసినపిమ్మట నతనికాలము నత నిమంత్రియు సింగనకవికిఁ దండ్రియు నగునయ్యలుమంత్రికాలముం దెలియఁగలము. ఆపని అవసరమగునెడలఁ జేయుదుము.

## సింగనమంత్రి గ్రామములు

ప్రస్తుతములో సింగనకవికిం బ్రభుం డగుకుమారముప్పభూపాలు నివలనఁ గవి కియ్యంబడినగ్రామాదులఁ దెలుపుపద్యమును, ఆముప్ప భూపాలుంగూర్చి యాగ్రంథములో నెంతవఱకు వివరింపఁబడినదో దానిని మాత్రము తెలిపి యింతకంటె విపులముగా నున్నపద్మపురాణోత్తర ఖండములోని పై రాజువిశేషములంబట్టి కాలనిర్ణయాదికములం జేసెద ము. సింగకవి కిచ్చినగ్రామాదికములం దెల్పుపద్యము—

"గీ. ఆమహావిభుచేత రామాద్రిసీమఁ, బెక్కువృత్తులు గ్రామముల్ వెలయఁ గాంచి
యాతనియాశ్రితులం దెల్ల నధికుఁ డనఁగ, జతురుఁ డన ధన్యుఁ డన నడిసన్నవాఁడ."

కుమారముప్పభూపాలుంగూర్చి

"క. కూనయముప్పనృపాలుని, నూనుఁ డగు తెలుఁగువిభుని సుందరిమల్లాం
బానందనుఁ డగుముప్పది, భూనాథుని సుకవివరుఁడ బుధసన్నుతుఁడక్."

ఇతనివిశేషములు పద్మపురాణోత్తరఖండకృతిముఖములోన వివ రించెద నని చెప్పియున్నానుగావున దానికి ముందుగా నీవాసిష్ఠరామా యణగ్రంథకథాదులంగూర్చియు కవిశయ్యాదులంగూర్చియు కవివ్రాసిన కొన్నివాక్యములను వివరించెదను. మొదట వివరించిన వచనములో

## గ్రంథవిశేషములు.

"వెండియుఁ గవిత్వతత్త్వరచనా కౌతుకంబునం జిత్తంబుజొత్తిల్ల నొక్కకృతిం జెప్పంబూనితి. ఏందే నిఖిలభూతాంతర్యామియు నిగమార్థగోచరుండును. నిత్యసత్యజ్ఞా నానందశుద్ధాంతరంగుండును, నిశ్చలానందయోగీంద్రహృదయుండును, నిశ్శ్రేయసానం దఫలప్రదాయకుండును, నిర్మలచిదాభానుండును, నిరాకారుండును, నిర్గుణబ్రహ్మంబునగు నారాయణుం డొక్కరుండుదక్క నన్యంబు లేదనియును, బ్రహ్మాదిచేతను లతనితేజః

కణంబు లనియును, దేహం బనిత్యంబు, దేహి నిత్యుం డనియును, జీవుండు చిత్తం బనియును, చిత్తంబునందె జగత్తులు విస్తరిల్లు ననియును, తత్సంకల్పంబె బంధంబు, తన్నిరసనంబె మోక్షంబనియును, చిత్తశాంతియె జీవన్ముక్తి యనియును, పెక్కువిధంబుల నుపన్యసించు నట్టి వాసిష్ఠసంగ్రహం బాంధ్రభాష నఖిలలోకోపకారార్థంబుగా రచియించెను."

## కవివిజ్ఞాపనము.

"క. ఇది తత్త్వరహస్యార్థము, పదసంగతిఁ దెనుఁగుపఱుప బ్రాజ్ఞులకును బె
ట్టిద మగుఁ దత్పరవాసన, విదితంబుగఁ గవులు మెచ్చ విరచించుఁ దగన్.

క. విజ్ఞానులు మును జెప్పిన, సంజ్ఞాభ్యాసములు కొంత జాడలు పోఁకన్
విజ్ఞాపనంబు జేసెద, ప్రాజ్ఞులు తార్కికులు తప్పుపట్టకుఁ డెలమిన్.

క. కరు కిది నీరస మని వే, సర కల్లన వినుఁడు తుద రసాయన మగుఁ బాఁ
జెఱకు తుదనుండి నమలిన, తెరగున మది కింపు దనుపుఁ దీపున్ జూపున్.

క. మృదుమధురవచనగర్భము, గదియించినయట్లు తత్త్వగాథార్థము చె
ప్పుదుఁ బువ్వుదేనెఁ గొను తు, మ్మెద మ్రాఁకులు దొల్చు నేర్పు మెఱసినభంగిన్.

క. ఇది యల్పగ్రంథం బని, మదిఁ దలపకుఁ డఖిలశాస్త్రమతములు దీనన్
విదితం బగు నద్దములో, మదదంతావళము దోఁచుమాడ్కిని దెలుపున్."

## కృతిపతివిషయము.

తనతొల్లింటిగ్రంథములవలెఁ గాక నీగ్రంథము అహోబలనృసింహస్వామివారికి సింగనకవివలనఁ గృతియియ్యఁబడినది. దానికిఁ గారణాదికము నీక్రిందిరీతిని వివరించె. ఎట్లన్న—

"వ. అని సకలజనసమ్మతముగా నుపక్రమించి యనన్యసామాన్య యోగవిక్రమావితావధూమణికిఁ బురుషుండును పురాణపురుషుండును గావుతమని, యఖిలలోకాధీశ్వరుండును, అతులకల్యాణగుణాలంకారుండును, ననవరత లక్ష్మీసమేతుండును, నాదిమధ్యాంత రహితుండును, నభిమతఫలప్రదాయకుండును, నగు నహోబల శ్రీనృసింహదేవునకు నిచ్చెద నని తలంచి, యద్దేవుం డఖిలవేదాంతవాగ్గోచరుం, డతితుచ్ఛంబు లగునా ద్వాక్యంబు లర్పింతుననుటయు మహాద్రోహం బగునో యని శంకించి, యప్పరమేశ్వరుం డాశ్రితసులభుండగుటయు, మత్కవిత్వంబు తదీయవరప్రసాదలబ్ధం బగుటయు భావించి మనంబున నిట్లు వితర్కించితి.

క. వనరాశి జలము గొని యా, వనరాశికి నర్ఘ్యమిచ్చువడువున హరియి
చ్చినవాక్యము లే నతనికి, ననయముఁ గృతి సెప్పి సుకృతి నగుదు ధరిత్రిన్.

క. గురుఁడును దల్లియుఁ దండ్రియుఁ, బురుషుఁడు, విద్యయును, దైవమును దాతయు నా
భారి నేఁడుఁ గడయుఁ దా నై, హరి నను రక్షించుఁ గాత ననవరతంబున్.

క. తన పేరిటివాఁ డనియును, దన దాసుల దాసుఁ డనియుఁ దనకీకవితా
వనితామణి నిచ్చినవాఁ, డనియును రక్షించు గాక హరి నన్ను దయన్."

అని యున్న పైవిజ్ఞాపనాంశముంబట్టియు గృతిపతి నిర్ణయాంశముంబట్టియు నీకవిమనోదార్ఢ్యాదులును, యుక్తిపరంపరయును, గవిత్వప్రజ్ఞయుఁ గోచరంబు కాకపోదు. ఇట్టి ధైర్యస్థైర్యములు గలకవియును భాగవతము నాంధ్రీకరింప వెఱచి దానిలోని దశమస్కంధసుమాత్రము దెనిఁగించె. దానికిఁ గారణము తత్త్వరహస్యార్థము లున్న పరమార్థగ్రంథమది గావున దానిం దెనిగింపఁగూడ దనునాకాలములోని పండితాభిప్రాయమై యుండవచ్చును. అట్లున్నను కవికిఁ గలవిష్ణుభక్తియే అతనిచేత నాభాగవతములోని శ్రీకృష్ణకథావిశేషంబులనైనఁ దెలిఁగించక తప్పనట్లుత్సాహించెను. పద్మపురాణోత్తరఖండమును వైష్ణవమాహాత్మ్యప్రతిపాదకంబే గావున నతఁడు ప్రథమములోనే దానిం దెనిగించె. ఇఁక నీవాసిష్ఠరామాయణము భాగవతమువంటి మహత్తరగ్రంథమే అయినను, అందలి యంశములు పాఠకులకు సుబోధంబులు కావు. గావున దానింగూడఁ దెనిఁగించె. ఇది మిక్కిలి సంగ్రహాషక్కికగా నీతనివలనఁ దెనిఁగింపఁబడియె. అట్టిదానికి సమ్మతింపని నవీనకవులలో నొక్కండును, నైజాముదేశములోని ధర్మపురినివాసియు నగుకృష్ణగిరి వేంకటరమణకవివలన నీవాసిష్ఠరామాయణము సంస్కృతమునకు సమముగా విపులముగా నుండునట్లుగా నాంధ్రీకరింపఁబడియె. ఈరెండుగ్రంథములకును గలభేదం బీగ్రంథాంతమునఁ గొంత సూచించెదను. ప్రస్తుతములోఁ బద్మపురాణోత్తరఖండమున నీకవి వివరించిన కృతిపతివంశమును, అతనికినిఁ దనకును ప్రభుం డగుకుమారముప్పభూపాలునిచారిత్రమును వ్రాయవలసియున్నది. దానికి ముందుగా నీగ్రంథములో సింగనకవి పూర్వకవుల నెవ్వరిఁ జేర్కొనెనో ఆవృత్తాంతంబు గొంత పరిశీలించెదము—

## ఆంధ్రపూర్వకవిస్తుతి.

"ఉ. భారత వేదవాక్యరసభావము లజ్ఞు లెఱుంగలేక ని
స్సారమనప్కులై తిరుగుచందముఁ జూచి తెలుంగుబాస దెం

పార రచించి యందఱఁ గృతార్థులఁ జేసిన పుణ్యమూర్తులన్
సారమతిన్ భజింతు ననిశంబును నన్నయతిక్కనార్యులన్. ''

దీనింబట్టి భారతారణ్యపర్వశేషమును భారతశేషం బగుహరి వంశమును బూర్తిచేసిన యెఱ్ఱాప్రెగ్గడ యీ కవికాలమునకుఁ బైకార్యము చేసియుండునట్లు సూచించు. లేదా యితనికాలీనుఁ డైనఁ గావచ్చును.

### స్వగురువర్ణనము.

" క. ధర సింహపురములకును గురు, చరణంబులె యాత్మ నాఁగఁటఁ జర్చించి మఱిం
బరవాదిభద్రవారణ, హరిభక్తులఁ దిరుమలయ్యయార్యులఁ దలఁతున్. ''

దీనింబట్టి పరవాదిభద్రగజకేసరి బిరుదాంకితుఁ డగుతిరుమలాచార్యుఁ డితనిగురుం డని తేలినది. ఈ తిరుమలాచార్యకాలముఁ దెలియు నాధారములు లేవు.

### కృతిపతికిఁ బ్రభుఁ డగుముప్పభూపాలువంశావళి.

౧. కూనయముప్పరాజు.

|

౨. గురిజాల తెలుఁగు రాయఁడు.

|

౩. ముప్పదిరాజు — ముత్తరాజు ౪.

### ఈ ముప్పదిభూపాలుని రాజ్యాదికము.

" వ. అని ప్రశంసింపఁదగిన విభవ విలాస విక్రమ విజయ విఖ్యాతులఁ బ్రసిద్ధుం డైన ముత్తభూపాలుండు తనకు సహాయుఁడుగా గౌతమీ దక్షిణభాగంబునఁ బరమ పావనం బగుసబ్బినాటిరాష్ట్రంబున రామగిరిపట్టణంబు నిజరాజధానిగాఁ బురందర విభవుండై రాజ్యంబు సేయుచున్న ముప్పరాజు ''

అని చెప్పి అతని బిరుదులం దెల్పె. అవి యెవ్వియన.—

" ౧. నీరుపెత్తురుగండ. ౨. గండరగండగోపాల. ౩. కాంచీరక్షపాలక. ౪. చోడరాజ్యస్థాపనాచార్య. ౫. దొంతియుమన్నెవిభాళ. ౬. చలమర్తిగండ. ౭. గజగండ వారణ. ౮. రాయగజకేసరి. ౯. మూరురాయజగకాళి నానాబిరుదవిఖ్యాతుండు, అగు ముప్ప భూపాలచంద్రుఁడు. ''

### కృతపతికందనవంశము.

పైముప్పరాజచంద్రునకు సకలసామ్రాజ్యభారధురంధరుండును, ధర్మచరిత్రుం

డును, నీతిచాతుర్యవివేక విశేష గుణాలంకారుండును నై యమ్మహారాజుమన్నన వడసి విశేషవస్తు వాహన ఛత్ర చామ రాందోళికాది రాజచిహ్నంబులం బొంది కందనామాత్యవంశావతారం బెట్టిదనిన ''

వాణసవంశము. కాశ్యపగోత్రము.

- రుద్రమంత్రి (మొలగూరుగ్రామాధిపతి)
  - నన్నయ(౧) {ఇతఁడు కాకతీయ గణపతిరాజుమంత్రి}
    - మల్లనమంత్రి (౨)
      - గణపతి
        - మల్లన
        - అబ్బన
          - తిప్పన
          - కేసన 3.
          - కందనమంత్రి (కృతిపతి)
          - మంత్రి.
        - మంత్రి.
      - గోపన
      - రామన
      - మంచిగన్నయ
  - రుద్రయ
  - పోతయ
  - ఎల్లయ

ఇట్లుగా నీవంశావళిలో వివరింపఁబడిన పురుషులలోని. ౧. ౨. 3. గుర్తులు గలవారి చారిత్రముం దెలుపుపద్యముల నీక్రింద వివరించెదను. అందు

౧. నన్నయమంత్రివిశేషములు.

" చ. పరువడి కాకతీయగణపక్షితినాయకునొద్ద మాన్యుఁడై
ధరణిఁ బ్రశస్తుఁడై సెగడె దానములెల్లను జేసి పేరు వెం
పెరుఁగఁ గుళ్లు గట్టి గణపేశ్వరదేవుని గోపికాధిపుం
దిర మగుచున్నలక్ష్మిని బ్రతిష్ఠలు చేసెఁ బ్రభుత్వ మేర్పడన్."

దీనింబట్టి యీనన్నయమంత్రికాలము కాకతీయగణపతిదేవుని కాలముగాఁ దేలినది. ఇదివఱలో మనకుఁ గాన్పించుచున్న గణపతిదేవుని

శాసనములం బట్టియు, నాతనిమంత్రి దండనాథులకాలముం బట్టియు నీ గణపతిదేవుఁడు శా. స. ౧౦౯౩ మొదలు ౧౧౩౦ వఱకు నున్నట్లు తేల్చితిమి, ఆవివరమంతయు నీవఱకే కాకతీయుల వంశచారిత్రములో వివరింపఁబడినది. గావున నిచ్చో దాని విస్తరింపను. అట్టిగణపతిదేవుని మంత్రి యగునీనన్నయకాలము నావిధముగనే నిర్ణయింతము. అతని నుండి అయిదవపురుషుఁ డీకృతిపతి యగుకందన మంత్రి. ఇతని కాలము మనము పురుషునకు ముప్పది సంవత్సరములవంతున లెక్కింపగా నైదు గురుపురుషులకును నూటయేఁబదిసంవత్సరములు చేర్చవలసియుండును. అనఁగా సుమారు ౧౦౯౦ లో ౧౧౦. ౧౨౦౦ శా. స. మగు నటనుండి నూఱుసంవత్సరములవఱకుఁ జూచిన శా. స. ౧౩౦౦ లకు లోపలనే కందనమంత్రికాల మగు.

ఇఁక నితనికిఁ గృతినిచ్చిన సింగనకవికాల మించుమించుగా నదియ యగు నగుటకు సంశయము లేదు. పైగణపతిరాజు కాలీనుఁ డగుతిక్కన సోమయాజితో నీకవి కొంతదూరపు సంబంధి యగుటంజేసి అక్కడినుండి యు లెక్కించి చెప్పవచ్చును. కాకతీయుల చారిత్రముంబట్టి తిక్కనసోమ యాజి గణపతిరాజు పెద్దతండ్రి యగురుద్రరాజు కాలమువాఁడుగాఁ దేలిన ది. ఆరుద్రరాజు శా. స. ౯౭౨ మొదలు శా.స.౧౦౯౦ వఱకు నున్నట్లు కాను పించుచున్నది. తిక్కనసోమయాజి శా.స. ౧౦౨౦ మొద లున్నట్లు చెప్పు టకు సందియ ముండదు. ఇతనిమరణము లోకల్‌రికార్డులలో నున్నట్లు శా. స. ౧౧౨౦ అగునెడల నీతఁడు నూఱుసంవత్సరములు జీవించియుం డును ప్రస్తుతములో మన కింతకంటె నీతనినిర్యాణకాలముం దెలుపుగ్రం థాధారములు లేవు గావున నీతనిమరణకాల మిదిగానే భావించి యితని నుండి యీసింగనకవికాలము నిర్ణయింతము. ఇతఁడు తిక్కనసోమయాజి పౌత్త్రినిపుత్త్రిక(లేకపుత్త్రినిపుత్త్రికకు) మనుమఁ డని చెప్ప బడెఁ గావు నఁ దిక్కనసోమయాజినుండి యితఁ డేడవపురుషుఁడు గావచ్చును. అపతి. ములోఁ గడమ ఆర్వురుపురుషులకును (౧)కి ముప్పది సంవత్సరము చొప్పునఁ ౧౮౦ బదిసంవత్సరము లగును. అనఁగా ౧౧౨౦ + ౧౮౦=౧౩౦౦.

అగును. పై లెక్కనుబట్టి కృతిపతి యగుకందనమంత్రియుఁ గొంచెమె చ్చు తగ్గుగా నాకాలమువాఁడే అయియుండె. కావున నీయిర్వురను శా. స. ౧౩౦౦ ల కాలము వారని నిశ్చయించెదము గాక.

## ౨. గుర్తుగల మల్లనమంత్రి.

ఇతనింగూర్చి చెప్పంబడినపద్యము విశేషచారిత్రాంశములం జెప్పునది కాకున్న నీమల్లన మంత్రి స్థలాదికములం దెలియంజేయును. అది యెట్లున్నదనఁగా:—

"ఉ. అశతమన్యువైభవుఁ డహర్పతితేజుఁడు చంద్ర చంద్రికా
కాశసమానమూర్తి యగుగౌరమమల్లనిమంత్రి దిక్కులన్
వాసికి నెక్క భక్తి ననివారణమై గుడికట్టి కట్టరా
మేశుఁ బ్రతిష్ఠచేసి నుతికెక్కిన నమ్ముల్గూరివాకిటన్."

దీనింబట్టి ఇతనిస్థలము మొలగూ రని తేలినది.

## 3. గుర్తుగలకేసనామాత్యువిశేషములు.

ఇతఁడు కృతిపతి యగుకందనామాత్యునకు జ్యేష్ఠభ్రాత. ఇతఁడును కుమారముప్పభూపాలునిమంత్రి యై యున్న ట్లుండుటం జేసి ప్రథమములో నితఁడే మంత్రిగా నుండె ననియు నితనియనంతరము కందనమంత్రి పైరాజునకు మంత్రిగా నుండెననియు నూహింపనై యున్నది. ఈ క్రింద నుదహరింపఁబడు నీసపాదమువలనఁ గేసనమంత్రి ముప్పభూపాలుని మంత్రి యగుట స్పష్ట మగుచున్నది. ఎట్లన.—

." తననీతి ముప్పదిధరణీశుఁ డేలెడి, ధరణికి వజ్రపంజరము గాఁగ "

ఇతఁడు గొన్ని ధర్మకార్యములు చేసినట్లు మఱియొకపద్యము వలనఁ గాన్పించు ఎట్లన్నను:—

" చ. అతులితలీలఁ గేససచివాగ్రణి ధర్మపురంబునందునం
చితముగ నన్నసత్త్రి మిడి శ్రీనరసింహున కుత్సవంబులన్
సతతమహోపచారములు సల్పుచు రామగిరీంద్రమందు సు
స్థితి గుడిఁ గట్టి విష్ణుని ప్రతిష్ఠ యొనర్చె నుదాత్తసంపదన్."

ఈ పయిం జెప్పబడ్డ ధర్మపురి ప్రస్తుతములో నిజాముౘారిపాలన క్రింద నుండునది. దీనిసమీపములోని వే మంథెన, కాళేశ్వరములు. ఈధర్మ

పురిలోని నృసింహస్వామి పేరిటనే నృసింహశతక మనుసీసపద్యశతకము పుట్టినది. దానిముకుటము.—

"......శ్రీధర్మపురనివాస, దుష్టసంహార నరసింహ దురితదూర"

అని యున్నది. కావున నృసింహస్వామియుండిఅంమమూలముగాఁ బ్రసిద్ధినందిన ధర్మపురి పైధర్మపురియే యనియు నా నృసింహునకే యీ కేసనమంత్రి విశేషోత్సవాదులు చేయించుచుండె ననియు దేలినది. ఇఁక రామగిరిపై నీకేసనమంత్రి గుడికట్టించి అందులో విష్ణుని ప్రతిష్ఠ చేసెనని మఱియొక వృత్తాంతము నాపద్యములోనే యున్నది. ఈ రామగిరిసీమలోనే యీసింగనకవి తాను ముప్పభూపాలునివలన ననేకవృత్తులు గ్రామములు సంపాదించినట్లున్నది. ఈ రామగిరి అనునది కేవలము పర్వతమే కాక యొకగ్రామనామముకూడ నైనట్లును, అది యీముప్పభూపాలుని ముఖ్యపట్టణ మైనట్లునుగూడఁ గాన్పించు. దానికి వాసిష్ఠరామాయణములో నీక్రిందివిధ మగునాధార మున్నది. దానిలోనే కృతిపతి యగు కందనమంత్రివృత్తాంతముగూడ వచ్చునుగావున నావాక్యములు ముందు వివరించి కృతిపతివిశేషములఁగూడ నీరెండుగ్రంథములలో నున్నట్లు వివరించెదను. అది యెట్లున్నదనఁగా:—

"విష్ణువిభవాభిరామంబు లగుపద్మపురాణోత్తరఖండంబును, భాగవత దశమ స్కంధంబును దెనుంగున రచియించి యప్పుణ్యపురాణంబులకుఁ గృతిపతిగా నే పుణ్యాంభోధిఁ గంటునో యని విచారించి, గజగంధవారణ, గండగోపాల,చలమర్తిగండ, రాయగజకేసరి, దొంతిమన్నె నానావిభవాది బిరుదవిఖ్యాతులం బ్రసిద్ధుం డగు రామగిరిపట్టణాధీశ్వరుం డైనకుమార ముప్పభూపాల మాన్యమంత్రివరధురంధరుండును, అమ్మహారాజ దిగంతరవ్యాప్తకీర్తిలతాలవాలుండును, ధర్మచారిత్రుండును, నీతిచాతుర్య వివేకవిశేష గుణాలంకారుండును, నఖిల దిక్కరికకీర్తి విశాలుండును, వాణసవంశాబ్ధి సుధాకరుండును, గౌశ్యపగోత్రపవిత్ర అబ్బనార్యతనూభవ కందనామాత్యుండు నాకు నతిస్నేహబాంధవుండును, అపూర్వవచనరచనానుబంధబంధుర కావ్యరసాభిజ్ఞుండును, నర్థిజనపారిజాతుండుఁ గావున నమ్మంత్రియుగంధరుం గృతిపతిఁ గావించి"

అని యున్నది. దీనింబట్టి చూడ నీసింగకవికిఁ బ్రభుం డగు ముప్పభూపాలుఁడు రామగిరిపట్టణాధీశ్వరుఁ డని తేలినది. ఈపట్టణము ప్రధాన

మగుసీమనే రామగిరిసీమ యని వాడఁబడినట్లును దానిలోపలనే యీప్ర భునివలన సింగకవి కనేకవృత్తులు గ్రామము లీయంబడిన ట్లీవఱకే వివరిం చియున్నాను. ఈరామగిరి పట్టణమునకు నీగ్రంథకాలమునాఁటికి సబ్బినా టిరాష్ట్రమని పేరున్నట్లుగా నది గౌతమీనదికి దక్షిణభాగంబున నున్న ట్లుగా వివరించియే యున్నాము. ఇట్టి రామగిరిపట్టణమునకు వేఁగిదేశము లోని (ప్రస్తుతపు గోదావరిజిల్లాలోని) పెద్దమనికి గ్రామమునకుఁ గొంచె మెచ్చుతగ్గుగా నెలదినములప్రయాణము పూర్వ ముండియుండు. అట్టి పట్టణములో గాఁపురముగా నుండుసింగనకవి కాతనితండ్రి సంపాదించిన పెద్దమనికింబట్టి మడికి సింగన యని చెప్పటకంటె నీతఁడు స్థిరపడి గ్రంథ రచనచేఁ బ్రసిద్ధినందినందున రామగిరి సింగన యని పిలుచుటయే మిగుల ననుకూల మని చెప్పి యితనియింటిపేరు రామగిరియని నవరించి యితని నింతటినుండి రామగిరి సింగన యని చెప్పెదము. పైవచనమువలనఁ గృతి పతి యగుగన్న మంత్రి వృత్తాంతము కొంత గోచరమగును. దానినే పద్మ పురాణోత్తరఖండములోఁ గొంతవిపులముగావివరించి యీసింగకవి చెప్పె ను. ఆకృతిపతి స్వకీయాస్థానమంటపంబునఁ గూర్చుండి కవిని గ్రంథరచనకై బిలిపించిన వృత్తాంతంబు నీక్రింద వివరింపుచున్నాఁడు. అదెట్లనిన :—

"వ. సప్తసంతానంబుల నుత్తరోత్తరంబు లగుకీర్తి సుకృతంబులకు మూలంబు కృతిపతిత్వంబుగా నిశ్చయించి, యష్టాదశపురాణంబులందును, సాత్త్వికంబునుం బరమ ధర్మార్థమోక్షప్రదంబును, విష్ణుకథాప్రధానంబును నగుపద్మపురాణంబు తెనుంగు సేయం దలంచి"

క. అపరమేశ్వరమకుట, వ్యాపృతగంగాప్రవాహావరకవితాస
ల్లాపుఁ డగుకవిని సింగనఁ, జేపట్టక కీర్తిగలదె శ్రీమంతులకున్. "
అని సింగనకవిం బిలువనంపించిన ట్లున్నది.

→ కవివంశావళీసంగ్రహము. ←

"వ. అనిపొగడంగఁ దెంపెసగునయ్యలమంత్రికి సింగమాంబకున్
దనయుని విష్ణుమంగళకథానుముఖాత్మునినిత్యసౌమ్యవ
ర్తను శుభశీలు సత్కవితారసపోషణవాగ్విలాసుభూ
జనసుతసింగనార్యు గుణసాగరు నన్ బిలిపించి యర్మిలిన్. "

## తెలుఁగురాయలంగూర్చి.

ఇదివఱలో జైమినీభారత గ్రంథముంబట్టి సాఁపరాయని కాలమును నిర్ణయింపవచ్చునని శ్రీనాథకవి చారిత్రములో వ్రాసియున్నాను. ఆసాంపరాయనివర్ణనకంటె నాగ్రంథములో నాతని యాస్థానసామంతుఁడును కృతిపతి యగునతనివర్ణనము విశేషించి వ్రాయఁబడినది ఆవర్ణనలో నీసాంపరాయనింగూర్చి కొంచెము వ్రాయంబడె నని సూచించియుంటిని. ఆపద్యమును వివరించెదను. ఎట్లన.—

"సీ. దరములో దక్షిణసువతాను నెదిరించి, కొనివచ్చిసాంపరాయనికి నిచ్చె
సామ్రాజ్యమున నిల్పి సాంపరాయస్థాప నాచార్యబిరుదు విఖ్యాతి గాంచె
శ్రీరంగవిభుఁ బ్రతిష్ఠించి యిర్వదివేలు, మాడలద్దేవుసమ్మౌళికి నొసఁగె
మధురాసురత్రాణు మడియించిపరరక్షు, సాళువబిరుదంబు జగతి నెఱపె
తే. గబ్బితనమునఁ దేజి మొగంబు గట్టి, తతిమి నగరంపుగవనులు విఱుగఁ ద్రోచి
తాను వ్రేసినగొరు సుద్దవిడిఁ దెచ్చె, సాహసంబున సుప్పాంగుసాళ్వమంగు."

ఇట్లుండుటంబట్టి పైసాంపరాయఁ డొకగొప్పరాజుగాఁ దేలుచున్నది. ఇతనికుమారునిపేరు తెలుఁగురాయఁ డని అతనిని సాంపరాయని తెలుంగాధీశుఁ డని శ్రీనాథకవి వర్ణించిన ట్లుండుటచేతఁ దేలినది. ఇతనికే యిర్వురుకుమారు లుండిరనియు నందులోఁ బెద్దవాఁడు కుమారముప్పరాజనియుఁ దేలినది. ప్రస్తుతములోని తెలుఁగురాయఁడు సూనయముప్పభూపాలునికొడుకుగాఁ దేలుటంజేసి పైసిద్ధాంతము తిరిగిపోయినది.

## తొయ్యేటి అనపోతభూపాలునికాలము.

ఈ యనవోతభూపాలునికాలముంగూర్చి యీవఱకే తిక్కనసోమయాజిచారిత్రములో నీసింగకవింగూర్చి వ్రాయునపుడే కొంతవ్రాసియున్నారము. కొండపీటిశాసనములంబట్టి యితనికాలము శా. స. ౧౨౭౦ మొదలు శా. స. ౧౨౯౦ వఱకు నున్నట్లుగా వివరించియుంటిమి. అతనికడ మంత్రిగా నున్నసింగనమంత్రితండ్రి యగునయ్యలమంత్రియుఁ గొంచె మెచ్చుతగ్గుగా నాకాలమువాఁడే అయియుండును. అదియునుఁగాక అనవోత భూపాలుఁడు ముప్పదిసంవత్సరములు రాజ్యము

చేసినట్లు కనుపించులెక్కవలన నతనివయస్సు నంతే యై యుండు నని యూహింపఁగూడదుగదా. కావున సింగనకవికాల మాతనితండ్రి యగు నయ్యలమంత్రికిఁ బ్రభుఁ డగునన వోతభూపాలునికాలముంబట్టికూడఁ గొంచెమెచ్చుతగ్గుగా సరిపడియే యున్న దని చెప్పవచ్చును. పై గ్రంథము

## పీ. కవిచరిత్రవిమర్శనము.

లో బ్ర. వీరేశలింగము పంతులవారు సింగకవి (మడికి సింగన్న) చారిత్రములో నతనికాలనిర్ణయముంగూర్చి కొంత యత్నించి దాని నొకవిధముగా నిర్ణయించిరి. దానింగూర్చి వారువ్రాసినదాని మనమిపుడు పరిశీలించవలసియున్నది. అందు వా రెట్లుగా వ్రాసి రనఁగా :—

"పై పద్యములవలన నీకవి తిక్కనసోమయాజుల మనమరాలి మనుమఁ డగుటయే కాక గోదావరీమండలములోని పెద్దమడికి నివాసుఁ డనికూడ స్పష్టమగుచున్నది."

అనువలుకు ముందుగా నాలోచింతము. ఇదివఱలో మనము చూపిన పద్యములుఁగూడ నివే అయియున్నవి. అందులో మొదటిపద్యమగు

"అతఁడు తిక్కనసోమయాజుల పౌత్రుఁ డై, కొమరారుగుంటూరికొమ్మవిభుని
పుత్రి బిట్టాంబిక బుధలోకకల్పకవల్లి వివాహమై——"

అని యుండుటం జేసి పుత్త్రుఁ డనుపాఠము సరి కా దని చెప్పియున్నారము. ఇపుడు మన మరసినమార్గముంబట్టి తిక్కనసోమయాజి కీ సింగనకవి మనమరాలిమనమఁడుగాక ముమ్మనమరాలి మనుమఁడుగాఁ దేలును. దానివలన గలుగుభేదము కలుగదనియే భావించెదము. ఇఁకఁ దరువాయి వాక్యములను బరిశీలింపవలసియున్నది.

"ఈకవి పద్మపురాణమునకుఁ గృతినాయకునిఁగాఁ జేసినకందనమంత్రి మామార్కండేయపురాణమును గృతినందిన గన్నయమంత్రికి యన్న మనుఁ మడొటకూడఁ గవికాలమును నిర్ణయించుట కనుకూలపడుచున్నది. గన్నయమంత్రి జ్యేష్ఠభ్రాత గణపతి. గణపతి ద్వితీయపుత్త్రుఁ డబ్బయామాత్యుఁడు. అబ్బయామాత్యుని తృతీయపుత్రుఁడు కందనమంత్రి. తిక్కనసోమయాజిశిష్యుఁ డైనమారన తనమార్కండేయపురాణ మంకితముచేసిన గన్నయమంత్రికిఁ గంగనమంత్రి యన్న పౌత్రుఁ డగుటచేతను, కందనమంత్రి కాలములో సింగకవి యుండుటచేతను సింగకవిమారనకుఁ దఱువాత మున్నదినలంబది

సంవత్సరముల కుండిన నుండవచ్చును. కాబట్టి యీసింగకవి క్రీ. శకము ౧౩౪౦-౭౦ (౧౨౬౨ శా. స.) సంవత్సరప్రాంతమున నుండవచ్చును. "

ఇక్కడ మనము వ్రాయవలసినది కొంత యున్నది. పైసిద్ధాంతము ననుసరించుటకు ముందు దాని యథార్థము కొంచె మరయవలసి యున్నది. పద్మపురాణోత్తరఖండములోని కృతిపతి వంశావళి నిదివఱలో వివరించియున్నను దానిని మారనకృత మగుమార్కండేయపురాణములోని వంశవృక్షము నొక్కచో వివరించి పరిశీలించెదముగాక. అపుడు బంతులవారు వివరించిన సంబంధములు స్పష్టపడును. అవి యెట్లున్నవనఁగా :—

**పద్మపురాణముకృతిపతివంశము.**

బ్రాహ్మణులలో వాణసవంశమున కాశ్యపగోత్రమునందు రుద్రమంత్రి.

- నన్నయ
  - మల్లన
    - గణపతి
      - మల్లన
      - అబ్బన
        - కందన (కృతిపతి)
      - మంత్రి
    - గోపన
    - గామన
    - మంచిగన్నయ
- రుద్రయ
- పోతయ
- యల్లయ

**మార్కండేయపురాణముకృతిపతివంశము.**

కూదుర్లు మల్ల సేనాని.

- నాగయ్య (మేచకనాయకపుత్రికకు భర్త.)
  - గన్న సేనాని (కృతిపతి)
  - ఎల్లయ
  - మేచయ

ఇట్లుగా నున్న పైరెండువంశములవారికిని బంతులవారు కల్పించుసంబంధ మూహాకురాకున్నది. మార్కండేయపురాణములో నున్న గన్న సేనానినే పద్మపురాణములోని మంచిగన్నయగాఁ బంతులుగారు పొరపడియుందురు. ఈ గన్న సేనాని నాగియసేనాని పుత్త్రులలో

జ్యేష్ఠుఁ డైనట్లు కానుపించును.మంచిగన్నయ యనునతఁడు మల్లన య నునతనిపుత్త్రుఁడై యతనినల్వురికొడుకులలోఁ గనిష్ఠుఁడుగాఁ గాన్పించు. ఇట్లున్నను పంతులవారు గన్నసేనానికి జ్యేష్ఠభ్రాత యున్నాఁ డనియు నతఁడు గణపతినామకుఁ డని వ్రాసిన వాక్యముల కర్థముకాక యున్నది.మా ర్కండేయపురాణములోని గన్నసేనాని యింటిపేరుగాని గోత్రముగాని వివరింపఁబడియుండలేదు. పద్మపురాణములోని మంచిగన్నయ వాణస వంశమువాఁ డనియును కాశ్యపగోత్రుఁ డనియు వ్రాయంబడియున్నది. ఆయిర్వురితండ్రులపేరులును భేదములైనవి. వాటియాద్యక్షరములైన నొకటి కావు.ఒకనిపేరు నాగయ్య. రెండవయతనిపేరు మల్లయ్య. అయితే యీమల్లయతండ్రి యగునన్నయమంత్రి కాకతీయగణపతి కాలీనుఁ డని యుండుటచేతను,నాగయ్య యను నతనిమామ యగు మేచనయ నునతఁడు కాకతీయగణపతియొద్దతలారి యని యుండుటంబట్టి ఆయిర్వురు కాకతీయగణపతికాలీను లనునమ్మకముతో నుండి తక్కినసంగతులన్నియుఁ బొరబాటున నూహించియుందురు. ఇట్లుగానినాఁడు పంతులవారి యూహాలకుఁ గలకారణముల వివరింపుఁ డని పంతులవారినే మనము కోరుదము. దానిని వారు తెల్పినపిమ్మట నీకథనంతయును నమ్ముదము. ఇఁకఁ బంతులవారు వివరించిన తక్కినయంశములఁగూర్చి విచారించవలసియున్నది.అందులో నెఱ్ఱాప్రెగ్గడకంటె సింగకవి పూర్వుఁ డని యీక్రింధవిధంబున వ్రాసిరి.

" ఇతఁ డెఱ్ఱాప్రెగ్గడకంటెఁ గొంత పూర్వుఁడు. కాబట్టియే సింగకవి పద్మపురాణమునం దీక్రిందిపద్యముచేత నన్నయ తిక్కనలను మాత్రమే స్తుతించియున్నాఁడు." అని. ఇది కేవలమొక సిద్ధాంతాంశముగాదు. కొందఱుకవులు కవిత్రయము వారినిఁగూడ నుతియింపక యుండుట గలదు. మఱికొందఱు నన్నయ తిక్కనలమాత్రమే నుతియించుటయుఁ గలదు. తిక్కన సోమయాజియే నన్నయభట్టు భారతములోని మొదటి మూఁడుపర్వములం దెనిఁగించె నని వ్రాసియుండుటంజేసి ఆమార్గమునే అతనిసంబంధి యగుసింగన యవలంబించి భారతము

నన్నయతిక్కనలకృతం బని ఆయీశ్వర నుతియించె. ఈసింగనకవి భాస్కరరామాయణగ్రంథకర్తలలో నొకరిపేరునైన స్మరియింపలేదు సరియేకదా తిక్కనసోమయాజివలనఁ గూడ నుతియించఁబడిన యతని తాత యగుభాస్కరమంత్రినిఁగూడ వదలివేసెను. ఆకారణమున నాతని కంటె నీసింగనకవి ప్రాచీనుఁ డనిచెప్పనొప్పియుండదుగదా. ఇతర మైనసాధనములచేత నే యెఱ్ఱాప్రెగ్గడకంటెఁ బూర్వుఁ డని తేలునెడల దానికి సహాయముగా నతనిపే రీతఁడు స్మరియింపకపోవుటకుఁ బైకారణము పనికివచ్చును. అటుగాక సింగకవి కాలమాతయు నూహాలపైననే స్థాపించుచోఁ దానిలోఁ బడినపొరపాటునకు నీసింగనకవి యెఱ్ఱాప్రెగ్గడపేరు స్మరియింపకపోవుటకూడ సహకారి యని చెప్పుట యొకయుక్తికాదని నాయభిప్రాయము. ఇట్టి సిద్ధాంతమునకు ముందుగాఁ బంతులవారు పద్మపురాణ మార్కండేయపురాణ కృతిపతులకుఁ గలసంబాధము చెప్పి దానిని నిరాధారణచేయవలసియున్నది. కావున నదియైనపిమ్మట దానికుపబలకముగాఁ బనికివచ్చు నీయెఱ్ఱాప్రెగ్గడవృత్తాంతముఁ గూడఁ గైకొందము. ప్రధానాంశము నిలువఁబడనప్పు డీయంశముంగూర్చి వ్రాయుపనియే యుండదుగదా. కావున దీని నిప్పటికి వదలెదము.

## నవీనవాసిష్ఠరామాయణవృత్తాంతము.

ఇదివఱలోనే నిట్టిపేరుతో నొప్పుకొనక నవీన గ్రంథము బయలువెడలెనని వ్రాసియుంటిని. ఆగ్రంథవిషయమై కొంత చెప్పి అనంతరము దానికిని సింగకవికృతగ్రంథమునకును గలభేదముం జూపెదను.

కవివంశావళి.

కృష్ణగిరిలో హారితసగోత్రుఁ డగు

నృసింహము.

|

రామయ్య.

|

వేంకటరమణయ్య.(కవి.)

ఇతఁడు తనవిషయమై యీక్రిందిపద్యంబు వ్రాసికొనియెను.—

"క. హారితసగోత్రోత్పన్నుఁడ, వరతరమగునులచనాడువంశ్యుఁడ లక్ష్మీ
కరకర్ణాటకులుండను, ధర వేంకటరమణుపేరఁ దనరినవాఁడన్."

దీనింబట్టి యీకవి కరణకమ్మ లనఁబడు కన్నడశాఖాబ్రాహ్మణులలోనివాఁ డనియు నితనినాఁ డీభేదానుసారముగా నులచనాటివాఁ డని చెప్ప నొప్పినట్లు గాన్పించు.

## కవికృతగ్రంథములు.

"గీ. రమ్యతర మైనయధ్యాత్మరామచరిత, సాంధ్ర మొనరించి పిమ్మట సాత్మభావఁ
బూని మానగుగరయుపాఖ్యాన మనెడు,గ్రంథము రచించితిని బుద్ధికలిమికొలఁది."

(౧) ఆంధ్రములో నధ్యాత్మరామాయణము.

(౨) కన్నడములో గరయోపాఖ్యానము.

ప్రస్తుతగ్రంథముంగూర్చి యీక్రిందివిధంబుగ నింకొకపద్యంబు జెప్పెను అదెట్లన్నను:—

"గీ. రహిని జన్మాదిరహితపరాత్పరత్వ, విమలసత్యాపరోక్షసంవిత్ప్రసాద
దక్షిణం బగుమోక్షశాస్త్రంబు నొకటి, నిపుడు నేసెదఁ దత్కృతిమ మెట్టి దనిన."

ఈకవి యాశ్వాసాంత గద్యముంబట్టి యథామాత్రకముగాఁ దెనిఁగించినట్లు కాన్పించును.

"ఇది శ్రీ సీతారామకృపారసరసుకీపాత్ర, హారితసగోత్రపవిత్ర, ఉలచనాడువంశపయఃపయోధికైరవమిత్ర,సజ్జనవర్ణనీయచరిత్ర,నృసింహావిఖ్యాత భూసురవర్యపుత్త్ర వేంకటరమణ ప్రణీతం బగుశ్రీమద్యథావాల్మీకీయ వాసిష్ఠరామాయణము సర్వంబును సంపూర్ణము."

ఈకవి మతిమొకచో సంస్కృతములోని వాల్మీకికృత వాసిష్ఠరామాయణకవితావిశేషంబులు దానిం దెనిఁగించుటకుఁ గల స్వశక్తిలోపమును దెల్పునట్లుగా నొకయుపన్యాసంబు వ్రాసెను. అది తన నిజమగు శక్తిలోపంబును వివరించుటకుఁ గాకున్న నెవ్వరైనఁ దనగ్రంథంబు నింగకవి గ్రంథంబుతో సరిచేసి అది లెస్సదై యున్నదనియు నిందట్టివిశేషంబులు లేవనుశంక నంది దీని నిరసించెద రనుసంకోచముతోఁ జేసియుండిన నుండవచ్చును. ఆవచనభాగంబుమాత్ర మిట వివరించెదను.

"వ. ఇట్టివేదాంతసార సర్వస్వం బై యాదిమకవిసార్వభౌముం డగువాల్మీకి మహర్షి ప్రవరవదన సదనామృత దివ్యమృదూక్తి మధుమాధురీసమ్మిళిత విరాజితపదగుంఫబద్ధం బై పురాకృతభాగధేయమాత్రసంవేదకమహార్థగుంభితం బై, సకృత్కర్ణకోటర ప్రవేశమాత్రాపకర్షితచిత్తగతమహామోహమధ్వాసనామలశబ్దరాజీవిరాజితం బై సకృత్పఠనమాత్రాపనోదితబహుజన్మానుస్యూతశోకసంచయం బగుశ్లోకసంచయసముద్దిష్టం బై అజ్ఞసర్వజ్ఞచిత్తరంజక కథావిసరప్రశస్తం బై యుపమేయాగతపరతత్త్వస్వరూప సర్వస్వప్రకాశకాద్భుతచమత్కారగర్భితోపమానచయఘటితం బై యశేషపక్షీయమహామహిమం బై యొప్పారునీసర్వోత్కృష్టతరమోక్షశాస్త్రంబును తన్మహర్షిశేఖరుకృపాబలం బొక్కటి దక్క నితరంబు లగుకావ్యబంధకౌశలాదు లెఱుంగనినేను జడమండగు జాంఘికుండు స్వేచ్ఛావిహారంబు సల్పిన తెరంగున, ఖర్వుండు తత్పదస్థానంబులం బ్రిలపనంబులిడుమఁ బ్రాసరూపకంటకంబుల యెడం గంటగింపక, యక్షయసంఘులకా మార్గంబుదప్పక, ప్రాప్తంబగు విచ్ఛిత్తినెడయక, సద్గుణపద్ధతి నతిక్రమింపక నడువనుద్యోగించుచందంబునఁ దెనిఁగింప సమకట్టినమదీయబాల్యతను సహించి జంతువులకు సర్వగుణంబుల సహజంబు లైన యీకృతింగల మద్బుద్ధిజాడ్యజనితదోషములచే ననూయతామాత్ర చిత్తులుగాక, యిచట సాధకార్థగ్రహణ మాత్రంబే ప్రయోజనంబుగా నెఱింగి యార్యభావంబు నొంది సర్వులు విని యానందభరితాంతరంగులు కావలయు నని ప్రార్థించి, యనంతరంబునం బ్రారీప్సిత గ్రంథంబునకు నవిఘ్నపరిసమాప్తి నిమిత్తంబుగా శిష్టాచార పరిప్రాప్తేష్టదేవతాప్రణామలక్షణం బగుమంగళంబును, గ్రంథకారుం డగు నప్పాచేతసుం డంగీకరించి చెప్పినశ్లోకంబు మొదలుకొని గద్యపద్యాత్మకంబుగాఁ జెప్పనారంభించితిని.”

అని యున్నది. కాని యిట్టి పై యుపన్యాసానుసారముగాఁ బ్రత్యేకము కవిత్వము దోషయుక్తముగాక సామాన్యముగా గ్రంథము రమ్యముగానే యున్నది. ఈగ్రంథము యథామూలముగాఁ దెనిఁగించుటం జేసి సింగకవికృతగ్రంథమునకంటె రెండుమూఁడురెట్లు పెరిగినది. సింగకవికృత మగుగ్రంథము నూటముప్పదిపుటలు గలదియు నీనవీనకవి ప్రణీతము నాల్గువందలముప్పదిపుటలగ్రంథము గలదియు నైనది. గ్రంథబాహుళ్యమున సారాంశము సుబోధము కాదనియే పూర్వకవులలోఁ బెక్కండ్రు గ్రంథములఁ దెనిఁగించునపుడు సాధ్యమగునంత సంగ్రహములుగానే తెనిఁగించుచు వచ్చిరి. ఆశైవగ్రంథములు పురాణములవలె నతివిపులము లై చెప్పినయంశమునే మరల నినమాఱు

ముమ్మాఱు చెప్పుచు సారాంశము తెలియుండునట్లుగాఁ జెప్పక ఛాందస వృత్తితో నుండునట్లుగాఁ జెప్పుటఁగన్పట్టి తొంటిపురాణాంధ్రకవులందఱు నామార్గము నవలంబించక సారాంశమునే ప్రధానము చేసుకొని సంగ్రహరూపముగానే ఆంధ్రములో నాగ్రంథములు ప్రకటించిరి. అట్లుగా సారాంశప్రకటనముఁ జేయుట కష్టసాధ్యముగావున నట్టిపనిం జేయక ప్రస్తుతకాలములోనివారు యథామాతృకముగాఁ దెనిఁగించుచున్నార మని చెప్పుచు శ్లోకమునకుఁ బద్యము వ్రాయుచుఁ జర్వితచర్వణముం జేయుచున్నారు. వీరికి లోకోపకారమే ప్రధాన మైనయుద్దేశ మైనయెడల సంస్కృతములో ఛందోబద్ధములుగా నుండుగ్రంథములను దేశభాషలలో నికిఁ గేవలము వచనరూపగ్రంథములుగా రచియించినదానివలనఁ గొంత లాభము కల్గును. అటుగాక తొంటిగ్రంథములనే తిరుగ నారంభించుచు నాగ్రంథము నాంధ్రీకరించిన పూర్వపువారికిఁ దమకుఁ గలకవిత్వభేదమరయఁబడునేమో అనుభయముతో యథామూలముగా మేము తెనిఁగించినారము. పూర్వు లిట్లుగాఁ దెలిఁగింపకుండుట యొకకొఱఁత యని యేల సూచింపవలయును? ఈగ్రంథకర్తవలెనే వాల్మీకికృతరామాయణము యథామూలముగాఁ దెనిఁగించితి నని యింకొకరు తెనిఁగించి దానింగూడఁ బ్రకటించిరి. కాని భాస్కరరామాయణము నా నవీనరామాయణమును రెంటిని బురాణముగా వినువారివలన వానిమంచిచెడ్డలు తెలియఁబడును. అప్పుడుగదా ప్రాచీనులమార్గమునకు నవీనులమార్గమునకును గలభేదంబు గోచరంబగు. అటులనే ప్రస్తుతవాసిష్ఠరామాయణము నుండెననుటకు సందియంబు లేదు. వలయునేని యేకథాభాగములోఁ జూచిన నాకథలోనే యీభేదము తేలక మానదు. దాని నాగ్రంథారంభములోనే కొన్నిపట్లలోఁ జూపెదము.

కథారంభములో

సీ. ౧. “ ఆ. గురుని నేకతమునఁ గూర్చున్న వాల్మీకి నఖిలదర్శనములు నప్పుడు గాంచి
ప్రణుతి సల్పి యాభరద్వాజుఁ డిటు మృదుస్వరము గరము వెలయ సరగ నడిగె.”

సిం. "క. అతులతపస్స్వాధ్యాయ, వ్రతశీలుఁడు బోధనిధి భరద్వాజుఁడు వి
శ్రుతకీర్తియొకఁ డనాఁ డేకతమున వాల్మీకిమౌనిఁ గని సంప్రీతిన్."

వేం. "తే. సాధు వత్స భరద్వాజ సద్గుణాఢ్య, యోగ్యుఁడవు నీవు చెప్పెద నున్నతముగ
దేని వినినంతలోన నజ్ఞానమలము, దూరమొనరింపఁగల దట్టివొక్కదాని."

సిం. "క. విను వత్స లెస్స యడిగితి, వినయోగ్యుఁడ వీవు వీని విస్పష్టముగా
ఘనమోహతమము దూరం, బునఁ దోఁగఁగఁ ద్రోచుమార్గమును వినుపింతున్."

వేం. "చ. అమలినచారుతేజ వినుమయ్య వియత్తలమందుఁ దోఁచుగా
లిమగఁడు మిథ్యయై ధర వెలింగియుఁ దథ్యముగాఁగఁ దోఁచు నా
క్రమముగ మాయచేతఁ బరికల్పిత మై యిటు దోఁచెడిం జగ
ద్భ్రమను మదిన్ స్మరింప నటు పాయుట మే లని నే తలంచెదన్.

క. కణఁగి క్షణక్షణమున నీ, క్షణపదమును బొందుమేటి సర్వజగతి నె
ట్లణఁగించు టనియె దేనిను, గుణగణపరిపూర్ణ వినుము కోరిక వెలయన్."

సిం. "గీ. కానఁబడు లేకవిరిసియు నాకాశవర్ణ, భాతినీజాగ్రతభ్రాంతిభ్రమలఁ బెట్టు
నద్దియు పలుమాఱు దలఁచిన నంతకంటె, నట్టితలఁపులు దలఁచనియదియు లెస్స.

గీ. కానఁబడ్డవిమిథ్యలుగాఁగ దెలిసియు, జ్ఞానమునఁ జేసి దృశ్యమార్జనము సేయఁ
జిత్తగేహాంబువిమలమై చెలఁగి నిత్య, మైననిర్వాణపదవృత్తియందు నొందు."

వేం. "గీ. బద్ధుఁ డేను ముక్తిఁ బడసెద నేక నను, నిశ్చయంబు ధరణి నెవ్వని కగు
నాతఁ డీసుశాస్త్రమం దధికారియగు, ననధికారు లజ్ఞు లాత్మవిదులు."

సిం. "గీ. ఆకట భవపాశబద్ధుఁడ నైననాకు, వెడలు బాటెద్దియో యని వెఱచుచున్న
యార్తుఁ డధికారియగుఁ గానియజ్ఞుఁ డైన, తజ్ఞుఁ డైనను యీశాస్త్రమునకుఁ గాఁడు."

## బాల్యకాలదుఃఖవర్ణనము.

వేం. "వ. బాల్యస్వరూపంబు వివరింపఁగలవాఁ డై శ్రీరాముం డిట్లనియె.

గీ. అస్థిరాకృతిఁ గల్గి చేయంగవలయు, కార్యగతులను బహుతరంగములుగల్గి
జగతిఁ బరిగొన్న సంసారసాగరమున, బాల్యజన్మము దుఃఖముల్వడయఁ గాదె.

గీ. మూఢతయు నాపదయుఁ దృష్ణ మూకతయును, జపలతయుశక్తిక్షుత్పిపాసలమదీన
భావ మివి మొదలగు దుఃఖవర్ధకములు, సర్వమున్ బాల్యమునఁ బ్రతిష్ఠనువహించు.

క. మానసపుంబ్రకృతియె చల, మానని బాల్యంబు దలఁప నతిచంచలమౌ
పూనిక రెండుంగూడిన, దానిం దేనికి సమమని తలఁపఁగ వచ్చున్.

క. ఉవిదయుఁ కన్నులమెఱుపులు, దవదహనజ్వాల లలలఁ తండంబులు నై
శవసంగతచిత్తముచే, నవనింగలిచిన విప్రబలమగుఁ జంచలతన్.

క. బాలుం డల్పప్రకృతిం, జాలను సుఖమందుమఱియుస్వల్పప్రకృతికిన్
జాలింబడుమలమునఁగడు, మేలనిరమియించుసార మేయముభంగిన్.

చ. అవనినదొట్టిమార్గ్యముననన్యులదయ్యు భుజింపరానిద
య్యు వెలయువస్తుసంతతిని యొడకతాభుజియింపఁగోరునిం
దువునువియత్ప్రదేశమునునుండి గ్రహింపఁగఁగోరునట్టిమా
ర్గ్యవిలసితంబు బాల్యముసుఖంబునకెట్లగుఁ దాపసోత్తమా.

క. అలశిశుతం దలితండ్రుల, వలనన్ గురుపరజనములవలనం బ్రివయ
స్కులవలన భయము గల్గుట, వలనన్ శైశవము మిగుల భయమందిర మా.''

ఇట్లుగా నున్న పద్యసప్తకమును సింగకవి యొకసీసపద్యములో నొకకందపద్యములోనం జెప్పె. ఎట్లన్నను:—

"సీ. ఆశాసమావృత మతిశక్తిహీనంబు, జాడ్యంబు దైన్యంబు చపలతయును
మాటాడ నేరమి మాటపొందెఱుఁగమి, యిది పాము తాఁడని యెఱుకలేమి
మూత్రపురీషసంప్లుత గాత్రుఁడైయుంట, తన్నుఁదా నెఱుఁగక తన్నుకొనుట
కదలి యిట్టట్టుపోఁ గాళ్లు రాకుండుట, గురుజనశిక్షలఁ గుటిలపడుట
ఆ. యివియు మొదలు గాఁగ నెన్నఁ బెక్కుగునట్టి, బాధ లనుభవించు బాల్యవృత్తి
పరమమునివరేణ్య ప్రత్యక్షనరకంబు, దీన నేమిసుఖము తెలుపవయ్య.

క. తల్లియుఁ దండ్రియు నితరులు, ప్రిల్లదులై తోడ నాడుపడుచులు నడువన్
తల్లడపడు శైశవ మిది, చెల్లంబో దురితదుఃఖశీలము గాదే.''

ఇట్లే గ్రంథమంతయు నున్నదని సూచించుట కీపద్యములే చాలును. సింగనకవి మాతృకాభిప్రాయానుసారముగాఁ దెనిఁగించుటచేత నాతనిగ్రంథముఁ జదువుచున్నపు డదియును మాతృకాగ్రంథమువలెనే యనన్వయాదులు లేక ధారాశుద్ధి గలదిగాఁ గాన్పించు. ఇఁక వేంకరమణ కవికృతగ్రంథము నైసర్గికధార లేనిదై యనన్వయవాక్యపూరితమై మాతృకం జూచినఁగాని కవియభిప్రాయము స్పష్టముగానిదై యుండి కొన్నిస్థలములలో నాంధ్రభాష యిది కాదేమో యనుసంశయము కల్గించుచుండును. ఈరెండుగ్రంథములకుం గలభేదమును స్థాలీపులాకన్యాయంబునఁ జూపినాఁడను గావున నిఁక వేంకటరమణకృతగ్రంథ మెట్లు పరిసమాప్తి నందింపఁబడినదో దానిం జూచెదము. అందులో నీకవి

తా నీగ్రంథము ముగించిన కాలమును దీనిని బరిశీలించిన పండితుని విశే షంబులు వివరించె. అది యెట్లున్నదనఁగా :—

## వార్ధికషట్పది.

"ఒనరు నీకలియుగంబున నాల్గువేలపై, యనములకుఁ బైఁ దొమ్మన్నూటడెబ్బది యొకటి జనినయంత వచ్చిన ప్రమోదూతవత్సరపు నాశ్వయుజశుద్ధమందూ, అను గతకుజాఖ్యవాసరమగుఁద్వితీయనాఁ డినుఁడు జనియించినంతట నైదుగడియలకు తనరె సంపూర్ణమై యీగ్రంథసత్తమము మత్పుణ్యాపటిమచేతను."

అనఁగాఁ గలియుగములో ౪౯౭౧ సంవత్సరములు కాఁగా వచ్చిన ప్రమోదూతవత్సర ఆశ్వయుజ శుద్ధతదియ మంగళవార మని తేలినది. ఇది చెన్నపట్టణములో ఆ 1873 వ సంవత్సరమునకు సరియగు శ్రీముఖ సంవత్సరములో ముద్రించి ప్రకటింపఁబడినది. అనఁగా క్రీ. ౧౮౭౦ సంవ త్సరమునకు సిద్ధమై మఱినాల్గుసంవత్సరములలోపుగానే ముద్రింపఁ బడినది.

## గ్రంథపరిశీలకవిషయము.

"ఉ. ఆ మొదటిప్రసిద్ధకవియాస్యవినిర్గతమైనసూక్తులం
దేమివిశేషముల్గలవొ యేమియు నేరనిమూఢుఁడైన నే
నేమిటిసంగ్రహించితినొ యేమిటినిం దృజియించినాఁడనో
యేమిమహాపరాధముదయించెడినో యనిసంశయాత్ముఁడై.

సీ. తతసాధుతరసంపదావసథంబయి, పరగుచుండెడి ధర్మపురియనేటి
పురమునం గలవిప్రపుంగవు ధర్మజ్ఞు, కావ్యార్థబోధన కౌశలాఢ్యు
మౌద్గల్యగోత్రుసన్మానితసుచరిత్రు, ధీమంతు శాంతు నధీతనిగము
సర్వశాస్త్రార్థజ్ఞు సత్యవ్రతాచారు, జానకీధవపదాబ్జాప్తచిత్తు
తే. గీ. కరతలామలకీకృతపరసుతత్త్వు, పరమమంగళసద్గుణభరితు నమలు
సత్యసంపన్న సుందరశాస్త్రిఖ్యుఁ, బిలిచిమన్ననమెయివిన్నవించినంత.

ఉ. అమహనీయమూర్తియు మహామునిజల్పితమైనకావ్యము
న్మాత్రుక కావ్యముం జదివిమానక చర్చయొనర్చి యాంధ్రమున్
దేమియునర్థభేదముదయింపఁగ లేదిది సాధువన్న నిం
కేమి ధరిత్రి నేనె కృతకృత్యుఁడ నంచు ముదంబుఁ జెందితిన్."

ఇట్లుగాఁ దాను వ్రాసినగ్రంథము నొకరెవరో బాగున్నదన సంతసించునంతటి బుద్ధిశాలి యీగ్రంథమువంటి శాస్త్రముం దెనిఁగింపఁ గడగుట విశేషగౌరవావహము గా దని నే నూహించెదను. పాఠకులే ఆగ్రంథములోని మంచిచెడ్డ లరయవలసినవారుగావున నిపుడు మనము విస్తరించవలసినది లేదు. మనము ప్రారంభములో సింగనకవిచారిత్ర మారంభించి అతని కథతో దాని ముగించుట న్యాయము కావున నాతని యాశ్వాసాంత గద్యము నిట వివరింతము :—

“ఇది శ్రీనరసింహావరప్రసాదలబ్ధ కవితావిలాసభారద్వాజగోత్రపవిత్ర సరసగుణధుర్య సింగనార్యప్రణీతం బైనజ్ఞానవాసిష్ఠరామాయణమునందు సర్వంబును బంచమాశ్వాసము.”

## పురాణకవులవివరము.

దీనిం దెల్పుటకుఁ బూర్వము పురాణములనామవివరమును, అట్టి పురాణములలో నెన్ని తెలిఁగింపఁబడినదియు, నట్లుగాఁ దెనిగించిన వారినామములును తెలిసినవఱకు వివరింపఁబడవలసియున్నది. కావున ముందుగఁ బురాణనామముల వివరించెదను. ఎట్లన్నను :—

| ౧౮ పురాణములు. | తెనిఁగించినవారిపేళ్లు. |
|---|---|
| ౧. ఆదిత్యపురాణము | తెలియదు. |
| ౨. కూర్మపురాణము | ౧. మండ చిట్టికామశాస్త్రి. ౨. రామలింగకవి. |
| ౩. గరుడపురాణము | పింగళిసూరకవి. |
| ౪. నారదీయపురాణము. | తెలియదు. |
| ౫. పద్మపురాణము | పద్మపురాణమునకే కథాసంగ్రహము శ్రీనాథకవితాత యగుకమలనాభకవియు దీని యుత్తరఖండము రామగిరి సింగనకవియు తెనుఁగున నొనర్చిరి. |
| ౬. బ్రహ్మకైవర్తము | తెలియదు. |
| ౭. బ్రహ్మాండపురాణము | ,, |
| ౮. బ్రాహ్మము. | ,, |
| ౯. భవిష్యోత్తరపురాణము | ,, |

| | | |
|---|---|---|
| ౧౦. | భాగవతము | బమ్మెరపోతనామాత్యుఁడు. ఇది దేవీభాగవత మని కొందఱిమతము. త్రిపురాన-తమ్మనదొర దానిఁ దెనిఁగించెను. |
| ౧౧. | మత్స్యపురాణము | తెలియదు. |
| ౧౨. | మార్కండేయపురాణము | మారనకవి, మండ కామశాస్త్రి. |
| ౧౩. | వరాహపురాము | ౧ మల్లయమలయమారుతకవులు. ౨. చంద్రహరిభట్టు. |
| ౧౪. | వామనపురాణము | తెలియదు. |
| ౧౫. | వైష్ణవ మనఁగా విష్ణుపురాణము | వెన్నెలకంటి సూరకవి. |
| ౧౬. | శైవపురాణము | తెలియదు. |
| ౧౭. | లింగపురాణము | ,, |
| ౧౮. | స్కాందపురాణము | దీనిలోని కాశీఖండ, భీమఖండముల, శ్రీనాథకవి తెనిఁగించె. కోడూరి వేంకటాచలకవి శివరహస్యఖండముఁ దెనిఁగించె. హాలాస్యమాహాత్మ్యము తిరుమలశెట్టి జగన్నాథదాస కృతము. |

పై పురాణముల కెదురుగా వ్రాయంబడిన పేరులు గలవిమాత్ర మాంధ్రభాషలలోనికిఁ దేఁబడినవి. తక్కినవి మనకు లభించనివగుట చేత వానివృత్తాంతము వివరింపలేదు. పైవారిలోఁ జారిత్రము గలవఱకు నీకవిజీవితములలోఁ జూపట్టుదురు. మిగిలినవారివిశేషములు కవికావ్య ప్రశంసాచంద్రికలోఁ జూడఁదగును.

క వి జీ వి త ము లు

సమాప్తము.

# శ్రీమదాంధ్రవచనభాగవతము.

## బ్రహ్మశ్రీ, శతఘంటము, వేంకటరంగశాస్త్రి కృతము.

---

శ్రీమన్నారాయణాంశసంభూతుఁడైనవేదవ్యాసమహాముని సంస్కృతభాషను రచించినశ్రీమద్భాగవతమును బమ్మెరపోతనామాత్యుఁడు గద్యపద్యాత్మకముగా రచియించుట లోకప్రసిద్ధంబుగదా! అయ్యది పద్యబహుళము గావున నందఱకును దానియర్థము గోచరింప కుండుటవలనను, మూలముకంటెఁ గొన్నివిషయము లధికముగాఁ జేర్పఁబడియుండుటవలనను దెనుఁగున వచనకావ్యముగ సంస్కృతానుసారముగా రచియింపఁజేసి ముద్రించి ప్రచురించియున్నాము.

| | | | | | |
|---|---|---|---|---|---|
| మూఁడువాల్యములుగా బైండుకట్టబడ్డ | ప్రతి | 1-కి | రు. | 7 | 0 |
| ఒకటేవాల్యముగా బైండుకట్టబడ్డ | ప్రతి | 1-కి | రు. | 6 | 8 |

# శబ్దార్థచంద్రిక.

శ్రీమహాకాళి. సుబ్బారాయకృత అకారాదినిఘంటువు. పూర్వముద్రణములోని లోపములెల్ల సవరించి లక్ష్మీనారాయణీయము, శబ్దరత్నాకరము మొదలగువానినుండి యపూర్వము లగుపదములు చేర్చి రమ్యముగా ముద్రింపఁబడుచున్నది. రు. 2 0

192, ఎస్ప్లనేడ్ }
328, తండియార్పేట } వావిళ్ల. రామస్వామిశాస్త్రులుఅండ్ సన్స్,

చెన్నపురి. ఈ.